



వేదాంగాలు


వ్యాకరణం

వాక్య పదీయము - 1









సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరవిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2040100047355

గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్థం **ఉచితంగా eBook** రూపంలో భారత ప్రభుత్వపు సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు, కనుక వారిని సంప్రదించగలరని మనవి చేసుకొంటున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాధ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

అనువాద వాఙ్మయము — 12

వ్యాకరణ శాస్త్రము

వాక్యపదీయము

ప్రథమ భాగము

[బ్రహ్మకాండము, వాక్యకాండము]

మూలకర్త:

భర్తృహరి

అనువాదకులు :

శ్రీ పేరి సూర్యనారాయణశాస్త్రి, విద్యాప్రవీణ, పి. ఓ. ఎల్.
శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులు, ఎం. ఏ.
డా. పుల్లెల శ్రీరామచంద్రుడు, ఎం.ఏ., పిహెచ్.డి.
శ్రీ అప్పల్ల సోమేశ్వరశర్మ, ఎం. ఏ.

పరిష్కర్త :

ఆచార్య గంటి జోగిసోమయాజి, ఎం.ఏ., ఎల్.టి., విద్వాన్, పి.ఓ.ఎల్.

తెలుగు అకాడమి

హైదరాబాదు-29

1974

ప్రస్తావన

తెలుగు అకాడమి ఇంతవరకు ఇంటర్మీడియట్ స్థాయిలో పాఠ్యగ్రంథాలను, డిగ్రీస్థాయిలో పఠనీయగ్రంథాలను మూడువందలకు పైగా ప్రచురించింది. శాస్త్రగ్రంథ ప్రచురణలో ఇది మొదటిదశ. రెండోదశలో కొన్ని ప్రామాణికగ్రంథాలకు అనువాదాలను, ఆయా శాస్త్రాంశాలమీద వాటివాటి ప్రాముఖ్యాన్ని పురస్కరించుకొని మోనోగ్రాఫ్‌లను ప్రచురించదలచింది. ఇందువల్ల విద్యార్థులకూ ఉపాధ్యాయులకూ పాఠ్యగ్రంథాలే కాక ఆయా పాఠ్యాంశాలమీద విస్తృతాధ్యయనానికి సహాయపడే విషయప్రధాన రచనలుకూడా లభిస్తాయి. అంతేకాదు. ఉన్నత విద్యాబోధనభాషగా తెలుగు సుప్రతిష్ఠితమై తెలుగు అకాడమి పాత్ర మరింత సుసంపన్నం కాగలదు.

ప్రామాణికగ్రంథానువాదాలలో ఇది ఒకటి. వేదకాలంనుంచీ భారత దేశంలో వ్యాకరణశాస్త్ర సంప్రదాయ మొకటి అనూచానంగా వస్తున్నది. అందులో సిద్ధాంతవిభాగానికి చెందిన ప్రశస్తగ్రంథాలలో వాక్యపదీయము అద్వితీయమైనది. ఆ మహాగ్రంథాని కిది అనువాదము. ఆధునిక భాషాశాస్త్రసిద్ధాంతాలతో ఈ సాంప్రదాయిక సిద్ధాంతాలను పోల్చిచూడటానికి ఈ అనువాదప్రచురణ ఎంతో తోడ్పడుతుంది. వాక్యపదీయము పఠనపాఠనాదులనుంచి తొలగిపోతున్న ఈ కాలంతో ఈ అనువాద ప్రచురణ ఎంతో ఆవశ్యకమని భావించినాము.

పై ప్రాముఖ్యాన్ని గుర్తించి అనువాదపరిష్కర్తలు ఆచార్య గంటి జోగి సోమయాజిగారు సువిస్తృతమయిన పరిచయం వ్రాసినారు. వారికీ, అనువాదకులు శ్రీ పేరి సూర్యనారాయణశాస్త్రిగారికి, శ్రీమాన్ శ్రీ భాష్యము అప్పలాచార్యులుగారికి, డాక్టర్ పుల్లెల శ్రీరామచంద్రుడుగారికి, శ్రీ అప్పల్ల సోమేశ్వరశర్మగారికి మా కృతజ్ఞతలు.

గుణగ్రహణ పారీణులయిన పాఠకులు ఈ గ్రంథాన్ని అభిమానించి ఆదరిస్తారని ఆశిస్తున్నాము. సహృదయ విమర్శకులు ఇచ్చే సూచనలను పునర్ముద్రణలో తప్పక పరిశీలించగలము.

పరిచయము

1. తెనుగువ్యాఖ్య

నేడు పాశ్చాత్యులు వ్రాయుచున్న భాషాశాస్త్రగ్రంథములకు భారతదేశములో మిక్కిలి ప్రచారము కల్పింపబడుచున్నది. ప్రపంచమందంతటను అన్ని రంగములలోను పాశ్చాత్యుల నాగరకత, వారి శాస్త్ర విజ్ఞానము మొదలయినవన్నియును వ్యాపించి యనుకరింపఁబడుటకు కారణము లనేకము లున్నవి. వానియందు ఘనత యుండుట యొకటి. రెండవది వానిని గూర్చిన రచనలు నేడు అనేకులయిన శ్రేష్ఠులకు పరిచితమయిన ఆంగ్ల భాషలో నుండుట. వారికి ధనము పెల్లుగా నుండుటయు, తమ యభిప్రాయములకు ప్రచారము కల్పించుటయందు నేర్పుగలుగుటయు ముఖ్యకారణములు.

పయివిషయమున ఒక భాగమగు భాషా శాస్త్రమును నేర్చుకొనుటకు ఇంగ్లాండు లోను, అమెరికాలోని సంయుక్త రాష్ట్రములలోను ప్రతివర్షము అనేకులు విద్యార్థి వేతనముల సాహాయ్యమున పర్యటించుచున్నారు. వారందరును నేటి భారతీయ విశ్వ విద్యాలయములలో ఆ సంప్రదాయములను ఇచ్చటి ఛాత్రులకు బోధించుచున్నారు.

భారతదేశమున క్రీస్తు పూర్వము సుమారు మూడువేల సంవత్సరముల నుండియు వేదాంగములుగా వ్యాకరణాదులు ప్రచారములో నుండినవి. ఇచ్చటి భాషా బాహుళ్యము, విజ్ఞానమునందలి శబ్దప్రామాణ్యము, పారమార్థికచింతయు వేదపఠనమునకు ప్రథమస్థానము నొసంగినవి. ఆ భాషను రక్షించుటకుగాను, శబ్దముయొక్క నిర్దుష్టమైన యుచ్చారణమును, స్వరూపమును, అన్వయాది లక్షణములను వేలకొలది సంవత్సరములు నిర్దుష్టముగా నిలువ బెట్టుటకు, భాషాశాస్త్రము యొక్క అనేక భాగములను మన పూర్వులు అభ్యసించి, ఇతరులకు బోధించుచు అనేక గ్రంథములు వ్రాసిరి. అట్టి వానిలో భర్తృహరి పేర వెలయుచున్న ఈ 'వాక్యపదీయము' ఒక ముఖ్య గ్రంథము; బహువిషయ సంభరితము; భారతీయులు చేసిన భాషాశాస్త్ర పరిశ్రమను బాగుగా వ్యక్తము చేయుచున్నది.

దేశ భాషలలో గ్రంథములు రచించుటకును, అందు విజ్ఞానబోధ జరుపుటకు వలయు ఇతర సదుపాయములు కూర్చుటకును ఆంధ్ర ప్రభుత్వము 'తెలుగు అకాడమి' ని స్థాపించి యున్నది. కొన్ని వందల గ్రంథములను ఈ సంస్థ ప్రచురించి యున్నది. మన భాషా శాస్త్ర సిద్ధాంతములు సంస్కృతములో నుండగా వానికి తెలుగులో పఠన పాఠనముల సదు పాయము కల్పించుటకు ఈ గ్రంథమును తెలిగింపవలసినదని అకాడమి పాలక సంఘము చేసిన నిర్ణయ ఫలితముగా ఈ గ్రంథము రచింపబడి ప్రకటింపబడినది.

2. భర్తృహరి రచిత గ్రంథములు

భర్తృహరి వ్రాసినవని ప్రచారములో నున్న గ్రంథములు :

1. (అష్టాధ్యాయికి) మహా భాష్యటీక.

2. వాక్యపదీయము-కాండలు I, II, III.
3. వాక్యపదీయ గ్రంథ శ్లోకములకు I-II కాండలయందు మాత్రము వృత్తి రూపమున నున్న గ్రంథకర్తృకృత-వృత్తి-వివరణము.
4. శబ్దధాతు సమీక్ష.
5. నీతి, శృంగార, వైరాగ్య ప్రధానములయిన మూడు శతకములు.
6. భట్టి కావ్యము.

పయి వానిలో 1-4 వ్యాకరణగ్రంథములు. 5 వది కేవలము రసమయమయిన కావ్యవిశేషము. 6 వదియు పద్యకావ్యమే. కాని పాణిన్యుక్త సూత్రముల కుదాహరణము లయిన తిఙన్త రూపములకు, కారక ప్రయోగములకు లక్ష్యములను, అలంకారములకు ఉదాహరణములను చూపించు రసమయమయిన కావ్యము. పయిగ్రంథములన్నియు రచించిన వ్యక్తి ఒక్కరేయనియు, కాదు భర్తృహరి నామము కలవారనేకు లుండిరనియు, రెండు అభిప్రాయము లున్నవి.

'మహాకవు లనేకులున్నారు, మహాపండితులు నున్నారు, కాని మహాకవి, మహా విద్వాంసుడు అయినవాడు భర్తృహరి ఒక్కడే''– కర్త తెలియని ఈ ప్రాచీన శ్లోకము[1] అభిప్రాయము వారిద్దరు నొక్కరే యని.

భర్తృహరిని గురించి యనేకములయిన కథ లున్నవి. ఒకానొక బ్రాహ్మణుడు సూర్య వర ప్రసాదమున లభించిన ఫలమును తన ప్రభువగు భర్తృహరి కొసగగా దాని నాతడు తన ప్రియభార్య కొసగెను. ఆమె దానిని తాను భుజింపక తన జారునకును, అతడు తన ప్రియురాలైన మఱియొక వనితకును ఇచ్చెను. ఆ విషయము నంతటిని గుర్తెఱింగి రాజైన భర్తృహరి రాజ్యము త్యజించి కానలకు నేగి వైరాగ్యమును బూనెను.

పయికథ ననుసరించి భర్తృహరి వ్రాసిన శృంగార వైరాగ్య శతకముల రెండిటి యందును గలిగిన రసవిశేషములను ఏకముఖమున వర్ణించుటకు కారణమయిన యనుభవ మును భర్తృహరి తన జీవితమునందు గడించెనని విమర్శకు లూహించుచున్నారు. కాని పయి కథలవంటి కథలు కల్పితములనియు, చారిత్రక ప్రమాణములు గావనియు వానిని పరిశీలింపక విశ్వసింపరాదనియు సిద్ధాంతము.

'భర్తృహరినిర్వేదము' అనుపేర నొక కావ్యము నిర్ణయసాగర ప్రెస్సువారి కావ్య మాలలో హరిహరుడను కవిచే వ్రాయబడినట్లు ప్రచురితమైనది. భర్తృహరి యొక్క భార్య మరణింపగా ఆ వియోగమును సహింపలేక శివావతారమయిన యోగి పుంగవుని (గోరక్ష నాథుని) వలన యోగజ్ఞానమును సంపాదించి యోగియయ్యెనని యిందలికథ. ఇదియు పయి కథవలె కల్పితమయినదే యని యూహ. పయిగా 'భర్తృహరి గుహ' యనుపేరుతో వారణాసి దగ్గఱ చునాగడము కోటలో నొకటియు, ఉజ్జయినిలో నొకటియు నున్నవని తెలియుచున్నది. ఆ గుహలలో భర్తృహరి తపస్సుచేసెననియు నొక విశ్వాసము కొందరియందు గలదు.

భర్తృహరి శతకములకు సంస్కృత వ్యాఖ్య వ్రాసిన శ్రీరామచంద్ర పండితుడు గోదావరీ నది శాఖయగు ఆత్రేయినది యొడ్డున నుండు కంజలూరు నివాసి, తెలుగువాడు.

---

[1] మహాన్తః కవయః సంతు, మహాంతః పండితాస్తథా
మహాకవి ర్మహావిద్వాన్ ఏకో భర్తృహరి ర్మతః ॥

ఈతడు 12-18 శతాబ్దముల నుండినవాడని వావిళ్ళవారి 'భర్తృహరి సుభాషిత'మునకు పీఠికా కర్త వ్రాసి, ఆయన శ్లోకము నుదాహరించి యున్నాడు. లోకములో ప్రసిద్ధముగా వినబడు చుండు పైగాథ నొకదాని నందాత డుదాహరించియున్నాడు.

"ఇత్సింగు" అను చీనాదేశస్థుడు క్రీ. శ. 691 వ సం. మున భారతదేశమున పర్యటించుచు భర్తృహరి యను ప్రసిద్ధ వైయాకరణుడు ఏడు సారులు, శృంగార వైరాగ్య ప్రధానములయిన జీవన విధానములలో, నేది యనుసరణీయమో తెలియక ఆశ్రమములు మార్చుకొనె ననియు, అతడు 40 సం. ల ముందే గతించె ననియు వ్రాసెను. దీనినిబట్టి భర్తృహరి క్రీ. శ. 651 సంవత్సరమున మరణించెనని యొక యభిప్రాయమును వెలిబుచ్చిరి.

ఇది యిట్లుండ, అభిజ్ఞాన శాకుంతల నాటకమున 5 వ అంకము 12 వ శ్లోకమగు

'భవన్తి నమ్రా స్తరవః ఫలోద్గమైః, నవాంబుభి ర్భూరివిలంబినో ఘనాః ।
అనుద్ధతాః సత్పురుషాః సమృద్ధిభిః, స్వభావ ఏవైష పరోపకారిణామ్ ॥

అనునది భర్తృహరి నీతిశతకములో పరోపకార పద్ధతియందు ప్రథమ శ్లోకముగా (సంఖ్య 81) నుండుటచేత కాళిదాసు కాలమునకు భర్తృహరి సమీపస్థుడు అనునొక యభిప్రాయము గలదు.

కాళిదాసు కాలమును గురించి అనేక భిన్నాభిప్రాయములుగలవు. 56 క్రీ. పూ. తో సమానమయిన విక్రమార్క శకారంభమునకు మూలపురుషుడయిన వానితో కాళిదాసు సమకాలికుడనియు, కావున నాతడు క్రీ. పూ. ప్రథమ శతాబ్దమువాడనియు, గుప్తవంశమునకు చెందిన సముద్రగుప్తుని యాస్థానమున నుండెననియు, కావున నతడు క్రీ. వె. మూడవ శతాబ్దమున నుండెననియు రెండు అభిప్రాయములు. ఈతడు ఆరవ శతాబ్దములో కాశ్మీర రాజయిన విక్రమాదిత్యుని కాలముననుండెనని మఱియొక యభిప్రాము. ఇదిగాక కాళిదాసు 'అగ్నివర్ణుని' యొక్క కుమారునితో సమకాలికుడనియు, క్రీ. పూ. 8వ శతాబ్దమున నుండెననియు మఱియొక యభిప్రాయము. ముగ్గురు కాళిదాసులు పయి మూడు భిన్నకాలములలో నుండిరనియు నేటి కాళిదాస కావ్యములలో నొకొక్కరొకొక్క కావ్యము వ్రాసియున్నారనియు మఱియొక్క సిద్ధాంతయు గలదు. ఇట్లు వివాదస్థమయిన కాళిదాసు కాలమును, అభిజ్ఞాన శాకుంతలమునందలి శ్లోకమునుబట్టి మన భర్తృహరి కాలమును గూర్చి ప్రామాణికమయిన సిద్ధాంతము చేయుటకు వీలులేదు.

సుభాషితత్రిశతిని గూర్చి ఈ సందర్భమున గొంత వివరింపవలసి యున్నది. తెలుగుదేశమున 'భర్తృహరి సుభాషితము' అనుపేర వావిళ్ళవారిచేత ప్రచురింపబడిన సంపుటము మిక్కిలి ప్రచారములోనున్నది. ఉత్తర హిందూస్థానమునను, మహారాష్ట్రమునను మఱికొన్ని ముద్రణములు ప్రచారములో నున్నవి. వావిళ్ళవారి ముద్రణముయొక్క ఉపోద్ఘాతమున "దాక్షిణాత్య పాఠమని ఉదీచ్య పాఠమని రెండు తెగలు ప్రసిద్ధమైయున్నవి" అని వ్రాసియున్నారు. త్రిశతి పాఠభేదములను గుఱించి గొప్ప పరిశ్రమ చేసినవారు, కీర్తిశేషులు శ్రీ కోశాంబిగారు అప్పటి కుపలభ్యమానములయిన యనేక శ్లోకములను, భర్తృహరి కృతములనబడినవానిని పరిశీలించి యిట్లు వ్రాయుచున్నారు. 'ఆదిమమయిన శ్లోకరాశి రెండు వందలు మాత్రమే. కాని పాఠాంతరములన్నియు కలుపగా మొత్తమన్నియు చేరి 852, అన్ని పాఠములలో సమానముగా నున్నవి పయి రెండువందలు మాత్రమే వానిలో 7 ఏ రసమునకును చెందనివి, నీతికి సంబంధించినవి 69, శృంగారమునకు 71, వైరాగ్యమునకు 58.

మిగిలిన 652 శ్లోకములును వివదనీయములే. అనగా భర్తృహరి విరచితములు కాక కాలక్రమముగా నా శ్లోకములు చేర్చబడినవే. మొదటి రెండువందలు కాక మిగిలిన 100 (అనగా మూడు శతకములకు లెక్క చేయబడినవానిలోనివి) వేరువేరు ప్రతులలో నున్నవి. ఈరకమైన చేర్పు కొన్ని శతాబ్దములలో జరిగినది.''

ఇట్టి సందర్భములో కాళిదాసకృత శ్లోకము నీతి శతకములో నున్నదను విషయమున తెలియదగిన సిద్ధాంత మేమియు లేదుగదా!

పయి గ్రంథములన్నియు నొక్కరిచేతనే వ్రాయబడియుండలేదనియు కావ్యములు రెండును ఒక్కనిచేతను, వ్యాకరణ గ్రంథములన్నియు నొక్కనిచేతను వ్రాయబడియుండెను అనియు నొక యూహ. కాళిదాసు లెందరో యుండినట్లు భర్తృహరు లనబడువారును భిన్న కాలములయందుండిరి. ఒకరు వాక్యపదీయాది వ్యాకరణగ్రంథములను, భట్టికావ్యమనునది మఱియొక్కరును వ్రాసియుండిరి. త్రిశతి వేరొకరిచేత వ్రాయబడినది అను కల్పన యొకటి గలదు. దృఢమైన ప్రమాణములు లేనప్పుడు ఎన్నియూహలయినను కలుగుట కవకాశ మున్నది. భట్టికావ్య మనబడునట్టి పయి లక్షణకావ్యమునకు మరియొక పేరు 'రావణవధ.' ఈ కావ్యమునకు వ్యాఖ్యవ్రాసిన జయమంగళుడు ఈ కావ్యకర్త భట్టియనియు, స్వామియనువాని కొమారుడనియు పేర్కొనియున్నాడు. మరియొకరు ''మహామహోపాధ్యాయ శ్రీ భర్తృహరి కవినా కృతం శబ్దకాండయోర్లక్షణం'' అని వ్రాసిరి. ఇంకొకరు ''అత్ర కవినా శ్రీధరస్వామిసూనునా భర్తృహరిణా సర్గబంధః'' అనియు, ''భర్తృహరిర్నామకవిః శ్రీరామకథాశ్రయం మహాకావ్యం చకార'' అని యింకొకరును వ్రాసిరి.[2] భర్తృ శబ్దమునకు ప్రాకృతరూపము భట్టి యగుటచే పయిరెండు శబ్దములను ఒక్కటిగా భావించి కవులిద్దరు నభిన్నులను వాదము బయలుదేరినది. కాని వీరు వేరే యని యొకవాదము- వలభి[3] యనునది గుజరాతు సౌరాష్ట్రముయొక్క ముఖ్య పట్టణము. అందు చంద్రగుప్తుడు అను బ్రాహ్మణునకు నలుగురు భార్యలనియు, అందు బ్రాహ్మణి యందు వరరుచియు, క్షత్రియయందు విక్రమార్కుడును, వైశ్యయందు భట్టియును, నాలవదానియందు భర్తృహరియు అను కొమరులు కలిగినట్లును, భట్టి విక్రమార్కుని మంత్రి యయినట్లును నొక గాధ కలదు. ఈ కథయు పై కథలవంటిదే.[4]

పయి విచారణవలన నేమియును తేలలేదు. కాబట్టి యీ విషయమును నిర్ణయించుటకు వేరొకమార్గమును చేపట్టవలయును.

రెండవకాండ తుదిని భర్తృహరి వ్యాకరణశాస్త్ర చరిత్రలో కొన్ని విషయములను (478-484. శ్లో॥) నిరూపించెను. నష్టమయిన వ్యాకరణాగమమును పతంజలి శిష్యులు దాక్షిణాత్యులనుండి సంపాదించిరి. శ్లో. 480. దానిని చంద్రాచార్యాదులు బహువిధములుగా ప్రచారముచేసిరి. ఈ శ్లోక వ్యాఖ్యానములో ''చంద్రాచార్య వసురాతగురు ప్రభృతీనాం దత్తఇతి'' అని యున్నది. ఆచార్య వసురాతునినుండి భర్తృహరి పొందినట్లు దీనినుండి తేలుచున్నది.

---

2 History of Classical Sanskrit Literature-By M. Krishnamachariar-Page 140.

3 కావ్య మిదం విహితం మయా వలభ్యాం శ్రీధరసేననరేంద్రపాలితాయాం। కీర్తిరయం భవతా దతో నృపస్య క్షేమకరః క్షితిపో యతః ప్రజానామ్. Do. 141.

4 Do. Page 141.

పయివిషయము లన్నియు విమర్శించుచు 'Franwallner' పండితుడు దిఙ్నాగుని ప్రమాణ సముచ్చయము మొదలయిన గ్రంథముల ఆధారమున ఈ క్రింది కాలనిర్ణయమును చేసెను. వసురాతుడు (భర్తృహరి గురువు)-480-490 A. D. భర్తృహరి 450-510 A.D. దిఙ్నాగుడు 480-540 A. D. భర్తృహరి పతంజలికృత మహాభాష్యమును వ్యాఖ్యానించెను. ఆతనికాలము 150 క్రీ. పూ. కాశికావృత్తియందు (సుమారు 650 క్రీ. వె.) వాక్యపదీయ ప్రశంస గలదు. కాబట్టి ఈ రెండుకాలముల మధ్యను భర్తృహరి యుండియుండవచ్చును. శతపథబ్రాహ్మణమునకు వ్యాఖ్యవ్రాసిన హరిస్వామియను నాతడు భర్తృహరి శ్లోకము నుదాహరించెను. ఆతనికాలము క్రీ. వె. 588.

తక్కిన గ్రంథములమాట యెట్లుండినను వాక్యపదీయము వ్రాసిన భర్తృహరిని గూర్చియు ఆతనివని నిశ్చయింపదగిన యితర గ్రంథములనుగూర్చియు క్రింద విచారింపబడును.

1. మహాభాష్యటీక : పతంజలికృతమయిన వైయాకరణ మహాభాష్యమునకు భర్తృహరి యొకటీక వ్రాసెనని తెలియుచున్నది. ఈ విషయమును ఇత్సింగును, మఱి కొందరు ప్రాచీన వైయాకరణులును పేర్కొనిరి. పై గ్రంథములోని యొక్క చిన్నభాగము మాత్రము, వ్రాతప్రతి లభించినది. ఈ టీక యెంతటిది? మహాభాష్యమునకంతటికిని వ్రాసెనా? అయినచో అది యెంతవఱకు? ప్రథమాధ్యాయములోని మూడు పాదములకు మాత్రమేనా? అదియు సందేహమే! దీనికే దీపిక అను పేరుకూడ నుండినట్లును వ్రాయుచున్నారు—ఇది భర్తృహరి కృతమని నిశ్చయింపనగును.

2. శబ్దధాతు సమీక్ష : సోమానందుడును, ఉత్పలాచార్యులును దీనినిగూర్చి పేర్కొనిరి. కాని యిది లభింపలేదు. సోమానందుడను గ్రంథకర్త శివదృష్టియను గ్రంథమునందు తన 'సమీక్ష' యందు భర్తృహరి వ్యాకరణమును విడిచిపెట్టి విజ్ఞానాభాసము నిరూపించుటకు ప్రయత్నించెను అని వ్రాసెను. దీనికి వ్యాఖ్యాకర్తయైన ఉత్పలాచార్యుడును పయివిషయమును నిర్వచించెను.[5]

భట్టి కావ్యమునుగూర్చియు, సుభాషిత త్రిశతినిగూర్చియు ముందు ఉదాహరించితిని. ఇక మిగిలినది ఒక్క వాక్యపదీయము మాత్రమే. దీనినిగూర్చియు తత్పూర్వముండిన వ్యాకరణచరిత్రనుగూర్చియు చాల సంగ్రహముగా వివరింప బడును.

3. వ్యాకరణశాస్త్రముసుత్పత్తి వికాసములు

సంస్కృత వ్యాకరణ చరిత్రము: భారతదేశమునందలి వాఙ్మయ మంతటిలో వేదమే ప్రాచీనము. ఇదియే సర్వశాస్త్రములకు మూలము. ఇది యనాది. బ్రహ్మముఖమునుండి వెలువడినది. ఇందు లేని ధర్మము లేదు. మహర్షులు తపస్సుచే ఆధ్యాత్మిక దృష్టివలన అనేక సత్యములను ప్రత్యక్ష మొనర్చికొని వానిని వ్రాక్రుచ్చిరి. ఇది అనేక శాఖలు. బహు ఋషులచే సంరక్షింపబడుచుండినది. ఇట్టి వేదరాశిని వ్యాసుడు విభజించి, ఋగ్యజుస్సామాథర్వణములను నాలుగు భాగములుగా నొనరించెను. ఇట్టి వానిని బ్రాహ్మణులు ఇతర వృత్తుల నన్నిటిని విడిచి సంరక్షించుచు, పుత్రపౌత్రాదిక్రమమున వల్లెవేయించి

5 భర్తృహరి— K. A S. Aiyar— పూనాడక్కన్ కాలేజీ వారి ప్రచురణము.

అర్థము తెలియకపోయినను, అట్టే వేలకొలంది సంవత్సరములు నిజధర్మముగా నెంచి మానవజాతి కొనసంగిరి. ఆ వేదమంత్రములయొక్క స్వరముగాని, వర్ణముగాని మారుపడ రాదు. అట్లు మారినచో మంత్రముయొక్క అర్థము కూడ మారిపోవును. అట్లు విపరిణత మయిన మంత్రము యజమానుని, ప్రయోక్తను సంహరించును. అది శత్రువుపైకి పోదు. ఇట్టి విశ్వాసముండుటవలన స్వరము, వర్ణము, శబ్దము, వాక్యము, అన్వయము మొదలగువానిని గుర్తెఱింగి ఆ మంత్రములను రక్షింపవలసి వచ్చినది గావున, శిక్ష, ప్రాతిశాఖ్యము అను శాస్త్ర గ్రంథములు బయలుదేరి ఆయావేద శాఖలలోని శబ్ద లక్షణాదికమును వివరించినవి. వేదార్థము తెలిసికొనుటకు వేదాంగములు బయలుదేరినవి. శిక్ష, జ్యోతిషము, కల్పము, నిరుక్తము, ఛందస్సు వ్యాకరణము అను ఆరును వేదాంగములు.

1. శిక్ష : ఈ గ్రంథములో వర్ణోచ్చారణము, ముఖయంత్రము, ఉచ్చారణాంగ ములు, ప్రయత్నము, స్థానకరణములు మొదలయిన నేటి ధ్వన్యుత్పాదక శాస్త్రమునకు సంబం ధించిన విషయము లన్నియు నుండును. పాణినీయ శిక్ష, చారాయణీయ శిక్ష మొదలయిన వీజాతికి చెందినవి. వేదకాలములో సంస్కృతమున మాండలిక వైవిధ్యము ఏర్పడినట్లు గ్రహించి ఇంకను వైవిధ్యమున భాష మారకుండునట్లు స్థిరరూపమున నిలుపుటకు శిక్షా శాస్త్రమును కనిపెట్టి ప్రాచీనులు దానిని అభ్యాసకులకు అందరకును బోధించిరి.

2. జ్యోతిషము : ఇది ఖగోళమునందలి గ్రహసంచారములను, సంవత్సర మాసాది కాల విభాగమును, ఋతువులు, అయనములు మొదలగువానిని తెలుపును. ఏ యే యాగములు ఎప్పుడెప్పుడు చేయవలయునో నిర్ణయించుటకు, అమావాస్య, పూర్ణిమ మొద లయిన తిథుల నెఱుంగుటకు ఇది సాధనము. దీనినే వైదిక జ్యోతిషమని మనము వ్యవ హరింతుము.

3. కల్పము : ఇందు ఆయా యాగముల విధానము, హోత, అధ్వర్యుడు మొద లగువారి బాధ్యతలు నిరూపింపబడును. బ్రాహ్మణములు, కల్పసూత్రములు ఈ జాతికి చెందినవి. ఆశ్వలాయన, శాంఖ్యాయనాది కృతములయిన సూత్రములు ఉదాహరణములు.

4. నిరుక్తము : ఇందు వేదములోని శబ్దములయొక్క వ్యుత్పత్తి అర్థము ననుస రించియు, ప్రయోగములను సూచించియు నిర్ణయింప బడును. ఇందు యాస్కుని గ్రంథము సుప్రసిద్ధము.

5. ఛందస్సు : ఇందు అక్షరములు, మాత్రలు, పాదభేదము, అందలి అక్షర గణనము, గాయత్రి, అనుష్టుప్ మొదలయిన ఛందో భేదములును చెప్పబడును. ఛందాగ్ంసి- ఛాదనాత్. ఛేదించుటవలన అనగా విభజించుట వలన గలుగు భాగములను బట్టి ఈ పేరు వచ్చినది. మనకు లౌకిక చ్ఛందస్సులు తెనుగున అప్పకవీయము మొదలయిన గ్రంథ ములలో ప్రసిద్ధములు.

6. వ్యాకరణము : వ్యాక్రియతే అనేనేతి వ్యాకరణమ్—దీనిచే శబ్దములు వ్యాకరింప బడును. ప్రకృతి, ధాతు, ప్రత్యయ విభాగము నిరూపింపబడును. శబ్దస్వరూపము స్పష్ట పరుపబడును.

పయి ఆరు వేదాంగములును కాలక్రమమున వేరుపడి అభివృద్ధములై లోకములో ప్రచారము నందినవి. వానిలో మనము ఇప్పుడు తెలిసికొనవలసినది వ్యాకరణ చరిత్ర.

పయిని నిరూపింపబడినట్లు వేదాంగములకు ఆధారములు వేదములే. వ్యాకరణ శాస్త్రముయొక్క ఉత్పత్తియు మిక్కిలి ప్రాచీనకాలముననే అనగా వేదమంత్రములు ఋషు లకు ప్రత్యక్షములయిన కాలముననే పద పదాంగ విభాగజ్ఞానముతోడనే ఉత్పన్నమైన ట్లూహింపక తప్పదు.

వేదమునందే వ్యాకరణము నందలి పారిభాషిక పదావళికి ప్రయోగమున్నట్లు స్పష్టము. 'వ్యాకృ' ధాతువునకు విభజనార్థమున ప్రయోగములు 'నామరూపే వ్యాకరవాణి', 'దృష్ట్వా రూపే వ్యాకరోత్ సత్యాన్నృతే ప్రజాపతిః'. ఋగ్ వేదముయొక్క పద పాఠమునందు 'సమ్ఽజగ్మానః', 'ప్రఽతిరంతే' మొదలయిన విభాగములు ప్రసిద్ధమయి యున్నవి. గోపథ బ్రాహ్మణమందు 'ఓంకారం పృచ్ఛామః, కో ధాతుః,, కిం ప్రాతిపదికం, కిం నామాఖ్యాతమ్, కిం లింగమ్, కిం వచనమ్, కా విభక్తిః, కః ప్రత్యయః, కః స్వర ఉపసర్గో నిపాతః, కిం వైయా కరణం, కో వికారః, కో వికారీ, కతి మాత్రః,కతి వర్ణః, కత్యక్షరః, కతి పదః, కః సంయోగః, కిం స్థాననాదానుప్రదానానుకరణమ్,' అని చెప్పబడినది. మైత్రాయణీయ సంహితయందును, ఐతరేయ బ్రాహ్మణమునందును ఆరు విభక్తులను గుఱించియు, ఏడు విభక్తులను గుఱించియు పరిసంగింపబడినది.

ఈ వ్యాకరణ శాస్త్రమునకు బ్రహ్మయే మొదటి కర్తయని చెప్పబడినది. ఋక్తం త్రమున- 'బ్రహ్మ బృహస్పతయే ప్రోవాచ, బృహస్పతి రింద్రాయ, ఇంద్రో భరద్వాజాయ, భరద్వాజ ఋషిభ్యః, ఋషయో బ్రాహ్మణేభ్యః' అని వ్యాకరణ పరిచారక్రమము నిరూపింప బడినది.

ఋగ్వేదమునందలి అయిదు మంత్రములు ఉదాహరింపబడి యీ క్రింది రీతిని వ్యాఖ్యానింపబడినవి.

1. చత్వారి శృంగా, 2. చత్వారి వాక్ పరిమితా పదాని, 3. ఉతత్వఃపశ్యన్, 4. సక్తుమివ, 5. సుదేవోఽసి. ఋ. 4-58-3, ఋ. 1-164-45, ఋ. 10-71-4, ఋ. 10-71-2 ఋ. 8-69-12.

ఋక్కు. 1. చత్వారి శృంగా త్రయో అస్య పాదా
ద్వే శీర్షే సప్తహస్తాసో అస్య।
త్రిధా బద్ధో వృషభో రోరవీతి
మహో దేవో మర్త్యాన్ ఆవివేశ ॥

అర్థము : అస్య=ఈ శబ్దరూపుడయినదేవునకు, శృంగాః=కొమ్ములు, చత్వారి= నాలుగు, పాదాః=పాదములు, త్రయః=మూడు, శీర్షే = శిరస్సులు, ద్వే = రెండు, హస్తాసః = చేతులు, సప్త=ఏడు.

త్రిధా = మూడు చోటులందు, బద్ధః = ప్రతిష్ఠింపబడినట్టి, వృషభః = కోరికల నిచ్చు శబ్దదేవుడు, రోరవీతి = ధ్వని చేయుచుండును, మహః = గొప్పవాడైన, దేవః= శబ్దదేవుడు, మర్త్యాన్=మానవులను, ఆవివేశ = ఆవేశించెను.

తాత్పర్యము : మానవులందు అంతర్యామిగానున్న శబ్ద పరబ్రహ్మమొక విచిత్ర మైన వృషభ స్వరూపము. ఆ వృషభమునకు నాలుగు కొమ్ములు, మూడు కాళ్ళు, రెండు

శిరస్సులు, ఏడు చేతులు నున్నవి. అయ్యది మానవుల నావేశించి మూడు చోటులనుండి యెల్లపుడును ధ్వని చేయుచుండును. అది సకల కామములను దీర్చుచుండును.

వివరణము : వాస్తవమున అగ్ని దేవతాపరమైన ఈ మంత్రము, శబ్దశాస్త్ర ప్రతిపాద్యమైన శబ్దబ్రహ్మపరముగ వైయాకరణులచే వ్యాఖ్యానింపబడినది. లాక్షణికముగ ఈ యర్థము సంభవించును.

మానవులం దంతర్యామిగ నున్న పరశబ్దము సహజ వృషభముకన్న అతివిచిత్రమని యిచట ప్రతిపాదింపబడినది.

ఇచటి శృంగములు : సుబంతము, తిజంతము, ఉపసర్గము, నిపాతము అను నాలుగు విధములయిన పదములు.

మూడు పాదములు : భూత భవిష్య ద్వర్తమానము లను కాలములు.

రెండు శిరస్సులు : శబ్దమున కున్న రెండు రూపములు.

(నిత్యము = స్ఫోటము, అనిత్యము = వైఖరి).

ఏడు చేతులు : ఏడు విభక్తులు.

మూడు స్థానములు : వక్షః స్థలము, కంఠము, శిరస్సు (శబ్దము యొక్క అభివ్యక్తి ప్రదేశములు).

వృషభము : వర్షించునది = కోరికల నిచ్చునది (సుశబ్దప్రయోగమువలననే కోరికలు సిద్ధించునని సంప్రదాయము).

రోరవీతి = రంకెలు వేయును. (సతతము నాద రూపమున గోచరమగును).

ఇట్టి శబ్దబ్రహ్మమును దెలియు మానవుడు తత్సాయుజ్యమును బొందును. ఈ యంశమును :

"అపి ప్రయోక్తు రాత్మానం శబ్ద మంతరవస్థితమ్ ।
ప్రాహు ర్మహాంత మృషభం యేన సాయుజ్య మిష్యతే॥"

అను కారికతో భర్తృహరియు సంగ్రహించెను. (చూ : వాక్యపదీయము I. 131).

(2) చత్వారి వాక్పరిమితా పదాని
తాని విదు ర్బ్రాహ్మణా యే మనీషిణః ।
గుహా త్రీణి నిహితా నేంగయంతి
తురీయం వాచో మనుష్యా వదంతి ॥

అర్థము : వాక్పరిమితా = వాక్కుయొక్క భేదములగు, పదాని = పదములు (శబ్దములు), చత్వారి = నాలుగు(నామాఖ్యాతోపసర్గ నిపాతములు-లేక పరాపశ్యంతీ మధ్యమా వైఖరులు), యే = ఎవరు, బ్రాహ్మణాః మనీషిణః = వ్యాకరణజ్ఞులగు విద్వాంసులు కలరో (తే = వారు), తాని = ఆ నాలుగు భేదములను, విదుః = సంపూర్ణముగా తెలియగలరు.

మనుష్యాః = వ్యాకరణజ్ఞానము లేని సామాన్యమానవులు, గుహా = గుహయందు = హృదయమందు—లేక—అజ్ఞానమందు, నిహితా = ఉంచబడిన, త్రీణి = మూడు వాగ్భేదములను, న + ఇంగయంతి = తెలియజాలరు, (తే = వారు), తురీయమ్ = నాల్గవభేదమైన, వాచమ్ = వాక్కును (వైఖరిని మాత్రము), వదంతి = పలుకుదురు.

తాత్పర్యము : వ్యాకరణ శాస్త్ర విద్వాంసులు మాత్రమే నాల్గు విధములయిన శబ్దభేదములను సంపూర్ణముగా తెలియుటకు సమర్థులగుదురు. ఇతరులకు వైఖరీ స్వరూపము మాత్రమే తెలియును. అట్టివారికి పరా పశ్యంతీ మధ్యమలను మూడు భేధములును అజ్ఞానముచే నా వృతములై పోవును.

ఈ విషయమును :

"వైఖర్యా మధ్యమాయాశ్చ పశ్యంత్యాశ్చైతదద్భుతమ్ ।
అనేక తీర్థ భేదాయా స్త్రయ్యా వాచః పరం పదమ్ ॥

స్వరూప జ్యోతిరేవాంతః పరా వా గనపాయినీ।"అను మాటలతో భర్తృహరియు సూచించెను. (వా. ప. ప్రథమ కాండము-143).

(3) ఉత త్వః పశ్య న్న దదర్శ వాచ-
ముత త్వః శృణ్వ న్న శృణోత్యేనామ్ ః
ఉతో త్వస్మై తన్వం విసస్రే
జాయేవ పత్య ఉశతీ సువాసాః ॥

అర్థము : త్వః = ఒకడు (వ్యాకరణము తెలియని వాడు), వాచమ్ = వాక్కును (శబ్దమును), పశ్యన్ = చూచుచున్నను, న + దదర్శ = చూడలేదు, ఉత=గదా ః, త్వః = వేరొకడు, ఏనామ్ = ఈ శబ్దమును, శృణ్వన్ = వినుచున్నను, న + శృణోతి = వినలేదు, ఉత=గదా ః (ఏషా = ఈ వాక్కు), సువాసాః = శుభ్రమైన బట్టలు గలిగి, ఉశతీ = ఉరకలు వేయుకోరికలుగల, జాయా = భార్య, పత్యే + ఇవ = భర్తకువలె, త్వస్మై = మరియొకనికి (వ్యాకరణము నెఱిగిన వానికి), తన్వమ్=తన శరీరమును (స్వరూపమును), విసస్రే = ప్రకాశింపజేయును. ఉత + ఉ = ఉతో = కదా ః

తాత్పర్యము : ఈ మంత్రములోని మొదటి రెండు పాదములు వ్యాకరణ జ్ఞానము లేని వానికి, తరువాతి రెండు పాదములును వ్యాకరణ జ్ఞానము గల వానికిని జెందును.

శబ్దశాస్త్రము నెఱుగనివాడు శబ్దమును చూచినను విన్నను సాఫల్యమును పొంద జాలడు. శబ్ద సంస్కారము తెలియనందున స్వరూప జ్ఞానము గాని, అర్థ జ్ఞానముగాని వానికి సంభవింపదని భావము.

ఇక వ్యాకరణజ్ఞుని విషయము వేరు. వాగ్దేవి అట్టివానికి ప్రియమైన భార్యవలె తన్నుగా నర్పించుకొనును. వైయాకరణునకు శబ్దార్థ స్వరూపము కరతలామలక మన్నమాట।

(4) సక్తుమివ తితఉనా పునంతో
యత్ర ధీరా మనసా వాచ మక్రత ।
అత్రా సఖాయః సఖ్యాని జానతే
భద్రైషాం లక్ష్మీ ర్నిహితాధివాచి ॥

అర్థము : యత్ర = ఏకవ్యాకరణమందు, ధీరాః = ధ్యానముగల వైయాకరణులు, తితఉనా = జల్లెడతో, సక్తుమివ = పిండినివలె, మనసా = జ్ఞానముతో, వాచమ్ = వాక్కును (శబ్దమును), పునంతః = శోధించువారై, అక్రత = ప్రయోగించిరో (తే = అట్టి వైయాకర

ణులు), అత్ర = ఈ శబ్ద బ్రహ్మమందు, సఖాయః = సమానజ్ఞానముగల వారై, సఖ్యాని = సాయుజ్యమును, జానతే = పొందుదురు. ఏషామ్ = వీరియొక్క, వాచి = వాక్కునందు, భద్రా = మంగళాత్మిక యైన, లక్ష్మీః = శబ్దబ్రహ్మలక్ష్మి, అధి = అధికముగా, నిహితా = సిద్ధమైయున్నది.

తాత్పర్యము : జల్లెడతో పిండిని శోధించినట్లు ప్రజ్ఞానముతో వైయాకరణులు శబ్దమును పరిశోధించి, (అపశబ్దములను సుశబ్దములను వేరుచేసి చూపి) సుశబ్దములనే ప్రయోగించుచుందురు. అట్టివారికి శబ్దార్థాభేదజ్ఞానము, సర్వశబ్ద సామ్యము, శబ్ద బ్రహ్మ జ్ఞానమును క్రమముగ గలుగును. తుదకు వారికి శబ్ద బ్రహ్మ సాయుజ్యమును సంప్రాప్తించును.

వైయాకరణులకు శబ్దబ్రహ్మ సాక్షాత్కారము స్వయం సిద్ధము కాగలదని యభిసంధి.

(5) సుదేవో అసి వరుణ యస్య తే సప్తసింధవః
అనుక్షరంతి కాకుదం సూర్మ్యం సుషిరామివ .

అర్థము : వరుణ = ఓ వరుణా !, సుదేవః = సత్యదేవుడవు (సత్యేన + దీవ్యతి = సత్యముతో ప్రకాశించువాడు), అసి = అయి ఉన్నావు, యస్య = యస్మాత్ = ఎందువలన, (అనగా), తే = నీయొక్క, కాకుదమ్ = తాలువును, (కంఠములోపలి–కొండనాలుక అను భాగము), (ప్రాప్య = పొంది), సప్తసింధవః = సప్త సముద్ర రూపములైన సప్త విభక్తులు, సుషిరామ్ = రంధ్రముగల, సూర్మిమ్ = శోభనమగు ఇనుప ప్రతిమను, (ప్రాప్య = పొంది) (అగ్నిః + ఇవ = అగ్నివలె) అనుక్షరంతి = ప్రకాశించు చున్నవో (అందువలన సత్యదేవు డగుట సిద్ధించెను).

తాత్పర్యము : వరుణుడు సత్యదేవుడు. అనగా సత్యముతో ప్రకాశించువాడు. వైయాకరణులును సత్యదేవులే అగుదురు. సత్యరూపమైన శబ్ద బ్రహ్మము వారి నోళ్ళయం దెల్లపుడును ప్రకాశించుచునే యుండును.

లోపల గుల్లగానుండు లోహప్రతిమలను నిప్పులో బెట్టి కాల్తురు. అగ్ని వానిలోపల ప్రవేశించి మలమునంతను దహించి వానిని శుద్ధిజేయును. అట్లే విభక్త్యంతములైన సాధు శబ్దములు వైయాకరణుల నోళ్ళను బ్రకాశింపుచు వారి పాపములను బోగొట్టుచుండును.

అనగా సాధుశబ్దమును బ్రయోగించు శాబ్దికులు విగత కల్మషులై వరుణ సదృశులై స్వర్గమును బొందుదురని సారాంశము.

[N B: కేవలము వరుణస్తుతి పరమైన ఈ ఋక్కును, వైయాకరణులు చాల శ్రమపడి తమకనుకూలముగా ఈడ్చికొని వచ్చినారు.]

పయిని నిరూపింపబడిన మంత్రములందు వ్యాకరణ ప్రచారమును, దాని స్తుతియు నుండిన ట్లూహింపనగును గాదా!

[వాక్యపదీయము రెండవకాండలో కొంత భాగమును తెనిగించిన శ్రీ అప్పల్ల సోమేశ్వర శర్మగారిచే పయి ఋక్కులకు ప్రతిపదార్థ తాత్పర్యములు వ్రాయబడినవి.]

ఇట్లు బయలువెడలిన వ్యాకరణశాస్త్రమునందు మిక్కిలి ప్రాచీనమయి యొక ముఖ్యఘట్టమును మనకు నిరూపించు గ్రంథము, పాణిని నిర్మితమయిన అష్టాధ్యాయి సూత్రములు. ఇవి సంస్కృతభాషకు ముఖ్యముగా లౌకిక సంస్కృతమునకు, (అనగా వైదిక మంత్రములలోని సంస్కృతముకంటె కొంత భిన్నము) ఈడులేని లక్షణము. ఈ పాణినికి ముందు విశాలమైన వైదికవాఙ్మయమేగాక లౌకిక వాఙ్మయమును, వాడుకలోనున్న అనగా నిత్యవ్యవహారములో పండితులు వాడుచుండిన భాషయు, అనేక వ్యాకర్తలును ఉండిరి. ఆ భాషనంతటిని సంస్కరించిన యీ పాణినీయ సంప్రదాయము నేటికిని ప్రమాణముగా వాడుకలో నున్నది. తక్కిన సంస్కృత గ్రంథములయొక్కయు, కవులయొక్కయు కాలమువలెనే పాణినియొక్క కాలమునుగూర్చి భిన్నాభిప్రాయము లున్నవి. **Dr. V. S. Agarwall** గారు పాణినికాలము 480-490 క్రీ. పూర్వమనిరి. శ్రీ భండార్కరుగారు 700 క్రీ. పూర్వమనిరి. **Maxmuller**350 క్రీ. పూర్వమనెను. **Keith** గారు 300 క్రీ. పూ. అనిరి. **Belwalkar** గారు 700-300 క్రీ. పూ. అనిరి.

పాణిని ముందు వ్రాయబడిన బ్రాహ్మణములయందు వ్యాకరణ ప్రశంస యుండినట్లు ముందే పేర్కొంటిని. రామాయణమునందు ఆంజనేయుని గూర్చి యీరీతిగా కిష్కింధా కాండలో చెప్పబడెను. "ఈతనిచేత వ్యాకరణ మఖిలమును బహువిధముల అభ్యసింపబడెను. ఎన్నియో మాటలు చెప్పినాడు కాని ఒక అపశబ్దముకూడ వినబడలేదు."[6] ఈ వ్యాకరణమునకు బ్రహ్మయే మొదటి కర్తయనియు,ఆతని తరువాత బృహస్పతి యనియు, అనంతరము ఇంద్రుడనియు చెప్పుటచే ఐంద్రవ్యాకరణ మను నొక సంప్రదాయ ముండినట్లును, అది పాణినికి పూర్వమనియు విమర్శకులు తలంచుచున్నారు. అరవమునకు మొదటి వ్యాకరణమును వ్రాసిన తొల్కాప్పియనారు గ్రంథమును గూర్చి, 'ఐందిరమ్ నిరైంద తొల్కాప్పియమ్' అని ఆతని కాలము వాడయిన అదంగోట్టా సిరియర్ వ్రాసినాడు. యాస్కుడును[7] పాణినికి పూర్వుడే. ఆయన వ్రాసిన నాలుగువిధములయిన పదవిభాగమునే, తొల్కాప్పియనారు అరవమునకు సరిపెట్టెను. కాబట్టి పాణిని రచనకు ఆధారములయిన లక్ష్యలక్షణములు, సంప్రదాయములు, లాక్షణికులు, విశాలమయిన వైదిక లౌకిక వాఙ్మయములును ఉండినవి. పాణిని తన అష్టాధ్యాయికి ముందు పేర్కొన్న 'అ ఇ ఉణ్' సూత్రములు మాహేశ్వర సూత్రములని యాయనయే పేర్కొనెను. కాబట్టి మహేశ్వర సంప్రదాయ మొకటి యుండెనని కొంద రూహించుచున్నారు.

పాణినిచే ఉదాహరింపబడిన వైయాకరణులు "ఆపిశలి, కాశ్యప, గార్గ్య, గాలవ, భారద్వాజ, శాకటాయన, శాకల్య, సేనక, స్ఫోటాయనాదులు" మొదలయినవారు 32 మంది ఆయనకు ముందుగనో, సమకాలగ్రంథకారులుగనో ఉండిరి.

ఈ అష్టాధ్యాయిలో $8 \times 4 = 32$ పాదములు ఉన్నవి. మొత్తము సూత్రముల సంఖ్య 3991 . ఈ పాణినికి పాణిన, పాణిని, దాక్షీపుత్ర, శాలంకి, శాలాతురీయ, ఆహిక

---

6 మానం వ్యాకరణం కృత్స్నమనేన బహుధా శ్రుతమ్ ।
బహు వ్యాహరతానేనకించి దపభాషితమ్॥ రామాయణము (కిష్కింధాకాండము).

7 చత్వారి పదజాతాని నామాఖ్యాతే చ ఉపసర్గ నిపాతాశ్చ—యాస్కుడు.

నామములు వాడుకలో నుండినట్లు తెలియుచున్నది. ఇతని తండ్రి పణి యనియు, తల్లి దాక్షి యనియు, శాలాతూర్ ఈతని నివాస గ్రామమనియు ఊహింపబడినది. నేటికిని పరమ ప్రామాణికమయి సంస్కృత భాషాధ్యయనమునకు మిక్కిలి ఉపకారకమయిన యీ పాణిని సూత్రములకు ఆతని తరువాత అనేకులు శేష గ్రంథములను వ్రాసిరి. పయి సూత్రములందలి అతివ్యాప్తి, అవ్యాప్తి మొదలయినవి వారించుచు వివరణము సవరణము చేయునట్టివి ఈ గ్రంథములు. ఇవియును రూపముననను అర్థముననను సూత్రములేకాని వానిని వార్తికములని వ్యవహరించుట రూఢిమూలము (పాణిని కృత సూత్ర వ్యావర్తకము) [8].

> ఉక్తానుక్త దురుక్తానాం చింతా యత్ర ప్రవర్తతే ।
> తం గ్రంథం వార్తికం ప్రాహు ర్వార్తికజ్ఞా మనీషిణః ॥
> ఉక్తానుక్త దురుక్త చింతా వార్తికమ్ : కావ్య మీమాంసా.

శ్లోకవార్తికము, తంత్రవార్తికము, శ్రీశంకర భగవత్పాదకృత బృహదారణ్యక భాష్యముపయిని సురేశ్వరాచార్యుడు వ్రాసిన వార్తిక గ్రంథము మొదలయిన వాని యందు వార్తికశబ్ద ముపయుక్తము.

పతంజలికృత మహాభాష్యమును బట్టి అయిదుగురు పురుషులు అష్టాధ్యాయికి వార్తికములను రచించినట్లు తెలియవచ్చుచున్నది. 1. కాత్యుడు లేక కాత్యాయనుడు. 2. భరద్వాజుఁడు. 3. సునాగుడు 4. క్రోష్ట 5. బాడవుడు. మహాభాష్యమునకు టీకలు వ్రాసిన వారివలన మఱి యిద్దరి పేళ్ళు తెలియవచ్చుచున్నవి: 6. వ్యాఘ్రభూతి 7. వైయాఘ్రపద్యుడు.

ఇంతమంది వార్తికకారుల పేర్లు తెలియవచ్చుచున్నను, వారిలో ముఖ్యుడును, ప్రసిద్ధుడును అయినవాడు కాత్యాయనుడు. ఈయనకే వరరుచి యను నామాంతరము గలదని స్వర్గారోహణ కావ్యమునందలి క్రింది శ్లోకము దృఢపఱచుచున్నది. [9] "కాత్యాయనునియొక్క వార్తిక పాఠము పాణినీయ వ్యాకరణము యొక్క అత్యంత మహత్త్వ పూర్ణమైన అంగము". పతంజలిచే, కాత్యాయనకృత వార్తికముల ఆధారము పయినే, వ్యాకరణ మహాభాష్యము వ్రాయబడినది. కాత్యాయనుని యొక్క వార్తిక పాఠములు స్వతంత్ర రూపమున ఉపలబ్ధములు కావు. మహాభాష్యమునుండి కాత్యాయనకృత వార్తికముల నిశ్చిత సంఖ్య స్పష్టముగా తెలియబడదు. ఎందుచేతననగా అందు అనేకులయిన యితర వాక్యకారుల వచనములు కూడ సంగృహీతములయినవి. వారి నామములు భాష్యకారునిచే పేర్కొనబడలేదు.

భాషాస్వరూపము అనంతముగావున దానికంతటికి నొకరు నిర్వచనము చేసి వ్యాకరణము వ్రాయ సమర్థులు కారు. ఎవ్వరు వ్రాసినను కేవలకర్తయొక్క బుద్ధి విశేషము

---

8. ఈ వార్తిక పదమునకు లక్షణము పరాశరోపపురాణమునం దిట్లు చెప్పఁబడినది.

9. మహారాజ సముద్రగుప్తునిచేత కృష్ణ చరితమునందలి మునికవి వర్ణమునంది శ్లోకములు వ్రాయబడినవి. యః స్వర్గారోహణం కృత్వా స్వర్గమానీతవాన్ భువి । కావ్యేన రుచిరేణైవ ఖ్యాతో వరరుచిః కవిః॥న కేవలం వ్యాకరణం పుపోష। దాక్షీసుతస్యేరిత వార్తికైర్యః॥ కావ్యేపి భూయోనుచకార తం వై। కాత్యాయనోఽసౌ కవికర్మదక్షః॥ (P. 295 సంస్కృత వ్యాకరణ శాస్త్రముయొక్క ఇతిహాసము) 2. సం. వ్యా. ఇ. P 291.

వలన వచ్చు గుణదోషములు మాత్రమే గాక దేశకాలముల భేదముచే వ్యవహృతము లగు చుండు మాండలిక భాషా భేదముల వలన గూడ లక్షణమందు భేదము కనుపట్టుచుండును. కావున శేషగ్రంథములు తప్పవు. తెనుగు వ్యాకరణమున ఆంధ్ర శబ్ద చింతామణికి శేష గ్రంథముగా అథర్వణ కారికలు బయలుదేరినవి. ఈ రెండిటికిని వ్యాఖ్యయగు అహోబల పండితీయమునందే ఈ కారికలు స్పష్టపడుచున్నవి. వానిని గ్రహించియే వేరుగా రూపించిరి అట్లే తెలుగున బాల వ్యాకరణమునకు సవరణ గ్రంథము ప్రౌఢ వ్యాకరణము. ఇట్టి తెలుగు రచనలును పయి సంస్కృత వ్యాకరణ సంప్రదాయము ననుసరించియే తెనుగున బయలు వెడలినని.

పయిరీతిని వార్తికములను గూర్చి తెలిపిన తరువాత వ్యాడి [10] కృతమైన 'సంగ్రహ' మనెడి యొక గొప్ప గ్రంథమును గూర్చి తెలిసికొనవలయును. పతంజలి కృత మహా భాష్య మునందు 'సంగ్రహ' గ్రంథమును గూర్చిన ప్రశంసగలదు. 'సంగ్రహ ఏతత్ ప్రాధాన్యేన పరీక్షితమ్—సంగ్రహే తావత్ కార్యప్రతిద్వంద్విభావాన్ మన్యామహే శోభనా ఖలు దాక్షాయ ణస్య సంగ్రహస్య కృతిః' పయి వాక్యములను బట్టి సంగ్రహమునకు కర్త దాక్షాయణుడని తెలియుచున్నది. ఈతనికే వ్యాడియని యింకొక పేరు. "పూర్వము ఈ పాణినీయ వ్యాకరణము నకు సంబంధించి వ్యాడిచే వ్రాయబడిన సంగ్రహమను గ్రంథము లక్ష శ్లోకపరిమితమయి యుండినది" అని వాక్యపదీయ టీకాకారుడయిన పుణ్యరాజు వ్రాసెను.

"'సాధారణముగా సంక్షేపరూప గ్రంథములయందే అభిరుచిగలిగి అల్పవిద్యా పరి గ్రహముచే తృప్తులైన వైయాకరణులను పొంది 'సంగ్రహము' నష్టమయినది. అనేకము లయిన విశేషములను స్వాధీనము చేసికొనిన గురురూపి పతంజలిచే బహువిధములయిన మార్గములను చూపించుచు మహాభాష్యము రచింపబడినది. అట్టి మహాభాష్యము అల్పబుద్ధు లకు స్వాధీనము కాకపోవుటచే మిక్కిలి విరళప్రచారమునంది నష్టతుల్యమయిపోయినది. ఇట్లు నష్టమయిన వ్యాకరణాగమము దాక్షిణాత్యులయందు మాత్రము నిలిచినది. పర్వతము నుండి దానిని తీసికొని వచ్చి చంద్రాచార్యాదులు బహుళప్రచారము నందించిరి. ఈ వ్యాకరణ శాస్త్రమార్గమును ఇతర శాస్త్రములయందు నిష్ణాతులయిన మా గురువు నిర్మించిరి.'' ఆదులనుటవలన భర్తృహరి గురువుగారయిన వసురాతుడు గూడ నందుండునట్లు నిశ్చయింప వచ్చును. పై సమాచారమంతయును వాక్యపదీయమునందలి రెండవకాండ 476-4౦2 శ్లోక ములలో నున్నది. ఆ శ్లోకములను గ్రంథమందు పరిశీలించునది.

పయినుదాహరింపబడిన మహాభాష్యకారుడయిన పతంజలిని గూర్చి సంగ్రహముగ వ్రాయనగును. ఈ వ్యాకరణ శాస్త్రమునకు పాణిని కాత్యాయన పతంజలులు ముగ్గురుమునులు కర్తలనియు, ఆదిపురుషులనియు నేడు స్తుతింపబడుచున్నారు. 'యథోత్తరం మునిత్రయస్య ప్రామాణ్యమ్' అనుటవలన వైరుద్ధ్యము స్ఫురించినచో మహాభాష్యము ప్రమాణమని సంప్ర దాయము. ఈ పతంజలికి గోనర్దీయుడనియు, గోణికాపుత్త్రుడనియు, నాగనాథ, అహిపతి, ఫణిభృత్, శేషరాజు మొదలయిన నామాంతరములు వాడుచుండిరి. పతంజలి అనేక స్థల

10. 'పురా పాణినీయేఽస్మిన్ వ్యాకరణే వ్యాడ్యుపరచితమ్ లక్షగ్రంథ పరి మాణం సంగ్రహాభిధానం నిబంధ మాసీత్'

ములయందు "అభిజానాసిదేవదత్తః కశ్మీరాన్ గమిష్యామః, తత్రసక్తూన్ పాస్యామః." (మహాభాష్యం 3/2/114 పాణిని సూత్రమునకు). ఇట్లాతడు కశ్మీరమును పలుమారు లుచ్చరించు చుండుటవలన అతనికి కశ్మీరదేశమందు అభిలాష మెండనియు అది జన్మభూమి యనియు భావింపబడు చున్నది. ఈతని జన్మగ్రామము గోనర్దమయి యుండవచ్చుననియు నూహ చేయబడినది. సామవేదీయ నిదానసూత్రము, యోగదర్శనము, మహాభాష్యము అను మూడును పతంజలి కృతములని ప్రతీతి. ఇక కాళిదాసులు, భర్తృహరులు మొదలయిన వారనేకు లున్నారనునట్లు పయి గ్రంథకర్త లొక్కరేనా? లేక భిన్నులా? ఎంతమంది పతంజలులు? అను ప్రశ్నలు ఉండనేయున్నవి. ఈ మహాభాష్య రచయిత ప్రాయశః పుష్యమిత్రునికి సమకాలికుడనియు 120-140 క్రీ. పూర్వమం దుండియుండెననియు నూహింపబడినది.

తక్కిన వ్యాకరణ గ్రంథములవలెగాక, మిక్కిలి సరళమయి హృదయంగమ మయిన శైలిలో వ్రాయబడిన గ్రంథము మహాభాష్యము. సంస్కృతమునందేమాత్రము పాండిత్యమున్నను మహాభాష్యశైలి అవగతము కాదగ్గదే. అందలి విషయము సర్వతోముఖము. ఆయన కాలమున విశాలమైన వ్యాకరణ వాఙ్మయ ముండినది. దాని సారము నంతను ఆతడందు చేరవేసి సవిమర్శముగ నిరూపించెను. కేవలము వ్యాకరణ శాస్త్రవిమర్శన మను మిషచే నాతడు ఇతర శాస్త్రసంప్రదాయములను దీనికి సంబంధించినవానిని సంగ్రహించి తన గ్రంథములో వివరించెను.

మహానంద కావ్యము, చరకసంహితా (సంస్కారము, సిద్ధాంత సారావళీ ఇది యొక వైద్యగ్రంథము) కోశము, సాంఖ్యశాస్త్రము, సాహిత్యశాస్త్రము (అనగా సాహిత్య రస విచారము), లోహశాస్త్రము మొదలయినవానికి సంబంధించిన గ్రంథములను ఈతడు రచించినట్లు కూడ ఊహించుట కాధారములున్నవి. ఇట్టి మహాభాష్యమునకు అనేకటీక లున్నవి. వ్యాఖ్యానములున్నవి. భర్తృహరి కృతమయిన మహాభాష్యటీక యున్నదని మునుదుదాహరింపబడినది. ఈ టీక విశాలమై 25000 శ్లోకములలో నున్నదని యొక వదంతి. నష్టమయిన యీ గ్రంథముయొక్క, ఒకానొక చిన్నభాగము మాత్రము లిఖితప్రతి దొరకగా దానిని సంస్కరించి యున్నారు. అందు అనేకమ్, అన్యే, ఇతరే, ఏకే, అపరే అను పదములచే భిన్నమతకర్తలను నిరూపించి యున్నట్లూహింపనగును. దీనినే మహాభాష్యదీపిక యని పేర్కొనుచున్నారు. అజ్ఞాత కర్తృకమయిన మరియొకటియు నుండినట్లు తెలియవచ్చుచున్నది. ఈ విషయము స్కందస్వామిచే సూచింపబడినది. మహాభాష్య ప్రదీపమను పేర కైయటునిచే విశాలమైన మరియొక వ్యాఖ్య వ్రాయబడినది. ఇది నేడు పఠనపాఠనముల కుపయోగించు చున్నది. దీని కాలము క్రీ. వె. 11వ శతాబ్దమని యూహింపబడినది. కాని నిశ్చితప్రమాణము లేవియును లేవు. ఈతడు కశ్మీరదేశవాసి యనుటయు కేవలము నామ సాదృశ్యమునుబట్టి యూహించినదే. ఇంకను గొన్నిటీక లున్నట్లు తెలియుచున్నది గాని కైయటము మిక్కిలి ప్రచారములో నున్నది.

4. భర్తృహరి మతము

భర్తృహరి బౌద్ధుడనియు ఏడు సారులు భిక్షుకుడుగా మారి, మరల నేడు సారులు ఆ మతము విడిచెనను ప్రవాదమును ఇత్ సింగ్ తెలిపినట్లు ముందు పేర్కొనబడినది.

ఈయన బౌద్ధుడగునా కాదా? అను విషయమును నిర్ణయించుటకు వాక్యపదీయముననే అనేకోదాహరణములున్నవి .వాక్యపదీయము సందెక్కడను బౌద్ధమతముయొక్క ప్రచారముగాని సిద్ధాంతములుగాని లేవు. వేద ప్రామాణ్యము, వైదిక కర్మలయిన యజ్ఞములు, అద్వైత సిద్ధాంతము, శబ్దము-బ్రహ్మము-ఈ రెంటికిని అభేదము అను విషయములున్నట్లు ఈ క్రింది శ్లోకముల వలన తెలియనగును.

1. ప్రథమ కాండములో 1, 2, 3 శ్లోకములలో బ్రహ్మ నిత్యత్వము, జగత్తునకు దాని వివర్తోపాదనత్వము, వేదప్రామాణ్యము, జ్ఞానమార్గమును నిరూపింపబడినవి.

2. 1 వ కాండ మూడవ శ్లోకమందును,
అధ్యాహితకలాం యస్య కాలశక్తి ముపాశ్రితాః
జన్మాదయో వికారాః షడ్ భావభేదస్య యోనయః ॥ 1-కాం. 3 శ్లో॥

కాలసముద్దేశము-మూడవ కాండమందును
తమస్య లోకతంత్రస్య సూత్రధారం ప్రచక్షతే
ప్రతిబంధాభ్యనుజ్ఞాభ్యాం తేన విశ్వం విభజ్యతే ॥ 3-కాం. 4 శ్లో॥

బ్రహ్మశక్తితో అభిన్నమయిన శక్తియే యిందంగీకరింపబడినది.

3. ప్రక్రియా భేదముచేత ఒక్కటియే అనేక విధములుగా విభజింపబడుచున్నది. అట్టి వ్యాకరణము నాశ్రయించి పరబ్రహ్మ పొందబడుచున్నది. 1-22

ఇట్టి వ్యాకరణ శాస్త్రాశ్రయమున ముక్తి లభించుననుట బౌద్ధుల కెట్లు సమ్మతము?

4. అన్ని స్మృతులకును వేదమే మూలమని 'స్మృతయో బహురూపాశ్చ' అని చెప్ప బడినది. ఇది బౌద్ధులకు కేవల విరుద్ధము కాక తప్పదుగదా. 1-కా. 7 శ్లో॥

5. వ్యాకరణము వేదమునకు ముఖ్యాంగము- "ఆసన్నమ్ బ్రహ్మణస్తస్య" 1-11

6. శబ్దబ్రహ్మకు ఛందోమయమయిన తనువుగలదు, "అత్రాతీత విపర్యాసః" 1-17

7. వేద శబ్దము వలననే జగత్తు యొక్క ఉత్పత్తి యేర్పడినది. "శబ్దస్య పరిణామోఽయం" 1-120

8. ప్రాణులయొక్క చేతనశక్తి గూడ శబ్దమే యని యెరుంగునది. "సైషా సంసారిణాం-" 1-126

9. అన్ని యాగములు సకర్తృకములు, వానికి వినాశనము తప్పదు. త్రయీ-మాత్రము నిత్యము "నజాత్వకర్తృకమ్." 1-133

10. ఆత్మ నిత్యమని అంగీకరించెను.

ఆత్మా వస్తు స్వభావశ్చ శరీరం తత్త్వ మిత్యపి
ద్రవ్యమిత్యస్య పర్యాయ స్తచ్చ నిత్య మితిస్మృతమ్॥ ద్రవ్య సముద్దేశము.
3-కా. 2-స. 1 శ్లో॥

భర్తృహరి యొక్క మతము బౌద్ధము కాదని చూపుటకు పయినిదర్శనములు చాలును. ఒకప్పుడు బౌద్ధ మతావలంబియైన భర్తృహరి యుండినచో నాతడు వాక్యపదీయ కర్త మాత్రము కాడు. ఆతడు మఱియొకడై యుండవచ్చును. ఆతడు సుభాషిత త్రిశతి యొక్క కర్తయయి యుండవచ్చునేమో యనిపించును. కాని అందును బౌద్ధమత విషయము లేవియును కనుపట్టవు. కాని "దిక్కాలాద్యనవచ్ఛిన్నానంతచిన్మాత్రమూర్తయే, స్వానుభూత్యేక మానాయ నమ శ్శాంతాయ తేజసే" అను శ్లోకము నీతి శతకమునకు ముందు కనుపట్టు చుండు నది భర్తృహరి శబ్దధాతుసమీక్షలోనిదని సోమానందుడు, ఉత్పలాచార్యుడును శివదృష్టి యను గ్రంథములో పేర్కొనిరి. సుభాషితత్రిశతి కర్తయు, వాక్యపదీయ కర్తయును, బ్రాహ్మణులును వేద వేదాంగ తత్త్వజ్ఞులని ఆ గ్రంథములను బట్టి నిశ్చయింపక తప్పదు.

5. వాక్యపదీయ టీకలు

వాక్యపదీయము మూలము, కారికలనబడెడు శ్లోకముల రూపమున మూడు కాండములలో నున్నది. ఈ గ్రంథము పయిని నాలుగు టీకలు లభించుచున్నవి. కాని ఏ యొక్కటి యును గ్రంథమంతటి మీదను సంపూర్ణముగా లేదు. వీనిలో ప్రాచీనమయినది 'వృత్తి' లేక 'టీక' యనబడుచున్నది. ఇది మొదటి రెండు కాండల పయినే యున్నది. ఈ వృత్తి కూడ ప్రథమ కాండము నంతటికి పూర్ణముగా నున్నను రెండవ కాండమునకు నడుమ నడుమ గ్రంథ పాతములతో కూడియున్నది. గ్రంథమునందు - వృత్తికారుడు 'హరి వృషభు'డని యున్నది. రెండవ కాండకు పయివృత్తికాక పుణ్యరాజకృతమయిన టీక కూడ నున్నది. మూడవ కాండమునకు హేలారాజు వ్రాసిన టీక యున్నది. అందు కొంత గ్రంథపాతము ఉండగా ఫుల్లరాజకృతమైన భాగముచే పూరింపబడినది. నాల్గవది వృషభదేవకృతమయిన 'పద్ధతి'యను టీక ప్రథమ కాండమునకు లభించుచున్నది.

ఇక్కడ విచారింపవలసిన విషయమొకటి. పైని పేర్కొనిన 'వృత్తి' వ్రాసిన వారెవ్వరు? ఈ విషయమును తల స్పర్శముగా విమర్శించి కారికలును వృత్తియును ఒక్కరే రచించిరని విమర్శకులు నిర్ణయించిరి. కాండాంత గద్యలలో ఒకయెడ 'శ్రీహరి వృషభ-రచితే' యనియును, 'భర్తృహరి వృషభ......రచితే' అని ఇంకొకయెడను వ్రాసియుండుటచే వృషభ శబ్దము శ్రేష్ఠ వాచకమనియు, భర్తృహరినే హరియని వాకొనిరనియు ఊహింపబడినది. కాని వీరిద్దరు భిన్నులను వారి వాదములోను కొన్ని బలమైన యుక్తులు గలవు. అవియు నాలోచింపవలసినవే. కాని అభిన్నులను వాదము ప్రాచీనము, అనుస్యూతము నగుట దానినే మనము ఇతర సాక్ష్యము వచ్చువరకును అంగీకరింపవచ్చును.

హేలారాజు వ్రాసిన వ్యాఖ్య మూడవకాండ సంబంధమయినదే, ప్రకాశమను పేర మనకు లభించుచున్నది. దీనియందలి వాక్యములను బట్టి ఈతడు మొదటి రెండు కాండలకు కూడ వ్యాఖ్యానములు వ్రాసినట్లును, దానిపేరు శబ్దప్రభయని వ్యవహరించెననియు తెలియుచున్నది. ఈ హేలారాజు కాశ్మీర భూపతి యయిన ముక్తాపీడుని మంత్రియగు లక్ష్మణుని వంశము వాడనియు భూతిరాజు కొమారుడనియు చెప్పుకొన్నాడు. ఈతడు పదవ శతాబ్దము నడిమిని 950 క్రీ. వె. ఉండిన ట్లూహింపబడినది. ఈతడు వ్యాకరణమున మహాపండితుడనియు మిక్కిలి ప్రతిభావంతుడనియు విమర్శనమువలన తెలియుచున్నది. పుణ్యరాజు

వ్రాసిన వ్యాఖ్యానము రెండవకాండకు లభించుచున్నది. ప్రథమ కాండమునకు ఈయనవ్రాసిన వ్యాఖ్యయున్నదని 1887 లో కాశీ విశ్వ విద్యాలయ ముద్రణమునందలి వాక్యము పొరపాటు. ఆ మొదటి కాండ వ్యాఖ్యానము హరివృషభుడు వ్రాసినట్లున్నది. ప్రథమకాండముయొక్క కారికలకును, వృత్తికిని కూడ కలిపి వ్రాసిన వ్యాఖ్యాన మొకటి వృషభదేవుడను నతడు 'పద్ధతి' యనుపేర రచియించెను. ఇది ప్రాచీన వ్యాఖ్యయే గాని కాలము స్పష్టముగా నిర్ణయింప వీలుగాదు.

వాక్యపదీయము పేరు, అందలివిషయము

'వాక్యంచ పదంచ వాక్యపదే, తే అధికృత్య కృతో గ్రంథో వాక్యపదీయమ్ పయి విగ్రహ వాక్యమును బట్టి వాక్యపదములు రెండింటిని విచారించు గ్రంథము గావున ఇది అన్వర్థ సంజ్ఞ యని స్పష్టము. ఇందు మూడు కాండలు గలవు. మొదటి దానికి బ్రహ్మకాండ యని పేరు. రెండవదానికి వాక్యకాండ యనియు, మూడవదానికి పదకాండ యనియు పేరు. మొదటి కాండలో 156 కారికలును, రెండవదానిలో 487 కారికలును, మూడవ దానిలో నున్న 14 సముద్దేశములలోని (శ్లోకములు) కారికలు 1323. మొత్తము కారికలు 1966.

1. బ్రహ్మకాండము అగమ (సంగ్రహము) సముచ్చయము. ఈ కాండములో ముఖ్యముగా శబ్దబ్రహ్మముల అభేదము, వేదప్రామాణ్యము, నిశ్రేయస ప్రాప్తి ముఖ్య విషయములు. కాబట్టి ఇది బ్రహ్మకాండ మనబడినది.

2. వాక్యకాండము వాక్యలక్షణము, ద్వైవిధ్యము, దాని విచారణము, ఇతర మతములు వాక్యార్థము అఖండము నిర్విభాగము, అనవయవమైన శబ్దమే వాక్యస్ఫోటము, పదవాదమునందలి దోషములు, మొదలయిన విందలి విషయములు. కాబట్టి యిది వాక్యకాండ మయినది. ఈ తెలుగు గ్రంథమున మొదటి రెండు కాండములు ప్రతిపదార్థ తాత్పర్యాదులతో ప్రచురింపబడినవి.

3. మూడవది పదకాండము : ప్రకీర్ణకాండము.

ఈ కాండము చాల పెద్దది. ఇందు పదునాలుగు సముద్దేశము లున్నవి. ఆయాసముద్దేశములందు ఆయావిషయముల స్వరూపము వివరింపఁబడినది.

1. జాతి	సముద్దేశము	106	కారికలు	8. క్రియాసముద్దేశము		64	కారికలు
2. ద్రవ్య	,,	18	కారికలు	9. కాల	,,	114	,,
3. సంబంధ	,,	88	,,	10. పురుష	,,	9	,,
4. భూయోద్రవ్య	,,	3	,,	11. సంఖ్యా	,,	32	,,
5. గుణ	,,	9	,,	12. ఉపగ్రహ	,,	27	,,
6. దిక్	,,	28	,,	13. లింగ	,,	31	,,
7. సాధన	,,	167	,,	14. వృత్తి	,,	627	,,

పయి సముద్దేశములలో ఆయా విషయములస్వభావము, వానికిగల వాచ్యవాచక సంబంధము మొదలయిన పరిపూర్ణవిచారము గలదు.

ఈయిరీతిని మూడు కాండముల యొక్క పేళ్ళను వానియందలి విషయ విభాగ మును మిక్కిలి సంగ్రహముగా నిరూపింపబడిన తరువాత అందలి విషయమును గూడ ఈ క్రిందను మఱికొంచెము విశదపడునట్లు సమన్వయపరచి నిరూపింతును.

1. ఈ మొదటి కాండమునకు కృత్యంతము "ఇతి శ్రీహరివృషభ మహావైయా కరణ విరచితే వాక్యపదీయే 'ఆగమసముచ్చయో' నామ 'బ్రహ్మకాండం' సమాప్తమ్" అని యుండుట వలన ఈ రెండును ఈ కాండమునకు పేళ్ళని యూహింపక తప్పదు.

ఈ గ్రంథమున 1 వ కాండలోని 24-25-26 శ్లోకములలో ఈ గ్రంథము నందంతటను వివరింపబడు విషయములు నిరూపింపబడినవి. అవి క్రమముగా 1. అపోద్ధార పదార్థములు, 2. స్థిత లక్షణములు 3. అన్వాఖ్యేయములయిన శబ్దములు 4. ప్రతిపాదకములు 5. కార్యకారణ భావమున నున్నవి. 6. యోగ్యతారూప స్థితములు. 7. ధర్మము. 8. ప్రత్య యము. (చూడు తెలుగు వ్యాఖ్యానము-24, 25, 26. శ్లో.)

ఈ ఎనిమిది విషయములకు వేరు వేరు కాండలు లేవుగదా ! ఉన్నవి మూడే. ఇక బ్రహ్మను చెప్పుకాండము బ్రహ్మ కాండమనుచో బ్రహ్మను గూర్చి యీ యెనిమిదిటిలో పరిగ ణింప వీలులేదుగదా ! అని యడుగవచ్చును. ఈ యెనిమిదియును ఏయే కాండలో వివరింప బడినవి ? అనియును ప్రశ్న కలుగుచున్నది. మొదటి కాండములో మొదటి 22 శ్లోకములలో ఫలము చెప్పబడినది. "తద్ వ్యాకరణ మాగమ్య పరం బ్రహ్మాధిగమ్యతే" అని 22 వ శ్లోకము తుదినున్నది. కాబట్టి బ్రహ్మప్రాప్తియే ఫలము. భర్తృహరి 'పయి' యెనిమిది విషయములలో 'ధర్మమును' 'ప్రత్యయమును = అర్థావగతి = బోధ అని పేర్కొనెను.' ఆ రెండే ఫలము. అందు ముఖ్యము బ్రహ్మప్రాప్తి—అదియే మోక్షము, నిశ్శ్రేయసము మొదలగు పదములచే చెప్పబడుచున్నది, కాబట్టి అట్టి బ్రహ్మమును శబ్దాభిన్నరూపముగా మొదటి శ్లోకముననే చెప్పి సమన్వయము చేసియున్నాడు. కావున బ్రహ్మకాండమను పేరు ఈ కాండమునకు తగి యున్నది.

ఇక రెండవపేరయిన ఆగమ సముచ్చయమును అన్వర్థమే యని చెప్పవలయును— అది నిరర్థకము అని భావి ంపమతము గూడ వినబడుచున్నది, 'ఆగమ' శబ్దమునకు సంప్ర దాయ సిద్ధమైన జ్ఞానము, వేదము, శాస్త్రములు మొదలయిన యనేకార్థములు ప్రాచీన కాలము ననే యుండినవి. ఇచ్చట ఆగమ సముచ్చయము, ఆగమ సంగ్రహము అను రెండు పదము లును ఈ ప్రథమ కాండమునకు పేళ్ళుగా వ్యవహరింపబడినవి. 'న జాత్వకర్తృకం కైశ్చిత్' అను 133 శ్లోకము నుండి చాల శ్లోకములలో ఆగమముల ప్రామాణ్యము, మానవకృతమయిన ఆగమములు, తర్కము, వేదములు మొదలగువాని స్వభావము అంతయును సంగ్రహముగ వివరింపబడినది. ఇట్లు చెప్పుటవలన ఈ కాండకు ఆగమ సముచ్చయము కూడ అన్వర్థమే యనక తప్పదు.

ఇందు చెప్పబడిన రెండు భాగములయిన ఫలమునందు ముఖ్యభాగమయిన ధర్మ రూప ఫలమునకు వేదమే మూలము. అదియే శబ్ద బ్రహ్మము. ఆ వేదమున కంగమైన వ్యాకర ణము వలన సాధుశబ్ద మేది అసాధుశబ్ద మేది యని వ్యవహర్త యెరుగగలడు. సాధుశబ్ద మును వాడుటవలననే మొదటి ఫలమయిన బ్రహ్మప్రాప్తి గలదు. అర్థావగతి మాత్రమే ఫలమను వారికి సాధ్వసాధుశబ్దములు రెండును ఉపాదేయములే. అసాధుశబ్దముల వలన

గూడ అర్థబోధ గలుగుచున్నది. లోక వ్యవహారము కుంటు వడదు.(వా.ప. I -141-42 శ్లో) ఈ కాండములోని 44 వ శ్లో. "ద్వావుపాదాన శబ్దేషు-" మొదలయిన శ్లోకములలో స్ఫోటయే నిజమైన శబ్దమనియు, అది నాదముకంటెను, ధ్వనికంటెను భిన్నమనియు, తాల్వాద్యవయవ ముల స్పందముచేత గలుగు వైఖరీ రూపమయిన వాక్కు కేవలము క్రమరూపమయి అసత్య మగు చున్నదనియు తెలిపి స్ఫోటయొక్క రూపమును వివరించెను. 'స్ఫోటమును గురించిన విచారణ' అను శీర్షిక క్రింద వివరింపబడును.

ఇక రెండవ కాండ పేరు వాక్య కాండ. ఈ కాండలో వాక్యార్థమే సత్యమనియు పదములు గాని, తదర్థములు గాని కాల్పనికము లనియు తెల్పుచు అట్టి వాక్యార్థమునకు గమక మయిన వాక్యమును గూర్చిన భిన్న మతములు, తన కాలములో నున్నవాటిని ఎనిమిది విధ ములుగా విభజించి వానినన్నిటిని సమన్వయపరచి గాని నిరాకరించి గాని పిండీకృతమయిన వ్యాకరణ మతమును నిశ్చయపరచెను. వాక్యమును విభజించుటవలన గలుగు శబ్దములే అర్థవంతములని యంగీకరించుచో అట్టి పదమును విభజించుటవలన గలుగు వర్ణములు గూడ నర్థవంతములయి సత్యము కావలెను గదా? అట్లగుటలేదు. కొన్ని పదములను విభజింపనే వీలుకాదు. కొన్ని పదాంగములను మనము విభజించి యెత్తి చూపునపు డవి ఆ యర్థములకు వాచకములు గావు గాని ద్యోతకములు మాత్రమే (దీపము వస్తుజ్ఞానమునకు ఎట్లు కారణ మగుచున్నదో అట్లే అవియును ద్యోతకములగుచున్నవి యను నభిప్రాయములను మనకు తెలిపెను). ఈ కాండమునందలి విచారమంతయును వాక్యస్వరూపమును గూర్చిన భిన్న మతములను ఉపన్యసించుట, సిద్ధాంతమును నిరూపించుటతోనే ముగిసినది గావున ఇది వాక్య కాండ యనుట యుక్తమును అన్వర్థమును అనుట నిశ్చితము.

మూడవ కాండమునకు పేరు పదకాండము. ఇందు వాక్యవిభజనమువలన నేర్పడు పదములు - వానిభేదములు - వానికిని అర్థమునకును గల సంబంధములు విచారింపబడినవి. "పదములు కొందరిచేత రెండు విధములుగాను, మూడు విధములని యితరులచేతను, నాలుగని మరికొందరిచేతను, ఐదని వేరొక కొందరిచేతను విభజింపఁబడినవి" యని మూడవ కాండ యారంభింపబడినది. అందు నామాఖ్యాతములు ముఖ్యములు. వానిలో నామములయర్థమును, వాక్యమందలి ప్రయోజనము వివరించుటకు ముందు, జాతి, ద్రవ్య, సంబంధ, భూయోద్రవ్య, గుణ, దిక్ రూపములయిన ఆరు పదార్థములను నిరూపించెను. ఏడవ సముద్దేశమునందు నామములందు గలిగిన శక్తివలన క్రియోత్పాదకమైన సాధనత్వము వాని యందెట్లున్నదో నిరూ పించెను. వాక్యార్థమే సత్యముగావున, దానికి ఆధారము క్రియార్థమైన వ్యాపారముకావున నందలి సాధనములయిన కారకములనువాని నన్నిటిని ఈ ప్రకరణమున వివరించెను. తరువాత క్రియా స్వరూపము వివరింపబడినది. నామమునకు క్రియకు గల భేదము, క్రియాస్వభావము, క్రమభూతములయిన అవయవములను గురించి ద్రష్టయొక్క బుద్ధియందు గలుగు అభేద భావమే యని నిరూపించెను. ఆతరువాత కాలసముద్దేశమునందు కాలస్వరూపము నిరూపిం చెను. అందు భూత భవిష్య ద్వర్తమానముల స్వరూపమును, పదునొకండు విధములయిన అవాంతర భేదములను స్పష్టముచేసెను. తరువాతిది యగు పురుష సముద్దేశమునందు ప్రథమ మధ్యమోత్తమ పురుషములను వివరించెను. ఆ తరువాత సంఖ్యాసముద్దేశము. సంఖ్య యన నేమి? అది దేని యందున్నది? అను విచారణమును ఎట్లు భేదాభేదవిభాగము సంఖ్యా

నిబంధనమగుచున్నది? యను విషయములను తెలిపెను. 12వ దైన ఉపగ్రహ సముద్దేశము నందు ఆత్మనేపదాది విచారము చేయబడినది. తరువాతిదైన లింగ సముద్దేశమునందు లౌకిక లింగమునకు వైయాకరణాంగీకృతమగు లింగమునకు గల భేదాదికమును విమర్శించెను. 14వది వృత్తిసముద్దేశము. ఇందు 627 శ్లోకములు గలవు. అందు ధాతు, సమాసాది వృత్తులను, వాని యవాంతరభేదములను అనేక దృష్టి కోణములనుండి విభజించి వివరించెను.

వాగ్ వ్యాపారము

"ద్వావుపాదాన శబ్దేషు" ఇత్యాది (1-44) శ్లోకమున, ఉపాదాన శబ్దములయందు రెండు విధములయిన వున్నవని భర్తృహరి చెప్పెను. ఈ రెండిటిలో ఒక్కటి ధ్వని, ఇంకొకటి స్ఫోట. వక్త పలుకు మాటలు ధ్వని. ఈ పలుకులు నిమిత్తములు. అనగా కారణములు. సత్యమై మూలమయిన స్ఫోటను (అర్థవంతమయినదానిని) ఇవి వెలుపరించుచున్నవని యభిప్రాయము. పయి శ్లోకములోను ఇతర స్థలములయం దచ్చటచ్చటను 'శబ్దము' అను పదమును అనేకార్థములలో భర్తృహరి వాడినట్లు స్పష్టముగా కనుపట్టును. 'వాక్యము, పదము, ధ్వని మాత్రము, అర్థవంతములయిన ధ్వనులు, శబ్దముయొక్క పశ్యంతీ, మధ్యమా, వైఖరీ అను భేదములు' పయి యన్నిటిని గూడ నీతడు శబ్దము అను మాటచేతనే వ్యవహరించెను. దీనివలన పాఠకులకు అర్థబోధయందు విలంబ మేర్పడును. వ్యాఖ్యాన సాహాయ్యమునగాని ప్రాకరణికార్థము తెలియ వీలుగాదు.

స్ఫోటయొక్క స్వరూపము పూర్తిగా తెలిసికొనుటకు ముందు భర్తృహరి మతము చొప్పున గాని మన యనుభవము చేతను గాని, యితర సంస్కారముచేగాని, వాగ్వ్యాపారము చేయుటయందు వక్తయొక్క ప్రయత్నములోను, శ్రోత యనుభవమునను గల యవస్థలను విభజించి మనము గుర్తించుకొనవలయును. వక్త తనచే నుద్దిష్టమయిన యర్థమునకు వాచకమయిన వాక్కును, తాలువు, జిహ్వా మొదలయిన ముఖాంగములతో నుచ్చరించును. ఆ ప్రయత్నమువలన వాక్కు బయల్వెడలి శ్రోతయొక్క శ్రవణేంద్రియముచేత గ్రహింపబడుచున్నది. వక్త తన నోటియందలి ప్రయత్నమువలన వెలువరించు వాక్కును వైఖరీ వాక్కు అని చెప్పుదురు. కొందరు వైయాకరణభిన్నులయిన శాస్త్రజ్ఞులు ఇట్లు బయలువెడలిన దానినే శబ్దమనియు, ఒక క్షణములో పుట్టి మఱియొక క్షణమున వినబడి ఉత్తర క్షణమున నశించుననియు చెప్పుదురు.

ఇక వైయాకరణుల మతమును పరిశీలింతము. శబ్దక్రియయందు మనకు ప్రత్యక్షమగునది ముఖాంగముల చలనము, వాయువుయొక్క కదలిక మాత్రమే గాదు. అట్లైనచో ఎట్టి కదలికవలన గలిగినను, ముఖ బహిర్గతమయిన ధ్వని యంతయు వాక్కుగావలయును గదా? అర్థ స్ఫోరకము గానిది వాక్కు గాదు. ఇక, ఏదో యొక నియతమైన క్రమముతోగూడిన ముఖాంగముల కదలిక గలిగి, వక్త యుద్దేశించిన యర్థమునకు వాచకమయిన ధ్వనియేగదా శబ్దము? ఈ శబ్దము నుచ్చరించుటకే నాలుక తాలువు మొదలయిన వాని కదలిక బయలుపడకముందు వక్తయొక్క మనసున నా శబ్దముండి యుండవలెనుగదా? అది వైఖరీ రూపమునకు పూర్వరూపమయిన 'మధ్యమా' రూపమనునది. ఈ మధ్యమారూపములో శబ్దము తనకు వాచ్యమయిన యర్థము యొక్క భావనతో గూడి, స్పష్టముగానుండవలెను. బయటికి వినబడకుండ నోరు కదల్పక వక్త తనలో ననుకొను శబ్దము లనేకములు కలవని,

మనసు పరీక్షవలన తెలిసికొనగలము. పయి రీతిని మధ్యమా రూపమయిన వాక్కునకు మఱి యొక్క పూర్వ రూపము-శబ్దార్థముల వేరుపాటు లేకయుండినది ఉండక తప్పదు. దానిపేరు 'పశ్యంతీ' యనునది. ఈపేరు అన్వర్థమా, నిరర్థకమా ? 'చూచుచున్నది' యని యీపదమున కర్థము. ఈ చూచుచున్నదేది ? అది వాక్కే; అదే కర్త్రి. మనము ఒక పదార్థమును చూచి అది యిల్లు అని గుర్తించునపుడు ఆ యింటిని గుర్తించుట వాక్కుచేతనేగదా ! అట్లు కాదను కొందము అనగా దానిపేరు మనకు తెలియదు. అప్పుడు మన జ్ఞానము, అనుభవ మాత్రము గానే యుండును గాని బహిర్భూతము చేయుటకుగాని జ్ఞాపకమేర్పడుటకు గాని పనికిరాదు. మన కాపేరు తెలిసిన వెంటనే శబ్దార్థములయొక్క సాహచర్యము, తాదాత్మ్యము నేర్పడును. అప్పటినుండియు ఆ సంజ్ఞచేతనే దానిని మన మవగాహనము చేసికొనవచ్చును. అదియే వాక్కు. అదియే 'పశ్యంతి'. ఈ పశ్యంతీ రూపమునకును వైఖరీ రూపమునకును నడిమి యవస్థయే 'మధ్యమా' రూపము. ఈ పేరును అన్వర్థమే. మధ్యమ యనగా నడిమిది. ఇక పశ్యంతీ మధ్యమా రూపములకు భేదమేమి యని యడుగవచ్చును. పూర్వావస్థ యగు పశ్యంతి యందు వాగర్థముల కైక్యము, తాదాత్మ్యము. మధ్యమయందు ఈ రెండింటియొక్క స్పష్టమయిన వేర్పాటు. ఒక ఉదాహరణమును గ్రహించునది. 'కోతి'యను శబ్దము ఆ శబ్దమునకును, దాని యర్థమునకును గూడ వాచకమే. అనగా కాగితముమీద 'కోతి' వ్రాయు మనునప్పుడు 'కోతి' యని 'లిపి'తోగాని 'కోతి' రూపమునుగాని యెదుటివాడు వ్రాయవచ్చును. ఈ రెండిటిలో నేది యుద్దిష్టమో మధ్యమా వాక్కున, వక్త యుద్దేశమున, స్పష్టముగ నుండును. పశ్యంతీ రూపమున నవి యవిభక్తముగా నుండును. కాబట్టి; యేవాక్కున కయినను పయి మూడు రూపములును అగీంకరింపక తప్పదు. భర్తృహరి యీ మూడింటినే పేర్కొనెను.[11] ఆతని మతమున ఈ మూడే వాక్కుయొక్క రూపములు అనవలెను. ఈ మూడింటికిని పూర్వ రూపమయినది యెల్లరి యంతఃకరణమున సాక్షిభూతముగా నుండునట్టిది నానాత్వము లేనిది యింకొకటి గలదనియు. దానిపేరు 'పరా' యనియు ఙ్ప్రౌడిమతము మఱియొకటిగలదు.

---

11 "వైఖర్యా మధ్యమాయాశ్చ పశ్యంత్యాశ్చైతదద్భుతమ్
అనేక తీర్థభేదాయా స్త్రయ్యా వాచః పరంపదమ్" ॥ వా. ప. — I—148.

పైన చెప్పినదిగాక, కొన్ని అధిక పాఠశ్లోకములు కూడ ఈ క్రిందివి అర్థమును స్పష్టపఱచుచున్నవి.

'అవిభాగాతు పశ్యంతీ సర్వతః సంహృతక్రమా ।
స్వరూపజ్యోతిరేవాతః । సూక్ష్మావాగనపాయినీ ॥
కేవలం బుద్ధ్యుపాదానా క్రమరూపానుపాతినీ ।
ప్రాణవృత్తి మతిక్రమ్య మధ్యమా వాక్ప్రవర్తతే ॥
స్థానేష్వభిహితే వాయౌకృతవర్ణ పరిగ్రహా ।
వైఖరీ వాక్ ప్రయోక్తౄణాం ప్రాణవృత్తి నిబంధనా ।
సేయమాకీర్యమాణాఽపి నిత్యమాగంతుకైర్మలైః ॥
అంత్యా కలేవసోమస్య నాత్యంత మభిభూయతే ।
'శివదృష్టి' యను గ్రంథము నందలి మధ్యమావర్ణనము.
"సంప్రాప్తా వక్త్రకుహరం । కంఠాదిస్థాన భాగశః ।
వైఖరీ కథ్యతేసైవ । బహిర్వ్యాపనయా క్రమాత్ ।
ఘటాదిరూపై ర్వ్యావృత్తా గృహ్యతే చక్షురాదినా ।

భర్తృహరి అద్వైత సిద్ధాంతమును ఆదరించువాడని ముందు స్థిరపరచితిని. ఆ పక్షమందు ఈ వాక్కు నెక్కడనో తుదిరూపమయిన బ్రహ్మముతో గలుపవలెనుగదా ః ఆ పద్ధతి వాక్యపదీయ మున బ్రహ్మకాండములోని 112-115 శ్లోకములలో నాతడు చెప్పెను (చూడు వ్యాఖ్యానము-తెలుగు). "సూక్ష్మమైన వాగాత్మయందు ఉన్నవాడై, లోపలిజ్ఞాత (అనగా ఆత్మయే;జీవాత్మ యన్నచో దానికిని పరమాత్మకును అభేదమేగదా) శబ్దరూపము చేతనే వ్యక్తమగుటకు వివర్తా వస్థను పొందుచున్నాడు" అని వ్రాసెను. కాబట్టి పశ్యంతీ రూపమయిన వాక్కే బ్రహ్మతో నభిన్నమను పయిమతము భర్తృహరిది-ఈ బ్రహ్మ రూపమునకును 'పశ్యంతీ' వాక్కు నకును నడుమ 'పరా' వాగవస్థ యున్నదను వారిమతమున అదియెట్టిది? ఆ పరా వాక్కునే గదా బ్రహ్మముతో కలుపుటని యడుగక తప్పదు - 'తెలిసిన యర్థమును చెప్పుటకు కోరికగల పురుషుని ప్రయత్నమువలన యోగమున 'మూలాధార' మందు గల వాయువుయొక్క సంస్కారము (గలుగు చున్నది). దానివలన అభివ్యక్త మయి నిశ్చలమయిన శబ్ద బ్రహ్మము తానే (అన్నిటికి ఆధారమయిన యునికిగలదగుటచేత) 'పరా' వాక్ అని చెప్పబడుచున్నది'. ఈ వాక్కు చొప్పున 'పరావాక్'[12] అనునది 'మూలాధారమను చక్రమునుండి బయలు వెడలుననియు అది బ్రహ్మముతో నభిన్నమనియు నిశ్చితమగుచున్నది. ఈ యభిప్రాయమునే నాగేశభట్టుకూడ వివరించియున్నాడు. పరావాక్ మూలాధార చక్రము నందలిది'యనియు,పశ్యంతీరూపము నాభియందలిదియనియు, మధ్యమ హృదయ గతమనియు, వైఖరీ వాక్కు కంఠదేశస్థమనియు చెప్పియున్నాడు. ఇట్లు 'పరా' అను రూపముగల వాక్కునేల పయి మతమున నంగీకరింపవలసి వచ్చినది యని ప్రశ్నింపక తప్పదు. దానికి హేతువు భర్తృహరి చెప్పిన శబ్దోత్పత్తి క్రమమునుబట్టియే యూహింపవచ్చును. భర్తృహరి I-118 వ శ్లోకమున ఈరీతిని చెప్పియున్నాడు. "ఆ బ్రహ్మ పదార్థము (వివర్త రూపమున) మనఃస్థితిని పొంది తేజస్సువలన పాకమును బడసి ప్రాణవాయువును ఆవేశించి బయటికి శబ్దముగా వచ్చుచున్నది"[13] దీనినిబట్టి వాయువు ఎచ్చట ఆవేశింపవలెను? అది అన్నిటికి ఆధారమయిన మూలాధారమున ప్రవేశించెనని చెప్పక తప్పదుగదా ః ఈ మార్గమే శిక్షలలో చెప్పబడినది.[14] "ఆత్మ (తానే జీవాత్మ) బుద్ధిచే అర్థములను తెలిసికొని మాటలాడవలెనని మనస్సుతో (యోగమును పొందును) కలియును. ఆ మనస్సు, శరీరములో నున్న అగ్నిని ప్రజ్వలింపజేసి వాయువును ప్రేరించును."అట్టి మారుతమే పరమాణు రూపమయిన శబ్దముతో

---

12. జ్ఞాతమర్థం వివక్షోః పుంసః ఇచ్ఛయా జాతేన ప్రయత్నేన,
యోగే ఏవ మూలాధారస్థపవనసంస్కారః । తదభివ్యక్తం
శబ్దబ్రహ్మ స్వప్రతిష్ఠతయా పరావాగిత్యుచ్యతే ॥
పరావాఙ్మూలచక్రస్థా పశ్యంతీ నాభిసంస్థితా ।
హృదిస్థా మధ్యమా జ్ఞేయా, వైఖరీ కంఠదేశగా ॥

13. స మనోభావ మాపద్య తేజసా పాక మాగతః ।
వాయుమా విశతి ప్రాణమ్ అథాసౌ సముదీర్యతే ॥   వా. 1-118.

14. పాణినీయ శిక్ష ॥ ఆత్మా బుద్ధ్యా సమర్థ్యార్థాన్ మనోయుంక్తే వివక్షయా।
మనః కాయాగ్ని మాహంతి స ప్రేరయతి మారుతమ్.

నభిన్నము.[15] కాబట్టి ఈ యణువులు మూలాధారమునుండియే బయల్వెడలవలెను. అంతకంటె క్రిందది లేదు. కాబట్టి మూలాధార చక్రమును గుఱించి యీ నాల్గవ భేదమగు 'పరా' వాక్కు భర్తృహరిచే గాకున్నను ఇతరులచే నంగీకరింపబడినది.[16] ఈ క్రింద నిరూపింపబడిన వృత్తియందు-భర్తృహరి చేతనే వ్రాయబడిదనబడుదానియందు, వాక్కుయొక్క నాలుగు అవస్థలును నిరూపించబడినట్లూహింపనగును. "అట్టి యీ వాక్కు (అనగా స్ఫోటము) మూడు విధములైనది. చైతన్యమనెడు ముడినుండి వివర్తరూపమున అనేక భేదములు గలుగుటచేత నిర్వచింప వీలులేనిదై వెడలినదై నాల్గవదానిచేత మనుష్యులయందు వ్యవహరింరబడుచున్నది. ఇక్కడ గూడను దీనికి కొంచెమే వ్యవహారము. మిగిలినదంతయు సామాన్య వ్యవహారము నతిక్రమించినదే. "చత్వారి వాక్ పరిమితా"యను ఋక్కును జూచునది. ఇట్లు వ్రాయబడియుండుటవలనను పయి భర్తృహరి కృతకారికయందు త్రయీవాక్ అని చెప్పియుండగా దానికంటె అధికముగా నాలుగు విధములుగా చెప్పుటచేతను ఈవృత్తి భర్తృహరిది గాదనియు, కారికలోని విషయముకంటె అధికముగా ఋక్కు యొక్క ప్రమాణముచే నిరూపించి మఱియొక్కరు ఈ వృత్తిని వ్రాసియుండవచ్చుననియు కొందరు విమర్శకు లభిప్రాయపడుచున్నారు. 17,18, సంఖ్య కారికలలో వాక్ శబ్దమునకు 'పరా' యని యర్థము వ్రాయుట పయి వ్యాఖ్యానానుసారము చేయబడినదని గ్రహించునది.

ఇట్లు వాగుత్పత్తివిధానమును గుర్తెఱింగి ఆ వాక్కును శ్రోత గ్రహించు విధానమును వివరింపవలెనుగదా: పయిరీతిని పుట్టిన వైఖరీవాక్కు శ్రోతయొక్క శ్రవణేంద్రియముద్వారా పరమాణు రూపమున ప్రసరించి ఆతనిలో నింతకుముందు సంస్కార రూపముననుండు అర్థమునే (రూఢివలనగాని యోగమువలనగావి సంబంధించిన దానినే) బోధావస్థలోనికి దెచ్చినపుడే వక్తయొక్క వాగ్ వ్యాపారమువలని ఫలితము పూర్తియైన దనవలెను. వక్తయొక్క అంతఃకరణమునందు ఈ వాగర్థము లెట్లు నిత్యరూపమున నుండినవో యట్లే శ్రోతయొక్క ప్రత్యక్షీకరణము జరుగును, ఇది స్మరణ రూపముననో అవగతి రూపముననో సిద్ధించు చున్నది. ఇదివర కాత డెరింగిన దానికి స్మరణము, క్రొత్త భావమునకు అవగతి. వాచ్య వాచకరూపమున ఆతనియందు సంస్కారషుగా, ఇవి పూర్వమున ఉండియుండనిచో, స్మరణములేదు, అవగతియును గలుగదు. వక్తయందు అఖండ రూపమున నిత్యముగానున్న శబ్దార్థములను తన వైఖరీ రూపమయిన పరమాణు చలనముచేత బయల్పరచి, వానివలన శ్రోత యొక్క బుద్ధియందు ప్రథవింపజేసి మరల నఖండరూపమయిన జ్ఞానముగా మార్చుటయే గదా వాగభివ్యక్తియొక్క ఫలితము. ఈ వివరణము చొప్పున తార్కికుల వాదమగు, 'శబ్దము పుట్టు

---

15. స్వశక్తౌ వ్యజ్యమానాయాం ప్రయత్నేన సమీరితాః ।
అభ్రాణీవ ప్రచీయంతే శబ్దాఖ్యాః పరమాణవః ॥ వా. I – 111 శ్లో॥

16. భర్తృహరిచేతనే వ్రాయబడినట్లూహింపబడిన, వృత్తియందలి పంక్తి — సైషా త్రయీ వాక్ చైతన్య గ్రంథి వివర్త వదనాఖ్యేయపరిమాణా తురీయేణ మనుష్యేషు ప్రత్యవభాసతే। తత్రాపిచాస్యాః కించిదేవ వ్యావహారికమ్, అన్యత్తు సామాన్య వ్యవహారాతీతమ్. ఆహ ఖల్వపి "చత్వారివాక్పరిమితా, (ఋగ్వేదే) 1–164.45. దీనియర్థము ముందీయబడినది.

చున్నది. నశించుచున్నది' యనునది పరాస్తమయినది. శబ్దము పుట్టలేదు, అది నశింపను లేదు. పయిరీతిని వాగ్ వ్యాపారముయొక్క ఆరంభమునను అంతమునను గల శబ్దమే నిత్యము. అదియే స్ఫోటము. అది కార్యముగాదు. ఈ స్ఫోటము వాక్య స్ఫోట, పదస్ఫోట, వర్ణస్ఫోట అను రీతిని ఆయా ఉపాధులగు వాక్య పద వర్ణములచేత త్రివిధముగా విభజింపనగును. 17

ఇంకొక్క విషయమిచ్చట గమనింప దగియున్నది. వక్తయొక్క మనస్సునందున్న పశ్యంతీ వాక్కు (లబ్ధానుసంహార స్వరూపము) నిమిత్తమగుచున్నది. దీనివలన గలుగు వైఖరీ వాక్కు కార్యమగుచున్నది. కారణము పూర్వవృత్తి, కార్యము అనంతర వృత్తి— కాని శ్రోత విషయములో వైఖరీ వాక్కు నిమిత్తము, కార్యము శ్రోత యొక్క బోధస్థమగు అవిభక్త రూపమయిన అఖండ వాక్యార్థము— ఈ రీతిని భర్తృహరి ఊహించి 'క్రమవాన్' 'అక్రమ నిమిత్తమ్' అను విశేషణములను శబ్దమును గురించి వాడియున్నాడు. వక్త విషయమున కారణము కార్యము అయినవియే శ్రోత విషయమున విపరీతములయి కార్యము కారణము అగుచున్నవి. వక్త—పశ్యంతీ—మధ్యమా—వైఖరీ—మధ్యమా—పశ్యంతీ—శ్రోత అను వరుసలో ఫలించుచున్నవి. ఒకచో వైఖరి నిమిత్తమనియు, మధ్యమ కార్యమనియు, భర్తృహరి వ్రాయుటలోని యభిప్రాయము సంబంధ విశేషమును చెప్పుటకయి అవలంబించెను. బయటికి తెలియునది వైఖరి—దానివలన వక్తయందలి మధ్యమా వాక్కును శ్రోత యూహించుచున్నాడు-అను నభిప్రాయమునందు చెప్పియున్నాడు.

స్ఫోట స్వరూపము

స్ఫోట యను పదార్థ మున్నదనియు నది యెల్ల శబ్దములకును మూలమనియు వైయాకరణు లెల్లరు నంగీకరించిరి. వైయాకరణులు స్ఫోటవాదులను ప్రసిద్ధిని పొందిరి, ఈ విషయమున, మీమాంసకులు, నైయాయికులు, వేదాంతులు, బౌద్ధులు, చార్వాకులు మొదలయిన వారందరును భిన్నమతముల నాశ్రయింతురు. ఈ స్ఫోట స్వరూపమును, స్వభావమును ప్రాచీనుల సమ్మతిపయి నాధారపడినదేగాని, దీనికి వివరణము, ప్రచారము, ప్రశస్తి మొట్టమొదట భర్తృహరి వలననే కలిగినదని చెప్పవచ్చును. మీమాంసకులయిన కుమారిలభట్టును, నైయాయికుడయిన వాచస్పతి మిశ్రుడును పయిస్ఫోటవాదమును ఖండించిరి. మండన మిశ్రుడను నాతడు 'స్ఫోటసిద్ధి' యను గ్రంథములో స్ఫోట సిద్ధాంతమును బలపరచెను.

పయిరీతిని రూఢమయిన స్ఫోట స్వభావమును తెలిసికొనుటకు శబ్దము, స్ఫోట, అను రెండు పదములను ఏయర్థములలో పతంజలి భర్తృహరులు ప్రయోగించిరో యెరుంగ

---

17. వర్ణపదవాక్య విషయాః ప్రయత్నవిశేష సాధ్యాః, ధ్వనయో వర్ణ పద వాక్యాఖ్యాన్ స్ఫోటాన్ పునః పునః అవిర్భావయంతః బుద్ధి ప్వారోపయంతి. [వా. I-148].

ఏకో నిమిత్తం శబ్దానా మపరోఽర్థే ప్రయుజ్యతే॥ వా. ప. శ్లో. 44-దాని వృత్తి; లబ్ధానుసంహారో నిమిత్తమ్; ఉపజనితక్రమస్తు ప్రత్యాయక ఇత్యేతే;

నగును. మహాభాష్యమున శబ్దము స్వభావము ఈ రీతిగా వివరింపబడినది.[18] "ఇక శబ్దమేమి? దేనినుచ్చరించుటచేత గంగడోలు, తోక, మూపురము, డెక్కలు, కొమ్ములు గలిగిన పిండ పదార్థములు స్ఫురించునో, అది గౌః అను శబ్దము. లోకమునందు ధ్వని మాత్రము కూడ శబ్దమని వ్యవహరింపబడుచున్నది. ఎట్లనగా శబ్దము చేయుము, శబ్దము చేయకుము, ఈ పిల్ల వాడు శబ్దము చేయుచున్నాడు అనియు వ్యవహారము. కావున ధ్వని శబ్దము. అట్లే స్ఫోటము శబ్దము; ధ్వని శబ్దగుణము. ఎట్లు? భేర్యాఘాతము వలెనే; ఒకానొక డోలుదెబ్బ వలని ధ్వని, ఇరువది, ఇంకొకటి ముప్పది, మణియొకటి నలువది అడుగులు ప్రసరించును. అట్లే ధ్వని యును గదా; కాని స్ఫోట మాత్ర మట్లే యుండును. పయిరీతిని గలిగిన వృద్ధి ధ్వని వలన గలిగినది." శబ్దము, స్ఫోట అను రెండు పదములు సమానార్థకములుగా నిర్ణయింపబడినవి. పయి మూడు పదములను ఈ రీతిని వివరింపవచ్చును. అర్థహీనమయినను సార్థకమయినను వ్యక్తిచే చేయబడు వాగ్ వ్యాపారము శబ్దము, ఎల్ల విధములయిన శబ్దములయందును ధ్వని యుండును. అట్లే అన్ని ధ్వనుల యందును స్ఫోట ముండునా? అనునది స్పష్టపడలేదు. అట్లయినచో 'శబ్దము' నకును 'స్ఫోటము' నకును సమాన వ్యాప్తి కలదా? అర్థమందు. వానికి స్వభావ భేదమే లేదా యను సందేహము తప్పదు. స్ఫోటకును ధ్వనికినిగల భేధమును సంబంధ మును మాత్రమే పతంజలి తెల్పెను. (ఇట్లు బయలుపడునట్టి సందేహములను వ్యాఖ్యాతలు తరువాత వివరింప యత్నించిరి).

ఆ తరువాత కొంతకాలము వరకు మహాభాష్య ప్రచారము ఉత్తరదేశమున నశింపగా, తనగురు పరంపరయయిన చంద్రాచార్య వసురాతులు పరిశ్రమించి తెచ్చిన వ్యాకరణ జ్ఞానమున తాను వాక్యపదీయమును వ్రాసెననియు భర్తృహరి యొక్క చరిత్రము వలన తెలియుచున్నది. అతడు వాక్యపదీయమున అనేక విషయములను వివరించుచు స్ఫోటను గూర్చి ప్రపంచించెను.అందుIకాండ44-49; 75; 77; 81; 93; 97; 102; 103; 106సంఖ్యలు గల శ్లోకములలో నా విషయము కలదు. ఈ శ్లోకముల తెలుగు వ్యాఖ్యానమును అచ్చట చూచునది. వానిలోని యభిప్రాయ మీ క్రింద సంగ్రహింపబడుచున్నది. "44-49 శ్లో- అర్థవంతములయిన శబ్దములలో రెండు విధములున్నవనియు అందొకటి స్ఫోటమనియు, అది నాదము యొక్క ప్రవర్తనము ననుసరించుట్లు కనుపట్టుననియు తెలుపబడెను.

---

18 యేన ఉచ్చారితేన సాస్నాలాంగూల కకకుదఖుర విషాణినాంసంప్రత్యయోభవతి
సశబ్దః ॥ ఏవం తర్హి స్ఫోటః శబ్దః । ధ్వనిః శబ్దగుణః ॥ భేర్యాఘాతవత్ ।
తద్యథా ॥ భేర్యాఘాతో భేరి మాహత్య కశ్చిద్వింశతి పదాని గచ్ఛతి । కశ్చిత్
త్రింశత్ ॥ కశ్చిచ్చత్వారింశత్ ॥ స్ఫోటస్తావానేవ భవతి । ధ్వనికృతా వృద్ధిః ॥
లోకే ధ్వనిః శబ్ద ఇత్యుచ్యతే । తద్యథా । శబ్దం కురు । శబ్దం మాకార్షీః
శబ్దకారీ అయం మాణవకః ఇతి ధ్వనిం కుర్వ న్నేవ ముచ్యతే ॥
ధ్వనిః స్ఫోటశ్చ శబ్దానాం ధ్వనిస్తుఖలు లక్ష్యతే ।
అల్పో మహాం శ్చ కేషాంచి దుభయం తత్స్వభావతః ॥
శ్రోత్రోపలబ్ధిః బుద్ధినిర్గ్రాహ్యః ప్రయోగేణాభిజ్వలితః ఆకాశదేశః
శబ్దః, ఏకరిచ పునరాకాశమ్ ॥ మ. భా.

ఉచ్చరించునపుడు ధ్వనియొక్క కాల పరిమితియు క్రమమును స్ఫోటమునం దారోపింపబడుచున్నవి. శబ్దగ్రహమునకు హేతువు స్ఫోటరూపమయిన ప్రాకృత ధ్వని. దాని తరువాతివి వైకృత ధ్వనులు.

వైకృత ధ్వనులలోనే వైవిధ్యము, అనగా వికారము కలుగును. ప్రాకృత ధ్వని అవికృతము.

స్ఫోటను గూర్చి మూడు మత భేదములు గలవు. (1) స్ఫోటము ధ్వనియు (ఏకముగానే) అభిన్నముగానే గ్రహింపబడును. (2) స్ఫోటమే గ్రహియింపబడుచున్నది. అసలు ధ్వనియే గ్రహింపబడదు. (3) ధ్వని వేరుగా గ్రహింపబడును.

వ్యక్తులయిన యనేక ధ్వనులయందు గనుపట్టు జాతిగా స్ఫోటము నెఱుంగనగును.

స్ఫోటము వ్యంగ్యము-నాదము (ధ్వని) వ్యఞ్జకము.

స్థానకరణముల సంయోగ వియోగముల వలన గలుగు ఫలమే స్ఫోటము. అదియే శబ్దము. దానివలన గలుగునవి దానికంటె వెనుకనునయినవి ధ్వనులు. ఈ మతమున స్ఫోటము క్షణికము.

"ధ్వని దీర్ఘమయినను హ్రస్వమయినను స్ఫోటకాలము భేదింపదు. దానివలన గలుగు శబ్ద సంతానము అనగా ధ్వనుల మొత్తము మాత్రము అల్పముగాని అధికము గాని కావచ్చును."

పయని తెలుపబడిన భర్తృహరి మాటలను బట్టి ఆతని కాలముననే స్ఫోట స్వరూపమును గూర్చి వైయాకరణులయందే మత భేదము లుండెననుట స్పష్టము. అది నిత్యమనియు, అనిత్యమనియు, ధ్వనులకంటె భిన్నమనియు, అభిన్నమనియు వివదించుకొనుచుండిరి. భిన్నమతములవారయిన మీమాంసకులు, నైయాయికులు స్ఫోట నాదరింపలేదు. అద్వైత సిద్ధాంతము నుండి బ్రహ్మైక్యమును గ్రహించుచు, స్ఫోటకు బ్రహ్మతుల్యత్వమును అంగీకరించి వైయాకరణులు అద్వైతము నాదరించుచున్నారని గ్రహించియు గూడ శ్రీ శంకరులు స్ఫోటను విమర్శించిరి.

పతంజలి తన భాష్యమున 'స్ఫోటః శబ్దః' అని వాని యైక్యమును జెప్పెను. అందు శబ్దమునకు లక్షణముగా మూడు ధర్మములున్నట్లు సూచించెను. అవి 1. అర్థబోధకత్వము 2. ధ్వనిత్వము 3. స్ఫోటత్వము. స్ఫోట సంగతి ప్రపంచింపలేదు. స్ఫుట ధాతువునకు 'పగిలి తటాలున బయలు పడుట', 'వికసించుట', 'బహిర్గతమగుట', అను మూడు అర్థములు గలవు. ఆ ధాతువు వలన గలిగిన కృదంతమయిన స్ఫోట శబ్దమునకు వ్యుత్పత్తి ముందు ముందు నిరూపింపబడును. ఇక వైయాకరణుల విచారణ నటుంచి మనకు తోచిన విమర్శను స్వతంత్రముగా చేసుకొనవలెను. బహిర్గతమయిన దేది ? స్ఫోటయా ? లేక బయల్పడుటకు కారణము స్ఫోటయా ? (అర్థమని వైయాకరణుల నిరూపణము). కారణమయినను కార్యమయినను, అది ద్రవ్యమా? గుణమా? క్రియయా? యని ప్రశ్నించుకొనవలెను. ద్రవ్యమేమయినచో క్రియాన్వయిత్వము, పరిణామ స్వభావము మొదలగు ధర్మములున్నవియా? ఎట్లు తెలిసినది ? ప్రమాణమేమి ? గుణమనుచో తెలుపు, నలుపువలె ఏ ద్రవ్యము నాశ్రయించి యున్నది ? ఇక క్రియ యనుచో యాస్కుడంగీకరించిన క్రియా లక్షణమగు 'గ్రహీత యొక్క మానసికమయిన ఐక్య భావముచే గుర్తింపదగిన అవస్థా భేదముల క్రమరూపము' దానియందు కలదా? అది నిత్యమా ? అనిత్యమా ? పై విచారణవలన నేమియు తేలదు. కాబట్టి అది యోగులయిన

సిద్ధ పురుషులకు తప్ప సామాన్యులకు గోచరము గాదు. అనిర్వచనీయతపయి నాధారపడిన బ్రహ్మమువలెనే దీనినిగూడ గ్రహింపవలెను. అందుకనియే శబ్ద బ్రహ్మము అని నిరూపించిరి. ఈ మార్గమును విడిచి ప్రత్యక్షమయిన మన వాగ్ వ్యాపారముతో దీనిని సమన్వయపరుప వలెను. శబ్దము తరంగ రూపమనుట ఎవ్వరును కాదనలేని నేటి భౌతిక శాస్త్రసిద్ధమయిన సత్యము. ఇట్టి తరంగములు ఆకాశమునంతటిని వ్యాపించి నిత్యముగా (ప్రవాహ నిత్యత్వము) నున్నవి. ఆ స్వరూపము నిత్యము ; బ్రహ్మముతో నభిన్నము. అట్టి తరంగ సృష్టిలో చలన హేతు వేదియో యొక్కటి భేర్యాఘాతమువలె నుండవలెను. అట్టి క్రియకు వాచకముగా మొదట స్ఫోటశబ్దము బయలుదేరి యుండుట యుక్తము. అట్లు బయలుదేరిన పయి శబ్ద మునకు బ్రహ్మముతో నభేదమును భర్తృహరి సూచించెను. కాలక్రమమున భాష్యార్థ వివరణ కారులయిన కైయటుడు, నాగేశుడు, భట్టోజీ మొదలయినవా రంగీకరించి అనేక విధముల ప్రపంచించిరి. తరువాతి వైయాకరణులు స్ఫోట ననేకవిధములుగా విభజించిరి- వ్యక్తి స్ఫోట, జాతి స్ఫోట. అది మరియు నెనిమిది విధములు

1. వర్ణస్ఫోట 2. పదస్ఫోట 3. వాక్యస్ఫోట 4. అఖండ పదస్ఫోట 5. అఖండ వాక్య స్ఫోట6. వర్ణజాతి స్ఫోట 7. పదజాతి స్ఫోట 8. వాక్య జాతి స్ఫోట.

పయిని చెప్పిన విషయములలో కొన్ని ముందరి విషయమున గ్రంథప్రమాణ ములతో తిరిగి వివరింపబడును.

స్ఫోటనుగూర్చి శాస్త్రజ్ఞు లేమి చెప్పిరి?

సర్వదర్శనసారసంగ్రహములో సాయనాచార్యు లీరీతిని వ్రాసియున్నారు. 'జగత్తునకు ఆదికారణమైన నిత్య శబ్దమే స్ఫోటమను పేరు గలదియే బ్రహ్మ పదార్థమని' భర్తృహరిచే చెప్పబడెను.[19] ఏ ప్రకారముగా మణియందును, తళతళలాడు కత్తియందును, ఒకే రూపము ఏవిధముగా ప్రతిఫలించుచున్నదో అ రీతిగా ఒకే స్ఫోట, ధ్వనులయందు వేరు వేరుగా భాసించుచున్నది.[20] ఏ ప్రకారముగా చంద్రాదుల ప్రతి బింబము నీటియందు కనుపట్టి ఆ నీటియొక్క కదలికచే కదలుచున్నట్లుండునో అట్లే, స్ఫోట స్థిరమయి, హ్రస్వ దీర్ఘాది భేదము లేనిదయ్యును నాదముచేత (అనగా వైఖరీ రూపము యొక్క) ఆయా ధర్మములను పొందునట్లు కనుపట్టుచున్నది.[21] వాక్కే పశ్యంతీ రూపమయినదియే అర్థమును చూచు చున్నది.[22] ఈ స్ఫోటమునందే వాక్కుయొక్క భిన్నావస్థలు, ఇతర ప్రపంచమంతయు నిమిడి యున్నది. నెమలి గ్రుడ్డులో బీజరూపమున, పెద్దదైన నెమలియం దెన్నిరంగు లుండునో అన్ని

---

19 జగన్నిదానం స్ఫోటాఖ్యః నిరవయవః నిత్యః శబ్దః బ్రహ్మైవేతి హరిణా భాణి బ్రహ్మకాండే I. 1-2 శ్లో "అనాది నిధనమ్...తదక్షరమ్...2...వివర్తతే జగతోయతః॥

20 యథామణి కృపాణాదౌరూపమేక మనేకధా ।
తథైవ ధ్వనిషు స్ఫోట ఏక ఏవ విభిద్యతే.

21 ప్రతిబింబం యథాన్యత్ర స్థితం తోయక్రియావశాత్ ।
తత్ప్రవృత్తి మివాన్వేతి స ధర్మః స్ఫోటనాదయోః॥

22 వాగేవార్థం పశ్యతి.

యను ఇమిడియున్నవిగదా ! అని యభిప్రాయము.[23] ఈ శ్లోకము యొక్క ప్రతిపదార్థ వ్యాఖ్యానములు ఆ స్థలమునజూచునది. ఇందలి 'క్రతు' శబ్దము యొక్క యర్థమును భిన్న విధముల వివరించిరి. క్రతు వనగా 'జ్ఞానము' అని సూర్యనారాయణ శుక్ల గారును, **Energy** అని శ్రీ సుబ్రహ్మణ్య అయ్యరుగారును,'క్రతుః ఇతిశాస్త్రాంతరే బుద్ధి రుక్తా'యని వృషభదేవకృత 'పద్ధతి' యందు బుద్ధియనియు వ్రాసియున్నారు. శ్రీ సూర్యనారాయణ శాస్త్రిగారు "క్రతు శబ్ద ముపనిషత్తులలో నిశ్చయార్థకముగా నున్నది. నిశ్చయార్థమును బట్టి ఇది బుద్ధివాచకము" అని తెల్పిరి. క్రతు శబ్దమునకు **A sacrifice, intelligence, power, ability, desire, will, purpose, inspiration, enlightenment** మొదలయిన యనే కార్థములు వ్రాయబడినవి. పై యర్థములలో నేయొక్క దానినైనను ఉపయోగించి భావమును వివరింపవచ్చును. క్రతువనునది 'కృ' ధాతువు వయిని 'కతు' అను ఔణాదిక ప్రత్యయమును విధించి వ్యుత్పత్తి చెప్పుటవలన 'పని' యని భావము. దానివలననే క్రతువు నకు ప్రసిద్ధార్థము యజ్ఞ నిశేషమయిన కర్మ. శ్లోకము నందు 'శబ్ద సంజ్ఞకః క్రతుః' అని చెప్పబడినది. 'తస్యక్రతోః వృత్తిః క్రియాభూతా భాగశః క్రమం లభతే' యని యన్వయము చెప్పి క్రతుత్వమును శబ్దముపై నారోపించవచ్చును. బుద్ధిస్థమయిన యాగము క్రియా రూపమమై భాగానుసారము క్రమ నిష్పాద్యత్వమును పొందుచున్నదని యర్థము. మానసిక మయిన శబ్దము వైఖరీరూపమున వెలువడుట, బుద్ధిస్థమయి సంకల్పరూపమున నుండిన క్రతువు కార్యరూపమయి క్రమనిష్పన్నమగుట, ఈ రెండిటికిని ఔపమ్యము. దానివలన ఆరోపము సిద్ధించుచున్నది. 'అండభావమి వాపన్నః' అనుచోట నెమిలియొక్క గ్రుడ్డునందు సూక్ష్మరూపముగానున్న భిన్నములయిన రంగులే పెద్దదయిన నెమిలి శరీరమునందును పింఛమునను విశదములగుట యను ధర్మము చెప్పబడినది. ఈ ధర్మమే సూక్ష్మ రూపమున నవిభక్తముగా నున్న 'పశ్యంతీ' రూపమున నుండి 'వాక్యపద' వివర్త ధర్మమున వైఖరీ రూపమున వెలువడుచున్నది యని భర్తృహరి కృతమనబడిన వృత్తిలో నున్నది. 'అండభావాపత్తి' యను స్వభావమే 'శబ్దము'నకును 'క్రతువు'నకును సమాన ధర్మము. క్రతు శబ్దము నుపయోగించుటవలన అట్టిక్రతువును ఆచరించునపుడు నియతముగా పరిదృశ్యమానమయిన స్రుక్కు స్రువము మొదలయిన వానితో గూడి హోమములలో వెలయుచున్న క్రియారూపము, వైదికుల కెల్లరకును నిత్య నైమిత్తిక కర్మలయందు ప్రచుర మయి యున్నది గదా. ఇచట శబ్దము ప్రకృతము. యజ్ఞకర్మ అప్రకృతము తెలిసికొన వలసిన శబ్ద స్వరూపమును బోధపఱచుకొనుటకు పరిచితమయిన 'క్రతు విభాగము' పోలికగా చెప్పుట యుక్తముగాని 'జ్ఞానము, బుద్ధి' యని యర్థముచెప్పి కేవలము అనుమితి వలన నెఱుంగదగిన భావరూపమును పోలికగా చెప్పుట సుబోధకము గాదుగదా !

ఇక భర్తృహరి తన గ్రంథములో స్ఫోటను గూర్చి చెప్పిన యభిప్రాయములను విమర్శించుచు **S. D. JOSHI** అను వారు కౌండభట్ట కృతమయిన స్ఫోటనిర్ణయమను గ్రంథ

---

23 అండభావమివాపన్నః యః క్రతుః శబ్దసంజ్ఞకః ।
వృత్తిస్తస్య క్రియాభూతా భాగశో లభతే క్రమమ్॥ వా. I–51.

మును ఆంగ్లానువాదముతో గలిపి పూనాలో ప్రచురించిరి.[24] అందు వారు వ్రాక్రుచ్చిన యభి ప్రాయములు :

1. "స్ఫోటయనునది, ధ్వనులకంటె పూర్వమనియు, అది అఖండమనియు స్వగత భేదము లేనిదనియు అర్థ స్ఫోరకమయినదనియు భర్తృహరి ఎచ్చటను చెప్పలేదు."

2. "శబ్దోచ్చారకాంగములయిన స్థాన కరణముల వలన నది వ్యక్తమగుచున్నదని మాత్రమే చెప్పెను.

3. "పతంజలిచే నిర్వచింపబడిన శబ్దముయొక్క భావముతో స్ఫోట పదముయొక్క అర్థము అభిన్నమని భావించుటచే ఈ చిక్కు ఏర్పడినది."

4. "అర్థవంతమయిన వాక్కు అను నర్థమున స్ఫోటను భర్తృహరి యెచ్చటను వాడలేదు."

5. "ధ్వని యనునది వినబడునది యనియు అది కేవలము అస్థిరమయిన శారీరక ముతో సంబంధించినదనియు, స్ఫోట పయిని నిరూపించిన శారీరకమయిన యుత్పత్తిగల ధ్వనులనుండి ఆహరించిన జాతివాచకమనియు, భర్తృహరియొక్క యభిప్రాయముగా తెలియ నగు"నని జోషిగారు వ్రాసిరి.

ఇట్లు వారు భర్తృహరి చెప్పలేదన్న పయి యభిప్రాయముల కాధారములు మిక్కిలి సూక్ష్మముగా భర్తృహరి యుద్దేశములో నుండినట్లు అక్కడక్కడ స్పష్టపడుచున్నది.[25] పయిని జోషిగారు వ్రాసిన వ్రాతలవలన నెరుంగదగిన దేమనగా పతంజలినాటి స్ఫోటయొక్క స్వరూపము క్రమక్రమమున ప్రస్తరింపబడి భర్తృహరి, కైయటుడు, మొదయిలన వారిచేత అంతకంతకు వివరింపబడి స్పష్టపరుపబడినదని యూహింపనగును.

'స్ఫుట' ధాతువుకంటె కరణార్థమున ఘఞ్ ప్రత్యయము చేసికొనగా 'స్ఫోట' యను శబ్దము పుట్టుచున్నది. 'వెలిపుచ్చునది', 'బయటికి దెచ్చునది' అని దీని యర్థము. 'స్ఫుట త్యర్థః అస్మాత్'-దీనివలన అర్థము. వెలిపుచ్చబడును అనియు వ్యుత్పత్తి. ఈ స్ఫోటరూప మయిన భావము వ్యంగ్యము. దీనికి వ్యంజకమయిన శబ్దమునకు ధ్వని యని వైయాకరణుల వ్యవహారము అని కావ్య ప్రకాశికాకారుడు చెప్పియున్నాడు.[26]

పయిని చెప్పిన ప్రమాణములను బట్టి స్ఫోట రూపము క్రింద క్రోడీకరింప బడు చున్నది.

---

24 S. D. JOSHI – స్ఫోట నిర్ణయము. కొండభట్ట విరచితము. పుట 27, 35,39,40. K. A Subrahmanya Iyer - Bhartrhari పుట 157.

25 ద్వౌ శబ్దాత్మానౌ. నిత్యః కార్య శ్చేతి। కైశ్చి న్నిత్యమితి దృష్టః కైశ్చి దనిత్య ఇతి। అథవా జాతిర్వ్యక్తి శ్చేతి। అథవాస్ఫోటోధ్వనిశ్చ. మహాభాష్య దీపికా. పుట 18.

వర్ణ పద వాక్య విషయాః ప్రయత్నవిశేష సాధ్యాః ధ్వనయః వర్ణపదవాక్యాఖ్యాన్ స్ఫోటాన్ పునః పునరావిర్భావయంతః బుద్ధిప్యారోపయంతి. (యథానువాదః శ్లోకోవా ఇత్యాది. వా. ప. శ్లో. 82 క్రింది వృత్తిలోని పంక్తి).

26. బుధైర్వైయాకరణైః ప్రధానభూత స్ఫోటరూప వ్యంగ్యవ్యంజకస్య శబ్దస్య ధ్వని రితివ్యవహారః కృతః II కావ్యప్రకాశిక— I

అద్వైత సిద్ధాంతము ప్రకారము బ్రహ్మ సత్యము, జగత్తు మిథ్య, జీవుడే బ్రహ్మ, ఇతరముగాదు. సత్, చిత్, ఆనందము అనునవియే బ్రహ్మ పదార్థమును లక్షింపజేయుచున్నవి. ఇట్టి బ్రహ్మ పదార్థముననే సర్వచరాచరమైన విశ్వము, భావరూపమయినను వస్తురూపమయినను బహిర్భూతమై అందే లీనమగుచున్నది. కావున శబ్దము గూడ అందే గలుగవలెనుగదా ! అట్లు తోచుటకు ముందు శబ్దమునకును, బ్రహ్మమునకును అభేదముగదా ! ఆ యభిప్రాయమును గూర్చియే 'అనాది నిధనంబ్రహ్మ' యను మొదటి శ్లోకమున శబ్దతత్వమును (స్ఫోటగా) చెప్పి యున్నారు. దీనియందే అనగా స్ఫోటయందే పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ యను నాలుగు అవస్థలు గలిగి బయలు దేరి శ్రోతయందలి చైతన్యములో లీనమగుచున్నది. వాక్కే అర్థమును చూచుచున్నది. వాక్కే పలుకును. వాక్కే నిక్షిప్తమయిన యర్థమును వ్యాపింప జేయుచున్నది. వాక్కునందే విశ్వమంతయు నున్నది.[27]

ధ్వనియొక్క స్వరూపమును నేటి భౌతిక శాస్త్రజ్ఞులు అనేకవిధముల ప్రత్యక్ష ప్రమాణమున నిరూపించియున్నారు. ఈ ధ్వని నీటిమీద సమతలమందు ప్రసరించు తరంగములవలె గాని, ఒక కేంద్రమునుండి యన్నిదిక్కులకును గోళాకారమున ప్రసరించు తరంగములవలె గాని, దూరప్రదేశములకు సాగిపోవుచున్నది. ఇట్టి తరంగములు రెండురకములు. 1. వాయువునందలి యణువుల కదలికవలన గలుగునవి. ఇక్కడ మాధ్యమము ద్రవ్యరూపము. 2. వాయువిహీనమైన ఆకాశమునందు వేలకొలది మైళ్లు ప్రసరించునట్టి రేడియో తరంగములు. ఈ రెండువిధములయిన తరంగములను పాశ్చాత్యులు కొలదికాలము క్రిందటనే గుర్తెఱింగిరి[28]. ఈ రెండింటియొక్క స్వరూపమును భర్తృహరి కాలముననే మనవారికి తెలిసినట్లు వారి వ్రాతలవలన స్పష్టపడుచున్నది. ద్రవ్యమునందు వాయువునందు కరణము యొక్క అభిఘాతముచే కంపము అనగా కదలిక పుట్టుచున్నది[29]. అట్టి కరణము నందు కంపము ఆగిపోయినను దీపమునుండి దీపము గలుగుచున్నట్లు ధ్వనులు వాయువునందుగాని ఆకాశము[30] నందుగాని అభిఘాతానంతరముకూడ కలుగుచునే యుండును. గాలిగాని, అణు

---

27. వాగేవార్థం పశ్యతి, వాగ్బ్రవీతి వాగేవార్థం నిహితం సంతనోతి, వాచ్యేవ విశ్వం బహురూపం నిబద్ధం తదేతదేకం ప్రవిభజ్యోపభుంక్తే॥ వా. ప. I –110.

28. 'వీచీ తరంగన్యాయేన కదంబ ముకుళేనవా' పైనిచెప్పిన రేడియో తరంగములను HERTZ క్రీ. శ. (1857–1894) అను జెర్మను భౌతిక శాస్త్రవేత్త 1888 సంవత్సరంలో గుర్తించెను. Robert Boyle అను శాస్త్రజ్ఞుడును తరువాత HAWKSBEE యును క్రీ. శ. 1705వ సంవత్సరములో ధ్వని తరంగములను వాయుప్రసారితములుగా తొలుత నిరూపించిరి.

29. ద్రవ్యాభిఘాతాత్ ప్రచిత–వాక్య–పదీ I, 105.

30. అనవస్థితకంపేఽపి–వా. ప. I. 106. వా. ప.I. 107, 508, 109, 110. శబ్దగుణకమాకాశమ్, శ్రుతివిషయగుణా యాస్థితా వ్యాప్య విశ్వమ్, శా. శాకు. ఇట్లనుట వలన వాయుశూన్యమయిన యాకాశమునగూడ శబ్దము ప్రసరించుచుండినట్లు ప్రాచీనుల కవగతమయిన విషయము స్పష్టము గదా!

వులుగాని, జ్ఞానముగాని శబ్దముగా పరిణమించునని కొందఱి మతము. ఇవి యన్నియును స్ఫోటవలననే అందే కలుగుచున్నవి. లయమందుచున్నవి. మాటలాడువాని ప్రయత్నము వలన అతని యిచ్ఛ ప్రకారము నోటియందలి వివిధస్థానములయందు వాయువు అభిహతమై శబ్దరూపమును పొందుచున్నది[31]. ఈ శబ్దము అజస్రవృత్తి - అనగా శాశ్వతమయినది ఎల్లప్పుడు నుండునది. సూక్ష్మమగుటచే తెలియబడదు[32]. అంతరాళమునందు ఇట్లు శాశ్వత ముగా నున్న శబ్దమును లేదని తలంచుట గ్రహీతయొక్క అశక్తిచేతనేగాని వేరుగాదు[33]. ఆ శబ్దము గ్రహణోపాయము మూలముననే తెలియనగును. మనము మాటలాడునపుడు దోషరహితమయిన శ్రవణేంద్రియమువలన నివి గోచరించును. వీణాతంత్రులను మీటునప్పుడు బయలుదేరు ధ్వని తరంగములు మనకు స్పష్టముగా తంత్రులయందు గనుపట్టును. వాని యొక్క కంపనమునందలి శీఘ్రమందగతిభేదమువలన భిన్నస్వరములు మనకు శ్రూయ మాణము లగుచున్నవి. వీనివలన గలుగు షడ్జాదిభేదములు, 'షడ్జాదిభేదఃశబ్దేన' మొదలయిన శ్లోకమువలన (వాక్యపదీయము I-111) మన పూర్వులకు మిక్కిలి ప్రాచీనకాలముననే తెలియ బడినట్లు స్పష్టము. క్రింద నుదాహరింపబడిన శ్లోకముల యర్థములు పైని సూచింపబడిన మార్గముకంటె భిన్నముగా ప్రాచీన వ్యాఖ్యలలో వివరింపబడినవి. ఇందలి వివరణ నేటి భౌతిక శాస్త్రసిద్ధాంతములతో సరిపడునట్లు సమన్వితము.

అసతశ్చాంతరాళే యాన్ శబ్దా న స్తీతి మన్యతే ।
ప్రతిపత్తు రశక్తి స్సా గ్రహణోపాయ ఏవ సః ॥

ఈ శ్లోకమునకు వ్యాఖ్యానాంతరము గ్రంథమునఁజూచునది. 'శబ్దాన స్తీతి' అనుచోట, 'న్నాస్తీతి' 'శబ్దోనాస్తీతి' యను పాఠాంతరములు గలవు. ఇదిభిన్న విధముల వ్యాఖ్యానింపబడినది. ఇది ప్రకృత గ్రంథమున నీయబడిన పాఠము. ఇందలి తెలుగు వ్యాఖ్యానమునందును ప్రాచీన సంస్కృత వ్యాఖ్యానములయిన వృత్తి, పద్ధతియనువానియందును, నవ్య వ్యాఖ్యాత లందరిచేతను ఏకరూపముగానే వాక్యమునందు పదములు సత్యములుకావు, ఉన్నవని గ్రహించుటకు గ్రాహకుని యొక్క అసమర్థతయే కారణము. ఇక పద రూప విభజనము అర్థమును గ్రహింపజేయుట కుపాయమాత్రమే' అనునట్లు వ్యాఖ్యానింపబడినది. వారి మత మున ఈ శ్లోకమునకు అఖండ వాక్యార్థ స్థాపనమే ఫలము. ఈ మతమునే 'అసతః' అనునది 'లేని వానిని' అను ద్వితీయా బహువచనాంతత్వమును శబ్దాన్ అనుదానికి విశేషణత్వము అంగీకృతము-కాని అర్థములు బహువచనము కర్త. అస్తి అను ఏకవచనము క్రియ పయిక ర్తతో కుదురదు అను ఆక్షేపణ తప్పలేదు. అట్టి శబ్దముల మొత్తమును ఏకముగా భావించి ఏకవచ

31. లబ్ధక్రియః ప్రయత్నేన వక్తురిచ్ఛానువర్తినా । స్థానేష్వభిహతో వాయుః శబ్దత్వం ప్రతిపద్యతే వా. ప 1—107. (అధికపాదము).

32. అజస్రవృత్తి ర్యశ్శబ్దః సూక్ష్మత్వా న్నోపలభ్యతే। వ్యజనాద్వాయురివస స్వనిమిత్తాత్ ప్రచీయతేః వా. ప 108 శ్లో.

33. అసతశ్చాంతరాళేయః శబ్దో నాస్తీతి మన్యతే। ప్రతిపత్తు రశక్తిః సా గ్రహణోపాయ ఏవసః॥ వా. ప. 1—85 శ్లోకమునకు పాఠాంతరము

నము సరిపెట్టు కొందును అనిచెప్పి అందలి ఒక్కొక్క శబ్దమునకును "అస్తీత్యేకవచన శ్రుతేః ప్రత్యేకమితి గమ్యతే" అనియువ్యాఖ్యాత సమన్వయించెను. అస్తి అవ్యయమనియు సమన్వితము.

ఇక పై శ్లోకమునకు పాఠాంతరము మండన మిశ్రుని స్ఫోట సిద్ధియందు పేర్కొనబడినది. ఈ పాఠమున 'శబ్దః' కర్త అస్తిక్రియతో సమన్వయించును. అసతః అనునది ద్వితీయా బహువచనము కాక, పంచమీ ఏకవచనముగా భావించిన స్ఫోట సిద్ధాంత ప్రకరణముగ సమన్వయింపవచ్చును. ఆపక్షమున అసతః = లేనిదాని (భ్రాంతాభిప్రాయము) వలన, అంతరాళే = భూనభోంతరాళమున (నేలనింగి అనువానినడుమను) (రెండవపాఠమున వాక్యము యొక్క ఆద్యంతములనడుమను అని దీని యర్థము), యః = ఎవడు, శబ్దః = శబ్దము, నాస్తి = లేదు, ఇతి = అని, మన్యతే = ఆలోచించునో, (తస్య) ప్రతి పత్తుః = అట్లు గ్రహించు వానికి, సా = అది, అశక్తిః = అసమర్థతయే. (హేతువు), సః = ఆశబ్దము, గ్రహణోపాయః ఏవ = శ్రవణముచే గ్రహించుటయే మార్గముగా గలది. అనగా శబ్దము వినబడుటచేతనే గదా గ్రహించుట, ఉప + ఈ = ఉపే = అనుదాతువుపయి ఘఞ్ ప్రత్యయము చేయగా కలిగిన ఉపాయ శబ్దమునకు సమీపించుట, మార్గము, పొందుట మొదలయిన యర్థములు కలవుగదాః "శబ్దము అనిత్యము అను భ్రాంతివలన ఎవ్వడు అంతరాళమున అనగా ఆకాశమున శబ్దము లేదు అని భావించునో అది వాని అసమర్థత వలన గలుగుచున్నది. ఆశబ్దము గ్రహించుట కనువయిన ఉపాయమువలనగదా తెలియగలదు" అని తాత్పర్యము. ఈ విధమయిన వ్యాఖ్యానమున స్ఫోట రూపమయిన శబ్దము ఆకాశమునునిండి యున్నదియని చెప్పుట ఫలము. ఆకాశస్థితమయిన "అజస్రశబ్దవృత్తి"కి నిరూపకము. ఇప్పటి మన యనుభవము వలన ఆకాశమున కోట్ల కొలది శబ్దము లున్నవి. వానిని ఉపాయముచే (రేడియో గ్రాహకములచే) గ్రహింపవచ్చును అనుటకుగూడ సరిపోవుచున్నది. ఇక అఖండవాక్యార్థ స్థాపనకు ఎన్నియో శ్లోకములు ఇతరత్ర భర్తృహరిచే వ్రాయబడినవి. "భర్తృహరి చెప్పిన శబ్ద నిత్యత్వమునకు 'అజస్రవృత్తి' ఇత్యాది శ్లోకార్థములకును ఈ పాఠము సరిపోవునని తోచుచున్నది గాన నిట్లూహింపబడినది".

ఈ సందర్భమున అధిక పాఠముగా నున్న ఈ క్రింది శ్లోకముల యర్థమును గూడ పరిశీలింపవలెను.

> "స్థానేష్వభిహతే వాయౌ కృతవర్ణ పరిగ్రహా ।
> వైఖరీ వాక్ ప్రయోక్తౄణాం ప్రాణవృత్తి నిబంధనా ।
> సేయ మాకీర్యమాణాఽపి, నిత్యమాగంతు కైర్మలైః ।
> అంత్యా కలేవ సోమస్య, నాత్యంత మభిభూయతే" ॥

ముఖమునందలి తాల్వాది స్థానములయందు (వాయువు) తాడితమయి వర్ణరూపమును పొంది, ప్రయోక్తలయొక్క ప్రాణవాయువు వలన వైఖరీ వాక్కు కలుగుచున్నది. ఎల్లవేళలయందును (అంతరాళస్థమయిన) వాయువువలన గలుగు ఆగంతుక (మలముల వలన) దోషములచే ఈ వాక్కు వివిధముగా అన్ని ప్రక్కలను చల్లబడియును (ఆకీర్యమాణమయ్యును) చంద్రునియొక్క (తుది) పదునారవకళ వలెనే పూర్ణముగా నశింపదు.

ఈ వాక్యమును బట్టి శబ్దము క్షీణించుచున్నట్లు తోచినను చంద్రకళవలెనే నిశ్శేషముగా నశింప దని భావము. కాబట్టి శబ్దము నిత్యమనియు గ్రహణ సామర్థ్యమును బట్టియే తెలియదగిన దనియు నిశ్చితాభిప్రాయము. ఇదియు 'అసతశ్చ' అను శ్లోకాభిప్రాయమును పయిరీతిని వివరింపబడినదానిని బలపరచుచున్నదిగదా!

నేటి పాశ్చాత్య భౌతిక శాస్త్రము ననుసరించియు, ఏకశబ్ద జాతములయిన తరంగ ములు, మాధ్యమము (mediuim) నందు గలిగిన, తత్సంబద్ధాన్య తరంగములచే కలుషితము లగుచున్నవను నభిప్రాయమును పయి 'ఆగంతుకైర్మలైః' అను పదము వివరించుచున్నది గదా! ఈ పయి వివరణములు, కొన్ని యెడల ప్రాచీన వ్యాఖ్యాతల వివరణములతో సరిపడకపోవచ్చును. గాని నేటి భౌతిక శాస్త్రముతో సరిపోవుచున్నవి.

ఈ సందర్భమున స్పష్టత కొఱకు శబ్దస్వభావమును గూర్చి తార్కికుల మతము సంగ్రహముగా 'భాషా పరిచ్ఛేదముననుసరించి వివరింపబడుచున్నది. "ధ్వని, వర్ణము," అని శబ్దము రెండు విధములు. మద్దెల మొదలగువానివలన గలుగునది ధ్వని. కంఠముయొక్క సాహాయ్యమున కలిగిన 'క', 'గ' మొదలయినవి వర్ణములు. అన్ని శబ్దములును ఆకాశమున వర్తిల్లుచున్నవి. ఉత్పన్నమయిన శబ్దము శ్రోత్రముచే గ్రహింపబడుచున్నది. వీచీతరంగ న్యాయమున ఆశబ్దోత్పత్తి జరుగుచున్నది. అనగా నీటిపైనుండు అలలు ఎట్లు ~~~~~~ ఈ గీతరూపమున నుండునో అట్లే ప్రసరించుచున్నదని భావము. కదంబముకుళము అనగా కడిమిచెట్టు మొగ్గ ఏ యాకారమున నుండునో ఆ యాకారమున బయల్వెడలునని కొందరి మతము. (అనగా ఉమ్మెత్తకాయకు ముళ్లు ఎట్లు అన్ని ప్రక్కలను బయలుదేరునో అట్లే దిశ దిక్కులకు శబ్దము బయలుదేరి వ్యాపించునని భావము). కకారము పుట్టినది, నశించినది అను అనుభవము మనకు గలుగుచుండును గావున ఆ 'క' కారము అనగా శబ్దము అనిత్యము ఒకచోట వ్రాసినట్టిదిగాని విన్నట్టిదిగాని యయిన 'క' కారము ఇయ్యదియే అని చెప్పు వాక్య మునకు అభిప్రాయము ఆ కకారమువంటిదే యనిగాని దానితో అభిన్నము అని కాదు. ఆ మొదటి 'క' కారము నశించిపోయినది. నీవు త్రాగిన మందేయిది అని యొకనితో మఱియొకడు తాను త్రాగుచున్న మందునుగూర్చి చెప్పునపుడు, ఆ మందువంటిదే యని యభిప్రాయము గాని, అతడు త్రాగివేసినమందు మఱి లేదుగదా! అనగా సాజాత్యము ఇక్కడ ఉద్దేశింప బడినది. (భర్తృహరి ఖండించిన తార్కికుల మతము. శబ్దవిషయమున పయిరీతిని స్పష్టత కొఱకు చూపబడినది). దీనికి ఆధారములయిన మూలశ్లోకములు ఈ క్రింద నీయబడినవి.

శ్లో॥ శబ్దో ధ్వనిశ్చ వర్ణశ్చ, మృదంగాదిభవో ధ్వనిః।
కంఠసంయోగాదిజన్యా వర్ణాస్తేకాదయో మతాః॥
సర్వ శ్శబ్దో నభోవృత్తిః శ్రోత్రోత్పన్నస్తు గృహ్యతే।
వీచీతరంగ న్యాయేన తదుత్పత్తిస్తుకీర్తితా॥
కదమ్బకోరక న్యాయాదుత్పత్తిః కస్యచిన్మతే।
ఉత్పన్నః కో వినష్టః క ఇతి బుద్ధే రనిత్యతా॥
సోఽయం క ఇతి బుద్ధిస్తు సాజాత్యమవలమ్బతే।
తదే వౌషధ మిత్యాదౌ సజాతీయేఽపి దర్శనాత్॥
తస్మా దనిత్యా ఏవేతి వర్ణా స్సర్వే మతం హి నః।
ఇతి శ్రీ విశ్వనాథ భట్టాచార్య విరచితాః భాషా పరిచ్ఛేదాంత్య శ్లోకాః॥

ప్రాకృత ధ్వనులు-వైకృత ధ్వనులు

వైయాకరణుల సిద్ధాంతములకు సంబంధించిన విచారణలో, శబ్దము, స్ఫోట, నాదము, ధ్వని (వైకృత ధ్వని, ప్రాకృత ధ్వని), పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ, యను పదములు వాడబడినవి. అద్వైత సిద్ధాంతము నంగీకరించినవారికి లోకమునందలి కోట్లకొలది భిన్నవస్తువులు, అనంత భావములు అన్నియు ఒక్కటియే అనగా "ఇంగర్ సాల్," అను నాయన చెప్పినట్లు షేక్స్పియర్ వ్రాసిన శబ్దరూపమయిన హేమ్లెట్ అను నాటకమును, ఆయన తినియుండిన రొట్టెయును అభిన్నములు. ఆ రొట్టెవలని శక్తియే గదా ఆ వాక్కుగా మారినది. కాబట్టి రొట్టెకును హేమ్లెట్ నాటకమునకును అభేదము" అని ఆయన వచించెను. అద్వైత వాదమునందును బంగారము ముద్దగానున్నను, మెరుగుపెట్టకున్నను, నగము రూపములోనున్న అభరణముగా నున్నను, మెరుగు పెట్టిన గొలుసుగా నున్నను అది యొక్కటే బంగారమనవచ్చును. కాని రూప భేదముతో కూడిన ఆ పదార్థమును పేర్కొనుటకు వేరువేరు నామములును, రూప భేదమును హేతువులగుచున్నవిగదా! అట్లే వ్యక్తిపరంపరలి స్ఫోట రూపమయిన శబ్దమే మొదట చెప్పిన పయిరూపాంతరములు పొందుచున్నది. కావున అన్నిటిని స్ఫోటముగా గాని శబ్దముగా గాని వ్యవహరింపవచ్చును. అట్లే భర్తృహరియు వ్యవహరించెను. ముందు ఒకచోట అట్టి వ్యవహారమువలన అర్థబోధకు విలంబమును, సందిగ్ధతయు నేర్పడ ప్రకరణాదులచే తెలియనగు నని వివరించితిని.

ఇక గ్రహింపవలసిన దేమనగా ధ్వనికిని శబ్దమునకు భేదమున్నదనవలెను-ఆ భేదమేమి? వ్యక్తిగతమై యర్థవంతమైన అభిప్రాయ మాత్ర రూపమును చెప్పుటకు వ్యక్తి తన తాల్వాద్యవయవ ప్రయత్న రూపమున గలిగించునట్టిది ధ్వని. ఈ ధ్వని నిమిత్తమయి తనకు మందుండిన అభిప్రాయమునకు వ్యంజకమగుచున్నది.

ఇందు ఒక సందేహము గలుగుచున్నది. స్ఫోట నిత్యము, అఖండము. అందు హ్రస్వ దీర్ఘాది భేదములు లేవుగదా, మరి, అ, ఆ, ఆ3 అనునట్లు ఉచ్చారణ కాలభేదమును ఉదాత్తాది స్వర భేదమును స్ఫోటయం దెట్లు కలుగుచున్నవి? అను ప్రశ్న లేవదీయబడినది. దానికి సమాధానము. పై ధ్వనియందు ప్రయత్నముచే వచ్చిన భేదము మూలమైన స్ఫోట యందు ఆరోపించబడుచున్నది. నిర్మలమైన నీటియందు చంద్రుని ప్రతిబింబము కనబడు చున్నది. ఆ నీటి యుపరి భాగమున కలుగు కదలికవలన ప్రతిబింబమున గూడ కదలిక యేర్పడుచున్నదిగదా? అట్లే శబ్దోచ్చారణమున విరుపు, ఱిక, పొంగు, గట్టితనము, మెత్తదనము మొదలయినవి యేర్పడుచున్నవి అను సమాధానమును స్ఫోటస్వభావమును చెప్పునపుడు వివరించితిని. అట్లు మొట్టమొదట స్ఫోటమునకు అవ్యవహితమైన అనంతరవృత్తిగా బయలుదేరినది ప్రాకృత ధ్వని, దాని తరువాతివి వైకృతధ్వనులు. ఈ ప్రాకృత ధ్వనులలోని విశేషములే స్ఫోటమున నున్నట్లు వ్యక్తమగుచున్నది.

ఇట్లు చెప్పిన 'ప్రాకృత ధ్వనులేవి? వైకృత ధ్వనులేవి? ఈ రెండిటిని ఎందు కంగీకరింపవలె' అను ప్రశ్న బయలుదేరుచున్నది. ఈ సందర్భమున వాక్యపదీయమునను, ఇతర స్థలములను చెప్పబడిన వాక్యములను ప్రక్కపుటలో క్రింద సూచించితిని.34 ఈ ప్రశ్నకు సమాధానము నూహించుకొనుటకు ముందు ధ్వనియనగా మనకు సాధారణముగా తోచునర్థమును

వివరింతును. నాకు ధ్వని వినబడుచున్నది అని యొకడనునప్పుడు, ఆ శ్రోతచే ననుభవింప బడినదానినే అనగా తన చెవినిబడుదానినే ధ్వనియని గాని శబ్దమని గాని చప్పుడు అని గాని పలుకును. ఈ రీతిని చూచినచో ఈ ధ్వని యనుదానికి అనంతరమున నేమి కలుగగలదో యూహింపలేడు. తాను 'క' అను వర్ణమును గాని 'కాకి' యను పదమును గాని 'అన్నమును తినుచున్నాడు' అను వాక్యమును గాని వినును. ఈ మూడింటికిని వరుసగా వర్ణస్ఫోట, పద స్ఫోట, వాక్యస్ఫోట యని వ్యవహరింపబడునట్టి జాతిరూపమయిన శబ్దమే గదా మూలము? అది నాచే వినబడినది. ఇక తరువాత పుట్టిన ధ్వనులేవియును లేవే యను సందేహము పుట్టక తప్పదు. అట్టి సందేహము నివారించుట యెట్లు?

ఈ సందేహమును నివారించుకొనుటకు ధ్వని యుత్పత్తినిగూర్చి వక్తనుండి క్రమము నూహించుకొనవలెను. వక్తయొక్క నోటిలోని స్థానకరణముల వలన ధ్వని పుట్టు చున్నది అని గదా యంటిమి. ఈ ధ్వనియను శబ్దముచేతనే వక్తనుండి శ్రోతవఱకు గలుగు అవస్థలనన్నిటిని శాస్త్రకర్త పేర్కొనుచున్నాడు. స్థానకరణముల సంయోగము వలన ధ్వని పుట్టలేదు. వాయువునందు కంపము మాత్రము గలిగినది. ఆ కంపమువలన తరంగరూపమయిన చలనము వాయువులోని అణువులయందు గలిగినది. ఇట్టి తరంగము మొదట కలుగును, దానివలన రెండవ తరంగమును, ఆ తరువాత మఱియొకటియు అట్లనంతముగా అన్నిదిక్కుల వైపునను ప్రసరించి వాయు వంతయు గాని, ఆకాశమంతయు గాని తరంగమయ మయి పోవును. ఈతరంగములు వాయువునందు ప్రసరించి దూరమున నున్న శ్రోత చెవియందు పడుచున్నవి. అవి చప్పుడుగా (ధ్వనిగా) శ్రోత తెలిసికొనుచున్నాడు. అప్పుడే అది అర్థ హీనమయిన ధ్వని యనిగాని అర్థవంతమయిన ధ్వని యని గాని వినినందువలన కలిగెడి యనుభవము. ఇట్లు బయలుదేరిన తరంగముల యొక్క వరుసలో ఒకదానికంటె నింకొకటి క్షీణబలముగలదిగా, నడుమను గలుగు వాయుకణములవలనిసంగముచే మార్పును పొంద వచ్చును.[35] ఆకారణము వలననే వక్తయొక్క కేక కొంత దూరమువఱకే విననగును. ఆ తరువాత నది వినబడదు.

ఇక ప్రాకృత ధ్వని యనునది స్థానకరణముల సంయోగమున అచటనే పుట్టును. దాని ప్రక్కనే నియతముగా నున్న వాయువున రెండవ తరంగము అనురణన రూపముగా

---

34. ఇహ ద్వివిధో ధ్వనిః ప్రాకృతో వైకృతశ్చ-తత్ర ప్రాకృతో నామ యేన వినా స్ఫోటరూపమ్ అనభివ్యక్తం న పరిచ్ఛిద్యతే ॥ వైకృతస్తు యేనాభివ్యక్తః పునఃపునః అవిచ్ఛేదేన ప్రచితతరకాల ముపలక్ష్యతే ॥ ధ్వనినాతు సంస్పృష్టం స్ఫోటస్య రూప ముపలక్ష్యతే యస్మాత్ ధ్వనేః స్థితికాలః స్ఫోటోపలబ్ధిరూపః పరివర్తతే ॥ శబ్దస్యోర్ధ్వమభివ్యక్తేః వృత్తిభేదేతు వైకృతాః ॥ ధ్వనయఃసముహోహన్తే స్ఫోటాత్మా తైర్నభిద్యతే ॥ తస్య నిత్యస్యయేఽభివ్యంజకా స్తేచ కేచిత్ ప్రాకృతాః కచిద్వైకృతాః యః కరణసన్నిపాతా దుత్పద్యతే యశ్చ తస్మాత్ తౌ ప్రాకృతౌ ॥ తాభ్యామ్ విశేషోపలబ్ధేః ॥ యస్తుధ్వనిః ధ్వనేరుత్పద్యతే సవైకృతః తతో విశేషా భావాత్ ॥ స్ఫోటస్య వర్ణస్య గ్రహణే హేతుః ప్రాకృతో ధ్వని రిష్యతే । స్థితిభేదే నిమిత్తత్వం వైకృతః ప్రతిపద్యతే ॥

35. సేయ మాశీర్యమాణాపి నిత్య మాగంతుకైర్మలైః । అంత్యాకలేవ సోమస్య నాత్యంత మభిభూయతే ॥

కలుగును-ఈ రెండిటినే ప్రాకృత ధ్వనులనియు ఆ తరవాత గలిగిన తరంగములన్నియును వైకృత ధ్వనులనియు అయ్యవి శ్రోతనుజేరి యర్థమును భాసింపజేయుననియు నుద్దేశింప బడినట్లు స్పష్టము-"శబ్ద స్యోర్ధ్వ మభివ్యక్తేః" అనియు 'అనురణనరూపా యే పశ్చాత్కాల భావినః' అనియు, ప్రాకృత వైకృత ధ్వనులను హేలారాజకృత వ్యాఖ్యానమున స్పష్టపరిచి యున్నాడు.

పైని నిరూపించిన క్రమ మంతయును నేటి పాశ్చాత్య శాస్త్రమయిన (**Physics** లోని **Propagation of sound**) అను విషయమునకు సరిపడియున్నది. దీనివలన మన మెఱుంగదగినది యేమనగా క్రీ. వె నాలుగవ శతాబ్దమునాటికే యీ ధ్వని శాస్త్రమును మన వారు పూర్తిగా గోచరము చేసికొనిరనుటయే.

పైని చెప్పిన వైయాకరణ మార్గమును గూర్చియు ప్రాచీన తార్కికుల శబ్ద ప్రసారమును గూర్చిన వివరణమును, అద్వైత వేదాంతులు విమర్శించి ఖండించినమార్గమును, పరిశీలించినచో పయి పద్ధతి యొక్క బహుళ ప్రచారము మునకు స్పష్టపడుచున్నది. "అద్వైత పరిభాష" యను గ్రంథమున ధర్మరాజాధ్వరి యను గ్రంధకర్త ఈ క్రింది విషయమును వ్రాసియున్నాడు. "శబ్దము, వీచితరంగ న్యాయమునగాని కదంబ ముకుళ న్యాయమునగాని బయలుదేరి వక్తనుండి శ్రోత వఱకు పోవుచున్నది అనునది తార్కికులు అంగీకరించిరి''. ఈ కల్పన దుష్టమని యాతడు త్రోసిపుచ్చెను. ఒకటి గౌరవ దోషము. రెండు ప్రత్యక్ష విరోధము. భేరి నుండి బయలుదేరిన శబ్దమును అనగా ధ్వనిని శ్రోత విను చున్నాడు. అతని యనుభూతి 'భేరీ శబ్దో మయా శ్రుతః' (భేరి శబ్దమును నేను వింటిని) అని గదా : భేరి నుండి శబ్దము పుట్టి దాని వెనుక నింకొకటిగా అనంత శబ్దకల్పన చేయుట గౌరవ దోషముతో కూడినది 'అనంతశబ్దకల్పనాయాః గౌరవత్వాత్' అని వ్రాసెను. అనగా ఒక్క భేరీ శబ్దమును అంగీకరించి చేయు కల్పన లాఘవముతో గూడినది". రెండవది "భేరీ శబ్దోమయాశ్రుతః ఇతి ప్రత్యక్షస్య విరోధాచ్చ'' అనగా శ్రోత యనుభవము, "తాను భేరీ శబ్ద మును వింటిని అని గాని, భేరీ శబ్దము వలన పుట్టిన శబ్దము నుండి పుట్టిన అనేకాంతరిత శబ్దము వింటినని గాదుగదా'' ఇది ప్రత్యక్ష ప్రమాణ విరోధము.

పయివాదమునం దాతడును వాయుగతములయి కంపన జన్యములయిన (శబ్ద) తరంగములను అన్నిటిని శబ్దమనియే వ్యవహరించి యున్నాడు. కావున పయి క్రమము నంతటిని స్పష్టపరచుటకు ఇందు చెప్పిన క్రమికావస్థలకు భిన్న భిన్నములయిన సాంకేతిక పదములను నిర్ణయించి ఆ పదములనే ఆ యర్థములయందు వాడుచుండినచో అర్థబోధకుపకా రకము, సందేహ నివారకము. పయి కల్పనలన్నియు అంతటి ప్రాచీన కాలముననే మనవారికి తెలిసియును, మన శాస్త్రములు పెరగకుండుటకును పాశ్చాత్యభౌతిక శాస్త్రము పెరుగుచుండుట కును హేతువు ముఖ్యమైనదొక్కటి - ఇందు **experimental method** అనగా ప్రయోగ మూలకమయిన పరామర్శ నవ్య మార్గమున ముఖ్యము. ఇంకొకటి యేమనగా పాశ్చాత్య పద్ధ తిని ఒక శాస్త్రమున చేసిన సిద్ధాంతమునకు విరుద్ధమయిన సిద్ధాంతము మరియొకచోట నెదు రయినపుడు రెండిటిని విమర్శించి, సంపన్నమయిన సాక్ష్యమునంతటిని సమన్వయపఱచి జ్ఞాన స్వరూపమును యథార్థముగా నిర్ణయించుకొందురు. దానికి బాధ వచ్చినప్పుడు కల్పనాంతరము

వలన క్రొత్తసాక్ష్యమును సమర్థించి ప్రాతకల్పనను విడుతురు. మన శాస్త్రములలో, ఏ శాస్త్రము వారి కల్పన ఆ శాస్త్రము వారిదే. అన్నియు ప్రచారములోనే యుండును. ఎవ్వరిది వారికే ప్రమాణము. ఇట్టివి కేవల భావ మాత్ర గోచరములయిన మానసిక విషయములలో తప్పనివేమోగాని, వెలుగు, ధ్వని, దర్శనము, శరీరాంగములు, లోహములు, మొదలయిన భౌతిక వికృతులలో ప్రత్యక్షీకరింప వీలగును గావున, వేరు వేరు ప్రతిపాదనలు చెల్లవు.

అయినను ఇంతటి ప్రాచీనకాలమున బయలుదేరిన వీరి కల్పనలు, వివరణములు నేటి భౌతిక శాస్త్రములోని ముఖ్య విషయములతో సరిపోవుటకు ప్రాచీనుల తపఃఫలమే హేతువు.

వాక్యపదీయమునకు తరువాతివారు కల్పించిన ప్రచారము

మహా భాష్యములోని యర్థములనూహించి పయిరీతిని వ్రాయబడిన కారికలను తరువాతివారనేకు లుదాహరించి యనుసరించిరి, కొందరు వివరించిరి, మరికొందరు తమ తమ మతములననుసరించి వివరించిరి. పయిరీతిని ఇతరులు ఉదాహరించిన సందర్భములను ఎత్తి పూనా విశ్వవిద్యాలయము వారు ప్రచురించిన వాక్యపదీయమునకు మూడవ అనుబంధమున విపులముగా వ్రాసిరి. దాని సంగ్రహరూప మీ క్రింద నీయబడుచున్నది.

క్షీరస్వామి యను నాతడు శతపథబ్రాహ్మణ వ్యాఖ్యాత (688 A. D.) కారికల నుదాహరించియున్నాడు, అట్లే జయంత భట్టు తన న్యాయమంజరిలో (830 A. D.), రామ కంఠుడు (950 A. D.) స్కందకారిక పయిని తాను వ్రాసిన వివృత్తియందును, సర్వ దర్శన సారసంగ్రహమునందు (1350 A. D) మాధవాచార్యులును, శాంతరక్షితుడు (720 A. D.) తత్త్వ సంగ్రహమునందును, దానికి వ్యాఖ్యాత కమలశీలుడు తన వ్యాఖ్యాన మునను, కుమారి లభట్టు (650–700 A. D.) తన తంత్రవార్తికమునను, అభినవగుప్తుడు (970-1020 A. D) తన అభినవ భారతియందును, వాచస్పతి మిశ్రుడు(820-900 A. D.) తన తత్త్వబిందువునను, భవ్యుడను నాతడు (600 A. D.) ప్రజ్ఞాప్రదీపవృత్తియందును, గోకులనాథుడు పదవాక్యరత్నాకరమందును, శివసూత్రవృత్తి యను వ్యాఖ్యయందును, భోజరాజు తన శృంగారప్రకాశికయందును ఉదాహరించిరి. ఇంక ననేకులచేత ననేకస్థలముల యందును వాక్యపదీయ కారికలు ఉదాహరింపబడినవి. శ్రీ శంకరాచార్యులు గూడ తన బ్రహ్మసూత్ర భాష్యమున వాక్యపదీయము నభిప్రాయములు ఆధారముగా విషయమును ప్రపంచించినట్లు స్పష్టము. (వా-ప-1-84) వీరిలో చాలమంది వైయాకరణ దర్శనమునకు దూరమైన వారు.ఇక వ్యాకరణ విచారణ గ్రంథములను వ్రాసిన కైయటుడు, భట్టోజీ దీక్షితుడు, కౌండభట్టు, నాగేశభట్టు మొదలయినవారు వాక్యపదీయ కారికలను పరమ ప్రమాణముగా తమ రచనలయందు వాడుకొనిరి.

ఇన్ని విధముల ఇందరిచేత నీగ్రంథ మేల వాడబడినది యను ప్రశ్న తోపక తప్పదు.వ్యాకరణ విషయమున రెండు విధములయిన విచారణ కలదు. ఒకటి పాణిని సూత్ర ముల ననుసరించిన ప్రక్రియా భాగము, అనగా రూప నిష్పాదన విధానము. రెండు ఆర్థిక విచారము, అనగా వ్యాకరణ దార్శనికుల యొక్క శబ్దార్థ స్వరూపములలోని విచారణ. ఈ రెండును కలిసియే మహాభాష్య రచనము సాగినది. అందలి ఆర్థిక విచారమును ముఖ్యముగా

విడదీసి, వివరించి, యందలి సిద్ధాంతములను ప్రపంచించి, అన్ని విషయములను సమన్వయ పరచిన గ్రంథము వాక్యపదీయమగుట, అది యెల్లరకును ఉపాదేయమయినది. విశేషించి, ఆగమ ప్రామాణ్యము, మోక్షవిచారము, జ్ఞాన స్వరూపము (శబ్దార్థ విచార విషయమున) అద్వైత సిద్ధాంతము, ఇందు వివరింపబడుటచేత, తార్కికులకు, మీమాంసకులకు, బౌద్ధులకు ఇతర మతస్థులకు ఇది అనివార్యముగా ఉపయోగించవలసి వచ్చినది.

ఈ గ్రంథము ప్రాచీన కాలముననుు, మధ్యకాలమున అనగా 19 వ శతాబ్దమునకు పూర్వముననుు మిక్కిలి ప్రచారము నుండినది. అయినను 18-20 శతాబ్దములలో ఎల్లరును ప్రక్రియా గ్రంథములను, ప్రకరణ గ్రంథములను మాత్రమే చదువుచు పరీక్షా ప్రయోజనమును వెళ్ళబుచ్చుకొను చుండుటవలన దీనికి ప్రచారము తగ్గినది. కాని ఇటీవల పూనా విశ్వవిద్యాల యము వారు, పూనా దక్కను కాలేజీవారును భర్తృహరిని గురించి చాల విమర్శ చేసి యనేక గ్రంథములను ప్రచురించి యున్నారు. అయినను కొన్ని యెడల అర్థసందిగ్ధత, పాఠభేదములు, సమన్వయమున మతభేదములు తప్పలేదు.

వ్యాకరణ శాస్త్రమున భర్తృహరి నిరూపించిన విశేషములు

సర్వ శాస్త్రముల నెఱింగిన పతంజలి మహర్షి అగాధమయిన వ్యాకరణ శాస్త్రము లందలి యనేకామూల్యరత్నములను సంపాదించి తన మహాభాష్యమున నిక్షేపించెను. మందబుద్ధులు వాని నుత్తర దేశమున సంరక్షింపలేక పోగా దక్షిణదేశమున నెక్కడనో ఒక్క మూలను మాత్రము ఉండిన వానిని చంద్రాచార్యాదులు పఠించి తమ శిష్య వర్గములోని వాడ యిన వసురాతునకు బోధింపగా భర్తృహరి యాశాస్త్రము నాతని కృపచే పొందెను. ఆ భాష్య ములో పతజంజలి చూపిన మార్గములను అనుసరించి తన గ్రంథములను భర్తృహరి రచించెను

1, పాతంజల మహాభాష్యమున బీజరూపముగానున్న స్ఫోటసిద్ధాంతమును వివరించి యనేక మార్గములలో దానిని వ్యాఖ్యానించి నిరూపించెను. ఆ తరువాత కైయటాదులు మఱి కొంత వివరించిరి.

2. తన కాలమున ప్రసిద్ధములయిన వేదాంతాది దర్శనములు, నిశ్శ్రేయసప్రాప్తికి మార్గములను, విశ్వముయొక్క సృష్టిలయాదుల స్వరూపమును చెప్పుచుండగా, కేవలము శబ్దరూపసాధన మాత్రమే ప్రయోజనముగా గల వ్యాకరణ శాస్త్రము అట్టి ప్రయోజనమును సాధింపజాలదు అను ప్రవాదమును పోగొట్టి దానికి మోక్ష సాధకతను నిరూపించెను. "ఇయం సా మోక్షమాణానామ్ అజిహ్మా రాజపద్ధతిః" అని చెప్పెను.

'మహతా దేవేన నః సామ్యం యథా స్యా దిత్యధ్యేయం వ్యాకరణమ్' అను మహా భాష్యవచనమునందలి 'సామ్యమ్' అను పదమునకు సాయుజ్యమను మోక్షఫల మర్థముగా నిరూపించెను. 'అపి ప్రయోక్తు రాత్మానం శబ్దమంతరవస్థితమ్। ప్రాహుర్మహాంత మృషభం యేన సాయుజ్య మిష్యతే'' ॥ వాక్య 1-122 (180).

అనగా వ్యాకరణమునకు గూడ ఇతర దర్శన సమానమైన ఫలమును చెప్పుట వలననే శివదృష్టియను గ్రంథమునందు, ''భర్తృహరి తన వైయాకరణత్వమును విడిచి దర్శన మార్గమునందు నడిచి రెంటికిని భ్రష్టుడయ్యెను'' అను నింద కనుపట్టుచున్నది.

3. బ్రహ్మకును శబ్దమునకును అభేదమును జెప్పి విశ్వ మంతయును శబ్దబ్రహ్మ యందిమిడియున్నదని నిరూపించెను.[36]

4. సాధు శబ్దములను ప్రయోగించుటవలన వేద స్వరూపము నెరింగి ధర్మ సాధనకు మార్గమును అధ్యేత అధిగమించునను పాతంజలమతమును విపులీకరించి తెల్పెను. "శాస్త్ర పూర్వకే వా ప్రయోగే ధర్మాభివ్యక్త్యా అభ్యుత్వం ప్రతిపద్యతే" అని నిరూపించెను. ఇట్లు ధర్మాద్యర్థ నిరూపణము చేయుట విజ్ఞానాభాస (న) మని సోమానందుడు నిందించెను.

5. సృష్టిలో మొదట ఓంకారము జనించెనను ఉపనిషన్మతము నాధారముగా గాని వాక్కు అనాది యనియు సృష్టికి మూలమనియు స్పష్టపఱచెను.

6. తన కాలమున పరిచితములయిన అన్యమత సిద్ధాంతములను సంగ్రహించి తన మతమునకు పూర్వపక్షములుగా నిరూపించి సమన్వయపరచెను.

7, శబ్ద స్వభావమును గురించియు వాక్యార్థమును గుఱించియు తార్కిక మీమాంసకాదుల సిద్ధాంతములమ దెలిపి, అఖండ వ్యాక్యార్థమే సత్యమని నిరూపించి వైయాకరణ మతమును స్థాపించెను,.

8. అద్వైతసిద్ధాంతమును, వేద ప్రామాణికత్వమును గూడ తన శాస్త్రముతో సమన్వయించెను. మీమాంసకులకు అపూర్వమును, నైయాయికులకు ఈశ్వరుడును, కాణాదులకు పీలువులును, బౌద్ధులకు శూన్యమును, వేదాంతులకు బ్రహ్మమును ఉన్నట్లు, వైయాకరణులకు భావగమ్యమయిన మూలపదార్థమగు స్ఫోటమును స్థాపించెను.

సర్వవిద్యావిశారదుడయిన ఇట్టి భర్తృహరి గ్రంథ మెల్లరకు నుపాదేయమేకదా ?

---

36. తస్మాద్యః శబ్దసంస్కారః సా సిద్ధిః పరమాత్మనః ।
తస్యప్రవృత్తి తత్త్వజ్ఞః తద్బ్రహ్మామృత మశ్నుతే ॥ వాక్య. I. 201.
యదేకం ప్రక్రియాభేదైః బహుధా ప్రవిభజ్యతే ।
తద్వ్యాకరణ మాగమ్య పరం బ్రహ్మాధి గమ్యతే ॥ వాక్య. P. 51.

ఉపయుక్త గ్రంథములు

వాక్యపదీయము - భర్తృహరి - వివిధముద్రణలు :

I, II కాండలు కాశీ విద్యాపీఠ ప్రచురణము - అంబాకర్త్రీ వ్యాఖ్యానముతో

I, II, III కాండలు అభయంకర్, లిమయేగారలు సంపాదించినది.
పూనా విశ్వవిద్యాలయ ముద్రణము.

I కాండ - కె. ఎస్. అయ్యరుగారు సంపాదించినది.

II కాండ ,, ,, ఆంగ్లపరివర్తనము
పూనా డక్కన్‌కాలేజి ప్రచురణము.

I, II కాండలు కే. రాఘవన్ పిళ్లై కృత - ఆంగ్లపరివర్తనసహితము.
మోతీలాల్ బనారస్‌దాస్ ప్రచురణము-బంగ్లారోడ్ ఢిల్లీ - 7

భర్తృహరి - కే. ఎ. ఎస్. అయ్యరుగారు వ్రాసినది (ఆంగ్లము)
సర్వంకష విమర్శగ్రంథము. పూనా డక్కన్ కాలేజి ప్రచురణము.

కౌండభట్టు - స్ఫోటనిర్ణయము - ఎస్. డి. జోషిగారి ఆంగ్లానువాద
వివరణముతో కూడినది. పూనా విశ్వవిద్యాలయ ముద్రణము.

పాతంజల మహాభాష్యము - ప్రదీపాదివ్యాఖ్యాసహితము.

సంస్కృతవ్యాకరణశాస్త్ర కా ఇతిహాస్ - (హిందీ) - యుధిష్ఠిర్ మీమాంసక్
భారతీయ ప్రాచ్యవిద్యా ప్రతిష్ఠాన్, 24/312 రామ్‌గంజ్, అజ్‌మేర్.

విషయసూచిక

I. ప్రస్తావన ... 3

II. పరిచయము ... 5

తెనుగువ్యాఖ్య — 5, ఇతర గ్రంథములు — 5, వ్యాకరణశాస్త్రము నుత్పత్తి వికాసములు — 9, భర్తృహరి మతము — 18, వాక్య పదీయ టీకలు — 21, వాగ్వ్యాపారము — 24, స్ఫోట స్వరూపము — 2ర, శాస్త్రజ్ఞమతము — 31, ప్రాకృత ధ్వనులు - వైకృతధ్వనులు— 38, తరువాతివారి ప్రచారము— 41, భర్తృహరి నిరూపించిన విశేషములు—42, ఉపయుక్త గ్రంథ పట్టిక—44,

III. ప్రథమ కాండము ... 1—103

IV. ద్వితీయ కాండము ... 104—457

V. పారిభాషిక పదకోశము ... i—xxii

వాక్యపదీయము

బ్రహ్మకాండము

ఏ గ్రంథమును రచింపదలచినను ముందుగా అనుబంధ చతుష్టయమును జూపవలెను. 1. విషయము, 2. ప్రయోజనము, 3. సంబంధము, 4. అధికారి—ఈ నాలుగింటిని అనుబంధ చతుష్టయ మందురు. అనుబంధచతుష్టయమును చూపినచో చదువరులు ఉత్సాహము కలవారై అందలి ప్రయోజనమును పొందదలచి ఆ గ్రంథమును చదువుటకు ప్రయత్నింతురు. అట్లు గాకున్న విషయ ప్రయోజనములు తెలియనందున వారు ఆ గ్రంథమును చదువుట సంభవింపదు. కనుక నియతముగా ముందుగా ఆ చతుష్టయమును జూపి గ్రంథారంభము చేయవలెనని పెద్దలు నిర్ణయించిరి.

భర్తృహరియు పాణినీయవ్యాకరణ మహాభాష్యమునకు వ్యాఖ్యానముగ "వాక్యపదీయ" మను ప్రకరణ గ్రంథమును వ్రాయదలచి పై నిర్ణయము ననుసరించి ముందుగా 43 శ్లోకములతో అనుబంధచతుష్టయమును జూపెను. 44వ శ్లోకముతో గ్రంథమునారంభించెను. 24, 25, 26(మూడు)శ్లోకములలో వ్యాకరణ శాస్త్రమునకు విషయముగా [1]ఎనిమిది పదార్థములను జూపెను. వానిలోనే ప్రయోజనముగూడ ఇమిడి యున్నది— 1. అర్థజ్ఞానము, 2. ధర్మము. ఈ రెంటిలో ధర్మము ముఖ్యప్రయోజనము. అది అంతతః (చివరకు) మోక్షరూపమే కాగా వ్యాకరణాధ్యయనమునకు మోక్షము ముఖ్య ప్రయోజనమని తెలినది. బ్రహ్మప్రాప్తియే మోక్షము కనుక ప్రాప్యమగు బ్రహ్మపదార్థము నిరూపింపవలసియున్నదని

---

1 శబ్దము 2 విధములు :	1. ప్రకృతి ప్రత్యయములు
	2. పదవాక్యములు,
అర్థము 2 విధములు :	1. ప్రకృతి ప్రత్యయార్థములు
	2. పదవాక్యార్థములు
శబ్దార్థములకు కల సంబంధము 2 విధములు :	1. కార్యకారణభావము
	2. యోగ్యత
ప్రయోజనము 2 విధములు :	1. అర్థజ్ఞానము
	2. ధర్మము
పదార్థములు	8

తలంచి భర్తృహరి నిర్గుణాద్వయబ్రహ్మస్వరూపమును ముందుగా చూపుచున్నాడు. ఈరీతిగా విషయప్రయోజనములు నిరూపింపగా వానినపేక్షించువాడు అధికారియని, విషయప్రయోజనములతో గ్రంథమునకు ప్రతిపాద్య ప్రతిపాదక భావము సంబంధమనియు చెప్పనక్కరలేకయే తెలియనగును.

అనాదినిధనం బ్రహ్మ శబ్దతత్త్వం యదక్షరమ్
వివర్తతేఽర్థభావేన ప్రక్రియా జగతో యతః. 1

అనాదినిధనమ్ = ఉత్పత్తి వినాశములులేనట్టియు; నశించనిదే, అక్షరమ్ = పరమార్థనిత్యమగునట్టియు, శబ్దతత్త్వమ్ = శబ్దస్వరూపమగు, యత్ = ఏ, బ్రహ్మ = బ్రహ్మము, అర్థభావేన = ఘటము, పటము మున్నగు అర్థములరూపమున, వి+వర్తతే = వివర్తమగుచున్నదో-అనగా తనస్వరూపమును విడనాడకుండ రూపాంతరమును భాసింపచున్నదో,

జగతః = జగముయొక్క, ప్రక్రియా = సృష్టిప్రక్రియ, యతః = దేనిచే కలుగుచున్నదో, అనగా ఏబ్రహ్మము లోకసృష్టికి కర్త యగుచున్నదో, తస్య = ఆ బ్రహ్మముయొక్క ప్రాప్త్యుపాయః = పొందుటకు ఉపాయము, వేదః = వేదము. ఈ శ్లోకార్థమునందు, రెండు, మూడు, నాలుగు శ్లోకముల అర్థములను ఐదవ శ్లోకార్థముతో సంబంధము చూపనగును.

తా. వృక్షము మున్నగువానికి ఉత్పత్తివినాశములు మనకు ప్రత్యక్షములగుచునే యున్నవి. ఆకాశము మున్నగునవి యుగప్రారంభమున పుట్టి ప్రళయమువరకు ఉండి నశించుచున్నవి. బ్రహ్మము అట్టిదికాదు. దానికి ఉత్పత్తివినాశములు లేవు, కావుననే అది పరమార్థనిత్యము. ఆ బ్రహ్మము జగద్రూపమున వివర్తమగుచున్నది. ఉదా॥ రజ్జుసర్పము. త్రాడు తనస్వరూపమును విడనాడకయే సర్పరూపమున భాసించుచున్నది. సర్పరూపము భ్రమవిషయమే. రజ్జుజ్ఞానము కలుగగా సర్పజ్ఞానము నశించును. లోకసృష్టికి బ్రహ్మము కర్తయగుచున్నది. బ్రహ్మమే వివర్తమునందు-లోకసృష్టికి మూలము. అనగా జగదుత్పత్తికి ఉపాదానకారణము బ్రహ్మము, సృష్టికి నిమిత్తకారణముకూడ బ్రహ్మమే అని తాత్పర్యము.

వి. ఈ శ్లోకమున 'యతః' అనునది పంచమ్యర్థమునందు గాదు. తృతీయార్థకము కావలెను. యతః = యేన. ఆద్యాదిగణపాఠమువలన తృతీయాంతమునందు తసి ప్రత్యయము ప్రవర్తించుటచే పైయర్థము లభించును.

అక్షరమనగా నశించనిది యని యర్థము. న+క్షరతి = అక్షరము. ఈ పదమునకు మరియొక అర్థముకూడ చెప్పనగును. అశ్నుతే (వ్యాప్నోతి) ఇతి అక్షరమ్. సందర్భమునుబట్టి అర్థమును వ్యాపించునది 'అక్షరమ్' అని గ్రహింపవలెను. అర్థమును వ్యాపించునది పదము లేదా వాక్యము. ఈరీతిని పదవాక్యములు అక్షరశబ్దముచే బోధింపబడుచున్నవి. పదవాక్యములు ఈ గ్రంథమునకు విషయములని అక్షర పదప్రయోగముచే ధ్వనితమగుచున్నది. పదవాక్యములలో వాక్యము ముఖ్యము కనుక వానికి పూర్వనిపాతముచేయగా వాక్యపదములకు సంబంధించిన గ్రంథము వాక్యపదీయము అని గ్రంథనామము కూడ ఈ పదముచే సూచితమగుచున్నది.

పర, పశ్యంతి, మధ్యమ, వైఖరి అనురీతిని వాక్కు నాలుగు విధములుగా నున్నది. వానిలో పరావాక్కు అద్వైతశాస్త్రసమ్మత మగు చేతననిర్గుణాద్వయబ్రహ్మరూపమే. దాని వివర్తములే పశ్యంతీ మధ్యమా వైఖరీ వాక్కులు. కాగా, పరావాగ్రూపమగు స్ఫోటశబ్దము

తా. = తాత్పర్యము. వి. = విశేషములు.

బ్రహ్మరూపమే అను వైయాకరణసిద్ధాంతము "శబ్దతత్త్వమ్" అను పదముచే భర్తృహరి వ్యక్తపరచుచున్నాడు.

శబ్దస్వరూప మగు బ్రహ్మమునందు ఏవిధ మగు భేదము లేదనియు, అపార్థము విచిత్రశక్తియోగమున విచిత్రరూపమున వివర్తమగుచున్న దనియు చెప్పుచున్నాడు.

ఏకమేవ యదామ్నాతం భిన్నం శక్తివ్యపాశ్రయాత్
అపృథక్త్వేఽపి శక్తిభ్యః పృథక్త్వేనేవ వర్తతే. 2

ఏకమ్ + ఏవ= ఒక్కటియేయనియు, అనగా నిజరూపమున భేదరహితమనియు శక్తివ్యపాశ్రయాత్=భిన్నములగు శక్తుల కాశ్రయమగుటవలన, భిన్నమ్=భిన్నముగా నున్నదనియు, అనగా భేదసహితమనియు, అమ్నాతమ్=ఉపనిషత్తులలో ననేకపర్యాయములు చెప్పబడినట్టి, యత్=ఏ శబ్దరూపమగు బ్రహ్మము, శక్తిభ్యః=తనయందున్న శక్తులకంటె, అపృథక్త్వే + అపి =అభిన్నముగా నున్నను, పృథక్త్వేన + ఇవ=భిన్నముగా నున్నటుల, వర్తతే=ఉన్నదో, అనగా వివర్తమగుచున్నదో, (తస్య, ప్రాప్త్యుపాయః, వేదః= దానిని పొందుట కుపాయము వేదము.)

తా. ఆ బ్రహ్మము నిజరూపమున ఒక్కటియే. దానియందు సజాతీయ విజాతీయ స్వగత భేదములు మూడును లేవు. ఈయర్థమును పరమప్రమాణములగు ఉపనిషత్తులు అనేక ప్రసంగములలో చూపియున్నవి. అట్టి బ్రహ్మమును సత్త్వరజస్తమోగుణాత్మకమగు అవిద్య అను నామాంతరము కల మాయ అను పదార్థము అనాదినుండి ఆశ్రయించి యున్నది. దానికి విలక్షణములగు శక్తులున్నవి. వానినిబట్టి అద్వితీయ మగు బ్రహ్మమునందు నానాత్వము కాన్పించును. ఈ యర్థమునుగూడ ఉపనిషత్తులు వ్యక్తపరచియున్నవి. బ్రహ్మము శక్తుల కంటె భిన్నము కాకపోయినను శక్తులు పరస్పరభిన్నములగుటచే వానివలన భిన్నముగా నున్నట్లు గోచరించును.

వి. మాయాశక్తిసహితమగు బ్రహ్మమే జగముల సృష్టి స్థితి సంహారములకు కారణము. అదియే సగుణము. నిర్గుణబ్రహ్మము కారణము కానేరదు. నిర్గుణబ్రహ్మభావము మోక్షము.

బ్రహ్మముయొక్క కాలశక్తినిబట్టియు భేదము గోచరించు నని చెప్పుచున్నాడు.

అధ్యాహితకలాం యస్య కాలశక్తి ముపాశ్రితాః
జన్మాదయో వికారాః షడ్ భావభేదస్య యోనయః. 3

యస్య=ఏశబ్దబ్రహ్మముయొక్క, అధ్యాహితకలామ్=ఆరోపింపబడిన భేదము కలిగినట్టి కాలశక్తిమ్=కాలమనెడి శక్తిని, ఉపాశ్రితాః=ఆశ్రయించినట్టి, జన్మాదయః= జన్మము మున్నగు, షట్=ఆరు, వికారాః=వివర్తములు, భావభేదస్య=బ్రహ్మముయొక్క నానాత్వమునకు, యోనయః=కారణములో, (తస్య, ప్రాప్త్యుపాయః, వేదః=అట్టి బ్రహ్మమును బొందుట కుపాయము వేదము.)

తా. బ్రహ్మమునందు కాలమనెడి శక్తియున్నది. దాని నిజరూపము క్షణము. అట్టి క్షణములను లెక్కించుటచే లవము, పలము, ముహూర్తము, గడియ, పగలు, రాత్రి దినము, వారము, మాసము, ఋతువు, అయనము మున్నగు కాలభేదములు కలుగుచున్నవి. ఈ కాలశక్తి పరమాత్మయందారోపితమగుటచే ఆత్మ పుట్టుట, ఉండుట, పరిణమించుట, వర్ధిల్లుట క్షీణించుట, నశించుట అనురీతిని ఆరువిధములుగా వివర్తమగుచున్నది. క్రమరహిత మగు

బ్రహ్మవివర్తమునకు కాలశక్తి నిబట్టియే పై క్రమము ఏర్పడుచున్నది. కనుకనే ప్రపంచక మునకు పుట్టుక మున్నగు వికారములు క్రమముగానే కలుగుచున్నవి. కాలము మాయయొక్క పరిణామము.

వి. ఇచట భావశబ్దము సత్తారూపపరబ్రహ్మవాచకము, వికారశబ్దము వివర్త పరము. ఈయభిప్రాయమును తృతీయకాండము జాతిసముద్దేశమున తెలిప శ్లోకముచే భర్తృ హరి స్పష్టపరచియున్నాడు.

బ్రహ్మము అవిద్యావశమున నానారూపముగ వివర్తమగునని, ఆ వివర్తము జన్మాది షట్కరూపమనియు చూపబడినది. ఇపుడు జీవుడు, భోక్త, భోగ్యము, అనుభవము అనెడి సుప్రసిద్ధమగు లోకవ్యవహారము కూడ బ్రహ్మముయొక్క వివర్తమే యని చెప్పు చున్నాడు.

ఏకస్య సర్వబీజస్య యస్య చేయ మనేకధా
భోక్తృభోక్తవ్యరూపేణ భోగరూపేణ చ స్థితిః. 4

ఏకస్య + చ = అద్వితీయమైనను, సర్వబీజస్య = సర్వప్రపంచకమునకు కారణ మగునట్టి, యస్య = ఏ బ్రహ్మముయొక్క, భోక్తృభోక్తవ్యరూపేణ = జీవరూపమున, అనుభ వింపబడేవిషయము రూపముననను, భోగరూపేణ + చ = సుఖదుఃఖానుభవరూపమునను, అనే కధా = పై ప్రకారముగా అనేకవిధములుగా, ఇయమ్ = ప్రత్యక్షముగా కానవచ్చుచున్న, స్థితిః = ఉనికి, అనగా వివర్తరూపమగు ఉనికి కలదో, (తస్య, ప్రాప్త్యుపాయః, వేదః = అట్టి బ్రహ్మము యొక్క ప్రాప్తికి ఉపాయము వేదము.)

తా. అవిద్యయందు కలిగెడి బ్రహ్మముయొక్క ప్రతిబింబము జీవుడు. అతడు చేతనుడు కనుక భోక్తయగుచున్నాడు బ్రహ్మవివర్తమగు విషయజాతము జడము కనుక భోగ్య మగుచున్నది. సుఖదుఃఖములుకూడ జడములే, కాని చిత్తునందలి ప్రతిబింబవశమున నవి అనుభవములుగా వ్యవహరించబడుచున్నవి. అట్టి సుఖదుఃఖానుభవము భోగము అనబడును. కాగా అవిద్యావశమున బ్రహ్మము జీవరూపమునను విషయరూపమునను అనుభవరూపమునను కాన్పించుచున్నది. ఈ స్థితియంతయు బ్రహ్మవివర్తమే.

వి. లోకమున ప్రతిపదార్థమునకును ఏదో ఒక నియత మగు కారణ ముండును. ఉదా. ఘటమునకు మట్టి, వస్త్రమునకు దారములు, సువర్ణకంకణమునకు బంగారము కారణ మగుచున్నది. మట్టివలన వస్త్రాదికార్యములు కలుగనేరవు. బ్రహ్మము ఎల్లవస్తువులకు కార ణము కాగలదు. జగత్తు బ్రహ్మముకంటె వేరుగ లేదు. కారణముకంటె కార్యము వేరుగా ఉండనేరదు. కనుక 'సర్వబీజస్య' అనుట సమంజసమే.

ఈరీతిగా నాల్గు శ్లోకములచే ప్రాప్యమగు బ్రహ్మముయొక్క స్వరూపమును జూపి దానిని పొందుట కుపాయమును జూపుచున్నాడు.

ప్రాప్త్యుపాయోఽనుకారశ్చ తస్య వేదో మహర్షిభిః
ఏకోఽప్యనేకవర్త్మేవ సమామ్నాతః పృథక్పృథక్. 5

తస్య = దానియొక్క — అనగా పై నాల్గు శ్లోకములచే చెప్పబడిన శబ్దబ్రహ్మము యొక్క, ప్రాప్త్యుపాయః = పొందుటకుపాయము, వేదః = వేదము, అనుకారః + చ = ఆ బ్రహ్మము యొక్క ప్రతిబింబముకూడ వేదము.

ఏకః = అట్టివేదము ఒక్కటియే ఐనను, మహర్షిభిః = మహర్షులచే, అనేకవర్త్మా + ఇవ = అనేకములగు మార్గములు కలదివలె, పృథక్పృథక్ = వేరువేరుగ, సమామ్నాతః = అభ్యసింపబడుచున్నది.

తా. వ్యాకరణాధ్యయనమునకు పరమప్రయోజనము మోక్షము. మోక్ష మనగా బ్రహ్మప్రాప్తియే. ప్రాప్యమగు బ్రహ్మమును పై నాల్గు శ్లోకములచే చూపియున్నాడు. అట్టి బ్రహ్మమును పొందుటకు ఉపాయము వేదము, మరియొక ఉపాయము లేదు. బ్రహ్మప్రాప్తి యనగా బ్రహ్మభావము, అదియే మోక్షము. ఆవేదము బ్రహ్మముయొక్క ప్రతిబింబమువంటిది

వేదము ఒక్కటియే, కాని దాని నభ్యసించెడి మనుష్యులకు కలియుగమున ఆయుష్యము, శక్తియు తగ్గియుండుటచే వారు వేదమును సంపూర్ణముగా చదువుట కవకాశము చాలకున్నదని భావించి మహర్షులు దానిని సులభముగా నభ్యసింపజేయుటకై ఋక్, సామ, యజుస్, అథర్వ అనురీతిని, సంహిత, పదము, క్రమము, శిఖ, మాల, జట, ఘన అను రీతిని అనేకమార్గములను వేరువేరుగా జూపియున్నారు.

వి. కార్యమును సాధించుటకై గ్రహింపబడి, అది సిద్ధించిన తరువాత విడువ తగినది ఉపాయ మనబడును. 'ఉపాదాయ హేయః = ఉపాయః' అనురీతిని ఉపాయశబ్దము నకు వ్యుత్పత్తి* చెప్పనగును. 'ఉపాదాయ హేయః' అనుచోట 'దాయహే' అను భాగమునకు పృషోదరాదిగణపాతముచే లోపము కలుగగా పైరూపము ఏర్పడును.

బ్రహ్మము సర్వజ్ఞము, వేదముకూడ అట్టిదే. అందుచే నది బ్రహ్మముయొక్క ప్రతిబింబము కానగును. అనుకార మనగా అనుకృతి, అనుకరణము. కాగా ప్రతిబింబ మని యాశయము.

బ్రహ్మప్రాప్తికి వేద ముపాయమని ఐదవశ్లోకమున జూపియున్నాడు. అట్టి వేదము యొక్క స్వరూపమును దాని మాహాత్మ్యమును వ్యక్తపరచుచున్నాడు.

భేదానాం బహుమార్గత్వం కర్మ ణ్యేకత్ర చాఙ్గతా
శబ్దానాం యతశక్తిత్వం తస్య శాఖాసు దృశ్యతే. 6

తస్య = ఆ వేదముయొక్క, భేదానామ్ = భేదములకు అనగా ఋక్ సామ యజుస్ అథర్వ అను నాలుగు భేదములకు, బహుమార్గత్వమ్ = ఒక్కొక్కవేదభేదమునకు శాఖా బాహుల్యముచే బహుమార్గములు కలిగియుండుట, ఏకత్ర = ఒకే, కర్మణి = యాగాదికర్మము నందు, అఙ్గత్వమ్ = అంగత్వము- అవయవముగా నుండుట- అప్రధానముగా నుండుట అని భావము, శాఖాసు = వేదశాఖలయందున్నట్టి, శబ్దానామ్ = శబ్దములకు, యతశక్తిత్వం + చ = (నియతమగు కార్యమును కలిగించుటచే) నిశ్చితమగు శక్తి కలిగియుండుటయు, దృశ్యతే = చూడబడుచున్నది.

---

* "ఉపాదాయాపి యే హేయా స్తానుపాయాన్ ప్రచక్షతే" (2 కాండ. 38) అని భర్తృహరి వివరించియున్నాడు. "తవ్యత్తవ్యానీయరః" 3–1–96 అను పాణినిసూత్ర మున నాగేశపండితుడు "ఉపాదాయాపి యే హేయా ఇతి ఉపాయశబ్దవ్యుత్పత్తిః; 'పృషోదరాదిత్వా త్సాధుః" అని (భాష్యప్రదీపోద్ద్యోతమున) వ్రాసియున్నాడు. "పృషోదరాదీని యథోపదిష్టమ్" (6. 3. 109)

తా. ఒకే వేదమును నాలుగు భాగములుగా విభజించిరి. వానిలో ఋగ్వేదము నకు 21, యజుర్వేదమునకు 101, సామవేదమునకు 1000, అథర్వవేదమునకు 9 శాఖలు కలవు. ఇదియే శాఖలకు బహుమార్గత్వము.

ఒకే యాగము అనేకశాఖలలో చెప్పబడియుండవచ్చును. అంతమాత్రమున ఆ యాగము భిన్నభిన్నయాగములుగా పరిగణింపబడదు. ఒకే యాగముగా గుర్తింపబడును. దేవత నుద్దేశించి మంత్రములను చదువుచు నెయ్యి మున్నగువస్తువులను అగ్నిలో హోమము చేయుట యాగము. ఇందు హోమముచేయుట ప్రధానము. దానికి మంత్రములు, దేవతలు, వస్తువులుకూడ అంగములుగా నుండును. యాగక్రియకు మంత్రము మున్నగునవి ఉపకార కములని భావము. వేరువేరుశాఖలలో నున్న మంత్రములు ఒకేయాగమునకు ఉపకారము చేయుట ఇచట "అజ్గత్వమ్" అను పదముచే వివక్షితమగుచున్నది.

ఇట్లే ఒకేశబ్దము భిన్నభిన్నశాఖలలో నుండవచ్చును. కాని శాఖాభేదముచే స్వర దీర్ఘాదులు భిన్నములు కావచ్చును. అట్టితరి ఆ శబ్దము ఏస్వరములో ఏశాఖలోనున్నదో, ఆ స్వరముకలిగినశబ్దమే ఆశాఖలోనే యాగాదిక్రియలకు ఉపయోగించును. దానినిబట్టి శబ్దము ఫలజనక మగును.

స్మృతులు వేదమూలకములు. ఈ కారణముచేగూడ వేదము బహుమార్గత్వము సుస్పష్టమగుచున్నదని బోధించుచున్నాడు.

స్మృతయో బహురూపాశ్చ దృష్టాదృష్టప్రయోజనాః
తమేవాశ్రిత్య లిజ్గేభ్యో వేదవిద్భిః ప్రకల్పితాః. 7

వేదవిద్భిః = వేదవేత్తలచే అనగా అతీంద్రియదృష్టిచే వేదార్థమును గుర్తించిన మహర్షు లచే, బహురూపాః = పలువిధములగునట్టియు, దృష్టాదృష్టప్రయోజనాః = ప్రత్యక్షముగా కాన్పించెడి ఫలము, ప్రత్యక్షముగా కాన్పించని ఫలము, ఉభయవిధములగు ఫలములు కలిగినట్టియు, స్మృతయః + చ = స్మృతులుకూడ, తమ్ + ఏవ = ఆ వేదమునే, ఆశ్రిత్య = ఆశ్రయించి, లిజ్గేభ్యః = ఆయా అర్థములను బోధించెడి మంత్రములవలన, ప్రకల్పితాః = రచింపబడినవి.

తా. మహర్షులు అతీంద్రియదృష్టిచే వేదార్థమును ప్రత్యక్షముగా గ్రహించి ప్రజాక్షేమమును కోరి వేదార్థప్రకాశకములగు స్మృతులను రచించిరి. వానికి వేదార్థ మునుబట్టియే ప్రామాణ్యము లభించును. ఈ యంశమును 133 వ శ్లోకము మొదలు 10 శ్లోకము లచే భర్తృహరి వివరింపనున్నాడు.

ఆ స్మృతులు పలువిధములుగా నున్నవి. కొన్నిటికి ప్రత్యక్షశ్రుతి మూలముగా కానవచ్చును. కొన్నిటికి శిష్టాచారము మూలముగా నున్నది.

స్మృతులు మనకు ప్రత్యక్షముగా కానవచ్చు ప్రయోజనములను, పరోక్షముగా కానరాక కాలాంతరమున-అనగా జన్మాంతరమున, లోకాంతరమున కలిగెడు ప్రయోజనములను- ఉభయవిధములగు ప్రయోజనములను బోధించుచున్నవి.

దర్శనభేదములుకూడ వేదమువలననే కలుగుచున్నవని చెప్పుచున్నాడు.

తస్యాఽర్థవాదరూపాణి నిశ్రితాః స్వవికల్పజాః
ఏకత్వినాం ద్వైతినాం చ ప్రవాదా బహుధా మతాః. 8

తస్య = ఆ వేదముయొక్క, అర్థవాదరూపాణి = అర్థవాదరూపమగు వాక్యములను-వానితో సమానములగు వాక్యములను, నిశ్రితాః = అత్యంతము ఆశ్రయించినట్టియు, స్వవికల్పజాః = వారివారి బుద్ధిభేదముచే కలిగెడి, ఏకత్వినామ్ = అద్వైతవాదులయొక్క, ద్వైతినాం + చ = భేదవాదులయొక్కయు, ప్రవాదాః = ప్రభిన్నములగు వాదములు, బహుధా = బహుప్రకారములుగా, మతాః = అభిమతములగుచున్నవి. భిన్నములగు దర్శనములుకూడ వేదమువలననే కలుగుచున్నవని భావము.

తా. చార్వాకము, బౌద్ధము, జైనము, ఆర్హతము, దిగంబరము, వైశేషికము, న్యాయము, సాంఖ్యము, యోగము, పూర్వమీమాంస, ఉత్తరమీమాంస మున్నగు దర్శనములు వేదమును మూలముగా గైకొనియే నిర్మితము లగుచున్నవి.

ఈ దర్శనములు వేదమునందున్న అర్థవాదవాక్యములను తత్సజాతీయవాక్యములను మూలముగా జేసుకొని నిర్మింపబడినవి. చార్వాకాదులుకూడ తమమతముల వేదవాక్యముల నుదాహరింతురు.

దర్శనకర్తలు వారికి తట్టినభావముల కనుగుణముగా ఏదో ఒక వేదైకదేశవాక్యమును జూపి నిజమున ఆ వాక్యమునకు ఆ యర్థము లేకున్నను వారనుకొన్న అర్థమును జూపుదురు. కనుకనే భిన్నాభిప్రాయములతో ఇట్టి యనేకశాస్త్రములు వ్రాయుట కవకాశము కలిగినది .

వి. యుక్తాయుక్తవిచార మెట్లున్నను ఎవరికి వారే తాము చూపిన భావమే సత్యమనియు ఇతరులభావము లసత్యమనియు పట్టుదలతో దర్శనములను వ్యక్తపరచియున్నారు.

ఇచట నిశ్చిత్య, నిశ్చితాః, నిశ్రితాః అనురీతిని పాఠత్రయము కానవచ్చుచున్నది. కాని 'నిశ్రితాః' అనునదియే ప్రామాణికము. ఈ యభిప్రాయమును రఘునాథశర్మ తన *అంబాకర్త్రి అను వ్యాఖ్యయందు స్పష్టపరచియున్నాడు. కాబట్టి పాఠకమహాశయులు 'నిశ్రితాః' అను పాఠమును గ్రహింతురుగాక.

పైయిచూపబడిన దర్శనభేదములు పట్టుదలతో మనుష్యులు వ్రాసియుండుటచేతను, అవి పరస్పరవిరుద్ధములగుటచేతను, వారు చూపెడి శ్రుతుల కర్థాంతరము చెప్పుట కవకాశముండుటచేతను అసత్యములే కావలెను. అట్టితరి సత్యమగు పదార్థ మెద్ది ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

> సత్యా విశుద్ధి స్తత్రోక్తా విద్యై వైకపదాగమా
> యుక్తా ప్రణవరూపేణ సర్వవాదావిరోధినీ. 9

తత్ర = ఆ వేదమునందు, విశుద్ధిః = విశిష్టమైన పరిశుభ్రతకలిగినట్టియు, సత్యా = పరమార్థసత్యమగునట్టియు, ఏకపదాగమా = ఒకేవిషయమున సమన్వయము కలిగినట్టియు, సర్వవాదావిరోధినీ = అన్నివాదములతోను విరోధము లేనట్టియు, ప్రణవరూపేణ = ఓంకారముతో, యుక్తా = కూడుకొన్నట్టి, విద్యా + ఏవ = జ్ఞానరూపమగు బ్రహ్మమే, ఉక్తా = చెప్పబడినది. కనుక అదియే సత్యపదార్థమని భావము.

---

*"అత్ర నిశ్చితాః, నిశ్చిత్య, నిశ్రితాః ఇతి పాఠత్రయం వర్తతే.తత్రేద మవధేయమ్‌— నిశ్చిత్య ఇతిపాఠో నిశ్చితా ఇత్యస్య స్థానే కేనచి త్కల్పిత ఇత్యప్రామాణికః, నిశ్చితా ఇతి పాఠస్తు అనన్వితార్థకత్వే నాప్రామాణిక ఇతి నిశ్రితా ఇతి పాఠ ఏవ యుక్తః."

తా. వేదార్థము పలువురు పలువిధములుగా జూపిరి. వారు ప్రవర్తించిన భావములు వేదతాత్పర్యవిషయములుకావు, అనగా అవి వేదముయొక్క సరియగు అర్థములు కానేరవు. వేదవాక్యము లన్నిటికి సాక్షాత్తుగాగాని పరంపరగాగాని జ్ఞానరూపమగు నిర్గుణాద్వయబ్రహ్మమునందే ముఖ్యతాత్పర్యము. అట్టిబ్రహ్మమే పరమార్థ సత్యము.

వి. అద్వైతవేదాంతము అట్టిబ్రహ్మమును బోధించుచున్నది. అది ఎల్లదర్శనములందలి సిద్ధాంతములను సోపానక్రమమున తనకనుగుణములనియే భావించినది. ఇతరదర్శనము లట్లు చేయలేవు. అవి ఇతరమతములయందు ద్వేషమును, తమ మతమునందు అభినివేశమును చూపి వ్రాయబడినవి. అద్వైతదర్శన మట్టిది కాదు. అది నాస్తికదర్శనములనుగూడ శ్లాఘించును.

దర్శనప్రవాదములేకాక శిక్షాదిషడంగములు, పురాణము మున్నగు ఉపాంగములుగూడ వేదార్థపరిజ్ఞానార్థమై వేదవేత్తలచే నిర్మింపబడినవి అని చెప్పుచున్నాడు.

విధాతు స్తస్య లోకానా మఙ్గోపాఙ్గనిబన్ధనాః
విద్యాభేదాః ప్రతాయన్తే జ్ఞానసంస్కారహేతవః. 10

లోకానామ్ = లోకములను, విధాతుః = సృష్టికర్త యగు, తస్య = ఆవేదమునకు సంబంధించినట్టియు, అఙ్గోపాఙ్గ నిబన్ధనాః = అంగరూపములుగాను ఉపాంగరూపములుగాను ఉన్నట్టియు, జ్ఞానసంస్కారహేతవః = ఆత్మతత్త్వజ్ఞానమునకు పుణ్యసంస్కారమునకును కారణములైనట్టి, విద్యాభేదాః = శిక్ష, వ్యాకరణము మున్నగు విద్యాభేదములు, ప్రతాయన్తే = విస్తరింపబడుచున్నవి.

తా. చతుర్ముఖుడు వేదమును ఆధారముగా జేసుకొని లోకములను సృష్టించెను, కనుక లోకసృష్టికి వేదము మూలము. అట్టి వేదముయొక్క అర్థమును పూర్తిగా నిర్ణయించుటకై శిక్ష మున్నగు అంగవిద్యలు, పురాణము మొదలగు ఉపాంగవిద్యలు ఉద్భవించినవి. వానిని ఋషులు విస్తరింపజేసిరి.

వి. శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అను ఆరును వేదమునకు అంగములు. ఇవి షడంగము లనబడును. పురాణము, న్యాయము, మీమాంస, ధర్మశాస్త్రము అనునవి ఉపాంగము లనబడుచున్నవి. ఇవి యన్నియు 'విద్యాభేదాః' అను పదముచే గ్రహింపబడుచున్నవి.

మరియు వేదాంగములనుండి శకునజ్ఞానము మున్నగునదియు, ఉపాంగములనుండి స్వప్నవిపాకాది జ్ఞానము మున్నగునవియు వెలువడుచున్నవి. ఏ స్వప్నము మంచిదో, ఏది చెడ్డదో చెప్పు శాస్త్రమును స్వప్నవిపాక మని వ్యవహరింతురు. ఇట్లే దర్శనవిభాగములు కూడ కలుగుచున్నవి.

మీమాంస మున్నగునవి ఆత్మతత్త్వజ్ఞానమునకు, ధర్మశాస్త్రము ధర్మమనే సంస్కారమునకును ఉపయోగపడును.

'భేదానాం బహుమార్గత్వమ్'అను శ్లోకముమొదలుకొని 'విధాతు స్తస్య లోకానామ్' అను శ్లోకమువరకు ఐదు శ్లోకములచే బ్రహ్మమును పొందుట కుపాయమగు వేదమును ప్రశంసించి, అట్టి వేదమునకు ప్రధానాంగమగు వ్యాకరణమును, చదువుకొనువారికి ప్రోత్సాహము కలిగించుటకై, మూడు శ్లోకములచే ప్రశంసించుచున్నాడు.

ఆసన్నం బ్రహ్మణ స్తస్య తపసా ముత్తమం తపః
ప్రథమం ఛన్దసా మఙ్గం ప్రాహు ర్వ్యాకరణం బుధాః. 11

బుధాః = జ్ఞానులగు మహర్షులు, వ్యాకరణమ్ = వ్యాకరణమును, బ్రహ్మణః = బ్రహ్మరూపము, బ్రహ్మను పొందుటకు కారణముకూడ అగునట్టి, తస్య = ఆవేదమునకు, ఆసన్నమ్ = సమీపముగానున్నదనియు, తపసామ్ = తపస్సులలో, ఉత్తమమ్ = శ్రేష్ఠమగు, తపః = తపమనియు, ఛన్దసామ్ = వేదములకు, ప్రథమమ్ = మొదటిదియగు, అఙ్గమ్ = అంగమనియు, ప్రాహుః = చెప్పుచున్నారు.

తా. మహాభాష్యకారుడు వ్యాకరణాధ్యయనమునకు 1. వేదములను రక్షించుట, 2. ఊహ అనగా వేదములో అవసరమగునపుడు ఒక పదమును తీసివేసి దానికి బదులుగా మరియొకపదము నుపయోగించుట, 3. ఆగమము, 4. లాఘవము, 5. అసందేహము అనురీతిని ఐదు ప్రయోజనములను జూపెను. వానిలో వేదరక్షణము, ఊహ, ఆగమము అను మూడు ప్రయోజనములను భర్తృహరి ఈశ్లోకముచే వివరించుచున్నాడు. ఆ మూడింటిలోను 1–2 ప్రయోజనములనియు మూడవది వ్యాకరణము చదువవలె ననుటలో ప్రమాణముగా నున్నదనియు గుర్తించవలెను.

వి. ఈశ్లోకమున 'ఆసన్నంబ్రహ్మణః' అనుభాగము వేదరక్షణ, ఊహ అను 2 ప్రయోజనములను, 'తపసా ముత్తమం తపః' అనుభాగము ఆగమరూప ప్రమాణమును జూపుచున్నవి.

వ్యాకరణము వేదమునకు చాల సన్నిహితముగా నున్నది. వేదమునందు శబ్దములు లోకమునందున్న శబ్దములవలెను, వానికంటె విలక్షములుగాను కాన్పించుచున్నవి. లౌకిక వాఙ్మయమునందు కానవచ్చుచున్న శబ్దములకంటె భిన్నరూపమున కొన్ని కానవచ్చు చున్నవి. ఆ రూపభేదము వ్యాకరణమువలననే తెలియబడును. అట్లు కాకున్న ఆ శబ్దమునకు అర్థము తెలియరాదు.

లౌకికపదము	అర్థము	వైదికపదము
గృహ్ణామి	గ్రహించుచున్నాను	గృభ్ణామి
సంజహార	సంహరించెను	సంజభార
	ఉపసంహరించెను	
దధార	ధరించెను	దాధార
హన్తి	చంపుచున్నాడు	హనతి
దుగ్ధే	పితుకుచున్నాడు	దుహ్రే
కర్ణైః	చెవులచే	కర్ణేభిః

ఇట్టి రూపపరిణామములు వ్యాకరణముచేతనే తెలియబడును. ఈరీతిగా వ్యాకరణము రక్షణముచేయుటచే వేదమునకు అతిసన్నిహిత మగుచున్నది.

ప్రాతఃకాలమున హోమముచేయుట సూర్యదేవత నుద్దేశించి జరుగును. ఆ మంత్రమున "సూర్యాయ" అని యున్నది. సాయంకాలమున ఆహోమము అగ్నిదేవత నుద్దేశించి చేయవలెను, కాని మంత్రమున 'అగ్నయే' అని లేదు. 'సూర్యాయ' అను పదమునకు బదులుగా అగ్నయే' అను పదమును మంత్రమున చేర్చి సాయంకాలమున హోమము చేయవలెను. పద

మును మార్చవలెనన్న వ్యాకరణముచే నా పదము తెలియవలయును. వ్యాకరణము లేనిచో పద స్వరూపము నిశ్చితము కానేరదు. ఈ రీతిగా వ్యాకరణము వేదమునకు సన్నిహితమగుచున్నది.

బ్రహ్మచర్యము, అధ్యయనము మున్నగు తపములు చాల కలవు. వానికి ప్రత్యక్ష ప్రయోజనము లేదు. జన్మాంతరమున, లోకాంతరమున వానికి ప్రయోజనము కలుగును. వానిని అదృష్టఫల మందురు. అట్టి తపములకంటె వ్యాకరణము శ్రేష్ఠమగు తపము. దీనికి శబ్ద సాధుత్వము, అర్థజ్ఞానము అనెడి దృష్టప్రయోజనములు, ధర్మమనే అదృష్టప్రయోజనముకూడ ఉన్నవి. వ్యాకరణము తప్పక చదువవలెనని వేదము[1] చెప్పుచున్నది. ప్రయోజనము నపేక్షింపక షడంగసహితమగు వేదాధ్యయనమును వేదము విధించుచున్నది. షడంగములలో వ్యాకరణము [2] ప్రధానమైనది. ఈ యభిప్రాయమును 'తపసా ముత్తమం తపః' 'ప్రథమం ఛన్దసా మఙ్గమ్' అను కారికాభాగము చూపుచున్నది.

మహాభాష్యకారుడు చూపిన [3]లాఘవ మనెడి నాల్గవ ప్రయోజనమును జూపుచున్నాడు.

ప్రాప్తరూపవిభాగాయా యో వాచః పరమో రసః

యత్త త్పుణ్యతమం జ్యోతి స్తస్య మార్గోఽయ మాఞ్జసః. 12

యః = ఏ సాధుశబ్దసముదాయము, ప్రాప్తరూపవిభాగాయాః = పొందబడిన రూపభేదము కల — అనగా వర్ణపదవాక్యరూపమున విభక్తమైన, వాచః = వాక్కునకు, పరమః = ఉత్కృష్టమగు, రసః = సారమో,

మరియు, తత్ = ప్రసిద్ధమగు, యత్ = ఏ సాధుశబ్ద సముదాయమో, పుణ్యతమమ్ = మిక్కిలి పుణ్యమగు, జ్యోతిః = తేజమో,

తస్య = అట్టి సాధుశబ్ద సముదాయమునకు అనగా — దానిని తెలిసికొనుటకు, అయమ్ = ఈ వ్యాకరణము, ఆఞ్జసః = సరళము, ఋజురూపము అగు, మార్గః = మార్గము— అనగా ఉపాయము.

తా. సాధుశబ్దములు అసాధుశబ్దములు కూడ లోకమున వాడుకలో నున్నవి. వానిలో సాధుశబ్దసముదాయము పవిత్రమగు వాక్కుయొక్క సారము. అసాధుశబ్ద సముదాయము కంకిపంటిది.

సాధుశబ్దసముదాయమును సులభముగా తెలుసుకొనుటకు వ్యాకరణము సరళము, లఘువుకూడ అగు మార్గము. అదితప్ప అట్టిది మరియొక మార్గము లేదు.

---

1. "నిష్కారణో ధర్మః షడఙ్గో వేదోఽధ్యేయో జ్ఞేయశ్చ" అనువేదము మహాభాష్య కారుడు చూపెను.

2. "ప్రధానంచ షడఙ్గేషు వ్యాకరణమ్, ప్రధానే చ కృతో యత్నః ఫలవాన్ భవతి" అని భాష్యకారుడు పలికెను.

3. "లఘ్వర్థంచ అధ్యేయం వ్యాకరణమ్. న చాన్తరేణ వ్యాకరణం లఘునోపాయేన శబ్దాః శక్యా విజ్ఞాతుమ్."

—పస్పశాహ్నికము, మహాభాష్యము.

మహాభాష్యకారుడు చూపిన, అసందేహము[1] అనగా సందేహములేకుండ నిశ్చితార్థబోధ కలుగుట అను ఐదవ వ్యాకరణ ప్రయోజనమును జూపుచున్నాడు.

అర్థప్రవృత్తితత్త్వానాం శబ్దా ఏవ నిబన్ధనమ్
తత్త్వావబోధః శబ్దానాం నాస్తి వ్యాకరణా దృతే. 13

అర్థప్రవృత్తితత్త్వానామ్ = అర్థముయొక్క వ్యవహారమునకు కారణములగు వస్తువులకు-అనగా ఘటము, పటము, స్వర్గము, నరకము మున్నగుపదార్థములకు సంబంధించిన వక్తయొక్క సంకల్పమూలమున కలిగెడి వస్తువులకు, శబ్దాః + ఏవ = శబ్దములే, నిబన్ధనమ్ = కారణము.

శబ్దానామ్ = శబ్దములయొక్క, తత్త్వావబోధః = స్వరూపజ్ఞానము, వ్యాకరణాత్ + ఋతే = వ్యాకరణము వినాగా, నాస్తి = కలుగదు.

తా. పదార్థములు రెండురూపములు కలిగియున్నవి. 1. బాహ్యప్రపంచమున దృశ్యముగా నున్నది యొకటి. 2. వక్తయొక్క సంకల్పములో నున్నది రెండవది. స్వర్గము నరకము, మోక్షము మున్నగునవి మనకు ప్రత్యక్షము కాకపోయినను వానికి సంబధించిన వ్యవహారము మనము చేయుచునేయున్నాము. అవి వక్తయొక్క బుద్ధిలో భాసించునవే. అట్టి పదార్థములను బోధించుటకు శబ్దములు కారణములగుచున్నవి.

నిజరూపము, దానికి కావలసిన పుష్టియు ప్రతిపదార్థమునకు ఆవశ్యకము. అందు ఏదేని లేకుండుట వైకల్యము. శబ్దమునకు వైకల్యము లేకుండ అర్థమును బోధించెడి రూపము, పుష్టియు వ్యాకరణమువలన కలుగుచున్నది. వ్యాకరణమే లేనిచో శబ్దముల తత్త్వము జ్ఞాతము కానేరదు. అట్టితరి అసందిగ్ధమగు అర్థమును గుర్తించలేము.

మహాభాష్యకారుడు చూపిన మోక్ష[2] మనెడి వ్యాకరణ ప్రయోజనమును వివరించుచున్నాడు.

తద్ ద్వార మపవర్గస్య వాఙ్మలానాం చికిత్సితమ్
పవిత్రం సర్వవిద్యానా మధివిద్యం ప్రకాశతే. 14

తద్ = ఆ వ్యాకరణము, అపవర్గస్య = మోక్షమునకు, ద్వారమ్ = ద్వారము-అనగా ఉపాయము, మరియు, వాఙ్మలానామ్ = వాక్కులకుగల మాలిన్యములకు, చికిత్సితమ్ = చికిత్సాహేతువు-అనగా ఆదోషములను బోగొట్టునది. మరియు, సర్వవిద్యానామ్ = ఎల్లవిద్యలకు, పవిత్రమ్ = పవిత్రతను కలిగించునది, మరియు, అధివిద్యమ్ = ఎల్లవిద్యల యందు, ప్రకాశతే = ప్రకాశించునది.

తా. మనుష్యుడు వ్యాకరణసహాయమున సాధుశబ్దములలోనున్న ప్రకృతి ప్రత్యయములను, వానికి కలిగెడి కార్యవిశేషములను వర్ణముల స్థానప్రయత్నములను గుర్తించి యట్టి

1. 'అసందేహార్థం చ అధ్యేయం వ్యాకరణమ్' మహాభాష్యము-పస్పశాహ్నికము.

2. 'ఏకః శబ్దః సమ్యగ్ జ్ఞాతః సుష్ఠు ప్రయుక్తః స్వర్గే లోకే కామధుగ్ భవతి' అను శ్రుతి నుదాహరించి, 'ఏకః పూర్వపరయోః' 6-1-84 అను సూత్రమున వ్యాఖ్యానించెను-పస్పశాహ్నికమున 'మహతా దేవేన నః సామ్యం యథా స్యాత్' అనియు పలికెను. ఈ యాశయమును ప్రథమకాండముననే 131 వ శ్లోకముచే భర్తృహరి వివరించియున్నాడు.

సాధుశబ్దములను యథాశాస్త్రముగ ప్రయోగించిన ధర్మవిశేషము అతనికి కలిగి దానివలన పాపములు క్షీణించగా చిత్తశుద్ధి కలుగును. దానిమూలమున మోక్షమాతనికి లభించును.

ఆయుర్వేదము శరీరమునందున్న మాలిన్యములను, యోగశాస్త్రము మానసిక మాలిన్యములను బోగొట్టును. అట్లే వ్యాకరణశాస్త్రము వాక్కులలో నున్న అపశబ్దము అనెడి మాలిన్యములను బోగొట్టును. వ్యాకరణజ్ఞుడు ప్రత్యవాయమునకు కారణమగు అపశబ్దములను ప్రయోగించడు.

వి. సాధుత్వము వ్యాకరణాధీనము, సర్వవిద్యలయొక్క అర్థము సాధుశబ్దాధీనము, కనుక వ్యాకరణము బహుపవిత్రమైనది.

ప్రతిశాస్త్రమున వ్యాకరణ మాదరింపబడుచున్నది. కానిచో శాస్త్రములందలి నప శబ్దమును ప్రయోగించిన, దానివలన (అపశబ్దప్రయోగమువలన) ప్రత్యవాయభాక్ అజ్ఞుడు కావలెను.

వ్యాకరణాధ్యయనమునకు లౌకిక శబ్దముల సాధుత్వజ్ఞానము కూడ ప్రయోజనము. దానిమూలమున మోక్షముకూడ లభించునని చెప్పుచున్నాడు.

యథాఽర్థజాతయ స్సర్వాః శబ్దాకృతినిబన్ధనాః
తథైవ లోకే విద్యానా మేషా విద్యా పరాయణమ్. 15

యథా = ఏరీతిగా, సర్వాః = ఎల్ల, అర్థజాతయః = అర్థములందున్న జాతులు, శబ్దాకృతినిబన్ధనాః = శబ్దములయందున్న జాతులు కారణములుగా గలవో, తథా ఏవ = ఆరీతిగానే, లోకే = లోకమున, ఏషా = ఈ, విద్యా = వ్యాకరణ విద్య, విద్యానామ్ = ఎల్లవిద్యలకు, పరాయణమ్ = ఉత్కృష్టమగు స్థానము-అన్ని విద్యలకు ప్రధానాశ్రయమని భావము.

తా. ఘటః, పటః మున్నగు శబ్దములు కడవ, వంచె మున్నగు అర్థములను బోధించుచున్నవి. అందుచే ఆశబ్దములు ఆయర్థములకు కారణము లగుచున్నవి. అర్థముల యందు ఘటత్వము పటత్వము మున్నగు జాతులు కలవు. వానికి ఆశబ్దములయందున్న ఘట శబ్దత్వము పటశబ్దత్వము మున్నగు శబ్దగతజాతులు కారణము లగుచున్నవి. కాగా అర్థగత జాతులకు శబ్దగతజాతులు కారణములని తేలినది. అట్లే లోకములో నున్న ఎల్లవిద్యలకు వ్యాకరణవిద్య కారణమగుచున్నది.

వి. విద్యలన్నియు శబ్దరూపమున నున్నవి. వానికి వ్యాకరణమువలన సంస్కారము కలుగుచున్నది. కాగా లౌకికశబ్దము లన్నియు వ్యాకరణము నపేక్షించును. లోకములో నున్న శబ్దములే వేదమునగూడ కాన్పించుచున్నవి. వేదములో కొన్నిశబ్దములందు కొన్ని పరిణామములు కానవచ్చినను వానినికూడ వ్యాకరణము చూచి సరిచేయుచునేయున్నది. అనగా ఆ పరిణామములను ప్రత్యేకముగా గుర్తించియేయున్నది. కనుక వైదికశబ్దములు కూడ వ్యాకరణము నపేక్షించుచున్నవి.

వ్యాకరణము వేదములందున్న పదములకు శక్తిజ్ఞానము కలిగించుటచేతనే మోక్ష సాధనమని చెప్పనక్కరలేదు. సాక్షాత్తుగా శబ్దబ్రహ్మసాక్షాత్కారమునకు సాధనమగుట చేతనుగూడ మోక్షమునకు ద్వారము కాగలదని చెప్పుచున్నాడు.

ఇద మాద్యం పదస్థానం సిద్ధిసోపానపర్వణామ్
ఇయం సా మోక్షమాణానా మజిహ్మా రాజపద్ధతిః. 16

ఇదమ్ = ఈవ్యాకరణము, సిద్ధిసోపానపర్వణామ్ = మోక్షమునకు మధ్యయందున్న అవస్థలనెడి మెట్లయొక్క విభాగములలో, ఆద్యమ్ = మొదటిదియగు, పదస్థానమ్ = పాదమును వేయుట కుపకరించెడి మెట్టు.

మోక్షమాణానామ్ = మోక్షముకోరువారికి, సా + ఇయమ్ = ఆ ఈ వ్యాకరణ విద్య, అజిహ్మా = వక్రముకాని, రాజపద్ధతిః = రాచబాట.

తా మేడఎక్కుటకు మెట్లుగదా ముఖ్యమార్గము: మొదటిమెట్టుమీద పాదమువేసికదా మీదికి వెళ్ళవలెను: అట్లే మోక్షమనే మేడకు శాస్త్రిలతో అంతరాళావస్థలు మెట్లుగా నున్నవి. వీనిలో వ్యాకరణము మొదటిమెట్టు. మోక్షముకోరువారికి శాస్త్రిలతో కొన్ని మార్గములు చూపబడి యున్నవి. వానిలో వ్యాకరణము రాచబాట వంటిది.

ఉపనిషత్తులలో శ్రవణ మనన నిధిధ్యాసములవలన కలిగెడి ఆత్మసాక్షాత్కారము మోక్షమని చెప్పబడినది. కాగా ఆత్మసాక్షాత్కారముచే అవిద్య నశించుటవలన అది సాధనమగును. ఇట్టితరి శబ్దసాక్షాత్కారము మోక్షసాధనమనుట యెట్లుపొసగును ? అను ప్రశ్నకు ఆయాత్మ శబ్దరూపమే కనుక దోషములేదని సమాధానము చెప్పుచున్నాడు.

అత్రాతీతవిపర్యాసః కేవలా మను పశ్యతి
ఛన్దస్య శ్ఛన్దసాం యోని మాత్మా ఛన్దోమయీం తనూమ్. 17

అత్ర = ఈవ్యాకరణమునందు, అతీతవిపర్యాసః = పోయినభ్రమ కలిగినట్టియు, ఛన్దస్యః = వేదమునకు హితుడగు-వేదమును కాపాడువాడని భావము, ఆత్మా = పురుషుడు, ఛన్దసామ్ = వేదములకు, యోనిమ్ = కారణమగు సాధుశబ్దరూపమగు వాక్కును, అను = చూచినతరువాత, ఛన్దోమయీమ్ = ఛందోరూపమగునట్టియు, కేవలామ్ = ప్రకృతి ప్రత్యయ సంబంధములేని, తనూమ్ = పరావాగ్రూపమగు ఆత్మస్వరూపమును, పశ్యతి = సాక్షాత్కరించుకొనుచున్నాడు.

తా. వ్యాకరణమువలన శబ్దము నిజరూపమును తెలుసుకొనినవాడు వేదార్థమును చక్కగ తెలుసుకొనగలడు. అట్లుకానిచో హ్రస్వదీర్ఘాదులవలనను ఉదాత్తాది స్వరములవలనను శబ్దము భిన్నార్థకము కాగలదు. అట్టితరి నిశ్చితార్థము తెలియబడదు. కనుక వ్యాకరణమున భ్రమప్రమాదములు లేనివాడు వాక్కుయొక్క పరమార్థరూపమును చూచి దానిమూలమున వేదములకు పరమార్థరూపమగు పరావాక్కును సాక్షాత్కరించుకొనగలడు. పరావాక్కు ఆత్మరూపమే.

18, 19, 20, 21, 22 ఈ అయిదు శ్లోకములచే వ్యాకరణశాస్త్రమును స్తుతించుచున్నాడు.

ప్రత్యస్తమితభేదాయా య ద్వాచోరూప ముత్తమమ్
య దస్మిన్నేవ తమసి జ్యోతిః శుద్ధం వివర్తతే. 18

యత్ = ఏవ్యాకరణము, ప్రత్యస్తమితభేదాయాః = నశించిన భేదముకల, వాచః = వాక్కునకు-అనగా పరావాక్కునకు, ఉత్తమమ్ = శ్రేష్ఠమగు, రూపమ్ = రూపమో;

మరియు, శుద్ధమ్ = పరిశుద్ధమగునట్టియు, జ్యోతిః = స్వ-పర ప్రకాశకమగు నట్టియు వెలుగయిన, యత్ = ఏవ్యాకరణము, అస్మిన్ = ఈ, తమసి + ఏవ = వైఖరీ వాగ్రూపమగు చీకటియందే, వివర్తతే = ఆచ్ఛాదితమైయున్నదో,

(తత్ = అట్టి, వ్యాకరణమ్ = వ్యాకరణమును, ఆగమ్య = పొందినవిమ్మట, పరమ్ + బ్రహ్మ = పరబ్రహ్మము, అధిగమ్యతే = పొందబడుచున్నది.)

తా. ఈ శ్లోకముయొక్క అర్థమునకు రాబోవు మూడుశ్లోకముల అర్థములను 22వ శ్లోకార్థముతో నన్వయము చూపవలెను.

వ్యంజకములగు ధ్వనులవలన కలిగెడి వర్ణభేదములు వైఖరీవాక్కునందు లీనము లగును. అట్టివాక్కునకు వ్యాకరణమనునది ఉత్కృష్టమగు రూపము. వ్యాకరణమువలననే గదా ఆ వాక్కు జ్ఞాతముకానగును?

మరియు వ్యాకరణము దీపమువలె స్వప్రకాశకము పరప్రకాశకముగూడ కాగలదు. అట్టి వ్యాకరణము వైఖరీవాక్కునందు లీనమైయున్నది. దీని స్వరూపము ఆవాక్కునందు వ్యక్తముకానందున దానిని చీకటిగా భావింతురు. వ్యాకరణశాస్త్రపు కార్యములు వైఖరీశబ్దము నందు ప్రవర్తించవు. ఆవాక్కు అర్థబోధకముకూడ కానేరదు. కనుక అది చీకటియైనదే. అట్టి వైఖరీశబ్దము వ్యాకరణమునకు సంబంధించిన మధ్యమావాక్కునకు వ్యంజకము కనుక దానిలో వ్యాకరణము లీనమైయున్నదని వైయాకరణులు భావింతురు.

వైకృతం సమతిక్రాన్తా మూర్తివ్యాపారదర్శనమ్
వ్యతీత్యాఽఽలోకతమసీ ప్రకాశం య ముపాసతే. 19

వైకృతమ్ = వైకృతధ్వనిసంబంధించునట్టి, మూర్తివ్యాపారదర్శనమ్ = దేశ కాలములవలన కలిగెడిభేదమును, సమతిక్రాన్తాః = అతిక్రమించినవారై అనగా-స్ఫోటశబ్దము నందు ఆరోపించనట్టి వైయాకరణులు, ఆలోకతమసీ = వెలుగును చీకటిని-అనగా ఉభయవిధ ప్రాకృతధ్వనిని వైకృతధ్వనినికూడ, వ్యతీత్య = అతిక్రమించి, (స్థితమ్) = ఉన్నట్టియుండు, యమ్ = ఏస్ఫోటశబ్దమును, ఉపాసతే = ఉపాసించుచున్నారో; అది ఉపలభించునట్టియు.

(తత్ = అట్టిస్ఫోటశబ్దమును ప్రతిపాదించెడి, వ్యాకరణమును పొందినవిమ్మట పర బ్రహ్మము పొందబడుచున్నది.)

తా. వైయాకరణులు స్ఫోటశబ్దము నంగీకరింతురు. ఆ శబ్దము ప్రాకృతధ్వనిని వైకృతధ్వనినికూడ అతిక్రమించియున్నది. అనగా వానికంటె భిన్నముగా నున్నది. స్ఫోట శబ్ద మభివ్యక్తమైనతరువాత కలిగెడివి వైకృతధ్వనులు. అవి దేశముచేతను, కాలముచేతను భిన్నములగుచున్నవి. అట్టిభేదమును వైయాకరణులు స్ఫోటశబ్దమునందారోపింతురు. స్ఫోట శబ్దాభివ్యక్తికి ముందుగానున్నవి ప్రాకృతధ్వనులు. వానిని మాత్రము స్ఫోటశబ్దమునందారో పించినట్లు కానవచ్చును. నిజరూపమున స్ఫోటశబ్దము రెండువిధములగు ధ్వనులను అతిక్ర మించియే యున్నది. ఈ యర్థము ఈకాండములోనే 77వ శ్లోకమున స్పష్టమగును.

యత్ర వాచోనిమిత్తాని చిహ్నానీ వాక్షరస్మృతేః
శబ్దపూర్వేణ యోగేన భాసన్తే ప్రతిబిమ్బవత్. 20

యత్ర = ఏస్ఫోటమునందు, అక్షరస్మృతేః = కకారము, గకారము మున్నగు అక్షరముల స్మరణమునకు, చిహ్నాని + ఇవ = గుర్తుగానున్న లిపులవలె, వాచః = శబ్దాభి

వ్యంజకమగు ప్రాకృతధ్వనికి, నిమిత్తాని = నిమిత్తములగు ధ్వనులయందు కాన్పించుచున్న కత్వగత్వాదికములు, శబ్దపూర్వేణ = శబ్దము పూర్వముగాగల, యోగేన = సంబంధముచే అనగా శబ్దాభివ్యక్తికి ముందుగానున్న ధ్వనితో సబంధించుటచే దానితో భేదము గృహీతము కానందున, ప్రతిబిమ్బవత్ = ప్రతిబింబమునందువలె, భాసన్తే = భాసించుచున్నవో,

(తత్ + వ్యాకరణమ్ = అట్టి స్ఫోటశబ్దమును ప్రతిపాదించెడి వ్యాకరణమును పొందినవిమ్మట పరబ్రహ్మము పొందబడును.)

తా. కకారాదివర్ణములు జ్ఞప్తికివచ్చుటకై కొన్ని సంకేతములుకలవు. వానినే 'లిపి' యందురు. అట్లే స్ఫోటశబ్దము జ్ఞానవిషయ మగుటకు కొన్ని సంకేతము లున్నవి. అవియే కత్వగత్వాదులు. అవి నిజముగ స్ఫోటశబ్దమునందు లేవు. కాని స్ఫోటశబ్దాభివ్యంజకమగు ప్రాకృతధ్వనియం దున్నవి. అయినను స్ఫోట శబ్దము వేరు, ప్రాకృతధ్వని వేరు అనే భేదము జ్ఞాతముకానందున ఆ ధర్మములు స్ఫోటశబ్దమునందు భాసించుచున్నవి. ఉదా. తెల్లని గాజుగ్లాసువద్దర ఎర్రని వస్తు వున్నచో దాని ఎరుపు ఆ గ్లాసునందు కాన్పించును. అనగా ఇతరధర్మము భాసించును.

అథర్వణా మఙ్గిరసాం సామ్నా మృగ్యజుషస్య చ
యస్మి న్నుచ్చావచా వర్ణాః పృథక్స్థితిపరిగ్రహాః. 21

అఙ్గిరసామ్ = అంగిరోగణముచే గుర్తింపబడిన, అథర్వణామ్ = అథర్వమంత్రములయొక్క, సామ్నామ్ = సామవేదీయ మంత్రములయొక్క, ఋగ్యజుషస్య + చ = ఋగ్వేదీయ యజుర్వేదీయ మంత్రములయొక్కయు, ఉచ్చావచాః = విజాతీయములగు, వర్ణాః = ఉదాత్తానుదాత్తత్వాది వర్ణధర్మములు, పృథక్స్థితిపరిగ్రహాః = వేరుగానున్న దానియందలి స్థితియొక్క స్వీకారము కలవై, అనగా స్ఫోటశబ్దమునందలి భిన్నమగు ధ్వని యందున్న స్థితిని స్వీకరించినవై, యస్మిన్ = ఏస్ఫోటశబ్దమునందు, (భాసన్తే = ప్రకాశించుచున్నవో),

(తత్ = అట్టి స్ఫోటశబ్దమును ప్రతిపాదించెడి వ్యాకరణమును పొందిన పిమ్మట పరబ్రహ్మము పొందబడుచున్నది.)

తా. నాల్గువేదములందలి వర్ణములు భిన్నములగు స్వరములు కలవై యున్నవి. అవి నిజమునకు స్ఫోటశబ్దమునందు లేవు. స్ఫోటాభివ్యంజకములగు ధ్వనులయం దున్నవి. కాని యవియు స్ఫోటశబ్దమునం దారోపిత మగుచున్నవి. స్ఫోటశబ్దము నిజరూపమున ఏకము, నిర్గుణము, జ్ఞానరూపము. పరికించిన వైఖరీధ్వనులవలెనె ఉదాత్తత్వాది ధర్మములుకూడ స్ఫోట శబ్దమునకు సంబంధించినవి కావు.

యదేకం ప్రక్రియాభేదై ర్బహుధా ప్రవిభజ్యతే
తద్ వ్యాకరణ మాగమ్య పరంబ్రహ్మాధిగమ్యతే. 22

యత్ = ఏస్ఫోటశబ్దము, ఏకమ్ = నిజరూపమున ఒక్కటియే ఐనను, ప్రక్రియా భేదైః = భిన్నములగు ప్రక్రియలచే, బహుధా = అనేకరూపముగ, ప్రవిభజ్యతే = విభజింప బడుచున్నదో.

తత్ = అట్టిస్ఫోటశబ్దమును నిరూపించుచున్న, వ్యాకరణమ్ = వ్యాకరణమును, ఆగమ్య = పొందినతరువాత, పరమ్ = ఉత్కృష్టమగు-అనగా జ్ఞానరూపమగు, బ్రహ్మ = శబ్దబ్రహ్మము, అధిగమ్యతే = తెలియబడుచున్నది.

తా. శబ్దము నిజరూపమున ఒక్కటియే. అది పశ్యంతి, మధ్యమ, వైఖరి అనురీతిని నానాత్వమును పొందుచున్నది. పరల వర్ణ పద వాక్య వ్యక్తి జాతి సఖండాఖండ రూపముగా మార్పుచెందుచున్నది. అందును ఒకేపదము వేరువేరు వ్యాఖ్యాతలచే వేరువేరుప్రక్రియల ననుసరించి చూపబడుచున్నది. శాకల్య శాకటాయన శారద్వాజ గార్గ్య పాణివ్యాదులు ప్రక్రియాభేదమున చాల వ్యాకరణములను రచించిరి. ఉదా. రామః అను పదమును వ్యాకరించుటలో పాణిని రామ + స్ అనియు, శాకటాయనుడు రామ + రు అనియు, శాకల్యుడు రామ + రి అనియు, భవతి అనుపదమునకు భూ + అ + తి అనియు, భూ + లటి అనియు, భవ + తి అనియు విభిన్నమగు మార్గములను జూపియున్నారు. ఇట్లున్నను రామః, భవతి అనెడి సిద్ధపదములు ఏకరూపముగలవే. చివరకు పరిశీలించిన పర్ణపదవాక్యము లన్నియు కల్పితములే. కనుక వ్యాకర్త లందరికి ఒక్క స్ఫోటశబ్దమునందే ముఖ్యతాత్పర్యమని తెలుచున్నది. అట్టి శబ్దము నిర్గుణబ్రహ్మరూపము.

ఈ రీతిగ వ్యాకరణశాస్త్రాధ్యయనమునకు ప్రయోజనములు చూపియున్నాడు. ఇక శాస్త్రీయప్రక్రియానిర్వహణకు నియతమగు వ్యవస్థ కలుగునట్లు చూపదలచి తాను వ్రాయదలచిన వాక్యపదీయ మను ప్రకరణగ్రంథమునకు వ్యాకరణశాస్త్రములోగల సంబంధమును జూపుటకై ఉపోద్ఘాతమును రచియించుచున్నాడు.

నిత్యాః శబ్దార్థసంబన్ధా స్తత్రాఽమ్నాతా మహర్షిభిః
సూత్రాణా మనుతన్త్రాణాం భాష్యాణాం చ ప్రణేతృభిః. 23

సూత్రాణామ్ = సూత్రములకు, అనుతన్త్రాణామ్ = వార్తికములకు, భాష్యాణామ్ + చ = భాష్యములకును, ప్రణేతృభిః = రచయితలగు, మహర్షిభిః = మహర్షులచే - అనగా పాణినికాత్యాయనపతంజలులచే, తత్ర = ఆ వ్యాకరణమునందు, శబ్దార్థసంబన్ధాః = శబ్దములు, వానిచే బోధింపబడు అర్థములు, ఆ శబ్దార్థములకు గల సంబంధములు—ఈ మూడును, నిత్యాః = నిత్యములై, ఆమ్నాతాః = అనేకస్థలములలో స్పష్టముగ చెప్పబడినవి.

తా. శబ్దార్థసంబంధములు నిత్యములేకాని. కల్పితములు కావని తలంచియే పాణిని సూత్రములను, వానికి కాత్యాయనుడు వార్తికములను, ఆసూత్రవార్తికములకు పతంజలి భాష్యమును రచియించిరి. శబ్దార్థసంబంధములు నిత్యములే కానిచో మనుష్యులు స్వతంత్రించి శబ్దార్థసంబంధములను మార్పుచేసెదరు. క్రొత్తశబ్దములను సృష్టించగలరు. ఈనాడు సాధువులుగా నున్న శబ్దములు కాలాంతరమున అసాధువులు కాగలవు. అట్టితరి వానికి నియతమగురూపము లభించనందున తన్మూలకమగు వ్యాకరణముకూడ నియతము కాకపోయెడిని. కాగా సాధుత్వబోధకమగు వ్యాకరణము వ్యవస్థాపకము కాకపోవుటచే నిరర్థకమే యగును. శబ్దార్థసంబంధములు నిత్యములగుచో నవి ఎల్లకాలములందు ఏకరూపముగా నుండుటచే వానికి సంబంధించిన శాస్త్రము కూడ ఏకరూపముగానుండి సాధుత్వసంపాదనమును, దానివలన ధర్మమును కలుగునని ట్లుపయోగపడును; నిరర్థకముకాదు.

మనము వారియభిప్రాయమును పైరీతిని ఊహించుటయేకాదు, వారే అనేక స్థలములలో శబ్దార్థసంబంధములకు నిత్యత్వమును స్పష్టముగా చెప్పియున్నారు.

శబ్దార్థసంబంధములు నిత్యములు కనుక వ్యాకరణ మన్వాఖ్యాపకము కాగలదని చూపి, ఆ వ్యాకరణము ప్రకృతి ప్రత్యయ కల్పనచే సాధుశబ్దములను చూపుచున్నది. అట్లు చేసిన తద్భిన్నము లసాధువులని తెలియగలదు. అట్లుగాక రెంటిని చూపిన క్లేశ మున్నది. లఘుమార్గమున శాస్త్రనిర్మాణము జరుగదని నిరూపించుచు అష్టపదార్థరూపమగు వ్యాకరణ శాస్త్రశరీరమును అనగా వ్యాకరణశాస్త్రమున చూపబడిన ఎనిమిది పదార్థములను 24,25, 26 మూడు శ్లోకములచే ప్రదర్శించుచున్నారు.

అపోద్ధారపదార్థా యే యే చార్థాః స్థితలక్షణాః
అన్వాఖ్యేయాశ్చ యే శబ్దా యే చాపి ప్రతిపాదకాః . 24
కార్యకారణభావేన యోగ్యభావేన చ స్థితాః
ధర్మే చ ప్రత్యయే చాఙ్గం సంబన్ధాః సాధ్వసాధుషు . 25
తే లిఙ్గైశ్చ స్వశబ్దైశ్చ శాస్త్రేఽస్మి న్నుపవర్ణితాః
స్మృత్యర్థ మనుగమ్యన్తే కేచిదేవ యథాగమమ్ . 26

అస్మిన్ = ఈ, శాస్త్రే = పాణినీయ వ్యాకరణశాస్త్రమునందు, సాధ్వసాధుషు = సాధుశబ్దముల అసాధుశబ్దముల మధ్యలో, 1. యే = ఏ, అపోద్ధారపదార్థాః = వేరు చేయ బడిన పదార్థములు-అనగా ప్రకృత్యర్థములు ప్రత్యయార్థములు, 2. యే + చ = ఏ, స్థిత లక్షణాః = స్థిరమగు రూపముగల, అర్థాః = అర్థములు-అనగా పదార్థములు వాక్యార్థములు, 3. యేచ = ఏ, అన్వాఖ్యేయాః = అవయవ విభాగముచే సాధుత్వబోధనమునకు అర్హములగు, శబ్దాః = శబ్దములు—అనగా పదములు వాక్యములు, 4. యే + చ + అపి = ఇంకను ఏ, ప్రతిపాదకాః = పదవాక్యరూపములగు శబ్దముల నిష్పత్తికి ఉపయోగించెడి, శబ్దాః = శబ్ద ములు-అనగా ప్రకృతిప్రత్యయరూపములగు శబ్దములు, 5. కార్యకారణభావేన = కార్య కారణభావరూపమున, 6. యోగ్యభావేన + చ = యోగ్యతారూపమునను, స్థితాః = ఉన్నటు వంటి, యే = ఏ, సంబన్ధాః + చ = సంబంధములున్ను, 7. ధర్మే = ధర్మమునందు, 8. ప్రత్యయే + చ = అర్థజ్ఞానమునందును, అఙ్గమ్ = సాధనమో, తే = అవి, లిఙ్గైః + చ = చిహ్నములచేతను, స్వశబ్దైః + చ = స్వరూపమును బోధించెడి శబ్దములచేతను, ఉప వర్ణితాః = వర్ణింపబడినవి. సాధుశబ్దములలోను అసాధుశబ్దములలోను సాధుశబ్దములే పైరీతిని వర్ణింపబడినవి. అసాధుశబ్దములు చూపబడలేదని భావము.

స్మృత్యర్థమ్ = లఘురూపమున వ్యాకరణస్మృతిని రచియించుటకై, కేచిత్ + ఏవ = కొన్ని శబ్దములే అనగా సాధుశబ్దములే, యథాగమమ్ = శాస్త్రము నతిక్రమించక, అనుగమ్యన్తే = అనుగమింపబడుచున్నవి.

తా. వాక్యమువలననే లోకులకు అర్థబోధ కలుగుచున్నది. కనుక వాక్యమే సత్యమైనది యని వైయాకరణులు విశ్వసింతురు. శబ్దమునకు సాధుత్వము జూపునది వ్యాకరణము. వాక్యము లనంతములు కనుక వానికి సాధుత్వప్రదర్శనము శక్యము కాదని భావించి వానిలోనుండి పదములను విభజించిరి. అవియు అనంతములైనందున వానికిగూడ సాధుత్వము చూపుట శక్యము గాదని తలంచి వానిలోనుంచి ప్రకృతి ప్రత్యయములను వేరుచేసి యుంచినారు. కాగా ప్రకృతి ప్రత్యయములు, వానియర్థములు కల్పితములే. కాని

మూలమున పదములు, తద్ద్వారా వాక్యములు వ్యాకరణముచే సంపూరింపబడగలవు. ఇది మునులుచేసిన పని. సత్యమైనది వాక్యమే. ప్రకృతి ప్రత్యయములు కల్పితములే. పదము మధ్యతరగతికి చెందినది.

శబ్దమునుండి విభజింపబడిన ప్రకృతిప్రత్యయముల అర్థములు అపోద్ధారపదార్థములని భర్తృహరి యాశయము.

సాధుశబ్దమువలనను, అసాధుశబ్దమువలనను అర్థబోధ కలుగును. కాని సాధుశబ్దములే ధర్మజనకములు కనుక వానికే వ్యాకరణము సాధుత్వమును జూపుటకై రచియింపబడినది. వ్యాకరణమున జూపబడినవి సాధువులని, వానికంటె ఇతరమైనవి యసాధువులని మనము తెలుసుకొనగలము. అసాధువులనే చూపిన ఇతరములు సాధువులని తెలుసుకోవచ్చును. కాని అసాధువులు అనంతములు కనుక వానిని జూపుటలో లాఘవ ముండదు. కనుక లాఘవమును అపేక్షించి సాధుశబ్దములనే వ్యాకరణము చూపుచున్నది.

వి. ఈ మూడు శ్లోకములు వ్యాకరణశాస్త్రమున విచారింపబడిన ఎనిమిది పదార్థములను జూపుచున్నవి.

శబ్దము	2	విధములు	1	ప్రకృతి ప్రత్యయములు
			2	పద వాక్యములు
అర్థము	2	విధములు	1	ప్రకృతి ప్రత్యయార్థములు
			2	పద వాక్యార్థములు
శబ్దములకు, అర్థములకు				
కల సంబంధము	2	విధములు	1	కార్యకారణభావము
			2	యోగ్యత
ప్రయోజనము	2	విధములు	1	అర్థజ్ఞానము
			2	ధర్మము
	8		8	

కాగా రెండేసి విధములగు శబ్దములు, అర్థములు, సంబంధములు, ప్రయోజనములు కలసి ఎనిమిది యగును. వీనినే వ్యాకరణశాస్త్రము విచారించియున్నది. ఈ యష్టపదార్థీరూపమే వ్యాకరణశాస్త్రశరీరము.

వాక్యపదీయము పాణినీయవ్యాకరణ మహాభాష్యమునకు వ్యాఖ్యానగ్రంథము. కనుక ఇదియు ఆ ఎనిమిది పదార్థములను విచారించుచున్నది. కనుకనే "పదార్థాష్టక విచార పరత్వాత్ వాక్య పదీయస్య" అని మూడవకాండ ప్రారంభమున హేలారాజు పలికెను. వాక్యపదీయము ఎనిమిది పదార్థములను విచారించునది యని దాని భావము.

పాణిని రెండువిధములగు ప్రకృతులను, ఎనిమిది విధములగు ప్రత్యయములను, వాని సంయోగవశమున కార్యవిశేషములను కల్పించి వానిద్వారా పదములకు, తద్ద్వారా వాక్యములకు సాధుత్వమును జూపెను.

1. ధాతువు 2. ప్రాతిపదికము, ఇవి ప్రకృతులు. సు, ఔ, జస్ మున్నగు సుప్పులు 21; టాప్ మున్నగు స్త్రీ ప్రత్యయములు 9; సుమారు 200 లకు పైగా తద్ధితములు; 12 సనాది ప్రత్యయములు; 22 వికరణ ప్రత్యయములు; 10 లకారములు; 18 తిఙ్ ప్రత్యయములు; సుమారు 110 పైగా కృత్ ప్రత్యయములు ఇవి 8 విధములగు ప్రత్యయములు.

పై ప్రకృతులకు, ప్రత్యయములకుగూడ అర్థములను పాణిని కల్పించెను.

కాగా ప్రకృతిప్రత్యయములు, వానియర్థములు కల్పితములే. సత్యములు కావు.

వాక్యము సత్యము. అదియే అర్థబోధకము. దానిని తెలుసుకొనుటకు ఉపాయములుగా ప్రకృతి ప్రత్యయములు కల్పింపబడినవి.

ప్రకృతి ప్రత్యయములకంటె పదము సత్యముగాను, వాక్యముకంటె అసత్యముగాను శాస్త్రమున చూపబడుచున్నది. అందుచే పదము మధ్యతరగతికి చెందియున్నది. వాక్యమునుండి పదములు, వానినుండి ప్రకృతి ప్రత్యయములు కల్పితములనియే మహాభాష్యకారులు నిర్ణయించిరి. ఇట్టి కల్పనకు అపోద్ధారమని భర్తృహరి వ్యవహారము. అఖండమగు వాక్యమునుంచి అవయవకల్పన అపోద్ధారము.

అపోద్ధారపద్ధతిలో ప్రకృతి ప్రత్యయ రూపమగు శబ్దములు, వాని యర్థములు స్వీకరింపబడుచున్నవి. వానిచే సత్యములగు వాక్యములు, వాని యర్థములు తెలియబడుచున్నవి.

కాగా 24వ శ్లోకమున 'అపోద్ధార పదార్థాః' అను పదము ప్రకృతి ప్రత్యయముల అర్థములను, 'స్థితలక్షణాః' అను పదము పద-వాక్యముల అర్థములను, 'అన్వాఖ్యేయాః' అను పదము పద-వాక్యములను, 'ప్రతిపాదకాః' అను పదము ప్రకృతి ప్రత్యయములను బోధించుచున్నవి. పై నాల్గు పదార్థములను ఈ శ్లోకము చూపుచున్నది.

శబ్దములకు అర్థములకు రెండు విధములగు సంబంధములను మహాభాష్యకారులు చూపిరి: 1. కార్యకారణభావము, 2. యోగ్యత. వక్తయొక్క బుద్ధిలో అర్థము ముందుగా భాసించును. దానిని ఇతరులకు చెప్పదలచినచో దాని కనుగుణమగు శబ్దము భాసించును. కాగా అర్థము కారణము, శబ్దము కార్యము అని స్పష్టమగుటచే వానికి ఆ సంబంధము తెల్లము. వక్త శబ్దము ప్రయోగించగా దానివలన శ్రోతకు బోధ కలుగుచున్నది. కాగా ఇపుడు శబ్దము కారణమని, అర్థము కార్యమని తేలుచున్నది. ఇట్లు పరస్పరము శబ్దార్థములకు కార్యకారణభావసంబంధము కలుగుచున్నది. ఇంద్రియములకు విషయములను గ్రహించుటలో స్వాభావికమగు యోగ్యత గలదు. అట్లే శబ్దములకు అర్థములను బోధించుటలో స్వాభావికమగు యోగ్యత కలదు. శబ్దార్థములకు తాదాత్మ్యము యోగ్యత. అదియే వానికి సంబంధము. ఈ రెండు సంబంధములు శబ్దార్థములకు అనాదిసిద్ధములు, కల్పితములు కావు.

వ్యాకరణశాస్త్రమునకు ప్రయోజనములు రెండు చూపబడినవి - అర్థజ్ఞానము, ధర్మము. ప్రవృత్తిరూపమగు ధర్మమువలన ఇహలోక పరలోక సుఖములు, నివృత్తిరూపమగు ధర్మమువలన మోక్షము లభించును.

రెండు సంబంధములు, రెండు ప్రయోజనములు కలసి నాల్గు పదార్థములను 25 వ శ్లోకము చూపుచున్నది.

పయిరీతిని సిద్ధించిన ఎనిమిది పదార్థములను వ్యాకరణశాస్త్రము ప్రతిపాదించి యున్నది. ఆ పదార్థములనే ఈ గ్రంథము కూడ నిరూపించుచున్నది. — ప్రథమ కాండము రెండు ప్రయోజనములను, ద్వితీయ కాండము వాక్య వాక్యార్థములను, తృతీయ కాండము ప్రకృతి ప్రత్యయరూపమగు శబ్దము, తదర్థములు, కార్యకారణభావము, యోగ్యత అను నాలుగు పదార్థములను విచారించుచున్నది.

ప్రథమ కాండమున 44 వ శ్లోకమున "అపరోఽర్థే ప్రయుజ్యతే" అని యుపక్రమించి శబ్దమునకు అర్థబోధకత్వము విపులముగా జూపబడినది. అట్లే 93 వ శ్లోకముచే శబ్దగతమగు జాతి వాచక మని చూపబడినది. 27 వ శ్లోకమున "సాధవో ధర్మసాధనమ్" అని ధర్మము ఫలమని నిరూపితమాయెను. 140 వ శ్లోకమున అభ్యుదయరూప ధర్మఫలము చెప్పబడినది. 14, 16, 22, 132 వ శ్లోకములతో నివృత్తిధర్మము అనగా మోక్షము ఫలముగా చూపబడినది.

వ్యాకరణమున తవ్య, అనీయ, తి మున్నగు రీతిని ప్రత్యయములు, భూ, ఏధ్, కన్యా, జానపద మున్నగు రీతిని ప్రకృతులు చూపబడినవి. కొన్నిచోట్ల త్వా, మా, వామ్, నౌ, వః, నః, తే, మే అనురీతిని పదములు, ఐకాగారికః (ఒకే ఇల్లు-అనగా అసహాయము గానున్న యిల్లు — ప్రయోజనముగా గల చోరుడు) శ్రోత్రియః (వేదమును చదివిన వాడు) హరేఽవ (ఓ విష్ణువా ! రక్షించుము) మున్నగురీతినివాక్యములు నిర్దేశింప బడినవి.

ప్రకృతి ప్రత్యయములను చిహ్నములుగా - అనగా గుర్తులుగా జూపి వానిద్వారా పదములు, వాక్యములు లోకమున కందజేయబడుచున్నవి.

పై యర్థము "తే లిఙ్గైశ్చ స్వశబ్దైశ్చ" అను కారికాభాగముచే వ్యక్తమగుచున్నది.

ఈ ఎనిమిది పదార్థములలో అర్థావబోధ, ధర్మము అనునవి ప్రయోజనములు గాను, వానికి మిగతా ఆరు పదార్థములు సాధనములుగాను చూపబడుచున్నవి.

ఈ మూడు శ్లోకములు (24, 25, 26) శాస్త్ర ప్రారంభమున కాత్యాయన పతంజ లులచే స్పష్టముగా బోధింపబడిన యర్థమునే క్రోడీకరించుచున్నవి.

పాణిని కాత్యాయన పతంజలులచే నిర్మింపబడిన వ్యాకరణ శాస్త్రముతో ఈ వాక్యపదీయమునకు గల సంబంధమును "నిత్యాః శబ్దార్థసంబన్ధాః" అను 23 వ శ్లోకముచే భర్తృహరి చూపియున్నాడు.

సాధుశబ్దములు, అసాధుశబ్దములు అను రెంటిలోను సాధుశబ్దములకే వ్యాకరణ మన్వాఖ్యాపక మని 26 వ శ్లోకమున చెప్పబడినది. కాని ఇవి సాధువులు, ఇవి అసాధువులు అని మనము ఎట్లు గుర్తించగలుగును? మరియు ప్రకృతి ప్రత్యయాదులు జ్ఞానజనకములు కాగలవు. అంతియేకాని ధర్మజనకములు కానేరవుగదా అను ప్రశ్నలకు సమాధానము చెప్పుచున్నాడు.

శిష్టేభ్య ఆగమా త్సిద్ధా స్సాధవో ధర్మసాధనమ్
అర్థప్రత్యాయనాభేదే విపరీతా స్త్వసాధవః. 27

అర్థప్రత్యాయనాభేదే = అర్థమును బోధించుటలో భేదము లేకున్నను, శిష్టేభ్యః = శిష్టులవలన లభించిన, ఆగమాత్ = శాస్త్రమువలన, సిద్ధాః = నిష్పన్నములగు శబ్ద

ములు, సాధవః = సాదువు లగుచున్నవి, ధర్మసాధనమ్ = అట్టి శబ్దములే ధర్మమునకు సాధనము కాగలవు.

విపరీతాః + తు = విపరీతములగు శబ్దములుమాత్రము—అనగా అట్టి శాస్త్రము వలన నిష్పన్నము కానివి, అసాధవః = అసాధువు లగును, కనుక అవి ధర్మసాధనము కానేరవని భావము.

తా. శబ్దములన్నియు అర్థమును బోధించుచున్నందున వానిలో కొన్ని శబ్దములు సాధువులు, కొన్ని యసాధువులని ఎట్లు మనము గుర్తించగలము? అని సందేహము కలుగవచ్చును. కాని పెద్దలు వ్యవస్థ చేసియున్నారు. అతీంద్రియశక్తిచే శబ్దతత్త్వమును గుర్తించినవారు శిష్టులు. వారు శాస్త్రములను నిర్మించిరి. ఆ శాస్త్రీయప్రక్రియచే నిష్పన్నములగు శబ్దములు సాధువు లనియు, ఆ ప్రక్రియకు దూరమగు శబ్దములు అసాధువు లనియు తేలినది. సాధుశబ్దములు ధర్మమును కలిగించును. అసాధువులు ధర్మజనకములు కావు. పైపెచ్చు అధర్మజనకము లగును.

శబ్దములు నిత్యము లనియు అనిత్యము లనియు శాస్త్రజ్ఞులలో రెండు వాదము లున్నవి. శబ్దములు పుట్టునవి కావు. పరమాణువులవలె అవి నిత్యములు. కాని కంఠతాల్వాద్యభిఘాతములచే నవి వ్యక్తీకరింపబడుచున్నవి అని మొదటివారి యాశయము. కంఠతాల్వాద్యభిఘాతములచే శబ్దములు పుట్టుచున్నవి. అవి నిత్యములు కానేరవు. భేరీదండ సంయోగమున పుట్టిన శబ్దము నిత్యముకాదుగదా! అని రెండవవారి యభిప్రాయము. శబ్దము నిత్య మనెడివారి మతముచొప్పున శబ్దములు స్థిరములు కనుక అవి ఏకరూపముగా నుండును. అట్టివానికి ఇవి సాధువులు, ఇవి అసాధువులు అనే వ్యవస్థ చేయవచ్చును. కాని శబ్దములు జన్యములు అనెడివారి మతము చొప్పున వయి వ్యవస్థ ఎట్లు సాధ్యమగును? ఏలయన, క్రొత్త క్రొత్త శబ్దములను పుట్టించి వానికి అనుగుణముగ వ్యాకరణము వ్రాసి వారి సంఘము చొప్పున అవి అన్నియు సాధువులని చెప్పవచ్చును. కనుక సాధుత్వ వ్యవస్థ ఎట్లు చూపవగును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

నిత్యత్వే కృతకత్వే వా తేషా మాది ర్న విద్యతే
ప్రాణినా మివ సా చైషా వ్యవస్థా నిత్య తోచ్యతే. 28

తేషామ్ = ఆ శబ్దములకు, ప్రాణినామ్ + ఇవ = జీవులకువలె, నిత్యత్వే = నిత్యత్వమున్నను, కృతకత్వే + వా = అనిత్యత్వమున్నను, ఆదిః = ఆదికాలము అనగా ఇంతకుముందు లేకుండగా ఈ నాడు శబ్దము పుట్టినది యనుట, న + విద్యతే = లేదు. అనాది సిద్ధముగా శబ్ద మున్నదే యని భావము.

సా = ఆ, ఏషా + చ = కూటస్థ నిత్యత్వముకంటె భిన్నమగు ఈ నిత్యత, వ్యవస్థానిత్యతా = వ్యవస్థచే అనగా వ్యవహారమున విశేషముగా నున్న స్థితిచే కలిగిన నిత్యత, ఉచ్యతే = శాస్త్రజ్ఞులచే చెప్పబడుచున్నది. ప్రవాహనిత్యత యని శాస్త్రవేత్తల నిర్ణయము.

తా. జీవులవలె శబ్దములు నిత్యములే. అవి ఎన్నడును నశించునవి కావు అని వైయాకరణులు విశ్వసింతురు. ఈ పక్షమున వ్యాకరణశాస్త్ర నిర్మాణము సంగతమగును. నిరర్థకము కాదు. ఈ సంగతి 23 వ శ్లోకమున నిర్ణీతమాయెను.

కాని దేహములవలె శబ్దములు పుట్టుచు నశించునని కొన్ని శాస్త్రములు చెప్పుచున్నవి. ఆ పక్షమున శబ్దములు వ్యవస్థితములు కానందున వ్యాకరణము నిరర్థకమే

యగును. కాని ఆ పక్షమున గూడ శబ్దములు నిత్యములే. ఎట్లనగా—శబ్దములు పుట్టుచు నశించవచ్చును. అవి అవిచ్ఛిన్నముగా నున్నవి. వానికి ప్రాథమికకాలము, ఈ నాటితో సరి యని చివరికాలము లేదు. ప్రవాహరూపమున కాన్పించుచునేయున్నది. అట్టి వస్తువులు కూడ నిత్యములు కాగలవు. ఈ రీతిగ శబ్దములకు నిత్యత సంభవించును. దీనిని ప్రవాహనిత్యత, వ్యవహారనిత్యత యందురు.

వి. వైయాకరణులు శబ్దములు కూటస్థనిత్యము లందురు. ఎల్లపుడు పుట్టుక, నాశము లేక ఏకరూపముగా నుండునవి యని భావము. ఇతర శాస్త్రముల చొప్పున శబ్దములు అట్టివి కాకున్నను ప్రవాహనిత్యములు కాగలవు. కనుక వానిపక్షమునగూడ వ్యాకరణము నిరర్థకము కాదు.

సాధుత్వ మనునది అనాదిసిద్ధమగు శిష్టపరంపరచే గ్రహింపబడినచో వ్యాకరణ శాస్త్రము రచియించ నక్కరలేదు. దీనివలన గలిగెడి శబ్దసాధుత్వజ్ఞానము ప్రకారాంత రముచే సిద్ధించుచున్నది కదా ! అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

నాఽఽనర్థికా మిమాం కశ్చి ద్వ్యవస్థాం కర్తు మర్హతి
తస్మా న్నిబధ్యతే శిష్టైః సాధుత్వవిషయా స్మృతిః. 29

కశ్చిత్ = ఎవడైన, అనర్థికామ్ = తెలుసుకొనుటకు చదువుటకు శక్యముకానట్టి, ఇమామ్ = మనకు ప్రత్యక్షముగా కానవచ్చుచున్న, వ్యవస్థామ్ = ఉదాత్తాదిస్వరవ్యవస్థను—లౌకిక వైదిక శబ్దములను తెలుసుకొనుట అనే వ్యవస్థను, కర్తుమ్ = చేసేకొరకు అనగా ఇత రులకు తెలిపేకొరకు, న + అర్హతి = ఈ వ్యాకరణము లేనిది సమర్థుడు కానేరడు.

తస్మాత్ = అందువలన, సాధుత్వవిషయా = శబ్దసాధుత్వము విషయముగా గల, స్మృతిః = వ్యాకరణస్మృతి, శిష్టైః = శిష్టులచే, నిబధ్యతే = అనేక ప్రకారములుగా గ్రంథ రూపమున చూపబడు చున్నది.

తా. శిష్టుల పరంపరచే సాధుశబ్దములు తెలియబడగలవు. కనుక వ్యాకరణము నిరర్థకమేగదా! యని ప్రశ్నింపవచ్చును. కాని ఉదాత్తాది స్వరములు ఎట్లు ఉచ్చరించవలెనో, లౌకిక వైదిక పదములలో స్వరనియమము, హ్రస్వదీర్ఘాదినియమము ఎట్లుండునో అను నంశములు వ్యాకరణాధీనములు. ఎంత పట్టుదల వహించినను, పై అంశములను ఎవడుగూడ వ్యాకరణము లేనిది ఇతరులకు చెప్పలేడు. ఈదృష్టితో శిష్టులు వ్యాకరణశాస్త్రమును రచించిరి.

సాధుశబ్దముల ప్రయోగముచే ధర్మము కలుగును. కాని అట్టి సాధు శబ్దముల వ్యవస్థకై వ్యాకరణము అక్కరలేదు. తర్కము వలన కూడ అట్టి వ్యవస్థ సంభవించగలదు—అయం గౌః శబ్దః సాధుః శిష్టప్రయుక్తత్వాత్. (ఈ గో శబ్దము సాధువు. ఏలయన, శిష్టులచే ప్రయోగింపబడుటవలన.) కాగా వ్యాకరణమునకు ఆవశ్యకతయే లేదు అను ప్రశ్నకు 30, 31, 32, 33, 34 శ్లోకములచే సమాధానము చెప్పుచున్నాడు.

నచాఽఽగమాదృతే ధర్మ స్తర్కేణ వ్యవతిష్ఠతే
ఋషీణామపి యజ్జ్ఞానం తదప్యాగమపూర్వకమ్. 30

ధర్మః = ధర్మము, ఆగమాత్ + ఋతే = వేదము, తన్మూలకమగు స్మృతులు వినాగా, తర్కేణ = కేవలతర్కముచే, న + చ + అవతిష్ఠతే = నిశ్చితము కానేరదు.

ఋషీణామ్ + అపి = ఋషులయొక్కయు, జ్ఞానమ్ = జ్ఞానము, యత్ = ఏదో, తత్ + అపి = అదియు, ఆగమపూర్వకమ్ = వేదము పూర్వముగా గలదియే. అనగా వేదము ఆధారముగా గలదియే.

తా. ఇంద్రియ సాపేక్షమగు ప్రత్యక్షమును బురస్కరించుకొని హేతువాదము నిర్ణాయకమగును. ధర్మాధర్మము లతీంద్రియములు కనుకనే వానికి అదృష్టమని శాస్త్రజ్ఞుల వ్యవహారము. అట్టి వానిని హేతువాదము నిర్ణయింపజాలదు సాధుశబ్దప్రయోగమువలన ధర్మము కలుగవలెనన్నచో అట్టి సాధుత్వము వ్యాకరణస్మృత్యధీనమేకాని హేతువాదమువలన లభించునది కాదు. కాగా "పర్వతో వహ్నిమాన్, ధూమాత్, మహానసవత్" అనునట్లు "అయం శబ్దః సాధుః, శిష్టప్రయుక్తత్వాత్, గోశబ్దవత్" అనెడి అనుమానముచేతనే శబ్ద సాధుత్వము తెలియుటచే వేరుగ వ్యాకరణశాస్త్రము వ్యర్థమే యని యాక్షేపింపరాదు.

ఋషులు వేదముల నభ్యసించి యథాశాస్త్రముగ తద్విహితములగు సత్కర్మలను బ్రహ్మచర్యము మున్నగు తపములను ఆచరించిరి. దానివలన వారికి అతీంద్రియార్థములను గ్రహించెడి జ్ఞానము కలిగినది. ఈ రీతిగా వారిజ్ఞానము వేదమూలకమే. ఆ జ్ఞానమునుబట్టి వ్యాకరణాది స్మృతులను నిర్మించిరి. ఇంతియేకాని వారు వానిని సొంతముగాగాని, అనుమాన ప్రమాణము నుపయోగించిగాని నిర్మించలేదు.

వి. కనుక కేవల హేతువాదము ధర్మనిర్ణాయకము కానోపదు.

ధర్మము ఆగమమూలక మనుట యుక్తము కాదు. ప్రజలను మోసగించెడి వామాచారమును బోధించే ఆగమములు కలవు. వానిలో, ''న కాఞ్చన పరిహరేత్'' (కోరి వచ్చిన ఏ స్త్రీని కూడ విడువరాదు) అని కలదు. ఇట్లే సురాపానము మున్నగునవి వామాచారపద్ధతిలో కాన్పించుచున్నవి. ఇట్టి స్థితిలో ఆగమము మనకు ధర్మవ్యవస్థాపక మెట్లు కాగలదు ?

మఱియు సంభవించినంతమట్టుకు తర్కము సహాయము కాగలదు. ''నరకపాలం శుచి, ప్రాణ్యఙ్గత్వాత్'' (మనుష్యుని కపాలము పవిత్రమైనది. ప్రాణికి అవయవము కనుక) ఇటువంటి తర్కము వలన కూడ ధర్మవ్యవస్థ కానగును. ఈ ప్రశ్నలకు సమాధానము చెప్పుచున్నాడు.

> ధర్మస్య చావ్యవచ్ఛిన్నాః పన్థానో యే వ్యవస్థితాః
> న తాన్ లోకప్రసిద్ధత్వాత్ కశ్చిత్తర్కేణ బాధతే. 31

యే = ఏవి, ధర్మస్య = ధర్మముయొక్క, పన్థాసః = పొందెడి ఉపాయములు, వ్యవస్థితాః = లోకప్రసిద్ధములై యున్నవో, అవ్యవచ్ఛిన్నాః + చ = శిష్టు లాచరించుటవలన నశించక యున్నవో, తాన్ = అట్టి, ఆగమాన్ = ఆగమములను, లోకప్రసిద్ధత్వాత్ = లోకమున ప్రసిద్ధి చెందియుండుటవలన, కశ్చిత్ = ఎవ్వడును, తర్కేణ = హేతువాదముచే, న + బాధతే = బాధింపజాలడు.

తా. లోకమున విభిన్నములగు ఆగమము లుండవచ్చును. కాని ఏ ఆగమములు లోకుల శ్రేయమును కోరునో, వేటిని శిష్టులందరు ఆదరింతురో, దేనియందు అందరికి విరుద్ధ భావ ముండదో అట్టి ఆగమములను శుష్కహేతువాదమును జూపి బాధింపరాదు. వామాచారమును బోధించు స్మృతులు కలవు. అవి శిష్ట సమ్మతములు కావు. అవి ధర్మవ్యవస్థాపకములు కానేరవు. వాటి సామ్యమును తీసికొని స్మృతు లన్నిటికి అవ్యవస్థితి నాపాదించరాదు.

లౌకికములగు పదార్థములందున్న శక్తులను పురస్కరించుకొని వాని సాహచర్యమును బట్టి హేతువాదము ప్రవర్తించును. ఆ పదార్థములలోనే శక్తులు భిన్నభిన్నములుగా నున్నవి. ఏకరూపములుగా ఉండనేరవు. కనుక లౌకిక వస్తువులయందే తర్కము సమర్థము కానపుడు అలౌకికమగు ధర్మము విషయమై తర్కము నిర్ణాయకము ఎట్లు కాగలదు? అను అంశమును నిరూపించుచున్నాడు.

అవస్థాదేశకాలానాం భేదా ద్భిన్నాసు శక్తిషు
భావానా మనుమానేన ప్రసిద్ధి రతిదుర్లభా. 32

భావానామ్ = పదార్థములయొక్క, శక్తిషు = శక్తులు, అవస్థాదేశకాలానామ్ = అవస్థలయొక్క అనగా బాల్యము, యౌవనము మున్నగువానియొక్క, దేశములయొక్క, కాలములయొక్కయు, భేదాత్ = మార్పువలన, భిన్నాసు (సతీషు) = మార్పుచెందుచుండగా అనుమానేన = అనుమానప్రమాణముచే, ప్రసిద్ధిః = వస్తువుల శక్తినిర్ణయము, అతిదుర్లభా = మిక్కిలి దుర్లభమైనది.

తా. లౌకికములగు పదార్థములందున్న శక్తులనుగుర్తించి వాని సాహచర్యమును బట్టి హేతువాదము ప్రవర్తించుచున్నది. ఒకేవస్తువునందు ఆ శక్తులు భిన్నభిన్నములుగా నున్నవి. ఏకరూపములుగా నుండనేరవు. లౌకికవస్తువులందే తర్కము నిర్ణాయకము కాకున్నది. ఇట్టి స్థితిలో అలౌకికమగు ధర్మమువిషయమై తర్కము నిర్ణాయక మెట్లు కాగలదు?

వి. మనుష్యుడు బాల్యమున బలవంతుడు కానేరడు. యౌవనమున ఆతడే బలవంతుడు కాగలడు. పచ్చిపిప్పలి కఫమును కలిగించును. అదియే ఎండినచో కఫ వాత పిత్తములను నశింపచేయును. నీరు హిమవత్ప్రదేశమున చల్లగా, అగ్నిప్రదేశమున వేడిగా నుండును. నూతిలో నీరు, మర్రిచెట్టునీడ, యౌవనముకల ఆడవి, ఇటికలతో కట్టిన ఇల్లు శీతకాలమున వేడిగాను, వేసవికాలమున చల్లగాను ఉండును. కనుక అతీంద్రియమగు ధర్మము విషయమై తర్కము సాహాయ్యము చేయనేరదు. అంతు ఆగమమే నిర్ణాయకమగును.

ద్రవ్యము యొక్క శక్తులు అవస్థాదేశకాలములచే మార్పు చెందునని 32 వ శ్లోకముచే చెప్పబడినది. ఇపుడు ఇతరద్రవ్యసంబంధమువలన కూడ శక్తులు మార్పు చెందునని చెప్పుచున్నాడు.

నిర్జ్ఞాతశక్తే ర్ద్రవ్యస్య తాం తా మర్థక్రియాం ప్రతి
విశిష్టద్రవ్యసంబన్ధే సా శక్తిః ప్రతిబధ్యతే. 33

తాం + తామ్ = ఆయా, అర్థక్రియాం ప్రతి = కార్యమును కలిగించుటనుగురించి, నిర్జ్ఞాతశక్తేః = స్పష్టముగా తెలియబడిన శక్తిగలిగిన, ద్రవ్యస్య = ద్రవ్యముయొక్క, సా = ఆ, శక్తిః = శక్తి, విశిష్టద్రవ్యసంబన్ధే = విశిష్టమగు ద్రవ్యముయొక్క సంబంధమున, ప్రతిబధ్యతే = ప్రతిబంధింపబడుచున్నది.

తా. ప్రతి వస్తువునకు విలక్షణములగు కార్యములు జరిపే శక్తు లున్నట్లు అందరికి తెల్లము. ఉదా:- అగ్నికి దహనశక్తి కలదు. కాని విజాతీయమగు చంద్రకాంతశిలతో సంబంధము కలుగగా అగ్నికి ఆశక్తి కానరాకున్నది. అందుచే ద్రవ్యమును చూచినంతమాత్రాన

దీనిశక్తి ఇది యని నిర్ణయించి దానిమూలమున తత్త్వమును ప్రవేశపెట్టరాదు. కనుక అతీంద్రియములగు ధర్మాధర్మములలో నాగమమే ప్రమాణము కానగును.

మహామేధావి చూపిన తర్కము నిర్దుష్టమగును: దానిచే ధర్మాధర్మవ్యవస నిర్ణీతము కానగును. అట్టితరి ధర్మాధర్మవ్యవస్థకు ఆగమప్రమాణముయొక్క ఆవశ్యకత లేదు. అను ఆక్షేపమునకు సమాధానము చెప్పుచున్నాడు.

యత్నే నానుమితోఽప్యర్థః కుశలై రనుమాతృభిః
అభియుక్తతరై రన్యై రన్యథై వోపపాద్యతే. ౭౪

కుశలైః = నేర్పరులగు—అనగా ఊహాసైపుణ్యముకల, అనుమాతృభిః = అనుమానము చూపువారిచే, యత్నేన = ప్రయత్నముచే, అనుమితః + అపి = ఊహింపబడినదైనను, అర్థః = అర్థము, అభియుక్తతరైః = వారికంటెను అధికమగు అభినివేశముకల-అనగా పట్టుదల కలిగిన, అన్యైః = ఇతరులగు అనుమాతలచే, అన్యథా + ఏవ = మరియొక విధముగనే ఉపపాద్యతే = యుక్తియుక్తముగా చూపబడగలదు.

తా. మహామేధాసంపన్నుడు చూపిన తర్కము నియతముగా నుండవచ్చును దానినిబట్టి ధర్మవ్యవస్థ సంభవించును. కనుక ఆగమప్రమాణ మనావశ్యకమే యని శంకింపవచ్చును. కాని యాతర్కము ఆగమమునుబట్టి కాక తన బుద్ధిబలముచేతనే ఊహారూపమున కలిగినప్పుడు అతనికంటెకూడ బుద్ధిమంతుడు ఆ తర్కమునకు అన్యథాత్వము చూపగలడు, బుద్ధిబలమునకు అంతులేదుకదా ః కనుక అవ్యవస్థితమగు తర్కము ధర్మాధర్మములను నిర్ణయింప జాలదు.

అభ్యాసము అనే మరియొక ప్రమాణమును గూడ స్వీకరించవలెనని చూపుచున్నాడు.

పరేషా మసమాఖ్యేయ మభ్యాసాదేవ జాయతే
మణిరూప్యాదివిజ్ఞానం తద్విదాం నానుమానికమ్. ౭౫

పరేషామ్ = ఇతరులకు, అసమాఖ్యేయమ్ = స్పష్టపరచి చెప్పుటకు శక్యముకాని, మణిరూప్యాదివిజ్ఞానమ్ = మణులయొక్క, వెండిబంగారములయొక్క, షడ్జము మున్నగు స్వరములయొక్క విశేషజ్ఞానము, తద్విదాం = మణి మున్నగువాని స్వరూపమును బాగుగ తెలుసుకొన్నవారికి, అభ్యాసాత్ + ఏవ = అభ్యాసమువలననే, జాయతే = కలుగుచున్నది. ఆ జ్ఞానము, ఆనుమానికమ్ = అనుమానప్రమాణముచే కలిగినది, న = కాదు.

తా. రత్నములు, మణులు, కెంపులు, వెండి, బంగారము మున్నగు వస్తువులను వర్తకులు అనేక పర్యాయములు పరీక్షించి వాని గుణదోషములను గుర్తింతురు. ఇట్లే షడ్జము గాంధారము మున్నగు స్వరవిశేషములను గుర్తించువారు కలరు. వారు గ్రహించిన మంచి చెడ్డలను ఒక లక్షణరూపమున కాని ఇతరులకు చెప్పజాలరు. వారలకు ఆజ్ఞానము ప్రత్యక్ష ప్రమాణమువలన, అనుమాన ప్రమాణమువలన, శబ్దప్రమాణమువలనను కలిగినదికాదు. అభ్యాసమువలననే కలిగినది. కనుక అభ్యాసమునే ప్రమాణాంతరముగా అంగీకరించవలెను.

వి. మనకు ధర్మము ప్రత్యక్షము కాకపోవచ్చును. అది ఆర్షజ్ఞానవిషయమగును. అదియు మణిరత్నాదుల విజ్ఞానమువంటిది కానగును.

పయి చూపబడిన 6 ప్రమాణములు కాక అదృష్ట మను మరియొక ప్రమాణమును గూడ అంగీకరింపవలయు నని చెప్పుచున్నాడు.

ప్రత్యక్ష మనుమానం చ వ్యతిక్రమ్య వ్యవస్థితాః
పితృరక్షఃపిశాచానాం కర్మజా ఏవ సిద్ధయః. 36

ప్రత్యక్షమ్ = ప్రత్యక్షప్రమాణమును, అనుమానమ్ = అనుమానప్రమాణమును, చ = మరియు-అనగా శబ్దాఖ్యాన ప్రమాణములను, వ్యతిక్రమ్య = విశేషముగా నతిక్రమించి-అనగా ఆ నాల్గు ప్రమాణములకు సాధ్యముకాక, వ్యవస్థితాః = లోకప్రసిద్ధములై ఉన్నటు వంటి, పితృరక్షఃపిశాచానామ్ = పితృదేవతలయొక్క, రాక్షసులయొక్క, పిశాచాదులయొక్కయు, సిద్ధయః = సిద్ధులు అనగా దేశకాలములచే దూరముగానున్నను, గోడ మున్నగు వానిచే వ్యవహితములుగా నున్నను వస్తువులను చూచుట మున్నగు సిద్ధులు, కర్మజాః + ఏవ = కర్మవలననే కలుగుచున్నవి.

తా. మనకు దేశకాలములచే దూరములగు పదార్థములు కానరావు. గోడ మున్నగు వస్తువులు అడ్డుగానున్నను కానరావు. పితృదేవతలకు, రాక్షసులకు, పయ్యములకు పదార్థములు ఎక్కడున్నను కానవచ్చును. అందుకు కారణము అవి చేసిన కర్మయే. వానికి ప్రత్యక్షాదిప్రమాణములతో నిమిత్తములేదు. అవి చేసిన కర్మయొక్క బలముచే అన్ని పదార్థములను చూచెడి శక్తి వానికి కలుగును. ఆ కర్మయే అదృష్ట మందురు. కాగా అదృష్ట మనే ప్రమాణాంతరము నంగీకరించవలెను.

వి. ఋషులకు కూడ తపముచే కలిగిన యదృష్టవిశేషము చేతనే ధర్మాదులను గుర్తించెడి జ్ఞానము కలిగినది. అది ప్రత్యక్షాదిజన్యము కాదు.

అదృష్టమనెడి వేరు ప్రమాణము కలదని రుజువు చేయుచున్నాడు.

ఆవిర్భూతప్రకాశానా మనుపప్లుతచేతసామ్
అతీతానాగతజ్ఞానం ప్రత్యక్షా న్న విశిష్యతే. 37

అనుపప్లుతచేతసామ్ = రజస్తమోగుణములచే ఆక్రమింపబడని మనస్సు కలిగి నట్టియు, కనుకనే, ఆవిర్భూతప్రకాశానామ్ = ఆవిర్భవించిన ప్రకాశముకల యోగులయొక్క, అతీతానాగత జ్ఞానమ్ = గతించిన వస్తువులకు రాబోవు వస్తువులకు సంబంధించిన జ్ఞానము, ప్రత్యక్షాత్ = అస్మదాదులకు కలిగెడి ప్రత్యక్షముకంటె, న + విశిష్యతే = భిన్నమైనది కాదు.

తా. యోగులకు తపోబలముచే రజస్తమోగుణములు నశించి సత్త్వగుణము వృద్ధిచెందును. దానివలన వారికి అతీంద్రియపదార్థములను గుర్తించెడి జ్ఞానము కలుగును. దానిచే వారు అతీతానాగతవస్తువులను చూచెదరు. వారిజ్ఞానము మనకు కలిగిన ప్రత్యక్షము వంటిదే. మనకు విషయేంద్రియ సంయోగమున ప్రత్యక్షజ్ఞానము కలుగుచున్నది. మనకు అచట ఎట్టి సంకోచము లేక నిశ్చితజ్ఞానము లభించుచున్నది. వారికి కలిగిన జ్ఞానముకూడ నిశ్చితమే, సందేహవిషయము కాదు. మనము అద్దములో ముఖమును చూచునట్లు వారు తమ బుద్ధిలో ప్రపంచక మంతను జూతురు. అదియే అదృష్టవిశేషము.

ఋషులకు కలిగెడి ప్రత్యక్షము ఇంద్రియ సంబద్ధము కానందున మిథ్య అని ఏల అనరాదు? ఇంద్రియసంబద్ధము కాక కలిగెడి ప్రత్యక్షము అసత్యమేకదా! శుక్తిరజత

జ్ఞానము, రజ్జుసర్పజ్ఞానము కూడ ఇట్టివే కదా ? వాని దృష్టాంతముచే ఆర్షజ్ఞానము మిథ్య అనవచ్చును. అనుమానమునకు విరుద్ధముగా నున్నదికదా! అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

అతీన్ద్రియా నసంవేద్యాన్ పశ్య న్త్యార్షేణ చక్షుషా
యే భావాన్, వచనం తేషాం నానుమానేన బాధ్యతే. ౪౪

యే = ఎవరు, అతీన్ద్రియాన్ = ఇంద్రియశక్తుల నతిక్రమించినట్టియు — అనగా కన్ను, చెవి మున్నగు ఇంద్రియములచే గ్రహింపబడనట్టియు, కనుకనే, అసంవేద్యాన్ = అనుమాన ప్రమాణముచే గూడ గ్రహింపశక్యముకాని, భావాన్ = పదార్థములను, ఆర్షేణ = వ్యావహారిక దృష్టికంటె భిన్నమగు అనగా అలౌకికమగు—సమాధి తపస్సులచే లభించిన, చక్షుషా = నేత్రముతో సమానమగు యోగమువలన కలిగిన ధర్మముచే, పశ్యన్తి = సంశయము లేకుండ చూచుచున్నారో, తేషాం = అట్టివారియొక్క, వచనమ్ = వచనము, అనుమానేన = దుర్బలమగు అనుమానప్రమాణముచే, న + బాధ్యతే = బాధింపబడనేరదు.

తా. సామాన్యదృష్టుల కందరాని పదార్థములను యోగీశ్వరులు చూచుచున్నారు. వారు సర్వశక్తి సమన్వితమగు అంతర్యామిగా నున్న పరమాత్మను, సమస్త లోకములకు మూలములగు పరమాణువులను, వానియందు ప్రాథమికమగు క్రియను, దేవతలను, జీవుడు స్థూలదేహమును విడనాడి మరియొక దేహమును ధరియించే మధ్యకాలమున నాతనికి కలిగెడి ఆతివాహికశరీరమును, కాలాంతరమున ఫలము నిచ్చెడి కర్మలయొక్క సంస్కారమును చూడగలరు. అవి రూపాదులవలె ఇంద్రియగ్రాహ్యములు కావు. సుఖదుఃఖాదులవలె మనోగ్రాహ్యములు కావు. ఏదో ఒక దుర్బలమగు హేతువాదమును తీసుకొని వారికి కలిగిన ప్రత్యక్షము శుక్తిరజతజ్ఞానము వంటిదని ఎట్లు చెప్పనగును? దుర్బలమగు అనుమానమే బాధింపబడును.

ఋషుల జ్ఞానము అనుమానముచే బాధింపబడక పోవచ్చును. కాని వారి వచనమును అనుసరించి ప్రవర్తించెడివారికి అంత ఆర్షజ్ఞానము లేనందున వారలను అనుమానము ఏల బంధించదు? కాగా అనుమాన ప్రమాణముచే సంశయము కలుగగా ధర్మాధర్మములందు ప్రవృత్తి కలుగనేరదు అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

యో యస్య స్వమివ జ్ఞానం దర్శనం నాఽతిశఙ్కతే
స్థితం ప్రత్యక్షపక్షే తం కథ మన్యో నివర్తయేత్? ౪౫

యః = ఎవడు—అనగా మునులవచనమును అనుసరించి ప్రవర్తించువాడు, యస్య = ఏయోగియొక్క, దర్శనమ్ = ఉపదేశరూపమగు జ్ఞానమును, స్వమ్ = తన సంబంధమైన, జ్ఞానమ్ + ఇవ = జ్ఞానమును వలె, న + అతిశఙ్కతే = సందేహింపడో, ప్రత్యక్షపక్షే = శిష్టుల ప్రత్యక్ష సమయమున, స్థితమ్ = ఉన్న తనప్రత్యక్షము - అనగా దానితో సమానమగునది అనిభావించు, తమ్ = వానిని, అన్యః = ఇతరుడు—అనగా తర్కమే ప్రమాణముగా గలవాడు, కథమ్ = ఎట్లుగా, నివర్తయేత్ = మరల్పగలడు ?

తా. ఋషుల జ్ఞానమును అనుమానము బాధించక పోవచ్చును. వారి వచనమననుసరించి ప్రవర్తించెడివానిని తర్కము బాధింపగలదు. వానికి మునుల కున్నంత జ్ఞాన ముండదు గదా ? అని శంకింపరాదు. శిష్టులు చెప్పినది శాస్త్రము. వారు అశాస్త్రీయమగు నర్థమును చెప్పరు.

కనుక వారి మాట ప్రమాణమే యని నమ్మిక కలవానిని తర్కము నివారించలేదు. అతడు శిష్టవచనమును నమ్మి సత్కర్మల నాచరించుచునే యుండును.

మనుష్యుడు తనకు ప్రత్యక్షముగా కానవచ్చుచున్న అర్థమునందు సంశయింపడు. శిష్టుల వచనమునుగూడ సంశయింపడు. వారి వచనమును తన ప్రత్యక్షముతో తుల్యమైన దనియే భావించును. 'నీటిలో రాళ్లు తేలును' అని వారుచెప్పినను సంశయము లేకుండ దానిని నమ్మును. వారి మాటయందు అంతటి విశ్వాస మాతనికి కలుగును. అట్టివానిని తర్కము నాధారముగా స్వీకరించువాడు ధర్మాచరణమునుండి మరల్పలేడు.

వేదములు, స్మృతులు అనే ఆగమములకంటె కూడ ఆప్తోపదేశము అధికమగు ప్రమాణము. శ్రుతి స్మృతులు లేకపోయినను ఆప్తుడు చెప్పగా లోకము దాని ప్రకారము సంచరించుచున్నదని చెప్పుచున్నాడు.

ఇదం పుణ్య మిదం పాప మిత్యేతస్మిన్ పదద్వయే
ఆచణ్డాలం మనుష్యాణా మల్పం శాస్త్రప్రయోజనమ్. 40

ఆచణ్డాలమ్ = చండాల పర్యంతము, మనుష్యాణాం = మనుష్యులకు, ఇదం + పాపమ్ = ఇది పాపము, ఇదం + పుణ్యమ్ = ఇది పుణ్యము, ఇతి = అనెడి, ఏతస్మిన్ = ఈ, పదద్వయే = రెండు పదముల విషయమై, శాస్త్రమ్ = శాస్త్రము, అల్పప్రయోజనమ్ = మందమగు ప్రయోజనము కలది.

తా. పుణ్యపాపములు నిజముగ వేదైకగమ్యములు. వానిని వేదము చదువనివారు కూడ తెలిసికొనుచున్నారు. అందులకు పెద్దల వచనములే కారణము. శుభకర్మ చేసిన పుణ్యము. అశుభకర్మ చేసిన పాపము కలుగునని యందరికి తెలియును. దానికై శాస్త్ర మక్కరలేదు. ఆప్తులగువారు పరంపరగా అనుకొనుచున్న ధర్మాధర్మములను వినువారు అందరికి చెప్పగా నదియే ఇంత విశ్వాసమును కలిగించుచున్నది.

కనుక వేదములు, స్మృతులు అనెడి ఆగమములకంటెగూడ ఆప్తోపదేశము పరమ ప్రమాణము. శ్రుతిస్మృతులు లేకపోయినను ఆప్తుడు చెప్పగా లోకము దానిప్రకారము సంచరించుచున్నది. ఇట్టితరి శాస్త్రము ప్రమాణమా? అప్రమాణమా? అను సంశయమునకు కూడ తావు లేదు.

ఈ రీతిగా ఆగమమునకు ప్రామాణ్యముచూపి ఏ ఆగమమును ఆశ్రయించి వ్యాకరణశాస్త్రము ప్రవర్తించినదో ఆ ఆగమమును చూపుచున్నాడు.

చైతన్య మివ యశ్చాయ మవిచ్ఛేదేన వర్తతే
ఆగమ స్త ముపాసీనో హేతువాదై ర్న బాధ్యతే. 41

అవిచ్ఛేదేన = స్వప్రకాశమగుటచే నవిచ్ఛిన్నముగా, చైతన్యమ్ + ఇవ = చైతన్యమువలె, యః + చ + అయమ్ = ఏ ఈ, ఆగమః = శ్రుతిస్మృతిరూపమగు ఆగమము అనగా శబ్దము, వర్తతే = ఉన్నదో, తమ్ = అట్టి ఆగమమును, ఉపాసీనః = సేవించువాడు, హేతువాదైః = హేతువాదములచే, న + బాధ్యతే = బాధింపబడడు.

తా. ఆగమ మనగా శబ్దము. అది అనుమానముకంటె ప్రబలమగు ప్రమాణము. అట్టి యాగమమును నమ్మినవాడు శుష్కహేతువాదములకు లొంగడు. శబ్దము చైతన్యము వలె అవిచ్ఛిన్నముగ అంతట వ్యాపించియున్నది.

వి. శబ్దములు, వానిచే బోధింపబడే అర్థములు, ఆశబ్దార్థములకు గల సంబంధములు నిత్యములనియు, అవి వ్యాకరణాధ్యయనము వలన లభించుననియు శాస్త్రజ్ఞులు చెప్పిరి. కాని వానికొరకింత పరిశ్రమ మనవసరము. లోకమువలననే యవి తెలియబడగలవని ఎవరైనా శుష్కతర్కమునుబట్టి ఎదుర్కొనగలరు. కాని ఆ వాదమునకు బలము చాలదు. శబ్దార్థ సంబంధములు శాస్త్రైకగమ్యములని శబ్దము చెప్పుచున్నది. హేతువాదము కొంతపరిధిని బట్టియే ప్రవర్తించును. సార్వత్రికము కాదు. శబ్ద మట్టిది కాదు. అది జీవచైతన్యమువలె సర్వత్ర వ్యాపించియున్నది. ఆగమమును శిష్టులాదరించిరి. బౌద్ధాదులుకూడ శబ్దమునుబట్టి సత్యమును అహింసను అంగీకరించిరి. గ్రీక్ దేశస్థులుకూడ భక్ష్యాభక్ష్యనియమము నాదరించిరి. శ్రుతి స్మృతి ప్రామాణ్యము నంగీకరించనివారుకూడ శబ్దమునుబట్టి వ్యవహరించుచునే యున్నారు.

వయి రీతిని తర్కముకంటె ఆగమము అన్ని విధముల బలవత్తరమని నిరూపించి, ఆగమమును విడనాడి కేవల తర్కమునే ఊతచేసుకొని ధర్మాధర్మాది విషయమున ప్రవర్తించిన వానికి ప్రమాదము వాటిల్లునని చెప్పుచున్నాడు.

హస్తస్పర్శాది వాన్ధేన విషమే పథి ధావతా
అనుమానప్రధానేన వినిపాతో న దుర్లభః . 42

విషమే = ఎత్తుపల్లములు కల-అనగా నేత్రము లున్నవాడుకూడ వెళ్ళుటకు సాధ్యము కాని, పథి = మార్గమున-అనగా పర్వతమార్గమున, హస్తస్పర్శాత్ = చేతులతో నేలను స్పృశించుటవలన, ధావతా = పరుగెత్తుచున్న, అన్ధేన + ఇవ = గ్రుడ్డివానిచేతను వలె, అనుమాన ప్రధానేన = కేవల తర్కమునే ఆశ్రయించినవానిచే, వినిపాతః = విశేషమగుపతనము, దుర్లభః = లభింపరానిది, న = కాదు. అతనికి అధోగతి తప్పక కలుగునని భావము.

తా. తార్కికుడు ఇంద్రియముచే నొకవస్తువును గ్రహించి దానికి సంబంధించిన మరియొక వస్తువును ఇంద్రియమునకు గోచరించకపోయినను ఉన్నదనియే భావించును. అందు కొక దృష్టాంతమును చూపును. అది సరిగానున్నచో దానినిబట్టి మరియొక అర్థమును గూడ సత్యమనియే తలంచును.

కాని ఒక దృష్టాంతమునుబట్టి అంతట అట్లే ఉన్నదనుట సరికాదు. అంతమాత్రాన పదార్థము నిశ్చితము కానేరదు. గ్రుడ్డివాడు సమప్రదేశమునగూడ ఇతరుని సాహాయ్యము లేనిది నడవలేడు. అట్టి తరి ఎత్తుపల్లములు కల కొండపై ఎట్లు నడవగలడు? కాని అతడు తనచేతితో నేలస్పృశించి అది సమముగా నున్నదని భావించి అడుగుపెట్టి దాని సామ్యముచే మార్గమంతయు సమముగానే యున్నదని తలంచి పరుగెత్తినచో నాతనికి ప్రమాదము వాటిల్లును. నేత్రములు కలవాని సాహాయ్యమున్నచో నట్టి ప్రమాదము కలుగదు. అట్లే వేదశాస్త్రములను నూతగైకొనక కేవలతర్కమునే ధర్మాధర్మ నిర్ణయమునకు గ్రహించువాడు అధోగతిపాలు కాగలడు.

కనుక వేదశాస్త్రములను ప్రమాణముగా గైకొని వానికి అవిరుద్ధమగు తర్కమును ప్రవేశపెట్టినచో నిజమగు ధర్మాధర్మము లాతనికి జ్ఞాతములు కాగలవు.

"న చాగమాదృతే" అను (30 వ) శ్లోకము మొదలు ఇంతవరకున్న గ్రంథముచే ధర్మాధర్మములు తర్కగమ్యములు కావనియు, అర్థజ్ఞానము ఆగమమూలకమనియు నిరూపించి ధర్మాధర్మములు ఆగమైక మూలములని ఉపసంహరించుచున్నాడు.

తస్మా దకృతకం శాస్త్రం స్మృతిం చ సనిబద్ధనామ్
ఆశ్రిత్యాఽఽరభ్యతే శిష్టైః శబ్దానా మనుశాసనమ్. 43

తస్మాత్ = అందువలన-అనగా దుర్బలమగు తర్కము ధర్మాధర్మముల విషయమున నసమర్థమగుటవలన, అకృతకమ్ = అపౌరుషేయమగు, శాస్త్రమ్ = వేదమును, సనిబద్ధనామ్ = శిష్టపరంపరాగతమగు, స్మృతిం + చ = స్మృతిని, ఆశ్రిత్య = ఆశ్రయించి, శిష్టైః = శిష్టులగు పాణిన్యాదులచే, శబ్దానామ్ = శబ్దములయొక్క, అనుశాసనమ్ = అనుశాసనము-అనగా అసాధుశబ్దములనుండి సాధుశబ్దములను వేరుచేయుట, ఆరభ్యతే = ఉపదేశింపబడుచున్నది.

తా. సాధుశబ్దజ్ఞానము తర్కసాధ్యము కానేరదు. ధర్మమునకు కారణమగు శబ్దసాధుత్వము వ్యాకరణైకసాధ్యము. అట్టి వ్యాకరణము అపౌరుషేయమగు వేదమును, శిష్ట పరంపరాగతమగు స్మృతులను గ్రహించి పాణిన్యాదులు లోకుల క్షేమమును గోరి రచించిరి.

వి. "అఇఉణ్" మున్నగు పదునాల్గు సూత్రములు వేదరూపమైనవి వానిలో నుంచి "అణ్, ఇక్, యణ్" మున్నగు సంజ్ఞలను స్వీకరించి వాని నూతనగా చేసికొని ఈ పాణినీయము నిర్మించబడినది. అథర్వవేదమున "కో ధాతుః? కిం ప్రాతిపదికమ్? కః ప్రత్యయః?" అని విచారించబడినది. దానిమూలమున ధాతు ప్రాతిపదిక ప్రత్యయాది సంజ్ఞలను చూపి పాణిని ఈ శాస్త్రమును లోకుల కందజేసెను.

ఆపిశలి, శాకటాయన, శాకల్య, భారద్వాజ, గార్గ్య, సేనక, గాలవ ప్రభృతులగు మహర్షులు వారివారి కాలమున వ్యాకరణములను నిర్మించిరి. ఆ వ్యాకరణముల నన్నిటిని పరిశీలించి పాణిని ఈ వ్యాకరణమును బోధించెను.

పై రీతిని 43 శ్లోకములచే విషయ ప్రయోజన సంబంధాధికారిరూపమగు అనుబంధ చతుష్టయమును జూపి ఈ 44 వ శ్లోకముతో శాస్త్రము నారంభించుచున్నాడు.

ద్వా వుపాదానశబ్దేషు శబ్దౌ శబ్దవిదో విదుః
ఏకో నిమిత్తం శబ్దానా మపరోఽర్థే ప్రయుజ్యతే. 44

శబ్దవిదః = శబ్దముల తత్త్వము నెరింగిన పాణిన్యాది మహర్షులు, ఉపాదాన శబ్దేషు = వాచకములగు శబ్దములవిషయమై-అనగా వానిని అర్థబోధ కలిగించుట కుచ్చరించునపుడు, ద్వౌ = రెండు విధములగు, శబ్దౌ = శబ్దములను, విదుః = గుర్తించుచున్నారు.

ఆ రెంటిలో, ఏకః = ఒకవిధమగు శబ్దము, శబ్దానామ్ = రెండవ విధమగు శబ్దములకు, నిమిత్తమ్ = ప్రకాశకము, అపరః = ఆ రెండవశబ్దము, అర్థే = అర్థమునందు అనగా అర్థమును బోధించుటకై, ప్రయుజ్యతే = ప్రయోగింపబడుచున్నది-అనగా ఉపయోగపడుచున్నది.

తా. రాముడు, కృష్ణుడు, మున్నగు వాచకశబ్దములలో రెండు విధములగు శబ్దములున్నవి. 1. వైఖరి, 2. మధ్యమ. నోటిలోనున్న నాలుక, దంతములు, పెదవులు మొదలగు వాని కదలికచే పుట్టుచున్నశబ్దము వైఖరి. ఇది ఇతరులకుగూడ వినబడును. ఇది యనిత్యమే. బుద్ధిలో నున్నది మధ్యమ. ఇది పుట్టునదికాదు కనుకనే నిత్యము. దీనినే స్ఫోటశబ్ద మందురు.

ఇది ఇతరులకు వినబడునది కాదు. పై రెండువిధములగు శబ్దములు వ్యాకరణశాస్త్రమునకు విషయములగునని మహర్షులు పేర్కొనియున్నారు.

వి. చీకటిలోనున్న పదార్థములకు దీపము ప్రకాశక మగును. అట్లే బుద్ధిలో నున్న మధ్యమాశబ్దమునకు వైఖరి ప్రకాశకమగును. అట్లు ప్రకాశితమగు మధ్యమా వాగ్రూపమగు స్ఫోటశబ్దము అర్థమును బోధించును. వైఖరి ప్రకాశకమేగాని యర్థబోధకము కానేరదు. కాగా వైఖరి ప్రకాశకము, మధ్యమ ప్రకాశ్యము కాగలవు. అవి వ్యంజకము, వ్యంగ్యము అనియు వ్యవహరింపబడుచున్నవి. వ్యక్తపరచునది వైఖరి, వ్యక్తముచేయబడునది మధ్యమ.

నదులు వడిగ పారునపుడు, వీణామృదంగాదులు మ్రోయించునపుడు, పశు,పక్ష్యాదు లరచునపుడు విలక్షణములగు శబ్దములు పుట్టుచున్నవి. అవి ధ్వన్యాత్మకములు. వర్ణాత్మకములు గావు. అట్టివి వ్యాకరణమునకు విషయములు కావు. అవి వాచకశబ్దములు కావు గదా: ఈ యాశయముతోడనే "ఉపాదాన శబ్దేషు" అను పదము ప్రయుక్తమాయెను. ఉపాదానము లనగా ముఖ్యకారణములు. వినువారికి అర్థమును తెలుపుటకు వ్యవహరింపబడు శబ్దములని భావము. ఉపాదానములగు శబ్దములవిషయమై యని యర్థము.

వ్యంజకమగు వైఖరీవాక్కునకు వ్యంగ్యమగు మధ్యమావాక్కునకును శాస్త్రజ్ఞులు భేదాఽభేదముల నంగీకరించి యున్నారని చెప్పుచున్నాడు.

ఆత్మభేద స్తయోః కేచి దస్తీ త్యాహుః పురాణగాః
బుద్ధిభేదా దభిన్నస్య భేద మేకే ప్రచక్షతే. 46

కేచిత్ = కొందరు, పురాణగాః = ప్రాచీనమతము స్వీకరించువారు, తయోః = ఆ రెండుశబ్దములకు, ఆత్మభేదః = స్వరూపభేదము, అస్తి = కలదు, ఇతి = అని, ఆహుః = చెప్పుచున్నారు. వ్యంజకముగా నున్న వైఖరీశబ్దమునకు వ్యంగ్యముగా నున్న మధ్యమాశబ్దమునకును భేదము స్వాభావికమని తలంతురని భావము.

ఏకే = మరికొందరు, అభిన్నస్య = స్వరూపమున నేకరూపమగు శబ్దమునకు, బుద్ధిభేదాత్ = బుద్ధులయొక్క భేదమువలన, అనగా వక్తయొక్క, శ్రోతయొక్క బుద్ధులు భిన్నములు కనుక వానియందున్న భేదమువలన, భేదమ్ = భేదమును, ప్రచక్షతే = చెప్పుచున్నారు.

తా. వైఖరీ శబ్దము వ్యంజకమగుటచే కారణముగను, మధ్యమాశబ్దము వ్యంగ్యమగుటచే కార్యముగను నున్నవి. కార్యకారణములకు భేదము స్వాభావికమే కనుక పై రెండు విధములగు శబ్దములకు నానాత్వము నిజముగనే యున్నదని కొందరు తలంచుచున్నారు కార్యము కారణముకంటె వేరుగా లేదని కొందరు విశ్వసింతురు. వారి మతము చొప్పున కార్యకారణములకు భేదములేనందున పై శబ్దముల కభేదమే సిద్ధించును. కాని పై శబ్దములు భిన్నములగు బుద్ధులలో విషయములగుటచే ఆ బుద్ధి భేదముచే శబ్దమునకు నానాత్వము కాన్పించుచున్నది. కాక వైఖరీశబ్దము చెవికి, మధ్యమ మనస్సునకు విషయమగుటచే వాని యందున్న భేదమునుబట్టి వానికి భేదము లభించును. వైఖరీశబ్దము వక్తయొక్కయు మధ్యమాశబ్దము శ్రోతయొక్కయు బుద్ధిలో విషయ మగును. కాగా శబ్దములకు భేదము కాల్పనికమే. వాస్తవముగాదు.

మొదటి మతమున నా రెండుశబ్దములకు భేదము స్వాభావికమనియు, రెండవ మతమున నది కాల్పనికమనియు తేలినది.

44 వ శ్లోకముచే మధ్యమాశబ్దము వైఖరీశబ్దమునకు నిమిత్తమను నభిప్రాయ ముగూడ లభించుచున్నది. అది ఎట్లు? వైఖరీశబ్దమే ముందుగా జనియించుచున్నదికదా! అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

అరణిస్థం యథా జ్యోతిః ప్రకాశాన్తరకారణమ్
తద్వచ్ఛబ్దోఽపి బుద్ధిస్థః శ్రుతీనాం కారణం పృథక్. 46

యథా = ఏ ప్రకారముగా, అరణిస్థమ్ = అరణియందు అస్పష్టముగానున్న, జ్యోతిః = తేజస్సు, ప్రకాశాన్తరకారణమ్ = తరవాత స్పష్టమగు తేజస్సునకు కారణమో, తద్వత్ = అట్లే, బుద్ధిస్థః = బుద్ధియందున్న అనగా మధ్యమావాగ్రూపమగు, శబ్దః + అపి = శబ్దముకూడ, పృథక్ = భిన్నములగు, శ్రుతీనామ్ = చెవికి వినబడు అకారము ఇకారము మున్నగు వైఖరీ శబ్దములకు, కారణమ్ = కారణమగుచున్నది.

తా. ఎండిన జమ్మికఱ్ఱపై రావికఱ్ఱను నిలిపి దానికి త్రాడుచుట్టి ఇటు అటు మనుష్యులు లాగుదురు. రావికఱ్ఱను నిలుపుటకు జమ్మికఱ్ఱకు ఒకరంధ్రముకూడ నిర్మింతురు. అట్లు లాగినచో ఆ కఱ్ఱల రాపిడి అధికముకాగా నిప్పు పుట్టును. అట్టి నిప్పు బహుపవిత్రమని భావించి దానితో యజ్ఞాది వైదికకర్మ లాచరింతురు. అట్టి కఱ్ఱను అరణియందురు.

అరణిలో నిప్పు సూక్ష్మరూపమున నున్నది. దాని ప్రకాశదాహకత్వాది గుణములు మనకు ప్రత్యక్షముకావు. ఆ యగ్ని అరణిమథనమున బహిర్గతమయి ప్రకాశాది గుణములు కలిగి మనకు ప్రత్యక్షమగుచున్నది. కాగా అరణిలో సూక్ష్మరూపమున ఉన్న అగ్ని ప్రకాశక మనియు దానివలన నభివ్యక్తమగు స్థూలరూపమయిన అగ్ని ప్రకాశ్యమనియు లోకులు గ్రహించుచున్నారు.

అట్లే బుద్ధియందు మధ్యమా వాగ్రూపమగు స్ఫోటశబ్దము సూక్ష్మరూపమున నున్నది. ఆ శబ్దమే వక్తయొక్క అభిప్రాయ విశేషమునుబట్టియు, కంఠము, తాలువు మున్నగు స్థానములయొక్క ఆభ్యంతరప్రయత్నముయొక్క సాహాయ్యముచేతను నభివ్యక్తమయి వైఖరీ శబ్దమును ప్రకాశింపజేయుచున్నది. కనుకనే వైఖరీవాక్కు చెప్పదలచిన అర్థమున కనుగుణము గానే ఉచ్చరింపబడుచున్నది. అనగా ఘటరూపార్థమును బోధింపదలచినచో దానిని బోధించెడి ఘకార అకార టకార అకారవర్ణములనే ఉచ్చరించుట జరుగుచున్నది. అవి లోపల సూక్ష్మ ముగానున్న స్ఫోటశబ్దము ననుసరించియే కలుగుటచే నారూపమున నున్నవి. అట్లుకానున్న ఆ వైఖరీధ్వనులు ఆ రూపముననే ఉండుట కవకాశము చాలదు. కాబట్టి బుద్ధిస్థమగు శబ్దము ననుసరించియే వైఖరీశబ్దము కలుగుటచే నారెంటికి ప్రకాశ్యప్రకాశకభావరూపమగు కార్య-కారణ భావము కలదని నిశ్చయింపవచ్చును.

మధ్యమా వాగ్రూపమగు స్ఫోటశబ్దము బుద్ధియందు సూక్ష్మరూపమున నున్నది. దానికి స్థూలమగు వైఖరీశబ్దము వ్యంజకమగునని 46 వ శ్లోకమున చెప్పబడిన అర్థమునకు ఉపపత్తి చూపుచు. స్ఫోటశబ్దము ఒక్కటియే కనుక ఘటః అను శబ్దమున కానవచ్చుచున్న వైఖరీ ధ్వనులచే నభివ్యక్తమగు ఆ శబ్దమువలన పటరూపార్థబోధ ఏల కలుగదు? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

వితర్కితః పురా బుద్ధ్యా క్వచి దర్థే నివేశితః
కరణేభ్యో వివృత్తేన ధ్వనినా సోఽనుగృహ్యతే. 47

పురా = ఉచ్చరించుటకు పూర్వము, బుద్ధ్యా = బుద్ధిచే, వితర్కితః = విశిష్టమగు రూపముచే అనగా ఇతర శబ్దములనుండి వ్యావృత్తి చేయబడిన రూపముచే నిరూపింపబడి నట్టియు, క్వచిత్ = ఒక, అర్థే=అర్థమునందు-అనగా ఏ యర్థమునందు వైఖరిచే నభివ్యక్త మగు స్ఫోటశబ్దమునకు తాదాత్మ్యము గ్రహింపబడినదో అట్టి యర్థమునందు, నివేశితః= ఉంచబడిన-అనగా బుద్ధితో తాదాత్మ్యము పొందిన, సః=ఆశబ్దము, కరణేభ్యః=స్థాన ప్రయత్నములవలన, వివృత్తేన=పుట్టిన, ధ్వనినా=వైఖరీధ్వనిచే, అనుగృహ్యతే=అనుస రించి గ్రహించబడుచున్నది-అనగా తద్రూప సంవలితమై అభివ్యంజితమగుచున్నది.

తా. ఉచ్చారణకు పూర్వము శబ్దము ఎచట ఉన్నది? ఎట్లున్నది? అను ప్రశ్న కలుగుచున్నది. వాచకమగు మధ్యమావాగ్రూపమగు స్ఫోటశబ్దము హృదయసంవలితమగు బుద్ధిలో నున్నది. ఆ శబ్దముతో అర్థము తాదాత్మ్యమును పొందియుండును. శబ్దార్థములు రెండు బుద్ధిరూపమగు ఒకేస్థలమున నుండుటచే వానికి పరస్పరము అధ్యాసము సంభవించ గలదు. అనగా నర్థమునకు శబ్దమునందు, శబ్దమునకు అర్థమునందును ఆరోపము సంభ వించును. శబ్దమునకు ఏ యర్థముతో తాదాత్మ్యము కలుగునో, ఆ యర్థమును బోధించెడి శబ్దమును ఆ బుద్ధి ఇతరశబ్దములకంటె వేరుచేయును. తరువాత ఆ బుద్ధి ఆ శబ్దమును వివక్షిత ప్రకృతార్థమునందు ప్రవేశింపచేయును. ఇది ఉచ్చారణకు పూర్వము శబ్దార్థములకు బుద్ధివలన కలిగిన ప్రక్రియ. ఇది యంతయు శబ్దోచ్చారణకు ముందు జరిగెడి కథాభాగము.

తరువాత పక్త స్థానప్రయత్నములచే వైఖరీశబ్దమును జనియింపచేయును. ఆ ధ్వనుల ననుసరించియే ఆవాచకశబ్ద మభివ్యక్తమగును. కనుక "ఘట" ధ్వనులచే నభివ్యక్త మగు శబ్దము తనతో తాదాత్మ్యమును పొందిన ఘటరూపార్థమునే బోధించును. పటరూపార్థ మును బోధింపనేరదు. పటరూపార్థముతో స్ఫోటశబ్దమునకు తాదాత్మ్యము లేదుకదా! అట్లు కాకున్న స్ఫోటశబ్ద మొక్కటియే కనుక "ఘటః" అను వైఖరీశబ్దముచే నభివ్యక్తమగు స్ఫోటశబ్దమువలన పటరూపార్థబోధ కలిగెడిని.

కాబట్టి వ్యంజకములగు వైఖరీధ్వనుల ననుసరించియే అభివ్యక్తమగు స్ఫోటశబ్ద ముండును.

బుద్ధిస్థమగు స్ఫోటశబ్దము వ్యంజకధ్వనిదూషితమై భాసించిన ఆ శబ్దమునకు నానాత్వమే లభించును. అట్టితరి శబ్దము నిత్యము, ఏకము అను సిద్ధాన్తము పొసగనేరదు. మరియు క్రమరహితమగు స్ఫోటశబ్దమునందు ధ్వనిధర్మములగు క్రమాదులు నియతముగా భాసించుట యెట్లు ? అను సంశయము కలుగగా దానికి సమాధానము చెప్పుచున్నాడు.

> నాదస్య క్రమజన్మత్వా న్న పూర్వో నాఽపరశ్చ సః
> అక్రమః క్రమరూపేణ భేదవా నివ జాయతే. 48

సః=వైఖరీధ్వనిచే నభివ్యక్తమగు స్ఫోటశబ్దము, పూర్వః=పూర్వత్వముకలది, న+చ=కాదు, అపరః=పరత్వముకలది, న+చ=కాదు, అక్రమః=క్రమములేనిది అనగా పౌర్వాపర్యమనే క్రమములేనిది. అట్లైనను,నాదస్య=వైఖరీధ్వని, క్రమజన్మత్వాత్= క్రమముగా జన్మకలదియగుటవలన, క్రమరూపేణ=నాదగతక్రమరూపమున, భేదవాన్+ ఇవ=భేదముకలదివలె, జాయతే=అగుచున్నది. నిజరూపమున క్రమరహితమైనను

అన్యగతక్రమమును దానియందు ఆరోపించుటచే క్రమముకలదివలె స్ఫోటశబ్దము భాసించు చున్నదని భావము.

తా. బుద్ధిగతమగు స్ఫోటశబ్దము నిజరూపమున నొక్కటియే. దానికి పౌర్వా పర్యము లేదు. పూర్వాపరావయవములు గల వస్తువునకు పౌర్వాపర్యముండును. స్ఫోట శబ్దము నిరవయవము. కాని స్ఫోటశబ్దమును ప్రకాశింపచేయునట్టి వైఖరీశబ్దము తాలువు, పెదవులు మున్నగు అవయవముల కదలికచే పుట్టుట కలదియే. కనుక దానియందు క్రమ మున్నందున దానికి కలిగిన క్రమమును స్ఫోటశబ్దమునందు ఆరోపించవచ్చును. కనుక అదియు క్రమముకలదివలె భాసించవచ్చును. వ్యంజకమగు వైఖరీశబ్దమునందు అనుభవసిద్ధ మగు క్రమమును వ్యంగ్యమగు స్ఫోటశబ్దమునందు ఆరోపించుటచే స్ఫోటశబ్దము క్రమ వంతమువలె కాన్పించును.

కాబట్టి స్ఫోటశబ్దమునకు నిజరూపమునుబట్టి ఏకత్వనిత్యత్వములు, వ్యంజకధ్వని గతక్రమమును ఆరోపించుటచే క్రమనియమముగూడ యుక్తమగును.

స్ఫోటశబ్దము ధ్వనిధర్మమగు క్రమమును గ్రహించుచున్నదనుటలో దృష్టాన్తమును చూపుచున్నాడు.

ప్రతిబిమ్బం యథాఽన్యత్ర స్థితం తోయక్రియావశాత్
తత్ప్రవృత్తిమివాఽన్వేతి స ధర్మః స్ఫోటనాదయోః. 49

అన్యత్ర=మరియొకస్థలమునను అనగా నీరు మున్నగుచోటులందు, స్థితమ్= ఉన్నటువంటి, ప్రతిబిమ్బమ్=చంద్రాది ప్రతిబింబము, తోయక్రియావశాత్=ఉదకము యొక్క చలనక్రియవలన, తత్ప్రవృత్తిమ్=ఆ ఉదకముయొక్క ప్రవృత్తిని, యథా= ఏరీతిగా, అన్వేతి+ఇవ=అనుసరించి వెడలుచున్నట్లున్నదో, సః+ధర్మః=ఆ సాదృశ్యము అనగా ఉపాధిధర్మము ననుసరించుట, స్ఫోటనాదయోః=స్ఫోటశబ్దమునకు నాదమునకును, అస్తి=కలదు.

తా. ధ్వనులందు హ్రస్వత్వ దీర్ఘత్వాది ధర్మములు, ఇది ముందు, ఇది వెనుక అను క్రమరూపమగు ధర్మములు కూడ కలవు. అట్టి ధ్వనులచే స్ఫోటశబ్ద మభివ్యక్తమగును. వ్యంజకమగు ధ్వనియొక్క పైధర్మములు వ్యంగ్యమగు స్ఫోటశబ్దమునందు కాన్పించుచున్నవి. అన్యధర్మము అన్యత్ర భాసించును. ఇందుకు ప్రతిబింబము దృష్టాన్తముగా చూపబడినది. చంద్రబింబము నీటిలో ప్రతిఫలించును. ఆ ప్రతిబింబమునకు స్వతః చలనము మున్నగు వికారములు లేవు. కాని నీటినిబట్టి దానికి వికారములు కలుగుచున్నవి. నీరు కదలిన ప్రతి బింబముకూడ అట్లే కాన్పించును.

శబ్దము ఎట్లు అర్థప్రకాశక మగునో ఆ సంగతిని సదృష్టాన్తముగా చూపుచున్నాడు.

ఆత్మరూపం యథా జ్ఞానే జ్ఞేయరూపం చ దృశ్యతే
అర్థరూపం తథా శబ్దే స్వరూపం చ ప్రకాశతే. 50

యథా=ఎట్లు, జ్ఞానే=జ్ఞానమునందు, జ్ఞేయరూపమ్=జ్ఞేయములగు ఘట పటా దుల స్వరూపము, ఆత్మరూపం+చ=తనయొక్క అనగా జ్ఞానముయొక్క స్వరూపమున్ను,

దృశ్యతే=ప్రత్యక్షముగా చూడబడుచున్నదో, జ్ఞానము కలుగగా అందు ఘటము, పటము మున్నగు అర్థము, జ్ఞానముకూడ భాసించునని భావము.

తథా=అట్లు, శబ్దే=శబ్దమునందు, అర్థరూపమ్=ఘటము, పటము మున్నగు వస్తువుల స్వరూపము, స్వరూపం+చ=శబ్దముయొక్క స్వరూపమున్ను, ప్రకాశతే=ప్రకాశించుచున్నవి.

తా. 'ఘట మానయ' అని యొకడు పలుకగా ఆ వాక్యము వినువానికి 'కడవను తెమ్ము 'అను జ్ఞానము కలుగుచున్నది. జ్ఞాన మనగా తెలివి. అది ఘటము, పటము మున్నగు వస్తువులను ఊతగా గైకొనియే యుండును. వస్తువులను స్పృశింపక కేవలజ్ఞాన ముండనేరదు. విశేష మేమనగా జ్ఞానము వస్తువులను భాసింపచేయును. అజ్ఞానమున అదియుగూడ భాసించును. దీపముకూడ ఇట్టిదే. అది వస్తువులను మన కంటికి గోచరమగునట్లు చేయును. తాను కూడ మన కంటికి గోచరించును. అట్లే శబ్దముకూడ విషయమును జ్ఞానవిషయమైనదానినిగా జేయును. అందు ఆ జ్ఞానముకూడ విషయమగును. ఘటః అను శబ్దమువలన 'కడవ' అను జ్ఞానము కలుగుచున్నది. ఆ జ్ఞానములో 'కడవ' అను వస్తువు, ఘకార అకార టకార అకార విసర్గరూపమగు శబ్దము ఈ రెండు కలసియే యుండును. శబ్దముకూడ భాసించనియెడల 'కడవ' అనియే జ్ఞానముయొక్క స్వరూపము లభించును. శబ్దముకూడ భాసించినచో 'ఘట శబ్దముచే బోధింపబడిన కడవ' అని జ్ఞానముయొక్క ఆకారము చూపవలెను.

వి. ఘటాదిశబ్దములకు అర్థము నందు వలె శబ్దస్వరూపమున గూడ శక్తిని స్వీకరించవలెను. అర్థము విశేష్యముగను, అంశు శబ్దము విశేషణముగను ఉండును. వ్యాకరణ సూత్రాలలో కన్యా, అగ్ని మున్నగు శబ్దము లున్నవి. అచట మాత్రము శబ్దమే విశేష్యమగును. అందు అర్థము విశేషణముగ నుండును.

వైఖరీవాక్కు మధ్యమావాక్కునకు నిమిత్తము. ఇది శ్రోతకు సంబంధించినది. వక్తకు మాత్రము మధ్యమావాక్కు వైఖరీ వాక్కునకు నిమిత్తమని 44వ శ్లోకమున చెప్పబడినది. ఆ యభిప్రాయమునే దృష్టాన్తముతో స్పష్టపరచుచున్నాడు.

> అణ్డభావమి వాఽఽపన్నో యః క్రతుః శబ్దసంజ్ఞకః
> వృత్తి స్తస్య క్రియారూపా భాగశో భజతే క్రమమ్. 51

శబ్దసంజ్ఞకః=శబ్దమనే పేరుకలిగిన, యః=ఏ, క్రతుః=బుద్ధి, అణ్డభావమ్=రసభావమును, ఆపన్నః+ఇవ=పొందినదివలె నున్నదో, తస్య=అ బుద్ధియొక్క, క్రియారూపా=ఆవిర్భావ తిరోభావరూపమగు, వృత్తిః=వ్యాపారము, భాగశః=ప్రత్యవయవమునందు, క్రమమ్=వరుసను, భజతే=పొందుచున్నది.

తా. వైఖరీవాక్కు మధ్యమావాక్కునకు నిమిత్తమగును. ఇట్లు చెప్పుట శ్రోత నుద్దేశించి యున్నది. వక్తకు మాత్రము మధ్యమాశబ్దమే వైఖరీవాక్కునకు నిమిత్తమగును. క్రమముకలిగిన వైఖరీశబ్దము శ్రోతయొక్క బుద్ధిలో ప్రవేశించుసరికి క్రమమును విడనాడి ఏకరూపముగా నుండును. ఆ శబ్దమే మరల ఇతరులతో మాట్లాడునపుడు క్రమవంతమై భాసించును. కాగా మనము మాట్లాడునపుడు వైఖరీ శబ్దము సక్రమము. అదియే శ్రోత యొక్క బుద్ధిలో ప్రవేశించి క్రమరహితమై యున్నది. అదియే ఇతరులతో మాట్లాడుసరికి

వైఖరీరూపమునుదాల్చి క్రమవంతమగును. ఈ రీతిగా శబ్దము పర్యావర్తమగుచున్నది. శబ్దమిన్ని విధములుగా కాన్పించుటలో నొకదృష్టాంతము చూపబడినది. నెమలి మున్నగు పక్షులు అవయవ విభాగముకలవై చక్కని రూపముతో కాన్పించుచున్నవి. ఇది పక్షియొక్క విభక్తమగు అవస్థ. ఆడనెమిలి, మగనెమిలి జంటగా కలియగా వాని యవయవములనుండి రసము జారి ఆడదాని కడుపులో గ్రుడ్డురూపముగా మారుచున్నది. దానిలో మరల నెమిలిగా పరిణమించే శక్తి కలిగిన రసమున్నది. ఇది పక్షియొక్క అవిభక్తమగు అవస్థ. గ్రుడ్డును పొదగగా ఆ రసమే నెమిలియొక్క రూపమున కానవచ్చుచున్నది. ఇది పక్షియొక్క మరల విభక్తమగు అవస్థ. నెమిలి మున్నగువానికి పయి ప్రకారము కలిగే అవస్థాత్రయము శబ్దమునకు గూడ పయి రీతిని కానవచ్చుచున్నది.

వి. క్రతుశబ్దము ఉపనిషత్తులలో నిశ్చయార్థకముగా నున్నది. నిశ్చయార్థమును బట్టి ఇచట క్రతుశబ్దము బుద్ధివాచకము. అండమనగా గ్రుడ్డు. దానియందున్నది – ఆండము = రసము. భాగశబ్దమున కవయవ మర్థము. దానికంటె వీప్సార్థమున 'శస్' తద్ధిత ప్రత్యయము. వీప్స అనగా వ్యాప్తి.

మనుష్యుడు మాట్లాడునపుడు శబ్దమునకు క్రమము కానవచ్చును. శ్రోతకు మాత్రము బుద్ధిలో ఆక్రమము కానరాక ఏకాకారముగానే శబ్దము భాసించును అని చెప్పబడిన పై యర్థమున మరియొక దృష్టాంతమును జూపుచున్నాడు.

యథైకబుద్ధివిషయా మూర్తి రాక్రియతే పటే
మూర్త్యన్తరస్య త్రితయ మేవం శబ్దేఽపి దృశ్యతే. 52

యథా = ఎట్లు, మూర్త్యన్తరస్య = ఎట్టియొక మూర్తికి సంబంధించినట్టియు, ఏకబుద్ధి విషయా = ఒకేబుద్ధికి విషయమగునట్టియు — మనుష్యుని అవయవములు ముందుగ ప్రత్యేకముగ గ్రహింపబడి తరువాత చిత్రకారునికి ఒకే బుద్ధి విషయమై సమస్త సామాన్యాకారమున గోచరించునని భావము. మూర్తిః = బుద్ధిలోనున్న స్వరూపము, పటే = వస్త్రమునందు, ఆక్రియతే = ఆకారవంతముగా చేయబడుచున్నదో.

ఏవమ్ = అట్లే, శబ్దే + అపి = శబ్దమునందుగూడ, త్రితయమ్ = ఈ మూడు రూప త్రయము, దృశ్యతే = ప్రత్యక్షముగా చూడబడుచున్నది.

తా. ఒక మనుష్యుని చిత్రమును వ్రాయదలచిన చిత్రకారుడు ముందుగా ఆ మనుష్యుని ప్రత్యవయవమును గుర్తించును. ఇది విభక్తమగు ప్రాథమికావస్థ. తరువాత అవయవ విభాగము లేకుండ మనుష్యుని రూపమును తన బుద్ధిలో సామాన్యాకారమున నుంచుకొనును. ఇది యవిభక్తమగు రెండవ యవస్థ. మరల ఆతడు ఆ మనుష్యుని చిత్రమును వస్త్రమునందో కాక కాగితమునందో తాను ముందు గుర్తించినరీతిని అవయవ విభాగముతో లిఖించును. ఇది విభక్తమగు మూడవ యవస్థ. కాగా బాహ్యమూర్తి, చిత్రకారుని బుద్ధిలో నున్నమూర్తి, చిత్రరూపమున నున్న మూర్తి అని ఒకేరూపమునకు అవస్థాత్రయము కలుగుచున్నది. ఈ యవస్థాత్రయము శబ్దమునకుగూడ కలుగుచున్నది.

వి. 'ఏకబుద్ధిః విషయః యస్యాః సా' అను రీతిని బహువ్రీహి సమాసమును స్వీకరించగా, మూర్తిః అను విశేష్యమును బట్టి స్త్రీలింగ మువపన్న మగుచున్నది.

శబ్దము తన రూపమును గూడ గ్రహించునని మరల నిరూపించుచున్నాడు.

యథా ప్రయోక్తుః ప్రాగ్ బుద్ధిః శబ్దేష్వేవ ప్రవర్తతే
వ్యవసాయో గ్రహీతౄణా మేవం తేష్వేవ జాయతే . 53

యథా = ఏరీతిగా, ప్రయోక్తుః = శబ్దమును ప్రయోగించువానియొక్క, బుద్ధిః = బుద్ధి, ప్రాక్ = ముందుగా అనగా అర్థమును బోధించుటకు పూర్వము, శబ్దేషు + ఏవ = శబ్దములందే, ప్రవర్తతే = ప్రవర్తించుచున్నదో.

ఏవమ్ = ఈ రీతిగా, గ్రహీతౄణామ్ = అర్థమును గ్రహించెడి శ్రోతలయొక్క, వ్యవసాయః = బుద్ధి, తేషు + ఏవ = శబ్దములందే, జాయతే = కలుగుచున్నది— ప్రవర్తించు చున్నది.

తా. వక్త తన యభిప్రాయమును ఇతరులకు బోధించు సమయమున ముందుగా తన బుద్ధిని శబ్దములందే ప్రవర్తింపచేయును. వానిద్వారా తన భావమును వ్యక్తపరచును.

శబ్దములను విని అర్థముచేసుకొనేవాడు శ్రోత. అతడు తనబుద్ధిని ముందుగా శబ్దములందే ప్రవర్తింపచేయును. వానిద్వారా అర్థమును గ్రహించును. ముందుగ శబ్దముల స్వరూపమును గ్రహింపనిదే అర్థమును గ్రహింపలేడు గదా!

కాబట్టి శబ్దము అర్థమును తన రూపమునుగూడ జ్ఞానమున విషయమగునట్లు చేయునని తెలుచున్నది. 51వ శ్లోకముచే బోధింపబడిన యర్థమును ఈ కారికా గ్రంథము వివరించు చున్నది.

వి. ప్రయోక్తకు బుద్ధిలో ముందుగా అర్థమే భాసించును. దానిని అనుసరించియే వానికి శబ్దములు గోచరించును. ఈ స్థితిలో నర్థము ముందు, తరువాత శబ్దము. ఈ క్రమము ననుసరించి, "యథా ప్రయోక్తుః" అను కారికాభాగము వ్రాయబడలేదు. మరి యేమన, ఇతరులకు తన భావమును వ్యక్తపరచునపుడు జరిగెడిక్రమము ననుసరించి వ్రాయబడినది. ఈ స్థితిలో అర్థముకంటె ముందుగా శబ్దములే వక్తయొక్క బుద్ధిలో భాసించుచున్నవి.

శబ్దము అర్థబోధకమగుటలో ఒక విశేషము : ఘటః అను శబ్దము అర్థవిషయిక మగు జ్ఞానమును కలిగించును. అంతటితో సరిపడక ఘకార అకార టకార అకార రూప మగు తన రూపమునుగూడ జ్ఞానమున విషయమగునట్లుచేయునని చెప్పబడినది. ఒక సంశయము—లోకులు 'ఘట మానయ' (కుండను తీసుకొనిరమ్ము) అని ప్రయోగించగా కుండను తీసుకొనివచ్చుచున్నారు. "అన్నము తినుము" అని ప్రయోగించగా అన్నము తినుచున్నారు. అచట ఘటశబ్దార్థము, అన్నశబ్దార్థము ఆనయనము భోజనము అను క్రియలతో సంబంధించు చున్నవి. అట్లే ఆ క్రియలతో 'ఘట' 'అన్న' అను శబ్దములు గూడ ఏల సంబంధించవు? అవియును భాసించుచునే యున్నవికదా ! అనగా శబ్దము అర్థమును తన రూపమును గూడ ప్రకాశింపజేసినపుడు అర్థము క్రియలతో సంబంధించినట్లు శబ్దముకూడ సంబంధించవలెనుగదా! పయి సంశయమును బోగొట్టుచున్నాడు.

అర్థోపసర్జనీభూతా నభిధేయేషు కేషుచిత్
చరితార్థాన్ పరార్థత్వా న్న లోకః ప్రతిపద్యతే . 54

లోకః = జనము, కేషుచిత్ = కొన్ని, అభిధేయేషు = అర్థములయందు, అనగా శబ్దముచే బోధింపబడిన శబ్దరూపములగు అర్థములయందు, చరితార్థాన్ = సఫలమగునట్టి,

అర్థోపసర్జనీభూతాన్ = ఘటము మున్నగు అర్థములయందు అప్రధానములగు శబ్దములను, పరార్థత్వాత్ = అర్థబోధ కుపయుక్తములగుటచే, పరాధీనములగుటవలన, న + ప్రతిపద్యతే = గ్రహించుటలేదు. ఆనయనము మున్నగు క్రియలతో శబ్దములను సంబంధింప చేయలేదని భావము.

తా. లోకులు తమ మనస్సులోనున్న అభిప్రాయమును ఇతరులకు బోధింప దలచినపుడు దానికి సాధనముగా శబ్దముల నుపయోగింతురు. అచట అర్థబోధనము ప్రధానము. దానికి సాధనముగా నుపయోగపడుచున్నందున శబ్ద మప్రధానము. భోజనము చేయువాడు దానికి సాధనముగా పళ్లెము, విస్తరంట మున్నగువానిని ఉపయోగించును. ఆ వస్తువులవంటివి శబ్దములు. కనుక అప్రధానములైనందున లోకము శబ్దములను ఆనయనాది క్రియలతో సంబంధింపచేయుటలేదు.

వి. అట్టు అప్రధానము కాకున్న శబ్దములకు క్రియలతో సంబంధమును చూపుచునే యున్నారు. వ్యాకరణమున కన్యా, అగ్ని మున్నగు శబ్దముల నుచ్చరించి కొన్ని కార్యములు చెప్పబడినవి. ఆ శబ్దములు కార్యములతో సంబంధించుచునే యున్నవి.

శబ్దము అర్థమును ప్రకాశింపచేయును. తనరూపమును గూడ ప్రకాశింపజేసుకొనును అని 50 వ శ్లోకమున (ఆత్మరూపమ్) చెప్పబడినది. శబ్దము ప్రకాశకము ప్రకాశ్యముకూడ అగును అని దాని భావము తేలుచున్నది. ప్రకాశకత్వ ప్రకాశ్యత్వములు రెండు విరుద్ధ ధర్మములు ఒక శబ్దము నందు ఉండగలవా? అను సంశయమును తొలగించుచున్నాడు.

గ్రాహ్యత్వం గ్రాహకత్వం చ ద్వే శక్తీ తేజసో యథా
తథైవ సర్వశబ్దానా మేతే పృథగివ స్థితే. 55

యథా = ఏరీతిగా, తేజసః = దీపము మున్నగు తేజస్సునకు, గ్రాహ్యత్వమ్ = గ్రహింపబడుటయు, గ్రాహకత్వం + చ = గ్రహింపజేయుటయు అనెడి, ద్వే = రెండు, శక్తీ = శక్తులు, స్థితే = ఉన్నవో, తథా + ఏవ = అట్లే, సర్వశబ్దానామ్ = అన్ని శబ్దములకు, ఏతే = గ్రాహ్యత్వము, గ్రాహకత్వము అను విలక్షణములగు ఈ రెండు శక్తులు, పృథక్ + ఇవ = వేరుగా నున్నట్లు కాన్పించుచున్నవై, స్థితే = ఉన్నవి.

తా. ఉచ్చరింపబడిన శబ్దమర్థబోధను కలిగించుచున్నది. అందుచే నది గ్రాహక మనబడుచున్నది. కాబట్టి దానియందు గ్రాహకత్వమను శక్తి యున్నట్లు తెల్లము. అర్థబోధ కలుగునపుడు అర్థముతోపాటు శబ్దముకూడ జ్ఞానమున విషయ మగుచున్నది. అందుచే శబ్దమునందు గ్రాహ్యత్వమనెడి శక్తియు ఉన్నట్లు తెల్లము.

ఇందు తేజము దృష్టాంతము. ఈ యర్థమును 50 వ శ్లోకమున వివరించి యుంటిని. ఆ శ్లోకమున ఈ యర్థమునకు జ్ఞానము దృష్టాంతముగా జూపబడినది. కాగా జ్ఞానము, తేజము, శబ్దము ఈ మూడు ఒకేశ్రేణికి చెందియున్నవి. ఇవి ఇతరవస్తు ప్రకాశకములు, స్వప్రకాశకములుగూడ నగుచున్నవి. కాగా గ్రాహ్యత్వ గ్రాహకత్వములు, ప్రకాశ్యత్వ ప్రకాశకత్వములు ఈ మూడింటియందు కానవచ్చు చున్నవి.

వి. ఘటము మున్నగు వస్తువులు గ్రాహ్యములే; గ్రాహకములు కానేరవు. కన్ను, చెవి మున్నగు ఇంద్రియములు గ్రాహకములే; గ్రాహ్యములు కానోపవు. ఈ రీతిగా జూచిన నా రెండు ధర్మములు ఏకత్ర ఉండునవి కావు. కాని తేజమునందును, జ్ఞానమునందును ఈ

రెండు ధర్మములు కానవచ్చుచున్నందున శబ్దమునందుగూడ అవి యుండుటలో విరోధము లేదు.

ఈ రెండు శక్తులు శబ్దమున కవిభక్తములగు రూపములే. ఐనను రెండువిధములగు కార్యములనుబట్టి వేరుగానున్నట్లు భాసించుచున్నవి. ఈ యభిప్రాయమును 'ఇవ' శబ్దము స్పష్టపరచుచున్నది.

శబ్దమునందు గ్రాహ్యత్వము గ్రాహకత్వము అనెడి శక్తులు స్వీకరించుటవలన కలిగెడి ప్రయోజనమును జూపుచున్నాడు.

విషయత్వ మనాపన్నైః శబ్దై ర్నార్థః ప్రకాశ్యతే
న సత్తయైవ తేఽర్థానా మగృహీతాః ప్రకాశకాః. 56

విషయత్వమ్ = జ్ఞానములో విషయ భావమును, అనాపన్నైః = పొందనటువంటి- అనగా ఇది ఘటపదము, ఇది పటపదము అని ప్రత్యేకముగా గుర్తింపబడని, శబ్దైః = శబ్దములచే, అర్థః = అర్థము, న + ప్రకాశ్యతే = ప్రకాశింపబడనేరదు. జ్ఞాతమగు శబ్దమే అర్థబోధక మగును. జ్ఞాతము కాకున్న బోధకము కానేరదు.

తే = ఆ శబ్దములు, అగృహీతాః = అజ్ఞాతములై, అనగా తెలియబడనివై, సత్తయా + ఏవ = ఉనికిమాత్రముచేతనే, అర్థానామ్ = అర్థములకు, ప్రకాశకాః = ప్రకాశకములు, న = కానేరవు.

తా. కొన్ని పదార్థములు జ్ఞాతములు కాకపోయినను కార్యజనకము లగుచున్నవి. ఇది 'పంచదార' అని తెలిసినను తెలియకున్నను నాలుకపై ఉంచగా దానిరుచి తెలియును. 'ఇది నిప్పు' అని తెలిసినను తెలియకున్నను తాకినంతమాత్రాన చురుకుమనును. ఇట్లే కన్ను, చెవి మున్నగు ఇంద్రియములుకూడ జ్ఞానజనకములగుచున్నవి. ఇవి సత్తామాత్రముననే కార్యమును కలిగించుచున్నవి.

శబ్దము అట్టిదికాదు. 'ఇది ఘటశబ్దము' అని విశేషరూపమున జ్ఞానవిషయమైనపుడే అర్థబోధ కలుగుచున్నది. అది ఉనికి మాత్రాన బోధకము కాదు.

శ్రోత్రేంద్రియము వర్ణములనే గ్రహించును. అవి యర్థబోధకములు కావు. వానిచే నభివ్యక్తమగు శబ్ద మర్థబోధక మగును. జ్ఞానమున శబ్దముకూడ విషయమగుటచే నది వాచకమగుచున్నది. శబ్దమునందు రెండు శక్తు లంగీకరించుటవలన నిది లభించుచున్నది.

'ఇది ఘటశబ్దము' అని విశేషాకారమున శబ్దము గృహీతమగునపుడే అర్థబోధ కలుగును అనుటలో మరియొక కారణమును జూపుచున్నాడు.

అతోఽనిర్జ్ఞాతరూపత్వా త్కిమాహే త్యభిధీయతే
నేన్ద్రియాణాం ప్రకాశ్యేఽర్థే స్వరూపం గృహ్యతే తథా. 57

అతః = ఈ కారణమువలన, అనగా జ్ఞాతమగుశబ్దమే అర్థబోధకమని యంగీకరించుటవలన, అనిర్జ్ఞాతరూపత్వాత్ = విశేషరూపమున శబ్దరూపము తెలియబడనందున (నిర్జ్ఞాతముకాని రూపము కలవాడగుటవలన అని వాచ్యార్థము) కిమ్ + ఆహ = ఏమిటియంటివి?

అని, అభిధీయతే = చెప్పబడుచున్నాడు - అడుగబడుచున్నాడు. వినేవాడు కర్త, ముందు పలికినవాడు కర్మ, ఇది కర్మార్థక ప్రయోగము.

ఇన్ద్రియాణామ్ = కన్ను, చెవి మున్నగు ఇంద్రియములకు, ప్రకాశ్యే = ప్రకాశింప జేయదగిన, అర్థే = ఘటము, పటము మున్నగు అర్థము విషయమై, స్వరూపమ్ = ఇంద్రియ ముల స్వరూపము, తథా = అట్లు, అనగా అర్థబోధనమున శబ్దమువలె, న + గృహ్యతే = గ్రహింపబడదు.

తా. శబ్దము నుచ్చరించగా నర్థబోధ కలుగుచున్నది. ఆలోచించినచో నంత మాత్రాన బోధ కలుగనేరదు. శబ్దము గృహీతము కావలెను. ఈ యంశమును నచ్చజెప్పవలె నన్నచో దాని లేమినిబట్టి తేలును. మాట్లాడగా ఆ శబ్దము గృహీతమగుటచే బోధకలుగు చున్నది. ఒకడు 'కడవను తెమ్ము' అని పలుకగా ఇతరులకు ఆ శబ్దము వినబడకపోతే కడవను తీసుకురాలేడు. అపుడు వినువాడు "నీవు ఏమిటి యంటివి?" అని ప్రశ్నించును అట్లుకాక శబ్దము గృహీతము కాకపోయినా బోధకమగుచో పై ప్రశ్నకు తావులేదుకదా! మొదటివాడు మరల గట్టిగా స్పష్టముగా జెప్పగా ఆ శబ్దము గృహీతమైనంతనే అతనికి జ్ఞానము కలుగుచున్నది

వి. కన్ను, చెవి మున్నగు ఇంద్రియములు ఇట్టివి కావు. దీని భావమును 56వ శ్లోకమున వివరించితిని.

56 వ శ్లోకమున శబ్దమునకు గ్రాహ్యత్వ గ్రాహకత్వము లను రెండు శక్తు లున్నవని చెప్పబడినది దానికి వ్యాకరణశాస్త్రమున గల విశేష ప్రయోజనమును జూపు చున్నాడు.

భేదేనాఽవగృహీతౌ ద్వౌ శబ్దధర్మా వపోద్ధృతౌ
భేదకార్యేషు హేతుత్వ మవిరోధేన గచ్ఛతః . 58

ద్వౌ = రెండు, శబ్దధర్మౌ = శబ్దమునందున్న ధర్మములు - అనగా 56వ శ్లోకమున చూపిన గ్రాహ్యత్వ గ్రాహకత్వములనెడి శక్తిరూపము ధర్మములు, అపోద్ధృతౌ = వేరు చేయబడుచున్నవై - అనగా ఒకే శబ్దమునందు ఏకశక్తిగా నున్న ధర్మములు బుద్ధిచే వేరుగా విభజింపబడినవై, భేదకార్యేషు = భేదము నిమిత్తముగాగల కార్యములయందు - అనగా రెండు పదార్థములు వేరుగా నున్నపుడు కలిగెడి సంజ్ఞాసంజ్ఞి సంబంధములందు, అవిరోధేన = విరో ధము లేకపోవుటచే - విరోధమును విడిచి యని భావము, హేతుత్వమ్ = కారణత్వమును, గచ్ఛతః = పొందుచున్నవి.

తా. భేద మనగా నానాత్వము దానిని బట్టియే పదార్థములకు సంబంధ మేర్పడు చున్నది. వ్యాకరణమున కొన్నిస్థలములలో ఒకే శబ్దవ్యక్తికి సంజ్ఞాసంజ్ఞిభావము చూపబడినది దానిని కుదురుపాటు చేయుటకై శబ్దమునందు ఏకరూపముగా నున్న శక్తికి నానాత్వమును జూపుచున్నారు. శక్తిభేదముచే శబ్దమునకు నానాత్వము లభించును. అట్టి శబ్దములకు సంజ్ఞా సంజ్ఞి భావము సిద్ధించుచున్నది. అట్లు కాకున్న ఒకే శబ్దమునకు పయి సంబంధము కలుగ నేరదు. ఒకవ్యక్తిని ప్రత్యేకముగా గుర్తించుట కుపయోగించే సాధనము సంజ్ఞ. అట్టిసంజ్ఞచే గుర్తింపబడేది సంజ్ఞి. ఉదా : రాముడు, భీముడు, నలుడు మున్నగునవి సంజ్ఞలు. ఇవి శబ్ద రూపములు. ఆ సంజ్ఞాపదములచే గ్రహింపబడే రామ, భీమ, నల వ్యక్తులు సంజ్ఞులు. అవి

మనుష్యరూపములు. ఇచట సంజ్ఞకు సంజ్ఞికి భేదము స్పష్టముగా నుండుటచే వానికి సంజ్ఞా సంజ్ఞి భావ ముపపన్నమగుచున్నది.

వ్యాకరణ సూత్రములలో ఒకేశబ్దమునకు సంజ్ఞాసంజ్ఞిభావ మున్నది. అచట ఒకేశబ్దము రెండుశక్తుల కాశ్రయమగుటచే భిన్నమయినది. అట్టి రెండుశబ్దములకు పై సంబంధము లభించినది. గ్రాహకత్వధర్మముగల శబ్దము సంజ్ఞగాను, గ్రాహ్యత్వధర్మముకల శబ్దము సంజ్ఞిగాను జూడబడుచున్నవి. పయిరీతిని నాశ్రయించనిచో ఒకేస్థలమున విరుద్ధ ధర్మము లుండనేరవు. పయిపద్ధతిని నాశ్రయించిన, నట్టి విరోధము తొలగి భేదమూలకమగు పై సంబంధము సిద్ధించును.

ఈ శ్లోకార్థమునకు లక్ష్యము 60 వ శ్లోకము వివరించనున్నది.

59 వ శ్లోకమున చెప్పబడిన అర్థమునకు 60 వ శ్లోకముచే లక్ష్యమును జూపదలచి దానికి ముందుగా వ్యాకరణ సమ్మతమగు వృద్ధి, గుణ. సవర్ణ – మున్నగు అర్థమును దృష్టాన్తముగా జూపుచున్నాడు.

వృద్ధ్యాదయో యథా శబ్దాః స్వరూపోపనిబన్ధనాః
ఆదైచ్ప్రత్యాయితైః శబ్దైః సంబద్ధం యాన్తి సంజ్ఞిభిః . 59

వృద్ధ్యాదయః = వృద్ధి మున్నగు, శబ్దాః = శబ్దములు-అనగా వ్యాకరణశాస్త్రమున సూత్రములలో నుపయోగింపబడిన సంజ్ఞాశబ్దములు, స్వరూపోపనిబన్ధనాః = శబ్దస్వరూపమే ప్రవృత్తినిమిత్తముగా గలవై, ఆదైచ్ప్రత్యాయితైః = ఆదైచ్ అను శబ్దముచే బోధింపబడు నట్టియు, సంజ్ఞిభిః = సంజ్ఞిగా నున్నట్టియు, శబ్దైః = ఆ ఐ ఔ అనెడి శబ్దములతో, సంబన్ధమ్ = సంజ్ఞాసంజ్ఞి రూపమగు సంబంధమును, యథా = ఏరీతిగా, యాన్తి = పొందుచున్నవో; ఈ శ్లోకార్థము 60 వ శ్లోకార్థముతో నన్వయించును.

తా. "వృద్ధి రాదైచ్" 1-1-1 అను పాణిని సూత్రము ఆకార ఐకార ఔకారములకు 'వృద్ధి' సంజ్ఞను విధించుచున్నది. వృద్ధిశబ్దము సంజ్ఞ. ఆదైచ్ అను పదముచే బోధింపబడినవి సంజ్ఞులు. ఇచట సంజ్ఞ, సంజ్ఞియు స్వతః వేరుగా నున్నవి. కాబట్టి వానికి సంజ్ఞా సంజ్ఞి సంబంధము సరసముగా కుదురుచున్నది.

ఒకే శబ్దమునకు సంజ్ఞా సంజ్ఞి సంబంధము చూపవలెను. అచట రెండు శబ్దములు యథార్థముగాలేవు. అందుచే నచట ధర్మభేదముచే శబ్దభేదము కల్పితమగుచున్నది.

కాగా రెండు పదార్థములు స్వతః వేరుగా నున్నచోట సంజ్ఞా సంజ్ఞి భావమును జూపునట్లు కల్పనాపక్షమున శబ్దభేదమున్నచోటున గూడ ఆ సంబంధము చూపనగును. ఈ యభిప్రాయముతో భర్తృహరి ఈ దృష్టాన్త వాక్యార్థమును జూపెను. శబ్దములు స్వతః భిన్నములుగా నుండి సంజ్ఞా సంజ్ఞి భావమును బొందిన స్థలములు వ్యాకరణమున చాల కలవు. విశేషమేమన- సంజ్ఞాపదము పదమునే బోధించును. ఆదైచ్చులు వృద్ధిసంజ్ఞకములు అని సామాన్యముగా నర్థము కలదు. ఆదైచః వృద్ధిపదాభిన్నాః అనునది వాచ్యార్థము. ఈ యంశమును 60 వ శ్లోకము వివరించును.

వి. ఈ శ్లోకమున 2 శబ్ద శబ్దములున్నవి. 1. శబ్దాః-ఇది సంజ్ఞాశబ్ద బోధకము. 2. శబ్దైః = ఇది సంజ్ఞిశబ్దబోధకము.

దృష్టాన్తమును జూపి దానికి ప్రకృతమున సమన్వయము జూపుచున్నాడు.

అగ్నిశబ్ద స్తథై వాఽయ మగ్నిశబ్దనిబన్ధనః
అగ్నిశ్రుతై ర్యైతి సంబన్ధ మగ్నిశబ్దాభిధేయయా. 60

తథా + ఏవ = అట్లే-అనగా వృద్ధ్యాదిశబ్దములవలె, అగ్నిశబ్ద నిబన్ధనః = అగ్ని శబ్దమే ప్రవృత్తినిమిత్తముగాకల, అగ్నిశబ్దః = అగ్నిశబ్దము — అనగా "అగ్నే ర్ఢక్" (4-2-33) మున్నగు సూత్రములందున్న అగ్నిశబ్దము, అగ్నిశబ్దాభిధేయయా = సూత్రమునందున్న అగ్నిశబ్దముచే బోధింపబడిన, అగ్నిశ్రుత్యా = లక్ష్యములో నున్న అగ్నిశబ్దముతో, సంబన్ధమ్ = సంజ్ఞా సంజ్ఞి భావరూపమగు సంబంధమును, ఏతి = పొందుచున్నది.

తా. అగ్నిః దేవతా అస్య (అగ్ని ఈ హవిర్భాగమునకు దేవత) అను నర్థమున అగ్నిశబ్దముకంటె "అగ్నే ర్ఢక్" (4-2-33) అను సూత్రముచే "ఢక్" తద్ధిత ప్రత్యయము ప్రవర్తించును. ఆయా ప్రక్రియావశమున "ఆగ్నేయమ్" అను రూప మేర్పడును. సూత్రమునందున్న అగ్నిశబ్దముచే లక్ష్యమునందున్న అగ్నిశబ్దము బోధింపబడి దానికంటె ప్రత్యయము ప్రవర్తించును. కాగా సూత్రస్థమగు అగ్నిశబ్దము సంజ్ఞగను, లక్ష్యమగు అగ్నిశబ్దము సంజ్ఞిగను కాన్పించి రెండును సంజ్ఞా సంజ్ఞిభావమును పొందుచున్నవి. ఇచట ఒకే శబ్దమునకు పయి సంబంధము కలుగుచున్నది. ఈ శబ్దమునందు గ్రాహ్యత్వ గ్రాహకత్వ శక్తిద్వయయోగమున భేదము కల్పితమగుటచే పయి వ్యవహారము నిరాఘాటముగా సుస్థిరమగుచున్నది.

వి. ఇట్టి శబ్దములకు సంజ్ఞా సంజ్ఞిభావమును "స్వం రూపం శబ్దస్య" (1-1-68) అను సూత్రముచే పాణిని బోధించి యున్నాడు. శబ్దమునకు తనరూపమే సంజ్ఞియగునని సూత్రార్థము. శబ్దమునందు గ్రాహ్యత్వ మున్నది కనుక అది సంజ్ఞియు, దానియందు గ్రాహకత్వమున్నది కనుక అది సంజ్ఞయు రెండు నగుచున్నది. వ్యాకరణమున సూత్రములలో ఆయా శబ్దముల నుచ్చరించి కార్యములను విధించునపుడు అంతట ఇదియే ప్రణాళిక. "కన్యాయాః కనీన చ" (4-1-116) కన్యాయా అపత్యమ్ కానీనః. వివాహము లేని స్త్రీకి కలిగిన సంతతి. అట్టివారు వ్యాస కర్ణులు. ఇట్టిసూత్రాలు పెక్కులున్నవి.

ఈ పద్ధతి సంస్కృతముననే గాదు. వ్యాకరణమాత్రాన కలదు. "జగదింద్రజిత్తుల తకారంబునకు లోపంబు విభాషనగు," (30 సూ. తత్సమ. బాలవ్యాకరణము) అను సూత్రముచే జగత్, ఇంద్రజిత్ అను శబ్దముల చివరనున్న తకారమునకు లోపము వికల్పముగా కలుగును. ఉదా: జగము, జగత్తు; ఇంద్రజి, ఇంద్రజిత్తు; ఇంద్రజిత్ శబ్దమునకు ఋత్విగాది పాఠమువలన ఇంద్రజితుండు అనియు రూప ముండును. ఇచటను పై ప్రణాళిక నాశ్రయించవలెను.

ఈ శ్లోకమున 4 అగ్నిశబ్దములున్నవి. 1. సూత్రమునందలి శబ్దము. 2. అది శబ్దప్రవృత్తినిమిత్తకమని చెప్పునది. 3. లక్ష్యమునందలి అగ్నిశబ్దమును బోధించును. 4. అది సూత్రమందున్న అగ్నిశబ్దముచే బోధింపబడునని చెప్పును.

ఈ శ్లోకము 58 వ శ్లోకార్థమునకు లక్ష్యమును, 59వ శ్లోక దృష్టాన్తమునకు దార్ష్టాన్తికమును చూపుచున్నది.

సూత్రవిహితములగు కార్యములు అర్థముకంటె ప్రవర్తింపవు. కాని ఆ కార్యములు సూత్రములలో నుచ్చరింపబడిన శబ్దములకంటె ఏల ప్రవర్తించవు? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

యో య ఉచ్చార్యతే శబ్దో నియతం న స కార్యభాక్
అన్యప్రత్యాయనే శక్తి ర్న తస్య ప్రతిబధ్యతే. 61

యః + యః = ఏఏ, శబ్దః = శబ్దము, ఉచ్చార్యతే = సూత్రమున నుచ్చరింపబడుచున్నదో, సః = ఆ శబ్దము, నియతమ్ = నియతముగా- అనగా తప్పక, కార్యభాక్ = కార్యమును బొందునది, న = కానేరదు. సూత్రమున నుచ్చరింపబడిన శబ్దముకంటె ఆ సూత్రముచే విధింపబడు కార్యము ప్రవర్తించదని భావము.

తస్య = ఆ సూత్రమున నుచ్చరింపబడిన శబ్దమునకు, అన్యప్రత్యాయనే = ఇతరమగు - అనగా లక్ష్యమునందున్న శబ్దమును బోధించుటయందు, శక్తిః = సామర్థ్యము, న ప్రతిబధ్యతే = నిరోధింపబడదు.

తా. అగ్నే ర్ఢక్ 4-2-33 మున్నగు సూత్రములలో నుచ్చరింపబడిన అగ్ని శబ్దము లక్ష్యములోనున్న అగ్నిశబ్దమును మనకు జ్ఞానవిషయముగాజేసి దానికంటె ప్రత్యయమును ప్రవర్తింపజేయుటకై ఉపయోగపడుచున్నది. ఈ ప్రయోజనమును అపేక్షించియే సూత్రమున ఆ శబ్దము ఉచ్చరింపబడినది. కాగా ఆ శబ్దము ప్రయోజనాంతరమును అపేక్షించి ఉచ్చరింపబడుటచే అప్రధానమగుచున్నందున తత్సూత్రవిహితకార్యములు ఆ శబ్దమునకు కలుగవు. లక్ష్యమునందున్న శబ్దము కంటెనే ప్రవర్తించును.

సూత్రోచ్చారితమగు శబ్దము తత్సూత్ర విహితమగు ప్రత్యయమును పొందకపోవచ్చును. అది లక్ష్యమునందున్న శబ్దమును బోధించుటలో మరేమియు ప్రతిబంధకము లేనందున దానిని తప్పక బోధించును.

వి. సంజ్ఞాశబ్దము లన్నిటికి ఇదియే ప్రయోజనము. సజ్ఞిని తెలిపి అవి తటస్థము లయి యుండును. సంజ్ఞి ప్రధానము కనుక దానికి కార్యాలు ప్రవర్తించును. సంజ్ఞ అప్రధానము కాబట్టి దానికి ఆ కార్యాలు ప్రవర్తించవు.

సూత్రమున ఉచ్చరింపబడిన శబ్దములకు ఆ కార్యము ప్రవర్తించదు అనుటలో హేతువును జూపుచున్నాడు

ఉచ్చరన్ పరతన్త్రత్వా ద్గుణః కార్యై ర్న యుజ్యతే
తస్మా త్తదర్థైః కార్యాణాం సంబన్ధః పరికల్ప్యతే. 62

ఉచ్చరన్ = సూత్రమున నుచ్చరింపబడిన శబ్దము, పరతన్త్రత్వాత్ = పరాధీనమగుటవలన - అనగా లక్ష్యమునందున్న శబ్దమును బోధించుటకై ఉపయోగింపబడుటవలన, గుణః = అప్రధానమగుచున్నదై, కార్యైః = సూత్రవిహితములగు కార్యములతో, న + యుజ్యతే = సంబంధముకలది కానేరదు.

తస్మాత్ = అందువలన అనగా సూత్రమునందుచ్చరింపబడిన శబ్దము కార్యమును బొందనందున, తదర్థైః = సూత్రోచ్చారిత శబ్దముల కర్థములగు లక్ష్యస్థశబ్దములతో, కార్యా

ణామ్ = సూత్రవిహిత కార్యములకు, సంబన్ధః = సంబంధము, పరికల్ప్యతే = కల్పింపబడు చున్నది.

తా. పరాధీనమగుటచే సూత్రోచ్చారితము అప్రధానము. కనుక దానికి కార్య సంబంధ ముండదు. లక్ష్యస్థశబ్దములు ప్రధానములు కనుక వానికి ఆ కార్యములు ప్రవర్తించును.

వి. ఈ శ్లోకమున "ఉచ్చరన్" అను శబ్దము ఉచ్చార్యమాణః అను అర్థమును బోధించును. ఈ శబ్దము ప్రేరణార్థమును జెప్పును. కాబట్టి వైయర్థము లభించును.

గుణ శబ్దము అప్రధానార్థకము.

సూత్రమునందుచ్చరింపబడిన శబ్దము లక్ష్యములో నున్న శబ్దమును బోధించుటకై ఉపయుక్తమైనందున అప్రధానమగుచున్నది. కనుక సూత్రమున నుచ్చరింపబడిన శబ్దము కంటె తత్సూత్ర విహితకార్యము ప్రవర్తించదు. అని 62 వ శ్లోకమున చెప్పబడినది. ఇట్టితరి లక్ష్యస్థమగు శబ్దము కూడ మనుష్యులకు అర్థబోధనకై ఉచ్చరింపబడుటచే నప్రధానమే కనుక దానికంటెగూడ ఆ కార్యము ప్రవర్తింపకున్నది అను ప్రశ్నకు 63 చే సమాధానము జెప్పుటకై ముందుగ ఒక దృష్టాంతమును జూపుచున్నాడు.

సామాన్య మాశ్రితం యద్య దుపమానోపమేయయోః
తస్యత స్యోపమానేషు ధర్మోఽన్యో వ్యతిరిచ్యతే . 63

ఉపమానోపమేయయోః = ఉపమానోపమేయములకు, యత్ + యత్ = ఏ ఏ, సామాన్యమ్ = సాధారణ ధర్మము, ఆశ్రితమ్ = ఆశ్రయింపబడుచున్నదో, తస్య + తస్య = ఆయా సాధారణధర్మమునకుగూడ, ఉపమానేషు = ఉపమితులు చెప్పవలసినయెడల నపుడు- అనగా దానికిగూడ ఉపమానోపమేయభావము చూపవలసివచ్చిన, అన్యః = మరియొక, ధర్మః = సాధారణ ధర్మము, వ్యతిరిచ్యతే = భిన్నమగుచున్నది.

తా. మోము చంద్రునివలె సుందరముగ నున్నదని లోకులు వ్యవహరింతురు. ముఖ చంద్రులకు ఉపమానోపమేయభావము భాసించుచున్నది. అందు పదార్థభేదము కారణము. సౌందర్యము సాధారణధర్మము. అది ఉభయసాధారణము, ఏకరూపమే.

ముఖచంద్రులు స్వతః భిన్నపదార్థములు కనుక వానియందున్న సౌందర్యము గూడ భిన్నమే యగును. అది వేరు గాగా ముఖ చంద్రులకువలె ఆ సౌందర్యములకు గూడ ఉపమానోపమేయభావము కల్పింపవలసి యున్నది. అపుడు ఆ రెంటికి సాధర్మ్యము నున్నగు సాధారణధర్మము కల్పితము కాగలదు. ఆశ్రయభేదమునుబట్టి దానినింత భిన్నముగా వివక్షించిన, వానికి సామ్యము చెప్పవలసి వచ్చినపుడు మరియొక సాధారణ ధర్మమును కల్పించవలసి యున్నది. ఇట్లు అనంత పరంపరగా సాధారణధర్మము కల్పితము కాగలదు. ఇది యంతయు వివక్షను బట్టి జరుగుచున్నది.

వి. ఇట్లే, "బ్రాహ్మణుని వలె క్షత్రియుడు చదువుచున్నాడు" అను ప్రయోగమున బ్రాహ్మణుడుపమానము, క్షత్రియు డుపమేయము కాగలరు. వారిదువురకు అధ్యయనము సాధారణధర్మము. అది ఒక్కటియే కాని బ్రాహ్మణ, క్షత్రియులు భిన్నులు. కాగా వారి యందున్న అధ్యయనముగూడ భిన్నమే యగును. అట్టితరి యధ్యయనములకు సామ్యమును జూపిన, వానికి సాధారణధర్మము సౌష్ఠవము కాగలదు. ఆ సౌష్ఠవముగూడ భిన్నముగా వివ

క్షితమగుచో, నచట మరియొక సాధాణధర్మము, దానికి మరియొక సాధారణధర్మము కల్పితము కాగలదు. ఇట్లు అనంతపరంపర సంభవించును.

ఈ శ్లోకమున ఇట్లు సాధారణ ధర్మపరంపరా కల్పనకు 65 వ శ్లోకమున ప్రయోజనము చూపబడును.

మరియొక దృష్టాంతమును జూపుచున్నాడు.

గుణః ప్రకర్షహేతు ర్యః స్వాతన్త్ర్యే ణోపదిశ్యతే
తస్యాఽఽశ్రితా ద్గుణాదేవ ప్రకృష్టత్వం ప్రతీయతే. 64

ప్రకర్షహేతుః = ద్రవ్యముయొక్క ప్రకర్షకు హేతువగు, యః = ఏ, గుణః = గుణము, స్వాతన్త్ర్యేణ = స్వాతంత్ర్యమున, ఉపదిశ్యతే = చెప్పబడుచున్నదో, అనగా వివక్షితమగుచున్నదో, తస్య = ఆ గుణమునకు, ఆశ్రితాత్ = ఆశ్రయింపబడిన-అనగా తనకు ఆశ్రయమగు వస్తువును వేరుచేయుటకై వివక్షింపబడిన, గుణాత్ + ఏవ = గుణమువలననే, ప్రకృష్టత్వమ్ = ప్రకర్ష, ప్రతీయతే = తెలియబడుచున్నది.

తా. రెండు మూడు వస్తువులకు తారతమ్యము జూపునపుడు తర, తమప్రత్యయము లుపయుక్తము లగుచున్నవి. ఉదా: 'శుక్లతరః పటః, శుక్లతమః పటః'. ఈ వస్త్రము మిక్కిలి తెల్లనిది యని యభిప్రాయము. ద్రవ్యమునకు స్వతః ఉత్కర్షాపకర్షములు లేవు. ఆ ద్రవ్యమునందున్న గుణముయొక్క ప్రకర్షాపకర్షలను పురస్కరించుకొని ద్రవ్యప్రకర్షము ఉపపన్నమగుచున్నది. ప్రధానమగునది ద్రవ్యమనియు, అప్రధానమైనది గుణమనియు గుణప్రధానభావము వివక్షామూలకమనియు వైయాకరణులు విశ్వసింతురు. వస్త్రము ప్రధానముగా వివక్షితమగుటచే దానికి అప్రధానమగు శుక్లరూపమును బట్టి ఉత్కార్షాపకర్షములు కలుగుచున్నవి.

ఒకవేళ శుక్లరూపమునే ప్రధానముగా వివక్షించిన నదియు ద్రవ్యమే కనుక దానికి స్వతః ఉత్కర్షాపకర్షములుండవు. అపుడు శుక్లరూపమునందున్న శుక్లత్వమనే ధర్మమును తీసికొని దానియందున్న ఉత్కర్షాపకర్షములను బట్టి తర తమ ప్రత్యయములు ప్రవర్తించును.

కాగా శుక్లతరః పటః అనుచోట శుక్లరూపమునందున్న ప్రకర్షమును బట్టియు పటస్య రూపం శుక్లతరమ్ అనుచోట శుక్లత్వమునందున్న ప్రకర్షమునుబట్టియు తర ప్రత్యయము ప్రవర్తించును.

ఒకవేళ శుక్లత్వమునకు గూడ ప్రాధాన్యమును వివక్షించిన నదియు ద్రవ్యమే కనుక శుక్లత్వమునందున్న మరియొక ధర్మమునుజూపిన తర ప్రత్యయము ప్రవర్తించును.

పై పద్ధతిని అనంత పరంపరా రూపమున గుణకల్పన చేయవచ్చు. ఇది యంతయు వక్తయొక్క ఇచ్ఛపై ఆధారపడి యున్నది.

ఇట్టి యర్థమును స్వీకరించుటకు గూడ 65 వ శ్లోకమున ప్రయోజనము చూపబడును.

63, 64 శ్లోకములచే రెండు దృష్టాంతములు చూపబడినవి. వాని ఉపయోగము జూపుచు ప్రకృతమున సమన్వయము చేయుచున్నాడు.

తస్యాభిధేయభావేన యః శబ్దః సమవస్థితః
తస్యా ప్యుచ్చారణే రూప మన్య త్తస్మా ద్వివిచ్యతే. 65

తస్య = ఆ సూత్రమున నుచ్చరింపబడిన శబ్దమునకు, అభిధేయభావేన = అర్థ రూపమున, యః = ఏ, శబ్దః = శబ్దము, సమవస్థితః = ఉన్నదో, అనగా లక్ష్యములలో కాన్పించుచున్నదో, తస్య + అపి = ఆ శబ్దముయొక్కయు, ఉచ్చారణే = ఉచ్చారణము కలుగగా- అనగా ఉచ్చరితత్వము కలుగగా, తస్మాత్ = ఆ శబ్దముకంటె, అన్యత్ = ఇతర మగు, రూపమ్ = రూపము, వివిచ్యతే = వేరుగా గ్రహింపబడుచున్నది. ఉచ్చారణ క్రియచే రెంటికి భేదముకలుగునని భావము.

తా. లక్ష్యములోనుండు శబ్దమును బోధించుటకై సూత్రమునందు శబ్దముచ్చరింప బడినది. కనుక అది అప్రధానమగుచున్నది. లక్ష్యస్థ శబ్దము ప్రధానము కనుక దానికంటె సూత్రవిహిత ప్రత్యయము ప్రవర్తించును. అప్రధానమగుటచే సూత్రమునందలి శబ్దముకంటె ప్రత్యయము ప్రవర్తించదు. ఇచట ఉచ్చరితత్వమే కారణము. ఈయభిప్రాయమును 62 వ శ్లోకము స్పష్టపరచి యున్నది.

63 వ శ్లోకముయొక్క అవతారికలో చూపబడిన సంశయమునకు సమా ధానము- శబ్దములు రెండు విభిన్నములు. కనుక ఒక దానికి కార్యము ప్రవర్తించుట, మరి యొకదానికి ప్రవర్తించక పోవుట యుక్తమే. రెంటికి ఉచ్చరితత్వమనే ధర్మము సమానము. కనుక పై కార్యవ్యవస్థ ఎట్లు? నిజమే, కాని వానికి ఉచ్చారణక్రియనుబట్టి భేదము సిద్ధించును. సూత్రమున అగ్ని శబ్దోచ్చారణముకంటె లక్ష్యములో అగ్నిశబ్దోచ్చారణము భిన్నమే. క్రియా భేదముచే కార్యభేదము లభించును. కాగా ఏ కార్యమును బోధించుటకై ఏ శబ్దమును ఉచ్చ రించెదమో, ఆ కార్యము ఆ శబ్దమునకు కలుగదు. కార్యాంతరము కలుగవచ్చును. లక్ష్య ములోనున్న అగ్ని శబ్దముకంటె "ఢక్" ప్రత్యయసిద్ధికై సూత్రమున అగ్నిశబ్దోచ్చారణము. కనుక ఆ ప్రత్యయము సూత్రమునందున్న అగ్ని శబ్దమునకు కలుగదు. ఆ శబ్దముమాత్రము లక్ష్యములోనున్న అగ్ని శబ్దమును బోధించగలదు. అగ్నిదేవతకు హవిస్సంబంధమును బోధించుటకై లక్ష్యములో అగ్నిశబ్ద ముచ్చరింపబడినది. కనుక ఈ పరిస్థితిలో అగ్ని శబ్ద మునకు హవిస్సంబంధము కలుగదు. ఆ శబ్దము 'ఢక్' ప్రత్యయము పొందగలదు.

వి. పైరీతిని శబ్దమునకు భేదము కల్పించవచ్చునా అను సందేహము కలుగు చుండగా దానికి ముందుగనే 62, 64 శ్లోకములచే 2 దృష్టాంతములు చూపబడినవి. "మోము చంద్రునివలె సుందరము" అను ఉపమా స్థలమునవలెను, శుక్లతరః పటః అను తర ప్రత్యయ స్థలమునవలెను భేదము కల్పించి సమన్వయము చేయవలెను. ఇది యంతయు వక్తయొక్క వివక్షనుబట్టి కలుగును.

"భేదకార్యేషు'' అని 63వ శ్లోకముచే జూపబడిన అర్థమును వివరించుచున్నాడు.

ప్రాక్ సంజ్ఞినాభిసంబన్ధా త్సంజ్ఞా రూపపదార్థికా
షష్ఠ్యాశ్చ ప్రథమాయాశ్చ నిమిత్తత్వాయ కల్పతే . 66

సంజ్ఞా = సంజ్ఞావాచకము, సంజ్ఞినా = సంజ్ఞితో, అభిసంబన్ధాత్ = సంబంధించుట కంటె, ప్రాక్ = పూర్వము, రూప పదార్థికా = శబ్దస్వరూపమే అర్థముగాగలదై, షష్ఠ్యాః + చ = షష్ఠీ విభక్తికి, ప్రథమాయాః + చ = ప్రథమకు, నిమిత్తత్వాయ = నిమిత్తత్వముకొరకు, కల్పతే = సమర్థమగుచున్నది.

తా. వ్యాకరణ శాస్త్రమున వృద్ధిపదముచే ఆదైచ్చులు గ్రహింపబడుచున్నవి. అందు "వృద్ధి రాదైచ్" 1-1-1 అను సూత్రముచే వానికి వృద్ధిసంజ్ఞావిధానము కారణము. ఆ సంజ్ఞాసూత్రమున కర్థము తెలిసినపిమ్మట పై వ్యవహారము కలుగును. కాగా ఆ సంజ్ఞా సూత్రమున కర్థజ్ఞానము కలుగుసమయమున వృద్ధిపదము ఆదైచ్చులను బోధింపజాలదు. ఆ కాలమున వృద్ధిపదమునకు ఆ శబ్దస్వరూపమే వాచ్యార్థము. లోకప్రసిద్ధమగు అభివృద్ధి కానేరదు. అది ప్రకృతమున అన్వితము కాదు. కాబట్టి ఘటపదమునకు కడవ అర్థమగునటుల ఇచట వృద్ధిశబ్దమునకు వకార, ఋకార, దకార, ధకార, ఇకార వర్ణసముదాయాత్మకమగు శబ్దస్వ రూపమే వాచ్యార్థమగును.

వి. వ్యాకరణమున సంజ్ఞాసూత్రములు రెండువిధములుగా నున్నవి. 1. సంజ్ఞావాచ కము, సంజ్ఞిబోధకము రెండుకూడ ప్రథమాన్తములుగా నుండుట. ఉదా: "వృద్ధిరాదైచ్" 1-1-1 వృద్ధిశబ్దము సంజ్ఞ, ఆదైచ్చులు సంజ్ఞులు. రెండు ప్రథమాన్తములే. 2. సంజ్ఞావాచకము ప్రథమాన్తముగను, సంజ్ఞి షష్ఠ్యంతముగాను ఉండుట. ఉదా: ఊఞః 1-1-17అను సూత్రముచే ఉఞ్ అను నిపాతమునకు ఇతి శబ్దము పరమగునపుడు ప్రగృహ్యసంజ్ఞ కలుగుచున్నది. ఇచట సంజ్ఞి ఊఞః అనునది షష్ఠ్యంతము. సంజ్ఞ ప్రథమాన్తము. కాగా సంజ్ఞికి ప్రథమ, షష్ఠియు ప్రవర్తించును.

ఈ శ్లోకమున పదార్థశబ్దము వాచ్యార్థపర్యాయము. పదార్థః = వాచ్యార్థము. రూపశబ్దమునకు స్వరూప మర్థము. రూపం పదార్థః యస్యాః సా అని బహువ్రీహి.

ప్రథమా విభక్తి, షష్ఠీవిభక్తియు ఎట్లు ప్రవర్తించునో ఆ మార్గమును జూపు చున్నాడు.

తత్రార్థవత్త్వాత్ప్రథమా సంజ్ఞాశబ్దా ద్విధీయతే
అస్యేతి వ్యతిరేకశ్చ తదర్థా దేవ జాయతే. 67

తత్ర = ఆ షష్ఠీ ప్రథమావిభక్తులలో, సంజ్ఞాశబ్దాత్ = సంజ్ఞిని బోధించెడు శబ్దము కంటె, అర్థవత్త్వాత్ = శబ్దస్వరూపమునుబట్టి అర్థవంతమగుటవలన, ప్రథమా = ప్రథమా విభక్తి, విధీయతే = విధింపబడుచున్నది.

అస్య + ఇతి = దీనికి అనెడి, వ్యతిరేకః + చ = భేదముకూడ, తదర్థాదేవ = సంజ్ఞా శబ్దముయొక్క ఆదైచ్ రూపమగు అర్థమువలననే, జాయతే = కలుగుచున్నది.

తా. సంజ్ఞాశబ్దము సూత్రము సంజ్ఞితో కలియనపుడు తన స్వరూపమునే బోధించును. అందుచే ఆ శబ్దము అర్థవంతమై ప్రాతిపదికసంజ్ఞ కలది యగును. దానికంటె ప్రథమావిభక్తి ప్రవర్తించును.

వి. సంజ్ఞకు, సంజ్ఞికి అభేదమును వివక్షించిన రెండును ప్రథమాంతములే యగును. ఉదా: "వృద్ధి రాదైచ్" 1-1-1 "భూవాదయో ధాతవః" 1-3-11. వానికి భేదమును వివ క్షించిన సంజ్ఞికంటె షష్ఠీవిభక్తి సాధువగును. 'ఆదైచాం వృద్ధిః' అని యుండును.

"ఊఞః" 1-1-18 సూత్రమును షష్ఠికి ఉదాహరణగా జూపవచ్చును.

పై రీతిని శబ్దమునందు గ్రాహకత్వ గ్రాహ్యత్వములనెడి రెండు శక్తులను ఆశ్రయించి "స్వం రూపం శబ్దస్యాఽశబ్దసంజ్ఞా" 1–1–68 అను సూత్రార్థము విచారింపబడినది. ఇపుడు జాతి వ్యక్తి పక్షముల నాశ్రయించి జాతి వ్యక్తి భేదముచే సంజ్ఞా సంజ్ఞి భావము కుదురుచున్నదని యట్టి యభిప్రాయముతో పయి సూత్రమునకు సమన్వయము జూపుచున్నాడు.

స్వం రూపమితి కైశ్చిత్తు వ్యక్తిః సంజ్ఞోపదిశ్యతే
వ్యక్తేః కార్యాణి సంసృష్టా జాతిస్తు ప్రతిపద్యతే . 68

కైశ్చిత్ + తు = కొందరిచేతను అయితే, స్వంరూపమ్ + ఇతి = "స్వంరూపం" అను పాణిని సూత్రమున, వ్యక్తిః = శబ్దవ్యక్తి, సంజ్ఞా = సంజ్ఞాపరముగా, ఉపదిశ్యతే = చూపబడుచున్నది. వ్యక్తేః = వ్యక్తికి సంబంధించియున్న, కార్యాణి = ప్రత్యయము పరముగా వచ్చుట మున్నగు కార్యములను, సంసృష్టా = వ్యక్తితో నిత్యసంబద్ధమగు, జాతిః + తు = జాతియు, ప్రతిపద్యతే = పొందుచున్నది.

తా. 56 వ శ్లోకమునుంచి ఇంతవరకు శబ్దమునందు గ్రాహ్యత్వము, గ్రాహకత్వము అనే రెండుశక్తుల నాశ్రయించి "స్వంరూపం శబ్దస్య" అను పాణిని సూత్రము విచారితమాయెను. శక్తిభేదముచే శబ్దమునకు నానాత్వము నంగీకరించి సంజ్ఞాసంజ్ఞిభావ ముపపాదింపవలెనని దాని యాశయము.

అట్లుగాక జాతి వ్యక్తి పక్షముల నాశ్రయించి వాని భేదముచే సంజ్ఞా సంజ్ఞి భావమును చూపుటకు 68, 69, 70 శ్లోకములు చూపబడుచున్నవి.

అగ్ని, కన్య మున్నగు శబ్దములు సూత్రములలోను, లక్ష్యములలోను కానవచ్చుచున్నవి ఘటాది పదార్థములందు ఘటత్వాది జాతులున్నట్లు పై శబ్దములందు అగ్నిశబ్దత్వము కన్యాశబ్దత్వము మున్నగు జాతులున్నవి. కాగా అకార గకార నకార ఇకార రూప వర్ణసముదాయాత్మకమగు శబ్దము వ్యక్తియనియు, దానియందున్న అగ్నిశబ్దత్వము జాతియనియు స్వీకరింపబడుచున్నది.

ఈ పక్షమున వ్యాకరణసూత్రములలో నున్న శబ్దవ్యక్తి సంజ్ఞిగాను, లక్ష్యములలో నున్న శబ్దములందలి శబ్దత్వజాతి సంజ్ఞిగాను చూపబడుచున్నది.

అగ్ని శబ్దత్వజాతి సంజ్ఞియగుచో దానికంటె ప్రత్యయము పరముగా ప్రవర్తించుట మున్నగు కార్యాలు స్వతః సంభవించవు. కాని వ్యక్తితో నిత్యసంబద్ధము జాతి యగుచున్నది. వ్యక్తికి ఆకార్యములు సంభవించును. కాగా వ్యక్తిద్వారా జాతి ఆకార్యములను పొందగలదు.

68 వ శ్లోకమున వ్యక్తి సంజ్ఞ అని, జాతి సంజ్ఞియని సమన్వయము చేయబడినది. ప్రస్తుతము వ్యక్తి సంజ్ఞియనియు, జాతి సంజ్ఞ అనియు సమన్వయము జూపుచున్నాడు.

సంజ్ఞినీం వ్యక్తి మిచ్ఛన్తి సూత్రగ్రాహ్యా మథాఽపరే
జాతిప్రత్యాయితా వ్యక్తిః ప్రదేశే షూపతిష్ఠతే . 69

అథ = అట్లుగాక, అపరే = కొందరు, సూత్రగ్రాహ్యమ్ = సూత్రముచే గ్రహింపబడే అనగా "స్వంరూపం శబ్దస్య" అను సూత్రమున స్వం రూపం అను పదములచే బోధింపబడిన జాతిచే గ్రహింపబడెడి, వ్యక్తిమ్ = అగ్ని, కన్యా మున్నగు శబ్దరూపమగు వ్యక్తిని, సంజ్ఞినీం = సంజ్ఞినిగా, ఇచ్ఛన్తి = కోరుచున్నారు.

జాతిప్రత్యాయితా = జాతిచే నాక్షేపింపబడిన, వ్యక్తిః = వ్యక్తి, ప్రదేశేషు = ప్రదేశములయందు అనగా సూత్రములయందు, ఉపతిష్ఠతే = సన్నిహితమగుచున్నది, అనగా అగ్నేర్ఢక్ అను సూత్రమున సంబంధించును.

తా. వ్యక్తియే సంజ్ఞి కావలెను. లేక జాతియే సంజ్ఞి కావలెను అని చెప్పుటలో నియామకము లేనందున 68, 69 శ్లోకములలో రెండు పక్షములు చూపబడినవి. ఏ పక్షము నాశ్రయించినను కార్యము కలుగుటలో భేదము లేదు. ఐనను జాతివ్యక్తులకు ప్రధానాప్రధాన భావమును పురస్కరించుకొని బుద్ధివైశద్యమును కలిగించుటకు భర్తృహరి పక్షభేదమును జూపెను.

68 వ శ్లోకమున వ్యక్తి సంజ్ఞి అని చెప్పుటకు, 69 వ శ్లోకమున జాతి సంజ్ఞి అని చెప్పుటకును - అనగా జాతి వ్యక్తులను నిమిత్తముగా జేసుకొని సంజ్ఞా సంజ్ఞి భావము కుదురును అని చెప్పుటకు ఉపపత్తి చూపుచున్నాడు.

కార్యత్వే నిత్యతాయాం వా కేచి దేకత్వవాదినః
కార్యత్వే నిత్యతాయాం వా కేచి న్నానాత్వవాదినః . 70

(అ) కార్యత్వే = శబ్దమునకు అనిత్యత్వమును స్వీకరించినను, నిత్యతాయాం వా = నిత్యత్వమును స్వీకరించినను, కేచిత్ = కొంతమంది శాస్త్రజ్ఞులు, ఏకత్వవాదినః = ఏకత్వము నంగీకరించు స్వభావము కలవారు.

తా. ఒకే శబ్దము నానార్థకమగుచో అర్థములు నానా అయినను శబ్దముమాత్రము ఒక్కటియే, దానికి నానాత్వము సంభవింపదు. శబ్దముల నిత్యత్వానిత్యత్వములతో మాకు ప్రసక్తిలేదు. ఏ పక్షముననైన శబ్దమున కేకత్వమే లభించును. ఇది కొందరు శాస్త్రజ్ఞుల అభిప్రాయము. వీరిమతము చొప్పున శబ్దము లనేకములు కావు. కనుక అచట జాతి కల్పితము కానేరదు. వ్యక్తులకు నానాత్వమున్నప్పుడే జాతి సిద్ధించును.

కాగా వీరిమతము ప్రకారము జాతి వ్యక్తులను పురస్కరించుకొని "స్వంరూప" సూత్రమున కర్థవర్ణనము చేయరాదు.

(ఆ) కార్యత్వే + నిత్యతాయాం + వా = శబ్దములకు అనిత్యత్వమున్నను, నిత్యత్వ మున్నను, కేచిత్ = కొందరు శాస్త్రజ్ఞులు, నానాత్వవాదినః = నానాత్వము నంగీకరించు స్వభావము కలవారు.

తా. శబ్దముల నిత్యత్వానిత్యత్వములతో పనిలేక అర్థము భిన్నమగుచో శబ్దము భిన్నమే యగును. అనగా హరిశబ్దమునకు విష్ణువు, ఇంద్రుడు, వానరము, కప్ప మున్నగు వాచ్యార్థములు చాల ఉన్నవి. వీని నన్నిటిని బోధించేది హరిశబ్ద మొక్కటియే కాదు. అర్థ ములు ఎన్నియో, బోధకములుకూడ అన్నియే యగును. ఇది కొందరు శాస్త్రజ్ఞుల మతము.

కాగా వీరిమతమున శబ్దములు అనేకములు కనుక అచట జాతి కల్పితమగుటచే, జాతివ్యక్తులను పురస్కరించుకొని "స్వంరూప" సూత్రార్థము చెప్పనగును.

శబ్దనిత్యత్వ ప్రసంగమున శబ్దనిత్యత్వవాది మీమాంసకమతము ననుసరించి వర్ణపద వాక్యములను 71, 72 శ్లోకములచే చూపుచున్నాడు.

పదభేదేఽపి వర్ణానా మేకత్వం న నివర్తతే
వాక్యేషు పద మేకం చ భిన్నేష్వ ప్యుపలభ్యతే . 71

(అ) పదభేదే అపి = పదములకు భేదమున్నను, అనగా పదములు వేరైనను, వర్ణానామ్ = వర్ణములకు, ఏకత్వమ్ = ఏకత్వము అనగా ఒక్కటియేయనుట, న నివర్తతే = నివర్తించునది - అనగా మరలునది కాదు.

తా. అర్కః = (సూర్యుడు), అశ్వః = (గుర్రము) మున్నగు పదములు భిన్నములుగా నున్నవి. వీనిలో 4 అకారములున్నవి. అవిమాత్రము వేరుకావు. స్థలము మారినను, వర్ణము మారునది కాదు. అవి యన్నియు ఒకే అకారముగానే గుర్తింపబడును. అర్క, మర్కట, కర్కట మున్నగు పదములు భిన్నములైనను, వానిలో రేఫములు ఏకమే యనియు, టకారములు ఏకమే యనియు తెలియనగును. వాఙ్మయమున గల అకారము లన్నియు ఒక్కటే, ఇకారము లన్నియు ఒక్కటే, రేఫము లన్నియు ఒక్కటే. అకారములు ఇకారములు మాత్రము భిన్నములే. వర్ణములు జన్యములుకావు నిత్యములు.

(ఆ) చ = మరియు, వాక్యేషు = వాక్యములు, భిన్నేషు + అపి = భిన్నములైనను పదమ్ = పదము, ఏకమ్ = ఒక్కటిగానే, ఉపలభ్యతే = తెలియబడుచున్నది.

తా. వాక్యములు భిన్నములుగా కాన్పించినను, వానిలో నున్న సరూపపదములు ఏకత్వమును విడనాడవు. అవి ఒక్కటి యనియే గ్రహించవలెను. "కడవను తెమ్ము", "పటమును చూడుము", "అశ్వమును తెమ్ము", "గోవును చూడుము" మున్నగు వాక్యములు భిన్నములు. ఐనను వానిలో తెమ్ము, చూడుము అను పదము లభిన్నములే.

వి. కనుక పదములకంటె వేరుగా వాక్యము లేదు. వర్ణములకంటె వేరుగా పదము లేదు. వర్ణములే పదములు. అవియే వాక్యములు. "గౌః" ఇచట ఏది శబ్దము? అని ప్రశ్నించిన గకార ఔకార విసర్గములు అనియే సమాధానము చెప్పవలెను. వర్ణములే సత్యములు. పదవాక్యములు కల్పితములు, మిథ్య.

ఈ యభిప్రాయమునే వ్యక్తపరచుచున్నాడు.

న వర్ణవ్యతిరేకేణ పద మన్యచ్చ విద్యతే
వాక్యం వర్ణపదాభ్యాం చ వ్యతిరిక్తం న కిఞ్చన . 72

వర్ణవ్యతిరేకేణ = వర్ణములు వినాగా- అనగా వర్ణములకంటె- వర్ణములను విడచి, అన్యత్ = వేరుగా- అనగా విలక్షణమగు, పదమ్ = పదము, న + విద్యతే + చ = లేనేలేదు.

చ = అట్లే, వర్ణపదాభ్యామ్ = వర్ణములకంటె, పదములకంటెను, వ్యతిరిక్తమ్ = వేరుగానున్న, వాక్యమ్ = వాక్యము, కిఞ్చన = ఏమియు, న + విద్యతే = లేదు.

తా. వర్ణసముదాయము పదము. పదసముదాయము వాక్యము అని తార్కికులు తలంతురు. కాని ఆ యాశమునకు బలముచాలదు. కనుక వర్ణములే సత్యములు. పదవాక్యములు భ్రమమాత్మకములే.

శబ్ది నిత్యత్వ ప్రసంగమున మీమాంసక మతమును జూపి దానిని నిరాకరించుచు వైయాకరణసిద్ధాంతమును స్పష్టపరచుచున్నాడు.

పదే న వర్ణా విద్యన్తే వర్ణే ష్వవయవా న చ
వాక్యా త్పదానా మత్యన్తం ప్రవివేకో న కశ్చన . 73

చ = కాని, వర్ణేషు = వర్ణములందు, అవయవాః + న = అవయవములు వలె, పదే = పదమునందు, వర్ణాః = వర్ణములు, న + విద్యన్తే = ఉండనేరవు. వాక్యాత్ =

వాక్యముకంటె, పదానామ్ = పదములకు, కళ్చన = ఏమియు, ప్రవివేకః = భేదము, అత్యన్తమ్ = మిక్కిలి, న = లేదు.

తా. వాక్యమే అర్థబోధకము. అదియే సత్యము. దానినుండి పదములు వర్ణములు విభజింపబడినవి. కాగా అవి మిథ్య అని వైయాకరణులు విశ్వసింతురు. ఈ యభిప్రాయమును 24 వ శ్లోకమున వ్యక్తపరచియున్నారు.

'ఋ' వర్ణమున రెండు రేఫములున్నట్లు భాసించును. కాని నిజముగా నచట అవి లేవు. అశ్లే పదమునందు ఘకారాది వర్ణములు భాసించుచున్నవి. అవియులేవు. అవి కల్పనా మూలమున కాన్పించుచున్నవి. పదము నిరవయవమే.

బాగుగా పర్యాలోచనచేసిన వాక్యమే సత్యము. దానియందు పదములు అవయవముల వలె కాన్పించును. అది కల్పనా మూలకము. పదములు లేనే లేవు. వాక్యము నిరవయవమే. అదియే అఖండార్థబోధకము.

వి. కాగా వర్ణములే సత్యములనెడి మీమాంసకమతము, పదమే సత్యమనెడి తార్కిక మతముకూడ నమ్మతగినవి కావు. వైయాకరణులు ప్రక్రియానిర్వాహార్థమై చేసిన కల్పనా మార్గాన దర్శనాంతరీయుల సిద్ధాంతములు లగ్నములై యున్నవి.

ఈ శ్లోకమున "న" శబ్దము ఇవార్థకము, నిషేధార్థకము కాదు. కొన్ని పుస్తకాలలో 'నచ' పదములకు 'ఇవ' అను పాఠాంతరము కలదు.

పయి చూపబడిన రెండుపక్షములు గూడ వ్యవహారమున కానవచ్చుచున్నవని చెప్పుచున్నాడు.

భిన్నం దర్శన మాశ్రిత్య వ్యవహారోఽనుగమ్యతే
తత్ర య న్ముఖ్య మేకేషాం తత్రాన్యేషాం విపర్యయః.　　74

(అ) భిన్నమ్ = పరస్పరము భిన్నమగు, దర్శనమ్ = సిద్ధాంతమును - అనగా 1. వర్ణములే సత్యము, పదవాక్యములు మిథ్య 2. వాక్యమే సత్యము, వర్ణపదములు మిథ్య అనెడి భిన్నసిద్ధాంతములను, ఆశ్రిత్య = ఆశ్రయించి, వ్యవహారః = శాస్త్రీయ వ్యవహారము, అనుగమ్యతే = అనుగమింపబడుచున్నది. అనగా నిర్ణయింపబడుచున్నది.

వి. వాక్యమే సత్యమను నమ్మకముగల శాబ్దికులు వర్ణములను పదములను చూపియే వ్యాకరణశాస్త్ర ప్రక్రియను నిర్వహించుచున్నారు. వర్ణ పదములే లేకున్న వారి ప్రక్రియ ఎట్లు కుదురును? వర్ణములే సత్యములని విశ్వసించిన జైమినీయులు పదవాక్యముల అర్థములను గ్రహించి వేదార్థమును చూపుచునే యున్నారు.

పయి సమస్య ఎట్లు తీర్మానింపబడును ? అను ప్రశ్నకు సమాధానముగా నుత్తరార్ధము చెప్పబడినది.

(ఆ) తత్ర = ఆ రెండు సిద్ధాంతములలో, ఏకేషామ్ = ఒక పక్షము వారికి, యత్ = ఏది, ముఖ్యమ్ = ముఖ్యదర్శనమో, తత్ర = దానియందు-అనగా ఆ దర్శనమునందు, అన్యేషామ్ = రెండవ పక్షమువారికి, విపర్యయః = విపరీతమగు భావము, అనగా ముఖ్యము కాదని భావము కలదు.

అందరు అన్నిపక్షములను నాశ్రయింతురు. అట్లుకాకున్న శాస్త్రముల ప్రవృత్తి కుదురుట ఎట్లు ? కాని కొందరు ఒక పక్షమును ముఖ్యముగను, రెండవ పక్షమును గౌణము

(అ) పదభేదే అపి = పదములకు భేదమున్నను, అనగా పదములు వేరైనను, వర్ణానామ్ = వర్ణములకు, ఏకత్వమ్ = ఏకత్వము అనగా ఒక్కటియేయనుట, న నివర్తతే = నివర్తించునది - అనగా మరలునది కాదు.

తా. అర్కః = (సూర్యుడు), అశ్వః = (గుఱ్ఱము) మున్నగు పదములు భిన్నములుగా నున్నవి. వీనిలో 4 అకారములున్నవి. అవిమాత్రము వేరుకావు. స్థలము మారినను, వర్ణము మారునది కాదు. అవి యన్నియు ఒకే అకారముగానే గుర్తింపబడును. అర్క, మర్కట, కర్కట మున్నగు పదములు భిన్నములైనను, వానిలో రేఫములు ఏకమే యనియు, టకారములు ఏకమే యనియు తెలియనగును. వాఙ్మయమున గల అకారము లన్నియు ఒక్కటే, ఇకారము లన్నియు ఒక్కటే, రేఫము లన్నియు ఒక్కటే. అకారములు ఇకారములు మాత్రము భిన్నములే. వర్ణములు జన్యములుకావు నిత్యములు.

(ఆ) చ = మరియు, వాక్యేషు = వాక్యములు, భిన్నేషు + అపి = భిన్నములైనను పదమ్ = పదము, ఏకమ్ = ఒక్కటిగానే, ఉపలభ్యతే = తెలియబడుచున్నది.

తా. వాక్యములు భిన్నములుగా కాన్పించినను, వానిలో నున్న సరూపపదములు ఏకత్వమును విడనాడవు. అవి ఒక్కటి యనియే గ్రహించవలెను. "కడవను తెమ్ము", "పటమును చూడుము", "అశ్వమును తెమ్ము", "గోవును చూడుము" మున్నగు వాక్యములు భిన్నములు. ఐనను వానిలో తెమ్ము, చూడుము అను పదము లభిన్నములే.

వి. కనుక పదములకంటె వేరుగా వాక్యము లేదు. వర్ణములకంటె వేరుగా పదము లేదు. వర్ణములే పదములు. అవియే వాక్యములు. "గౌః" ఇచట ఏది శబ్దము? అని ప్రశ్నించిన గకార ఔకార విసర్గములు అనియే సమాధానము చెప్పవలెను. వర్ణములే సత్యములు. పదవాక్యములు కల్పితములు, మిథ్య.

ఈ యభిప్రాయమునే వ్యక్తపరచుచున్నాడు.

న వర్ణవ్యతిరేకేణ పద మన్యచ్చ విద్యతే
వాక్యం వర్ణపదాభ్యాం చ వ్యతిరిక్తం న కిఞ్చన. 72

వర్ణవ్యతిరేకేణ = వర్ణములు వినాగా- అనగా వర్ణములకంటె- వర్ణములను విడచి, అన్యత్ = వేరుగా- అనగా విలక్షణమగు, పదమ్ = పదము, న + విద్యతే + చ = లేనేలేదు.

చ = అట్లే, వర్ణపదాభ్యామ్ = వర్ణములకంటె, పదములకంటెను, వ్యతిరిక్తమ్ = వేరుగానున్న, వాక్యమ్ = వాక్యము, కిఞ్చన = ఏమియు, న + విద్యతే = లేదు.

తా. వర్ణసముదాయము పదము. పదసముదాయము వాక్యము అని తార్కికులు తలంతురు. కాని ఆ యాశమునకు బలముచాలదు. కనుక వర్ణములే సత్యములు. పదవాక్యములు భ్రమమాత్రకములే.

శబ్ద నిత్యత్వ ప్రసంగమున మీమాంసక మతమును జూపి దానిని నిరాకరించుచు వైయాకరణసిద్ధాంతమును స్పష్టపరచుచున్నాడు.

పదే న వర్ణా విద్యన్తే వర్ణే ష్వవయవా న చ
వాక్యా త్పదానా మత్యన్తం ప్రవివేకో న కశ్చన. 73

చ = కాని, వర్ణేషు = వర్ణములందు, అవయవాః + న = అవయవములు వలె, పదే = పదమునందు, వర్ణాః = వర్ణములు, న + విద్యన్తే = ఉండనేరవు. వాక్యాత్ =

స్వభావభేదాత్ = స్వరూపవిశేషమువలన, ప్రాకృతధ్వనియే స్ఫోటశబ్దముయొక్క స్వరూపమనెడి అభిమానమువలన, ప్రాకృతస్య = ప్రాకృతమగు, ధ్వనేః = ధ్వనికి సంబంధించినదై, హ్రస్వదీర్ఘప్లుతాదిషు = ఉచ్చరింపబడెడి హ్రస్వాదులందున్న, కాలః = ఏకమాత్రాది కాలము, నిత్యత్వే = స్ఫోటశబ్దమునకు నిత్యత్వమున్నను, శబ్దస్య + ఇతి = స్ఫోటశబ్దమునకు సంబంధించినది యని, ఉపచర్యతే = ఆరోపింపబడుచున్నది.

తా. ప్రకృతి యనగా మూలము. దానినుండి కలిగిన ధ్వని ప్రాకృతధ్వని. ఇది జన్యము కనుక కాలము దీనిని పరిణమింపచేయగలదు. అందుచే ఏకమాత్రా ద్విమాత్రాది కాలభేదము ప్రాకృతధ్వనికి కలుగును. ఇదియే స్ఫోటశబ్దము బయటికి అభివ్యక్తమగుటలో కారణము. ఆధ్వని, స్ఫోటశబ్దము రెండును పాలునీరువలె మిశ్రితములైయున్నవి. ఆరెంటిని వేరుచేయుట సాధ్యముకాదు. రెండును అవిభక్తములుగా నుండుటచే ఆ ధ్వని ధర్మములు స్ఫోటశబ్దమునందు భాసించును. స్ఫోటశబ్దము ఈధ్వనిచేతనే అకార కకార గకారాది రూపముగా కాన్పించుచున్నది.

వి. ప్రాకృతధ్వనియొక్క రూపమే స్ఫోటశబ్దముయొక్క రూపమువలె కాన్పించును. అందుచే స్ఫోటశబ్దమునందు ఏకమాత్రా ద్విమాత్రా త్రిమాత్రా కాలభేదము ఆరోపమూలమున కాన్పించును. అందుచే ఆశబ్దమునకు భేదము కలుగుచున్నది. హ్రస్వాకారము, దీర్ఘాకారము, ప్లుతాకారము పరస్పరము భిన్నములే యగును. కనుకనే హ్రస్వాకారమునకు తకారము చేర్చగా 'అత్' అనురీతిని ఉండి దీర్ఘాకారాదులను గ్రహించకయున్నది. దీనినే 'తపరకరణ' మందురు. తపర స్తత్కాలస్య 1-1-70 అని పాణిని సూత్రము.

ఈ రీతిగా ప్రాకృతధ్వని ధర్మములు స్ఫోటశబ్దమునందు ఆరోపితములగుచున్నవి. నిజరూపమున స్ఫోటశబ్దమునందు ఈభేదములు లేవు. కనుక అది నిత్యమే యగును.

స్ఫోటశబ్దమునందు హ్రస్వాకారాది భేదము కాన్పించునట్లు ద్రుతాది వృత్తిభేదము కూడ భాసింపవలెను. ఉభయత్ర కాలభేదమేకదా కారణమగుచున్నది! అను ఆక్షేపమునకు సమాధానము చెప్పుచున్నాడు.

శబ్ద స్యోర్ధ్వ మభివ్యక్తే ర్వృత్తిభేదే తు వైకృతాః
ధ్వనయః సముపోహన్తే స్ఫోటాత్మా తై ర్న భిద్యతే. 77

శబ్దస్య = స్ఫోటశబ్దముయొక్క, అభివ్యక్తేః = అభివ్యక్తికంటె, ఊర్ధ్వమ్ = తరువాత, (జాయమానాః = పుట్టుచున్న), వైకృతాః = వైకృతములగు, ధ్వనయః + తు = ధ్వనులు మాత్రము, వృత్తిభేదే = ద్రుత మధ్యమ విలంబిత వృత్తుల భేదమునందు - అనగా అభివ్యక్తమగు స్ఫోటశబ్దమును అంతకాలమున ఉంచుటయందు, సముపోహన్తే = కారణములగుచున్నవి, తైః = ఆ వైకృత ధ్వనులచే, స్ఫోటాత్మా = స్ఫోటస్వరూపము, న + భిద్యతే = భేదింపబడదు. ఆ ధ్వనుల భేదముచే స్ఫోటశబ్దము నానారూపములుగా మార్పుచెందదని భావము.

తా. వికృతి యనగా బాహ్యము. దానివలన కలిగెడి ధ్వనులు వైకృతధ్వనులు. ప్రాకృతధ్వనులచే వ్యక్తీకరింపబడిన స్ఫోటశబ్దము స్మృతముకాగా దానిని కొంతకాలమువరకు మన చెవికి వినపడునట్లు వైకృతధ్వనులు చేయును. దానిమూలమున ద్రుతాది వృత్తులు

కలుగుచున్నవి. చదివినదానిని వల్లెవేయునపుడు ద్రుతవృత్తిని, ఇతరులతో మాట్లాడునపుడు మధ్యమను, పాఠము చెప్పునపుడు విలంబితమును వాడవలెను.

కాగా వైకృతధ్వనులు అభివ్యక్తమగు స్ఫోటశబ్దమునకు కొంతసేపుండుటకు సహకరించునవే. కనుక వానివలన స్ఫోటము భిన్నము కానేరదు.

కనుక ఒకే అకారము ద్రుతాదివృత్తిభేదమున భిన్నము కానందున మూడు వృత్తులలోను ఏకముగానే ఉండును. అట్లు కాకున్న పాణిని సూత్రములలో ఏదో ఒక వృత్తిలో అకార ముచ్చరించిన ఇతరవృత్తులలో ఆ సూత్రము ప్రవర్తించక పోయెడిది.

వి. ధ్వనులు ప్రాకృతములని, వైకృతములనియు రెండు విధములుగా నున్నవి. శబ్దాభివ్యక్తికి ముందుగా మూలముగా నున్నవి ప్రాకృతములు. వానివలన స్ఫోట శబ్దము నానాత్వమును పొంది మాత్రాకాలాది భేదమును చూపును. శబ్దాభివ్యక్తి తరువాత కలిగెడివి వైకృతములు. అవి ఆ శబ్దమును కొంతసేపు ఉండునట్లు చేయును. ఇవియే ద్రుతాది వృత్తులు. వీనివలన స్ఫోటశబ్దము నానాత్వమును పొందదు.

ధ్వనులు శబ్దముల వ్యక్తపరచును. వానిచే నభివ్యక్తమగు స్ఫోటశబ్దము వాచ్యమగునని ముందు చూ బడినది. ధ్వనులు శబ్దమును ఎట్లు వ్యక్తపరచును ? అభివ్యక్తి అనగా ఏమి ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

ఇన్ద్రియస్యైవ సంస్కారః శబ్దస్యైవోభయస్య వా
క్రియతే ధ్వనిభి ర్వాదా స్త్రయోఽభివ్యక్తివాదినామ్ . 78

ధ్వనిభిః = ధ్వనులచే, 1. ఇన్ద్రియస్య + ఏవ = ఇంద్రియమునకే, సంస్కారః = సంస్కారము, క్రియతే = చేయబడుచున్నది, 2. శబ్దస్య + ఏవ = శబ్దమునకే సంస్కారము చేయబడును. 3. వా = కాక, ఉభయస్య = రెంటికి-అనగా ఇంద్రియమునకు, శబ్దమునకుగూడ సంస్కారము చేయబడును అనురీతిని, అభివ్యక్తివాదినామ్ = అభివ్యక్తిని స్వీకరించు స్వభావము కలవారిలో, త్రయః = మూడు, వాదాః = వాదములు, (సన్తి = కలుగుచున్నవి,) - అభిప్రాయ భేదము లున్నవి.

తా. ధ్వనులవలన కలిగెడి విశేషమునుగూర్చి మూడు అభిప్రాయములు గలవు. 1. ధ్వనులు చెవికి సంస్కారమును కలిగించును. అట్టి చెవి శబ్దమును గ్రహించును. 2. అవి శబ్దమునకే సంస్కారమును కలిగించును. అట్టి శబ్దము చెవిచే గ్రహింపబడును. 3. అవి రెంటికి సంస్కారమును కలిగించును. అట్టి శబ్దమును అట్టిచెవి గ్రహించును.

వి. చెవి శబ్దమును గ్రహించును. అట్టి గ్రహణశక్తిలేని చెవికి ధ్వనులు శక్తి విశేషమును కలిగించును. గ్రహణశక్తి చెవికి ఉన్న దానిని స్పష్టపరచును. ఇదియే ఇచట సంస్కారము. అపుడు శ్రోత్రము శబ్దగ్రాహకము కాగలదు.

ఈ వాదములు ప్రాకృతధ్వనులకు సంబంధించును. అవియే కదా స్ఫోటశబ్దాభివ్యంజకములు?

ధ్వనులు ఇంద్రియమునకే సంస్కారమును కలిగించునని ప్రథమ పక్షమును పూర్వార్ధముచేతను, విషయమునకే సంస్కారము కలిగించునని రెండవ పక్షమును ఉత్తరార్ధముచేతను చూపుచున్నాడు.

ఇన్ద్రియస్యైవ సంస్కారః సమాధానాఞ్జనాదిభిః
విషయస్య తు సంస్కార స్తద్గన్ధప్రతిపత్తయే . 79

(అ) సమాధానాఞ్జనాదిభిః=(మనస్సునకు) ఏకాగ్రత, కాటుక మున్నగువానిచే, ఇన్ద్రియస్య+ఏవ=ఇంద్రియమునకే, సంస్కారః=సంస్కారము, (క్రియతే=చేయ బడుచున్నది) విషయమునకు కాదు.

తా. ధ్వనులు ఇంద్రియమునకే సంస్కారమును కలిగించును. యోగీశ్వరుడు దూరముగానున్న వస్తువును చూడగోరినపుడు మనస్సునకు ఏకాగ్రతను సంపాదించును. దానిచే కంటికి శక్తి కలుగును. అట్టి కంటికి దూరమున నున్న వస్తువు కానవచ్చును. కొందరు కంటికి విలక్షణమగు కాటుకను పెట్టుకొని దూరమందున్న వస్తువులను జూతురు. అస్మదాదులము వయస్సు మరలగా కంటికి కండ్లజోడు పెట్టుకొని చూచుచున్నాము. ఈదృష్టాన్తములు చూడగా ఇంద్రియమునకే సంస్కారము కలుగునని తెలుచున్నది.

అట్లే ప్రాకృతధ్వనులు కూడ చెవికి శబ్దమును గ్రహించుటకు యోగ్యమగు శక్తిని కలిగించును. అపుడు ఆచెవి శబ్దమును గ్రహించును. ధ్వని పైరీతిని శ్రోత్రముచే గ్రహింప బడు శబ్దమునకు వ్యంజకమగుచున్నది.

ఇచట 'ఆది' పదముచే కండ్లజోడు మున్నగునవి గ్రహింపబడును. గ్రాహ్యమగు శబ్దమునకు సంస్కార మక్కర లేదని దీని యాశయము.

(ఆ) విషయస్య+తు = విషయమునకే, సంస్కారః = సంస్కారము, తద్గన్ధ ప్రతిపత్తయే = విషయమునందున్న గంధముయొక్క జ్ఞానముకొరకు (క్రియతే = చేయ బడుచున్నది.)

అధికముగా ఎండిన భూమియొక్క గంధము నీరుపోసిన, నూనెయొక్క గంధము ఎండలో పెట్టిన తెలియును. అనగా ఉదకసంస్కారమువలన నేలయొక్క వాసన, ఆతప సంస్కారమువలన నూనెయొక్క వాసన తెలియును. గంధమనగా మన అలవాటులోనున్న వాసన. సుగంధము, దుర్గంధము. దానిని గ్రహించునది ఘ్రాణేంద్రియము- అనగా ముక్కు. ఇచట ఘ్రాణేంద్రియమునకు సంస్కారము చేయబడలేదు. గ్రాహ్యమగు గంధమునకు ఆధారమగు వస్తువుకే చేయబడుచున్నది.

అట్లే ధ్వని సంసర్గమున శబ్దమే సంస్కరింపబడి చెవికి విషయమగుచున్నది. లోపల ఉన్న శబ్దము బయటికి వినబడెడి రూపమును ధ్వనిసంబంధమువలన ధరియించును.

ఉభయమునకు సంస్కార మను మూడవపక్షమును జూపుచున్నాడు.

చక్షుషః ప్రాప్యకారిత్వే తేజసా తు ద్వయో రపి
విషయేన్ద్రియ యో రిష్టః సంస్కారః, స క్రమో ధ్వనేః. 80

చక్షుషః = నేత్రమునకు, ప్రాప్యకారిత్వే = ప్రాప్యకారిత్వ పక్షమున అనగా నేత్రేంద్రియము వస్తువువద్దకుపోయి దానితోకలసి దానిని గ్రహించు నను పక్షమున, తేజసా + తు = వెలుతురు చేతను అయితే, విషయేన్ద్రియయోః = విషయము ఇంద్రియము అనెడి, ద్వయోః = రెంటికి, సంస్కారః = సంస్కారము, ఇష్టః = సమ్మతమగుచున్నది, ధ్వనేః = ధ్వనికికూడ, సః + క్రమః = ఆ క్రమము, ఇష్టః = సమ్మతమగును, ధ్వనులవలన శ్రోత్రేంద్రియమునకు శబ్దమునకు గూడ సంస్కారము కలుగునని భావము.

చీకటిలో ఘటము పటము మున్నగువస్తువులను వెలుతురు సాహాయ్యమున మనము కండ్లతో చూచుచున్నాము. వెలుతురు వస్తువులకు సంస్కారకమనుటలో విప్రతిపత్తి లేదు.

కాని ఇంద్రియము తన గోళమునందే యుండి వస్తుగ్రాహకమగునను సిద్ధాన్తమున ఒకవస్తువునకే సంస్కారము కలుగును. అట్లుకాక నేత్రేంద్రియము కిరణరూపము. అది అంతట ప్రసరించును. కనుక అది వస్తువువద్దకు పోయి దానితోకలసి దానిని గ్రహించుననెడి సిద్ధాంతమున ఆలోకము ఇంద్రియమునకుగూడ సంస్కారకము కాగలదు. మొదటి సిద్ధాంతము బౌద్ధులది. రెండవది నైయాయికులది. నైయాయిక మతమును దృష్టాంతముగాజూపి "ప్రాకృతధ్వనులు చెవికి శబ్దమునకు గూడ సంస్కారమును కలిగించును" అను మూడవపక్షము ఈ శ్లోకముచే చూపబడినది. స్ఫోటశబ్దము నంగీకరింపకున్నను శబ్దమునకు నిత్యత్వము నంగీకరించెడి మీమాంసకులు కూడ ఈ మూడుపక్షములను జూపియేయున్నారు.

స్ఫోటశబ్దమును ప్రకాశింపజేయు ధ్వనుల విషయమున గూడ మూడు విధములగు అభిప్రాయములను జూపుచున్నాడు.

స్ఫోటరూపావిభాగేన ధ్వనే ర్గ్రహణ మిష్యతే
కైశ్చిద్ ధ్వని రసంవేద్యః స్వతన్త్రోఽన్యైః ప్రకల్పితః. 81

అభివ్యక్తివాదుల మతము నాశ్రయించి 79,79, 80శ్లోకములచే స్ఫోటశబ్దాభివ్యక్తి విషయమున 8 పక్షములు చూపబడినవి. వారి మతముననే స్ఫోటశబ్దమును ప్రకాశింపచేయు ధ్వనులను గ్రహించుటలో గూడ ఈ శ్లోకముచే 8 పక్షములను జూపుచున్నాడు.

(అ) కైశ్చిత్ = కొందరిచే, స్ఫోటరూపావిభాగేన = స్ఫోటశబ్దముతో స్వరూపవిభాగము లేకుండునట్లుగా, ధ్వనేః = ధ్వనియొక్క, గ్రహణమ్ = జ్ఞానము, ఇష్యతే= అంగీకరింపబడుచున్నది.

తా. సూర్యునివలన కలిగిన వెలుతురు స్తంభము మున్నగువస్తువులను ప్రకాశింపజేయును. ఆ వస్తువులతో అవిభక్తముగనే వెలుతురు గ్రహింపబడును. "ఇది స్తంభము". "ఇదివెలుతురు" అను భేదజ్ఞాన ముండదు.

అట్లే నాలుక, పెదవులు మున్నగుస్థానముల చలనముచే జనియించిన ధ్వనులు స్ఫోటశబ్దమును ప్రకాశింపచేయును. ఆ శబ్దముకంటె వేరుగా ధ్వనులు గ్రహింపబడవు, దానితో అవిభక్తములైయే ధ్వనులు గ్రహింపబడును.

(ఆ) కైశ్చిత్ = మరికొందరిచే, ధ్వనిః = ప్రాకృతధ్వని, అసంవేద్యః = తెలియబడనిదై అనగా ధ్వని స్వరూప మిది అని గుర్తింపబడనిదై, ఇష్యతే = శబ్దగ్రహణమున నిమిత్తముగా స్వీకరింపబడుచున్నది.

తా. కన్ను మున్నగు ఇంద్రియములు వానిరూపము మనకు తెలియకయే వస్తుగ్రాహకములగుచున్నవి. అదే విధమున ధ్వనులుగూడ ప్రత్యేకము మనకు తెలియకయే శబ్దమును ప్రకాశింపజేయుచున్నవి.

(ఇ) అన్యైః = మరికొందరిచే,ధ్వనిః = ధ్వని, స్వతన్త్రః = స్వతంత్రమైనదై అనగా స్ఫోటశబ్దముతో గలిసియున్నను స్వతంత్రమైనదై, ప్రకల్పితః = స్వీకరింపబడుచున్నది.

తా. దంతములుపోగా మనము స్పష్టముగా మాట్లాడుచున్నను అచట ధ్వనియే గృహీత మగును. దంతము లున్నను పదిమంది కలసి మాట్లాడినపుడు ఇతరులకు ధ్వనియే

వినబడును. శబ్దముతో కలసియున్నను పై విధముగా ధ్వనియే జ్ఞాతమగుచున్నది. పశు, పక్ష్యాదులు అరచునపుడు వర్ణములులేక ధ్వనులే వినబడును.

'ఘటః' అను పదమున 4 ధ్వనులు కలవు. అవి యన్నియు ఒకేసారి శబ్దమును ప్రకాశింపజేయనేరవు. ఒకేధ్వని దానిని ప్రకాశింప చేయలేదు. అట్టితరి ధ్వనులు శబ్దమును ఎట్లు ప్రకాశింపజేయగలవు? అను ప్రశ్నకు 83వ శ్లోకముచే సమాధానము చెప్పదలచి దానికి ముందుగా ఈ శ్లోకముచే నొక దృష్టాంతమును జూపుచున్నాడు.

యథాఽనువాకః శ్లోకో వా సోఢత్వ ముపగచ్ఛతి
ఆవృత్త్యా, న తు స గ్రన్థః ప్రత్యావృత్తి నిరూప్యతే.　　　　82

యథా = ఏరీతిగా, అనువాకః = మంత్రసముదాయము, శ్లోకః + వా = శ్లోకము గాని, ఆవృత్త్యా = ఆవృత్తిచే - అనగా 10 పర్యాయములు వల్లెవేయుటచే, సోఢత్వమ్ = సహించుటకు యోగ్యతను-అనగా గురువు చెప్పనక్కరలేకుండగా తనకు స్వాధీనమగుటను, ఉపగచ్ఛతి = పొందుచున్నదో, సః + గ్రన్థః = ఆ గ్రంథము, ప్రత్యావృత్తి + తు = ఆవృత్తి చేయునపుడెల్లను-అనగా చివరివల్లెకు ముందుగానున్న అన్నిఆవృత్తులలోను, న + నిరూప్యతే = బుద్ధివిషయము కానేరదో,

ఈ శ్లోకార్థమునకు 83 వ శ్లోకార్థముతో నన్వయము కలుగును.

తా. ఒకవ్యక్తి గురువువద్ద వేదములో ననువాకమును సంత చెప్పుకొనును. లేక ఒక శ్లోకమును చెప్పుకొనును. 10 పర్యాయములు వల్లెవేయగా అది వానికి కంఠస్థమగును. 10 వ సారి చదువు సరికి గాని అతనికి అది స్వాధీనము కాలేదు; చివరి ఆవృత్తిచే అది స్వాధీనమైనది. అపుడు 9 పర్యాయములు చదువుట వ్యర్థము అను ప్రశ్న కలుగును. కాని అన్నిసార్లు చదువుటచేతనే వాని బలమువలన 10 వ సారికి స్వాధీనమైనది. అంతకు ముందు వల్లెవేయునపుడెల్ల అంతయు చదివినను అది స్వాధీనము కానందున వ్యర్థము కావలెను అని చెప్పరాదు కదా! అనగా ఒక్కొక్కసారి వల్లెవేయుటచే రానందున, అట్లుచేయుట నిరుపయోగ మనరాదు. చివరి సమయమున అది స్వాధీనమగుటలో సాహాయ్యము చేయుట సంభవించినది.

పై దృష్టాంతమును ప్రకృతమున సమన్వయపరచుచున్నాడు.

ప్రత్యయై రనుపాఖ్యేయై ర్గ్రహణానుగుణై స్తథా
ధ్వనిప్రకాశితే శబ్దే స్వరూప మవధార్యతే.　　　　83

తథా = ఆరీతిగా, అనుపాఖ్యేయైః = ప్రత్యేకము చెప్పుటకు శక్యము కానట్టియు, అయినను, గ్రహణానుగుణైః = స్ఫోటశబ్దమును గ్రహించుటకు ఉపాయములగునట్టియు, ప్రత్యయైః = బుద్ధులచే, ధ్వని ప్రకాశితే = ధ్వనులచే ప్రకాశింపజేయబడిన, శబ్దే = శబ్దము నందు, స్వరూపమ్ = అక్రమ స్ఫోటశబ్దముయొక్క స్వరూపము, అవధార్యతే = స్పష్టముగ నిశ్చయింపబడుచున్నది.

తా. ధ్వనులు స్ఫోటప్రకాశకము లగును. 'ఘట మానయ' (కడవనుతెమ్ము) ఇచట 10 ధ్వనులున్నవి. ఒక ధ్వనిచేగూడ స్ఫోటము వ్యక్తమగును. ఇది అనువాకమును మొదటితడవ వల్లెవేయుట వంటిది. అంతమాత్రాన ఆ శబ్దము స్పష్టముకానేరదు. ఘకార అకార అనురీతిని 9 ధ్వనులచే నభివ్యక్తమైన తరువాత చివరి 'అ' ధ్వనివలన ఆ స్ఫోట

శబ్దము స్పష్టమగును. అలాగుననే ముందుగా నున్న 9 ధ్వనులు వ్యర్థములు కావు. ఈ తొమ్మిది ధ్వనులచే సహకృతమగు చివరిధ్వని స్ఫోటవ్యంజకము కాగలదు.

కాగా పది పర్యాయములు వల్లెవేయగా అనువాకమో, శ్లోకమో స్వాధీనమగునట్లు పై వాక్యమున 10 ధ్వనులచే నభివ్యక్తమగు స్ఫోటశబ్దము వాచక మగును.

ఒక్కొక్క పర్యాయము చదువునప్పుడు ఒక్కొక్క ధ్వనిచే శబ్దము వ్యక్తము కాగలదు. అంతమాత్రాన చారితార్థ్యము లభించదు.

కాబట్టి పూర్వ పూర్వ వర్ణానుభవ సహకృతమగు అంత్యవర్ణవిషయకమగు బుద్ధిచే నాశబ్దము గృహీతమగును.

88 వ శ్లోకములో నున్న అర్థమునే ప్రకాశింపజేయుచున్నాడు.

నాదై రాహితబీజాయా మన్త్యేన ధ్వనినా సహ
అవృత్తపరిపాకాయాం బుద్ధౌ శబ్దోఽవధార్యతే. 84

నాదైః=పూర్వపూర్వధ్వనులచే, ఆహితబీజాయామ్=సమర్పింపబడిన బీజము అనగా భావన కలిగినట్టియు, ఆవృత్తపరిపాకాయామ్=అభ్యసింపబడిన పరిపాకము కలిగిన బుద్ధౌ=బుద్ధియందు, అన్త్యేన=చివరిదియగు, ధ్వనినా+సహ=ధ్వనితోగూడ - అనగా చివరి ధ్వని అవగతమగుకాలముననే, శబ్దః=స్ఫోటశబ్దము, అవధార్యతే=నిశ్చితమగు చున్నది.

88 వ శ్లోకార్థమునే ఈశ్లోకము వివరించుచున్నది. ఇచట బీజమనగా సంస్కారము. ప్రకృత కార్యమును కలిగించెడి శక్తి విశేషము పరిపాక మనబడును.

పూర్వపూర్వధ్వనులచే బుద్ధిలో వాని సంస్కారమేర్పడును. స్ఫోటశబ్దమును వ్యక్తపరచెడి శక్తి విశేషము దానియందు కలుగును. చివరిధ్వనితోపాటు స్ఫోటశబ్ద మభివ్యక్త మగును. చివరిధ్వనిచే నభివ్యక్తి కలుగునపుడు పూర్వపూర్వధ్వనులు సంస్కారరూపమున నుండి సహకరించును.

ధ్వనులు ప్రత్యేకముగా స్ఫోటశబ్దమును వ్యక్తపరచినచో వర్ణమున అవయవములు, పదమున వర్ణములు వాక్యమున పదములు లేవనియే సిద్ధాన్తము తేలుచున్నది. వానికి ప్రత్యేకముగ వ్యంజకములు లేవు కదా! కాని వర్ణము మున్నగునవి భాసించుచునేయున్నవి. అవి యెట్లు సంగతము అగును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

అసత శ్చాన్తరాలే యాన్ శబ్దా నస్తీతి * మన్యతే
ప్రతిపత్తు రశక్తిః సా గ్రహణోపాయ ఏవ సః. 85

(అ) అన్తరాలే=మధ్యకాలమున-అనగా ధ్వనులుపుట్టుట, స్ఫోటశబ్ద మభివ్యక్త మగుట ఈ రెంటికి మధ్యకాలమున, అసతః+చ=లేనట్టి, యాన్=యే, శబ్దాన్=శబ్దములను, అస్తి+ఇతి=ఉన్నట్లు, మన్యతే=తలంచుచున్నాడో, సా=వానినిసట్లు భావించుట, ప్రతిపత్తుః=శబ్దమును గ్రహించువానియొక్క, అశక్తిః=అసామర్థ్యము.

---

* ఈ కారికలో "అస్తి" అనునది తిఙంతముకాదు, తిఙంత ప్రతిరూపకమగు అవ్యయము. 'మన్యతే' అను క్రియమబట్టి 'శబ్దాన్' అనునది కర్మ, ద్వితీయాంతము.

(అ) సః = మధ్యకాలమున శబ్దము లున్నవని భావించుట, గ్రహణోపాయః + ఏవ = స్ఫోటశబ్దమును గ్రహించుటలో నుపాయమే, (భవతి = అగుచున్నది).

తా. ధ్వనివలన వర్ణరూపమున గాని, పదరూపమున గాని స్ఫోటశబ్ద మభివ్యక్త మగును. ఆ శబ్దము మాత్రము నిరవయవము. వర్ణమున వర్ణావయవములుగాని, పదమున వర్ణములు గాని, వాక్యమున పదములు గాని లేనేలేవు. అవి యున్నవని భావించుట భ్రమయే. ధ్వనులచే శబ్ద మును గ్రహించు శక్తి కలవానికి అవి భాసించవు. పైరీతిని లేని శబ్దము లున్నవని కొందరు భావింతురు. వారు అసలుశబ్దమును గ్రహించే శక్తి లేనివారు. అట్టివారే అట్లు భావింతురు.

కాని అట్టి శక్తి కలవారు క్రమముగా స్ఫోటశబ్దమును గ్రహించుటలో భ్రమరూప ముగా నున్న మధ్యకాలమునందలి శబ్దములు సాహాయ్య మాచరింపగలవు.

సిద్ధాంతమున శబ్దము అఖండమే.

నిజరూపమున క్రమము లేనిదే స్ఫోటశబ్దము. దానిని వ్యక్త పరచెడి ధ్వనులయందు క్రమ మున్నది. ఆ క్రమము స్ఫోటశబ్దమునందు ఆరోపింపబడుచున్నది. అట్టిశబ్దమే మనకు అర్థబోధకమగుచున్నది. అట్లుకానిచో నది మనకు గ్రాహ్యము కాదు. అర్థబోధకము కూడ కాదు అని దృష్టాంతము చూపుచు బోధించుచున్నాడు.

భేదానుకారో జ్ఞానస్య వాచ శ్చోపప్లవో ధ్రువః
క్రమోపసృష్టరూపా వాగ్ జ్ఞానం జ్ఞేయవ్యపాశ్రయమ్. 86

(అ) జ్ఞానస్య = ఘటము అనెడి ఆకారముకల జ్ఞానమునకు, భేదానుకారః = భేదముయొక్క ఆరోపణము అనగా ఏకరూపమగు జ్ఞానమునందు వస్తుభేదము వలన కలిగెడి బేదమును ఆరోపించుట, వాచః = శబ్దమునకు, ఉపప్లవః + చ = భేదమును ఆరోపించుటయు- అనగా స్ఫోటశబ్దమునందు వ్యంజకధ్వనుల యందున్న భేదమును ఆరోపించుటయు, ధ్రువః = నిశ్చితమే.

తా. స్ఫోటశబ్దము నిజరూపమున నిరవయవము, క్రమరహితము. దానికి వ్యంజకము లగు ధ్వనులు జన్యములు కనుక సావయవములు, క్రమసహితములు. వానియందున్న ధర్మ ములు స్ఫోటశబ్దమునందు ఆరోపితములు కాగలవు. ఇందుకు జ్ఞానము దృష్టాంతముగా జూప బడినది. జ్ఞానము నిజమున ఏకరూపమే. దానియందు భేదము లేదు. కాని తెలియబడే వస్తువులు భిన్నములగుటచే వానియందున్న బేదమును జ్ఞానమునందు ఆరోపించుచున్నారు.

(ఆ) జ్ఞానమ్ = జ్ఞానము, జ్ఞేయవ్యపాశ్రయమ్ = జ్ఞేయములగు వస్తువులు ఆశ్ర యముగా గలది, వాక్ = శబ్దము, క్రమోపసృష్టరూపా = వ్యంజకధ్వని గతమగు క్రమముతో మిశ్రితమగు రూపమే గలది.

తా. ధ్వనిగతక్రమము స్ఫోటశబ్దమునందు ఆరోపితమగును. అట్టిశబ్దమే మన కర్థబోధక మగుచున్నది. అట్లుకాకున్న అది అస్మదాదులకు గ్రాహ్యము కానేరదు. అర్థబోధ కము కూడ కానేరదు. ఇందు జ్ఞానము దృష్టాంతముగా జూపబడినది. జ్ఞేయములగు ఘట పటాది వస్తువులతో సంవలితమగు జ్ఞానమే వ్యవహారయోగ్యమగును. అట్లు కాకున్న నిరాశ్రయ మగు జ్ఞానము వ్యవహారక్షమము కానేరదు.

వి. ఈ శ్లోకమున పూర్వోత్తరభాగములలో జ్ఞానము దృష్టాంతముగా జూపబడినది. ఇవ, యథా మున్నగుపదములు లేవు. అయినను అప్రకృతమగు జ్ఞానమును చెప్పుట దృష్టాంతార్థమే యగును.

86 వ కారికలో "గ్రహణోపాయ ఏవ సః" అని చెప్పబడినది. అవయవ రహితమగు స్ఫోటశబ్దమునకు పదములు వర్ణములు వాని అవయవములు అవయవములుగా కల్పింపబడినవి. అవి విలక్షణములే, అయినను అవి శబ్దగ్రహణమునకు ఉపాయములని దాని భావము. ఇచట ఒక సంశయము—వస్త్రమునకు తంతువులకు యథార్థము అగు అవయవావయవి భావ మున్నది. రెంటికి గుణసామ్యము కూడ కలదు. అచట అవయవములు అవయవిని తెలుసుకొనుటకు ఉపాయములు కాగలవు. వర్ణపదములు వాక్యమునకు ముఖ్యములగు అవయవములు కావు. పరస్పరము అవి సంబద్ధములు కానేరవు. సదృశమగు వస్తువు సదృశవస్తుజ్ఞానమునకు ఉపకరించును. కాగా విసదృశములగు వర్ణపదములు స్ఫోటశబ్దజ్ఞానమునకు ఎట్లు ఉపాయము అగును ?— ఈ సంశయమును పోగొట్టుచున్నాడు.

యథాఽఽద్యసంఖ్యాగ్రహణ ముపాయః ప్రతిపత్తయే
సంఖ్యాన్తరాణాం భేదేఽపి తథా శబ్దాన్తరశ్రుతిః . 87

యథా = ఏరీతిగా, ఆద్యసంఖ్యాగ్రహణమ్ = మొదటిది యగు సంఖ్యయొక్క—అనగా ఏకత్వసంఖ్య యొక్క జ్ఞానము, భేదే + అపి = భేదమున్నను, సంఖ్యాన్తరాణామ్ = దశత్వము మున్నగు ఇతరసంఖ్యల యొక్క, ప్రతిపత్తయే = తెలుసుకొనుటకొరకు, ఉపాయః = ఉపాయమో, తథా = అరీతిగా, శబ్దాన్తరశ్రుతిః = పదము మున్నగు శబ్దముల శ్రవణము అఖండవాక్య స్ఫోటమును తెలుసుకొనుట కుపాయము కాగలదు.

తా. వర్ణావయవములు పదావయవములు కూడ మిథ్యాభూతములు. మిక్కిలి భిన్నములు. అయినను అవి ఆశబ్దమును వ్యక్తపరచగలవు. ఇచట సంఖ్య దృష్టాంతముగా జూపబడినది ఏకత్వము మొదటిసంఖ్య. దీనివలననే ఇతరసంఖ్యలు కలుగుచున్నవి. ఇది ఒకటి, ఇది ఒకటి అని లెక్కించిన ద్విత్వసంఖ్య పుట్టుచున్నది. ఇట్టి 10 వ్యవహారముల వలన దశత్వసంఖ్య పుట్టును. ఏకత్వముకంటె ఇతరసంఖ్యలు విజాతీయములే. అయినను వానికి ఏకత్వసంఖ్య కారణము కాగలదు. చివరి ఏకత్వముచే దశత్వము పుట్టుచున్నది. అట్లే ప్రకృతమున గూడ కాగలదు.

ధ్వనులు శబ్దజ్ఞానమున కారణములు కావచ్చును. కాని ఆ ధ్వనులు విలక్షణము లగుటచే తమరూపమును శబ్దమున ఎట్లు చూపగలవు? ధూమము అగ్నిని జ్ఞాపన చేయుచు ధూమరూపమున చూపి జ్ఞాపన చేయలేదు కదా! అను సంశయమును పోగొట్టుచున్నాడు.

ప్రత్యేకం వ్యఞ్జకా భిన్నా వర్ణవాక్యపదేషు యే
తేషా మత్యన్తభేదేఽపి సంకీర్ణా ఇవ శక్తయః . 88

వర్ణవాక్యపదేషు = వర్ణములు, వాక్యములు, పదములు, (ప్రకాశనీయేషు = ప్రకాశింప జేయవలసి వచ్చినపుడు), ప్రత్యేకమ్ = ప్రత్యేకముగా, యే = ఏవి, భిన్నాః = భిన్నములగు, వ్యఞ్జకాః = ప్రకాశములగు ధ్వనులో, తేషామ్ = వానికి, అత్యన్త భేదే + అపి = మిక్కిలి భేదమున్నను, శక్తయః = శక్తులు, అనగా వర్ణపదాదులను ప్రకాశింపజేయు శక్తులు, సంకీర్ణాః + ఇవ = సంకీర్ణమైనవివలె కాన్పించుచున్నవి.

తా. వాక్యమును ప్రకాశింపజేయు ధ్వనులు పదాభివ్యంజక ధ్వనులు, వర్ణాభి వ్యంజక ధ్వనులు ఏకరూపములు కావు. అవి పరస్పరము భిన్నములే. అవి వేరువేరుగా ప్రకాశకములగును. కాని వాక్యమున పదావయవములు. వానిలో వర్ణావయవములు. వానిలో కొన్ని అవయవములు ఉన్నట్లు కాన్పించును. ఉదా: 'గా మానయ' (ఆవును తెమ్ము) ఇది ఒక వాక్యము. స్వతంత్రముగా ప్రయోగింపబడు గామ్, ఆనయ అను పదముల సారూప్యము దీనియందు కానవచ్చుచున్నది. వాక్య పద ధ్వనులు విభిన్నములైనను పై సామ్యమును బట్టి సంకీర్ణములై కన్పించుచున్నవి. కాబట్టి వాక్యము నిరవయవమైనను దానిలో పదములు, వానిలో వర్ణములు కనిపించుచున్న వనుట సరియగుచున్నది.

కత్వ గత్వాదికము క్రమము అనునవి ధ్వనిధర్మములు. స్ఫోట శబ్దమున అట్టి ధర్మములు లేవు. కాగా అట్టి వైలక్షణ్య ముండుటచే అట్టి ధర్మములు శబ్దమునందు ఎట్లు భాసించును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుటకై ముందు ఈ శ్లోకముచే దృష్టాంతము చెప్పుచున్నాడు.

యథైవ దర్శనైః పూర్వై ర్దూరా త్సంతమసేఽపి వా
అన్యథాకృత్య విషయ మన్యథై వాధ్యవస్యతి . 89

యథా = ఏరీతిగా, పూర్వైః = ముందుగానున్న, దర్శనైః = చూపులచే, దూరాత్ = వెలుతురులోనే దూరముగానున్నను, సంతమసే + అపి + వా = దగ్గరగా కను చీకటిలో నున్నను, విషయమ్ = చెట్టు, త్రాడు మున్నగువస్తువులను, అన్యథాకృత్య + ఏవ = రూపాంతరముచే అనగా ఏనుగుగాను, పాముగాను గుర్తించి, (పరైః) = తరువాతి చూపులచే, అన్యథా + ఏవ = ముందు గుర్తించిన రూపముకంటె భిన్నమగు చెట్టు, త్రాడు అను నిజ రూపముతోనే, అధ్యవస్యతి = నిశ్చయించుచున్నదో. (ఇచట లోకముకర్త. ఈ శ్లోకార్థమునకు ౯0 వ శ్లోకార్థముతో సన్వయము కలుగును.)

తా. పూర్వపూర్వ ధ్వనులు ప్రకాశకములగునపుడు అఖండవాక్య స్ఫోట శబ్దము స్పష్టముకాక వర్ణపదములే భాసించుచున్నవి. ఆ స్ఫోటశబ్దమే నిజరూపమునగాక అసత్యములగు వర్ణ పద రూపములుగా కానవచ్చుచున్నది. చివరిధ్వనిచే నభివ్యక్తి కలుగు సమయమున వర్ణపదరూపములు పోయి సత్య వాక్యస్ఫోటశబ్దము స్పష్టమగును. ఇందుకు రెండు దృష్టాంతములు చూపబడినవి. చక్కనివెలుతు రున్నను మనుజుడు దూరమున ఒక చెట్టునుచూచి 'ఏనుగు' అని భావించును. దగ్గరగా నున్నను చీకటిలో వంకరగానున్న త్రాడును చూచి 'పాము' అని భావించును. ఆ వ్యక్తి ముందుచూచుటలో కలిగిన పరిస్థితి యిది. ఆయన అచటనే యుండి జాగ్రత్తగా పరికించిన చెట్టు, త్రాడు అను రూపాంతరముల భావించును. దోషవశమున అసలు వస్తువును ముందుగా రూపాంతరముగా చూచి ఆ దోషము నివర్తించగా ఆ వస్తువునే రూపాంతరమును-అనగా భ్రమరూపమును, విడనాడి నిజరూపమున గుర్తించును. ప్రకృతమునగూడ అట్లే.

వర్ణ పదములు కల్పితములు. అవి నిజముగ లేవు వాక్యము సత్యము. అదియే స్ఫోటశబ్ద మని వైయాకరణులు విశ్వసింతురు.

యయిరీతిని దృష్టాంతము జూపి ప్రకృతార్థమున సమన్వయము చేయుచున్నాడు.

> వ్యజ్యమానే తథా వాక్యే వాక్యాభివ్యక్తిహేతుభిః
> భాగావగ్రహరూపేణ పూర్వం బుద్ధిః ప్రవర్తతే. 90

తథా = ఆరీతిగా, వాక్యే = నిరవయవమగు వాక్యశబ్దము, వ్యజ్యమానే = వ్యక్తీకరింపవలసియుండగా, వాక్యాభివ్యక్తిహేతుభిః = వాక్యముయొక్క అభివ్యక్తికి కారణములగు ధ్వనులచే, పూర్వమ్ = ముందుగా, భాగావగ్రహరూపేణ = వర్ణములు పదములు అనే భాగముల యొక్క స్వీకారరూపమున, బుద్ధిః = బుద్ధి, ప్రవర్తతే = ప్రవర్తించుచున్నది.

తా. వాక్యాభివ్యంజక ధ్వనులతో 88 వ శ్లోకమున చెప్పినప్రకారము పద ధ్వనులు సారూప్యమును బట్టి సంకీర్ణములగుటచే ముందుగా వర్ణ పద ధ్వని రూపమున బుద్ధి ప్రవర్తించును. చివరి ధ్వనివలన అట్టి పదవిషయక భ్రమ నివర్తించి నిజమగు వాక్యరూపమున నిలుచును.

'ఘట మానయ' ఈవాక్యము వ్యక్తము కావలెనన్నచో ముందుగా ఘకారాది వర్ణములు, 2 పదములు భాసించును. చివరి ధ్వనివలన ఈ రెండురూపములు మారి వాక్యరూపమున భాసించును. ముందుగా కలిగినది భ్రమ, తరువాతిది సత్యము. దీని భావము 89 వ శ్లోకమున గూడ వ్యక్తము.

వాక్యము అఖండము. దానికి అవయవములు లేవు. అచట పదరూపావయవములు, వర్ణరూపావయవములు కల్పితములే అని అంగీకరించినచో కల్పన అనియతముగా కాన్పించుచున్నందున వాక్యము విషయమున ముందుగ వర్ణరూపము. తరువాత పదరూపము అను క్రమముకూడ అనియతముగానే ఉండవలెను. చెట్టును చూచి భ్రమపడుటలో నొకనికి చిన్నఏనుగుగను, మరియొకనికి పర్వతముగను కాన్పించుచున్నదిగదా ! కాని వాక్యము విషయమున నియతమగు క్రమము కాన్పించుచున్నది. అది ఎట్లు పొసగును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

> యథాఽనుపూర్వీనియమో వికారే క్షీరబీజయోః
> తథైవ ప్రతిపత్తౄణాం నియతో బుద్ధిషు క్రమః. 91

యథా = ఏరీతిగా, క్షీరబీజయోః = పాలయొక్క, విత్తుయొక్కయు, వికారే = వికారము విషయమై, ఆనుపూర్వీనియమః = ఆనుపూర్వియొక్క నియమము అనగా నియతమగు క్రమము (అస్తి = కలదో) తథా + ఏవ = ఆరీతిగనే, ప్రతిపత్తౄణామ్ = గ్రహించువారికి - అనగా వాక్యమును తెలుసుకొనువారికి, బుద్ధిషు = వర్ణపదములకు సంబంధించిన బుద్ధుల విషయమై, క్రమః = క్రమము - అనగా ముందుగా వర్ణములు, తరువాత పదములు అను క్రమము, నియతః = నియతమైనదై, (అస్తి) = కలదు.

తా. నిరవయవమగు వాక్య స్ఫోటశబ్దమే సత్యము. దానియందు పదములు, వర్ణములు లేనేలేవు. కాని ముఖ్యశబ్ద మభివ్యక్తము కావలెనన్నచో నియతమగు క్రమము కలదు. ముందుగా వర్ణములు, తరువాత పదము భాసించును. తరువాత వాక్యము వ్యక్తమగును. అంతియేగాని పదము ముందు, వర్ణములు తరువాత అని మాత్ర ముండదు. వర్ణ పదములు కల్పితములు కావచ్చును. వానికి క్రమముమాత్రము పై రీతిని నియతముగా

నుండును. ఇందుకు రెండు దృష్టాంతములు చూపబడినవి. పాలు పెరుగుగా మారును. పాలు ముందుగా కొంచెము గట్టిపడును. తరువాత మరికొంచెము గట్టిపడును. విత్తు వేయగా మొలక, రెండు ఆకులు, చిగురు, రెమ్మ, కొమ్మ అను క్రమముననే చెట్టు అగుచున్నది. ప్రథమావస్థను రెండవ యవస్థగాను, రెండవయవస్థను ప్రథమావస్థగాను మార్చుట బ్రహ్మకుగూడ సాధ్యము గాదు. ప్రకృతమునగూడ అదియే రీతి.

పూర్వమీమాంసకులు వర్ణములకు నిత్యత్వ మంగీకరింతురు. మరియు వర్ణముల కలయికయే పదము, అదియే వాక్యము. వర్ణములకంటె వేరుగా పదముగాని వాక్యము గాని ఉండనేరదు అని వారు తలంచుచున్నారు. వారిమతమునగూడ ఘట పటాది శబ్దములకు భేదము అభివ్యంజకములగు ధ్వనుల క్రమమును పురస్కరించుకొనియే కలుగునని అంగీకరించవలె నని చెప్పుచున్నాడు.

భాగవత్స్వపి తేష్వేవ రూపభేదో ధ్వనేః క్రమాత్
నిర్భాగే ష్వభ్యుపాయో వా భాగభేదప్రకల్పనమ్ . 92

(అ) భాగవత్సు + అపి = అవయవములు కలవియైనను, తేషు = ఆ పద వాక్యములయందు, రూపభేదః = రూపభేదము, ధ్వనేః = వ్యంజకమగు ధ్వనియొక్క, క్రమాత్ + ఏవ = క్రమమువలననే (జాయతే = కలుగుచున్నది).

తా. మీమాంసకమతమున ఘటః పటః అను పదస్వరూపము వ్యంజకములగు ధ్వనులందున్న క్రమమును బట్టియే చెప్పవలెను. అట్లు కాకున్న ఒక్కొక్క ధ్వనిచే నభివ్యక్తి కలిగిన పదము నిర్ధారితము కాకపోయెడిని. వర్ణములకు స్వతః క్రమములేదు. అన్ని ధ్వనులు ఒకేసారి వ్యంజకములగుచో 'నదీ' 'దీన' ఈ రెండు పదములలో గూడ ఒకేవిధములగు వర్ణము లున్నందున పదభేదము చూప సాధ్యము కాదు. ఇట్లే 'కపి'-'పిక' 'రాజ'-'జరా' 'యమ'-'మయ' మున్నగునవి కలవు. వ్యంజకములు ధ్వనులు. అవి జన్యములు. వానికి క్రమము కలదు. ఆ క్రమమును వ్యంగ్యమగు వర్ణమునందు ఆరోపించగా పదభేదము సిద్ధించును.

పూర్వార్థముచే మీమాంసకమతమును జూపి వైయాకరణమతమును ఉత్తరార్థముచే జూపుచున్నాడు.

(ఆ) వా = అట్లుగాక, నిర్భాగేషు = నిరవయవములగు వాక్యములందు, భాగభేదప్రకల్పనమ్ = వర్ణములు పదములు అనెడి భాగముల భేదముయొక్క కల్పనము - అనగా ధ్వనుల క్రమముచే కలిగిన వర్ణము, పదము అనే అవయవముల కల్పనము, అభ్యుపాయః = అఖండ స్ఫోటశబ్దమును తెలుసుకొనుటకు ఉపాయము కాగలదు.

తా. వాక్యమే సత్యము వర్ణ పదములు కల్పితములని శాబ్దికులు విశ్వసింతురు. వీరికిగూడ ధ్వనులక్రమముచే వర్ణ పద భేదము, దానివలన సత్య వాక్య స్ఫోటశబ్దజ్ఞానము కలుగును.

కాగా ధ్వనులకు స్వాభావికమగు క్రమమును ముఖ్యశబ్దమునందు ఆరోపణము మీమాంసకులకు, వైయాకరణులకు సమానమే.

విశేషమేమనగా మీమాంసక మతమున వాయుసంయోగములు, వైయాకరణ మతమున కకార గకారాది వర్ణములు ధ్వనులుగా గ్రహింపబడుచున్నవి.

శబ్దగత జాతియే వాచకమనెడి జాతిస్ఫోటవాదియొక్క మతమును జూపుచున్నాడు.

అనేకవ్యక్త్యభివ్యఙ్గ్యా జాతిః స్ఫోట ఇతి స్మృతా
కైశ్చి ద్వ్యక్తయ ఏవాస్యా ధ్వనిత్వేన ప్రకల్పితాః. 93

కైశ్చిత్ = కొందరిచే, అనగా శబ్దమునందున్న జాతి వాచకమను పక్షము నాశ్రయించిన వారిచే, అనేకవ్యక్త్యభివ్యఙ్గ్యా = అనేకములగు వర్ణవ్యక్తులచే వ్యంగ్యమగు, జాతిః = శబ్దత్వరూపమగు జాతి, స్ఫోటః + ఇతి = వాచకమని, స్మృతా = స్మరింపబడుచున్నది అనగా నిశ్చయింపబడుచున్నది.

అస్యాః = వాచకమగు ఈ జాతికి, వ్యక్తయః + ఏవ = వర్ణవ్యక్తులే, ధ్వనిత్వేన = వ్యంజకరూపమున, ప్రకల్పితాః = స్వీకరింపబడినవి.

తా. మహాభాష్యకారులు జాతి వ్యక్తి భేదమున స్ఫోటశబ్దమును రెండు రకములుగా నిరూపించి యున్నారు. ఇంతవరకు వ్యక్తి స్ఫోటపక్షమును చూపి ఈ శ్లోకముచే జాతి స్ఫోటపక్షమును నిరూపించుచున్నాడు.

స్ఫుటతి అస్మాదర్థః (దీనివలన అర్థము స్ఫుటమగును) అను వ్యుత్పత్తిని బట్టి స్ఫోటశబ్దము వాచకపర్యాయము. వ్యక్తిస్ఫోట అనగా వ్యక్తి వాచకమనియు, జాతి స్ఫోట అనగా జాతివాచకమనియు అర్థము చెప్పవలెను.

ఘటః పటః మున్నగు ధ్వనులచే నభివ్యక్తమగు స్ఫోటశబ్దము వాచకమని వ్యక్తి స్ఫోటవాది యాశయము.

పై శబ్దములు ఘటము మున్నగు వ్యక్తులందున్న ఘటత్వ పటత్వ జాతులను బోధించును. అట్లు చెప్పుటలో లాఘవ మున్నదని చాలమంది శాస్త్రజ్ఞులు సిద్ధాంతపరచి యున్నారు. అట్టితరి ఘటశబ్దము వాచకమగుటకు దానియందున్న ఘటశబ్దత్వ జాతి వాచకమగునని జాతి స్ఫోటవాది యాశయము. అట్టి జాతికి వర్ణరూపములగు ధ్వనులు వ్యంజకములు కాగలవు.

వి. ఇచట జాతి అనగా తార్కికులు చూపుచున్న జాతి కాదు. మరియేమన అద్వైత వేదాంతులు చూపిన బ్రహ్మరూపము. ఈ యంశమును భర్తృహరియే మూడవ కాండమున స్పష్టపరచనున్నాడు.

శబ్దవ్యక్తియే వాచకమనెడి వ్యక్తిస్ఫోటవాది మతమును చూపుచున్నాడు.

అవికారస్య శబ్దస్య నిమిత్తై ర్వికృతో ధ్వనిః
ఉపలబ్ధౌ నిమిత్తత్వ ముపయాతి ప్రకాశవత్. 94

నిమిత్తైః = నోటిలోనున్న తాలువు, దంతములు, పెదవులు మున్నగు స్థానముల చలనముచే, వికృతః = వికారమునుపొందిన-అనగా పుట్టిన, ధ్వనిః = ధ్వని, ప్రకాశవత్ = దీపము మున్నగువాని వెలుతురువలె, అవికారస్య = వికారములేని, శబ్దస్య = అఖండవ్యక్తి స్ఫోటరూపమగు శబ్దముయొక్క, ఉపలబ్ధౌ = పొందుటయందు, నిమిత్తత్వమ్ = కారణత్వమును, ఉపయాతి = పొందుచున్నది - అనగా కారణమగుచున్నది.

తా. ఘటమునందు ఘటత్వజాతి యున్నది. దానికి ఆశ్రయము ఆ ఘటము. అనగా వ్యక్తి. ఇది శాస్త్రజ్ఞుల వ్యవహారమున నున్న ప్రక్రియ.

స్ఫోటశబ్దము అట్టిదికాదు. శబ్దవ్యక్తి నిత్యము. ఆకాశము నంతట వ్యాపించి యున్నది ఒక్కటియే. దానియందు జాతి లేనేలేదు. స్థానముల చలనము నోటిలో నున్న ధ్వనికే భేదమును కలిగించును. స్ఫోటశబ్దమునకు భేదకము కాదు.- ధ్వనివలన స్ఫోటవ్యక్తి పుట్టినది కాదు. ఐనను దానికి ధ్వని వ్యంజకము కాగలదు. ఇందుకు ప్రకాశము దృష్టాంతముగా జూపబడినది. దీపముయొక్క వెలుతురు ఘటము మున్నగు వస్తువులను పుట్టించునది కాదు. దానిపై అవి ఆధారపడినవి కావు. ఐనను వానిని ప్రకాశింపజేయుచున్నది. ప్రకృతమునగూడ అట్లే.

బ్రహ్మజ్ఞానము కలుగగా జాతియు నశించును. కనుక జాతి సిద్ధాంతమున నిలుచునది కాదు. కనుక వ్యక్తి స్ఫోటపక్షము యుక్తము.

నిత్యమగు శబ్దమునకు ధ్వనులు వ్యంజకము లనుట పొసగదు. ఏలయన అనిత్యము లగు ఘటపటాదులకే దీపాదులచే నభివ్యక్తి కలుగును. నిత్యమగుదానికి అభివ్యక్తి ఎట్లు ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

న చానిత్యే ష్వభివ్యక్తి ర్నియమేన వ్యవస్థితా
ఆశ్రయైరపి నిత్యానాం జాతీనాం వ్యక్తి రిష్యతే. 95

అభివ్యక్తిః=వ్యంజకములచే ప్రకాశించుట, అనిత్యేషు + చ = అనిత్యములగు వ్యక్తులందే, నియమేన=నియతముగా, న+వ్యవస్థితా=నిశ్చయింపబడునది కాదు.

కారణమేమనగా, నిత్యానామ్+అపి=నిత్యములైనను, జాతీనామ్=ఘటత్వము మున్నగు జాతులకు, ఆశ్రయైః=ఆధారములగు ఘటము మున్నగువ్యక్తులచే, వ్యక్తిః=అభివ్యక్తి, ఇష్యతే=అంగీకరింపబడుచున్నది.

దీపముయొక్క ప్రకాశము ఘటము మున్నగువస్తువులను ప్రకాశింపజేయుచున్నది. ప్రకాశింపజేయబడెడి ఘటాదు లనిత్యములే. కాబట్టి ప్రకాశింపజేయబడే పదార్థము అనిత్యమే యగును అను నియమము లభించుచున్నది. ఇట్టితరి ధ్వనులచే స్ఫోటశబ్ద మభివ్యక్త మగునని తలంచిన ఆ శబ్ద మనిత్యమే కావలెను. అట్లంగీకరించుట వ్యాకరణసిద్ధాంత విరుద్ధము అను సంశయము కలుగుచున్నది. దానికి ఈ శ్లోకము సమాధానము చూపుచున్నది.

తా. అభివ్యక్తి అనిత్య వస్తువులకే అను నియమము లేదు. ఘటము పటము గోవు మున్నగువ్యక్తులందు ఘటత్వము పటత్వము గోత్వము మున్నగు జాతు లున్నవి. అవి నిత్యములనియే శాస్త్రములు చెప్పుచున్నవి. ఘటము మున్నగు వ్యక్తులు ఆ జాతులను ప్రకాశింపజేయుననియు శాస్త్రములే చెప్పుచున్నవి. కనుకనే ఘటాదులకు వ్యక్తులను వ్యవహారము కలిగినది వ్యక్తపరచునది వ్యక్తి. ఇట్టి ఆకారము కలవి యన్నియు ఘటములు అనియు, వాని యన్నిటియందు ఘటత్వమను జాతి యున్నదనియు లోకులు తలంచుచునే యున్నారు.

కాగా నిత్యములైనను జాతులు స్వాశ్రయ వ్యక్తులచే నభివ్యంజితములగు చున్నందున నిత్యమగు స్ఫోటశబ్దముకూడ ధ్వనులచే నభివ్యంజితమగుటలో విప్రతిపత్తి లేదు. అనిత్యవస్తువులే అభివ్యక్తము లగునను నియమము లేదు.

ఒకే దేశమునందున్న దీపమునకు, ఘటాదికమునకు వ్యంగ్యవ్యంజక భావము కాన్పించుచున్నది. బజారులోనున్న దీపము ఎచ్చటనో ఉన్న ఘటాదికమును ప్రకాశింప జేయనేరదు కదా! ప్రకృతమున తాల్వాదులచే నభివ్యక్తమగు ధ్వని నోటిలోనున్నది శబ్దము మాత్రము బుద్ధియందున్నది. కాగా భిన్నదేశములయందున్న ధ్వని శబ్దములకు వ్యంగ్య వ్యంజకభావము ఎట్లు కుదురును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

దేశాదిభిశ్చ సంబన్ధో దృష్టః కాయవతా మిహ
దేశభేదవికల్పేఽపి న భేదో ధ్వనిశబ్దయోః . 96

(అ) ఇహ=ఈ జగమున, కాయవతామ్+చ=శరీరము కలవానికే, దేశాదిభిః= దేశము మున్నగువానితో, సంబన్ధః=సంబధము–అనగా ఈ గోవు ఈ ప్రదేశమున నున్నది. ఈ కడవ ఈ దేశమున ఉన్నది. ఇది ఈ కాలమున ఉన్నది. అనే దేశకాలసంబన్ధము, దృష్టః=చూపబడుచున్నది. మూర్తిమత్తులకే దేశకాల సంబంధము కలుగును. పరిమితమగు పరిమాణము కలవి మూర్తిమత్తు లనబడును. అమూర్తములకు దేశకాల సంబంధ ముండదని భావము.

తా. మూర్తములగు పదార్థములకే దేశసంబంధము కలుగును. ఘటము గోవు మున్నగునవి మూర్తములు కనుక వానికి దేశసంబంధము, కాలసంబంధము కలుగును. శబ్దము అట్టిదికాదు. అది వ్యాపకము. అంతట వ్యాపించియున్నది. కనుక పరిమిత పరిమాణ ములకు కలిగెడి దేశసంబంధము వ్యాపకమగు శబ్దమునకు ప్రసరించునది కాదు.

(అ) ధ్వనిశబ్దయోః=ధ్వనికి శబ్దమునకును, దేశభేద వికల్పే+అపి =దేశభేద మును కల్పించినను, భేదః=యథార్థమగు భేదము, న=లేదు.

తా. 'ఇంటిలో మాట్లాడుచున్నాడు', 'బజారులో మాట్లాడుచున్నాడు' మున్నగు లోకుల వ్యవహారము చూడగా శబ్దమునకుగూడ దేశభేదమున్నటుల కాన్పించును; కాని ఆ భేదము కల్పితమే. యథార్థము కానేరదు. అమూర్తమగు శబ్దమునకు దేశసంబంధము కలుగ నేరదు కదా!

వి. ఈ కారికా పూర్వభాగమున 'చ' శబ్దము, 'ఏవ' శబ్దార్థకము. 'కాయవతా మపి' అని పాఠాంతరము.

ప్రకాశింపజేయబడు వస్తువునకు ప్రకాశకములు నానావిధము లుండగలవు. ఘట మును దీపము సూర్యరశ్మి మణికాంతి మున్నగునవి అన్నియు ప్రకాశింపజేయుచున్నవి. ప్రకాశక నియమము లేదు. ఇది వ్యంగ్యవ్యంజకములకు గల పద్ధతి. ప్రకృతమున శబ్దము ప్రకాశింపజేయబడేది. దానిక ప్రకాశకములు "ధ్వనులు". మరియొకదానివలన అది ప్రకాశింపజేయబడనేరదు. అందుచే ధ్వనులకు, శబ్దమునకు జన్యజనకభావము చెప్పవలెను, వ్యంగ్య వ్యంజకభావము కుదరదు అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

గ్రహణ గ్రాహ్యయోః సిద్ధా నియతా యోగ్యతా యథా
వ్యఙ్గ్యవ్యఞ్జకభావేన తథైవ స్ఫోటనాదయోః . 97

యథా=ఏరీతిగా, గ్రహణగ్రాహ్యయోః=గ్రహణసాధనమునకు, గ్రహింపబడు దానికిని, వ్యఙ్గ్యవ్యఞ్జక భావేన=వ్యంగ్యవ్యంజక భావరూపమున, నియతా=నియతమగు, యోగ్యతా=అర్హత, సిద్ధా=ప్రసిద్ధమైయున్నదో, తథా+ఏవ=అట్లే, స్ఫోటనాదయోః= స్ఫోటశబ్దమునకు, ధ్వనికిని, వ్యంగ్యవ్యంజక భావమున నియతమగు యోగ్యత కలదు.

తా. నేత్రేంద్రియమునందున్న రూపము బాహ్యఘటాదుల రూపమును ఘటమును వ్యక్తపరచును. నేత్రమునందున్న మరియొక గుణముగాని, మరియొక ఇంద్రియముగాని దాని రూపముగాని ఘటరూపమును ఘటమును వ్యక్తపరచలేవు. కనుక నేత్రేంద్రియరూపమే వ్యంజకమగును. వానికి సంబంధము నియతమే. ఇదియే యోగ్యత. కాని పై రెంటికి జన్య జనక భావములేదు. నేత్రరూపమువలన ఘటరూపము, ఘటము పుట్టుటలేదు. అట్లే ధ్వనులు నియతమగు శబ్దమునే వ్యక్తపరచగలవు. వానికి ఆ శక్తి నియమితము. అదియే యోగ్యత.

97 వ శ్లోకమున అవతారికలో చూపబడిన సంశయమునకు సమాధానము చూపి, ఆ సంశయమునకే మరియొకరీతిగా సమాధానము చూపుచున్నాడు.

సదృశగ్రహణానాం చ గన్ధాదీనాం ప్రకాశకమ్
నిమిత్తం నియతం లోకే ప్రతిద్రవ్య మవస్థితమ్ . 98

సదృశగ్రహణానామ్=సమానములగు గ్రహణములు కల-అనగా సమానములగు గంధాదులచే గ్రహింపబడునట్టి, గన్ధాదీనామ్+చ=గంధము రూపము మున్నగువానికి అయితే, ప్రకాశకమ్=ప్రకాశింపచేయునట్టి, నిమిత్తమ్=నిమిత్తము, లోకే=లోకమున, ప్రతిద్రవ్యమ్=ప్రతిద్రవ్యమునందు, నియతమ్=నియతమైనదై, అవస్థితమ్=ఉన్నది.

తా. గ్రాహ్యగ్రాహకములకు వైజాత్యమున్నపుడే వ్యంజక మనియతమగును. వ్యంగ్యమగు ఘటమునందు ద్రవ్యత్వము, గ్రాహకమగు నేత్రేంద్రియ రూపమున గుణత్వము ఉన్నవి. అవి విజాతీయములు కనుక అచట వ్యంజక మనియతము కావచ్చును. వానికి సారూప్యమున్నచో వ్యంజకము నియమితముగానే యుండును. ఘటముయొక్క రూపము వ్యక్తము కావలయునన్నచో నేత్రేంద్రియము యొక్క రూపమే వ్యంజకమగును. మరియొకటి ఉపయోగించదు. ప్రకృతమున వ్యంజకములగు ధ్వనులకు వ్యంగ్యమగు స్ఫోటశబ్దమునకు సారూప్యముండుటచే నిచటవ్యంజకము అనియతముగా నుండవలయునను నియమములేదు. వ్యంజకము నియతముగానే యుండును. ఇట్లే భూమియొక్క గంధము గ్రాహ్యము కావలె నన్నచో ఘ్రాణేంద్రియముయొక్క గంధమే వ్యంజకమగును. అదియు సజాతీయము కనుక వ్యంజకము నియతమే.

ప్రాకృతధ్వని స్ఫోటశబ్దమును ప్రకాశింపజేయును. స్ఫోట శబ్దము నిత్యమే. దానికి పరిణామము లేదు. కాగా స్ఫోటశబ్దము వ్యంగ్యమగునని వైయాకరణుల సిద్ధాంతము. కాని అట్లు చెప్పుట లోకానుభవమునకు విరుద్ధముగా కానవచ్చుచున్నది. చీకటిలో ఘటాదులు మనకు కానరావు. వానిని చూడవలెనన్నచో దీపమును ఉపయోగించుచున్నాము. ఆ దీపముచే చీకటి తొలగి ఘటాదులు మనకు కానవచ్చుచున్నవి. ఇచట దీపము ప్రకాశకము. ఘటాదులు ప్రకాశ్యములని అందరికి తెలిసినదే. ప్రకాశకమగు దీపము యొక్క అల్పత్వ మహత్త్వములచే ప్రకాశ్యమగు ఘటమునకు అల్పత్వాదులు కలుగవు. అనగా దీపము చిన్నదైనచో ఆ ఘటము చిన్నదిగా ఉండుటగాని, దీపము పెద్దది యగుచో ఘటము పెద్దది యగుటగాని జరుగదు. అట్లే పది దీపములు ప్రకాశకములైతే ప్రకాశ్యమగు ఘటముకూడ పది ఘటములుగా మార్పుచెందదు. ఇది ప్రకాశ్య ప్రకాశకములకు కల స్థితి. అనగా ప్రకాశమునుబట్టి ప్రకాశ్యము భిన్నరూపమును దాల్చదు. అది నిజరూపముతోనే యుండును. ప్రకృతమున అట్లు కానరాదు. వ్యంజకధ్వనులనుబట్టి స్ఫోటశబ్దమునకు పెరుగుట, తరుగుట కానవచ్చుచున్నది. అట్లే వ్యంజకధ్వనులు పలువిధములగుచో వ్యంగ్యమగు స్ఫోటమును

ఘటః పటః మున్నగు నానా పదములుగా కానవచ్చుచున్నది. కాగా స్ఫోటశబ్దమునందు వ్యంజక ధ్వని ధర్మములు కాన్పించుచున్నవి. లోకమున అట్లు కానరాలేదు. కనుక స్ఫోట శబ్దము జనియించుచున్నదనుటయే యుక్తము. అయినచో శబ్దమునకు నిత్యత్వమెట్లు సిద్ధించును ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

ప్రకాశకానాం భేదాంశ్చ ప్రకాశ్యోఽర్థోఽనువర్తతే
తైలోదకాది భేదే తత్ప్రత్యక్షం ప్రతిబిమ్బకే. 99

ప్రకాశ్యః=ప్రకాశింపచేయబడెడి, అర్థః=పదార్థము, ప్రకాశకానామ్=ప్రకాశింప జేయు పదార్థములయొక్క, భేదాన్=భేదములను, అనువర్తతే=అనువర్తించుటయు కలదు.

తత్=అట్లు అనువర్తించుట, తైలోదకాదిభేదే=తైలము ఉదకము మున్నగు వస్తువులచే భేదముకల – అనగా వానిచే భిన్నమగు, ప్రతిబిమ్బకే=ప్రతిబింబమున, ప్రత్యక్షమ్=ప్రత్యక్షమగుచున్నది. అనగా చూడబడుచున్నది.

తా. ప్రకాశకముయొక్క ధర్మములను ప్రకాశ్యము అనువర్తించుటకూడ కలదు. ముఖము నూనెలో ప్రతిఫలించిన నల్లగాను, అద్దమునందు ప్రతిఫలించిన స్వచ్ఛముగాను, భూతయద్దమున పెద్దదిగాను, వికారముగానున్న యద్దమున వికారముగాను, కత్తియందు కోలగాను కనుపించుచున్నది.

వి. ఒకే సూర్యబింబము ఉదకములు నానాస్థలములందు నున్నచో వానియందు బహుసంఖ్యాకముగా కనిపించును. ఒకే చైతన్యము అంతఃకరణ భేదమున నానాత్వమును బొందుచున్నది. పెద్ద ఏనుగు చిన్నఅద్దమున చిన్నరూపముతో కనిపించును. పెద్ద మేఘ మాలయు చిన్నదిగా కానవచ్చును. కాన ప్రకాశకధర్మము ప్రకాశ్యమున కానరాదు అను నియమములేదు.

కాబట్టి ఒకే స్ఫోటశబ్దము వ్యంజకధ్వనులనుబట్టి నానారూపములను పొందుచు కానవచ్చును. స్ఫోటశబ్దము జన్యము కాదు.

తైలము, వజ్రము, అద్దము మున్నగువానిలో ముఖప్రతిబింబము నూతనమైనదే పుట్టుచున్నది. అంతియేకాని వాని యందు ముఖములు ప్రతిఫలించుట కాదు. కనుక ప్రకాశక ధర్మములు ప్రకాశ్యమునందు కలుగుటకు దృష్టాంతము సరిపడదు అని అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

విరుద్ధపరిమాణేషు వజ్రాదర్శతలాదిషు
పర్వతాదిసరూపాణాం భావానాం నాస్తి సమ్భవః. 100

విరుద్ధపరిమాణేషు=విరుద్ధమగు పరిమాణము కల, వజ్రాదర్శతలాదిషు= వజ్రము, అద్దము మున్నగు వస్తువులయందు, పర్వతాది సరూపాణామ్=పర్వతము మున్నగు వానితో సమానమగు స్వరూపము కల, భావానామ్=పదార్థములకు, సమ్భవః=పుట్టుక, నాస్తి=లేదు, కలుగదు; సంభవించదు.

తా. వజ్రము, అద్దము మున్నగువానిలో కొండ ఏనుగు మున్నగునవి ప్రతి ఫలించును. అంతియేగాని నూతనముగ అచట వస్తువు పుట్టదు. అది అసంభవము. పర్వతా దుల శరీరము పెద్దది. అట్టి ప్రతిబింబము – అనగా అంత ఆకారముకల ప్రతిబింబములు స్వల్పమగు వజ్రము అద్దము మున్నగు వానియందు నూతనముగా ఎట్లు పుట్టగలవు ?

కాబట్టి 99 వ శ్లోకమున చూపిన దృష్టాంతము యుక్తమే.

స్ఫోటశబ్దమునందు వ్యంజకధ్వనులవలన భేదము కలుగుచున్నదని 49 వ శ్లోకము దగ్గరనుండి ప్రతిపాదింపబడిన అర్థమును ఉపసంహరించుచున్నాడు.

తస్మాదభిన్నకాలేషు వర్ణవాక్యపదాదిషు
వృత్తికాలః స్వకాలశ్చ నాదభేదా ద్విభావ్యతే. 101

తస్మాత్ = ఆకారణము వలన - అనగా వ్యంజకధ్వనుల భేదముచే వ్యంగ్యమగు స్ఫోట శబ్దమునందు భిన్నధర్మములు కాన్పించుట వలన, అభిన్నకాలేషు = అభిన్నమగు కాలము కల-అనగా స్వతః కాలభేదములేని, వర్ణవాక్యపదాదిషు = వర్ణ వాక్య పదరూపమగు స్ఫోటశబ్దములయందు, నాద భేదాత్ = ప్రాకృత వైకృత ధ్వనుల భేదమువలన, వృత్తికాలః = ద్రుత మధ్య విలంబిత వృత్తుల కాలము, స్వకాలః + చ = తనయొక్క స్ఫోటాభివ్యంజక మగు ప్రాకృత ధ్వనియొక్క ఏకమాత్రాది కాలమున్ను, విభావ్యతే = తెలియబడుచున్నది.

తా. స్ఫోట శబ్దము నిత్యము, కనుక దానిని కాల ధర్మము లనువర్తించవు. దానిని ధ్వనులు వ్యక్తపరచును. వ్యంజక ధర్మములు శబ్దమునందు కాన్పించును. ప్రాకృత ధ్వనులు స్ఫోటాభివ్యంజకములు. వానితో కలిసియే యున్నందున ఆశబ్దము ఏక మాత్రాది కాల భేదమును పొందగలదు. వైకృత ధ్వనులు బహిరంగములగుటచే వాని ధర్మములు స్ఫోట శబ్దమునందు సంక్రమించవు. కాని యవి ఆ శబ్దమునకు కొంతకాలము ఉనికిని కలిగించగలవు.

పై రీతిని ప్రాకృతధ్వనులవలన స్ఫోటశబ్దమునందు ఏకమాత్రాది కాలభేదము, వైకృత ధ్వనులవలన ద్రుతాది కాలవ్యవహారము లభించును.

వైయాకరణులు శబ్దము నిత్యమనియు, అనిత్యమనియు రెండు పక్షములను స్వీకరించిరి. మొదటి పక్షము ముఖ్యసిద్ధాంతమని వారు తలంతురు. ఆ పక్షము నాశ్రయించి స్ఫోటశబ్దస్వరూపము, దానికి వ్యంజకములగు ధ్వనుల స్వరూపము, వ్యంగ్య వ్యంజక భావము మున్నగు అంశములను 44వ శ్లోకమున నుపక్రమించి యింతవరకు నిరూపించెను. ఈ పక్షము ఉత్తమాధికారులకు సంబంధించినది.

మధ్యమాధికారులకు గూడ శాస్త్రమందుబాటులో నుండవలెనను తలంపుతో వైయాకరణులు శబ్దమనిత్యమను రెండవ పక్షమును గూడ ఆశ్రయించిరి. ఈ పక్షమును వారు "కార్యశబ్దవాద" మను పేరుతో వ్యవహరించిరి. శబ్దము ఘటపటాదికము వలె పుట్టక కలదియే యని దీని భావము. ఆ పక్షమును నాశ్రయించి స్ఫోట శబ్దస్వరూపమును ధ్వని స్వరూపమును 102 నుంచి 118 వ శ్లోకము వరకు 16 శ్లోకములలో వివరించుచున్నాడు.

యస్సంయోగవిభాగాభ్యాం కరణై రుపజన్యతే
స స్ఫోటః శబ్దజాః శబ్దా ధ్వనయోఽన్యై రుదాహృతాః. 102

కరణైః = స్థానప్రయత్నములచే, సంయోగ విభాగాభ్యామ్ = వాయువుల సంయోగముచేతను, విభాగముచేతను, యః = ఏ శబ్దము, ఉపజన్యతే = ముందుగా పుట్టుచున్నదో, సః = ముందుగా పుట్టిన ఆశబ్దము, స్ఫోటః = వాచకశబ్దముగాను, శబ్దజాః = అట్టి శబ్దముచే

పుట్టిన, శబ్దాః = ఇతర శబ్దములు, ధ్వనయః = ధ్వనులుగా, అన్యైః = ఇతరులచే అనగా శబ్దమునకు అనిత్యత్వము నంగీకరించెడి ఆచార్యులచే, ఉదాహృతాః = చెప్పబడుచున్నవి.

తా. కంఠము, తాలువు, మూర్ధము, పెదవులు మున్నగు స్థానములందు లోపల నుండి పయనముచేయు వాయువు ప్రసరించును. వానియందు ఆ వాయువుల సంయోగ విభాగములచే, అ, ఇ, ఉ, క మున్నగు శబ్దములు పుట్టుచున్నవి. అవియే వాచకములు. అవియే స్ఫోట శబ్దరూపములు. ఇవియే ముందుగా పుట్టినవి.

ఇట్టి స్ఫోటశబ్దమువలన మరికొన్ని శబ్దములు పుట్టును. అవియే ధ్వనులు. నిత్య శబ్దవాదమున స్ఫోటశబ్దమునకు వ్యంజకములుగా నున్న ప్రాకృత ధ్వనులు ఈ కార్యశబ్ద వాదమున స్ఫోటశబ్దముగాను, వైకృతధ్వనులు ధ్వనులుగాను స్వీకరింపబడును. స్థానము లందు ముందుగా స్ఫోట శబ్దము పుట్టును. ఆశబ్దమువలన మరికొన్ని శబ్దములు పుట్టును. అవి ధ్వనులుగా నున్నవి.

ముందుగా కంఠతాల్వాదులయందు వాచక శబ్దము జనియించును. దానినే స్ఫోట శబ్దమందురు. తరువాత ఆ శబ్దమువలన మరికొన్ని శబ్దములు పుట్టుచున్నవని 102 వ శ్లోకములో చూపబడినది. ఆ మతమున కలిగెడి ప్రక్రియను అనగా వివరములను జెప్పు చున్నాడు.

> అల్పే మహతి వా శబ్దే స్ఫోటకాలో న భిద్యతే
> పరస్తు శబ్దసన్తానః ప్రచయాపచయాత్మకః . 103

అల్పే = తక్కువదియైనను, మహతి + వా = పెద్దది అయినను, శబ్దే = వైకృత శబ్దము, (జాతే = కలుగగా), స్ఫోటకాలః = స్ఫోట శబ్దముయొక్క కాలము-అనగా హ్రస్వా కారాది కాలము, న + భిద్యతే = భేదింపబడదు-అనగా భిన్నము కాదు.

పరః = రెండవదియగు - అనగా ముందుగా పుట్టిన స్ఫోటశబ్దమువలన పుట్టిన, శబ్దసన్తానః + తు = శబ్దసముదాయము మాత్రము, ప్రచయాపచయాత్మకః = వృద్ధిచెందునది, అల్పత్వము చెందునదియు - అనగా అధిక దేశమును వ్యాపించునదియు, అల్ప దేశమును వ్యాపించునదియు, (భవతి = అగుచున్నది).

తా. శబ్దము అమూర్తము కనుక దానియందు అల్పత్వ మహత్త్వరూప పరిమా ణము సంభవింపదు. దాని పరిమాణ మిది యని చెప్ప సాధ్యము కాదు.

కాని ఆ స్ఫోట శబ్దమువలన కలిగిన శబ్ద సముదాయమునకు అట్టి పరిమాణము లభించును. దానిని బట్టి స్ఫోట శబ్దమునకు గూడ ఆ వ్యవహారము కలుగును. కాగా ముఖ్య మగు అల్పత్వముకల సూది అల్పదేశమును, అట్టి మహత్త్వముకల పర్వతము అధికదేశమును వ్యాపించునట్లు ఆరోపితమగు అల్పత్వ మహత్త్వములు కల శబ్దముకూడ అల్పమగు దేశమును, అధిక మగు దేశమును వ్యాపించును.

102 వ శ్లోకమున ముందుగా స్ఫోటశబ్దము పుట్టును. దానివలన ధ్వనులు కలు గునని చూపబడినది. ఈ శ్లోకమున స్ఫోటశబ్దము ధ్వనులతో పాటు పుట్టు ననెడి మరియొక మతమును జెప్పుచున్నాడు.

> దూరాత్ ప్రభేవ దీపస్య ధ్వనిమాత్రం తు లక్ష్యతే
> ఘణ్టాదీనాం చ శబ్దేషు వ్యక్తో భేదః స దృశ్యతే . 104

దీపస్య=దీపముయొక్క, ప్రభా+ఇవ=వెలుతురు వలె, ధ్వనిమాత్రం+తు =ధ్వని మాత్రమే, దూరాత్=దూరమునుండి, లక్ష్యతే=గుర్తింపబడుచున్నది. శబ్దము మాత్రము దూరమున వినబడదు.

చ = మరియు, ఘణ్టాదీనామ్=గంట మున్నగువానియొక్క, (అభిఘాతేన జాయమానేషు = కొట్టుటచే కలిగినటువంటి,) శబ్దేషు=శబ్దములయందు, సః = ఆ, భేదః=భేదము-అనగా స్ఫోటనాదములకు గల భేదము, వ్యక్తః = స్పష్టమైనదై, దృశ్యతే = తెలియబడుచున్నది.

తా. దీపము ప్రభతోపాటు పుట్టును. అట్లే స్ఫోట శబ్దముకూడ ధ్వనులతోపాటు పుట్టును - అనగా రెండు ఒకేసారి పుట్టును. దీపము ఆ స్థలమునందే ఉండును. కాంతి మాత్రము దూరము వ్యాపించును. అట్లే శబ్దము అచటనే ఉండును. ధ్వని మాత్రము దూరము వ్యాపించును - అనగా దూరమున నున్నను ధ్వని వినబడును. శబ్దము వినబడదు. పదిమంది కలసి మాట్లాడునపుడు మాట వినబడదు. ధ్వని మాత్రము వినబడును.

మరియు గంట మ్రోయించగా ధ్వని కలుగును. అది స్ఫోటశబ్దము. దాని వలన మరికొన్ని శబ్దములు వరుసగా కలుగును. అవి ధ్వనులు. ఇచట స్ఫోటనాదములకు భేదము స్పష్టముగా నున్నది.

వి. ఈ శ్లోకమున రెండు భాగములలోను రెండుదృష్టాంతములు కలవు. స్ఫోట శబ్దముకంటె వేరుగా ధ్వని అనుభూతము కానందున లేదు అను శంకకు సమాధానముగా ఘంటానాద దృష్టాంత ముపయుక్తమగు చున్నది. రెండు ఒకేసారి పుట్టుటచే వేరుగా తెలియక పోయినా జనసమూహము మాట్లాడునపుడు ధ్వని వేరుగా కాన్పించుచున్నది. స్ఫోట శబ్దము వలన జనియించిన ధ్వని దూరదేశమును వ్యాపించుననుటకు దీపప్రభాదృష్టాంత ముపయుక్తమగును. 102, 104, శ్లోకములచే చూపబడిన రెండు మతములు శబ్దమున కనిత్యత్వము నంగీకరించెడివారిలో నభిప్రాయభేదములే.

శబ్దములు కార్యములను పక్షమున హ్రస్వ దీర్ఘాదులకు, ద్రుతాది వృత్తులకు ఉపపత్తిని జూపుచున్నాడు.

ద్రవ్యాభిఘాతా త్ప్రచితౌ భిన్నౌ దీర్ఘప్లుతావపి
కమ్పే తూపరతే జాతా నాదా వృత్తే ర్విశేషకాః. 105

ద్రవ్యాభిఘాతాత్ = కంఠము మున్నగు స్థానములయందు నాలుకయొక్క తాకుట వలన, ప్రచితౌ = వృద్ధిపొందిన, దీర్ఘప్లుతౌ + అపి = దీర్ఘప్లుతములుకూడ, భిన్నౌ = భిన్నములే.

కమ్పే=కంపము, ఉపరతే+తు=విరమించగానే, జాతాః=పుట్టిన, నాదాః= వైకృతధ్వనులు, వృత్తేః=ద్రుతాది వృత్తికి, విశేషకాః = భేదకము లగుచున్నవి.

తా. లోపలనున్న వాయువు కంఠమువరకు వచ్చి స్థానములయందు జిహ్వాగ్రమును పడునట్లు చేయును. దానియందు విలక్షణమగు శక్తియున్నది. దానివలన కంపము కలుగును. అది ఆ వర్ణమును అనువర్తించును. అందుచే దీర్ఘప్లుతములు కూడ భిన్నములే యగును. "స్విచ్చి" వేయగా "ఫాన్" తిరుగును. అది కొంతసేపు తిరగగా "స్విచ్చి" ఆపి వేసినను "ఫాన్" వేగమున్నంత వరకు తిరుగుచుండును. ఈ కంపము కూడ అట్టిదే.

ఆ కంపము తగ్గిన తరువాత వైకృతధ్వనులు జనియించును. అవి ద్రుతమధ్యమ విలంబిత వృత్తులకు కారణమగుచున్నవి.

స్థానములందు వాయుప్రసారము కలిగి దానివలన శబ్దము పుట్టును. దానియందు స్వతః నానాత్వము లేకపోయినా కంపమును బట్టి భిన్నధర్మములు కలుగును. దీర్ఘప్లుతములు పైరీతిని భిన్నములగును.

కంపము నశించిన తరువాత వైకృత ధ్వనులు కలుగును. అవి స్ఫోట శబ్దమందు వైజాత్యమును కలిగించనేరవు. వానివలన ద్రుతాది వృత్తిభేదము సిద్ధించును.

వి. కాగా ద్రుతాది వృత్తులతో దీర్ఘము పరిణమించదు. స్ఫోటశబ్దము నిత్యమని స్వీకరించినను ఈ శ్లోకము దానికి అనుగుణమే యగును.

కమ్పము నివర్తించిన పిమ్మట వైకృతధ్వనులు కలుగునని 105 వ శ్లోకమున చెప్పబడినది. అట్లుగాక కంపముండగనే ఆ ధ్వనులు స్ఫోట శబ్దమునుండియే పుట్టుచున్నవని మతాంతరమును పలుకుచున్నాడు.

అనవస్థితకమ్పేఽపి కరణే ధ్వనయోఽపరే
స్ఫోటాదేవోపజాయన్తే జ్వాలా జ్వాలాన్తరాదివ. 106

కరణే=వాయువు మున్నగునది, అనవస్థితకమ్పే+అపి=అనవరతము పలికిన కంపము కలదైనను, అపరే=మరికొన్ని, ధ్వనయః=వైకృత ధ్వనులు, స్ఫోటాత్+ఏవ=స్ఫోట శబ్దమునుండియే, జ్వాలాన్తరాత్=మరియొక జ్వాలనుండి, జ్వాలాః+ఇవ=జ్వాలలు వలె, ఉపజాయన్తే=పుట్టుచున్నవి.

తా. కర్రలను అగ్ని సంపర్కము కలుగగా జ్వాలలు బయలుదేరును. కర్రలను ఆశ్రయించియున్న జ్వాలలనుండియే మరికొన్ని కర్రలు కలుగక మునుపే జ్వాలలు కలుగు చున్నవి. అట్లే వాయువుయొక్క ఆభిఘాతము వలన కంపము కలుగునపుడు కంపముండగనే ఆ స్ఫోట శబ్దమునుండియే వైకృత ధ్వనులు కలుగుచున్నవి.

కార్య శబ్దవాదమున — అనగా శబ్దములు నిత్యములు కావు. అన్యమును అనిమతమున శబ్దమునకు ఉపాదానకారణమును (ముఖ్యకారణమును) మతాంతరము నాశ్రయించి 107 వ శ్లోకము మొదలు 119 వరకు 11 శ్లోకములచే చూపుచున్నాడు.

వాయో రణూనాం జ్ఞానస్య శబ్దత్వాపత్తి రిష్యతే
కైశ్చిద్దర్శనభేదో హి ప్రవాదే ష్వనవస్థితః. 107

(అ) కైశ్చిత్ =కొందరిచే, వాయోః=వాయువునకు, పరమాణువులకు, అణూనామ్ =పరమాణువులకు, మరికొందరిచే, జ్ఞానస్య=జ్ఞానమునకు, శబ్దత్వాపత్తిః=శబ్దాకారముగు పరిణామము, ఇష్యతే=ఇష్టమగుచున్నది, అనగా వారిచే సమ్మతింపబడుచున్నది.

తా. శబ్దమునకు వాయువు కారణమని శిక్షాశాస్త్రజ్ఞులు, పరమాణువులు కారణమని జైనులు, జ్ఞానము కారణమని మహాభాష్యకారుడు తలంచుచున్నారు.

(అ) ప్రవాదేషు=ప్రకృష్టములగు వాదములయందు-అనగా సిద్ధాన్తములయందు, దర్శన భేదః=దృష్టిభేదము, అనవస్థితః+హి=వ్యవస్థితముకాదు-అనగా నిశ్చితము కాదు గదా: శబ్దమునకు ఇదియే ముఖ్యకారణమని నిర్ధారణచేసి చెప్పుట శక్యము కాదని భావము.

1. శబ్దమునకు వాయువు ముఖ్యకారణమను శిక్షాశాస్త్రకారుని మతమును 108, 109 రెండు శ్లోకములలో జెప్పుచున్నాడు.

లబ్ధక్రియః ప్రయత్నేన వక్తురిచ్ఛానువర్తినా
స్థానే ష్వభిహతో వాయుః శబ్దత్వం ప్రతిపద్యతే. 108

వక్తుః=వక్తయొక్క-అనగా శబ్దము నుపయోగించెడి వానియొక్క, ఇచ్ఛానువర్తినా=శబ్దప్రయోగేచ్ఛచే కలిగినట్టి, ప్రయత్నేన=ప్రయత్నముచే, లబ్ధక్రియః=పొందబడిన వ్యాపారము—అనగా చలనము కల, వాయుః=ప్రాణవాయువు, స్థానేషు=కంఠము, తాలువు మున్నగు ఎనిమిది స్థానములందు, అభిహతః=కొట్టబడినదై - అనగా శబ్దమును కలిగించెడి సంయోగమున కాశ్రయమైనదై, శబ్దత్వమ్=శబ్దభావమును, ప్రతిపద్యతే=పొందుచున్నది. అట్టి ప్రాణవాయువు శబ్దముగా పరిణమించుచున్నదని భావము.

తా. మనుష్యుడు తన యభిప్రాయమును ఇతరునకు చెప్పదలచినపుడు ఒక ప్రక్రియ కలదు. ముందుగా ఆ భావము తన బుద్ధిలో స్ఫురించును. తరువాత దానిని వ్యక్త పరచవలెననెడి ఇచ్ఛ కలుగును. తరువాత దానికి అనుగుణమగు ప్రయత్నము చేయును. కంఠముదగ్గర ఉన్న నాడులను బిగబెట్టుట, మూసుకొనియున్న పెదవులను విప్పుట, దవడలను కొంచెము విశాలముచేయుట, గుటక వేయుట మున్నగునవి ఇచట ప్రయత్నమన బడును. ఆ ప్రయత్నముచే నాభి ప్రదేశమందున్న వాయువు కదలి ఆ భావమును తనయం దారోపించుకొని హృదయముద్వారా కంఠము వరకు పయనముచేసి అచట నున్న స్థానముల యందు ప్రసరించి అ, ఇ, ఉ మున్నగు శబ్దరూపమును ధరించుచున్నది.

ఘనీభూతమగు ఒకే వాయువునకు నానా విధములగు శబ్దములుగా పరిణామము ఎట్లు కలుగును ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

తస్య కారణసామర్థ్యా ద్వేగప్రచయధర్మణః
సన్నిపాతా ద్విభజ్యన్తే సారవత్యోఽపి మూర్తయః. 109

కారణసామర్థ్యాత్ = వాయుచలనమునకు కారణమగు ప్రయత్న విశేషముయొక్క సామర్థ్యము వలన, వేగ ప్రచయ ధర్మణః = వేగమను సంస్కారమును, ఘనీభావము అను ధర్మములను కల, తస్య=ఆ వాయువునకు, సన్ని పాతాత్ = కంఠాది స్థానములందు లెస్సగా పడుటవలన, సారవత్యః + అపి = ఘనీ భూతములుగా నున్నట్టివి-అనగా కఠినములైనను, మూర్తయః=మూర్తులు, విభజ్యన్తే = విభజింపబడుచున్నవి.

'తస్య' అనుదానికి "సారవత్యోఽపి మూర్తయః' అను దానితో సంబంధము చూపవలెను.

తా. వాయువునకు వేగము, ఘనీభావము అను రెండు ధర్మములు కలవు. మనుష్యుని ప్రయత్నవిశేషమువలన వాయువునకు వేగము వ్యక్తమై భాసించును. దానివలన వాయువు చలించును. ఆ వేగముచేతనే ఆయా స్థానములందు పడుటచే వాయువుయొక్క ఘనీభావము-అనగా కఠినభావము శిథిలమై నానారూపములను ధరించును. కఠినముగానున్న మట్టి గడ్డ రాతిమీద పడగా శిథిలమై విశీర్ణమగుచున్నది. అట్లే ఘనీభూతమగు ఒకే వాయువు ఆయా స్థానములందు పడుటచే శిథిలమై నానావిధములగు శబ్దములుగ పరిణమించుచున్నది.

2. అణువులు శబ్దములకు కారణమనెడి జైనుల పక్షమును 110, 111 రెండు శ్లోకములలో చూపుచున్నాడు.

అణవః సర్వశక్తిత్వాద్ భేదసంసర్గవృత్తయః
ఛాయాతపతమశ్శబ్దభావేన పరిణామినః . 110

సర్వశక్తిత్వాత్=సమస్తమగు శక్తులు కలుగుటవలన, భేదసంసర్గ వృత్తయః= విభాగము, కలియుట అను వ్యాపారములు కల, అణవః = పరమాణువులు-అనగా తన్మాత్రలు ఛాయాతపతమశ్శబ్దభావేన=నీడగాను, ఎండగాను చీకటిగాను, శబ్దముగాను, పరిణామినః= పరిణామము కలవి (భవన్తి =అగుచున్నవి).

తా. ఈశ్లోకమున అణవః అను పదము కపిల సాంఖ్యమున నంగీకరింపబడిన తన్మాత్రలను బోధించును. మహాభూతములకు మూలముగానున్న సూక్ష్మపదార్థములు "తన్మాత్ర" లనబడును. వానియందు భూతత్వము లేనందున 'తన్మాత్ర' లందురు. తర్కశాస్త్ర ప్రసిద్ధము లగు పరమాణువు లిచట గ్రాహ్యములు కావు. తన్మాత్రలయందు విలక్షణములగు శక్తులు కలవు. వాని వలన నవి విభక్తము లగుటయు, సంయుక్తములగుటయు గాగలవు. వానిలో నీలాణువులు నీడగాను, చీకటిగాను, శుక్లాణువులు ఎండగాను, శబ్దాణువులు స్థూలశబ్దముగాను పరిణమించును. విభాగసంయోగములను కలిగించెడి శక్తులుగూడ వానియందున్నవి.

శబ్దతన్మాత్ర రూపములగు పరమాణువులు నిత్యములు కనుక అవి ఎల్లప్పుడును స్థూలశబ్ద రూపమున ఏల పరిణమింపవు ? మనకు అట్లు అనుభవము లేదు కదా ! అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

స్వశక్తౌ వ్యజ్యమానాయాం ప్రయత్నేన సమీరితాః
అభ్రాణీవ ప్రచీయన్తే శబ్దాఖ్యాః పరమాణవః . 111

ప్రయత్నేన=ప్రయత్నముచే, సమీరితాః=ప్రేరేపించబడిన, శబ్దాఖ్యాః=శబ్దమనే పేరుగల, పరమాణవః=పరమాణువులు-అనగా శబ్దతన్మాత్రలు, స్వశక్తౌ=తమ శక్తి, వ్యజ్యమానాయామ్=వ్యక్తీకరింపబడగా, అభ్రాణి + ఇవ=మేఘపరమాణువుల వలె, ప్రచీయన్తే =స్థూల శబ్దరూపమున ప్రోగుచేయబడుచున్నవి.

తా. ఇచట ప్రయత్నమనగా అదృష్టవిశేషమున కలిగిన చలనము. అట్టి చలనము కలవానిని ప్రాణవాయువు ప్రోగుగా చేయును. వర్షాకాలమున మేఘములు పురోవాతముచే ప్రేరేపింపబడినవై ఉదకరూపముగా పరిణమించును. అట్లుగాకున్న అవి అట్లుపరిణమించలేవు.

అట్లే శబ్దతన్మాత్రలు అంతటవ్యాపించి యున్నను అదృష్టవిశేషహార్యతమగు చలనము కలుగగా ప్రాణవాయువుచే ప్రోగుగా చేయబడినవై స్థూలశబ్దరూపమున కాన్పించుచున్నవి. అట్టి ప్రయత్నములేకున్న అవి స్థూలశబ్దముగా మార్పుచెందలేవు.

3. జ్ఞానము శబ్దమునకు కారణమను [1]మహాభాష్యకారుని మతమును 112, 113, 114, 115 నాల్గు శ్లోకములచే జూపుచున్నాడు.

అథాయమాన్తరో జ్ఞాతా సూక్ష్మవాగాత్మనా స్థితః
వ్యక్తయే స్వస్య రూపస్య శబ్దత్వేన వివర్తతే. 112

1 "ఆఖ్యాతోపయోగే" 1-4-29 అను పాణిని సూత్రమును వ్యాఖ్యానించు సందర్భమున మహాభాష్యకారుడు ఈ పక్షమును నిరూపించియున్నాడు. 107 వ శ్లోకము నుండి 115 వ శ్లోకమువరకు గల వాక్యపదీయమును కైయటనాగేశులు అచట చూపి వ్యాఖ్యానించి యున్నారు.

సూక్ష్మవాగాత్మనా = సూక్ష్మమగు వాగ్రూపమున, స్థితః = ఉన్నట్టియు, అన్తరః = లోపలఉన్న, జ్ఞాతా = మనస్సు-కాక జీవుడు, స్వస్య = తన సంబంధమైన, రూపస్య = రూపముయొక్క, వ్యక్తయే = అభివ్యక్తి-అనగా బయటకు ఆవిర్భవింపచేయుకొరకు, శబ్దత్వేన = స్థూలశబ్దరూపమున, అథ = తరువాత-అనగా వివక్షచే కలిగెడి ప్రయత్నముచే ప్రేరేపింపబడిన ప్రాణవాయువుయొక్క చలనముచే ఆ యాస్థానములందు అభిఘాతము కలిగిన తరువాత, వివర్తతే = వివర్తమగుచున్నది.

తా. శబ్దస్వరూపమే ముందుగా ఉండెడిది. అదియే వాగ్రూపముగాను, మనస్సుగాను విభక్తమగుచున్నది. ఆ మనస్సు వృత్తిరూపమున పరిణమించును. ఆ పరిణామమే జ్ఞానము. వృత్తిరూపమగు జ్ఞానమున కాశ్రయమగుటంజేసి మనస్సు "జ్ఞాతా" అను పదముచే గ్రహింపబడుచున్నది. అట్లే జ్ఞాతయగు జీవునియందు వాగ్రూపత్వము అనుషక్తము కాగలదు. ప్రాథమికావస్థ బహుసూక్ష్మమైనది. కత్వ గత్వాది విశేషరూపము లేనిది.

అట్టి మనస్సు ఇతరునికి తనయందున్న భావమును వ్యక్తపరచవలసినపుడు తన సూక్ష్మరూపమును స్థూలశబ్దరూపముగా వివర్తింపచేయుచున్నది. అట్లు జరుగుటకు శరీరమునందున్న వేడియే సాధనము.

వి. అంతఃకరణము వృత్తిద్వారా శబ్దభావమును బొందుటయే జ్ఞానము శబ్దరూపమున భాసించునట్లుగా గ్రహింపబడుచున్నది. శబ్దమును ప్రయోగించువాని జ్ఞానము శబ్దముచేతనే ఇతరులకు చూపవలసి వచ్చియున్నందున జ్ఞానమే శబ్దముగా మార్పుచెందునని తలచబడు చున్నది. శబ్దము చేతనమని శాబ్దికులు విశ్వసింతురు.

జ్ఞానము స్థూల శబ్దరూపమును ఎట్లు పొందుచున్నదో ఆ క్రమమును జూపుచున్నాడు.

స మనోభావ మాపద్య తేజసా పాక మాగతః
వాయు మావిశతి ప్రాణ మథాసౌ సముదీర్యతే.　　118

సః = 112 వ శ్లోకమున నిర్దిష్టమగు జ్ఞాత, మనోభావమ్ = మనస్సుయొక్క రూపమును, ఆపద్య = పొంది, తేజసా = తేజముచే, పాకమ్ = పాకమును, ఆగతః = పొందినదై, ప్రాణం + వాయుమ్ = ప్రాణవాయువును, ఆవిశతి = ప్రవేశించుచున్నది.
అథ = తరువాత, అసౌ = ఈ ప్రాణవాయువు, సముదీర్యతే = లెస్సగా పైకి ప్రేరేపింపబడుచున్నది.

తా. జఠరాగ్ని, నాడులందున్నవేడి ఇచట 'తేజసా' అను పదముచే గ్రహింపబడును. ఈ రెండును మనోవృత్తిరూపమగు జ్ఞానమునకు పాకమును కలిగించును. మనోభావమును బొందిన అంతఃకరణ వృత్తికి విషయగ్రహణ సామర్థ్యమును కలిగించుట ఇచట పాకశబ్దార్థము.

ఇట్టి పాకముననే అంతఃకరణము తన రూపమును ప్రాణవాయువునందు నిలుపును. అట్టివాయువు కంఠపర్యంతము మీదుగా జీవశక్తిచే ప్రేరేపింపబడును. పయనము ప్రాణవాయు స్వభావము. ప్రేరణ జీవశక్తిది.

వి. బాహ్యప్రపంచమునయున్న వాయువునకు అట్టి ప్రక్రియ లేనందున ఆ వాయువు దంత తాల్వాదులయందు ప్రవేశించినను శబ్దభావమును బొందనేరదు.

తరువాత వినిమిషయుగుణో చెప్పుచున్నాడు.

అన్తఃకరణతత్త్వస్య వాయు రాశ్రయతాం గతః
తద్ధర్మేణ సమావిష్ట స్తేజసైవ వివర్తతే. 114

అన్తఃకరణ తత్త్వస్య = మనస్సునకు, ఆశ్రయతామ్ = ఆశ్రయత్వమును, గతః = పొందిన, వాయుః = ప్రాణవాయువు, తద్ధర్మేణ = మనస్సుయొక్క ధర్మముతో, సమావిష్టః = కూడినదై, తేజసా + ఏవ = జఠరాగ్నియొక్క సహకారముచేతనే, వివర్తతే = వివర్తమగుచున్నది.

తా. మనస్సునకు ఆధారము ప్రాణవాయువు. ఆ వాయువులేనిచో మనస్సు ఉండేదికాదు. కాగా ప్రాణవాయువును ఆశ్రయించిన మనస్సు వాయువుతో కలసి జఠరాగ్ని సహకారమున బయటికి మరల మనస్సుయొక్క రూపములోనే వివర్తమగును. ఇందుకు ఒక దృష్టాంతము- పాకము తయారుకావలెనన్నచో అగ్ని అపేక్షితమగును. అగ్ని కర్రను ఆశ్రయించును. తరువాత కర్రను విడనాడి తేజోరూపమును పొందును.

వి. ప్రాథమికస్థితి శబ్దరూపమే, అదియే మనస్సుగా మారినది. అది వాయువు నాశ్రయించి తేజస్సహకారమున బయటికి వచ్చుటలో శబ్దరూపమగు మనస్సు వ్యక్తమగును.

తరువాత మనస్సుతో తాదాత్మ్యమును పొందిన ప్రాణవాయువు వర్ణరూపమును పొందెడి ప్రక్రియ చూపుచున్నాడు.

విభజన్ స్వాత్మనో గ్రన్థీన్ శ్రుతిరూపైః పృథగ్విధైః
ప్రాణో వర్ణా నభివ్యజ్య వర్ణేష్వే వోపలీయతే. 115

ప్రాణః = ప్రాణవాయువు, పృథగ్విధైః = భిన్నములగు, శ్రుతిరూపైః = వర్ణములచే, గ్రన్థీన్ = గ్రంథులతో సమానములగు, స్వాత్మనః = తన అవయవములను, విభజన్ = ఆయా వర్ణవిభాగముచే చూపుచున్నదై, వర్ణాన్ = అ, క మొదలగు వర్ణములను, అభివ్యజ్య = వ్యక్తపరచి, తేషు + ఏవ = ఆవర్ణములందే, ఉపలీయతే = లయమును పొందుచున్నది. వర్ణరూపమును పొంది నిజరూపమును వదలుచున్నది.

తా. ప్రాణవాయువు వర్ణాభివ్యక్తికి ప్రయత్నభేదములను గ్రహించుచుండి తన అవయవములను లోపలనుండి వచ్చుచున్న వర్ణములచే ఆయా వర్ణరూపము లుగా చేసి బయటికి వర్ణములను వ్యక్తపరచును. తరువాత ఆ వాయువు వర్ణరూపముగానే యుండును. వాయు రూపము కానరాదు.

వి. వాయువు బయటికి వచ్చునపుడు కంఠాది స్థానములందు, తనయొక్క అభిఘాతమును కలిగించును. దానివలన వర్ణాభివ్యక్తి కలుగును.

గ్రంథియనగా 'ముడి' అందురు. ప్రాణమున ముడియున్నట్లు వాయువునకు గూడ ప్రసారమును నిరోధించే భాగములు కలవు. గ్రంథులు హృదయమునందుగూడ కలవు. అవియే ఆత్మ తత్త్వజ్ఞానమునకు ప్రతిబంధకములు.

107 నుంచి శబ్దము జనియించు ప్రకారము మూడు మతములలోను చూప బడినది. అన్నిటిలోను వాయువునకు ప్రాధాన్యముకలదు. ప్రాణవాయువు ముఖ్యము. ఇతర సహకారమును పురస్కరించుకొని మతభేదము సిద్ధించుచున్నది.

శబ్దము ఆకాశమునందే గాక అంతట నిండి. నిబిడముగా నున్నదని కొందరు శిక్షాశాస్త్రజ్ఞులు తలంచిరి. వారి మతమును జూపుచున్నాడు.

అజస్రవృత్తి ర్యః శబ్దః సూక్ష్మత్వా న్నోపలభ్యతే
వ్యంజనా ద్వాయు రివ స స్వనిమిత్తా త్ప్రతీయతే. 116

అజస్రవృత్తిః=ఎల్లప్పుడు ఉన్నటువంటి, యః=ఏ, శబ్దః=శబ్దము, సూక్ష్మత్వాత్=సూక్ష్మమగుటవలన, న+ఉపలభ్యతే=చెవిచే గ్రహింపబడకున్నదో, సః=ఆ శబ్దము, స్వనిమిత్తాత్=తనకు నిమిత్తమగు తాల్వాది స్థానాభిఘాతమువలన, వ్యజనాత్=విసనకర్రవలన, వాయుః+ఇవ=వాయువువలె, ప్రతీయతే=తెలియబడుచున్నది-అనగా ఇంద్రియగ్రాహ్య మగుచున్నది.

తా. శబ్దము వ్యాపకము. అచేతనములగు ఘటాదులయందు ధ్వనిరూపమున, చేతనములలో గూడ, పశుపక్ష్యాదులందు ధ్వనిరూపమున, మనుష్యులయందు ధ్వని వర్ణోభయ రూపమున కాన్పించును. కాని శబ్దమునకు వ్యక్తి కలిగించెడి నిమిత్తమున్నప్పుడే అది గ్రాహ్యమగును. మనుష్యులచెవికి శబ్దము వినబడవలెనన్నచో తాల్వాది స్థానాభిఘాతము కావలెను. అపుడు వర్ణరూపమున శ్రుతమగును. భేరీ దండసంయోగమున ధ్వనిరూపముగా శ్రుతమగును. నిమిత్తములేనిది భాసించునదికాదు. అందు కారణము శబ్దముయొక్క సూక్ష్మత్వమే. ఇందుకు వాయువు దృష్టాంతముగా జూపబడినది. వాయువు సర్వవ్యాపి, అయినను మనకు ఒక సమయమున చర్మముచే గ్రహింపబడుట, లేకుండుటగూడ కలదు. చర్మముచే గ్రహింపబడకున్నను అచట వాయువు సూక్ష్మరూపమున ఉన్నది. అదియే విసనకర్ర మున్నగు సాధనములచే వ్యక్తమయి మన ఇంద్రియముచే గ్రహింపబడుచున్నది.

కాగా సూక్ష్మరూపమున నంతట వ్యాపించియున్న శబ్దము కారణవశమున స్థూలరూపమున గృహీతమగుచున్నది.

శబ్దము విషయమై మతాంతరమును జూపుచున్నాడు.

తస్య ప్రాణే చ యా శక్తి ర్యా చ బుద్ధౌ వ్యవస్థితా
వివర్తమానా స్థానేషు సైషా భేదం ప్రపద్యతే. 117

తస్య=శబ్దముయొక్క, యా=ఏ, శక్తిః=శక్తి-అనగా సూక్ష్మరూపము, బుద్ధౌ+చ=బుద్ధియందే, వ్యవస్థితా=ముందుగానున్నదో, యా=ఏశక్తి, ప్రాణే+చ=ప్రాణవాయువుసందుగూడ, వ్యవస్థితా=బుద్ధిప్రేరణచే తరువాత ఉన్నదో, సా+ఏషా=ఆ ఈ రెండువిధములగు శక్తి, స్థానేషు=తాల్వాదిస్థానములందు, వివర్తమానా=వెలువడుచున్నదై, భేదమ్=వర్ణభేదమును, ప్రపద్యతే=పొందుచున్నది.

తా. శబ్దము బుద్ధిలో సూక్ష్మరూపమున నున్నది. సూక్ష్మరూపమే ఇచట 'శక్తి' శబ్దముచే గ్రహింపబడును. బుద్ధి తనలోనున్న సూక్ష్మశబ్దమును ప్రాణవాయువునందు కలిగించును. ఈ రెండువిధములగు శక్తులు తాల్వాది స్థానములందు జనియించి అ, ఇ, క మున్నగు విజాతీయ వర్ణములను చూపుచున్నవి.

ఆ శబ్దము బుద్ధిలోనే ముందుగా నున్నది. బుద్ధిబలముచే ప్రాణమునకు బలము కలుగును. ఉభయము కలసి స్థూలశబ్దమునకు కారణమగును.

వి. బుద్ధిసంబంధమున్నందుననే ప్రాణవాయువు వివక్షితమగు అర్థమును అనుస రించియే వర్ణవిశేషములను కలిగించెడి స్థానవిశేషములందే ప్రసరించుచున్నది. అట్లుగాకున్న ఏవో వర్ణములే జనియించును.

ప్రాణవాయు సంబంధములేనిచో బుద్ధికి శబ్దరూపముగా పరిణామము సంభ వించదు.

కనుక బుద్ధిలో ముందుగా సూక్ష్మశబ్దముండును. దాని ప్రేరణచే ప్రాణవాయువు నందు ఆ సూక్ష్మశబ్దము కలుగును. ఉభయమును కలసి స్థానములందు ప్రసరించి వర్ణ విశేషములను పుట్టించును.

ఇంతవరకు శబ్దస్వరూపమును నానాదృక్పథముల జూపి లోకమున కలిగిన వ్యవ హారమునకు శబ్దమే మూలమని చెప్పుచు ఈ శ్లోకమునుండి 15 శ్లోకములచే శబ్దమాహాత్మ్య మును నిరూపించుచున్నాడు.

శబ్దేష్వే వాఽఽశ్రితా శక్తి ర్విశ్వస్యాఽస్య నిబన్ధనీ
యన్నేత్రః ప్రతిభాత్మాఽయం భేదరూపః ప్రతీయతే. 118

(అ) అస్య = ఈ-అనగా మనకు ప్రత్యక్షముగా కానవచ్చుచున్న, విశ్వస్య = ప్రపంచకమునకు, నిబన్ధనీ = కారణమగు, శక్తిః = సామర్థ్యము, శబ్దేషు + ఏవ = శబ్దము లందే, ఆశ్రితా = ఆశ్రయించియున్నది.

తా. ప్రపంచమున కలిగెడి వ్యవహారమునకు శబ్దమే కారణము. ప్రపంచకము శబ్దార్థో భయ రూపము; శబ్దముకంటె, దానిచే చెప్పబడే అర్థమురంటెను వేరుగాలేదు. ఈ రెంటిలోను శబ్దము వాచకము. అర్థము వాచ్యము అగుచున్నది. కాగా ఈ రెంటికి వాచ్యవాచకభావ సంబంధమే శక్తియని వైయాకరణులు విశ్వసింతురు. ఈ సంబంధమును పురస్కరించు కొనియే లోకవ్యవహారమంతయు నడచుచున్నది. ఆ వ్యవహారము శబ్దముసందాధారపడి యున్నది.

(ఆ) యన్నేత్రః = ఏ శబ్దము నేత్రముగా అనగా జ్ఞాపకముగా కలిగినట్టియు, ప్రతిభాత్మా = ప్రతిభారూపమగు, భేదరూపః = భిన్నమగు రూపముకల, అయమ్ = ఈ లోకి వ్యవహారము, ప్రతీయతే = మనచే తెలియబడుచున్నదో, ప్రతిపురుషునకు భిన్న భిన్న రూపముగా లోకవ్యవహారము కానవచ్చుచున్నదని భావము.

వి. ప్రతిభ బుద్ధిలో నొక విశేషము. తద్రూపమే వాక్యార్థము, లోకవ్యవ హారము బుద్ధిరూపముగనే ఉన్నది. అది బాహ్యప్రపంచము నపేక్షించునది కాదు. బాహ్య రూపమున ఒకే వస్తు వున్నను దానిని లోకులు భిన్నరూపిగా గుర్తింతురు. ఒకే పడతిని కాముకుడు భోగ్యవస్తువని, పులి మున్నగునవి భక్ష్యమనియు, తలిదండ్రులు కూతురనియు, ఆమెకు కలిగిన పిల్లలు తల్లి అనియు, వీతరాగులు శవమనియు తలంతురు. వారివారి బుద్ధిలో నున్న సంస్కారమే అందుకు కారణము. ఇంతకు శబ్దమే కారణ మగుచున్నది.

మరియు లోకములో బాహ్యరూపముగా లేని వస్తువులుకూడ వ్యవహారమున కలవు. వానిని శబ్దము బోధించును.

కాగా లోకమున రూపవంతములు కాని పదార్థములు శబ్దముచేతనే బోధింపబడు చున్నవి. ప్రత్యక్షముగా కానవచ్చుచున్న ఘటపటాదుల భేదముకూడా శబ్దమూలకమే.

కాబట్టి జగమంతయు ప్రతిభావిషయమే. బాహ్యార్థము లేకున్నను శబ్దము కలుగును. శబ్దమే జగద్రూపమున వివర్తమగును. ఈ భావము 1 కాండలో 18 వ శ్లోకమున చూపబడి యున్నది.

118 వ శ్లోకార్థమునే వ్యక్తపరచుచున్నాడు.

షడ్జాదిభేదః శబ్దేన వ్యాఖ్యాతో రూప్యతే యతః
తస్మా దర్థవిధాః సర్వాః శబ్దమాత్రాసు నిశ్రితాః . 119

యతః = ఏకారణమువలన, షడ్జాది భేదః = షడ్జము, నిషాదము మున్నగు స్వరముల భేదము, శబ్దేన = శబ్దముచే, వ్యాఖ్యాతః = స్పష్టపరుపబడినదై, రూప్యతే = వేరుచేయబడి నియమింపబడుచున్నదో, తస్మాత్ = ఆకారణము వలన, శబ్ద మాత్రాసు = శబ్ద శక్తుల యందు, సర్వాః = సమస్తములగు, అర్థవిధాః = అర్థముయొక్క శక్తులు, నిశ్రితాః = మిక్కిలి ఆశ్రయించి యున్నవి. మనము గుర్తించుటకు శక్యముగాని పదార్థములకుగల పరస్పర భేదమును గుర్తించుటకు శబ్దమే కారణమని భావము.

తా. షడ్జము, నిషాదము మున్నగురీతిని 7 విధములగు ధ్వనులు జగత్ప్రసిద్ధములు. వీనికి గాంధర్వ శాస్త్రమున లక్షణములు చెప్పబడినవి. ఆ లక్షణములు శబ్దరూపముననున్నవి. అట్టి శబ్దమే లేనిచో వానికి గల పరస్పర భేదము గుర్తింప నలవికాదు.

ఘటము, పటము మున్నగునవి మనకు స్పష్టముగా భాసించును. కాని వానికి పరస్పర భేదము శబ్దమూలకమే.

వి. మరియు పశువులను మేపువారు వానికి ఏవో సంకేతములను ఏర్పరచి వ్యవహరింతురు. ఒక్కొక్క విలక్షణమగు సంకేతముచే ఒక్కొక్క జాతికి చెందిన పశువులు పిలువబడి పనిచేయుట జరుగుచున్నది. కాబట్టి లోకవ్యవహారమున కంతకు శబ్దము మూలము.

ఇంతియేకాక లోకసృష్టియు శబ్దమువలననే కలుగుచున్నదని బోధించుచున్నాడు.

శబ్దస్య పరిణామోఽయ మిత్యామ్నాయవిదో విదుః
ఛన్దోభ్య ఏవ ప్రథమ మేత ద్విశ్వం వ్యవర్తత . 120

అయమ్ = ఈ ప్రపంచకము, శబ్దస్య = శబ్దముయొక్క, పరిణామః = పరిణామము, ఇతి = అని, ఆమ్నాయవిదః = వేదవేత్తలు, విదుః = తెలియుచున్నారు. ఏతత్ = ఈ, విశ్వమ్ = ప్రపంచకము, ప్రథమమ్ = ముందుగా, ఛన్దోభ్యః + ఏవ = వేదముల వలననే, వ్యవర్తత = వివర్తమైనది.

తా. ఈ ప్రపంచకము శబ్దముయొక్క వివర్తమే యని వేదముల ముఖ్యతాత్పర్యమును గుర్తించినవారు నుడివిరి. వేదములలోను, వానిని ప్రమాణముగా జేసుకొని నిర్మింపబడిన స్మృతులలోను, పురాణములలోను గూడ వేదముల వలననే దృశ్యమగు ఈ ప్రపంచకము వివర్తమగుచున్నదని స్పష్టముగా చెప్పబడియున్నది.

వి. వైయాకరణులు నిర్గుణాద్వయ బ్రహ్మభావము మోక్షమనెడి ఔపనిషద సిద్ధాన్తమును విశ్వసింతురు. కనుక వారు వివర్తవాదము నాశ్రయించువారే. కాబట్టి ఈ శ్లోకమున పరిణామ పదము వివర్తపరము.

ఘటాది ప్రపంచము శబ్దముయొక్క పరిణామమని చెప్పబడినది. అట్లైనచో మృద్వి కారమగు ఘటాదికమున మృద్రూపము కానవచ్చునట్లు శబ్దరూపము కూడ ఏల కానరాదు ? అను ప్రశ్నకు, అది మాకు సమ్మతమే. అది సిద్ధాన్తమే. అట్లే కానవచ్చుచున్నదని చెప్పు చున్నాడు.

ఇతికర్తవ్యతా లోకే సర్వా శబ్దవ్యపాశ్రయా
యాం పూర్వాహితసంస్కారో బాలోఽపి ప్రతిపద్యతే. 121

లోకే = లోకమున, సర్వా = సమస్తమగు, ఇతికర్తవ్యతా = పనిని ఇట్లు చేయ వలెను అని భావించుట, శబ్దవ్యపాశ్రయా = శబ్దమే కారణముగా గలది.

యామ్ = ఏ "ఇతికర్తవ్యత"ను, బాలః + అపి = చంటి పిల్లడు గూడ, పూర్వా హిత సంస్కారః = పూర్వజన్మమునందు కలిగిన భావనాసంస్కారము గలవాడై, ప్రతి పద్యతే = పొందుచున్నాడో.

తా. కర్తవ్య మనగా చేయవలసిన పని. పనిని ఈ రీతిగా చేయవలెనని భావన ఇతికర్తవ్యత. అట్టి భావన అంతయు శబ్దరూపమే. కనుక ప్రతి పదార్థము నందును ఇతి కర్తవ్యత సంబంధించియే యుండును. అట్లు ఆలోచించనిదే ఎవరును ఏ పనిని చేయలేరు. అట్టి భావన మానసికక్రియ. అది ఇతరులకు వినపడక పోవచ్చును. కాని ఆలోచించువాని మనస్సున నది శబ్దరూపమున భాసించుచునే యున్నది. ఘటాదులందు మన్ను అనుగత ముగా నున్నట్లు పైరీతిని శబ్దము గూడ అనుగతముగానే యున్నది.

చంటిపిల్లడు పుట్టగానే శబ్దజ్ఞానము లేనివాడే. వాని పాలు త్రాగుట పూర్వ జన్మమునందున్న సంస్కారవశమున చిన్నప్రాయమున గూడ [illegible] చేయగలడు.

వి. శరీరము మారినను, జీవశక్తి ఆవిచ్ఛిన్నముగానే [illegible] అను వర్తించును. పూర్వజన్మమున చేసిన పుణ్యపాప [illegible] మరియొక జన్మ లభించును. దీని సంపూర్ణభావమును 122 వ శ్లోకము [illegible].

చంటిపిల్లవానికి ఇతికర్తవ్యత ఉన్నదని ఎట్లు చెప్పగలము ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

ఆద్యః కరణవిన్యాసః ప్రాణస్యోర్ధ్వం సమీరణమ్
స్థానానా మభిఘాతశ్చ న వినా శబ్దభావనామ్ . 122

బాలునకు, ఆద్యః = ప్రాథమికమగు, కరణవిన్యాసః = శబ్దముల నుచ్చరించుటకై ప్రయత్నములయొక్క వినియోగము, ప్రాణస్య = ప్రాణవాయువుయొక్క, ఊర్ధ్వమ్ = మీదుగా, సమీరణమ్ = ప్రేరణము, స్థానానామ్ = కంఠము, తాలువు మున్నగు స్థానముల యొక్క, అభిఘాతః + చ = కొట్టుటయును, శబ్దభావనాం + వినా = లోపల శబ్దములను భావించుట లేనిది, న (భవతి) = కలుగనేరదు.

వి. శబ్దముల నిట్లుచ్చరించవలెను. ఇవి శబ్దములు అను విషయమెరుని చంటి వాడు శబ్దముల నుచ్చరించుటకై తన అవయవములను వినియోగించుచున్నాడు - అనగా ప్రాణవాయువును నిరోధించుట, కంఠమునందున్న నాడులను స్తంభింపచేయుట, నోటిలో నున్న నీటిని లోపలకు గుటకవేయుట, దవడలనుబాచుట మున్నగు పనులను చేయుచున్నాడు. ఇవి లేనిది శబ్దోచ్చారణము జరుగదు.

మరియు వాయువునకు తిర్యగ్గమనము అనగా అడ్డముగా సంచరించుట స్వభావము. అట్లయినను బాలుడు ప్రాణవాయువును ఊర్ధ్వముగా ప్రసరింప చేయుచున్నాడు. మరియు కంఠము మున్నగు స్థానములందు ప్రాణవాయువును ప్రతిహతము చేయుచున్నాడు.

పై పనులు బాలుడు చేయుటవలన లోపల శబ్దములను భావించుచున్నాడనియే నిశ్చయింపవచ్చును. కాని ఈ జన్మమున అతనికి శిక్షణలేనందున పై కారణసామాగ్రిచే జన్మాంతరీయ సంస్కారమునే కారణముగా జూపక తప్పదు. కాబట్టి సర్వసాధారణముగ శబ్దము ఇతి కర్తవ్యతకు మూలమని నిశ్చయింపదగును.

శబ్దము వలన కలిగెడి జ్ఞానమునందే కాక జ్ఞానసామాన్యమున శబ్దము భాసించు నను సిద్ధాన్తమును జూపుచున్నాడు.

న సోఽస్తి ప్రత్యయో లోకే య శ్శబ్దానుగమా దృతే
అనువిద్ధ మివ జ్ఞానం సర్వం శబ్దేన భాసతే. 123

యః=ఏ జ్ఞానము, శబ్దానుగమాత్+ఋతే=శబ్ద సంబంధ శూన్యమైనదో - అనగా శబ్ద సంబంధము లేనిదో, సః=అట్టి, ప్రత్యయః=జ్ఞానము, న+అస్తి=లేదు. సర్వమ్=సమస్తమగు-అనగా వక్తకు కలిగినదిగాని, శ్రోతకు కలిగినదిగాని, ప్రత్యక్షానుమిత్యుపమితిశాబ్దరూపముగాని, స్మృతిరూపముగాని, భ్రమరూపముగాని, జ్ఞానమ్=జ్ఞానము, శబ్దేన=శబ్దముతో, అనువిద్ధమ్+ఇవ=కలిసిపోయినది వలె, భాసతే=భాసించుచున్నది.

తా. ఏ జ్ఞానము కలిగినను శబ్దముతో కలిసియే కలుగును. శబ్దసంబంధము లేనిది జ్ఞానముండదు. వక్త ముందుగా నర్థమును బుద్ధిలో చూచును. దానికి అనుగుణమగు శబ్దమును చూచును. తనకు కలిగిన భావనకు అనుగుణముగా కల్పితమగు శబ్దార్థసంబంధమును చూచును. ఇది యంతయు శబ్దమూలకము. ఇట్టి తన భావమును ఇతరునకు బోధింపదలచి నపుడు శబ్దమునే ద్వారముగా జేసుకొనును. శ్రోతయు శబ్దమువలననే అర్థమును గ్రహించును. ఈ భావము ఈ కాండలో 53 వ శ్లోకమున స్పష్టముగా జూపబడియున్నది.

కనుకనే ప్రత్యక్షము, అనుమితి, ఉపమితి, శాబ్దము, స్మృతి, భ్రమ మున్నగు జ్ఞానము లన్నియు శబ్దముతో మిశ్రితములైనవే భాసించుచున్నవి. శబ్ద సంబంధము లేక శుద్ధ జ్ఞానము వ్యవహారదశలో నుండనేరదు. ప్రత్యయశబ్ద మిచట జ్ఞానపరము.

జ్ఞానమున శబ్దము యొక్క ఆకారము అనుగతముగా నుండు నను అర్థమును దృఢ పరచుచున్నాడు.

వాగ్రూపతా చే న్నిష్క్రామే దవబోధస్య శాశ్వతీ
న ప్రకాశః ప్రకాశేత సా హి ప్రత్యవమర్శినీ. 124

(అ) అవబోధస్య=జ్ఞానమునకు, శాశ్వతీ=సహజమగు, వాగ్రూపతా=వాగ్రూపపత్వము-అనగా సూక్ష్మమగు శబ్దముయొక్క సంబంధము, నిష్క్రామేత్+చేత్=తప్పుకొన్నచో, ప్రకాశః=జ్ఞానము, న+ప్రకాశేత=ప్రకాశించక పోయెడిని.

తా. తనలోపల నున్న జ్ఞానము పరునకు తెలియబడదు. దానిని శబ్దముచేతనే పరునకు స్పష్టపరచవలెను. శబ్దము లేనిచో ప్రకాశము లేనందున పరునకు తనకున్న జ్ఞానము

కలుగకపోయెడిని. లేక తనకు కలిగిన జ్ఞానముకూడ ప్రకాశింపక పోయెడిని అని చెప్ప వచ్చును. తనకు జ్ఞానము కలిగినచో దానిని శబ్దముచేతనే కదా భావన చేయవలెను :

(అ) హి = ఏలయన, సా = వాగ్రూపత, ప్రత్యవమర్శినీ = ప్రకాశమునకు గూడ ప్రకాశకము.

తా. తనకు జ్ఞానము కలుగగా నాకు ఇట్టి జ్ఞానము కలిగినది అను భావన లోక మున కలుగును. దానినే అనువ్యవసాయ మందురు. కంటికి ఘటము కనబడగా ఘటజ్ఞానము ఆ వ్యక్తికి కలుగును. "ఘట మహం జానామి" (నేను ఘటమును తెలుసుకొనుచున్నాను) అను రూపమున ఉన్న జ్ఞానము అనువ్యవసాయము. సూక్ష్మరూపము గూడ అట్టిదే.

కాగా కలిగిన జ్ఞానమును మరల ఒకసారి అనువదించుట ప్రత్యవమర్శ. అది శబ్ద రూపము.

సర్వము వాగ్రూపమే యని చెప్పుచున్నారు.

సా సర్వవిద్యాశిల్పానాం కలానాం చోపబన్ధనీ
తద్వశా దభినిష్పన్నం సర్వం వస్తు విభజ్యతే. 125

సా = ఆ వాక్కు, సర్వవిద్యాశిల్పానామ్ = ఎల్ల విద్యలకు, ఎల్ల శిల్పములకును, కలానాం + చ = ఎల్ల కళలకును, ఉపబన్ధనీ = కారణము.

తద్వశాత్ = ఆ వాక్కుయొక్క మహిమవలన, సర్వమ్ = సమస్తమగు, వస్తు = వస్తువు, అభినిష్పన్నమ్ = పుట్టుచున్నదై, విభజ్యతే = వేరుచేయబడుచున్నది.

తా. మనుష్యులు లౌకిక వ్యాపారములందు యాగాది వైదిక కర్మలయందు అను కూల్యమున్ననాడు ప్రవర్తించుచున్నారు. ప్రాతికూల్యమున్నచో నివర్తించుచున్నారు. ఆ ప్రవృత్తి నివృత్తులు విద్యలను, శిల్పములను, కళలను ఆధారముగా చేసుకొనియే జరుగు చున్నవి. పశు పక్ష్యాది తిర్యగ్జంతువులు ఘట పటాదికమగు అచేతన పదార్థములుగూడ మనుష్యునికి అధీనములై యున్నవి. అట్లుండుటకు మనుష్యునికి గల విద్యాశిల్పకళలే కారణములు.

విద్యాశిల్పకళ లుపదేశించువాని బుద్ధిలో సూక్ష్మరూపమున నున్నవి. అవి చదువు కొను వాని బుద్ధిలో సంక్రమించవలెనన్నచో శబ్దము ముఖ్యకారణ మగుచున్నది. ఆ శబ్దము జ్ఞానరూపము. అట్లుగాకున్న శబ్దమును నుచ్చరించిన మాత్రమున శిష్యునకు జ్ఞానము కలుగ నేరదు. కాబట్టి శబ్దము, జ్ఞానము ఏకరూపములే. శబ్దము అర్థము ఏకరూపమే యగుట ఉపా ధ్యాయుడు శబ్దము నుచ్చరించగా శిష్యునకు అర్థజ్ఞానము కలుగుచున్నది.

వి. మరియు మనుష్యుని బుద్ధిలో సూక్ష్మ శబ్దరూపమున సమస్తపదార్థము ఆవి ర్భవించి బాహ్యప్రపంచమున ఆ పదార్థమే స్థూలరూపమున కాన్పించుచున్నది. కనుకనే ఘటము పటము పర్వతము మున్నగు శబ్దములచేతనే పదార్థ విభాగజ్ఞానము కలుగుచున్నది.

మరియు ఒకేవ్యక్తి భిన్న భిన్న రూపముగా పలువురచే గ్రహింపబడుచున్నది. ఈ యాశయము 118 వ శ్లోకమున చూపబడినది.

కాగా విద్యాశిల్పకళలు, లోకమున సమస్తవస్తువిభాగము శబ్దరూపమును ఆధార ముగా జేసికొని యున్నవి.

శబ్దము, విద్యాశిల్పకళలకు మూలమే కాదు. మరి యేమనగా సర్వప్రాణులకు లోపల ఏ చైతన్యము కలదో, అదియు శబ్దరూపమే యని చెప్పుచున్నాడు.

సైషా సంసారిణాం సంజ్ఞా బహిరన్తశ్చ వర్తతే
తన్మాత్రా మనతిక్రాన్తం చైతన్యం సర్వజన్తుషు . 126

సా + ఏషా = ఆ ఈవాక్కు-అనగా విద్యాశిల్పకళలకు కారణమగు శబ్దము, సంసారిణామ్ = ప్రాణులకు, సంజ్ఞా = చైతన్యమై, బహిః = వెలుపల, అన్తః + చ = లోపల గూడ, వర్తతే = ప్రవర్తించుచున్నది. శబ్దము ప్రాణుల బాహ్యవ్యవహారమునకు అంతరంగిక సుఖ దుఃఖాది జ్ఞానమునకు కారణమని భావము

ఏలయన, సర్వజన్తుషు = సమస్త జంతువులం దున్న, చైతన్యమ్ = చైతన్యము, తన్మాత్రమ్ = శబ్దముయొక్క స్వరూపమును, అనతిక్రాన్తమ్ = అతిక్రమించునది కాదు. అది శబ్దరూపమే యని భావము.

తా. సర్వప్రాణులు నేను సుఖముగానున్నాను. నేను దుఃఖము కలిగియున్నాను. నేను పని చేయుచున్నాను అని భావింతురు. అట్లు భావించుటకు చైతన్యము కారణము. ఒకరితో నొకరు మాట్లాడుదురు. పరస్పరము పనులు చేసుకొందురు. అచటను చైతన్యమే కారణము. ఆ చైతన్యము శబ్దరూపము. శబ్దముచేతనే గదా లోకులు సర్వవ్యవహారములు నడుపుచున్నారు

వి. ఘటము, పటము మున్నగు వ్యక్తులందు ఘటత్వము పటత్వము మున్నగు జాతులు కలవు. అవి యన్నియు శబ్దరూపము ననుసరించియే యున్నవి. శబ్దము లేనిది ఏ జాతియు చెప్పబడలేదు.

వృక్షాదులకు గూడ సుఖ దుఃఖములు కలవు. అవి తమ సుఖదుఃఖాదులనే తెలుసుకొనగలవు. పరవృత్తాంతమును చెప్పజాలవు. వానికికూడ ప్రాణమున్నది కనుకనే అవి విరిగి పోయినా మరల పుట్టుచున్నవి.

సంసారులకు వాక్కు సంజ్ఞ-అనగా చైతన్యము అని చెప్పినాడు. దానినే బలపరచుచున్నాడు.

అర్థక్రియాసు వాక్ సర్వాన్ సమీహయతి దేహినః
తదుత్క్రాన్తౌ విసంజ్ఞోఽయం దృశ్యతే కాష్ఠకుడ్యవత్ . 127

వాక్ = చైతన్యరూపమగు శబ్దము, సర్వాన్ = సమస్తములగు, దేహినః = దేహధారులను, అర్థక్రియాసు = ప్రయోజన వంతమగు పనులయందు, సమీహయతి = ప్రేరేపించుచున్నది.

తదుత్క్రాన్తౌ = ఆ చైతన్యమునకు ఉత్క్రాన్తి కలుగగా-అనగా—దేహమునుండి చైతన్యము తప్పుకొనగ, అయమ్ = అంతకుముందు చలించుచున్న దేహి, కాష్ఠకుడ్యవత్ = ఎండిన కఱ్ఱవలె, గోడవలెను, విసంజ్ఞః = పోయిన సంజ్ఞకలదై-అనగా తెలివితప్పినదై, చలనము లేనిదై, దృశ్యతే = ప్రాణవంతులచే చూడబడుచున్నది

తా. సమస్తమగు దేహధారులను తన కవసరమగు పనులయందు శబ్దము ప్రేరేపించుచున్నది. ముందుగా తెలుసుకొని దానిని కావలెనని కోరి, యత్నించి, గమనా

గమనములు దేహధారి చేయును. ఈ క్రమమునే "జానాతి, ఇచ్ఛతి, యతతే, చేష్టతే" అను రీతిని ప్రవృత్తిలో ప్రజలు అనుసరింతురు. వీనిలో జానాతి (తెలుసుకొనుచున్నాడు) ముందుగా నున్నది. అది శబ్దమే. అదియే చైతన్యము. అట్టి శబ్దసంబంధములేని చెట్టు, లత మున్నగునవి పై రీతిని కదలలేకున్నవి.

ఆ దేహమునుండి ఆ శబ్దము తప్పుకొన్ననాడు దేహాలు కర్ర, రాయి, బెడ్డ, గోడ మున్నగు జడపదార్థముల వలె తెలివితప్పి కదలక యుండును. అట్టి స్థితి సుషుప్తి, మూర్ఛ, మరణము మున్నగు అవస్థలలో కానవచ్చుచున్నది.

జాగ్రదవస్థలో వాక్కు సర్వవ్యవహార కారణమని చూపి ఇపుడు స్వప్నావస్థయందు గూడ అదియే కారణమని చూపుచున్నాడు.

ప్రవిభాగే యథా కర్తా తయా కార్యే ప్రవర్తతే
అవిభాగే తథా సైవ కార్యత్వే నాఽవతిష్ఠతే. 128

కర్తా = పనిచేయువాడు, ప్రవిభాగే = జాగ్రదవస్థయందు, తయా = ఆవాక్కుచే, కార్యే = చేయదగిన పనియందు, యథా = ఏరీతిగ, ప్రవర్తతే = ప్రవర్తించుచున్నాడో, తథా = ఆ రీతిగా, అవిభాగే = స్వప్నావస్థయందు, సా + ఏవ = ఆవాక్కే, కార్యత్వేన(అపి) = కార్యరూపమునగూడ, అవతిష్ఠతే = ఉంటున్నది.

భా. ప్రాణులకు జాగ్రదవస్థలో సర్వవ్యవహార కారణము శబ్దము, అదియే చైతన్యము. వాగ్రూపమగు చైతన్యముతో ననువిద్ధమగు శబ్దమును పురస్కరించుకొనియే లోకులు వ్యవహరింతురు. ఈ భావము 127 వ శ్లోకమున స్పష్టముగా నున్నది.

అట్లే కర్త, కర్మ, కరణము అను విభాగములేని స్వప్నావస్థయందు గూడ శబ్దము ఉపయోగపడుచున్నది. విశేషమేమనగా — స్వప్నావస్థలో వాగ్రూపమగు చైతన్యమే పని చేయు కర్తగాను, చేయబడే కర్మగాను, పనిచేయుట కుపయోగించెడి సాధనముగాను గూడ మార్పుచెందుచున్నది. ఆ యవస్థలో పదార్థములు వాసనారూపములే, జాగ్రదవస్థయందు వలె స్థూల పదార్థములు కావు. కనుక వాటిని ప్రాతిభాసికములందురు. మిథ్యాభూతములని భావము. రథ మెక్కి ప్రయాణము చేసినట్లు కల వచ్చును. నిజముగ అచట రథము, గుర్రములు, పయనము లేవు. కాని అది యంతయు శబ్దము వలననే జరుగును. జాగ్రదవస్థలో శబ్దము సాధన మేయగును. స్వప్నావస్థలో సాధనము గాను, కార్యరూపముగాను భాసించును.

స్వప్నావస్థలో చైతన్యమే ఇంద్రియములు చేసే పనిని చేయును. శబ్దమే చైతన్యమని 125 వ శ్లోకమున స్పష్టముగా జూపబడినది.

సమస్తమగు వికారము శబ్దమునకు సంబంధించినదే అని చూపుచున్నాడు.

స్వమాత్రా పరమాత్రా వా శ్రుత్యా ప్రక్రమ్యతే యథా
తథైవ రూఢతా మేతి తయా హ్యర్థో విధీయతే. 129

స్వమాత్రా = తన స్వరూపము, పరమాత్రా + వా = ఇతర వస్తువుయొక్క స్వరూపముగాని, శ్రుత్యా = శబ్దముచే, యథా = ఏరీతిగా, ప్రక్రమ్యతే = జ్ఞానవిషయముగా

చేయబడుచున్నదో-అనగా అభిన్నముగా నున్న పదార్థమును రెండు రూపములతో నున్నట్టు, భిన్నముగా నున్న పదార్థములను ఏకరూపముగా నున్నట్టు శబ్దము ఎట్లు చూపుచున్నదో తథా + ఏవ = ఆరీతిగానే భేదరూపమునగాని, అభేదరూపమునగాని, అర్థః = ఆ యర్థము, రూఢతామ్ = రూఢిని, ఏతి = పొందుచున్నది. ఇది నిజరూపమా, కాక కల్పితమా అని సంశయమే లేక అయర్థము రూఢమనియే లోకము భావించునని భావము.

హి = ఏలయన, తయా = ఆశబ్దముచేత, అర్థః = అర్థము, విధీయతే = బుద్ధి యందు ఆరోపింపజేయ బడుచున్నది. అట్టి యర్థమును బుద్ధికి శబ్దము అందజేయుచున్నది. లేని యర్థమును గూడ ప్రకాశింపజేయుట శబ్దముయొక్క మహిమచే కలుగుచున్నది.

తా. "రాహోః శిరః" (రాహువుయొక్క శిరము) అను వాక్యము కలదు. ఒక వ్యక్తి మొండెముగాను, కేవల శిరస్సుగాను ఛేదింపబడగా మొండెమునకు కేతువని శిరోమాత్ర మునకు రాహువనియు లోకప్రసిద్ధి కలదు. రాహువే శిరము, శిరస్సుకంటె వేరుగా అవయవ ములు లేవు. కాని రాహువుయొక్క శిరస్సు అను వాడుక మాత్రము కలిగినది. ఒకే శిరము నకు రెండు భాగములున్నట్లు శబ్దము బోధించుచున్నది. ఇది శబ్దముయొక్క మహిమ.

ఇట్లే వ్యాకరణమున స్థాన్యాదేశవ్యవహారము కలదు. అచట స్థాని వేరు. ఆదే శము వేరు. కాని ఆదేశము స్థానివంటిది యగునని శాస్త్రముచెప్పుచున్నది. అచట భిన్నము లగు రెంటికి అభేదము శబ్దముచే లభించును.

బాహ్య ప్రపంచమున పదార్థములతో సంబంధములేకయే శబ్దము భిన్న భిన్నము లగు రూపములతో నర్థమును బుద్ధి విషయమగునట్లు చేయుచున్నది.

పయి అంశమునే స్పష్టపరచుచున్నాడు.

> అత్యన్త మతథాభూతే నిమిత్తే శ్రుత్యుపాశ్రయాత్
> దృశ్యతేఽలాతచక్రాదౌ వస్త్వాకారనిరూపణా . 180

నిమిత్తే = బాహ్య ప్రపంచమున నిమిత్తముగానున్న, అలాతచక్రాదౌ = కొర కంచును తిప్పినందువలన గన్పట్టు చక్రము మొదలయినవానియందు, అత్యన్తమ్ = మిక్కిలి, అతథాభూతే = అట్లు కాకపోయినా - అనగా సత్యము కాకపోయినా, శ్రుత్యుపాశ్రయాత్ = శబ్దముయొక్క బలమువలన, వస్త్వాకార నిరూపణా = వస్తువుయొక్క ఆకారమునకు సంబం ధించిన శబ్దప్రయోగము, దృశ్యతే = చూడబడుచున్నది. ఇచట లోకము కర్త.

తా. శబ్దము చెవిచే గ్రహింపబడినదై తనయందున్న అర్థమును బుద్ధికి విషయ మగునట్లు చేయును. చెవిని ద్వారముగా జేసుకొని శబ్దము బుద్ధికి విషయమగునపుడు తన యందున్న అర్థమునుగూడ బుద్ధికి విషయమగునట్లు చేయుటలో నాశ్చర్యమేమి యున్నది? శబ్దము ప్రత్యాయకము, దానియందు ప్రత్యాయ్యరూపమున అర్థమున్నది. శబ్దమర్థమును బోధించుటలో ఆ యర్థము బాహ్య ప్రపంచకమున ఉన్నదా? లేదా? అను విచారము లేకయే ఉపయోగపడును. అచట వక్తయొక్క ఇచ్ఛయే మూలము.

ఇందు మనకు చాలా వ్యవహారములు కన్పించుచున్నవి. రథచక్రము కంటికి కన బడును. దానిని తాకిన దానిస్పర్శయు ప్రత్యక్షము అగును. అది నాలుగుప్రక్కల ఒకేసారి స్పర్శకు యోగ్యమగును. అలాతచక్ర మట్టిది కాదు. అలాత మనగా కొరకంచు. దానికి తగు

మాత్రము నిప్పు ఉండును. దానిని చేతితో త్రిప్పినచో చక్రమువలె కాన్పించును. అది కంటికి కనబడునేగాని నాలుగు ప్రక్కల ఒకేసారి అంతట స్పర్శలేకపోవుటచే అదిలేదనియే నిశ్చిత మగును. రథచక్రము స్పర్శకర్హమగుటచే నది సత్పదార్థమనియు, అలాతచక్ర మసత్పదార్థ మనియు తెలియబడుచున్నది. 'అలాతచక్రము' అనుశబ్దము మాత్రము దానిని బోధించుచునే యున్నది.

vi. ఇట్లే వంధ్యాపుత్రుడు, చెవులపిల్లి కొమ్ము, గగనకుసుమము మున్నగు పద ములు కూడ అర్థవంతములే, కాని వాని యర్థము లోకమున ప్రత్యక్షముగా కానరాదు.

జగత్తునకు పరమాత్మ కారణమని వేదము బోధించుచున్నది. జగత్తునకు శబ్దము కారణమన్నచో పయిశ్రుతులు విరోధించుచున్నవి అను సంశయము కలుగగా ఆశబ్దము పరమాత్మస్వరూపమే అని సమాధానము చెప్పుచున్నాడు.

అపి ప్రయోక్తు రాత్మానం శబ్ద మన్తరవస్థితమ్

ప్రాహు ర్మహాన్తం వృషభం యేన సాయుజ్య మిష్యతే. 181

(మన్త్రాః = మంత్రములు), ప్రయోక్తుః = శబ్ద ముచ్చరించువాని-అనగా జీవుని యొక్క, ఆత్మానమ్ + అపి = నిజస్వరూపమునుగూడ-అనగా నిర్గుణపరమాత్మ స్వరూప మును గూడ, అన్తః = లోపల, అవస్థితమ్ = ఉన్నట్టియు, మహాన్తమ్ = వ్యాపకమగు, వృష భమ్ = వృషభరూపముగా కల్పింపబడిన, శబ్దమ్ = శబ్దమునుగానే, ప్రాహుః = చెప్పుచున్నవి. జీవభావము కల్పితము. దానిపారమార్థికరూపము నిర్గుణబ్రహ్మమే. ఆబ్రహ్మము శబ్దరూపమే యని వేదమంత్రములు చెప్పుచున్నవని భావము.

యేన = ఏశబ్దరూపమగు పరబ్రహ్మముతో, సాయుజ్యమ్ = ఐక్యము (ముముక్షుభిః = మోక్షము కోరువారిచే), ఇష్యతే = కోరబడుచున్నదో.

తా. శబ్దమును వృషభముగా మంత్రములు రూపకల్పనచేసి దాని మహిమను పొగడుచున్నవి. అది సమస్తమగు కోరికలను ఇచ్చును. సర్వశక్తి సమన్వితము, పరమాత్మ రూపము. మనుష్యులను అట్టి శబ్దము ఆవేశించియున్నది. దానిని సేవించిన ముముక్షువులు దానితో నైక్యమును బొందుదురు. దాని స్వరూపము వ్యాకరణాధ్యయనము వలన తెలియ నగును. వ్యాకరణమును అభ్యసించిన పాపములు తొలగి ధర్మమువలన చిత్తశుద్ధి కలిగి సాధ కుడు నిర్గుణాద్వయబ్రహ్మభావమును పొందును.

శబ్దబ్రహ్మతో నైక్యమును పొందుటకు అవసరమగు ఉపాయమును చూపు చున్నాడు.

తస్మా ద్యః శబ్దసంస్కారః సా సిద్ధిః పరమాత్మనః

తస్య ప్రవృత్తితత్త్వజ్ఞ స్తద్బ్రహ్మాఽమృత మశ్నుతే. 182

తస్మాత్ = అందువలన-అనగా శబ్దమునందు మాహాత్మ్యముండుటవలన, యః = ఏది, శబ్దసంస్కారః = శబ్దముయొక్క సంస్కారమో - అనగా అసాధు శబ్దములనుండి సాధు శబ్దములను వేరుగా చూపుటయో, సా = అది, పరమాత్మనః = పరమాత్మయొక్క, సిద్ధిః = పొందుట కుపాయము.

తస్య = ఆ శబ్దబ్రహ్మము యొక్క, ప్రవృత్తి తత్త్వజ్ఞః = ప్రవృత్తులయొక్క తత్వము గుర్తించినవాడు, అమృతమ్ = అవినాశియగు, తత్ = ఉపనిషత్ప్రతిపాద్యమగు, బ్రహ్మ = పరబ్రహ్మమును, అశ్నుతే = వ్యాపించుచున్నాడు-అనగా పొందుచున్నాడు.

తా. అసాధు శబ్దసంపర్కము వలన సాధుశబ్దముల శక్తి తగ్గియుండును. అందుచే నవి ధర్మజనకములు కానేరవు. కనుక ముందుగా అసాధుశబ్దముల నుండి సాధు శబ్దములను వేరుగా తెలుసుకొనవలెను. ఇదియే శబ్ద సంస్కారము. దాని వలన పాపములు నశించి ధర్మము వృద్ధిచెంది చిత్తము శుద్ధమగును. అపుడు ఉపనిషత్ప్రతిపాద్యమగు నిర్గుణ బ్రహ్మభావరూపమగు మోక్షము లభించును.

వి. శబ్దబ్రహ్మము 'జాయతే' (పుట్టుక) మున్నగు ఆరు విధములుగా వివర్తమగును. అవియే ప్రవృత్తులు అనబడును. వాని తత్త్వము అవికారి బ్రహ్మమే.

సాధుశబ్దము కూడ వికృతమే. దానిని సేవించిన ప్రతిభ కలుగును. అదియే సృష్టి స్థితిలయములకు కారణము. అట్టి సాధుశబ్ద జ్ఞానము వ్యాకరణాధీనము. అది లేనిది శబ్దస్వరూపము జ్ఞాతము కానేరదు. ఈ యర్థము 13 వ శ్లోకమున కలదు. 118 వ శ్లోకమునుండి ఇంతవరకు 15 శ్లోకములచే శబ్దముయొక్క మాహాత్మ్యము నిరూపింపబడినది.

సాధుశబ్ద ప్రయోగమువలన ధర్మము, దానివలన చిత్తశుద్ధి, మోక్షము కలుగును. అని చెప్పబడినది. కాని వ్యాకరణస్మృతికి ప్రామాణ్య మెట్లు? అది పౌరుషేయము కనుక అప్రమాణమగును అనిశంక కలుగగా వేదమూలకమగుటచే వ్యాకరణస్మృతి ప్రమాణమే అను సమాధానము చెప్పదలచి ఒక్క వ్యాకరణమే వేదమూలకమగుటచే ప్రమాణముకాదు. స్మృతులన్నియు ఇట్టివే అని చెప్పుచున్నాడు.

న జాత్వకర్తృకం కశ్చిదాగమం ప్రతిపద్యతే
బీజం సర్వాగమాపాయే త్రయ్యేవాఽతో వ్యవస్థితా. 133

(అ) కశ్చిత్ = ఒకడుకూడ, జాతు = ఎప్పుడైనను, ఆగమమ్ = స్మృతిశాస్త్రమును, అకర్తృకమ్ = కర్తలేనిదానినిగా-అనగా అపౌరుషేయమునుగా, న + ప్రతిపద్యతే = గుర్తించడు.

తా. ప్రతి మనుష్యుడు స్మృతులు వేదమువలె అపౌరుషేయములని భావించడు. అవి మనుష్యులచే నిర్మింపబడినవి యనియే తలంచును. అవి యనిత్యములగుటచే తప్పక నశించు నని భావము.

(ఆ) అతః = ఈ కారణమువలన - అనగా స్మృతులు పురుషులచే నిర్మింపబడి యుండుటవలన, సర్వాగమాపాయే = ప్రళయమున సమస్తమగు స్మృతిశాస్త్రములు నశించగా, వ్యవస్థితా = నిత్యమగునట్టి, త్రయీ + ఏవ = ఋగ్యజుస్సామరూపమగు వేదత్రయమే, బీజమ్ = మూలము. స్మృతు లన్నిటికి వేదమే మూలమని భావము.

వి. సాధుశబ్దప్రయోగము వలన పాపముపోయి ధర్మము. చిత్తశుద్ధి, మోక్షము కలుగును. సాధుశబ్దజ్ఞానము వ్యాకరణమూలకమని చెప్పుట ఎట్లు పొసగును? వ్యాకరణము పురుష నిర్మితము కాబట్టి యప్రమాణమే యగును. కాగా వ్యాకరణమునుబట్టి పైయర్థమును ఎట్లు విశ్వసింతుము? అను సంశయము కలుగగా వ్యాకరణము వేదమూలకము కనుక

ప్రమాణమే యగును అను నర్థమును జెప్పుచు స్మృతులన్నిటికి వేదప్రామాణ్యమును బట్టియే ప్రామాణ్యము లభించునని 133 నుండి 143 వరకు 10 శ్లోకములచే నిరూపించుచున్నాడు.

తా. ఈ కాలమున కన్పించుస్మృతులు వేదార్థమును ప్రమాణముగా తీసుకొని మునులచే రచింపబడినవి. అంతియేకాని వేదార్థముతో సంబంధములేక కేవలము వ్యక్తి బుద్ధిబలమునే ఉపయోగించి వ్రాయబడినవి కావు. వేదము స్వతః పరమప్రమాణమని భారతీయులు విశ్వసింతురు.

స్మృతులు పురుషనిర్మితములనియే అందరు నమ్ముదురు. అవి అపౌరుషేయము లని ఎవ్వరు నమ్మరు. కాగా అవి సకర్తృకములగుటచే అనిత్యములని వేరుగ చెప్పనక్కర లేదు. అనిత్యములగుటచే ప్రళయమున నవి నశించును.

ప్రళయము తరువాత యుగప్రారంభమున కపిల ప్రభృతులు వేదమును మూల ముగా గైకొని స్మృతులను నిర్మింతురు. ఆ సమయమున వేదమొక్కటియే మిగిలియుండును. అది నిత్యము. ప్రళయమున గూడ వేదము నశించదు. అట్లే ప్రతి యుగమున జరుగు చుండును.

అట్టి స్మృతులలో వ్యాకరణము గూడ చేరియున్నందున ప్రమాణమే. కనుక పై యర్థము విశ్వసింప దగినదే.

పౌరుషేయములగు ధర్మశాస్త్రగ్రంథములు నశించునపుడు ఆ స్మృతులకు మూలము లగు వేదములు మనకు తెలియబడనందున ఆ సమయమున ధర్మాచరణము విచ్ఛిన్నమే కావలెనను సంశయమును పోగొట్టుచున్నాడు.

అస్తంయాతేషు వాదేషు కర్తృష్వన్యేష్వసత్స్వపి
శ్రుతిస్మృత్యుదితం ధర్మం న లోకో వ్యతివర్తతే. 184

వాదేషు = ధర్మశాస్త్రగ్రంథములు, అస్తమ్ = నాశమును, యాతేషు = పొందగా-అనగా అవి నశించగా, అన్యేషు = ఇతరులగు, కర్తృషు = ధర్మశాస్త్ర గ్రంథరచయితలు, అసత్సు + అపి = లేకున్నను, లోకః = శిష్టలోకము, శ్రుతిస్మృత్యుదితమ్ = వేదములోను, తన్మూలకమగు స్మృతులలోను చెప్పబడిన, ధర్మమ్ = ధర్మమును, న + వ్యతివర్తతే = అతిక్రమించి ప్రవర్తించదు. దానిని విడచి యుండదు

తా. ప్రళయమున ధర్మశాస్త్రగ్రంథములు, వానిని రచించినవారు నశిం తురు. యుగప్రారంభమున రచయితలు లేరు. ఈ మధ్యకాలమున ధర్మాచరణమున కవ కాశము లేనందున ధర్మాచరణము విచ్ఛిన్నమే యగునని సంశయింపనప్పును. కాని నిత్య మగు వేదమునే యాధారముగా జేసుకొని ఆ నాటి శిష్టులు ధర్మమును ఆచరించుచునే యుందురు. కాబట్టి ధర్మాచరణ మెన్నడు విచ్ఛిన్నము కానేరదు.

కపిలాది స్మృతి ప్రణేతలకు ధర్మాధర్మజ్ఞానము స్వభావసిద్ధమే. అందు ఇతర శాస్త్ర ములు కాని వేదముకాని కారణముకాదు. కనుక స్మృతులు వేదమూలకములని ఎట్లు చెప్ప నగును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

జ్ఞానే స్వాభావికే వార్థః శాస్త్రైః కశ్చన విద్యతే
ధర్మే జ్ఞానస్య హేతుశ్చేత్తస్యాఽఽమ్నాయో నిబన్ధనమ్. 185

(అ) జ్ఞానే = ధర్మాధర్మ విషయకమగు జ్ఞానము. స్వాభావికే = స్వభావసిద్ధమే యగుచో, శాస్త్రైః = స్మృతిశాస్త్రములచే, కశ్చన = ఏమియు, అర్థః = ప్రయోజనము, న + విద్యతే = కలుగనేరదు.

తా. వేదమక్కరలేకుండ కపిలాదులకు వలె ఇతరులకు గూడ ధర్మాధర్మ జ్ఞానము స్వభావముగానే కలుగవచ్చును. కనుక కపిలాదులు ఇతరుల నుద్దేశించి చేసిన శాస్త్ర నిర్మాణము నిరుపయోగమే యగును; కనుక కపిలాదులకుగూడ వేదమూలముననే జ్ఞానము కలిగినదని చెప్పవలెను. కాబట్టి స్మృతులు వేదమూలములే కాగలవు. కపిలాదులకు జ్ఞానము స్వాభావికము కాదు.

(అ) జ్ఞానస్య = కపిలాదులకు కలిగెడి జ్ఞానమునకు, ధర్మః = ధర్మము, హేతుః + చేత్ = కారణమన్నచో, తస్య = ఆధర్మమునకు, ఆమ్నాయః = వేదము, నిబన్ధనమ్ = మూలము. వేదములేనిది వారలకు కూడ ధర్మము కలుగనేర దని భావము.

తా. స్మృతిశాస్త్రములను నిర్మించెడి కపిలాదులకే ధర్మ మనుగ్రహమును జూపును, ఇతరుల ననుగ్రహించదనుట విశ్వసనీయము కాదు.

కనుక కపిలాదులు వేదార్థపరిశీలనము, తద్విహిత సత్కర్మాచరణము చేసి దాని మూలముననే జ్ఞానాతిశయమును బొందిరి. ఇతరులకు, అంతశక్తి లేనందున వారియందు అనుగ్రహబుద్ధితో కపిలాదులు తాము గుర్తించిన పరమార్థసత్యమును గ్రంథరూపమున వారి కంద జేసిరి. అట్లు కాకున్న, సామాన్యులు వేదార్థమును గ్రహించలేక పోవుటచే జ్ఞానవంతులు కాకపోయెడివారే.

స్మృతులన్నియు వేదమును ఊతచేసుకొని రచియింపబడినందున ప్రమాణములని నిరూపింపబడినది. అట్టితరి ఆ వేదమువలననే మనకు అర్థజ్ఞానము కలుగుచుండగా మరల వేరుగా పూర్వోత్తర మీమాంసాశాస్త్రనిర్మాణము వ్యర్థమే కావలెను అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

వేదశాస్త్రావిరోధీ చ తర్కశ్చక్షు రపశ్యతామ్
రూపమాత్రాద్ధి వాక్యార్థః కేవలా న్నావతిష్ఠతే. 136

వేదశాస్త్రావిరోధీ = వేదమనే శాస్త్రమున కవిరుద్ధమగు, తర్కః + చ = తర్కమే, అపశ్యతామ్ = చూచుటకు శక్తిలేని వారికి-అనగా సందేహములేకుండ వేదార్థమును స్వయముగా గ్రహించుటకు సామర్థ్యము లేనివారికి, చక్షుః = నేత్రమువంటిది.

హి = ఏలయన, కేవలాత్ = తర్కసహకారములేని, రూపమాత్రాత్ = వేద శబ్దముయొక్క స్వరూపమాత్రమువలన, వాక్యార్థః = వేదవాక్యమునకు తాత్పర్యవిషయమగు అర్థము, న + అవతిష్ఠతే = సామాన్యులకు నిశ్చితము కానేరదు.

తా. శాస్త్రముల నిర్మాణమువలన కలిగెడి ప్రయోజనమును ఈ శ్లోకము వివరించుచున్నది. ఇచట తర్కశబ్దముచే జైమిని రచియించిన పూర్వమీమాంసాశాస్త్రము, వ్యాసమహర్షి నిర్మించిన ఉత్తరమీమాంసాశాస్త్రము గ్రహింపబడును.

వేదవాక్యములో కొన్ని పదములకు అర్థము పరస్పర విరుద్ధముగాను, సందిగ్ధముగాను, అనేకవిధములుగా కాన్పించును. అస్మదాదులు వానిని సమన్వయబరచి నిశ్చితార్థమును

గ్రహింపజాలము. పూర్వోత్తర మీమాంసా శాస్త్రములు అట్టి వేదవాక్యములను జూచి సాధక బాధక పర్యాలోచనచేసి ఒక నిశ్చితార్థమును చూపుచున్నవి. వేదవాక్యముననే ఆ నిశ్చితార్థ బోధకత యున్నది. దానిని శాస్త్రము స్పష్టపరచినది. శాస్త్రము లేనిది దానిని మనము తెలుసుకొనలేము.

పదార్థములను చూచుటకు నేత్రము సహకరించునట్లు వేదార్థమును చూచుటకు శాస్త్రము సహకరించును. ఆ శాస్త్రము వేదార్థమునకు విరుద్ధముగా నుండరాదు. విరుద్ధమగు తర్కము నిర్ణాయకము కానేరదు.

కాబట్టి వేదతాత్పర్య నిర్ణయము తర్కాధీనమే.

వేదతాత్పర్య విషయమగు అర్థమును నిర్ణయించుట తర్కాధీనమను అర్థమును ఉదాహరణతో చూపుచున్నాడు.

సతోఽవివక్షా పారార్థ్యం వ్యక్తి రర్థస్య లైఙ్గికీ
ఇతి న్యాయో బహువిధ స్తర్కేణ ప్రవిభజ్యతే . 187

సతః=ఉన్నదానికి-అనగా శబ్దమువలన లభించిన అర్థమునకు, అవివక్షా=వివక్ష చేయకుండుట-ఆ యర్థమును విడనాడుట యని భావము, పారార్థ్యమ్=పరాధీనత్వము-అనగా ఒక పదార్థము మరియొకపదార్థమునకు ఉపకరించుట, అర్థస్య=శబ్దముచే లభించిన అర్థమునకు, లైఙ్గికీ=లింగబలముచే లభించిన, వ్యక్తిః=అభివ్యక్తి - అనగా శబ్దముచే సామాన్యాకారముగా బోధింపబడిన అర్థమును వాక్యాంతర బలముచే విశేషాకారముగా చూపుట, ఇతి=ఇట్టి, బహువిధః=పలువిధమగు, న్యాయః=సిద్ధాంతము, తర్కేణ=తర్కముచే ప్రవిభజ్యతే=స్పష్టముగా విభజింపబడి చూపబడుచున్నది. అట్టి నిర్ణయము తర్కాధీనమే యని భావము.

తా. శబ్దముచే అర్థము స్పష్టముగా లభించుచున్నను దానిని విడిచియే కొన్ని చోటులందు సమన్వయము చేయవలయును. కొన్ని చోటులందు విడువకుండగనే సమన్వయము చూపవలయును. ఎచట విడువవలెనో, ఎచట విడువరాదో ఆ పరిస్థితిని మనము గుర్తించలేము. తర్కము ఆ పని చేయును.

వి. ఉదాహరణమునకు-"తస్యాఽపత్యమ్"- 4-1-92 అని పాణిని సూత్రము. షష్ఠ్యంతముకంటె అపత్యార్థమున తద్ధితము ప్రవర్తించునని యర్థము. సూత్రమున "తస్య" అని యున్నందున పుల్లింగమగు ఏకవచనాంతముకంటె ప్రత్యయము ప్రవర్తించునని లభించు చున్నది. కాగా 'దశరథస్య అపత్యమ్=దాశరథిః' మున్నగు రూపములే లభించును. స్త్రీ లింగముకంటెను, ద్వివచన బహువచనాంతములకంటెను ప్రత్యయము ప్రవర్తించనేరదు. 'సుమిత్రాయాః అపత్యమ్=సౌమిత్రిః, స్వస్రోః అపత్యే-స్వస్రీయౌ, (చెల్లెండ్ర కుమారులు)' ఇత్యాదిరూపములు సిద్ధించకపోయెడివి. ఇట్లే ఆ సూత్రమున 'అపత్యమ్' అని ఏకవచ నాంతముగా నున్నందున రెండు మూడు సంతానములు అర్థమగునపుడు ప్రత్యయము ప్రవర్తించక పోయెడిది. కాబట్టి పై సూత్రమున లింగవచనములు వివక్షితములు కావని చెప్పవలెను. ఇట్టివి ఉదాహరణములు చాల కలవు.

"కాకేభ్యో దధిరక్ష్యతామ్" (కాకములనుండి పెరుగు రక్షింపబడవలెను) అను వాక్యము పెరుగు రక్షింపదగినదనెడి తాత్పర్యముతో ప్రయోగింపబడినది. దానికి గుర్తుగా

"కాకేభ్యః" అను పదమున్నది. పిల్లి, కుక్క మున్నగు ఏ వ్యక్తియు పెరుగు పాడుచేయ కుండ జాగ్రత్తగా కాపాడవలెనని ముఖ్యాశయము. అంతియేకాని "కాకేభ్యః" అని యున్నందున కాకములనుండి రక్షించి పైవానినుండి రక్షించవద్దని భావము కాదు. కాగా పై వాక్యమునందలి కాకపదము కాకమునేగాక పెరుగును పాడుచేయు వ్యక్తు లన్నిటిని బోధించును. ఈ యర్థమునే "దధ్యుపఘాతుకే కాకపదం లాక్షణికమ్" అని పెద్దలు నుడివిరి. దీనినే ఉపలక్షణమని యందురు.

"అభిరూపాయ కన్యా దేయా"- (యోగ్యమగువానికి కన్యక ఈయతగినది) అను వాక్యము సామాన్యార్థమును బోధించును. మరికొన్ని వాక్యములు చూచినతరువాత విద్య, ధనము, రూపము, కులము మున్నగునవి కలవానికి ఈయవలెనని విశేషరూపమున అర్థము నిర్ణీతముకాగా పై వాక్యమున కదియే యర్థమని చివరికి తేలుచున్నది.

ఈ రీతిగా ఎన్నియో సిద్ధాంతములను తర్కము స్పష్టపరచుచున్నది.

పురుషులచే జూపబడెడి తర్కమునకు శబ్దశక్తియే మూలము. అట్లుకాక పురుషులచే స్వతంత్రముగా జూపబడెడి తర్కము శుష్కతర్క మనబడును. అట్టి తర్కము వేదతాత్పర్య విషయమగు అర్థమును నిర్ణయింపజాలదు అని చూపుచున్నాడు.

శబ్దానామేవ సా శక్తి స్తర్కో యః పురుషాశ్రయః
శబ్దానుగతో న్యాయోఽనాగమే ష్వనిబన్ధనః . 188

పురుషాశ్రయః = పురుషుల నాశ్రయించియున్న-అనగా పురుషులు చూపెడి, యః=ఏ, తర్కః=తర్కమో, సా=ఆ, శక్తిః=సామర్థ్యము, శబ్దానామ్+ఏవ= శబ్దములకు సంబంధించినదే, శబ్దముల కంత సామర్థ్యమున్నది, దానిని పురుషులు వ్యక్తపరచు చున్నారని భావము.

అనాగమేషు = శబ్దశక్తిని అనుసరించని పురుసుల యందున్నట్టియు, శబ్దానుగతః = శబ్దశక్తిని అనుసరించనట్టియు, న్యాయః = తర్కము, అనిబన్ధనః=అర్థనిర్ణాయకము కానేరదు.

తా. "తస్యాఽపత్యమ్", "కాకేభ్యో దధి రక్ష్యతామ్", "అభిరూపాయ కన్యా దేయా" మున్నగు శబ్దములకు 187 వ శ్లోకమున వివరింపబడిన యర్థమంతయు కలదు. మనుష్యులు వానికి లేని యర్థమును చెప్పుట కాదు. నిగూఢముగా నున్న అర్థమును స్పష్టపడు నట్లు మనుష్యులు హేతువాదమును జూపుచున్నారు.

అట్లుకాక శబ్దశక్తిని దూరముచేసి మనుష్యుడు తనకు తట్టిన యభిప్రాయము ననుసరించియే శబ్దమున కర్థముచెప్పినచో దానిని ప్రామాణికులు పరిగ్రహించరు. శుష్కతర్కమని హేలన చేయుదురు.

సాధుశబ్దములకు ధర్మమును కలిగించుటయందు సామర్థ్యము కలదని 140 వ శ్లోకముచే చెప్పదలచి, దానికి రెండు దృష్టాంతములను ఈ శ్లోకముచే చూపుచున్నాడు.

రూపాదయో యథా దృష్టాః ప్రత్యర్థం యతశక్తయః
శబ్దా స్తథైవ దృశ్యన్తే విషాపహరణాదిషు . 189

యథా=ఏరీతిగా, రూపాదయః = రూపము మున్నగునది — అనగా రూపరస గంధస్పర్శలు, ప్రత్యర్థమ్ = ప్రతిప్రయోజనమున - అనగా విలక్షణమగు కార్యమునుబట్టి,

యతశక్తయః = నియతమగుశక్తులు కలవై, దృశ్యన్తే = ప్రత్యక్షముగా చూడబడుచున్నవో, తథా + ఏవ = మరియు అట్లే, శబ్దాః = శబ్దములు-అనగా అథర్వవేదమున నున్న శబ్దములు, విషాపహరణాదిషు = విషమును పోగొట్టుట మున్నగు కార్యములందు, నియతమగు శక్తులు కలవై చూడబడుచున్నవి. ఈ శ్లోకార్థమునకు 140వ శ్లోకార్థముతో నన్వయము కలుగును, ఇది దృష్టాంత వాక్యము.

తా. కంటితో రూపముచూతుము. అది నీల హరితరూపములు చూచుటకు ఉపక రించును. వానిని మనము చూడగలము. కాని భాస్వర శుక్లరూపము కంటికి నాశనము కలి గించును. దానిని కంటితో చూడలేము. రూపములకు రూపత్వము సామాన్యమైనను పయి రీతిని కార్యభేదము కానవచ్చుచున్నది.

మధురరసము కఫమును, కటురసము పైత్యమును కలిగించును. విషపు ఓషధుల గంధము మూర్ఛను, మాలతీగంధము అధికమై తస్యమును కలిగించును.

బాలికను [1] స్పృశించిన ఆయుష్యాభివృద్ధి, పడతిని స్పృశించిన యథాస్థితమగు ఆయుష్యము, ప్రౌఢను స్పృశించిన వృద్ధత్వము, వృద్ధురాలిని స్పృశించిన మరణము పురుషు నకు కలుగును.

ఇట్లే అథర్వవేదమున కొన్ని మంత్రములు తేలు, పాము మున్నగువాని విషమును పోగొట్టును. కొన్ని శత్రునాశనమును జేయును. ఋగ్వేదమున నున్న శ్రీసూక్తము, పురుష సూక్తము మున్నగునవి దేవతానుగ్రహమును కలిగించును.

దృష్టాంతమును జూపి ఈ యర్థమును ప్రకృతమున జూపుచున్నాడు.

యథైషాం తత్ర సామర్థ్యం ధర్మేఽప్యేవం ప్రతీయతామ్
సాధూనాం సాధుభి స్తస్మా ద్వాచ్య మభ్యుదయార్థిభిః . 140

యథా = ఏరీతిగా, ఏషామ్ = వీనికి-అనగా 139 వ శ్లోకమున చూపబడిన రూప రస గంధాదులకును, ఆథర్వణ శబ్దములకును, తత్ర = విశేషకార్యమును కలిగించుటయందు, సామర్థ్యమ్ = సామర్థ్యము, ప్రతీయతే = తెలియబడుచున్నదో, ఏవమ్ = ఈరీతిగా, సాధూ నామ్ = సాధుశబ్దములకు, ధర్మే అపి = ధర్మమునందు గూడ, సామర్థ్యమ్ = శక్తి, ప్రతీయ తామ్ = తెలియబడుగాక - అనగా లోకులచే గుర్తింపబడు గాక.

తస్మాత్ = అందువలన-అనగా సాధుశబ్దములు ధర్మమునకు కారణమగుటవలన, అభ్యుదయార్థిభిః = ఇహలోక పరలోక ఫలములను కోరువారిచే, సాధుభిః = సాధు శబ్దముల చేతనే, వాచ్యమ్ = మాట్లాడుట యుక్తము.

వి. 138 వ శ్లోకమునుంచి స్మృతులకు వేదార్థమూలకములగుట వలన ప్రామా ణ్యమునుజూపి, వానిలో నంతర్గతమగుటచే వ్యాకరణమునకుగూడ ప్రామాణ్యము లభించునని

[1] ఆయుర్వేదమున నిట్లున్నది.

"బాలా ప్రాణప్రదా ప్రోక్తా, యువతీ ప్రాణధారిణీ
ప్రౌఢా కరోతి వృద్ధత్వం, వృద్ధా మరణ మాదిశేత్."

స్పష్టపరచెను. దానివలన వ్యాకరణాధ్యయనము వలన సాధుశబ్దజ్ఞానము, తద్ద్వారా ధర్మము కలుగవచ్చునని స్పష్టమగుచున్నది.

కాని అర్థబోధనకై ఉపయోగించెడి శబ్దములకు ధర్మమును కలిగించెడి సామర్థ్య మున్నదా ? అను ప్రశ్నకు ఈ శ్లోకముచే సమాధానము చెప్పబడినది. అందుకు ముందుగా 139 వ శ్లోకమున రెండు దృష్టాంతములను జూపియున్నాడు. వానిలో రెండవది ఆశ్లోకము యొక్క పూర్వార్థమునకు దార్ష్టాంతికము, ఈ శ్లోకార్థమునకు దృష్టాంతముకూడ కాగలదు.

తా. రూపరసగంధ స్పర్శలు ఆథర్వణములలో మంత్రములు ఎట్లు విలక్షణము లగు కార్యములను కలిగించుచున్నవో, అట్లే సాధుశబ్దములు ధర్మమును కలిగించగలవు. వానికి అర్థబోధకత ప్రయోజనము కావచ్చును. అది దృష్టఫల మగును. అవి పైరీతిని ధర్మరూప మగు అదృష్టఫలమును గూడ కలిగించగలవు.

కనుక ధర్మము నపేక్షించువాడు సాధుశబ్దములనే సామాన్యవ్యవహారమున గూడ ప్రయోగించవలెను.

కొన్ని శబ్దములకు విషాపహరణము కలదు. అది ప్రత్యక్షసిద్ధము. అట్లు సాధు శబ్దములు ధర్మజనకము లనుట ప్రత్యక్షసిద్ధము కాదు. అట్టితరి పయి సిద్ధాంతము ఎట్లు సమ్మతమగును ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

సర్వోఽదృష్టఫలా నర్థా నాగమా త్ప్రతిపద్యతే
విపరీతం చ సర్వత్ర శక్యతే వక్తు మాగమే .　　　　141

(అ) సర్వః = ప్రతిమనుష్యుడు, అదృష్టఫలాన్ = అదృష్టఫలకములగు-అనగా ప్రత్యక్షముగా కనిపించని ఫలములు కల, అర్థాన్ = అర్థములను, ఆగమాత్ = వేదమువలన, తన్మూలకమగు స్మృతుల వలన, ప్రతిపద్యతే = పొందుచున్నాడు (తెలుసుకొనుచున్నాడు).

తా. లోకులు ఇంద్రియములచే లభ్యములగు అర్థములను ఇంద్రియములచేతనే తెలుసుకొనుచున్నారు. అతీంద్రియములగు స్వర్గాదిఫలములను కలిగించెడి యాగాదులను వేదమువలననే తెలుసుకొనుచున్నారు. యాగముచేసిన స్వర్గముకలుగునని వేదము చెప్పు చున్నది. "స్వర్గకామో యజేత" అది వేదము వలననే తెలియనగును. మరియొక సాధనముచే తెలియబడునది కాదు.

అయితే సాధుశబ్దములు అధర్మమునకు కారణము లేల కాకూడదు ? అధర్మము కూడ అదృష్టరూపమే కదా ! వానివలన ధర్మమే కలుగునని యెట్లు నిశ్చయింప నగును ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

(అ) విపరీతం + చ = విపరీతార్థమైతే, సర్వత్ర = ఎల్లవిధములగు, ఆగమే = ఆగమ విషయమై, వక్తుమ్ = చెప్పేకొరకు, శక్యతే = శక్యమగుచున్నది.

తా. దానముచేసిన పుణ్యము, చౌర్యముచేసిన పాపము కలుగునని వేదము చెప్పుచున్నది. ఆయా పనులవలన భిన్నఫలము లేల కలుగరాదు ? అని వేద విహిత కర్మలన్నిటిని ఎదుర్కొని మాట్లాడవచ్చును. అట్లైన ఏదియు విశ్వసనీయము కాక పోయెడిది. కనుక అట్టి హేతువాదము చూపరాదు. పుణ్యపాపముల విషయమున వేదార్థముపై నమ్మక మున్ననాడే లోకులు నిత్యయాత్రను సక్రమముగా నడుపుకోగలరు.

వ్యాకరణ శాస్త్రము స్మృతిరూపము, అదియే సాధు శబ్దస్వరూపమును జూపగలదు. అది శిష్టపరంపరగా నిబద్ధమగుచున్నది. కనుక సాధుశబ్దములను ప్రయోగించిన ధర్మము కలుగుననుటలో ఇది ప్రమాణము కాగలదని చెప్పుచున్నాడు.

సాధుత్వజ్ఞానవిషయా సైషా వ్యాకరణస్మృతిః
అవిచ్ఛేదేన శిష్టానా మిదం స్మృతినిబన్ధనమ్ . 142

సా=అ- అనగా శబ్దసాధుత్వమును తెలుసుకొనుటకు అన్వేషింపబడుచున్న స్మృతి, ఏషా=ఈ,-అనగా మనకు ప్రత్యక్షముగా కానవచ్చుచున్న, వ్యాకరణ స్మృతిః=పాణినీయ స్మృతి, సాధుత్వజ్ఞాన విషయా=శబ్దముల సాధుత్వమును తెలుపుటయే విషయముగా గలదై, (వర్తతే=ఉన్నది).

ఇదమ్=ఈ పాణిని వ్యాకరణము, శిష్టానామ్=సాధుశబ్దములయొక్క, అవిచ్ఛేదేన=అవిచ్ఛిన్నముగా-అనగా మధ్యే మధ్యే నాశములేకుండ, స్మృతినిబన్ధనమ్=స్మరణమే మూలముగా గలది, (భవతి=అగుచున్నది).

తా. పెద్దలు సాధుశబ్దములను అవిచ్ఛిన్నముగా స్మరించుచునేయున్నారు. ఒకరి నుండి మరియొకరికి, వారినుండి మరియొకరికి ఈ రీతిగా ఆ శబ్దములు లోకమున నిలిచియున్నవి. దానిని ఆధారముగా గైకొనియే ఈ వ్యాకరణము ప్రవర్తించుచున్నది. నూతనమైనది కాదని భావము.

ఏ శబ్దము సాధువో, ఏది యసాధువో అనునది శబ్దతత్త్వజ్ఞులు నిర్ణయించియున్నారు. ఆ నిర్ణయము ననుసరించియే పాణిని కాత్యాయన పతంజలులు ఈ వ్యాకరణమును లోకమున కందజేసిరి. ఇదియే శబ్ద సాధుత్వమును నిర్ణయించును. కనుక మనము శబ్ద సాధుత్వము విషయమై వేరుగ అన్వేషణ చేయనక్కర లేదు.

వి. ఈ వ్యాకరణము శిష్టపరంపరాగతములగు శబ్దములను అనేకములగు మార్గముల ద్వారా బోధించుచున్నది. కనుకనే కొన్ని శబ్దములు వ్యాకరణ సూత్రము ప్రకారము సాధువులువలె కాన్పించినను అట్టివానిని వేరుచేసి మునులు వానిని ప్రయోగించరాదని నిషేధింతురు. "నహి పచి రన్తిపరః ప్రయుజ్యతే" అని మహాభాష్యకారుడు బిగ్గరగా పలికెను. 'అన్తి' ప్రత్యయమునుజేర్చి పచధాతువును ప్రయోగించరాదని యర్థము. ఇట్టివి చాల కలవు.

పయి రీతిగా వ్యాకరణ స్మృతికి ప్రామాణ్యము జూపి దానికి విషయమగు శబ్దస్వరూపమును అనగా ఏ శబ్దమును విషయముగా జేసికొని ఈ స్మృతి ప్రవర్తింపజేయబడినదో ఆ యంశమును జూపుచున్నాడు.

వైఖర్యా మధ్యమాయాశ్చ పశ్యన్త్యా శ్చైత దద్భుతమ్
అనేకతీర్థభేదాయా స్త్రయ్యా వాచః పరంపదమ్ . 143

అనేక తీర్థ భేదాయాః=అనేకములగు స్థానములచే భేదము కలిగినట్టియు, త్రయ్యాః=మూడు విధములగునట్టియు, వైఖర్యాః=వైఖరీరూపముగా నున్నట్టియు, మధ్యమాయాః+చ=మధ్యమా రూపముగా నున్నట్టియు, పశ్యన్త్యాః+చ=పశ్యన్తీరూపముగా నున్నట్టియు, వాచః=వాక్కునకు, ఏతత్=ఈ వ్యాకరణము, అద్భుతమ్=విలక్షణమగునట్టియు, పరమ్=ఉత్తమమగు, పదమ్=స్థానము-అనగా పొందుటకు సాధనము.

తా. శబ్దము కంఠము, ప్రాణము, బుద్ధి యనెడి మూడు స్థానములందున్నది. దానికి వైఖరీ, మధ్యమా, పశ్యన్తీ అను మూడు అవయవములు కలవు. ఇన్ని విధములగు శబ్దములను తెలుసుకొనుటకు వ్యాకరణము సాధనము.

వి. "ద్వావుపాదానశబ్దేషు" అను 44 వ శ్లోకమున వైఖరీ, మధ్యమా అను రెండు విధములగు శబ్దములు వ్యాకరణమునకు విషయమగునని చెప్పెను. అది అస్మదాదుల నుద్దేశించి చెప్పబడినది. మనకు ఆ రెండు విధములే విషయమగును. పశ్యంతిని మనము గుర్తించలేము. అది యోగులకే విషయమగును. యోగులనుకూడ ఉద్దేశించి ఇచట త్రయ్యాః అని చెప్పెను. పరావాక్కు యోగులకుకూడ విషయము కాదు. అది సర్వ వ్యవహారాతీతము, నిర్గుణ బ్రహ్మరూపము. కనుక దానిని ఇచట విడిచి త్రయ్యాః అని పలికెను. వాక్కు మూడు విధములే అనరాదు. పరను కలిపి వాక్కు 4 విధములని ఋగ్వేద భాష్యములోను, మహాభారతములోను, ఇతరములగు ప్రామాణికగ్రంథములలోను కూడగలదు. పశ్యన్తీవాక్కునందు గూడ ప్రకృతి ప్రత్యయ విభాగము కలదు. అది యోగికి అందుబాటులో ఉన్నది.

కంఠము, ప్రాణము, పెదవులు మున్నగు అవయవముల చలనముచే కలిగెడిది వైఖరి. ఇది ఇతరుల చెవికికూడ వినపడును. బుద్ధిలోనున్నది మధ్యమ. ఇది నిత్యము, వైఖరి జన్యము. వైఖరి మధ్యమా వాక్కును వ్యక్తపరచును. మధ్యమాశబ్దము వ్యాకరణ కార్యములు ప్రవర్తించుటకు యోగ్యమైనది. అదియు, పశ్యన్తియు సాక్షాత్ వ్యాకరణవిషయములు. మధ్యమా వాక్కునకు వ్యంజకమగుటచే వైఖరియు వ్యాకరణ విషయమగుచున్నది.

ఈయురీతిని వ్యాకరణము అన్నివిధములగు సాధుశబ్దములు తెలుసుకొనుటకు ఉపాయమని సామాన్యముగా చెప్పబడినది. ఆ అభిప్రాయమునే విశేషరూపమున చూపుచున్నాడు.

తద్విభాగావిభాగాభ్యాం క్రియమాణ మవస్థితమ్
స్వభావజ్ఞై శ్చ భావానాం దృశ్యన్తే శబ్దశక్తయః . 144

చ = ఎందువలన, భావానామ్ = పదార్థములయొక్క, స్వభావజ్ఞైః = స్వభావమును గురెరింగినవారిచే—అనగా అతీంద్రియ పదార్థములను గుర్తించెడి ఆర్షదృష్టికలవారిచే, శబ్దశక్తయః = శబ్దములయొక్క సామర్థ్యములు, అనగా పుణ్యపాపములను కలిగించెడి శక్తులు, అర్థమును బోధించెడి శక్తులు, దృశ్యన్తే = ప్రత్యక్షముగా జూడబడుచున్నవో;

(అతః = ఈ కారణమువలన), తద్ = ఆ వ్యాకరణము, విభాగావిభాగాభ్యామ్ = విభాగముచేతను, అవిభాగముచేతను-అనగా కొన్ని శబ్దములకు ప్రకృతి ప్రత్యయములను వేరుగా చూపుటచేతను, కొన్ని శబ్దములను అట్లుకాక సూత్రములలో స్పష్టముగా ఉచ్చరించుటచేతను, క్రియమాణమ్ = రచింపబడినదై, అవస్థితమ్ = సాధ్వసాధుశబ్దముల స్వరూపమును తెలుసుకొనుటకు ఉపయోగించుచున్నది.

తా. అతీంద్రియ ద్రష్టలగు మహానుభావులు శబ్దములందు అర్థబోధకతను, ధర్మజనకత్వమును ప్రత్యక్షముగా జూచి వ్యాకరణమూలమున ఆశబ్దములను లోకుల కందచేసిరి. వ్యాకరణాధ్యయనము వలన శబ్దములు తెలియబడగలవు. అవి అర్థబోధకము లగును. ధర్మజనకములు కూడ అగును.

వి. వ్యాకరణ నిర్మాణము రెండువిధములుగా నున్నది. 1. వ్యాకర్త ఏ శబ్దమునకు సాధుత్వము చూపదలచెనో, ఆ శబ్దము నుచ్చరించక ఆ శబ్దమునకు, తత్సజాతీయములకు ఎన్నియో మరికొన్ని శబ్దములకు సరిపడునట్లు సామాన్యాకారముగా సూత్రములను నిర్మించును. ఆ సూత్రార్థమునకు లక్ష్యములుగా నున్న శబ్దములన్నియు దాని మూలమున సాధువులగును. అవ్యాప్తి, అతివ్యాప్తి మున్నగు దోషములు లేకుండ ఆ సూత్రము నిర్మింపబడును. ఉదా : ఇకోయణచి 6-1-77 అచ్చు పరమగుచో ఇక్‌నకు యణ్ ఆదేశముగా అగునని సూత్రార్థము. సుధీ + ఉపాస్యః = సుధ్యుపాస్యః. ఇట్లే "ఉత్తునకు అచ్చుపరంబగునపుడు సంధియగు" అను సూత్రము బాలవ్యాకరణమున కలదు. (సంధి 1) రాముడు + అతడు = రాముడతడు. పై సూత్రములచే లెక్కించుటకు అలవికాని లక్ష్యములు సిద్ధింపగలవు. అదియొక పద్ధతి.

2. సూత్రము లట్లు వ్రాయక ఆ శబ్దములను ఆ సూత్రములలో స్పష్టముగా నుచ్చరించుట రెండవ పద్ధతి.

"కస్కాదిషుచ" - 8-3-48. కొన్నిచోట్ల సకారము, కొన్నిచోట్ల షకారము ప్రవర్తించును. కస్కః, సర్పిష్కుణ్డికా, ధనుష్కపాలమ్, ఇట్లే "వేధపురోధ పురోధసుడు" (తత్సమ 82) అను బాలవ్యాకరణ సూత్రము. వేధశ్శబ్దమునకు నిత్యముగా పురోధశ్శబ్దమునకు వైకల్పికముగా సకారలోప త్రిపద్యాపములు ఈ సూత్రముచే నిపతింపబడినవి.

పయిరీతిని వ్యాకరణము స్మృతి యనుటవలన ప్రమాణమని నిరూపించి శ్రుతి స్మృతులకుగల భేదమును జూపుచున్నాడు.

అనాది మవ్యవచ్ఛిన్నాం శ్రుతి మాహు రకర్తృకామ్
శిష్టై ర్నిబధ్యమానా తు న వ్యవచ్ఛిద్యతే స్మృతిః . 145

శ్రుతిమ్ = వేదమును, అకర్తృకామ్ = కర్త లేనిదానినిగాను - అనగా ఎవరిచేతను నిర్మింపబడనిదనియు, అనాదిమ్ = ఆది రహితమునుగాను - అనగా పుట్టుకలేనిదనియు, అవ్యవచ్ఛిన్నామ్ = విచ్ఛేదము లేనిదానినిగాను, ఆహుః = చెప్పుచున్నారు. వేదము అపౌరుషేయమనియు, ఉత్పత్తివినాశములు దానికి లేవనియు పూర్వమీమాంసకులు చెప్పుచున్నారని భావము.

స్మృతిః + తు = స్మృతి మాత్రము, శిష్టైః = శిష్టులచే, నిబధ్యమానా = ప్రతికాలమున నిర్మింపబడినదైనను, న + వ్యవచ్ఛిద్యతే = విచ్ఛిన్నమగునట్లు చేయబడునదికాదు.

తా. వేదములు బ్రహ్మయొక్క ముఖములనుండి అప్రయత్నముగా వెలువడినవి. వానికి ఎన్నడు నాశనములేదు. ఉత్పత్తియు లేదు. ప్రళయము, యుగప్రారంభము అనునవి లేనేలేవు. వేదములో వర్ణములు, పదములు, స్వరములు ఎన్నడును మారునవి కావు.

స్మృతు లట్టివి కావు. అవి మునులచే రచింపబడినవే. అవి అవిచ్ఛిన్నముగా ప్రవాహరూపమున నుండుటచే నిత్యములనియే పరిగణింపబడుచున్నవి.

ప్రళయము లేదని తలంచెడి పూర్వమీమాంసకమత మనుసరించి 145 వ శ్లోకమున శ్రుతి స్మృతులకు కల భేదమును చూపి 146 వ కారికచే ప్రలయమును అంగీకరించెడి వారి మతమును అనుసరించి వానికి కల భేదమును చూపుచున్నాడు.

అవిభాగా ద్వివృత్తానా మఖిఖ్యా స్వప్నవ చ్ఛ్రుతౌ
భావతత్త్వం తు విజ్ఞాయ విజ్ఞైర్భో్ విహితా స్మృతిః . 146

అవిభాగాత్ = విభాగములేని శబ్ద బ్రహ్మమునుండి, వివృత్తానామ్ = వివర్తమగుచున్న ఋషులకు, శ్రుతౌ = వేదవిషయికమగు, అభిఖ్యా = జ్ఞానము, స్వప్నవత్ = స్వప్నముతో సమానమైనదై యున్నది. స్వప్నమున ఇంద్రియముల అపేక్ష లేకుండగనే జ్ఞానము కలుగునట్లు, బ్రహ్మకు ప్రతినిధులగు ఋషీశ్వరులకు స్వతః వేదము భాసించును. వారల కుపదేశాపేక్ష లేదని భావము.

స్మృతిః + తు = స్మృతి అయితే, భావతత్త్వమ్ = వేదార్థముయొక్క సామర్థ్యమును, విజ్ఞాయ = ఆర్షదృష్టిచే తెలిసికొని, లిఙ్గేభ్యః = వైదికశబ్దములనుండియే, విహితా = రచియింపబడినది.

తా. విభాగములేకుండ ఏకరూపముగా శబ్దమే ముందుగా ఉండెడిది. ప్రలయము తరువాత ఆ శబ్దమునుండి ఋషులు ప్రాదుర్భవింతురు. మనుష్యులకు స్వప్నమున చూచుటకు కన్ను, వినుటకు చెవి లేకున్నను ఇంద్రియముల నపేక్షించకయే మానసికజ్ఞానము కలుగుచున్నది. అట్లే ఋషులకుగూడ ఇతరుల ఉపదేశ మక్కరలేకుండగనే వేదములు మానసజ్ఞానవిషయము లగుచున్నవి.

యుగప్రారంభమున పరమేశ్వరుని నిశ్వాసరూపమున వేదము లావిర్భవించును. ప్రళయమున నవి నశించును. ప్రళయము శాస్త్రసమ్మతము.

స్మృతులు శ్రుతుల అర్థము ననుసరించి ఋషులచే నిర్మింపబడినవి.

వి. సృష్టిప్రలయముల నంగీకరించెడి ఉత్తరమీమాంసక మతముల ననుసరించి వేదప్రామాణ్యమును ఈ శ్లోకము చూపుచున్నది.

పయిరీతిని శ్రుతి—స్మృతుల స్వరూపమును ప్రామాణ్యమును జూపి ఇతర స్మృతులతో వ్యాకరణ స్మృతికి సామ్యమును చూపుచున్నాడు.

కాయవాగ్బుద్ధివిషయా యే మలాః సమవస్థితాః
చికిత్సాలక్షణాధ్యాత్మశాస్త్రై స్తేషాం విశుద్ధయః . 147

కాయ వాగ్ బుద్ధి విషయాః = శరీరమునకు, వాక్కునకు, మనస్సునకును విషయములగు- అనగా వానియందు, యే = ఏ, మలాః = మలములు, సమవస్థితాః = ఉన్నవో, తేషామ్ = వానికి, చికిత్సాలక్షణాధ్యాత్మశాస్త్రైః = వైద్యకశాస్త్రముచేతను, వ్యాకరణశాస్త్రముచేతను, యోగశాస్త్రముచేతను, విశుద్ధయః = విశిష్టములగు పారిశుద్ధ్యములు, (భవన్తి = కలుగుచున్నవి).

తా. భుజించిన పదార్థముల పరిణామమువలన, దేశకాల పరిస్థితులవలనను శరీరమునకు రోగములు కలుగును. సౌఖ్యము నపేక్షించి యపశబ్దములను ప్రయోగించగా వానిదోషములు వాక్కునకు సంక్రమించును. మనస్సునకు భ్రమ, వంచన, ప్రమాదము, రాగము, ద్వేషము, లోభము మున్నగు దోషములు కలుగును. వానినే మలము లందురు. అవి యున్నచో బుద్ధి కలుషితమై వస్తువుయొక్క నిజరూపమును గ్రహింపనేరదు.

చరక సుశ్రుతాది వైద్యకగ్రంథముల అర్థమును పరిశీలించి, వానిలో చెప్పిన ప్రకారము ఆచరించిన శరీరమునకు సంబంధించిన రోగములు నశించును. అట్టి కార్యజ్ఞానము ఆ శాస్త్రమువలన కలుగుచున్నది.

యోగశాస్త్రముయొక్క అర్థపరిశీలనచేసి దానిప్రకారము నడచిన మనస్సునకు కలిగిన దోషములు పోవుచున్నవి. ఆ శాస్త్రమువలన ఆ లాభము కలుగుచున్నది.

పయిరీతిని వైద్యశ యోగ శాస్త్రము లెట్లు శరీరముయొక్కయు మనస్సు యొక్కయు దోషములను పోగొట్టుచున్నవో అట్లే వ్యాకరణశాస్త్రముకూడ వాక్కులయొక్క మాలిన్యమును పోగొట్టుచున్నది. అపశబ్దములే వాక్కుల మాలిన్యములు.

ఇతరస్మృతుల వలె వ్యాకరణస్మృతియు కార్యకారి యగుటచే తత్సామ్యమును పొందుచున్నది.

ధర్మమునకు సాధువులగు శబ్దములు కారణమని ఇంతవరకు నిరూపించి, ఆ ప్రసంగ మున ప్రయోగింపరాని అసాధుశబ్దములను 9 శ్లోకములచే చూపుచున్నాడు.

శబ్దః సంస్కారహీనో యో గౌరితి ప్రయుయుక్షితే
త మపభ్రంశ మిచ్ఛన్తి విశిష్టార్థనివేశినమ్. 148

గౌః + ఇతి = గౌః అనురీతిని, ప్రయుయుక్షితే = ప్రయోగింపవలచియుండగా, అట్టుకాక, యః = ఏ, శబ్దః = శబ్దము (గోణీ వంటిది), సంస్కారహీనః = వ్యాకరణ సంస్కారముచే శూన్యమైనది యగునో, విశిష్టార్థ నివేశినమ్ = అర్థవిశేషమున ప్రయోగింప బడిన, తమ్ = అట్టిదానిని, అపభ్రంశమ్ = అపభ్రంశ శబ్దమునుగా, ఇచ్ఛన్తి = శిష్టులంగీక రించుచున్నారు. అట్టిది అసాధుశబ్ద మని భావము.

తా. వ్యాకరణమున ఏ కార్యములు శబ్దములకు చూపబడినవో వానిని విడనాడి యున్న శబ్దము అసాధువగును. ఉదా: గౌః అను పదము వ్యాకరణప్రక్రియానుసారముగా నిబద్ధమైయున్నది. ఇది సాధువు. ఈ ప్రక్రియకు వ్యతిరేకముగా ఆ శబ్దమును ప్రయోగించిన అసాధువే. గావీ, గోణీ, గోతా మున్నగునవి ఇట్టివి. ఈ శబ్దములు గోవు అను నర్థమున అసాధువులు. వానిలో గోణీ, గోతా శబ్దములు అర్థాంతరమును బోధించునపుడు ఆ ఆనుపూర్వీ సహితములే సాధువులు కానగును. ఈ యంశము 119 వ శ్లోకమున స్పష్టము కాగలదు.

148 వ శ్లోకమున ''విశిష్టార్థనివేశినమ్''= అర్థవిశేషమున ప్రయోగింపబడినది అపభ్రంశము అని చెప్పబడినది. దానిని బట్టి చూచిన ఒకే శబ్దము ఒక అర్థమున అపభ్రంశ మనియు, మరియొక అర్థమున సాధువు అనియు లభించుచున్నది. ఈ యభిప్రాయమునే ఉదాహరణము జూపుచు స్పష్టపరచుచున్నాడు.

అస్వగోణ్యాదయః శబ్దాః సాధవో విషయాన్తరే
నిమిత్తభేదా త్సర్వత్ర సాధుత్వం చ వ్యవస్థితమ్. 149

అస్వగోణ్యాదయః = అస్వ, గోణీ మున్నగు, శబ్దాః=శబ్దములు, విషయాన్తరే= అర్థాంతరమున, సాధవః = సాధువులగును. నిమిత్తభేదాత్ = శబ్దముల ప్రవృత్తి నిమిత్తము యొక్క భేదమువలన, సర్వత్ర = అంతట అనగా కోశవ్యాకరణాదులకు సమ్మతమగు శబ్దమునందు, సాధుత్వం + చ = సాధుత్వముగూడ, వ్యవస్థితమ్ = నియతమై యున్నది.

తా. గుఱ్ఱము అను నర్థమున 'అశ్వ' పదము అశ్వత్వ జాతినిబట్టి ప్రవృత్తమై సాధువగును. ఆ యర్థమున 'అస్వ' పదము సాధువు కాదు. ఆ పదము ధనములేనివాడు అను నర్థమున సాధువు కాగలదు. న విద్యతే, స్వం = ధనం యస్య-సః = అస్వః. ఇచట ధనా భావమును బట్టి అస్వశబ్దము ప్రవర్తించినది. అస్వశబ్దము సర్వాత్మనా అసాధువని చెప్పరాదు.

గోపదము గోత్వజాతిని బట్టి గోవును కిరణమును బోధించును. ఆ యర్థమున గోణీ శబ్దము అసాధువు. ధాన్యము, బియ్యము మున్నగు వస్తువులను భద్రపరచే నిమిత్తము వాడబడుచున్న గోనె అను నర్థమున సాధువే యగును.

గోశబ్దమునకు పర్యాయ పదముగా గోతాశబ్దము అసాధువు. 'గోః భావః' అను నర్థమున అది సాధువే యగును.

పై పదములు ఒక యర్థమున నసాధువులైనను అర్థాంతరమున సాధువులగు చున్నవి. ఈ యర్థమునే "విశిష్టార్థనివేశినమ్" అను పదముచే 148 వ శ్లోకమున భర్తృహరి స్పష్టపరచెను.

వి. సంస్కృతమున మిత్ర శబ్దము పుంలింగమున, నపుంసకలింగమున గూడ ఉన్నది. మిత్రః, మిత్రమ్. పులింగశబ్దము సూర్యుని, నపుంసక శబ్దము స్నేహితుని బోధించునపుడే సాధువగును. ఇట్టి శబ్దములు చాల కలవు.

వ్యాకరణ సంస్కారమునకు దూరమగు శబ్దములు ఏ యర్థమును బోధించినను అసాధువులే యగును. ఉదా: శర్వర్యాం భవం=శార్వరికమ్, రాత్రియందుండునది యని యర్థము. శార్వరమ్ అను పదము సాధువు కానేరదు.

147 నుంచి 3 శ్లోకములచే అపభ్రంశములు కూడ అర్థబోధకములే, కాని అవి సాధువులు కానేరవు అని ప్రతిపాదింపబడినది. ఆ ప్రసంగమున 150 వ శ్లోకమునుండి 5 శ్లోకములచే తార్కికుల మతమును జూపుచున్నాడు.

తే సాధు ష్వనుమానేన ప్రత్యయోత్పత్తిహేతవః
తాదాత్మ్య ముపగమ్యేవ శబ్దార్థస్య ప్రకాశకాః . 150

తే = ఆ యపభ్రంశ శబ్దములు, సాధుషు = సాధుశబ్దముల విషయమై- అనగా ఆ శబ్దములకు బదులుగా ప్రయోగింపబడినవై, అనుమానేన = సాధుశబ్దస్మరణముచే, ప్రత్యయోత్పత్తిహేతవః = జ్ఞానోత్పత్తికి కారణములగుచున్నవి.

(తే = ఆయసాధుశబ్దములు), తాదాత్మ్యమ్ = సాధు శబ్దములతో నైక్యమును, ఉపగమ్య + ఇవ = పొందినట్టు ఉండి, శబ్దార్థస్య = శబ్దమువలన కలిగెడి యర్థమునకు, ప్రకాశకాః = ప్రకాశమును కలిగించుచున్నవి.

తా. సాధుశబ్దములనుండి అపభ్రంశ శబ్దములు జనియించుచున్నవి. అసాధు శబ్దము లర్థబోధకములు కానేరవు. వానియందు శక్తి లేదు. సాధుశబ్దములే శక్తములు. శక్తపదమే సాధువు కానగును. అసాధుశబ్ద ముచ్చరించగా దానికి ప్రకృతియగు సాధు శబ్దము స్మరింపబడును. ఆ సాధుశబ్దమే అర్థబోధకమగును. అసాధుశబ్దము సాధుశబ్దముతో సమానరూపముతో నన్నందున తాదాత్మ్యమును పొందియున్నట్లు కాన్పించును. ఇది తార్కికుల యాశయము.

వి. ఇచట అనుమానశబ్దము స్మరణార్థకము. అనుమానప్రమాణపరము కాదు. రెండు శబ్దములకు వస్తుతః ఐక్యము లేనందున 'ఇవ' శబ్దము ప్రయుక్తమాయెను.

148, 149 రెండు శ్లోకములచే వ్యాకరణమతము ననుసరించి యసాధు శబ్దములు విచారింపబడినవి. అపభ్రంశములే సాక్షాత్ అర్థమును బోధించును. వానియందు

గూడ శక్తియున్నది. కాని యవి సాధువులు కావు. సాధుత్వమనునది వ్యాకరణైకగమ్యమగు జాతివిశేష మని వైయాకరణులు విశ్వసింతురు.

150 నుండి 5 శ్లోకములలో తార్కికుల మతము ననుసరించి వానిని విచారించుచున్నాడు.

తార్కికుల మతమున విశేషమును జూపుచున్నాడు.

న శిష్టై రనుగమ్యన్తే పర్యాయా ఇవ సాధవః
తే యతః స్మృతిశాస్త్రేణ తస్మా త్సాక్షా దవాచకాః . 151

సాధవః = సాధువులగు, పర్యాయాః + ఇవ = పర్యాయశబ్దములవలె, తే = ఆ యసాధుశబ్దములు, యతః = ఏకారణమువలన, శిష్టైః = శిష్టులగువారిచే, న + అనుగమ్యన్తే = అనుసరింపబడుట లేదో, మరియు స్మృతిశాస్త్రేణ = వ్యాకరణ శాస్త్రముచే, (న + అనుగమ్యన్తే = అనుసరింపబడలేదో), తస్మాత్ = ఆ కారణమువలన, సాక్షాత్ = సాక్షాత్తుగా, అవాచకాః = అర్థబోధకములు కావు.

తా. సాధువులగు పర్యాయశబ్దములతో పాటు అపభ్రంశములు గూడ పర్యాయ పదములుగా ఏల గ్రహింపబడవు? అట్టితరి అవియు వాచకములే యగునుగదా! అను సంశయమును ఈ శ్లోకార్థము తీర్చుచున్నది. అపభ్రంశములను శిష్టులు సాధుశబ్దములతో పాటు ఉపయోగించి యుండలేదు. వానిని వ్యాకరణశాస్త్రము కూడ వ్యాఖ్యానించలేదు. అట్లుకాక అపభ్రంశములుకూడ వాచకములగుచో వానిని శిష్టులు పర్యాయపదములతో పాటు ఉపయోగించియుండెడివారు. వ్యాకరణము కూడ వానికి ప్రకృతి ప్రత్యయ విభాగము చూపి వ్యాఖ్యానించి యుండెడిది. అట్లు జరగకుండుటచే అవి వాచకములు కావనియే తేలుచున్నది.

వి. కాబట్టి యవి సాక్షాత్తుగా అర్థబోధకములు కావు. సాధుశబ్దమును స్మరియింపజేసి వానిద్వారా అర్థబోధకములగు చున్నటయే సమంజసము.

150 వ శ్లోకమున అసాధువుచే సాధుశబ్దస్మృతి కలుగును. దానిచే అర్థబోధ కలుగును అని చెప్పబడినది. అందుకు దృష్టాంతమును చూపుచున్నాడు.

అమ్బామ్బేతి యథా బాలః శిక్ష్యమాణః ప్రభాషతే
అవ్యక్తం తద్విదాం తేన వ్యక్తే భవతి నిర్ణయః . 152

అమ్బా + అమ్బా + ఇతి = అంబ, అంబ అని, శిక్ష్యమాణః = తల్లి మొదలగు వారిచే సభ్యాసము చేయించబడుచున్న, బాలః = చంటివాడు, అవ్యక్తమ్ = అస్పష్టముగా, ప్రభాషతే = పలువిధములుగా మాట్లాడును. తద్విదామ్ = ఆ చంటివాని యస్పష్టములగు వాక్కుల పరిచయము కలవారికి, తేన = ఆ చంటివాడుచ్చరించిన యస్పష్టమగు మాటచే, వ్యక్తే = స్పష్టమగు శబ్దము జ్ఞాపకము రాగా, యథా = ఏరీతిగా, నిర్ణయః = ప్రకృత నిశ్చితార్థము, (భవతి = కలుగుచున్నదో), (ఈ శ్లోకమునకు 153వ శ్లోకార్థముతో సమన్వయము చూపవలెను).

తా. 1, 2 సంవత్సరముల ప్రాయముకల చంటివానికి మాటలు చెప్పుదురు. వానిని విని చంటివాడు అవయవ బలము చాలక అస్పష్టముగా మాట్లాడును. తల్లిదండ్రులు

మున్నగు వారు ఆ పిల్లవాని మాటలు విని వానివలన తమకు భాసించిన స్పష్టశబ్దముల వలన ప్రకృతార్థమును నిర్ణయింతురు. అంతియేకాని చంటివాని మాటలవలననే వారికి జ్ఞానము కలుగనేరదు.

పై దృష్టాంతమునకు దార్ష్టాంతికమును చూపుచున్నాడు.

ఏవం సాధౌ ప్రయోక్తవ్యే యోఽపభ్రంశః ప్రయుజ్యతే
తేన సాధువ్యవహితః కశ్చిదర్థోఽభిధీయతే. 153

ఏవం = ఈ ప్రకారముగానే, సాధౌ = సాధుశబ్దము, ప్రయోక్తవ్యే = ప్రయోగింప వలసి యుండగా, దానికి బదులుగా, యః = ఏ, అపభ్రంశః = అసాధుశబ్దము, ప్రయుజ్యతే = ప్రయోగింపబడుచున్నదో, తేన = ఆ అసాధుశబ్దముచే, సాధువ్యవహితః = సాధు శబ్దముతో వ్యవధానము కల, కశ్చిత్ = ఒక - అనగా ప్రకృతమగు, అర్థః = అర్థము, అభిధీయతే = చెప్పబడుచున్నది.

తా. సాధు శబ్దమే అర్థబోధకము. అది ప్రయుక్తము కాక దానియర్థమున నసాధు శబ్దమును ప్రయోగించిన నా శబ్దము అర్థవాచకము కాదు. దానిచే సాధుశబ్దము స్మరణకు వచ్చి దాని ద్వారా అర్థజ్ఞానము కలుగును. ఈ యర్థమునకు 152 వ శ్లోకమున చంటివాని మాటలు దృష్టాంతముగా చూపబడినవి.

వి. కాగా 150 వ శ్లోకార్థమే దృష్టాంతముతో 152, 153-రెండు శ్లోకములచే స్పష్టపరుపబడినది.

అసాధు శబ్దమును ఉచ్చరించగా దానిచే సాధుశబ్దము స్మరింపబడి అర్థబోధను కలిగించుననుట సార్వత్రికము కానేరదు. ఏలయన సాధుశబ్దములను ఎరుగనివారు కొందరు పరస్పరము మాట్లాడుట లోకమున కలదు. వారికి పరస్పరము భావములు అవగతములు అగుచునే యున్నవి. వారికి సాధుశబ్దము తెలియనే తెలియదు. అను సంశయమునకు సమాధానముగా "తాదాత్మ్యము పగమ్యైవ శబ్దార్థస్య ప్రకాశకాః" అను 150 వ కారికా భాగము కక్క అభిప్రాయమును వ్యక్తపరచుచున్నాడు.

పారమ్పర్యా దపభ్రంశా విగుణే ష్వభిధాతృషు
ప్రసిద్ధి మాగతా యేషు తేషాం సాధు రవాచకః. 154

విగుణేషు = విగుణులగు - అనగా శబ్దములను స్పష్టముగా నుచ్చరించుటకు యోగ్యములగు దంతాదిస్థానబలములేనట్టి, అభిధాతృషు = శబ్దముసుచ్చరించునట్టి, యేషు = ఏమనుష్యులందు, పారమ్పర్యాత్ = పరంపరగా, అపభ్రంశాః = అసాధు శబ్దములు, ప్రసిద్ధిమ్ = ప్రసిద్ధిని, ఆగతాః = పొందినవో, తేషామ్ = వారలకు, సాధుః = సాధుశబ్దము, అవాచకః = వాచకము కాదు. అట్టివారికి అసాధుశబ్దమే సాక్షాత్తు అర్థబోధక మగును దాని వలన సాధుశబ్దము స్మరింపబడి, దాని వలన నర్థబోధ కలుగదని భావము.

తా. దంతములు మున్నగునవి శిథిలము కాగా మనుష్యుల ఉచ్చారణము స్పష్టముగా నుండదు. ఒక వర్ణమునకు బదులుగా మరియొక వర్ణము పలుకుటయు, కొన్ని వర్ణములు వినబడక యుండుటయు మున్నగు ఎన్నియో దోషములు కలుగును. వాని మూలమున అసలు శబ్దస్వరూపము మారిపోవును. అట్టివారు మాట్లాడగా ఇతరులు వానిని విని

అవియే యథార్థములగు శబ్దములని భావింతురు. అట్టివానిని పరంపరగా అందరు వ్యవహరింతురు. అట్టి స్థితిలో అసాధుశబ్దమే సాక్షాత్తు అర్థబోధకము కాగలదు. సాధుశబ్దస్మరణ అక్కరలేదు.

మరియు చాలమంది సాధుశబ్దములు తెలియకయే అసాధు శబ్దములతోనే మాట్లాడుదురు. అచట కూడ సాధుశబ్ద స్మరణ లేకుండగనే బోధ కలుగును.

150 నుంచి ఇంతవరకు అపభ్రంశములవలన బోధ కలుగుట గురించి తార్కికుల యభిప్రాయమును వ్యక్తపరచి ఇపుడు వైయాకరణ మతము ప్రకారము సాధు శబ్దముల యొక్కయు, అసాధుశబ్దముల యొక్కయు విభాగమును జూపుచున్నాడు.

దైవీ వాగ్ వ్యవకీర్ణేయ మశక్తై రభిధాతృభిః

అనిత్యదర్శినాం త్వస్మిన్ వాదే బుద్ధి విపర్యయః. 155

దైవీ = దేవతలకు సంబంధించియున్న, ఇయమ్ = వ్యాకరణ బద్ధమగు, వాక్ = శబ్దము, అశక్తైః = ఉచ్చరించుటకు ఇంద్రియసామర్థ్యము లేని, అభిధాతృభిః = ఉచ్చరించెడి వారిచే, వ్యవకీర్ణా = మిక్కిలి సంకీర్ణమైనదిగా, (కృతా = చేయబడినది).

తా. పూర్వము అసత్యము, అశక్తత మున్నగు దోషములు లేనంత మనుష్యులందరు పరిశుద్ధముగా నుండెడివారు. రాను రాను వారు అసత్యాది దోషములను పొందినారు. వారి భాషయు అపశబ్దసంకీర్ణ మాయెను. కాగా శుద్ధమగు భాష అపభ్రంశములతో సంకీర్ణమాయెను.

అనిత్యదర్శినామ్ + తు = శబ్ద మనిత్యమనెడి వారికి - అనగా తార్కికులకు, అస్మిన్ = ఈ, వాదే = పై చూపబడిన అర్థము విషయమున, బుద్ధి విపర్యయః = బుద్ధికి వైపరీత్యము - అనగా వారికి అభిప్రాయము భిన్నముగా నున్నది.

తా. శబ్దము నిత్యము కానేరదు. సాధు శబ్దములు ధర్మజనకములు కావు. అవి కేవలము అర్థబోధనకే ఉపయోగపడును. అసాధువులే ముందుగా నుండెడివి. వానిని సంస్కరింపగా సాధు శబ్దములు లభించినవి. కావున అసాధువుల నుచ్చరించగా సాధుస్మరణముచే బోధ కలుగునని తార్కికుల యాశయము.

"బుద్ధి విపర్యయః" అనుటచే వారి యాశయము గ్రాహ్యము కాదను భావము లభించుచున్నది.

సాధుశబ్దాపశబ్దములు రెండును స్వతంత్రములే. వాని: పరస్పరము ప్రకృతి వికృతి భావము లేదు. మరియు రెండు కూడ పరంపరగా వచ్చుచున్నవను తన యాశయమును స్పష్టపరచుచున్నాడు.

ఉభయేషా మవిచ్ఛేదా దన్యశబ్ద వివక్షయా

యోఽన్యః ప్రయుజ్యతే శబ్దో న సోఽర్థ స్యాభిధాయకః. 156

ఇతి వాకపదీయే బ్రహ్మకాణ్డం సమాప్తమ్.

ఉభయేషామ్ = రెండు - అనగా సాధుశబ్దములు అసాధుశబ్దములు కూడ, అవిచ్ఛేదాత్ = పరంపరగా అవిచ్ఛిన్నముగా నుండుటవలన, అన్యశబ్ద వివక్షయా = ఒక శబ్దమును ప్రయోగించు ఇచ్ఛచే, యః = ఏ, అన్యః = మరియొక, శబ్దః = శబ్దము, ప్రయుజ్యతే =

ప్రయోగింపబడుచున్నదో, సః = ఆ శబ్దము అర్థస్య = ప్రయోగింప దలచిన శబ్దము యొక్క అర్థమునకు, అభిధాయకః = బోధించునది, న = కానేరదు.

తా. అపశబ్దము నుచ్చరించగా నా శబ్దముచే సాధుశబ్దము స్మరింపబడి యర్థ బోధకమగు ననెడి తార్కికుల మత మయుక్తమే యని భావము.

ఇంతటితో బ్రహ్మకాండ మనబడు ప్రథమకాండము ముగిసినది.

1—43 శ్లోకములలో వ్యాకరణ శాస్త్రారంభమును సమర్థించుటకై విషయ ప్రయోజన సంబంధాధికారి రూపమగు అనుబంధ చతుష్టయము చూపబడినది. ప్రధాన ప్రయోజనమగు మోక్షమును బొందుటకై నిర్గుణ బ్రహ్మస్వరూప నిర్ణయముతో గ్రంథ మారంభింపబడినది. కనుకనే ఈ కాండమునకు బ్రహ్మకాండము అను ప్రసిద్ధవ్యవహారము కలిగినది. కాగా ఈ భాగము ఉపోద్ఘాతముగా నున్నది. 44 నుండి శాస్త్రమారంభింపబడినది.

44—101 శ్లోకములలో నిత్యశబ్దవాదము ననుసరించి వాచక స్ఫోట శబ్దము, ధ్వనులు — రెంటికి కల వ్యంగ్య వ్యంజక భావము, అభివ్యక్తి ధ్వనుల స్వరూపము, ప్రాకృత వైకృత ధ్వనుల వలన స్ఫోటశబ్దమునకు కలిగెడి విశేషములు, జాతి—వ్యక్తి స్ఫోటపక్షములు నిరూపింపబడినవి.

102-117 శ్లోకములలో కార్యశబ్దవాదము నాశ్రయించి స్ఫోట శబ్దము, ధ్వనులు, శబ్దోత్పత్తికి కారణములు చూపబడినవి.

118—132 శ్లోకములలో శబ్దముయొక్క మాహాత్మ్యము, మోక్షము చూపబడినవి. 129 వ శ్లోకమునుండి 14 శ్లోకములలో శబ్దమునకు అవశ్యకత ప్రాబల్యము కూడ నిర్ణీత మాయెను. కనుకనే ఈ కాండమునకు "ఆగమ కాండము" అను వ్యవహారము కూడ కలిగినది.

133—147 శ్లోకములలో వేదార్థమూలకము లగుటచే స్మృతులు ప్రమాణములు. వానిలో నొకటి యగుటచే వ్యాకరణము ప్రమాణమని చూపబడినది.

148—156 శ్లోకములలో అసాధు శబ్దములు విచారింపబడినవి.

ఈ రీతిగా ఈ కాండముయొక్క విషయములు సూక్ష్మరూపమున తెలియనగును.

వాక్యపదీయము

వాక్య కాండము

"ఆగమ సముచ్చయ" మను బ్రహ్మకాండమందు శబ్దస్వరూపము—దాని జ్ఞానము వలన, ప్రయోగమువలన కలుగుఫలము—శబ్ద నిత్యత్వము—అనిత్యత్వము, సఖండత్వము అఖండత్వము నిరూపింపబడినవి. పదవాక్య సాధారణముగ శబ్దము వాచక మని అందు స్థాపింపబడినది. కాని కొందర మతమున పదము వాచకము (అర్థబోధకము). కొందర మతమున వాక్యము వాచకము. కాని సిద్ధాంతమున వాచకము వాక్యమే. అందుచే వాక్య స్వరూపమును విస్తరించి ప్రతిపాదించుటకు ద్వితీయ కాండము ఆరంభింపబడినది.

వాక్యస్వరూపము ఆయా ఆచార్యుల మతములలో ఎనిమిది విధములుగ నిరూపింపబడినది—అని నిర్దేశించుచున్నాడు.

ఆఖ్యాతశబ్దః సంఘాతో జాతిః సంఘాతవర్తినీ
ఏకోఽనవయవః శబ్దః క్రమో బుద్ధ్యనుసంహృతిః . 1

పద మాద్యం పృథ క్సర్వం పదం సాకాంక్ష మిత్యపి
వాక్యం ప్రతి మతి ర్భిన్నా బహుధా న్యాయవాదినామ్ . 2

ఆఖ్యాతశబ్దః = క్రియావాచకశబ్దము, (వాక్యము). సంఘాతః = పద సముదాయము, సంఘాతవర్తినీ జాతిః = సముదాయమునందుండు జాతి, ఏకః అనవయవః శబ్దః = ఏకము అఖండము అగు శబ్దము, క్రమః = పదముల పౌర్వాపర్యము, బుద్ధ్యనుసంహృతిః = బుద్ధిలో కల్పింపబడిన పదముల కూడిక, ఆద్యం పదమ్ = మొదటిపదము, పృథక్ సర్వం పదం సాకాంక్షమ్ = వేరుగా అన్నిపదములు ఆకాంక్షగలవి, వాక్యమ్ = వాక్యము, ఇత్యపి = అనియు, వాక్యం ప్రతి = వాక్యమునుగూర్చి, న్యాయవాదినామ్ = వాక్య విషయ చర్చాశీలురగు విద్వాంసులయొక్క, మతిః = మతము, బహుధా = అనేకవిధము లుగా, భిన్నా = భిన్నమై యున్నది.

తా. ఆ యా యాచార్యుల మతభేదము ననుసరించి వాక్యము ఎనిమిది విధము లుగ ఇందు నిర్దేశింపబడుచున్నది. వాక్యవిషయమున చర్చించిన ఆచార్యుల అభిప్రాయ ములు ఎనిమిది విధములుగ ఉన్నవి.

1. క్రియావాచకశబ్దము — వాక్యము
2. పదసముదాయము — ,,
3. సముదాయమునందుండు జాతి —
4. పూర్ణము-అఖండము (స్ఫోటరూపము) అగు శబ్దము — ,,
5. పౌర్వాపర్యముతో నున్న పదములు — ,,

6. బుద్ధిలో కల్పింపబడిన పదముల సక్రమమగు కూడిక   వాక్యము
7. (వాక్యములో) మొదటిపదము ,,
8. (వాక్యములోని) ప్రతిపదము పరస్పరాకాంక్ష గలిగియుండునది ,,

వి. వాక్యము (1) అఖండము-అనగా పదవర్ణరూప విభాగములేనిది-స్ఫోటము, (2) సఖండము అనగా పదవర్ణరూప విభాగము కలది, అని రెండు పక్షములు కలవు.

పై ఎనిమిది వాక్యలక్షణములలో, 3. సముదాయవర్తిజాతి వాక్యము. 4. ఏకము-అఖండమునగు శబ్దము వాక్యము, 6. బుద్ధియందు ఏర్పడిన పదసముదాయము వాక్యము. అను మూడును అఖండపక్షమునకు చెందినవి. మిగిలిన 1, 2, 5, 7, 8 మతములు సఖండ పక్షమునకు చెందినవి. ఈ అయిదింటిలో 2. పదసముదాయము, 5. పౌర్వాపర్యముతో నున్న పదములు అను రెండుమతములు "అభిహితాన్వయవాదము"నకు చెందినవి. మిగిలిన మూడును "అన్వితాభిధాన వాదము"నకు చెందినవి.

"వాక్యములోని క్రియావాచకశబ్దమే వాక్యము". అను వారిమతమున కేవల క్రియాపదమే వాక్యమని తాత్పర్యము గాదు. కొన్నిచోట్ల కేవలక్రియాపదముకూడ వాక్యముగా నుండనగునని వారి యభిప్రాయము.

ఉదా॥ "మూయుము" అను క్రియను వాడినపుడు దానితో అన్వయించు కారకము నియతముగ భాసించుటచే కేవలక్రియాపదమును వాడినను సంపూర్ణముగ అర్థబోధ కలుగు చుండుటచే అదికూడ వాక్యమే.

"సుబంత తిఙంత పదసముదాయము వాక్యము" అనునది అందరకు అంగీకారనమే అయినను ఆ యా వ్యక్తుల ఉచ్చారణమున భిన్నమై, కాలముచే భిన్నమై ఒకే వాక్యము ప్రయోగింపబడునపుడు ఆ వాక్యములన్నియు ఏకరూపముగా ఉండుటచే ప్రత్యేకవాక్యములకు అర్థబోధకత్వము నంగీకరించుటకంటె అట్టి వాక్యములందుగల జాతి అర్థబోధకము-అని కొందరు చెప్పుటచే పదసముదాయము వాక్యము, సముదాయవర్తిజాతి వాక్యము అని రెండు పక్షము లేర్పడినవి.

వైయాకరణుల సిద్ధాంతమున అఖండమగు స్ఫోట మనబడు శబ్దమే వాక్యము.

మన ముచ్చరించునపుడు ఏనాదము వచ్చునో ఆ నాదముచే అభివ్యక్తమై అర్థమును ఇతరులకు భాసింపజేయు బుద్ధిమాత్ర గోచరమగు ఒకానొక శబ్దమే స్ఫోటము. దానిని అభివ్యక్తము చేయునది ధ్వని. ఈ స్ఫోటము రెండువిధములు. 1. బాహ్యము 2. ఆంతరము. బాహ్యము ఇతరుల శ్రవణేంద్రియముచే గ్రహింపబడును. ఆంతరము మనసుచే మాత్రమే గ్రహింపబడును. బాహ్యమగు స్ఫోటము 1. వ్యక్తి, 2. జాతిఅను భేదముచే ద్వివిధము. వ్యక్తి స్ఫోటము-ఏకః అనవయవః శబ్దః. ఇది పూర్ణము, అద్వితీయము, అఖండజ్ఞానస్వరూపము. కేవలవాక్యమే తప్ప పదపదార్థములు కల్పితములు అని వీరి సిద్ధాంతము. అట్లుకాక, ఆ స్ఫోటము పదరూపము అని కొంద రంగీకరించిరి. ఆ స్ఫోటరూపములగు పదవాక్యసముదాయములలోనున్న వర్తిజాతి అర్థబోధకముగా ఉండును. దీనినే జాతిస్ఫోటము అందురు. ఆంతరమగు స్ఫోటరూపమగు శబ్దము అర్థబోధకము అను పక్షమున బుద్ధిచే పరికల్పితములైన పదములకూడిక అర్థబోధకము. అదియే వాక్యము అను పక్షము వచ్చినది. ఇట్లు స్ఫోట వాదుల మతమున వాక్యస్వరూపము మూడువిధములుగా కన్పట్టుచున్నది.

ఇక సఖండపక్షమున రెండుమతములు కలవు, 1. అభిహితాన్వయవాదము, 2. అన్వితాభిధానవాదము.

1. "పదమే సంకేతముచే - లేదా శక్తిచే అర్థమును బోధించును. అట్లు పదముచే బోధింపబడిన పదార్థములకు అన్వయమును వాక్యము ప్రతిపాదించును" అనునది అభిహితాన్వయవాదము. మీమాంసకులలో భాట్టులు, నైయాయికులు అభిహితాన్వయ వాదమునే అంగీకరించిరి.

ఈ మతమున (1) పదసముదాయము వాక్యము (2) పూర్వాపర క్రమమున ఏర్పడిన పదములే వాక్యము అను రెండు పక్షములు ఆవిర్భవించినవి

2. అన్వితాభిధానవాదము—ప్రవృత్తి లేదా నివృత్తి అనునవియే వాక్యప్రయోజనములు. దానినే కార్యము అందురు. ఆ కార్యమునందు అన్వయించియే సర్వపదములు వాక్యమున ప్రయోగింపబడును. అందుచే "కార్యముతో అన్వయించిన - లేదా కార్యముతో అన్వయించిన వేరొక పదార్థముతో అన్వయించిన అర్థమునే పదము బోధించును" అనునది అన్వితాభిధానవాదము. ఈ మతము ననుసరించి ఆఖ్యాతశబ్దము వాక్యము, మొదటిపదము వాక్యము, సాకాంక్షమగు ప్రతిపదము వాక్యము అను మూడు పక్షములు ఆవిర్భవించినవి. ఈ మతమును మీమాంసకులలో ప్రాభాకరులు ఆదరించిరి.

అభిహితాన్వయ వాదమున పదము కేవలము అర్థమును బోధించును. వాక్యము ఆ పదార్థములకు గల సంసర్గమును అనగా అన్వయమును బోధించును. అన్వితాభిధానవాదమున వేరొకదానితో అన్వయించిన అర్థమునే పదము బోధించును. వాక్యము అన్వయమును బోధింపదు. విశేషసంబంధములను మాత్రము బోధించును.

పైరీతిగా స్ఫోటవాదమున మూడు వాక్యలక్షణములును, అభిహితాన్వయవాదమున రెండు వాక్యలక్షణములును, అన్వితాభిధానవాదమున మూడు వాక్యలక్షణములును మొత్తము ఎనిమిది వాక్యలక్షణములు నిర్దేశింపబడినవి. ఇవి ప్రక్కపుటలోని పట్టికలో చూపబడినవి.

పై వాక్యలక్షణములను ముందు విపులముగా వివరింప బోవుచున్నారు. సంగ్రహముగా వాని స్వరూపము వివరింపబడుచున్నది.

1. ఆఖ్యాత శబ్దము వాక్యము.


క్రియావాచక పదము కారకములతో అన్వయించి ప్రవృత్తి నివృత్తిరూపమగు వాక్యార్థమును ప్రతిపాదించును. మిగిలిన పదములు ఆ అర్థమును ఇతరవాక్యార్థములకంటె విలక్షణమని తెలియజేయగల సంస్కారమును గలిగించును.

2. పదసంఘాతము వాక్యము.

పదముల పరస్పరాన్వయము వాక్యముచే బోధింపబడును. అట్లు బోధించు పదసముదాయమే వాచకము.

3. పదసంఘాతవర్తి జాతి వాక్యము.

''దేవదత్తః కఱ్ఱతో గోవును తోలి తెమ్ము'' అను వాక్యమును ఉచ్చరించునపుడు ధ్వని విశేషములగు వర్ణములు అనిత్యములు, క్రమికములు నగుటచే ఏకకాలమున ఉండవు. అందుచే, ఆ ధ్వనులచే దేవదత్తాది పదములకంటె భిన్నమగు నిత్యము-అనవయవము అగు శబ్దము అభివ్యక్తమగును. అదియే వాచకము. అది జాతిరూపమగు స్ఫోటము.


వాక్యము
సఖండము
అఖండము (స్ఫోటము)
(వైయాకరణులు)
అభిహితాన్వయము
(నైయాయికులు, భాట్టమీమాంసకులు)
అన్వితాభిధానము
(ప్రాభాకర మీమాంసకులు)
బాహ్యము
అంతరము
బుద్ధ్యనుసంహృతిః
వ్యక్తి
ఏకః అనవయవః శబ్దః
జాతి
సంఘాతవర్తినీ జాతిః
సంఘాతః
క్రమః
ఆద్యం
పదమ్
పృథక్ సర్వం
పదం సాకాంక్షమ్
ఆఖ్యాతశబ్దః

4. ఏకము, అనవయవమునగు శబ్దము వాక్యము.

వర్ణములు - పదములు అసత్యములు. ఆ ధ్వనులచే అభివ్యక్తమగు నిత్యము, విభాగరహితము, ఏకమునగు స్ఫోటరూపమగు శబ్దమే వాచకము.

5. పదక్రమము వాక్యము.

వీరి మతమున వర్ణముల క్రమము పదము. పదములక్రమము వాక్యము. అదియే వాచకము.

6. బుద్ధియొక్క అనుసంహారము వాక్యము.

వ్యక్తముగా ఉచ్చరించినపుడు ఉండు క్రమము స్థిరమైనది కాదు; కనుక, అంతరాత్మ - అంతర్యామి అయి ప్రతిప్రాణియందును ఉండు ఒకానొక శబ్దతత్త్వము అక్షర చిహ్నములు లేకయే ఉన్నట్లుగను, పదవిభాగము లేకయే ఉన్నట్లుగను బుద్ధిలో ఏర్పడును. ఆ బుద్ధులచే ఏర్పడిన సంస్కారములచే కలిగిన స్మరణమే, నిత్యము - అనవయవము అగు వాక్యముగ ఉండి అర్థమునకు వాచకమగును. అదియే వాక్యము.

7. ఆద్యపదము వాక్యము.

ఏ పదము మొదట ప్రయోగింపబడునో అదియే వాక్యార్థమునకు వాచకము. దానిచేతనే మిగిలిన అర్థమంతయు సూచింపబడును. ఆ మొదట ప్రయోగింపబడిన పదము క్రియావాచకమైనను సరే; నామవాచకమైనను సరే. క్రియాకారకములు అవినాభావము కలవి కనుక వానిలో ఏ ఒకటి ప్రయోగింపబడినను దానికి సంబంధించిన అర్థాంతరమును గూడ తానే తెలియజేయును. మిగిలిన పదములు ఆ వాక్యార్థమునకు ఇతర వాక్యార్థములకంటె గల భేదమును స్పష్టముచేయుటకొరకు సాయపడును.

8. ప్రత్యేకము సాకాంక్షమగు ప్రతిపదము వాక్యము.

అన్యోన్యము అన్వయాపేక్షగల సర్వపదములు ప్రత్యేకము వాచకములే.

పై వాక్యలక్షణములే గాక వ్యాకరణశాస్త్రమున ఉపయోగపడుటకు వార్తికకారుడు చెప్పిన రెండు వాక్యలక్షణములును, లౌకికముగ ఉపయోగపడు మీమాంసకులు చెప్పిన ఒక వాక్యలక్షణమును గలవు.

1. అవ్యయములు, కారకములు, విశేషణములతో కూడిన క్రియావాచక శబ్దము వాక్యము.

2. ఒక తిఙంతము (క్రియావాచక శబ్దము) గలది వాక్యము అను రెండు లక్షణములును వార్తికకారుడు వ్యాకరణమున అనుదాత్తాదిస్వర కార్యముల సాధనకు ఉపయోగ పడునట్లు నిర్వచించెను.

3. ఒకే అర్థము కలిగియున్నది (క్రియలు ఒకటికంటె ఎక్కువగానున్నను) ఒక వాక్యము. వాక్యమునందు గల పదములు పరస్పరాన్వితములై ఏకార్థ ప్రతిపాదకము

1. ఆఖ్యాతం సావ్యయ కారక విశేషణం వాక్యమ్.
2. ఏకతిఙ్ వాక్యమ్.
3. అర్థైకత్వా దేకం వాక్యం సాకాంక్షం చేత్ విభాగే స్యాత్.

లగును. అందులో ఒకపదమును వేరుచేసినచో మిగిలిన పదసముదాయము ఆ పదముయొక్క అర్థమున ఆకాంక్షకలదియై యుండును.

ఈ లక్షణములన్నియు పదసముదాయము వాక్యము అను వాక్యలక్షణమున అంతర్భూతములగు నని గ్రహింపవలయును.

వాక్యలక్షణములను ప్రస్తావించు సందర్భమున ఆయా మతములలో వాక్యార్థము ఏది ? సంబంధ మేది ? అనికూడ తెలిసికొనవలెను. పైని పేర్కొనబడిన ఎనిమిది మతము లలో అఖండపక్షమునకు చెందిన మూడు లక్షణములలో వాక్యార్థము ప్రతిభ.

వాక్యము అఖండము. దానియందు పదముల విభాగము బుద్ధిచే కల్పితము. ఆ పదముల యర్థమును గ్రహించు సమయముననే దానికంటె భిన్నమగు అఖండమగు వాక్యార్థ ప్రతీతి ఈ అసత్యములగు పదార్థములచే అభివ్యక్తమగును. అట్లు భాసించు అఖండార్థ స్ఫురణమే ప్రతిభ.

మిగిలిన అయిదు లక్షణములలో ఆఖ్యాతశబ్దము వాక్యము అను మతమున వాక్యా ర్థము క్రియ. క్రియావాచక పదమును విన్నంతమాత్రముననే ఆ క్రియకు ఆశ్రయము, ఆక్రియకు సాధనము అగు పదార్థములతో అన్వయించిన ఇతరక్రియలకంటె భిన్నమయిన క్రియ వినువానికి స్ఫురించును. ఆ వాక్యమున ఉపయోగింపబడిన నామవాచక పదములు దానినే స్పష్టపరచుటకు సాయపడునవై యుండును.

ఇక పదసంఘాతము - లేదా పదముల క్రమము వాక్యము అను లక్షణములలో పదములే అర్థములకు వాచకములు. వానిచే బోధింపబడిన అర్థముల సంసర్గము-అనగా పరస్పరాన్వయము వాక్యార్థము.

అన్వితాభిధానవాదుల మతమున ఆద్యపదము, ప్రత్యేకము సాకాంక్షమగు ప్రతి పదము వాక్యము అను రెండు పక్షములలో ఇతర పదములయొక్క అర్థములతో అన్వ యించిన స్వార్థమునే పదము బోధించును. అందుచే ప్రతిపదము వాక్యమంతటి యొక్క అర్థమును తెలియజేయుచుండును. ఇట్లు ఒక పదముచేతనే వాక్యార్థము తెలియజేయబడు చున్నను ఇతర పదముల ఉచ్చారణ అస్ఫుటముగా ఉన్న ఆ అన్వయమును స్పష్టముగా వ్యక్తముచేయును. అందుచే వీరిమతమున పదార్థమే వాక్యార్థము. కొందరు ప్రయోజనము వాక్యార్థము అని అందురు. ఈ విధముగ ప్రతిభ, సంసర్గము, సంసర్గవశమువలన నిరా కాంక్షమైన సంపూర్ణమగు పదార్థము, పరస్పరాన్వితమగు పదార్థము, క్రియ, ప్రయోజనము అను ఆరును వాక్యార్థములుగా భావింపబడినవి.

ఇవికాక, విధి వాక్యార్థమని, నియోగము వాక్యార్థమని, భావన వాక్యార్థమని కొన్ని మతములు కలవు. కాని, ఇవి క్రియారూపములే కనుక వేరుగ పేర్కొనబడలేదు. ఆ క్రియ ప్రకృత్యర్థము అని వైయాకరణులు భావించగా ప్రత్యయార్థమని మీమాంసకులు భావించిరి. వైయాకరణుల మతమున క్రియ ధాత్వర్థము. మీమాంసకమతమున భావన ఆఖ్యాతార్థము. విధి, నియోగము అనునవి లిఙ్, లోట్, తవ్య ప్రత్యయములతో కూడిన వాక్యములందే కానవచ్చును గాన సామాన్య వాక్యలక్షణములందు వానిని పేర్కొన అవసరము లేదు.

ఇక బౌద్ధులు విజ్ఞానవాదులు. వీరికి వాక్యము వాక్యార్థము కూడ విజ్ఞానము యొక్క ఆకారవిశేషము. అనాదిగ వాక్యము విషయమున, వాక్యార్థవిషయమున గలిగిన భేదవాసనచే విజ్ఞానమునకు విభాగరహిత మైనదానికి విభాగమున్నట్లును రూపములేనిదానికి రూపమున్నట్లును భాసించును. ఆ విధముగ ఆరోపితమైన రూపముగల పదార్థములచే పదార్థ సముదాయ రూపమగు వాక్యార్థము భాసించును. ఇది నిర్విభాగమే అయ్యు విభాగము కలది వలె భాసించును. ఈ శాక్యసిద్ధాంతము నందలి వాక్యార్థము వైయాకరణ మతమునందలి ప్రతిభతో సమానమైనదే. అందుచే వేరుగా పేర్కొనబడ లేదు-ఇక వారిసిద్ధాంతమున వాక్యము వైయాకరణ మతమునందలి "ఆంతర స్ఫోటరూపమగు బుద్ధ్యనుసంహారము వాక్యము" అను లక్షణముతో తుల్యము. అందుచే ఆ లక్షణములు గూడ ఇందు అంతర్భూతములే;

నైయాయికుల మతమున పదములో ముందు ముందు వర్ణములు ఉచ్చరింపగనే నశించిపోయినను వానిస్మృతి చివరి వర్ణముయొక్క అనుభవముతో కలిసి జ్ఞానమున గోచరమగును. అదియే పదము. అట్లే వాక్యములో పూర్వపూర్వపదముల స్మృతితో కూడిన చివరి పదముయొక్క అనుభవములో గోచరమగు రూపమే వాక్యము. అట్లే వాక్యార్థములో పూర్వపూర్వ పదముల అర్థముల స్మృతితో చివరిపదముచే కలిగిన అర్థజ్ఞానమే వాక్యార్థము. ఈ పక్షము సంసర్గము వాక్యార్థము అను పక్షమున అంతర్భూతమగును. ఈ విధముగా వాక్యార్థములను తెలిసికొనిన తరువాత వాక్య వాక్యార్థములకు గల సంబంధమును పరిశీలింతము.

అనవయవము ఏకము స్ఫోటరూపము అను వాక్యము ప్రతిభారూపమగు వాక్యార్థమును ప్రతిపాదించుటలో అధ్యాసము సంబంధము-అనగా వాక్య వాక్యార్థములకు తాదాత్మ్యము సంబంధము. మిగిలిన పక్షములలో వాచకము వాక్యము, వాచ్యము వాక్యార్థము; కావున వాచ్యవాచకభావము-అనగా యోగ్యత సంబంధము.

ఇక బౌద్ధమతానుసారముగ విజ్ఞానవాదమున వాక్యార్థము విజ్ఞానరూపమే. వాక్యము విజ్ఞానరూపమే. ఆ వాక్యము వాక్యార్థమునకు కారణము. అందుచే వానికి గల సంబంధము కార్యకారణ సంబంధము.

సంసర్గము వాక్యార్థము అనువారిమతమున సంకేతము వాక్య వాక్యార్థములకు గల సంబంధము. కావున అధ్యాసము, వాచ్య వాచకభావము, కార్యకారణ భావము, సంకేతము అనునవి సంబంధములు.

వీనిలో వైయాకరణుల మతమున అఖండము, ఏకము, అనవయవము నగు స్ఫోట రూపమగు శబ్దమే వాక్యము. ప్రతిభయే వాక్యార్థము. అధ్యాసమే సంబంధము. వీనినే ఈ కాండమున ప్రతిపాదింతురు.

వార్తికకారుడు చెప్పిన లక్షణములకు మీమాంసకులు చెప్పిన వాక్యలక్షణమునకు సమన్వయము కుదురునా ? అను విషయమున చర్చచేయబడుచున్నది.

నిఘాతాదివ్యవస్థార్థం శాస్త్రే యత్పరిభాషితమ్
సాకాంక్షావయవం తేన న సర్వం తుల్యలక్షణమ్ . ౪

సాకాంక్షావయవమ్ = ఆకాంక్షగల పదములతో కూడినదై, విభాగము లేనప్పుడు ఆకాంక్షారహితముగా నుండు ఏకార్థ ప్రతిపాదకమగు పద సముదాయము వాక్యము అని

మీమాంసకులు చెప్పిన లక్షణము, నిఘాతాదివ్యవస్థార్థమ్ = నిఘాతము (అను దాత్త స్వరము), యుష్మదస్మదాదేశములు మొదలగునవి వచ్చుటలో వ్యవస్థను కల్పించుటకొరకు, శాస్త్రే = వ్యాకరణ శాస్త్రమందు, యత్ = ఏ వాక్యలక్షణములు రెండును, పరిభాషితమ్ = నిర్వచింప బడెనో, తేన = ఆ వాక్యలక్షణ ద్వయముతో, సర్వం, తుల్య లక్షణమ్ = పూర్తిగ సమాన లక్షణము కలది, న = కాదు.

తా. వ్యాకరణ శాస్త్రములో సమానవాక్యమునంచే నిఘాతము, యుష్మదస్మచ్ఛబ్దములకు వచ్చు ఆదేశములు రాదగును అను నియమము కలదు. దానికై శాస్త్రీయముగ వార్తికకారుడు వాక్యలక్షణమును నిర్వచించెను. ఆ లక్షణములు రెండు. ఒకటి: అవ్యయకారక విశేషణసహితమగు క్రియాపదము వాక్యము. రెండు: ఒకే క్రియాపదము గలది వాక్యము.

మీమాంసకులు అర్థైక్యమున్నచో ఒకే వాక్యమని నిర్ణయించిరి. "అయం దండః హర అనేన" "ఇది కఱ్ఱ, తెమ్ము దీనితో" "ఓదనం పచ, తవ భవిష్యతి" "అన్నమును వండుము, నీకు అగును" అను వాక్యములలో "అయం దండో హ రానేన" అనునది మీమాంసక మతము ననుసరించి ఏకార్థ ప్రతిపాదకమగుటచే ఏకవాక్యమే ; అట్లే "ఓదనం పచ తవ భవిష్యతి" అనునది కూడ ఏకవాక్యమే ; కాని, వైయాకరణ మతమున "అయం దండః-హర అనేన" అనునవి రెండు వాక్యములు. అవి రెండు వాక్యములగుటచే ఒకే వాక్యమునందు రావలసిన నిఘాతస్వరము 'దండః' అనుదానిలోని చివరి అకారమునకు 'హర' అను క్రియాపదము పరముగా ఉన్నను రాదు. తిఙంతము పరముగా ఉన్నప్పుడు అతిఙంతమునకు నిఘాతము ఏకవాక్యమున వచ్చును. ఇది ఏకవాక్యము కాదు గనుక తిఙంతము పరముగా ఉన్నను స్వరము రాదు. అట్లే "ఓదనం పచ, తవ భవిష్యతి" అనునవి వైయాకరణ మతమున రెండు వాక్యములు. ఏకవాక్యమైనప్పుడే తవ అనుదానికి 'తే' అను ఆదేశము వచ్చును. పైవాక్యములలో ఏవాక్యమునకు ఆ వాక్యముననే తిఙంతము లుండుటచే అవి ప్రత్యేకవాక్యములు కనుక నిఘాతముకాని, 'తే' అను ఆదేశము కాని రావు.మీమాంసకుల మతము ననుసరించి పైవాక్యములలో సామర్థ్యము అనగా ఏకార్థసంబంధము ఉండుటచే ఏక వాక్యత ఉండును. కాని, ఏకవాక్యత ఉన్నచో శాస్త్రీయముగ పై స్వరము, ఆదేశములు రాపలసివచ్చునని వైయాకరణ మతమున వానిని ఒక వాక్యముగ అంగీకరింపరు. అందుచే పై వాక్యలక్షణములు ఈ లక్ష్యములందు సమావేశపడవు.

ఇక, "నద్యా స్తిష్ఠతి కూలే" (నదియొక్క-ఉన్నది-ఒడ్డున),"శాలీనాం తే ఓదనం దాస్యామి" (శాలిధాన్యముల యొక్క - నీకు-అన్నమును - ఇచ్చెదను) అను వాక్యములలో వైయాకరణ మతము ననుసరించియు, మీమాంసకమతము ననుసరించియు గూడ ఏక వాక్యత ఉన్నది. వైయాకరణ సిద్ధాంతమున నిఘాతము - తే-మే ఆదేశములు, వచ్చుటకు ఏకార్థసంబంధము ఆవశ్యకముగాదు. ఏకవాక్యత ఆవశ్యకము. "నద్యాః" అను పదము యొక్క అర్థమునకు 'తిష్ఠతి' అనుపదము యొక్క అర్థముతో సామర్థ్యము లేదు. లేక పోయినను ఏకవాక్యము గనుక- ఒకే తిఙంతముకలది గనుక అచట నిఘాతము వచ్చును. అట్లే 'శాలీనాం-తే' అనువాని యర్థములకు కూడ సామర్థ్యములేదు. కాని ఏకతిఙంత ఘటిత మగుటచే ఏకవాక్యము గనుక 'తవ' - అనుదానికి 'తే' అను ఆదేశము వచ్చును. ఇట్లు

మీమాంసక సిద్ధాంతమున వాక్యలక్షణము అన్వయించినచోట శాస్త్రీయమగు వార్త్తికకార వాక్య లక్షణము కూడ కొన్నిచోట్ల సరిపడవచ్చును. కాని, వెనుక చూపిన ఉదాహరణములలో రెండు మతములవారి వాక్యలక్షణములు సరిపడవు. అందుచేత వార్త్తికకార మీమాంసక మతములందలి వాక్యలక్షణములు సర్వత్రతుల్యముగ సమావేశపడవు అని యెఱుంగనగును.

ప్రసంగవశమున మీమాంసకులు చెప్పిన వాక్యలక్షణమును చెప్పుచున్నాడు.

> సాకాంక్షావయవం భేదే పరానాకాంక్షశబ్దకమ్
> కర్మప్రధానం గుణవ దేకార్థం వాక్యమిష్యతే. 4

ఈ కారికకు మూలమగు మీమాంసకుల వాక్యలక్షణమును ప్రతిపాదించి తరువాత కారికార్థమును ప్రతిపాదింతును.

"అర్థైకత్వా దేకం వాక్యం సాకాంక్షం చే ద్విభాగే స్యాత్" విభాగే=వాక్యములోని పదములను వాక్యమునుండి తీసివేసినచో, సాకాంక్షం-స్యాత్-చేత్=ఆ వాక్యము ఆ పదముల అన్వయమును అపేక్షించునదిగా ఉన్నదైనచో, అర్థైకత్వాత్=ప్రయోజన మొకటిగా ఉండుటవలన, ఏకం-వాక్యం=ఆపదసముదాయము ఒకే వాక్యమగును.

"రాముడు అన్నమును వండుచున్నాడు" -అను వాక్యములో కర్తృపదమునుగాని, కర్మపదమునుగాని, క్రియాపదమునుగాని తొలగించినచో మిగిలిన పదములు ఆకాంక్షకలవిగా ఉండును. అవియన్నియు కలిసి ఒకే అర్థమును బోధించును. కావున అది ఒక వాక్యము. అట్టివాక్యములలో క్రియలు రెండున్నను ప్రతిపాదింపబడు అర్థము ఒకటే అయినచో ఏక వాక్యమగును. "చూడుము, గుఱ్ఱము పరుగెత్తుచున్నది" ఇది మీమాంసక సిద్ధాంతమున ఒక వాక్యమే.

ఇక, కారికకు ప్రతిపదార్థము చెప్పబడుచున్నది.

భేదే=ఒకపదమును వాక్యమునుండి వేరుచేసినచో, సాకాంక్షావయవమ్=సాకాంక్షములగు ఇతరపదములు కలదియు, పరానాకాంక్షశబ్దకమ్=అట్లు వేరుచేయనినాడు వాక్యములోని పదములకంటె ఇతరములగు పదముల ఆకాంక్షలేనిదియు, కర్మప్రధానమ్=క్రియాప్రధానమై యుండునదియు, గుణవత్=విశేషణములతో కూడినదియు, ఏకార్థమ్=ప్రయోజనైక్యము కలదియు నగు పదసముదాయము, వాక్యమ్=వాక్యముగ, ఇష్యతే=చెప్పబడుచున్నది.

తా. వాక్యములో నుండు పదములలో ఏపదమును తీసినను మిగిలినపదముల అన్వయము పూర్త్తికాకుండ ఉండునదియు, అన్నిపదములు కలిసియున్నచో వేరొకపదము యొక్క అపేక్షలేకయే సంపూర్ణముగ అర్థబోధ కలిగించునదియు, క్రియ ప్రధానముగా కల దియు, ఇతరపదముల అర్థమంతయు దానికి విశేషణముగనే అన్వయించునదియు, ఏక ప్రయోజన సంబద్ధమగునదియు నగు పదసముదాయము వాక్యము.

వార్త్తికకారుడు చెప్పిన అవ్యయ కారక విశేషణ సహితమగు క్రియాపదము వాక్యము-అను లక్షణము అవ్యాప్తి దోషము కలిగియున్నదని శంకించి సమాధానము చెప్పుచున్నాడు.

సంబోధనపదం యచ్చ తత్క్రియాయా విశేషకమ్
వ్రజాని దేవదత్తేతి నిఘాతోఽత్ర తథా సతి . 5

యచ్చ, సంబోధనపదమ్=“వ్రజాని దేవదత్తః” అను వాక్యములో “దేవదత్తః” అనెడి ఏ సంబోధనపదము కలదో, తత్=అది, క్రియాయాః=“వ్రజాని” అనెడి క్రియ యొక్క, విశేషకమ్=మిగిలిన క్రియలకంటె విశేషమును (భేదమును) బోధించునది. తథా, సతి=అట్లు ‘దేవదత్త’ అనునది కూడ విశేషణమగుటచే, అత్ర=ఈ “వ్రజాని దేవదత్త” అనుచోట, నిఘాతః=అనుదాత్తము సిద్ధించుచున్నది.

తా. వార్తికకారుడు చెప్పిన వాక్యలక్షణము ననుసరించి “వ్రజాని దేవదత్తః” అను వాక్యములో దేవదత్తః అనునది అవ్యయముగాని, కారకముగాని, విశేషణముగాని కాక పోవుటచే, వాక్యత్వము లేకపోవలసివచ్చును- అని శంకించి ఈ కారిక సమాధానము చెప్పు చున్నది.

విశేషణమనగా ఇతరమగు వానికంటె విశేష్యమునకుగల విశేషమును బోధించునది. “వెళ్ళుదును దేవదత్తః” అనునపుడు ‘దేవదత్తః’ అను సంబోధనపదము ఇతరులను సంబోధించి తాను వెళ్ళుటకంటె దేవదత్తు నుద్దేశించి చెప్పి వెళ్ళుటలో గల విశేషమును బోధించుచున్నది. “యజ్ఞదత్తః వెళ్ళుదును” అనునప్పుడు జరుగు గమనక్రియకంటె “దేవదత్తః వెళ్ళుదును” అనునప్పుడు జరుగు గమనక్రియ వేరైనదని ‘దేవదత్తః’ అను పదము తెలుపుచుండుటచే అది క్రియకు విశేషమును నిరూపించుచున్నది కావున విశేషణమే. ఆ విధముగ ‘వ్రజాని దేవదత్తః’ అనుచోట వాక్యత్వమునకు భంగములేదు. అందుచే ‘దేవదత్త’ అనువానికి అనుదాత్తస్వరము వచ్చుటకు అభ్యంతరములేదు.

వి. ‘వ్రజాని దేవదత్తః’ అనుచోట ‘దేవదత్త’ అనునది క్రియావిశేషణమని నిరూపింపబడినది గదా! క్రియావిశేషణము నపుంసకలింగములో ఉండవలెను, కర్మగా ఉండ వలెను. ఇది అట్లులేదు. అది విరుద్ధముకదా అని సందేహము కలుగవచ్చును.

క్రియావిశేషణములు రెండురకములు. సమానాధికరణములు- వ్యధికరణములు. అందు సమానాధికరణము అగు క్రియావిశేషణము “శోభనముగ జరుగుచున్నది” అనుచోటి “శోభనముగ” అనునది. ఇది క్రియకే విశేషణమై అన్వయించుటచే క్రియ ద్రవ్యవాచకము కాదు కనుక ఆ క్రియతో అన్వయించు శోభనశబ్దము నపుంసకలింగమును పొందినది. “దేవదత్తః వెళ్ళుదును” అనుచోట “దేవదత్తః” అనునది వ్యధికరణము. దేవదత్తునకు క్రియతో అన్వయములేదు. దేవదత్తునిచేత క్రియ సాధింపబడుటలేదు. వేరొకడు వెళ్ళుచు దేవదత్తుని సంబోధించి చెప్పి వెళ్ళుచున్నాడు. అందుచే దీనిని వ్యధికరణక్రియావిశేషణ మందురు. ‘శోభనముగ’ అనుదానిని సమానాధికరణ క్రియావిశేషణ మందురు. సమానాధి కరణ క్రియావిశేషణమే నపుంసకలింగమున ఉండును. వ్యధికరణము ఉండదు. కాని “దేవ దత్తః వెళ్ళుదును”అనుచోటిక్రియ“యజ్ఞదత్తః వెళ్ళుదును” “దేవదత్తః వచ్చెదను”అనుక్రియల కంటె విశిష్టమైనదని దేవదత్తశబ్దము తెలియజేయుచున్నది. కావున అదియు క్రియావిశేషణమే. ‘దేవదత్తః వ్రజాని’ ‘వ్రజాని దేవదత్తః’ అను వాక్యములకు అర్థము సమానమే అయినను ‘వ్రజాని దేవదత్త’ అను వాక్యమునే ఇచట గ్రహింపవలెను. ‘దేవదత్త’ అనుదానికి అను దాత్తస్వరము ‘వ్రజాని దేవదత్తః’ అనునపుడే వచ్చునుగాని ‘దేవదత్తః వ్రజాని’ అనునప్పుడు

రాదు. ఆ స్వరము ఏకవాక్యమైనప్పుడుగాని రాదు కనుక వ్రజాని 'దేవదత్త' అనునది ఏక వాక్యమనియు, స్వరము రావచ్చుననియు, వార్తికకారుడు చెప్పిన లక్షణమునకు అవ్యాప్తి లేదనియు ఎఱుంగనగును.

వార్తికకారుడు చెప్పిన లక్షణములో ఒకే క్రియాపదము కలది వాక్యము అన్నట్లు స్ఫురించు చుండుటచే "పూర్వం స్నాతి–పచతి తతో వ్రజతితతః" అనువాక్యము ఏకవాక్యము కాకపోవలసివచ్చును. అట్లు ఏకవాక్యతలేనిచో 'తతః' అనుదాని తర్వాతనున్న 'వ్రజతి' అనుదానికి నిఘాతము అనగా అనుదాత్తస్వరము రాకపోవును అని శంకించి సమాధానము చెప్పుచున్నాడు.

యథానేకమపి క్త్వాన్తం తిఙన్తస్య విశేషకమ్
తథా తిఙన్తం తత్రాహుః తిఙన్తస్య విశేషకమ్ . 6

యథా=ఏవిధముగ, అనేకమపి క్త్వాన్తమ్=అనేకములను క్త్వాప్రత్యయాంతము లను ప్రయోగించినను, 'స్నానముచేసి–వండికొని–భోజనముచేసి వెళ్ళుచున్నాడు'. అనుచోట నున్న క్త్వాన్తములన్నియు, తిఙన్తస్య=ప్రధానమగు "వెళ్ళుచున్నాడు" అనుక్రియకు, విశేష కమ్=విశేషమును తెలియజేయుటచే విశేషణములగుచున్నవో, తథా=అట్లే, తత్ర= 'ముందుగా స్నానముచేయుచున్నాడు, వండుచున్నాడు తర్వాత–వెళ్ళుచున్నాడు తర్వాత' (పూర్వం స్నాతి, పచతి తతః వ్రజతి తతః) అను వాక్యములో, తిఙన్తమ్=క్రియాపదము లన్నియు, తిఙన్తస్య=ప్రధాన క్రియాపదమగు వెళ్ళుచున్నాడు అనుదానికి, విశేషకమ్= విశేషణములు అగుచున్నవి.

తా. "పూర్వం స్నాతి పచతి తతః వ్రజతి తతః" అనుచోట అతిఙన్తముకంటె పరమైన తిఙన్తమునకు నిఘాతము వచ్చునను నియమము ననుసరించి 'తతః' అనుదాని తరువాత నున్న 'వ్రజతి' అను క్రియాపదమునకు నిఘాతము రావలెను. కాని స్వరము ఏకవాక్యమునందే వచ్చును గనుక సావ్యయ కారక విశేషణము సఖ్యాతము వాక్యము అను వార్తిక కారుని లక్షణము ననుసరించి ఒకే క్రియాపదముగల పదసముదాయమే వాక్యమగును గాని అనేక క్రియాపదములుగల పదసముదాయము భిన్నవాక్యములే యగును. అట్లు భిన్న వాక్యములే యైనచో పైవాక్యమున 'వ్రజతి' అనుదానికి నిఘాతమురాదని శంకించి ఇది ఏకవాక్యమే యని సమర్థించుచున్నాడు.

అనేక క్రియాపదములున్నను ఆ క్రియాపదములన్నియు ప్రధానములు గాక ఒకే క్రియాపదము ప్రధానమై ఇతరములు దానికి విశేషణములే అయినప్పుడు అది ఏకవాక్యమే యగును. 'స్నాత్వా, భుక్త్వా, పీత్వా వ్రజతి' అన్నప్పుడు–స్నాన, భోజన, పానములు క్త్వాన్తములగు పదములచే తెలియజేయబడి ప్రధానమగు 'వ్రజతి' అనుదానిచే తెలుపబడు వ్యాపారమునే ఎట్లు విశేషించి చూపుచున్నవో అట్లే 'పూర్వం స్నాతి పచతి తతః వ్రజతి తతః' అనునపుడు కూడ క్త్వాన్తములుగాక తిఙన్తములే ప్రయోగింపబడినను 'వ్రజతి' అనునది ఒక్కటే ప్రధానక్రియ. మిగిలిన 'స్నాతి–పచతి' అను తిఙన్తములచే తెలుపబడు క్రియలు దానికే విశేషణములు. అందుచే ఏకవాక్యతకు భంగములేదు. వాక్యమున ఒకే తిఙన్త ముండ వలెను అనుదానికి అర్థము ఒకే ప్రధానమగు తిఙన్తముండవలెను అని గ్రహింపవలెను. ఇదియే వార్తికకారుని లక్షణమునకు అర్థమని చెప్పనిచో సూత్రకారుని అభిప్రాయమునకు

విరుద్ధము గావున 'ఏకతిఙన్తముకలది వాక్యము' అనునపుడు ప్రధానమగు ఒక తిఙన్తము కలది వాక్యము అని అర్థమును గ్రహింపవలెను.

వి. సమగ్రార్థబోధకమగు వాక్యములో అప్రధానములగు తిఙన్తము లెన్ని యున్నను అవి దాని ఏకవాక్యతకు భంజకములు కావు. అందుచే మీమాంసకులు చెప్పిన అర్థైకత్వమే వీరికిని అభిమతమని గ్రహింపవలెను. కాని వైయాకరణుల యభిప్రాయమున నిర్విభాగము శబ్దార్థమయము బోధరూపము నగు స్ఫోటము అనబడు శబ్దమే బాహ్యముగాని ఆంతరముగాని వాక్యము అని గ్రహింపవలెను.

వైయాకరణమతమున అంగీకరించిన స్ఫోటరూపమగు శబ్దము పదవర్ణ రూప విభాగము లేని అఖండమగు శబ్దమని నిరూపింపబోవుచు దానికి దృష్టాంతముగ చిత్రజ్ఞానమును చిత్రరూపమును ప్రదర్శించుచున్నాడు. అందు ముందు చిత్రజ్ఞానమును దృష్టాంతముగా చూపుచున్నాడు.

యథైక ఏవ సర్వార్థప్రత్యయః ప్రవిభజ్యతే
దృశ్యభేదానుకారేణ వాక్యార్థానుగమ స్తథా. 7

యథా = ఏవిధముగ, ఏకఏవ = ఒకేప్రకాశము (జ్ఞానము), సర్వార్థప్రత్యయః = సకలవస్తువిషయకమైనది, దృశ్యభేదానుకారేణ = చూడబడు వస్తువులయొక్క భేదమునుబట్టి వాస్తవముగ భేదము లేకున్నను, ప్రవిభజ్యతే = విభజించి వ్యవహరింపబడుచున్నదో, తథా = ఆవిధముగ, వాక్యార్థానుగమః = వాక్యవాక్యార్థములయందు పదపదార్థభేదము కల్పింపబడుచున్నది.

తా. నీలపీతాది అనేకాకారములుగల ఒక ద్రవ్యమును చూచినపుడు వాని అన్నిటి సామూహికమైన జ్ఞానము మనలో కలుగును. అట్లే ఘట పట కుడ్యాది వస్తుసమూహ మును ఒక్కసారి చూచినపుడు ఆ సమూహమును గూర్చిన ఒక జ్ఞానము కలుగును. ఈ జ్ఞానము ఏకాకారమే కాని భిన్నము కాదు. మనకు అందు కన్పట్టు వేర్వేరు రంగులను బట్టి, వేర్వేరు వస్తువులనుబట్టి జ్ఞానములోకూడ భేదమున్న దన్నట్లు కన్పించును. వాస్తవమునకు ఈ చిత్రజ్ఞానమున ఆకారభేదము లేదు. అట్లే వాక్యమునందు పదములుగాని, వాక్యార్థము నందు పదార్థములుగాని వాస్తవములు కావు. కల్పితములై, ఉన్నట్లు భాసించును.

వి. పంచదార, మిరియము, సుగంధద్రవ్యములు, జలము మున్నగువాని సమ్మిశ్రణమున ఏర్పడిన పానకమున అనుభవింపబడు రుచి ఏకాకారమే కాని భిన్నముకాదు. ఇట్లే నెమలి గ్రుడ్డులోని రసములో భిన్నభిన్నములగు వర్ణములు కన్పట్టును. అవి భిన్నవర్ణముల యొక్క సమ్మేళనము కాదు. అది అఖండమే. ఇట్లే నరసింహరూపమున భాసించు నరసిం హత్వజాతి నరత్వ-సింహత్వములు కలిసినదికాదు. అఖండమే. ఈ విధముగ చిత్రరూపమున నీలపీతాది అనేక వర్ణభానము ఉన్నను ఆ జ్ఞానము ఏకమే. వేరొకచోట నీలరూపమును పీత వర్ణమును చూచినపుడు కల్గిన జ్ఞానముతో సదృశమగు జ్ఞాన మిందులో ఉండుటచే దీనిలోకూడ భేదమున్నదన్నట్లు తోచును. అట్లే వాక్యము. ఆ వాక్యమును వినగానే కల్గిన అర్థజ్ఞానము అఖండమే దానిలో పదములు పదార్థములు ఉన్నట్లు భాసించుట కాల్పనికము

ఇట్లు చిత్రజ్ఞానమును దృష్టాంతముగా చూపి బాహ్యమగు చిత్రరూపమును దృష్టాంతముగ ఒసంగుచున్నాడు.

చిత్రస్యైకస్వరూపస్య యథా భేదనిదర్శనైః
నీలాదిభిః సమాఖ్యానం క్రియతే భిన్నలక్షణైః. 8

ఏకస్వరూపస్య=ఏకాకారముగా ఉన్న, చిత్రస్య=భిన్నభిన్నవర్ణముగల వస్తువునకు, భిన్నలక్షణైః=భిన్న ఆకారములగు నీలపీతాది స్వరూపములుగల, భేదనిదర్శనైః=ప్రత్యేకవ్యవహారముగల, నీలాదిభిః=నలుపు, ఎరుపు మున్నగు రూపములతో, యథా=ఎట్లు, సమాఖ్యానమ్=వ్యవహారము, క్రియతే=చేయబడుచున్నదో.

తథైవైకస్య వాక్యస్య నిరాకాంక్షస్య సర్వతః
శబ్దాంతరైః సమాఖ్యానం సాకాంక్షై రనుగమ్యతే. 9

తథైవ=ఆవిధముగనే, ఏకస్య-వాక్యస్య=అఖండమగు వాక్యమునకు, సర్వతః నిరాకాంక్షస్య=అన్నివిధముల ఆకాంక్షారహితమై ఉన్నదానికి, సాకాంక్షైః=ఈ వాక్యమునందు అంతర్గతములుకాక, దీనియందలి పదములతో సదృశములై వస్పట్టు వేరుపదములతో అన్వయింప యోగ్యతకల, శబ్దాంతరైః=వేరుశబ్దములతో, సమాఖ్యానమ్=అఖండ వాక్యమున కాల్పనికముగ పదవ్యవహారము, అనుగమ్యతే=చేయబడుచున్నది.

తా. 'దేవదత్తః గా మానయ దండేన' అను వాక్యము ప్రయోగించునపుడు, అది సంపూర్ణమగు వాక్యార్థమునకు వాచకమై యుండును. దీనిలోని పదములు మరియొక పదముతో అన్వయింప యోగ్యతకలవి కావు. ఈ వాక్యమువలన కలిగిన జ్ఞానము విభాగరహితముగ ఉండును. కాని వేరొకచోట వినబడిన అదేవిధమగు పదములను అర్థములను భావించి అట్టిదియే ఇది యని, ఈ వాక్యములో నాల్గుపదము లున్నవి అని కాల్పనికముగ వ్యవహరించుచుందురు. వాస్తవమునకు ఈ పదములు ఆ పదములు వేరు. వాని పదవిభాగమే లేదు. నీలపీతాది వర్ణములతో చిత్రింపబడిన ఒక చిత్రమును చూచినపుడు ఆ చిత్రమునందు ఏకాకారతయే గాని భిన్నరూపత కనుపట్టదు. కాని వేరొకచోట చూచిన నీలపీతాది వర్ణములను భావించి ఆ లక్షణములు గలవి ఇందును గలవని కల్పితముగ వ్యవహరింతురు. కాని వాస్తవమునకు ఈ రూపము, ఈ రూపమును చూచినపుడు కల్గిన జ్ఞానము కూడ విభాగరహితమై ఉండునదియే. ఇట్లే వాక్యవాక్యార్థ విషయమున గూడ మనము భావించు పదపదార్థస్వరూపము కల్పితమే యని యెరుంగవలెను.

ఈ సిద్ధాంతమున పదము అఖండము. అందలి ప్రకృతి, ప్రత్యయము అను భేదము అజ్ఞులకు వ్యుత్పత్తి కలుగజేయుటకు కల్పింపబడినది. అట్లే వాక్యమునందును పండితులుకాని వారికొరకు అవశ్యభూతములయిన పదములను విభజించి కల్పించిరని చెప్పుచున్నాడు.

యథా పదే విభజ్యన్తే ప్రకృతిప్రత్యయాదయః
అపోద్ధార స్తథా వాక్యే పదానా ముపవర్ణ్యతే. 10

యథా=ఏవిధముగ, పదే=అఖండమగు పదమునందు, ప్రకృతి ప్రత్యయాదయః=బాలవ్యుత్పాదనమునకై ప్రకృతి, ప్రత్యయములు మున్నగునవి, విభజ్యన్తే=

కల్పించి విభజింపబడినవో, తథా = ఆవిధముగనే, వాక్యే = అఖండమగు వాక్యమునందు, పదానామ్ = కల్పితములగు పదములయొక్క, అపోద్ధారః = విభాగము, ఉపవర్ణ్యతే = వర్ణింపబడు చున్నది.

తా. బాలవ్యుత్పాదనమునకై పదమునందు ప్రకృతి, ప్రత్యయము అను విభాగము యథార్థముగ లేనిదాని నెట్లు కల్పించిరో అట్లే వాక్యమునందును సులభముగ వాక్యార్థ ప్రతిపత్తి కల్గుటకు అసత్యమగు పదవిభాగము కల్పింపబడినది.

వర్ణాంతరసరూపం చ వర్ణభాగేషు దృశ్యతే
పదాంతరసరూపాశ్చ పదభాగా అవస్థితాః . 11

యథా = ఏవిధముగా, వర్ణభాగేషు = ఏకవర్ణములగు ఐ,ఔ మొదలగు వర్ణముల అవయవములలో, వర్ణాంతర సరూపమ్ = స్వతంత్రవర్ణములగు అ, ఇ - అ, ఉ అను వర్ణముల సారూప్యము, దృశ్యతే = కన్పట్టుచున్నదో, తథా = అవిధముగనే, పదాంతర సరూపాః = వాక్యావయవములగు పదములలో ప్రత్యేక పదములపోలికగల భాగములును, పదభాగాః చ = అఖండమగు పదమునందు ప్రకృతి ప్రత్యయ రూప భాగములును, అవస్థితాః = ఏర్పడినవి.

తా. "ఐ, ఔ" అనునవి స్వంతంత్ర వర్ణములు. కాని వానిలో 'అ-ఇ; అ-ఉ' అను అక్షరముల పోలికలు కన్పట్టుటచే అవి సంధ్యక్షరములనియు, రెండక్షరముల కూడికచే ఏర్పడిన వనియు, ఎట్లు తోచుచున్నదో అట్లే వాక్యమునందు వాస్తవముగ పదములు, పదము నందు ప్రకృతి ప్రత్యయ రూపావయవములు లేవు. కాని ప్రత్యేకముగా కన్పట్టు పదములవంటి భాగములు ఆ వాక్యములలో కన్పడినపుడు వానిని పదములని విభజించి ఏర్పరచుట జరిగినది. అట్లే పదముకూడ నిరంశమే, ప్రకృతి ప్రత్యయ విభాగము అసత్యమే అని యెరుంగవలెను.

భాగైరనర్థకైర్యుక్తా వృషభోదకయావకాః
అన్వయవ్యతిరేకౌ తు వ్యవహారనిబంధనమ్. 12

వృషభోదక యావకాః = 'వృషభ, ఉదక, యావక' అనుశబ్దములు, అనర్థకైః = అర్థములేని, "ఋషభ, ఉద, యావ" అను, భాగైః = అవయవములతో, యథా = ఎట్లు, యుక్తాః = కూడియున్నవో - అట్లే (పచతి-పాచకః మున్నగుపదములలో ప్రకృతి ప్రత్యయ రూపములగు భాగములు వాస్తవమున అనర్థకములే. కాని, శాస్త్రములు 'పచతి' అనుచోట 'పచ్' అనునది ప్రకృతి, 'తి' అనునది ప్రత్యయము, వానికర్థము క్రియ-కర్త అనికల్పించిరి.) అన్వయవ్యతిరేకౌ = ఈ ప్రత్యయముతో కూడిన ధాతువు ఈయర్థము నిచ్చును. ఈ ప్రత్యయము లేనిచో ఈ యర్థమునీయదు అని ఆ భాగములకు ఆ అర్థాదులందు కల్పింపబడిన అన్వయ వ్యతిరేకములు, వ్యవహారనిబంధనమ్ = ఆ కల్పితమైన అర్థముతో ఆ పదమును అజ్ఞులు వ్యవహరించుటకు కారణము.

తా. లోకములో 'ఋషభ-ఉద-యావ' అను ప్రత్యేకపదములు ప్రత్యేకార్థముల యందు వ్యవహరింపబడుచున్నవి. వానికి అర్థము కలదు. కాని 'వృషభ' అనునది విను నపుడు దానిలోని 'ఋషభ' అనునది ప్రత్యేకముగా అర్థము కలిగియుండదు. మొత్తము 'వృషభ' శబ్దమే అర్థబోధకము. అట్లేయున్నను ఇందలి 'ఋషభ' అనుభాగము 'ఋషభ' అను ప్రత్యేకపదము వలె అర్థబోధకము కాక 'వృషభ' అను అఖండపదమే అర్థబోధకము

అగును. అట్లే, పచతి అనుచోట 'చ్ + తి' అని విభజించి 'పచ్' అనుదానికి 'వండు' అని యర్థము. 'తి' అనుదానికి "అపనిని చేయువాడు" అని అర్థము. 'తి' అను ప్రత్యయమును చేర్చినపుడు "వండుచున్నాడు" అను అర్థమువచ్చును అని శాస్త్రజ్ఞులు బాలుర వ్యుత్పత్తి కొరకు ఆ ప్రకృతి ప్రత్యయముల కాయా యర్థములందు అన్వయ వ్యతిరేకములను–అనగా అవిభాజ్యమగు సంబంధమును కల్పించిరి. కాని వాస్తవమునకు 'పచతి' అను అఖండపదము "వండుచున్నాడు" అను అర్థమును బోధించును గాని ప్రత్యేకార్థములు గల భాగములు అందు లేవు. అట్లే వాక్యముకూడ నిరంశమై అర్థబోధక మగును. పదవిభాగము వ్యవహారమునకై కల్పింపబడినది.

వాక్యమువలె వాక్యార్థముకూడ నిర్విభాగమే అని ప్రతిపాదించుచున్నాడు.

శబ్దస్య న విభాగోఽస్తి కుతోఽర్థస్య భవిష్యతి ?
విభాగైః ప్రక్రియాభేద మవిద్వాన్ప్రతిపద్యతే . 18

శబ్దస్య = అఖండ వాక్యస్ఫోటరూపమగు శబ్దమునకు, విభాగః = పదరూపమగు విభాగము, నాస్తి = లేదు, (అట్టిచో) అర్థస్య = ఆ వాక్యముచే బోధింపబడు అఖండమగు ప్రతిభారూపమగు అర్థమునకు, విభాగః = విభాగము, కుతః భవిష్యతి = ఎట్లుండగలదు ; అవిద్వాన్ = యథార్థ జ్ఞానములేని బాలుడు. విభాగైః = అసత్యములగు శాస్త్రములచే కల్పింపబడిన పద, ప్రకృతి, ప్రత్యయాది రూపవిభాగములచే, ప్రక్రియాభేదమ్ = పదముయొక్క ప్రక్రియలో ప్రకృతి ప్రత్యయాది భేదమును, వానియర్థములోని భేదమును (లేనివానిని గూడ), ప్రతిపద్యతే = (ఉన్నట్లు) తెలిసికొనుచున్నాడు.

తా. సిద్ధాంతమున వాక్య మఖండమైనపుడు దానిచే బోధింపబడు అర్థముకూడ అఖండమే. కాని వాక్యమునందు పదములను, పదములందు ప్రకృతి ప్రత్యయాది భేదమును శాస్త్రజ్ఞులు కల్పించుట ఆ అఖండమగు అర్థమును, శబ్దమును తెలిసికొనుటకు సాధనము. విభాగములతో పదనిర్మాణమును సులభముగా తెలియగవచ్చును. తద్ద్వారా వాక్యార్థము నెఱుంగుట సులభమగును. వానిని అఖండమని ఎఱుంగుట కష్టము.

వి. ప్రతి పదము, ప్రతి వాక్యము పఠించి శబ్ద జాలము నంతను ఎఱుంగుట ఇంద్రునివంటివానికే సాధ్యముకాలేదని మహాభాష్యకారుడు చెప్పియున్నాడు. ఈవిధముగా సామాన్య విశేషభావముచే ఏకరూపముగ ఉన్న పదములున్నవని విభజించి ఒకదానిని తెలిసికొనుటచే సర్వపదముల స్వరూపము తెలియునట్లు ప్రక్రియను ఏర్పరచిరి. అందులో విశిష్టములగు పదములకు ఈ సామాన్యప్రక్రియ సరిపడకపోయినచో విశేషప్రక్రియను నిర్దేశించిరి. 'ఇంద్రాణీ, వరుణానీ' మొదలగు కొన్నిరూపములలో ఇంద్ర–ఆన్–ఈ కన్పించు చుండుటచే ఇంద్ర మొదలగు శబ్దములకు 'ఆనుక్' ఆగమము జీష్ ప్రత్యయము వచ్చి ఆ రూపము లేర్పడినవని సామాన్యప్రక్రియ నిర్దేశించిరి. కాని 'పూతక్రతాయీ' అనుచోట 'పూతక్రతు – ఆయ్ – ఈ' అని విన్పించుటచే వెనుకటి ప్రక్రియ కుదురక పూతక్రతు శబ్దమునకు మాత్రము 'ఐ' అను ఆదేశము, జీష్ అను ప్రత్యయము వచ్చునని విశేషప్రక్రియను నిర్దేశించిరి. ఈ విధముగ పదభేదమును బట్టి ప్రక్రియాభేద మేర్పడినది. ఈ సామాన్య విశేష రూపమగు ప్రక్రియా రచనచే అవిద్వాంసులు సులభముగ వాక్యార్థము నెఱుంగుట సాధ్యపడును. అందుకై అసత్యమగు ఈభేదము కల్పింపబడినది.

వాక్యములో దేవదత్తాది పదములు అర్థమున్నట్లు కన్పడుచు వినఁబడుచుండగా అనర్థకములని చెప్పుట యెట్లు ? అను సంశయమును నివారించుచున్నాడు.

బ్రాహ్మణార్థో యథా నాస్తి కశ్చి ద్బ్రాహ్మణకంబలే
దేవదత్తాదయో వాక్యే తథైవ స్యు రనర్థకాః. 14

బ్రాహ్మణకంబలే = బ్రాహ్మణ కంబలమను శబ్దమునందు, బ్రాహ్మణార్థః కశ్చిత్ = బ్రాహ్మణశబ్దమునకు ఏ అర్థముకూడ, యథానాస్తి = ఏవిధముగ లేదో, తథైవ = ఆ విధముగనే, వాక్యే = వాక్యమునందు, దేవదత్తాదయః = దేవదత్త మొదలగు పదములు, అనర్థకాః = అర్థములేనివి, స్యుః = అగుచున్నవి.

తా. బ్రాహ్మణ కంబలము అనుదానితో బ్రాహ్మణ శబ్దము విడదీసి ఉచ్చరించినపుడు అది బ్రాహ్మణ శబ్దమువలె విన్పడినను దానికి ప్రత్యేకముగా అర్థమేమియును లేదు. అట్లే "దేవదత్తః గామ్ ఆనయ దండేన" అను వాక్యము నుచ్చరించినపుడు వాక్యార్థమఖండముగా భాసించును గాని దేవదత్త మున్నగుపదములు వేరువేరుగా ఉచ్చరించినపుడు వానికి ప్రత్యేకార్థవత్త్వము లేదు.

మీమాంసకులు పదములకు సామాన్యరూపమగు స్వార్థమును బోధించు శక్తి ఉండుననియు, వాక్యము ఆ పదార్థముల అన్వయ విశేషమును బోధించుననియు, ఆకాంక్షాదుల వలన పరస్పరము అన్వయించిన పదసముదాయము వాక్యమనియు చెప్పుదురు, దానిని ఖండించుచున్నాడు.

సామాన్యార్థ స్తిరోభూతో న విశేషేఽవతిష్ఠతి
ఉపాత్తస్య కుత స్త్యాగః నివృత్తః క్వావతిష్ఠతామ్ ? 15

సామాన్యార్థః = ('దేవదత్తః గామ్ ఆనయ దండేన' అనునప్పుడు దేవదత్త పదము సకలపదార్థములతో అన్వయించుటకు తగిన దేవదత్తః అను) సామాన్యార్థము కలది, తిరోభూతః = (పదాంతర సన్నిధానము లేక మునుపే పదాంతరములో అన్వయము కలదియై యుండియు వేరొక పదార్థముతో అన్వయింపని సామాన్యార్థము కలదియై ఆ) యన్వయము మరుగుపడినదియై, విశేషే = వేరొక పదార్థముతో అన్వయించిన స్వార్థము అను విశేషమునందు, న–అవతిష్ఠతే = ఉండదు, ఉపాత్తస్య = సామాన్యార్థ బోధనమునకై స్వీకరించిన వాచ్యవాచకభావరూప సంబంధమునకు, త్యాగః = త్యాగము, కుతః = ఎట్లు, నివృత్తః = సామాన్యార్థ బోధనమునుండి విరమించిన యాపదము, క్వ = ఎచట (ఏ అర్థమునందు) అవతిష్ఠతామ్ = ఉండును.

తా. 'దేవదత్తః గామ్ ఆనయ దండేన' అను వాక్యములో దేవదత్తాది పదములే వాక్యము. దేవదత్త పదము ముందు సామాన్యముగ వేరొకపదముతో అన్వయింపదగిన స్వార్థమును బోధించును. కాని పదాంతరములతో కలిపి పలికినపుడు ఆ పదములతో అన్వయించుటకు వీలుగా, సామాన్యార్థమును బోధించు శక్తిని మరుగుపరచి యుంచును. పదాంతర సన్నిధానముచే ఆ అర్థముతో అన్వయించిన విశిష్టార్థమును బోధించు శక్తి కలిగియుండును–అని మీమాంసకులు చెప్పుదురు. కాని ఇది పొసగదు. సకల పదార్థములతో అన్వయింపదగిన సామాన్యార్థమును బోధించు శక్తిగల పదమునకు ఆ యర్థముతోగల వాచ్య వాచక భావసంబంధము నిత్యము. అందుచే సామాన్యార్థము వాచ్యమైననాడు దానిని పదాంతర సన్ని

ధానమున విడచుట కుదురదు. అట్లు విడచునన్నచో శబ్దార్థసంబంధము అనిత్యము అనవలసి వచ్చును. అందుచే విశేషార్థమున ఆ పదమునకు శక్తియుండదు. విశేషార్థమున వాచ్యవాచక రూపసంబంధము లేకపోయినను సామాన్యార్థముగల ఆ పదమే స్మరింపబడి విశేషార్థముతో అన్వయించును అనినప్పుడు సామాన్యార్థమును బోధించు శక్తిగల పదమును స్మరించి విశేషార్థసంబంధమును బోధించు శక్తి దానికి కల్పించునపుడు ఆ మొదటి సామాన్యార్థ సంబంధమును విడచుట ఎట్లు పొసగును? ఒకవేళ విడచినను విశేషార్థబోధకత్వరూపమగు సంబంధము లేనిదే దాని నెట్లు బోధించును? అందుచే పదము ముందు సామాన్యముగ అర్థమును బోధించి తరువాత విశేషముగ అర్థమును బోధించు నను సిద్ధాంతము నిలువదు.

మీమాంసకులలో అన్వితాభిధాన వాదమున పదాంతరముతో అన్వయించిన స్వార్థమునందే పదమునకు శక్తి అను సిద్ధాంతము ఉండుటచే సామాన్యార్థముతో అన్వయించిన స్వార్థబోధకత్వము పదమునకే అంగీకరించి అట్టి పద సంఘాతమే వాక్యమని చెప్పిరి. కాని అది సంగతము కాదని వెనుక నిరూపింపబడినది. ఇపుడు రెండవ పక్షమగు అభిహితాన్వయవాదమును నిరూపించి ఖండించుచున్నాడు.

అశబ్దో యది వాక్యార్థః పదార్థోఽపి తథా భవేత్
ఏవం చ సతి సంబంధః శబ్దస్యార్థేన హీయతే. 16

వాక్యార్థః = వాక్యముయొక్క అర్థము, అశబ్దః-యది = వాచకశబ్దము లేకయే వచ్చినట్లంగీకరించినచో, పదార్థోఽపి = పదార్థముకూడ, తథా భవేత్ = ఆవిధముగనే-వాచకశబ్ద మక్కరలేకయే రాగలదు, ఏవం చ సతి = ఈవిధముగ అంగీకరించినచో, శబ్దస్య = శబ్దమునకు, అర్థేన = అర్థముతో, సంబంధః = వాచ్యవాచకభావరూప సంబంధము, హీయతే = తొలగిపోవును.

తా. అభిహితాన్వయ వాదమున పదములు పరస్పరసంబంధము లేని పదార్థములను మాత్రము బోధించును. ఆ పదములయొక్క సమూహరూపమగు వాక్యములో ఆ పదార్థములకు పరస్పరసంబంధము ఆకాంక్షచే మన బుద్ధిలో భాసించును. ఈ సిద్ధాంతము నంగీకరించినచో వాక్యార్థమునకు వాచకము పదములు కావు, వాక్యమునుగాదు. ఆకాంక్షచే బుద్ధిలో భాసించును. అందుచే శబ్దార్థములకు గల వాచ్యవాచక భావరూపసంబంధము పరిత్యక్తమగును. వాక్యార్థము ఎట్లు ఆకాంక్షచే భాసించినదో పదార్థముకూడ ఉచ్చరించగనే నశించు వర్ణములు ఏకకాలికములుగ ఉండవు గనుక, ఆ పదముచే గాక వేరొకదానిచే మన బుద్ధిలో భాసించునని చెప్పవచ్చును. ఇట్లు శబ్దార్థములకు గల వాచ్యవాచకభావరూపసంబంధము పదమునకు గాని వాక్యమునకు గాని లేదని అపసిద్ధాంతమేర్పడును.

పై కారికచే అభిహితాన్వయవాదుల వాక్యలక్షణము నిరసింపబడినది. ఇక అన్వితాభిధాన పక్షమున ఆద్యపదము వాక్యము, పరస్పరాన్వితమగు ప్రతిపదము ప్రత్యేకముగ వాక్యము అను రెండు వాక్యలక్షణములను విమర్శించుచున్నాడు.

విశేషశబ్దాః కేషాంచి త్సామాన్యప్రతిరూపకాః
శబ్దాంతరాభి సంబంధాత్ వ్యజ్యన్తే ప్రతిపత్తృషు. 17

విశేషశబ్దాః = ('దేవదత్త గామ్ ఆనయ దండేన' మున్నగు వాక్యములలో దేవదత్త శబ్దము మిగిలిన పదముల అర్థముతో అన్వయించినది గనే ప్రయోగింపబడును) అట్టి

విశిష్టార్థ ప్రతిపాదకములగు శబ్దములు, సామాన్యప్రతిరూపకాః = సామాన్యార్థ ప్రతిపాదకము లగు దేవదత్తాది సాధారణ శబ్దములుగ, కేషాంచిత్ = కొందరకు (భాసించును), శబ్దాంతరాభిసంబంధాత్ = ఆ వాక్యములో దానితర్వాత ఉచ్చరింపబడిన గవాది పదనులతో గల సంబంధము వలన, ప్రతిపత్తృషు = తెలిసికొనువారియందు, వ్యజ్యన్తే = (దేవదత్తాది పదముల విశిష్టార్థము) అభివ్యక్తమగును.

తా. ఆద్యపదము వాక్యము అనుపక్షమున సకల విశేషణములతో కూడి ఇతర పదార్థములతో అన్వయించిన అర్థమే వాచ్యమైయుండును గాన వాక్యారంభమున ఉపయో గింపబడిన పదము ఆ వాక్యములోని ఇతర పదములతో అన్వయించిన స్వార్థమును దెల్పును. అందుచే ఆద్యపదము వాక్యార్థమునంతను ప్రతిపాదించును. మిగిలిన పదములు కొందరకు ఆ పదము సామాన్యరూపమున ఉండుటచే సామాన్యార్థకమను భ్రమచే సంపూర్ణవాక్యార్థమును భాసింపజేయనపుడు విశిష్టార్థమును అభివ్యక్తముచేయుటకు సాయపడును.

ఈ తీరుననే ఒక్క మొదటిపదముమాత్రమేకాక ఏపదమైనను వాక్యముయొక్క మొత్తముఅర్థమును ప్రతిపాదింపగలది అగునని కొందరు, పరస్పరాన్వితమగు ప్రతి పదముసు వాక్యమున ప్రత్యేకముగ వాక్యార్థ ప్రతిపాదకమగునని చెప్పిరి.

ఈ పక్షములందు గల దూషణమును, దానికి వారు చెప్పు సమాధానమును ప్రదర్శించు చున్నాడు.

తేషాం తు కృత్స్నో వాక్యార్థః ప్రతిభేదం సమాప్యతే
వ్యక్తోపవ్యంజనా సిద్ధిః అర్థస్య ప్రతిపత్తృషు. 18

తేషాంతు = ఒకే శబ్దముచే వాక్యార్థమంతయు అఖండముగ ప్రతిపాదింపబడునని చెప్పువారి మతమున, కృత్స్నః = సంపూర్ణ వాక్యార్థము, ప్రతిభేదమ్ = ప్రతి పదమున, సమాప్యతే = మాప్తమైయుండును, ప్రతిపత్తృషు = బోద్ధలయందు, అర్థస్య = వాక్యార్థము యొక్క, సిద్ధిః = జ్ఞానము, వ్యక్తోపవ్యంజనా = మొదటి పదముయొక్క అర్థముతెలియుట చేతనే తెలిసిన వాక్యార్థము, మిగిలిన పదముల ఉచ్చారణముచే స్ఫుటముగా అభివ్యక్తము కాగలదు.

తా. వాక్యమున మొదటిపదము లేదా ప్రతిపదము వాక్యార్థమునంతను సమగ్ర ముగ బోధించుచో ఇతర పదప్రయోగము వ్యర్థము గదా అను శంకను ఈ కారికచే నిరసించు చున్నారు. ఒక పదముచేతనే సకలవిశేషణ విశిష్టమగు వాక్యార్థము బోధింపబడినను మిగిలిన పదములు దాని స్పష్టప్రతిపత్తికి సాయపడునని గ్రహింపవలెను. ఈ విధముగ అన్వితాభిధాన వాదమునందలి రెండు వాక్యలక్షణములను నిరూపించిరి.

పై విధముగ వాక్య వాక్యార్థములు సఖండములు అను మతములను నిరూపించి వానికి తిరస్కరించుటకు ముందుగ ప్రతిభా రూపమగు వాక్యార్థమే ప్రధానముగా గ్రహింప దగినదని వాక్య మఖండము అను పక్షమును నిరూపించుచున్నాడు.

అవ్యక్తః క్రమవాన్ శబ్దః ఉపాంశ్వయ మధీయతే
అక్రమస్తు వితత్యేవ బుద్ధి ర్యత్రావతిష్ఠతే. 19

అవ్యక్తః = బాహ్యముగా గాని అంతరముగాగాని స్ఫోటరూపముగా ప్రతీయమాన మగుచున్నను అంతకుముందు అవ్యక్తమైయుండు, శబ్దః = శబ్దము, ఉపాంశు = ఇతరులకు తెలియక తనకుమాత్రమే తెలియునట్లు, అధీయతే = ఉచ్చరింపబడుచున్నది, అయమ్ = ఇది, అక్రమస్తు = క్రమములేనిదయ్యు, క్రమవాన్ = అభివ్యంజకములగు ధ్వనులనెడి ఉపాధుల వలన క్రమముకలదియై యుండును, యత్ర = ఏక్రమభానమందు, బుద్ధిః = కల్పింపబడిన క్రమముతోకూడిన ఆ శబ్దబుద్ధి, వితత్య ఇవ = విస్తరించి యున్నట్లుగ, అవతిష్ఠతే = ఉన్నదై క్రమమును గ్రహించునో.

తా. శబ్దము వాస్తవమునకు జ్ఞానరూపము. దానిని అభివ్యక్తముచేయు ధ్వనుల వలన అది బాహ్యరూపమున ప్రతీయమాన మగుచుండును. దానిలో అంశములులేవు. అందుచే మెల్లగా ఉచ్చరించుట, గట్టిగా ఉచ్చరించుట, ఉపాంశువుగ ఉచ్చరించుట, ద్రుతముగ ఉచ్చరించుట, మున్నగునవి అన్నియు మనకు భాసించుచున్నవేగాని, శబ్దమునం దుండవు. అభివ్యంజకధ్వనుల ఉచ్చారణభేదమునుబట్టి శబ్దములం దాభేదము ఉన్నట్లు కన్పించును. శబ్దమును ప్రయోగించువారు, వారి బుద్ధియందు ఒక క్రమరూపము ఉన్నట్లు అనుభవింతురు గాని వాస్తవమునకు శబ్దమున క్రమములేదు. అందుచే వ్యావహారికముగ వాక్యమనబడు దాని యందుకూడ పదభేదము ఆది, అంతము, మధ్యము అను భేదము లేదని యెరుంగవలెను. నిర్విభాగమగు ఆకాశమున ప్రయాణము చేయువాడు తాను పొందిన దేశమునుబట్టి ఆకాశమును ఎట్లు పరిచ్ఛిన్నముగ చేయునో అట్లే ఈ వాక్యరూపమగు శబ్దమునందుకూడ ఆయా ప్రాణ కరణాదులయందు చేయు ప్రయత్నభేదమువలన ప్రయోగించువాని బుద్ధియందు ఒక క్రమ మున్నట్లు భాసించుటచే అదియే అఖండమగు శబ్దమని ఆరోపింపబడును.

ఈ స్ఫోటరూపమగు శబ్దము వ్యక్తిరూపము, ఏకము, నిరవయవము అని ఒక సిద్ధాంతము. ఆ వ్యక్తులెన్నియైనను ఆ వ్యక్తులయందు గల వాక్యజాతి స్ఫోటరూపమగు శబ్దము అని వేరొక సిద్ధాంతము. ఈ రెండు సిద్ధాంతములందును వాక్యరూపమగు శబ్దము నిరవయవము - ఏకము. అట్లయినచో కాలభేదముచేత, భిన్నపురుషులచేత ఉచ్చరింపబడు వాక్యములందు భేదము, సాదృశ్యము ఎట్లు కుదురును ? మనకు క్రమములో కొన్ని వాక్యము లలో భేదము, కొన్ని వాక్యములలో సాదృశ్యము కన్పడుచున్నవి. వస్తువు ఒకటియే యైన పుడు తనలో తనకు భేదము సాదృశ్యము ఉండవుగదా ! అని శంకించి సమాధానము చెప్పు చున్నాడు.

> యథా క్షేపవిశేషేఽపి కర్మభేదో న గృహ్యతే
> అవృత్తౌ వ్యజ్యతే జాతిః కర్మభిః భ్రమణాదిభిః . 20
>
> వర్ణవాక్యపదే ష్వేవం తుల్యోపవ్యంజనా శ్రుతిః
> అత్యంతభేదే తత్త్వస్య సరూపేవ ప్రతీయతే . 21

యథా = ఏవిధముగ, క్షేపవిశేషేఽపి = త్రిప్పుట, ఎత్తుట, కదల్చుట మున్నగు కర్మలలో మూలభూతమగు ప్రయత్నము ప్రత్యేకము నిరవయవమై పరస్పరభేదము కల దైనను, కర్మభేదః = ఆ వ్యాపారములలో భేదము, న గృహ్యతే = ఇతరులచే గ్రహింపబడదో, అవృత్తౌ = ఆ కర్మ మరల చేయబడినపుడు, భ్రమణాదిభిః కర్మభిః = ప్రయత్నవిశేషముచే

గుండ్రముగా తిరుగుట, ఊర్ధ్వదేశమునకు పోవుట మున్నగు కర్మలచే, జాతిః = వాస్తవముగ మూలభూతమగు వ్యాపారములందు లేనిజాతి, వ్యజ్యతే = ఉన్నట్లు కన్పట్టునో, ఏవం = ఇట్లే, తుల్యోపవ్యంజనాః శ్రుతిః = సమానములగు శ్రుతులు (వినపడుటలు) గల వ్యంజక ధ్వనులు గల శబ్దము, వర్ణవాక్యపదేషు = వర్ణములందు, వాక్యమునందు, పదములందు, తత్త్వస్య = అఖండమగు వాక్యమునకు, సరూపేవ = సాదృశ్యముకలదివలెను, అత్యంత భేదే = వ్యంజకధ్వనులలో భేదమున్నచో ఆ వర్ణపదములచే భేదము కలదివలెను, ప్రతీయతే = భాసించును.

తా. వాక్యవ్యక్తి, స్ఫోటరూపమగునది శబ్దమనునపుడు వ్యక్తి ఒకటి కనుక భేదము, సాదృశ్యము (ఈ వాక్యము ఈ వాక్యముతో పోలియున్నది, ఈ వాక్యముకంటె భిన్నముగానున్నది అనుట) కుదురదు. వాస్తవమునకు శబ్దము ఒకటియేగాన భేదసాదృశ్య ములు లేవు. లేనిదానియందు వేరొకచోట ఉండు భేదసాదృశ్యములు ఆరోపింపబడుచున్నవి. లోకములోఎత్తుటకు,కదల్చుటకు,త్రిప్పుటకు చేయు ప్రయత్నములు ప్రత్యేకములు క్షణికములు. ఆ ప్రయత్నమున కాప్రయత్నమే కాని ఒక ప్రయత్నము వేరొకప్రయత్నమువంటిది ఉండదు. ఆ ప్రయత్నముచే కదల్పబడు వస్తువు ఒకప్పుడు ఊర్ధ్వదేశమును తాకును. ఒకపుడు గుండ్ర ముగా సర్వదేశములను తాకును. అపుడు ఈ భ్రమణము, ఉత్క్షేపణము మొదలగు కర్మలు ఆ యా దేశసంయోగభేదముచే భిన్నములై మూలప్రయత్నమునందు లేని భేదసాదృశ్యము లను ఉన్నట్లు కన్పింపచేయుచున్నవి. అట్లే వాస్తవముగ స్ఫోటరూపమగు శబ్దములో లేని భేదసాదృశ్యములు బయటికి వినపడు ధ్వనులచే ఉన్నట్లు భాసింపచేయబడుచున్నవి. సమాన ముగా వినబడు ధ్వనులుగల వర్ణపదములున్నపుడు ఆ ధ్వనులయందు గల సాదృశ్యముచే ఆ వాక్యములందు సాదృశ్యము, ఆధ్వనుల భేదముచే ఆ వాక్యములందు భేదము ఆరోపితమై భాసించుచున్నది.

వాక్యము ఏకము అనునప్పుడు అఖండము ఏకమునగు నిత్యశబ్దమున పూర్వము, పరము అని పౌర్వాపర్యము నిరూపించుట ఎట్లు సంభవించునని శంకించి సమాధానము నిచ్చుచున్నాడు.

> నిత్యేషు తు కుతః పూర్వం పరం వా పరమార్థతః
> ఏకస్యైవ తు సా శక్తిః యదేవ మవభాసతే . 22

నిత్యేషు = నిరవయవములగు వాక్యములందు, పరమార్థతః = వాస్తవముగ, పూర్వం పరం వా = ఈ పదము ముందు, ఈ పదము తరువాత అని చెప్పెడి పౌర్వాపర్యము, కుతః = ఎట్లు సంభవించును?, ఏకస్యైవ = నిరవయవము క్రమరహితమునగు అఖండవాక్య మునకే, సా శక్తిః = ఆ శక్తి కలదు, యత్ ఏవం అవభాసతే = దేనివలన క్రమరహితమగు వాక్యముకూడ క్రమముకలదివలె భాసించుచున్నదో.

తా. "ఈ వాక్యము పూర్వము పాటలిపుత్రమున పలుకబడినది. ఈ వాక్యము తరువాత పలుకబడినది" అని వాక్యములలో ముందువెనుకలు కాలమునుబట్టిగదా ఏర్పడ వలెను. కాలము అనిత్యపదార్థములకు పౌర్వాపర్యమును కల్పింపగలదు. కాని నిత్యపదార్థము లలో ఎట్లు కల్పింపగలదు? ఎప్పుడూ ఉన్నదానికి ముందువెనుక లెట్లు? అని శంక కలుగ వచ్చును. వేదాంతమతమున విశ్వరూపముగ కన్పట్టు విశ్వాత్మకమగు బ్రహ్మము ఏకము

నిత్యము అయినను దానియందు సృజింపబడు వస్తువులను క్రమముగ భాసింపచేయు శక్తి కలదియై యుండును. అట్లే నిత్యము నిరవయవమునగు వాక్యమునకుగూడ వర్ణములలోను పదములలోను వాస్తవముగ లేని క్రమమును భాసింపచేయు శక్తి కలదు. ఆ శక్తిచే వాక్యమున వాస్తవముగ లేని క్రమము భాసించినను వాక్యముయొక్క ఏకత్వ నిత్యత్వములకు విరుద్ధము కాదు.

పదము నుచ్చరించుటకంటె వాక్యము నుచ్చరించుటలో ఎక్కువకాలము పట్టును అని మనకు తెలియును. ఒక మాత్రకాలములో ఉచ్చరించిన హ్రస్వము అనియు రెండు మాత్రల కాలము దీర్ఘము, మూడు మాత్రల కాలము ప్లుతమనియు చెప్పుచున్నాము. కాని శబ్దము నిత్యము నిరవయవము కావున దానికి కాలకృతమగు "వేగము, ఆలస్యము" "హ్రస్వము, దీర్ఘము, ప్లుతము" అను భేదమెట్లు కలుగును? అనుశంకకు సమాధానము చెప్పుచున్నాడు.

> చిరం క్షిప్ర మితి జ్ఞానే కాలభేదా దృతే యథా
> భిన్నకాలే ప్రకాశేతే స ధర్మో హ్రస్వదీర్ఘయోః. 23

జ్ఞానే=బహు వస్తువిషయకమగు జ్ఞానము, ఏకవస్తు విషయకమగు జ్ఞానము కలిగినపుడు ఆ జ్ఞానములందు, చిరమితి=బహు వస్తువిషయక జ్ఞానమంతయు చాలకాలమున కల్గినది అనియు, క్షిప్రమితి=వేగముగ కల్గినది అనియు, కాలభేదా దృతే=ఆ జ్ఞానములలో కాలభేదము లేకపోయినను, యథా=ఎట్లు భేదము ఏర్పడుచున్నదో అట్లే, స ధర్మః=ఆ స్వభావము, హ్రస్వ దీర్ఘయోః=హ్రస్వము, దీర్ఘము అను వానికి గూడ కలదు. ఆ స్వభావము చేతనే, భిన్నకాలే=భిన్నకాలికత్వముతో, ప్రకాశేతే=ప్రకాశించుచున్నవి.

తా. చాలా వస్తువులనుగూర్చి జ్ఞానము కలిగినపుడు ఆలస్యముగ కలిగినట్లును, ఒక వస్తువునుగూర్చి జ్ఞానము కలిగినపుడు వేగముగ కలిగినట్లును మనము తలచును. వాస్తవమునకు బహువస్తువిషయక జ్ఞానమునకు, ఏకవస్తు విషయకజ్ఞానమునకు కాలములో భేదము లేదు. కాని తెలిసికొనబడిన వస్తువులకు గల కాలభేదమును జ్ఞానమునం దారోపించి ఎట్లు "చిరకాలము, శీఘ్రము" అని వ్యవహరించుచున్నామో ఆ స్వభావము ననుసరించియే స్ఫోటరూపముగ వర్ణము, పదము నిత్యమేయయినను అభివ్యంజకములగు ధ్వనులకు గల కాల భేదమును ఆ నిత్యస్ఫోటరూపశబ్దమున నారోపించుటచే, "చిరము, క్షిప్రము, హ్రస్వము, దీర్ఘము" మున్నగు కాలభేద వ్యవహారము సంభవించుచున్నది.

వాక్యము లేదా పదము అభివ్యంజక ధ్వనిభేదముచే భిన్నమని చెప్పుట యుక్తము కాదు. నిత్యము నిరవయవము అగు వాక్యమునకు—లేదా పదమునకు ఉపాధివశమున భేదము కలుగునని చెప్పినచో స్వభావభేద మంగీకరించినట్లే యగును. అంతేకాక వాక్యము, పదము, హ్రస్వ దీర్ఘాది వర్ణములు కూడ నిత్యములే యగుటచే కాలభేదము కలవిగా చెప్పుటకు వీలు లేదు. వానియందు కాలకృతమగు పరిమాణ భేదమును చూపుట విరుద్ధము. కాలమునందే భేదము చెప్పుట సంభవించదు. ఇక హ్రస్వదీర్ఘములం దాభేదము ఎట్లు సంక్రమించునని శంకించుచున్నాడు.

> న నిత్యాః పరమాత్రాభిః కాలో భేద మిహార్హతి
> వ్యావర్తినీనాం మాత్రాణా మభావే కీదృశః క్రమః ? 24

ఇహ = ఈ శాస్త్రమునందు, నిత్యః = నిత్యముగా వ్యవహరింపబడుచున్న, కాలః = కాలము, పరమాత్రాభిః = తనకంటె భిన్నమగు క్రియయొక్క లేదా ఆ క్రియచే జనించిన పదార్థము యొక్క అవయవములచే, భేదమ్ = భేదమును, నార్హతి = పొందుటకు తగదు, వ్యావర్తినీనామ్ = పరస్పరము భిన్నములగు, మాత్రాణామ్ = క్రియావయవములు, లేదా దానిచే జనించు పదార్థావయవములు, అభావే = ఒకసారిగా ఉండనప్పుడు, క్రమః = పౌర్వాపర్యము, కీదృశః = ఎట్టిది ?-అనగా క్రమము లేదని యర్థము.

తా. కాలము నిత్యము, వ్యాపకము అని వైయాకరణ సిద్ధాంతము. ఆ పక్షము నంగీకరించినపుడు గాని-లేదా క్రియ, క్రియచే జనించు పదార్థావయవములే పౌర్వాపర్యముతో కూడి కాలమని వ్యవహరింపబడును అను పక్షము నంగీకరించినపుడు గాని, కాలమునందు క్రమము నిరూపించుట శక్యము కాదు. అట్టి కాలభేదమే లేనప్పుడు ఆ కాలభేదమును బట్టి ఔపాధికముగ హ్రస్వ దీర్ఘ భేదము సంభవించు ననుట కుదురదు గదా !

వి. కాలము నిత్యము, నిరవయవము అన్నప్పుడు ఆకాలములో జరుగు క్రియ యొక్క అవయవములచే లేదా ఆక్రియచే జనించు పదార్థముల యొక్క అవయవములచే ఔపాధికముగ క్షణము, లవము, ఎక్కువ, తక్కువ అను భేదము కాలమునందు కల్గుచున్న దని చెప్పుట కుదురదు. ఇతర పదార్థావయవములచే కాలమునకు ఉత్కర్షాపకర్షలు సంభవించు ననుట అసంగతము.

కాల మనిత్య మనునపుడు కాలమనునది ఇతర పదార్థముల పరిమాణ రూపము. అనగా "పాలుపిండు చుండగా అతడు వెళ్లెను" అనునప్పుడు గోదోహనము అను క్రియ ఉపాధిగా కల కాలము గమనమను క్రియకు పరిమాణ మగుచున్నది. ఒకదానికి పరిమాణమగు కాలమునకు మరల వేరొకదానిచే పరిమాణ మేర్పడుట సంభవింపదు. ఇక సర్వజగత్తు నిత్య మనునపుడు పదార్థములు నిత్యమే, కాలము నిత్యమే, అయినప్పుడు నిత్యముచే నిత్యమునకు పరిచ్ఛేదము కుదురదు. సర్వము అనిత్యము అనునపుడు ఒకపదార్థములోని ముందు భాగము తరువాతి భాగము ఒకసారి ఉండుట ఎన్నడును కుదురదు కనుక క్రమము కుదురదు. ఈ విధముగ పదార్థావయవములు నిత్యము లనుకొన్నను, అనిత్యము లనుకొన్నను వాని వలన కాలమునందు భేదము కలుగునని చెప్పుట కుదురదు. ఇట్లు కాలమునందే భేదము సంభవింపనపుడు దానిభేదముచే హ్రస్వ దీర్ఘాది భేదము కల్గుననుట సర్వథా అనుపపన్నము.

క్రమముతోకూడిన పదార్థముల అవయవములచే మనబుద్ధిలో కల్గు పరిమాణ భేదముచే కాలభేదము కల్పితమగుచున్నది—అనుట కూడ యుక్తము కాదని నిరూపించుచున్నాడు.

తాభ్యో యా జాయతే బుద్ధి రేకా సా భాగవర్జితా
సా హి స్వశక్త్యా భిన్నేవ క్రమప్రత్యవమర్శినీ. 25

తాభ్యః = బుద్ధిగోచరములగు పదార్థావయవములవలన, యా బుద్ధిః = ఏ బుద్ధి జాయతే = కల్గుచున్నదో, సా = ఆ బుద్ధికూడ, ఏకా = ఒకటియై, భాగవర్జితా = విభాగములు లేనిది అగుటచే బుద్ధికూడ కాలమునందు భేదమును కల్పింపలేదు అని శంకించి సమాధానము చెప్పుచున్నాడు.

హి = ఎందువలన, సా = ఆబుద్ధి, భేదరహితమైనను, భిన్నేవ = భేదముకలది వలె ఉండి, స్వశక్త్యా = తన స్వభావముచే, క్రమప్రత్యవమర్శినీ = తనకు గోచరమగు పదార్థావయవములలో క్రమమును స్ఫురింపచేయును.

తా. ప్రకాశమాత్రస్వరూపముకల దగుటవలన బుద్ధి ఏకముగా నుండును కాని అవయవ విభాగముకలదిగా ఉండదు. ఆ బుద్ధిలో భాసించు పదార్థముయొక్క అవయవములు భిన్నములైనవియు, జడరూపములైనవియు అయినను, బుద్ధికిని దానిలో గోచరము అగు విషయమునకును తాదాత్మ్యము ఆరోపించుటచే విషయముయొక్క అవయవములు కూడ ప్రకాశరూపములే యగును. కాని ఆ పదార్థావయవముల స్వరూపము ప్రకాశమునకు విరుద్ధమైనను స్వస్వరూప పరిత్యాగము లేరయే బుద్ధి తాదాత్మ్యమునందుటచే బుద్ధియందు సహజముగ లేనిదైనను క్రమము ఉన్నట్లు గోచరించును.

వి. ఈరీతిగ చూచినచో బుద్ధియందు గూడ క్రమము లేదని తెలియుచున్నది. బుద్ధి తనకు లేని క్రమమును నిత్యము నిరవయవము నగు కాలమును కెట్లు కల్గించును ? కాలమునకు భేదము, క్రమము లేనపుడు హ్రస్వ దీర్ఘాది భేదము కాని క్రమము కాని ఎట్లు సంభవించును ?

పదార్థావయవములు క్రమముగలవి. కాని క్రమము వానిని గోచరింపజేయుటాను బుద్ధియందు ఉన్నట్లు ప్రత్యక్షముగ గోచరించుచున్నది. ఆ బుద్ధిచేతనే సంస్కారమేర్పడును. ఆ సంస్కారములో కూడ పదర్థముల క్రమము భాసించును. బుద్ధి సంస్కారము లెప్పుడును ఏకరూపముగనే ఉండును. సంస్కారముచే అనుభవము, అనుభవముచే సంస్కారము ఏర్పడుచు అనాదిగ సాగుచున్నది. ఆ సంస్కారమునందలి క్రమము బుద్ధియందుకూడ భాసించుటచే ఆక్రమమే దీర్ఘప్లుతాదిభేదమును పదవాక్యాదుల యందలి క్రమమును కల్గింపజేయునని చెప్పవీలున్నది—అనువాదమును ఖండించుచున్నాడు.

క్రమోల్లేఖానుషంగేణ తస్యాం యద్బీజమాహితమ్
తత్త్వనానాత్వయో స్తస్య నిరుక్తి ర్నావతిష్ఠతే . 26

తస్యామ్ = బుద్ధియందు, క్రమోల్లేఖానుషంగేణ = క్రమమును గోచరింపజేయగల సంబంధముచేత, యత్ బీజమ్ = క్రమమును గోచరింపజేయగల సంస్కార రూపమగు ఏ బీజము, ఆహితమ్ = పూర్వానుభవముచే నిరూపింపబడినదో, తస్య = ఆ సంస్కార రూపమగు బీజమునకు, తత్త్వనానాత్వయోః = బుద్ధికంటె అభేదము-భేదా భేదముయొక్క, నిరుక్తిః = నిర్వచనము, నావతిష్ఠతే = నిలువదు.

తా. పదార్థముయొక్క అవయవములలో గల క్రమము బుద్ధిలో భాసించుటకు ఆ బుద్ధిని కల్గించిన సంస్కారముయొక్క స్వభావము కారణము-అని అనుకొనుట కుదరదు. ఆ సంస్కార స్వభావము బుద్ధియందు నిక్షేపింప బడినప్పుడు ఆ స్వభావము బుద్ధికంటె వ్యతిరిక్తమా లేక అవ్యతిరిక్తమా అని పరిశీలింపవలెను. వ్యతిరిక్తమన్నచో ఆ స్వభావము బుద్ధిని మార్పు నొందింపలేదు. అవ్యతిరిక్తమన్నచో ఆ స్వభావము బుద్ధికంటె వేరుకాదు కనుక బుద్ధి నిర్విభాగమే యగును. కావున పదార్థావయవములు ఎట్లు బుద్ధిలో క్రమమును కల్పింపనేరవో అట్లే సంస్కార స్వభావముకూడ బుద్ధియందు క్రమమును ఏర్పరుపలేదు. అందుచే వర్ణపదాదులయందు కాలభేదము క్రమము కల్పించుట కుదురదు.

కాలమునకు గాని బుద్ధికి గాని సహజముగ క్రమము లేకుండుటచే అఖండమగు పదమునకు గాని వాక్యమునకు గాని పౌర్వాపర్యము కల్గింపలేదు. వాక్యస్ఫోటము లేదా పదస్ఫోటము చాతకాండరసమువలె విభాగ మున్నట్లు కన్పించుచున్నను అవిభక్తమే యని నిరూపించుచున్నాడు.

భావనాసమయే త్వేతత్ క్రమసామర్థ్య మక్రమమ్
వ్యావృత్తభేదో యేనార్థో భేదవా నుపలభ్యతే . 27

ఏతత్ = ఈ వాక్యము, అక్రమం = స్ఫోటస్వభావము కలదగుటచే విభాగరహిత ముగనే వాచకము, భావనాసమయేతు = వాక్యార్థము పదార్థఘటితముగ భావనచేయు నవసర మున, క్రమసామర్థ్యం = కల్పితములగు పదములనెడి ఉపాధివలన క్రమమును తెలిపెడి సామర్థ్యముకలదియై యుండును. యేన = ఏ సామర్థ్యముచే, అర్థః = వాక్యార్థము, వ్యావృత్త భేదః = అవయవభేదములేక అఖండమయ్యు, భేదవాన్ = పదార్థరూపమగు భేదము కలదివలె, ఉపలభ్యతే = తోచుచున్నదో.

తా. వర్ణపదభేదశూన్యమగు వాక్యము అఖండము. కాని లోకవ్యవహారమున వాక్యమున పదభేదమున్నట్లు భావింపబడుటచే అఖండమగు వాక్యమున పదభేద మారోపింప బడుచున్నది ఇట్లు మిథ్యారోపిత పదభేదముతో గూడినదిగా వాక్యమును అనాదిగ వ్యవహ రించు పురుషులబుద్ధిలో వాస్తవముగ లేని పౌర్వాపర్యరూపమగు క్రమము పదార్థావయవముల యందున్నట్లు కల్పింపబడును. అందుచే వాస్తవముగ అవయవభేదములేని వాక్యము ఏకము, అనవయవము అయ్యు తనకు విరుద్ధమగు పౌర్వాపర్యరూపమగు అర్థమును తనకు లేనిదానిని ఉన్నట్లు భావనాసమయమున గ్రహించుటచే భేదముకలదిగా కన్పట్టును. లోకములో వాస్తవముగ భేదము లేకున్నను ఆరోపితభేదముచే భేదమున్నట్లు భాసించుట ప్రసిద్ధమేకదా:

వి. దిక్కు అనవయవము అయినను ఆ యా అవధినిబట్టి పైన, క్రింద, ప్రక్క మొదలగు వ్యవహారము భావనచే ఆరోపింపబడి వ్యవహరింపబడుచున్నది. ఆత్మ పుట్టుచున్నది, చనిపోవుచున్నది మొదలగు వ్యవహారము నిత్యమగు ఆత్మయందు భావనచే ఉత్పత్త్యాది ధర్మములను ఆరోపించుటచేతనే కల్గుచున్నది. అట్లే వాక్యమున వాస్తవముగలేని పదవిభాగము భావనచేయు నవసరమున వ్యావహారికముగ భాసించును.

వాక్యముకంటె వేరుగ కన్పట్టు పదములే కలిసి వాక్యమనబడుచున్నవి కాని వాస్తవముగ సత్యములు పదములే. వానికంటె వ్యతిరిక్తమగు అఖండమగు వాక్యమనునది ప్రత్యేకము లేదని వాదించు పద సముదాయము వాక్యము అను మతమును దూషించు చున్నాడు.

పదాని వాక్యే తాన్యేవ వర్ణా స్తేచ పదే యది
వర్ణేషు వర్ణభాగానాం భేదః స్యాత్ పరమాణువత్ . 28

భాగానా మనుపశ్లేషా న్న వర్ణో న పదం భవేత్
తేషా మవ్యపదేశ్యత్వాత్ కి మన్య దపదిశ్యతామ్ ? 29

పదాని = వాక్యమున కాకుండా వేరుగా స్వతంత్రముగ నుండు పదములే కలిసి, వాక్యే యది = వాక్యమున నున్నవి అనినచో, అట్లే, వర్ణాః = పదమునందు కాక వేరుగా స్వతం

త్రముగ నుండు వర్ణములు, తేచ = అవియే, పదే యది = పదమున నున్నవి యన్నచో, పరమాణువత్ = పదమాణువులవలె, వర్ణేషు = వర్ణములయందుకూడ, వర్ణభాగానాం = వర్ణావయవములయొక్క, భేదః = విభాగము, స్యాత్ = కల్పింపబడవచ్చును. (అట్లు సఖండముగ నుండునని అంగీకరించినచో).

భాగానాం = వాక్యమునందు పదరూపములగు భాగములు, పదములందు వర్ణ రూపములగు భాగములయొక్క, అనుపశ్లేషాత్ = (ఒకకాలమందుండకపోవుటచే) కలయిక లేకపోవుటచే, వర్ణః = వర్ణరూపమగు అవయవి, న = ఉండదు, పదం = పదరూపమగు అవయవికూడ, న భవేత్ = ఉండదు. (వర్ణపదరూపములగు అవయవములకంటె వేరుగ పదము, వాక్యము అనునవి ఉండునని యంగీకరించక పోవుటచే), తేషాం = ఆ వర్ణరూప ములలో లేదా పదరూపములగు భావములకు, అవ్యపదేశ్యత్వాత్ = పదము లేదా వాక్యము అని వ్యవహారము లేకపోవుటవలన (వాచకము పదము—లేదా వాక్యము అనుటకు వీలుకాదు. కానినాడు) అన్యత్ = ఆ పదవాక్యములకంటె ఇతరమైనది, కిం = ఏది, అపదిశ్యతామ్ = వాచకముగా వ్యవహరింపబడును?

తా. స్వతంత్రముగ పదములుగ వ్యవహరింపబడునవి కలిసి వాక్యము, అట్టి వర్ణములు కలిసి పదము అగుచున్నవి అనినచో ఘటమును విభాగముచేసి పరమాణువుల వరకు ఎట్లు విభజించిరో అట్టే వర్ణములయందు కూడ వర్ణభాగములను కల్పింపవచ్చును. ఇట్లు కల్పించుకొనుచు పోయినచో దానికి అంతము ఉండదు. అంతేకాక అనిత్యములగు వర్ణ ములు ఉత్పత్తివినాశములు కలవియగుటచే ఏకకాలమున ఉండవు. కావున కలియుట సంభ వింపదు. వర్ణములకంటె వేరుగ పదమునుకాని పదములకంటె వేరుగ వాక్యమును కాని అంగీకరించనపుడు వాక్యార్థమునకు వాచకము ఏది?

వి. వాక్యార్థము ప్రతీతమగుచున్నదికదా? దానికి వాచకమును కల్పించవలెను కనుక నిత్యము అఖండమునగు పదము-లేదా వాక్యము స్ఫోటరూపమును శబ్దము కలదనియు అదియే వాచకమనియు అంగీకరింపవలెను.

స్ఫోటరూపమగు శబ్దము ద్వివిధము. అంతరము—బాహ్యము అని. ఆయాస్థానకరణ ములందు వాయ్వభిఘాతముచే పుట్టిన నాదములచే ప్రకాశింపచేయబడి శ్రవణగోచరమగునది బాహ్యము. ఇది అభివ్యంజకము; వ్యక్తిరూపము—జాతిరూపము అని ద్వివిధము. ఇదియు అఖండము నిత్యము. దీనిని వినుటచే బుద్ధిలో భాసించు శబ్దము అంతరము. ఇది అంతర స్ఫోట రూపము; పదరూపము, లేదా వాక్యరూపమై యుండును. అదియే వాస్తవముగ వాచకమని అంతరమగు బుద్ధ్యనుసంహారము వాక్యమని వాక్యలక్షణములలో నిర్దేశించిన భేదమును వివరించుచున్నారు.

యదంతః శబ్దతత్త్వం తు నాదైరేకం ప్రకాశితమ్
తదాహు రపరే శబ్దం తస్య వాక్యే తథైకతామ్. 30

[ఇంతవరకు బహీరూపమగు వ్యక్తిస్ఫోట జాతి స్ఫోట రూపముగల శబ్దము వాచకము అని ప్రతిపాదింపబడినది] తు = కాని, యత్ = ఏ, అంతః = హృదయమునందుండు, శబ్దతత్త్వం = జ్ఞానరూపమగు శబ్దతత్త్వము, ఏకం = విభాగరహితమయ్యును, నాదైః =

క్రమముకలిగిన ధ్వనిరూపములగు భాగములచే, ప్రకాశితం = ప్రకాశింపచేయబడునో, తత్ = ఆ, శబ్దం = పదరూపమగు శబ్దము వాచకముగ, అపరే = కొందరు, ఆహుః = చెప్పుదురు, తస్య = ఆ పదమునకు, ఏకతాం = సజాతీయభేదము, స్వగతభేదము, లేకుండుటను, ఆహుః = చెప్పుదురు, తథా = అట్లే, వాక్యే = వాక్యమునందుకూడ, ఏకతాం = ఏకత్వమును (సజాతీయ స్వగత భేద రాహిత్యమును), ఆహుః = చెప్పుదురు.

తా. శబ్దములకు అక్షరచిహ్నరూపమగు లిపి కల్పితమగుటచే ఎట్లు అవాస్తవమో అట్లే శ్రవణగోచరమగు శబ్దము వ్యక్తిరూపమేయైనను, జాతిరూపమేయైనను నశించునదే కావున వాస్తవముగ వాచకము కాదు. దానిచే బుద్ధియందు ప్రకాశింపచేయబడి బుద్ధియందు అనుసంధానము చేయబడిన పదము లేదా వాక్యమే వాచకము. ఆ బౌద్ధమగు వాక్యమున పద వర్ణరూపాది విభాగము వాస్తవముగ లేకున్నను ఏ ధ్వనులచే ఇది ప్రకాశితమగునో ఆ ధ్వనులయందుగల క్రమముచే, క్రమము కలదివలె భాసించును. ఈ బుద్ధ్యనుసంహార రూపమగు శబ్దమే వాచకము.

కేవలము వాక్యమే అఖండమును వర్ణపదరూపవిభాగరహితమును కాదు. వాక్యార్థమగు ప్రతిభకూడ పదార్థరూపవిభాగరహితమే. కల్పితములగు పదార్థరూపములగు భాగములచే విభాగము కలది వలె భాసించునని చెప్పుచున్నాడు.

అర్థభాగై స్తథా తేషా మాంతరోఽర్థః ప్రకాశ్యతే
ఏకస్యై వాత్మనో భేదౌ శబ్దార్థా వపృథక్స్థితౌ. 81

తేషామ్ = ఆంతర జ్ఞానరూపమగు అఖండ వాక్యమే వాచకము, అది వాసనారూపమున శబ్దార్థోభయాత్మకమై యుండును అని చెప్పువారి మతమున, తథా = వాక్యము వలె, అర్థః = ప్రతిభాత్మకమగు వాక్యార్థము కూడ, ఆంతరః = జ్ఞానరూపమై, అర్థభాగైః = పరికల్పితములగు పదార్థరూపములగు భాగములచే, ప్రకాశ్యతే = అభివ్యక్తము చేయబడును, శబ్దార్థౌ = ఆ శబ్దార్థములు (వాక్య వాక్యార్థములు), ఏకస్య ఆత్మనః ఏవ = ఒక శబ్ద తత్వము యొక్కయే, అపృథక్స్థితౌ = ఒకదానిని విడిచి వేరొకటియుండని, భేదౌ = విశేషములు.

తా వాచకమగు శబ్దము బౌద్ధము (బుద్ధి సంబంధమైనది) అయినట్లే వాచ్యమగు అర్థము కూడ బౌద్ధమే. ఆ యర్థము బాహ్యమగు అర్థముచే ప్రకాశింపచేయబడును. ఉపాధి వశమున నీ బాహ్యార్థమున కల్పింపబడిన పదార్థ విభాగము ఆంతరమగు బౌద్ధ వాక్యార్థమున నారోపింపబడును. అది వాసనారూపమున బుద్ధియందు నిలిచి వ్యవహారహేతు వగును. కాని వాస్తవమున జ్ఞానమే శబ్దరూపము, అర్థరూపమునై యుండును. అదియు అఖండమేయై యుండును. వాసనారూపమున శబ్దార్థోభయాత్మకత్వము, విభాగము దానియందుండును. అందుచే శబ్దము, అర్థము అనునవి అవిభాజ్యమగు అఖండజ్ఞానముయొక్క ఆరోపింపబడిన వాసనారూపమున నుండు విశేషములని ఎరుంగవలెను.

శబ్దార్థములు వాచ్యవాచకములని ప్రసిద్ధమే కదా ? వాచకము శబ్దము, వాచ్యము అర్థము–ప్రకాశకమగుటచేతనే శబ్దము వాచకమగుచున్నది. అర్థప్రకాశమున శబ్దము కారణము కావున శబ్దార్థములు కార్యకారణములుగా కూడ వ్యవహరింపబడుచున్నవి. శబ్దార్థములు ఏకత్వమే యైనచో ప్రకాశ్య ప్రకాశక భావము, కార్యకారణభావము

కుదురదు. ఒకే వస్తువు కార్యము కారణము, ప్రకాశ్యము ప్రకాశకము కూడ కాదు కదా! ఏకత త్త్వ మనుట ఎట్లు? అని శంకించి సమాధానము చెప్పుచున్నాడు.

ప్రకాశక ప్రకాశ్యత్వం కార్యకారణరూపతా
అంతర్మాత్రాత్మన _స్తస్య శబ్దత _త్త్వస్య సర్వదా . ౩౨

అంతర్మాత్రాత్మనః = (బుద్ధిలో విషయముగా శబ్దము భాసించునపుడు) విషయాత్మకమగు, తస్యశబ్దతత్త్వస్య = ఆ శబ్దతత్త్వమునకు (శక్తిద్వయ సంబంధ ముండుటవలన) సర్వదా = ఎల్లపుడు, ప్రకాశక ప్రకాశ్యత్వం = ప్రకాశక ప్రకాశ్యభావము, కార్యకారణరూపతా = కార్యకారణభావము ఉండును.

తా. బాహ్యముగ శ్రవణగోచరమగుచున్న శబ్దము కూడ కేవలము బాహ్యము కాదు. అది బుద్ధియందు గోచరమగు జ్యోతీరూపమగు శబ్దతత్త్వమే. దానికి రెండు శక్తులు కలవు. అందొకటి ఎల్లపుడు శబ్దమును విడువకయుండు ప్రకాశకశక్తి. వేరొకటి కాదాచిత్కముగ నుండు ప్రకాశ్యత్వశక్తి. శబ్దతత్త్వమున ఈ రెండు శక్తులు కూడియే యుండును. అందుచే శక్తిద్వయ యుక్తమగు శబ్దము ఒకటియే అయియున్నను బయటికి విభాగమున్నట్లు భాసించును. బుద్ధిరూపమగు ఉపాధి సంబంధముచే ఈ శబ్దతత్త్వమే విభువు, నిత్యము, నిరవయవము అగు ఆత్మస్వరూపమయ్యు అంతర్మాత్ర (బుద్ధి గోచరమగు శబ్దతత్త్వము) అని వ్యవహరింపబడును. ఇది జీవాత్మవంటిది. దీనికి సూక్ష్మమగు రూపము స్థూలమగు రూపము కూడ కలవు. సూక్ష్మమగు రూపము ఆంతరముగ పరా పశ్యంతీ మధ్యమా రూపములతో ఉండును. స్థూలరూపము, స్వరవర్ణరూపమై వైఖరీరూపమున భాసించుస. ఇది శబ్దార్థమయ మగుటచే ప్రకాశ్య ప్రకాశకత్వము విరుద్ధము కాదు. శబ్దతత్త్వమున కాలకృత పరిచ్ఛేదము లేకపోయినను ప్రకాశకత్వ శక్తితో ఎల్లప్పుడు కూడియున్నట్లుగు వ్యామోహము అవిద్యచే కల్గుచుండును.

శబ్దార్థోభయాత్మకమును జ్ఞాన స్వరూపమును అగు శబ్దత త్త్వమునకు నిత్యములగు భావాభావములు ఉండును. అవి ఏకరూపములు. క్రమరహితములు. ఐనను శక్తిభేదము వలన క్రమము కలవిగను, ఒకప్పుడుండి ఒకప్పుడు లెనివిగను భాసించును.

తస్యైవా _స్తిత్వనా _స్తిత్వసామర్థ్యే సమవస్థితే
అక్రమే క్రమనిర్భాసే వ్యవహారనిబంధనే . ౩౩

తస్యైవ = ఏకము, ఆత్మస్వరూపము, శబ్దార్థోభయాత్మకము నగు ఆ శబ్దతత్త్వమునకే, అస్తిత్వ నాస్తిత్వ సామర్థ్యే = భావము, అభావము (ఉండుట, లేకపోవుట) అను సామర్థ్యములు, సమవస్థితే = స్వరూపములై ఉండును, అక్రమే = క్రమరహితములయ్యు, క్రమనిర్భాసే = ఆ భావాభావముల క్రమము ప్రతీతమగునట్లు చేయునవియై, వ్యవహార నిబంధనే = లోకములోని శబ్దము వాచకము, అర్థము వాచ్యము అను వ్యవహారమును కల్గించుటకు కారణములగుచున్నవి.

తా. జ్ఞానరూపమై, ఏకమై ఉండు వాక్యస్ఫోటమున శబ్దార్థోభయాత్మకత నిత్యముగా ఉండును. దానికి భావము, అభావము అను రెండు సామర్థ్యములు నిత్యముగ కలవు. అవి దాని స్వరూపముకంటె వేరు కావు. ఆ సామర్థ్యముచే ఈశబ్దార్థములు లోకమున ఒకప్పు

డున్నట్లు, ఒకప్పుడు లేనట్లు భాసించుటచే ఒకటి ముందు, ఒకటి తరువాత అను క్రమము, ఒకటి ప్రకాశకము, ఒకటి ప్రకాశ్యము అను భేదము వ్యవహరింపబడుచున్నవి.

పదము పారమార్థికమను పదస్ఫోటవాదమును దూషించుచున్నారు.

సంప్రత్యయప్రమాణత్వాత్ పదార్థాస్తిత్వకల్పనే
పదార్థాభ్యుచ్చయే త్యాగా దానర్థక్యం ప్రసజ్యతే . 34

సంప్రత్యయప్రమాణత్వాత్=వాక్యమున పదములు, పదార్థములు ప్రతీయమానములగుచుండుట వలన, పదార్థాస్తిత్వకల్పనే=పదములు, పదార్థములు వాస్తవముగా నున్నవని కల్పించినచో, పదార్థాభ్యుచ్చయే = పూర్వపూర్వపదముల యర్థములతో కూడిన స్వార్థమునే తరువాతి పదములు బోధించు నను పదార్థ సముచ్చయముగ, త్యాగాత్= కేవల స్వార్థమును విడనాడుటచే, ఆనర్థక్యం= పూర్వపూర్వపదముల ఉచ్చారణమునకు వైయర్థ్యము, ప్రసజ్యతే = ప్రాప్తించును.

తా. వాక్యమున పదములు, పదార్థములు భాసించుచుండుటచే పదములు, పదార్థములు పారమార్థికములని యంగీకరించినచో ఆ పదార్థములన్నియు కలిసి వాక్యార్థముగా నుండును. కావున పూర్వపూర్వపదార్థములతో గూడిన స్వార్థమే ఉత్తరపదమున కర్థమని చెప్పవలెను. అట్లు చెప్పినచో ముందరిపదముల యర్థము తరువాతిపదములచే చెప్పబడుటచే పూర్వపదోచ్చారణము వ్యర్థమగును. అంతేకాక కేవలపదార్థమును పదము బోధింపదు కావున పదార్థము ప్రతీతమగుచుండుటచే అది పరమార్థమనుట కూడ కుదురదు.

పదము (పరమార్థముగ) వాస్తవముగ నుండునది యనినచో అది అంతటను ఏకరూపమై యుండవలెను. అట్లు కన్పట్టుట లేదు కావున పద మసత్యము అని నిరూపించుచున్నాడు.

రాజశబ్దేన రాజార్థో భిన్నరూపేణ గమ్యతే .

భిన్నరూపేణ= రాజా, రాజానం, రాజ్ఞా, రాజ్ఞే, రాజ్ఞి అని భిన్నములగు రూపములు గల, రాజశబ్దేన= రాజపదముచేత, రాజార్థః= రాజు అను అర్థము, గమ్యతే= తెలియజేయబడుచున్నది.

తా. పదము సత్యము అన్నచో అది అంతట ఏకరూపముగ ఉండియుండును. రాజరూపార్థమును తెలియజేయుపదములు ఆయా వాక్యములలో భిన్నరూపములతో కన్పట్టుచున్నవి. సత్యమే యన్నచో పదము సర్వత్ర ఏకరూపముగ కన్పట్టును. అట్లు కన్పడుట లేదు కావున పదములు మిథ్యాభూతములు.

పదము సత్యము కాదనుటకు వేరొక హేతువును చూపుచున్నాడు.

వృత్తౌ వాఖ్యాతసదృశం పద మన్య త్ప్రసజ్యతే . 35

(వాక్యములో పదము సత్యమేయయినచో) వృత్తౌ= 'రాజపురుష' మొదలగు సమస్తపదమున, ఆఖ్యాత సదృశం= 'రాజ' అను క్రియావాచకముతో తుల్యమగు, అన్యత్ పదమ్= వేరొకపదము, ప్రసజ్యతే= భాసింపవలసివచ్చును.

తా. పదములే సత్యమనినచో 'రాజపురుషః' అను సంబోధనాంతమగు సమస్త పదమును ప్రయోగించినపుడు రాజపురుషుడా ! అనునర్థమును మాత్రమేకాక, "పురుష=

ఓ పురుషుడా, రాజ = ప్రకాశించుము" అను నర్థము వచ్చునట్లు 'రాజ' అని రాజధాతువు లోట్ మధ్యమైక వచనాంతము అగు పదముకూడ ప్రతీతి విషయము కావలెను. కాని అట్టి అనుభవము లేదు. కావున వాక్యార్థగ్రహణమునకు కల్పింపబడినవే పదపదార్థములు కాని వాస్తవములు కావు.

రాజా, రాజానాం, రాజ్ఞా మొ॥ స్థలములందు రాజశబ్దము నియతరూపముగ లేదు. రాజపురుషః ఇత్యాదులలో నియతరూపమున్నను నియతముగ విశిష్టార్థమునే బోధించును కాని రాజపదము భిన్నార్థమును బోధింపదు కావున పదములు కాని పదార్థములు కాని పారమార్థికములు కావు అని నిరూపించుచు "రాజపురుష" అనునపుడు కూడ "రాజ" అనునది ప్రత్యేకార్థము కలది కాదని నిరూపించుచున్నాడు.

యథాశ్వకర్ణ ఇత్యుక్తే వినైవాశ్వేన గమ్యతే
కశ్చిదేవ విశిష్టోఽర్థః సర్వేషు ప్రత్యయ స్తథా. 86

యథా = ఏవిధముగ, అశ్వకర్ణః ఇత్యుక్తే = అశ్వకర్ణశబ్దము నుచ్చరించునపుడు, అశ్వేన వినైవ = సమాసములోనున్న అశ్వపదముయొక్క అర్థములేకయే, కశ్చిదేవ విశిష్టోఽర్థః = వృక్షవిశేషరూపమగు ఒకానొక విశిష్టార్థమే, గమ్యతే = భాసించునో, తథా = ఆవిధముగనే, సర్వేషు = సమాసము లన్నింటియందుకూడ, ప్రత్యయః = అవయవార్థము లేకుండ విశిష్టార్థమే (భాసించును).

తా. అశ్వకర్ణః మొదలగు పదములు వృక్షవిశేషవాచకములు. అవి బహువ్రీహి సమాసమున అశ్వ, కర్ణ అనుశబ్దముల కలయికచే ఏర్పడినట్లు కల్పింపబడినవి. కాని వాస్తవముగ అశ్వశబ్దార్థము ఆ సమాసముచే స్ఫురింపదు. కేవలము వ్యుత్పత్తికై పదవిభాగము కల్పింపబడినది.

అట్లే రాజపురుషః మున్నగు సమాసములలో విశిష్టార్థబోధకత్వమే కాని పదార్థప్రతీతి యుండదు. అందలి పదములు సత్యములు కావు. కాల్పనికము లని ఎరుంగ నగును.

ఇట్లు 'రాజపురుషః' మున్నగు సమస్త పదములలోగూడ అశ్వకర్ణాది సమస్త పదము లందువలె పూర్వపదార్థోత్తరపదార్థములకు అన్వయము లేదన్నచో అశ్వకర్ణాది శబ్దములు రూఢి శబ్దములు, రాజపురుషాది శబ్దము లవయవార్థస్ఫురణముండుటచే యౌగికములు అని రూఢి యోగ విభాగమెట్లు సంభవించును ? అను శంకకు సమాధానమును చెప్పుచున్నాడు.

వాక్యే త్వర్థాంతరగతేః సాదృశ్యం పరికల్ప్యతే
కేషాంచిద్ రూఢిశబ్దత్వం శాస్త్ర ఏవానుగమ్యతే. 87

వాక్యేతు = లౌకికవిగ్రహ వాక్యమునందు, వృత్తికంటె, అర్థాంతరగతేః = రాజపురుషః, ఆక్షికః మున్నగుచోట వేరొకయర్థము భాసించుచుండుటచే, సాదృశ్యం = పరస్పరము వృత్తిచే బోధింపబడు నర్థమునకును, విగ్రహవాక్యముయొక్క అర్థమునకును సాదృశ్యము, పరికల్ప్యతే = కల్పింపబడును. (అట్లు వృత్తి-వాక్యముల యర్థములకు సాదృశ్యమును కల్పించినవానిని యౌగికములందురు). కేషాంచిత్ = అశ్వకర్ణః మొదలగు కొన్ని శబ్దములకు (వృత్తి-విగ్రహవాక్యముల యర్థములందు పూర్తిగ భేదమే కల శబ్దములకు) రూఢి

శబ్దత్వం = రూఢిశబ్దములు అని వ్యవహారము, శాస్త్రే ఏవ=శాస్త్రమునందే, అనుగమ్యతే= అనుసరింపబడుచున్నది.

తా. రాజపురుషః, ఆక్షికః మున్నగునవి యౌగికశబ్దములు. అశ్వకర్ణః, తైల పాయికా మున్నగునవి రూఢిశబ్దములు. ఈ రెండువిధములగు శబ్దములలో గూడ, సమస్త పదమునకు విశిష్టార్థబోధకత్వమే కాని పదపదార్థవిభాగము కాల్పనికము. పదవిభాగము, పదార్థవిభాగము లేనపుడు యౌగికము, రూఢము అను భేదము ఎట్లువచ్చినదో చెప్పుచున్నాడు. "రాజ్ఞః పురుషః = రాజపురుషః" అనుచోట వృత్తికి, విగ్రహవాక్యమునకు అర్థము ఒకేవిధ ముగ నున్నట్లు కన్పించును. కాని శాస్త్రప్రకారము చూచినచో సమాసములో రాజపదార్థము పురుషపదార్థమునకు ఉపసర్జనముగనే భాసించును. "రాజ్ఞః పురుషః" అన్న వాక్యములో "రాజ్ఞః" అను పదార్థము ముందు భాసించి తరువాత పురుషపదార్థములో విశేషణముగ భాసించును. ఈ భేదమున్నను ఈ రెండర్థములు సదృశములని, వానిని యౌగిక శబ్దము లందురు.

అశ్వకర్ణః అనుచోట ఒకానొకచెట్టు అని సమస్తపదమునకు అర్థము. అశ్వము యొక్క కర్ణముల వంటి ఆకులు కలది అని విగ్రహవాక్యమున కర్థము. ఈ రెండర్థములకు భేదమే కాని సాదృశ్యము లేదు. కనుక ఇది రూఢశబ్దము. ఇట్టివే సంజ్ఞావాచకములు. ఆయా వ్యాకరణ కార్యములకై శాస్త్రమునందు ఈ రూఢశబ్దములను నిరూపించిరి. అంతియే కాని వాస్తవమునకు సమస్తపదములలో విశిష్టార్థమేకాని అవయవార్థము లేదు.

సమస్తపదములందు ఆయాపదములయొక్క విభాగము, వాక్యములందు పదవిభాగము, పదములందు ప్రకృతి ప్రత్యయ విభాగము ఉన్నట్లు శాస్త్రము చెప్పుచున్నది. ఆ విభాగమును పరిత్యజించుటచే శాస్త్ర ప్రామాణ్యము చెడిపోవునుకదా యని శంకించి సమాధానము చెప్పుచున్నాడు.

ఉపాదాయాపి యే హేయా స్తా నుపాయన్ ప్రచక్షతే
ఉపాయానాం చ నియమో నావశ్య మవతిష్ఠతే. 38

యే=ఏవి (పదసిద్ధికి ప్రకృతిప్రత్యయాదులు, వృత్తిసిద్ధికి పదములు మున్నగునవి), ఉపాదాయాపి=స్వీకరించియును, హేయాః=ప్రయోజనసిద్ధి అయిన తరువాత విడువదగి నవో, తాన్=వానిని, ఉపాయాన్=ఉపాయములనుగా, ప్రచక్షతే=చెప్పుదురు, ఉపా యానాం=ఉపాయములయొక్క (పదసిద్ధికై ఆశ్రయించు ప్రకృతి ప్రత్యయాది కల్పన, వృత్తిసిద్ధికై కల్పించు విగ్రహవాక్యములు), నియమః=ఈరీతిగనే యుండవలెనను నియతి, అవశ్యం=తప్పక, నావతిష్ఠతే=ఉండదు.

తా. శబ్ద పరిజ్ఞానమునకు శాస్త్రము ఉపాయము. వైయాకరణులు పదజ్ఞాన మునకు సాధనముగా ప్రకృతి ప్రత్యయములను, వృత్తి పరిజ్ఞానమునకు విగ్రహవాక్యముగ కొన్ని పదములను ఆశ్రయింతురు. అవి ఆయా శాస్త్రకారుల యభిప్రాయముచే భిన్న భిన్న ముగా కల్పింపబడును. పదస్వరూప జ్ఞానము కలిగిన తరువాత ఆ ఉపాయముల ఆవశ్య కత లేదు. కనుక అవి పరిత్యజింపబడును. అవి శాస్త్రకారులచే కల్పితములే కాని వాస్తవిక ములు కావు. కనుకనే ఒక్కొక్క వైయాకరణుడు ఒక్కొక్క విధముగ ఆ ప్రకృతి ప్రత్యయ విభాగమును కల్పించును. కావున వానిని పరిత్యజించుట దోషము కాదు.

వి. ఈ ఉపాయముల చేతనే కాక వేరొకవిధముగ ఆ జ్ఞానమును సంపాదించి నను సంపాదించవచ్చును. ఇట్లే వాక్యార్థజ్ఞానమునకు సాధనములుగ పదములు, పదార్థములు కల్పింపబడును; కాని నియమతలు కావు.

ఒకరు పాణినిరచించిన వ్యాకరణము ననుసరించి శబ్దముల నెరుంగవచ్చును. వేరొకరు మరొక వ్యాకరణశాస్త్రము ననుసరించి ఎరుంగవచ్చును. కాని సమాసరూపమున సంసృష్టమైన అర్థమైనను, విభక్తమై విగ్రహ వాక్యరూపమున నుండు అర్థమైనను వాక్యార్థముచేతనే ఎరుంగనగును కాని ప్రత్యేక మెరుంగుటకు వీలుకాదు అని నిరూపించుచున్నాడు.

అర్థం కథంచిత్ పురుషః కశ్చి త్సంప్రతిపద్యతే
సంసృష్టా వా విభక్తా వా భేదా వాక్యనిబంధనాః . ౮౯

కశ్చిత్ పురుషః = ఒకానొక పురుషుడు, అర్థం = వాక్యార్థమును, కథంచిత్ = పద పదార్థములను కల్పించుకొని ఎట్లో, సంప్రతిపద్యతే = ఎరుంగుచున్నాడు, భేదాః = పద పదార్థరూపములగు భేదములు, సంసృష్టాః వా = రాజపురుషః మున్నగువానివలె కలిసియున్నవి యైనను, విభక్తాః వా = 'రాజ్ఞః పురుషః' మున్నగువానివలె వేరుగా నున్నను, వాక్యనిబంధనాః = వాక్య వాక్యార్థజ్ఞానమును కల్గించుట కేర్పడినవే.

తా. పదస్వరూప నిర్వచనము వాక్యస్వరూపము నెరుంగుటకే. ఆ పదలక్షణ ములు భిన్న భిన్నములుగా నుండును. శ్రోత్రియ శబ్దమునకు "ఛందః అధీతే ఇతి శ్రోత్రియః", ఛందస్సును అధ్యయనము చేయువాడు అను వ్యుత్పత్తి నాశ్రయించి, ఛందస్ శబ్దమునకు శ్రోత్రాదేశమును, అధ్యయనము చేయుచున్నాడను అర్థమున "ఘన్" ప్రత్యయమును వచ్చి, ఆ ప్రత్యయమునకు ఇయాదేశమువచ్చుటచే, 'శ్రోత్రియ' రూపము నిష్పన్నమైన దని పాణిని చెప్పెను. ప్రాచీన వైయాకరణులు శ్రోత్రశబ్దమునకు, ఘన్ ప్రత్యయము చేరగా శ్రోత్రియ శబ్దము నిష్పన్నమైనదని కల్పించిరి. ఇట్లే ఆఖనిక శబ్దము 'ఆఖని' అను ప్రకృతికి ఇక ప్రత్యయము చేరుటచే ఏర్పడినదని కొందరు చెప్పగా, ఆ, ఖని, క అని మూడు భాగములుగ కల్పించి అ = అతిశయితా ఖనిః యస్య సః = అఖనికః అని కొందరు చెప్పిరి. ఈ విధముగా ఏదో ఒక విధముగ పదపదార్థజ్ఞానము కల్గించుటకు లాక్షణికులు లక్షణముల నేర్పరతురు. కాని అవి యేకరూపమున నున్నను విభక్తములై ప్రత్యేక పదము లుగ నున్నను వాక్యమున ప్రయోగింపబడినవే అర్థబోధకములగును. రాజపురుషః అన్నను రాజ్ఞః పురుషః అన్నను, అది వాక్యములో ప్రయోగింపబడినపుడు 'రాజపురుషః పశ్యతి' 'రాజ్ఞః పురుషః పశ్యతి' అనుతీరున వాక్యరూపమున నుండియే అర్థవంతము లగును. ఆ వాక్యార్థమును ఎరుంగజేయుటకే ఈ కల్పితమగు పద పదార్థ విభాగము. అంతేకాని వానికి ప్రత్యేకార్థవత్త్వము, స్వరూపము లేదు.

వి. "ఆఖనిక, శ్రోత్రియ" మొదలగు శబ్దములు ఆయా లాక్షణిక నిర్వచనముల ననుసరించి భిన్నములయినట్లు కన్పించినను, అవి అఖండములై ఉండును. ఇంతే కాక "దేవదత్త గామ్ ఆనయ" అని కొన్ని పదములతో గూడిన వాక్యమయినను, 'పిధేహి' (మూయుము) మున్నగు వ్యస్తపద రూపముగ నున్న వాక్యముమైనను, వాక్యరూపమున నున్నప్పుడే, ఆ పదములచే అర్థబోధ కలుగును. కాని ప్రత్యేకముగ పదములు అర్థబోధక

ములు కావు. పదములను విడి విడిగ చూపుట కేవలము నేర్చుకొనువారికి వాక్యార్థజ్ఞానమును కల్గించు ఉపాయమే.

వాక్యార్థము నిరవయవము, పదార్థ విభాగము వాక్యార్థ జ్ఞానమునకై కల్పితము. వాక్యము నకు వాక్యార్థమునకు తాదాత్మ్య సంబంధమును ఆరోపించుటచే, వాక్యము వినగనే వాక్యార్థము ప్రతీయమాన మగుచున్నది. వాక్యమునందు పదములు వర్ణములు అను విభాగము లేదు వాక్యార్థముతో సంబంధము సంకేతితముగ ఒక వర్ణమునకు కల్పించినను 'భా, భీ' మొదలగు వర్ణ మాత్రమున గూడ వాక్యార్థము భాసించును అని వివరించుచున్నారు.

సోఽయమి త్యభిసంబంధో బుద్ధ్యా ప్రక్రమ్యతే యదా
వాక్యార్థస్య తదైకోఽపి వర్ణః ప్రత్యాయకః క్వచిత్ . 41

యదా = ఎప్పుడు, సోఽయ మిత్యభిసంబంధః = వాక్యార్థమునకు వాక్యముతో అదే ఇది అను తాదాత్మ్య సంబంధము, బుద్ధ్యా = బుద్ధిచే, ప్రక్రమ్యతే = శాబ్దబోధకు ముందుగా తెలిసికొనబడునో, తదా = అప్పుడు, ఏకోఽపివర్ణః = వాక్యార్థమునందు సంకేతిత మగు ఒక్క వర్ణమైనను (వాక్యము వలెనే), వాక్యార్థస్య = వాక్యార్థమునకు, క్వచిత్ = ఒక్కొక్కచోట, ప్రత్యాయకః = వాచకము - అగును.

భా. పరస్పరము భిన్నములయిన అనేకపదములతో కూడిన 'గామ్ ఆనయ శుక్లామ్ దండేన' మున్నగు వాక్యరూపమున శబ్దము ఆవరుసలో నున్న తన పద ముల చేతనే వాక్యార్థమును స్ఫురింపజేయును అని నియమము లేదు. ఆ వాక్యమునందు ఒక వర్ణము సంకేతితమైయున్నచో దానివలన గూడ ఆ వాక్యార్థము స్ఫురింపగలదు. కావున పద పదార్థములకు ప్రాధాన్యము లేదు. పదమున ప్రకృతి ప్రత్యయ విభాగమునకును ప్రాధాన్యము లేదు. లోకవ్యవహారమున వాక్యార్థ జ్ఞానముకల్గినను శాస్త్రజమగు పద నిర్మాణ జ్ఞానముచే వాక్యార్థ జ్ఞానము కల్గినను సమానమే :

వి. ప్రతి వాక్యమును వ్యవహారముచే తెలిసికొనుట శ్రమసాధ్యమని శాస్త్రముచే ప్రకృతి ప్రత్యయ విభాగము, పద పదార్థవిభాగము కల్పింపబడినది. కాని, వాక్యార్థము క్రమరహితము. అది క్రమరహితమగు వాక్యమువలననే జనించును. శాస్త్రవాసన కలవారికి మాత్రము పదార్థజ్ఞాన పూర్వకముగ వాక్యార్థజ్ఞానము కలిగినట్లు భాసించుట మిథ్యా పరికల్పితమగు ప్రకృతి ప్రత్యయాది విభాగ జ్ఞాన ముండుటచేతనే అని ఎరుంగవలెను. అందుచేతనే పదమున ప్రకృతి ప్రత్యయ విభాగము ఒక్కొక్కరు ఒక్కొక్క విధముగ కల్పించుకొనిరి. "పచతి" అనుచోట పచ్-ధాతువు, అ, తి, అనువవి రెండు ప్రత్యయములు- అని కొందరు విభజింపగా, పచ్-ధాతువు, అతి-ప్రత్యయమును అని కొందరు విభజించిరి. అందుచే విభాగము నియతము కాదు. అది వాక్యార్థజ్ఞానము కల్గించుటకు సాధనముమాత్రమే అని ఎరుంగవలెను.

అభిహితాన్వయవాదమున పదసంఘాతము వాక్యము అను వాక్యలక్షణమును ఉపపాదించుచున్నాడు.

కేవలేన పదే నార్థో యావానే వాభిధీయతే
వాక్యస్థం తావతోఽర్థస్య తదాహు రభిధాయకమ్ . 41

కేవలేన = అన్వయయోగ్యమగు పదాంతరముతో సంబంధములేని, పదేన = పదముచేత, యావాన్ = ఎంత, అర్థః = అర్థము, అభిధీయతే = తెలియచేయబడునో, వాక్యస్థం = వాక్యముననుండు, తత్ = ఆ పదము, తావతఏవ అర్థస్య = అంతమాత్రపు అర్థమునకే, అభిధాయకమ్ = వాచకము అగును అని, ఆహుః = చెప్పుదురు.

తా. ఇతరపదార్థములతో అన్వయము లేక కేవలము ఏయర్థమును మాత్రము పదము బోధించునో వాక్యములో ఇతరపదములతో కలిపి ప్రయోగింపబడినపుడు కూడ ఆ పదము ఆ యర్థమునే బోధించును. పరస్పర మాపదముల యర్థముల అన్వయము (సంసర్గము) ఆకాంక్షచే తెలుపబడును. లేదా వాక్యమున లక్షణావృత్తిచే బోధింపబడును.

సంబంధే సతి యత్త్వన్య దాధిక్య ముపజాయతే
వాక్యార్థమేవ తం ప్రాహు రనేకపదసంశ్రయమ్. 42

సంబంధే సతి = కేవలపదములచే తెలియచేయబడు అర్థములకు సంబంధము కలుగగా, అన్యత్ = ఆ పదార్థములకంటె వేరుగ, యత్ ఆధిక్యం = పరస్పర సంబంధరూపమగు ఏయధికార్థము, ఉపజాయతే = భాసించునో, తం = ఆ యర్థమును, అనేకపదసంశ్రయమ్ = అనేకపదముల నాశ్రయించియున్న, వాక్యార్థమేవ = వాక్యార్థముగనే, ప్రాహుః = చెప్పుదురు.

తా. పదములు పరస్పరము కలిసి వాక్యముగా నున్నపుడు కేవల పదార్థములు కాక వానికిగల సంబంధము అధికముగ భాసించును. ఆ యధికముగ భాసించు పదార్థముల పరస్పరాన్వయరూపమగు నర్థము అనేక పదసమాశ్రయమగు వాక్యార్థముగ నెరుంగవలెను.

వి. "వీరః పురుషః" అన్నపుడు, ఆ రెండుపదములు విడివిడిగా ప్రయోగించినపుడు భాసించని విశేష్యవిశేషణభావము, లేదా ఒకే వ్యక్తియందు వీరత్వమను గుణము, పురుషత్వము అను జాతియు చేరియున్నవను సామానాధికరణ్యము భాసించుచున్నది. అది పదములు ప్రత్యేకముగ ప్రయోగించినపుడు భాసింపక కలిపి ప్రయోగించినపుడు భాసించుటచే నీ సంసర్గము వాక్యార్థమని ఎరుంగవలెను. పదాంతరముతో సంబంధము వాక్యార్థము అనినచో రాజ్ఞః (రాజుయొక్క) అనుచోట సంబంధము వేరొకపదముతో సంబంధమున్నపుడే భాసించును కనుక అది పదార్థ మెట్లగును? ఘటం (కుండను) అనుచోట కర్మత్వము క్రియావాచక పదసంబంధములేనిదే భాసింపదుకదా? అది పదార్థమెట్లగును అని శంకకలుగ వచ్చును. రాజ్ఞః, ఘటం (రాజుయొక్క కుండను) అనుచోట పదాంతర సాపేక్షమైయున్నను అది వాక్యార్థముకాదు. పదార్థమేయని శాస్త్రనిర్ణయము. పదసంస్కారమునకు ఏ యర్థ జ్ఞానము నిమిత్తమగునో ఆ యర్థము పదార్థము. రాజ్ఞః రాజుయొక్క అనుచోట షష్ఠీవిభక్తి రాజన్‌శబ్దమునకు సంబంధార్థమున చేరిననాడే రాజ్ఞః అనుపదము సాధువగును. అందుచే ఇచట భాసించు స్వస్వామిభావరూపసంబంధ జ్ఞానము పదముచే కల్గునదేయని తెలియవలెను. వీరః పురుషః అనునపుడు విశేష్య విశేషణ భావరూప సంబంధము వీరః అను పదము యొక్క సంస్కారమునకు కాని, పురుషః అను పదముయొక్క సంస్కారమునకు కాని ఆవశ్యకము కాదు. కాన నది వాక్యార్థము. కాబట్టి సంసర్గము (సంబంధము) వాక్యార్థము అనునపుడు ఆసంసర్గము యొక్క స్వభావమును బట్టి దాని పదార్థత్వము, లేదా, వాక్యార్థత్వమును ఎరుంగనగును.

సంసర్గము వాక్యార్థము, అది అనేకపదసంశ్రయము అనునపుడు అనేక పదసంశ్రయమున గల రెండు మతములను వివరించుచున్నాడు.

స త్వనేకపదస్థోఽపి ప్రతిభేదం సమాప్యతే
జాతివత్ సముదాయేఽపి సంఖ్యావ త్కల్ప్యతే పరైః. 43

సః తు = ఆ వాక్యార్థమయితే, అనేకపదస్థోఽపి = వాక్యమునందలి పదముల నన్నింటిని ఆశ్రయించి యుండునదే యయినను, జాతివత్ = జాతివలె, ప్రతిభేదం = ప్రతిపదమున, సమాప్యతే = వ్యాపించి సమాప్తమగును, పరైః = మరికొందరిచే, సంఖ్యావత్ = ద్విత్వ బహుత్వాది సంఖ్యవలె, సముదాయేఽపి = సముదాయమునందుకూడ, కల్ప్యతే = కల్పింపబడుచున్నది.

తా. జాతి భిన్నవ్యక్తులయందుండుటచే, అనేకవ్యక్తులయందున్నను ప్రతి వ్యక్తియందునుగూడ న్యూనత ఏమాత్రము లేక పరిపూర్ణముగ ఎట్లుండునో, అట్లే వాక్యార్థము అనేకపదనిష్ఠ మయ్యును ఆవాక్యమునం దుండు అర్థముకంటె ఏమాత్రము కొరవడకుండ ప్రతిపదమునందును ఉండును అని ఒక మతము. ఇరువది అనుసంఖ్య సముదాయమునే ఆశ్రయించునదైనను ప్రత్యేక మాయా ఇరువది వస్తువులందుకూడ ఇరువది అను సంఖ్యచే తెలియజేయబడుటకై ఎట్లు ఉండునో అట్లే వాక్యార్థము పదసముదాయమునందే యున్నను ప్రత్యేకపదములయందుకూడ ఉండును అని యొక మతము.

పదసంఘాతము వాక్యము అను పక్షమున అభిహితాన్వయవాదమును వివరించి అన్వితాభిధానవాదమును వివరించుచు పదార్థమే వాక్యార్థమని నిరూపించుచున్నాడు.

సర్వభేదానుగుణ్యం తు సామాన్య మపరే విదుః
త దర్థాంతరసంసర్గాత్ భజతే భేదరూపతామ్. 44

భేదా నాకాంక్షత స్తస్య యా పరిప్లవమానతా
అవచ్ఛినత్తి సంబంధ స్తాం విశేషే నివేశయన్. 45

అపరేతు = ఇతరులయితే, సర్వభేదానుగుణ్యమ్ = ఇతరపదార్థరూపములగు విశేషణము లన్నియు ఏదో ఒకసంబంధముతో అన్వయించుటకు తగిన, సామాన్యమ్ = సంబంధసామాన్యరూపమును, విదుః = పదార్థమునుగా చెప్పుదురు, తత్ = ఆ సంసర్గ సామాన్యమే, అర్థాంతర సంసర్గాత్ = వేరొకపదార్థము అన్వయించుటకు తగినది సన్నిధానమున ఉండుట వలన, భేరూపతామ్ = సంసర్గ విశేషరూపమును, భజతే = పొందును.

భేదాన్ = తనతో అన్వయించుటకు యోగ్యములగు పదార్థవిశేషములను, ఆకాంక్షతః = ఆకాంక్షించుచున్న, తస్య = ఆ సంబంధసామాన్యమునకు (పదార్థముగా ఉన్నదానికి), యా పరిప్లవమానతా = తనతో సంబంధించు పదార్థవిశేషనిశ్చయము లేకపోవుటచే గల్గిన ఏ అస్ఫుటత్వమున్నదో, తామ్ = ఆ సంబంధసామాన్యమును, సంబంధః = పదార్థాంతర సాన్నిధ్యము, విశేషే = అన్వయవిశేషమందు, నివేశయన్ = నిలుపుచు, అవచ్ఛినత్తి = తొలగించును.

తా. పదసంఘాతము వాక్యము, వాక్యఘటకములగు పదములకు కేవలముగా ఉన్నప్పు డే యర్థమో ఆ యర్థమే వాక్యమునందును ఉండును. పదార్థాన్వయ రూపమగు

సంసర్గము వాక్యశక్తిచే అభిహితమగును. అదియే వాక్యార్థమని అభిహితాన్వయవాదుల మతము. పదార్థాంతరముతో అన్వయింపతగిన స్వార్థమునే పదము బోధించును. ఆ అన్వయింపదగిన పదార్థము ఇది అని నిశ్చయముగా లేకపోవుటచే సామాన్యరూపముగ పదమే సంసర్గమునుకూడ తెలియజేయును. తనతో అన్వయింపదగిన పదార్థాంతరమును గూర్చి ఆకాంక్షించు సంసర్గసామాన్యము అర్థముగాగల పదమునకు పదార్థాంతర సాన్నిధ్యము ప్రత్యేకార్థమున అన్వయమును నిశ్చయించును. అనగా పదము మొదట సంసర్గ సామాన్యమును బోధించుననియు పదాంతర సంబంధము ఆ సామాన్యమైన సంబంధము ఏ పదార్థముతోనో నిర్ణయించు ననియు తెలియనగును. ఇట్లు చెప్పుటచే సంసర్గముకూడ పదార్థమే యనియు అదియే వాక్యార్థమనియు ప్రత్యేకము సంసర్గము వాక్యార్థము కాదనియు అన్వితాభిధానవాదమున సిద్ధాంతము.

పదార్థములకు పరస్పరము గల సంసర్గము వాక్యశక్తిచే తెలియబడునది గాదు. పదము మొట్టమొదట సంసర్గ సామాన్యమునే బోధించును. పదాంతర సన్నిధానమువలన ఆ పదార్థము ఏ పదార్థముతో అన్వయించునో ఆ సంసర్గ విశేషమున పర్యవసించును. ఈ సంసర్గ విశేషము పదార్థమే. కాని మొట్టమొదట తెలియజేయబడకపోవుటచే పదమునకు వాచ్యార్థముగ మొత్తమువాక్యమునకర్థము తెలియకమునుపు భాసింపదు. వాక్యమునకంతకు అర్థజ్ఞానము కల్గినపిమ్మట ఈ సంబంధ విశేషము కూడ పదముయొక్క అర్థమే అని అనుమానింపబడును— అని నిరూపించుచున్నాడు.

కార్యానుమేయ స్సంబంధః రూపం తస్య న దృశ్యతే
అసత్త్వభూత మత్యన్త మత స్తం ప్రతిజానతే . 46

సంబంధః= పదార్థములకుగల సంసర్గవిశేషము, కార్యానుమేయః= ఏ పదము యొక్క అర్థముతోనైనను అన్వయయోగ్యత సామాన్యముగ కలిగిన పదార్థము ఒక పదము యొక్క అర్థముతో నన్వయించుట అనెడి కార్యముచే అనుమానింపదగినది, తస్య= ఆ పదార్థ విశేషసంబంధముయొక్క, రూపం= స్వరూపము, న దృశ్యతే=వాక్యమున కంతకు అర్థజ్ఞానము కలుగకమునుపు తెలియబడదు. అతః= అందుచే, తం= ఆ సంసర్గవిశేషమును, అత్యంతం = పూర్తిగ, అసత్త్వభూతం = పదార్థమునకంటె భిన్నముగ నుండనిదానినిగ, ప్రతిజానతే= చెప్పుచున్నారు.

తా. వాక్యమున కంతకు అర్థము తెలియకముందు అన్వయించుటకు తగిన ఏదో ఒక అర్థముతో అన్వయింపదగిన అర్థమును మాత్రము పదము తెలియజేయును. తరువాత ఇతర పదార్థములతో చేరినపుడు వానితో నన్వయించిన స్వార్థమును తెలియజేయును. అందుచే పదము ముందు సంసర్గసామాన్యమును తెలుపును. తరువాత వాక్యములో ఏ పదార్థముతో అన్వయించునో మనకు తెలియును. ఇదియే సంసర్గవిశేషము. ఈ సంసర్గవిశేషము ఇతర పదార్థముతో నన్వయించిన తరువాత పదమునకే అర్థముగా మనకు గోచరించును. కాని వాక్యమునకు అంతకు అర్థము తెలియకమునుపు పదముయొక్క అర్థముగా భాసింపదు. అందుచే సంసర్గవిశేషము వాక్యమున కంతకు అర్థము తెలియకముందు లేనట్టుండి వాక్యమున నితర పదార్థములతో అన్వయించినతరువాత పదముయొక్క అర్థముగనే ఊహింప వీలగును అని సంసర్గము (సామాన్యము, విశేషము కూడ) పదార్థమే అనువారు చెప్పుదురు.

ఇట్లు అన్వితాభిధానవాదమున పదార్థముకంటె వ్యతిరిక్తమగు వాక్యార్థము లేదను భావమునే వివరించుచున్నాడు.

నియతం సాధనే సాధ్యం క్రియా నియతసాధనా
స సన్నిధానమాత్రేణ నియమః సన్ ప్రకాశతే. 47

సాధనే = క్రియకు సాధనవిశేషమగు కారకమందు, సాధ్యం = క్రియావిశేషము, నియతమ్ = అవశ్యముగ ఉండును, క్రియాపి = క్రియావిశేషముకూడ, నియతసాధనా = నియతముగ సాధనము కలదియైయుండును, సః నియమః=సాధ్యసాధనములు వ్యాప్యవ్యాపకములగుటచే నేర్పడిన ఉపకార్యోపకారకభావనియతి, సన్ = పదాంతర సన్నిధానమునకు ముందు ఉన్నదియే, సన్నిధానమాత్రేణ = పదాంతర సన్నిధానమాత్రముచే, ప్రకాశతే = ప్రకాశించుచున్నది.

తా. వాక్యములో క్రియావాచక తత్సాధన వాచక పదములు రెండును నియతముగ ఒకదానినొకటి ఆక్షేపించుకొనుచునే యుండును. అవి విడిగా నున్నపుడు వానికి వ్యాప్య వ్యాపకభావరూప నియతసంబంధము అజ్ఞాతమైయుండును. అందుచే క్రియ కారకముతోను, కారకముక్రియతోను కలిగియున్న నియతసంబంధము నిర్ధరింప వీలుకానిదై లేనట్లు కన్పించును. దానితో అన్వయింపదగిన అర్థముగల పదము సన్నిహితము కాగానే వాని నియతసంబంధము ప్రకాశించును. పదార్థమే తనతో నన్వయింపదగిన పదార్థముతో నన్వయించిన నది వాక్యార్థము. అట్టిపదాంతరములతో కూడిన పదమే వాక్యము. కావున పద పదార్థములకంటె భిన్నము కాని పదసంఘాతము వాక్యము, పదార్థసంఘాతము వాక్యార్థము అని తెలియవలెను.

క్రియాపదము కారకపదము వాక్యములో పరస్పరాపేక్షకలవై యుండునపుడు క్రియాపదము ప్రధానము, కారకము అప్రధానము అని గుణప్రధానభావము కల్పించుట ఎట్లు సరిపడు నను శంకకు సమాధానము నొసంగుచున్నాడు.

గుణభావేన సాకాంక్షం తత్ర నామ ప్రవర్తతే
సాధ్యత్వేన నిమిత్తాని క్రియాపద మపేక్షతే. 48

తత్ర = ఆక్రియ విషయమున, సాకాంక్షం = నియతముగ ఆకాంక్ష కలదియగు నామ = కారకపదము, గుణభావేన = క్రియను సాధించుటలో ఉపకారకమగుటచే అప్రధాన భావముతో, ప్రవర్తతే=తనయర్థమును బోధింపసాగును. క్రియాపదమ్=క్రియావాచకపదము, సాధ్యత్వేన = సాధింపబడునది యగుటచే, నిమిత్తాని = ఆ క్రియాసాధనమున నిమిత్తములుగ కారకపదములను, అపేక్షతే = అపేక్షించును.

తా. వాక్యమున క్రియ విధేయమగుటచే ముఖ్యము. ముఖ్యము కనుక మిగిలిన పదార్థములు దానికి సాధకములుగ అవశ్యాపేక్షితములు. కారకపదములు సిద్ధములగుటచే ఒకదానిని సాధించుట కుపకరించునవి. కావున సాధ్యము నాకాంక్షించుచు క్రియకు అంగములుగ స్వార్థములను బోధించును. క్రియ ప్రధానభావముతో కారకపదముల నపేక్షించును. ఈ విధముగ వీనికి గుణ ప్రధాన భావ మేర్పడునని ఎరుంగునది.

క్రమము వాక్యము అనుపక్షమును ఉపపాదించుచున్నాడు.

సంత ఏవ విశేషా యే పదార్థేషు వ్యవస్థితాః
తే క్రమా దనుగమ్యన్తే న వాక్య మభిధాయకమ్. 49

పదార్థేషు = దేవదత్తుడు మొదలగు పదముల యర్థములందు, యే విశేషాః = కర్తృత్వము, కర్మత్వము మున్నగు ఏ విశేషములు, వ్యవస్థితాః = ప్రసిద్ధిచే నియతములై, సంత ఏవ = పదార్థములు వాక్యార్థముగా ఏర్పడుటకు ముందు అనభివ్యక్తములై యుండునో అనియే అగు, తే = ఆ కర్తృత్వాది విశేషములు, క్రమాత్ = యోగ్యపదములయొక్క పౌర్వాపర్య రూపమగు క్రమమువలన, అనుగమ్యంతే = బుద్ధిగోచరములగుచున్నవి, వాక్యం = క్రమముకంటె విలక్షణమగు వాక్య మనునది, అభిధాయకం = వాచకము, న = కాదు.

తా. క్రమము-అనగా పౌర్వాపర్యము. ఇది కాలవ్యాపారము. అది శబ్దములయం దారోపింపబడుటచే నిత్యములగు శబ్దములలో పౌర్వాపర్యము కన్పట్టును. "దేవదత్తుడు గోవును తీసుకొని వచ్చుచున్నాడు" అను వాక్యమున వాక్యార్థము ఏర్పడకముందు కూడ దేవదత్తుడు అను దానియందు కర్తృత్వము, గోవును అను పదమునందు కర్మత్వము ప్రసిద్ధములుగా నుండనే యున్నవి. అవి యోగ్యపదముయొక్క సంబంధమున అభివ్యక్తమగును. ఆ పదము లొక క్రమములో కలిసినపుడు ఆ యర్థము లభివ్యక్తములై వాక్యార్థమును భాసింపచేయును కావున క్రమమే వాక్యార్థమునకు వాచకము కాని వేరొకటి వాక్యము కాదు.

దీనినే వివరించుచున్నాడు.

శబ్దానాం క్రమమాత్రే చ నాన్యః శబ్దోఽస్తి వాచకః
క్రమో హి ధర్మః కాలస్య తేన వాక్యం న విద్యతే. 50

శబ్దానాం = శబ్దములయొక్క, కమమాత్రే = పౌర్వాపర్య రూపమగు క్రమము మాత్రము వాచకము అని నిశ్చితమైనది కావున, అన్యః = క్రమముకంటె ఇతరమగు, శబ్దః = వాక్యస్ఫోటరూపమగు శబ్దము, వాచకః = వాచకము, నాస్తి = కాదు, క్రమః = క్రమము. కాలస్య = కాలముయొక్క, ధర్మః = ధర్మము, తేన = అందుచేత, వాక్యం = క్రమముకంటె ఇతరమగు వాక్యము, న విద్యతే = లేదు.

తా. కాలముయొక్క శక్తియే క్రమము. ఆ క్రమమే పదములయందు ఆరోపింపబడును. పదములయొక్క, పదార్థములయొక్క క్రమము మాత్రముననే వాక్యార్థము అవగతమగు చుండగా, వాక్యార్థమునకు వాచకముగ వేరొక శబ్దము నంగీకరించుట యుక్తము కాదు.

కాలముయొక్క శక్తియగు క్రమము కలిగియుండుటచే పదములు వాచకము లనుట కంటె వర్ణక్రమమే వాచకమని యంగీకరింపరాదా యను శంకకుసమాధానము చెప్పుచున్నాడు.

యే చ సంభవినో భేదాః పదార్థే ష్వవిభావితాః
తే సన్నిధానే వ్యజ్యన్తే న తు వర్ణే ష్వయం క్రమః. 51

పదార్థేషు = పదములయొక్క అర్థములందు, యే సంభవినః భేదాః = కర్తృత్వము, కర్మత్వము మున్నగు ఉండగిన ఏ విశేషములు కలవో, తే = అవి, అవిభావితాః = పదార్థాం

తరసన్నిధానము లేనపుడు అజ్ఞాతములై యున్నవి, సన్నిధానే=పదార్థాంతర సన్నిధాన మున, వ్యజ్యంతే = అభివ్యక్తము లగుచున్నవి, వర్ణేషు = వర్ణములయందు, అయం క్రమః = ఈక్రమము, న=కర్తృత్వాది ధర్మముల నభివ్యక్తముచేయ సమర్థము కాదు.

తా. పదములయొక్క అర్థములందు సహజముగ కర్తృత్వము కర్మత్వము మున్నగు భేదము లుండును. కాని యోగ్యమగు పదార్థాంతరము ప్రక్కన ఉన్నపుడు అవి అభివ్యక్త మగును. అందుచే పదములయొక్క క్రమమే వాక్యార్థమును తెలియచేయును. వర్ణములయొక్క క్రమము పదార్థములం దుండు కర్తృత్వాదుల నభివ్యక్తము చేయజాలదు. కావున వర్ణక్రమము వాచకము కాదు, పదక్రమమే వాచకమని యంగీకరింపదగును.

పదక్రమమే వాక్యము అను పక్షమును ముగించుచున్నాడు.

వర్ణానాం చ పదానాం చ క్రమమాత్రనివేశినీ
పదాఖ్యా వాక్యసంజ్ఞా చ శబ్దత్వం నేష్యతే తయోః. 52

పదాఖ్యా=పదమనుసంజ్ఞ, వాక్య సంజ్ఞాచ = వాక్యమను సంజ్ఞయును, వర్ణానాంచ = వర్ణములయొక్కయు, పదానాంచ = పదములయొక్క యు, క్రమమాత్రనివేశినీ=క్రమమునందు మాత్రమే ఉండునవి, తయోః=ఆ వర్ణములకు పదములకు, శబ్దత్వమ్=అర్థబోధకత్వము, న ఇష్యతే = అంగీకరింపబడదు.

తా. వర్ణములు, పదములు శ్రోత్రేంద్రియ గ్రాహ్యము లగుచున్నను వాచకత్వ రూపమగు శబ్దము అను వ్యవహారమును కల్గియుండవు. వర్ణములయొక్క క్రమమునకే పదమని సంజ్ఞ. పదములయొక్క క్రమమునకే వాక్యమని సంజ్ఞ. అవియే వాచకములు.

పదక్రమము శబ్దము కాని పదము శబ్దముకాదు—అనగా వాచకత్వములేదు. కాని వాక్యార్థములోని భాగములను తెల్పునది యగుటచే వర్ణక్రమమునకు కూడ వాచకత్వము కల్పించినట్లే వర్ణములకు కూడ వాచకత్వము ఏల కల్పింపరాదు ? అను శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

సమానేఽపి తు శబ్దత్వే దృష్టస్సంప్రత్యయః పదాత్
ప్రతివర్ణం త్వసౌ నాస్తి పదస్యార్థ మతో విదుః. 53

శబ్దత్వే సమానేఽపి = వర్ణములు, పదములు అనునవి రెండును శ్రోత్రేంద్రియ గ్రాహ్యములగుట అను శబ్దత్వమును కల్గియుండుటలో సమానములే అయినను, పదాత్ తు= వర్ణక్రమరూపమగు పదమువలన అయినచో, సంప్రత్యయః=వాక్యార్థములోని భాగమగు పదార్థముయొక్క ప్రతీతి, దృష్టః=కన్పట్టుచున్నది, ప్రతివర్ణంతు = వర్ణములయందు ప్రత్యేకముగ, అసౌ = పదార్థమును భాసింపచేయుశక్తి, నాస్తి=లేదు, అతః=అందువలన, పదస్య=వర్ణక్రమరూపమగుపదమునకు, అర్థమ్=వాక్యార్థములో భాగమును అర్థమునుగ, విదుః=చెప్పుచున్నారు.

తా. పదములయొక్క క్రమమే వాచకముగాని పదములు వాచకములు కావు. కాని వాక్యార్థములోని భాగములు ఆ పదములు వినునపుడు ప్రతీతము లగుచుండుటచే ఆ పదములకు అవి అర్థములని కల్పించిరి. పదములకు యథార్థముగ వాచకత్వము లేనట్లే వర్ణములకు కూడ వాచకత్వము లేదు. ఆ పదములయందు గల శ్రోత్రేంద్రియ గ్రాహ్యత్వము

వర్ణములయందును గలదు. అందుచే వర్ణములకు కూడ పదములకు వలెనే అర్థవత్త్వము ఏలకల్పింపరాదు అని శంకింపబనిలేదు. పదమువలన వాక్యార్థభాగము స్ఫురించునట్లు వర్ణమువలన ఏ అర్థము స్ఫురించుటలేదు. కావున పదము లర్థవంతములు— వర్ణములు అనర్థకములు. వాస్తవమునకు పదక్రమమే వాక్యము, సంసర్గమే వాక్యార్థము అని ఎఱుంగ వలెను.

ఇంతవరకు 1. "పద సముదాయము" 2. "క్రమము" 3. "అనవయవము, ఏకము అగుశబ్దము" వాక్యము అనుపక్షములు మూడును వివరింపబడినవి. ఆమూడు వాక్యలక్షణము లను మూడు శ్లోకములతో ఉపసంహరించుచున్నాడు. పద సముదాయము వాక్యము అనుపక్ష మును మొదట ఉపసంహరించుచున్నాడు.

యథా స్యావయవా వర్ణా వినా వాచ్యేన కేనచిత్
అర్థవంత స్సముదితా వాక్యమ ప్యేవ మిష్యతే. 54

యథా=ఎట్లు, అస్య=వర్ణసముదాయరూపమగు పదముయొక్క, అవయవాః = అవయవములగు, వర్ణాః = వర్ణములు, కేనచిత్ వాచ్యేన వినా=వాచ్యమగు నర్థము ఏదియు లేక యుండునో, సముదితాః=పరస్పరము కలిసి ఆవర్ణములే,అర్థవంతః = అర్థముకలవియగునో, తథా = అట్లు, వాక్యమపి = వాక్యముకూడ, ఏవం = పదములు ప్రత్యేకము వాక్యార్థమును బోధింపనివియై కలిసి వాక్యార్థమగు సంసర్గమును బోధించునదిగా, ఇష్యతే = భావింపబడు చున్నది.

తా. పదముయొక్క అవయవములగు వర్ణములకు అర్థములేదు. ఆ వర్ణముల యొక్క సముదాయరూపమగు పదమే అర్థబోధకము. అట్లే పదములకు ప్రత్యేకము వాక్యార్థ మును బోధించు శక్తి లేదు. పద సముదాయరూపమగు వాక్యము పదార్థ సంసర్గరూపమగు వాక్యార్థమును బోధించును. కావున పదసముదాయమే వాక్యమని ఎరుంగవలెను.

క్రమము వాక్య మను పక్షము నుపసంహరించుచున్నాడు.

అనర్థకా న్యుపాయత్వాత్ పదార్థే నార్థవంతి వా
క్రమే ణోచ్చరితా న్యాహుః వాక్యార్థం భిన్నలక్షణమ్. 55

ఉపాయత్వాత్ = వాక్యార్థజ్ఞానము కల్గించుటకు ఉపాయము లగుటవలన (కేవల పదములు), అనర్థకాని = అర్థరహితములు; లేదా, పదార్థేన = పదములయొక్క అర్థముచేత, అర్థవంతి = అర్థముకలవి- కాని వాక్యార్థము బోధించు సామర్థ్యము లేనివి, క్రమేణ ఉచ్చరి తాని = క్రమముతో ఉచ్చరింపబడిన పదములే వాక్యార్థబోధకములు, భిన్నలక్షణం = పద ములయొక్క అర్థముకంటె భిన్నమగునది (సంసర్గము లేదా సంసర్గవిశేషముగల పదార్థము), వాక్యార్థం = వాక్యార్థము అని, ఆహుః = చెప్పుచున్నారు.

తా. క్రమము వాక్యము అను మతమున రెండు పక్షములు కలవు. అందు మొదటిపక్షమున పదములు స్వార్థమును బోధించును. వానిక్రమము వాక్యార్థమగు సంసర్గ మును బోధించును. అందుచే వాక్యార్థమును బోధించుట కుపాయము లగుటవలన వీనికి వాక్యార్థమును తెలియజేయు శక్తి లేకపోవుటచే పదము లర్థరహితములు. వాక్యార్థము పదార్థములకంటె భిన్నమగు ఆ పదార్థముల పరస్పర సంసర్గము.

రెండవపక్షమున పదములు సామాన్యముగ ఇతరపదార్థముతో నన్వయించు స్వార్థమును బోధించును. ఆ పదముల క్రమము విశేషముగ ఒక ప్రత్యేకపదార్థముతో అన్వయించిన పదార్థరూపమగు వాక్యార్థమును మనకు భాసింపచేయును. మొదటి పదముచే బోధింపబడు అర్థము సంసర్గసామాన్య విశిష్టము. ఏ పదముయొక్క అర్థముతోనైన అన్వయించురీతి నుండునది. తరువాత క్రమముచే ఆ పదముయొక్క అర్థము ఆ వాక్యములోని ఏదోఒక పదార్థముతో అన్వయించుటచే పదార్థవిశేషసంసర్గవిశిష్టము. ఈ పదార్థమే వాక్యార్థము.

ఈ రెండువిధములగు వాక్యార్థములకు బోధకము క్రమమే యని ఎరుంగవలెను.

అనవయవము, ఏకమునగు శబ్దము వాక్యము అనెడి స్ఫోటపక్షము నుపసంహరించు చున్నాడు.

నిత్యత్వే సముదాయానాం జాతే ర్వా పరికల్పనే
ఏకస్యై వార్థతా మాహుః వాక్య స్యావ్యభిచారిణీమ్ .　　56

సముదాయానాం = పదసముదాయములుగ భావింపబడు వాక్యస్ఫోటములకు, నిత్యత్వే = నిత్యత్వమును స్వీకరించినపుడు, లేదా, సముదాయానాం = వక్తృభేదముచేతను, కాలభేదముచేతను భిన్నములగు పదసముదాయములయొక్క, జాతేః వా = జాతిరూపమగు వాక్యస్ఫోటముయొక్క, పరికల్పనే = కల్పనమునగాని, ఏకస్య వాక్యస్య ఏవ = వాక్యవ్యక్తి రూపమగు స్ఫోటమునకే, లేదా, వాక్యజాతి రూపమగు స్ఫోటమునకే, అవ్యభిచారిణీం = ఆ స్ఫోటరూపమగు వాక్యమును నియతముగ విడచియుండని, వాక్యార్థతాం = ప్రతిభారూపమగు వాక్యార్థము సంబంధించియుండునని, ఆహుః = చెప్పుదురు.

తా. "దేవదత్తః గామ్ ఆనయ" (దేవదత్తః గోవునుతెమ్ము) అను వాక్యమును ఒకేవ్యక్తి పలుసార్లు ఉచ్చరింపవచ్చును. లేదా వేరువేరు వ్యక్తులు భిన్నకాలములలో ఉచ్చరింపవచ్చును. కాని ఆ వాక్యములన్నింటిని విన్నపుడును ఆ వాక్యమే యిది అని గుర్తింపబడు చుండుటచే ఆ వాక్యములచే అభివ్యక్తమగు ఒకేవాక్యము వ్యక్తిస్ఫోటము, నిత్యము, అర్థబోధకము. ఆ వాక్యమే ప్రతిభ యనెడి అఖండవాక్యార్థమును బోధించును. ఇది వ్యక్తిస్ఫోట పక్షము.

వేరువేరు వ్యక్తులు వేర్వేరుకాలములలో లేదా ఒకేవ్యక్తి భిన్నకాలములలో నుచ్చరించిన వాక్యములు అనిత్యములు. ఆ అనిత్యములగు వాక్యములచే నిత్యమగు జాతిరూపమగు వాక్యము స్ఫోటరూపము అభివ్యక్తమగును. అదియే అర్థబోధకము. ఇది జాతిస్ఫోటము. ఆ వాక్యమే నిత్యము, అఖండమునగు వాక్యార్థమునకు వాచకము.

ఈ విధముగ సంఘాతము, క్రమము, స్ఫోటము అను మూడు పక్షములలోని వాక్య స్వరూపము వివరింపబడినది. ఇకముందు ఆఖ్యాతము వాక్యము అను మతమును వ్యాఖ్యానింప బోవుచు వాక్యము, వాక్యార్థముకూడా అఖండములే యని వివరించుచున్నారు. అఖండ పక్షము సూత్రకారుడగు పాణినికి భాష్యకారుడగు పతంజలికి గూడ సమ్మతము. పాణిని "తిఙ్ఙతిఙః" అను సూత్రమున అతిఙః అను పదముచే అఖండమగు వాక్యార్థమును బోధించు నదే అఖండమగు వాక్యము అని సూచించెను. తిఙన్తముకాని పదముకంటె పరమగు తిఙన్త

మునకు నిఘాతము వచ్చునని పాణిని సూత్రించెను. ఒకే తిఙన్తపదము ఒకవాక్యములోనుండు నని నియమము నంగీకరించినచో ఒకవాక్యములో తిఙన్తపదముకంటె పరమైన తిఙన్తపదము ఉండనే యుండదు కనుక "అతిఙః" అనుట వ్యర్థము. అందుచే పాణిని ఉద్దేశమున పదము లనుబట్టి వాక్య లక్షణము చెప్పుట సరికాదనియు అఖండమగు అర్థమును బోధించునది వాక్యమనియు, అందు ఒక క్రియావాచకపద మున్నను అనేకము లున్నను నుండవచ్చుననియు తెలియుచున్నది. అందుచే పదవిభాగము కాల్పనికము వాక్య మఖండమని సూత్రకారాభిమతము, ఇక పతంజలి మహాభాష్యమున "నలక్షణేన పదకారా అనువర్త్యాః, పదకారైర్నామ లక్షణ మనువర్త్యమ్" 'లక్షణము పదకారుల ననుసరింపతగదు. పదకారులు లక్షణము నను సరింపతగును' అని చెప్పెను. పదములే సత్యమని పతంజలి యభిమతమైనచో పదకారు లనుట అసంగతముకదా ! పదమును నిర్మించువారలు పదకారులు, పదములు సత్యములే యయినచో వానిని నిర్మించుటఎట్లు ? పదకారులు లక్షణము ననుసరించి నిర్మింపవలెననుట మాత్రము పదములు సత్యములే యైనపుడు అంతకుముందే యున్నవి గనుక ఎట్లు సంగతమగును ? కావున భాష్యకారుల మతమున అఖండమగు వాక్యమే సత్యము. పదములు లాక్షణికులచే అబుధ బోధమునకు కల్పితములు. కావున అఖండవాక్యసిద్ధాంతమే ఆదరణీయము. ఇ దినినే నిరూపించుచున్నాడు.

అభేదపూర్వకా భేదాః కల్పితా వాక్యవాదిభిః
భేదపూర్వా నభేదాంస్తు మన్యంతే పదదర్శినః . 57

వాక్యవాదిభిః=పదవిభాగ రహితమగు వాక్యస్ఫోటము గలదను వాదులచే, అభేదపూర్వకాః = వాక్యము సత్యము ఏకము అని ముందు అంగీకరించి, భేదాః = దానినెరుంగుటకు పద విభాగములు, కల్పితాః = కల్పింపబడినవి, పదదర్శినః = వాక్యము సఖండము అని యంగీకరించువారు, భేదపూర్వాన్=వాస్తవముగ పద విభాగము కలదని ముందు అంగీకరించి, అభేదాన్=ఆ పదములు అవిభక్తమగు వాక్యములుగా నుండుటను, కల్పితాన్=కల్పింపబడినవానినిగా, మన్యంతే = తలంతురు.

తా. సుగమము.

పదములు సత్యములు కానినాడు "పదప్రకృతిః సంహితా" 'పదమూలకము సంహిత' యను ప్రాతిశాఖ్య ఎట్లు సమన్వయించును ? పదములు అసత్యములైనపుడు వానివలన ఏర్పడు సంహితకూడ అసత్యమే అగునుకదా ? అని వాక్యము అఖండము అను పక్షమున పదప్రకృతిః సంహితా అను వాక్య మసంగతమగు నని శంకించి సమాధానముచెప్పుచున్నాడు.

పదప్రకృతిభావశ్చ వృత్తిభేదేన వర్ణ్యతే
పదానాం సంహితా యోనిః సంహితా వా పదాశ్రయా . 58

పదప్రకృతిభావశ్చ = సంహితకు పదప్రకృతిత్వము, వృత్తిభేదేన = బహువ్రీహి, షష్ఠీతత్పురుష సమాభేదముచే, వర్ణ్యతే=నిరూపింప వీలగుచున్నది, పదానాం=పదములకు, యోనిః= మూలము, సంహితా = వాక్యధర్మమగు సంహిత అని షష్ఠీతత్పురుషముకాని, సంహితా=సంహిత, పదాశ్రయా=పదములు మూలముగా కలిగియుండునది అని బహువ్రీహి సమాసముకాని చెప్పవచ్చును.

తా. పదములయొక్క సన్నిధానము సంహిత. ప్రాతిశాఖ్యమున సంహిత పదప్రకృతి అని చెప్పిరి. పదములు కాల్పనికములు, వాక్యమఖండము అన్నపుడు పై

లక్షణమెట్లు కుదురునని సందేహింప నక్కరలేదు. పదసత్యత్వవాదులు సఖండము వాక్య మని పదములు ప్రకృతిగా కలది అని బహుప్రీహి సమాసము నాశ్రయించి సంహిత పద మూలకమని చెప్పుదురు. కాని వాక్యము అఖండము, సత్యము; పదములు కల్పితములను నపుడు పదములకు ప్రకృతి సంహిత యని షష్ఠీతత్పురుషము నాశ్రయించి సంహితనే విభ జించి పద విభాగము కల్పించబడినది. కావున సంహిత పదములకు మూలమని ఎరుంగ వలెను. పై విధమున షష్ఠీతత్పురుషము నాశ్రయించుటచే పదప్రకృతి సంహిత యగుటలో విరోధము లేదు.

వాక్యము అఖండము, అదియే సత్యము, అపౌరుషేయము; పదములు కల్పితములు అని భావించువారు అఖండవాదులు. పదములే సత్యములు, అపౌరుషేయములు; వాని సంసర్గ రూపమే వాక్యము, అది కల్పితము అనువారు సఖండవాదులు. నిత్యము• ఏకము నగు శబ్ద మునకు రెండు శక్తులు కలవు: విభాగశక్తి, అవిభాగశక్తి! అవిభాగశక్తి వాక్యరూపము, అవిభాగశక్తి పదరూపము అని సఖండాఖండవాదుల మతము. వెనుక భాష్యకారుడు "న లక్షణేన పదకారా అనువర్త్యాః" అని చెప్పుటచే పదము లసత్యములు, వాక్య మఖండ మని చెప్పినాడు. పదము సత్యము అను వాదమున పై భాష్యకారుల వాక్య మెట్లు సమర్థింప బడును ? అని శంకించి సమాధానమును చెప్పుచున్నాడు.

పదామ్నాయశ్చ యద్యన్యః సంహితాయా నిదర్శకః
నిత్య స్తత్ర కథం కార్యం పదం లక్షణదర్శనాత్ . 59

సంహితాయాః=పద సన్నిధి రూపమగు వాక్యరూప సంహితకు, నిదర్శకః = ప్రతిపాదకమగు, పదామ్నాయశ్చ=పదరూపమగు శబ్దము కూడ, అన్యః=వాక్యముకంటె భిన్నమగునది, యది నిత్యః=నిత్యము అయినచో, తత్ర=ఆ మతమున, లక్షణదర్శనాత్= సూత్రప్రవృత్తివలన, పదం=పదము, కార్యం=నిర్మింపబడవలెను అని భాష్యకారులు చెప్పి నది, కథం=ఎట్లు కుదురును?

తా. పదమే నిత్యము, సత్యమునగు శబ్దము. అట్టిపదములే సంహితారూపమున నుండు వాక్యమన్నచో పదకారులు లక్షణము ననుసరింపవలెనని పదములను కార్యములనుగా చెప్పుట సంగతము కాదు కనుక వాక్యము అఖండమే యని అంగీకరింపవలెను. అని అఖండ వాక్యపక్షమున ఈ కారికయొక్క భావము. సఖండవాక్య పక్షమున ఈ కారికకు అర్థము మరియొక విధముగ భావింపవలెను. పదకారులు అను శబ్దమునకు పదస్రష్టలు అనియర్థము కాదు. పదప్రయోక్తలని యర్థము. వాక్యముకంటె భిన్నమగు పదము నిత్యము అని యంగీకరించునపుడు ఆ పదములను ప్రయోగించువారు నిత్యమగు పదార్థసంబంధమును అవిద్యచే ఎరుంగజాలరు కనుక సమ్యగ్జ్ఞానము కల ఋషులు చెప్పిన లక్షణము ననువర్తించి ప్రయోగింపనగును. లక్ష్యము సిద్ధము కనుక దానిని శాస్త్ర మనుసరించవలెను కాని నిత్య మగు లక్ష్యము శాస్త్రము ననుసరింపదు అని భాష్యకారుల యభిప్రాయముగా ఎరుంగనగును.

శబ్దము విభాగావిభాగరూప శక్తిద్వయ సహిత మనువారి మతము ఒకశబ్దమున రెండు విధములగు విభాగము లేర్పడు శక్తి యున్నపుడు ఒకేవిధమగు విభాగము గుర్తింప బడవలెనని, ఏవిధమగు శక్తి తొలగింపబడునో దానిని లక్షణముచే నెరుంగవలెను అని పద కారులు లక్షణము ననుసరింపవలెననుదాని యర్థము. "వక్షస్సురుక్మ" అను శబ్దము వక్షః,

సురుక్మ అనియు, వక్షస్సు, రుక్మ అనియు గూడ విభజింపబడు శక్తియుండ వక్షస్సు, రుక్మ అను విభాగమేకాని వక్షస్, సురుక్మ అను విభాగశక్తి భాసింపకుండుటకు లక్షణము ననుసరింపవలెను. ఇట్లు భాష్యకారుని వాక్యమును మూడు విధముల నన్వయింప వచ్చును. కాని అఖండపక్షమే భాష్యకారాభిమత మని గ్రహింపవలెను.

పదసత్యత్వ వాదమున నొక ఆక్షేపమును చేయుచున్నాడు,

ప్రతివర్ణ మసంవేద్యః పదార్థప్రత్యయో యథా
పదేష్వేవ మసంవేద్యం వాక్యార్థస్య నిరూపణమ్ . 60

యథా=ఎట్లు, పదార్థ ప్రత్యయః=పదముయొక్క అర్థజ్ఞానము, ప్రతివర్ణం=ఆ పదమునందలి ప్రతి వర్ణము నందును, అసంవేద్యః=భాసింపదో, ఏవం=ఈవిధముగనే, వాక్యార్థస్య=వాక్యార్థముయొక్క, నిరూపణం=ప్రతీతి, పదేషు=పదములయందు- ప్రతి పదమునందు, అసంవేద్యం=భాసింపదు.

తా. దేవదత్త అను పదములోని దే, వ, మొదలగు వర్ణములచే పదార్థము భాసింపదు. దేవదత్త అను పదముచే అఖండముగనే భాసించును. కావున వర్ణములు అనర్థకములు. అట్లే 'దేవదత్త గా మానయ' అను వాక్యముయొక్క అర్థము ప్రత్యేక పదములచే ప్రతీతి గోచరముకాక వాక్యముచేతనే అఖండముగ బోధింపబడును. అందుచే పదములో వర్ణములవలె వాక్యములో పదములు కూడ అర్థరహితములే. అర్థము కలదగుటచే వాక్యమే సత్యము. పదములు అనర్థకములు కనుక అసత్యములే యని భావము.

పదసత్యత్వవాది మతములో పదములకు వాక్యార్థభాగము అర్థముగా భాసించుచుండుటచే అర్థమున్నది అని అంగీకరించినపుడు పదము యొక్క అర్థముచేత వర్ణములు ప్రత్యేకముగ అర్థవంతములే యగును అను ఆక్షేపణకు పదసత్యత్వవాది సమాధానము చెప్పుచున్నాడు.

వాక్యార్థః సన్నివిశతే పదేషు సహావృత్తిషు
యథా తథైవ వర్ణేషు పదార్థః సహావృత్తిషు . 61

సహావృత్తిషు=ఇతర పదములతో కలిసియున్న, పదేషు=పదములయందు, వాక్యార్థః=వాక్యములయొక్క అర్థము, యథా=ఎట్లు, సన్నివిశతే=పదాంతర సన్నిధానము వలన ప్రతీయమాన మగునో, తథైవ=అట్లే, సహావృత్తిషు = వర్ణాంతరములతో కలిసి యున్న, వర్ణేషు=వర్ణములయందు కూడ, పదార్థః=పదముయొక్క అర్థము, సన్నివిశతే= వర్ణాంతర సన్నిధానమువలన ప్రతీయమానమగును.

తా. పదములు ఒకదానితో ఒకటి కలిసి యున్నప్పుడు వాక్యార్థమును స్ఫురింపజేయుచుండుటచే ఎట్లు అర్థవంతము లగుచున్నవో అట్లే వర్ణములు కూడ ఇతర వర్ణములతో కలిసి పదార్థమును స్ఫురింపజేయుటచే అర్థవంతములేయని ఎఱుంగవలెను.

వి. కేవల పదములు ఎట్లు వాక్యార్థమును ఎరింగింపజాలవో అట్లే కేవల వర్ణములు పదార్థమును ఎరింగింపజాలవు. అంతమాత్రముచే అవి అనర్థకములు అనరాదు. ఒక పదమునం దర్థము లేకపోయినచో ఇతర పదములతో కలిసినపుడు కూడ దానికి అర్థవత్త్వము కలుగదు. ఒక యిసుకరేణువునందు నూనె లేకపోయినచో ఎన్ని రేణువులు

కలిసినను నూనె ఉండదు గదా ః కావున వర్ణములు, పదములు అర్థవంతములే. అవి పరస్పర సంసృష్టములై అర్థబోధకము లగును.

వర్ణములు కూడ అర్థవంతములే అయినచో పదము వినగనే పదార్థము ప్రతీత మయినట్లు వర్ణము వినగనే అర్థము స్ఫురించుట లేదేమి ? అను ప్రశ్నకు సమాధానము నిచ్చుచున్నాడు.

సూక్ష్మం గ్రాహ్యం యథాఽన్యేవ సంసృష్టం సహ గృహ్యతే
వర్ణోఽప్యన్యేన వర్ణేన సంబద్ధో వాచక స్తథా . 62

సూక్ష్మమ్=సూక్ష్మమైనదైనను, గ్రాహ్యమ్=గ్రహింపదగిన వస్తువు (విడిగా గ్రహింపబడకున్నను), అన్యేన సంసృష్టమేవ=వేరొక వస్తువుతో కలసినదై, యథా=ఎట్లు, గృహ్యతే=గ్రహింపబడుచున్నదో. తథా=అట్లే, వర్ణః అపి=వర్ణముకూడ, అన్యేన వర్ణేన= వేరొక వర్ణముతో, సంబద్ధః=కూడినదై, వాచకః=అర్థబోధక మగును.

తా. సూక్ష్మములైన కేశ మక్షికాది వస్తువులుగాని, పరాగ రేణువులుగాని విడిగా ఉన్నప్పుడు గ్రహింపదగినవలైనను గ్రహించుటకు వీలుకానివైనను ఇతర వస్తువులతో కలిసి యున్నప్పుడు గ్రహింపబడుట లోకములో గోచరించుచున్నది గదా ? అట్లే వర్ణములు విడిగా నుచ్చరించునపుడు అర్థముకలవే అయినను మనమా అర్థమును గ్రహింపలేము. అవి కలసినపుడు మనకు అర్థప్రత్యాయకము లగుచున్నవి.

వర్ణములు అర్థరహితములు కనుక పదము అనర్థకము అనుట యుక్తముగాదు. వర్ణముల కానర్థక్యము నంగీకరించుట ప్రత్యక్ష విరుద్ధము అని చెప్పుచున్నాడు.

పద స్యోచ్చారణా దర్థో యథా కశ్చి న్నిరూప్యతే
వర్ణానా మపి సాన్నిధ్యాత్ తథా సోఽర్థః ప్రతీయతే . 63

యథా = ఎట్లు, పదస్య = కేవలము ఒక పదముయొక్క, ఉచ్చారణాత్ = ఉచ్చారణమువలన, కశ్చిత్ అర్థః = పదార్థమని వ్యవహరింపబడు ఒకానొక అర్థము, నిరూప్యతే = గ్రహింపబడుచున్నదో, తథా = అట్లు, వర్ణానామ్ = వర్ణములయొక్క, సాన్నిధ్యాత్ అపి = సన్నిధానమువలనకూడ, సః అర్థః = ఆ యర్థమే, ప్రతీయతే = తెలియజేయబడుచున్నది.

తా. ఒకపదము ఉచ్చరించగనే ఏ అర్థము స్ఫురించుచున్నదో ఆ యర్థము ఆ పదము వలననే కలిగినదని ఎట్లు అనుకొనుచున్నామో అట్లే ఆ పదములోని వర్ణములు కలిపి పలుకగానే ఆ యర్థము స్ఫురించిన దనుకొనినచో ఆ వర్ణముల సముదాయమే ఆ యర్థమును బోధించినదని అనుకొనవచ్చును. అందుచే వర్ణముయొక్క సముదాయముకంటె విలక్షణమగు పదముగాని పదముయొక్క సముదాయముకంటె విలక్షణమగు వాక్యముగాని లేదు. పరస్పరము కలిసిన వర్ణములే పదార్థమునకు వాచకములు. పరస్పరము కలిసిన పదములే వాక్యార్థమునకు వాచకములు.

పదములచే వాక్యములు, పదార్థములచే వాక్యార్థములు భాసించునని యంగీకరించినచో పదార్థములు యథార్థముగ లేవు కనుక (1)'కుశ'లు లేనిచో ప్రతినిధిగ 'శర'ములు= రెల్లు కల్పింపవలెననుట ఎట్లు సంభవించును?(2)ఈ వాక్యములో 'పిక' పదమున కర్థము ఏమి?

అని ఒక పదమునకు మాత్రము అర్థముతెలియక ప్రశ్నించుట ఎట్లు ? (3) శ్రుతి లింగ వాక్య ప్రకరణ స్థాన సమాఖ్యలు అను ఆరు ప్రమాణములలో వాక్య ప్రమాణముకంటె పదశ్రుతి రూప ప్రమాణము బలవత్తరము అనుట ఎట్లు ? (4) ఒక మహావాక్యములో అవాంతర వాక్యములకు అర్థవత్త్వము ఎట్లు ? అని శంకలు కలుగుచున్నవి. అందు మొదటిది పదార్థ ప్రతినిధికల్పన మఖండవాక్యార్థ పక్షమున కుదరదని శంకించుచు పదార్థమునకు ప్రతినిధిగ వేరొక పదార్థమును విధించుటను గూర్చి చర్చించుచున్నాడు.

ప్రాప్తస్య యస్య సామర్థ్యా న్నియమార్థా యతః శ్రుతిః
తే నాత్యంతం విశేషేణ సామాన్యం యది బాధ్యతే. 64

సామర్థ్యాత్ = 'యజేత' అనుచోట యజతిక్రియయొక్క సామర్థ్యమువలన, ప్రాప్తస్య = లభించిన, యస్య = ఏ వ్రీహిత్వరూపజాతియొక్క, శ్రుతిః = వ్రీహిభిః అను పదముచే నిర్దేశింపబడుట, యతః = ఎందుచే, నియమార్థా = వ్రీహులచేతనే యాగముచేయ వలెనను నియమమును బోధించునో, తేన = అందుచే, విశేషేణ = వ్రీహియనబడు ద్రవ్య విశేషముచే, సామాన్యం = ద్రవ్యసామాన్యము, అత్యంతం = పూర్తిగ, బాధ్యతే యది = బాధింపబడును అనినచో.

యజేతేతి యదా ద్రవ్యం ప్రాప్తం సామర్థ్యలక్షణమ్
వ్రీహిశ్రుత్యా నివర్తేత న స్యాత్ప్రతినిధి స్తదా. 65

యజేతేతి = యజేత అనుచోట యజతి క్రియచే యాగైకదేశముగ, ప్రాప్తం = ద్రవ్య సామాన్యమున విశేషముగ అన్వయించు వ్రీహిత్వమువలె ప్రాప్తమగు, ద్రవ్యం = యవత్వ రూపమగు ద్రవ్యము, సామర్థ్యలక్షణం = యజతి క్రియాసామర్థ్యముచే లభించునది, యదా = ఎపుడు, వ్రీహిశ్రుత్యా = వ్రీహిపదశ్రవణముచే, నివర్తేత = నివర్తించునో, తదా = అపుడు, ప్రతినిధిః = వ్రీహులకు యవలు ప్రతినిధి, న స్యాత్ = కాకపోవును.

తా. (64, 65) 'యజేత' అనుచోట 'యజ్' అనుధాతువు ద్రవ్యదేవతా రూప మగు యాగస్వరూపమును తెలుపును. ద్రవ్యత్వరూపమున ఏ ద్రవ్యమైనను ఇందు సాధన ముగ ఉండవచ్చును. ద్రవ్యత్వములో వ్రీహిత్వము, యవత్వము అను విశేషజాతుల రూప మునసైనను ఉండవచ్చును. యాగైకదేశముగ యజతిక్రియచే తెలుపబడు ద్రవ్యము ద్రవ్యత్వరూపమునకాక వ్రీహిత్వ యవత్వాది రూపమున నుండునను మతమున వ్రీహులకు, యవలకు కూడ యాగములో సాధనములుగా నుండుటకు అర్హత యుండగ "వ్రీహిభి ర్యజేత" అనుచోట వ్రీహిభిః అను పదము వ్రీహులతోనే యాగముచేయవలెను అను నియమమును చేయుటచే "యవ" లకు యాగసాధనత్వము లేదని ఈ "వ్రీహిభి ర్యజేత" అను వాక్యము నియమించినపుడు వ్రీహులులేనపుడు వ్రీహులకు బదులుగ యవలు ఉపయో గింపవలెను అను ప్రతినిధి కల్పనము కుదురదు.

ఇచట రెండు పక్షములు కలవు. 'వ్రీహిభి ర్యజేత' అనుచోట 'వ్రీహిభిః' అను శ్రుతి విధ్యర్థము అని కొందరు, నియమార్థము అని కొందరు. ఇతర విధమున ప్రాప్తించని దానిని శ్రుతిచెప్పినచో దానిని విధి యందురు. వేరొకదానిచే అదియు మరొకటియు కూడ ప్రాప్తించు

నపుడు శ్రుతి ఒకదానిని పేర్కొనినచో అదియే స్వీకరింపదగినది రెండవది కాదు అని నియమము అగును. 'వ్రీహిభిః యజేత' (వ్రీహులతో యాగముచేయవలెను) అనుచోట 'యజేత' అనుచోట యజ్ అను క్రియ ద్రవ్యదేవతలను సామాన్యముగ తెలుపును. ఆ ద్రవ్య మేదియో వ్రీహిభిః అను పదము తెలుపును. ఇది విధియా లేక నియమమా అని ముందు ఎరుంగవలెను. యజతి క్రియచే తెల్పబడు ద్రవ్యము ద్రవ్యత్వ సామాన్య రూపమున నుండునని కొందరందురు. అనగా వ్రీహిత్వ యవత్వాది విశేషజాతులు గల ద్రవ్యము లన్నియు ద్రవ్యత్వము కలవే కావున ఏ ద్రవ్యముచే యాగముచేయవలెనో దీనిచే నిర్ధరింపబడదు. అపుడు 'వ్రీహిభిః' అను పదము వ్రీహులచేత అని విధించును. ఇట్లు విధి యయినపుడు అవి లేనపుడు ప్రతినిధిగా క్రియాలోపము లేకుండుటకు యవలనుపయోగింపవచ్చును. కాని యజతి క్రియచే ద్రవ్యత్వము కాక యవత్వ వ్రీహిత్వాది రూపమున నుండు ద్రవ్య విశేషముల జాతి చెప్పబడునన్నపుడు యాగసాధనము వ్రీహులు కావచ్చును, యవలు కావచ్చును. ఇట్లు అన్నింటికి యాగసాధనత్వము వచ్చునపుడు వ్రీహిభిః అను పదము వ్రీహులచేతనే చేయవలెను కాని వేరొకదానిచే కాదని నియమించును. ఇట్లు నియమార్థము అని నపుడు వ్రీహులస్థానమున యవలను ప్రతినిధులుగా ఉపయోగించుట కుదురదు. నిషేధింపబడినవానికి యాగసాధవత్వము కూడదు. విధింపబడకుండ నిషేధింపబడకుండ ఉన్నచో విధింపబడినది లేనపుడు నిషేధింపబడనిదానిని ప్రతినిధిగ కల్పించవచ్చును. కావున నియమార్థమైనపుడు ప్రతినిధి కల్పన ఎట్లు పొసగును ? అని శంక రాగా ఆ రెండు మతములకంటె భిన్నమగు మరొక మతము నాశ్రయించి ప్రతినిధికల్పనమును సమర్థించుచున్నాడు.

తస్మాద్ వ్రీహిత్వ మధికం వ్రీహిశబ్దః ప్రకల్పయన్
ద్రవ్యత్వ మవిరుద్ధత్వాత్ ప్రాప్త్యర్థః స న్న బాధతే. 66

తస్మాత్ = అందువలన (యజేత అనుచోట యజనక్రియచే యాగాంగముగా ద్రవ్యత్వ మాక్షిప్తమైనను వ్రీహిత్వమున కంగత్వము బోధింపబడనందున), వ్రీహిశబ్దః = 'వ్రీహిభి ర్యజేత' అనుచోట వ్రీహిశబ్దము, అధికం = ద్రవ్యత్వముకంటె అధికముగ, వ్రీహిత్వం = వ్రీహిత్వమును అంగముగ, ప్రకల్పయన్ = కల్పించుచు, ప్రాప్త్యర్థః సన్ = అప్రాప్తమగు వ్రీహిత్వమునకు యాగాంగత్వమును కల్గించుచున్నదై, అవిరుద్ధత్వాత్ = సామాన్యమునకు విశేషమునకు సామానాధికరణ్యమున విరోధము లేకపోవుటవలన, ద్రవ్యత్వం = ద్రవ్యత్వమును, న బాధతే = బాధింపదు.

తా. యజేత అనుదానివలన యాగాంగముగ ఒక ద్రవ్య ముండవలెనని సామాన్యముగ తెలియును. వ్రీహిభిః అను పదము యాగమున ద్రవ్యముగా నుండవలసినది వ్రీహియని వ్రీహిత్వమునకు యాగాంగత్వ ప్రాప్తిని కల్గించును. కావున వ్రీహి యున్నపుడు యవలకు ప్రాప్తి యుండదు. అది లేనపుడు ప్రతినిధిగా ఉండుట కభ్యంతరము లేదు. వ్రీహిత్వము, ద్రవ్యత్వము విశేష సామాన్య ధర్మములు కనుక బాధ్యబాధకభావ ముండదు. ముందు సామాన్యముగ ద్రవ్యత్వమునకు యాగాంగత్వము బోధింపబడి తరువాత వ్రీహులకు యాగాంగత్వము బోధింపబడినపుడు ద్రవ్యత్వము వ్రీహిత్వముకూడ వ్రీహులయందుండ వచ్చును కనుక వ్రీహిత్వము ద్రవ్యత్వమును బాధింపదు. యవలకు ప్రతినిధికల్పనము కూడ సంభవించును.

వ్రీహులు లేనపుడు యవలతో చేయుట ప్రతినిధి కల్పనము. వ్రీహులతో గాని యవలతో గాని చేయవచ్చు ననుట వికల్పము. వ్రీహిత్వమునకు బాధకము కాదని చెప్పినారు కనుక ద్రవ్యత్వముగల వ్రీహులతో గాని యవలతో గాని చేయవచ్చునని వికల్పము వచ్చునా ? యని శంకించి ఇచట వికల్పము రాదని చెప్పుచున్నాడు.

తేన చాపి వ్యవచ్ఛిన్నే ద్రవ్యత్వే సహచారిణి
అసంభవాద్ విశేషాణాం తత్రాన్యేషా మదర్శనమ్ . 67

తేన చ = విధ్యర్థకమగు వ్రీహిశబ్దముచే, సహచారిణి = యజతిక్రియచే ఆక్షిప్తమై యవత్వాదులతోకూడ కలిసియుండు, ద్రవ్యత్వే = ద్రవ్యత్వము, వ్యవచ్ఛిన్నే = యవత్వాదులతో నన్వయించుటనుండి వారింపబడగా, తత్ర = ఆ యాగమునందు, అన్యేషాం విశేషాణాం = వ్రీహికంటె భిన్నములగు యవలు మొదలగు విశేషములకు, అసంభవాత్ = వికల్పము సంభవింపకపోవుటవలన, అదర్శనమ్ = యాగాంగముగ నన్వయించుట కన్పట్టదు.

తా. యజేత అనునపుడు (యజ్)యాగము ద్రవ్య దేవతాస్వరూపమగుటచే ద్రవ్యత్వము సామాన్యముగ దానికర్థముగ భాసించును. ఆ ద్రవ్యత్వము వ్రీహిత్వము, యవత్వము మున్నగు విశేషములతో సహచరితమై యుండును. కాని వ్రీహిభిః అను పదము ఆ ద్రవ్యత్వజాతి వ్రీహిత్వరూప విశేషజాతి కలదే కాని యవత్వాది విశేషము కలద కాదు అని యవత్వాదులతో సంబంధమును ద్రవ్యత్వమునకు వారించును. అందుచే యవలు యాగాంగములు కావు. కావున ఇచట వికల్పము సంభవింపదు.

వి. "వ్రీహిభిః యజేత" "యవైః యజేత" అను రెండు ద్రవ్యములు కూడ శబ్దతః ఉపాత్తములైనపుడే వికల్పము సంభవించును.

'యజేత' అనుచోట యజతిక్రియ ద్రవ్యత్వ సామాన్యమును చెప్పుటచే విశేషము లన్నియు గ్రహింపబడవచ్చునుగదా ? అట్లు వ్రీహియవాదులన్నియు గ్రహింపబడినపుడు వికల్పమని చెప్పుట కత్యంతరములేదుకదా యని శంకించి సమాధానము చెప్పుచున్నాడు.

న చ సామాన్యవ త్సర్వే క్రియాశబ్దేన లక్షితాః
విశేషా న హి సర్వేషాం సతాం శబ్దోఽభిధాయకః . 68

సర్వే విశేషాః = యవత్వము మొదలగు విశేషము లన్నియు, సామాన్యవత్ = ద్రవ్యత్వమువలె, క్రియాశబ్దేన = యాగక్రియను బోధించు 'యజేత' అను శబ్దముచే, న చ లక్షితాః = బోధింపబడవు, హి = ఎందుచేతననగా, శబ్దః = ఏ శబ్దముకూడ, సతాం = తనచే బోధింపబడదగిన, సర్వేషాం = అర్థముల కన్నిటికి, అభిధాయకః = బోధకము కాదు(బోధింపగల వానిలో సంకేతితమైన దానినే బోధించును).

తా. 'యజేత' అను శబ్దము ద్రవ్యదేవతలను తెలియజేయును. ద్రవ్యము సామాన్యము కావచ్చును. వ్రీహియవాది రూపమున విశేషము కావచ్చును. కాని ఇచటి క్రియాశబ్దము ద్రవ్యత్వరూపమున సామాన్యమునే బోధించును కాని విశేషమును బోధింపదు. దానిచే ఆ యర్థములు బోధింపదగినవే యైనను ఏయర్థమున సంకేతముండునో ఆ యర్థమునే శబ్దము బోధించును. కాబట్టి యజేత అను క్రియాశబ్దము విశేషములందు సంకేతము లేకపోవుటచే విశేషములను బోధింపదు. కావున వికల్పము సంభవింపదు.

శబ్దమున కా యర్థ మున్నను వివక్ష చేతనే అర్థబోధకత్వము కల్గును. వివక్ష లేనపుడు శబ్దమున కర్థమున్నను అది అర్థము కానట్లే యుండును. వివక్షచేతనే శబ్దము అర్థమును బోధించు ననుటలో దృష్టాంతమును చూపుచున్నాడు.

శుక్లాదయో గుణాః సంతో యథా తత్రావివక్షితాః
తథాఽవివక్షా భేదానాం ద్రవ్యత్వసహచారిణామ్ . 69

యథా = ఏ విధముగ, తత్ర = వ్రీహిభిః అనుచోట, సంతః = వ్రీహిత్వముతో విరోధము లేకుండ వ్రీహులలో నున్న, శుక్లాదయః = శుక్లకృష్ణాది గుణములు, అవివక్షితాః= వివక్షితములు కావో(అందుచే వ్రీహిశబ్దముచే బోధింబడవో), తథా = అనిధముగ, ద్రవ్యత్వ సహచారిణాం = ద్రవ్యత్వముతో కలిసియుండదగిన, భేదానాం = వ్రీహిత్వయవత్వాది విశేషములకు, అవివక్షా = వివక్ష లేదు(అందుచే ద్రవ్యత్వసామాన్యబోధక మగు యజతిక్రియ తద్విశేషములను బోధింపదు).

తా. యజేత అనునపుడు యాగక్రియచే తెలుపబడిన ద్రవ్యత్వములో నన్వయించు వ్రీహులు ఎరుపు, నలుపు మొదలగు రంగులు కలిగి ఆ రంగులు కలవియే యాగాంగము లగుచున్నవి. కావున వ్రీహిపదము తెల్లని, లేదా, నల్లని వ్రీహులు అని బోధింపదు. అవి నియతముగ వ్రీహులయందున్నను, ద్రవ్యత్వములో నన్వయించుటలో విరుద్ధములు కాక పోయినను, ఈ రంగు గల వ్రీహు లని బోధించు తలంపు(వివక్ష)తో వ్రీహిభిః అనుపదము ప్రయుక్తము కాలేదు కనుక వ్రీహిశబ్దము శుక్లకృష్ణాది వర్ణముల నెట్లు బోధింపదో అట్లే యాగక్రియాబోధకమగు 'యజ్' అను ధాతువు ద్రవ్యత్వసామాన్యమునే బోధించుట వివక్షితము కావున వ్రీహిత్వయవత్వాదులను బోధింపదు. వ్రీహిత్వయవత్వములు ఇచట వివక్షితములు కావు కనుక యజేత అను శబ్దముచే బోధింపబడవు. అందుచే వ్రీహిత్వమునకు యాగాంగత్వప్రాప్తికై నిర్దేశించిన వ్రీహిభిః అను పదముచే వ్రీహులకు యాగాంగత్వము సిద్ధించును. వ్రీహిరూపమగు ముఖ్యద్రవ్యము లేనపుడు క్రియకు ప్రతినిధిగ వేరొకక్రియ చేయరాదు కనుక ద్రవ్యప్రతినిధిగ యవలను ఉపయోగింప వీలగును.

శాస్త్రముచే ప్రతిషిద్ధముకాని ద్రవ్యమును ముఖ్య ద్రవ్యము లభింపనపుడు ప్రతినిధిగా కల్పించుటకు ప్రయోజనమును తెల్పుచున్నాడు.

అసన్నిధౌ ప్రతినిధి ర్మాభూ న్నిత్యస్య కర్మణః
కామ్యస్య వా ప్రవృత్తస్య లోప ఇత్యుపదిశ్యతే . 70

అసన్నిధౌ = ముఖ్యద్రవ్యము లేనపుడు, నిత్యస్య కర్మణః = నిత్యకర్మకు గాని, కామ్యస్య వా = కామ్య కర్మకు గాని, ప్రవృత్తస్య = ప్రారంభింపబడిన దానికి, లోపః = లోపము, మాభూత్ ఇతి = కాకుండుగాక యని, ప్రతినిధిః = ప్రతినిధి, ఉపదిశ్యతే = ఉపదేశింపబడుచున్నది.

తా. సంధ్యావందనము, అగ్నిహోత్రము మున్నగు నిత్యకర్మలు చేయక పోయినచో ప్రత్యవాయము కలుగును. అందుచే ఆ నిత్యకర్మల కంగములుగా చెప్పిన ద్రవ్యములు లేనపుడు ప్రతినిధులతోనైనను ఆచరించవలెను. అట్లే కామ్యకర్మ లారంభించిన తరువాత మధ్యలో ముఖ్యమగు ద్రవ్యమేదైన లేకపోవుట తటస్థించిన కర్మకు విచ్ఛేదము

కలుగకుండుటకై శాస్త్రము నిషేధించని ద్రవ్యమును ప్రతినిధిగా ఉపయోగింపవలెనని శాస్త్రము చెప్పుచున్నది.

పై విధమున 'వ్రీహిభిః' అను పదము వ్రీహులకు యాగాంగత్వ ప్రాప్తికై చెప్పబడినది. యవాదులను నిషేధింపదు అని చెప్పి ప్రతినిధిత్వమును తత్ప్రయోజనమును సమర్థించి, ఇట్లు ద్రవ్యమునకు బదులుగా ద్రవ్యము నుపయోగించుట పదపదార్థముల నంగీకరించినపుడే తప్ప అఖండవాక్యార్థ పక్షమున కుదురదని ఆక్షేపించుచున్నాడు.

విశిష్టైవ క్రియా యేన వాక్యార్థః పరికల్ప్యతే

ద్రవ్యాభావే ప్రతినిధౌ తస్య తత్స్యాత్క్రియాన్తరమ్. 71

యేన=వాక్య వాక్యార్థము లఖండములని యంగీకరించుఎవనిచేత, ద్రవ్యాభావే= ముఖ్యద్రవ్యము లేనపుడు ప్రతినిధౌ = ప్రతినిధిని పెట్టినపుడు, విశిష్టైవక్రియా = ప్రతినిధి ద్రవ్యసాధ్యమగు యాగక్రియయే, వాక్యార్థః = వాక్యార్థముగ, పరికల్ప్యతే = కల్పింపబడునో, తస్య=ఆ యఖండ వాక్యార్థవాదికి, తత్=ప్రతినిధిద్రవ్యవిశిష్ట యాగక్రియ, క్రియాంతరం = ముఖ్యద్రవ్య విశిష్టయాగక్రియలకంటె భిన్నమగునది, స్యాత్=అగును.

తా. అఖండ వాక్యార్థవాదమున "వ్రీహిభిః యజేత" అనుచోట వ్రీహులు సాధనముగా గల యాగక్రియ చేయవలెను అని విశిష్టముగ వాక్యార్థబోధ కలుగును. పదార్థభానము ప్రత్యేకముగ నుండదు. అట్టిచో వ్రీహులు లేనపుడు యవలను ప్రతినిధిగ ఉపయోగించునపుడు అదేక్రియలో వ్రీహిరూప పదార్థమునకు బదులు యవద్రవ్యము నుపయోగించి రనుట కుదురదు. వారికి ప్రత్యేక పదార్థము లేదు. కనుక మొదటి వాక్యార్థమునకు బదులు 'యవకరణకము' అగు యాగక్రియ అను వాక్యార్థమే క్రొత్తది వచ్చును. అట్లు చెప్పినచో 'వ్రీహిభి ర్యజేత'అనునది 'యవై ర్యజేత' అనుదానికంటె భిన్నక్రియ యగుటచే క్రియకు క్రియ ప్రతినిధి అయినది కాని ద్రవ్యమునకు ద్రవ్యము ప్రతినిధి యయినది అనుట కుదురదు. అట్లు క్రియకు ప్రతినిధిగా క్రియను చేయుట కూడదు. ద్రవ్యమునకు ప్రతినిధిగా ద్రవ్యమును కల్పించవచ్చును కాని క్రియకు ప్రతినిధిగ క్రియను కల్పించుట శాస్త్రనిషిద్ధము. అందుచే అఖండవాక్యార్థపక్షమునంగీకరించినచో ప్రతినిధిద్రవ్యకల్పనము నుపపోవలసివచ్చును.

వాక్యార్థాఖండవాదమున వేరొకదోషమును చూపుచున్నాడు.

విజ్ఞాతార్థం పదం యచ్చ తదర్థే ప్రతిపాదితే

పికాది య దవిజ్ఞాతం త త్కిమి త్యనుయుజ్యతే. 72

యత్ = ఏది, విజ్ఞాతార్థం = తెలిసిన అర్థముగల, పదం = పదము కలదో, తదర్థే = దానియర్థము, ప్రతిపాదితే = ప్రతిపాదింపబడగా, యత్=ఏ, 'అవిజ్ఞాతం=అర్థము' తెలియని పదము కలదో, తత్=అది, కిమ్ ఇతి=ఏమి అర్థమును బోధించును అని, అనుయుజ్యతే చ=ప్రశ్నింపబడుచున్నది.

తా. "వనాత్ పికః ఆనీయతామ్"(వనమునుండి పికమును తెమ్ము)అను వాక్యమును వినిన నాగరికుడు తనకు "వనాత్, ఆనీయతామ్," అను పదములకు అర్థముతెలిసి పికః అను పదమునకు అర్థముతెలియక పికః అనగా నేమి ? అని ప్రశ్నించుచున్నాడు. వాక్యము పద

విభాగము లేనిదై అఖండమునై అర్థమునకు వాచకమగునని యంగీకరించినపుడు వాక్యము వలన వాక్యార్థము అఖండముగనే తెలియును కనుక ఒక పదమున కర్థము తెలియక ప్రశ్నించుట కుదురదు. వాక్యార్థము అఖండముగనే తెలియుటయో తెలియకపోవుటయో జరుగును. కాని కొన్ని పదముల కర్థము తెలిసి కొన్ని పదములకు తెలియకుండుట సంభవింపదు. కాని అట్లు సంశయము కల్గుచున్నది. కావున పదములు ప్రత్యేకార్థవంతములై యుండును అని అంగీకరించవలెను.

అఖండ వాక్య వాక్యార్థ పక్షమున శ్రుతివాక్యములకు విరోధము కల్గిననపుడుగాని, శ్రుతి లింగములకు విరోధము కల్గినపుడుగాని శ్రుతి ప్రబలమని చెప్పుట కుదురదు అని దోషమును చూపుచున్నాడు.

సామర్థ్యప్రాపితం యచ్చ వ్యక్త్యర్థ మనుషజ్యతే
శ్రుతిరేవానుషంగే సా బాధికా లింగవాక్యయోః. 78

సామర్థ్యప్రాపితం="వాయవ్యం శ్వేతం ఛాగ మాలభేత" అను వాక్యమున ఆలంభన (పశువిశసనము) రూపక్రియా కర్మభూతమగు ద్రవ్యము (పశువు) నిర్గుణముగా నుండదు కనుక ఆ శబ్ద సామర్థ్యముచేతనే లభించిన, యత్=ఏ తెల్లదనము మొదలగు ధర్మము, వ్యక్త్యర్థం=స్ఫుటీకరణమునకై, అనుషజ్యతే=ఆలభేత అనుక్రియతో సంబంధింప చేయబడుచున్నదో, (ద్రవ్యగుణము కూడ క్రియతో), అనుషంగే=సంబంధము కలిగి యున్నప్పుడు, సా శ్రుతి రేవ=ఆ సంబంధము దెలుపు శ్రుతియే, లింగవాక్యయోః=లింగము చేతను, వాక్యముచేతను ప్రాప్తమగు సంబంధమునకు, బాధికా=బాధకమగును.

తా. వాక్యముయొక్క అర్థము సందిగ్ధముగా నున్నపుడు నిర్ణయించుటకు శ్రుతి లింగ వాక్య ప్రకరణ స్థాన సమాఖ్యలు అను ఆరు ప్రమాణములుగా స్వీకరింపబడును. వానిలో పూర్వ పూర్వము ఉత్తరోత్తరముకంటె బలవత్తరము. శ్రుతి : స్వార్థబోధనమున వేరొకదాని యపేక్షలేని శబ్దము. లింగము : శబ్దసామర్థ్యము. వాక్యము : రెండు లేక అంతకంటె ఎక్కువ పదముల చేరిక. ప్రకరణము : రెండు అర్థములకు పరస్పరము ఆకాంక్షయుండుట. స్థానము : సాన్నిధ్యము. సమాఖ్య : యౌగిక శబ్దము. "వాయవ్యం శ్వేతం ఛాగ మాలభేత భూతికామః" ఐశ్వర్యమును కోరువాడు వాయుదేవతాకమగు శ్వేతమగు ఛాగమును (మేకను) విశసనము చేయవలెను అని విధి. ఆలభేత=ఆలంభనము చేయవలెను అను క్రియకు కర్మగా ఛాగము, దానితో ద్వితీయా విభక్తి చేరియుండి శ్రుతి గోచరమగుటచే సంబంధించుచున్నది. ఛాగమునకు కర్మత్వ రూపసంబంధమున సందేహము కలుగకుండ చేసినది ద్వితీయావిభక్తి శ్రవణము (శ్రుతి). కావున శ్రుతిప్రమాణముచే ఛాగమునకు కర్మత్వము సిద్ధించినది. అట్లే శ్వేతం అను శబ్దమునందలి ద్వితీయా విభక్తి శ్రవణము శ్వేత గుణమునకు కర్మరూపమున క్రియాసంబంధమును తెలుపుచున్నది. ద్రవ్యము గుణములేనిదే యుండదు. గుణము ద్రవ్యములేనిదే యుండలేదు. కనుక గుణద్రవ్యముల సంబంధము "శ్వేతం ఛాగం" అను పదద్వయ సమభివ్యాహారరూపమగు వాక్యమువలన తెలియుచున్నది. గుణము (తెల్లదనము) ద్రవ్యము (ఛాగము) అనునవి రెండును ఆలంభనక్రియతో శ్రుతి ప్రమాణముచే సంబంధించుచున్నవి. కనుక అవి రెండును ఒకదానినొకటి బాధించుకొనవు. శ్రుతికి శ్రుతి బాధకము కాదు కావున వికల్పము ఏర్పడును. శ్వేతగుణము గల ఛాగము

లభించనపుడు 'శ్వేతం' అనుదానికి ప్రతినిధిగ ఏదో ఒక గుణముగల ఛాగమును విశసనము చేయవలెను. ఛాగము లభింపనపుడు శ్వేతగుణముకల మేషమును విశసనము చేయవలెను. "శ్వేతం ఛాగం" అను రెండిటికి గల సంబంధము(విశేష్య విశేషణభావ రూప సంబంధము) వాక్యప్రమాణముచే నేర్పడినది కనుక 'తెల్లని ఛాగమును' అనుదానిని శ్రుతి ప్రమాణము బాధించి శ్వేతగుణము కలదానినైనను, ఛాగమునైనను విశసనము చేయవలెను అని బోధించును.

శ్రుతిసిద్ధమగు సంబంధమునకు, వాక్యసిద్ధమగు సంబంధమునకు భేదమును చూపుచున్నాడు.

అప్రాప్తో యస్తు శుక్లాదిః సన్నిధానేన గమ్యతే
స యత్నప్రాపితో వాక్యే శ్రుతిధర్మవిలక్షణః. 74

యస్తు శుక్లాదిః=వ్రీహిత్వముతో కలిసియుండు ఏ శుక్లాది గుణము, అప్రాప్తః= శ్రుతిచే అప్రాప్తమై, సన్నిధానేన=వ్రీహిరూప ద్రవ్యమందుండుటచే, గమ్యతే=తెలియబడుచున్నదో, సః=ఆ శుక్లాదిగుణము, వాక్యే="వ్రీహిభిర్యజేత" అను వాక్యములో (నిర్గుణమగు ద్రవ్యముండదు కనుక ద్రవ్యము నాశ్రయించియున్న గుణమునకుకూడ క్రియాసంబంధము), యత్నప్రాపితః=లింగరూప ప్రమాణముచే కాని, అర్థాపత్తిరూపప్రమాణముచే కాని క్రియా సంబంధము కల్గింపబడిన దైనది, అది, శ్రుతిధర్మ విలక్షణః=శ్రుతిచే సిద్ధమైన వ్రీహ్యాది ద్రవ్యమువంటిది కాదు కనుక విధిలో అన్వయ ముండదు.

తా. "వ్రీహిభి ర్యజేత" అనుచోట వ్రీహిరూపద్రవ్యము శ్రుతిసిద్ధము కనుక దానికి సాక్షాత్ క్రియా సంబంధముండును. దానియందుండుటచే ద్రవ్యద్వారా ప్రమాణాంతర బలముచే శుక్లాదిగుణము క్రియాసంబంధము కలది యగుచున్నది. కావున అది విధ్యర్థముతో నన్వయింపదు.

వి. "శ్వేతం ఛాగ మాలభేత" అనుచోట అట్లుకాక ద్రవ్యము, గుణముకూడ శ్రుతి సిద్ధములే యగుటచే రెండింటికి సాక్షాత్తు క్రియాసంబధముండును కనుక రెండింటికిని విధ్యన్వయ ముండును.

ఇట్లు శ్రుతి వాక్యప్రమాణములకు విరోధము కల్గినపుడు శ్రుతి బలవత్తర మనుట అఖండవాక్యార్థ పక్షమున కుదురదని దూషించుచున్నాడు.

అభిన్నమేవ వాక్యం తు య ద్యభిన్నార్థ మిష్యతే
త త్సర్వం శ్రుతిభూతత్వా న్న శ్రుత్యైవ విరోత్స్యతే. 75

వాక్యం=వాక్యము, అభిన్నమేవ=పదవిభాగశూన్యమే యయి, అభిన్నార్థం= అఖండమగు వాక్యార్థమును బోధించునదిగానే, యది ఇష్యతే=అంగీకరించినచో, తత్సర్వం= వాక్యము, దానియందు కల్పితమగు పదము కూడ. శ్రుతిభూతత్వాత్ = ఇతరానపేక్షముగ అర్థబోధకమగు శ్రుతిరూపమగుటవలన, శ్రుత్యైవ=వాక్యముకూడ శ్రుతియే యగుటచే శ్రుతితోనే, న విరోత్స్యతే=విరోధము కల్గియుండదు.

తా. వాక్యము అఖండము. పదవిభాగశూన్యమై అఖండవాక్యార్థమునే బోధించును. పదములు, వాని యర్థములు కూడ కల్పితములు అనునపుడు వాక్యము పదమువలె నిరపేక్ష

ముగ అర్థబోధకము అగును.దానికి పదసాపేక్షత్వము లేదు. 'శ్వేతం ఛాగ మాలభేత' అన్నప్పుడు శ్వేతత్వగుణవిశిష్ట ఛాగకర్మక అలంభనక్రియ వాక్యార్థము. శ్వేతత్వగుణము, ఛాగము శ్రౌతము, వాని సంబంధము వాక్యజన్యము అని వేరుచేయుటకు పదపదార్థోపస్థితి వలెనే వాక్య వాక్యార్థోపస్థితి నిరపేక్షముగ కల్గుచుండుటచే వీలు కాదు.

వి. అందుచే 'శ్వేతం ఛాగ మాలభేత, యనునపుడు గుణద్రవ్యసంబంధము వాక్య జన్యము కావున పదశ్రుతి జన్యమగు క్రియాకారక సంబధము దానిని బాధించును కావున శ్వేత గుణము లేకపోయినను, ఛాగము లేకపోయినను వాని ప్రతినిధులను కల్పించి వికల్పముగా విధిని అనుష్ఠించుట కుదురదు. క్రియాకారక సంబంధము, గుణద్రవ్య సంబంధము కూడ శ్రుతిప్రమాణసిద్ధమే కావున ఒకదాని నొకటి బాధింపవు కనుక శ్వేతచ్ఛాగము లభించనపుడు విధ్యనుష్ఠానము లేకపోవలసివచ్చును.

వాక్య వాక్యార్థములకు అఖండత్వ మంగీకరించినచో అవాంతర వాక్యముల యర్థ నిరూపణము కుదురదని ఆక్షేపించుచున్నాడు.

వాక్యానాం సముదాయశ్చ య ఏకార్థప్రసిద్ధయే
సాకాంక్షావయవ స్తత్ర వాక్యార్థోఽపి న విద్యతే. 76

ఏకార్థప్రసిద్ధయే=ముఖ్యమగు నొక యర్థము సిద్ధించుటకొరకు, యః=ఏ, వాక్యా నాం = అవాంతరవాక్యములయొక్క, సాకాంక్షావయవః = పరస్పరాకాంక్ష గల అవాంతర వాక్యార్థములుగల, సముదాయః=సమూహము (ప్రయుజ్యతే=ప్రయోగింపబడుచున్నదో), తత్ర=అట్టి మహావాక్యములో, వాక్యార్థోఽపి=అవాంతర వాక్యార్థము లేదు కనుక మహా వాక్యార్థము కూడ, న విద్యతే=ఉండదు.

తా. "పాలు పిండుము, పాలతో భోజనముచేసి ఉపాధ్యాయుడు నాకు చదువు చెప్పును." అను మహా వాక్యములో "పాలు పిండుము" అనునది అవాంతర వాక్యము. దీని యర్థముతో ఆకాంక్ష కలిగియున్నది తరువాతి వాక్యము. తరువాతి వాక్యములోని యర్థముతో దీని కాకాంక్షయున్నది. మహావాక్యమునకు నిర్విభాగమగు మహావాక్యార్థమే తప్ప అవాంతరవాక్యార్థమే లేదన్నచో ఒక్కసారి అంతవాక్యము గ్రహించుట సాధ్య పడదు కనుక మహావాక్యార్థమే ఏర్పడదు. అవాంతరవాక్యార్థము ఉండదన్నచో శాస్త్రములు మహావాక్యావాంతరవాక్యరూపములై యుండును కావున అవాంతరవాక్యార్థ జ్ఞానపూర్వ కముగ కాని మహావాక్యార్థజ్ఞానము ఏర్పడుట సంభవింపకపోవుటచే శాస్త్రగ్రహణ ప్రవచనమే లేకపోవలసివచ్చును. సర్వవ్యవహారము సాగకపోవలసివచ్చును.

[వాక్యార్థ నిర్ణయమున మీమాంసకులచే ఆరు, లేక పన్నెండు లేక ఇరువది నాలుగు న్యాయము లంగీకరింపబడినవి. వానినే పన్నెండు అధ్యాయములలో పూర్వమీమాంసాశాస్త్ర మున నిరూపించినారు. వాక్యవాక్యార్థముల నిర్ణయమున ఈ న్యాయములు లోకమున, వేదమున గూడ ఉపయోగించును. ఈ న్యాయములు పదపదార్థాంగీకారములేని అఖండ వాక్య వాక్యార్థ పక్షమున సంభవింపవు అని నిరూపించుచు ప్రసంగవశమున ఆ న్యాయములకు ఉదాహరణములను ఏడు శ్లోకములలో నిరూపించుచున్నాడు.

పూర్వ మీమాంసా శాస్త్రమున పన్నెండు అధ్యాయములయందు పన్నెండు లక్షణ ములు (న్యాయములు) ప్రతిపాదింపబడుటచే దీనికి "ద్వాదశలక్షణీ" అని వ్యవహారము.

మొదటి ఆరధ్యాయములలో విధి, భేదము, శేష శేషిభావము, ప్రయోజకత్వము, క్రమము, అధికారి అను ఆరు విషయములు నిరూపింపబడినవి. ఇవి ప్రకృతి యాగములకు సంబంధించిన వగుటచే వీనికి ప్రకృతిషట్కము, లేదా ఉపదేశషట్కము అనిపేరు. తరువాతి ఆరు అధ్యాయములలో సామాన్యాతిదేశము, విశేషాతిదేశము, ఊహ, బాధ, తంత్రము, ప్రసంగము అను ఆరు విషయములు నిరూపింపబడినవి. మొత్తము పన్నెండు లక్షణములచే లౌకిక, వైదిక వాక్యార్థ నిర్ణయముచేయ వీలగును. ఈ పన్నెండు లక్షణములకు ప్రతిపక్షములు (వ్యతిరేక రూపములు) పన్నెండు కూడ ఆయా యధ్యాయములలో నిరూపింపబడినవి. అందుచే ఇరువదినాలుగు లక్షణములు (న్యాయములు) ప్రతిపాదింపబడినవి. [లక్ష్యతే=నిశ్చయతే అనేన) దీనిచే నిశ్చయింపబడును కావున దీనికి లక్షణమని పేరు].

'అథాతో ధర్మజిజ్ఞాసా' అని ఆరంభించి ధర్మమన నేమి, దాని లక్షణ మేమి అని ప్రశ్నించుకొని చోదన (చేయవలెనని శ్రుతిచే ప్రతిపాదింపబడుట) లక్షణముగా గలది ధర్మము, చోదనయే ప్రమాణము, చోదనకే విధి, నియోగము అని మతభేదమున సంజ్ఞాభేదము, చోదన రూపమగు ప్రమాణమును నిరూపించుటచే మొదటి అధ్యాయము ప్రమాణ నిరూపణము.

ప్రమాణము అనగా చోదనశబ్ద, ప్రవృత్తి, సంఖ్యా భేదములచే భిన్నమయి యుండును. ఆ భేదములను రెండవ అధ్యాయము ప్రతిపాదించును. యజతి, దదాతి, జుహోతి అను శబ్దములు భిన్నములగుటచే చోదన భిన్నమగును. సంఖ్యయొక్క భేదముచే చోదన భిన్నమగును. ఒకే మంత్రముతో మూడుసార్లు మూడు ఆహుతులను హోమముచేయవలెను అని ''తిస్ర ఆహుతీ ర్జుహోతి''అని చోదన భిన్నభిన్నముగా ఉండును కాన కర్మకూడ భిన్నమగును.

మూడవ అధ్యాయములో—ప్రతిపాదింపబడిన కర్మలలో ప్రధాన మేది? అంగ మేది? అని తెలిసి వినియోగముచేయవలెనని శేష శేషిభావము ప్రతిపాదింపబడినది. వినియోగింపబడిన కర్మలలో ఏది ప్రయోజకము, ఏది అప్రయోజకము అని తెలుపునది నాల్గవ అధ్యాయము. అంగములను క్రమముగ వినియోగించుటలో శ్రుతిక్రమము పాఠక్రమము ననుసరించవలెనని క్రమమును అయిదవ అధ్యాయము నిరూపించును.

సాంగమైన కర్మ నాచరించుటకు సమర్థుడు అర్థిత్వముకలవాడు, శాస్త్రముచే నిషేధింపబడనివాడు, యోగ్యతకలవాడని అధికారి నిరూపణము ఆరవయధ్యాయమున నిరూపింపబడినది.

యాగమునకు అంగజాతము గా నివద్ద చెప్పనపుడు అది వికృతి యాగమైనచో దానిని ప్రకృతి యాగమువలెనే చేయవలెను అను సామాన్యాతిదేశముచే ప్రకృతియాగము యొక్క అంగజాతమునే ఆచరించవలెనని తెల్పునది సామాన్యాతిదేశము ఏడవ అధ్యాయమున ప్రతిపాదింపబడెను.

కొన్ని కర్మలలో అతిదేశమువలన ఇతర కర్మలలోని విశేషములగు మంత్రము బున్నగునవే గ్రహింపవలెను కాని సామాన్యములు కావని విశేషాతిదేశము ఎనిమిదవ యధ్యాయమున ప్రతిపాదింపబడెను.

అతిదేశముచే ప్రకృతియాగములోని మంత్రమును వికృతి యాగములో ఉపయోగించునపుడు దేవత మొదలగువానిని మార్చుట చేయవలెనని తెల్పు ఊహ తొమ్మిదవ యధ్యాయమున ప్రతిపాదింపబడెను.

సామాన్యశాస్త్రమును నిరవకాశమైన విశేషశాస్త్రము తదితర విషయములందు ప్రవర్తించునట్లు చేయు బాధ పదవయధ్యాయమున నిరూపింపబడెను.

ఒకసారి ఒకకర్మ ఆచరించుటవలన, రెండుసార్లు చేసినందువలన వచ్చుఫలము సిద్ధించునట్లు చేయుటయనెడి తంత్రము పదునొకండవ అధ్యాయమున నిరూపింపబడెను.

ఒకదానికొరకు ఆరంభింపబడినదానిచే ఒకే ప్రయత్నమున వేరొకటిగూడ సంభవించుటచే ప్రయత్నలాఘవము కల్గుట ప్రసంగము పన్నెండవయధ్యాయమున నిరూపింపబడెను. వీని ప్రతిపక్షములు కూడ ఆయా యధ్యాయములందు ప్రతిపాదించుటచే ఇరువదినాల్గు లక్షణములు].

ప్రసంగ, తంత్ర, ఆవృత్తి, భేద, సముచ్చయములను నిర్దేశించుచున్నాడు.

ప్రాసంగిక మిదం కార్య్య మిదం తంత్రేణ లభ్యతే
ఇద మావృత్తిభేదాఖ్యా మత్ర బాధ స ముచ్చయౌ . 77

ఇదం కార్యం = ఈకార్యము, ప్రాసంగికం = ఒకఫలమునకై చేసిన ప్రయత్నముచే వేరొకటికూడ సిద్ధించినది. ఇదం = ఇది, తంత్రేణ = ఒకే ప్రయత్నముచే రెండును సిద్ధించునట్లు చేయుటచే, లభ్యతే = లభించుచున్నది. ఇదం = ఇది, అవృత్తిభేదాఖ్యాం = ప్రసంగమునకు తంత్రమునకు ప్రతిపక్షములు అగు ఆవృత్తిభేదములచేతను సిద్ధించును. అత్ర = ఈ విషయమున, బాధసముచ్చయౌ = బాధసముచ్చయములు- విశేషశాస్త్రముచే సామాన్యశాస్త్రమునకు బాధ, అవిరుద్ధములై తుల్యబలములగు వానికి సముచ్చయమును సిద్ధించును.

తా. పై విధముగ ప్రసంగ, తంత్రములును వాని ప్రతిపక్షములగు ఆవృత్తి భేదములును, బాధయు దాని ప్రతిపక్షమగు సముచ్చయమును నిరూపింపబడినవి.

ఊహ, సామాన్యాతిదేశ విశేషాతిదేశములను నిర్దేశించుచున్నారు.

ఊహోఽస్మిన్ విషయే న్యాయ్యః సంబంధోఽస్య న బాధ్యతే
సామాన్య స్యాతిదేశోఽయం విశేషోఽ త్రాతిదిశ్యతే . 78

అస్మిన్ విషయే = ఈ పదవిషయమునగాని విభక్తివచనములవిషయమునగాని, న్యాయ్యః = చేయదగిన మార్పు, ఊహః = ఊహయనబడును, అస్య = ప్రకృతి యాగము నుండి వచ్చినవాక్యములో('అగ్నయే త్వా జుష్టం నిర్వపామి' అనుదానిని సూర్యాయ అని మార్చి ఊహచేసినపుడు), మిగిలిన వాక్యముయొక్క, సంబంధః = సంబంధము, న బాధ్యతే = బాధింపబడదు, అనగా "త్వా జుష్టం నిర్వపామి" అని మారకుండగనే సంబంధించును.

అయం = ఇది, సామాన్యస్యాతిదేశః = సామాన్యాతిదేశము, అనగా ప్రకృతివలె వికృతిని చేయవలెనని చెప్పుట సామాన్యాతిదేశము, విశేషః = విశేషము, అత్ర = ఈ కర్మలందు, అతిదిశ్యతే = అతిదేశింపబడును, ఇది విశేషాతిదేశము.

తా. ఈ శ్లోకమున సామాన్యాతిదేశము, విశేషాతిదేశము, ఊహ, అపవాదము అనునవి నిరూపింపబడినవి.

అధికార తదపవాదములు నిరూపింపబడినవి.

అర్థిత్వ మత్ర సామర్థ్య మస్మి న్నర్థో న ఛిద్యతే
శాస్త్రాత్ప్రాప్తాధికారోఽయం వ్యుదాసోఽస్య క్రియాంతరే . 79

అత్ర = ఈ ఫలమునందు, అర్థిత్వం = కోరికయు, అస్మిన్ = ఈ కర్మయందు, సామర్థ్యం = శక్తియును, ఉండవలెను. అర్థః = ఫలము, న భిద్యతే = భేదింపదు, అయం = ఈ అధికారి, శాస్త్రాత్ = శాస్త్రమువలన, ప్రాప్తాధికారః = ఒక కర్మయందు యోగ్యత కలవాడు అగును, అస్య = వీనికి, క్రియాంతరే = వేరొకకర్మయందు, వ్యుదాసః = నిషేధము సిద్ధించును.

తా. అర్థిత్వము, సామర్థ్యము, శాస్త్రముచే నిషేధింపబడకుండుట అనునవియే కర్మయందు ఒకనికిగల యోగ్యతకు నిర్ణాయకములు. అదియే అధికారము.

క్రమము యొక్క స్వరూపమును నిరూపించుచున్నాడు.

ఇయం శ్రుత్యా క్రమప్రాప్తి రియ ముచ్చారణాదిభిః
క్రమోఽయ మత్ర బలవా నస్మింస్తు న వివక్షితః . 80

ఇయం క్రమ ప్రాప్తిః = ఈ అంగముల క్రమసిద్ధి, శ్రుత్యా = శ్రుతిచేత ("చేయవలెను" అని చెప్పు శబ్దశ్రవణముచేత), ఇయం = ఈ క్రమసిద్ధి, ఉచ్చారణాదిభిః = పాఠము అర్థము మొ. వానిచే, అయం క్రమః = ఈ క్రమము, అత్ర = ఈ అంగానుష్ఠానమున, బలవాన్ = బలమైనది, అస్మింస్తు = ఈ అంగాచరణమున, క్రమః = క్రమము, న వివక్షితః = వివక్షచేయబడదు.

తా. అంగాచరణమున శ్రుతి, పాఠము, అర్థము మొదలగువానిచే క్రమము సిద్ధించును. కొన్నిచోట్ల క్రమము వివక్షింపబడదు.

వి. క్రమావివక్ష క్రమమునకు ప్రతిపక్షము.

ప్రయోజకత్వ మనెడి ప్రయుక్తిని నిరూపించుచున్నాడు.

ఇదం పరాంగైః సంబద్ధ మంగానా మప్రయోజకమ్
ప్రయోజక మిదం తేషా మత్రేదం నాంతరీయకమ్ . 81

ఇదం = ఇది, పరాంగైః = ఇతరములగు కర్మాంగములతో, సంబద్ధం = సంబంధించినది, అంగానాం = ఈ కర్మాంగములకు, అప్రయోజకం = నిమిత్తముకాదు, ఇదం = ఈ వస్తువే, తేషాం = ఆ ఫలభేదముకల కర్మాంగములకు, ప్రయోజకం = నిమిత్తమగును, అత్ర = ఇక్కడ, ఇదం = ఇది, నాంతరీయకం = ఉండకతప్పనిది కనుక అప్రయోజకము.

తా. వేరొకఫలమునకై యొక వస్తువుండి మరియొక కర్మాంగముతో సంబంధించి యుండి దాని ఫలమును తనకు కూడ ఫలముగా పొందుచున్నను అది దానికి అప్రయోజకము. దేనియొక్క సాన్నిధ్యములేనిదే ఏ అంగముయొక్క ఫలము సిద్ధింపదో దానికే అది ప్రయోజకము.

వి. ఛత్రచ్ఛాయ క్రిందనున్న రాజు ఏనుగుపై నుండుటచే రాజునకువలెనే ఏనుగునకు కూడ ఛత్రఛాయతో సంబంధమున్నను ఛత్రఛాయకు రాజు ప్రయోజకము, ఏనుగు అప్రయోజకము అని ఎరుంగునది.

శేష శేషిభావమును వివరించుచున్నాడు.

ఇదం ప్రధానం శేషోఽయం వినియోగక్రమ స్త్వయమ్
సాక్షా దస్యోపకారీద మిద మారాద్విశేషకమ్ . 82

ఇదం=ఈ కర్మ, ప్రధానం=ప్రధానము, అయం=ఇది, శేషః=అంగము (అప్రధానము), అయం=ఈ ప్రధానాంగ భావరూపమగు శేషశేషిభావమే, వినియోగక్రమః=ఆ కర్మలకుగల పరస్పర సంబంధముయొక్క క్రమమును తెలుపును. ఈ శేషశేషిభావము ద్వివిధము, ఇదం=ఇది, అస్య=ఈ కర్మకు, సాక్షాదుపకారి=ప్రత్యక్షముగ ఉపకారకము, ఇదం=ఇది, ఆరాత్=పరంపరగా, విశేషకం=ఉపకారకము.

తా. ప్రధానము, అంగము అను కర్మలకుగల సంబంధమే శేషశేషిభావము. ఇదియే వాని వినియోగక్రమము. ఈ అంగములు కొన్ని ప్రధానకర్మకు సాక్షాత్తుగను, కొన్ని మరియొకదాని ద్వారాను ఉపకారకములు అగును కనుక సాక్షాదుపకారకము, ఆరాదుపకారకము అని రెండువిధములగును.

వి. ఈ శేషశేషిభావమును వివక్షింపకుండుటయే దీని ప్రతిపక్షము.

శక్తివ్యాపారభేదేఽస్మిన్ ఫల మత్ర తు భిద్యతే
సంబంధా జ్జాతభేదోఽయం భేద స్తత్రావివక్షితః . 83

అస్మిన్=యాగ, దాన, హోమరూపములగు మూడు కర్మలయందు, శక్తివ్యాపారభేదే=యజతి, జుహోతి, దదాతి అను శబ్దములయొక్క శక్తిరూపవ్యాపారముల యొక్క ఏ భేదముకలదో ఆభేదముచేతనే భేదమేర్పడును. అందు, అత్ర = కర్మలయందు ఫలం=ఫలము, భిద్యతే=భేదించుచుండును, సంబంధాత్=కర్మసంబంధమువలన, అయం=ఈ ఆచమనాదికమగు అంగకర్మ, జాతభేదః= భేదముకలదగును, తత్ర=ఆ కర్మలలో, భేదః=శబ్దాదులచే భేదము, అవివక్షితః=వివక్షింపబడనిది. అభేదము అనే భేదప్రతిపక్షము.

తా. యజతి, జుహోతి, దదాతి మున్నగు శబ్దభేదములచే ఆ క్రియల శక్తిభేదముచే కర్మలలో కల్గుభేదమును భేదము అందురు. భిన్నశబ్దవ్యవహారములు కాకపోయినను కర్మలు ఫలభేదముచే భేదము కలిగియుండును. కౌండపాయుల మాసాగ్నిహోత్రమునకును "అగ్నిహోత్రం జుహుయాత్ స్వర్గకామః"అని విధించిన అగ్నిహోత్ర కర్మకును ఫలభేదముచే భేదము. కర్మాంగమగు ఆచమనకర్మ స్వతంత్రమగు ఆచమనకర్మకంటె భేదము కలిగియుండును. ఇట్టిభేదము వివక్షింపబడనపుడు దానిని అభేద మందురు.

ఈ ఇరువదినాల్గు విధములగు న్యాయములు పదపదార్థాశ్రయములై లోక వేద శాస్త్రములయందు వాక్యార్థ నిర్ణయమున నెట్లుపకరించునో తెలియచేయుటకు వాని స్వరూపోదాహరణములను శ్రీ భర్తృహరియు తదనుసారముగ పుణ్యరాజును వివరించిరి. వాని నిట కొద్దిగ తెలిసికొందము.

ప్రసంగము : ఇద్దరు అర్థులైయుండి ఇద్దరకు సామర్థ్యమున్నను ఒకరిని గూర్చి చేసిన పనితోనే రెండవవాడుకూడ కృతార్థుడై యుండునపుడు చేసిన పని వాని నుద్దేశించినది కాకయే ఫలము సిద్ధించుట ప్రసంగము. అట్లు ప్రసంగము కారణముగా సంభవించిన కార్యము ప్రాసంగికము.

లోకమున : ఒకనికి పాఠము చెప్పుచుండగా దానిని తానుకూడ ఎరుంగవలె నని వేరొకడు కూడ సమర్థుడైనవాడు అచటనున్నచో వేరుగా అధ్యాపన మక్కర లేకయే ఒకనికి చెప్పిన దానివల్లనే రెండవవానికి అధ్యాపన ఫలము సిద్ధించినది. కావున ఇది ప్రాసంగికము.

వేదమున : "అగ్నీ షోమీయం పశు మాలభతే, తస్య వపయా ప్రచర్యాగ్నీషోమీయ మేకాదశకపాలం పురోడాశం నిర్వపతి" అగ్నీషోమీయ పశువిశసనము చేసి అగ్నీషోమీయమగు ఏకాదశకపాలపురోడాశమును యాగమున నుపయోగించవలెను. ఇచట అగ్నీషోమీయ పశువునకై చేయు ప్రయాజానుయాజరూపాంగానుష్ఠానము ఆ పశుపురోడాశమునకు కూడ చేసినట్లే యగును. ఇది ప్రాసంగికము.

వ్యాకరణశాస్త్రమున : 'సర్వాదీని సర్వనామాని' అను సూత్రముచే సర్వనామ సంజ్ఞ విధింపబడుచున్నది. సర్వనామ అను పదమున నకారమునకు ణత్వము రావలెను. సర్వణామ అనియుండవలెను. కాని సంజ్ఞను విధించుచు పాణిన్యాచార్యులు సర్వనామ అని నిర్దేశించుటచేతనే ణత్వమురాక పోవుటను కూడ సాధించెను. దానికి వేరేప్రయత్నము చేయ లేదు. కావున ఇది ప్రాసంగికము. దానికొరకు ఉద్దేశింపబడకపోయినను వేరొకదానికై ఉద్దేశించినదానిచేతనే కార్యము సిద్ధించుట ప్రసంగము. "ఆమ్రాశ్చ సిక్తాః పితరశ్చ తృప్తాః" అను లోకన్యాయము దీనికి ఉదాహరణము.

తంత్రము : ఒక వస్తువుచే అనేకులకు కార్యము కావలసివచ్చినపుడు ఆవృత్తిచేసి వారి వారి నుద్దేశించి చేయనవసరము లేకయే ఒకేప్రయత్నముతో ఆ యందరి కార్యములు నెరవేర్చుట తంత్రము. ఒకేదానిచే భిన్నఫలములు సిద్ధించుట.

లోకమున : ఒక దీపముతో పదిమంది చదువుకొనుట. వేరు వేరు దీపములు వేరుగ అవసరములేక అందరకు ఒకే దీపము ఫలమును నెరవేర్చుచున్నది కావున ఇది తంత్రము.

వేదమున : ఆగ్నేయాదులగు దర్శపూర్ణమాస యాగము లారింటికి ముందుగాని వెనుకగాని ప్రయాజానుయాజలు ఆచరించినచో అవి ఆరింటికి వేరు వేరుగా చేయనక్కర లేకయే ఆరింటికి చెందును.

వ్యాకరణ శాస్త్రమున : 'తపర స్తత్కాలస్య' అనుసూత్రమున తపరః అను పదము బహువ్రీహిసమాసము, తత్పురుష సమాసము కూడ చెప్పుటకు వీలుగా నుచ్చరింపబడుట. "తాత్పరః" (తకారముకంటె పరమైనది), "తః పరః యస్మాత్ సః" (తకారము దేనికంటె పరముగానుండునో అది) అని రెండు విధములుగ అర్థము వచ్చునట్లు తపరః అని ఒకేపదమును నిర్దేశించుట తంత్రము.

పై తంత్రప్రసంగములకు ప్రతిపక్షములు ఆవృత్తిభేదములు.

ఆవృత్తి : లోకమున యుద్ధభూమిలోగాని, రంగస్థలమున గాని ఒకేవస్త్రము, ఆభరణము, ఆయుధము వేర్వేరు వ్యక్తులచే ఉపయోగింపబడుచున్నది. దానిని వారు వేరు వేరు సమయములలో మార్చుకొని ధరింతురు.

వేదములో : సామిధేనీమంత్రములు 17 అని చెప్పబడుచున్నవి. ఇవి అగ్నిని ప్రజ్వలింపచేయు ఋక్కులు. ఇవి 13 మాత్రమే. కాని మొదట ఋక్కును మూడుసార్లు, చివరి ఋక్కును మూడుసార్లు ఉచ్చరించిన అవి 17 అగును. ఉచ్చారణయొక్క ఆ వృత్తిచే మంత్రభేదము వచ్చినది.

వ్యాకరణ శాస్త్రమున : "ఇగ్యణః సంప్రసారణమ్" ('యవరల') యణ్ యొక్క స్థానమున (ఇఉఋౡ) ఇక్కు వచ్చును, అది సంప్రసారణము, అని సంప్రసారణ సంజ్ఞవిధింపబడినది. వర్ణములకు సంప్రసారణసంజ్ఞ యనియు, వాక్యమునకు సంప్రసారణ సంజ్ఞ అనియు రెండు పక్షములు కలవు. ఆయాసూత్రములలో సంప్రసారణ పదము వచ్చినపుడు 'యణ్ స్థానికములగు ఇక్కులు' అనిగాని 'యణ్ స్థానమునందు ఇక్ వచ్చును' అనువాక్యము కాని ఉపస్థితము కావలెను. విధిస్థలములలో వాక్యము, అనువాదస్థలములలో వర్ణములు ఉపస్థితములు కావలెను. అందుచే అనువాదస్థలములో వాక్యము, వర్ణములు రెండు నుపస్థితమగుటకు ఆవృత్తిచేయుదురు. అట్లు చేసినచో అన్వయము కుదురును.

భేదము : తంత్రమునకు ప్రతిపక్షము. లోకమున ఒకే కంచము వేర్వేరు సమయములలో భుజించునపుడు చాలమందికి ఉపయోగించినను ఒకేసారి భోజనముచేయునపుడు వేర్వేరు భోజనపాత్ర లుండుట భేదము.

వేదమున : గ్రహము అని యాగములో నుపయోగించు పాత్రలను శోధించునపుడు "గ్రహం సమ్మార్ష్టి" అని ఏకవచనముతో నున్నను భిన్నభిన్నముగనే సమ్మార్జనము చేయవలెను.

వ్యాకరణ శాస్త్రమున : 'నవేతి విభాషా' అనుసూత్రమును భాష్యకారులు ప్రత్యాఖ్యానము చేసి ఉభయత్ర విభాషాస్థలములలో కొన్ని ఉదాహరణములలో విధిరూపమున ప్రవర్తించుననియు, కొన్ని ఉదాహరణములలో నిషేధరూపమున ప్రవర్తించుననియు భేదమును అంగీకరించిరి. "హృక్రో రన్యతరస్యామ్" అనుసూత్రమున ప్రవృత్తిభేదము నంగీకరించి "కారయతి కటం చైత్రం చైత్రేణ" అనుచోట వేరొకదానిచే ప్రాప్తింపకపోవుటచే కర్మత్వమును విధించును. "వికారయతి సైంధవాన్, సైంధవైః" అనుచోట అకర్మకమగుటచే వేరొక సూత్రముచే ప్రాప్తించుటచే నిషేధము ప్రవర్తించును. ఇట్లు ప్రవృత్తిభేద మంగీకరింపబడినది. ప్రసంగమునకుగూడ ఆవృత్తిభేదములు ప్రతిపక్షములే.

ప్రసంగవిరోధియగు భేదము : లోకములో ఒక ఊరికి వెళ్లి తిరిగివచ్చుచు త్రోవలో మేయుచున్న ఆవును తోలి తెచ్చుట ప్రసంగము. అట్లు మరచిపోయి ఇంటికి వచ్చి మళ్ళీ వెళ్ళి ఆవును తోలి తెచ్చుట క్రియాభేదము.

వ్యాకరణమున : 'పూర్వత్రాసిద్ధమ్' అను సూత్రముచే పూర్వశాస్త్రముల దృష్ట్యా పరశాస్త్రమునకు అసిద్ధత్వమును విధించి దాని తరువాతి సూత్రముచే "నలోపః సుప్స్వరసంజ్ఞాతుగ్విధిషు కృతి" నలోపము సుప్స్వరాది విధుల దృష్ట్యా అసిద్ధమగును కాని ఇతర శాస్త్రముల దృష్ట్యా అసిద్ధము కాదని చెప్పెను. ఇచట "పూర్వత్రాసిద్ధమ్" అను సూత్రములోనే "సుప్స్వరాది శేషే" అని సుప్స్వరాదిశేషత్వమును విధించినచో వేరే సూత్రమక్కర లేకయే ప్రసంగముచే రెండు సూత్రముల ప్రయోజనము సిద్ధించును. కాని పాణిని సూత్రద్వయము చేయుట క్రియాభేదము.

ప్రసంగ విరోధియగు ఆవృత్తి : లోకమున వసిష్ఠునికి పాద్యాదులతో పూజించి భోజనముపెట్టుము అనినపుడు ప్రధానక్రియ భోజనము; దానితో కలిసి పాద్యాది పూజనము ఒక్కని విషయమున ఒకే ప్రయత్నమున జరుగును. కావున క్రియాభేదము లేదు. అది ప్రసంగము. "బ్రాహ్మణులకు పూజలొనర్చుము-భుజింపచేయుము" అనునపుడు ప్రతి బ్రాహ్మణునికి పూజన భోజనము లావృత్తిచే చేయబడును.

వ్యాకరణమున : సంజ్ఞా సూత్రములను ఆ సంజ్ఞల నుపయోగించిన సూత్రము లన్నింటిలోనూ ఆవృత్తిచే ఏకవాక్యతలో సంబంధింపచేయుట ఆవృత్తి.

బాధ : సామాన్యోపదేశమువలన గాని, కావలెననిపించుటచే గాని ఒక కార్యము నకు ప్రాప్తి సంభవించుచుండగా దృష్టప్రయోజనముచే గాని, అదృష్టప్రయోజనముచే గాని ప్రాప్తి లేదని చెప్పుట బాధ.

వైదికము అనగా శ్రుతిసిద్ధమగు దృష్టాంతము : ఆకలితీరుటకు దేనినైనను తిని ఆకలి తీర్చుకొనుట ప్రాప్తమగుచుండగా "అభక్ష్యో గ్రామ్యకుక్కుటః" అని గ్రామ్యకుక్కుట భక్షణము బాధింపబడుచున్నది.

లోకమున : "బ్రాహ్మణులకు పెరుగు పోయుము కౌండిన్యునకు మజ్జిగ పోయుము" అనునపుడు బ్రాహ్మణుడుగా కౌండిన్యునకు సామాన్యముగ రావలసిన పెరుగును "మజ్జిగ పోయుము" అనునది బాధించును.

వ్యాకరణమున : 'కర్మణ్యణ్' అను సూత్రముచే సామాన్యముగ కర్మ ఉప పదముగా నున్నపుడు వచ్చు అణ్ ప్రత్యయమును ఉపసర్గముండుండని ఆకారాంత ధాతువులకు కప్రత్యయము వచ్చును అని "ఆతోఽనుపసర్గే కః" అనుసూత్రముచే విధించు "క" ప్రత్యయము బాధించును.

సముచ్చయము : పరస్పర విరోధము లేనివానికి ఒకచోట ప్రాప్తికల్గినపుడు తుల్యబలములైనచో సముచ్చయము (రెండును ప్రాప్తించుట) సంభవించును.

లోకమున : దేవదత్తునకు నెయ్యి, ఉప్పు, కూర, పచ్చడి వడ్డింపుము అనునపుడు పరస్పర విరోధము లేదు కనుక, మూడింటికి ప్రాప్తి సమానము కనుక మూడు పదార్థములును వడ్డింపవచ్చును.

వైదిక కర్మమున : "బ్రాహ్మణులకు పాద్యమును, ఆచమనీయమును ఒసంగుము" అనునపుడు పాద్యాచమనీయములకు పరస్పరవిరోధము లేదు కనుకను, తుల్యముగనే ప్రాప్తించుచున్నవి కనుకను సముచ్చయము.

వ్యాకరణశాస్త్రమున : ఒకేప్రత్యయమునకు, ఫలభేదముండుటవలనను విరోధము లేకపోవుటవలనను ప్రత్యయసంజ్ఞ, కృత్ సంజ్ఞ, కృత్యసంజ్ఞ కూడ వచ్చును. ఇది సముచ్చయము.

వికల్పము : ఇది సముచ్చయమునకును, బాధకును ప్రతిపక్షము, అనగా విరోధి. తుల్యప్రమాణసిద్ధములగు వానిలో విరోధమున్నపుడు రెండును (ఏకకాలికముగ) సముచ్చయముగ రాపీలులేదుకనుకను ఒకదాని నొకటి బాధింపవీలులేదుకనుకను ఏదో ఒకటియే రావీలగును. కావున దీనిని వికల్పమందురు.

వేదమున : "వ్రీహిభిర్వా యవైర్వా యజేత" అనునపుడు యాగమున వ్రీహి యవలకు అంగత్వము తుల్య ప్రమాణసిద్ధ మగునపుడు రెంటిని కలిపి ఉపయోగింప వీలుపడదు కనుక ఏదో ఒకదానినే వినియోగించుట వికల్పము.

లోకమున : కౌండిన్యునకు పెరుగు గాని మజ్జిగ గాని పోయుము అనునపుడు ఏదో ఒకదానిచే అన్నము తడియుట అను ఫలము సిద్ధించును కనుక పెరుగు కాని మజ్జిగ కాని పోయబడుట వికల్పము.

శాస్త్రమున : ణ్వుల్ తృచ్ ప్రత్యయములు సమానార్థకములు, తుల్యప్రమాణ సిద్ధములు అగునవి సముచ్చయముగా రావీలుపడదు కనుక వికల్పము. విధి ప్రతిషేధ శాస్త్రములు రెండును తుల్యబలములైనపుడు వానికి కూడ వికల్పమే సంభవించును.

వేదమున : "అతిరాత్రే షోడశినం గృహ్ణాతి, న గృహ్ణాతి" అను విధినిషేధ ములు రెండును తుల్యప్రమాణ సిద్ధములే కనుక షోడశి గ్రహణాగ్రహణములకు వికల్పము.

లోకములో కూడ : "వీనికి కొంచెమిమ్ము, వద్దు" అని చెప్పినపుడు రెండును సమానబలములే కనుక విధి నిషేధములకు వికల్పము. ఇస్తే ఇవ్వవచ్చు-మానిన మానవచ్చు.

శాస్త్రమున : భాష్యకారుడు "వా" గ్రహణము చేయనవసరము లేదు. విధి నిషేధ శాస్త్రబలముచేతనే రెండును సిద్ధించును అని విధినిషేధములకు వికల్పమును చెప్పెను.

ఊహ : ప్రకృతియాగమున వినియోగించు మంత్రములను వికృతియాగమున నుపయోగించునపుడు దేవతాభేదముండుటచే ఆ మంత్రములు యాథాతథముగా ఉపయో గింపవు. కావున ప్రకృతిని, లింగమును, వచనమును వికృతియాగదేవతానుగుణముగ మార్చుకొనుట ఊహ. ప్రకృత్యూహ, లింగోహ, వచనోహ అని ఇది మూడు విధములు. ప్రకృత్యూహ: ప్రకృతియాగమున "అగ్నయే త్వా జుష్టం నిర్వపామి" అను మంత్రమున వికృతియాగమున "సూర్యాయ" అని సూర్యదేవతా వాచకమగు ప్రకృతిని మార్చుట. ఇట్లే మిగిలినవి కూడ.

లోకమున : "ఈ దేవదత్తునకు ఎత్తైన మేడలు కలవు. ధనవంతుడు ఈ వెధవ" అన్నపుడు దేవదత్తునకు అను షష్ఠీవిభక్త్యంతమును రెండవ వాక్యములో ధనవం తుడు అను ప్రథమాంతముతో అన్వయించునట్లు దేవదత్తుడు అని మార్చుకొనుట ఊహ.

వ్యాకరణమున: ఒకసూత్రములోనున్న పదము వేరొక సూత్రములో సంబంధించు నపుడు విభక్తి పరిణామము తరచు చేయవలసియుండును. "ఉపదేశేఽజనునాసిక ఇత్" (ఉపదేశమున అనునాసికమగు అచ్చుఇత్ అను సంజ్ఞ కలదగును) అని చెప్పి "తస్య లోపః" (ఆ ఇత్సంజ్ఞక వర్ణమునకు లోపము వచ్చును) అని చెప్పెను. "తస్య" అను షష్ఠ్యంతముతో సంబంధించుటకు పూర్వసూత్రములోని 'ఇత్' అను ప్రథమాంత పదమును షష్ఠ్యంతముగా మార్చవలెను.

సంబంధాబాధనము : ఇది ఊహకు ప్రతిపక్షము. "దేవదత్తునకు ఎత్తైన మేడలు కలవు. అవి ధనవంతునకు తగినవే" అనునపుడు దేవదత్తునకు అను షష్ఠ్యంతము

రెండవ వాక్యములోని ధనవంతునకు అను పదముతో సంబంధించుటలో విభక్తి పరిణామ మక్కరలేదు. కనుక ఆది సంబంధాబాధనము.

వేదమున: "యజమానం దండేన దీక్షయతి-అద్భి ర్దీక్షయతి-మేఖలయా దీక్షయతి" అను వాక్యములలో "యజమానం" అను పదము విభక్తి పరిణామ మక్కర లేకుండగనే మిగిలిన వాక్యములతో సంబంధించును.

వ్యాకరణమున: "బహుగణవతుడతి సంఖ్యా" అను సూత్రమునందలి "సంఖ్యా" శబ్దము "ష్ణాంతా షట్" (ష్ణాంతా సంఖ్యా) అను సూత్రమున ష్ణాంతా అనుదానితో విభక్తి పరిణామ మక్కరలేకయే సంబంధము కలిగియుండును.

అతిదేశము: ఒకదానియందుండు ధర్మమును వేరొకదానికి సంబంధింప చేయుట అతిదేశము. సామాన్యాతిదేశము-విశేషాతిదేశము అని అది రెండువిధములు.

సామాన్యాతిదేశము: వేరొకచోట ప్రసిద్ధముగ సంబంధముకలవని నిశ్చిత ములైన సాధారణ ధర్మములు దానికంటె భిన్నమగుస్థలమున నున్నట్లు ప్రసిద్ధముగ తోచు టచే ఒకదాని సాధారణ ధర్మమును వేరొకదానికి సంబంధింపచేయుట సామాన్యాతిదేశము.

క్షత్రియుని బ్రాహ్మణునివలె చూడవలెను. బ్రాహ్మణునియందు ప్రసిద్ధసంబం ధముకల త్రిషవణస్నాన శౌచ జపాది ధర్మములు క్షత్రియునియం దుండుటచే బ్రాహ్మణ సాధారణముగ చేయు అగ్రాసనదాన, అనుగమనాది ధర్మములను క్షత్రియునందుగూడ సంబంధింపచేయుట సామాన్యాతిదేశము.

వేదమున: ప్రకృతి యాగమువలె వికృతియాగము నాచరింపవలెను అనునది సామాన్యాతిదేశము.

వ్యాకరణశాస్త్రమున: ఆదేశము స్థానివలె ఉండును అనునది సామాన్యాతి దేశము.

విశేషాతిదేశము: ఈ బ్రాహ్మణుని బ్రాహ్మణునివలె ఆదరించవలెను.

బ్రాహ్మణ సామాన్యముగాచేయు అగ్రాసనదాన, అనుగమనాదులు చేయవలెనని ఎరింగినవానికి బ్రాహ్మణునివలె ఈ బ్రాహ్మణుని ఆదరించవలె నని బ్రాహ్మణాతిదేశముచే ప్రయోజనములేదు కనుక అతిదేశసామర్థ్యముచే విశిష్టబ్రాహ్మణునికి చేయు అర్ఘ్యోపనయనాది విశేషములు ఈ బ్రాహ్మణునికి చేయవలె నని అతిదేశము చేయబడును.

వేదమున: ప్రకృతియాగమువలె వికృతియాగము చేయవలె నను సామాన్యాతి దేశ మున్నను "ఆగ్నేయవత్ సౌర్యమ్" అని వికృతియాగమగు సౌర్యయాగము ఏకదేవతాక మగుటచే, ఏకదేవతాకమగు ఆగ్నేయయాగమువలెనే అంగజాత మాచరింపవలె నని విశేషాతి దేశము చేయబడును.

వ్యాకరణశాస్త్రమున: రూపాతిదేశ, నిమిత్తాతిదేశ, తాదాత్మ్యాతిదేశ, శాస్త్రాతి దేశ, కార్యాతిదేశ, వ్యపదేశాతిదేశ భేదములచే విశేషాతిదేశ మారు విధములుగ నుండును.

ఉదాహరణమునకు *నిమిత్తాతిదేశము:* ధాతువునకు సన్ ప్రత్యయమును చేర్చు నపుడు, సన్ ప్రత్యయప్రకృతియగు ధాతువు ఏనిమిత్తము నాశ్రయించి ఆత్మనేపదము నందునో ఆ నిమిత్తము సన్నంతమునకుగూడ ఆత్మనేపదమునకు నిమిత్తమగునని సూచిం చుచు "పూర్వవ త్సనః" అని సన్నంతమున నిమిత్తాతిదేశము చేయబడెను. ఏధ ధాతువు ఆత్మనేపదమగుటచే "ఏదిధిషతే" అని సన్నంతముకూడ ఆత్మనే పదమే యగును.

అధికారము : అధికారము అనగా యోగ్యత. అర్థిత్వము, సామర్థ్యము, శాస్త్రముచే నిషేధింపబడకుండుట అను మూడు లక్షణములుకల వ్యక్తి అధికారి. పురుషార్థము నపేక్షింపనివానికి ఆ కర్మయందు ప్రవృత్తికలుగదు కనుక మొదట కోరిక యుండవలెను. అది యున్నను ఆ కర్మచేయు సామర్థ్యము లేనివాడు కర్మయందు ప్రవృత్తుడు కాలేడు. నాటకము చూడవలెనని కోరిక యున్నను కన్నులేనివాడు చూడలేడు. సామర్థ్యము, కోరిక, యున్నను శాస్త్రవిహితములైన కర్మలయందు శాస్త్రముచే నిషేధింపబడిన వానికి అధికారము లేదు. అలౌకికమగు పురుషార్థము నుద్దేశించి ప్రవర్తించుటలో శాస్త్ర మెవనికి ప్రవృత్తిని విధించునో వానికే అధికారము. అదియే ప్రధానము. లోకమున రాజు ఒకనిని "నీవీనాటి నుండి ఈ గ్రామమునకు లేదా నగరమునకు అధికారివి" అని నియోగించినచో వాని కధి కారము సిద్ధించును.

వేదమున: "'అగ్నిహోత్రం జుహుయాత్ స్వర్గకామో బ్రాహ్మణః" అని బ్రాహ్మ ణునకు స్వర్గమందు కోరికగలవానికి అగ్నిహోత్రము నాచరించుటలో అధికారము.

వ్యాకరణశాస్త్రము: సాధుశబ్దమును, దానియర్థమును, దానిని ప్రయోగించుటచే పురుషునకు గలుగు ధర్మములను, ఫలమును ప్రతిపాదించుటలో అధికారము గలిగియుండును,

శబ్దము: ఆరు విధములు - మొదట సాధుశబ్దము, అసాధుశబ్దము అని రెండు విధములు. సాధుశబ్దము శాస్త్రీయము, ప్రాయోగికము అని ద్వివిధము. శాస్త్రీయము ప్రతిపాద్యము, ప్రతిపాదకము, ఉభయరూపము అని త్రివిధము.

ప్రతిపాద్యశబ్దము "దాధర్తి" మున్నగురూపమున శాస్త్రముచే సాధువుగ నిపతింప బడిన శబ్దము.

ప్రతిపాదకశబ్దము : ప్రకృతిప్రత్యయరూపము.

ఉభయరూపము : "భతవ్య" శబ్దము. తవ్య శబ్దముచే ప్రతిపాదింపబడుటచే ప్రతిపాద్యశబ్దము; భవితవ్యం మొదలగుచోట ఇతవ్య శబ్దము ప్రతిపాదకశబ్దము. ఈ విధముగ ఉభయరూపము. ప్రాయోగికము లౌకికము, వైదికము అని ద్వివిధము. అసాధు శబ్దముతో కలిపి ఆరు విధములు.

అర్థము: ఇది 18 విధములు. అర్థము వస్తుమాత్రము, అభిధేయము అని ద్వి విధము.

1. వస్తుమాత్రము : లోకమున వస్తురూపమున నుండునది.
2. అభిధేయము : ఇతరుల కర్థమగునట్లు చెప్పబడి బుద్ధిలో శబ్దముచే భాసించునది. ఇది శాస్త్రీయము, లౌకికము అని రెండు విధములు.
3. శాస్త్రీయము : ప్రకృత్యర్థము, ప్రత్యయార్థము అని శాస్త్రముచే కల్పింపబడినది.
4. లౌకికము : ప్రకృతి ప్రత్యయ విభాగరహితముగ, అఖండముగ భాసించునది.
5. విశిష్టావగ్రహసంప్రత్యయహేతువు : శాస్త్రములో "కంసవధమును చెప్పుచున్నాడు" అను నర్థమున "కంసం ఘాతయతి" అని విశిష్టముగ వ్యవహరింపబడును. లోకమున కథకుడు లేదా నటుడు చెప్పుచున్నను, అభినయించుచున్నను కంసుని చంపు

చున్నాడు. చంపును, చంపినాడు అని వ్యవహరింతురు. ఇచట లోకవ్యవహార విలక్షణ మగు జ్ఞానమున గోచరమగు అర్థము విశిష్టావగ్రహసంప్రత్యయ హేతువు.

6. తద్విపరీతము : లోకములో ఎట్లు జ్ఞానవిషయమగుచున్నదో అట్లే శబ్దముచే కూడ చెప్పబడునది "ఈ ఆవు తెల్లనిది".
7. ముఖ్యము : "గంగడోలు మున్నగునవి కలది ఆవు" అని.
8. పరికల్పితరూప విపర్యాసము : సాదృశ్యాది నిమిత్తవశమున ఆరోపితరూపముకలది. "గౌ ర్వాహీకః" "వాహీకుడు పశువు" అనినపుడు గోరూపము కల్పితము.
9. వ్యపదేశ్యము : జాతి, ద్రవ్యము మొ॥ నవి.
10. అవ్యపదేశ్యము : జాతిద్రవ్యాది విభాగరహితమగు అఖండవాక్యార్థము.
11. సత్త్వభావము నందినది : లింగసంఖ్యాద్యన్వయయోగ్యమగు ద్రవ్యరూపము నందినది.
12. అసత్త్వభూతము : వాక్యార్థరూపమున నుండునది.
13. స్థిరలక్షణము : 'రాజపురుషుడు' అను సమస్తపదమున పురుషునకు రాజసంబంధిత్వము స్థిరలక్షణము.
14. వివక్షాప్రాపిత సన్నిధానము : "రాజ్ఞః పురుషస్య" (రాజుయొక్క - పురుషుని యొక్క") ఇచట విశేష్య మొకపుడు రాజు కావచ్చును. లేదా పురుషుడు కావచ్చును. ఇట్లు వివక్షనుబట్టి విశేష్య విశేషణ భావము మారవచ్చును.
15. అభిధీయమానము : 'రాజసఖః' అను సమాసమున టచ్ ప్రత్యయము సమాసాంతముగ షష్ఠీతత్పురుషసమాసముననే వచ్చును కనుక "రాజుయొక్క సఖుడు" అను నర్థము అభిధీయమానము.
16. ప్రతిపాద్యమానము : రాజు స్నేహితుడుగా కలవాడు అను నర్థము.
17. అభిసంహితము : గోశబ్దమునకు గోత్వరూపజాతికాని, గోరూపవ్యక్తికాని, ఉభయము కాని-శబ్దశక్తిచే ప్రతిపాదింప నభిప్రేతమైనది.
18. నాంతరీయకము : గోవునందుండు రంగు, ఆకారము మున్నగునవి వ్యక్తిని వదలి యుండునవి కాకపోవుటచే,వ్యక్తిని శక్తిచే ప్రతిపాదించుచున్నను దానిని వదలియుండక పోవుటచే వచ్చు అర్థము.

క్రమము : శ్రుతిక్రమము, అర్థక్రమము, పాఠక్రమము, కాండక్రమము, ప్రవృత్తిక్రమము, ప్రతిపత్తిక్రమము, ప్రయోగక్రమము, బుద్ధిక్రమము అను భేదములు కలిగి యుండును.

శ్రుతిక్రమము లోకమున : స్నాత్వా "వ్రజతి" స్నానముచేసి వెళ్ళుచున్నాడు అనుచోట క్త్వాప్రత్యయము శ్రుతిగోచరమగుటచే రెండు క్రియల పౌర్వాపర్యము తెలియుచున్నది.

వేదమున : "హృదయస్యాగ్రే అవద్య త్యథ జిహ్వాయాః" "పశువుయొక్క హృదయమును ముందుగా విశసనము చేయవలెను తరువాత జిహ్వను" అని చెప్పుటలో అగ్రే= ముందు—అథ = తరవాత అను పదశ్రుతి క్రమమును నిరూపించుచున్నది.

శాస్త్రమున : "పరస్మైపదానాం ణలతుసుస్థలథుసణల్వమాః" అని పరస్మైపద ప్రత్యయములు తొమ్మిదింటికి ణల్ మొదలగు తొమ్మిది ఆదేశములు వచ్చును అనుచోట

స్థానాన్యాదేశములు సమసంఖ్యలో నున్నపుడు "యథాసంఖ్య మనుదేశః సమానామ్" అని యథాసంఖ్యముగ వచ్చునని శాస్త్రము చెప్పుటచే ఇది శ్రుతిక్రమము.

అర్థక్రమము : అర్థము అనగా సామర్థ్యము. దానిచే పౌర్వాపర్యము నిశ్చయింపబడుట. *లోకమున* "భుక్త్వా స్నాత్వా వ్రజతి" (భోజనముచేసి స్నానముచేసి వెళ్ళుచున్నాడు) అనునపుడు స్నానము తరువాత భోజనము జరుగుట సహజమగుటచే వేరొక విధముగ పలుకబడినను అర్థపర్యాలోచనచే "స్నానము, భోజనము" తరువాత "వెళ్ళుట" అని తెలియును కావున ఇది అర్థక్రమము.

వేదమున : "అగ్నిహోత్రం జుహోతి, యవాగూం శ్రపయతి"అగ్నిహోత్రమును హోమము చేయుచున్నాడు, యవాగువును (గంజి) కాచుచున్నాడు" అనునపుడు యవాగువు హోమద్రవ్యముగా ఉపయోగపడునది కనుక దానిని ముందు కాచి తరువాత హోమము చేయవలెనను క్రమము వాని స్వరూప పర్యాలోచనముచే నిర్ణయింపబడును. శ్రుతినిబట్టి ముందు అగ్నిహోత్రహోమమున్నను తరువాతియవాగూ పాకము దృష్టప్రయోజనము లేనిదగును కావున, ముందు యవాగూపాకమైనచో హోమార్థ ముపయోగింపబడును కావున అర్థమునుబట్టి యవాగూ పాకము ముందు హోమము తరువాత చేయవలెననునది అర్థక్రమము. శాస్త్రమున *గూడ* ప్రధానాప్రధానకర్మలు *గల* ఉభయకర్మక క్రియలలో ప్రధానకర్మకంటె ముందుగ అప్రధానకర్మకే క్రియతో సంబంధముండును కావున దాని ననుసరించి లకారాదులు ప్రవర్తించుచుండును. "గాం దోగ్ధి పయః" (ఆవును పాలను పిండుచున్నాడు) అనునపుడు 'గాం' అనునది అప్రధాన కర్మ-'పయః' అనునది ప్రధానకర్మ. కాని ఆవు లేనిదే పాలను పిండలేడు కావున క్రియతో ముందు గోశబ్దమునకు, తరువాత పయశ్శబ్దమునకు సంబంధము. ఇది అర్థ సామర్థ్యముచే ఏర్పడిన క్రమము కావున అర్థక్రమము.

పాఠక్రమము : ఉచ్చారణము ఏ క్రమములో నుండునో ఆక్రమమే పాఠక్రమము. ఆమె వక్త్ర, కాంతి, ఈక్షణ, గతి, స్వర, కేశములచే ఇందు, స్వర్ణ, ఏణ, మాతంగ, పుంస్కోకిల, మయూరములను జయించినది. ఇచట ఉచ్చరించిన క్రమములో ఉపమేయోపమానములకు సంబంధము పాఠక్రమము.

వేదమున : ప్రయాజలు అనెడి యాగాంగ హోమములను"సమిధో యజతి, తనూనపాతం యజతి, ఇడో యజతి, బర్హి ర్యజతి" అని ఏ వరుసలో పఠించినారో ఆ వరుసలోనే చేయవలెను. ఇది పాఠక్రమము.

శాస్త్రమున : "విప్రతిషేధే పరం కార్యమ్" అని సూత్రపాఠక్రమము ననుసరించి పూర్వ పరశాస్త్రములకు ఏకత్ర ప్రాప్తి కలుగునపుడు పాఠక్రమము ననుసరించి పరశాస్త్రము ప్రవర్తించును.

కాండక్రమము : స్మృతులలోను పురాణములలోను బ్రాహ్మణ క్షత్రియ వైశ్యశూద్రుల ధర్మములు ఏ క్రమములో ముందు ఉద్దేశింపబడునో ఆ క్రమముననే కాండములలో ధర్మములు ప్రతిపాదింపబడును. వేదమున యాజ్యానువాక్య లనెడి ఋక్కులు ఏ క్రమములో నున్నవో ఆ క్రమములోనే ఆగ్నేయాదులకు సంబంధము. వ్యాకరణ శాస్త్రములో ఆరవ యధ్యాయమున ముందు ద్విర్వచన కాండము. తరువాత సంప్రసారణకాండము పఠింప

బడినవి. అందుచే ద్విర్వచన కాండముకంటె సంప్రసారణకాండము పరమగుటచే ముందుగా ప్రవర్తించును.

ప్రవృత్తిక్రమము : బ్రాహ్మణులు ఏ వరుసతో యజ్ఞశాలలో ప్రవేశింతురో ఆ వరుసలోనే వారిని ఆచార్యుడు ఆయా కార్యములలో నియమించును.

వేదమున: ''సప్తదశ ప్రాజాపత్యాన్ పశూ నాలభతే'' అని పదునేడు ప్రాజాపత్య పశువులను ప్రోక్షణ విశసన పర్యగ్నికరణము లను సంస్కారములచే సంస్కరించవలెను. అపుడు ఏ పశువునకు ముందు ప్రోక్షణ మారంభించునో ఆ ప్రోక్షణ మన్నింటికి చేసి ఆక్రమములోనే మిగిలిన విశసన పర్యగ్నికరణములను చేయవలెను. యజ్ఞమాచరించువాని ఇచ్ఛననుసరించి ప్రోక్షణ మారంభించవచ్చును. కాని మిగిలిన సంస్కారములు ఆ ప్రవృత్తి ననుసరించి సాగును. కావున ఇది ప్రవృత్తిక్రమము

వ్యాకరణశాస్త్రమున : ఏ క్రమమున అర్థప్రాదుర్భావము జరుగునో ఆ క్రమముననే శబ్ద ప్రాదుర్భావము జరుగును. పట్వ్యా, మృద్వ్యా అనుచోట్ల 'పటు' అను ప్రాతిపదికకు లింగసంబంధమువలన ముందు స్త్రీ ప్రత్యయము వచ్చును, తరువాత కర్మ, సంఖ్యాది సంబంధముచే ఏకవచనము వచ్చును. ఆ క్రమముననే పటు + ఈ + ఆ అనుచోట యణా దేశాది కార్యములు వచ్చును.

ప్రతిపత్తిక్రమము : లోకమున "పురుష- రాజ్ఞః" అని పురుషశబ్దము ముందు చ్చరింపబడినను ''రాజుగారి యొక్క పురుషుడు" అని రాజశబ్దార్థ ప్రతిపత్తి పూర్వకముగనే పురుష శబ్దార్థ ప్రతిపత్తి కలుగును.

వేదమున : ప్రధాన యాగమును గూర్చి ముందు తెలిపి అవాంతర యాగములను గూర్చి తరువాత చెప్పినను అంగ నిర్వర్తనానంతరమే ప్రధాన యాగనిర్వర్తనము కనుక అట్లే గ్రహింపబడును.

శాస్త్రమున : "లుఙ్ లఙ్ ల్ఋఙ్ క్ష్వడుదాత్తః" లుఙ్, లఙ్, ల్ఋఙ్‌లలో ధాతువునకు పూర్వము అడాగమము వచ్చునని విధించెను. అభవత్, అభూత్, అభవిష్యత్ మొ. స్థలము లందు అడాగమము ముందు ఉచ్చరింపబడుచున్నను లఙ్, లుఙ్ మొదలగు లకారములేనిదే అడాగమము రాదు కనుక పాఠక్రమముకంటె ప్రతిపత్తిక్రమముచే లకారములు వచ్చిన తరువాతనే అడాగమము వచ్చును.

ప్రయోగక్రమము : శాస్త్రములో "డుకృఞ్" అను ధాతువునందు ఏ క్రమమున ఇత్సంజ్ఞక వర్ణములు ప్రయోగింపబడినవో ఆక్రమము ననుసరించియే వానికి ఇత్సంజ్ఞ లభించును.

వేదమున : "దర్శపూర్ణమాసాభ్యా మిష్ట్వా అన్యేన యజేత" దర్శపూర్ణమాస యాగముల నాచరించియే ఇతరయాగము ననుష్ఠింపవలెను అని ప్రయోగమున క్రమమును పాటింపవలెను.

బుద్ధిక్రమము : వర్ణములు ఉచ్చరించగానే నశించునవి కనుక "ఇకున్కలకు అచ్చు పరముగా నున్నపుడు యణ్ ఆదేశముగా వచ్చును'' అను సూత్రముచే సంహితలో ఇక్కుకు అచ్చుపరముగా నుండుట కుదురదని భాష్యకారుడు ఆశంకించి బుద్ధిమంతుడైన వక్త వర్ణ పద వాక్య మహావాక్య రూపముగ శబ్దముచే అర్థములను బుద్ధిలో గోచరింపచేసికొని

పౌర్వాపర్యమును కల్పించుకొనవలెను అని వర్ణములకు, పదములకు, వాక్యములకు, వాని అర్థములకు పౌర్వాపర్యము బుద్ధిక్రమమని సమాధానము చెప్పెను. ఇది శాస్త్రమునందలి బుద్ధిక్రమము.

లోకములో: మెరుపును చూచి ఒకటే యనుకొనుటతో క్రమముగా ప్రవర్తించు చున్న విద్యుత్తులను బుద్ధిలో సంకలనముచేయుట గోచరించును. ఇది బుద్ధిక్రమము.

వేదములో : అనుష్ఠానానంతరమే నిలిచు ప్రయాజాదులకు క్రమము బుద్ధి పరికల్పితమే కావున ఇది క్రమము.

అవివక్ష : క్రమమునకు విరోధి. క్రమమును వివక్ష చేయనిచో నిమిత్త వశమున అక్రమముగ ప్రవర్తించును. యాగాంగముల నాచరించునపుడు "తుమ్మువచ్చినచో ఆచమనము చేయవలెను. దురదవేసినచో దుప్పికొమ్ముతో గోకుకొనవలెను". అనియున్నది. ఇది ఒక వరుసలో చేయవలసినది కాదు. ఎవరికి ఆ నిమిత్తము సంభవించునో వారు ప్రాయశ్చిత్తము చేసికొనవలెను.

లోకములో : వాక్యమును ప్రయోగించుటలో క్రమమునకు అవివక్ష. అందుచే కొందరు "గాం ఆనయ శుక్లాం దండేన" అందురు. మరికొందరు. "శుక్లాం గాం ఆనయ దండేన" అందురు. క్రమమక్కరలేదు. శాస్త్రములో కిత్తుజిత్తు రూపమగు నిమిత్తము నాశ్రయముగా చేసికొని వచ్చు గుణవృద్ధులు రావు. అనునపుడు యథాసంఖ్యముగా కిత్తు గుణమునకు, జిత్తు వృద్ధికి సంబంధించునని వివక్షచేయబడలేదు కనుక క్రమము ఆశ్రయింపబడదు.

ప్రయోజకము : ప్రయోజకమనగా హేతుభూతమైనది. ఏనుగుమీదనెక్కిన రాజుగారిపైనుండు ఛత్రచ్ఛాయతో ఏనుగు సంబంధించియున్నను రాజు ఛత్రచ్ఛాయకు ప్రయోజకుడు. ఏనుగు అప్రయోజకము.

శేషశేషిభావము : ప్రధానము శేషి-దానికుపయోగించునది శేషము. వేదమున "వ్రీహీన్ అవహన్తి" ధాన్యమును దంపవలెను. ధాన్యము శేషి— దంపుట శేషము. ఈ శేషశేషి భావసంబంధమున అంగములుగా నుండునవి ఆరాదుపకారకములు, సాక్షాదుపకారకములు అని రెండువిధములు. వేదమున అవఘాతము (దంపుట) దర్శపూర్ణమాసములకు సాక్షాదుపకారకము. ప్రయాజాదులు ఆరాదుపకారకములు.

భేదము : ఒకే పదార్థమునందు శక్తిభేదము, శక్తివ్యాపారభేదము ఉండును. మేఘమునుండి మెరయుచున్నది; మేఘమునందు మెరయుచున్నది; మేఘము మెరయు చున్నది అని మేఘమునందు అపాదాన, అధికరణ, కర్తృ శక్తిభేదముచేతనే వ్యాపారభేదము కూడ కన్పట్టును.

"ధనుస్సుచే కొట్టుచున్నాడు" (ధనుషా విధ్యతి) యనునపుడు ధనుస్సునందు అపాదానశక్తిగర్భమగు కరణశక్తి యుండును.

ఒకే కర్మకు ఫలభేదము కూడ ఉండును. ఒకే విధమగు దానకర్మకు ఆయుస్సు ఆరోగ్యము, ఐశ్వర్యము అను ఫలభేదము ఉండును. సంబంధభేదముచే కూడా భేదము కలుగును.

ధాత్వర్థమగు క్రియయొక్క కర్తలలో భేదముండుటచే క్రియాభేదమేర్పడును. ఇద్దరు వండుచున్నారు, పలువురు వండుచున్నారు. కర్తలు ఇద్దరు, పలువురు అయినపుడు వారిసంబంధముచే క్రియాభేద మేర్పడును.

అభేదము: భేదమునకు ప్రతిపక్షము భేదమును వివక్షింపకుండుట. "అన్నమును వండి తినుచున్నాడు" ఒకే కర్తయొక్క రెండు వ్యాపారములలో పూర్వవ్యాపారమును తెలుపు క్రియకు క్త్వాప్రత్యయము వచ్చును. ఇక్కడ క్రియాభేదముచే కర్తృకర్మశక్తులు భిన్నములని వివక్ష చేయకపోవుటచే ఏకకర్తృకత్వముచే క్త్వాప్రత్యయము వచ్చెను. ఈభేదము, అభేదము కూడ బహువిధముల నుండును.

ఈవిధముగ మీమాంసాశాస్త్రమునందలి ఆరు, లేదా పదిరెండు, లేదా ఇరువది నాల్గు న్యాయములు వివరింపబడినవి. ఇవి అఖండవాక్యార్థ పక్షమున పద పదార్థములు లేవు కనుక ప్రతిపాదింప వీలుపడదు.

వెనుక ప్రతిపాదించిన ఇరువదినాల్గు విధములగు న్యాయములకంటె భిన్నములగు మరికొన్ని న్యాయములు కూడ పదార్థ నిర్ణయమునకు ఉపయోగించునవి కలవని ప్రతిపాదించుచున్నాడు.

ప్రసజ్యప్రతిషేధోఽయం పర్యుదాసోఽయ మత్ర తు
ఇదం గౌణ మిదం ముఖ్యం వ్యాపీదం గురు లఘ్విదమ్ . 84

భేదో నాంగాంగిభావోఽస్య బహుభేదం వికల్ప్యతే
ఇదం నియమ్యతేఽస్యాత్ర యోగ్యత్వ ముపజాయతే . 85

అస్య వాక్యాంతరే దృష్టా ల్లింగా ద్భేదోఽనుమీయతే
అయం శబ్దా దపోద్ధృత్య పదార్థః ప్రవిభజ్యతే . 86

ఇతి వాక్యేషు యే ధర్మాః పదార్థోపనిబంధనాః
సర్వే తే న ప్రకల్పేరన్ పదం చేత్స్యా దవాచకమ్ . 87

అయం = ఇది, ప్రసజ్యప్రతిషేధః = ప్రసజ్య ప్రతిషేధము, అత్రతు = ఇచటనైతే, అయం = ఇది, పర్యుదాసః = పర్యుదాసము, ఇదం = ఇది, గౌణం = గౌణము, ఇదం = ఇది, ముఖ్యం = ముఖ్యము, ఇదం = ఇది, వ్యాపి = వ్యాపకము, ఇదం = ఇది, గురు = గురువు, ఇదం = ఇది, లఘు = లఘువు, భేదః = భేదము, న = లేదు, అంగాంగిభావః = అంగాంగిభావము, ఇదం = ఇది, అస్య = దీనికి, బహుధా = అనేకవిధముల, వికల్ప్యతే = వికల్పించబడును, ఇదం = ఇది, నియమ్యతే = నియమింపబడును, అస్య = దీనికి, అత్ర = ఈక్రియయందు, యోగ్యత్వం = యోగ్యత, ఉపజాయతే = కలుగును, అస్య = దీనికి, వాక్యాంతరే = ఇతరవాక్యమున, దృష్టాత్ = చూడబడిన, లింగాత్ = హేతువువలన, భేదః = భేదము, అనుమీయతే = అనుమానింపబడును, అయం పదార్థః = ఈ పదార్థము, శబ్దాత్ = శబ్దమునుండి, అపోద్ధృత్య = పృథక్కరించి, ప్రవిభజ్యతే = విభాగముచేయబడుచున్నది, ఇతి = ఈ విధముగ, వాక్యేషు = వాక్యములయందు, పదార్థోపనిబంధనాః = పదార్థముల నాశ్రయించి ప్రవర్తించునట్టి, యేధర్మాః = ఏ న్యాయములు కలవో, తే = అవి, సర్వే = అన్నియు, పదం = పదము, అవాచకం స్యాత్ చేత్ = అర్థబోధకము కాదన్నచో, న ప్రకల్పేరన్ = సంభవింపవు.

తా. వెనుక చెప్పిన ఇరువది నాల్గు విధములగు వాక్యలక్షణములు కాక మరి కొన్నిటి నిట ప్రదర్శించుచున్నాడు. పద, పదార్థముల నంగీకరించనిచో ఈ న్యాయములచే వాక్యార్థనిర్ణయము చేయుట సంభవించదు. వాని నిట వరుసగా తెలిసికొందము.

ప్రసజ్య ప్రతిషేధము : 'నఞ్' కు క్రియాపదముతో సంబంధము ఉండి వాక్యభేద మున్నచో అది ప్రసజ్య ప్రతిషేధము. ఉదా : శాస్త్రములో "అకర్తరిచ కారకే సంజ్ఞాయామ్" సంజ్ఞయందు కారకమున ఘఞ్ ప్రత్యయము వచ్చును. కర్తృకారకమున రాదు. ఇచట "అకర్తరి" అను సమాసములో నుండు 'నఞ్' క్రియతో నన్వయించి కర్తృకారకమున రాదు అను నర్థము నిచ్చును. అది భిన్న వాక్యము కావున ప్రసజ్యప్రతిషేధము. వేదమున "బ్రాహ్మణో న హంతవ్యః, నానృతం వదేత్" మొ॥నవి. లోకమున :"అసూర్యం పశ్యా రాజదారాః" (రాజభార్యలు సూర్యుని చూడరు) అని క్రియతో నఞ్ అన్వయించును.

పర్యుదాసము : నఞ్ క్రియతో నన్వయింపక ఉత్తరపదముతో అన్వయించును. భిన్నవాక్యముగా కాక ఏకవాక్యమై యుండును.

శాస్త్రమున: "ఆతో కనుపసర్గేఽ కః" ఉపసర్గభిన్నమగునది ఉపపదముగా నున్నపుడు ఆకారాంతధాతువునకు కప్రత్యమువచ్చును. ఇచట నఞ్ ఉపసర్గముతో సంబంధించినది కాని క్రియతో కాదు. భిన్న వాక్యముగా కాక ఏకవాక్యముగా నున్నది. కావున పర్యుదాసము.

వేదమున:"అబ్రాహ్మణః సోమవిక్రయీ" (బ్రాహ్మణత్వ వ్యతిరిక్త జాతికలవాడు సోమవిక్రయి) అని నఞ్ ఉత్తరపదమగు బ్రాహ్మణ శబ్దముతో సంబంధించినది; నఞ్ సాదృశ్యముకూడ అర్థముగా కలిగియుండుటచే బ్రాహ్మణభిన్నుడు - బ్రాహ్మణ సదృశుడు సోమవిక్రయి అని తెలియచేయబడును.

లోకమున: "అబ్రాహ్మణ మానయ" అబ్రాహ్మణుని తీసికొని రమ్ము అనునపుడు బ్రాహ్మణత్వ వ్యతిరిక్తజాతి కలవాడు తత్సదృశుడు నగువానిని తీసికొనిరమ్ము అనియర్థము. ఇచట నఞ్ ఉత్తరపదమగు బ్రాహ్మణ శబ్దముతో అన్వయించును. కావున ఇది పర్యుదాసము.

గౌణము : "తత్పురుషః సమానాధికరణః కర్మధారయః" (సమానాధికరణ మగు తత్పురుషము కర్మధారయము.) ఇచట తత్పురుష సమాసావయవములగు పూర్వోత్తర పదములు సమానాధికరణములు కాని అసామానాధికరణ్యము తత్పురుషమందు లక్షణా వృత్తిచే ఆరోపింపబడెను. కావున ఇది గౌణము.

వేదమున: "ఆదిత్యో యూపః" చక చకమని మెరయుట యను గుణసంబంధముచే యూపమును ఆదిత్యుడుగా వ్యవహరించుట గౌణము.

లోకమున: "సింహో మాణవకః" ఆ మాణవకుడు సింహము అని సింహము యొక్క శౌర్యాదిగుణయోగముచే మాణవకుని సింహముగా వ్యవహరించుట గౌణము

ముఖ్యము : శాస్త్రమున 'ధాతోః ప్రాతిపదికాత్' అనువాని యర్థము ముఖ్యము. 'హన్' అను దానియందు ముఖ్యధాతుత్వము, రామ యను దాని యందు ముఖ్య ప్రాతిపదికత్వము. అహన్ అను పరినిష్ఠితరూపమున ధాతుత్వము అతిదిష్టము కావున గౌణము. 'రామే' అను సుబంతమున ప్రాతిపదికత్వము అతిదిష్టము కావున గౌణము.

వేదమున : ‘‘యజమానోఽధ్వర్యు మన్వారభతే’’ (యజమానుడు అధ్వర్యువును అన్వారంభము చేయును) అనుచోట యజమాన, అధ్వర్యువు అను శబ్దముల యర్థములు ముఖ్యములు.

లోకమున : ‘‘శూరో మాణవకః’’ ఈ మాణవకుడు శూరుడు అనుట ముఖ్యము.

వ్యాప్తి : ‘‘ఏకశ్రుతి దూరాత్సంబుద్ధౌ’’ (దూరమునుండి సంబోధనము చేయు నపుడు ఆ పదము) ఏకశ్రుతి కలదగును. అనుచోట సంబుద్ధిపదమునకు లోకప్రసిద్ధ మైన అభిముఖీకరణము అను నర్థము వ్యాపి (వ్యాపకము). శాస్త్రసిద్ధమగు ఏకవచనమున సంబుద్ధి సంజ్ఞను గ్రహించినచో మిగిలినస్థలములలో సంబోధనమును గ్రహింపదు. వ్యాపక మగు లోకప్రసిద్ధమగు నర్థమును గ్రహించినచో శాస్త్రీయమగునదికూడ దానిలో నంతర్భూత మగును.

వేదమున : ప్రధానయాగసంబంధియగు ఫలమును విధించునవి ఫలవిధానము లేని అన్నియాగములకు సంబంధించునట్లు వ్యాపకముగా నుండును. ‘‘జ్యోతిష్టోమేన స్వర్గ కామో యజేత’’ అని విధించినపుడు జ్యోతిష్టోమ శబ్దము ఫలవిధానములేని ప్రధాన యాగ మును లక్షణచే తెలుపును. కావున ఫలవిధానములేని విశ్వజిదాది యాగములందు స్వర్గమే ఫలముగా నుండును. కావున ఈ విధి వ్యాపకము.

లోకమున : ‘సన్నిహతి’ యను నొకతీర్థమున సర్వతీర్థములు సన్నిహితములై యుండునని భారతమున చెప్పబడెను. దానిలో గ్రహణ సమయమున స్నానముచేయుట సర్వతీర్థస్నానఫలదము అనుట వ్యాపకము.

గురువు-లఘువు : పృషోదరాది శబ్దములు శిష్టవ్యవహారమున ప్రసిద్ధములగుటచే వానిని ‘పృషోదరాదీని యథోపదిష్టమ్’ యథోపదిష్టములగు వానికి సాధుత్వమును విధించుట లఘువైన ఉపాయము. వానినే ప్రత్యేకముగ సాధించిన గురువగును.

లోకమున : ‘లోహితశాలిమాన్ అయం గ్రామః’ (ఎఱ్ఱధాన్యము కలది ఈ గ్రామము) అనుచోట లోహితశాలిశబ్దములకు కర్మధారయమును చేసి దానిపై మతుప్ప్రత్యయమును చేర్చుట గురువు. బహువ్రీహి సమాసమును చేయుట లఘూపాయము. వేదమున వెనుక ప్రతి పాదించిన తంత్రప్రసంగములు లఘూపాయములు. ఆవృత్తి గురూపాయము.

అంగాంగిభావము : సామాన్యవిధులు విశేషవిధులతో కలిసి ఏకవాక్యతతో నన్వయించును కాని భేదముండదు. ‘‘తస్యాపత్యమ్’’ అను సామాన్యసూత్రము అపత్యార్థ మున ప్రత్యయములను విధించు విశేషసూత్రములతో అంగాగిభావముతో అన్వయించును.

వేదమున : ఒక వాక్యమున అవయవముగా సంబంధించు భాగము వాక్యాం తరములకు కూడ అవయవముగా అన్వయించును. ‘చిత్పతి స్త్వా పునాతు, వాక్పతి స్త్వా పునాతు, దేవ స్త్వా సవితా పునాత్వచ్ఛిద్రేణ పవిత్రేణ’ ఇచట ‘అచ్ఛిద్రేణ పవిత్రేణ’ అను వాక్యావయవము ముందు వాక్యములకుకూడ సంబంధించును. అంగాగిభావము వెనుక ఇరువది నాల్గు న్యాయములలో చెప్పబడినది. అయితే అచట ఒక అంగికి ఒక అంగము చూపబడినది. కాని ఇచట ఒక అంగము అనేకాంగులకు సంబంధించుట ప్రతిపాదింపబడెను.

లోకమున : ‘‘మణిః శాణోల్లీఢః శరది సరిదాశ్యాన పులినా’’ మున్నగు దీప కాలంకారోదాహరణములలో ఒకే క్రియ అనేక వాక్యములతో సంబంధించును.

బహుధావికల్పము: *వ్యాకరణశాస్త్రమున :* కొన్నిచోట్ల నిత్యముగా ప్రాప్తించుచుండగా వికల్పము, కొన్నిచోట్ల ప్రాప్తిలేకున్నను వికల్పము, కొన్నిచోట్ల ఉభయ వికల్పము. వేదమున దీక్షణీయేష్టియందు ఉపాంశు స్వరము ప్రాప్తమగుచుండగా యథేష్టముగ ఉచ్చైస్స్వరవిధానము వికల్పముగ విధింపబడెను.

లోకమున : ఒకే ఉపమేయ వస్తువును వివిధముగ ఉత్ప్రేక్షారూపమున వికల్పించుట ఉత్ప్రేక్షాలంకారమున కన్పట్టును.

నియమము : *శాస్త్రమున :* "తే ప్రాగ్ధాతోః" ఉపసర్గలు ధాతువునకు ముందే ప్రయోగింపబడవలెను అనునది నియమము.

వేదమున : 'నక్షత్రం దృష్ట్వా వాచం విసృజేత్' నక్షత్ర దర్శనముచేసి మాట లాడవలెను అనిచెప్పుటచే నక్షత్రదర్శనము అయ్యేకాలమందే మాటలాడవలెను. అంతకు ముందు మౌనము పాటింపవలెను అని నియమము వచ్చుచున్నది. 'నక్షత్రములను చూచి' అనుటచే నక్షత్రదర్శన యోగ్యమగు కాలమని యర్థము వచ్చును. అందుచే పగలు ఏదైన కారణముచే నక్షత్రములు కన్పడినను వాగ్విసర్గము చేయరాదు. అట్లే రాత్రి మబ్బులు కమ్ము టచే నక్షత్రములు కానరాకున్నను మాటలాడవచ్చును అని గ్రహింపవలెను.

లోకమున : పార్థుడే ధనుర్ధరుడు అనునపుడు ధానుష్కత్వము పార్థుని యందు నియమింపబడుచున్నది. విశేష్యముతో నన్వయించు ఏవకారము అన్యయోగ వ్యవ చ్ఛేదమును చేయును. విశేషణముతో సంబంధించు ఏవకారము అయోగవ్యవచ్ఛేదము చేయునని ఎరుంగునది.

యోగ్యత: *శాస్త్రమున :* ఋకారముయొక్క స్థానమున రాబోవుచున్న అణ్‌నకే రపరముగా నుండు యోగ్యత కలదని "ఉరణ్ రపరః" (అ, ఇ. ఉలకే) అను సూత్రము చెప్పెను.

వేదమున : జ్యోతిష్టోమ యాగానుష్ఠానమున త్రైవర్ణికులకే యోగ్యతను ప్రతి పాదించును.

లోకమున : "ధురి ధుర్యో నియుజ్యతే" కాడి మోయగల ఎద్దునే కాడికి కట్టుదురు అని యోగ్యత తెలుపబడును.

భేదము : వాక్యాంతరమున గన్పట్టు లింగము వలన భేదము గోచరించు చుండును. శాస్త్రమున "ఓః పుయణ్ జ్యపరే" అను సూత్రముచే అభ్యాసమునందలి ఉకార మునకు ఇకారమును విధించుట అను లింగము (నిమిత్తము)చే ణిచ్ పరమగునపుడు వచ్చిన ఆదేశము స్థానివంటిదగునను విశేషము తెలియును. "ద్వివ్వచనేఽచి" అను సూత్రముచే స్థాని వద్భావనిషేధము 'ణిచ్' పరమగునపుడు ప్రవర్తింపదు.

వేదమున : 'అక్తాః శర్కరా ఉపదధాతి' పూయబడిన గులకరాళ్ళు ఉపధానము చేయవలెను. అనినపుడు 'దేనిచే పూయబడినవి' అని శంక కలుగగా 'తేజో వై ఘృతమ్' అను వాక్యాంతరమున కన్పట్టు ఘృతస్తుతిరూపలింగముచే ఘృతముచే పూయబడినవి అని తెలియుచున్నది.

లోకమున : "రామోఽసౌ భువనేషు విక్రమగుణైః ప్రాప్తః ప్రసిద్ధిం పరామ్" విక్రమముచే ప్రసిద్ధిచెందినవాడు ఈ రాముడు అనినపుడు దశరథ రాముడా ? పరశు రాముడా ? అను సందేహము రాగా ఆశ్లోకముయొక్క ఉత్తరార్ధములో ఒకే బాణముతో ఏడు చెట్లకు రంధ్రమేర్పరచిన వాడను లింగముచే దశరథరాముడే అని తెలియుచున్నది.

పదార్థవిభాగము : శబ్దమును పృథక్కరించి ప్రకృతి ప్రత్యయములుగా విభాగముచేయుట. శాస్త్రమున : "ధృషిశసీ వైయాత్యే" అను సూత్రమున వైయాత్యశబ్ద మును వియాత + ష్యఞ్ అని విభజించి వియాతునియొక్క భావము వైయాత్యము అని అర్థము కల్పించుటలో గోచరించును.

వేదమున : "వాయవ్యం శ్వేత మాలభేత" అను వాక్యార్థమునందలి వాయవ్య పదార్థమునుండి వాయుపదార్థమును పృథక్కరించి 'వాయుర్వై క్షేపిష్ఠా దేవతా' అని వాయు దేవత అర్థవాదమున స్తోత్రము చేయబడినది. లోకమున 'రాజపురుషః' అనునపుడు అందులో రాజపదార్థమును పృథక్కరించి 'కస్య రాజ్ఞః' (ఏ రాజుయొక్క) అని ప్రశ్నించుటచే విభాగము కల్పించబడుచున్నది.

పైవిధమగు న్యాయములు పదసముదాయ రూపములగు వాక్యములందు పదార్థ ముల నాధారముగ చేసికొని వాక్యార్థమును నిర్ణయించుట కేర్పడినవి. పదపదార్థ విభాగ రహితమగు వాక్య వాక్యార్థము నంగీకరించినచో ఈ న్యాయముల కవకాశముండదు కదా ! కావున అఖండ వాక్యపక్షము అంగీకరించుట తగదని పదసత్యత్వవాది ఆక్షేపములను తెలిపెను.

అఖండవాక్యార్థవాదమున చూపిన దోషములను పరిహరించుచున్నాడు.

అవిభక్తేఽపి వాక్యార్థే శక్తిభేదా దపోద్ధృతే
వాక్యాంతర విభాగేన యథోక్తం న విరుధ్యతే. 88

అవిభక్తే ఽపి = అవాంతరవాక్యార్థ, పదార్థరూప విభాగము వాస్తవముగ లేని దైనను, వాక్యార్థే = వాక్యార్థము, శక్తిభేదాత్ = పదార్థప్రతీతిని, అవాంతర వాక్యార్థ ప్రతీ తిని కల్గించు మహావాక్యగత శక్తిభేదమువలన, వాక్యాంతర విభాగేన = అవాంతర వాక్య, పదరూప విభాగముచే, అపోద్ధృతే = బుద్ధిచే పృథక్కరింపబడగా, యథోక్తం = పదార్థ నిశ్చయమునకై ఏర్పడిన న్యాయములు మొదలగునవంతయు, న విరుధ్యతే = విరుద్ధముకాదు.

తా. మహావాక్యమువలన అఖండ వాక్యార్థజ్ఞానమే కల్గుచుండుటచే అదియే సత్యమైనను, అవాంతరవాక్య, వాక్యార్థ, పద, పదార్థ ప్రతీతికూడ లోకమున కల్గుచుండుటచే తదనుగుణముగ మహావాక్యమున భిన్నశక్తులుండు ననియు ఆ శక్తులచే అవాంతరవాక్య, పద విభాగమును కల్పించినచో అవాంతర వాక్యార్థ పదార్థజ్ఞానము వానిచే కల్గునని యంగీకరింప వలెను. అట్లంగీకరించిన వాక్యార్థనిర్ణయమున నుపయోగించు పదసంబంధులు మీమాంసా న్యాయములన్నియు ప్రవర్తించుటలో విరోధము లేదు.

అభిన్నమగు పుష్పచందనాది వాసనలయందు భేదమెట్లు కల్పితముగ వ్యవహరింప బడునో అట్లే అఖండవాక్యార్థమున కల్పితభేదము వ్యవహరింపబడునని దృష్టాంతముమ ప్రదర్శించుచున్నాడు.

యథైవైకస్య గంధస్య భేదేన పరికల్పనా
పుష్పాదిషు తథా వాక్యే ష్వర్థభేదో విధీయతే. 89

పుష్పాదిషు = పూవులు, చందనము మున్నగువానియందు, యథైవ = ఏవిధముగా, ఏకస్య గంధస్య = అభిన్నమగు లేదా ఏకజాతీయమగు పరిమళమునకు, భేదేన = భిన్న జాతీయముగ, పరికల్పనా = కల్పించుట జరుగుచున్నదో, తథా = ఆ విధముగనే, వాక్యేఽపి = అఖండ వాక్యార్థమునందుకూడ, అర్థభేదః = పదార్థభేదము, విధీయతే = కల్పింపబడును.

తా. పూవులయందు, చందనమందు ఉండు పరిమళము ఒకేవిధమైనది, లేదా ఒకటేయయినను ఇది చందనపరిమళము, పూవులపరిమళము అని ఎట్లు భేదమును కల్పించి వ్యవహరించుచున్నారో అట్లే వాక్యముచే బోధింపబడు అఖండవాక్యార్థమున ఇది దేవదత్త శబ్దార్థము, ఇది గోశబ్దార్థము అని భేదము కల్పింపబడుచున్నది.

వేరొక దృష్టాంతమును చూపుచున్నాడు.

గవయే నరసింహే వా హ్యేక జ్ఞానావృతే యథా
భాగం జాత్యంతరస్యైవ సదృశం ప్రతిపద్యతే. 90

యథా = ఏవిధముగ, గవయే = గవయమృగమునందును, నరసింహే వా = నరసింహునియందును, ఏకజ్ఞానావృతే = ఒకటిగానే గ్రహింపబడుచున్నవానియందు, జాత్యంతరస్యైవ = గవయత్వరూపమున, నరసింహత్వరూపమున ప్రత్యేకజాతియై యుండు దానికే, భాగం = గోత్వము, అశ్వత్వము అను విభాగమును, నరత్వము, సింహత్వము అను విభాగమును, సదృశం = గోవునందు, అశ్వమునందు ఉండు గోత్వాశ్వత్వములకు సదృశమగు దానిని, నరునియందు, సింహమునందు ఉండు నరత్వసింహత్వములకు సదృశమగుదానిని, ప్రతిపద్యతే = లోకము గుర్తించుచున్నదో (అట్లే వాక్యార్థమునగూడ విభాగమును గ్రహించుచున్నది).

తా. గవయమృగము గోవు అశ్వము కలిసినరూపముతో నుండును. నరసింహమూర్తి నరుడు సింహము కలిసినట్లు ఉండును. కాని వాస్తవమునకు గవయమున గోరూప అశ్వరూపముల సమావేశములేదు. నరసింహునియందు నర-సింహరూపముల సమావేశము లేదు. గవయత్వము వేరేజాతి. నరసింహత్వము వేరేజాతి. ప్రసిద్ధమగు గోవునందుండు గోత్వమువంటి భాగము, అశ్వత్వమువంటి భాగము అందున్నట్లు కన్పించుటచే గోత్వ-అశ్వత్వము లను భాగములు గవయమునందున్నట్లును, నరత్వసింహత్వరూపజాతులు నరసింహము నందున్నట్లును లోకము బుద్ధిచే పరికల్పితమగు విభాగము నెట్లు గుర్తించునో, అట్లే వాక్యార్థమును పదార్థరూప విభాగరహితమైనను కల్పితమైన భాగములచే పదపదార్థవిభాగము కలదానివలె గ్రహించును.

ఇట్లు కల్పితమగు పృథక్కరణముచే ఏర్పడిన పదవిభాగము నాశ్రయించి "పిక" పదార్థ సందేహము ఉపపన్నమగునని సమాధానించుచున్నాడు.

అప్రసిద్ధం తు యం భాగ మదృష్ట మనుపశ్యతి
తావ త్యసంవిదం మూఢః సర్వత్ర ప్రతిపద్యతే. 91

యం = ఏ, అప్రసిద్ధం = అంతకుముందు ప్రసిద్ధముకాని, భాగం = గవయము యొక్క అశ్వసదృశమగు భాగమును, అదృష్టం = ఇంతకుముందు అశ్వసదృశముగనున్నను అశ్వసదృశముగ చూడని దానినిగ, అనుపశ్యతి = భావించునో, సః = వాడు, సర్వత్ర = సంపూర్ణమగు గవయరూపమున, మూఢః = జ్ఞానములేనివాడయ్యె, తావతి = అశ్వభాగ సదృశమగు గవయభాగముననే, అసంవిదం = అజ్ఞానమును, ప్రతిపద్యతే = కల్గియుండును.

తా. గవయమున గోసదృశమగు భాగము అశ్వసదృశమగు భాగము ఉండునపుడు అందులో గోసదృశభాగము నెరింగి అశ్వసదృశమగు భాగమును ఎరుంగనివాడు గవయమును పూర్ణముగ నెరుంగనివాడే యగును. కాని దానియందు వాస్తవముగ లేని గోసదృశ, అశ్వసదృశ భాగములను కల్పించుకొనుటచే సగము తెలిసినట్లును సగము తెలియనట్లును వానికి తోచును.

అట్లే ప్రకృతమున పికపదముయొక్క అర్థము తెలియనట్లుండునని సమన్వయించుచున్నాడు.

తథా పికాదియోగేన వాక్యేఽత్యంతవిలక్షణే
సదృశస్యేవ సంజ్ఞాన మసతోఽర్థస్య మన్యతే . 92

తథా = అట్లే, పికాదియోగేన = 'పిక' మొదలగు పదముల చేరికచే, అత్యంత విలక్షణే = వనాత్ ఋక్ష ఆనీయతామ్, (వనమునుండి ఎలుగుబంటి తేబడుగాక) అను వాక్యముకంటె పూర్తిగ విలక్షణమైన, వాక్యే = వనాత్ పిక ఆనీయతామ్ వనమునుండి కోకిల తేబడుగాక) అను వాక్యమున, అసతః అర్థస్య = వాస్తవముగలేని ''వనము, ఆనయనము (తెచ్చుట)" అను నర్థమునకు, సదృశస్యఇవ = మొదటివాక్యములోనిదానివలె, సంజ్ఞానం = ప్రత్యభిజ్ఞ (గుర్తించుట), మన్యతే = భావింపబడును.

తా. "వనాత్ పిక ఆనీయతామ్" అనువాక్యము "వనాత్ ఋక్ష ఆనీయతామ్" అను వాక్యముకంటె పూర్తిగ భిన్నమైనదే. మొదటి వాక్యములోలేని పికపద ముండుటచే భిన్నమే. వనాత్ ఆనీయతామ్ అను పదములు, వాని యర్థములను పోలినయర్థములుగల పదము లిందుండుటచే-సదృశము లనిపించుటచే ఆ రెండు శబ్దములు తెలిసినట్లును పికపదము తెలియనట్లును భావించును. కాని వాస్తవమునకు పదములు వాక్యమునందు ప్రత్యేకముగ లేవు. ఒక పదముయొక్క అర్థము తెలియనినాడు వాక్యమంతయు తెలియనట్లే.

వేరొకదృష్టాంతమును చూపుచున్నాడు.

ఏకస్య భాగే సాదృశ్యం భాగే భేదశ్చ లక్ష్యతే
నిర్భాగస్య ప్రకాశస్య నిర్భాగేనైవ చేతసా . 93

ఏకస్య = ఏకాకారమైన, నిర్భాగస్య = భాగములులేని, ప్రకాశస్య = ప్రకాశ రూపమగు జ్ఞానమునకు, భాగే = (జ్ఞాన) భాగమున, సాదృశ్యం = ఇతరజ్ఞానములతో పోలికయున్ను, భాగే = (విషయ) భాగమున, భేదశ్చ = భేదమున్ను, నిర్భాగేనైవ = భాగరహితమగు, చేతసా = జ్ఞానసాధనమగు మనస్సుచేతనే, లక్ష్యతే = గుర్తింపబడును.

తా. ఎరుపు నలుపు మొదలగు రంగులయొక్క సమూహజ్ఞానము కలిగినపుడు ఆ జ్ఞానము ప్రకాశరూపము, విభాగరహితము, ఏకమునై యుండును. కాని ప్రత్యేకముగా

ఎరుపునే చూచినపుడు కలిగిన జ్ఞానమునకును దీనిలో ఎరుపుయొక్క జ్ఞానమునకును పోలిక యున్నట్లును నలుపుయొక్క జ్ఞానము మాత్రము ఇచట భిన్నముగా నున్నట్లును కన్పడును. కాని వాస్తవమునకు నిర్భాగమైన మనస్సు కాల్పనికముగ అట్లు గ్రహించున ట్లుండును. కాని ఆ జ్ఞానము వేరు, ఈ జ్ఞానము వేరు. అంతేకాదు. విషయము వేరు కాని జ్ఞానము సమానమను కొనుటకు వీలుకాదు. విషయము జ్ఞానము విడదీసి చూప వీలుగా నుండవు. అదంతయును ఒకటే కావున భేదసాదృశ్యములు కల్పితములే, ఉన్నట్లు తోచును.

పై దృష్టాంతమును పదవాక్యవిషయమున నన్వయించుచున్నాడు.

తథైవ భాగే సాదృశ్యం భాగే భేదోఽవసీయతే

భాగాభావేఽపి వాక్యానా మత్యంతం భిన్నధర్మణామ్ . 94

తథైవ = అట్లే, అత్యంతం = పూర్తిగా, భిన్నధర్మణామ్ = భిన్న స్వభావముకల, వాక్యానాం = వాక్యములలో, భాగాభావేఽపి = భాగములు లేకపోయినను, భాగే = ఒక భాగమునందు, సాదృశ్యం = పోలికయున్ను, భాగే = భాగమునందు, భేదః = భేదమున్ను, అవసీయతే = నిశ్చయింపబడును.

తా. పైని చూపిన రక్తనీలాది జ్ఞానమువలెనే "వనాత్ ఋక్ష ఆనీయతామ్" "వనాత్ పిక ఆనీయతామ్" అను వాక్యములు రెండును అత్యంతభిన్నములే. కాని కాల్పనిక పదవిభాగముచే వాస్తవముగ భాగములు లేకపోయినను "వనాత్, ఆనీయతామ్" అను భాగమున రెండు వాక్యములలో సాదృశ్య మున్నట్లును "ఋక్షః, పికః" అను భాగమున భేదమున్నట్లును గోచరించును. కాని వాస్తవమునకు రెండును ప్రత్యేకము అఖండములై అఖండ వాక్యార్థమును బోధించునవే.

అఖండవాక్యార్థవాది పదవాదమున దోషములను చూపుచున్నాడు.

రూపనాశే పదానాం స్యాత్ కథం చావధికల్పనా ?

అగృహీతావధౌ శబ్దే కథం చార్థో వివిచ్యతే ? 95

పదానాం = పదములయొక్క, రూపనాశే = స్వరూపము సంహితలో (సంధిలో) మార్పుచెందునపుడు, అవధికల్పనా = ఈ యర్థమును బోధించు వర్ణానుపూర్వి గల పద మిది యని కల్పించుట, కథంచ = ఎట్లుగా, స్యాత్ = అగును, శబ్దే = పదము, అగృహీతావధౌ = ఈ వర్ణానుపూర్విగల ఈ పదము ఈ అర్థముయొక్క వాచకత్వము కలది యని గ్రహింప బడనిచో, కథం చ = ఎట్లు, అర్థః = అర్థము, వివిచ్యతే = గ్రహింపబడును.

తా. సంహితలో సంధి జరిగినపుడు 'దధ్యానయ' 'దధీహ' మున్నగు వాక్య ములలో దధిశబ్దమునకు ఏకరూపత లేకపోవుటచేతను దధ్నా దధ్నే మొదలగు విభక్త్యంత ములలో ఏకరూపత లేకపోవుటచేతను, దధిరూపార్థబోధకము ఈ పదము అని నియతముగ నెట్లు నిశ్చయింప వీలగును? అర్థబోధక పదస్వరూప నిశ్చయము లేనిచో అర్థజ్ఞాన మెట్లు కలుగును? అని పదవాది ఇది పదమని నిరూపింప వీలుపడదని దోషమును చూపుచున్నారు.

'శ్వేతో ధావతి' అను వాక్యము రెండు ప్రశ్నలకు సమాధానముగా వ్యవహరింప బడుచున్నది. అచట "శ్వా + ఇతః, శ్వేతః" అనురెండు విధములుగ పదప్రతీతి అఖండ వాక్య వాక్యార్థపక్షమున కుదురదు. కనుక "శ్వేతః ధావతి" (తెల్లని గుఱ్ఱము పరుగెత్తుచున్నది)

అను నర్థమే కాని "కుక్క ఇటువైపు పరుగెత్తుచున్నది' అను నర్థము అంఖండవాక్యపక్షమున రావీలుపడదని శంకించి సమాధానము చెప్పుచున్నాడు.

సంసర్గ ఇవ రూపాణాం శబ్దేఽన్యత్ర వ్యవస్థితః
నానారూపేషు తద్రూపం తంత్రేణాపర మిష్యతే. 96

అన్యత్ర = వాక్య వాక్యార్థము లఖండములను పక్షమున, శబ్దే = శ్వేతః అను శబ్దమున, రూపాణాం = శ్వా + ఇతః — శ్వేతః, శ్వేతః అనునట్టి శబ్దస్వరూపముల యొక్క, సంసర్గ ఇవ = సంసర్గము (కలిపి యుచ్చరించుట) వలె, వ్యవస్థితః = ఏర్పడి యున్నది; తంత్రేణ = ఏక ప్రయత్నముచేతనే రెండు శబ్దములను కలిపి యుచ్చరించుటచే (దానితోనే చేరియున్న), అపరం తద్రూపం = అఖండమగు ఆ శ్వేతో ధావతి యను వాక్య స్వరూపమే, నానారూపేషు = శ్వాఇతః-శ్వేతః అను భిన్న స్వరూపముల ప్రతీతిని కల్గించు నదిగా, ఇష్యతే = అంగీకరింపబడును.

తా. కుక్క ఇటు పోవుచున్నదా? అని ఒకరు ప్రశ్నించగా, వేరొకరు తెల్లని గుఱ్ఱము ఇటు పోవుచున్నదా? అని ప్రశ్నింపగా ఆ రెండు ప్రశ్నములకుకూడ ఒకేవాక్యముతో "శ్వేతోధావతి" అని సమాధానము చెప్పినపుడు ఒక అర్థమున శ్వా = కుక్క, ఇతః = ఇటువైపు, ధావతి = పరుగెత్తుచున్నది: వేరొక యర్థమున శ్వేతః = తెల్లనిది (గుఱ్ఱము), ధావతి = పరుగెత్తుచున్నది అని రెండర్థములు అఖండవాక్యపక్షమున ఎట్లు వచ్చును? ఇచట 'శ్వా' అన్న రూపమే లేదుగదా! ఒక్క యర్థమేగదా వాక్యము వలన వచ్చును అని శంకించు కొని సమాధానమును చెప్పుచున్నారు.

శ్వేతః అనుదానిలో శ్వా + ఇతః, శ్వేతః అనునవి తంత్రముచే కలిపి యుచ్చ రింపబడినట్లుండును. వాస్తవమునకు అఖండమే కాని శ్వేతో ధావతి అను వాక్యముచే శ్వా ఇతో ధావతి, శ్వేతో ధావతి అను రెండు వాక్యస్వరూపములు ప్రతీయమానము లగును. అట్లు ప్రతీతములగు రెండు వాక్యములచే రెండు విధములగు అర్థములు వచ్చును.

నినే ప్రకారాంతమున వివరించుచున్నాడు.

తస్మిన్న భేదే భేదానాం సంసర్గ ఇవ వర్తతే
రూపం రూపాంతరా త్తస్మా దనన్యత్ ప్రవిభజ్యతే. 97

తస్మిన్ = ఆ శ్వేతః అనునట్టి, అభేదే = అఖండమగు ఒకే వాక్యమున, భేదా నాం = శ్వా ఇతః, శ్వేతః అనునట్టి భిన్న వాక్యములయొక్క, సంసర్గ ఇవ = కలయిక వలె, వర్తతే = ఉండును, తస్మాత్ = అందువలన, రూపం = శ్వేతః అనెడి అఖండరూపము, రూపాంతరాత్ = శ్వా ఇతః, శ్వేతః అనెడి రూపద్వయము కంటె, అనన్యత్ = వేరు కానిదే యయ్యు, ప్రవిభజ్యతే = ఆవృత్తిచే రెండు అర్థముల నిచ్చునట్లు విభజింపబడును.

తా. ఇచటగూడ "శ్వేతో ధావతి" అను వాక్యముచే రెండర్థములు వచ్చుటనే వివరించుచున్నారు. "శ్వా ఇతో ధావతి, శ్వేతో ధావతి" అనెడి రెండు వాక్యములను కలిపి తంత్రముగ (ఒకేసారి) ఉచ్చరించునట్లు కన్పట్టు "శ్వేతో ధావతి" అను వాక్యము అఖండమే. ఈ అఖండ వాక్యములో ఆ రెండు వాక్యములు కలిసియే యుండును. ఈ అఖండవాక్యమే, ఉచ్చరించువా డొక్కసారియే ఉచ్చరించినను అర్థమును గ్రహించువానిచే రెండుసార్లు భావింప బడి కల్పిత విభాగముచే రెండర్థము లిచ్చును.

వి. వెనుకటి శ్లోకమునకు ఈ శ్లోకమునకు కొంచెము భేదమున్నది. ప్రత్యాయకము=ప్రతీతిని (జ్ఞానమును) కల్గించునది, ప్రత్యాయ్యము = ప్రతీయమానమైనది అనెడి రెండింటికి భేదము, అభేదము అనెడి రెండుపక్షము లిందు ప్రతిపాదింపబడినవి. 'శ్వేతో ధావతి' అనెడి వాక్యముచే 'శ్వా ఇతో ధావతి' 'శ్వేతో ధావతి' అను రెండు వాక్యములు ప్రతీయమానము లగుననియు, ఆ ప్రతీయమానములగు రెండు వాక్యములచే రెండర్థములు ప్రతిపాదింపబడు నను నదియు మొదటిమతము. శ్వేతో ధావతి అని రెండర్థములతో కలిసియున్న వాక్యము ప్రత్యాయకము. దానిచే ప్రత్యేకార్థబోధకములుగా ప్రతీయమానములగు రెండు వాక్యములు ప్రత్యాయ్యములు. వీటికి భేదము అంగీకరించి మొదటి శ్లోకమున సమాధానము నిచ్చిరి.

రెండవ శ్లోకమున "శ్వేతో ధావతి" అనెడి అఖండవాక్యముకంటె ప్రత్యేకార్థబోధకములగు వాక్యములు వేరుగా నుండవనియు అవి దానితో అభిన్నములుగనే యుండుననియు ఆ ప్రత్యాయక వాక్యముచేతనే ఆవృత్తిచే రెండర్థములు ప్రతిపాదింపబడుననియు వివరించెను. ఇందు ప్రత్యాయక ప్రత్యాయ్యములకు అభేదము నంగీకరించెను.

ప్రత్యాయక ప్రత్యాయ్యములకు భేదము, అభేదము అనునవి విషయభేదముచే శాస్త్రమున నంగీకరింపబడినవి అని ప్రసంగవశమున నిరూపించుచున్నాడు.

శాస్త్రే ప్రత్యాయకస్యాపి క్వచి దేకత్వ మాశ్రితమ్
ప్రత్యాయ్యేన క్వచి ద్భేదః గ్రహణ గ్రాహ్యయోః స్థితః. 98

శాస్త్రే=శాస్త్రమునందు, క్వచిత్=కొన్నిచోట్ల, ప్రత్యాయక స్యాపి = ప్రత్యాయకమునకు గూడ, ప్రత్యాయ్యేన = ప్రత్యాయ్యముతో, ఏకత్వం=అభేదము, ఆశ్రితం=స్వీకరింపబడినది, క్వచిత్=కొన్నిచోట్ల, గ్రహణ గ్రాహ్యయోః = ప్రత్యాయక ప్రత్యాయ్యములకు, భేదః = భేదము, స్థితః = ఉండును.

ప్రత్యాయక ప్రత్యాయ్యములకు భేదమునకు ఉదాహరణము నిచ్చుచున్నాడు.

ఊఁఇత్యభేద మాశ్రిత్య యథాసంఖ్యం ప్రకల్పితమ్

ఊః ఇతి="ఊకాలోఽజ్ఝ్రస్వదీర్ఘప్లుతః" (1.2.27) అను సూత్రములో ఊః అను చోట, అభేదం=ప్రత్యాయక ప్రత్యాయ్యములకుఅభేదమును, ఆశ్రిత్య = ఆశ్రయించి, యథాసంఖ్యం = యథాసంఖ్యత, ప్రకల్పితం=కల్పింపబడెను.

తా. "ఊకాలోఽచ్ హ్రస్వ దీర్ఘప్లుతః" అను సూత్రములో ఉ, ఊ, ఊ౩ అను మూడు వర్ణములను 'ఊ' అని నిర్దేశించి వానియొక్క కాలముతో సమానమైన కాలము గల అచ్చు హ్రస్వము, దీర్ఘము, ప్లుతము అను సంజ్ఞలు కలది యగునని విధించెను. 'ఊ' అను నది ఉ, ఊ, ఊ౩ అను మూడు వర్ణముల ప్రతీతిని మనకు కల్గించును కనుక అది ప్రత్యాయకము. 'ఉ, ఊ, ఊ౩' అను వర్ణములు ప్రత్యాయ్యములు. ఇచట యథాసంఖ్య నియమముచే 'ఉ' కాలముతో సమానమైన కాలముగల అచ్చు హ్రస్వము, ఊకాలసదృశకాలముగల అచ్చు దీర్ఘము, ఊ౩ కాలసదృశకాలముగల అచ్చు ప్లుతము అని అర్థము చెప్పవలెను. ఉద్దేశ్యము ఊ అనునది ఒకటి. విధేయములు హ్రస్వ దీర్ఘ ప్లుతములు మూడు. వీనికి సంఖ్యలో సామ్యములేదు కనుక 'యథా సంఖ్య మనుదేశః సమానామ్' అను సూత్రముచే సమసంఖ్య కలవానికే యథాసంఖ్యముగ సంబంధము కనుక ఇచట యథాసంఖ్యముగ సంబంధమెట్లు?

అని శంకించి భాష్యకారులు ప్రత్యాయక ప్రత్యాయ్యముల కభేదము నాశ్రయించి ఊః అను దానిలో సంధిచే కలిసి 'ఉ, ఊ, ఊః' అను మూడును కలవు కనుక యథాసంఖ్య సంబంధము కుదురును అని వివరించెను. అందుచే 'ఊ' అను ప్రత్యాయకమునకు 'ఉ ఊ ఊః' అను ప్రత్యాయ్యములకును అభేద మంగీకరింపబడెను.

ప్రత్యాయక ప్రత్యాయ్యములకు భేదమునకు ఉదాహరణము నిచ్చుచున్నాడు.

లృఙ్ లృటోర్గ్రహణే భేదో గ్రాహ్యాభ్యాం సహ కల్పితః . 99

లృఙ్ లృటోః గ్రహణే = 'స్యతాసీల్ఌలుటోః' (3.1.33)అను సూత్రమున లృ అనుటచే లృఙ్ లృట్ లకు ప్రతీతి కల్గుచున్నను, గ్రాహ్యాభ్యాం సహ = ప్రత్యాయ్యములతో, భేదః=భేదము, కల్పితః = కల్పింపబడినది.

తా. 'స్యతాసీ ల్ఌలుటోః' అను సూత్రముచే 'ల్ఌలుటోః' పరముగానున్నపుడు స్య తాస్ అనునవి వచ్చును అని విధించుచున్నారు. ఇచట లృ అనుదానిచే లృఙ్ లృట్ గ్రహింపబడును. కాగా నిమిత్తములు లృఙ్ లృట్ లుట్ అనునవి మూడు. అవి నిమిత్తములుగా నుండగా వచ్చు నాగమములు స్య, తాస్ అనునవి రెండు. ఇచట ప్రత్యాయకము లృ లుటోః అనునది. ప్రత్యాయ్యములు లృఙ్ లృట్ లుట్ లు. వీనికి అభేదము నంగీకరించినచో లృఙ్ లృట్ లుట్ అను నిమిత్తములు మూడు, ఆగమములు స్య, తాస్ లు రెండు కనుక యథాసంఖ్య సంబంధము కుదురదు. అందుచే ఇచట భేద మంగీకరించిరి. భేదమంగీకరించినచో ప్రత్యాయకమగు లృ, లుట్ లు రెండే కనుక ఆవి నిమిత్తములుగా స్యతాస్లు వచ్చునని యథాసంఖ్య సంబంధము చెప్పవచ్చును. అపుడు లృఙ్ లోను, లృట్ లోను స్య వచ్చును, లుట్లో తాస్ వచ్చును. ఇట్లు ఇచట ప్రత్యాయక ప్రత్యాయ్యములకు భేదము నంగీకరించి యథాసంఖ్య సంబంధము నిరూపింపబడినది.

ప్రత్యాయక ప్రత్యాయ్యముల కభేదమునకు వేరొక ఉదాహరణ మిచ్చుచున్నాడు.

యస్యేత్యేత దణో రూపం సంజ్ఞినా మభిధాయకమ్
నహి ప్రతీయమానేన గ్రహణ స్యాస్తి సంభవః . 100

అణోః = ఇకార అకారములయొక్క, రూపం = రూపము అగు, యస్య ఇత్యేతత్ = "యస్యేతిచ" (6.4.148) అను సూత్రములోని యస్య అనునది, సజ్ఞినాం = అకారసంజ్ఞులగు పదునెనిమిది అకారములకును, ఇకారసంజ్ఞులగు పదునెనిమిది ఇకారములకును, అభిధాయకమ్ = (గ్రాహకము) వాచకము, అట్లుకానిచో ప్రతీయమానేన = ప్రతీయమానమగు ఇకార అకారములచే, గ్రహణస్య = స్వసవర్ణములగు పదునెనిమిది విధములగు ఇకారాకారములను గ్రహించుటకు, సంభవః = అవకాశము, నాస్తి హి = లేదుగదా!

తా. "ఇశ్చ అశ్చ యం, తస్య యస్య" అను విగ్రహముచే ఇకార అకారములకు సమాసముచేయగా ఇ + అ అనునవి సంధిచే కలిసి య అగును. ఆ ఇకార అకారములకు ఈకారముగాని తద్ధిత ప్రత్యయముగాని పరముగా నున్నపుడు లోపము వచ్చును. అని 'యస్యేతిచ' అను సూత్రము విధించుచున్నది. యస్య అనుచోట ఇ + అ సంధితో కలిసి య అయినది. ఇది ప్రత్యాయకము, ఇకార అకారములు అను ప్రతీతిని కల్గించునది. ఇకారాకారములు ప్రత్యాయ్యములు. ఈ రెండును భిన్నములు కావు. సంధిచేకలిసిన

ఇకారాకారములే య గా నున్నది. అందుచే ఇకారముదే దాని 18 భేదములు, అకారముచే దాని 18 భేదములుకూడ ఇచట గ్రహింపబడును. ఇట్లు గ్రహింపబడనిచో ఇకారమునకే తప్ప ఈకారమునకు లోపమురాదు. అకారమునకే తప్ప ఆకారమునకు లోపమురాదు. అట్లు రానిచో సౌపర్ణేయః వైనతేయః-అను రూపములు సిద్ధింపవు. అందుచే య అను దానికి ఇ, అ అనువానికి అభేదముగ నిర్దేశ మిందు కలదని యంగీకరించవలెను. అంగీకరించినచో ఇ, అ అనునవి స్వసవర్ణములను గ్రహించును కనుక 18 విధములగు ఇకారాకారములకు లోపము రావచ్చును. అట్లు అభేదముగ నిర్దేశము నంగీకరింపక య అను ప్రత్యాయకము "ఇ అ" అను ప్రత్యాయ్యములు భిన్నములన్నచో, ఉచ్చరింపబడినదే స్వసవర్ణములను గ్రహించును కాని ప్రతీయమానము గ్రహింపదు కనుక ప్రతీయమానములగు ఇకార అకారములు ఉచ్చరింపబడిన య కంటె భిన్నములు కనుక ఉచ్చరింపబడక పోవుటచే స్వసవర్ణములను గ్రహింపవు. అందుచే ఇచట ప్రత్యాయక ప్రత్యాయ్యముల కభేదము అంగీకరింపబడినది.

వి. ఇట్లే 'శ్వేతో ధావతి' అనునపుడుకూడ 'శ్వా + ఇతః, శ్వేతః' అనునని రెండును కలిపి అభిన్నముగ 'శ్వేతో ధావతి' అను వాక్యమున నుండుటచే రెండర్థములను ఆ వాక్యమే యొసంగును.

భిన్నవాక్యములు ఏకవాక్యముగ గాని, భిన్నపదములు ఏకపదముగా గాని తోచునపుడు ఒక వాక్యములో ఒక వాక్యము మునిగి కన్పడకయుండును. అర్థబోధనమయమున ఆ రెండర్థములును ఒనివలననే వచ్చును అని చెప్పుచున్నాడు.

ఊః ఇత్యేత దభిన్నం చ భిన్నవాక్యనిబంధనమ్
భేదేన గ్రహణం చాస్య పరరూప మివ ద్వయోః. 101

ఊః ఇత్యేతత్ = ఊకాలః అనుచోట ఊః అనునది, అభిన్నం = అఖండమైనదే, భిన్నవాక్య నిబంధనం = "ఉకాలః అచ్, ఊకాలః అచ్, ఊఃకాలః అచ్" అను భిన్న వాక్యములకు జ్ఞాపకము, ద్వయోః = రెండు అచ్చులయొక్క, పరరూపం ఇవ = పరరూప సంధిచే ఏర్పడిన రూపము అఖండముగా నుండియు తన స్థానులనెట్లు జ్ఞాపకముచేయునో అట్లే, అస్య = అఖండమగు 'ఊః' అనుదానికే, భేదేన = ఉ ఊ ఊః అను మూడింటిని విడిగా, గ్రహణం = గ్రహించుట జరుగును.

తా. "ఊకాలః" అనుచోట 'ఊః' అనునది ఉత్వజాతి సామాన్యముచే మూడు విధములగు ఉకారములకు సామాన్యనిర్దేశమే. అందుచే ఆ ఒక్క ఉకారమే మూండిటిని మనకు భాసింపచేయును. అదే మూడు వాక్యముల యర్థమును ఇచ్చును.

వి. పరరూపముచే రెండు అచ్చులు ఏకరూపమున నున్నను రెండుస్థానులు కూడ ఎట్లు దానిచే స్ఫురించుచుండునో అట్లే ఒకే వాక్యముచే ఆ వాక్యములోనే అణగియున్న మిగిలిన వాక్యములును వాని యర్థమును ప్రకాశింపచేయబడును. వెనుక తంత్రముచే రెండు వాక్యము లేకముగా సుచ్చరింపబడిన వనియు, ఇచట వాక్యము వాక్యములో లీనమై యున్నదను వాక్యోపప్లవముచే రెండువాక్యములు స్ఫురించుచున్న వనియు చెప్పిరి.

"ఊకాలః" అని సూత్రకారుడు నిర్దేశించుటచే వాక్యము అభిన్నమేయని నిరూపించి, యీ అభేదపక్షము వార్తికకారుడు అంగీకరించలేదని వివరించుచున్నారు.

ప్లుత స్యాంగవివృద్ధిం చ సమాహార మచో _స్తథా
వ్యుదస్యతా పున ర్భేదః శబ్దే ష్వత్యంత మాశ్రితః . 102

ప్లుతస్య = ఐకారమునకు, ఔకారమునకు ప్లుతము రాగా ఆ ప్లుతముయొక్క, అంగవివృద్ధిం = ఆ ఐకారౌకారముల యంగములగు ఇకార ఉకారములకు చతుర్మాత్రములుగా నగు వృద్ధిని, వ్యుదస్యతా = నిషేధించుచున్నట్టియు, తథా=అట్లే, అచోః = పూర్వ పరాచ్చుల యొక్క, సమాహారం=సంహితలో కలిసియుండుటను, వ్యుదస్యతా = నిషేధించుచున్న వార్తికకారునిచే, శబ్దేషు = శబ్దములయందు, అత్యంతం = పూర్తిగా, భేదః = భేదము, ఆశ్రితః = ఆశ్రయింపబడెను.

తా. వార్తికకారుడు ఐకారమునకు, ఔకారమునకు ప్లుతమువచ్చి నాలుగు మాత్రలగునపుడు సమూహమునకే వృద్ధివచ్చును కాని అంగములగు ఇకార ఉకారములకు వృద్ధి రాదని చెప్పెను. అందుచే ఇకార, ఉకారములకంటె ఐకార ఔకారములు భిన్నములే కాని అభిన్నములు కావని తెలియుచున్నది. అట్లే సంహితలో పూర్వ పరాచ్చులకు ఏకాదేశము వచ్చిన రూపములలో ఆ అచ్చు రెండు అచ్చుల సమాహారము కాదనియు నది భిన్నమే యనియు వార్తికకారుడు చెప్పెను. అందుచే ప్రత్యాయక ప్రత్యాయ్యములకు భేదపక్షమును వార్తిక కారుడు అంగీకరించెను.

వార్తికకారునకు భేదపక్షము ఇష్టమైనను "ఊకాలః" అని నిర్దేశించిన సూత్రకారునకు అభేదపక్షమే ఇష్టము కనుక దానినే ఆశ్రయించి "శ్వేతోధావతి" మొదలగు వాక్యములలో తంత్రముచేతనే అర్థభేదము వచ్చునని సిద్ధాంతము చేయుచున్నాడు.

అర్ధర్చాదిషు శబ్దేషు రూపభేదః క్రమా ద్యథా
తంత్రా త్తథై కశబ్దత్వే భిన్నానాం శ్రుతి రన్యథా . 103

యథా = ఏవిధముగా, అర్ధర్చాదిషు శబ్దేషు = అర్ధర్చ మున్నగు అఖండశబ్దములలో, రూపభేదః = 'ఋచః అర్ధం—అర్ధర్చం' అని విగ్రహవాక్యముగను, సమాసముగను భిన్నరూపములు ఎట్లు వ్యవహరింపబడునో, తథా = ఆవిధముగనే, ఏకశబ్దత్వే = ప్రత్యాయ్య ప్రత్యాయకములు ఏకశబ్దమే యను మతమున భిన్నానాం = భిన్నములగు "శ్వా ఇతః" "శ్వేతః" అను శబ్దములయొక్క, అన్యథాశ్రుతిః = ఏకరూపమున 'శ్వేతః' అని వినబడుట, తంత్రాత్ = తంత్రమువలన అని యెరుంగనగును.

తా. ఋక్కులో సగము అను నర్థము గల 'అర్ధర్చం' అను శబ్దము అభిన్నరూపమే. కాని 'ఋచః అర్ధం అర్ధర్చం' అని విగ్రహమున ఒక తీరుగను సమాసమున ఒక తీరుగను ఉండును. విగ్రహమున ఋక్ శబ్దము ముందుగను అర్ధశబ్దము తరువాతను ఉండగా సమాసమున అర్ధశబ్దము ముందును ఋక్ శబ్దము తరువాతను ఉండును. ఈ భిన్నక్రమముతో భిన్నరూపములు ఉండగా 'అర్ధర్చం' అను అభిన్నశ్రుతి ఎట్లు వినబడుచున్నదో అట్లే ప్రత్యాయ్య ప్రత్యాయకము లభిన్నములయ్యు "శ్వేతో ధావతి" మున్నగుచోట్ల రెండర్థములు కన్పట్టును.

శబ్దైకత్వమే వివరింపబడుచున్నది.

సంహితావిషయే వర్ణాః స్వరూపే ణావికారిణః
శబ్దాంతరత్వం యాంతీవ శక్త్యాన్తర పరిగ్రహాత్ . 104

సంహితావిషయే = 'శ్వా + ఇతః = శ్వేతః' అను సంహితయందు, వర్ణాః = అకార ఇకార రూపములగు వర్ణములు, స్వరూపేణ అవికారిణః = స్వరూపతః మార్పులేనివైనను, శక్త్యన్తర పరిగ్రహాత్ = రెండర్థముల ప్రతీతిని కల్గించుటవలన-వేరొక శక్తిని స్వీకరించుట వలన, శబ్దాంతరత్వం = శ్వా ఇతః అనునది సంహితచే శ్వేతః అను వేరొకశబ్దముగా నుండుటను, యాంతీవ = పొందినట్లు ఉండును.

తా. శ్వేతః అనునది రెండర్థముల నిచ్చుచుండుటచే, అకార ఇకారములు అసంహితలో అనేక వర్ణములు కలదే సంహితలో ఏకవర్ణమై ఏకపదముగా నున్నట్లు తోచును. కాని వాస్తవమునకు అచట ఏకాక్షరమే కాని భిన్నాక్షరములు లేవు. కాని శ్వేతః అనుదానిచే రెండర్థములు ప్రతీయమానము లగుచుండుటచే వేరొకయర్థమును ప్రతిపాదించు శక్తి ఆ శబ్దమున కంగీకరింపవలెను. కావున సహజముగ వికారములేనివైనను అకార ఇకారములు కలిసి ఏకాక్షరమైనట్లును ఆశబ్దము భిన్నశబ్దమైనట్లును తలంపబడునే కాని వాస్తవమునకు రెండువర్ణము లేకమై ఒక వర్ణమగుటకాని, శ్వా ఇతః, శ్వేతః అను రెండు శబ్దము లుండుట కాని లేదు. అది కల్పితమే యని ఎరుంగవలెను.

శాస్త్రపరికల్పితమైన సంహిత యనెడి నిమిత్తముచే శ్వేతః అనుచోట రెండవ రూపము గ్రహింపబడినను శబ్దస్వరూపము ఏకమే కాని భిన్నముకాదని దృష్టాంతపూర్వకముగ వివరించుచున్నాడు.

ఇంద్రియాదివికారేణ దృష్టం గ్రాహ్యేషు వస్తుషు
ఆత్మత్యాగా దృతే భిన్నం గ్రహణం స క్రమః శ్రుతౌ . 105

ఇంద్రియాది వికారేణ = కన్ను మొదలగు ఇంద్రియములకు కల్గిన కామెర మొదలగు దోషములచే, గ్రాహ్యేషు = ఆ కంటిచే గ్రహింపబడు, వస్తుషు = వస్తువులయందు, ఆత్మత్యాగాత్ ఋతే = స్వరూపములో భేదము లేకుండగనే (ఎట్లు), భిన్నంగ్రహణం = ఒకే త్రాడు భిన్నరూపములతో పాముగా, పూలదండగా, భూమిపై పగులుగా గ్రహింపబడుట సంభవించుచున్నదో, అట్లే శ్రుతౌ = శ్వేతః అను శబ్దమును వినునపుడు, సఃక్రమః = ఆ తీరే సంభవించును, అనగా - ఆ శబ్దము ఒకటే యయి దానిలో మార్పులేకుండగనే సంహిత అను దోషముచే ఆ శబ్దము రెండు రూపములుగా భాసించును. దీనిచే స్వరూపములో భేదము కలుగదు.

తా. ఒక త్రాటిని చూచినపుడు చీకటిచేగాని, కంటి దోషముచేగాని పాముగా, పూలదండగా, భూమిపై ఏర్పడిన బీటగా అది తోచును. ఇచట రజ్జుస్వరూపమున భేదములేకుండగనే ఎట్లు భేదము కంటిచే దోషవశమున గ్రహింపబడునో అట్లే శ్వేతః అను ఒకేశబ్దము స్వరూపమున భేదములేకయే సంహిత యను దోషముచే 'శ్వా ఇతః' అను రూపమున గూడ చెవిచే గ్రహింపబడి భిన్నార్థము నిచ్చును.

పై విషయమునే ఉపసంహరించుచున్నాడు.

అభిధానక్రియాయోగా చ్ఛబ్దే ష్వవికృతే ష్వపి
రూప మత్యంతభేదేవ తదే వైకం ప్రకాశతే. 106

అవికృతేష్వపి = భిన్నరూపములు కలిగియున్నట్లు భాసించుచున్నను వాస్తవమునకు భేదము లేనివేయైన, శబ్దేషు = శ్వేతః మొదలగు శబ్దములయందు, తదేవ ఏకం రూపం = ఆశ్వేతః అను శబ్దమొక్కటియే, అభిధానక్రియాయోగాత్ = సంహితతో కలిపి యుచ్చరించుట యనెడి దోషసంబంధమువలన, అత్యంతభేదేన = శ్వా ఇతః అను భిన్నరూపముతో, ప్రకాశతే = ప్రకాశించును.

తా. 'శ్వేతః' అను రూపము మార్పుచెందునది కాకపోయినను వ్యాకరణ శాస్త్ర కల్పనానుసారముగ శ్వా ఇతః అనునవి సంహితలో 'శ్వేతః' అను రూపము నందుట యను సంబంధముచే శ్వేతః అనునది 'శ్వా ఇతః' అను నాకారముతో గూడ భాసించును.

శబ్దము ఏకమే యయ్యు భిన్నరూపమున వ్యవహరింపఁబడుట వేదమున కూడ గలదని చూపుచున్నాడు.

ఋచో వా గీతిమాత్రం వా సామ ద్రవ్యాంతరం న తు
గీతిభేదా ద్విగృహ్యంతే తా ఏవ వికృతా ఋచః. 107

ఋచః = ఋక్కుయొక్క, గీతిమాత్రంవా = గానము మాత్రముకాని, ఋచః వా = ఋక్కు లేకాని, సామ = సామ యనబడును, కాని, ద్రవ్యాంతరంతు = ప్రత్యేకవస్తువు, న = కాదు, తా ఏవ ఋచః = ఆ ఋక్కులే, వికృతాః = గానముచే మార్పునొందింపబడినవై, గీతిభేదాత్ = వస్తువొకటేయయ్యు గీతిభేదము వలన, విగృహ్యంతే = భిన్నముగా గ్రహింపబడుచున్నవి.

తా. ఋక్కులే గీతిభేదముచే సామము అను పేరున వ్యవహరింపబడుచున్నవి. గానపూర్వకోచ్చారణక్రియామాత్ర సంబంధముచే ఋక్కునకు, సామమునకు వాస్తవమున భేదము లేకపోయినను భేదమున్నట్లు ఎట్లు గోచరించుచున్నదో, అట్లే శ్వా ఇతః అను శబ్దములకు సంహితారూప సంబంధముచే ఏర్పడిన శ్వేతః అను శబ్దముకంటె భిన్నముగ వేరొక శ్వేతః (శ్వా ఇతః) ఉన్నట్లు గోచరించును. కాని వాస్తవమునకు శ్వేతశబ్దము అచట ఒక్కటే కాని రెండు కావు.

భిన్నములగు అర్థముల నిచ్చు రెండు శబ్దములను సమానవర్ణానుపూర్వి కలవానిని తంత్రముచే ఒకే యుచ్చారణమున నుచ్చరించుటయే శాస్త్రసమ్మతమని వివరించుచున్నాడు.

ఉపాయా చ్ఛ్రుతిసంహారో భిన్నానా మేకశేషిణామ్
తంత్రేణోచ్చారణే తేషాం శాస్త్రే సాధుత్వ మిష్యతే. 108

"శ్వేతో ధావతి" మొదలగువాక్యములలో, భిన్నానాం = శ్వేతః, శ్వా ఇతః అను రూపమున భిన్నములగు పదములకు, ఏకశేషిణాం = సమాన వర్ణానుపూర్వికల వగుటచే ఒకటిగనే పలుకబడినవానికి, ఉపాయాత్ = తంత్రమనెడి ఉపాయమువలన అనగా – ఒకే ఉచ్చారణముచే రెంటిని కలిపి ఉచ్చరించుటవలన, శ్రుతిసంహారః = శ్వేతో ధావతి అను ఒకే అఖండవాక్య శ్రవణమున రెండు వాక్యములు ఇమిడియుండును, తంత్రేణ ఉచ్చారణే =

తంత్రముతో నుచ్చరించునపుడు, తేషాం=ఆ భిన్నములగు శబ్దములకు, శాస్త్రే = శాస్త్రము నందు, సాధుత్వం = సాధుత్వము, ఇష్యతే=ప్రతిపాదింపబడుచున్నది.

తా. 'శ్వేతో ధావతి' అను వాక్యమున శ్వేతః అనునది రెండు పదములయొక్క స్వరూపములను కలిపి ఒకే ఉచ్చారణమున రెండును స్ఫురించునట్లు ఉచ్చరింపబడును. శ్వా ఇతః అనునపుడు 'ఆ ద్గుణః (6.1.87) అను సూత్రముచే సంధివచ్చి సాధుత్వము కల్గును. శ్వేతః శ్వేతః అనెడి-ఆ రెంటిలో ఒకటి మిగిలినను రెంటి అర్థములను గోచరింపచేయును.

'శ్వేతో ధావతి' మున్నగుచోట్ల రెండర్థములు గలవన్న శబ్దములను వర్ణానుపూర్విచే సమానములైన వానిని తంత్రముచే ఉచ్చరించి అర్థద్వయబోధనమునకు ప్రయోగించుట ఆవశ్యకమని నిరూపించుచున్నాడు.

పరిగృహ్యా శ్రుతిం చైకాం రూపభేదవతా మపి
తంత్రే ణోచ్చారణం కార్య మన్యథా తే న సాధవః . 109

రూపభేదవతామ్ అపి = వర్ణవాచకమగు అఖండమగు శ్వేత శబ్దమునకు, శ్వా ఇతః అను రెండు పదార్థములను ప్రతిపాదించు సఖండ శ్వేతశబ్దమునకును రూపములో భేదము ఉన్నను, ఏకామ్ = సమానవర్ణానుపూర్విగల, శ్రుతిమ్ = శబ్దమును, పరిగృహ్య = రెండు శబ్దములను కలిపియుంచు నాధారముగా స్వీకరించి, తంత్రేణ = రెండు అర్థములను ప్రతిపాదించునట్లు ఒకేసారి, ఉచ్చారణం=ఉచ్చారణము, కార్యమ్ = చేయవలెను, అన్యథా = అట్లు తంత్రముచే రెండు శబ్దములను కలిపి యుచ్చరించనిచో, తే = ఆ శబ్దములు, సాధవః = రెండర్థములను ప్రతిపాదించు సమర్థత యనెడి సాధుత్వముకలవి, న = కావు.

తా. "శ్వేతః"అనునది రెండర్థములను ప్రతిపాదించు రెండు శబ్దముల కలయిక. ఒక శబ్దము 'తెల్లనిది' అను నర్థమును, వేరొకటి 'కుక్క ఇటువైపు' అను నర్థమును రెండు పదార్థములను బోధించును. ఆ రెంటిలో ఒకటి అఖండము, ఒకటి సఖండము. అట్లు భేదము గల ఆ రెండు శబ్దములకు 'శ్వేతః' అను వర్ణానుపూర్విసమానమే. కావున శ్వేతః అను చోట రెండుశబ్దములను తంత్రముచే ఉచ్చరింపవలెను. ఉచ్చరించినచో ఆవృత్తిచే రెండర్థములు వచ్చును, ఆ తంత్రము నాశ్రయించనిచో ఒకసారి యుచ్చరించిన శబ్దము ఒక యర్థమును ప్రతిపాదించి విరమించును. కావున రెండవయర్థమును ప్రతిపాదింపదు. రావలసిన యర్థమును బోధించుటయే శబ్దమునకు సాధుత్వము కావున ఆ సాధుత్వము లేకపోవలసివచ్చును. కావున సాధుత్వమునకై తంత్రముతో నుచ్చరించుట అవశ్యకర్తవ్యము.

సరూపములగు పదములకు ఏకశేషమును వ్యాకరణ శాస్త్రము ప్రతిపాదించును. అందుచే సమాన స్వరూపములగు పదములను తంత్రముతో నుచ్చరించుట శాస్త్ర విహితమే. కాని వాక్యములను తంత్రముతో నుచ్చరించుట శాస్త్రమున విధింపబడలేదు. పద తంత్రము ననుసరించి వాక్యతంత్రముకూడ శాస్త్రసమ్మతమే యని యంగీకరింపవలెను. అట్టి ప్రయోగములు కన్పట్టుచున్నవని వివరించుచున్నాడు.

సరూపాణాం చ వాక్యానాం శాస్త్రేణ ప్రతిపాదితమ్
తంత్రే ణోచ్చారణా దేకం రూపం సాధూపలభ్యతే . 110

సరూపాణాం = సమానములగు రూపముగల, వాక్యానాంచ = వాక్యములకు కూడ, తంత్రేణ = ఒకేప్రయత్నముతో రెండు వాక్యములను కలిపి ఉచ్చరించు తంత్రముచే, ఉచ్చా

రణాత్=ఉచ్చరించుటవలన, ఏకంరూపం = ఒకరూపముండుట, శాస్త్రేణ = పదములకు ఏక శేషమును విధించు శాస్త్రముచేతనే, ప్రతిపాదితమ్=ప్రతిపాదింపబడినట్లే, సాధు = ప్రయోగములలో రెండు వాక్యముల నేకరూపమున ప్రయోగించుట బాగుగా, ఉపలక్ష్యతే=కన్పట్టుచున్నది.

తా. శాస్త్రము పదములకు ఏకశేషముచే తంత్రమును ప్రతిపాదించినను వాక్యములకుకూడ తంత్రము నంగీకరించినట్లే గ్రహింపవలెను. అట్టి వాక్యైకశేషములు ప్రయోగములలో మనకు గోచరించుచున్నవి.

పై విషయమునే దృష్టాంతపూర్వకముగ వివరించుచున్నాడు.

ఏక స్యానేకరూపత్వం నాలికాది పరిగ్రహాత్
యథా తథైవ తంత్రాత్ స్యాత్ బహూనా మేకరూపతా. 111

యథా = ఏవిధముగా, నాలికాదిపరిగ్రహాత్ = రంధ్రములనెడి ఉపాధిభేద స్వీకారమువలన, ఏకస్య=ఒకేధ్వనికి, అనేక రూపత్వం=భిన్నరూపములై యుండుటయో, తథైవ=అట్లే, తంత్రాత్=తంత్రమువలన, బహూనాం = భిన్నములగు (శ్వేతః, శ్వా + ఇతః) శబ్దములకు, ఏకరూపతా = ఒకేరూపము కలవై యుండుట, స్యాత్ = అగును.

తా. వేణువునందుగల రంధ్రములనుండి ధ్వని ప్రసరించునపుడు ఒకేధ్వని షడ్జాది భేదములచే భిన్నరూపత నెట్లుపొందునో అట్లే శ్వేతః అనుశబ్దము, శ్వా ఇతః — శ్వేతః అను శబ్దము కలిసి తంత్రముగా ఉచ్చరించుటచే భిన్నశబ్దములు ఏకరూపత నందును.

అవాంతరవాక్యములు ప్రత్యేకముగా లేవు కనుక అఖండవాక్యపక్షమున అవాంతర వాక్యమున కర్థము లేకపోవలసివచ్చు నను ఆక్షేపమునకు సమాధానము నొసంగుచున్నాడు.

యథా పదసరూపాణాం వాక్యానాం సంభవః పృథక్
తథా వాక్యాంతరాభావే స్యా దేషాం పృథగర్థతా. 112

యథా=ఏవిధముగా, పదసరూపాణాం=వాక్యములో లేనిపదములు పృథక్కరణముచే ఏర్పడినపుడు ఉన్నట్లుగా తోచుపదములతో సమానధర్మముగల, వాక్యానాం= అవాంతర వాక్యములకు, పృథక్‌సంభవః=మహావాక్యముకంటె ప్రత్యేకముగ ఉండుట ఎట్లు సంభవమో, తథా=అట్లే, వాక్యాంతరాభావే=అవాంతరవాక్యములు లేకపోయినను, ఏషాం= ఈ వాక్యములకు, పృథగర్థతా=ప్రత్యేకార్థవత్త్వము, స్యాత్=సంభవించును.

తా. వాక్యము అఖండము పదవిభాగరహితము. అయినను ఆ వాక్యమును పృథక్కరించుటచే అందులో లేనిపదము లెట్లు ఉన్నట్లు తోచుచున్నవో అట్లే మహావాక్యములో అవాంతరవాక్యములు లేకపోయినను మహావాక్యమును పృథక్కరించుటచే అవాంతరవాక్యములును, ఆ యవాంతర వాక్యములకు ప్రత్యేకార్థవత్త్వమును కల్పితమైయుండుటకు ఆటంకములేదు.

వాక్యముయొక్క అర్థము ప్రయోజనము అను మతమును నిరసించుచున్నాడు.

అభిధేయః పదస్యార్థో వాక్యస్యార్థః ప్రయోజనమ్
యస్య తస్య న సంబంధో వాక్యానా ముపపద్యతే. 113

పదస్య=పదముయొక్క, అర్థః=అర్థము, అభిధేయః=శబ్దశక్తి ప్రతిపాద్యమై వాచ్యమగును, వాక్యస్య=వాక్యముయొక్క, అర్థః=కార్యము, ప్రయోజనం=ఆ పదార్థముల యొక్క సంసర్గమును బోధించుట, అని, యస్య=ఎవనియొక్క మతమో, తస్య=వాని మత మున, వాక్యముల కర్థములేదు కనుక, వాక్యానాం=వాక్యములకు, సంబంధః=సంబంధము, న ఉపపద్యతే=కుదురదు.

తా. పదములకే యర్థమును ప్రతిపాదించు శక్తి యుండును. అట్టిపదముల చేరికయే వాక్యము. ఆవాక్యమున కర్థము లేదు. ఆ పదముల యర్థములకు గల పరస్పరసంబధమును బోధించుటయే దాని ప్రయోజనము. వాక్యముల కర్థము లేనపుడు అర్థముద్వారా పరస్పర సంబంధము కలిగియుండ వలసిన వాక్యములకు సంబంధము ఉండదు. ఏ వాక్యమున కావా క్యమే కాని పరస్పర సంబంధము కుదురదు.

అన్వితాభిధానవాదము నాశ్రయించి వెనుకచూపిన దోషములను పరిహరించు చున్నాడు.

తత్ర క్రియాపదాన్యేవ వ్యపేక్షన్తే పరస్పరమ్
క్రియాపదానుషక్తస్తు సంబంధోఽతః ప్రతీయతే. 114

తత్ర=ఆ అన్వితాభిధాన పక్షమున, క్రియాపదమేవాక్యమను పక్షమున, క్రియా పదాన్యేవ=క్రియాపదములే, పరస్పరం=అన్యోన్యము, వ్యపేక్షన్తే=కారక పదములను తమతో అన్వయింపదగిన వానిని ఆక్షేపించును, అతః=అందువలన, క్రియాపదానుషక్తః= క్రియాపదమే వాక్యమనునపుడు ఆ క్రియాపదమునకు వాచ్యమై సంబంధించిన, సంబంధః= సాధ్యసాధనములయొక్క సంబంధము, ప్రతీయతే = వాక్యార్థముగ గోచరించును.

తా. అన్వితాభిధాన పక్షమున క్రియాపదమే వాక్యము అని యంగీకరించినపుడు క్రియాపదములే సర్వసాధనములతో నన్వయించిన స్వార్థమును బోధించును. 'మూయుము' అనగానే 'తలుపు మూయుము' అను వాక్యార్థము క్రియాపదముచే ప్రతిపాదింపబడును. 'తలుపును' అను కర్మవాచక పదమును ఆ క్రియాపదమే ఆక్షేపించును. క్రియాపదములోనే ఈ సాధ్యసాధనములకు గల పరస్పరాన్వయ రూపమగు సంబంధమును ప్రతిపాదించుశక్తి కలదు కనుక అదియే వాక్యార్థము. అందుచే వాక్యార్థము ప్రయోజనమను మతమున వాక్య ములకు పరస్పరాన్వయము సంభవించును. క్రియాపదమే వాక్యము. కావున దానిచే ఆక్షిప్త ములగు కారకపదములతో అన్వయించిన స్వార్థమే క్రియారూప వాక్యార్థము కావున ఆ వాక్యార్థములు వాక్యాంతరార్థములతో అన్వయించుటలో క్లేశము లేదు.

అన్వితాభిధానవాదమే సంగతముకాదు, మొట్టమొదట క్రియాపదమును వినగనే సకలకారకములతో అన్వయించిన వాక్యార్థము అవగతమగుచో తరువాత కారకపదములను ప్రయోగించుట ఎందుకు? అర్థము వేరొకవిధముగా అవగతమైన పిమ్మట ఆ యర్థమును ప్రతిపాదించు శబ్దమును ప్రయోగించుట వ్యర్థము కదా! యను శంకకు సమాధానమును చెప్పుచున్నాడు.

ఆవృత్తి రనువాదో వా పదార్థవ్యక్తికల్పనే
ప్రత్యేకం తు సమాప్తోఽర్థః సహభూతేషు వర్తతే. 115

అవృత్తిః = అన్వితాభిధానవాదమున ఒకే పదముచే మిగిలిన పదముల యర్థము తెలియచేయబడినను ఆ పదమును మరల నుచ్చరించుట వేరొకపదము అన్వయించక ఈ పదమే యన్వయించు నను నియమముకొరకు, వా = లేక, పదార్థ వ్యక్తికల్పనే = ఇతర కారక పదార్థములు కాక ఈ పదార్థమే అన్వయించునని స్పష్టముగా తెలియజేయుటకై, అనువాదః = ఇదిపరకే ప్రతీతమైన యర్థముగల పదమును అనువదించుట జరుగును. సహభూతేషు = బుద్ధిలో కలిసియేయున్న క్రియాకారక వాచకపదములలోనే, ప్రత్యేకం = ప్రత్యేకము ఒక్కొక్క పదముననే, సమాప్తః అర్థః = ఆ కాంక్షారహితముగ పూర్తియగు అర్థము, వర్తతే = ఉండును.

తా. అన్వితాభిధానవాదమున క్రియాపదమే దానితో అన్వయింపదగు కారక పదార్థములతో అన్వయించిన స్వార్థమునే బోధించినపుడు, క్రియాపదమే సంపూర్ణవాక్యార్థమును బోధించుటచే, ఇతర కారకపదప్రయోగము ఆ కారకపదములే తప్ప ఇతరపదములా క్రియతో అచట అన్వయింపవు అను నియమమును సూచించుటకని ఎరుంగవలెను. లేదా ఆ క్రియలో అన్వయించు కారకపదార్థములు ఇవి యని స్పష్టముగా తెలియుట కా పదములు పేర్కొనబడెనని ఎరుంగవలెను. కారకపదములు, క్రియాపదము కలిసిన వాక్యము, ఒక్కసారియే బుద్ధియందు సన్నిహితమైయుండును. కావున ఒక్కొక్కపదమే పూర్తియర్థమును బోధింపజాలినదై యుండునని ఎరుంగవలెను.

"సంఘాతము వాక్యము" మొదలగు వాక్యలక్షణములను ముందు పేర్కొనిరి. అచటనే సంసర్గము, పరస్పరాన్వితపదార్థము, నిరాకాంక్షపదార్థము, ప్రయోజనము వాక్యార్థములని నిరూపించిరి. ప్రతిభ, క్రియకూడ వాక్యార్థము అని ఇక ముందు గ్రంథముక నిరూపింపబోవుచున్నారు. వాక్యార్థము అఖండము, (అభిన్నము) ఏకమును అయినచో ఇన్ని పక్షము లెట్లు వచ్చినవి అని సందేహము కలుగవచ్చునని దానిని నివారించుచున్నాడు.

అవికల్పేఽపి వాక్యార్థే వికల్పా భావనాశ్రయాః
అత్రాధికరణే వాదాః పూర్వేషాం బహుధాగతాః. 116

వాక్యార్థే=వాక్యముయొక్క అర్థము, అవికల్పేఽపి=భేదము లేక అఖండమేయైనను, వికల్పాః = సంసర్గము మొదలగు వాక్యార్థభేదములు, భావనాశ్రయాః=ఆయా శాస్త్రవాసన కలవారి భావనచే వచ్చినవి, అత్ర అధికరణే=ఈ వాక్యార్థ విచారప్రకరణమున, పూర్వేషాం = ప్రాచీనులయొక్క, వాదాః=వాదములు, బహుధా=అనేకవిధములుగ, గతాః= సాగినవి.

తా. వాక్యార్థము ఏకరూపమును అఖండమును అయియుండును. ఆయా శాస్త్రముల నధికరించినవారు ఆ శాస్త్రవాసనచే వాక్యార్థమును తమ సంస్కారముతో భావించి భిన్న భిన్నముగా ప్రతిపాదించుటచే ఈ భేదము లేర్పడినవి. అందుచే ఈ వాక్యార్థ విచారణ ప్రకరణమున ప్రాచీనశాస్త్రముల ననుసరించి మతభేదములు ప్రతిపాదింపబడినవి.

వాస్తవమునకు వాక్యార్థము ప్రతిభారూపమున ఏకవిధమే. వాక్యమును వినగనే తరువాత చేయవలసినకార్యము మనస్సున భాసింపచేయుటయే వాక్యార్థము. అందుచేతనే మీమాంసకులు కార్యమే వాక్యార్థమని నిరూపించిరి. అందుచే శబ్దము ప్రతిభను కలిగించుటకు కారణమని ఎరుంగవలెనని ప్రతిభారూప వాక్యార్థమును వివరించుచున్నాడు.

అభ్యాసా త్ప్రతిభా హేతుః శబ్దః సర్వోఽపరైః స్మృతః
బాలానాం చ తిరశ్చాం చ యథార్థప్రతిపాదనే . 117

అపరైః = ఆచార్యులచే,సర్వః శబ్దః=ధ్వన్యాత్మకము,వర్ణాత్మకము నగు శబ్దము-పదవాక్యరూపము అగు శబ్దముకూడ, అభ్యాసాత్ = పునఃపునరావృత్తి వలన, ప్రతిభాహేతుః =నియతార్థబోధ హేతువై కార్యప్రవృత్తికి కారణమగును, బాలానాంచ=బాలురకు-అనగా శబ్దార్థసంకేత మెరుంగని వారికిని, తిరశ్చాంచ=పశు పక్ష్యాదులకును, యథార్థప్రతిపాదనే = ఉన్న యర్థమును ప్రతిపాదించుటలో శబ్దము అభ్యాసము వలన సమర్థమగును.

తా. పదవాక్య రూపమగు శబ్దము, కరతాళధ్వన్యాదులు, వర్ణాత్మకమగు శబ్దములు కూడ అభ్యాసమువలన కార్యప్రవృత్తి హేతువగును. అట్టి అభ్యాసమువలన సంకేతము నెరుంగని బాలురకు, పశు పక్ష్యాదులకు కూడ అర్థము తెలియుచున్నది.

అభ్యాసమువలన కార్యప్రవృత్తిని కలిగించు అర్థబోధరూపకమగు ప్రతిభ జనించును అని చెప్పిరి. ఆ యభ్యాసము ఈ జన్మమందలిదా? జన్మాంతరమందలిదా? ఆ ప్రతిభ ఎట్లుండునని శంకించి సమాధానము చెప్పుచున్నాడు.

అనాగమశ్చ సోఽభ్యాసః సమయః కైశ్చి దిష్యతే
అనంతర మిదం కార్య మస్మాది త్యుపదర్శనమ్ . 118

సః అభ్యాసః= ఆయభ్యాసము, అనాగమః=ఈ జన్మలో శాస్త్రాభ్యాసాదులచే వచ్చునదికాదు, జన్మాంతరమునుండి లభించినది, సః=ఆ అభ్యాసమే, కైశ్చిత్ = కొందరిచే, సమయః=సంకేతము అని, ఇష్యతే=చెప్పబడుచున్నది, అస్మాత్ అనంతరం=దీని తరువాత, ఇదం కార్యం = ఇది చేయదగినది, ఇతి=అని, ఉపదర్శనం = బోధ కల్గుట యనెడి ప్రతిభను కల్గించుటకు కారణమే అభ్యాసము.

తా. శబ్దమును వినగనే ప్రవృత్తి కలుగుటకు కారణము అభ్యాసము. ఆ అభ్యాసము ఈ జన్మలో నేర్చుకొనినది కాదు. జన్మాంతరమునుండి వచ్చినదే. దానినే కొందరు సంకేతమని యందురు. శబ్దమును వినగనే ఈ పని చేయవలెనని తోచుటయే ప్రతిభ. ఆ ప్రతిభను కల్గించి ప్రవర్తింపచేయునది అభ్యాసము.

వి. అంకుశపు పోటుచేత ఏనుగు నడచుట, కొరడాతో కొట్టగనే గుఱ్ఱము పరుగెత్తుట ఈ అభ్యాసము వలననే. ఇట్లే ప్రాణులన్నియు అనాది వాసనచే ఈ శబ్దమును వినగనే ఈ ప్రవృత్తి చేయవలెనను బోధకలవారగుదురు. దానిచేతనే లోకయాత్రసాగును. అందుచే వాక్యము, వాక్యార్థము కూడ అఖండమే. ప్రతిభయే వాక్యార్థము. పదములు, పదార్థములు కాల్పనిక విభాగముచే పరికల్పితములు. వాని నాశ్రయించియే ప్రతినిధి కల్పనము, ప్రసంగాది మీమాంసాన్యాయములను ప్రవర్తించేయుట సంభవమగుచున్నవి.

అఖండ వాక్యార్థములనుండి పద పదార్థములు పృథక్కరణముచే ఏర్పడునని చెప్పుటచే పదముయొక్క అర్థమునుగూర్చి విచారణ చేయుచున్నాడు.

అ స్త్యర్థః సర్వశబ్దానా మితి ప్రత్యాయ్యలక్షణమ్
అపూర్వదేవతాస్వర్గైః సమ మాహు ర్గవాదిషు . 119

సర్వశబ్దానాం=శబ్దముల కన్నింటికి, అర్థః=విశేషాకార పరామర్శలేక సామాన్య మగు అర్థము, అస్తి=ఉండును, ఇతి=అనునదియే, ప్రత్యాయ్యలక్షణం=శబ్దముచే వాచ్య మగు నర్థమాయొక్క స్వరూపము, గవాదిషు=గోవు మొదలగు శబ్దములచే తెలియచేయబడు నర్థము, అపూర్వ దేవతా స్వర్గైః=అపూర్వము, దేవత, స్వర్గము మొ. లగు పదములచే ఆకారవిశేషప్రతీతి లేకయే ప్రతీయమానమగు సామాన్యార్థముతో, సమం=సమానమైనదని, ఆహుః=చెప్పుదురు.

తా. పదముయొక్క అర్థమునుగూర్చి మతభేదములను ప్రతిపాదించుచున్నాడు. సర్వపదములు ఆకార విశేషప్రతీతి లేకయే సామాన్యమగు అర్థమును కల్గియుండును, అపూర్వము యాగముచే జనించు ఒక అదృష్ట విశేషము; ఆ యపూర్వము అను పదమును వినునపుడు ఏదో అర్థము ఆ శబ్దముచే మనకు తెలియచేయబడును. కాని దాని ఆకారము బుద్ధిలో గోచరింపదు. అట్లే దేవత, స్వర్గము అను పదములు వినునపుడుకూడ సామాన్యముగ విశేషాకారప్రతీతి లేని అర్థమే గోచరించును. గోవు అను శబ్దమునకు కూడ పై అపూర్వ స్వర్గదేవతా శబ్దములవలెనే విశేషముగ కొమ్ములు, తోక మొ. లగు లక్షణములతో కూడిన ఆకార విశేషములేని సామాన్యమగు అర్థమే వాచ్యముగా నుండును. ఆ శబ్దమును చాలా సార్లు ఆ యాకారముగల వస్తువును చూసి పెద్దలు ప్రయోగించుటచే ఆ స్మరణ కలిగి ఆకారవిశేషము గోచరించును. విశేషము లేనిదే సామాన్య ముండదు. కనుక విశేషాకారము బుద్ధిలో తరువాత గోచరించును కాని, శబ్దమునకు వాచ్యమగు నర్థము సామాన్యభూతమే యని ఎరుంగవలెను.

'గోవు' మొదలగు శబ్దముల వలన ఆకారముతో కూడిన గో వ్యక్తియే గోచరించు చున్నదే-అది వాచ్యమగు అర్థము కాదనుట ఎట్లు? అను ఆశంకకు సమాధానము చెప్పు చున్నాడు.

ప్రయోగదర్శనాభ్యాసా దాకారావగ్రహస్తు యః
న స శబ్దస్య విషయః స హి యత్నాంతరాశ్రయః. 120

ప్రయోగదర్శనాభ్యాసాత్=తోక, కొమ్ములు మొదలగునవి కల ఆకార విశేషము కలిగిన వస్తువునందే గోవు మొ. శబ్దమును ప్రయోగించుట మరల మరల చూచుచుండుట వలన, యః=ఏ, ఆకారావగ్రహః=ఆకారజ్ఞానము కల్గుచున్నదో, సః=అది, శబ్దస్య= గోవు మొ. శబ్దమునకు, విషయః=వాచ్యమగు నర్థము, న=కాదు, హి=ఏలనన, సః= ఆకారజ్ఞానము, యత్నాంతరాశ్రయః= మరల మరల ప్రయోగించుట చూచుట యనెడి యత్నాంతరము నాశ్రయించి కలుగుచున్నది.

తా. గోవు అను శబ్దము నుచ్చరింపగనే ఆకార విశేషముతో కూడిన వస్తువు మనకు బుద్ధిలో గోచరించినట్లుండును. కాని శబ్దము ఆకార విశేషములేని సామాన్యమునే బోధించును. ఆ శబ్దమునే గంగడోలు, కొమ్ములు మొ. నవి కలిగిన గోవ్యక్తియందు పదే పదే ప్రయోగించుట చూచుచుండుటచే ఆ వ్యక్తి ఆ శబ్దమును వినగనే గోచరించును కావున ఆకార విశేషప్రతీతి ప్రయత్నాంతరముచే కల్గినది కాని శబ్దముచే కల్గినదికాదు.

జాతియే శబ్దవాచ్యమని చెప్పుదురుకాని కొందరు ఆ జాతితోపాటు దానివెంటనే వ్యక్తికూడ గోచరించును కావున వ్యక్తికూడ శబ్దవాచ్యమందురు అని నిరూపించుచున్నాడు.

కేచిద్ భేదాః ప్రకాశ్యంతే శబ్దై స్తదభిధాయిభిః
అనునిష్పాదినః కాంశ్చి చ్ఛబ్దార్థ ఇతి మన్యతే. 121

కేచిత్ భేదాః = గోత్వము మొదలగు కొన్ని సామాన్యభేదములు, తదభిధాయిభిః శబ్దైః=వానిని ప్రతిపాదించు గోవు మొ. లగు శబ్దములచే, ప్రకాశ్యంతే=బుద్ధిగోచరమగునట్లు చేయబడును, అనునిష్పాదినః = ఆ జాతి భాసించినవెంటనే దానితోపాటు గోచరించు, కాంశ్చిత్ = వ్యక్తులను కూడ, శబ్దార్థ ఇతి=శబ్దముచే వాచ్యముగానుండు అర్థముననగానే, మన్యతే = తలంతురు.

తా. వేర్వేరు వ్యక్తులలో సామాన్యముగా నుండు జాతినే శబ్దము ప్రతిపాదించు నని కొందరు పేర్కొందురు. ఆ జాతితోపాటు శబ్దమును వినగానే తప్పక వ్యక్తికూడ గోచరించుచుండుటచే వ్యక్తులుకూడ శబ్దమునకు వాచ్యార్థములే యని కొందరందురు.

పై పక్షమును ఖండించుచున్నాడు.

జాతేః ప్రత్యాయకే శబ్దే యా వ్యక్తి రనుషంగిణీ
న తద్వ్యక్తిగతాన్ భేదాన్ జాతిశబ్దోఽవలంబతే. 122

జాతేః = వ్యక్తులన్నింటి యందుండు సామాన్యరూపమగు జాతియొక్క, ప్రత్యాయకే = ప్రతీతిని కల్గించు, శబ్దే = గోవు మొదలగు శబ్దమున, అనుషంగిణీ=అనుగత సంబంధముకల్గి జాతిని వదలకయుండు, యావ్యక్తిః=ఏ వ్యక్తి భాసించుచున్నదో, తద్వ్యక్తిగతాన్ = ఆ వ్యక్తులందు ఉండెడి, భేదాన్=ఆకారవిశేషములను, జాతిశబ్దః = అట్టి జాతి వాచక శబ్దము, నావలంబతే=వాచ్యముగ ప్రతిపాదింపదు.

తా. 'గోవు' మొదలగు శబ్దము గోవ్యక్తులయందు సామాన్యభూతమగు జాతిని ప్రతిపాదించును. వ్యక్తి జాతిలేకుండ ఉండునదికాదు. జాతితో కలిసియే యుండును. కావున వ్యక్తికూడ గోచరించును. కాని ఆవ్యక్తుల ఆకారవిశేషము శబ్దమునకు వాచ్యార్థము మాత్రము కాదు. జాతియే వాచ్యమని ఎరుంగనగును.

పైవిషయమునే దృష్టాంతముతో వివరించుచున్నాడు.

ఘటాదీనాం న చాకారాన్ ప్రత్యాయయతి వాచకః
వస్తుమాత్రనివేశిత్వాత్ తద్గతి ర్నాంతరీయకీ. 128

ఘటాదీనాం = ఘటము మొదలగు వానియొక్క, ఆకారాన్ = ఆకార విశేషములను, వాచకః = శబ్దము, వస్తుమాత్ర నివేశిత్వాత్=ఆ యాకారముగల వస్తువును మాత్రమే ప్రతిపాదించున దగుటవలన, న ప్రత్యాయయతి = ప్రతీతిగోచరము చేయదు, తద్గతిః = ఆ ఆకార విశేషము బుద్ధిలో గోచరించుట, నాంతరీయకీ = సామాన్యభూతమగు నాయర్థమును ఆకారమువదలి యుండనిదగుటచేతనే - అని ఎరుంగవలెను.

తా. ఘటము అను శబ్దము ప్రత్యేకమగు నొక యాకారముతో కూడిన వస్తు సామాన్యమునే బోధించును కాని వేరుగా ఒక ఘటమునందుండు ఆకారమును గోచరింప

జేయదు. కాని ఆ సామాన్యభూతమగు అర్థము శబ్దముచే తెలియజేయబడగనే దానిని వదలక అంటియుండు ఆకారము కూడ దానితోపాటు జ్ఞానగోచరమగును.

జాతివ్యక్తులకు గల అవినాభావసంబంధమును ప్రదర్శించుచున్నారు.

క్రియా వినా ప్రయోగేణ న దృష్టా శబ్దచోదితా
ప్రయోగ స్త్వనునిష్పాదీ శబ్దార్థ ఇతి గమ్యతే. 124

శబ్దచోదితా='యజేత' అను శబ్దముచే విహితమైన, క్రియా=యాగక్రియ, ప్రయోగేణ వినా=కర్తృ కర్మాది కారక సంబంధము లేనిదే, న దృష్టా=జ్ఞానగోచరము కాదు అందుచే, ప్రయోగస్తు=కర్తృ కర్మాది కారకసంబంధ ప్రతీతి లేనిదే క్రియా ప్రతీతి పూర్తిగా జ్ఞానవిషయము కాకపోవుటచే కారక సంబంధము, అనునిష్పాదీ=క్రియాప్రతీతి కలుగగనే కలుగునది. కావున అట్లే ఘటసామాన్య ప్రతీతి కలుగగనే ఆకార విశేషప్రతీతి కలుగును కావున అదికూడ, శబ్దార్థః ఇతి=శబ్దముయొక్క అర్థముగా, గమ్యతే=గోచరించును.

తా. 'యజేత' యాగము చేయవలెను అను శబ్దముచే యాగక్రియ విధింపబడును. కాని క్రియ సామాన్యముగా తెలిసినను కర్తృ కర్మ కరణాది కారకాన్వయము లేని క్రియ యుండదు కనుక కారకసంబంధము కూడ క్రియాప్రతీతి కలిగిన వెంటనే కలుగును. కావున అది కూడ శబ్దార్థముగనే తోచును.

సామాన్యవిశేషరూపములగు అర్థములు రెండును పదమునకు వాచ్యార్థములే. అందు విశేషార్థము ప్రధానముగను సామాన్యార్థము విశేషణముగను ఉండును. అట్లే సాధ్యమగు క్రియ సాధనములగు కారకములు కూడ శబ్దార్థమే. అందు క్రియ ప్రధానముగను కారకములు దాని విశేషణములుగను ఉండునను పక్షమును వివరించుచున్నాడు.

నియతాస్తు ప్రయోగా యే నియతం యచ్చ సాధనమ్
తేషాం శబ్దాభిధేయత్వ మపరై రనుగమ్యతే. 125

యేతు=ఏవైతే (యజేత మున్నగునవి), నియతాః=తప్పనిసరిగా కారక వాచక శబ్దప్రయోగమున్నను లేక పోయినను నియతమైన, ప్రయోగాః=క్రియావాచక శబ్ద ప్రయోగములు కలవో, యచ్చసాధనం=ఏ కారక వాచక శబ్దప్రయోగము, నియతం=క్రియా వాచక శబ్దప్రయోగమున్నను లేకపోయినను నియతమో, తేషాం=ఆ సాధ్య సాధనముల రెండింటియొక్క, శబ్దాభిధేయత్వం=శబ్దముయొక్క వాచ్యార్థమే యగుట, అపరైః=మరి కొందరిచే, అనుగమ్యతే=అంగీకరింపబడుచున్నది.

తా. "యజేత" యాగము చేయవలెను అనుక్రియను ప్రయోగించినపుడు 'సోమేన' సోమముతో అను సాధనము చెప్పినను చెప్పకపోయినను నియతముగ భాసించును. అట్లే "ద్వారం" 'ద్వారమును' అను కారక వాచకపదమును ప్రయోగించగానే 'పిధేహి' 'మూయుము' అనుక్రియావాచక పదము నియతముగ భాసించును. కావున క్రియా కారకములు రెండును విశేష్య విశేషణభావముతో అన్వయము కలిగినవై శబ్దమునకు వాచ్యార్థమే యగును. అందు ఒకటి వాచ్యార్థము, వేరొకటి దానిని వదలక యుండునదగుటచే ప్రతీయమానము అనుట సరికాదు. సామాన్య విశేషములు, సాధ్య సాధనములు కూడ పరస్పరము

విశేష్య విశేషణభావముతో, ప్రధానాప్రధానభావముతో సంబంధించి వాచ్యార్థమే యని కొందరు చెప్పుదురు.

సాధ్యసాధనములు, సామాన్యవిశేషములు గుణప్రధానభావముతో వాచ్యమగుట కాక సమూహరూపమున పదముచే వాచ్యములుగ ప్రతిపాదింపబడుననియు, వానియొక్క విశేష్యవిశేషణభావము తరువాత శాబ్దబోధలో భాసించుననియు కొందరందురు. వీరిమతమున సముదాయమే పదార్థము. సామాన్యము, విశేషము, అనగా జాతి, వ్యక్తి అనువానిలో విశేష్య విశేషణభావము గోచరింపక రెండును సమప్రధానముగనే యుండును అనెడి నాల్గవపక్షమును పదార్థప్రతిపాదనమున నిరూపించుచున్నాడు.

సముదాయోఽభిధేయో వా ప్యవికల్పసముచ్చయః

అవికల్పసముచ్చయః అపి=సామాన్య విశేషార్థములకు వికల్పముకాని సముచ్చయము కాని లేనిదైన, సముదాయః=సామాన్య విశేషముల సముదాయము, సమప్రధానముగ, అభిధేయః = పదమునకు వాచ్యార్థమైయుండును.

తా. జాతి వ్యక్తులు, క్రియా కారకములు ప్రధానాప్రధానభావము లేక సమప్రధానముగ సముదాయరూపమున పదమునకు వాచ్యమగునని కొందరి యభిప్రాయము. రెండును సమప్రధానము లైనచో అర్థములు రెండు కలిసి వాచ్యార్థమైనచో 'ఘటము' అనునపుడు ద్వివచనము రావలెను. అట్లు రెండర్థములు సముచ్చయము కాక వికల్పము అనగా అదికాని, ఇదికాని అర్థమన్నచో "వా" అని యర్థములో కల్పింపవలెను. అందుచే పదముచే రెండర్థములు ప్రతిపాదింపబడినను ఆ రెండర్థములు సముచ్చయ వికల్పములు లేని సముదాయమే యైయుండునని వీరి అభిప్రాయము.

వ్యక్తియందు జాతి గుణ క్రియలయొక్క సంసర్గము వాస్తవముగ వస్తువుకంటె వేరుగ నిరూపింప వీలుకానిదైనను ఆ సంసర్గము పదముయొక్క వాచ్యార్థమను పక్షమును ప్రతిపాదించుచున్నాడు.

అసత్యో వాపి సంసర్గః శబ్దార్థః కైశ్చి దిష్యతే.　　126

వా = అట్లుగాక, సంసర్గః = ఘటము మున్నగువస్తువులకు ఘటత్వము మున్నగు జాత్యాదులతోడి సంబంధము, అసత్యః = వాస్తవముగ వస్తువుకంటె వేరుగా గోచరింపక పోవుటచే అసత్యమయినది, శబ్దార్థః = శబ్దమునకు అర్థమని, కైశ్చిత్ = కొందరిచే, ఇష్యతే = అంగీకరింపబడుచున్నది.

తా. ఘటమునందుండు ఘటత్వజాతి సంబంధమే ఘటశబ్దార్థమని కొందరందురు. వ్యక్తికంటె వేరుగా జాతియొక్క సంసర్గము అనుభూయమాన మగుటలేదు. అందుచే ఇది అసత్యము. జాతి యనునది కల్పనయే కాని వేరేలేదని బౌద్ధుల యభిప్రాయము. జాతిని అద్వైతు లంగీకరింప లేదు.

అసత్యములగు జాతి, గుణము మున్నగు ఉపాధుల యొక్క సంబంధముచే భిన్నభిన్నముగా భాసించు వ్యక్తియే శబ్దమునకు అర్థము అను పక్షమును ప్రతిపాదించుచున్నాడు.

అసత్యోపాధి యత్ సత్యం తద్వా శబ్ద నిబంధనమ్.

వా = లేక, యత్ సత్యం = సత్యమగు ఏ వ్యక్తికలదో, అసత్యోపాధి = అసత్యములగు జాతి మున్నగు ఉపాధులతోకూడిన, తత్ = ఆ వ్యక్తియే, శబ్దనిబంధనం = ఆశబ్దము ప్రయోగించుటకు కారణము, అనగా వాచ్యమగు అర్థము అని ఎరుంగవలెను.

తా. అసత్యములగు జాతి మొదలగు ఉపాధులతోకూడిన సత్యమగు ద్రవ్యమే-అనగా వ్యక్తియే శబ్దముయొక్క వాచ్యమగు అర్థమని భావము.

శబ్దో వాప్యభిజల్పత్వ మాగతో యాతి వాచ్యతామ్. 127

వా = లేక, అభిజల్పత్వం = శబ్దముతో అర్థమునకు, అర్థముతో శబ్దమునకు గల్గు అభేదారోపరూపమగు అభిజల్పమును, ఆగతః = పొందిన, శబ్దః = శబ్దమే, వాచ్యతాం = అర్థముగా నుండుటను; యాతి = పొందుచున్నది.

తా. శబ్దమునకు అర్థమునకు గల్గు అన్యోన్యాధ్యాసము అభిజల్పము. ఆ అభిజల్పముచే అనగా అధ్యాసరూపమగు అభేదారోపముచే శబ్దమే అర్థముగా నుండును.

అభిజల్పమును వివరించుచున్నాడు.

సోఽయ మి త్యభిసంబంధాద్ రూప మేకీకృతం యదా
శబ్ద స్యార్థేన తం శబ్ద మభిజల్పం ప్రచక్షతే. 288

శబ్దస్య = శబ్దమునకు, అర్థేన = అర్థముతో, సోఽయమితి = అదే ఇది యను, అభిసంబంధాత్ = శబ్దార్థములకు తాదాత్మ్యము వలన, రూపం = శబ్దముయొక్క స్వరూపము, యదా = ఎప్పుడు, ఏకీకృతం = అర్థముతో తాదాత్మ్యముచే అభిన్నముగా భావింపబడునో, తం శబ్దం = ఆ శబ్దమును, అభిజల్పం = అభిజల్పము అని, ప్రచక్షతే = చెప్పుదురు.

తా. 'అదే ఇది' అను తాదాత్మ్య సంబంధము శబ్దార్థములకు కల్పింపబడును. ఆ సంబంధమునకే అధ్యాసమని పేరు. అదే అభిజల్పము. ఆ సంబంధముచే పదార్థము శబ్దముచే ఆచ్ఛాదింపబడి అర్థమే శబ్దస్వరూపమున భాసించును. అపుడు పదార్థమే శబ్దముగా వ్యవహరింపబడును. శబ్దమే అర్థముగా భాసించును. కావున శబ్దమే అర్థమని కొందరు చెప్పుదురు. ఈ అధ్యాసముచే శబ్దార్థములు ఏకరూపములే యయినను అర్థము ఉపయోగమున నావశ్యకము కనుక అది ప్రధానముగా భావింపబడును.

శబ్దార్థములకు అభేదమే యయినను లోకమున అర్థమునకును, శాస్త్రమున శబ్దమునకును ప్రాధాన్యము కన్పట్టుచుండునని వివరించుచున్నాడు.

తయో రపృథగర్థత్వే రూఢే రవ్యభిచారిణి
కించిదేవ క్వచిద్రూపం ప్రాధాన్యే నావతిష్ఠతే. 129

తయోః = ఆ శబ్దార్థములకు, రూఢేః = అధ్యాసముచే కల్గిన ప్రసిద్ధివలన, అవ్యభిచారిణి = నియతమగు, అపృథగర్థత్వే = ఏకరూపతయే యున్నను, క్వచిత్ = ఒక్కొక్కచోట, కించిదేవ = ఒక్కొక్కటియే, ప్రాధాన్యేన = ప్రధానముగ, అవతిష్ఠతే = ఉండును.

తా. శబ్దార్థములకు తాదాత్మ్యము నంగీకరించుటచే శబ్దార్థములు రెండును సమ ప్రధానములుగనే యుండును. కాని లోకమున పదార్థము ప్రధానముగను, శాస్త్రమున శబ్దము ప్రధానముగను గోచరించుచుండును.

లోకమున అర్థమునకే ప్రాధాన్య మని వివరించుచున్నాడు.

లోకేఽర్థరూపతాం శబ్దః ప్రతిపన్నః ప్రవర్తతే.

లోకే=లోకమున (వ్యవహారములో), శబ్దః=శబ్దము, అర్థరూపతాం ప్రతిపన్నః =తాదాత్మ్యధ్యాసము వలన అర్థముతో ఏకరూపత నందినదై, ప్రవర్తతే = వ్యవహారమున ప్రతీయమాన మగుచున్నది.

తా. లోకములో వ్యవహరించునపుడు పదార్థమే ప్రధానము కనుక ఆ యర్థముతో తాదాత్మ్యము నందియున్న శబ్దముకూడ అర్థరూపముననే భాసించును.

శాస్త్రములో మాత్రము శబ్దార్థములు రెండును ఆయా స్థలముల వివక్షనుబట్టి భాసించునని చూపుచున్నాడు.

శాస్త్రే తూభయరూపత్వం ప్రవిభక్తం వివక్షయా. 180

శాస్త్రేతు=శాస్త్రమునందు అయితే, వివక్షయా=ఆ సందర్భమున యోగ్యత ననుసరించి, ఉభయరూపత్వం=కొన్నిచోట్ల శబ్దస్వరూపము ప్రధానముగను, కొన్నిచోట్ల అర్థస్వరూపము ప్రధానముగను, ప్రవిభక్తం=భిన్నముగ నుండును.

తా. వ్యాకరణశాస్త్రమున శబ్దము కొన్నిచోట్ల కేవల శబ్దస్వరూపమును ప్రతిపాదించును. కొన్నిచోట్ల అర్థమునుకూడ ప్రతిపాదించును. "అగ్నేర్ఢక్" (4.2.33) అను చోట 'అగ్ని' అను శబ్దమునకు ఢక్ వచ్చును అని శబ్దస్వరూపమును ప్రతిపాదించును. "తస్యాపత్యం" (4.1.92) అనునపుడు అపత్యశబ్దము సంతాన రూపార్థమును బోధించును.

అర్థములు అశక్తివిశిష్టములుగానే యుండును. వానిని ప్రతిపాదించుటకు తగిన శక్తి శబ్దమున కధీనమై యుండును. జాతి, గుణ, క్రియాది భిన్నశక్తియుతమగు అర్థములను ప్రతిపాదించుటలో నియతముగ కొన్ని శబ్దములు జాతి, గుణ, క్రియాదులనే గాని, కొన్ని శబ్దములు సిద్ధవస్తువును గాని ప్రతిపాదించుట శబ్దాధీనమని వివరించుచున్నాడు.

అశక్తేః సర్వశక్తేర్వా శబ్దైరేవ ప్రకల్పితా

ఏక స్యార్థస్య నియతా క్రియాదిపరికల్పనా. 181

అశక్తేః = జాతి, గుణము, క్రియ మొ. వానిని కలిగియుండు శక్తిలేని, లేదా, సర్వశక్తేః=జాతి, గుణము,క్రియ మొదలగువాని నన్నింటిని కలిగియుండుటలో శక్తిగల, ఏకస్య = ఒక, అర్థస్య=పదార్థమునకు, నియతా=నియతముగ, క్రియాది పరికల్పనా = క్రియతోకూడినట్లు, గుణముతో కూడినట్లు కన్పించుట, శబ్దైరేవ = శబ్దములచేతనే, ప్రకల్పితా = కల్పింపబడినది.

తా. ఘటము, కలసము మున్నగు శబ్దములచే ఒకే పదార్థమును గూర్చిన జ్ఞానము కలుగుచున్నది. కాని ఘటము అను శబ్దముచే ఘటనచేయబడిన వస్తువుగా గాని, లేదా ఘటత్వరూపజాతి కలదిగా గాని గోచరించును. కలస శబ్దముచే 'క' అనగా నీటిచే 'లస' ప్రకాశించునదిగా గోచరించును. జాతి, గుణ, క్రియలు మూడును పదార్థమునందే యున్నను ఆ శబ్దములు భిన్న భిన్న శక్తియుతముగ ప్రకాశింపచేయును. నియతార్థ ప్రతిపాదనము శబ్దాధీనము. అర్థము మాత్రము సర్వశక్తి విశిష్టమే యని ఎరుంగవలెను.

శబ్దముయొక్క అర్థము బుద్ధినిష్ఠమేకాని బాహ్యవస్తునిబంధనము అని నిరూపించుచున్నాడు.

యో వార్థో బుద్ధివిషయో బాహ్యవస్తునిబంధనః
స బాహ్యవస్త్వితి జ్ఞాతః శబ్దార్థః కైశ్చి దిష్యతే. 182

వా=అట్లుకాక, యః అర్థః = శబ్దముచే బోధింపబడు ఏ యర్థముకలదో, అది, బుద్ధివిషయః=బుద్ధిగోచరమగునదే యయినను, బాహ్యవస్తునిబంధనః = జ్ఞానాకారముగ వస్తువు కన్పడుటలో బాహ్యవస్తువే కారణముగా కలది యగును. సః=ఆ బాహ్యవస్తువు, జ్ఞాతః=జ్ఞానగోచరమగు అర్థముతో (అధ్యాసము) తాదాత్మ్యము నందినదై, శబ్దార్థః ఇతి = శబ్దముయొక్క అర్థమని, కైశ్చిత్=కొందరిచే, ఇష్యతే=అంగీకరించబడినది.

తా. శబ్దము బుద్ధిగోచరమగునదే వాచకము కనుక అర్థముకూడా బుద్ధిగోచరమై జ్ఞానాకారము నందినదే వాచ్యమగును. అట్లు అర్థము జ్ఞానాకారము నందుటకు కారణము బాహ్యవస్తువే. అందుచే జ్ఞానాకారము నందిన యర్థమునకును, బాహ్యముగనుండు వస్తువునకును తాదాత్మ్యముచే బాహ్యవస్తువుకూడ శబ్దార్థమని కొందరందురు. కాని బుద్ధ్యుపారూఢమగు అర్థమే శబ్దార్థమని ఎరుంగవలెను.

కొన్ని శబ్దములు అనగా ఘటము మున్నగునవి ఆకారవిశేషముతో కూడిన అర్థమును కల్గియుండును. కొన్ని శబ్దములు అనగా అపూర్వము మొదలగు శబ్దములు ఆకార విశేషము లేని జ్ఞానమాత్రమున నుండు అర్థము కల్గియుండును అను పక్షమును వివరించుచున్నాడు.

ఆకారవంత స్సంవేద్యా వ్యక్తస్మృతినిబంధనాః
యే తే ప్రత్యవభాసంతే సంవిన్మాత్రం త్వతోఽన్యథా. 183

యే సంవేద్యాః=ఏ అర్థములు, వ్యక్తస్మృతి నిబంధనాః=ఆకారముకల్గిన వస్తువును చూచి, ఆ చూచిన వస్తువుయొక్క స్మృతిచే కల్గినవో, తే=ఆ యర్థములు, ఆకారవంతః=ఆకారము కలవియై, ప్రత్యవభాసంతే=బుద్ధిగోచరములగును; యేతు=ఏ యర్థములైతే, అతః అన్యథా=ఆకారములేని వస్తువులగుటచే ఆకారస్మృతి యుండకయే కల్గినవో, తే=ఆ యర్థములు, సంవిన్మాత్రం=జ్ఞానమాత్రముగనే, ప్రత్యవభాసంతే=బుద్ధిగోచరములగును.

తా. బాహ్యమున ఆకారముగల వస్తువును చూచుటచేగాని వినుటచేగాని ఏ యాకారము మనకు గోచరమగునో ఆ యాకారము ఆ వస్తువునకు సంకేతమగు శబ్దమును వినగానే స్మృతికి వచ్చును. అట్లు స్మృతిలో వచ్చిన రూపము ఆ శబ్దముచే భాసించు జ్ఞానరూపమగు నర్థమునగూడ భాసించును. అందుచే అట్టి యర్థములు సాకారములై యుండును. ఏ పదార్థములకు బాహ్యమున ఆకారము ఉండదో ఆ శబ్దములను వినునపుడు ఆకారస్మృతి యుండదు. కనుక అట్టి యర్థములు నిరాకారములై జ్ఞానమాత్రములుగ భాసించునని ఎరుంగవలెను.

ఒక వస్తువును చూచినపుడు ఒక్కొక్కరికి ఒక్కొక్క విధముగా తోచును. ఘటమును చూడగనే కొందరికి కంబుగ్రీవాదిమత్తుగను, కొందరికి పెద్ద కడుపు కలదిగను, కొందరికి ఘటత్వ జాతి కలదిగను తోచును. ఆ విధముగనే వారి వాసనలు ఏర్పడును. ఎవరి

వాసన ననుసరించి వారికా శబ్దమువలన అర్థజ్ఞానము కలుగును. కావున శబ్దముయొక్క అర్థము అందరికి ఏకరూపముగ నుండదు అని శబ్దార్థము అనియత మను పక్షమును వివరించుచున్నాడు.

యథేంద్రియం సన్నిపత ద్వైచిత్ర్యే ణోపదర్శకమ్
తథైవ శబ్దా దర్థస్య ప్రతిపత్తి రనేకధా. 184

యథా=ఏ విధముగ, ఇంద్రియం=ఇంద్రియము, సన్నిపతత్=విషయముతో సంబంధించుచు, వైచిత్ర్యేణ=విచిధాకారము కలదానినిగ, ఉపదర్శకం=విషయమును కన్పింపచేయునది యగునో, తథైవ=అట్లే, శబ్దాత్=వారివారి వాసనలతో కూడిన శబ్దము వలన, అర్థస్య=అర్థముయొక్క, ప్రతిపత్తిః=జ్ఞానము, అనేకధా=భిన్నభిన్నముగ, కల్గును.

తా. ఉపనిషత్తులలో 'ద, ద, ద' అను వర్ణము వినబడినపుడు వారివారి వాసనల ననుసరించి దేవతలకు దమమని, అసురులకు దయ యని, మానవులకు దానమని యర్థము ఎట్లు స్ఫురించెనో, ఒకత్రాడును చూచినపుడు ఒకరికి సర్పమనియు, వేరొకరికి భూమిబీట యనియు, వేరొకరికి నీటిధారయనియు వారివారి వాసనల ననుసరించి దోషవశమున ఎట్లు భిన్నముగ జ్ఞానము కలుగుచున్నదో, అట్లే శబ్దమునకు నియతమగు అర్థము లేదు. వారివారి వాసనల ననుసరించి శబ్దముయొక్క అర్థము భిన్న భిన్నముగా నుండును.

పై విషయమునే వివరించుచున్నాడు.

వక్త్రాఽన్యథైవ ప్రక్రాంతః భిన్నేషు ప్రతిపత్తృషు
స్వప్రత్యయానుకారేణ శబ్దార్థః ప్రవిభజ్యతే. 185

వక్త్రా=వక్తచేత, అన్యథైవ=ఒక వస్తువును వేరొకవిధముగ ప్రతిపాదింపవలెనని, ప్రక్రాంతః=ప్రారంభింపబడినదై, భిన్నేషు=వేర్వేరు, ప్రతిపత్తృషు=శబ్దము నర్థము చేసికొనువారిలో, స్వప్రత్యయానుసారేణ=తమతమ జ్ఞానమునుబట్టి, శబ్దార్థః=శబ్దముయొక్క అర్థము, ప్రవిభజ్యతే=భిన్నభిన్నమగుచున్నది.

తా. వైశేషికుని మతముననుసరించి 'ఘటము' అను ఒక అవయవిని బోధింపవలెనని ఘటశబ్దము ప్రయోగింపబడగా సాంఖ్యుడు సత్త్వరజస్తమోగుణసమాహారము ఘటమనియు, జైనబౌద్ధులు పరమాణు సముదాయరూపము ఘటమనియు అర్థముచేసికొందురు. కావున శబ్దమున కర్థము వారివారి వాసనల ననుసరించి భిన్నముగా కల్గును. కాని నియతము కాదు.

వెనుక చెప్పిన విషయమునే వ్యక్తీకరించుచున్నాడు.

ఏకస్మిన్నపి దృశ్యేఽర్థే దర్శనం భిద్యతే పృథక్
కాలాంతరేణ చైకోఽపి తం పశ్య త్యన్యథా పునః. 186

ఏకస్మిన్ అపి = వాస్తవమునకు ఏకరూపమేయైనను, దృశ్యే అర్థే=దృశ్యమగు అర్థము, వారివారి వాసనల ననుసరించి, దర్శనం = జ్ఞానము, పృథక్ = ప్రత్యేకముగ, భిద్యతే = భేదించును, ఏకోఽపి = ఒక్కడేయైనను, తం = ఆవెనుక చూచిన వస్తువును, కాలాంతరేణ = కాలాంతరమున, పునః = మరల, అన్యథా = వేరొకవిధముగ, పశ్యతి = చూచును.

తా. వాస్తవమున ఏకరూపమే యైనను దృశ్యమగు వస్తువునుగూర్చిన జ్ఞానము వారివారి వాసనల ననుసరించి భిన్నభిన్నముగా నుండును. ఒకే పురుషుడు ఒకే వస్తువును బౌద్ధ జైన సంప్రదాయ వాసనతో చూచినపు డొకవిధముగా తోచును. వైశేషిక దర్శనానుసారి జ్ఞానముకలవాడై దానిని చూచినపుడు వేరొకవిధముగ తోచును.

పై విధమున అర్థ మనియతమగుటచే అర్థజ్ఞానము అనేక విధములుగ కల్గుచుండు నని ప్రతిపాదించుచున్నాడు.

ఏకస్యాపి చ శబ్దస్య నిమిత్తై రవ్యవస్థితైః
ఏకేన బహుభి శ్చార్థో బహుధా పరికల్ప్యతే . 137

ఏకస్య శబ్దస్య అపి = ఒకేశబ్దమునకుకూడ, అవ్యవస్థితైః = నియతముగానుండని నిమిత్తైః= శాస్త్రసంస్కారరూపమగు హేతువులచే, ఏకేన = ఒకపురుషునిచేతను, బహుభిశ్చ = అనేకులచేతను, అర్థః = అర్థము, బహుధా= అనేకవిధములుగ, పరికల్ప్యతే = కల్పింపబడును.

తా. శబ్దము ఒకటియేయైనను దానియర్థము నెరుంగు పురుషుల సంస్కారములు భిన్నభిన్నములుగా నుండుటచే, ఒకే పురుషునికి భిన్నభిన్నములగు అర్థములు భాసించును. అట్లే వేర్వేరు పురుషులకు వేర్వేరు రూపములుగ అర్థములు భాసించును. దీనికి కారణములు వారివారి సంస్కారమే యని ఎరుంగనగును.

వెనుకచెప్పినదాని ఫలితమును చెప్పుచున్నాడు.

తస్మా దదృష్టతత్త్వానాం సాపరాధం బహుచ్ఛలమ్
దర్శనం వచనం చాపి నిత్యమే వానవస్థితమ్ . 138

తస్మాత్=అందువలన, అదృష్టతత్త్వానాం=తత్త్వము నెరుంగనివారియొక్క దర్శనం=దర్శనము, వచనంచాపి=ఆ యర్థముల వ్యవహారముకూడ, నిత్యమేవ=ఎల్లప్పుడు, అనవస్థితమ్=నిలుకడగా నుండదు, సాపరాధం=అసత్యవస్తువిషయ మగును, బహుచ్ఛలం= అనేకవిధములగు బాధకములు కల్గియుండును.

తా. పై విధముగ పదార్థములు అనియతములుగ నుండుటకు తత్త్వము నెరుంగక పోవుటయే కారణము. తత్త్వము నెరుంగక పోవుటచే వారి దర్శనము అవ్యవస్థితమై యుండును. అసత్య వస్తువిషయమై యుండును. బాధకములు అధికముగా నుండును. దర్శనము వలె వ్యవహారము కూడ అవ్యవస్థితముగానే యుండును.

పరమార్థ దర్శనము కలిగిన మునులు తత్త్వదర్శనము చేయగలవారే యైనను వారి దర్శనము ననుసరించి అర్థ వ్యవస్థాపనము చేయుట వీలుపడదని నిరూపించుచున్నాడు.

ఋషీణాం దర్శనం యచ్చ తత్త్వే కించి దవస్థితమ్
న తేన వ్యవహారోఽస్తి న త చ్ఛబ్దనిబంధనమ్ . 139

ఋషీణాం=పరావరతత్త్వ దర్శనము కలిగిన ఋషులయొక్క, యచ్చ దర్శనం= ఏదర్శనముకలదో, తత్త్వే = పరమార్థమునందు, కించిదవస్థితం=కొంచెము నిలచియుండు

నది యగునో, తేన=ఆ తత్త్వజ్ఞానముచే, వ్యవహారః=లోకమున వ్యవహారము, నాస్తి = లేదు, తత్ = ఆ తత్త్వజ్ఞానము, శబ్దనిబంధనం=శబ్దప్రయోగమునకు నిమిత్తము, న=కాదు.

తా. పరమార్థజ్ఞానము గల ఋషులు యథార్థ దర్శనముకలవారు కనుక వారి దర్శనము ననుసరించి వాస్తవముగ అర్థ మేదో నిశ్చయింప వీలగును. కావున అర్థము అవ్యవస్థితము అనుట ఎట్లు అని సందేహము కలుగవచ్చును. ఋషులు ఎపుడో ఒకప్పుడు యథార్థ వస్తుదర్శనము చేసినను అది వ్యవహారమున నుపయోగింపదు. వ్యవహారదశలో వారుకూడ తత్త్వదర్శనము లేనివారితో సమానులే కావున వారిజ్ఞానము అర్థవ్యవస్థ కల్పించుటకు సమర్థము కాదు. పరమార్థజ్ఞానము శబ్దప్రయోగమునకు నిమిత్తము కాదు. అధ్యస్తమైన వస్తువే వ్యవహరింపబడును, కాని పరమార్థ వస్తువు వ్యవహారోపయోగి కాదు.

తర్కముచేతను, ఆయా శాస్త్ర సంస్కారములచేతను పురుష బుద్ధులు భిన్నభిన్నములుగా నుండుటచే అర్థము అనియతమని వెనుక నిశ్చయింపబడినది. కాని శాస్త్ర జన్యబుద్ధి నాశ్రయింపక కేవల ప్రత్యక్షముచేతనే అర్థ నిర్ణయము చేయవచ్చునుగదా ? ప్రత్యక్షముచే మనము ఏ యర్థమునెట్లు తెలిసికొందుమో అదే శబ్దమున కర్థము అని చెప్పవచ్చునుకదా యని శంకించి సమాధానము చెప్పుచున్నాడు.

తలవద్ దృశ్యతే వ్యోమ ఖద్యోతో హవ్యవా డివ
నైవ చాస్తి తలం వ్యోమ్ని న ఖద్యోతో హుతాశనః . 140

వ్యోమ = ఆకాశము, తలవత్ = ఇంద్రనీలమణి నిర్మిత కటాహసదృశ భాగము కలదిగ, దృశ్యతే=చూడబడును. ఖద్యోతః = మిణుగురు పురుగు, హవ్యవాడివ=అగ్నివలె, దృశ్యతే = చూడబడును. వ్యోమ్ని=ఆకాశమున, తలం = భాగము, న చాస్తి = లేదు. ఖద్యోతః = మిణుగురు పురుగు, హుతాశనః=అగ్ని, న = కాదు.

తా. ఆకాశము ఇంద్రనీలమణి కటాహమువలె నిర్మలము అని మనము చూచుచుందుము. అట్లే మిణుగురుపురుగును చీకటిలో చూచినపుడు నిప్పుగా చూచుచుందుము. ప్రత్యక్షము ఈ విధముగా నున్నను ఆ యర్థము నట్లు వ్యవహరించుటకు ఆకాశమున తలము అను భాగములేదు. దానికి మాలిన్యము ఉండుట, లేకపోవుట యనునవి లేవు. కాని నిర్మలముగా ఉన్నదని మనకు ప్రత్యక్ష వ్యవహారము. అట్లే మిణుగురు పురుగులో నిప్పు లేదు. కాని నిప్పున్నట్లు ప్రత్యక్షమగుచుండును. కావున ఇంద్రియ జన్యమగు జ్ఞానము అనగా ప్రత్యక్షము కూడ అవ్యవస్థితముగనే యుండును. కావున ప్రత్యక్షము కూడ అర్థవ్యవస్థను కల్గింపలేదు.

ఇందుచేత ఎవరికి ఎట్లు భాసించునో యుక్తిచే నిశ్చయించి. దానినే శబ్దమున కర్థమని గ్రహింతురు కాని వ్యవస్థ లేదని చెప్పుచున్నాడు.

తస్మాత్ ప్రత్యక్ష మప్యర్థం విద్వా నీక్షేత యుక్తితః
న దర్శనస్య ప్రామాణ్యాత్ దృశ్య మర్థం ప్రకల్పయేత్ . 141

తస్మాత్ = అందువలన, విద్వాన్=విద్వాంసుడు, ప్రత్యక్ష మప్యర్థం = ఇంద్రియ గోచరమగు నర్థమును గూడ, యుక్తితః=ప్రత్యక్షము భ్రమరూపముగ కూడ ఉండునుకావున యుక్తిచే, ఈక్షేత = పరీక్షింపవలెను, దర్శనస్య = ప్రత్యక్షముయొక్క, ప్రామాణ్యాత్=

ప్రామాణ్యమువలన, ఉపపత్తి లేకపోయినను ప్రమాణమే యని తలంచి, దృశ్యమర్థం = చూచినదానిని చూచినట్లే పదార్థముగ, న ప్రకల్పయేత్ = భావింపరాదు.

తా. అయథార్థ విషయకముగ కూడ ప్రత్యక్షము కలుగుచుండుట సహజము కావున ప్రత్యక్షమునే ఆశ్రయించి ఉపపత్తిచే నిర్ణయము చేయనిదే పదార్థమును నిశ్చయింప రాదు. అందుచే పదార్థము వారి వారి సంస్కారభేదముచే భిన్నముగా నుండును.

ప్రత్యక్షముగ ఎట్లు కన్పట్టునో చూచి, దానిని యుక్తిచే నిశ్చయించి, వ్యవహార మున లోకములో ఎట్లు ఆ పదార్థమును గ్రహింపదగునో అట్లు కల్పింపవలెనే కాని తమ పరమార్థ జ్ఞానము ననుసరించి కల్పింపరాదని చెప్పుచున్నాడు.

అసమాఖ్యేయ తత్త్వానాం అర్థానాం లౌకికై ర్యథా
వ్యవహారే సమాఖ్యానం తత్ప్రాజ్ఞో న వికల్పయేత్ . 142

అసమాఖ్యేయ తత్త్వానాం = ఇట్టున్నదని నిర్వచించుటకు వీలుకాని స్వభావము కలిగిన, అర్థానాం = అర్థములయొక్క, వ్యవహారే = లోకవ్యవహారమున, సమాఖ్యానం = చెప్పుట, లౌకికైః = లోకములోనివారిచే, యథా = ఏ విధముగ చేయబడుచున్నదో, తత్ = ఆ లోక ప్రసిద్ధ వ్యవహారమును, ప్రాజ్ఞః = విద్వాంసుడు, న వికల్పయేత్ = భిన్నము చేయరాదు.

తా. లోకములోని పదార్థము లన్నియు అనిర్వచనీయస్వరూపములే యయినను లోకులచే ప్రసిద్ధముగ ఏ రూపముతో వ్యవహరింపబడుచున్నవో ఆ రూపము కలవిగనే శాస్త్రజ్ఞులు కూడ వ్యవహరింపవలెను. కాని భిన్న భిన్న రూపములుగ కల్పింపరాదు. లోకములో ఏ శబ్దమున కేది యర్థమని వ్యవహారమున ప్రసిద్ధమైయుండునో దానినే స్వీకరింపవలెను. కాని దానిని యుక్తులచే నిరసింపరాదు.

ఈ విధముగ పన్నెండు విధములుగ పదార్థము నాయామతభేదమున నిరూపించెను. కాని వైయాకరణ మతమున వాక్యార్థ మఖండము, పదార్థ మసత్యము. వాక్య వాక్యార్థ ములకు అధ్యాసమే సంబంధము, ప్రతిభయే వాక్యార్థము కావున ప్రతిభా స్వరూపమే వివరింపబడుచున్నది.

విచ్ఛేదగ్రహణేఽర్థానాం ప్రతిభాన్యైవ జాయతే
వాక్యార్థ ఇతి తా మాహుః పదార్థై రుపపాదితామ్ . 143

అర్థానాం = 'దేవదత్త గామ్ ఆనయ' అను వాక్యములో కల్పితములైన పదములచే భాసించిన అర్థములకు, విచ్ఛేదగ్రహణే = విడి విడిగా గ్రహించునపుడు, అన్యైవ = ఆ పదార్థ ములకంటె వ్యతిరిక్తమగు, ప్రతిభా = ప్రతిభయనుపేరుగల బుద్ధి, జాయతే = కల్గును, పదార్థైః ఉపపాదితాం = అసత్యములగు దేవదత్తాది పదార్థములచే అభివ్యక్తమైన ఆ బుద్ధినే, వాక్యార్థ ఇతి = వాక్యార్థమని, ఆహుః = చెప్పుదురు.

తా. 'దేవదత్త గామ్ ఆనయ' అను వాక్యము అఖండమైనను దానియందు లేని పదములు కల్పితములై ఉన్నట్లు భాసించును. ఆ పదముల యర్థములు విడివిడిగా భాసించు నపుడు ఆ యర్థము లన్నియు సామూహికముగ వేరొక యర్థమును, ప్రతిభ యను దానిని, అభివ్యక్తము చేయును. ఆ ప్రతిభయే వాక్యార్థము.

ఆ ప్రతిభ ఎట్టిదియో వివరించుచున్నాడు.

ఇదం తదితి సాన్యేషా మనాఖ్యేయా కథంచన
ప్రత్యాత్మవృత్తిసిద్ధా సా కర్త్రాపి న నిరూప్యతే. 144

సా = ఆ ప్రతిభ, ఇదం తత్ ఇతి = పదార్థములచే అభివ్యక్తమగు ఈ ప్రతిభ యను వాక్యార్థము ఆ పదార్థ సముదాయమేనని, కథంచన = ఏవిధముగను, అన్యేషాం = ఇతరులకు, అనాఖ్యేయా = నిరూపించుటకు శక్యముకాదు. సా = ఆ ప్రతిభ, ప్రత్యాత్మ వృత్తి సిద్ధా = ఎవరికి వారి అనుభవమున గోచరించునదే, కాని, కర్త్రాపి = ఆ వాక్యార్థ జ్ఞానము కలవానిచేత గూడ, న నిరూప్యతే = నిరూపింప వీలుపడదు.

తా. ప్రతిభ యని భాసించు ఈ వాక్యార్థము పదార్థముల సముదాయరూపమే యని ఇతరులకు నిరూపించుటకు వీలుకాదు. పానక రసమువలె పదార్థ సమ్మేళనముచే విడదీసి చూపరాని దగుటచే ఇది ఈ పదము యొక్క అర్థమని ఇతరులకు గాని తనకుగాని తెలిసికొన వీలుకాదు. కాని ఎవరి అనుభవమున వారికి గోచరించుచుండును.

ప్రతిభయొక్క స్వభావమును వివరించుచున్నాడు.

ఉపశ్లేషమి వార్థానాం సా కరో త్యవిచారితా
సార్వరూప్యమి వాపన్నా విషయత్వేన వర్తతే. 145

సా = ఆ ప్రతిభ, అవిచారితా = ఇది ఆ పదముయొక్క అర్థము అని వివేచించి చూప వీలుకానిదైనను, అర్థానాం = పదార్థముల యొక్క, ఉపశ్లేషం = సంసర్గమును (పరస్పరమేళనమును), కరోతి ఇవ = చేయునట్లు ఉండును. సార్వరూప్యం = వాక్యము యొక్క సంపూర్ణమగు అర్థస్వరూపమును, ఆపన్నా = పొందినదై, విషయత్వేన = పదార్థ ములచే అభివ్యక్తి చేయబడునదై, వర్తతే ఇవ = ఉన్నట్లుండును.

తా. ప్రతిభ వాక్యార్థము. ఆ వాక్యార్థము అనిర్వచనీయము. అనగా ఈ పదము యొక్క అర్థ మిదియని వాక్యార్థములో నిశ్చయించి చూప వీలుపడదు. కాని పదార్థములయొక్క పరస్పర సంబంధమును కల్పించునట్లును, పదార్థములచేతనే ఈ వాక్యార్థము అభివ్యక్తమైనట్లును గోచరించుచుండును.

ఏ ప్రాణియు లోకవ్యవహారమున ప్రతిభ నతిక్రమించి యుండలేదు. ప్రతిభయే మనుష్యులకు, తిర్యగ్జంతువులకు, బాలురకు కూడ వ్యవహార హేతువు అని నిరూపించు చున్నాడు.

సాక్షాచ్ఛబ్దేన జనితాం భావనానుగమేన వా
ఇతికర్తవ్యతాయాం తాం న కశ్చి దతివర్తతే. 146

సాక్షాత్ = ప్రత్యక్షముగ ఈ జన్మమున, శబ్దేన = వృద్ధ వ్యవహారమున ప్రయో గింపబడిన శబ్దముచేతగాని, భావనానుగమేన వా = పూర్వజన్మయందలి భావనచే గాని, జనితాం = కలిగిన, తాం = ఆ ప్రతిభను, ఇతికర్తవ్యతాయాం = వ్యవహారమున, కశ్చిత్ = ఏ ఒక్క ప్రాణియు, న అతివర్తతే = మీరి వ్యవహరింపజాలదు.

తా. లోకమున మనుష్యులలో పెద్దలు చేయు వ్యవహార నిర్వహణమునగాని, పిల్లలుచేయు కార్యములలోగాని, తిర్యగ్జంతువులు తమతమ పనులు చేయుటలోగాని ప్రతి

భయే కారణము. మనుష్యులలో పెద్దవారు ఈ జన్మలోనే శబ్దముయొక్క సంకేతము నెరుంగుటచే వ్యవహారము సాగింతురు. బాలురు తమ తోడివారితో పూర్వజన్మయందలి భావన యనుసరించివచ్చుటచే వారికి తెలియకయే లోపల నావిర్భవించిన ప్రతిభచే వ్యవహారము సాగింతురు. తిర్యగ్జంతువులు కూడ అంతే. అందుచేత లోకమున ఏ ప్రాణియు ప్రతిభ నతిక్రమించి ప్రవర్తింపజాలదు.

దీనినే విశదము చేయుచున్నాడు.

ప్రమాణత్వేన తాం లోకః సర్వః సమనుపశ్యతి
సమారంభాః ప్రతాయంతే తిరశ్చామపి తద్వశాత్ . 147

సర్వః లోకః = సమస్త లోకము, తాం = ఆ ప్రతిభను, ప్రమాణత్వేన = తాను చేయుపనికి ప్రమాణముగ, సమనుపశ్యతి = భావించును. తిరశ్చామపి = తిర్యగ్జంతువులయొక్క కూడ, సమారంభాః = వ్యాపారములు, తద్వశాత్ = ఆ ప్రతిభవలననే, ప్రతాయంతే = విస్తృతముగ సాగుచున్నవి.

తా. ప్రతివ్యక్తియు తనకు మనస్సులో తోచినదానిని బట్టియే ప్రవర్తించుచు దానినే ప్రమాణముగ భావించును. శాకుంతలమున దుష్యంతుడు "సతాంహి సందేహపదేషు వస్తుషు ప్రమాణ మంతఃకరణ ప్రవృత్తయః" అని అంతఃకరణ వ్యాపారము ప్రమాణమని నిశ్చయించినాడుకదా ః పుట్టగనే పశువులు తమ వ్యవహారమును సాగించుట ఈ ప్రతిభ చేతనే. కావున సర్వ వ్యాపారములు ప్రతిభ నాశ్రయించియే సాగును.

అందరిలోను ఈ ప్రతిభ సహజముగ నుండునని ప్రతిపాదించుచున్నాడు.

యథా ద్రవ్యవిశేషాణాం పరిపాకై రయత్నజాః
మదాదిశక్తయో దృష్టాః ప్రతిభా స్తద్వతాం తథా . 148

ద్రవ్యవిశేషాణాం = ఇప్పపువ్వు, బెల్లము, బియ్యము, మొదలగు ద్రవ్యములయొక్క, పరిపాకైః = పాకవిశేషములచే, అయత్నజాః = ప్రయత్నము వేరుగ అవసరము లేకయే జనించు, మదాదయః = మత్తుకల్గించు శక్తులు, యథా = ఎట్లు, దృష్టాః = చూడబడునో, తథా = అట్లు, తద్వతాం = ప్రతిప్రాణికిని, ప్రతిభాః = ప్రతిభలు, దృష్టాః = అయత్నజన్యముగ చూడబడుచున్నవి.

తా. ఇప్పపువ్వు బెల్లము మొ॥నవి కలిపి నానబెట్టినచో వానిలో పరిపాకముచే వేరొక ప్రయత్న మేమియు అక్కరలేకయే మత్తుకల్గించుశక్తి ఆవిర్భవించును. అట్లే ప్రతిప్రాణియందును సహజముగనుండు శక్తియే ప్రతిభ. కాని ఇది క్రొత్తగా సృజింపబడునది కాదు.

ఈ ప్రతిభ జన్మాంతరాభ్యాసముచే జనించునది అని నిరూపించుచున్నాడు.

స్వరవృత్తిం వికురుతే మధౌ పుంస్కోకిలస్య కః ?
జంత్వాదయః కులాయాదికరణే కేన శిక్షితాః ? 149

మధౌ = వసంతర్తువునందు, పుంస్కోకిలస్య = గండుగోయిలకు, స్వరవృత్తిం = తన పూర్వస్వరము పంచమస్వరముగా నగు మార్పును, కః = ఎవడు, వికురుతే =

కల్గించుచున్నాడు. జంత్వాదయః = సాలెపురుగు మున్నగునవి, కులాయాదికరణే = గూడు నిర్మించుటలో, కేన = ఎవనిచేత, శిక్షితాః = శిక్షింపబడినవి.

తా. వసంతర్తువులో కోకిలకు పూర్వపుకంఠస్వరము మారి పంచమస్వరము కల్గుట అయత్నసిద్ధమే కాని ఎవరిచేతను సృజింపబడినది కాదు. సాలెపురుగు గూడు కట్టు కొనుట ఎవరివద్దను నేర్చుకొనలేదు. అదియే ప్రతిభ. ఆ ప్రతిభచేతనే సర్వవ్యాపారములు సాగును.

దానినే స్పష్టముచేయుచున్నాడు.

ఆహారప్రీత్యపద్వేషప్లవనాదిక్రియాసు కః
జాత్యన్వయప్రసిద్ధాసు ప్రయోక్తా మృగపక్షిణామ్ ? 150

జాత్యన్వయ ప్రసిద్ధాసు = జాతినిబట్టి, కులమునుబట్టి సిద్ధములై యుండు, ఆహార ప్రీత్యపద్వేషప్లవనాదిక్రియాసు = ఆహారము, ప్రీతి, పగ, ఈదుట మొ॥గు వ్యాపారములలో, మృగ పక్షిణామ్ః = మృగములకు, పక్షులకు, ప్రయోక్తా = ప్రవర్తింపచేయువాడు, కః = ఎవడు ?

తా. పిల్లికి ఎలుక ఆహారమగుట, కుక్కకు తనను పెంచిన వానిమీద ప్రేమ, గోవ్యాఘ్రములకు, ముంగిసకు, పాముకు పరస్పరద్వేషము, ఎనుబోతులు మొ॥నవి నీటిలో ఈదుట మొ॥నవి అయా మృగములలో పక్షులలో జాతి సహజములుగ మనకు కన్పట్టు చున్నవి. వానిని ఆ విధముగ ఆహార, ప్రేమ, ద్వేష, ప్లవనాదులు చేయవలెనని ఎవ్వరును ప్రేరణ చేయలేదు. అది సహజమేయని ఎరుంగనగును. అది అనాదియగు ప్రతిభవలననే అని స్పష్టమగుచున్నదికదా ?

ప్రతిభకు శబ్దమే మూలమని చెప్పుచున్నాడు.

భావనానుగతా దేత దాగమా దేవ జాయతే
ఆసత్తివిప్రకర్షాభ్యా మాగమస్తు విశిష్యతే. 151

భావనానుగతాత్ = ప్రతిభకు కారణముగా కన్పట్టు భావనతో కలిసియుండు, ఆగమాదేవ = శబ్దమువలననే, ఏతత్ = ఈ ప్రతిభారూపమగు జ్ఞానము, జాయతే=కల్గును. తు=కాని, ఆగమః=శబ్దము, ఆసత్తి విప్రకర్షాభ్యాం=(ఈ జన్మమున) దగ్గరగానుండుట, (పూర్వజన్మముల)దూరముగా నుండుట అను భేదములచే, విశిష్యతే=విశేషము కలదగును.

తా. భావనా సహకారముతో ప్రతిభకు కారణ భూతమైనది శబ్దమే. ఆ శబ్దము ఈ జన్మమునందలిది కావచ్చును; పూర్వజన్మమందలిది కావచ్చును. అందుచే ప్రతిభా హేతు భూతమగు శబ్దము ఆసన్నము, విప్రకృష్టము అని ద్వివిధముగ నుండును.

నిమిత్తభేదముచే ప్రతిభ ఆరు విధములుగ నుండునని వివరించుచున్నాడు.

స్వభావచరణాభ్యాసయోగాదృష్టోపపాదితాం
విశిష్టోపహితాం చేతి ప్రతిభాం షడ్విధాం విదుః. 152

స్వభావ, చరణ, అభ్యాస, యోగ, అదృష్ట—ఉపపాదితాం=స్వభావముచేతను, సదాచారముచేతను, నిత్యాభ్యాసముచేతను, యోగబలముచేతను. అదృష్టముచేతను

అభివ్యక్తమగునదియు, విశిష్టోపహితాంచ=సిద్ధినందిన మహాపురుషులచే సంక్రమింపచేయ బడినదియు, ఇతి=అని, ప్రతిభాం=ప్రతిభను,షడ్విధాం=ఆరువిధములుగ, విదుః=ఉదాహరింతురు.

తా. ప్రతిభ నిమిత్త భేదముచే ఆరువిధములుగ నుండునని కొందరు చెప్పుదురు.

1. స్వభావ సిద్ధముగ నావిర్భవించు ప్రతిభ: ఉ॥ ప్రకృతి మహత్తత్త్వముగ పరిణామము నందుట సహజమే. సుషుప్త్యవస్థలో నున్న వానికి మేల్కొనుటకు తగిన స్థితి కల్గుట
2. సదాచారము నిమిత్తముగ నావిర్భవించు ప్రతిభ: శాస్త్ర విహితమగు తపస్స్వాధ్యాయాదులచే వసిష్ఠాదులకు కల్గిన త్రైకాలికవిషయప్రకాశము
3. అభ్యాసము నిమిత్తముగ నావిర్భవించు ప్రతిభ: నూతులు చెరువులు త్రవ్వు వారికి ఎక్కడ నీరుపడునో తెలియుట అభ్యాస సిద్ధ ప్రతిభచేతనే.
4. యోగనిమిత్తముగ నావిర్భవించు ప్రతిభః యోగాభ్యాసముచే నావిర్భవించు ప్రతిభ. యోగాభ్యాసముచేతనే ఇతరుల అభిప్రాయముల నెరుంగు శక్తి.
5. అదృష్టముచే నావిర్భవించు ప్రతిభ: రక్షఃపిశాచాదులు ఇతరులపై ఆవేశించుట, అంతర్ధానమగుట మున్నగునవి ఈ శక్తిచేతనే.
6. తపోయోగాది సిద్ధిసంపన్నులగు విశిష్టవ్యక్తులచే సంక్రమింపచేయబడిన ప్రతిభ: సంజయునకు భారత యుద్ధమున దూరముగా జరిగిన యుద్ధ వృత్తాంతములను చూడ గల్గిన శక్తి. ఇది కృష్ణద్వైపాయనునిచే సంక్రమింపచేయబడినది.

పై ఆరు విధములగు ప్రతిభకూడ ఆగమసిద్ధవాక్యములచే అభివ్యక్తము చేయ బడునదే యని ఎరుంగవలెను.

వాక్యము అఖండమని యంగీకరించినను పద పదార్థవిభాగములేనిదే వ్యవహారము సిద్ధించదు కావున పదార్థ స్వరూపమును వెనుక వివరించిరి. ఆ పదార్థము ముఖ్యము, నాంతరీయకము అనుభేదముచే ద్వివిధముగా నుండునని వివరించుచున్నాడు.

యథా సంయోగిభి ర్ద్రవ్యై ర్లక్షితేఽర్థే ప్రయుజ్యతే
గోశబ్దో న త్వసౌ తేషాం విశేషాణాం ప్రకాశకః . 153

ఆకారవర్ణావయవైః సంసృష్టేషు గవాదిషు
శబ్దః ప్రవర్తమానోఽపి న తా నంగీకరో త్యసౌ . 154

గోశబ్దః='గోవు' అనుశబ్దము, సంయోగిభిః=గోశబ్దముయొక్క అర్థము అగు వ్యక్తితో తాత్కాలికముగ సంబంధించియుండు, ద్రవ్యైః=ఘంటలు, మణులు మొదలగు వస్తువులచే, లక్షితే=ఉపలక్షితమగు, అర్థే=గోవునందు, యథా ప్రయుజ్యతే=ఏవిధముగ ప్రయోగింపబడునో, మనమెరుంగుదుము. తు=కాని, అసౌ=ఈ గోశబ్దము, తేషాం విశేషాణాం=ఆ ఘంటలు, మణులు మొదలగు విశేషములకు, న ప్రకాశకః=వాచకము కాదు. ఆకారవర్ణావయవైః= ఆకారము, రంగు, కొమ్ములు, తోక మొదలగు అవయములతో, సంసృష్టేషు=కూడిన, గవాదిషు = గోవు మొదలగు అర్థములందు, శబ్దః=గోశబ్దము, ప్రవర్తమానోఽపి=వ్యవహరింపబడుచున్నను, అసౌ = ఈ గోశబ్దము, తాన్=ఆకారము, రంగు మొదలగు వానిని, న అంగీకరోతి=వాచ్యముగా స్వీకరింపదు.

తా. గోవు అను శబ్దముచే గోత్వమను జాతి కాని గోవ్యక్తి కాని చెప్పబడును. ఆ గోవుకు అలంకారములుగా మెడలో కట్టిన మువ్వలు, గంటలు కూడ ఆ గోవుతో పాటే జ్ఞాన గోచరమగును; కాని ఇవి ఒకపుడు లేకపోవచ్చును. ఉపలక్షకములుగా గోవుతో సంబంధించి యుండును. అవి బహిరంగములగు విశేషములు, అట్లే గోవునం దుండు ఆకారము, రంగు, కొమ్ములు, తోక మొదలగు అవయవములు కూడ శబ్దముచే జ్ఞానగోచరములగును. ఇవి అంతరంగ విశేషములు. ఈ రెండు విధములగు విశేషములు గోవుతో తాత్కాలికముగనో, నిత్యముగనో కూడి యుండునవే యయినను గోత్వమను జాతి గోవుతో కూడి యుండునట్లు అవ్యభిచరితముగ సర్వదా గోచరింపవు. కనుక అవి గోశబ్దమునకు ముఖ్యార్థములు కావు. గోశబ్దమునుచ్చరించగనే తప్పక గోచరించు వ్యక్తి లేదా జాతియే ముఖ్యమగు వాచ్యార్థము. ఆ మువ్వల ఆవు, కుంచెడు పాలిచ్చే ఆవు, రాజుగారి ఆవు మొదలగు ఇతర గోవులకంటె భేదమును తెలియచేయు బహిరంగ విశేషములు ఆ గోశబ్దమును వినగనే మనసున గోచరించినను అవి వాచ్యములు కావు. అట్లే ఆ గోవుయొక్క ఆకారము, రంగు, అవయవములు కూడ గోశబ్దముచే మనసున గోచరించుచున్నను ఆ అంతరంగవిశేషములు కూడ వాచ్యములు కావు.

శబ్దముచే ఆకారము, వర్ణము మొ॥నవి తెలియచేయబడవు అనినచో స్థూలము, హ్రస్వము, చిత్రము మున్నగు శబ్దములు ఆకారము, లేదా వర్ణముతో కూడిన వస్తువు నుద్దేశించి ప్రయోగింపబడును కావున అచట ఆకారవర్ణములు శబ్దవాచ్యములగునా కాదా యను సందేహమును నివారించుచున్నాడు.

సంస్థానవర్ణావయవై ర్విశిష్టే యః ప్రయుజ్యతే
శబ్దో న తస్యావయవే ప్రవృత్తి రుపలభ్యతే . 155

సంస్థానవర్ణావయవైః = ఆకారము, రంగు, అవయవములతో, విశిష్టే = కూడిన వస్తువునందు, యః శబ్దః = ఏ శబ్దము, ప్రయుజ్యతే = ప్రయోగింపబడునో, తస్య = ఆ శబ్దమునకు, అవయవే = అవాంతర భాగమునందు, ప్రవృత్తిః = వాచకత్వము, న ఉపలభ్యతే = ఉండదు.

తా. 'గోవు' అను శబ్దము గోత్వజాతిని లేదా వ్యక్తిని ముఖ్యముగా తెలియచేయును. కాని దాని ఆకారమును రంగును తెలియచేయదు. కాని స్థూలము, కృశము, చిత్రము మున్నగు శబ్దము ఆకారముతో గూడిన వస్తువును, వర్ణముతో కూడిన వస్తువును తెలుపవలెనను నుద్దేశముతో ప్రయోగింపబడినవి కనుక ఆ శబ్దములు ఆకారమునకు, వర్ణమునకు వాచకములే యగును. కాని వానిలో అవాంతరభాగములను అనగా చిత్రము అనునది చిత్రవర్ణమునే కాని దానిలో అవయవములైన శ్వేతపీతాది వర్ణములను వాచ్యముగా ఎరిగింపదు. ఆ చిత్రవర్ణములో తప్పనిసరిగా అవి యుండును కనుక గోచరించునే కాని అవి వాచ్యార్థము మాత్రము కావు.

ఆకారపరిమాణసంఖ్యానిరపేక్షముగ సామాన్యమాత్రమునే శబ్దము తెలియచేయుటలో దృష్టాంతమును చూపుచున్నాడు.

సంఖ్యా ప్రమాణ సంస్థాన నిరపేక్షః ప్రవర్తతే
బిందౌ చ సముదాయే చ వాచకః సలిలాదిషు . 156

సలిలాదిషు=‘నీరు తెల్లనిది’ మొదలగు వానియందు, వాచకః=‘జలము, శుక్లము, శ్వేతము మున్నగు శబ్దము, సంఖ్యా ప్రమాణ సంస్థాన నిరపేక్షః=ఏకత్వాది సంఖ్యనుగాని, ‘చిన్నది, పెద్దది, తక్కువ, ఎక్కువ’ అను ప్రమాణమునుగాని, ఆకారమును గాని అపేక్షింపకయే, బిందౌ = బిందువునందు, సముదాయేచ = సముదాయమునందు కూడ, ప్రవర్తతే = ప్రవర్తించును.

తా. జలము అను శబ్దము జలబిందువును, సముద్రమునందలి జలరాశినికూడ తెలియజేయును. “ఒక శిల తెల్లగానున్నది” ‘హిమవత్పర్వతము తెల్లగానున్నది’ అని శిల యందు పర్వతమునందు కూడ “తెల్లగా నున్నది” అనునది సమానముగనే వర్ణవాచకమగును. ఇచట సంఖ్యగాని, ఆకారముగాని, పరిమాణము కాని వివక్షితములు కావు. ఇచట జల, శుక్ల, నీలాది శబ్దముల ప్రవృత్తికి నిమిత్తము జలత్వ, శుక్లత్వ మాత్రములే కాని ఆశ్రయ ద్రవ్యముయొక్క ప్రమాణ—సంఖ్యా—ఆకారాదులు కావని ఎరుంగునది.

విశేషపరామర్శ లేక వస్తుమాత్రమునే శబ్దము బోధించును అని చెప్పినచో “సముదాయ వాచకశబ్దములు అవయవములనుకూడ బోధించును” అని భాష్యకారులు చెప్పి “తైలము శుక్తము, ఘృతము శుక్తము” అని ఉదాహరణము నిచ్చి నిరూపించుట ఎట్లు కుదురును? సముదాయవాచకము, తద్విశేషమగు అవయవమును కూడ బోధించు చున్నదిగదా! అను శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

సంస్కారాదిపరిచ్ఛిన్నే తైలాదౌ యో వ్యవస్థితః
ఆహైకదేశం తత్త్వేన తస్యావయవ వర్తితా . 157

సంస్కారాదిపరిచ్ఛిన్నే=సంస్కారము లేదా ఉపఘాతము (దూషితముగ చేయుట)చే పరిమితమైయున్న, తైలాదౌ=తైలము, ఘృతము మున్నగువానియందు, యః= ఏ తైలశబ్దము లేదా ఘృతశబ్దము, వ్యవస్థితః=ప్రయోగింపబడినదో, సః = ఆ శబ్దము, తత్త్వేన=ఆ సముదాయారోపముచే సముదాయ సదృశముగ, ఏకదేశం=అవయవమును, ఆహ=బోధించును. అందుచే—తస్య=ఆ పరిమిత సముదాయ వాచక శబ్దమునకు, అవయవ వర్తితా=అవయవ వాచకత్వము కూడ ఉండును అని భాష్యకారుడు చెప్పెను.

తా. కాకి ముట్టుకొనుటచే దూషితమైన నేయి కాని లేదా రోగికొరకు శుద్ధిచేయబడిన నేయి కాని కొంత యున్నపుడు అందులో ఏకదేశము నొకడు తినగా ఆ భాగము కూడ సముదాయమువలెనే దూషితమో సంస్కృతమో యగుటచే తత్సాదృశ్యముచే ఆ మొత్తమునకు వాచకమగు పదము లక్షణచే ఏకదేశమునకు కూడ వాచక మగునని భాష్యకారుడు చెప్పెను కాని సముదాయబోధనమున శక్తి కలిగిన శబ్దమే అవయవమును బోధించు శక్తికూడ కలిగి యుండునని దాని యర్థము కాదని ఎరుంగనగును.

గోవు, ఘటము మొదలగు శబ్దములకు జాతి (సామాన్యము) అర్థము, తైలము మొ॥గు శబ్దములకు సామాన్యము, విశేషము కూడ అర్థము; ముష్టి మొ॥గు శబ్దములకు విశేషమే అర్థము అగునపుడు శబ్దార్థము ఇట్టిదని నిశ్చయముగ చెప్పవీలుపడదని పరమార్థ ముగ నిశ్చయముగ చెప్పుచున్నాడు.

యేనార్థే నాభిసంబద్ధ మభిధానం ప్రయుజ్యతే
తదర్థాపగమే తస్య ప్రయోగో వినివర్తతే . 158

యేన అర్థేన=ప్రయోజనముచే అనగా జాత్యాదిరూపమగు నిమిత్తముచే ఏ యర్థముతో-అభిసంబద్ధం=(దానితో అనగా ఆ జాత్యాది రూపార్థముతో) తాదాత్మ్య సంబంధము కలదై, అభిధానం = ఆ యర్థమును ప్రతిపాదింపగల-అభిధావృత్తిగల శబ్దము, ప్రయుజ్యతే= ప్రయోగింపబడునో, ఆ శబ్దము, తదర్థాపగమే = ఆ యర్థము బోధింపబడనపుడు, తస్య= ఆ శబ్దముయొక్క, ప్రయోగః=ప్రయోగించుట, వినివర్తతే = ఆగిపోవును.

తా. జాతి, లేదా, విశేషము అనువానిలో ఏది ఏశబ్దమును ప్రయోగించుటలో నిమిత్తముగా నుండునో ఆ యర్థముతో తాదాత్మ్యము నందుటచే శబ్దము ఆ యర్థమును బోధించుటలో అభిధయను శక్తి కలదైయుండును. కావున ఆ యర్థమునే ఆ శబ్దము బోధించును. ఆ యర్థము శబ్దప్రవృత్తి లో నిమిత్తము కానపుడు ఆ శబ్దము ప్రయోగింపబడదు.

గోశబ్దమును ప్రయోగించునపుడు రోమములు, గిట్టలు మొదలగు అవయవములతో కూడిన గోశబ్దార్థమగు గోత్వమునే నియతముగ బోధించును. కాని రోమశృంగాది విశేషములను నియతముగ బోధింపదు అని వివరించుచున్నాడు.

యాంస్తు సంభవినో ధర్మా నంతర్నీయ ప్రయుజ్యతే
శబ్ద స్తేషాం న సాన్నిధ్యం నియమేన వ్యపేక్షతే. 159

యాంస్తు సంభవినః ధర్మాన్=గోశబ్దముయొక్క అర్థమగు గోత్వజాతితో సమానాధికరణములగు రోమ, శఫాదులగు ఏ ధర్మములను, అంతర్నీయ = గోత్వజాతి యందు అంతర్భవింపచేసి, శబ్దః=గోశబ్దము, ప్రయుజ్యతే = ప్రయోగింపబడునో, తేషాం = ఆధర్మముల యొక్క, సాన్నిధ్యం = సన్నిధానమును ఆ శబ్దము, నియమేన=నియతముగ, న వ్యపేక్షతే=అపేక్షింపదు.

తా. గోశబ్దమునుచ్చరింపగనే గోత్వజాతియే నియతముగ గోచరించును కనుక అదియే గోశబ్దార్థము. ఆ గోవునందుండు రోమ శఫాదులు కూడ ఆ గోశబ్దముచే గోచరింపవలెనని తలంచి ఒకప్పుడు గోశబ్దమును ప్రయోగించినను అవి నియతములు కాకపోవుటచే గోశబ్దార్థము కానేరవు. గోత్వజాతి లేనిచో గోశబ్దము ప్రయోగింపబడదు. రోమశఫాదులు లేకున్నను గోత్వజాతి యున్నచో గోశబ్దము ప్రయోగింపబడును.

యథా రోమశఫాదీనాం వ్యభిచారేఽపి దృశ్యతే
గోశబ్దో న తథా జాతే ర్విప్రయోగే ప్రవర్తతే. 160

రోమశఫాదీనాం=రోమములు, గిట్టలు మొ॥ వాని యొక్క, వ్యభిచారేఽపి = నియతముగ సాన్నిధ్యము లేకపోయినను, గోశబ్దః = గోశబ్దము, యథా = ఎట్లు, దృశ్యతే= కన్పట్టుచున్నదో, తథా=ఆ విధముగ, జాతేః=గోత్వజాతియొక్క, విప్రయోగే = సాన్నిధ్యము లేనపుడు, న ప్రవర్తతే=గోశబ్దము ప్రయోగింపబడదు.

తా. గోత్వజాతితో సమానాధికరణములగు రోమశఫాదులు లేనపుడు కూడ గోశబ్దము ప్రయోగింపబడును. కాని గోత్వజాతి లేనిచో గోశబ్దము ప్రయోగింపబడదు.

శృంగ రోమ శఫాది విశిష్టమగు వస్తువు ప్రత్యక్షగోచరము కానేరదు. గోత్వజాతి మాత్రమునే గోశబ్దము సాక్షాత్కరింపచేయును. అందుచే గోత్వమే గోశబ్దార్థమని నిరూపించుచున్నాడు.

దుర్లభం కస్యచి ల్లోకే సర్వావయవదర్శనమ్
కైశ్చి త్త్వవయవై ర్దృష్టై రర్థః కృత్స్నోఽనుమీయతే. 161

కస్యచిత్ = ఏ పదార్థము యొక్క అయినను, సర్వావయవదర్శనం = సర్వావయవవిశిష్ట పదార్థ సాక్షాత్కారము, లోకే = లోకమునందు, దుర్లభం = దుర్లభము; కైశ్చిత్ = కొన్ని, దృష్టైః = చూడబడిన, అవయవైః = అవయవములచే, కృత్స్నః అర్థః = సర్వాంగ విశిష్టమగు సమగ్ర పదార్థము, అనుమీయతే = అనుమానముచే గోచరించును.

తా. ఏ పదార్థమైనను ఎవనిచేతనైనను సర్వాంగవిశిష్టముగ సాక్షాత్కారము చేసికొన సాధ్యపడదు. కొన్ని అవయవములు ప్రత్యక్ష గోచరములు కాగా సర్వాంగ విశిష్టమగు పదార్థము అనుమానముచేతనే జ్ఞాన విషయమగును కాని ప్రత్యక్షముచే గోచరము కాదు.

ఈవిధముగ కొన్ని అవయవములను చూచుటచే గలిగిన సకల పదార్థ జ్ఞానము ఆనుమానికమే యైనట్లు 'జాతిగంధః' 'ఉత్పలగంధః' ఇత్యాది పదములచే జాతిపుష్పగంధ—ఉత్పలగంధముల జ్ఞానముతో పాటు కలుగుచున్న ఆ పుష్పముల రూపస్పర్శాది జ్ఞానము అనుమానికమే కాని ప్రత్యక్షము కాదని చెప్పుచున్నాడు.

తథా జాత్యుత్పలాదీనాం గన్ధేన సహచారిణామ్
నిత్యసమ్బన్ధినాం దృష్టం గుణానా మవధారణమ్. 162

తథా = కొన్ని అవయవములను ప్రత్యక్షముగ చూచినవిమ్మట అనుమానముచే సకలపదార్థజ్ఞానము కలిగినట్లు, జాత్యుత్పలాదీనాం = మాలతీపుష్పము, కలువ మొదలగు వాటియొక్క, గన్ధేన = ప్రత్యక్షమగు గంధముతో, సహచారిణాం = కూడా ఉండునవియు, నిత్యసమ్బన్ధినామ్ = దానితో నిత్యసంబంధము కలవియు అగు, గుణానాం = రూపస్పర్శాది గుణములయొక్క, అవధారణమ్ = అనుమానము, దృష్టమ్ = చూడబడినది.

తా. అట్లే జాత్యుత్పలాది గంధ ప్రత్యక్షముచే తత్సహచారులును, దానితో నిత్యసంబద్ధములును అగు రూపస్పర్శాదుల అనుమానము కలుగుచున్నది.

వి. గాలి వీచుచున్నపుడు ఒక గంధవిశేషమును వాసనచూడగా ఇది మాలతీ కుసుమ గంధము, ఇది ఉత్పలగంధము అనెడు జ్ఞానము కలుగును. ఆ జ్ఞానముచే గంధ విశేషమున్నది గాన ఇది మాలతీపుష్పము, ఇది ఉత్పలము అని జాత్యుత్పలాద్యనుమానము కలుగుచున్నది. ఈ విధముగ అనుమితములగు జాత్యుత్పలాదుల విషయమున ప్రయుక్తములగు 'జాతి' 'ఉత్పల' మొదలగు శబ్దములు జాత్యుత్పల సామాన్యములను బోధించుచు, ప్రత్యక్షగంధ జ్ఞానసాహాయ్యముచే, ఆ గంధముతో పాటు కలిసియుండెడు రూపస్పర్శాది గుణముల జ్ఞానమును అనుమానముచే కలిగించుచున్నవి. అంతియేకాని గంధజ్ఞానము ప్రత్యక్షముగ నున్నట్లు రూపస్పర్శాది జ్ఞానము ప్రత్యక్షము కాదు. కావున 'జాతిగంధః' 'ఉత్పలగంధః' ఇత్యాది శబ్దములవలన కలిగిన జాత్యుత్పలస్పర్శాది రూపార్థము అనుమానజన్యమే కాని శబ్దార్థము కాజాలదు.

ప్రకృత విషయమును ఉపసంహరించుచున్నాడు.

తస్మా త్సమ్భవినోఽర్థస్య శబ్దాత్ సంప్రత్యయే సతి
అదృష్టవిప్రయోగోఽర్థః సమ్బన్ధిత్వేన గమ్యతే. 163

తస్మాత్ = సామాన్యముతో కలిసియున్న గుణాదుల విషయమున వ్యభిచారము కనబడుటచే, శబ్దాత్ = శబ్దమువలన, సంభవినః = సంభావ్యమగు, అర్థస్య = గుణాద్యర్థము యొక్క, సం[ప్రత్యయే సతి = [ప్రతీతి కలుగుచున్నను, అదృష్ట వి[ప్రయోగః = వ్యభిచరితముకాని, అర్థః = సామాన్యరూపమగు అర్థము, సమ్బన్ధిత్వేన = వాచ్యముగ, గమ్యతే = బోధింపబడుచున్నది.

తా. కావున శబ్దముచే గుణాదుల జ్ఞానము కలుగుచున్నను (ఆ గుణాదులు వ్యభిచరించును గాన) వ్యభిచరితము కాని సామాన్యమే శబ్దార్థమని చెప్పవలెను.

వి. అనగా శబ్దముచే [ప్రతీయమానమైనంత మా[త్రముచే సంభావ్యములగు అర్థములన్నియు శబ్దార్థములే యని చెప్పుటకు వీలులేదు. ఏలయన కొన్నియెడల వాటికి వ్యభిచారము కనబడుచున్నది. అందుచే 'గౌః' మొదలగు శబ్దములు అవ్యభిచరితమై నిత్య సంబద్ధమగు గోత్వాదిరూప సామాన్యమునే బోధించును. కావున ఆ సామాన్యమే శబ్దార్థము. వ్యక్త్యాదులు కావు.

ఇంతవరకును భర్తృహరి నామపదార్థవిచారణము చేసి ఇపుడు నామపదాంశము లగు [ప్రకృతి [ప్రత్యయముల అర్థమును విచారించుటకు ఉప[క్రమించుచున్నాడు. మొదట 'వాచికా' ఇత్యాది శ్లోకద్వయమునందు [ప్రత్యయభాగార్థమును గూర్చి విచారించుచున్నాడు.

వాచికా ద్యోతికా వా స్యు ర్ద్విత్వాదీనాం విభక్తయః
స్యాద్వా సంఖ్యావతోఽర్థస్య సముదాయోఽభిధాయకః. 164

విభక్తయః = సు, ఔ, జస్, తిప్, తస్, ఝి మొదలగు విభక్తి[ప్రత్యయములు, ద్విత్వాదీనామ్ = ద్విత్వము, కర్మత్వము మొదలగు వాటికి, వాచికాః = వాచకములు, వా = లేక, ద్యోతికాః = సూచకములు, స్యుః = అగును, వా = లేక, సముదాయః = [ప్రకృతి[ప్రత్యయసముదాయము, సంఖ్యావతః = సంఖ్యాది విశిష్టమగు, అర్థస్య = అర్థమునకు, అభిధాయకః = వాచకము, స్యాత్ = కావచ్చును.

తా. విభక్తి [ప్రత్యయములు ద్విత్వాదులను బోధింపవచ్చును లేదా సూచింపవచ్చును. లేదా [ప్రకృతి[ప్రత్యయ సముదాయము సంఖ్యాది విశిష్టమగు అర్థమును బోధింపవచ్చును.

లేదా [ప్రకృతి [ప్రత్యయసముదాయము సంఖ్యాకర్మత్వాద్యుపలక్షితమగు అర్థమును బోధించును—అను పక్షాంతరమును రెండవ శ్లోకమున చెప్పుచున్నాడు.

వినా సంఖ్యాభిధానాద్వా సంఖ్యాభేదసమన్వితాన్
అర్థాన్ స్వరూపభేదేన కాంశ్చి దాహు ర్గవాదయః. 165

వా = లేక, గవాదయః = విభక్తి [ప్రత్యయాంతములగు గోశబ్దాదులు, సంఖ్యాభిధానాద్వినా = సంఖ్యాదులను బోధించకుండగనే, స్వరూపభేదేన = ద్విత్వాది సంఖ్యల స్వరూపభేదముచేత, సంఖ్యాభేదసమన్వితాన్ = సంఖ్యావిశేషముతో ఉపలక్షితములగు, కాంశ్చిత్ = కొన్ని, అర్థాన్ = అర్థములను, ఆహుః = బోధించుచున్నవి.

తా. గోశబ్దాదులు సంఖ్యను బోధించకుండగనే ద్విత్వాది సంఖ్యాస్వరూపము చేత సంఖ్యావిశేషముతో ఉపలక్షితములగు కొన్ని అర్థములను బోధించును.

వి. ఈ శ్లోకద్వయమునందు నాలుగు పక్షములు ప్రతిపాదితము లైనవి. స్వాది తిఙాది విభక్తులు ద్విత్వకర్మత్వాదులను బోధించును అనునది మొదటిపక్షము. సంఖ్యాదులు కూడ ప్రకృతికే చెందినవి అనెడు పక్షమున విభక్తులు కేవలము ద్విత్వాదులను ద్యోతింప చేయును అని రెండవపక్షము. ప్రకృతిప్రత్యయములకు వేరువేరు అర్థములు లేవు. ప్రకృతి ప్రత్యయ సముదాయము సంఖ్యాది విశిష్టార్థమును బోధించును అని మూడవపక్షము. ప్రకృతి ప్రత్యయ సముదాయము సంఖ్యాద్యుపలక్షితమగు అర్థమును బోధించును అని నాల్గవపక్షము.

వాక్యమునుండి పదపదార్థములను విడదీసి వ్యవహరించునట్లే పదమునుగూడ ప్రకృతి ప్రత్యయరూపమున విడదీసి చూపించుట శాస్త్రములలో కానవచ్చుచున్నది. ఈ విధముగ పదములను విభజించగా నేర్పడిన ప్రకృతిప్రత్యయముల అర్థము విషయమున పండితులలో అభిప్రాయభేదము కనబడుచున్నది. దీనికి ఇది అర్థము అని అన్వయ వ్యతిరేక ముల సహాయముచే నిర్ణయింతుము. ఈ అన్వయ వ్యతిరేకముల సహాయముతో పరిశీలింపగా పదమునందు ప్రకృత్యర్థము ప్రత్యయార్థము అనునవి రెండుమాత్రమే ఉన్నవి కాని అంతకు మించిన ప్రకృతిప్రత్యయ సముదాయరూపపదార్థ మనునది లేదు. ఒక వాక్యమునందు అనేకపదము లుండును. ఒక్కొక్కపదము ఒక్కొక్క అర్థమును బోధించును. అంతియే కాని ఆ పదములు తమ పరస్పర సంబంధమును బోధింపజాలవు. కాని ఆకాంక్షావశముచే- అనగా పరస్పరసంబంధము లేకున్నచో ఆ పదముల ప్రయోగము వ్యర్థమగునను కారణముచే- వాటి పరస్పరసంబంధరూపమగు వాక్యార్థము బోధితమగును. పదమునందుగూడ ఆ విధము గానే ఆకాంక్షావశముచే ప్రకృతి ప్రత్యయార్థములు పరస్పర సంబద్ధమగుటతో ప్రకృతి ప్రత్యయ సముదాయ రూపపదార్థ మవగతమగును అని కొందరి అభిప్రాయము.

ఒక పదమునందు ఈ భాగము ప్రకృతి, ఈ భాగము ప్రత్యయము అని పాణి న్యాది వైయాకరణులు కేవలము స్వబుద్ధిచే కల్పించి శాస్త్రవ్యవహారమును నిర్వహించి యున్నారు. కావున ఇది దీని అర్థము, ఇది దీని అర్థము కాదు, అని అన్వయవ్యతిరేకములచే నిరూపించుటకై ప్రయత్నించుటగూడ కేవలము శాస్త్రీయమే. లోకమున, ఈ పదములో ఇంతవరకును ప్రకృత్యర్థము, ఇది ప్రత్యయార్థము అనెడు భేదజ్ఞానము లౌకికులకు లేదుకదా. కావుననే శాస్త్రకారులలోగూడ కొందరు ప్రాతిపదికమే స్వార్థద్రవ్యలింగసంఖ్యాకర్మాదులను బోధించును, విభక్తులు కేవలము సంఖ్యాకర్మత్వాది సూచకములే అనియు, మరికొందరు-ప్రాతి పదికము స్వార్థద్రవ్యలింగములను మాత్రమే బోధించును అనియు చెప్పుచున్నారు. దీనినిబట్టి ఈ ప్రకృతిప్రత్యయ విభాగము, అన్వయవ్యతిరేకములచే ప్రకృతి ప్రత్యయములకు విభిన్నార్థ కల్పనము, ఇది యంతయు శాస్త్రప్రక్రియకై కల్పితమైనదని కొందరి అభిప్రాయము. ఈ విధముగ ప్రకృతిప్రత్యయ విభాగము కేవలశాస్త్రకల్పిత మగుటచే ప్రకృతిప్రత్యయసము దాయమే సంఖ్యాదివిశిష్టార్థమును లేదా సంఖ్యాద్యుపలక్షితమగు అర్థమును బోధించును అను తృతీయ చతుర్థపక్షములు బయల్వెడలినవి.

ఈ రెండు శ్లోకముల సంపిండితార్థ మేమనగా- 'రామమ్' 'ఫలమ్' 'రాముని' 'ఫలమును' మొదలగు పదములలో 'రామ' 'ఫల' మొదలగు ప్రకృతిభాగములును, 'అమ్' 'ని' 'ను' మొదలగు ప్రత్యయభాగములును ఉన్నవి. ఈ ప్రత్యయభాగములు ఏకత్వాది సంఖ్యను, కర్మత్వ కరణత్వాదికమును బోధించుచున్నవి. కాని ఈ ప్రత్యయములు ప్రకృతి

యందు అంతకుపూర్వము లేని సంఖ్యాకర్మత్వాదులను బోధించుచున్నవా లేక ప్రకృత్యర్థ ములేమైన సంఖ్యాదులను బోధించుచున్నవా అనునది ప్రశ్న. ఈ రెండు పక్షములును ఉన్నవి. మొదటి పక్షమున ప్రకృతి బోధింపని సంఖ్యాదుల జ్ఞానము ప్రత్యయములచే కలుగుచున్నది గాన ప్రత్యయములు సంఖ్యాదిబోధకములు (వాచకములు) - అనగా అవి క్రొత్తగ సంఖ్యాదులను బోధించుచున్న వని చెప్పవలెను. ఇది వాచకత్వపక్షము. ప్రకృతి యందే సంఖ్యాదులు కూడ ఉన్నవి; వాటిని ప్రత్యయములు, చీకటిలో ఉన్న వస్తువులను దీపము స్పష్టీకరించినట్లు, స్పష్టీకరించుచున్నవి అనునది రెండవ పక్షము - ద్యోతకత్వ పక్షము. ప్రకృతి ప్రత్యయ విభాగము కేవల శాస్త్రకల్పితము గాన సముదాయమే (ప్రకృతి ప్రత్యయ సంఘాతమే) సంఖ్యాది విశిష్టము లేక సంఖ్యాద్యుపలక్షితము నగు అర్థమును బోధించును అని తృతీయ చతుర్థపక్షముల అభిప్రాయము.

విశిష్టత్వము, ఉపలక్షితత్వము :- కలిసి ఉన్న అన్ని వస్తువులకును తుల్యముగ క్రియాన్వయ మున్నచో అది విశిష్టత్వము. ఉదా: "లక్ష్మణునితోగూడిన రాముడు భుజించు చున్నాడు" అనునపుడు భోజనము చేయుట అనుక్రియతో రామ లక్ష్మణు లిరువురకును తుల్యముగ సంబంధమున్నది. కావున "లక్ష్మణునితో కూడిన రాముడు" అనగా "లక్ష్మణ విశిష్టుడగు రాముడు" అని యర్థము. ప్రకృతమున "సంఖ్యాది విశిష్టార్థము" అనగా "సంఖ్యాదులతో నిత్యసంబద్ధమగు అర్థము" అని ఫలితార్థము. "పీతవస్త్రముతో గూడిన రాముడు భుజించుచున్నాడు" అని చెప్పునపుడు పీతవస్త్రమునకు భోజనక్రియతో అన్వయము లేదు. కావున "పీతవస్త్రముతో గూడిన రాముడు" అనగా "పీతవస్త్రోపలక్షితుడగు రాముడు" అని యర్థము. ప్రకృతమున సంఖ్యాద్యుపలక్షితార్థ బోధన మనగా సంఖ్యాదులతో కాకగుణకంబలము వలె, అనిత్య సంబద్ధమగు అర్థమును బోధించుట యని యర్థము. విశిష్టత్వపక్షమున ప్రకృత్యర్థములకును సంఖ్యాదులకును ప్రాధాన్యము తుల్యము. ఉపలక్షి తత్వ పక్షమున సంఖ్యాదులకు అప్రాధాన్యము. కాకి కంఠమున గుర్తుకై కట్టిన రంగు గుడ్డ వంటివి ఈ సంఖ్యాదులు. గుడ్డ మారవచ్చును. గుడ్డ రంగు మారవచ్చును, కాకిమాత్రము అట్లే ఉండును. అట్లే సంఖ్యాదులు మారుచుండవచ్చును. ప్రాతిపదికార్థము మాత్రము అట్లే ఉండును. ఇదియే విశిష్టత్వోపలక్షితత్వ పక్షములలోని భేదము.

ఇది ప్రకృత్యర్థము, ఇది ప్రత్యయార్థము అని నిర్ణయించుట ఎట్లు ? అని ఆశంకించు కొని సమాధానము చెప్పుచున్నాడు.

> యే శబ్దా నిత్యసమ్బన్ధా వివేకే జ్ఞాతశక్తయః
> అన్వయవ్యతిరేకాభ్యాం తేషా మర్థో విభజ్యతే . 166

యే = ఏ, నిత్యసంబన్ధాః=స్వార్థముతో నిత్యసంబంధము గల, శబ్దాః=విభక్త్యన్త పదములు (వృక్షమ్ మొదలగునవి), వివేకే=ప్రకృతిప్రత్యయ విభాగము, ప్రకృత్యర్థ-ప్రత్యయార్థ విభాగము చేసినపుడు మాత్రమే, జ్ఞాతశక్తయః=స్వార్థమున జ్ఞాతమగు శక్తి కలవో, తేషాం=అట్టి శబ్దముల, అర్థః = అర్థము, అన్వయ వ్యతిరేకాభ్యాం=అన్వయ వ్యతిరేకములచే, విభజ్యతే=స్థాపింపబడుచున్నది.

తా. స్వార్థముతో నిత్యసంబంధముగల శబ్దముల శక్తి ప్రకృతి ప్రత్యయాది విభాగము చేసినపుడు మాత్రమే తెలియును. వాటి అర్థము అన్వయ వ్యతిరేకములచే విభజింపబడును.

వి. 'వృక్ష' అను ప్రాతిపదికమును మాత్రము ప్రయోగించగా ఏకత్వాదులు లేని కేవల వృక్షత్వరూపార్థము అవగతమగు చున్నది. 'అమ్' అను ప్రత్యయమును చేర్చి 'వృక్షమ్' అని ప్రయోగింపగా ఏకత్వకర్మత్వవిశిష్టవృక్షబోధ కలుగుచున్నది. ఈ విధముగ ఏది లేనపుడు ఏది బోధింపబడుటలేదో, ఏది యున్నపుడు ఏది బోధింపబడుచున్నదో అది దాని యర్థమని నిర్ణయించుటకు వీలగుచున్నది. ప్రకృతమున వృక్షత్వము 'వృక్ష' రూప ప్రకృత్యర్థ మనియు, సంఖ్యాకర్మత్వాదికము 'అమ్' రూప ప్రత్యయార్థ మనియు తెలిసికొనుటకు వీలగుచున్నది. ఈవిభాగము కాల్పనికమే కావచ్చును. బుద్ధికల్పితమగు వస్తుశూన్య వికల్పజ్ఞానమే కావచ్చును. బనను అర్థవిభాగమునకు ఇది సహాయకారిగనే కనబడుచున్నది.

'అది ఉన్నచో ఇదికూడ ఉండును' - "యత్సత్త్వే యత్సత్త్వమ్" - అని చెప్పినచో అన్వయము. "అది లేనిచో ఇదియు ఉండదు" - "యదభావే యదభావః" అని చెప్పినచో వ్యతిరేకము. "ధూమ మున్నచో అగ్ని ఉండి తీరును" అనునది అన్వయమునకుదాహరణము. "అగ్ని లేనిచో ధూమము ఉండజాలదు" అనునది వ్యతిరేకమునకు ఉదాహరణము. ఈ అన్వయవ్యతిరేకముల సహాయముచే దీని కిది కారణము అని నిర్ణయించుటకు వీలగును.

ప్రకృతి ప్రత్యయ సముదాయరూపమగు పదము వాస్తవమున అఖండమే యైనను, అన్వయవ్యతిరేకములచే ప్రకృతి ప్రత్యయార్థములు వేరువేరుగ వ్యవస్థాపితములగుచున్నవి అని వెనుక ప్రతిపాదించబడినది. కాని ఈ అన్వయవ్యతిరేకములు గూడ వ్యభిచారము లేనపుడు మాత్రమే ప్రకృతి ప్రత్యయార్థ విభాగమును కల్పింప సమర్థమగునని చెప్పుచున్నాడు.

యత్ర చావ్యభిచారేణ తయోః శక్యం ప్రకల్పనమ్
నియమ స్తత్ర న త్వేవం నియమో నుట్శబాదిషు . 167

యత్ర = ఎచట, అవ్యభిచారేణ = వ్యభిచారము లేకుండగా, తయోః = ఆ అన్వయ వ్యతిరేకముల, ప్రకల్పనమ్ = కల్పనము, శక్యం = శక్యమైనదో, తత్ర = అట్టి స్థలములయందు మాత్రమే, నియమః = ప్రకృతి ప్రత్యయార్థముల నియమము, తు = కాని నుట్శబాదిషు = నుడాగమము, శప్ మొదలగువాటి విషయమున, ఏవం = ఈ విధముగ, నియమః = నియమము, న = లేదు.

తా. వ్యభిచారము లేకుండగ ఎచట అన్వయవ్యతిరేకములను కల్పింపవీలగునో అచటనే నియమముగాని, 'నుట్' 'శప్' మొదలగువాటి విషయమున నియమము లేదు.

వి. ఈ అన్వయ వ్యతిరేకములు వ్యభిచారదోషము లేకుండ ఎచట ప్రవర్తించునో అట్టి స్థలములందు మాత్రము 'ఈ పదమునందలి ఈ భాగము ఈ అర్థమును బోధించును' అని నియమము ఏర్పరచుటకు వీలగును. ఉదాహరణమునకు : 'రామాణామ్' (రాములయొక్క) 'మరుతామ్' (దేవతలయొక్క) మొదలగు పదములలో 'ఆమ్' అను

భాగము సంఖ్యాసంబంధాదులను బోధించుచున్నది. అదిలేనిచో వాటి బోధ కలుగుటలేదు. కావున 'ఆమ్' సంఖ్యాసంబంధాది వాచకమని చెప్పవచ్చును. అట్లే 'అత్తి' (తినుచున్నాడు), 'పచతి' (వండుచున్నాడు) ఇత్యాద్యుదాహరణములందలి 'తి' అనునది కర్తృత్వైకత్వాదులను బోధించుచున్నదని అన్వయవ్యతిరేకముల సహాయముచే నిర్ణీత మగుచున్నది. కాని 'రామాణామ్' అను పదమున 'ఆమ్' కు 'నుట్' అను ఆగమము వచ్చినది. ("రామ + ఆమ్" అని యుండగా నుడాగమము- ఆకారము వెనుక నకారమువచ్చి, అది ణకారముగా మారి 'రామాణామ్' అను రూపము సిద్ధించినది). 'మరుతామ్' అనునపుడు నుడాగమము రాలేదు. ఆ నుడాగమము వచ్చిన 'రామాణామ్' అనునపుడు అర్థవిశేషమేదియో యుండి 'మరుతామ్' అనునపుడా యర్థవిశేషము లేకపోవుట యనునది లేదు. దీనిని బట్టి నుట్టుకు ప్రత్యేకముగ అర్థమేదియు లేదని స్పష్టమగుచున్నది. 'పచతి' అనునపుడు 'శవ్' (అ) ప్రత్యయమున్నది, ('పచ్ + తి' అని యుండగా 'శవ్' వచ్చి 'పచ్ + అ + తి' = 'పచతి' అను రూపము సిద్ధించినది), కాని 'అత్తి' అనునపుడు 'శవ్' లేదు. కావున పైవలెనే' శవ్' కు అర్థమేదియు లేదని తేలినది. ఈ 'నుట్' 'శవ్' లు కేవలము అర్థబోధనమున సహాయకారులుగ మాత్ర మున్నవి. 'నుట్' తో గూడిన 'ఆమ్' సంఖ్యాసంబంధాదులను బోధించుననియు, 'శవ్' తో గూడిన 'తి' కర్తృత్వాదిబోధక మనియు చెప్పినచో ఈ నియమమునకు 'మరుతామ్' 'అత్తి' ఇత్యాద్యుదాహరణములందు వ్యభిచారము గాన అట్లు చెప్పుటకు వీలులేదు. ఈ యుదాహరణములలో 'నుట్' 'శవ్' లు లేని 'ఆమ్' 'తి' లు గూడ తత్తదర్థములను బోధించుచున్నవి కదా? కావున ఇట్టి వ్యభిచారదోషము లేనిపక్షముననే ఈ యన్వయ వ్యతిరేకములద్వారా ప్రకృతి ప్రత్యయార్థకల్పనము చేయవలెను.

'వ్యభిచారము' అనునది న్యాయశాస్త్రమునం దుపయోగించెడు ఒక పారిభాషిక పదము. "ఎక్కడెక్కడ ధూమముండునో అక్కడక్కడ అగ్ని ఉండును" అని చెప్పినచో దీనికి వ్యాప్తి యని పేరు. ఇది అన్వయవ్యాప్తి. "ఎక్కడ అగ్ని ఉండదో అక్కడధూమము కూడ ఉండదు" అనునది కూడ వ్యాప్తియే. ఇది వ్యతిరేకవ్యాప్తి, మొదటి అన్వయవ్యాప్తిని తారుమారుచేసి "ఎక్కడెక్కడ అగ్ని ఉండునో అక్కడ ధూమముండును" అని చెప్పినచో అది నిర్దుష్టమైన వ్యాప్తి కాజాలదు. ఎఱ్ఱగా కాల్చిన అయోగోళముపై అగ్నిఉన్నను ధూమము లేదుకదా? ఈ విధముగా వ్యాప్తికాని, లేదా ఒక నియమముకాని ప్రవర్తింపకూడని, అనగా సాధ్యములేని కొన్ని లక్ష్యములలో ప్రవర్తించుటకు వ్యభిచారమని పేరు. ఇట్టి వ్యభిచారదోషము పట్టిన వ్యాప్తి వాస్తవమున వ్యాప్తి కాజాలదు. అట్లే "ఎక్కడ ధూమముండదో అక్కడ అగ్ని ఉండదు"అని చెప్పినచో ఈ వ్యతిరేకవ్యాప్తికి గూడ తప్తాయోగోళమునందే వ్యభిచారము. కావున ఈ వ్యతిరేకవ్యాప్తిగూడ దుష్టమైనది. ఈ విధముగనే, 'ఈ పదభాగమున కిది యర్థము' అని నిర్ణయించుటకు ఉపయోగించు అన్వయ వ్యతిరేకములు వ్యభిచారదోషదుష్టములు కారాదని ఈ కారిక తాత్పర్యము.

కొన్ని స్థలములలో ప్రకృతి ప్రత్యయములు వేరువేరు అర్థములను బోధించువట్లు స్పష్టముగ గోచరించును. అట్టి స్థలములలో ప్రకృతి ప్రత్యయములు ఆయాయర్థములను బోధించును అని అంగీకరింపవలెను. అంతియే కాని వాటిలో ఒకటి వాచకమనియు, రెండవది ఉపలక్షకమనియు చెప్పరాదు అని చెప్పుచున్నాడు.

సమ్భవే వాభిధానస్య లక్షణం తు న కల్ప్యతే
ఆపేక్షికో౽హి సంసర్గే నియతాః శబ్దశక్తయః . 168

వా = కాని, అభిధానస్య = (ప్రకృతి ప్రత్యయములు రెండును) భిన్నార్థములను బోధించుటకు, సంభవే = వీలు ఉన్నపుడు, లక్షణంతు = ఉపలక్షకత్వము (ద్యోతకత్వము), న కల్ప్యతే = కల్పింపబడదు.

తా. ప్రకృతి ప్రత్యయములు రెండును భిన్నార్థములను బోధించుటకు అవకాశమున్నపుడు అవి ద్యోతకములని కల్పించుట యుక్తముకాదు అని పూర్వార్ధతాత్పర్యము.

వి. 'కిమ్' శబ్దమును నపుంసకలింగ ప్రథమైక వచనమున 'కిమ్' అని ప్రత్యయరహితముగ ప్రయోగించుచున్నాము. అట్లే 'ఇదమ్' శబ్దమునకు 'వతుప్' ప్రత్యయము చేర్చగా ప్రకృతిభాగమంతయు లోపించి 'ఇయాన్' 'ఇయతీ' 'ఇయత్' ఇత్యాది విధముల ప్రత్యయము మాత్రమే ప్రయోగమునకు మిగిలినది. ఇట్టి స్థలములలో ప్రకృతి ప్రత్యయములే తత్తదర్థవాచకము లని అంగీకరింపవలెను. పదము ప్రకృత్యర్థమును మాత్రమే బోధించి ప్రత్యయార్థమును ఉపలక్షించుచున్నదని గాని, తద్విపరీతముగ గాని చెప్పరాదు.

కిమ్‌శబ్ద నపుంసక ప్రథమైకవచనమున 'కిమ్ + సు' అని యుండగా 'స్వమోర్నపుంసకాత్' (7-1-23) అను సూత్రముచే విభక్తిప్రత్యయము పూర్తిగ లోపించి 'కిమ్' అను ప్రకృతి మాత్రమే శేషించినది. 'ఇదమ్' శబ్దమునకు పరముగ "కిమిదంభ్యాం వో ఘః" (5-2-50) అను సూత్రముచే 'వతుప్' ప్రత్యయము, దాని వకారమునకు ఘకారమును వచ్చును. ఘకారమునకు 'ఆయనేయీ' (7-1-2) ఇత్యాదిసూత్రముచే 'ఇయ్' ఆదేశము. 'ఇదమ్ + ఇయత్' అని యుండగా "ఇదమ్ కిమో రీశ్కీ" (6-3-90) అను సూత్రముచే 'ఇదమ్'కు 'ఈ' ఆదేశము. 'ఈ + ఇయత్' అని యుండగా 'యస్యేతిచ' (6-4-148) అను సూత్రముచే 'ఈ' లోపించినది. ఈ విధముగ ప్రకృతిభాగమంతయు లోపించి, ప్రత్యయభాగమైన 'ఇయత్' మాత్రము శేషింప లింగత్రయమున 'ఇయాన్' 'ఇయతీ' 'ఇయత్' ఇత్యాదిరూపములు సిద్ధించును. ఈ విధముగ ప్రకృతియంతయు లోపించి ప్రత్యయము మాత్రము మిగిలిన 'ఇయత్' ఇత్యాద్యుదాహరణములను, అద్వైత జ్ఞానమును దృష్టిలో నుంచుకొని రచించిన శ్లోకమొకటి పండితలోకప్రసిద్ధము.

"ఉదితవతి పరస్మిన్ ప్రత్యయే శాస్త్రయోనౌ
గతవతి విలయం చ ప్రాకృతే౽పి ప్రపఞ్చే
సపది పరముదీతం కేవలః ప్రత్యయో యత్
తదిదమితి మిమీతే కో౽ధునా పండితో౽పి"

శబ్దశాస్త్రవిహితమగు (వతుప్)ప్రత్యయము పరముగ ఆవిర్భవించిన దగుచుండగా, ప్రకృతి సంబంధమగు ప్రపంచము కూడ విలయమును పొందినదగుచుండగా, అపుడు కేవల ప్రత్యయరూపమగు ఏ పదము ఆవిర్భవించినదో దానిని ఇది అని (ఇయత్ అని) పండితుడైనను ఇపుడు ఎవడు ఊహింపగలడు? ఇది వ్యాకరణశాస్త్రమునకు సంబంధించిన అర్థము. ఈ శ్లోకమున ఆ శబ్దమిది యనెడు ప్రశ్నయు, అది 'ఇయత్'అను పదము అనెడు ప్రత్యుత్తరముకూడ ఉన్నది. 'అధునా' అనునదికూడ ప్రత్యుత్తరము. 'ఇదమ్' శబ్దమునకు 'అధునా' (5-3-17)

అను సూత్రముచే 'అధునా' ప్రత్యయము. 'ఇదమ్+అధునా' అని యుండగా 'ఇదమ ఇశ్' (5.3.3) అను సూత్రముచే 'ఇదమ్'కు 'ఇశ్' అను నాదేశము. దానికి 'యస్యేతిచ' (6.4.148) అను సూత్రముచే లోపము. ఇక 'అధునా' అను ప్రత్యయభాగము మాత్రము మిగిలినది. ఈ విధముగ 'ఇయత్' 'అధునా' అనునవి ప్రత్యుత్తరము.

అద్వైతజ్ఞానపరమగు అర్థము: ఉపనిషజ్జన్య మగు అత్యుత్తమమైన అద్వైతజ్ఞానము జనించిన పిమ్మట ప్రకృతి విలాసరూపమగు ఈ జగము లీనము కాగా, కేవలము జ్ఞానరూపమగు - చిద్రూపమగు - ఏస్థితి లభించినదో దానిని ఈవిధముగ నుండునని ఎంతటి పండితుడైనను ఎవడు నిర్ణయింపగలడు ?

ఈ విధముగ పూర్వార్ధమున ప్రకృతి ప్రత్యయములు రెండును వేరు వేరు అర్థములను బోధించునపుడు అట్టి స్థలములలో ఆవిధముగనే అంగీకరింపవలెనని చెప్పియున్నాడు. ప్రకృతి ప్రత్యయము ఎట్లు స్వతంత్రార్థబోధన సమర్థములైన పక్షమున ఆ రెండును స్వస్వార్థములను బోధించు సందర్భములలో పరస్పరాపేక్షములుగ నుండుటకు కారణమేమి ? పరస్పరాపేక్ష లేకుండ ఘటపటాది శబ్దములవలె అర్థబోధ చేయవచ్చును గదా యని యాశంకించుకొని 'ఆపేక్షికో్యహి' ఇత్యాద్యుత్తరార్ధమున సమాధానము చెప్పుచున్నాడు.

హి = ఎందుచేతననగా, శబ్దశక్తయః = ప్రకృతి ప్రత్యయరూపములగు శబ్దముల శక్తులు, సంసర్గే = ప్రకృత్యర్థ ప్రత్యయార్థముల కలయికచే కలిగిన బోధయందు, ఆపేక్షిక్యః = పరస్పరాపేక్ష కలవైనను, నియతాః = తాము బోధించవలసిన (అన్వయ వ్యతిరేకములచే నిర్ణీతము లగు) అర్థముల విషయమునందు నియతముగనే యుండును.

తా. శబ్దశక్తులు సంసర్గజన్య బోధవిషయమున పరస్పరాపేక్ష కలవే యైనను తమ తమ అర్థములను మాత్రము నియతముగనే బోధించును.

వి. వెనుక చూపిన విధముగ ప్రకృతిప్రత్యయములు వేరు వేరు అర్థములను బోధించుచుండగా వానిలో ఒకటి వాచకమనియు, రెండవది ద్యోతకమనియు చెప్పుట తగదు. ఇది వాచకము, ఇది ద్యోతకము అని చెప్పుటకు వినిగమనము (నిర్ణాయక ప్రమాణము) ఏదియు లేదు కదా ? ద్యోతకత్వమును అంగీకరించు పక్షమున ప్రతి ఒక్కటియు ప్రతి యొక్క అర్థమునకును ద్యోతకమని చెప్పవచ్చును గదా ? అందుచే - ఏశబ్దమును ప్రయోగింపగా ఏ యర్థము బోధ కలుగుచున్నదో అది దాని కర్థమని నిర్ణయించుట యుక్తము. సాధారణముగ ప్రకృతి లేని ప్రత్యయమును గాని, ప్రత్యయము లేని ప్రకృతినిగాని ప్రయోగించుట కానరాకపోవచ్చును. తావన్మాత్రముచే ప్రకృతి ప్రత్యయములకు అవినాభావ సంబంధ మని మాత్రమే చెప్పగలము గాని, అన్వయవ్యతిరేకముల సహాయముచే వాటికి నిర్ణీతమైన స్వస్వార్థాభిధాన శక్తి లేదని కూడ చెప్పజాలము.

కొన్నిచోట్ల అన్వయ వ్యతిరేకములు చూపినను వాటికి వ్యభిచార ముండవచ్చును. అట్టి స్థలములలో పదముల అవయవములను విభజించి వాటికి వేరు వేరు అర్థములను నిర్ణయించుటకు ప్రయత్నింపరాదు. ఉదాహరణమునకు—'కూప' 'యూప' 'సూప' అను పదముల లోని 'ఊప' అనుదానిని విడదీసి దానికి ప్రత్యేకముగ ఒక అర్థమును, ककारాదులకు ఒక అర్థమును నిర్ణయించుటకు వలనుపడదు. ఇచట నున్న ककारాదుల కేదైన ఒక అర్థమున్నదని

నిర్ణయించినచో, అది 'కలశ' మొదలగు పదములలోని కకారమున గోచరించకపోవుటచే వ్యభిచారదోషము పట్టినది. కావున 'కూప' 'యూప' మొదలగు సముదాయములే అర్థవిశేషమును బోధించునని చెప్పవలెను గాని వాటిని విభజింపరాదని చెప్పుచున్నాడు.

న కూప సూప యూపానా మన్వయోఽర్థస్య దృశ్యతే
అతోఽర్థాన్తరవాచిత్వం సఙ్ఘాతస్యైవ కల్ప్యతే. 169

కూప సూప యూపానాం='కూప' 'సూప' 'యూప' శబ్దముల, అర్థస్య=అర్థముయొక్క, అన్వయః = సంబంధము, న దృశ్యతే = కకారాది వర్ణములయందు కనబడుట లేదు. (కలశాది పదములలోని కకారాదులందు వ్యభిచారము కదా ?) అతః=అట్టి అన్వయ వ్యభిచారము వలన, సంఘాతస్యైవ='కూప' 'సూప' మొదలగు సంఘాతమునకే, అర్థాన్తరవాచిత్వం=మరియొక అర్థమును బోధించు శక్తి (కూప శబ్దమునకు సూపశబ్దార్థముకంటె భిన్నమగు అర్థమును బోధించు శక్తి, సూపశబ్దమునకు కూపాది శబ్దార్థములకంటె భిన్నమగు అర్థమును బోధించు శక్తి), గమ్యతే=ఊహింపబడుచున్నది.

తా. కూప-సూప-యూప శబ్దముల అర్థముయొక్క సంబంధము కకారాదులలో కనబడుట లేదు. అందుచే మొత్తము పదమే అర్థవిశేషమును బోధించు నని అంగీకరింపవలెను.

వి. కూపశబ్దమునుండి కకారమును తొలగింపగా మిగిలిన 'ఊప' శబ్దము ఏ యర్థమును బోధించుట లేదు. అట్లే 'ఊప' శబ్దమును తీసివేయగా కకారము ఏయర్థమును బోధించుట లేదు. కావున వాటిని ఇట్లు విభజింపరాదు. 'కూప' అను సముదాయమే 'నుయ్యి' అను నర్థమును బోధించునని అంగీకరింపవలెను. సూపాదిశబ్దముల విషయమునగూడ నిట్లే.

పదమునందలి భాగములను విభజించి, అన్వయ వ్యతిరేకముల సహాయముచే వాటి యర్థమును నిర్ణయించునపుడు ఈ ప్రకృతి ప్రత్యయాన్వాఖ్యానమునకు తగు నిమిత్తమేదియో ఒకటి ఉండవలెనని చెప్పుచున్నాడు.

అన్వాఖ్యానాని భిద్యన్తే శబ్దవ్యుత్పత్తికర్మసు
బహూనాం సమ్భవేఽర్థానాం నిమిత్తం కిఞ్చి దిష్యతే. 170

శబ్దవ్యుత్పత్తికర్మసు=శబ్దములకు వ్యుత్పత్తిని తెలుపునపుడు, అన్వాఖ్యానాని = ప్రకృతి ప్రత్యయ విభాగమును, వాటి యర్థభేదములను కల్పించెడు అనుశాసనములు, భిద్యన్తే=(ఆయా వ్యాకరణ రచయితల బుద్ధిభేదము ననుసరించి) వేరువేరుగ ఉన్నవి. బహూనాం = అనేకములగు, అర్థానాం=అర్థములకు, సమ్భవే=అవకాశమున్నపుడు, కించిత్=ఏదియో ఒక, నిమిత్తమ్ = నిమిత్తము, ఇష్యతే=అంగీకరింపబడును.

తా. శబ్దముల వ్యుత్పత్తిని చూపు విషయమున శబ్దానుశాసనములు వేరువేరుగనున్నవి. అనేక అర్థములకు అవకాశ మున్నపుడు (నిర్వచనమునకై) ఏదియో యొకదానిని నిమిత్తముగ అంగీకరింతురు.

వి. వైయాకరణులు తమతమ బుద్ధిభేదము ననుసరించి ఒక పదమునకు వేరు వేరు వ్యుత్పత్తులు చెప్పుచుందురు. ఆ పదమునకు వారు చెప్పిన వ్యుత్పత్తులే కాక మరికొన్ని వ్యుత్పత్తులు కూడ చెప్పుటకు అవకాశ ముండవచ్చును. ఉదాహరణమునకు 'తణ్డుల' శబ్ద

వ్యుత్పత్తి చెప్పుచు "వృఞ్-లుటి-తని-తాడిభ్య ఉలచ్ తణ్డశ్చ" అను ఉణాదిసూత్రము 'వృఞ్ వరణే' 'లుత విలోడనే' 'తనువిస్తారే' 'తడ ఆఘాతే' అను ధాతువులకంటె 'ఉలచ్' ప్రత్యయమును, ధాతువునకు 'తణ్డ్' అను ఆదేశమును విధించినది. దీనిసిపట్టి "'వ్రియన్తే' 'లుత్య న్తే' 'తన్య న్తే' 'తాడ్య న్తే' ఇతివా తణ్డులాః" అనగా ఎల్లరిచేతను కోరబడునవి, లేదా అవలోడనము చేయబడునవి, లేదా విస్తరింపచేయబడునవి, లేదా దంచబడునవి కావున తండులములు అని వ్యుత్పత్తి చెప్పినట్లైనది. ఈ విధముగ ఒకధాతువు స్థానమున తణ్డ్ ఆదేశము విధించు పక్షమున, మూలధాతువు పూర్తిగ లోపించి 'తండ్' అనునది మాత్రమే మిగులును గాన 'వృఞ్' మొదలగు నాలుగు ధాతువులనే కాక మరియే 'భుజ్' ధాతువునో గూడ మూలధాతువుగ గ్రహింపవచ్చును. కావున ఇట్టి వ్యుత్పత్తులన్నియు పురుషబుద్ధిభేద కృతములు గాన వ్యవస్థితములు కావు. 'బియ్యము' అను నర్థముమాత్రము నియతము. ఈ విధముగ అనేకములగు అర్థములు సంభావ్యములగునపుడు శాస్త్రకారులు ఏవియో ఒకటిరెండు నిమిత్తములను పురస్కరించుకొని వ్యుత్పత్తి చెప్పుచుందురు. ఇట్లు వ్యుత్పత్తి చెప్పుటకు నియతమైనను అనియతమైనను ఏదియో యొక నిమిత్తము మాత్రము ఉండితీరును.

శబ్దముల సాధుత్వాన్వాఖ్యానమునకు నిమిత్తమేదియేని ఉన్న చాలును, అది నియతముగ నుండవలసిన పనిలేదు—అను విషయమునే వివరించి చెప్పుచున్నాడు.

> వైర వాసిష్ఠ గిరిశా స్తథైకాగారికాదయః
> కైశ్చిత్ కథఞ్చి దాఖ్యాతా నిమిత్తావధిసఙ్కరైః . 171

వైరవాసిష్ఠగిరిశాః = వైర, వాసిష్ఠ, గిరిశ శబ్దములు, తథా = మరియు, ఐకాగారికాదయః = ఐకాగారిక మొదలగు శబ్దములును, కైశ్చిత్ = కొందరు శాస్త్రకారులచేత, నిమిత్తావధిసఙ్కరైః = నిమిత్తములగు అర్థములయొక్కయు, అన్వాఖ్యానమునకు అవధిభూతములగు ప్రకృతిప్రత్యయముల యొక్కయు, సంకరములచేత (భిన్నమైనవి ఏకస్థానమున సమావేశమగుట సంకరము), కథఞ్చిత్ = ఎటులనో, ఆఖ్యాతాః = సాధువులుగ ప్రతిపాదింపబడినవి.

తా. 'వైర' 'వాసిష్ఠ' 'గిరిశ' శబ్దములను, 'ఐకాగారిక' మొదలగు శబ్దములను కొందరు, అర్థములయొక్కయు ప్రకృతి ప్రత్యయములయొక్కయు సంకరములచే, ఏదియో విధముగ సాధువులనుగ ప్రతిపాదించినారు.

వి. 'వైర' 'వాసిష్ఠ' మొదలగు పదములకు వైయాకరణులు వేరు వేరు వ్యుత్పత్తులను చూపియున్నారు. 'వైరం' అనుదానికి వీరునికర్మ (వీరస్యకర్మ) అనిగాని, వీరునకు లేక వీరవనితకు సంబంధించినది (వీరస్య వీరాయా వా ఇదమ్) అనిగాని, వీరులలో ఉన్నది (వీరేషు భవమ్) అనిగాని అర్థము చెప్పవచ్చును. అట్లే వాసిష్ఠశబ్దమునకు 'వసిష్ఠునిచే చూడబడినది' లేక 'వసిష్ఠునిచే చెప్పబడినది', లేదా 'వసిష్ఠ శబ్దముకలది' అని అర్థమును చెప్పవచ్చును(వసిష్ఠేన దృష్టం వా, ప్రోక్తం వా, వసిష్ఠశబ్దోఽస్మిన్ వర్తతే ఇతి వా వాసిష్ఠమ్). 'గిరిశః' అనుదానికి 'గిరియందు శయనించువాడు' (గిరౌ శేతే) అనిగాని, గిరిని ఖండించువాడు (గిరిం శ్యతి) అనిగాని, 'గిరియందు శిరస్సుకలవాడు' (గిరౌ శిరః యస్య సః) అనిగాని చెప్పవచ్చును. 'ఐకాగారికః' అను దానికి ఒక గృహమును మాత్రము సహించువాడు (ఏకా

గారం సోధా) అనిగాని, విడిగా ఒక్కటిగా ఉన్న ఇంటివలన లాభము పొందు చోరుడు (ఏకం అసహాయం అగారం ప్రయోజనం యస్య) అనిగాని చెప్పవచ్చును. ఈ విధముగ పై ఉదాహరణములలో అర్థమునకు అనియమము గోచరించుచున్నది.

'తప్పర్వమరుద్భ్యామ్' అను వార్తికముచే 'పర్వ' 'మరుత్' శబ్దములకంటె 'తప్' ప్రత్యయమును విధించుటచే 'పర్వతః' 'మరుత్తః' అనురూపములు సిద్ధించినవి. కాని మరుత్ శబ్దమునకు "మరుచ్ఛబ్ద స్యోపసంఖ్యానమ్" అను వార్తికముచే ఉపసర్గసంజ్ఞ నంగీకరించి, "మరుతా దత్తః" అను నర్థమున "మరుత్ + దా + త" (క్త ప్రత్యయము) అని యుండగా ఈ దాధాతువు ఆకారమునకు "అచ ఉపసర్గా త్తః" అను సూత్రముచే తకారమును చేసి "మరుత్తః" అను రూపమును సాధించవచ్చునని "దదాతివృత్తంవా" ఇత్యాది భాష్యవార్తికములు ప్రతిపాదించుచున్నవి. ఈ విధముగ "మరుత్తః" అను పదమున 'తప్పర్వమరుద్భ్యామ్' అను వార్తికము ననుసరించి "త" అనునది ప్రత్యయమనియు, "మరుత్" అనునది ప్రకృతియనియు, పైనచూపిన విధమున తత్వము నంగీకరించిన పక్షమున ఈ తకారము "దా" ధాతు "క్త" ప్రత్యయములకు చెందినదనియు రెండు విధముల చెప్ప వీలగుచున్నది. ఇట్లు నిమిత్తభూతము లగుచుండుటచే నియతములగు నిమిత్తములేవియు లేకుండ వైయాకరణులు అన్వాఖ్యానములు చెప్పచుందురని యభిప్రాయము.

వ్యుత్పత్తి చెప్పునపుడు ఏదైన నియతమగు నిమిత్తమునే ఏల గ్రహింపరాదు అని శంకించుకొని, ప్రకృతి ప్రత్యయాపోద్ధారరూపములగు నిమిత్తములు అనియతములు గాన వ్యుత్పత్తి నిమిత్తములుగూడ అనియతములుగనే ఉండునని చెప్పుచున్నాడు.

యథా పథః సమాఖ్యానం వృక్షవల్మీకపర్వతైః
అవిరుద్ధం గవాదీనాం భిన్నైశ్చ సహచారిభిః . 172

వృక్షవల్మీకపర్వతైః = వృక్షములచేతను, వల్మీకములచేతను, పర్వతములచేతను, పథః = మార్గముయొక్క, అన్వాఖ్యానం = బోధనము, యథా = ఎట్లో, (తథా = అట్లే), భిన్నైః = వేరువేరైన, సహకారిభిః స్వార్థసంబద్ధములగు గుణక్రియాకారాదులచే, గవాదీనాం = "గో" మొదలైనవాటి యొక్క (నిర్వచనము), అవిరుద్ధమ్ = విరుద్ధము కాదు.

తా. చెట్టులు, పుట్టలు, గుట్టలు మొదలగువాటి గుర్తుచే దారి చూపించునట్లు, వేరు వేరు గుణక్రియాదుల సహాయముచే గోశబ్దాదుల వ్యుత్పత్తిని చూపుట అవిరుద్ధము.

వి. ఎవరికైన ఏదైన మార్గమును తెలుపవలసి వచ్చినపుడు ఆ మార్గమునకు దగ్గరనున్న చెట్టును గాని, పుట్టను గాని, గుట్టనుకాని గుర్తుగా చూపవచ్చును. అవియన్నియు ఆ మార్గమునకు సంబంధించినవే కావున వీటిలో దేనిని చెప్పినను తప్పులేదు. మార్గమును తెలియజెప్పుట ప్రధానము గాని వృక్షాదిచిహ్నములు ప్రధానములు కావు. అట్లే 'గో' మొదలగు శబ్దముల వ్యుత్పత్తిని చెప్పవలసి వచ్చినపుడు గోశబ్దార్థమగు ఆవుకు సంబంధించిన జాతి క్రియా గుణ అవయవాది నిరూపణమును ఇచ్ఛానుసారముగ చేయవచ్చును.

ఒక అర్థమునకు వివిధములగు అవస్థాభేదము లుండవచ్చును. వ్యుత్పత్తి చెప్పువాడు తన దృష్టికి గోచరించిన అవస్థాభేదము ననుసరించి వ్యుత్పత్తి చెప్పుచుండునని వివరించుచున్నాడు.

అన్యథా చ సమాఖ్యాన మవస్థాభేదదర్శిభిః
క్రియతే కింశుకాదీనా మేకదేశావధారణాత్ . 173

అవస్థాభేదదర్శిభిః=ఒక పదార్థమునకు గల వేరు వేరు అవస్థలను పరికించిన వ్యుత్పత్తికారులచేత, అనగా - తాము చూచిన అవస్థాభేదము ననుసరించి వేరు వేరుగా, సమాఖ్యానం = పదసాధుత్వ నిర్వచనము, క్రియతే = చేయబడుచున్నది, ఏకదేశావధారణాత్=వాక్యములోని ఒక భాగమును విడదీసి, కింశుకాదీనాం='కింశుక' మొదలగు శబ్దముల (నిర్వచనము చూపబడుచున్నది).

తా. పదార్థముల వేరు వేరు అవస్థలను చూచినవారు వేరు వేరు నిర్వచనములు చేయుచుందురు. వాక్యమునందలి ఒక విభాగమును విడదీసి కింశుకాది శబ్దముల వ్యుత్పత్తిని చూపించుచున్నారు.

వి. అన్వాఖ్యానము చేయువారు ఒకపదార్థమునందలి, తమదృష్టికి గోచరించిన ఒక అవస్థాభేదమును పురస్కరించుకొని పదనిర్వచనము చేయుచుందురు. ఉదాహరణముకు : కింశుక శబ్దమునకు 'మోదుగ చెట్టు' అని యర్థము. దానికా యర్థమువచ్చుటకు కారణ మేమనగా- ఫలములు లేని మోదుగచెట్టుపై చిలుకలు వాలకుండుటచూచి "కింశుకేన ఫలాశే" (పలాశవృక్షముపై శుకమెందులకుండును?) అని గాని 'కింశుకో న పలాశే?' (పలాశముపై శుక మేల లేదు?)అని గాని ఒకడు ప్రశ్నింపగా, ఆతడు ప్రయోగించిన పై వాక్యములోని కింశుక పదమును వేరుగ దీసి దీనినే పలాశరూపార్థ ప్రయోగకారణమగు వ్యుత్పత్తినిగా ఒకరు చూపవచ్చును. ఈ విధముగ ఒక వస్తువునకు ఎన్నియో అవస్థాభేదములుండ తమ దృష్టికి గోచరించిన విశేషమును బట్టి వైయాకరణులు వ్యుత్పత్తి చెప్పుచుందురు. కొంతకాలమునకు ఈ వ్యుత్పత్తి కేవలము ఉపలక్షణము మాత్రమై నిలుచును. కావుననే"కింశుకే శుకః శేతే" (కింశుక వృక్షముపై శుకము నిద్రించుచున్నది) అను వాక్యమున కింశుక పదవ్యుత్పత్తి మరుగుపడి ఆ పదము పలాశత్వమాత్రవాచక మగుచున్నది.

ఈ విషయమునే ఇంకను స్పష్టీకరించుచున్నాడు.

కైశ్చి న్నిర్వచనం భిన్నం గిరతే ర్గర్జతే ర్గమేః
గవతే ర్గదతే ర్వాపి గౌరిత్య త్రానుదర్శితమ్ . 174

కైశ్చిత్=కొందరు వైయాకరణులచేత, గౌరిత్యత్ర='గౌః' అను శబ్దమున, గిరతేః = 'గౄ' నిగిరణే (మింగుట) అను ధాతువునుండి, గర్జతేః = 'గర్జ శబ్దే' (గర్జించుట) అను ధాతువునుండి, గమేః=' గమ్లృగతౌ'(నడచుట) అను ధాతువునుండి, గవతేః='గుఙ్ అవ్యక్తే శబ్దే' (అస్పష్టధ్వని చేయుట) అను ధాతువునుండి, వాపి=లేక, గదతేః='గద వ్యక్తాయాం వాచి' (స్పష్టముగ పలుకుట) అను ధాతువునుండి, భిన్నం=వేరైన, నిర్వచనమ్=నిర్వచనము, అనుదర్శితమ్=చూపబడినది.

తా. కొందరు, 'గో' శబ్దము గౄధాతువునుండి గాని, గర్జధాతువునుండి గాని, గమ్లృధాతువునుండి గాని, గుఙ్ధాతువునుండి గాని, గద ధాతువునుండి గాని నిష్పన్నమైనదని చూపియున్నారు.

వి. గోరూపార్థమునకు వివిధములగు అవస్థలుండుటచే వాటిలో ఒకదాని ననుస రించి, ధాతువులోనున్న వర్ణములతో సామ్యమునుకూడ పురస్కరించుకొని, గో మొదలగు శబ్దములకు అనేకులు అనేకవిధములగు వ్యుత్పత్తులు చెప్పుచున్నారని యభిప్రాయము.

ఇంతవరకును, ఏదైన ఒక పదమునకు నిర్వచనము చెప్పునపుడు దాని ప్రకృతిచే వాచ్యమగు అర్థమునే నిమిత్తముగ తీసికొనవలెను అని ప్రతిపాదించి, ఇందులకుదాహరణముగ 'గో' శబ్దమును చూపి, దాని వివిధ ప్రకృత్యర్థములు ఏవిధముగ వివిధ వ్యుత్పత్తులకు దారి తీసినవో చూపియున్నాడు. ఇపుడు, శబ్దముల స్వరూపమే వాటి ప్రవృత్తి నిమిత్తమనియు (అవి ఏదైన అర్థమును బోధించుటకు నిమిత్తమనియు), అదియే వ్యుత్పత్తి ప్రదర్శనమునకై (అన్వాఖ్యానమునకై) గ్రహింపబడుననియు చెప్పుచున్నాడు.

గౌరిత్యేవ స్వరూపా ద్వా గోశబ్దో గోషు వర్తతే

వ్యుత్పాద్యతే నవా సర్వం కైశ్చిచ్చో భయ థేష్యతే . 175

గోశబ్దః = గోశబ్దము, గౌరిత్యేవ = అది గో శబ్దము అనెడు కారణముచేత మాత్రమే (అనగా గో శబ్దస్వరూపమును మాత్రమే ప్రవృత్తి నిమిత్తముగ తీసికొని), గోషు= గోవులు అను అర్థమునందు, ప్రవర్తతే = ప్రవర్తించుచున్నది, (గోరూపార్థమును బోధించు చున్నది. కావున) సర్వమ్=ఏ ఒక్క పదముకూడ, న వ్యుత్పాద్యతే = వ్యుత్పత్తికలదిగా చూపబడదు, కైశ్చిత్=కొందరు వైయాకరణుల చేత, ఉభయథా = రెండు విధములుగా కూడ ఇష్యతే = అంగీకరింపబడుచున్నది.

తా. గోశబ్దము గోశబ్దము కావున గోవు అను అర్థమును బోధించుచున్నది. కావున ఏ పదమునకునుగూడ వ్యుత్పత్తి చూపవలసిన పని లేదు. కొందరు రెండు విధములుగ కూడ అంగీకరింతురు.

వి. ఔక్థిక్యుడు మొదలగు కొందరు ప్రాచీనాచార్యులు గోశబ్దము గోవు అను నర్థమును ఎట్లు బోధించుచున్నది అని ఆశంకించుకొని అది గోశబ్దము గాన గోవు అను నర్థ మునను బోధంచుచున్నది అని సమాధానము చెప్పియున్నారు. అనగా గోశబ్దము సహజముగ గోరూపార్థమును బోధించును. దీనికి నిమిత్తాంతర విచారము అనావశ్యకము. ఇది గోశబ్ద మగుటయే (గోశబ్ద స్వరూపమే) అందులకు నిమిత్తము అని వారి అభిప్రాయము. ఈ విధ ముగ ఏ పదమైనను ఒక యర్థమును బోధించుచున్నదనిన అందులకా పదస్వరూపమే నిమిత్తము. ఈ పదము ఈ విధముగ నిష్పన్నమైనది గాన ఈ యర్థమును బోధించు చున్నది అని వ్యుత్పత్తి చెప్పుటకై ప్రయత్నించుట అనావశ్యకము. దీనిని అవ్యుత్పత్తి పక్ష మందురు. మరికొందరు - ఒక పదము ఒక అర్థమును బోధించుచున్నదనగా అందులకు ఆ శబ్దస్వరూపము, దాని వాచ్యము, రెండును నిమిత్తములే. కావున శబ్దమునకు వ్యుత్పత్తి చూపుటకై ప్రయత్నించుటలో తప్పులేదు అని చెప్పుదురు. ఈ విధముగ పక్షద్వయము నందును గూడ అన్వాఖ్యానమునకు నిమిత్తమున్నది. మొదటి (అవ్యుత్పత్తి) పక్షమున శబ్ద స్వరూపమే నిమిత్తము; రెండవ పక్షమున శబ్దస్వరూపము, వాచ్యము అను రెండును నిమిత్తములు.

ఇపుడొక క్రొత్త విషయమును విచారించుచున్నారు. ఒకే పదమును అనేక పర్యాయములు ఉచ్చరించినపుడు అది ప్రతి పర్యాయమునందును వేరు వేరు శబ్దమా లేక ఆ శబ్దము లన్నియు ఒక్కటియేనా? అవి యన్నియు వేరువేరు శబ్దము లన్నచో 'గరలం' 'గమనం' 'గజః' ఇత్యాదిస్థలములందలి గకారములన్నియు భిన్నవర్ణములైనట్లు ప్రతిఒక్క ఉచ్చారణము నందును 'గో' శబ్దముకూడ భిన్న మగుటచేతను, అట్టి గో శబ్దములు అనంత సంఖ్యాకములగుట చేతను వాటి అన్నిటికిని అన్వాఖ్యానము అశక్యముకదా అని ఆశంకించుకొని సమాధానము చెప్పుచున్నాడు.

సామాన్యే నోపదేశశ్చ శాస్త్రే లఘ్వర్థ మాశ్రితః
జాత్యన్తరవదస్యాపి విశేషాః ప్రతిపాదకాః. 176

శాస్త్రేచ = శాస్త్రమునందైతే, లఘ్వర్థమ్ = ఒక్కొక్క ఉచ్చారణమునందు వేరువేరుగా కనబడుచున్న అనంతశబ్దములకు లఘువుగా అన్వాఖ్యానము చెప్పుటకొరకు, సామాన్యేన = అగ్నిశబ్దాదులలోనున్న అగ్నిశబ్దత్వాది సామాన్యమును (జాతిని) పురస్కరించుకొని, ఉపదేశః = అగ్న్యాది శబ్దోపదేశము, ఆశ్రితః = ఆశ్రయింపబడినది, విశేషాః = అగ్నిశబ్దము మొదలగు వ్యక్తివిశేషములు, జాత్యన్తరవత్ = ఘటత్వాదీతర జాతులకువలె, అస్యాపి = అగ్నిశబ్దత్వాది జాతికికూడ, ప్రతిపాదకాః = బోధకములు.

తా. శాస్త్రములందు లాఘవార్థమై జాతిని పురస్కరించుకొని ఉపదేశము చేయుచుందురు. అగ్నిశబ్దము మొదలగు విశేషములు ఇతరజాతులనువలె అగ్నిశబ్దత్వాది జాతులనుగూడ బోధించును.

వి. "అశ్వః శీఘ్రగామీ" ఇత్యాది వాక్యములందలి 'అశ్వః' శబ్దము ఏదియో ఒక్క అశ్వమును మాత్రమునే కాక అశ్వత్వజాతిని చెప్పును, కాని అశ్వత్వజాతికి శీఘ్రగామిత్వము కుదరదుగాన చివరకు "అశ్వత్వజాతి విశిష్టము శీఘ్రముగ నడచును" అనునర్థము పర్యవసన్న మగును. ఇట్లు చెప్పుటచే శీఘ్రగామిత్వ మనునది ఏదియో ఒక అశ్వముతోడనే కాక అశ్వత్వజాతిగల అన్ని అశ్వములతోడను సంబంధించును. అట్లే 'అగ్నే ర్ఢక్'(4-2-33)ఇత్యాది సూత్రములచే అగ్నిశబ్దముకంటె 'ఢక్' ప్రత్యయము విధింపబడినది. ఇచట 'అగ్ని' శబ్దము ఒక పర్యాయ ముచ్చరించిన ఏదేనొక అగ్నిశబ్దమును మాత్రమేకాక అగ్నిశబ్దత్వజాతి విశిష్టములగు అగ్నిశబ్దము లన్నింటిని బోధించును. ఈ విధముగ శాస్త్రకారులు ప్రత్యుచ్చారణము భిన్నములగు శబ్దములన్నింటిని చెప్పశక్యముకాదు గాన లాఘవార్థమై సామాన్యము (జాతి) ద్వారా శబ్దోపదేశము చేయుచుందురు. ఈ విధముగ ఒక అశ్వవ్యక్తి అశ్వత్వజాతికి సూచకమైన విధమున అగ్ని శబ్దము మొదలగు విశేషములు అనగా వ్యక్తివిశేషములు, అగ్ని శబ్దత్వాది జాతులను సూచించును.

ఇట్లే 'గో' శబ్దమునకు 'గచ్ఛతి ఇతి గౌః' అను నొక వ్యుత్పత్తి చెప్పుదురు. ఇచట 'గచ్ఛతి' అనునది ఏదియేనొక గమనవిశేషమును కాక గతిసామాన్యమునే బోధించుచున్నది. ఈ గతిసామాన్యము మహిష్యాదులలో కూడ ఉన్నదికదా యని శంకింపరాదు. ఇచట గతి సామాన్యమునే అంగీకరించినను, ఒకవిధమగు వైశిష్ట్యముతోగూడిన గమనమునే గ్రహింప వలెను. ఉదాహరణమునకు 'స్యన్దతే' 'స్రవతి' 'ప్లవతే' ఇత్యాదులలో గతిసామాన్యమున్నను

ఒక విశేషముగూడ నిగూఢముగ లేకపోలేము. అందుచేతనే 'స్రవతి' 'స్యన్దతే' ఇత్యాదులు జలాది గమనార్థమునంచే ప్రయుక్తము లగుచున్నవి. అట్లే గోవునకు సంబంధించిన గమన సామాన్యమునందు గూడ ఒక వైశిష్ట్యమును అంగీకరింప వచ్చును. కావున ప్రత్యుచ్చారణము పదములు భిన్నములైనను అభిన్నములైనను గూడ అన్వాఖ్యానమునకు విఘాత మేదియు ఉండదని కారిక పరమతాత్పర్యము.

వాస్తవమున 'అర్థభేదమును బట్టి శబ్దముకూడ భేదించును' అను న్యాయము ననుసరించి గతివిశేషరూపమగు అర్థాంతరమున ప్రయుక్తమగు గోశబ్దమునందలి 'గమ్' ధాతువు గమన సామాన్యమున ప్రయుక్తములగు 'గచ్ఛతి' ఇత్యాదులలోని 'గమ్' ధాతువుకంటె భిన్నమైనది. ఉదాహరణమునకు—కర్తరిప్రయోగమున 'తణ్డులం పచతి' (తండులమును వండుచున్నాడు) అని ప్రయోగింపగా కర్మకర్తరిప్రయోగమున 'పచ్యతే తండులేన' (బియ్యము ఉడుకుచున్నవి) అని ప్రయోగింపఁబడుచున్నది. ఇచట రెండు వాక్యములందును ఉన్నది పచ్ ధాతువేయైనను అర్థభేదముచే ఆ రెండును వేరు వేరని చెప్పుచున్నారు కదా? పై ఉదాహరణములలోని 'గమ్'ధాతువు విషయమునందును అట్లే అని చెప్పుచున్నాడు.

అర్థాన్తరే చ యద్వృత్తం తత్ప్రకృత్యన్తరం విదుః
తుల్యరూపం న తద్ రూఢా వన్యస్మిన్ననుషజ్యతే . 177

యత్ = ఏది, అర్థాన్తరే = అర్థవిశేషమునందు, వృత్తం = వృత్తిగలదో, తత్ = దానిని, ప్రకృత్యన్తరం = మరియొక ప్రకృతినిగా, విదుః = తెలియుచున్నారు. (యత్ = ఏ 'గమ్' ధాత్వాదిరూపము) అన్యస్మిన్ = గచ్ఛతీత్యాదులందు, అనుషజ్యతే = సంబంధించియున్నదో, తత్ = అది, రూఢౌ = రూఢార్థమగు గవాదిశబ్దమునందు, న = లేదు, తత్ = అది, తుల్యరూపమ్ = సమానమైన రూపము గలదిమాత్రమే.

తా. అర్థభేదమును బోధించునది భిన్నమగు ప్రకృతియే యని చెప్పుదురు. మరియొక పదమునందున్న ప్రకృతి రూఢపదమున లేదు. అది కేవలము సమానరూపము గలది.

వి. గవాదిశబ్దములలో నున్న రూఢి విషయములగు (అనగా 'గోవు' మొదలగు రూఢార్థములను బోధించు) గమ్యాదులకును, 'గచ్ఛతి' ఇత్యాదులలోనున్న రూఢివిషయములు కాని గమ్యాదులకును కొంచెము రూపసామ్యమున్నను అర్థభేద మధికముగ నుండుటచే ఆ రెండును వేరువేరని చెప్పుదురు.

ఈవిధముగ వేరువేరు అర్థములను బోధించునవి వేరువేరు ప్రకృతులని యంగీకరింపవలెనని చెప్పి కొన్ని యెడల అర్థభేదము లేకున్నను (అర్థైకత్వమున్నను), విభిన్న ప్రకృతులే యని అంగీకరింపవలెనని చెప్పుచున్నాడు.

భిన్నా విజియజీ ధాతూ నియతౌ విషయాన్తరే
కైశ్చిత్ కథంచిదుద్దిష్టౌ చిత్రం హి ప్రతిపాదనమ్ . 178

విషయాన్తరే = భిన్నవిషయమునందు (కిత్ ప్రత్యయము పరమగునపుడు 'ఇజ్' అనియు, తదితరస్థలములందు 'యజ్' అనియు), నియతౌ = నియతములైనవియు, (అందుచే) భిన్నౌ = పరస్పర భిన్నములగు, ఇజియజీ ధాతూ = 'ఇజ్' 'యజ్' ధాతువులు, కైశ్చిత్ = కొందరు లాక్షణికులచే, కథంచిత్ = వేరువేరు విధములుగ, ఉద్దిష్టౌ = ప్రతిపా

దింప బడినవి, ప్రతిపాదనం = ప్రతిపాదనముచేసెడు విధానము, చిత్రం హి = విచిత్ర మైనదికదా ?

తా. విషయాంతరములందు భిన్నములగు ఇఙ్, యఙ్ ధాతువులను కొందరు మరి యొక విధముగ ప్రతిపాదించి యున్నారు. ప్రతిపాదనము విచిత్రముగ నుండునుకదా ?

వి. 'ఇఙ్' 'యఙ్' ధాతువులు సమానార్థకము లైనను అత్యంతభిన్నము లైనవి. ఏలనన 'ఇఙ్' ధాతువు కిత్తులగు ప్రత్యయములు పరమగునపుడు మాత్రమే ప్రయుక్త మగును. 'యఙ్' ధాతువు తద్భిన్న స్థలములందు ప్రయోగింపబడును. ఐనను కొందరు వైయాకరణులు వీటికి పరస్పరభేదము నాశ్రయించియు, మరికొందరు అభేదము నాశ్రయించియు—అనగా రెండును వేరువేరు ధాతువులనియు ఈ రెండును ఒకేధాతువనియు, ప్రతిపాదించి యున్నారు. ఉదాహరణమునకు పాణిని 'యఙ్' ధాతువును అంగీకరించి "వచి స్వపి యజాదీనాం కితి" (6-1-15) అను సూత్రముచే 'కిత్' ప్రత్యయములు పరమగునపుడు యకారమునకు సంప్రసారణము (ఇకారము) వచ్చి 'ఇఙ్' అగునని చెప్పియున్నాడు. కొందరు 'ఇఙ్'ను మూలధాతువుగా స్వీకరించి దానికి అకిత్ ప్రత్యయములు పరమగునపుడు యకారాదేశము వచ్చి 'యఙ్' అగునని చెప్పియున్నారు. లక్ష్యప్రధానులగు ఈ వైయాకరణుల లక్షణవిధానము విచిత్రముగా నుండునుగదా ?

శబ్దస్వరూప సామ్యమున్నను, రూఢములగు గవాదిశబ్దములందలి 'గమ్' ధాతువు, 'గచ్ఛతి' 'గన్తా' ఇత్యాది పదములలోని 'గమ్' ధాతువును పరస్పర భిన్నము లని వెనుక ప్రతిపాదింపబడి యున్నది, అట్లే 'ఇఙ్' 'యఙ్' మొదలగువాటికి అర్థసామ్యమున్నను, శాస్త్రకారులు గూడ ఆ విధముగనే అంగీకరించి యున్నను, ఈ రెండును పరస్పర భిన్నములే యని ఈ కారిక చెప్పుచున్నది.

'స్తః' 'సన్తి' ఇత్యాదులలో 'స' అనునదిమాత్రమే ధాతువు. ఇది 'అస్తి' ఇత్యాదులలోని 'అస్' ధాతువుకంటె భిన్నమైనదే గాని 'అస్' అనునది 'స' గా మారుట, అనునది వాస్తవము కాదు. ఒక పదమునందు ఈ భాగము ధాతువు, ఈ భాగము ప్రత్యయము అనెడు కల్పనము వ్యావహారికమే గాని పారమార్థికము కాదు. వాస్తవమున ప్రతి యొక్క పదమును అఖండమే, ధాతు వనునది కేవలము శాస్త్రకల్పితమే కాని వాస్తవము కాదు. కావుననే 'అస్' ధాతువని పాణిన్యాదు లంగీకరించినది వాస్తవమున 'స్' ధాతువే యనియు, దానికి విషయవిశేషమునందు (పిత్ ప్రత్యయములు పరమగునపుడు) అకారాగమము వచ్చుననియు కొందరు చెప్పిరి. నిరుక్తకారుడు "నిగచ్ఛన్తి" అనుచోట "నిగమ్" అను స్వతంత్రధాతువు నొకదాని నంగీకరించినాడు. "బ్రూఞ్" ధాతువునకు లట్టులోని మొదటి ఐదు రూపములందును ఆహాదేశము వచ్చునని ("బ్రువః పంచానామాదిత ఆహో బ్రువః" 3-4-84) పాణిని అంగీకరింప, మరికొందరు "ఆహ్" అను స్వతంత్రధాతు వొకటి ఉన్నదనియు, దానికి లట్టులో ఐదు రూపములుమాత్రమే ఉండుననియు అంగీకరించినారు.

లాక్షణికులు ఒకవస్తువునకు గల అవస్థాభేదము నాధారముగ గొని కూడ తద్వాచక శబ్ద ప్రతిపాదనము (వ్యుత్పాదనము) చేయుదురని చెప్పుచున్నాడు.

ఏవం చ వాలవాయాది జిత్వరీవ దుపాచరేత్
భేదాభేదాభ్యుపగమే న విరోధోఽస్తి కశ్చన . 179

ఏవం చ = అర్థైక్యమున్నను, భిన్నప్రకృతిత్వ మంగీకరించిన పక్షమున, వాలవాయాది = "వాలవాయ" "విశ్రవణ" "రవణ" మొదలగు పదములను, జిత్వరీవత్ = "జిత్వరీ" పదమునువలె, ఉపాచరేత్ = వ్యవహరించవలెను. భేదాభేదాభ్యుపగమే = భేదము నంగీకరించినను అభేదము నంగీకరించినను, విరోధః = విరోధము, కశ్చన = ఏదియు, నాస్తి = లేదు.

తా. ఈ విధముగ "వాలవాయ" మొదలగు శబ్దములను 'జిత్వరీ' శబ్దమును వలె వ్యవహరించవలెను. భేదాభేదపక్షములలో దేని నంగీకరించినను విరోధ మేదియును లేదు.

వి. ఒక రత్నవిశేషము విదూరమునుండి పుట్టుచున్నది. ఈ అవస్థా భేదమునాధారముగ తీసికొని పాణిని "విదూరా జ్ఞ్యః" (4-3-84) అను సూత్రముచే 'విదూరాత్ ప్రభవతి' అను నర్థమున విదూరశబ్దముకంటె 'ఞ్య' ప్రత్యయమును విధించి 'వైదూర్యః' అను రూపమును సాధించినాడు. కాని విదూర మనునది ఒక నగరము. అచట వైదూర్యములు పుట్టుట లేదు. వాలవాయ మనెడు పర్వతమున పుట్టిన వాటిని విదూరనగరమున సానబట్టుచుండెడివారు. కావున 'ఞ్య' ప్రత్యయము వచ్చు సందర్భమున "వాలవాయ" శబ్దమునకు 'విదూర' అను నాదేశము వచ్చునని గాని, లేదా వారణాసికి కేవలము వర్తకులకు మాత్రమే తెలిసిన 'జిత్వరీ' అను నామాంతరమున్నట్లు, వాలవాయమునకు ఇతరజనాప్రసిద్ధమగు 'విదూర' అను నామాంతర మున్నదని గాని అంగీకరింపవలెను. ఈ విధముగ "విదూర" అనునది "వాలవాయ" శబ్దమునకు ఆదేశముగ వచ్చినదని[1] అంగీకరించి అభేదపక్షమును (వాలవాయ

[1] ఒక శబ్దము స్థానమున దానితో ఏ మాత్రమును సంబంధములేని కొన్ని యాదేశములను చెప్పు పాణిన్యాదుల పద్ధతి భాషావికాసరీతికి విరుద్ధముగ నున్నదని కొందరి ఆక్షేపణకు ఇచట కొంతవరకును సమాధానము లభించుచున్నది. పాణిన్యాదులు బహుళప్రచారములో లేని కొన్ని స్వతంత్రపదములను ఆదేశముగ చూపుచున్నారు. ఉదాహరణమునకు—'జాయాచ పతిశ్చ' అనునపుడు 'జాయా'శబ్దమునకు వికల్పముగ 'దమ్' ఆదేశము వచ్చునని వైయాకరణులు చెప్పుదురు. కాని అచట 'దమ్' అనునది దానితో సామ్యముగల 'దమ్యా'వంటి పదముకు ('దమ్య' శబ్దము ఇంటిలో నుండునది అను నర్థమున ఋగ్వేదములో నున్నది.) అవశేషము కావచ్చును. ఆ పదమిపుడు భార్యార్థమున ప్రయుక్తము కాక కేవలము 'దంపతీ' ఇత్యాది రూపములలో శేషించి యుండునని ఊహించవచ్చును. అనగా అత్యంత భిన్నములుగ కన్పడు ఆదేశములన్నియు పూర్వమొకప్పుడు స్వతంత్రపదములుగ ఆ యా యర్థములందు ప్రయుక్తములయ్యెడివనియు, కాలాంతరమున వాటి ప్రయోగము కొన్ని స్థలములందే సీమితమైనదనియు చెప్పవలెను. ఇట్లు కొన్ని అంశములలో ప్రయోగములందు లేక కొన్ని యంశములందు మాత్రము ప్రయోగములలో నున్న పదములెన్నియో మనకిపుడు గోచరించును. 'గచ్ఛతి' అనునర్థమున 'శవతి' అని ఇపుడెవ్వరును ప్రయోగింపరు—కాని గమనార్థకశవధాతువునుండి నిష్పన్నమగు 'శవ' శబ్దము మాత్రము బహుళ ప్రయోగములో నున్నది. కాలాంతరమున 'శవ'ధాతువొకటి యున్నదని పూర్తిగ మరచినపుడు ఎవరైనను కొన్ని పరిస్థితులలో 'గమ్' ధాతువునకు 'శవ్' ఆదేశము వచ్చును అని చెప్పవచ్చును. ఇట్టి నియమము 'శవ' అను స్వతంత్రశబ్దమొకటి ఉండెడిదని మనము గ్రహించుటకు సహాయపడును. విదూర శబ్దాదుల విషయమున భిన్నశబ్దత్వాభిన్నశబ్దత్వరూపమగు మతభేదమును ప్రతిపాదించు పై కారిక ఈ విషయమును స్పష్టముగ సూచించుచున్నది.

విదూర శబ్దములకు) ఆశ్రయించినను, విదూర అనునది ప్రకృత్యంతర మని గ్రహించి భేద పక్షము నాశ్రయించినను దోషమేమియు లేదు. ఇట్లే "రావణ" "వైశ్రవణ" శబ్దములు 'విశ్రవసః అపత్యం పుమాన్' అను నర్థమున విశ్రవస్ శబ్దమునకు రవణ, విశ్రవణ ఆదేశములు వచ్చుటచే నిష్పన్నమైనవని కొందరును రవణ, విశ్రవణ అను స్వతంత్ర శబ్దముల నుండియే నిష్పన్నమైనవని ('శివాదిభ్యోఽణ్' 4-1-112 అను సూత్రముచే అణ్ చేయగా) కొందరును చెప్పుచున్నారు. ఈ భేదాభేదపక్షములు రెండును యుక్తములే.

ఈవిధముగ అర్థభేదాదులను బట్టి శబ్దభేదము నంగీకరింపవలెనని తెలినది. కావున 'గమ్' ధాతువు వేరు 'ఆగమ్' ధాతువు వేరు, ఆ రెండును వేరువేరు అర్థములను బోధించుచున్నవికదా ? ఐనను అడాగమ-ఆడాగమ-ద్విర్వచనాదుల వ్యవస్థకొరకై కొన్ని శబ్దభాగములు ఉపసర్గములనియు, మిగిలినవి ధాతువులనియు చెప్పుచుందురు. వాస్తమున ఉపసర్గముతో కూడిన దానికే ధాతుసంజ్ఞ యని చెప్పుచున్నాడు.

అడాదీనాం వ్యవస్థార్థం పృథక్త్వేవ ప్రకల్పనమ్
ధాతూపసర్గయోః శాస్త్రే ధాతు రేవ తు తాదృశః. 180

తథాహి సంగ్రామయతేః సోపసర్గా ద్విధిః స్మృతః
క్రియావిశేషాః సంఘాతైః ప్రక్రమ్యన్తే తథావిధాః. 181

శాస్త్రే = శాస్త్రమునందు, ధాతూపసర్గయోః = ధాతువులకును, 'ప్ర' 'పరా' మొదలగు ఉపసర్గములకును, పృథక్త్వేన = వేరుగా, ప్రకల్పనం = కల్పనము, అడాదీనాం = అడాగమ - ఆడాగమ-ద్విత్వాదుల, వ్యవస్థార్థమ్ = వ్యవస్థకొరకే, తు = కాని, తాదృశ ఏవ = ఆ ఉపసర్గముతో కూడిన మొత్తము సముదాయమే, ధాతుః = ధాతువు.

తథాహి = అది యుక్తమేకదా, సోపసర్గాత్ = 'సమ్' అను ఉపసర్గముతోగూడిన, సంగ్రామయతేః = సంగ్రామ ధాతువుకంటె, విధిః = అడాగమాడాగమాదివిధి, స్మృతః = చెప్పబడినది, తథావిధాః = అట్టి, క్రియావిశేషాః = యుద్ధాది క్రియావిశేషములు, సంఘాతైః = ధాతూపసర్గ సంఘాతములచేత, ప్రక్రమ్యన్తే = ఆ క్రమములో నున్నయెడలనే బోధింపబడుచున్నవి.

తా. అడాగమాదుల వ్యవస్థకొరకై శాస్త్రమునందు ధాతూపసర్గలను వేరువేరుగ చెప్పుచుందురు. కాని ఉపసర్గతో కూడినదే ధాతువు.

కావుననే సోపసర్గమగు 'సంగ్రామ' ధాతువుకంటె అడాగమాదులు విధింపబడినవి. సంఘాతములు అక్రమములో నున్నయెడలనే, అట్టి క్రియావిశేషమును బోధించును.

వి. 'భూ' అనుదాని అర్థము వేరు 'అనుభూ' అనుదాని అర్థము వేరు. కావున రెండును భిన్నధాతువులు. అయినను కొన్ని ప్రయోజనముల నుద్దేశించి వైయాకరణులు 'అను' మొదలగునవి ఉపసర్గము లనియు, 'భూ' అనునది ధాతు వనియు చెప్పియున్నారు.

లజ్-లుజ్-లృజ్జులలో హలాది ధాతువునకు 'అ' (ట్) అను ఆగమము, అజాది ధాతువునకు 'ఆ' (ట్) అను ఆగమము విధింపబడినవి. 'భూ' అనునది ధాతువు అని అంగీకరించుటచే దానికి అడాగమము వచ్చి అను + అభవత్ = అన్వభవత్ అను రూపము సిద్ధించినది. ఉపసర్గసహితమగు 'అనుభూ' అనునదియే ధాతువని చెప్పినచో దానికి ప్రారంభ

మున అడాగమము వచ్చి "అ + అనుభవత్ = అనుభవత్" అను అనిష్టరూపము సిద్ధించెడిది. ఇట్లే యఙంతాదులలో భూధాతువునకే ద్విత్వమువచ్చి అనుబోభూయతే మొదలగు ఇష్టరూపములు సిద్ధించును. 'అనుభూ' అనునదియే ధాతువగుచో 'భూ' అనుదానికి ద్విర్వచనము రాక అనిష్టరూప మేదియో సిద్ధించి యుండెడిది. ఈ విధముగ ప్రక్రియా సౌలభ్యము కొరకై శాస్త్రకారులు ఉపసర్గ ధాతువిభాగమును చేసిరి. కాని వాస్తవమున సోపసర్గ నిరుపసర్గములు భిన్న భిన్నధాతువులే. కావుననే అడాగమద్విర్వచనాదులు సోపసర్గమునకే వచ్చుట ఇష్టమైన స్థలములలో సోపసర్గమునే ధాతువుగ అంగీకరించి యున్నారు. ఉదాహరణమునకు 'సంగ్రామ' అనుదానిలోని సమ్ అనునది ఉపసర్గము. ఐనను సమ్ కు పూర్వము అడాగమము వచ్చుటయు, 'సమ్' కు ద్విర్వచనాదులు వచ్చుటయు ఇష్ట మగుటచే సోపసర్గమగు 'సంగ్రామ' అనుదానినే ధాతువుగ అంగీకరించినారు. దానికి లఙాదులందు అడాగమము వచ్చి 'అసంగ్రామయత' ఇత్యాదిరూపములును, సన్నంతాది రూపములలో 'సిసంగ్రామయిషతే' ఇత్యాది రూపములును సిద్ధించినవి. 'సమ్' ఉపసర్గము అన్నచో 'సమగ్రామయత' ఇత్యాద్యనిష్టరూపములు సిద్ధించెడివి. ఈ విధముగ ప్రక్రియాసౌకర్యమునకై కొన్ని విషయముల నంగీకరించినను అర్థభేదాదులను బట్టి శబ్దభేదము నంగీకరింపవలె ననునది పరమార్థము.

ధాతూపసర్గ సంఘాతమే విశిష్టార్థబోధకమని యంగీకరించుటకు ప్రయోజనాంతరమును చెప్పుచున్నాడు.

కార్యాణా మన్తరఙ్గత్వ మేవం ధాతూపసర్గయోః
సాధనై ర్యాతి సమ్బన్ధం తథాభూతైవ సా క్రియా . 182

ఏవం=ఈవిధముగ ధాతూపసర్గముల సంఘాతము విశిష్ట క్రియాబోధకము గాన ధాతూపసర్గయోః = ధాతూపసర్గలకు సంబంధించిన, కార్యాణామ్ = కార్యములకు, అన్తరఙ్గత్వం=అంతరంగత్వము (అంగీకరింపబడినది), తథాభూతైవ=ధాతూపసర్గ సముదాయవాచ్య మగుచునే, సా క్రియా=ఆ విశిష్టక్రియ, సాధనైః = కర్మకరణాది కారకములతో, సమ్బన్ధం = సంబంధమును, యాతి=పొందును.

తా. కావుననే ధాతూపసర్గములకు సంబంధించిన కార్యము అంతరంగము అట్టి క్రియయే సాధనములతో సంబంధించుచున్నది.

వి. ధాతూపసర్గములు రెండును కలిసి ఒక సంఘాతముగ ఏర్పడి ఒక విశిష్టార్థమును బోధించుచున్నవి గావుననే వాటి నడుమ రావలసిన సంధ్యాదికార్యము అంతరంగము. కావున ఇతరకార్యములకంటె ముందుగ ఆకార్యమే వచ్చును. అనగా ధాతూపసర్గములు పూర్తిగ ఒకదానితో నొకటి కలసి, ఒక్క సంఘాతముగ నేర్పడిన పిదప విశిష్టార్థమును బోధించును. ఉపసర్గముకంటె భిన్నమగు ధాతువునకు ప్రత్యేకార్థబోధకత్వశక్తి ఏదియు ఉండదు. కావుననే 'అనుభూయతే' (అనుభవింపబడుచున్నది) అనునపుడు కర్మణి లకారము వచ్చుటకు వీలయినది. 'అను' పూర్వకమగు భూధాతువు ('అనుభూ' అనునది) సకర్మకము గాని 'భూ' అనునది అకర్మకమే కదా? ఈ విధముగ ఉపసర్గసంబంధమును బట్టి క్రియా విశేషబోధకము లగు 'అనుభూ' మొదలగు ధాతువులు పిమ్మట 'సుఖం' 'దుఃఖం' ఇత్యాది కారకములతోడను, కర్మవాచక లకారాదులతోడను సంబంధించును. 'గౌర' శబ్ద

'ఖర' శబ్దములు భిన్న భిన్నార్థములైనను 'గౌరఖర' శబ్దము "అడవి గాడిద" అనెడు విశిష్టార్థమును బోధించును. అట్టి విశిష్టార్థమునకే కర్మకారకత్వాదికము లభించును. అట్లే 'అనుభూ' ఇత్యాదుల విషయమున గూడ తెలియవలెను.

వ్యాకరణకార్యములలో కొన్ని అంతరంగము లనియు, కొన్ని బహిరంగము లనియు చెప్పుదురు. అంతర్నిమిత్తమును బట్టి వచ్చు కార్యము అంతరంగము, బాహ్యనిమిత్తమును బట్టి వచ్చు కార్యము బహిరంగము. ఉదాహరణమునకు - 'ఇణ్' ధాతువు తప్పక 'అధి' పూర్వకముగ నుండును. దీనికి 'క్త్వా' ప్రత్యయము చేర్చినపుడు "అధి + ఇ + త్వా" అని యుండగా 'త్వా' కు 'ల్యప్' చేయగా "అధి + ఇ + య" అని యున్నది. ఇపుడు 'అధి' లోని ఇకారమునకు పరమగు ఇకారముతో ముందుగ సవర్ణదీర్ఘము చేయవలయునా, లేక 'ఇ' ధాతువునకు చెందిన ఇకారమునకు 'హ్రస్వస్య పితికృతి తుక్' (6-1-71) అను సూత్రముచే తుక్ ('త్') ఆగమము చేయవలయునా అని సంశయము. ఉపసర్గధాతువులు రెండును కలిసి ఒక ధాతువుగ నేర్పడి విశిష్టార్థమును బోధింపనున్నవి గాన వాటి సంబంధము పైన చూపిన విధముగ చాల ప్రధానము. అందుచే వాటి కార్యము అంతరంగము. కావున 'అధి + ఇ' అనువాటికి సవర్ణదీర్ఘముచేసి 'అధీ' అని ముందుగ రూపము సిద్ధింపచేయవలెను. ఇపుడు అధీ + య అని యుండగా ఈకారము హ్రస్వముకాదు గాన పైన చూపిన సూత్రముచే తుగాగమమురాదు. తుగాగమము వచ్చినగాని 'అధీత్య' అను అభీష్టరూపము సిద్ధించదు. కావున సూత్రకారుడు 'షత్వతుకోరసిద్ధః' (6-1-86)అని ప్రత్యేకముగ ఒక సూత్రము రచించి తుగాగమము చేయివలసియున్నపుడు సవర్ణదీర్ఘరూపమగు ఏకాదేశము అసిద్ధమని చెప్పినాడు. అనగా దీర్ఘము వచ్చినను రానట్లే భావించి (హ్రస్వ మున్నదని భావించి) తుగాగమము చేయవనెనని యర్థము. ఇపుడు 'అధీత్య' అనురూపము సిద్ధించును. ధాతూపసర్గల కార్యము అంతరంగము కావుననే ఈ విధముగ ఈసూత్రము చెప్పవలసి వచ్చినది. కాకున్నచో అధి + ఇ + య అని యుండగా ముందుగా తుగాగమముచేసి, పిమ్మట అధి + ఇ అనుదానికి దీర్ఘము చేసిన పక్షమున ఈ సూత్రము ఆవశ్యకమై యుండెడిది కాదు. ఈ సూత్రనిర్మాణమును బట్టి కూడ ధాతూపసర్గముల కార్యము అంతరంగ మనియు, అందుకు కారణము ఆ రెండును కలిపి ఒక సంఘాతముగ నేర్పడి విశిష్టార్థమును చెప్పుటయే యనియు తేలినది.

కారకముతో సంబంధించుటకు పూర్వమే ధాతువు ఉపసర్గముతో సంబంధించును అను పక్షమును వెనుకటి కారికలో ప్రతిపాదించి, ఇపుడు ధాతువు మొదట కారకములతో సంబంధించి అటుపిమ్మటనే ఉపసర్గముతో సంబంధించునను పక్షాంతరమును చెప్పుచున్నాడు.

ప్రయోగార్హేషు సిద్ధఃసన్ భేత్తవ్యోఽర్థో విశిష్యతే
ప్రాక్ చ సాధనసమ్బన్ధాత్ క్రియా నైవోపజాయతే. 188

ప్రయోగార్హేషు = ధాతువులు కారకసంబధమును పొంది ప్రయోగార్హతను పొంది యుండగా, సిద్ధః సన్ = సిద్ధరూపమై, భేత్తవ్యః = ఇతర వ్యావర్త్యమైన, అర్థః = అర్థము, విశిష్యతే = ఉపసర్గలచే విశేషింపబడుచున్నది. సాధనసమ్బన్ధాత్ ప్రాక్ = కారకాన్వయము కంటె పూర్వము, క్రియా = క్రియ, నైవోపజాయతే = పుట్టనే పుట్టదు కదా ?

తా. ధాతువులు ప్రయోగార్హములై యుండగా, సిద్ధరూపమై ఇతరవ్యావర్త్యమైన అర్థమును (ఉపసర్గములు) విశేషించును. కారకసంబంధము కంటె పూర్వము క్రియ పుట్టనే పుట్టదు గదా!

వి. 'ఛిద్' మొదలగు ధాతువులు ఛేదించుట మొదలగు క్రియలను బోధించును. కాని 'అసినా' (కత్తితో) 'వృక్షః' మొదలగు కరణకర్మాది కారకములతో, కర్తృకర్మాద్యర్థక తిఙాదులద్వారా సంబంధ మేర్పడిన గాని ఛిద్ ధాతువాచ్యక్రియ నిష్పన్నము కాదు. కావున క్రియ పూర్తిగ నిష్పన్నము కావలెనన్నచో ముందుగ కారక (సాధన) సంబంధము ఏర్పడ వలెను. ఈ విధముగ క్రియ నిష్పన్నమైన తరువాత ఆ క్రియ యందలి విశేషమును బోధించు ఇతర క్రియలనుండి దానిని వ్యావర్తింపచేయుటకు విశేషణ సంబంధ మేర్పడును. అట్టి విశేష ణము ఉపసర్గము; క్రియ విశేష్యము కావున కారకములతో మొదట సంబంధించి నిష్పన్నమగు క్రియను బోధించు శక్తి లభించిన పిమ్మటనే ధాతువు విశేషణమగు ఉపసర్గములతో సంబంధించును. విశేష్యమే సిద్ధము కాని యెడల దానికి విశేషణ సంబంధ మెట్లు లభించును? ఇది "పూర్వం ధాతు రుపసర్గేణ యుజ్యతే, పశ్చా త్సాధనేన" అను పూర్వకారికోక్త పక్షము నకు విరుద్ధమగు "పూర్వం ధాతుః సాధనేన (కారకేణ) యుజ్యతే, పశ్చా దుపసర్గేణ" అను పక్షాంతరము.

ఇప్పుడు "పూర్వం ధాతు రుపసర్గేణ యుజ్యతే" ఇత్యాది పక్షమును సమర్థించు చున్నాడు.

ధాతోః సాధనయోగస్య భావినః ప్రక్రమా ద్యథా
ధాతుత్వం కర్మభావశ్చ తథాన్యదపి దృశ్యతామ్ . 184

భావినః = రాబోవు, సాధనయోగస్య=కారక సంబంధము యొక్క, ప్రక్రమాత్ = ఉపక్రమమునందే అనుసంధానము వలన, ధాతోః = ధాతువునకు, యథా = ఏ విధముగ, ధాతుత్వం= ధాతుసంజ్ఞయు, కర్మభావశ్చ = కర్మత్వమును అంగీకరింపబడుచున్నవో, తథా = అట్లు, అన్యదపి= సాధన సంబంధమునకు పూర్వము ఉపసర్గసంబంధవశముచేత విశిష్టక్రియావాచిత్వము కూడ, దృశ్యతామ్ = చూడబడుగాక.

తా. రాబోవు సాధన సంబంధమును ప్రారంభముననే అనుసంధించుటచే ధాతు వునకు ధాతుత్వ కర్మత్వములను అంగీకరించినట్లు ఇతరమైనది గూడ అంగీకరింపబడుగాక.

వి. భాష్యకారులు "క్రియను బోధించునది ధాతువు" (క్రియావచనో ధాతుః) అని ధాతువును నిర్వచించియున్నారు. సాధనసంబంధము కలుగక పూర్వము క్రియ నిష్ప న్నము కాదు. కాన 'భూ' 'అద్' మొదలగునవి (ఆ అవస్థలో) క్రియా వచనములు కాకున్నను రాబోవు కారకసంబంధమును ముందుగనే బుద్ధియందు అనుసంధానము చేసికొని వాటికి ధాతుసంజ్ఞను అంగీకరించియున్నారు. "పఠితుం ఇచ్ఛతి పిపఠిషతి" ఇత్యాదులందు "ధాతోః కర్మణః సమానకర్తృకా దిచ్ఛాయాం వా"(3.1.7)అను సూత్రముచే 'పఠ్' మొదలగు ధాతువులు ఇచ్ఛాకర్మకము లగునపుడు (పఠనమును ఇచ్ఛించుచున్నాడు గాన) 'సన్' ప్రత్యయము విధింపబడినది. ఇచట ధాతువునకు ఇచ్ఛాకర్మత్వము మొదట లేకున్నను భావియందు సంభవింపనున్నది గాన, దానిని అట్టి ఉపక్రమమునందే ఉన్నట్లుగ భావింప

బడినది. అట్లే భావిసాధన సంబంధమును మనస్సులో నుంచుకొని మొదటనే ధాతువునకు ఉపసర్గసంబంధమును చేయుటచే అది విశిష్టక్రియావాచి యగునని అంగీకరింపవచ్చును. కావున "పూర్వం ధాతు రుపసర్గేణ యుజ్యతే" అను పక్షము నిర్దుష్టమని యభిప్రాయము.

సాధన సంబంధ మేర్పడుటకు పూర్వమే ధాతూపసర్గములకు సంబంధమేర్పడి ఒక విశిష్టక్రియ అవ్యక్తరూపమున ప్రతీయమానమగును. సాధన సంబధమేర్పడిన పిదప ఆ విశిష్ట క్రియకుస్ఫుటప్రతీతి లభించును అను విషయమును దృష్టాంతపూర్వకముగనిరూపించుచున్నాడు.

బీజకాలేషు సమ్బద్ధా యథా లాక్షారసాదయః
వర్ణాదిపరిణామేన ఫలానా ముపకుర్వతే. 185

బుద్ధిస్థా దభిసమ్బన్ధా త్తథా ధాతూపసర్గయోః
అభ్యన్తరీకృతో భేదః పదకాలే ప్రకాశతే. 186

బీజకాలేషు = బీజవాపకాలమునందు, సమ్బద్ధాః = బీజములతో కలిసిన, లాక్షారసాదయః = లాక్షారసము మొదలగునవి, వర్ణాదిపరిణామేన = తమ వర్ణాదులతో సమానము లగు వర్ణాదుల పరిణామము ద్వారా, యథా = ఏ విధముగా, ఫలానాం = ఫలములకు, ఉపకుర్వతే = ఉపకరించునో, తథా = అట్లు, బుద్ధిస్థాత్ = బుద్ధియందున్న, ధాతూపసర్గయోః = ధాతూపసర్గముల యొక్క, అభిసమ్బన్ధాత్ = సంబంధము వలన, అభ్యన్తరీకృతః = అంతర్లీన మగుటచే అస్పష్టముగ ప్రతీయమానమగు, భేదః = క్రియావిశేషము, పదకాలే = ధాతువునకు సాధనసంబంధము కలిగిన పిమ్మట పదనిష్పత్తి కాలమునందు, ప్రకాశతే = స్పష్టముగ తెలియును.

తా. విత్తులు నాటిన కాలమున వాటిపై పూసిన లాక్షారసాదులు స్వగతవర్ణాది పరిణామముచే ఫలాదులకు ఉపకరించునట్లు బుద్ధిస్థమగు ధాతూపసర్గముల సంబంధముచే అంతర్లీనమై యున్న క్రియా విశేషము పదనిష్పత్తికాలమున స్పష్టముగ తెలియును.

వి. కొన్ని వృక్షముల విత్తనములను మొలవేయునపుడు, మున్ముందు ఆ విత్తములనుండి రాబోవు ఫలముల వర్ణరసాదికము బాగుండుటకై లాక్షారసాదులను పూసి విత్తనములకు సంస్కారము చేయుదురు. ఈ విధముగ బీజములకు కలిగిన లాక్షారసాది సంబంధముచే భావికాలమున వృక్షము ఫలింపబోవు ఫలములకు మంచి రంగు, రుచి మొద లగునవి కలుగుటద్వారా ఉపకారము కలుగుచున్నది. అట్లే బుద్ధికృతమగు సంబంధముచే కలిసిన ధాతూపసర్గములు, మొదట అంతర్లీనమై అనుద్బుద్ధముగ నున్న క్రియావిశేషమును (ధాతువునకు) సాధనసంబంధము (కర్తృకర్మాద్యర్థక తిబాది సంబంధము) కలిగి పదత్వము నిష్పన్న మైన పిమ్మట, స్పష్టముగ ప్రకాశింపచేయును.

వాస్తవమున ధాతూపసర్గసముదాయమే ధాతువగుటచే ధాతూపసర్గముల సంబంధము ఆడాది కార్యార్థమై బుద్ధికల్పితము గాన "బుద్ధిస్థా దభిసమ్బన్ధాత్" అని చెప్పియున్నాడు. లాక్షారసాది సంబంధమును పొందిన బీజములలో అనుద్బుద్ధముగ నున్న విశిష్ట వర్ణ రసాదులను కాలాంతర సంబంధము ఆవిష్కరించినట్లు, ధాతూపసర్గ సముదాయమునందు సహజ ముగ నున్న అనుద్బుద్ధమగు క్రియావిశేషబోధకత్వశక్తిని సాధనసంబంధము అభివ్యక్తీక రించుచున్నది. దానియందా శక్తి సహజముగ లేకున్నచో ఎన్ని సాధనములతో సంబంధ

మేర్పడినను క్రొత్తగ ఆవిర్భవింపదు కదా। కావున "పూర్వం ధాతు రుపసర్గేణ యుజ్యతే" అనునదియే సిద్ధాంతమని తాత్పర్యము.

"నామాఖ్యాతోపసర్గనిపాతాశ్చేతి చత్వారి పదజాతాని" (నామములు, ఆఖ్యాతములు, ఉపసర్గములు, నిపాతములు అని పదములు నాలుగువిధములు) అని నిరుక్తకారుడు చెప్పియున్నాడు. ఇంతవరకును నామాఖ్యాతముల స్వరూపము నిరూపింపబడినది. ఇపుడు ఉపసర్గల స్వరూపమును నిరూపించుచున్నాడు.

క్వచి త్సమ్భవినో భేదాః కేవలై రనిదర్శితాః
ఉపసర్గేణ సమ్బన్ధే వ్యజ్యన్తే ప్రపరాదినా. 187

క్వచిత్ = (పచ్ ధాతువు మొదలగు) కొన్నిటియందు, కేవలైః = ఉపసర్గ రహితములైన వాటిచే, అనిదర్శితాః = స్పష్టముగ బోధింపబడని, సంభవినః = సంభావ్యములగు (బోధింప వీలయిన), భేదాః = ప్రకృష్టపాకము మొదలగు విశిష్టార్థములు, ప్రపరాదినా = 'ప్ర' 'పరా' మొదలగు, ఉపసర్గేణ = ఉపసర్గముతో, సమ్బన్ధే = సంబంధ మేర్పడగా, వ్యజ్యన్తే = అభివ్యక్త మగుచున్నవి.

తా. కొన్ని యెడల కేవల ధాతువులచే చూపబడనివియు, సంభావ్యములును అగు భేదములు 'ప్ర' 'పరా' మొదలగు ఉపసర్గములతో సంబంధము కలుగగనే వ్యంజిత మగుచున్నవి.

వి. 'పచతి' అనుదానికి 'ప్రకృష్టమగు పాకము చేయుచున్నాడు' అను నర్థము కూడ చెప్పవచ్చును. ఐనను 'ప్ర' అను ఉపసర్గమును చేర్చినగాని ఆ యర్థము స్పష్టముగ గోచరించుట లేదు. 'ప్ర' 'పరా' మొదలగు ఉపసర్గములతో సంబంధమేర్పడుటచే 'ప్రపచతి' ఇత్యాదులలో ఆ అర్థవిశేషము స్పష్టముగ స్ఫురించుచున్నది. కావున ఉపసర్గములు ధాతువులలో నున్న అర్థవిశేషమునే స్పష్టీకరించుచున్నవి గాని క్రొత్త అర్థమును బోధింపకుండుటచే ఇవి అర్థవిశేషద్యోతకములే కాని అర్థవిశేషవాచకములు కావు.

పై కారికనుబట్టి ఉపసర్గములకు కేవలము ద్యోతకత్వమే యున్నదా లేక వాచకత్వాదులు కూడ అంగీకార్యములా యని ఆశంకించుకొని పక్షాంతరములను చెప్పుచున్నాడు.

స వాచకో విశేషాణాం సంభవా ద్ద్యోతకోఽపి వా
శక్త్యాధానాయ ధాతో ర్వా సహకారీ ప్రయుజ్యతే. 188

సః = ఆ ఉపసర్గము, విశేషాణామ్ = క్రియలోనున్న విశేషములకు, వాచకః = వాచకము (కావచ్చును), వా = లేక, సమ్భవాత్ = ధాతువునకే విశిష్టక్రియా బోధకత్వశక్తి సంభావ్యము గాన, ద్యోతకః = సూచకము కావచ్చును, వా = లేక, ధాతోః = ధాతువునకు, శక్త్యాధానాయ = విశిష్టక్రియా బోధకత్వ శక్తిని కలిగించుటకు, సహకారీ = సహకారిగా (సహాయ పడునదిగా), ప్రయుజ్యతే = ప్రయోగింప బడుచున్నది.

తా. ఆ ఉపసర్గమే ధాతుగత విశేష వాచకము కావచ్చును. లేదా, ధాతువునకే (వాచకత్వము) సంభావ్యము గాన ద్యోతకము కావచ్చును. లేదా, ధాతువునకు శక్తిని కల్పించుటకై అది సహకారిగ ప్రయోగింపబడవచ్చును.

వి. 'స్థా' ధాతువునకు గతినివృత్తి (నిలబడుట) అని యర్థము. కాని దానికి 'ప్ర' అను ఉపసర్గమును చేర్చుటచే అది ప్రయాణముచేయుట (గమనము) అను నర్థమును బోధించు చున్నది. కావున ఇచట 'ప్ర' అనునది ధాత్వర్థమగు స్థితికి విరుద్ధమగు గమనరూపార్థమును బోధించుచున్నది గాన ఉపసర్గములు వాచకము లని కూడ అంగీకరింపవలెను. ఉపసర్గములు ద్యోతకములను విషయము పూర్వకారికయందు స్పష్టీకరింపబడినది. ఇట్లు వాచకత్వ ద్యోతకత్వ పక్షములు కాక మూడవ పక్షము సహకారిత్వపక్షము. ఉపసర్గము విశిష్టక్రియను బోధింపదు. ద్యోతింపచేయదు. ఇక నేమనగా - ధాతువు ప్రక్కన చేరి దానికి విశిష్టార్థబోధకత్వశక్తిని కూర్చుచుండును. ఈ విధముగ ఉపసర్గములు వాచకములు, ద్యోతకములు, సహకారులు అను మూడు పక్షములను చెప్పినట్లైనది.

'ప్రతిష్ఠతే' ఇత్యాదులలో 'ప్ర' అను ఉపసర్గము కేవల ధాత్వర్థరూపమగు గతినివృత్తి రూపార్థమును బాధించి గమనరూపార్థమును బోధించుచున్నది అని వెనుక చెప్పబడినది. వాస్తవమున అనుమాన సహాయముచే గమనాద్యర్థ వాచకత్వము కూడ స్థా ధాతువునకే ఉన్నది. ఉపసర్గము ద్యోతకము మాత్రమే యని చెప్పుచున్నాడు.

స్థాదిభిః కేవలైః ర్యచ్చ గమనాది తు గమ్యతే
తత్రానుమానా ద్ద్వివిధా త్తద్ధర్మా ప్రాది రుచ్యతే. 189

ద్వివిధాత్ = రెండు విధములగు, అనుమానాత్ = అనుమానమువలన, కేవలైః = ఉపసర్గరహితములగు, స్థాదిభిః = 'స్థా' మొదలగు ధాతువులచే, యత్ = ఏ, గమనాది = గమనాదికము, గమ్యతే = బోధింపబడుచున్నదో, తత్ర = ఆ గత్యాద్యర్థము విషయమున, ప్రాదిః = ప్ర మొదలగునది, తద్ధర్మా = ద్యోతకత్వధర్మము కలదిగా, ఉచ్యతే = చెప్పబడు చున్నది.

తా. కేవలము లగు 'స్థా' మొదలగు ధాతువులు బోధించు గమనాద్యర్థ విషయమున ప్రాదులు ద్యోతకత్వధర్మము కలవి అని ద్వివిధానుమానముచే చెప్పబడుచున్నది.

వి. 'స్థా' ధాతువును ఉపసర్గరహితముగ ప్రయోగించునపుడు అది గతినివృత్తి రూపార్థమునే బోధించును. కావుననే 'ష్ఠా గతినివృత్తౌ' అని అభియుక్తులు పఠించియున్నారు. 'ప్రతిష్ఠతే' అనునపుడు ఆ 'స్థా' ధాతువే గమనమును బోధించుచున్నది కావున అనుమాన సహాయముచే స్థా ధాతువునకు గమనార్థ వాచకత్వశక్తి గూడ యున్నదనియు, 'ప్ర' అను ఉపసర్గము ఆ శక్తిని కేవలము ద్యోతింప చేయుచున్నదనియు గ్రహింపవలెను. ఒక్క అర్థమును మాత్రము జూపు 'ష్ఠా గతి నివృత్తౌ' ఇత్యాది పాఠము లోక ప్రసిద్ధ్యనుసారము చేయబడినది.

అనుమాన మనగా అనుమితి జ్ఞానమును కలిగించు సాధనము. పర్వతముపై ధూమమును చూడగనే 'పర్వతో ధూమవాన్' (పర్వతముపై ధూమ మున్నది) అను జ్ఞానము కలుగును. దీనికి పక్షధర్మతాజ్ఞాన మని పేరు. పిమ్మట 'యత్ర యత్ర ధూమ స్తత్ర తత్ర వహ్నిః' (ఎక్కడెక్కడ ధూమముండునో అక్కడక్కడ వహ్ని యుండును) అను వ్యాప్తి జ్ఞానము స్మరణకు వచ్చును. పిమ్మట 'వహ్నివ్యాప్యధూమవాన్ పర్వతః' (వహ్నివ్యాప్యమగు ధూమము పర్వతముపై నున్నది) అను జ్ఞానము కలుగును. దీనికి పరామర్శ మని

పేరు. పిమ్మట 'పర్వతో వహ్నిమాన్' (పర్వతముపై అగ్ని ఉన్నది) అను జ్ఞానము కలుగును. దీనికి అనుమితి యనిపేరు. ఈ యనుమితికి కరణము (సాధనము) గాన 'యత్ర ధూమస్తత్రాగ్నిః' అను జ్ఞానమునకు అనుమాన మని పేరు.

అనుమానము అవీతము, వీతము అని రెండు విధములు. అవీతమునకే కేవల వ్యతిరేకి యని కూడ పేరు. అన్వయవ్యాప్తి లేక కేవలము వ్యతిరేకవ్యాప్తియే ఉన్నచో అది కేవల వ్యతిరేకి. 'పర్వతో వహ్నిమాన్, ధూమాత్' అను అనుమితియందు పర్వతము పక్షము, వహ్ని సాధ్యము, ధూమము సాధనము లేక హేతువు. ఎక్కడెక్కడ సాధనము (హేతువు) ఉండునో అక్కడక్కడ సాధ్యముండును అని దృష్టాంత పూర్వకముగ చెప్పుటకు వీలు ఉన్నచో అది అన్వయవ్యాప్తి. ఉదాహరణమునకు – ఎక్కడెక్కడ ధూమముండునో అక్కడక్కడ అగ్ని యుండును, వంటయింటిలో వలె; అని చెప్పుటకు వీలున్నది గాన ఇది అన్వయ వ్యాప్తి. ఎక్కడ సాధ్యము ఉండదో అక్కడ హేతువు గూడ ఉండదు. అని దృష్టాంత పూర్వకముగ చెప్పుటకు వీలున్న అది వ్యతిరేకవ్యాప్తి. ఉదాహరణమునకు — ఎక్కడ అగ్ని ఉండదో అక్కడ ధూమము కూడ ఉండదు, చెరువునందువలె అని చెప్పుటకు వీలగు చున్నది గాన ఇది వ్యతిరేకవ్యాప్తి. కొన్ని స్థలములలో ఈ అన్వయ వ్యతిరేక వ్యాప్తులు రెండును ఉండును. కొన్ని స్థలములలో అన్వయవ్యాప్తి ఒక్కటియే యుండును. కొన్నిట వ్యతిరేకవ్యాప్తి మాత్రమే ఉండును. అట్టి దానికి కేవలవ్యతిరేకి లేక అవీతము అని పేరు. ఉదాహరణమునకు 'పృథివి జలాదులకంటె భిన్నమైనది, గంధ మున్నది గాన' (పృథివీ ఇతరరేభ్యః భిద్యతే, గన్ధవత్త్వాత్) అను అనుమితి యందలి 'గంధమున్నది గాన' (గంధవత్త్వాత్) అను హేతువు కేవలవ్యతిరేకి. ఇచట "ఏది సగంధమో అది జలాదులకంటె భిన్న మైనది" అను అన్వయవ్యాప్తి చెప్పుటకు వీలులేదు. దీనికి దృష్టాంతముగ గంధముగల ఏవస్తువును చూపినను అది పృథివిలో చేరినదే గాన (పక్షమే గాన) దీనికి ఉదాహరణము చూపుటకు అవకాశము లేదు. దేనియందు సాధ్యమును సాధింతుమో దానినే దృష్టాంతముగ చూపుటకు వీలులేదుకదా? పర్వతమునందు అగ్ని ఉన్నది, ధూమమున్నది కనుక; "మహానసమునందు వలె" అని పర్వత(పక్ష)భిన్నమగు మహానసమును దృష్టాంతముగ చూపుదుము గాని పర్వతమునే చూపము గదా? కావున దానికి "యదితరేభ్యో న భిద్యతే న తద్ గంధ వత్, యథా జలమ్" (ఏది జలాదులకంటె భిన్నము కాదో దానికి గంధముండదు; జలము నందు వలె) అని వ్యతిరేకవ్యాప్తి మాత్రమే యున్నది గాన ఇది కేవలవ్యతిరేకి.

వీతము 'పూర్వవత్' అనియు, 'సామాన్యతోదృష్టమ్' అనియు రెండు విధములు. 'పూర్వవత్' అనుదానికి 'విశేషతోదృష్టమ్' అని నామాన్తరము. మహానసమున ధూమ మున్నపుడు అగ్ని యుండుట చూచి పర్వతమునందుగూడ ధూమ మున్నదిగాన అగ్ని యుండవలె నని యూహించుచున్నాడు. కాని ఆనాడు మహానసమునందు చూచిన ధూమము వేరు, ఈ నాడు పర్వతముపై చూచుచున్న ధూమము వేరు. మహానసమునందు ఆనాడు చూచిన అగ్ని వేరు, ఈనాడు పర్వతముపై ఊహించుచున్న అగ్ని వేరు. అనగా పూర్వము మహానసమునందు చూచిన ధూమవిశేష–అగ్నివిశేషముల సంబంధమును పురస్కరించుకొని ఇపుడు మరియొక ధూమవిశేషము సహాయముచే మరియొక అగ్నివిశేషమును ఊహించు చున్నాడు. కాని ఆనాడు చూచిన ధూమాగ్నులయందు ధూమత్వాగ్నిత్వజాతు లున్నవి.

పర్వతీయ ధూమాగ్నులయందు గూడ ధూమత్వాగ్నిత్వజాతు లున్నవి. పర్వతీయాగ్నిని ఇపుడు ఊహించుటకు పూర్వము అగ్నిత్వజాతి గల అగ్నివిశేషము మహానసమునందు చూడబడెను గాన దానికి 'పూర్వవత్' అనియు, 'విశేషతో దృష్టమ్' అనియు పేర్లు వచ్చినవి. ఈ విధముగ విశేషమును పూర్వ మెన్నడును చూచుటకు అవకాశము లేనిచో అట్టి దానికి (అనుమానమునకు) 'సామాన్యతో దృష్టమ్' అని పేరు. చక్షురాదీంద్రియములు ప్రత్యక్షములు కావు; కేవలము అనుమాన గమ్యములు. "రూపాదిజ్ఞానాని కరణవన్తి, క్రియాత్వాత్, ఛిదిక్రియావత్" (రూపాది జ్ఞానములకు కరణములు (సాధనములు) ఏవైన ఉండియుండవలెను. క్రియలు కావున, ఛేదనక్రియకు వలె) అనునది ఇంద్రియ సాధకానుమానము. ఛేదన క్రియవలెనే రూపాదిజ్ఞానము కూడ క్రియ గాన ఛేదనక్రియకు కుఠారాదికము కరణముగ నుండునట్లు ఈ జ్ఞాన రూపక్రియకు గూడ ఏదైన కరణము (సాధనము) ఉండవలెను. ఆ సాధనము ఇంద్రియము అని అనుమానము వలన సిద్ధించును. ఇచట సాధ్యము ఇంద్రియరూప కరణము. పర్వతముపై వహ్నిని ఊహించుటకు పూర్వము తద్వహ్ని గత వహ్నిత్వజాతి విశిష్టమగు వహ్ని విశేషమును మహానసము నందు చూచియున్నట్లు ఇచట సాధ్యమగు ఇంద్రియత్వ సామాన్యమునకు విశేషమగు ఇంద్రియమును పూర్వమెన్నడును అనుమాత చూచియుండలేదు. కరణత్వ సామాన్యమునకు విశేషమగు కుఠారాదుల స్వరూపమును మాత్రము ఛేదనాది క్రియలయందు చూచి యుండవచ్చును. ఈ అనుమానముచే అనుమాత కరణత్వ సామాన్య రూపముననే ఇంద్రియానుమితిని పొందుచున్నాడు. కావున ఇది సామాన్యతోదృష్టము.

ప్రకృతమున— విశేషతోదృష్ట సామాన్యతోదృష్టానుమానముల సహాయముచే ధాతువులకు భిన్నవిశిష్టక్రియా వాచకత్వమును, ఉపసర్గములకు విశిష్టక్రియాద్యోతకత్వమును సాధింపవచ్చును. "స్థాధాతుః అనేకార్థః, ధాతుత్వాత్; ఉభయవాది సమ్మతానేకార్థక యజత్యాదివత్" (స్థా ధాతువు, ధాతువు గాన, అనేకార్థములని అందరును అంగీకరించిన యజ్ మొదలగు ధాతువుల వలె, అనేకార్థము) అను సామాన్యతోదృష్టానుమానముచే స్థా ధాతువు అనేకార్థమని నిశ్చయించ వచ్చును ఈ సామాన్యతోదృష్టానుమానమును ఆధారముగ గొనిన 'అన్యేఽపి ధాతవః అనేకార్థాః, ధాతుత్వాత్, స్థా ధాతువత్' అను మరియొక సామాన్యానుమానముచే అన్ని ధాతువులును అనేకార్థము లని తెలియవచ్చును. 'స్థా' ధాతువునకు పూర్వమున నున్న 'ప్ర' అను ఉపసర్గమునకు – 'ప్ర' శబ్దః గతిరూప క్రియాద్యోతకః, ప్రశబ్దత్వాత్, పచ్యాది పూర్వదృష్ట ప్రశబ్దవత్' (పచ్ మొదలగు ధాతువుల మొదటనున్న 'ప్ర' వలె 'స్థా' కు పూర్వమున నున్న 'ప్ర' కూడ విశిష్టక్రియాద్యోతకము) అను విశేషతోదృష్టానుమాన సహాయముచే 'ప్ర' కు విశిష్టార్థబోధకత్వమును సాధింపవలెను. పిమ్మట ఏ తదనుమాన మూలకముగ – 'పరాదయః ఉపసర్గాః ద్యోతకాః, ఉపసర్గత్వాత్, ప్రతిష్ఠతే ఇత్యత్ర ప్రోపసర్గవత్' (పరా మొదలగునవి ద్యోతకములు, ఉపసర్గములు కావున; 'ప్రతిష్ఠతే' లోని 'ప్ర' అను ఉపసర్గమువలె) అనెడు సామాన్యతోదృష్టానుమానముచే ఉపసర్గము లన్నిటికిని తద్ధర్మత్వము అనగా ద్యోతకత్వరూప సాధ్యవత్త్వము – సిద్ధించును. కావున ధాతువు వాచకము, ఉపసర్గము ద్యోతకము అని కారిక అభిప్రాయము.

ఈ విధముగ ధాతువు విశిష్టక్రియాభిధాయక మనియు, ఉపసర్గము తద్ద్యోతక మనియు ప్రతిపాదించి ఇపుడు (కొన్ని యెడల) ధాతూపసర్గములు రెండును కలిసియే విశిష్టా

ర్థమును బోధించును. కేవలధాతువు గాని కేవలోపసర్గము గాని నిరర్థకము అని తెలుపు చున్నాడు.

అప్రయోగేఽధిపర్యోశ్చ యావద్దృష్టం క్రియాన్తరమ్
తస్యాభిధాయకో ధాతుః సహ తాభ్యా మనర్థకః . 190

అధిపర్యోః='అధి' 'పరి' అను ఉపసర్గముల, అప్రయోగే = ప్రయోగములేనప్పుడు, యావత్=ఏ, క్రియాన్తరమ్ = క్రియావిశేషము, దృష్టమ్ = చూడబడినదో, తస్య = దానికి, ధాతుః = ధాతువు, అభిధాయకః = వాచకము, తాభ్యాం సహ = వాటితో కూడ (వాటిని ప్రయోగించునపుడు), అనర్థకః = అర్థములేనిది.

తా. 'అధి' 'పరి' అనువాటిని ప్రయోగింపనపుడు ఏ క్రియా విశేషము కాన వచ్చుచున్నదో దానికి ధాతువు వాచకము. వాటితోకూడ ప్రయోగించినపుడు అది అర్థము లేనిది.

వి. 'అధ్యాగచ్ఛతి' (మీదుగా వచ్చుచున్నది) 'పర్యాగచ్ఛతి' (నలువైపుల నుండి వచ్చుచున్నది) ఇత్యాదులలోని 'అధి' 'పరి' అను ఉపసర్గములు అనర్థకములు వాటిని ప్రయోగింపకున్నను ప్రకరణాది సహకృతమగు ధాతువే ఉపరివిశిష్టాగమనమును సర్వతోభావ విశిష్టాగమనమును బోధించును గాన 'అధి' 'పరి' అను ఉపసర్గముల ప్రయోగము కేవలము స్పష్టార్థము. ఆ రెండింటిని ప్రయోగించునపుడు కేవల ధాతువు నిరర్థకము. అనగా ఉపసర్గసహితమగు ధాతువు విశిష్టార్థబోధకము గాన కేవల ధాతువు గాని కేవలోప సర్గము గాని నిరర్థకమని యభిప్రాయము.

ధాతువుతో కలిసి యుండెడి ఉపసర్గములకు అర్థముండునా ఉండదా అను విచారణము చేయు ప్రసంగమున నామసమభివ్యాహృతము లగు కొన్ని స్వార్థిక ప్రత్యయముల స్వరూపమును నిర్ణయించుట కుపక్రమించుచున్నాడు.

తథైవ స్వార్థికాః కేచిత్ సఙ్ఘాతాన్తరవృత్తయః
అనర్థకేన సంసృష్టాః ప్రకృత్యర్థానువాదినః . 191

తథైవ = ధాతు సమభివ్యాహృతము లగు 'అధి' 'పరి' మొదలగు ఉపసర్గములవలెనే కేచిత్ = కొన్ని, స్వార్థికాః = "యావాదిభ్యః కన్' (5.4.29) ఇత్యాది సూత్రములచే 'యావ' మొదలగు శబ్దములకంటె పరములుగ విహితములగు 'కన్' మొదలగు స్వార్థికప్రత్యయములు, అనర్థకేన = అర్థరహితములగు యావాది శబ్దములతో, సంసృష్టాః = కలిసినవై, సంఘాతాన్తర వృత్తయః = 'యావ' శబ్దముకంటె భిన్నమగు 'యావక' శబ్దరూప సంఘాతము నందు ఉన్నవై, ప్రకృత్యర్థానువాదినః = ప్రకృతిభూతములగు యావాదుల అర్థమును అనువదించునవిగ (ఉన్నవి).

తా. అట్లే కొన్ని స్వార్థిక ప్రత్యయములు అనర్థకములగు శబ్దములతో కలిసి మరియొక సంఘాతమునం దున్నవై ప్రకృత్యర్థమును అనువదించును.

వి. 'యావాదిభ్యః కన్' (5.4.29)అను సూత్రముచే 'యావ' మొదలగు శబ్దముల కంటె 'కన్' ప్రత్యయము స్వార్థమున విధింపబడుచున్నది. ఇచట 'యావ' శబ్ద 'క' ప్రత్యయ ములు భిన్నార్థబోధకములా లేక రెండును కలిసియే అర్థమును బోధించుచున్నవా యనునది

ప్రశ్న. 'యావ' శబ్దమును వేరుగా ప్రయోగించినపుడు దానికి అర్థమున్నది గాని 'యావక' లోని 'యావ' శబ్దము నిరర్థకము. 'యావ' శబ్దము వేరు. 'యావక' లోని 'యావ' వేరు. అనర్థక మగు నీ యావశబ్దముతో కలిపిన కప్రత్యయము 'యావ' శబ్దమును స్వతంత్రముగ ప్రయోగించినచో ఏ యర్థముండునో ఆ యర్థమును ('యావక'లోని 'యావ' నిరర్థకమైనను) అనువదించును. అనగా 'యావ' మొదలగు ప్రకృతులును, కప్రత్యయమును కలిసియే అర్థ మును బోధించును గాని వాటికి స్వతంత్రముగ అర్థమేమియు లేదని తాత్పర్యము.

నిపాతముల స్వరూపమును గూర్చి గూడ విభిన్నమతము లుండుటచే ఇప్పుడు వాటిని గూర్చి చెప్పుచున్నాడు.

నిపాతాః ద్యోతకాః కేచిత్ పృథగర్థాభిధాయినః
ఆగమా ఇవ కేఽపి స్యుః సంభూయార్థస్య వాచకాః . 192

కేచిత్ = కొన్ని, నిపాతాః = నిపాతములు, ద్యోతకాః = తత్తదర్థద్యోతకములు, (కేచిత్ = కొన్ని నిపాతములు), పృథగర్థాభిధాయినః = వేరువేరు అర్థములను బోధించును, కేఽపి = మరికొన్ని నిపాతములు, ఆగమా ఇవ = ఆగమములవలె, సంభూయ = ఇతర పదములతో కలిసి, అర్థస్య = అర్థమునకు, వాచకాః = వాచకములు, స్యుః = అగును.

తా. కొన్ని నిపాతములు ఆ యా యర్థములకు ద్యోతకములు. కొన్ని నిపాత ములు విభిన్నార్థబోధకములు. మరికొన్ని నిపాతములు ఆగమములవలె ఇతరపదములతో కలిసి అర్థవాచకములు.

వి. 'వటశ్చ ప్లక్షశ్చ' అను దానికి "వటముతో సముచ్చితమగు (కూడిన) ప్లక్షము, ప్లక్షముతో సముచ్చితమగు వటము" అని యర్థము. ఇచట 'వట' 'ప్లక్ష' శబ్దములు స్వేతరపదార్థ సముచ్చితములగు స్వార్థములనే శక్తి చేతగాని లక్షణచేతగాని బోధించునని కొందరి యభిప్రాయము. ఈ మతము ప్రకారము ఇచటనున్న 'చ' అను నిపాతములకు స్వతంత్రార్థ మేదియును లేదు. ఇవి కేవలము వటాదిపదములకున్న సముచ్చితత్వార్థమును ద్యోతింపచేయుచున్నవి. మరికొందరి మతము ననుసరించి ఇచటనున్న 'చ' అను నిపాత ములు స్వతంత్రముగ సముచ్చయ రూపార్థమును బోధించును. ఇది రెండవ మతము. 'సంస్కృత్య' ఇత్యాదులలోని సుగాగమాదులును ప్రకృతియును కలిసి ఏవిధముగ అర్థమును బోధించుచున్నవో ఆ విధముగనే నిపాతములుగూడ ఇతరపదములతో కలిసి అర్థబోధకము లగునని మూడవమతము. ఈ మతము ప్రకారము నిపాతములకు అర్థమేదియు లేదు.

ఈ కారిక పూర్వార్థమునకు మరియొక విధముగగూడ అర్థము చెప్పవచ్చును. 'చ' 'తు' మొదలగు కొన్ని నిపాతములు తత్తదర్థద్యోతకములు (వాచకములు) కావు. 'యుగ పత్' (ఒక్కమారుగా) 'శశ్వత్' (ఎల్లప్పుడును) మొదలగు మరికొన్ని నిపాతములు తత్తదర్థవాచకములు. 'చ' మొదలగునవి స్వతంత్ర ప్రయోగానర్హములు గాన అవి ద్యోతక ములు మాత్రమే. స్వతంత్ర ప్రయోగార్హములగు 'యుగపత్' మొదలగునవి వాచకములు అని భావము.

ద్యోతకము లగు 'చ' మొదలగు నిపాతములను లౌకిక వాక్యములందు, ద్యోత్యార్థాభిధాయి పదమునకు ముందు గాని వెనుక గాని ఇచ్ఛానుసారముగ ప్రయోగింపవచ్చునని చెప్పుచున్నాడు.

ఉపరిష్టా త్పురస్తా ద్వా ద్యోతకత్వం న భిద్యతే
తేషు ప్రయుజ్యమానేషు భిన్నార్థేష్వపి సర్వథా . 198

భిన్నార్థేషు = తమతో కలిసిన పదముల అర్థముకంటె భిన్నమైన అర్థములు కల, తేషు = వికల్ప సముచ్చయాద్యర్థద్యోతకములగు 'చ' 'వా' మొదలగునవి, ఉపరిష్టాత్ = ద్యోత్యార్థపదములకు తరువాతగాని, పురస్తాద్వా = వెనుకగాని, ప్రయుజ్యమానేష్వపి = ప్రయోగింపబడుచున్నను, సర్వథా = సర్వవిధములచేతను, ద్యోతకత్వమ్ = ద్యోతకత్వము, న భిద్యతే = మార్పుచెందదు.

తా. భిన్నార్థకములగు ఆ నిపాతములను ముందు ప్రయోగించినను, వెనుక ప్రయోగించినను వాటి ద్యోతకత్వమునందు మార్పు ఏదియును లేదు.

వి. 'చ' 'వా' మొదలగు సముచ్చయ వికల్పాదిద్యోతక నిపాతములను లౌకిక వాక్యమున, ద్యోత్యార్థవాచక పదములకు ముందుగాని వెనుకగాని ప్రయోగింపవచ్చును. ఎట్లు ప్రయోగించినను వాటి ద్యోతకత్వమున భేదమురాదు, ఉదాహరణమునకు 'ధవం ఖదిరం చ ఛిన్ధి' అనిగాని, 'ధవం చ ఖదిరం' అని గాని, 'ధవంచ ఖదిరంచ' అని గాని, 'ధవం వా ఖదిరం' అనిగాని, 'ధవం ఖదిరంవా' అనిగాని ప్రయోగింపవచ్చును.

కొన్ని నిపాతములు ద్యోతకము లనియు, కొన్ని వాచకము లనియు ఏలచెప్పవలెను? అన్నియు వాచకములే యని ఏల చెప్పరాదు? అని ఆశంకించుకొని సమాధానము చెప్పుచున్నాడు.

చాదయో న ప్రయుజ్యన్తే పదత్వే సతి కేవలాః
ప్రత్యయో వాచకత్వేఽపి కేవలో న ప్రయుజ్యతే. 194

పదత్వే సతి = పదములేయైనను, చాదయః = 'చ' మొదలగునవి, కేవలాః = ఇతరపదాసహకృతములుగ (స్వతంత్రముగ), న ప్రయుజ్యన్తే = ప్రయోగింపబడుటలేదు. ప్రత్యయః = ప్రత్యయము, వాచకత్వేఽపి = వాచకమేయైనను, కేవలః = కేవలముగ, న ప్రయుజ్యతే = ప్రయోగింపబడదు.

తా. చాదులు పదములేయైనను వాటిని ఇతరపదాసహకృతములుగ ప్రయోగింపరు. ప్రత్యయము అర్థవాచకమే యైనను దానిని స్వతంత్రముగ ప్రయోగింపరు.

వి. చాదులు పదములేయైనను వాటిని స్వతంత్రముగ (ద్యోత్యార్థవాచక పదములతో సంబంధము లేకుండగ) ప్రయోగించుటలేదు. కావున అవి ద్యోతకములే కాని వాచకములు కావు. వాచకము లైనచో 'గో' శబ్దాదులవలె స్వతంత్ర ప్రయోగార్హములై యుండెడివి. "ప్రత్యయములు వాచకములేయైనను వాటిని స్వతంత్రముగ ప్రయోగించుట లేదు గదా? అందుచే స్వతంత్రప్రయోగార్హత లేనంతమాత్రమున చాదులు వాచకములని ఏల చెప్పుదురు?" అని ఆశంకింపరాదు. ప్రత్యయములకు స్వతంత్రప్రయోగము లేకుండుటకు కారణము అవి పదములు కాకుండుట. 'అపదం న ప్రయుఞ్జీత' అని పదము కాని దానిని ప్రయోగింపరాదని నిషేధ మున్నదికదా? చాదులన్ననో పదములే. అయినను వాటిని కేవలము ప్రయోగింపరు. కావున అవి ద్యోతకములే కాని వాచకములు కావని చెప్పవచ్చును.

ఇపుడు, శంకానిరాకరణపూర్వకముగ. చాదులు [illegible]వాచకము అని (కారికాద్వయమున) నిరూపించుచున్నాడు. (శంక) — శబ్ద శక్తి స్వభావము నాలోచించి చాదులుగూడ ద్రవ్యభిన్నములగు వేరువేరు సముచ్చయాద్యర్థములను బోధించును అని చెప్పుట యుక్తము కాదు. శక్తి ననుసరించి చాదులు సముచ్చయాద్యర్థములను బోధించు నని అంగీకరించు పక్షమున ఆ యర్థములనే బోధించు 'సముచ్చయ' మొదలగు పదములను ప్రయోగించునపుడు ఏవిధముగ సంబంధవాచకమగు షష్ఠి వచ్చి 'వటస్య సముచ్చయః, ప్లక్షస్య సముచ్చయః' ఇత్యాది ప్రయోగములుండునో చాదిప్రయోగమునందు గూడ 'వటస్య చ ప్లక్షస్య చ' అని షష్ఠి రావలసియుండును. (సమాధానము) — చాదులు సముచ్చయవాచకములైనచో పై దోషము వచ్చియుండెడిది; కాని అవి సముచ్చయవాచకములు కావు. సముచ్చితములను (సముచ్చయము కలవాటిని) బోధించును. ఇపుడు వటాదులకును చాదిబోధితము లగు సముచ్చితములకును అభేదము గాన షష్ఠి వచ్చెడు ప్రసంగము లేదని చెప్పుచున్నాడు.

సముచ్చితాభిధానేఽపి వ్యతిరేకో న విద్యతే
అసత్త్వభూతో భావశ్చ క్రియాన్యై నాభిధీయతే. 195

సముచ్చితార్థాభిధానేఽపి = (చాదులు)సముచ్చితము అను నర్థమును బోధించినను, వ్యతిరేకః = భేదము, నవిద్యతే = లేదు.

తా. సముచ్చితము అను నర్థమును బోధించినను భేదము లేదు. అనగా చాదులు ద్యోతకములు అను పక్షమున ప్లక్షాదిపదములే సముచ్చిత ప్లక్షాద్యర్థములను బోధించును. చాదులు కేవలము ప్లక్షాదులలో నున్న అట్టి అర్థమును ద్యోతింపచేయును అని చెప్పునపుడు భేదము లేకపోవుటచే ప్లక్షాదిపదములకంటె షష్ఠి రాదు కదా! అట్లే చాదులు సముచ్చితాద్యర్థమును బోధించునను పక్షమునందు గూడ భేదము లేకుండుటచే భిన్నవస్తువుల సంబంధమును బోధించు షష్ఠి ప్లక్షాది శబ్దములకంటె రాదు అని పూర్వార్ధాశయము.

శంక — చాదులు సముచ్చితార్థములని యంగీకరించినచో అవి సత్త్వ (ద్రవ్య) వాచకము లగును. అట్లైనచో 'చాదయోఽసత్త్వే' (1-4-57)అను సూత్రమున ద్రవ్యవాచకములు కాని చాదులకుమాత్రమే నిపాతసంజ్ఞ విధింపబడినది గాన సత్త్వవాచకము లగు ఈ చాదులకు నిపాతసంజ్ఞ లేకపోవును. నిపాతసంజ్ఞ లేకున్నచో తత్ప్రయుక్తమగు 'స్వరాదినిపాతమవ్యయమ్' (1-1-37) అను సూత్రవిహితమైన అవ్యయసంజ్ఞ లభింపదు. అవ్యయసంజ్ఞ లేనిచో ఈ చాదులకంటె పరముగ వచ్చిన విభక్తి ప్రత్యయములకు 'అవ్యయాదాప్సుపః' (2.4.82) అను సూత్రముచే విహితమగు 'లుక్'(లోపము) రాదు గాన చాదులకంటె విభక్తి ప్రత్యయములు కనబడవలసియుండును అని ఆశంకించుకొని - ఆఖ్యాతము అసత్త్వమగు క్రియనుబోధించునట్లు చాదులు కూడ అసత్త్వమగు సముచ్చితాద్యర్థమునే బోధించును అని ఉత్తరార్థమున సమాధానము చెప్పుచున్నాడు.

అసత్త్వభూతః = పదార్థము కాని, భావః = సముచ్చితాద్యర్థము, నిపాతలచే బోధింపబడును. (యథా = ఏవిధముగా,) అన్యేన = సత్త్వమగు క్రియను బోధించు 'పాకః' ఇత్యాది పదములకంటె భిన్నమగు 'పచతి' మొదలగు ఆఖ్యాతముచే, క్రియాసత్త్వము కాని క్రియ, అభిధీయతే = చెప్పబడుచున్నదో.

తా. 'పచతి' మొదలగు ఇతరపదములచే క్రియ బోధింపబడినట్లు చాదులచే అసత్త్వభూతమగు సముచ్చయాద్యర్థము బోధింపబడును.

వి. 'పాకః' అను నామపదము, 'పచతి' అను అఖ్యాతపదము, ఈ రెండును పాకక్రియనే బోధించును. కాని శబ్దశక్తిస్వభావము ననుసరించి 'పచతి' అనునపుడు అఖ్యాతము సత్త్వము కానిదియు, సాధ్యమును (అసంపూర్ణమును) అగు పాకక్రియను బోధించుచున్నది. 'పాకః' అను నామపదము పరినిష్ఠితస్వభావమగు, సత్త్వమైన పాకక్రియను బోధించుచున్నది. (క్రియ సంపూర్ణమైననే గాని పదార్థము కాజాలదు) అట్లే శబ్దశక్తిస్వభావమును అనుసరించి చాదులు సత్త్వము కాని సముచ్చితాద్యర్థమునే బోధించును. ఈ విధముగ చాద్యర్థము సత్త్వము కాదు. కాన లింగసంఖ్యాన్వయయోగ్యము కాదు. అందుచే చాదులకంటె విభక్తియే ఉత్పన్నము కాదు.

చాదులు సముచ్చితాద్యర్థబోధకము లను పక్షమున దోషాంతరము నాశంకించి పరిహరించుచున్నాడు. చాదులు సముచ్చితాద్యర్థ బోధకము లని యంగీకరించినచో ఆ యర్థమునే బోధించు 'సముచ్చితః' ఇత్యాదిపదములకు విశేషణములను చేర్చుటకు అవకాశమున్నట్లు 'చ' మొదలగు వాటికి గూడ విశేషణములను చేర్చుటకు అవకాశముండవలెను. విశేషణముల లింగవచనములు విశేష్యముల లింగవచనములపై ఆధారపడి యుండును. కాని చాదులు అసత్త్వ వాచకములగుటచే వాటికి లింగవచనాదులు లేవు గాన వాటికి విశేషణములుగ ప్రయోగించు పదములకు 'సామాన్యే నపుంసకమ్' (వా.) అను శాస్త్రముచే నపుంసకలింగము వచ్చి 'హరితం శోభనం చ వృక్షః' ఇత్యాదివాక్యమును ప్రయోగింపవలసి యుండును, కావున చాదులకు సముచ్చితాద్యర్థవాచకత్వమును అంగీకరింపరాదు అని ఆశంకించుకొని సమాధానమును చెప్పుచున్నాడు.

సముచ్చితాభిధానేఽపి విశిష్టార్థాభిధాయినామ్
గుణైః పదానాం సమ్బన్ధః పరతన్త్రాస్తు చాదయః . 196

విశిష్టార్థాభిధాయినామ్ = స్వార్థమును బోధించుటకు తప్పక పదాంతరముతో సంబంధముండవలెను అనెడు పారతంత్ర్యము లేకుండ స్వతంత్రముగ జాత్యాదివిశిష్టార్థమును బోధించు, పదానాం = పదములకు, గుణైః = విశేషణములతో, సంబంధః = సంబంధము (ఉండును). చాదయస్తు = చాదులైతే, సముచ్చితార్థాభిధానేఽపి = సముచ్చితార్థమును బోధించినను, పరతంత్రాః = పరాధీనములు.

తా. (స్వతంత్రముగ) విశిష్టార్థమును బోధించు పదములకు విశేషణములతో సంబంధము ఉండవచ్చును; కాని చాదులు సముచ్చితార్థ బోధకములైనను పరతంత్రములు.

వి. స్వతంత్రముగ జాత్యాది విశిష్టార్థబోధకము లగు పదములకు విశేషణములను చేర్పవచ్చును. చాదినిపాతములు శబ్దశక్తి స్వభావముచే అసత్త్వభూతార్థవాచకములని అంగీకరించినను, శబ్దశక్తిస్వభావముచేతనే, తప్పక ఇతరపదములతో కలిసియుండవలెననెడు పారతంత్ర్యము కూడ వీటికుండుటచే, విశేషణములను చేర్చెడు అవకాశము ఉండదు గాన పూర్వోక్తదోషము లేదు. ఈ విధముగ చాదినిపాతములు శబ్దశక్తిస్వభావమును బట్టి అసత్త్వభూతసముచ్చితాద్యర్థములను బోధించును. కాని వీటికి స్వతంత్ర ప్రయోగము గాని, విశేషణయోగము గాని లేదు అని ఈ రెండు కారికల సారాంశము.

ఇంతవరకు నామ—ఆఖ్యాత—ఉపసర్గ-నిపాతము అనెడు చతుర్విధ పదస్వరూపమును నిరూపించి ఇపుడు కర్మ ప్రవచనీయ మనెడు పంచమవిధ పదమును గూర్చి కూడ విచారించు చున్నాడు.

జనయిత్వా క్రియా కాచిత్ సమ్బన్ధం వినివర్తతే
శ్రూయమాణే క్రియాశబ్దే సమ్బన్ధో జాయతే క్వచిత్ . 197

క్వచిత్ = కొన్ని స్థలములందు, కాచిత్ = ఒకానొక, క్రియా = క్రియ, సమ్బన్ధం= సంబంధమును, జనయిత్వా = పుట్టించి, వినివర్తతే = తొలగిపోవును (వినబడకుండును). క్వచిత్ = కొన్ని స్థలములందు, క్రియాశబ్దే = క్రియావాచక మగు శబ్దము, శ్రూయమాణే= వినబడుచుండగా, సమ్బన్ధః = సంబంధము, జాయతే = ఏర్పడును.

తా. కొన్ని స్థలములందు ఒక్కొక్క క్రియ సంబంధమును ఏర్పరచి తాను వినబడకుండ పోవును. మరికొన్ని యెడల క్రియావాచకము వినబడుచు ఉండగనే సంబంధము ఏర్పడును.

వి. ' లక్షణేత్థంభూతాఖ్యానభాగవీప్సాసు ప్రతిపర్యనవః '(1-4-90) ఇత్యాదిసూత్రములచే లక్షణాద్యర్థములు విషయ మగునపుడు 'ప్రతి' మొదలగు వాటికి కర్మప్రవచనీయసంజ్ఞ విహితమైనది. 'వృక్షం ప్రతి విద్యోతతే విద్యుత్' ఇత్యాదికము ఉదాహరణము : 'కర్మ ప్రోక్తవన్తః కర్మప్రవచనీయాః' అను వ్యుత్పత్తిచే కర్మప్రవచనీయ శబ్దమునకు పూర్వ మొకప్పుడు (ఉదాహరణాంతరముల యందు) క్రియను బోధించునవి, కాని ఇపుడు మాత్రము క్రియావాచకములు కాక క్రియాజన్య మగు సంబంధ విశేషమును బోధించునవి అని యర్థము. 'వృక్షంప్రతి విద్యోతతే విద్యుత్' అను వాక్యమునకు 'వృక్షముచే గుర్తింపబడు మెరుపు మెరయుచున్నది' అని యర్థము. మెరుపు మెరిసిన మరుక్షణమునందే అదృశ్యమగును. వృక్షప్రకాశము గూడ మెరుపుతోపాటు పుట్టి నశించుచున్నది. ప్రకాశితమగు వృక్షముచే విద్యుత్తును ఊహించుచున్నాము గాన వృక్షము విద్యుత్తునకు లక్షణము. విద్యుత్తు లక్ష్యము. ఈ లక్ష్యలక్షణ రూపసంబంధమును 'ప్రతి' అనునది సూచించుచున్నది. కావున ఇది కర్మ ప్రవచనీయము. ఈ కర్మప్రవచనీయముతో సంబంధించిన 'వృక్ష' శబ్దమునకు 'కర్మప్రవచనీయ యుక్తే ద్వితీయా' (2-3-8) అను సూత్రముచే ద్వితీయ వచ్చినది. ఈ విధముగ కర్మప్రవచనీయములు సంబంధవిశేషావచ్ఛేదకము లని తేలినది.

సంబంధము లన్నియు క్రియాకారకపూర్వకములై యుండును అనగా ఒక క్రియ యందు కారకములుగా నున్న రెండింటికి ఆ క్రియద్వారా సంబంధ మేర్పడును. ఉదాహరణమునకు - 'రాజు ఈ పురుషుని పోషించుచున్నాడు' అనునపుడు పోషణ క్రియయందు కర్తయగు రాజునకును, కర్మయగు పురుషునకును ఈ పోషణ రూపక్రియ ద్వారా స్వస్వామి భావసంబంధము (భృత్యుడు, అధిపతి అనెడు సంబంధము) ఏర్పడినది. కొన్ని స్థలములలో క్రియ రెండు కారకములకు సంబంధమేర్పరచి తాను నివర్తించును - అనగా ఆ క్రియ వినబడదు. ఉదాహరణమునకు - 'రాజ్ఞః పురుషః' అనునపుడు 'రాజుకు సంబంధించిన పురుషుడు' అని స్వస్వామిభావసంబంధము గోచరించుచున్నది. ఈ పురుషుని రాజు పోషించు చున్నాడు గాన వారిరువురకును స్వస్వామిభావసంబంధము, ఈ పోషణక్రియ స్వస్వామి భావసంబంధమును ఏర్పరచి 'రాజ్ఞః పురుషః' అనుచోట వినబడకుండ తొలగిపోయినది.

ఇచట ఆ క్రియ శ్రూయమాణము కాకున్నను స్వస్వామిభావసంబంధము అవగతమగు చున్నది. కొన్ని స్థలములలో క్రియాపదము శ్రూయమాణముగ నున్నపుడు మాత్రమే స్వవాచ్యక్రియకు కారకముతో సంబంధమును బోధింప గల్గును. ఆ క్రియాపదము శ్రూయ మాణము కాకున్నచో సంబంధము కూడ అవగతము కాదు. ఉదాహరణమునకు – 'మాతుః స్మరతి' అనుదానికి తల్లిని స్మరించుచున్నాడు అని యర్థము. ఇచట తల్లికిని స్మరణము నకును జన్యజనకభావసంబంధము లేక నిమిత్త నిమిత్తి భావసంబంధము. తల్లి స్మరణము నకు నిమిత్తము, స్మరణము నిమిత్తి. ఇచట 'స్మరతి' అనెడు క్రియ తొలగిపోయి శ్రూయ మాణము కాకున్నచో మాతృస్మరణములకు గల సంబంధము గూడ తొలగిపోవును గాన ఇట్టి స్థలములలో క్రియాపదమున్నపుడు మాత్రమే సంబంధ మవగతమగును.

దీనినిబట్టి ఒక క్రియద్వారా రెండు కారకములకు ఏర్పడిన సంబంధము ఆ క్రియాపదము వినబడకున్నను గమ్యమగును; కాని కారకమునకును క్రియాపద వాచ్యక్రియ కును నడుమ నేర్పడిన సంబంధము క్రియాపదము శ్రూయమాణము కాకున్నచో తొలగిపోవు నని తేలినది.

'షష్ఠీ శేషే' (2.3.50) అనుసూత్రముచే సంబంధసామాన్యమున షష్ఠి విహితమై యుండగా కర్మత్వాది విశేషసంబంధమును పురస్కరించుకొని 'అధీగర్థదయేశాం కర్మణి' (2.3.52) ఇత్యాది సూత్రములచే మరల ప్రతిపదషష్ఠి (పదవిశేషమును నిమిత్తముగ గొని వచ్చెడు షష్ఠి) ఏల విధింపబడినది ? అని ఆ శంకించుకొని సమాధానము చెప్పుచున్నాడు. (ఈ విచారము ప్రాసంగికము).

> తత్ర షష్ఠీ ప్రతిపదం సమాసస్య నివృత్తయే
> విహితా, దర్శనార్థంతు కారకం ప్రత్యుదాహృతమ్ . 198

తత్ర = 'మాతుః స్మరణమ్' ఇత్యాదులందు, సమాసస్య = సమాసముయొక్క, నివృత్తయే = నివృత్తికొరకు (సమాసము రాకుండుటకొరకు), ప్రతిపదం షష్ఠీ = పద నిర్దేశ పూర్వకమగు షష్ఠి, విహితా = విధింపబడినది, తు = కాని, దర్శనార్థంతు = గుణములు కరణ మని చూపుట నిమిత్తము, కారకమ్ = కరణ కారకమైన 'గుణైః' అనునది, ప్రత్యుదా హృతమ్ = ప్రత్యుదాహరణముగా చూపబడినది.

తా. అచట సమాసము రాకుండుటకై ప్రతిపదషష్ఠి విహితమైనది. కరణత్వ మును చూపుటకై కారకము ప్రత్యుదాహరణముగా చూపబడినది.

వి. రెండు పదముల నడుమ ఏదైన ఒక సంబంధమును చెప్పుటకు వీలున్నపుడు (సంబంధ సామాన్యార్థమున)'షష్ఠీ శేషే' (2.3,50)అను సూత్రముచేషష్ఠి విధింపబడినది. దీనిని బట్టి 'రాజ్ఞః పురుషః' 'రామస్య పుత్రః' 'రామస్య భార్యా' ఇత్యాది స్థలములందు స్వస్వామి భావ–జన్యజనకభావ–దాంపత్యాది సంబంధములను పురస్కరించుకొని రాజాది శబ్దములకు షష్ఠి వచ్చినది. కర్మ–కరణ సంప్రదానాదులకు ద్వితీయా–తృతీయా–చతుర్థ్యాదులను విధిం చినను ఆ కర్మాదులను సంబధసామాన్యముగ పరిగణించినచో షష్ఠి రావచ్చును. 'మాతరం స్మరతి' (తల్లిని స్మరించుచున్నాడు) అనునపుడు స్మరణక్రియలో తల్లి కర్మ గాన మాతృ శబ్దము ద్వితీయలో నున్నది. కాని ఆ కర్మను సంబంధ సామాన్యముగ వివక్షించినచో [చెప్పదలచినచో] అపుడు ద్వితీయ రాక 'షష్ఠీ శేషే' అను సూత్రముచే షష్ఠి వచ్చి 'మాతుః స్మరతి' యగును. 'మాతుః స్మరణమ్' అనునపుడు గూడ ఈ విధముగనే షష్ఠి

రావచ్చును. అనగా పై ఉదాహరణమున షష్ఠి వచ్చుటకు ప్రత్యేకముగ సూత్ర మేదియు ఆవశ్యకము కాకుండగనే సంబధ సామాన్య వివక్షచే (శేషత్వ వివక్షచే) షష్ఠి రావచ్చునని తెలినది. కాని పాణిని పై యుదాహరణమున షష్ఠి వచ్చుటకై 'అధీగర్థదయేశాం కర్మణి' (2.3.52) అను సూత్రమును పఠించెను. 'స్మృత్యర్థక ధాతువులు, దయధాతువు, ఈశ్ధాతువు వీటి కర్మ శేషముగ (సంబంధ సామాన్యరూపమున) వివక్షిత మగునపుడు (ఆ కర్మకు) షష్ఠి వచ్చును' అని దాని యర్థము. కొన్ని పదములను నిమిత్తముగ చూపి విహితమగు షష్ఠిగాన దీనికి 'ప్రతిపదవిధానషష్ఠి' యని పేరు. పైన చూపిన విధముగ శేషత్వ వివక్షయందు 'షష్ఠీ శేషే' (2.3.50) అను సూత్రముచేతనే షష్ఠి వచ్చుచుండగా ఇక ప్రతిపదవిధాన మెందులకు అని ఆశంక. దీనికి సమాధానము 'సిద్ధే సత్యారభ్యమాణో విధి ర్నియమాయ భవతి' అను వైయాకరణ సంప్రదాయము ననుసరించి ఒక కార్యము ఒక శాస్త్రముచే సిద్ధించుచుండగా మరల ఆ కార్యమే శాస్త్రాంతరముచే ఒక నియమము నుద్దేశించి విధింపబడును. ఇచట 'మాతుః స్మరణమ్' ఇత్యాదులలో శేషషష్ఠి వచ్చుటకు అవకాశమున్నను మరల ప్రతిపదవిధానషష్ఠి విధానమునకు – 'ఇట్టి షష్ఠ్యంతము సమసింపదు' అను నియమ కల్పనము ప్రయోజనము. ఈవిషయమునే వార్తికకారుడు 'ప్రతిపదవిధానా షష్ఠీ న సమస్యత ఇతి వాచ్యమ్' అని స్పష్టీకరించి యున్నాడు. కావున ఈ నియమముచే 'మాతుః స్మరణమ్' అనునపుడు సమాసము చేసి 'మాతృ స్మరణమ్' అని ప్రయోగింపరాదు. ఈ విధముగ 'ప్రతిపదషష్ఠి' సమాసము రాకుండుటకై విధింబడినది.

ఇది ఇట్లుండగా మరియొక ఆశంకగూడ కలుగుచున్నది–అధీగర్థేత్యాది సూత్రమునందు 'కర్మణి' అని చెప్పనేల అని ప్రశ్నించి 'మాతుః గుణైః స్మరణమ్' అను ప్రత్యుదాహరణము చూపబడినది[1]. ఈ సూత్రమున 'కర్మణి' అను పదము లేకున్నచో స్మరణార్థాది ధాతువుల అన్ని కారకములకును శేషత్వవివక్షయందు షష్ఠి వచ్చునని అర్థము వచ్చును. అట్లైనచో 'మాతుః గుణైః స్మరణమ్' అనుచో 'గుణైః' అను కరణకారకమునకు గూడ షష్ఠి వచ్చియుండెడిది అని ప్రత్యుదాహరణము నిచ్చుటలోని యభిప్రాయము. ఇచట గుణశబ్దముకంటె షష్ఠి ఈ సూత్రముచే రాకున్నను, శేషత్వవివక్షలో షష్ఠీ శేషే అను సూత్రముచే రావచ్చును కదా? అపుడు 'మాతుః గుణానాం స్మరణమ్' అని యుండవచ్చును కదా? అని ఆశంక. దీనికి హరి 'దర్శనార్థం తు కారకం ప్రత్యుదాహృతమ్' అని సమాధానము చెప్పుచున్నాడు. అనగా గుణశబ్దముకంటె శేషషష్ఠి రావచ్చును. కావున 'మాతుః గుణానాం స్మరణమ్' అని గూడ ప్రత్యుదాహరణ మీయవచ్చును. కాని ఈ 'గుణానామ్' అనునది కర్మవాచకమా లేక కరణాదివాచకమా యని సంశయము వచ్చును. ఈసంశయము రాకుండుటకై 'గుణైః' అని కరణతృతీయాంతము ప్రయోగింపబడినది. ఈ కరణవాచకమగు గుణశబ్దమునకు శేషషష్ఠి రావచ్చును. సమాసము రాదను నియమము దానికి వర్తింపదు గాన గుణస్మరణమ్ అని సమాసము కూడ రావచ్చునని యభిప్రాయము.

1 ఈ ప్రత్యుదాహరణము భాష్యములో లేదు. కాశికలోనున్నది. కాని భర్తృహరి కాశికకంటెను ప్రాచీనమగు వ్యాఖ్యానమును దేనినో దృష్టిలోనుంచుకొని ఈ కారికను వ్రాసి యుండును.

ప్రాసంగిక విచారము ముగిసినది. శ్రూయమాణము కాని అశ్రూయమాణము కాని యగు క్రియ సంబంధము నేర్పరచును అని వెనుక నిర్ణయింపబడినది. దీనికి ప్రకృతముతో సమన్వయమును చూపుచున్నాడు.

స చోపజాతః సమ్బన్ధో వినివృత్తే క్రియాపదే
కర్మప్రవచనీయేన తత్ర తత్ర నియమ్యతే . 199

క్రియాపదే = క్రియాపదము, వినివృత్తే = సంబంధమును కల్పించిన పిమ్మట నివర్తించిన దగుచుండగా, సః = ఆ, ఉపజాతః = పుట్టిన, సమ్బన్ధః = సంబంధము, కర్మప్రవచనీయేన = కర్మప్రవచనీయముచే, తత్ర తత్ర = ఆయా క్రియయందు, నియమ్యతే = నియమించబడుచున్నది.

తా. క్రియాపదము సంబంధమును కల్పించి నివర్తించినపిమ్మట, కర్మప్రవచనీయము, జనించిన ఆ సంబంధమును ఆ యా క్రియయందు నియమించును.

వి. సంబంధమును కల్పించినపిమ్మట క్రియాపదము నివృత్తముకాగా పిమ్మట, ఈ సంబంధము ఏక్రియద్వారా ఏర్పడినది అను సందేహము కలుగును. అపుడు కర్మప్రవచనీయము ఈ సంబంధము ఈ క్రియనుబట్టి ఏర్పడినది అని నియమించును. "కర్మప్రవచనీయయుక్తే ద్వితీయా" (2.38) అను సూత్రముచే కర్మప్రవచనీయయోగముగల శబ్దమునకు ద్వితీయా విభక్తి వచ్చునుగాన ఆ ద్వితీయయే యీ సంబంధమును బోధించును. కావున కర్మప్రవచనీయము ఈ సంబంధవిశేషము ఈ క్రియద్వారా కలిగినది అని ద్యోతనము మాత్రము చేయును.

వెనుకచూపిన 'వృక్షం ప్రతి విద్యోతతే విద్యుత్' అను ఉదాహరణమునకు 'వృక్షమ్ అభిలక్ష్య విద్యుత్ విద్యోతతే' (వృక్షమును గుర్తుగా చేసికొని విద్యుత్తు మెరయుచున్నది) అని యర్థము. ఇచట వృక్షమునకును మెరపునకును లక్ష్యలక్షణభావ సంబంధము. వృక్షము లక్షణము (గుర్తు), విద్యుత్తు లక్ష్యము (గుర్తింపదగినది). ఈ సంబంధమును బోధించు 'అభిలక్ష్య' అను క్రియ నివర్తించినది. ఇచట కర్మప్రవచనీయమగు ప్రతి అనునదిగూడ లేకున్నచో ఆ సంబంధము ఎట్టి సంబంధము? ఏ క్రియద్వారా ఏర్పడినది? అను విషయములు తెలియవు. ప్రతి అనునది ఉన్నచో అది ముందుగా లక్షణక్రియను చెప్పి, ఆ క్రియద్వారా కలిగిన, ద్వితీయా బోధ్యమగు లక్ష్యలక్షణభావరూపసంబంధమును ద్యోతింపచేయును. కావుననే దీనికి కర్మప్రవచనీయమని పేరు. అనగా ముందుగ క్రియను బోధించి తరువాత సంబంధమును సూచించునది యని యర్థము[1].

అశ్రూయమాణమగు క్రియను కర్మప్రవచనీయము ఆక్షేపించును అని ఏల చెప్పరాదు—అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

[1] 'కర్మప్రవచనీయ' శబ్దమునకు వెనుక చెప్పిన వ్యుత్పత్తిని ఈ వ్యుత్పత్తిని గూడ వ్యాఖ్యానకారులు అంగీకరించియున్నారు. కర్మ ప్రవచనీయము లోని కర్మ శబ్దమునకు క్రియ యని యర్థము, యాస్కాదులు కర్మ శబ్దమును క్రియా పర్యాయముగ ప్రయోగించి యున్నారు.

యేన క్రియాపదాక్షేపః స కారకవిభక్తిభిః
యుజ్యతే వి ర్యథా తస్య లిఖావనుపసర్గతా .　　200

యేన=ఏ శబ్దముచేత, క్రియాపదాక్షేపః=ఆ క్రియాపదముయొక్క ఆక్షేపము చేయబడునో, సః = అది, కారకవిభక్తిభిః=కారకవిభక్తులతో, విః యథా='వి' అను ఉపసర్గమువలె, యుజ్యతే = సంబంధించుచున్నది, తస్య = ఆ 'వి' కి, లిఖౌ = 'లిఖ' ధాతువునందు, అనుపసర్గతా = ఉపసర్గత్వము లేదు.

తా. ఏది క్రియాపదమును ఆక్షేపించునో అది 'వి' అను ఉపసర్గమువలె, కారకవిభక్తులతో సంబంధించుచున్నది. ఆ 'వి', 'లిఖ్'ధాతువు విషయమున ఉపసర్గముకాదు.

వి. క్రియాపదమును ఆక్షేపించు పదము క్రియాబోధకముగాన క్రియాపదము వలె ఆ పదము కారకవిభక్తులతో సంబంధించును. ఆక్షేపమనగా ఒక పద మొకచోట ప్రయోగింపబడకున్నను అది అక్కడ నున్నట్లుగా భావించి అర్థము చెప్పుటకు వీలు కలిగించుట. 'ప్రాదేశం విలిఖతి' అనుదానికి జేనెడు చొప్పున కొలిచి గీయుచున్నాడు అని యర్థము-అనగా ఇచట 'వి' అను పదము (ఉపసర్గము) 'విమాయ' (కొలిచి) అను క్రియను ఆక్షేపించినది కావుననే ఇది విమానక్రియను బోధించుచు ప్రాదేశమ్ అను కర్మకారకముతో సంబంధించుచున్నది. ఈ విలిఖతి లోని 'వి' అనుదానికి క్రియాయోగమున్నది గాన 'ఉపసర్గాః క్రియాయోగే' (1.4.59) 'గతిశ్చ' (1.4.60) (ప్రాదులు క్రియలతో సంబంధించినపుడు ఉపసర్గ సంజ్ఞములు, గతిసంజ్ఞములు గూడ అగును) అను సూత్రములచే ఉపసర్గ సంజ్ఞా గతి సంజ్ఞలు లభించినవి. కాని ఈ ఉపసర్గసంజ్ఞ లిఖతి అను క్రియతోడ సంబంధమును బట్టి వచ్చినది కాదు. ఆక్షిప్తమగు మానక్రియనుబట్టి వచ్చినది. కావున లిఖ ధాతువునుగూర్చి 'వి' ఉపసర్గముగాని, గతిగాని కాదు.

ప్రకృతమున కర్మప్రవచనీయములుగూడ 'విలిఖతి' లోని 'వి' వలె క్రియా పదాక్షేపకము లని అంగీకరించినచో అపుడు అట్టి కర్మప్రవచనీయములతో యోగమున్నపుడు కర్మత్వాది ప్రయుక్త ద్వితీయావిభక్తియే వచ్చును గాన" కర్మప్రవచనీయయుక్తే ద్వితీయా" అని మరల ద్వితీయను విధింపవలసిన పనిలేదు. 'ప్రాదేశం విలిఖతి' అనునపుడు 'వి' చేత ఆక్షిప్తమగు మా ధాతువునుబట్టి దానియందు కర్మయగు ప్రాదేశమునకు ద్వితీయ వచ్చినది కదా? అటులనే ఇక్కడను ద్వితీయ వచ్చుటకు అవకాశముండగా మరల సూత్ర మెందులకు? ఈ సూత్రమును చెప్పుటనుబట్టి కర్మప్రవచనీయము క్రియను ఆక్షేపించుట లేదని తెలియుచున్నది. క్రియాపదమును ఆక్షేపించుటలేదు గాన వృక్ష, విద్యుత్ పదములకు సంబంధసామాన్యముచే షష్ఠి వచ్చుటకు అవకాశమున్నది. దానిని బాధించుటకై ద్వితీయా విధాయకసూత్రము చెప్పబడినది.

ఉపసర్గము క్రియాపదాక్షేపక మనుటకు ఉదాహరణాంతరము గూడ చూపుచున్నాడు.

తిష్ఠతే రుపయోగశ్చ దృష్టోఽప్రత్యయసన్నితి
సున్వతీ త్యాభిముఖ్యేఽభిః కేవలోఽపి ప్రయుజ్యతే .　　201

(అ) అప్రత్యజయన్నితి = 'దేవాః అసురాన్ అప్రత్యజయన్' అను స్థలమున (దీనికి - 'దేవాః = దేవతలు, అప్రతి = ప్రతిష్ఠితులు కాని, అసురాన్ = అసురులను, అజయన్ = జయించిరి' అని యర్థము) తిష్ఠతేః = స్థా ధాతువునకు, ఉపయోగశ్చ = 'ప్రతి' అను ఉపసర్గముచే ఆక్షేపము గూడ, దృష్టః = చూడబడినది.

తా. 'అప్రత్యజయన్' అనునపుడు స్థా ధాతువునకు ఆక్షేపము చూడబడినది గూడ.

వి. కావున 'ప్రాదేశం విపరిలిఖతి' అను వాక్యమునందలి 'వి' శబ్దము లిఖ ధాతువును బట్టి ఉపసర్గము కాని విధమున ఇచటగూడ 'ప్రతి' శబ్దము 'జి' ధాతువును బట్టి ఉపసర్గము కాదు.

కొన్ని స్థలములలో ఉపసర్గము స్వార్థమును స్వతంత్రముగ బోధించుచు తద్ద్వారా, (క్రియావదార్థవాచకమగు ఉపసర్గమువలె కాక) ప్రక్కనున్న ధాతువుతో, సంబంధించును. అనగా ఈ ఉపసర్గము ప్రక్కనున్న ధాతువుతో, తద్ధాత్వర్థ ద్యోతకము కాక, స్వతంత్రముగ తన యర్థమును బోధించుచు సంబంధించును అను విషయమును ప్రసంగవశమున ఉత్తరార్ధమున చెప్పుచున్నాడు.

(ఆ) సున్వన్తీతి = అభిషుణ్వన్తి అనుచోట, కేవలోఽపి = కేవలముగనే, అభిః = అభి అను ఉపసర్గము, ఆభిముఖ్యే = ఆభిముఖ్యార్థమునందు, ప్రయుజ్యతే = ప్రయోగింపబడును.

తా. 'అభిషుణ్వన్తి' అనునపుడు 'అభి' అను ఉపసర్గము ఆభిముఖ్యార్థమున స్వతంత్రముగ ప్రయోగింపబడును.

వి. 'అభిషుణ్వన్తి' అనునపుడు 'అభి' అను ఉపసర్గమే 'అభిముఖముగ నుండుట' (ఆభిముఖ్యము) అను నర్థమును బోధించుచున్నది. కాని ధాతువే ఆభిముఖ్యవిశిష్ట సవనమును బోధించును. 'అభి' అనునది దానిని ద్యోతింపచేయును అని చెప్పుటకు వీలులేదు. 'ఆభిముఖ్యము' అను నర్థము లింగసంఖ్యాన్వయయోగ్యము కాన అది సత్త్వము (పదార్థము). ధాతువు సత్త్వమును బోధింపదు. 'అసత్త్వభూతో భావశ్చ తిఙ్ పదై రభిధీయతే' (తిఙన్తములు సత్త్వము కాని భావమును బోధించును) అని నియమము. 'అభి' పదబోధ్యమగు ఈ ఆభిముఖ్యము సవనమునందు క్రియావిశేషణముగ భేదమున అన్వయించును. 'అభి అనునది స్వార్థము ద్వారా ధాత్వర్థమగు సవనమునందు అన్వయించును.

ఈ విధముగ సార్థకమగు 'కర్మప్రవచనీయము' అను నామధేయమును బట్టియే కర్మప్రవచనీయములు, సంబంధమును ఏర్పరచి నివృత్తమైన క్రియను బట్టి వచ్చిన సంబంధ విశేషమును ద్యోతింపచేయుచు, సంబంధనియామకము లగునని నిర్ణీతమైనది.

సంబంధము నేర్పరచి ధాతువు నివృత్తము కాగా సంబంధ విశేషద్యోతనము చేయునవి కర్మప్రవచనీయములు అని చెప్పినచో, క్రియలతో సంబంధించి యుండియే క్రియావిశేషమును బోధించు 'సు, అతి' మొదలగు వాటికి కర్మప్రవచనీయత్వము నెట్లు చెప్ప వీలగును అని శంకించుకొని చెప్పుచున్నాడు

కర్మప్రవచనీయత్వం క్రియాయోగే విధీయతే
షత్వాదివినివృత్త్యర్థం స్వత్యాదీనాం విధర్మణామ్ . 202

విధర్మణామ్ = విరుద్ధ ధర్మములు కలిగిన, అనగా సంబంధ విశేషమును ద్యోతింపచేయుటకంటె విరుద్ధమయిన క్రియావిశేషమును ద్యోతింపచేయుట యనునది కలిగిన, స్వత్యాదీనామ్ = 'సు' 'అతి' మొదలగు వాటికి, షత్వాదినివృత్త్యర్థమ్ = 'సుసిక్తమ్' ఇత్యాదులందు షత్వాదులు రాకుండుటకై, క్రియాయోగే = క్రియావిశేషద్యోతకత్వమున్నపుడు (సంబంధవిశేషద్యోతకత్వము లేకున్నను), కర్మప్రవచనీయత్వమ్ = కర్మప్రవచనీయ సంజ్ఞ. విధీయతే = విధింపబడుచున్నది.

తా. విరుద్ధ ధర్మములగు 'సు' 'అతి' మొదలైనవాటికి, క్రియావిశేషద్యోతకత్వమున్నపుడు, షత్వాదులు రాకుండుటకై, కర్మప్రవచనీయ సంజ్ఞ విధింపబడుచున్నది.

వి. 'సుః పూజాయామ్' (1.4.94) 'అతి రతిక్రమణేచ' (1.4.95) అను సూత్రములచే 'సు' 'అతి' అను పదములకు కర్మప్రవచనీయ సంజ్ఞ విధింపబడినది. 'సుసిక్తమ్' 'అతిసిక్తమ్' ఇత్యాదులు ఉదాహరణములు. ఇచట కర్మప్రవచనీయములగు 'సు' 'అతి' అనునవి 'వృక్షం ప్రతి విద్యోతతే విద్యుత్' ఇత్యాదిస్థలమునందలి 'ప్రతి' మొదలగువానివలె (సంబంధమును జనింపచేసి క్రియాపదము నివర్తించినపిమ్మట) సూచించుట లేదు. అట్లయినను వీటికి కర్మప్రవచనీయసంజ్ఞ విధించుటలో ప్రయోజనమేమనగా – 'సుసిక్తం' ఇత్యాదులలో గత్యుపసర్గలను బాధించి కర్మప్రవచనీయ సంజ్ఞమాత్రమే 'సు' 'అతి' అనువాటికి ఉండును కావున 'ఉపసర్గాత్ సునోతి' ఇత్యాది (8.3.65) సూత్రముచే విహితమగు షత్వము ('సిక్తం' లోని సకారమునకు) రాదు. ఇట్లు షత్వాదులు రాకుండుటయే ఈ కర్మప్రవచనీయసంజ్ఞకు ప్రయోజనము.[1]

సంబంధ విశేషద్యోతకములగు కర్మప్రవచనీయములకు వెనుక చెప్పినట్లు శేష షష్ఠిని ఒక్కదానిని బాధించుటయే ప్రయోజనము కాదు. కొన్ని స్థలములలో హేతు తృతీయను బాధించుట గూడ ప్రయోజనమని ప్రసంగవశమున చెప్పుచున్నాడు.

హేతు హేతుమతో ర్యోగపరిచ్ఛేదేఽనునా కృతే
అరమ్భా ద్బాధ్యతే ప్రాప్తా తృతీయా హేతులక్షణా. 204

హేతుహేతుమతోః = హేతువుయొక్కయు హేతుమత్తుయొక్కయు, యోగపరిచ్ఛేదే = హేతుహేతుమద్భావసంబంధముయొక్క నిర్ధారణము, అనునా = 'అను' అనెడు ఉపసర్గముచే, కృతే = చేయబడినదగుచుండగా, ప్రాప్తా = ద్వితీయను బాధించి ప్రాప్తమైన, హేతులక్షణా = హేతుత్వప్రయుక్తమగు, తృతీయా = తృతీయావిభక్తి, అరమ్భాత్ = శాస్త్రారంభసామర్థ్యము వలన, బాధ్యతే = బాధింపబడుచున్నది.

తా. హేతు హేతుమత్తుల సంబంధ నిర్ధారణము 'అను' చేత చేయబడినదగుచుండగా, ద్వితీయను బాధించి ప్రాప్తించుచున్న హేతులక్షణ తృతీయ శాస్త్రారంభ సామర్థ్యముచే బాధింపబడుచున్నది.

1 కాని 'అతిరతిక్రమణేచ' (1–4–95) అను సూత్రముచే అతికి కర్మప్రవచనీయ సంజ్ఞ విధింపబడినది గాన 'అతిదేవాన్ కృష్ణః,' ఇత్యాదులలో దేవాదిశబ్దములకు ద్వితీయ వచ్చినది, ఇది కర్మప్రచనీయములగు ప్రత్యాదులవలె సంబంధ బోధకముగా నున్నది. కావున ఈ కారికలో 'అతి' ని అతిసిక్తమ్ ఇత్యాద్యుదాహరణములను మాత్రమే దృష్టిలోనుంచుకొని చేర్చినట్లు కనబడుచున్నది.

vi. 'అనుర్లక్షణే' (1.4.84)అను సూత్రము లక్ష్యలక్షణ భావరూప సంబంధము ద్యోత్య మగునపుడు 'అను' అను ఉపసర్గమునకు కర్మప్రవచనీయసంజ్ఞను విధించుచున్నది. దానికి ఉదాహరణము 'శాకల్యస్య సంహితా మను ప్రావర్షత్' అనునది, 'శాకల్యుడు సంహితను పఠించినపుడు వర్షము కురిసినది' అని యర్థము. ఇచట వర్షమెపుడు కురిసినదో చెప్పుటకు శాకల్యుడు సంహితను పఠించుట అనునది లక్షణము (గుర్తు), వర్షము కురియుట అనునది లక్ష్యము. వర్షము కురియుటకు సంహితాపఠనము హేతువు. అనగా సంహితాపఠనజన్యా పూర్వము వర్షము కురియుటకు నిమిత్తము. ఈ లక్ష్య లక్షణ భావరూప సంబంధమును బోధించుచున్నదిగాన 'అను'కు కర్మప్రవచనీయ సంజ్ఞ లభించినది, 'సంహితా' శబ్దమునకు ద్వితీయ వచ్చినది.

ఇచట విచారణీయాంశ మిది. కారకమనియు జ్ఞాపకమనియు హేతువు రెండు విధములు. ఘటాదులకు దండాదులు కారకహేతువులు, అనగా అవి ఘటాదుల నిర్మాణమునకు సహకరించుచున్నవి. 'వృక్షమను విద్యోతతే విద్యుత్'అనునపుడు విద్యుత్తు ఎక్కడ మెరిసినదో గుర్తుగానున్నదిగాన వృక్షము జ్ఞాపకహేతువు. దీనినిబట్టి లక్ష్య లక్షణభావసంబంధము గూడ హేతుహేతుమద్భావరూపమైనదే అని తేలినది. కావున 'లక్షణేత్థంభూతాఖ్యాన–' ఇత్యాది సూత్రముచేతనే (1.4.90) 'సంహితామను' ఇత్యాద్యుదాహరణమునందు కూడ కర్మ ప్రవచ నీయత్వము లభించుచుండగా మరల 'అను ర్లక్షణే' (1.4.84)అను సూత్రముచే కర్మ ప్రవచ నీయ సంజ్ఞావిధాన మెందులకు అనునది ప్రశ్న. దీనికి సమాధానమేమనగా–'సంహితా మను' ఇత్యాద్యుదాహరణమున 'లక్షణేత్థం–' ఇత్యాది (1.4.90) సూత్రముచే కర్మ ప్రవచనీయ త్వము, తత్ప్రయుక్తమగు ద్వితీయయు రావచ్చును; కాని సంహితాపఠనము వర్షాగమనమునకు హేతువుగాన పూర్వమగు కర్మ ప్రవచనీయ సంజ్ఞా విధాయక శాస్త్రమును బాధించి, పరమగు 'హేతౌ' అనుసూత్రముచే (2.3.23) తృతీయ వచ్చును గాన అది రాకుండుటకై 'అను ర్లక్షణే' అనుసూత్రము చెప్పబడినది. 'హేతౌ' అనుసూత్రము (2.3.23) 'అనుర్లక్షణే' అను (1.4.84) సూత్రముకంటె గూడ పరమే యైనను దానిని బాధింపదు. దానిని గూడ బాధించి తృతీయయే వచ్చినచో 'అను ర్లక్షణే' అను సూత్రమును చెప్పుట వ్యర్థమగును. పృథక్సూత్ర నిర్మాణసామర్థ్యముచే పరమైనను హేతుతృతీయా విధాయక సూత్రమును పూర్వమగు ఈసూత్రమే బాధించును.

ఈ విధముగ కర్మ ప్రవచనీయసంజ్ఞ కొన్ని ఉదాహరణములలో శేష షష్ఠిని కొన్ని ఉదాహరణములలో హేతు తృతీయను బాధించి ద్వితీయ వచ్చుట కుపయుక్తమగు చున్నదని తాత్పర్యము.

కర్మప్రవచనీయములకు సంబంధించిన ప్రాసంగిక విచారమును పూర్తిచేసి ఇపుడు కర్మ ప్రవచనీయమునకు ద్యోతకత్వమే కాని వాచకత్వాదికము లేదని చెప్పుచున్నాడు.

క్రియాయా ద్యోతకో నాయం సమ్బన్ధస్య న వాచకః
నాపి క్రియాపదాక్షేపీ సమ్బన్ధస్య తు భేదకః. 204

అయం = కర్మప్రవచనీయము, క్రియాయాః = లక్షణాది క్రియకు, ద్యోతకః = ద్యోతకము, న = కాదు. సమ్బన్ధస్య = సంబంధమునకు, వాచకః = వాచకము, న = కాదు,

క్రియాపదాక్షేప్యపి = క్రియాపదము నాక్షేపించునది గూడ, న = కాదు. తు = కాని, సమ్బన్ధస్య = సంబంధమునకు, భేదకః = విశేషకము (సంబంధమునందలి విశేషమును సూచించును).

తా. ఇది క్రియను ద్యోతింపచేయదు; సంబంధవాచకము కాదు; క్రియాపదాక్షేపమును కూడ చేయదు. సంబంధమునందలి విశేషమును మాత్రము బోధించును.

వి. కర్మప్రవచనీయ ప్రయోగస్థలమున లక్షణాదిక్రియల ప్రతీతి కలుగుట లేదు; కాన అది క్రియాద్యోతకము కాదు. షష్ఠిని బాధించి వచ్చిన ద్వితీయయే సంబంధమును బోధించుచున్నది గాన అది సంబంధవాచకము కూడ కాదు. 'ప్రాదేశం విలిఖతి' ఇత్యాదులలో 'వి' శబ్దము విమానమనుక్రియను (విశేషమయిన మానము, అనగా కొలత అని అర్థము) ఆక్షేపించినట్లు ఇది లక్షణక్రియను ఆక్షేపించుటలేదు. ఇంక నేమనగా లక్షణాది క్రియాజనితమగు సంబంధమునందలి విశేషమును మాత్రము బోధించును.

వాక్య వాక్యార్థములు అఖండములని యంగీకరించు సిద్ధాంతి తన వాదమున పద పదార్థ విభాగము అనుపపన్నమైనను కాల్పనికమగు అట్టి విభాగమును అంగీకరించి, నిరుక్తకారానుసారముగ నామము, ఆఖ్యాతము, ఉపసర్గము, నిపాతము అని నాల్గు విధములగు పదములను గూర్చి వివరించెను. కర్మ ప్రవచనీయము ఐదవ విధమగు పదము అను మతము ననుసరించి దాని స్వరూపమును గూడ స్పష్టీకరించెను. ఇట్లు శాస్త్రీయవ్యవహారార్థమై సఖండత్వ పక్షము నంగీకరించినను అఖండత్వ పక్షమే పారమార్థికమని సమర్థింపబోవుచు భాష్య వార్త్తిక విరోధము నాశంకించి చెప్పుచున్నాడు.

అనర్థకానాం సఙ్ఘాతః సార్థకోఽనర్థక స్తథా
వర్ణానాం పద మర్థేన యుక్తం నావయవాః పదే . 205

అనర్థకానామ్ = అర్థరహితములగు, వర్ణానామ్ = వర్ణములయొక్క, సఙ్ఘాతః = సమూహము, సార్థకః = ('ఘటః' ఇత్యాదులలో) సార్థకము, తథా = మరియు, అనర్థకః = ('కర్పటః' ఇత్యాదులలో) నిరర్థకము, పదమ్ = పదమే, అర్థేన = అర్థముతో, యుక్తమ్ = కూడినది (వర్ణములు కావు; కావున), పదే = పదమునందు, అవయవాః = అవయవములు, న = లేవు

తా. అర్థరహితములగు కొన్ని వర్ణముల సంఘాతము సార్థకముగను, కొన్ని వర్ణముల సంఘాతము నిరర్థకముగను ఉండును. అర్థముతో కూడినది పదమే. పదమునందు అవయవములు లేవు,

వి. 'సఙ్ఘాతార్థవత్త్వాత్' అని యొక వార్త్తికము గలదు. పదముల సముదాయము వాక్యము. ఆ వాక్యము అర్థవంతము. వాక్యమువలె వాక్యఘటితములగు పదములుగూడ అర్థవంతములు. అట్లే వర్ణముల సంఘాతము పదము. ఈపదము అర్థవంతముగాన తద్ఘటితములగు వర్ణములును అర్థవంతములై యుండవలెను అని దాని యభిప్రాయము. దీనినిబట్టి వాక్యఘటితములగు పదములకు వలె పదఘటితములగు వర్ణములకు గూడ అర్థముండవలెనని వార్త్తికకారుని యభిప్రాయము గాన అఖండత్వపక్షమున ఏతద్వార్త్తికవిరోధము నాశంకించి ఈ కారిక చెప్పబడుచున్నది.

వర్ణములకు అర్థములేదు. ఇట్టి వర్ణములు సంఘాతముగ నేర్పడినపుడు కొన్ని, 'ఘటః' ఇత్యాదిసంఘాతములకు అర్థవిశేషముండును; 'కర్పట' ఇత్యాదిసంఘాతములకు

ఉండదు. ఇట్లు వర్ణసంఘాతమే అర్థబోధకమగును గాని వర్ణములు అర్థబోధకములు కావు. పదార్థములు వాక్యార్థమునందు ఉపకరించునట్లు వర్ణార్థములు పదార్థమునందుపకరించుటలేదు. కావున పదములకు అవయవములుగ వర్ణములనునవి ఉన్నటులగూడ అంగీకరింపబనిలేదని యభిప్రాయము.

నిరర్థకములగు వర్ణముల సంఘాతము కొన్ని యెడల సార్థకము, కొన్ని యెడల నిరర్థకము అయినట్లు అర్థయుక్తములగు పదముల సముదాయము గూడ పరస్పర సంబంధ ముండుట లేకపోవుట అను భేదమును బట్టి సార్థకముగను నిరర్థకముగను ఉండును అని చెప్పుచున్నాడు.

పదానా మర్థయుక్తానాం సఙ్ఘాతో భిద్యతే పునః
అర్థాన్తరావరోధేన సమ్బన్ధవిగమేన చ . 206

పునః = మరియు, అర్థయుక్తానాం = అర్థముగల, పదానామ్ = పదములయొక్క, సఙ్ఘాతః = సంఘాతము, అర్థాన్తరావరోధేన = పదార్థముకంటె భిన్నమగు సంసర్గరూపమైన అర్థమును స్వీకరించుటచేతను, సమ్బన్ధ విగమేన చ = అట్టి సంసర్గము లేకపోవుటచేతను, భిద్యతే = భేదించుచున్నది (రెండువిధములుగ నున్నది).

తా. అర్థయుక్తములగు పదముల సంఘాతము అర్థాంతరమును స్వీకరించుట చేతను, స్వీకరింపకుండుటచేతను భిన్నముగ నున్నది.

వి. భిన్నార్థబోధకములగు పదములు ఒక సంఘాతముగ నేర్పడినపుడు ఆ పదములలో ఒకదానితో మరియొకదానికి సంబంధము (సంసర్గము) ఉన్నయెడల అపుడా సంఘాతము అర్థబోధకమగును, ఈ సంసర్గ మనునది పదవాచ్యము కాదు. రెండు పదము లొకచోట చేరగనే సహజముగ భాసించుచున్నది. ఉదాహరణమునకు – "దేవదత్త ! గామ భ్యాజ శుక్లాం దణ్డేన" (ఓ దేవదత్తా! తెల్లని ఆవును దండముతో తోలుకొనిరమ్ము) ఇత్యాది పదసంఘాతములలోని పదములు ప్రత్యేకముగ స్వస్వార్థములను బోధించుటయే కాక ఒకదా నితో నొకటి సంబంధించునవిగ కూడ ఉన్నవి. కావున ఈ పదసంఘాతము అర్థవంతము. కాని 'దశదాడిమాని, షడపూపాః' ఇత్యాది పదసంఘాతములలోని పదములకు స్వస్వార్థ బోధకత్వమున్నను, వాటికి పరస్పర సంబంధమేదియు కానవచ్చుటలేదు. కావున నీ పద సంఘాతము నిరర్థకము.

కొన్ని స్థలములలో వర్ణసముదాయముల పరస్పర సంబంధ తదభావములను గూర్చిన మతభేదమును చెప్పుచున్నాడు.

సార్థకానర్థకౌ భేదే సమ్బన్ధం నాధిగచ్ఛతః
అధిగచ్ఛత ఇత్యేకే కుటీరాదినిర్శనాత్ . 207

భేదే = ప్రకృతి ప్రత్యయవిభాగము చేసినపుడు, సార్థకానర్థకౌ = ఒకటి సార్థ కమై రెండవది నిరర్థకమై యుండు వర్ణసముదాయములు, సమ్బన్ధం = పరస్పరసంబంధమును, నాధిగచ్ఛతః = పొందవు (అని కొందరు అందురు). కుటీరాదినిదర్శనాత్ = 'కుటీర' మొద లగు వర్ణసంఘాత ద్వయఘటితపదముల నిదర్శనమును పురస్కరించుకొని, ఏకే = కొందరు, అధిగచ్ఛతః = పొందును, ఇతి = అని (చెప్పుచున్నారు).

తా. విడదీసినపుడు సార్థకముగను నిరర్థకముగను ఉండునవి పరస్పరసంబంధమును పొందవని కొందరును, కుటీరాది దృష్టాంతముచే పొందునని కొందరును చెప్పుచున్నారు.

వి. 'కుటీర' మొదలగు శబ్దముల ప్రకృతిప్రత్యయ విభాగముచేయగా 'కుటీ' అను ఒక వర్ణసముదాయము, 'ర' అను మరియొక వర్ణసముదాయమును విడివడును. ఇందు కుటీ అను వర్ణసంఘాతము సార్థకము (పర్ణశాల యని యర్థము), 'ర' అను సంఘాతము నిరర్థకము. ఆ రెండును పరస్పరసంబంధమును పొందవని కొందరును, అల్పత్వ రూపార్థద్యోతకమగుటచే 'ర' ప్రత్యయము గూడ సార్థకమే గాన ఇవి పరస్పర సంబంధమును పొందునని మరికొందరును చెప్పుచున్నారు.

సంఘాతము అర్థవంతముగాన అవయవములు గూడ అర్థవంతములే యని చెప్పుచున్నాడు.

అర్థవద్భ్యో విశిష్టార్థః సంఘాత ఉపజాయతే
నోపజాయత ఇత్యేకే సమాసస్వార్థికాదిషు . 208

అర్థవద్భ్యః = అర్థవంతములగు వర్ణపదాదులనుండి, విశిష్టార్థః = ఆ వర్ణముల కంటెను పదములకంటెను విలక్షణమగు అర్థముగల, సంఘాతః = సంఘాతము, ఉపజాయతే = కలుగుచున్నది (అని కొందరు). నోపజాయతే = కలుగదు, ఇతి = అని, ఏకే = మరికొందరు అనుచున్నారు. సమాసస్వార్థికాదిషు = సమాసములు స్వార్థిక ప్రత్యయములు మొదలగువాటిలో ('తథా దర్శనాత్' అని అధ్యాహారము - అట్లు కనబడుటవలన).

తా. సమాసస్వార్థికాదులను బట్టి అర్థవంతములగు వాటినుండి విశిష్టార్థ మగు సంఘాతమేర్పడునని కొందరును, కలుగదని మరికొందరును చెప్పుచున్నారు.

వి. 'చిత్రగుః' ఇత్యాది సమాసములయందు అర్థవంతములగు పదముల కలయికవలన విశిష్టార్థమగు సమాసరూపసంఘాతము జనించుచున్నది గాన, దాని నుదాహరణముగ గొని కొందరు అర్థవంతములగు వర్ణపదాదులవలన విశిష్టార్థమగు సంఘాతమేర్పడునని యంగీకరించుచున్నారు. 'బాలకః' ఇత్యాదులలో స్వార్థమున విహితములగు 'క' ప్రత్యయాదులు చేర్చినను సంఘాతము విశిష్టార్థమును దేనినీ బోధించుటలేదు గాన, ('బాలః' అన్న ఏ యర్థమో 'బాలకః' అన్ననూ అదియే యర్థము) అట్టి స్వార్థికాది ప్రత్యయాంత సంఘాతములయందు అర్థవంతములగు అవయవముల వలన విశిష్టార్థ సంఘాతము జనించుట అనునది లేదని మరికొందరనుచున్నారు.

సంఘాతములు పైనచూపిన ప్రకారము రెండువిధములుగ (కొన్ని విభక్తావయవార్థములుగను మరికొన్ని విభక్తావయవార్థ రహితములుగను) ఉన్నవని చెప్పుచున్నాడు.

కేచిత్తు యుతసిద్ధార్థాః భేదే నిర్జ్ఞాతశక్తయః
అన్వయవ్యతిరేకాభ్యాం కేచిత్ కల్పితశక్తయః . 209

యుతసిద్ధార్థాః = విభక్తమై తెలియబడు అర్థముగల, కేచిత్తు = కొన్ని సంఘాతములైతే, భేదే = విభాగము చేయబడినవగుచుండగా, నిర్జ్ఞాతశక్తయః = వేరువేరుగా గుర్తింప

వీలగు శక్తికలవి, కేచిత్ = కొన్ని సంఘాతములు, అన్వయ వ్యతిరేకాభ్యామ్ = అన్వయవ్యతిరేకములచేత, కల్పితశక్తయః = కల్పింపబడిన శక్తికలవి.

తా. వేరుగతెలియు అర్థములు గల కొన్ని సంఘాతములు విభాగము చేసినపుడు వేరువేరుగ తెలియబడు శక్తి కలవిగనుండును. కొన్ని అన్వయవ్యతిరేకములచే కల్పితమగు శక్తి కలవిగనుండును.

వి. 'శమీవృక్షః', 'దాడిమీ వృక్షః', ఇత్యాది పదసంఘాతములలోని 'శమీ' 'వృక్ష' మొదలగు అవయవముల స్వరూపమున మార్పు ఏదియునులేదు గాన, అట్టి సంఘాతములను విడదీసినను వాటి అవయవముల అర్థము స్పష్టముగ తెలియుచున్నది. 'ప్రగతే జానునీ యస్య సః' 'సంహతే జానునీ యస్య సః' అను నర్థమున జానుశబ్దమునకు 'జ్ఞు' అను నాదేశమురాగా సిద్ధించిన 'ప్రజ్ఞుః' (ఎడముగానున్న మోకాళ్ళుకలవాడు) 'సంజ్ఞుః' (కలిసిన మోకాళ్ళుకలవాడు) ఇత్యాది సమాసముల అవయవార్థము, తద్ఘటితమగు జానుశబ్దము పూర్తిగ అదృశ్యమైనది గాన, 'ప్రసంభ్యాం జానునోర్జ్ఞుః' (౫-4-129) ఇత్యాది లక్షణము ననుసరించి అన్వయ వ్యతిరేకములసహాయముచేతనే అవగతమగుచున్నది. కావున "సఙ్ఘాతార్థవత్త్వాత్" అను వార్తికము అనైకాన్తికము, భాగాసిద్ధము కూడనని యర్థము.

అనైకాన్తికత్వము, భాగాసిద్ధత్వము అనునవి హేతుదోషములు. ఇట్టి దోషములు పట్టిన హేతువునకు 'హేత్వాభాస' మనిపేరు. ఒకసాధ్యమును సాధించుటకై చెప్పినహేతువు అసాధ్యము ఉండుటకు అవకాశములేని స్థలమునందుగూడ ఉన్నచో అట్టి హేతువు అనైకాంతికము. "పర్వతో వహ్నిమాన్, ప్రమేయత్వాత్" (పర్వతము ప్రమేయముగాన—జ్ఞేయముగాన—దానిపై వహ్ని యుండవలెను.) అను ప్రయోగమున 'ప్రమేయత్వాత్' అను హేతువు పక్షమైన పర్వతమునందును, వహ్నిలేని విపక్షమగు హ్రదమునందును గూడ ఉన్నది గాన ఇది అనైకాంతికము. అట్టి దుష్టహేతువు సాధ్యమును సాధింపజాలదు. (ప్రమేయత్వ మనగా, తెలిసికొనుటకు శక్యమగుట. ప్రపంచమునందలి పదార్థములన్నియు ప్రమేయములే). వార్తికకారుడు 'సంఘాతార్థవత్త్వాత్' అని చెప్పుటలో "పదాద్యవయవాః అర్థవన్తః, అర్థవత్సంఘాతావయవత్వాత్" అను అనుమానమును అంగీకరించినట్లయినది. "పదములు మొదలగు అవయవములకు గూడ అర్థమున్నది. అవి అర్థవంతమగు సంఘాతమునకు అవయవములగుటవలన" అని అనుమానప్రయోగమున కర్థము. కాని, ఈ (20౯ వ) కారికలోచెప్పినవిధముగ 'సంజ్ఞుః' ఇత్యాది పదావయవములగు 'జ్ఞు' ఇత్యాదులకు అర్థములేదు గాన "అర్థవత్సంఘాతావయవత్వాత్ అను హేతువు వ్యభిచారదోషదుష్టమైనది. (అనైకాన్తికత్వమునకు వ్యభిచారమనికూడ పేరు.)

అసిద్ధత్వదోషము- ఆశ్రయాసిద్ధము, స్వరూపాసిద్ధము, వ్యాప్యత్వాసిద్ధము అని మూడు విధములు. 'గగనారవిందం సురభి; అరవిందత్వాత్; సరోజారవిందవత్' అను అనుమానమున గగనారవిందమనునదే లేదు గాన, 'అరవిందత్వాత్' అను హేతువుకు ఆశ్రయము లేదు. కావున ఇది ఆశ్రయాసిద్ధము. పై వార్తికము ననుసరించి 'వర్ణాః అర్థవన్తః, అర్థవత్సంఘాతావయవత్వాత్' అని ప్రయోగము చేసినచో 20౬ వ కారికలో చెప్పినవిధముగ ('నావయవాఃపదే') వర్ణములనునవే అంగీకార్యములు కావు గాన, ఈ హేతువు ఆశ్రయాసిద్ధత్వదోష దుష్టము.

"ఏకవర్ణ రూపములగు ధాతు, ప్రాతిపదిక, ప్రత్యయ, నిపాతములు అర్థవంతములుగ కానవచ్చుచున్నవి. కావున వర్ణములు గూడ నర్థ వంతములు'' (అర్థవన్తోవర్ణాః; ధాతు ప్రాతిపదిక ప్రత్యయ నిపాతానా మేక వర్ణానామర్థ దర్శనాత్)'' అనగా — 'ఇ'అను ఏకవర్ణ రూపమగు ధాతువునకు గమన మర్థము; 'అ' మొదలగు ప్రాతిపదికములు విష్ణ్వాద్యర్థకములు; 'కారుః' (శిల్పి) ఇత్యాదులలోని 'ఉ' కారాది ప్రత్యయములు కర్త్రాద్యర్థకములు. 'అఅపేహి' ఇత్యాదులలో 'అ' కారాది నిపాతములు సంబోధనాద్యర్థకములు. ఈ విధముగ ఏకవర్ణరూప ధాత్వాదులు సార్థకములు గాన వర్ణము లన్నియు సార్థకములే యని వార్తికకారుని ఆశయము). దీనిని నిరాకరించుచున్నాడు.

శాస్త్రార్థ ఏవ వర్ణానా మర్థవత్త్వే ప్రదర్శితః
ధాత్వాదీనాం విశుద్ధానాం లౌకికోఽర్థో న విద్యతే. 210

వర్ణానామ్ = వర్ణములకు, అర్థవత్త్వే = అర్థవత్త్వమును సాధించువిషయమున (ప్రమాణముగ), శాస్త్రార్థఏవ = ప్రక్రియకొరకై శాస్త్రముచే అంగీకరింపబడిన అర్థమే, ప్రదర్శితః = (వార్తికకారునిచే) చూపబడినది, విశుద్ధానామ్ = కేవలములైన, ధాత్వాదీనామ్ = ధాతు ప్రాతిపదికాదులకు, లౌకికః = లౌకికమైన, అర్థః = అర్థము, న విద్యతే = లేదు.

తా. వర్ణములు అర్థవంతములు అని సాధించుటకు శాస్త్రమాత్రాంగీకృతమగు అర్థమే ప్రమాణముగ చూపబడినది. విశుద్ధములగు ధాత్వాదులకు లౌకికార్థము లేదు.

వి. వార్తికకారుడు వర్ణములు సార్థకములని నిరూపించు సుద్దేశముతో ఏకవర్ణ రూపధాత్వాదుల సార్థకత్వమును ఉదాహరణముగ చూపియున్నాడు. అది యుక్తము కాదు. ధాత్వాదుల కర్థము శాస్త్రపరికల్పితమేకాని, లోకమున వాటికి స్వతంత్రప్రయోగము గాని, అర్థవిశేష బోధకత్వముగాని లేదుకదా.

కేవలములగు కృత్ప్రత్యయ తద్ధిత ప్రత్యయాదులకు గూడ స్వతంత్రముగ అర్థబోధకత్వము లేదని చెప్పుచున్నాడు.

కృత్తద్ధితానా మర్థశ్చ కేవలానా మలౌకికః
ప్రాగ్విభక్తే స్తద న్తస్య తథై వార్థో న విద్యతే. 211

కేవలానామ్ = కేవలములైన, కృత్తద్ధితానామ్ = కృత్తద్ధిత ప్రత్యయముల, అర్థశ్చ = అర్థముకూడ, అలౌకికః = శాస్త్రీయము మాత్రమేగాని, లోకప్రసిద్ధముకాదు, తథైవ = అట్లే, విభక్తేః ప్రాక్ = విభక్తిప్రత్యయములు చేర్చుటకు పూర్వము, తదన్తస్య = కృతద్ధిత ప్రత్యయాంతమునకు, అర్థః = అర్థము, న విద్యతే = లేదు.

తా కేవల కృత్తద్ధితముల అర్థముకూడ శాస్త్రమాత్రప్రసిద్ధము, విభక్తిప్రత్యయములను చేర్చుటకుపూర్వము తదంతములకు కూడ అర్థములేదు.

వి. కేవల కృత్ప్రత్యయ, తద్ధితప్రత్యయములకును, విభక్తి ప్రత్యయరహితములగు కృత్ప్రత్యయాంత తద్ధితప్రత్యయాంతములకును లౌకికార్థముగాని, స్వతంత్ర ప్రయోగార్హతగాని లేదు.

కృత్తద్ధితాంతములకు గూడ అర్థము లేకున్నచో సూత్రకారుడు మొదట — 'అర్థవదధాతు రప్రత్యయః ప్రాతిపదికమ్' (1.2.45) (ధాతువు, ప్రత్యయము, ప్రత్యయాంతము

కాని, అర్థవంతమగు శబ్దస్వరూపము (ప్రాతిపదిక సంజ్ఞ మగును) అను సూత్రముచే, ప్రాతిపదిక సంజ్ఞను విధించి, మరల 'కృత్తద్ధిత సమాసాశ్చ' (1.2.46) అను సూత్రమున, వెనుకటి సూత్రము నుండి 'అర్థవత్' అను పదమును అనువర్తింప చేసికొని 'అర్థవంతములగు కృత్తద్ధితాంతములకు ప్రాతిపదిక సంజ్ఞను ఎట్లు విధించినాడు? దానినిబట్టి కేవల కృత్తద్ధితాంతములకు కూడ అర్థమున్నట్లు సూచిత మగుచున్నది కదా? యని ఆశంకించుకొని, కృత్తద్ధితాంతములకు ఈ సూత్రములో చెప్పిన అర్థవత్త్వము శాస్త్రీయార్థవత్త్వమే గాని లౌకికార్థవత్త్వము కాదని పరిహరించుచున్నాడు.

అభివ్యక్తతరో యోఽర్థః ప్రత్యయాన్తేషు లక్ష్యతే
అర్థవత్తాప్రకరణా దాశ్రితః స తథావిధః. 212

ప్రత్యయాన్తేషు = కృత్తద్ధిత ప్రత్యయాంతములయందు, యః = ఏ, అర్థః = శాస్త్రీయార్థము, అభివ్యక్తతరః = ప్రకృత్యర్థముకంటె ఎక్కువ వ్యక్తముగ, లక్ష్యతే = అపోద్ధార కల్పనచేత ఏర్పడిన అన్వయవ్యతిరేకముల సహాయముచే గోచరించుచున్నదో, తథావిధః = ఆ విధముగ శాస్త్రీయమైన, సః = ఆ అర్థము, అర్థవత్తా ప్రకరణాత్ = కృత్తద్ధితేత్యాది సూత్రములోనికి 'అర్థవత్' అను పదమును అనువర్తింప చేసికొనుటచే, ఆశ్రితః = సూత్రకారునిచే ఆశ్రయింపబడినది.

తా. ప్రత్యయాంతములయందు ఏ అర్థము ఎక్కువగ అభివ్యక్తముగ నున్నదో అట్టి శాస్త్రీయార్థమే 'అర్థవత్' అను పదమును, అనువర్తింపచేసికొనుటచే ఆశ్రయింపబడినది.

వి. అనగా, ఇచట కృత్తద్ధితాంతములు విభక్త్యుత్పత్తికి పూర్వము బోధించు అర్థము శాస్త్రీయమేకాని లౌకికము కాదు కావున, కృత్తద్ధితాంతములు విభక్తిప్రత్యయోత్పత్తికి పూర్వము నిరర్థకములు అని చెప్పుట యుక్తమే అని భావము.

పదములును, వాక్యములును అర్థమును బోధించును అని లోకమున ప్రసిద్ధి యున్నది. వర్ణములు అర్థవంతములని అంగీకరించినచో ఈ లోక ప్రసిద్ధికి భంగము వాటిల్లును అని చెప్పుచున్నాడు.

ఆత్మభేదో నచే త్కశ్చి ద్వర్ణేభ్యః పదవాక్యయోః
అన్యోన్యాపేక్షయా శక్త్యా వర్ణః స్యా దభిధాయకః. 213

పదవాక్యయోః = పదవాక్యములకు, వర్ణేభ్యః = వర్ణములకంటె, ఆత్మభేదః = స్వరూపభేదము, కశ్చిత్ = ఏదియు, న చేత్ = లేకున్నచో, అన్యోన్యాపేక్షయా = పరస్పరాపేక్షగల, శక్త్యా = శక్తిచేత, వర్ణః = వర్ణమే, అభిధాయకః = వాచకము, స్యాత్ = అగును.

తా. పదవాక్యములకు వర్ణములకంటె స్వరూపభేద మేదియును లేకున్నచో, పరస్పరాపేక్షగల శక్తిచేత వర్ణమే వాచకము కావలసి యుండును.

వి. వర్ణములు అర్థవంతములు అని అంగీకరించినచో పదవాక్యములుగూడ అర్థవద్వర్ణసముదాయములేగాన, వర్ణములే పరస్పరాపేక్షగల శక్తిచే అర్థబోధకములు అని చెప్పవలసి యుండును. వర్ణముకంటె అతిరిక్తమగు పదముగాని, వాక్యముగాని, లేకపోవుటచే అవి వాచకములు కావు అని అంగీకరింపవలసి యుండును. వర్ణములకు అర్థములేదని అంగీక

రించినచో అర్థవంతములగు పదవాక్యములకు ఒక విశిష్టస్వరూపమున్నదనియు, అవియే అర్థబోధకము లనియు చెప్పుటకు వీలగును. ఇది లోకప్రసిద్ధికి అనుగుణముగ నుండును.

'నిష్కర్తారమ్' (చేయువానిని) అను పదములో 'న' కారమును లోపింపచేసి, 'ఇష్కర్తారమ్' అని ప్రయోగించినను అర్థబోధము కలుగుచున్నది. కావున అవయవములు కూడ వాచకములే యని యాశంకించి, ఆ విధముగ ఒక వర్ణమును తొలగింపగా, ఏర్పడిన 'ఇష్కర్తారమ్' ఇత్యాది శబ్దము 'నిష్కర్తారమ్' కంటె భిన్నమగు శబ్దమని గాని, అదే శబ్దమనిగాని రెండు పక్షములు చెప్పవచ్చును. రెండు పక్షములందును గూడ అవయవములు అనర్థకములే యని చెప్పుచున్నాడు.

వర్ణేన కేనచి న్న్యూనః సఙ్ఘాతో యోఽభిధాయకః
నచే చ్ఛబ్దాన్తర మసా వన్యూన స్తేన గమ్యతే. 214

కేనచిత్ = ఒకానొక, వర్ణేన = నకారాదివర్ణముతో, న్యూనః = న్యూనమైన, యః = ఏ, సఙ్ఘాతః = 'ఇష్కర్తారమ్' అను సంఘాతము, అభిధాయకః = అర్థబోధకముగ నున్నదో, అసౌ = ఈ సంఘాతము, శబ్దాన్తరం = 'నిష్కర్తారమ్' అనుదానికంటె భిన్నమగు శబ్దము, నచేత్ = కానిచో, తేన = ఆ న్యూన వర్ణపదముచే, అన్యూనః = పరిపూర్ణమగు 'నిష్కర్తారమ్' అను పదము, గమ్యతే = గమ్యమగుచున్నది.

తా. ఒకవర్ణము తొలగించినను అర్థబోధకముగ నున్న వర్ణసంఘాతము శబ్దాంతరము కాకున్నచో, దానిచే పరిపూర్ణశబ్దము గమ్యమగుచున్నది.

వి. న్యూనవర్ణమగు 'ఇష్కర్తారమ్' అనునది 'నిష్కర్తారమ్' అనుదానికంటె భిన్నమని అంగీకరించు పక్షమున అవయవముకూడ వాచకమని చెప్పుటకు అవకాశమేలేదు. అట్లుకాక ఆ రెండును ఏకశబ్దమేయన్నచో 'ఇష్కర్తారమ్' అను న్యూనవర్ణశబ్దముద్వారా 'నిష్కర్తారమ్' అను పూర్ణశబ్దము గమ్యమానమై దానిచే అర్థబోధ కలుగుచున్నదని చెప్పవలెను. ఈ ద్వితీయపక్షమునందుగూడ అవయవమునకు వాచకత్వము లేదని తేలినది.

ఎవ్వడైన వక్త 'ఇష్కర్తారమ్' అని ప్రయోగించినచో శ్రోత — ఈతడు 'నిష్కర్తారమ్' అని ఉచ్చరించుటకు బదులు ఉచ్చారణ దోషముచే 'ఇష్కర్తారమ్' అని పలుకుచున్నాడనియు, వాస్తవమున ఆ పదము 'నిష్కర్తారమ్' అనునదియే యనియు తెలిసికొని అర్థజ్ఞానమును బొందుచున్నాడు. కావున 'నిష్కర్తారమ్' అను పూర్ణపదమే వాచకము గాని తదవయవమగు 'ఇష్కర్తారమ్' అనునది కాదు అని పూర్వకారికోక్త విషయమునే వివరించుచున్నాడు.

స తస్మిన్ వాచకే శబ్దే నిమిత్తాత్ స్మృతి మాదధత్
సాక్షా దివ వ్యవహితం శబ్దే నార్థ ముపోహతే. 215

సః = అన్యూనవర్ణసముదాయము, నిమిత్తాత్ = వ్యాకరణశాస్త్రాభ్యాసరూపనిమిత్తమువలన, తస్మిన్ = ఆ పూర్ణవర్ణమగు, వాచకే = వాచకమగు, శబ్దే = శబ్దమునందు, స్మృతిమ్ = స్మృతిని, ఆదధత్ = కలిగించుచున్నదై, వ్యవహితమ్ = పూర్ణవర్ణశబ్దస్మృతిచే వ్యవహితమగు, అర్థమ్ = అర్థమును, సాక్షాదివ = ప్రత్యక్షముగ వలె, శబ్దేన = పూర్ణవర్ణశబ్దముద్వారా, ఉపోహతే = సమర్పించుచున్నది (బోధించుచున్నది).

తా. అది శాస్త్రాభ్యాసాది నిమిత్తవశమున వాచక శబ్దస్మృతిని కలిగించి వ్యవహితమగు అర్థమును పూర్ణశబ్దముద్వారా ప్రత్యక్షముగ బోధించుచున్నట్లు బోధించుచున్నది.

వి. న్యూనవర్ణ సముదాయమును వినగనే వినువానికి వ్యాకరణశాస్త్రాభ్యాస సంస్కారవశముచేత పూర్ణవర్ణమగు పదము స్మృతికి వచ్చును. అపుడు అర్థబోధ కలుగును. ఈ విధముగ న్యూనవర్ణపదము సాక్షాత్తుగాకాక, పూర్ణవర్ణపదస్మృతిద్వారా అర్థబోధను కలిగించుచున్నను సాక్షాత్తుగా కలిగించుచున్నట్లే తోచును. కావున అవయవమునకు బోధకత్వము పక్షద్వయమందును లేదు.

అవయవములకు అర్థప్రతిపాదకత్వము లేదనెడు విషయమునే మరల శ్లోకద్వయముచే ప్రతిపాదించుచున్నాడు.

పదవాచ్యో యథా నార్థః కశ్చిత్ గౌరఖరాదిషు
సత్యపి ప్రత్యయేఽత్యన్తం సముదాయేన గమ్యతే . 216

సమన్విత ఇవార్థాత్మా పదార్థైర్యః ప్రతీయతే
పదార్థదర్శనం తత్ర తథైవానుపకారకమ్ . 217

గౌరఖరాదిషు = 'గౌరఖరః' 'కృష్ణసర్పః' మొదలగుపదములయందు, పదవాచ్యః = 'గౌర', 'ఖర' 'కృష్ణ', 'సర్ప', మొదలగు విభక్తపదములచే వాచ్యమగు, అర్థః = అర్థము, కశ్చిత్ = ఏదియు, ప్రత్యయే = దాని జ్ఞానము, సత్యపి = శ్రవణసమయమున నున్నను, సముదాయే = సముదాయమునందు, యథా = ఏవిధముగా, అత్యన్తమ్ = అత్యంతము. న గమ్యతే = గమ్యముకాదో, తథైవ = ఆ విధముగనే ("దేవదత్త గా మభ్యాజ కృష్ణాం దణ్డేన" ఇత్యాదివాక్యములయందుగూడ) పదార్థైః = పదార్థములతో, సమన్విత ఇవ = సమన్వితము కాకున్నను సమన్వితమైనదివలె, యః = ఏ, అర్థాత్మా = ప్రతిభాలక్షణమగు వాక్యార్థము, ప్రతీయతే = బుద్ధి గోచరమగుచున్నదో, తత్ర = ఆ వాక్యార్థమునందు, పదార్థదర్శనమ్ = పదార్థజ్ఞానము, అనుపకారకమ్ = ఉపకారకము కాదు.

తా. గౌర-ఖరాదిశబ్దములయందు ప్రతీతియున్నను పదవాచ్యమగు అర్థము సముదాయమునందు ఏవిధముగ ఏమాత్రమును గమ్యముగాకుండునో, ఆ విధముగనే పదార్థములతో సమన్వితమైనది వలె, ప్రతీయమానమగు వాక్యార్థమునందు పదార్థజ్ఞానము ఉపకారకము కాదు.

వి. 'గౌరఖరః' అను పదమునకు అడవిగాడిద యని యర్థము. 'కృష్ణసర్పః' అను పదమునకు 'త్రాచుపాము' అని యర్థము. ఈ విధముగ ఈ పదసముదాయములే ఆయా యర్థములను బోధించుచున్నవి. వాటిలో నున్న 'గౌర', 'ఖర', 'కృష్ణ', 'సర్ప', మొదలగు పదములకు వ్యస్తరూపమున అర్థ మేదియు లేదు. పదోచ్చారణసమయమున గౌరాది పదములయర్థము బుద్ధిగోచరమగుచున్నను, సముదాయార్థమునందు ఆ యర్థములకు అన్వయము లేదు. అట్లే 'దేవదత్త గా మభ్యాజ' ఇత్యాది వాక్యములే అఖండమగు ప్రతిభాలక్షణమైన అర్థమును బోధించుచున్నవి. ఏ తద్వాక్యాంతర్గత గవాదిశబ్దార్థములు వాక్యార్థమునకేమియు ఉపకారమును చేయజాలవు. ద్రాక్షారసము, పంచదార, పాలు, మొదలగు మధుర

ద్రవ్యములను, లవంగాది సుగంధద్రవ్యములను, కలిపి తయారుచేసిన పానకమునందు, ఒక విలక్షణమగు రసముండును గాని, ఆ ద్రాక్షాది రసముల జ్ఞానము ఆ రుచియందు వేరువేరుగ గోచరింపదు. అట్లే అఖండమగు వాక్యార్థమున పదార్థములు సమన్వితములైనట్లు కనబడునే గాని, వాటి కొక స్వతంత్ర ప్రతీతి లేదు.

సముదాయములును, అవయవములును, వేరు అర్థములను బోధించునని అంగీకరించినచో వృత్తియందు ఒకే సమయమున విరుద్ధ ధర్మముల ప్రతీతి కలుగవలసి యుండును అని చెప్పుచున్నాడు.

సముదాయావయవయో ర్భిన్నార్థత్వే చ వృత్తిషు
యుగపద్భేదసంసర్గౌ విరుద్ధా వానుషంగికౌ. 218

వృత్తిషు = 'గౌర ఖరః' 'కృష్ణ సర్పః' మొదలగు సమాసాది వృత్తులయందు, సముదాయావయవయోః = సముదాయము, అవయవము, భిన్నార్థత్వే = వేరువేరు అర్థములు కలవైనచో, విరుద్ధౌ = పరస్పరవిరుద్ధములగు, భేదసంసర్గౌ = భేదసంసర్గములు, యుగపత్ = ఒక్కమాటుగా, అనుషంగికౌ = ప్రాప్తించును.

తా. వృత్తులయందు సముదాయావయవములు, భిన్నార్థములన్నచో, పరస్పర విరుద్ధములగుభేద-, సంసర్గములు ఒక్కమారుగ ప్రాప్తించును.

వి. మట్టి, నీరు విడదీయరాకుండునట్లు కలసిపోయి బురద యను విజాతీయ వస్తు వుత్పన్నమైనట్లు గౌరఖరాది సమాసవృత్తి గౌతఖరత్వాదిజాతిగల పదార్థాంతరమును బోధించుచుండగా, అదేసమయమున తత్సముదాయమున నవయవములగు 'గౌర', 'ఖర' మొదలగు శబ్దములుకూడ సముదాయార్థ విరుద్ధములగు అర్థములను బోధించునని చెప్పవలసి యుండును. అది అనుభవవిరుద్ధము. కావున సముదాయమునకే గాని, అవయవములకు అర్థము లేదు.

వృత్తియందును, వాక్యార్థముల యందును పద పదార్థములు కల్పితములని అంగీకరింపనిచో 'అధిభువి రామః' ఇత్యాది వాక్యముల యందు 'అధి' మొదలగునవి అధికరణాద్యర్థములను బోధించునని చెప్పవలసి యుండును. అట్లైనచో వాటిని స్వతంత్రరూపమున ప్రయోగించుటకు వీలుండ వలెను. అట్లు లేదుకదా! కావున పద పదార్థములు అసత్యములని చెప్పుచున్నాడు.

కశ్చ సాధనమాత్రార్థా నధ్యాదీన్ పరికల్పయేత్ ?
అప్రయుక్తపద శ్చార్థో బహువ్రీహౌ కథం భవేత్ ? 219

కశ్చ = ఎవడు, అధ్యాదీన్ = 'అధి' మొదలగునాటిని, సాధనమాత్రార్థాన్ = అధికరణాది కారకార్థములు కలవాటినిగా, పరికల్పయేత్ = కల్పింపగలడు, బహువ్రీహౌ = బహువ్రీహిసమాసమునందు, అప్రయుక్తపదః = ప్రయోగింపబడని పదములగల, అర్థః = అర్థము, కథమ్ = ఎట్లు, భవేత్ = అగును (బోధింపబడును).

తా. 'అధి' మొదలగునవి సాధన మాత్రార్థములేయని ఎవడు కల్పించును? బహువ్రీహియందు అప్రయుక్తపదమగు అర్థము ఎట్లు భాసించును?

వి. 'అధిహరి' (హరియందు) ఇత్యాది సముదాయమున కే అధికరణార్థ వృత్తిత్వముగాని, 'అధి' అనుదానికి అధికరణార్థ బోధకత్వములేదు. అట్లైనచో దానిని స్వతంత్రముగ ప్రయోగించుటకు వీలుండవలెను. 'చిత్రగుః' (చిత్రమైన గోవులు కలవాడు) ఇత్యాది బహువ్రీహిసమాసములయందు చిత్రమైన గోవులుకల దేవదత్తాదులను బోధించు పద మేది యును లేదు. అయినను దేవదత్తాద్యర్థ ప్రతీతి కలుగుచునే యున్నది. దానినిబట్టి గూడ సముదాయమే విశిష్టార్థబోధకమనియు, అవయవములకు అర్థములేదనియు స్పష్టమగుచున్నది.

అవయవములు కూడ సార్థకములైనచో 'ప్రజ్ఞః', 'సంజ్ఞః' ఇత్యాదులలోని 'జ్ఞః' అనునది భిన్నార్థమును బోధింపవలసి యుండును. అట్లు లేదు. కావున, అవయవములు నిరర్థకములని చెప్పుచున్నాడు.

ప్రజ్ఞసంజ్ఞాద్యవయవై ర్న చా_స్త్యర్థావధారణమ్
తస్మా త్సంఘాత ఏవైకో విశిష్టార్థ నిబన్ధనమ్ . 220

ప్రజ్ఞసంజ్ఞాద్యవయవైః = 'ప్రజ్ఞః', 'సంజ్ఞః' మొదలగు పదముల అవయవములైన 'జ్ఞ' అను పదములచే, అర్థావధారణమ్ = అర్థనిర్ణయము, నచాస్తి = లేదు, 'జ్ఞ' అనునది స్వతంత్రముగ అర్థబోధకము కాదు. తస్మాత్ = ఆ కారణమువలన, ఏకః = ఒక్క (అఖండమైన), సంఘాతఏవ = స్ఫోటరూపమగు సంఘాతమే, విశిష్టార్థ నిబన్ధనమ్ = ప్రతిభాత్మకమగు విశిష్టార్థబోధకు హేతువు.

తా. 'ప్రజ్ఞ', 'సంజ్ఞ' మొదలగు పదముల అవయవములచే అర్థనిర్ణయము లేదు. కావున సంఘాత మొక్కటియే విశిష్టార్థబోధకారణము.

వి. సమాసములలో ఒక్క సమయముననే భేదము, సంసర్గము, అనెడు విరుద్ధార్థములు ఉపస్థితములు కావలసి యుండుటచేతను, స్వతంత్రముగ 'అధి' మొదలగునవి అధికరణాద్యర్థ బోధకములుగ కానరాకుండుటచేతను, బహువ్రీహియందు ప్రయుక్త పదార్థభిన్నమగు అన్యపదార్థము ప్రతీయమానమగుటచేతను, 'సంజ్ఞః' ఇత్యాదులలోని 'జ్ఞః' మొదలగునవి స్వతంత్రముగ అర్థబోధకములు కాకుండుటచేతను (ఈ నాలుగు హేతువులచే) అఖండమును స్ఫోటాత్మకమును అగు పదసంఘాతమే ప్రతిభాత్మకమగు అఖండ వాక్యార్థమును బోధించుచున్నదని అంగీకరింపవలెను.

ఇపుడు అఖండ వాక్యార్థవాదియగు సిద్ధాంతి తన సిద్ధాంతమున ఇతరులు చూపు దోష ప్రసక్తమును అనువదించి పరిహరించుచున్నాడు. పదార్థము అసత్యమైనచో 'దేవదత్త యజ్ఞదత్త విష్ణుమిత్రాః భోజ్యన్తామ్' అను వాక్యమున ద్వంద్వము అఖండ సముదాయరూప వాక్యార్థమును విధించుచున్నది. కాన, పదార్థభేదము లేకుండుటచే ఏకవచనమే ఉండవలెను గాని, బహువచన మెట్లు వచ్చినది ? అను ఆశంకకు సమాధానము చెప్పుచున్నాడు.

గర్గా ఇత్యేక ఏవాయం బహుష్వర్థేషు వర్తతే
ద్వంద్వ సంజ్ఞోఽపి సంఘాతో బహూనా మభిదాయకః. 221

యథా = ఏవిధముగా, గర్గా ఇతి = గర్గాః అని, ఏక ఏవ అయం = ఈ ఒక్క పదమే, బహుషు = బహుత్వ విశిష్టమైన, అర్థేషు = అర్థములయందు, వర్తతే = ప్రవర్తించు

చున్నదో, (తథా = ఆవిధముగా), ద్వంద్వసంజ్ఞః = ద్వంద్వమను పేరుగల, సంఘాతః అపి = సముదాయముకూడా, బహూనాం = అనేకవస్తువులకు, అభిధాయకః = వాచకము.

తా. 'గర్గాః' అనెడు ఒక్కపదమే బహుత్వవిశిష్టార్థములను బోధించునట్లు ద్వంద్వమను పేరుగల సంఘాతముకూడ అనేక వస్తువులను బోధించును.

వి. గర్గశబ్దముకంటె, 'గర్గాదిభ్యో యఞ్' అను సూత్రముచే, 'గర్గస్య గోత్రాపత్యమ్' అను నర్థమున 'యఞ్' ప్రత్యయము వచ్చి 'గార్గ్యః' అను రూపము సిద్ధించును. గర్గుని గోత్రమునందు పుట్టినవాడు అని యర్థము. గర్గగోత్రమునందు పుట్టిన అనేకులు అనునర్థము చెప్పవలసి వచ్చినపుడు, ఎంతమందిని చెప్పవలెనో అన్నిసారులు గార్గ్యశబ్దమును ఆవృత్తి చేయవలయును. గాన, గార్గ్యశ్చ, గార్గ్యశ్చ, గార్గ్యశ్చ అని ఆ వృత్తిచేసిన పిమ్మట, 'సరూపాణా మేకశేష ఏకవిభక్తౌ' (1-2-64) అను సూత్రముచే ఒక్క గార్గ్యశబ్దము మాత్రమే శేషించును. బహుత్వమును బోధింపవలసి యున్నదిగాన, 'యఞఞోశ్చ' (2-4-64) అను సూత్రముచే 'యఞ్' లోపింపతన్నిమిత్తకమగు ఆదివృద్ధికూడ పోయి 'గర్గ' శబ్దము మిగులును. ఇపుడు ఈ 'గర్గ' శబ్దము అవయవ విభాగ మేమియు లేకున్నను బహుత్వమును బోధించుచున్నది గాన, బహువచన ప్రత్యయమగు 'జస్' వచ్చి 'గర్గాః' అను రూపము సిద్ధించును. (ఈ శబ్దము - గార్గ్యః, గార్గ్యౌ, గర్గాః; గార్గ్యమ్, గార్గ్యౌ, గర్గాన్ ఇత్యాది విధమున ఉండును). ఈ విధముగ నిరస్తావయవభేదమగు గర్గశబ్దము బహ్వర్థ వృత్తియగుటచే ఎట్లు బహువచనాంతమైనదో, అట్లే ద్వంద్వ సంజ్ఞమగు సంఘాతముగూడ అవయవ భేదరహితమైనను శబ్దశక్తి మాహాత్మ్యముచే బహుత్వమును బోధించును గాన బహువచనము వచ్చినది. తావన్మాత్రముచే వాక్యార్థ వ్యతిరిక్తమగు పదార్థ మున్నదని చెప్పుటకు అవకాశము లేదు.

వృత్తి అఖండార్థము అను పక్షమున 'ధవఖదిరపలాశాః సిచ్యన్తామ్' ఇత్యాదులందు వృత్త్యర్థవ్యతిరిక్తమగు పదార్థము లేకుండుటచే, 'ప్రత్యేకం వాక్యపరిసమాప్తిః' అనునది కుదురదు కాన—అనగా 'ధవః సిచ్యతామ్ ఖదిరః సిచ్యతామ్, పలాశః సిచ్యతామ్' ఇత్యాదివిధమున ధవాది వృక్షములతో క్రియకు విడివిడిగ అన్వయము చెప్పుటకు వీలులేదు గాన—సముదాయమునకే ఒక్కమారుగ సేచనక్రియాకర్మత్వము చెప్పవలెను. కాని మూడుచెట్ల సముదాయమును ఒకే మయమున తడుపుట శక్యముకాదు. కావున వాక్యార్థబోధము అనుపపన్నము అను రెండవచోద్యమునకు సమాధానము చెప్పుచున్నాడు.

యథైకదేశే భుజ్యాదిః ప్రత్యేక మవతిష్ఠతే
క్రియైవం ద్వంద్వవాచ్యేఽర్థే ప్రత్యేకం ప్రవిభజ్యతే . 222

యథా = ఏవిధముగా, భుజ్యాదిః = భుజ్ మొదలగు, క్రియా = క్రియ, ఏకదేశే = సముదాయముయొక్క ఏకదేశమునందు, ప్రత్యేకం = వేరువేరుగా, అవతిష్ఠతే = ఉండునో, ఏవం = ఈ విధముగా, ద్వంద్వవాచ్యే = ద్వంద్వముచే బోధింపతగిన, అర్థే = సముదాయరూపార్థమునందు, ప్రత్యేకమ్ = ఒక్కొక్కదానియందు, ప్రవిభజ్యతే = విభక్తమగుచున్నది.

తా. భుజ్యాదిక్రియ సముదాయైకదేశమునందు ప్రత్యేకముగ నున్నట్లు ద్వంద్వవాచ్యమగు అర్థమునందుగూడ ఒక్కొక్కదానియందు విభక్తమగుచున్నది.

వి. "అతిథయః భోజ్యన్తామ్" (అతిథులకు భోజనము పెట్టుడు) అనునపుడు 'అతిథయః' అను ఏకశేషమునందు వృత్త్యర్థమగు సముదాయముకంటె భిన్నమగు పదార్థము లేకపోయినను భోజనక్రియ సముదాయములో ఏకదేశము (అవయవము) లగు బుద్ధి పరికల్పిత వ్యక్తులతో వేరువేరుగా అన్వయించును. అట్లే ద్వంద్వవాచ్యమగు సముదాయమునందలి అవయవములను బుద్ధిచే విభజించుకొని వాటితో సేచనాదిక్రియలను అన్వయించుకొన వచ్చును గాన అఖండత్వ పక్షమునందు దోష మేమియు లేదు.

'జనపద తదవధ్యోశ్చ' (4.2.124) అను సూత్రము జనపదవాచకము కంటెను తదవధివాచకము కంటెను (అనగా వెనుక జనపదము చెప్పబడినది గాన ఈ తచ్ఛబ్దము జనపదమును పరామర్శించును. కావున తదవధివాచకమనగా జనపదముయొక్క అవధిని చెప్పునది అని అర్థము) 'వుఞ్' ప్రత్యయము వచ్చునని చెప్పుచున్నది. 'జనపద తదవధ్యోః' అనునది ద్వంద్వము. అఖండవాదపక్షమున ఈ ద్వంద్వ ఘటకములగు పదములకు అర్థము లేదు గాన జనపదశబ్దము నిరర్థకము. అట్టి జనపదశబ్దమును తచ్ఛబ్దముచే పరామర్శించుట కూడ కుదరదు. ఇచటనున్న తచ్ఛబ్దము కూడ నిరర్థకమేకదా ? కావున వృత్త్యఖండార్థత్వపక్షమున ఈ సూత్రమునకు అర్థముచెప్పుట కుదరదు అను మూడవచోద్యమునకు (అనుపపత్త్యాశంకకు) సమాధానము చెప్పుచున్నాడు.

యచ్చ ద్వన్ద్వపదార్థస్య తచ్ఛబ్దేనవ్యపేక్షణా
సాపి వ్యావృత్తరూపేఽర్థే సర్వనామసరూపతా. 228

ద్వన్ద్వపదార్థస్య='జనపద తదవధ్యోః' అను ద్వంద్వమున ఘటితమగు 'జనపద' పదార్థమునకు, తచ్ఛబ్దేన=తచ్ఛబ్దముచేత, వ్యపేక్షణా = పరామర్శ మనునది, యచ్చ= ఏదికలదో, సాపి = ఆ పరామర్శకూడ, వ్యావృత్తరూపే=విశేషణ విశేష్యోభయ రూపము కంటె వ్యావృత్తమై (భిన్నమై) అఖండమగు, అర్థే = ప్రతిభామాత్రవృత్త్యర్థమునందు, బుద్ధికల్పితమైన అపోద్ధారముచే పదార్థాన్వయము నాశ్రయించిన, సర్వనామ సరూపతా = సర్వనామ సారూప్యము మాత్రమే.

తా. ద్వంద్వావయవమగు పదముయొక్క అర్థమును తచ్ఛబ్దముచే పరామర్శించుట యనునదిగూడ కాల్పనిక భేదముగల అర్థముతో సంబంధించినట్లు కనబడు సర్వనామ సారూప్య మాత్రముచే ఏర్పడినదియే.

వి. 'జనపద తదవధ్యోః' అను పైన చూపిన ద్వంద్వమునందు వాస్తవమున సర్వనామశబ్ద మేదియును లేదు. కావున, ఆ శబ్దము పూర్వపదమగు జనపదశబ్దమును పరామర్శించుట అనునదియు లేదు. ఇది సర్వనామమువలె భాసించుచున్నది గాని, వాస్తవమున సర్వనామము కాదు. కావున అఖండార్థమే ఇచట బోధింపబడుచున్నది, అని తాత్పర్యము.

'ధవఖదిరపలాశాః ఛిద్యన్తామ్' అను వాక్యమునందలి 'ధవఖదిరపలాశాః' అను ద్వంద్వమునందలి పదములు నిరర్థకములు. ఈ ద్వంద్వము అఖండమగు అర్థమునే బోధించుచున్నది అని అంగీకరించినచో ఛేదనక్రియలో ధవఖదిరపలాశము లన్నియు ఒక్కమారుగ అన్వయించును కాని అన్నింటిని ఒక్కమారుగ ఛేదించుట అశక్యముకదా ? కావున పదములకు

కూడ సార్థకత్వము నంగీకరించి ఈ వృక్షములను క్రమముగ ఛేదింపవలెను అను అర్థము చెప్పిన యుక్తముగనుండును అనెడు వాల్గవచోద్యమును పరిహరించుచున్నాడు.

యథా చ ఖదిరచ్ఛేదే భాగేషు క్రమవాం శ్ఛిదిః
తథా ద్వన్ద్వపదార్థస్య భాగేషు క్రమదర్శనమ్. 224

ఖదిరచ్ఛేదే='ఖదిరః ఛిద్యతామ్' అనునపుడు నిరవయవమగు ఖదిరమును, అఖండమగు ఛేదనమును ఉపస్థితములగుటచే ఈ వాక్యముచే క్రమరహితమగు ఖదిరచ్ఛేదనము చోద్యమగునపుడు, ఛిదిః=ఛేదనక్రియ, యథా=ఏవిధముగా, భాగేషు=ఖదిరముయొక్క త్వగాది భాగములయందు, క్రమవాన్=క్రమము కలదిగా భాసించుచున్నదో, తథా=అట్లే, ద్వంద్వపదార్థస్య=అఖండమగు ద్వంద్వపదార్థముయొక్క, భాగేషు= (అక్రమము, అఖండమునగు ద్వంద్వపదార్థము ఛేదనక్రియాకర్మ కాజాలదు గాన బుద్ధిపరికల్పితములైన) అవయవములయందు, క్రమదర్శనమ్= ఛేదనక్రియానుష్ఠాన క్రమదర్శనము (లోకములోనున్నది).

తా. 'ఖదిరః ఛిద్యతామ్' అనునపుడు ఛేదనక్రియ ఏవిధముగ దాని భాగములయందు, క్రమము కలదిగ నుండునో అట్లే ద్వంద్వపదార్థ భాగములయందు క్రమదర్శనమున్నది.

వి. పదార్థ వాక్యార్థములకు భేదము నంగీకరించువారి మతమునందుగూడ "ఖదిరః ఛిద్యతామ్" ఇత్యాదులలో ఖదిరము సావయవమైనను శబ్దశక్తిచే అఖండముగనే భాసించుచున్నది. అట్లే ఛేదనక్రియగూడ సావయవమైనను అఖండముగనే ప్రతిభాసించుచున్నది. ఖదిరము సావయవమని సర్వవిదితమేకదా: క్రియకూడ క్రమవిశిష్టములగు అనేకావయవముల సమూహము. ఉదాహరణమునకు పాకక్రియయనగా, బియ్యమును కడుగుట, గిన్నెలో పోయుట, దానిని పొయ్యిపై నుంచుట, మంటపెట్టుట మొదలగు ఎన్నియో క్రమవంతములగు అవయవములతో గూడినది. ఐనను వాటినన్నింటిని బుద్ధిచే ఒకదానిగా భావించి ఒక క్రియ యందురు. ప్రకృతమున 'ఖదిరమును ఛేదింపుము' అనునపుడు శబ్దముచే అఖండము, అక్రమము అగు ఛేదనక్రియ భాసించుచున్నను ఒక్కమారుగ చేయుట అశక్యముగాన, అవయవములయందే పర్యవసన్న మగుచున్నది. అనగా, ఈ ఛేదనము మొదట చెట్టుపై నున్న బెరడుమీదను, పిమ్మట కఠినపదార్థమునందును పిమ్మట సారభూతమైన అంతర్గత పదార్థమందును ప్రవర్తించుచున్నది. అట్లే 'ధవఖదిరపలాశాః ఛిద్యన్తామ్' అనునపుడు ద్వంద్వమున వృత్త్యర్థము అఖండమేయైనను అపోద్ధారబుద్ధిచే పరికల్పితములగు, పదార్థముల క్రమము ననుసరించి ఛిదిక్రియకు లోకమున అన్వయము చూడబడుచున్నది.

వనపాలకుడొకడు 'మమపురుషైః అస్మిన్ పర్వతే ధవఖదిరపలాశాః ఛిద్యన్తామ్' (నా పురుషులు ఈ పర్వతమునందలి ధవఖదిరపలాశములను ఛేదింపవలెను.) అని చెప్పినపుడు ఆ పర్వతముపైనున్న కొన్ని ధవములను, కొన్ని ఖదిరములను, కొన్ని పలాశములను మాత్రమే ఛేదించి ఆ పురుషులు వనపాలకుని ఆజ్ఞ నిర్వహింపబడినదని చెప్పుచున్నారు. కాని వృత్త్యర్థము అఖండమని యంగీకరించినచో ఆ పర్వతముపై నున్న ధవాది వృక్షముల నన్నిటిని ఛేదించిన గాని, వనపాలుని ఆజ్ఞను నిర్వహించినట్లు కాకూడదు అను ఐదవ చోద్యమును పరిహరించుచున్నాడు.

సఙ్ఘైకదేశే ప్రక్రాన్తాన్ యథా సఙ్ఘానుపాతినః
క్రియావిశేషాన్ మన్యన్తే స ద్వన్ద్వావయవే క్రమః . 225

సఙ్ఘానుపాతినః = బ్రాహ్మణాః భోజ్యన్తామ్ ఇత్యాదిస్థలములలో 'బ్రాహ్మణాః' అను ఏకశేషవృత్తికి అర్థమగు బ్రాహ్మణసంఘమునకు సంబంధించిన, ప్రక్రాన్తాన్ = ఉపక్రమమున ప్రతీతములగు, క్రియావిశేషాన్ = క్రియావిశేషములను, సంఘైకదేశే = సంఘము యొక్క ఒకభాగమునందు, యథా = ఏవిధముగా, మన్యన్తే = అంగీకరించుచున్నారో, ద్వన్ద్వావయవే = ద్వన్ద్వవాచ్యసముదాయాన్తర్గతములగు అవయవములందుగూడ, సః = అదియే, క్రమః = క్రమము.

తా. సంఘమునకు సంబంధించిన ఉపక్రమ ప్రతీతములగు క్రియావిశేషములను సంఘైకదేశమునం దెట్లు అంగీకరింతురో ద్వన్ద్వావయవమునందును ఆ విధముగనే క్రమము అంగీకరింప దగినది.

వి. 'బ్రాహ్మణాః భోజ్యన్తామ్' ఇత్యాదిస్థలములలో భోజనక్రియ ప్రారంభమున ఏకశేషవృత్తియగు 'బ్రాహ్మణాః' అనుపదముచే బోధింపబడిన బ్రాహ్మణసంఘాతముతో నన్వయించునట్లు భాసించుచున్నది. కాని, తత్సంఘాతావయవమగు కొందరు బ్రాహ్మణులు మాత్రమే భోజనము చేసినను 'బ్రాహ్మణాః భుక్తాః' అని చెప్పుదురు. అట్లే ధవఖదిర పలాశ సంఘాతమంతయు ఛేదించక కొన్ని ధవాదులను మాత్రమే ఛేదించినను 'ధవఖదిరపలాశాః ఛిన్నాః' అని చెప్పుటకు వీలగుచున్నది. ఈ విధముగ వృత్త్యఖండార్థత్వమును అంగీకరించినను ద్వంద్వవాచ్య సముదాయాతంతర్గతావయవములతో క్రియ అన్వయించుట కవకాశమున్నది.

వృత్తియు వృత్త్యర్థమును అఖండములు, పద పదార్థములు అసత్యములు అని, అంగీకరించినచో, అవ్యయీభావము పూర్వపదార్థ ప్రధానము, తత్పురుషము ఉత్తర పదార్థ ప్రధానము, ఇత్యాది విధమున సమాసములందు తత్తత్పదార్థ ప్రాధాన్య వర్ణనము అసంగతమగును అనెడు అరవ చోద్యమును పరిహరించుచున్నాడు.

ప్రతిపాదయతా వృత్తి మబుధాన్ వాక్యపూర్వికామ్
వృత్తౌ పదార్థభేదేన ప్రాధాన్య ముపదర్శితమ్ . 226

అబుధాన్ = అపండితులనుగూర్చి, వాక్యపూర్వికామ్ = వాక్యపూర్వకమగు, వృత్తిం = వృత్తిని, ప్రతిపాదయతా = ప్రతిపాదించుచున్న ఆచార్యునిచేత, పదార్థభేదేన = అలౌకిక వాక్యమునందలి పదార్థభేదమునుబట్టి వృత్తియందుకూడ నేర్పడిన పదార్థభేదముచే, వృత్తౌ = సమాసమునందు, ప్రాధాన్యమ్ = తత్తత్పదార్థ ప్రాధాన్యము, ఉపదర్శితమ్ = చూపబడినది.

తా. అబుధులకు వాక్యపూర్వకమగు వృత్తిని బోధించుచు ఆచార్యుడు పదార్థభేదమును పురస్కరించుకొని వృత్తియందు తత్తత్పదార్థప్రాధాన్యమును చూపియున్నాడు.

వి. ఆచార్యుడు అజ్ఞులకు సులభముగ అర్థమును బోధించు నిమిత్తమై సమాస వృత్తియందు, అపోద్ధారకల్పనచే 'రాజపురుషః' ఇత్యాదివృత్తుల సిద్ధికొరకు 'రాజన్ +

జస్ + పురుష + సు' ఇత్యాద్యలౌకిక విగ్రహవాక్యమును కల్పించినాడు. ఈ విధముగ అలౌకిక విగ్రహవాక్యకల్పనా పూర్వకముగ, సమాసరూపవృత్తిని ప్రతిపాదించు ఆచార్యుడు అలౌకిక వాక్యమునందలి పదార్థభేదమునుబట్టి, సమాసమునందు ఆయా పదముల అర్థములు ప్రధానమని ప్రతిపాదించినాడు. వాస్తవమున వృత్తియందు పదపదార్థ విభాగము లేదు.

'అబ్రాహ్మణః' ఇత్యాది 'నఞ్' సమాసములందలి పదార్థ ప్రాధాన్యమును భాష్యకారులు అనేకవిధముల చూపియున్నారు. అదికూడ శిష్యశిక్షార్థమై చేసిన కల్పనయే కాని వాస్తవము కాదని చెప్పుచున్నాడు.

అభేదా దభిధేయస్య నఞ్సమాసే వికల్పితమ్
ప్రాధాన్యం బహుధా భాష్యే దోషాస్తు ప్రక్రియాగతాః . 227

అభిధేయస్య = అర్థముయొక్క, అభేదాత్ = ఏకత్వమువలన (వృత్త్యర్థము అఖండమగుటచే దానియందు పూర్వపదార్థోత్తరపదార్థాది ప్రాధాన్యవిచారము లసంగతమైనను), నఞ్ సమాసే = నఞ్ సమాస విషయమున, ప్రాధాన్యమ్ = పూర్వోత్తరాది పదార్థ ప్రాధాన్యము, భాష్యే = భాష్యమునందు, బహుధా = అనేకవిధములుగా, (యత్), వికల్పితమ్ = వికల్పింపబడెను అనువిషయ మేది కలదో అదియు, తత్ప్రయుక్తాః = తాదృశప్రాధాన్యవికల్పకృతములగు దోషాస్తు = పూర్వపదార్థప్రాధాన్యము చెప్పినచో ఈ దోషమనియు, ఉత్తరపదార్థ ప్రాధాన్యమంగీకరించిన ఈ దోషమనియు, ఈ విధముగ భాష్యమునందు చెప్పబడిన దోషములు, ప్రక్రియాగతాః = కల్పితమగు లౌకిక విగ్రహవాక్యాది ప్రక్రియకు సంబంధించినవి.

తా. అర్థము అఖండముగాన, భాష్యమునందు 'నఞ్' సమాసవిషయమున బహువిధముల చూపబడిన ప్రాధాన్యవికల్పమును, అభ్యూహితములగు ఆయా దోషములును కాల్పనిక ప్రక్రియకు సంబంధించినవి.

వి. భాష్యకారుడు నఞ్ సమాసమునందు అర్థభేదమునుబట్టి కొన్ని యెడల పూర్వపదార్థప్రాధాన్యమును, కొన్ని యెడల అన్యపదార్థప్రాధాన్యమును, మరికొన్ని యెడల ఉత్తరపదార్థ ప్రాధాన్యమును ప్రతిపాదించెను. వృత్త్యర్థము అఖండమేయైనను భాష్యకారుడు ఈ విధముగ త్రివిధ వికల్పములను చూపుట, పూర్వపదార్థాది ప్రాధాన్యము నంగీకరించు పక్షమున నాయాదోషములు వచ్చునని చెప్పి ఉత్తరపదార్థాది ప్రాధాన్య స్థాపనము చేయుట, ఇదియంతయు, కాల్పనికమగు విగ్రహ వాక్యాదులకు సంబంధించినదేగాని, అఖండ సమాస వృత్తికి సంబంధించినదికాదు.

వృత్తియందు పద పదార్థములు లేవన్నచో జహత్స్వార్థయనియు, అజహత్స్వార్థావృత్తియనియు భేదము ఉండుటకు అవకాశము ఉండదు. ఏ వృత్తియందలి పదము తన అర్థమును పరిత్యజించునో అది జహత్స్వార్థయనియు, ఏవృత్తియందలి పదము పరిత్యజింపకుండునో అది అజహత్స్వార్థ యనియు అనబడును. వృత్తి యఖండమై పదపదార్థములే లేవన్నచో ఈ విభాగ మెట్లు కుదురును ? అను చోద్యమును పరిహరించుచున్నాడు.

జహత్స్వార్థ వికల్పేచ సర్వార్థత్యాగ మిచ్ఛతా
బహువ్రీహిపదార్థస్య త్యాగః సర్వస్య దర్శితః . 228

సర్వార్థ త్యాగం = వృత్తియందు సర్వ పదార్థ త్యాగమును, ఇచ్ఛతా = కోరుచు, 'అనేక మన్యపదార్థే' (2.2.24) (అన్యపదార్థమును బోధించు అనేక పదములు సమసించును) అని సూత్రించిన ఆచార్యునిచేత, సర్వస్య = సమస్తమైన, బహువ్రీహి పదార్థస్య = బహువ్రీహి పదార్థముయొక్క, త్యాగః = త్యాగము, జహత్స్వార్థవికల్పే = జహత్స్వార్థ వృత్తియగు వికల్పమునందు, దర్శితః = ప్రమాణముగ చూపబడినది.

తా. సర్వార్థ త్యాగమును అంగీకరించెడు పాణిన్యాచార్యుడు సకల బహువ్రీహి పదార్థ త్యాగమును జహత్స్వార్థ వికల్పమునకు ప్రమాణముగ చూపియున్నాడు.

వి. పాణిన్యాచార్యుడు "అనేక మన్యపదార్థే" యను బహువ్రీహి సమాస విధాయక సూత్రమున సమస్యమానములగు పదముల అర్థములకంటె భిన్నమగు అర్థమును బోధించుటకై ప్రథమాంత పదములు సమసించును అని చెప్పెను. వృత్తియందు పదార్థము ఉండదు అను సిద్ధాంతము నంగీకరించువాడు కావుననే ఈయన ఈ విధముగ బహువ్రీహి యందు సర్వపదార్థ త్యాగమును బోధించి వృత్తి జహత్స్వార్థయా, అజహత్స్వార్థయా అను వికల్పమున జహత్స్వార్థ పక్షమే తన కభీష్ట మనియు అందుచే అఖండత్వ వాదమేయథార్థ మనియు సూచించియున్నాడు.

వృత్తులు జహత్స్వార్థ యనియు, అజహత్స్వార్థ యనియు రెండువిధములు. అవయవార్థమును అపేక్షింపకయే సముదాయార్థమును బోధించు వృత్తి జహత్స్వార్థా వృత్తి. ఈ వృత్తి యందు ఘటకములగు అవయవములు తమతమ యర్థములను విడచినవిగాన, (జహతి స్వార్థం పదాని యస్యాం సా) దీనికాపేరు వచ్చినది. 'రథన్తరమ్' (ఒకానొకసామము), కృష్ణ సర్పః (త్రాచుపాము) గౌరఖరః (అడవిగాడిద) శుశ్రూషా (సేవ-ఇది సన్నంతధాతువృత్తి. శ్రోతుం ఇచ్ఛా శుశ్రూషా అను అవయవార్థమును బోధింపదు) ఇత్యాదివృత్తులు అవయవార్థ నిరపేక్షముగనే సముదాయార్థమును బోధించుచున్నవి గాన, ఇవి జహత్స్వార్థములు. 'రాజపురుషః' ఇత్యాదివృత్తులు అవయవార్థముతో మిశ్రితమగు సముదాయార్థమును బోధించుచున్నవి గాన, (ఈ వృత్తులు తమయందలి పదముల స్వార్థములను విడచుట లేదుగాన) ఇవి అజహత్స్వార్థములు.

కాల్పనికమగు అపోద్ధారముచే ఈ అజహత్స్వార్థత్వము కల్పితమనియు, వాస్తవమున వృత్తులన్నియు జహత్స్వార్థములే యనియు, ఇదియే పాణిన్యాచార్యునకు గూడ అంగీకార్యమనియు, ఈ కారికకు తాత్పర్యము. కావున వృత్తి అఖండార్థబోధకమను సిద్ధాంతము సుస్థము.

వృత్తియందును వాక్యమునందునుగూడ పద పదార్థవ్యవహారము శాస్త్రప్రక్రియ కొరకు కల్పితమే కాని వాస్తవముకాదని చెప్పుచున్నాడు.

శాస్త్రే క్వచి త్ప్రకృత్యర్థః ప్రత్యయే నాభిధీయతే
ప్రకృతౌ వినివృత్తాయాం ప్రత్యయార్థశ్చ ధాతుభిః . 229

శాస్త్రే = శాస్త్రమునందు, క్వచిత్ = కొన్ని స్థలములందు, ప్రకృతౌ = ప్రకృతి, వినివృత్తాయాం = లోపించినదగుచుండగా, ప్రకృత్యర్థః = ప్రకృతియొక్క అర్థము, ప్రత్యయేన = ప్రతయముచేత, అభిధీయతే = చెప్పబడుచున్నది, ధాతుభిః = ధాతువులచేత, ప్రత్యయార్థశ్చ = ప్రత్యయార్థము కూడ (ప్రత్యయము లోపించినపుడు) చెప్పబడుచున్నది.

తా. శాస్త్రమునందు కొన్నియెడల, ప్రకృతి లోపింప దాని యర్థమును ప్రత్యయమే బోధించును. ధాతువులే ప్రత్యయార్థమును గూడ బోధించుచుండును.

వి. 'ఇయాన్' ఇత్యాదిపదములలో ప్రకృతి పూర్తిగ లోపించినపుడు ఆ లోపించిన ప్రకృతిభాగమునకు సంబంధించిన అర్థమును ప్రత్యయభాగమే బోధించుచున్నది. ఇట్లే, 'అహన్', 'దధి' ఇత్యాదులలో ప్రత్యయము పూర్తిగ లోపింప ప్రకృతిభాగమే ప్రత్యయభాగార్థమును గూడ చెప్పుచున్నది. ఈ విధమగు ప్రక్రియ యంతయు శాస్త్రమునందేగాని, లోకమునకు సంబంధించినంతవరకు 'ఇయాన్', 'దధి' ఇత్యాదులలో ప్రకృతిగాని, ప్రత్యయమనునదిగాని లేవు. నిరవయవమగు పదము నిర్విభాగమగు అర్థమును బోధించుచున్నది.

ప్రకృతి ప్రత్యయ విభాగము కాల్పనికమని చెప్పుటకు యుక్త్యంతరమును చెప్పుచున్నాడు.

యమర్థ మాహతు ర్భిన్నౌ ప్రత్యయౌ వేక ఏవ తమ్
క్వచి దాహ పచన్తీతి ధాతు స్తాభ్యాం వినా క్వచిత్. 280

పచన్తీతి = 'పచన్తి' అనుచోట, భిన్నౌ = వేరువేరైన, ప్రత్యయౌ = ప్రత్యయములు, యం=ఏ, అర్థమ్=కర్తృరూపమగు అర్థమును, ఆహతుః=చెప్పుచున్నవో, క్వచిత్=కొన్నిస్థలములయందు, తమ్=ఆ అర్థమును, ఏకఏవ = ఒక్క ప్రత్యయమే, ఆహ=చెప్పుచున్నది, క్వచిత్ = కొన్నిస్థలములయందు, తాభ్యాంవినా = ఆ రెండు ప్రత్యయములును లేకుండగ, ధాతుః = ధాతువు, ఆ అర్థమును బోధించుచున్నది.

తా. 'పచన్తి' ఇత్యాదులలో రెండు భిన్నప్రత్యయములు ఏ యర్థమును బోధించుచున్నవో, ఆ అర్థమును కొన్నియెడల ఒక్క ప్రత్యయమే బోధించును. కొన్నియెడల ఆ రెండును లేకుండగ ధాతువే ఆ యర్థమును బోధించును.

వి. 'పచన్తి' అనునపుడు 'పచ్' ధాతువు 'శప్' (అ) 'అన్తి' అనునవి ఉన్నవి. వాటిలో 'అ', 'అన్తి' అను రెండు ప్రత్యయములును కర్తృరూపార్థమును బోధించుచున్నవి. 'అత్తి' 'జుహోతి' ఇత్యాదులలో, 'శప్' (అ) లేకపోయినను ఒక్క 'తి' యను ప్రత్యయమే ఆ కర్తృరూపార్థమును బోధించుచున్నది. 'అహన్' ఇత్యాదులందు 'శప్' గాని, 'తిప్' ప్రత్యయముగాని, లేకపోయినను ధాతువే వాటిచే బోధ్యమగు కర్తృత్వార్థమును బోధించుచున్నది. దీనినిబట్టి ప్రకృతి ప్రత్యయములకు అర్థబోధన విషయమున ఒక వ్యవస్థ యనునది లేదుగాన, ప్రకృతిప్రత్యయములు గాని, ప్రకృత్యర్థప్రత్యయార్థములుగాని, సత్యములు కావు. అట్లే వృత్తియందును వాక్యమునందును పదములును, పదార్థములును అసత్యములు.

'అహన్' అనునది 'హన' ధాతు లఙ్ ప్రథమపురుషైకవచనము. లఙ్ పరమగునపుడు హనధాతువునకు 'అట్' (అ) ఆగమము, 'అహన్‌లఙ్' అని యుండగా, లఙ్‌కు 'తి' ఆదేశము. ఇకారమునకు 'ఇతశ్చ' (3-4-100) అను సూత్రముచే లోపము. మిగిలిన తకారమునకు 'సంయోగాన్తస్య లోపః' (8-2-23) అను సూత్రముచే లోపము. ఈ ప్రత్యయమంతయు లోపింప 'అహన్' అను ధాతుభాగము మాత్రము మిగిలినది.

ప్రకృతి ప్రత్యయములు, వాటి యర్థములును మాత్రమే కాదు; శాస్త్రప్రక్రియ అన్నియును గూడ అవాస్తవములేయని చెప్పుచున్నాడు.

అన్వాఖ్యానస్మృతౌ యేచ ప్రకృత్యర్థా నిబన్ధనమ్
నిర్దిష్టార్థ (ష్టాస్తే) ప్రకృత్యర్థాః స్మృత్యన్తర ఉదాహృతాః. 281

అన్వాఖ్యానస్మృతౌ = ఒక శబ్దానుశాసనస్మృతియందు (ఒక వ్యాకరణమునందు), యే=ఏ, ప్రత్యయార్థాః = ప్రత్యయముల యొక్క అర్థములు, నిబన్ధనమ్ = ప్రత్యయములను విధించుటకు హేతువులుగ, నిర్దిష్టాః = చెప్పబడినవో, తే = ఆప్రత్యయార్థములే, స్మృత్యన్తరే = మరి యొక వ్యాకరణమునందు, ప్రకృత్యర్థాః = ప్రకృతి యొక్క అర్థములుగా, ఉదాహృతాః = చెప్పబడినవి.

తా. ఒక వ్యాకరణమున, ఆయాప్రత్యయములు వచ్చుటకు కారణముగ చెప్పిన ప్రత్యయార్థములు వ్యాకరణాంతరమున ప్రకృత్యర్థములుగ చెప్పబడినవి.

వి. కొన్ని వ్యాకరణములలో ఈ ప్రత్యయములకు, ఈ యర్థములని నిర్ణయించి, తత్తదర్థ బోధకములు కావుననే ఆప్రత్యయములు ప్రకృతికి చేర్చబడుచున్నవి అని ప్రతిపాదింపబడినది. మరికొన్ని వ్యాకరణములు ప్రకృతి యే ఆయా యర్థములను బోధించుననియు, ప్రకృతియందలి అర్థ భేదము ననుసరించి వేరువేరు ప్రత్యయములను చేర్చవలెననియు ప్రతిపాదించినవి. ఉదాహరణమునకు లింగ సంఖ్యాకారకాదులు ప్రకృత్యర్థము లని కొన్ని వ్యాకరణము లంగీకరింప, అవి ప్రత్యయార్థము లని కొన్ని వ్యాకరణము లంగీకరించినవి. కావుననే భాష్యకారులు, —"ఏకం ద్వికం త్రికం చాథ చతుష్కం పంచకం తథా। నామార్థ ఇతి సర్వేఽమీ పక్షాః శాస్త్రే నిరూపితాః॥" అను శ్లోకమున స్వార్థ ద్రవ్య లింగ సంఖ్యా కారకములు అను ఐదిటిలో, స్వార్థ మొక్కటియే ప్రకృత్యర్థమనియు, (ఇతరములు ప్రత్యయార్థములనియు) స్వార్థద్రవ్యములు రెండును ప్రకృత్యర్థములనియు, మూడును ప్రకృత్యర్థములనియు, నాల్గును ప్రకృత్యర్థములనియు, ఐదును ప్రకృత్యర్థములనియు, మత భేదములు శాస్త్రములలో నున్నవి" అని చెప్పియున్నారు.

ఈ విధముగ శాస్త్రప్రక్రియలు ఒక నియత రూపమున లేవుగాన, ఈ ప్రకృతి ప్రత్యయ విభాగము, తత్తదర్థ విభాగము గూడ అసత్యమైనవని తేలినది.

ఈ కారికలోని తృతీయపాదమున "నిర్దిష్టాస్తే ప్రకృత్యర్థాః" అనునది సాధు పాఠ మని వ్యాఖ్యాతలు పరిగ్రహించినారు.

శాస్త్రవ్యాసనముచే అధివాసితమగు చిత్తము గలవారు శాస్త్ర ప్రక్రియయందు, 'ఉద్వమతి', 'లిమ్పతి', 'కరోతి' ఇత్యాది తిఙంత పదములను విభజించి, 'ఉద్వమి', 'లిమ్ప', 'కరి' ఇత్యాది విధమున ప్రయోగించుచున్నారు. అట్టి ప్రయోగములు శాస్త్ర ప్రక్రియయందు మాత్రమే సాధువులు గాని, లౌకిక ప్రయోగమున సాధువులు కావు అని చెప్పుచున్నాడు.

ప్రసిద్ధే రుద్వమికరీత్యేవ శాస్త్రేఽభిధీయతే
వ్యవహారాయ మన్యన్తే శాస్త్రార్థప్రక్రియా యతః. 282

ప్రసిద్ధేః = శాస్త్రప్రసిద్ధివలన, ఉద్వమికరీతి='ఉద్వమి', 'కరి' ఇత్యాది విధముగ, శాస్త్ర ఏవ = శాస్త్రమునందు మాత్రమే, అభిధీయతే=చెప్పబడుచున్నది. యతః=

ఏకారణమువలన, శాస్త్రార్థప్రక్రియాః=శాస్త్రసంబంధమైన అర్థములు పదసాధుత్వ ప్రక్రియలు గూడ, వ్యవహారాయ=అబుధులకు వ్యుత్పత్తిని కల్గించుటకొరకు మాత్రమే, మన్యన్తే= అంగీకరింపబడుచున్నవో.

తా. ప్రసిద్ధి ననుసరించి 'ఉద్వమి', 'కరి' మొదలగునవి శాస్త్రమునందు మాత్రమే చెప్పబడుచున్నవి. శాస్త్రీయములగు అర్థప్రక్రియలు కేవల శాస్త్ర వ్యవహారమునకు మాత్రమే ఉపయోగించును.

వి. లాఘవముకొరకై 'ఉద్వమతి' అనుపదమును విభజించి "ఉద్వమి" అనియు, "కరోతి, కరోషి, కరోమి" ఇత్యాదులను విభజించి (ప్రత్యాహారమువలె "కర్"కు, "తి"లోని "ఇ" కారమును కలిపి) "కరి" అనియు, శాస్త్రమునందు మాత్రమే ప్రయోగింతురు. కావుననే "స్తంబం కరోతి ఇతి స్తంబకరిః" అనియున్నది కాదాఅని "కర్మకరిః" "యాగకరిః" ఇత్యాది ప్రయోగములను లోకమున చేయరాదు. "స్తంబకరిః" అనుదానిలోని "కరిః" అనుదానిని మాత్రమే శాస్త్రము అంగీకరించెనుగాని ఇతరోదాహరణములయందు అంగీకరింపదు. ఈవిధముగ, శాస్త్రమునందు తిజంతములను విభజించి "ఉద్వమిః" ఇత్యాది ప్రయోగములు చేసియున్నను అట్టి విభాగము అసత్యమే కాని, సత్యముకాదు. శాస్త్రప్రక్రియ యంతయు, అపండితులకు బోధచేయుటకొరకు మాత్రమే ఉద్దిష్టమైనది.

శాస్త్ర ప్రక్రియ యంతయు కాల్పనికమే గాన మిథ్యాభూతమని చెప్పుచున్నాడు.

శాస్త్రేషు ప్రక్రియాభేదై రవిద్యై వోపవర్ణ్యతే
అనాగమవికల్పాతు స్వయం విద్యోపవర్తతే. 233

శాస్త్రేషు = శాస్త్రములయందు, ప్రక్రియాభేదైః=ప్రక్రియా భేదములచేత, అవిద్యైవ=అవిద్యయే, ఉపవర్ణ్యతే=వర్ణింపబడుచున్నది. అనాగమవికల్పా = శాస్త్రకల్పితములగు ప్రకృతి ప్రత్యయాది వికల్పములులేని, విద్యా=పదాది విషయజ్ఞానము, స్వయం= స్వయముగ, ఉపవర్తతే = అవిద్యను ఉపమర్దించి ప్రాప్తించును.

తా. శాస్త్రములు ప్రక్రియాభేదము ననుసరించి అవిద్యను మాత్రమే వర్ణించుచున్నవి. ఆగమ వికల్ప రహితమగు పదాదిజ్ఞానము స్వయముగనే భాసించును.

వి. ఒకే పదముయొక్క ప్రక్రియను బోధించునపుడు ఒక వ్యాకరణము, ఈ పదభాగము స్థాని, దానిస్థానమున ఈ ఆదేశము వచ్చినది అని ప్రతిపాదింప—మరియొక వ్యాకరణము, మరియొక పదభాగము స్థాని యనియు, దాని స్థానమున ఆదేశము వచ్చినదనియు ప్రతిపాదించుచున్నది. ఈవిధముగ స్థాన్యాదేశాదుల విషయమునను ప్రకృతి ప్రత్యయ విభాగ విషయమునను, ప్రకృత్యర్థ, ప్రత్యయార్థముల విషయమునను, ఆగమముల విషయమునను, తత్కృతవికారవిషయమునను, భిన్న భిన్నవ్యాకరణములయందు తత్తత్పురుషబుద్ధి పరికల్పితములగు ఎన్నియో కల్పనాభేదములు కానవచ్చుచున్నవి.

వ్యాకరణమునందే కాదు, వేదాంతాదులయందునను జగత్సృష్ట్యాది విషయమున, ప్రక్రియాభేదములు చెప్పబడినవి. కొన్నిచోట్ల జగత్సృష్టికి క్రమమే చెప్పలేదు. మరికొన్ని చోట్ల క్రమము చెప్పబడినది. ఆ క్రమములో గూడ కొన్నిచోట్ల, ఆకాశాదిక్రమగు సృష్టియు, మరికొన్నిచోట్ల తేజస్సు అదిగాగలసృష్టియు చెప్పబడినది. ఈవిధములుగ, శాస్త్రములలో విద్యా

ప్రాప్తిసాధనములుగ ప్రక్రియాభేదము నెన్ని చెప్పినను అవియన్నియు, ఉపాయమాత్రములే గాని, యథార్థములుగావు అవిద్యకములగు ఈ ప్రక్రియలను బాగుగా తెలిసికొనిన పిమ్మట విద్య స్వయముగ ప్రతిభాసించును. అపుడు ఈ ప్రక్రియాదుల ఆవశ్యకత యుండదు.

విద్యావిలక్షణమును అసత్యమును అగు అవిద్య సత్యమగు విద్యకు ఉపాయ మెట్లగును అని ఆశంకించుకొని, చెప్పుచున్నాడు.

అనిబద్ధం నిమిత్తేషు నిరుపాఖ్యం ఫలం యథా
తథా విద్యా ప్యనాఖ్యేయా శాస్త్రోపాయేవ లక్ష్యతే. 284

యథా=ఏ విధముగా, నిమిత్తేషు=కారణములయందు, అనిబద్ధమ్=(ఉత్పత్తికి పూర్వము) సంబంధములేనిదియు, (కావుననే) నిరుపాఖ్యమ్=వ్యపదేశము (ఇది ఇట్టు అని చెప్పుట వ్యపదేశము) లేనిదియు అగు, ఫలమ్=ఫలము, (కార్యము) ["అద్భుతేన రూపేణ జాయతే" యని అధ్యాహారము=అద్భుతరూపముతో జనించుచున్నదో], తథా=ఆవిధముగా, అనాఖ్యేయా=అనిర్వాచ్యమగు స్వప్రకాశ రూపముగల, విద్యాపి=విద్యకూడ, శాస్త్రోపాయేవ=శాస్త్రము ఉపాయముగాకలదివలె, లక్ష్యతే=చెప్పబడుచున్నది.

తా. కారణముతో సంబద్ధము కానిదియు, వ్యపదేశ్యము కానిదియు, అగు కార్యము ఏవిధముగ అద్భుతరూపమున జనించుచున్నదో, ఆవిధముగనే అనిర్వాచ్య స్వరూపముగల విద్యకూడ, శాస్త్రమే ఉపాయముగా గలదివలె చెప్పబడుచున్నది.

వి. ఉత్పత్తికి పూర్వము కార్యము కారణముతో ఎట్లు సంబంధించియున్నదో చెప్పుటకు శక్యముకాదు. కావున ఆ కార్యము ఈవిధముగనున్నది అని చెప్పుటకు వీలుకాదు. ఐనను ఆ కార్యము అద్భుతమగు రూపమున జనించుచున్నది. అట్లే పదాదివిషయిక విద్య కూడ శాస్త్రమువలన జనించుచున్నది.

వాస్తవమున విద్య జనించుట యనునది గూడ యథార్థముగాదు. అంతఃకరణ వృత్తి రూపమగు విద్యచే అజ్ఞానావరణము భగ్నముకాగా వెంటనే స్వయంప్రకాశమగు బ్రహ్మ విద్య ప్రకాశించుచున్నది. కాని ఇది ఉపనిషత్ప్రక్రియాజన్య మనియు చెప్పజాలము, మరి, యేమన అంతఃకరణవృత్తియే ఆవిధముగ స్వప్రకాశమగును. ఉపనిషత్ప్రక్రియవలన జనించిన దెల్ల అజ్ఞానావరణ భంగము మాత్రమే.

ఇట్లే శాస్త్రప్రక్రియా రూపమగు అవిద్యగూడ అంతఃకరణవృత్తిరూపమగు పదాది విద్యయందు ఉపాయము మాత్రమే యని భావము. వాస్తవమున విద్య అవిద్యాజన్యము కాజాలదు గాన, శాస్త్రము విద్యకు ఉపాయము కాకున్నను ఉపాయమువలె తోచుచున్నది.

'శాస్త్రములు ప్రక్రియాభేదముచే అవిద్యనే వర్ణించుచున్నవి' అని వెనుకచెప్పి యున్నాడు. కాని అఖండ పదాది తత్త్వ సాక్షాత్కారము కలుగునంతవరకును ఈ శాస్త్రీయ ప్రక్రియ యంతయు అవిద్యాకార్యమను విషయము గూడ తెలియకుండుటచే వాక్కువలన లోకులకు శాస్త్రాభ్యాసానుసారముగ నీ శబ్దార్థ ప్రతిపత్తి కలుగుచున్నదని చెప్పుచున్నాడు.

యథాభ్యాసం హి వాగర్థే ప్రతిపత్తిం సమీహతే
స్వభావ ఏవ చానాది ర్మిథ్యాభ్యాసో వ్యవస్థితః. 285

వాక్=వాక్కు, యథాభ్యాసం=శాస్త్రాభ్యాసానుసారముగనే, అర్థే=అర్థమునందు, ప్రతిపత్తిం=జ్ఞానమును, సమీహతేహి=కలిగించుటకు సమర్థమగుచున్నదికదా. అనాదిః= ఆదిలేని,మిథ్యాభ్యాసః=మిథ్యాభూతమగు శాస్త్రాభ్యాసము, స్వభావ ఇవ=స్వాభావికమువలె, వ్యవస్థితః=ఉన్నది.

తా. వాక్కు శాస్త్రాభ్యాసానుసారముగనే అర్థజ్ఞానమును కలిగింప సమర్థమగును. అనాదిగనున్న ఈ మిథ్యాభ్యాసము స్వాభావికమువలె అయిపోయినది.

వి. వాక్కు శాస్త్రాభ్యాసము ననుసరించి, ప్రకృతి, ప్రత్యయ, తదర్థ జ్ఞాన పూర్వకముగ అర్థ జ్ఞానమును కలిగించుచున్నది. కాన, ఈ శాస్త్రీయ ప్రక్రియా భేదము అవిద్యా విషయికమైనను శబ్దార్థ జ్ఞాన హేతుక మగుటచే ఉపాదేయమేకాని హేయముకాదు. పద పదార్థ తత్త్వము నెరింగిన ఆర్ష దృష్టిమంతులకు మాత్రము ఇది అనావశ్యకము. అనాది గురుశిష్య పరంపరా ప్రాప్తమైన ఈ శాస్త్రాభ్యాసము మిథ్యాభూత ప్రక్రియా భేదములను బోధించుటచే మిథ్యయేయైనను, దేహాత్మైక్యాధ్యాసాభ్యాసమువలె స్వాభావికమైనట్లు కనబడుచున్నది.

పురుషమతి వికల్పములవలన పుట్టిన కల్పనలన్నియు, శాస్త్రీయములైనను, లౌకికములైనను మిథ్యాభూతములే, కాని శాస్త్రీయకల్పనలు తత్త్వజ్ఞానమునకు ఉపయుక్తములగును. అశాస్త్రీయము లట్లుకాదు అను విషయమును ప్రతిపాదించుటకై చెప్పుచున్నాడు.

ఉత్ప్రేక్షతే సావయవం పరమాణు మపణ్డితః
తథావయవినం యుక్త మన్యై రవయవైః పునః .　　286

అపణ్డితః = అపండితుడు, పరమాణుమ్ = పరమాణువును, సావయవమ్ = అవయవములతో కూడుకున్న దానినిగా, ఉత్ప్రేక్షతే = ఊహించుచున్నాడు. తథా= మరియు, అవయవినం=అవయవములు కలదానిని, పునః=మరల, అన్యైః=ఇతరమైన, అవయవైః=అవయవములతో, యుక్తం కూడినదానినిగా, (ఊహించును).

తా. పరమాణువునకు గూడ అవయవము లున్నవనియు, అవయవికి ఇంకను ఏవిమో అవయవము లున్నవనియు అపండితుడు ఊహించుచుండును.

వి. పరమాణువు అన్నిటికన్న చిన్న ప్రమాణము కలదనియు, దానిని రెండుగ భేదింపుట అశక్యమనియు పండితులు నిర్ణయించి యుండగా, అపండితుడు పరమాణువునకు గూడ అవయవము లుండునని యూహించుచుండును. అట్లే, ఒక అవయవికి అవయవము లున్నట్లే, దాని అవయవములకు అవయవము లున్నవనియు, మరల దానికి గూడ నున్నవనియు, ఈ విధముగ అవిచ్ఛిన్నమగు అవయవ ధారను ఊహించును. ఇట్లు పురుష బుద్ధి కృతములగు కల్పనలకు అంతమనునది యుండదనియు, అవియన్నియు వాస్తవము కాజాలవనియు అభిప్రాయము.

కొందరు పరిచ్ఛిన్న ప్రమాణమగు ఘటమును జూచి. ఘటమువలె ప్రపంచము గూడ (వాస్తవమున నది పరిచ్ఛిన్నము కాకున్నను) పరిచ్ఛిన్నమని భావింతురు. అట్లే భావ పదార్థములన్నియు ఆది కలవి కావున బ్రహ్మకూడ భావ పదార్థమగుటచే (అది వాస్తవమున శాశ్వతమైనను) సాదియనియు, కార్యమనియు, ఊహింతురు అని చెప్పుచున్నాడు.

ఘటాదిదర్శనా ల్లోకః పరిచ్ఛిన్నోఽవసీయతే
సమారమ్భాచ్చ భావానా మాదిమద్ బ్రహ్మ శాశ్వతమ్. 287

ఘటాది దర్శనాత్ = ఘటము మొదలగు వాటిని చూచుటవలన, లోకః = దృశ్యమగు ఈ ప్రపంచము గూడ, పరిచ్ఛిన్నః = పరిమితమైనదిగా, అవసీయతే = (కొందరిచే) నిశ్చయింపబడుచున్నది, భావానామ్ = భావ పదార్థములకు, సమారమ్భాత్ = ఆరంభము (ఉత్పత్తి) ఉండుట వలన, శాశ్వతం = శాశ్వతమైనను, బ్రహ్మ = బ్రహ్మ, ఆదిమత్ = ఆదికలదిగా నిశ్చయించబడుచున్నది.

తా. ఘటాదులను జూచి ప్రపంచము గూడ పరిచ్ఛిన్నమనియు, భావముల న్నియు జన్మకలవిగాన, శాశ్వతమగు బ్రహ్మకు గూడ ఆది ఉన్నదనియు నిర్ణయించు చుందురు.

శాస్త్రీయ ప్రక్రియ కాల్పనికమే కాని, వాస్తవము కాదని చెప్పుచున్నాడు.

ఉపాయాః శిక్షమాణానాం బాలానా మపలాలనాః
అసత్యే వర్త్మని స్థిత్వా తతః సత్యం సమీహతే. 288

ఉపాయాః = శాస్త్రములు, శిక్షమాణానాం = అభ్యసించుచున్న, బాలానామ్= అపండితులకు, అపలాలనాః = వంచనములే, అసత్యే = అసత్యమైన శాస్త్ర ప్రక్రియా రూపమగు, వర్త్మని = మార్గమునందు, స్థిత్వా = నిలచి, తతః = అటు పిమ్మట, సత్యం సత్యమును, సమీహతే = పొందును.

తా. పూర్వోక్త కారణములచే శాస్త్రములు జిజ్ఞాసువులగు అపండితులను మోస గించునవే కాని, వాటి ప్రక్రియలో సత్యము లేదు. కాని జిజ్ఞాసువు కొంత కాలము అసత్య ప్రక్రియా మార్గమునందు నిలచి, అటు పిమ్మట అవిద్యను పదలి సత్యమును పొందును.

ఇపుడు మరల వాక్య వాక్యార్థములు అఖండములని స్థాపించుటకై పదపదార్థములను నిరాకరించుచున్నాడు.

అన్యథా ప్రతిపద్యార్థం పదగ్రహణపూర్వకమ్
పునర్వాక్యే తమేవార్థ మన్యథా ప్రతిపద్యతే. 289

పదగ్రహణ పూర్వకం = వేరు వేరుగా పదములజ్ఞానసముద్వారా, అర్థం = అర్థ మును, అన్యథా = ఒక విధముగా, ప్రతిపద్య = శక్తిచే గ్రహించి, పునః = తిరిగి, వాక్యే = వాక్యమునందు, తం=ఆ, అర్థమేవ = అర్థమునే, అన్యథా = మరియొక విధముగా, ప్రతిపద్యతే = తెలిసికొను చున్నాడు.

తా. పదములను గ్రహించునపుడు ఒక విధమగు అర్థమును గ్రహించి మరల ఆ అర్థమునే వాక్యమున మరియొకవిధముగ గ్రహించుచున్నాడు.

వి. ఒక వాక్యమునందు మొదట పదగ్రహణ పూర్వకముగ, శక్తిచే, ఒక అర్థమును గ్రహించి అంతమునందు అదేవాక్యమున లక్షణచేతగాని, వ్యంజనచేతగాని, మరి యొక అర్థమును గ్రహించుచున్నాడు.

ఉదాహరణమునకు అపకారము చేసినవానిని గూర్చి "ఓ మిత్రమా ! నీవు నాకు చాల ఉపకారము చేసినావు" అని పలికినపుడు మొదట పదపదార్థముల గ్రహణముచే ఉపకారము చేసితివి అని విధేయముఖమున అర్థము గ్రహించినను తుదకు లక్షణచే "నీవు నాకు గొప్ప అపకారము చేసితివి" అను నర్థమును గ్రహించును.

ఈ విధముగ కొన్నిస్థలములలో నిషేధ్యముగ ప్రథమమున అవగతమగు వాక్యార్థము చివరకు లక్షణావ్యంజనాదులచే విధేయముగ తెలియబడుచున్నది. వాక్యవాక్యార్థముల లోని పదపదార్థములు సత్యములైనచో అపుడు పదార్థజ్ఞానసమయమున పరస్పరాన్విత పదార్థములను ఒకవిధముగ గ్రహించి, వాక్యార్థబోధానవసరమున వెనుకటి యర్థమును త్యజించి మరియొక అర్థమును గ్రహించుట యనునది అసంపపన్నముకదా? కావున చివరకు గ్రాహ్యమగు వాక్యార్థమే సత్యమనియు తత్పూర్వజన్య పదపదార్థజ్ఞాన మసత్య మనియు చెప్పవలెను.

మొదట 'నఞ్' పద ప్రయోగము లేక, వాక్యాంతమున దానిని ప్రయోగించిన, 'ధవ ఖదిర పలాశాః ఛేదనీయాః న' ఇత్యాది స్థలములలో పదగ్రహణ పూర్వకముగ మొదట గ్రహించిన పదార్థమును, తత్సమన్వయముచే లభించిన వాక్యార్థమును విడిచి, (అనగా, విధేయతాత్పర్యమును విడిచి) మరియొక నిషేధ రూపమగు వాక్యార్థము గ్రహింపబడుచున్నదని చెప్పుచున్నాడు.

ఉపాత్తా బహవోఽప్యర్థా యేష్వన్తే ప్రతిషేధనమ్
క్రియతే తే నివర్తన్తే తస్మాత్తాంస్తత్ర నాశ్రయేత్ . 240

(యే = ఏ) బహవోఽపి = అనేకమైన, అర్థాః = అర్థములు, ఉపాత్తాః = నఞ్ ప్రయోగముకంటె ముందు ప్రయోగింపబడిన అనేకపదములచే బోధింపబడినవో (పదముల ద్వారా గ్రహింపబడినవో), యేషు = వేటియందు, అంతే = అంతమునందు ప్రయుక్తమగు నఞ్ చేత, ప్రతిషేధనమ్ = నిషేధము, క్రియతే = చేయబడుచున్నదో, తే = ఆ పదార్థము లన్నియు, నివర్తన్తే = నఞర్థఘటితమగు వాక్యార్థము యొక్క జ్ఞానము కలుగునపుడు నివర్తించుచున్నవి. తస్మాత్ = ఆ కారణమువలన, తాన్ = ఆవిధముగ నివర్తింపనున్న పదార్థములను, తత్ర = నఞ్ రహితవాక్యమునందుకూడా, నాశ్రయేత్ = ఆశ్రయింపరాదు.

తా. వేటియందు అంతమున నిషేధము చేయబడునో అట్టి అనేకములగు అర్థములు ప్రారంభమున గ్రహింపబడినను, వాటిని అచట ఆశ్రయింపరాదు.

వి. "ధవ ఖదిర పలాశాః ఛేదనీయాః న" అనునపుడు మొదట 'ధవఖదిర పలాశాః ఛేదనీయాః' అనునంతవరకు వినగనే వాటిని ఛేదింపవలెను అను అర్థము వచ్చుచున్నది. కాని, అంతమునందు ప్రయుక్తము అగు 'నఞ్' చే తన్నిషేధము బోధింపబడుచున్నది. కాని ఈ విధముగ ఒకమారు గృహీతమగు అర్థమును పరిత్యజించినచో శబ్దార్థసంబంధము అనిత్యము కావలసి వచ్చును. కావున ధవఖదిర పలాశచ్ఛేదన రూపార్థమును గ్రహింపకుండుటయే యుక్తము.

పైనచెప్పిన విధముగ నఞ్ సమభివ్యాహారమున్నపుడు అఖండ వాక్య వాక్యార్థములనే సత్యములని అంగీకరించుట యుక్తము. దీని దృష్టాంతముచే నఞ్ సమభివ్యాహారము

లేనపుడు గూడ వాక్య వాక్యార్థముల అఖండత్వము నంగీకరించుటయే యుక్తమని చెప్పుచున్నాడు.

వృక్షో నాస్తీతి వాక్యం చ విశిష్టాభావలక్షణమ్
నార్థేన బుద్ధౌ సమ్బన్ధో నివృత్తే రవతిష్ఠతే. 241

'వృక్షః నాస్తి' ఇతి వాక్యం = 'వృక్షఃనాస్తి' అనెడు వాక్యము, విశిష్టాభావలక్షణమ్=విలక్షణమగు అఖండమైన అభావమును జ్ఞాపింపచేయునది. (ఎందుచేతననగా) నివృత్తేః = నిషేధమునకు, అర్థేన='సత్' ఐనను, 'అసత్' ఐనను, నిషేధ్యమగు పదార్థముతో గూడ, సమ్బన్ధః = సంబంధము, బుద్ధౌ = బుద్ధియందు, నావతిష్ఠతే=నిలవదు.

తా. 'వృక్షః నాస్తి' అనెడు వాక్యము విలక్షణమగు అభావమును బోధించును; ఏలనన అర్థముతోగూడ నిషేధమునకు సంబంధము బుద్ధియందు నిలవదు.

వి. 'వృక్షః నాస్తి' అను అఖండవాక్యమే అఖండమగు వృక్షాభావ జ్ఞానరూపమగు అర్థమునకు జ్ఞాపకము. ఇచట ఆయా పదార్థములతో ఘటితమగు సఖండవాక్యార్థము నంగీకరించినచో స్వకారణ బలముచే స్థితిని సంపాదించుకొనిన (అనగా, ఉన్నట్లుగా తెలియబడిన) వృక్షపదార్థముతో నఞర్థమగు నిషేధమునకు సంబంధము కుదరదు. జనితమైయున్న సత్పదార్థమును లేదనుట ఎట్లు? వృక్షరూపార్థము బుద్ధియందున్నను, బాహ్యస్థలమున లేదుగాన, దానికి నఞర్థముతో సంబంధ ముండవచ్చును అనుటకూడ యుక్తము కాదు. స్వతః, 'అసత్' అగు (లేని) పదార్థమును నిషేధించుట అనావశ్యకముకదా? కావున, 'వృక్షో నాస్తి' ఇత్యాది నఞ్ఘటితవాక్యములలో విలక్షణాభావావగతిరూపమగు అఖండ వాక్యార్థమునే అంగీకరింపవలెను. నఞ్ఘటిత వాక్య సామ్యముచే తదఘటితములగు 'వృక్షఃఅస్తి' ఇత్యాది వాక్యములందుగూడ అఖండార్థత్వమునే అంగీకరించుట యుక్తము.

'నఞ్' నిషేధబుద్ధిని కలిగించుటకు పూర్వమే 'వృక్షః నాస్తి' అనువాక్యమున పద పదార్థములను విభజించుటచె ముందుగ వృక్ష పదార్థ విషయకమగు అస్తిత్వబుద్ధి (వృక్షము ఉన్నది అనుబుద్ధి) కలుగును. నఞ్ ప్రయోగించగనే తత్సంబంధముచే ఆ బుద్ధి నివర్తింపచేయబడును. అంతియేకాని, వృక్షాస్తిత్వమును నిషేధించుట అనునది లేదు అని ఆశంకించి వృక్షాస్తిత్వము శబ్దబోధితముగాని వృక్షాస్తిత్వబుద్ధి శబ్దబోధితముకాదు కావున శబ్దబోధితము కాని వృక్షాస్తిత్వ బుద్ధితో నఞ్ శబ్దార్థమగు నిషేధమునకు అన్వయము కుదురదు. శబ్దార్థము శబ్దార్థముతోడనే అన్వయించును గాని, శబ్దార్థ భిన్నముతో అన్వయింపదు కదా, యని చెప్పుచున్నాడు.

విచ్ఛేదప్రతిపత్తౌ చ యద్యస్తీత్యవధార్యతే
అశబ్దవాచ్యా సా బుద్ధి ర్నివర్తేత స్థితా కథమ్? 242

విచ్ఛేద ప్రతిపత్తౌ=పదపదార్థముల విభక్త జ్ఞానము కలుగగా, అస్తీతి = ఉన్నది అని, అవధార్యతే యది=వృక్షాస్తిత్వము నిర్ణయింపబడినట్లైతే, అశబ్దవాచ్యా = శబ్దవాచ్యము కానిదియు, స్థితా=ఉన్నదియు అగు, సా=ఆ అస్తిత్వబుద్ధి, కథమ్=ఎట్లు, నివర్తేత = నివర్తించును.

తా. విభక్తమగు జ్ఞానము కలిగినపుడు, ఉన్నది అని నిర్ధారణము చేయబడినచో, శబ్దవాచ్యము కానిదియు, ఉన్నదియును అగు ఆ అస్తిత్వబుద్ధి ఎట్లు నివర్తించును?

వి. నఞా శబ్దవాచ్యమగు అర్థమునుమాత్రమే నిషేధించును. శబ్దము బాహ్యమగు అర్థమును బోధించును. వృక్షాస్తిత్వము శబ్ద బోధ్యముకావచ్చును గాని, వృక్షాస్తిత్వబుద్ధి శబ్దవాచ్యముకాదు. కావున అది నఞ్‌తో సంబంధింపజాలదు. 'కావున, వృక్షః నాస్తి' అను వాక్యమునందలి 'వృక్షఃఅస్తి' అనుదానికి వృక్షాస్తిత్వబుద్ధియను నర్థమును చెప్పి దానిని నిషేధించుట కుదురదు గాన, "వృక్షో నాస్తి" అనుదానిని అఖండవాక్యముగ అంగీకరించి తద్బోధ్యమగు వృక్షాభావరూపార్థము కూడ అఖండమని చెప్పవలెనని యర్థము.

పైనచూపినట్లు, నఞ్ వృక్షాస్తిత్వబుద్ధిని నివర్తింపచేయకున్నను ఆ బుద్ధి మిథ్యాభూతమని తెలుపుచున్నది అని ఆశంకించి నిరాకరించుచున్నాడు.

> అథ యద్ జ్ఞాన ముత్పన్నం త న్మిథ్యేతి నఞా కృతమ్
> నఞో వ్యాపారభేదేఽస్మి న్నభావావగతిః కథమ్ .　　248

అథ = అట్లుగాక, యద్ = ఏ, జ్ఞానమ్ = వృక్షాస్తిత్వజ్ఞానము, ఉత్పన్నమ్ = పుట్టినదో, తత్ = అది, మిథ్యేతి = అసత్యమైనది అను జ్ఞానము, నఞా = నఞ్‌చేత, కృతమ్ = ఏర్పరుపబడినట్లైతే, (అట్లైనను) నఞః = నఞ్‌కు, అస్మిన్ = ఈ, వ్యాపారభేదే = పూర్వజ్ఞానము అసత్యము అని బోధించుట యను వ్యాపార విశేషమును అంగీకరించినచో, అభావావగతిః = అభావజ్ఞానము, కథమ్ = ఎట్లు కలుగును?

తా. అట్లుకాక, నఞా ఉత్పన్నమగు జ్ఞానము అసత్యమని బోధించును అని చెప్పినచో ఈ విధముగా నఞుకు వ్యాపారభేదము నంగీకరించిన పక్షమున అభావావగతి ఎట్లు కలుగును?

వి. వృక్షాస్తిత్వబుద్ధి శబ్దార్థముకాదుగాన, నఞర్థమునకు దానితో సంబంధము లేకపోవచ్చును. కాని ఇచట నఞ్ "వృక్షాస్తిత్వజ్ఞానము మిథ్య" అని బోధించును. ఇట్లు చెప్పినచో పూర్వోక్తపుగు అనుపపత్తి యుండదు—అనికూడ చెప్పుట యుక్తముకాదు. ఇచట నఞ్ వృక్షాభావబోధనమునకై ఉద్దిష్టమైనది. ఇపుడు దానికి పూర్వజ్ఞానము అసత్యము అని బోధించుట యను అర్థమును కల్పించినచో అభావరూపార్థమును బోధించుట ఎట్లు? అనగా నఞ్‌కు పర్యుదాసార్థమును చెప్పినచో "ఇది వృక్షముకాదు, వృక్షసదృశము; కావున వృక్షజ్ఞానము మిథ్య" యని చెప్పుటకు వీలగును కాని, నఞ్ ప్రసజ్య ప్రతిషేధార్థకమైనచో ఇట్లు చెప్పుట కుదరదు. ప్రసజ్యప్రతిషేధమును అంగీకరించినగాని, వాక్యార్థమగు వృక్షాభావము బోధింపబడదు అని యభిప్రాయము.

పర్యుదాసమనియు, ప్రసజ్యప్రతిషేధమనియు నఞర్థములు రెండు. నఞ్ ఉత్తరపదముతో అన్వయించినచో అది పర్యుదాసము. 'అబ్రాహ్మణః', 'అనశ్వః', ఇత్యాదులలో 'నఞ్' బ్రాహ్మణ, అశ్వ, ఇత్యాది పదములతో అన్వయించి, 'బ్రాహ్మణుడు కానివాడు' 'అశ్వముకానిది' అను అర్థములను బోధించుచున్నది. ఇచట నఞ్ తద్భిన్నత్వమునేగాక, తత్సదృశత్వమునుగూడ తెలుపును. "న ఞివయుక్త మన్యసదృశే తథాహ్యర్థగతిః" ('నఞ్' తోడను, 'ఇవ' తోడను కూడినపదము తద్భిన్నము, తత్సదృశము అను అర్థమును బోధించును, ఈ విధముగనే లోకములో అర్థబోధ కలుగుచున్నదికదా)అని అభియుక్తోక్తి; కావుననే, ఒక చెట్టునుగాని, ఒక పుట్టనుగాని చూపి, 'అబ్రాహ్మణః' 'అనశ్వః' అని అనరాదు. అవి

బ్రాహ్మణాశ్వ భిన్నములే యైనను, బ్రాహ్మణాశ్వ సదృశములు కావు. కావున, బ్రాహ్మణ భిన్నులును, బ్రాహ్మణ సదృశులును, అగు క్షత్రియాదులను అబ్రాహ్మణులని యనవచ్చును. అశ్వభిన్నములును అశ్వసదృశములు నగు వృషభాదులను మాత్రమే అనశ్వము లనవచ్చును. నఞ్ క్రియతో అన్వయించినచో అది ప్రసజ్యప్రతిషేధము, "బ్రాహ్మణః నాగచ్ఛతి" "అశ్వః నాగచ్ఛతి" ఇత్యాదులందు నఞ్ ఆగమనక్రియతో అన్వయించి, 'వచ్చుటలేదు' అను నర్థమును (గమనాభావమును) బోధించుచున్నది. కావున ఇది ప్రసజ్యప్రతిషేధము "పర్యు దాసః సవిజ్ఞేయః యత్రోత్తరపదేన నఞ్, ప్రసజ్యప్రతిషేధోఽయం క్రియయా సహ యత్ర నఞ్" అని అభియుక్తవచనము.

నఞ్ నివర్తింపనున్న వృక్షమునే బోధించును. నివర్తింపనున్న ఈ వృక్షాది బౌద్ధ పదార్థము (బుద్ధిస్థ వృక్షాది పదార్థము) సత్తు అని గాని, అసత్తు అని గాని, వికల్పించుట కుదురదు గాన, ఉభయ విలక్షణమని చెప్పవచ్చును అని ఆశంకించుకొని అట్లు అంగీకరించినచో ఆధారమగు వృక్షపదము నపేక్షింపకయే నఞ్ ప్రవర్తించునని చెప్పవలసియుండును. అపుడు ప్రతియోగి వాచకమగు వృక్షాదిపదముకంటె పూర్వమే నఞ్‌ను ప్రయోగించవలసియుండును; పరముగ కాదు. కాని, 'వృక్షః న' ఇత్యాదివిధమున ప్రతియోగివాచకమునకు తరువాతనే నఞ్ పదమును ప్రయోగించుట స్వారసికముగ కన్పట్టుచున్నది. అట్లంగీకరించుటలో మరియొక దోషమేమనగా—నఞ్ అనునదియే నిషేధ్యమగు వృక్షాదికమును బోధించును గాన, దేనినైన నిషేధించవలసియున్నప్పుడు ప్రతియోగి పదమును ప్రయోగింపకుండగనే కేవలము'న' అని యందురు. ప్రతియోగి వాచక పదప్రయోగము ప్రతియోగి నియమము కొరకై చేయబడు చున్నది.—అనగా, ఇది ఘట నిషేధముగాని, పటనిషేధముకాని కాదు, వృక్షనిషేధము, అను నియమమును సూచించుటకై, 'న వృక్షః', ఇత్యాదులలో ప్రతియోగి ప్రయోగము చేయ బడుచున్నది అన్నచో—ప్రతియోగి వాచకపదము స్వార్థమును విడచి లక్షణచే స్వేతరార్థ నిషేధమును బోధించుట యనునది అనుచితముకాదా! ఈ విషయము లన్నిటిని మనస్సులో నుంచుకొని చెప్పుచున్నాడు.

నిరాధారప్రవృత్తౌ చ ప్రాక్ ప్రవృత్తి ర్నఞో భవేత్
అథాధారః స ఏవాస్య నియమార్థా శ్రుతి ర్భవేత్ . 244

నిరాధారప్రవృత్తౌ = ఆధారములగు వృక్షాదిశబ్దముల అపేక్షలేని ప్రవృత్తిని నఞ్‌కు అంగీకరించినచో, నఞః = నఞ్కు, ప్రాక్ = ఆధారమగు ప్రతియోగికంటె పూర్వము, ప్రవృత్తిః = ప్రయోగము, భవేత్ = కావలసివచ్చును. అథ = అట్లుకాక, స ఏవ = ఆ వృక్షాదికమే, అస్య = ఈ నఞ్కు, ఆధారః = ఆధారము, (ఘటపటాదికము కాదు) అని చెప్పినచో, (అప్పుడు) శ్రుతిః = వృక్షాదిపదశ్రవణము, నియమార్థా = నియమ రూపమగు అర్థము కలదిగా, భవేత్ = కావలసివచ్చును.

తా. ఆధారాపేక్షలేని ప్రవృత్తిని అంగీకరించినచో నఞ్ను పూర్వమందే ప్రయోగించవలసి యుండును. అట్లుకాక, అదియే దీనికి ఆధారమన్నచో వృక్షాది పదశ్రుతి నియమార్థము కావలెను. (ఈ విధముగ స్వార్థమును విడచి లాక్షణికార్థమును స్వీకరించుట యుక్తము కాదని అభిప్రాయము).

వి. ఏదిలేదని చెప్పుదుమో - అనగా దేనియొక్క అభావమును చెప్పుదుమో దానికి ప్రతియోగియని పేరు. 'ఘటము లేదు' అనునపుడు లేనిది ఘటముగాన, ఘటమునకు ప్రతియోగియని పేరు. "యస్యాభావ స్తత్ ప్రతియోగి".

పక్షాంతరములను శంకించి పరిహరించుచున్నాడు.

నియమద్యోతనార్థా వా అనువాదోఽథవా భవేత్
కశ్చిదే వార్థవాం స్తత్ర శబ్దః శేషా స్త్వనర్థకాః. 245

పూర్వకారికనుండి 'శ్రుతిః' అనుపదము అనువర్తించును. అచట 'శ్రుతిః' అను దానికి ప్రతియోగి వాచకపదశ్రుతియనియు, ఇచట 'నఞ్ శ్రుతి' యనియు అర్థము.

వా = లేక (నఞ్ శ్రుతి), నియమద్యోతనార్థావా = నియమమును ద్యోతింపచేయుట కొరకైనదిగాని, అథవా అనువాదః = అనువాదముగాని, భవేత్ = అగును, ఏ పక్షము నంగీకరించినను, తత్ర = 'వృక్షో నాస్తి' ఇత్యాదులలో, కశ్చిత్ = ఏదియో యొక, శబ్దఏవ= శబ్దముమాత్రమే, అర్థవాన్ = అర్థముకలది, శేషాస్తు = ఇతరపదములైతే, అనర్థకాః = అర్థరహితములు.

వి. 'నిపాతా ద్యోతకాః కేచిత్' అను మతము ప్రకారము 'వృక్షో న' ఇత్యాదులలో ప్రతియోగి వాచకమగు వృక్షాది పదమే నివర్త్యమాన ప్రతియోగివాచకము (లేదని చెప్పబడుచున్న వృక్షమును - అనగా వృక్షాభావమును) బోధించును. నఞ్ రూపమగు నిపాతము కేవలము తదర్థ ద్యోతకము అని చెప్పవచ్చును. కాని, శబ్దార్థ నియామకము లగు సంయోగాదులలో ఏదో ఒకదాని సహాయముచేతనే ప్రతియోగివాచకపదము నివర్త్య మాన ప్రతియోగివాచకమని చెప్పుటకు అవకాశముండును గాన, నఞ్ వ్యర్థమే యనవలసి వచ్చును. కావున ఈ నఞ్ ప్రతియోగిత్వమును మాత్రమేకాక, ప్రతియోగి నియమమును కూడ సూచించునని చెప్పవలయును. కాని, నియమము అనుచితమను విషయము పూర్వ కారికయందే స్పష్టీకరింపబడినది. అట్లుకాక, ప్రతియోగిపదముగాని, నఞ్‌గాని, నివర్త్య మాన ప్రతియోగిని బోధింప, రెండవది ఆ యర్థమునే అనువదించుచు, స్పష్టీకరించుచున్న దని చెప్పవచ్చును. కాని, అట్లు చెప్పినచో పునరుక్తిదోషము వచ్చును. ఈ విధముగ, ప్రతియోగిబోధక పదశ్రుతి నియమార్థ మన్నను, నఞ్ ప్రయోగము నియమ ద్యోతనార్థ మన్నను, లేదా, వీటిలో ఒకటి అనువాదార్థమన్నను, 'వృక్షః న' ఇత్యాదులలోని ఒక పదము మాత్రమే సార్థకము, ఇతరపదములు నిరర్థకములు అని తేలినది. ఇట్లు ఒక వాక్యము నందలి ఒకభాగమునకు సార్థకత్వమును, మరియొకభాగమునకు నిరర్థకత్వమును, చెప్పుట అయుక్తము. కావున 'వృక్షో నాస్తి' ఇత్యాద్యఖండవాక్యములు విశిష్టాభావరూపమగు అఖండ వాక్యార్థమును బోధించుచున్నవని యంగీకరించుట యుక్తము.

'అన్యథా ప్రతిపద్యార్థమ్' ఇత్యాది పూర్వకారికను (239) సింహావలోకనముచే వ్యాఖ్యానించుచున్నాడు.

విరుద్ధం చాభిసమ్బద్ధ ముదహార్యాదిభిః కృతమ్
వాక్యే సమాప్తే వాక్యార్థ మన్యథా ప్రతిపద్యతే. 246

(వాక్యసమాప్తికి పూర్వము పదార్థము, ప్రతిభాసించునపుడు) ఉదహార్యాదిభిః = 'ఉదహారి' మొదలగు పదములచే, కృతమ్ = చేయబడిన, విరుద్ధమ్ = విరుద్ధమగు, అభిసమ్బన్ధమ్ = పదార్థసంబంధమును, (అవగచ్ఛతి = తెలిసికొనును). వాక్యే = వాక్యము, సమాప్తే = సమాప్తమైనదగుచుండగా, వాక్యార్థమ్ = వాక్యార్థమును, అన్యథా = మరియొక విధముగా, ప్రతిపద్యతే = గ్రహించును.

తా. 'ఉదహారి' మొదలగు పదములచే కలిగిన విరుద్ధపదార్థసంబంధమును గ్రహించుచున్నాడు. వాక్యము పూర్తియైన పిమ్మట, వాక్యార్థమును మరియొకవిధముగ గ్రహించును.

వి. "ఉదహారి, భగిని యా త్వం శిరసానడ్వాహం వహసి సా త్వం ప్రాచీనం కుమ్భ మభిధావన్త మద్రాక్షీః" ఇత్యాదివాక్యములలో పదప్రయోగము అస్తవ్యస్తముగ నుండుటచే వాక్యము పూర్తిగానిసమయమున శ్రోత, "ఓ ఉదహారీః ఎద్దును మోయుచున్నావు" ఇత్యాది విరుద్ధములగు పదార్థముల జ్ఞానమును పొందును. కాని వాక్యము పూర్తియైనపిమ్మట యోగ్యతా వశముచేత పదములను— 'ఉదవాహిని, భగిని, యా త్వం ప్రాచీనం కుమ్భం శిరసా వహసి, సా త్వం అభిధావన్త మనడ్వాహ మద్రాక్షీః' (నీరును మోసికొని పోయే ఓ సోదరీః ఏ నీవు శిరస్సుపై పాతకుండను ధరించుచున్నావో ఆ నీవు పరుగిడిపోవుచున్న ఎద్దును చూచితివా?) ఇత్యాదివిధమున తగుక్రమమున నేర్పరచుకొని, మొదట గ్రహించిన, పదార్థములకంటె భిన్నమగు వాక్యార్థమును గ్రహించును. కావున వాక్యార్థమునందు పదార్థమనునది వాస్తవము కాదు.

ఈ విషయమునే మరియొక విధముగకూడ మరల ప్రతిపాదించుచున్నాడు.

స్తుతినిందాప్రధానేషు వాక్యే ష్వర్థో న తాదృశః
పదానాం ప్రవిభాగేణ యాదృశః పరికల్ప్యతే . 247

స్తుతి నిందా ప్రధానేషు = స్తుతి ప్రధానములును నిందా ప్రధానములును అగు, వాక్యేషు = వాక్యములయందు, పదానాం = పదములయొక్క, ప్రవిభాగేణ = విభాగముచేత, యాదృశః = ఎట్టి, అర్థః = అర్థము, పరికల్ప్యతే = వాచ్యమగుచున్నదో, తాదృశః = అట్టి అర్థము, న = వాచ్యమగుటలేదు.

తా. స్తుతి నిందా ప్రధానములగు వాక్యములలో పదములను విభజించుటచే వాచ్యమగు అర్థము వాక్యార్థముగా కానరాదు.

వి. కొన్ని వాక్యములలో స్తుతి వాక్యార్థముగ నుండును. కాని పదార్థ జ్ఞాన సమయమున నిందారూపార్థము అవగతమగును.

ఉదా॥ "కః స్వర్ధుని వివేక స్తే పాపినో నయసే దివమ్"

'ఓ గంగా! పాపాత్ములను స్వర్గమునకు కొనిపోవుచున్నావు. ఇదియేనా నీ వివేకము?' ఇచట పదార్థజ్ఞానసమయమున 'నీకు వివేకజ్ఞానములేదు' అని నింద గమ్యమగుచున్నను, 'పాపాత్ములను గూడ స్వర్గమును చేర్చగల పవిత్రురాలవు నీవు' అను స్తుతియే వాక్యార్థము.

ఇట్లే కొన్నియెడల పదార్థబోధావసరమున స్తుతి బోధ్యమాన మగుచున్నను, నిందయే ప్రధానవాక్యార్థముగ నుండును.

ఉదా॥ "సాధు దూతి! పునః సాధు కర్తవ్యం కిమతఃపరమ్ ।
యన్మదర్థే విలూనాసి దన్తైరపి నఖై రపి॥"

'బాగు దూతీ బాగు: ఇంతకంటె ఏమిచేయుదువు: నాకొరకై దంతములచేతను, నఖములచేతను విలూనవైతివి' తన ప్రియుని తీసుకొనివచ్చెదనని తెల్పి ఆతనికడకు పోయి, ఆతనితో ఆనంద మనుభవించి వచ్చిన దూతిక శరీరముపై దంతక్షతాది సంభోగచిహ్నములను జూచి నాయిక అను మాట లివి. ఇచట పదార్థజ్ఞానసమయమున స్తుతి గమ్యమగుచున్నను, నిందయే ప్రధాన వాక్యార్థము.

పద పదార్థములుకూడ, సత్యమైనచో ఈ వాక్యము విరుద్ధార్థబోధక మనవలసి వచ్చును. గాన, వాక్యార్థమున పదపదార్థములు లేవని అంగీకరింపవలెను.

ఇపుడు పదవాది ఆశంకించుచున్నాడు.

అథాసంసృష్ట ఏవార్థః పదేషు సమవస్థితః
వాక్యార్థ స్యాభ్యుపాయోఽసా వేకస్య ప్రతిపాదనే. 248

పదేషు=పదములయందు, అసంసృష్ట ఏవ=ఇతరార్థములతో సంసృష్టముకాక వేరువేరుగ నుండు, అర్థః=అర్థము, సమవస్థితః=వాచ్యముగానున్నది; అసౌ=ఈ పదార్థము, ఏకస్య=ఒక్క, వాక్యార్థస్య=వాక్యార్థముయొక్క, ప్రతిపాదనే=ప్రతిపాదనమునందు, అభ్యుపాయః=ఉపాయము.

తా. పదములలో అసంసృష్టముగనే ఉన్న పదార్థము ఒక్క వాక్యార్థమును బోధించుటకు ఉపాయము.

వి. అర్థాంతరముతో సంసృష్టముకానిది పదార్థము; తత్సంసృష్టము వాక్యార్థము. వాక్యార్థమనునది ఒక్కటి మాత్రమే. కాని వాక్యార్థమునందు అనేకములగు పదార్థములు భాసించుచున్నవి. మొదట పదార్థజ్ఞానము కలుగుచున్నది. పిమ్మట వాక్యార్థజ్ఞానము కలుగుచున్నది. కావున పదార్థము వాక్యార్థజ్ఞాన హేతువు అని అంగీకరింపవలెను. అందుచే పదార్థము కూడ సత్యమే యని పూర్వపక్షి యభిప్రాయము.

దీనిని నిరాకరించుచున్నాడు.

పూర్వం పదే ష్వసంసృష్టో యః క్రమా దుపచీయతే
భిన్నగ్రథితకల్పత్వా త్తం విశిష్టతరం విదుః. 249

పూర్వం=అదియందు, యః=ఏ అర్థము, అసంసృష్టః=అర్థాంతరములతో అన్వితము కాకుండగనే, క్రమాత్=క్రమముగ, అర్థాంతరములతో అన్వయించి, ఉపచీయతే=వృద్ధిపొందునో (వికసించునో), తం=వాక్యార్థమనెడు ఈ అర్థమును, భిన్నగ్రథితకల్పత్వాత్=భేదించి అతికిన ఘటాదులతో సమానమగుటవలన, విశిష్టతరం=పదముల యర్థము మాత్రముకంటె అత్యంత విలక్షణమైనదానినిగా, విదుః=చెప్పుదురు.

తా, ఏ అర్థము ఆదియందు అసంసృష్టముగనుండి పిదప క్రమముగ వికసిత మగునో అది భేదించి, అతుకబడినదివలె నుండుటచే విశిష్టతరము అని చెప్పుదురు.

వి. రెండు చిప్పలను (కపాలములను) అతికి కుండగ తయారుచేయుదురు. కావున, కుంభకారుడు మొదట కపాలాంతరముతో సంయుక్తముకాని కపాలమును, కపాలాంతరముతో కలిపి, తయారుచేయగా, ఏర్పడిన ఘటము, కపాలములకంటె అత్యంతభిన్నమగు పదార్థాంతరమని నైయాయికుల సిద్ధాంతము. అంతియేకాని, శాఖలకు వృక్షమునకు నడుమ భేదాభేదము నంగీకరించినట్లు, (కొమ్మలను విడివిడిగా కొమ్మలుగా తీసుకొన్నచో వాటికిని వృక్షమునకును భేదము. సమూహ రూపమున తీసికొన్నచో అభేదము) ఇచట అంగీకరింపరు. అట్లే మొదట పదార్థాంతర సంసర్గములేక పిమ్మట క్రమముగ వాక్యార్థరూపమున ఉపచిత మగు అర్థము పదార్థముకంటె అత్యంత విలక్షణమైనది.

ఈ విధముగ అనేక యుక్తుల సహాయముచే వాక్యార్థము అఖండమనియు, అదియే సత్యమనియు, అపోద్ధారకల్పితములగు పదపదార్థములు అసత్యములనియు ప్రతిపాదింపబడినది. ఈ అఖండవాక్య, వాక్యార్థవాదులు పదపదార్థములను సత్యములని అంగీకరింపకున్నను, పదపదార్థాపోద్ధారమును స్వీకరించి పదపదార్థములను, వ్యవహారార్థమై అంగీకరించి యున్నారు. కావున, ఇపుడు ప్రసంగవశముచే ముఖ్య గౌణ విభాగమును చేయబోవుచు, మొదట అర్థభేదము ననుసరించి, శబ్ద భేదమున్నదా లేదా యని విచారించుచున్నాడు.

ఏక మాహు రనేకార్థం శబ్ద మన్యే పరీక్షకాః
నిమిత్తభేదా దేకస్య సార్వార్థ్యం తస్య భిద్యతే . 250

అన్యే = కొందరు, పరీక్షకాః=శాస్త్రజ్ఞులు, ఏకమ్ = ఒక, శబ్దమ్ = శబ్దమును, అనేకార్థమ్ = అనేకములైన అర్థములు కలదానినిగా, ఆహుః = చెప్పుచున్నారు. ఏకస్య = ఒకటేయైనను, తస్య = ఆ శబ్దమునకు, నిమిత్త భేదాత్ = అర్థప్రకరణాది రూపములగు నిమిత్తముల భేదము వలన, సార్వార్థ్యం = అనేక అర్థములు కలిగియుండుట, భిద్యతే = (అభిన్నమే ఐనను) భిన్నముగ కనబడుచున్నది.

తా. కొందరు శాస్త్రకారులు ఒకే శబ్దము అనేకార్థమని చెప్పుచున్నారు. ఒక్కటే యైనను, ఆ శబ్దముయొక్క సర్వార్థకత్వము నిమిత్త భేదముచే భిన్నముగ నుండును.

వి. వ్యాకరణశాస్త్రమున ఏకశబ్దదర్శనము అనేకశబ్దదర్శనము అను రెండు పక్షములున్నవి. అర్థభేదముచే శబ్దభేదము— అనగా ధేనువు అను అర్థముగల గోశబ్దము వేరు, భూమ్యర్థకమగు గోశబ్దము వేరు—అని అంగీకరించు పక్షము అనేకశబ్దదర్శనము. ఆవు, భూమి, కిరణములు, మొదలగు వేరువేరు అర్థములను చెప్పుచున్నను, గోశబ్ద మొక్కటియే యని చెప్పునది ఏకశబ్ద దర్శనము. పదరూపమగు నిమిత్తము, ఒక్కటియే యైనను, అర్థము, ప్రకరణము, మొదలగు నిమిత్తాంతరములు భిన్నములగుటచే ఒకే గో శబ్దము అనేకార్థవాచకముగ నుండును అని ఏకార్థ దర్శనమును అంగీకరించువారి అభిప్రాయము

ఒకే శబ్దము నిమిత్త భేదముచే శక్తి భేదమును పొంది అనేకార్థవాచకమని, యంగీక రించుటచే ప్రకృతమున నేమి యని ఆశంకించుకొని, సమాధానము చెప్పుచున్నాడు.

యౌగపద్య మతిక్రమ్య పర్యాయే వ్యవతిష్ఠతే
అర్థ ప్రకరణాభ్యాం వా యోగా చ్ఛబ్దాన్తరేణ వా. 251

(గవాది శబ్దము నానార్థమైనను), యౌగపద్యమ్ = ఒక్కమారుగ సర్వార్థబోధకత్వమును, అతిక్రమ్య = విడిచి, అర్థప్రకరణాభ్యాం = ప్రయోజనముచేత గాని, ప్రకరణముచేతగాని, శబ్దాన్తరేణ = ఇతర శబ్దముతో, యోగాద్వా = సంబంధమువలన గాని, పర్యాయే = పర్యాయముచే ఆయాయర్థములను బోధించుటయందు, వ్యవతిష్ఠతే = నియతమగును.

తా. అనేకార్థశబ్దము ఒక్కమారుగ, సర్వార్థబోధకత్వమును విడిచి, అర్థ ప్రకరణములచేతగాని, శబ్దాంతర సంబంధమువలనగాని, పర్యాయమున ఆయా యర్థములను బోధించుచుండును.

వి. గవాదిశబ్దములకు అనేకార్థములున్నను, ఆ అర్థము లన్నింటిని ఆ శబ్దము ఒకే సమయమున బోధింపదు. ప్రయోజనమునుబట్టి గాని, ప్రకరణ సహాయముచే గాని, శబ్దాంతర సన్నిధిచేగాని, ఒకమారు ఒక అర్థమునే బోధించును. "గౌః పాలయితవ్యా దుగ్ధాయ" అనునప్పుడు 'పాలకొరకు గోవును పోషింపవలెను' అని యున్నదిగాన, ఇచట పాలు అను ప్రయోజనమును బట్టి గోశబ్దము ధేనురూప ముఖ్యార్థ వాచకము. "గౌర్భర్తవ్యో గృహకర్మసిద్ధయే'' (గృహ కర్మలుచేయుటకై గోవును పోషించవలెను) అనునపుడు గృహకర్మసిద్ధియను ప్రయోజనమునుబట్టి గోశబ్దము వాహీకుడు (ఎద్దువలె మొరటుగానుండెడు వాహీకదేశీయుడగు వ్యక్తి) అను గౌణార్థమును బోధించును. 'గౌ స్తిష్ఠతి', 'గౌ ర్గచ్ఛతి' ఇత్యాదులలో ప్రకరణాది భేదము ననుసరించి గో వాహీకాద్యర్థములను బోధించును. 'గౌ ర్దుహ్యతే' (గోవు పిదుకబడుచున్నది) 'గాం పాఠయ' (గోవుకు చదువు చెప్పుము) ఇత్యాదులయందు 'దుహ్యతే', 'పాఠయ' ఇత్యాది పద సాన్నిధ్యముచే క్రమముగ ధేను, వాహీకార్థములు బోధింపబడుచున్నవి.

'యౌగపద్య మతిక్రమ్య పర్యాయే వ్యవతిష్ఠతే' అను దానికి ఉదాహరణము చెప్పుచున్నాడు.

యథా సాస్నాదిమాన్ పిణ్డో గోశబ్దే నాభిధీయతే
తథా స ఏవ గోశబ్దో వాహీకేఽపి వ్యవస్థితః. 252

గోశబ్దేన = గోశబ్దముచేత, యథా=ఏ విధముగా, సాస్నాదిమాన్=గంగడోలు మొదలగుదానితోకూడిన, పిణ్డః = పదార్థము, అభిధీయతే=అభిధచే బోధించబడుచున్నదో, తథా = అట్లు, సః=ఆ, గోశబ్ద ఏవ = గోశబ్దమే, వాహీకేఽపి=వాహీకుడను అర్థమునందు కూడ, వ్యవస్థితః = నియతమైయున్నది.

తా. గోశబ్దము అభిధచే ఏ విధముగా సాస్నాదులతో గూడిన ఒక పదార్థమును బోధించునో, అట్లే, వాహీకుడు అనునర్థమునందు కూడ నియతమై యుండును.

వి. గోశబ్దము అభిధావృత్తిచే గోత్వజాతి బోధనపురస్సరముగ గంగడోలు మొదలగు అవయవవిశేషములు గల ఒక వ్యక్తిని ఏవిధముగ బోధించుచున్నదో ఆ విధముగ, అదే గోశబ్దము, అభిధావృత్తిచేతనే, వాహీకాద్యర్థమును గూడ బోధించుచున్నది. అనగా శక్తిస్వరూపమునందు భేదమున్నను, అభిధయనునది ఒక్కటియే. శుద్ధలక్షణ,

గౌణలక్షణ యను మరియొక్క వృత్తి యేదియును లేదు. అభిధయే ప్రసిద్ధమైనచో ముఖ్యమనియు, అప్రసిద్ధమైనచో గౌణమనియు శబ్దోపచారముచే—అనగా శబ్దమునందు ముఖ్యత్వ, గౌణత్వారోపణముచే చెప్పబడుచున్నది అని సూచింపబడినది.

ఈ విషయమునే స్పష్టీకరించుచున్నాడు.

సర్వశక్తేస్తు తస్యైవ శబ్ద స్యానేకధర్మణః
ప్రసిద్ధిభేదాద్ గౌణత్వం ముఖ్యత్వం చోపవర్ణ్యతే. 253

అనేక ధర్మణః = అర్థభేదముచే వేరు వేరు శక్తికల, సర్వశక్తేః = కావుననే సర్వార్థ విషయకభిన్నశక్తులు గల, తస్య = ఆ ఒక్క, శబ్దస్యైవ = గవాదిశబ్దమునకే, ప్రసిద్ధి భేదాత్ = అధిక ప్రసిద్ధి-అల్పప్రసిద్ధి భేదముచే, ముఖ్యత్వం = ముఖ్యత్వము, గౌణత్వంచ = గౌణత్వమును, ఉపవర్ణ్యతే = చెప్పబడుచున్నది.

తా. అనేక ధర్మమును సర్వశక్తియు నగు ఆ శబ్దమే ప్రసిద్ధిభేదము ననుసరించి, గౌణమనియు ముఖ్యమనియు చెప్పబడుచున్నది.

వి. ఒక్క గోశబ్దమునకే అనేకములగు అర్థములను బోధించు శక్తులుండుటచే, అది సర్వశక్తిమంతము. కాని, గోశబ్దము గోత్వాదివిశిష్ట పిండరూపమగు అర్థమును బోధించునని ఎక్కువ ప్రసిద్ధి కలదు. కావున ఆ యర్థమున గోశబ్దము ముఖ్యము. వాహీకాద్యర్థ ప్రతిపాదనమున ప్రసిద్ధి అల్పము. అందుచే ఆ యర్థములందు గోశబ్దము గౌణము. ఈ విధముగ వేరు వేరు అర్థములను బోధించినను శబ్దమొక్కటియే. ఆ శబ్దము అభిధా శక్తిచేతనే ముఖ్య గౌణార్థములను రెండింటిని బోధించును.

శబ్దైక్యదర్శనమున గౌణ ముఖ్య విభాగమును చూపి, ఇపుడు ఆదర్శనమునందే, ఆయా యర్థముల భేదముచే భిన్నములగు మంత్రముల వినియోగ ప్రకార భేదమును గూర్చి చెప్పుచున్నాడు.

ఏకో మన్త్ర స్తథాధ్యాత్మ మధి దైవ మధిక్రతు
అసఙ్కరేణ సర్వార్థో భిన్నశక్తి ర్వ్యవస్థితః. 254

తథా = ఆ విధముగా, ఏకః = ఒక్క, మన్త్రః = మంత్రము, అధ్యాత్మం = ఆత్మయందును, అధిదైవమ్ = దేవతలయందును, అధిక్రతు = యజ్ఞములందును, భిన్నశక్తిః = భిన్నమైనశక్తులు కలదై, సర్వార్థః = భిన్నార్థములు కలదై, వ్యవస్థితః = నియమితమైయున్నది.

తా. అ విధముగ ఒకే మంత్రము, అధ్యాత్మ-అధిదైప -అధియజ్ఞార్థముల యందు విభిన్నశక్తి కలదై, భిన్నార్థములు కలదై, నియమితమై యున్నది.

వి. ఏకశబ్ద దర్శనమునందు ఒకేశబ్దము ఆయా యర్థములయందు వేరు వేరు శక్తులు కలదగుటచే వేరువేరు అర్థములను బోధించుచున్నది. అట్లే ఒకే మంత్రము, ఆత్మ విచారసమయమునందు ఆత్మార్థమునందును, జపసమయమునందు దేవతారూపార్థమునందును, యజనసమయమునందు క్రత్వర్థమునందును వినియుక్తమగుచున్నది. ఉదాహరణమునకు— గాయత్రీ మంత్రము ధ్యానసమయమునందు ప్రత్యగాత్మ ధ్యానపరముగాను, జపసమయమున సూర్యదేవతాధ్యానపరముగాను, కర్మానుష్ఠాన సమయమున సూర్యమండల పరముగాను

వినియోగింపబడుచున్నది. ఈ విధముగ ఒకే మంత్రము వేరువేరు శక్తులను పురస్కరించు కొని, వేరువేరు అర్థములను బోధించుటయందు వినియుక్త మగుచున్నది.

ముఖ్యత్వ గౌణత్వ రూప శబ్దోపచారము ప్రసిద్ధ్యప్రసిద్ధి నిమిత్తమని చెప్పబడినది. ఈ శబ్దోపచార పక్షమున ఒక శబ్దము ఒక అర్థమును బోధించు సమయమున ఆ యర్థముతో దానికి సంబంధ ముండును. బోధింపనపుడు సంబంధముండదు గావ, శబ్దార్థ సంబంధము అనిత్యమని చెప్పవలసి యుండును. కావున అర్థోపచారపక్షము నవలంబించి చెప్పుచున్నాడు.

గోత్వానుషఙ్గో వాహీకే నిమిత్తాత్ కైశ్చి దిష్యతే
అర్థమాత్రం విపర్యస్తం శబ్దః స్వార్థే వ్యవస్థితః . 255

కైశ్చిత్ = కొందరు శాస్త్రజ్ఞులచేత, నిమిత్తాత్ = జడత్వము మొదలగు కొన్ని సాధారణ ధర్మములను నిమిత్తముగ గొని, వాహీకే = వాహీకునియందు, గోత్వానుషఙ్గః = ఆరోపమూలకమగు గోత్వసంబంధము, ఇష్యతే = అంగీకరించబడుచున్నది, అర్థమాత్రం = పదజన్య ప్రతీతియందు విశేష్యమగు అర్థము మాత్రమే, విపర్యస్తమ్ = మార్పుచెందినది. శబ్దః = గోశబ్దము, స్వార్థే = గోత్వరూప స్వార్థమునందు, వ్యవస్థితః = నియతమైనది.

తా. నిమిత్త వశముచే వాహీకునియందు గోత్వసంబంధ మేర్పడుచున్నది అని కొందరు అంగీకరింతురు. అర్థము మాత్రమే మార్పు చెందినది గాని, శబ్దము స్వార్థమునందే నియతమైనది.

వి. శబ్దముయొక్క అర్థము స్వరూపము, బాహ్యము అని రెండు విధములు. 'గో' శబ్దమునకు 'గో' అను అర్థము స్వరూపము. గోశబ్దము ఎల్లపుడును గోత్వము అను అర్థమునే బోధించును. ఈ గోత్వ రూపార్థము గోశబ్ద స్వరూపముకంటె బాహ్యము గాన, ఇది బాహ్యార్థము. బాహ్యమగు ఈ గోత్వము, గోవునందు భాసించుచున్నది, వాహీకాదులందు ఆరోపింపబడుచున్నది. అనగా, గోశబ్దము సహజముగ గోత్వరూపమగు అర్థమునే బోధించినను, గోవునకు (ఎద్దుకు) ఉన్న జడబుద్ధిత్వము మొదలగు ధర్మములు వాహీకుని యందు కానవచ్చుటచే, ఈ వాహీకుని గూడ బోధించుటకు ప్రయుక్తమగుచున్నది. వాహీకాద్యర్థమును చెప్పినపుడు గూడ విశేష్యమగు వాహీక రూపపదార్థము మారినది గాని, గోత్వము మాత్రము, అపుడు గూడ (వాహీక రూపార్థ బోధసమయమునందు గూడ) భాసించుచునే యున్నది. ఈ విధముగ రెండు స్థలములయందునను,— గోరూప వాహీక రూపార్థములను బోధించునపుడు— గోత్వరూప బాహ్యార్థోపచారమున్నది. కాని విశేష మేమనగా— 'గౌః' అని స్వతంత్రముగ ప్రయోగించినపుడు అభిహితమగు గోత్వము ముఖ్యము. 'గౌ ర్వాహీకః' ఇత్యాది స్థలములలో వాహీకాది పదాంతర సంబంధమున్నప్పుడు అభిహితమగు గోత్వము గౌణము. ఈ విధముగ అర్థోపచార పక్షమున గోశబ్దము ఏ యర్థము నందుపయుక్తమైనను, గోత్వమనుదానితో సంబంధించియే యున్నది గాన, శబ్దార్థసంబంధము నిత్యమనుటకు విఘాత ముండదు.

బాహ్యార్థోపచారమును నిరూపించి ఇపుడు స్వరూపోపచారమును తెలుపుచున్నాడు.

తథా స్వరూపం శబ్దానాం సర్వార్థే ష్వనుషజ్యతే
అర్థమాత్రం విపర్యస్తం స్వరూపే తు స్థితిః స్థిరా . 256

తథా = గోత్వరూపమగు అర్థము సహజ రీతిచే గోరూప ముఖ్యార్థముతో గాని, జాడ్యాది నిమిత్తకృతమగు ఆరోపముచే వాహీకాది గౌణార్థములతోగాని. ఏ విధముగా సంబంధించుచున్నదో, ఆ విధముగనే (శబ్దస్వరూపమే ప్రవృత్తి నిమిత్తము — అర్థము అను పక్షమున), శబ్దానామ్ = గవాది శబ్దముల, స్వరూపం = స్వరూపము, సర్వార్థేషు = ముఖ్యార్థములయందును, గౌణార్థములయందును గూడ, అనుషజ్యతే = సంబంధించుచున్నది. అర్థమాత్రం = గవాది శబ్దములవలన కలిగిన జ్ఞానమునందు విశేష్యమగు అర్థము మాత్రమే, విపర్యస్తమ్ = ముఖ్యార్థము కంటె భిన్నమైనది. స్వరూపే తు = శబ్ద స్వరూపమునందైతే, స్థితిః = గవాది శబ్దముల స్థితి, స్థిరా = స్థిరమైనది.

తా. అట్లే శబ్దముల స్వరూపము, సర్వార్థములతోడను అనుషక్తమగును. అర్థము మాత్రము విపర్యస్తమైనను, స్వరూపమునందు గవాదిశబ్దముల స్థితి స్థిరమైనది.

వి. గోశబ్దమునకు 'గో' శబ్దస్వరూపమే అర్థమని మరియొక మతము. ఈ మతము ప్రకారము కూడ శబ్దస్వరూపము 'గోవు' అను ముఖ్యార్థముతో సహజసంబంధముచేతను, వాహీకుడు మొదలగు గౌణార్థములతో జాడ్యాది గుణనిమిత్తము చేతను సంబంధించును. గోశబ్దస్వరూపము విశేషణము; 'గోవు,' 'వాహీకుడు' మొదలగు అర్థము విశేష్యము. ఈ విధముగ విశేష్యమగు వాహీకాద్యర్థము, గోరూప ముఖ్యార్థముకంటె భిన్నమైనను విశేషణమగు గోశబ్దము గౌణముఖ్యార్థములు రెండింటియందును స్థిరముగ నున్నదిగాన, శబ్దార్థసంబంధముల నిత్యత్వమునకు హానిలేదు.

ఏకశబ్ద దర్శనానుసారముగ, శబ్దోపచార-అర్థోపచారములను నిరూపించి, ఇపుడు అనేక శబ్దార్థ దర్శనానుసారముగ శబ్దోపచార అర్థోపచారములను విశదీకరించుచున్నాడు.

ఏకత్వం తు సరూపత్వా చ్ఛబ్దయో ర్గౌణముఖ్యయోః
ప్రాహు రత్యన్తభేదేఽపి భేదమార్గానుదర్శినః . 257

భేదమార్గానుదర్శినః = శబ్దభేదవాదులు, గౌణముఖ్యయోః = గౌణార్థములును, ముఖ్యార్థములును అగు, శబ్దయోః = శబ్దములకు, అత్యన్తభేదేఽపి = అర్థభేదము ననుసరించి మిక్కిలి భేదమున్నను, సరూపత్వాత్ = సమానరూపములు కలిగియుండుటచే, ఏకత్వమ్ = ఏకత్వమును, ప్రాహుః = చెప్పుచున్నారు.

తా. గౌణార్థక, ముఖ్యార్థకశబ్దములు భిన్నములే యైనను, అవి రూపసామ్యమును బట్టి అభిన్నములుగ నున్నవని భేదమార్గాంగీకర్తలు చెప్పుదురు.

వి. భేదమార్గము ననుసరించు వైయాకరణులు, గౌణముఖ్యార్థములను బోధించుశబ్దములు పరస్పరము భిన్నములే యని అంగీకరించుచున్నారు. వాహీకరూపార్థమును బోధించు గోశబ్దము, గోరూపార్థమును బోధించు శబ్దముకంటె అత్యంత భిన్నమనియే వీరి అభిప్రాయము. ఏలయనగా—శబ్దార్థములు భిన్నాకారముకలవి; వేరువేరు ఇంద్రియములచే గ్రహింపదగినవి; వేరువేరు స్థానములం దున్నవి. వీటికి వాస్తవమున తాదాత్మ్యముగాని మరియొక సంబంధముగాని సంభావ్యముగాదు. కాని వీటికి ఏదియో సంబంధ మున్నట్లు తెలియుచున్నది. ఈ సంబంధము కేవలము కాల్పనికమగు తాదాత్మ్యసంబంధము. ఈ విధముగ గోశబ్దమునకు వాహీకాద్యర్థముతో కాల్పనికమైనను ఒక తాదాత్మ్యసంబంధమేర్పడిన తరువాత మరల ఇంకొక అర్థముతో సంబంధ మెట్లు ఏర్పడును? కాన, గౌణార్థబోధక

గోశబ్దము వేరు, ముఖ్యార్థబోధక గోశబ్దము వేరు. కాని, అనుపూర్వీసామ్యమును బట్టి ఈ రెండును అభిన్నములని అభిప్రాయము కలుగుచున్నది.

ఏకశబ్దదర్శనమును ప్రతిపాదించునపుడు 'ఏకమాహుః రనేకార్థమ్' అని 'ఆహుః' అను పదమునుమాత్రము ప్రయోగించి, ఇచట అనేకశబ్దదర్శన ప్రదర్శన సమయమున 'ప్రాహుః 'అని ప్రశస్తార్థమగు 'ప్ర' అను నుపసర్గను గూడ ప్రయోగించుటచే, భర్తృహరికి అనేక శబ్దదర్శనమే అంగీకార్యమని సూచితమగుచున్న దని వ్యాఖ్యాతల అభిప్రాయము.

ఈ శబ్ద భేద దర్శనము వైదిక శబ్దముల విషయమున గూడ ప్రవర్తించునని చెప్పుచున్నాడు.

> సామిధేన్యన్తరం చైవ మావృత్తా వనుషజ్యతే
> మన్త్రాశ్చ వినియోగేన లభన్తే భేద మూహవత్ .　　　౨౫౯

ఏవం＝వెనుక చూపినవిధముగ శబ్దభేదదర్శనము నంగీకరించినచో, ఆవృత్తౌ＝ఆవృత్తిచేసినపుడు, సామిధేన్యన్తరం＝భిన్నమైన సామిధేనీ మంత్రము, అనుషజ్యతే＝పూర్వమున నున్న సామిధేనీమంత్రములతో సంబంధించును. మన్త్రాశ్చ＝మంత్రములు కూడ, ఊహవత్＝ఊహమునందువలె, వినియోగేన＝వినియోగభేదముచే, భేదమ్＝భేదమును, లభన్తే＝పొందుచున్నవి.

తా. ఈ విధముగ ఆవృత్తిచేసినపుడు భిన్నమైన సామిధేని, పూర్వమున నున్న సామిధేనితో సంబంధించును. మంత్రములుగూడ ఊహమునందువలె వినియోగభేదముచే భేదమును పొందుచున్నవి.

వి. అగ్నిని ప్రజ్వలింపచేయుటకై వినియుక్తములగు పదకొండు లేక పదమూడు ఋక్కులు కలవు. వాటికి సామిధేనీ ఋక్కు లని పేరు. వాటిలో మొదటిఋక్కును, చివరిఋక్కును, మూడేసిసార్లు పఠించవలెను అనెడి నియమము కలదు. కావున వాటిని రెండేసిసార్లు ఎక్కువ పఠించుటచే, ప్రత్యుచ్చారణము శబ్దభేదముగాన, నాలుగు ఋక్కులు అధికముగ వచ్చును. వీటితో మొత్తము ఋక్కులసంఖ్య పదిహేనుకుగాని, పదిహేడుకుగాని పెరుగును.

ఈ విధముగ సంఖ్య పెరుగుట అనునది, మూడు పర్యాయము లుచ్చరించిన మంత్రము మూడు భిన్నమంత్రము లని యంగీకరించిననే సాధ్యమగును, కావున మొదట చదివిన మంత్రము వేరు, రెండవసారి చదివినది వేరు, మూడవసారి చదివినది వేరు అని శబ్దభేదవాదుల అభిప్రాయము.

ఈ విధముగ ఒకేమంత్రమును, రెండు మూడు కర్మలలో వినియోగింతురు. (మంత్రమునకు వినియోగ మనగా-ఒక కర్మ నాచరించునపుడు ఆ మంత్రమును పఠించుట). ఈ వినియోగభేదమునుబట్టి మంత్రములుకూడ సమానానుపూర్వీకములైనను, ఊహమునందు కొంచెము మార్పుచెందిన ఆనుపూర్విగల మంత్రములవలె భిన్నములే యని యంగీకరింపవలెను.

ఊహ మనగా ఒక కర్మయందు వినియోగించిన మంత్రమును మరియొక కర్మయందు వినియోగించునపుడు అచట దేవతా లింగ సంఖ్యాదులను బట్టి ఈ మంత్రమునందలి

కొన్నిపదములలో దేవతా లింగ సంఖ్యాది కృతములగు మార్పులను చేయుట. ఉదాహరణమునకు ప్రకృతి యాగమున వినియుక్తమగు 'అగ్నయే త్వా జుష్టం నిర్వపామి' అను మంత్రమునే వికృతి యాగమగు సౌర్యయాగమునందు వినియోగించునపుడు 'సూర్యాయ త్వా జుష్టం నిర్వపామి' అను పదవ్యత్యాసము చేయుదురు. కావున ఈ రెండుమంత్రములును భిన్నములు. అట్లే గాయత్రీ మంత్రమునకు ఆచార్యుడు బ్రహ్మచారికి ఉపదేశించుట, వివాహ ప్రకరణమున దంపతులు హుతశేష ప్రాశనము చేయుట, స్నానము చేయించుట మొదలగు అనేక కర్మలలో వినియోగము గలదు. కావున ఒక్కొక్క వినియోగము చేసినపుడెల్ల ఈ మంత్రముగూడ, ఊహచేసిన మంత్రమువలె, వేరువేరని అంగీకరింపవలె నని భావము.

సమగ్రముగ అంగము లన్నింటిని చెప్పినయాగము ప్రకృతియాగము. కొన్ని యంగములనే చెప్పుటచే ప్రకృతియాగమునుండి మరికొన్ని యంగములను గ్రహింపవలసియున్న యాగము వికృతియాగము. దర్శపూర్ణమాసాదికము ప్రకృతి, సౌర్యయాగాదికము వికృతియని మీమాంసక సంప్రదాయము.

ఊహ వినియోగాదులచే భిన్నములని యంగీకృతములగు ఆ మంత్రములకు వేదత్వమున్నదా—లేదా ? యని ఆశంకించి ఉన్నదని చెప్పుచున్నాడు.

తా న్యామ్నాయాంతరా ణ్యేవ పఠ్యతే కశ్చిదేవ తు
అనర్థకానాం పాఠో వా శేష _స్త్వన్యః ప్రతీయతే . 259

తాని = ఊహ వినియోగాది పఠితములగు మంత్రములుగూడ, ఆమ్నాయాన్తరాణ్యేవ = వేదాంతరములే, తు = కాని, కశ్చిదేవ = ఒకవేదము మాత్రమే, పఠ్యతే = పఠింపబడుచున్నది.

తా. అవికూడ వేదాంతరములే; కాని, ఒక్కటిమాత్రమే పఠింపబడుచున్నది.

వి. ఊహ వినియోగాదిపఠితములగు మంత్రము లన్నియును ఆనుపూర్వీసామ్యము కలవగుటచే వేదములే. కాని అన్నింటిని వేరువేరుగ పఠించిన గ్రంథవిస్తరమగునను భయముచే ఋషులు ఒక వేదమును మాత్రమే పఠించియున్నారని పూర్వార్ధభావము.

ఇపుడు మతాంతరమును చెప్పుచున్నాడు.

వా = లేక, అనర్థకానామ్ = అర్థరహితములగు వాటియొక్క, పాఠః = పాఠము (వేదమునందు చేయబడినది). అన్యస్తు = పఠితమైనదానికంటె భిన్నమును, లక్షణచే తద్బోధ్యమైనదియు నగునది, శేషః = కర్మాంగముగ, ప్రతీయతే = తోచుచున్నది (లేదా, 'అన్యః = పఠితముకంటె భిన్నమైన, శేషః = కర్మాంగమైన వేదమైతే, ప్రతీయతే = పఠితమగు వేదముద్వారా ఉపలక్షణరీతిచే ప్రతీయమానమగుచున్నది' అని అర్థము).

తా. లేదా అనర్థకములగు మంత్రముల పాఠమే చేయబడుచున్నది. తద్భిన్నమగు కర్మాంగమంత్రము ప్రతీయమానమగుచున్నది.

వి. వేదమునందు పఠితములగు మంత్రములకు కర్మనిష్పాదన సామర్థ్యము లేకుండుటచే అవి వేదము కావు. ఆ మంత్రములు లక్షణచే తమతో సమానమగు ఆనుపూర్విగల మంత్రములకు ఉపలక్షణభూతములగుచున్నవి. కావున వినియోగాది సమయము

లందు మూలపతితమంత్రములద్వారా ప్రతీయమానములగు కర్మవినియుజ్యమాన మంత్రములే వేదనామయోగ్యములు.

అర్థభేదమున్నచో శబ్దములు కూడ భిన్నములే కాన, మంత్రములు కూడ భిన్నములే. వేద పతితములగు మంత్రము లన్నిటికి వాస్తవమున వేదత్వము లేదు. వినియోగోపాదుల కుపయుక్తములగు మంత్రములను ఉపలక్షణచే బోధించుటయే వాటి ప్రయోజనము అని వెనుక ప్రతిపాదింపబడియున్నది. కొందరి యభిప్రాయము ప్రకారము సకల వైదిక మంత్ర పాఠము స్వరూపార్థకమే గాని, వాటికి అర్థవిశేషము లేదు అని చెప్పుచున్నాడు.

శబ్దస్వరూప మర్థస్తు పాఠేఽన్యై రుపవర్ణ్యతే
అత్యన్త భేదః సర్వేషాం తత్సమ్బన్ధాత్తు తద్వతామ్ . 260

అన్యైస్తు = ఇతరులచేతనైతే, పాఠే = వేదమంత్రముల పాఠమునందు, శబ్దస్వరూపం = శబ్దస్వరూపమే, అర్థః = అర్థముగా, ఉపవర్ణ్యతే = వర్ణింపబడుచున్నది. తత్సమ్బన్ధాత్తు = ప్రవృత్తి నిమిత్తమగు స్వరూపము యొక్క సంబంధమువలన, తద్వతామ్ = స్వరూపముగల, సర్వేషామ్ = అన్ని మంత్రములకును, అత్యన్తభేదః = మిక్కిలి భేదము.

తా. వేదమంత్రపాఠమున శబ్దస్వరూపమే అర్థమని కొందరు చెప్పుదురు. దాని సంబంధమువలన ఆ స్వరూపము గల అన్ని మంత్రములకును అత్యంతభేదము.

వి. వ్యాకరణమునందు 'అగ్నేర్ఢక్' ఇత్యాది సూత్రములలోని అగ్న్యాది పదములకు 'అగ్ని' శబ్దమే అర్థము కాని తద్భిన్నమగు అర్థము లేదు. అనగా ఈ అగ్న్యాది శబ్దములకు 'అగ్ని' శబ్దస్వరూపమాత్రబోధనమే ప్రయోజనము కాని ఇతర కార్యకారిత్వ మేదియును లేదు. అట్లే వేదపతితములగు మంత్రములకు శబ్దస్వరూపమే అర్థము. కావున శక్తిచేతనే శబ్దము మంత్రస్వరూపమును బోధించుచున్నది. కాన లక్షణ అనావశ్యకమని యభిప్రాయము. కావున పతితమంత్రములకును, అపతితమంత్రములకును స్వరూపభేద ముండుటచే అత్యంతభేదమే కాని అభేదము లేదు. వేదపతితములైనవాటికి స్వరూపము మాత్రమే అర్థమైనను ఇతర మంత్రములకు యాగాదివినియోగముకూడ ఉన్నది గాన అవి కేవలస్వరూపవంతములు కావుకదా యని యాశంకింపరాదు. అచట కూడ ప్రవృత్తినిమిత్తభూతమగు స్వరూపమున్నది గాన ఆ స్వరూపము కలవాటి కన్నిటికిని పరస్పరము అత్యంతాభేదమే అంగీకార్యము.

ఈవిధముగ పతితాపతిత మంత్రములకు భేదమునే అంగీకరింపవలెనని చెప్పుచున్నాడు.

అన్యా సంస్కారసావిత్రీ కర్మ ణ్యన్యా ప్రయుజ్యతే
అన్యా జపప్రబన్ధేషు సా త్వేకైవ ప్రతీయతే . 261

సంస్కారసావిత్రీ = ఉపనయనాది సంస్కారములయందు వినియుక్తమగు గాయత్రి, అన్యా = భిన్నమైనది. కర్మణి = యాగాదికర్మయందు, అన్యా = మరియొక గాయత్రి, వినియుజ్యతే = వినియోగింపబడుచున్నది. జపప్రబన్ధేషు = చతుర్వింశతి లక్ష జపాదులందు, అన్యా = మరియొక గాయత్రి వినియోగింపబడుచున్నది. తు = కాని. సా = ఆ గాయత్రి, ఏకైవ = ఒక్కటిగానే, ప్రతీయతే = తోచుచున్నది.

తా. సంస్కారమునందు వినియుక్తమగు గాయత్రి వేరు. కర్మవినియుక్త గాయత్రి వేరు. జపవినియుక్త గాయత్రి వేరు. ఐనను ఆ గాయత్రి ఒక్కటిగనే తోచు చున్నది.

వి. ఈ విధముగ అర్థభేదముచే శబ్దభేదము నంగీకరించు అనేక భేదధర్మము సందు గౌణార్థము వేరు, ముఖ్యార్థము వేరు. గౌణార్థబోధక శబ్దము వేరు, ముఖ్యార్థబోధక శబ్దము వేరు. అయినను ఆనుపూర్వీ సామ్యముచే ఆ రెండు శబ్దములకును ఏకత్వము నారోపించి (ఇదియే శబ్దోపచారము) ప్రసిద్ధమగు అర్థమును బోధించునపుడు ముఖ్యార్థమును బోధించుచున్నదనియు, అప్రసిద్ధార్థమును బోధించునపుడు గౌణార్థమును బోధించుచున్న దనియు వ్యవహారము. ఇట్లు శబ్దోపచారము నంగీకరించక (శబ్దైకత్వ దర్శనము నవలం బించి)అర్థోపచారమును స్వీకరించి, వాహీకుని యందు జాడ్యాదిగుణములను నిమిత్తముగ గొని గోత్వరూపార్థము ఆరోపించబడుచున్న దన్నచో శబ్దార్థసంబంధము అనిత్యమని అంగీ కరింపవలసి యుండును. కావున భేదపక్షము నవలంబించి శబ్దోపచారము నంగీకరించుటయే యుక్తము.

ఇపుడు శబ్దములన్నింటికిని స్వరూపమే ప్రవృత్తి నిమిత్తమని చెప్పుచున్నాడు.

> అర్థస్వరూపే శబ్దానాం స్వరూపా ద్వృత్తి రిష్యతే
> వాక్యరూపస్య వాక్యార్థే వృత్తి రన్యానపేక్షయా . 262

శబ్దానామ్ = శబ్దములకు, అర్థస్వరూపే = అర్థమనెడు వస్తువునందు, స్వరూపాత్ = స్వరూపమువలననే, వృత్తిః = ప్రవృత్తి (బోధకత్వము), ఇష్యతే = అంగీకరింప బడుచున్నది. వాక్యరూపస్య = వాక్యస్వరూపమునకు, వాక్యార్థే = వాక్యమనెడు అర్థమునందు, అన్యానపేక్షయా = ఇతరాపేక్ష లేకుండగానే, వృత్తిః = ప్రవృత్తి.

తా. శబ్దము స్వరూపముచేతనే అర్థరూపవస్తువునందు ప్రవర్తించును. వాక్య స్వరూపముకూడ ఇతరానపేక్షమై వాక్యార్థమున ప్రవర్తించును.

వి. 'తత్సమ్బన్ధాత్తు తద్వతామ్' అని పూర్వముచెప్పిన ప్రవృత్తి నిమిత్తమగు స్వరూపముతో సంబంధము వేదమంత్రముల విషయముననే కాదు; ఇతరశబ్దములు, వాక్య ములు కూడ స్వరూపసంబంధమునే పురస్కరించుకొని స్వస్వార్థములను బోధించును.

గౌణ ముఖ్య విభాగము ఏకశబ్దదర్శనమునందే గాని అనేకశబ్ద దర్శనమునందు లేదని చెప్పుచున్నాడు.

> అనేకార్థత్వ మేకస్య యైః శబ్ద స్యానుగమ్యతే
> సిద్ధ్యసిద్ధికృతా తేషాం గౌణముఖ్యప్రకల్పనా . 263

యైః = ఎవరిచేత, ఏకస్య = ఒక, శబ్దస్య = శబ్దమునకే, అనేకార్థత్వమ్ = గౌణ ముఖ్యార్థభేదముచే నానార్థకత్వము, అనుగమ్యతే = అంగీకరింపబడుచున్నదో, తేషామ్ = వారిమతమునందు, గౌణముఖ్యప్రకల్పనా = గౌణముఖ్యవిభాగకల్పనము, సిద్ధ్యసిద్ధికృతా = అర్థముయొక్క ప్రసిద్ధ్యప్రసిద్ధులచే చేయబడినది.

తా. ఒకశబ్దము అనేకార్థము అని అంగీకరించు వారిమతమున గౌణముఖ్య విభాగము ప్రసిద్ధ్యప్రసిద్ధిమూలకము.

వి. ఒకే శబ్దము అనేకములగు (గౌణముఖ్యాది) అర్థములను బోధించును అని అంగీకరించు ఏకశబ్దదర్శనమునందే ఇది గౌణార్థము, ఇది ముఖ్యార్థము అనెడు విభాగము గాని అనేకశబ్దదర్శనమున అట్టి విభాగములేదు. ఈ దర్శనమున అన్నిశబ్దములును తమ తమ యర్థములను బోధించును గాన అన్నియు ముఖ్యార్థములే. అనేకశబ్దదర్శనమునందు, ఒక అర్థము ప్రసిద్ధమగుటచే అది ముఖ్యార్థమనియు, మరియొకటి అప్రసిద్ధమగుటచే గౌణార్థమనియు చెప్పుదురుగాని, ముఖ్యార్థమును శక్తి (అభిధ) బోధించుననియు, గౌణార్థమును లక్షణ బోధించుననియు అంగీకరింపవలసిన పనిలేదు. గౌణార్థమైనను, ముఖ్యార్థమైనను, రెండర్థములను గూడ శక్తియే బోధించును. స్వతంత్రమగు లక్షణావృత్తిని కల్పింప పనిలేదు. అప్రసిద్ధార్థమును బోధించు శక్తియే లక్షణ, శబ్దాభేద దర్శనమునందుగూడ వాస్తవమున ఆయా 'గో' శబ్దములు బోధించు ఆయా వాహీకగవాద్యర్థము లన్నియు ముఖ్యార్థములేయైనను లోకప్రసిద్ధిచే వాహీకాద్యర్థబోధక గోశబ్దము గౌణమనియు, గోరూపార్థబోధక 'గో' శబ్దము ముఖ్యమనియు లోకవ్యవహారము.

ఇపుడు రెండు దర్శనములందును గౌణముఖ్య విభాగమునకు నిమిత్తాంతరమును చూపుచున్నాడు.

అర్థప్రకరణాపేక్షో యో వా శబ్దాన్తరైః సహ
యుక్తః ప్రత్యాయయ త్యర్థం తం గౌణ మపరే విదుః. 264

యః = ఏ శబ్దము, అర్థప్రకరణాపేక్షః = అర్థమును (ప్రయోజనమును), ప్రకరణమును అపేక్షించునదై గాని, వా = లేక, శబ్దాన్తరైః = ఇతరశబ్దములతో, యుక్తం = కూడినదై గాని, అర్థం = అర్థమును, ప్రత్యాయయతి = బోధించునో, తం = దానిని, గౌణమ్ = గౌణశబ్దమునుగా, అపరే = ఇతరులు, విదుః = గ్రహించుచున్నారు.

తా. అర్థప్రకరణాపేక్షమై గాని, శబ్దాంతరసహచరితమై గాని అర్థమును బోధించు శబ్దము గౌణశబ్దమని కొందరు చెప్పుదురు.

వి. అర్థమును గాని, ప్రకరణమును గాని అపేక్షించి, లేదా శబ్దాంతరముతో సన్నిహితమై యుండి అర్థమును బోధించు పదము గౌణమని కొందరి అభిప్రాయము. ఇది భేద పక్షమునందును అభేదపక్షమునందును గూడ సమానము. 'గాం పాఠయ' అనునపుడు పాఠనరూపప్రయోజనమును పురస్కరించుకొని గోశబ్దము వాహీకుని బోధించును. వాహీకుని గూర్చి మాటలాడుప్రసంగమున 'గౌర్గచ్ఛతి' అని ప్రయోగించినపుడు గూడ గోశబ్దమునకు 'వాహీకుడు' అని యర్థము. ఇట్లే 'గౌ ర్వాహీకః' ఇత్యాదులలో వాహీకపదసంబంధముచే 'గో' శబ్దము గౌణార్థకము.

పై విషయమునే సంగ్రహకారుని శ్లోకమునుగూడ ప్రమాణముగ చూపుచు విశదీకరించుచున్నాడు.

శుద్ధ స్యోచ్చారణే స్వార్థః ప్రసిద్ధో యస్య గమ్యతే
స ముఖ్య ఇతి విజ్ఞేయో రూపమాత్రనిబన్ధనః. 265

శుద్ధస్య = అర్థప్రకరణాదిరహితమగు, యస్య = ఏ శబ్దముయొక్క, ఉచ్చారణే = ఉచ్చారణముచేయగనే, ప్రసిద్ధః = ప్రసిద్ధమగు, స్వార్థః = స్వార్థము, గమ్యతే = తెలియ

బడునో, రూపమాత్రనిబన్ధనః = శబ్దస్వరూపముమాత్రమే నిమిత్తముగా గల, సః = ఆ శబ్దము, ముఖ్యః ఇతి = ముఖ్యమని, విజ్ఞేయః = తెలియదగినది.

తా. ఒకశబ్దము నుచ్చరించగనే, అర్థప్రకరణాది సహాయము నపేక్షింపక, స్వస్వరూపమును మాత్రమే నిమిత్తముగా గొని (అది 'గో' శబ్దము గావున) ప్రసిద్ధమగు అర్థమును బోధించినచో ఆ శబ్దము ముఖ్యమని గ్రహింపవలెను. ఇది ముఖ్యశబ్దలక్షణము.

ఇపుడు గౌణశబ్దస్వరూపమును చెప్పుచున్నాడు.

యస్త్వన్యస్య ప్రయోగేణ యత్నాదివ నియుజ్యతే
తమప్రసిద్ధం మన్యన్తే గౌణార్థాభినివేశినమ్. 266

యస్తు = ఏ శబ్దమైతే, అన్యస్య = మరియొక శబ్దము యొక్క, ప్రయోగేణ = ప్రయోగముచేత. యత్నాదివ = ప్రయత్నపూర్వకముగ చేసినట్లు (అర్థప్రకరణాన్యపద సాహచర్యాదులచే), నియుజ్యతే = అప్రసిద్ధమగు అర్థాంతరమునందు నియమితమగుచున్నదో, తం = ఆ, అప్రసిద్ధం = అప్రసిద్ధార్థముగల పదమును, గౌణార్థాభినివేశినమ్ = గౌణార్థబోధకమునుగా (గౌణమునుగా), మన్యన్తే = తలతురు.

తా. అర్థము, ప్రకరణము, ఇతరశబ్దసంసర్గము మొదలగు కారణాంతరములచే అప్రసిద్ధార్థమును బోధించు శబ్దము గౌణము; ఆ శబ్దము బోధించు అర్థము గౌణార్థము.

ఇపుడు శబ్దైక్యదర్శనమున ప్రకారాంతరముచే గౌణముఖ్యవిభాగమును చేయుచున్నాడు.

స్వార్థే ప్రవర్తమానస్య యస్యార్థం యోఽవలమ్బతే
నిమిత్తం తత్ర ముఖ్యం స్యాన్నిమిత్తీ గౌణ ఇష్యతే. 267

స్వార్థే = గంగడోలు మొదలగు అవయవములుగల వ్యక్తియందు, ప్రవర్తమానస్య = బహులముగా ప్రయోగింపబడుచున్న, యస్య = ఏ గోశబ్దముయొక్క, అర్థం = అర్థమును (ప్రవృత్తినిమిత్తమగు గోత్వమును), యః = వాహీకుని విషయమున ప్రయుక్తమగు ఏ గోశబ్దము, అవలమ్బతే = అవలంబించుచున్నదో, తత్ర = ఆవిధముగ అవలంబించుటయందు, ముఖ్యం = ముఖ్యార్థము, నిమిత్తమ్ = నిమిత్తముగా, స్యాత్ = అగును, గౌణః = గౌణశబ్దము, నిమిత్తీ = నిమిత్తిగా, ఇష్యతే = అంగీకరింపబడుచున్నది.

తా. గోశబ్దము ప్రయోగబాహుళ్యముచే సాస్న (గంగడోలు) మొదలగు అవయవవిశేషముగల వ్యక్తిని బోధించును. అది దాని ముఖ్యార్థము. వాహీకుని విషయమున ప్రయుక్తమగు గోశబ్దము కూడ జాడ్యాది మూలకమగు ఆరోపముచే గోశబ్దముఖ్యార్థమగు గోత్వమునే ప్రవృత్తి నిమిత్తముగ ఆశ్రయించుచున్నది. కావున ముఖ్యార్థము నిమిత్తము, గౌణార్థము నిమిత్తి.

అర్థద్వయమునకున్న ఈనిమిత్త నిమిత్తి భావముతో సహితమగు అర్థప్రకరణాదికమే గౌణముఖ్య విభాగమునకు హేతువు కాని కేవలార్థ ప్రకరణాదికము కాదని చెప్పుచున్నాడు.

పురారాదితి భిన్నేఽర్థే యౌ వర్తేతే విరోధిని
అర్థప్రకరణాపేతం తయోరవ్యవధారణమ్. 268

పురా ఆరాత్ ఇతి = 'పురా' 'ఆరాత్' అని, యౌ = ఏశబ్దములు, భిన్నే = పరస్పరభిన్నమును, విరోధిని = విరుద్ధమును అగు, అర్థే = అర్థమునందు, వర్తేతే = ఉంటున్నవో, తయోరపి = వాటియందు కూడా, అవధారణమ్ = అర్థనిర్ణయము, అర్థప్రకరణాపేక్షమ్ = అర్థప్రకరణములపై ఆధారపడియున్నది.

తా. పరస్పరభిన్నములును, విరుద్ధములును అగు రెండేసి అర్థములను బోధించు 'పురా' 'ఆరాత్' అను శబ్దముల అర్థనిర్ణయము కూడ అర్థప్రకరణాపేక్షమై యున్నది.

వి. 'పురా' అనునది భూతార్థమును భావ్యర్థమును కూడ బోధించును. 'పురా భుఙ్క్తే' అనగా 'భుజింప గలడు' అని యర్థము. ఇచట 'పురా' భవిష్యదర్థకము. 'యజతిస్మ పురా యుధిష్ఠిరః' 'యుధిష్ఠిరుడు పూర్వము యాగముచేసెను' అనునపుడు భూతార్థకము. ఇట్లే 'ఆరాత్' అను అవ్యయమునకు 'దూరమున' 'సమీపమున' అని రెండర్థములు. 'ఆరాద్దూరసమీపయోః' అని అమరుడు. ఈ విధముగ పరస్పరభిన్నములగు రెండు అర్థములను బోధించు ఈ అవ్యయముల అర్థమును నిర్ణయింపవలెననిన అర్థప్రకరణాది సహాయము కావలెను. తావన్మాత్రముచే ఒక యర్థము ముఖ్యమనియు, రెండవది గౌణమనియు చెప్పుటకు వీలులేదు. రెండును ముఖ్యార్థములే. కావున అర్థప్రకరణాదికముతో పాటు నిమిత్తనిమిత్తి భావమున్ననే అవి గౌణముఖ్యత్వ నిర్ణయమునకు ఉపయుక్తములగును.

ఏకశబ్దదర్శనమునందు గాని, అనేకదర్శనమునందు గాని, పదపదార్థములకు సత్యత్వము నంగీకరించుటచే, గౌణముఖ్యవిభాగము, దాని నిమిత్తములును ప్రతిపాదింపబడినవి. కాని వాస్తవమున పదార్థములు అసత్యములనియు, అఖండవాక్యమే అఖండవాక్యార్థమును బోధించుననియు సిద్ధాంతము గాన, అట్టి వాక్యమునందు పదపదార్థములు లేకున్నచో గౌణముఖ్య విభాగమెట్లు కుదురును? అనగా 'గౌర్వాహీకః' ఇత్యాద్యుదాహరణములయందు పదపదార్థములు సత్యములు అని అంగీకరించు పక్షమున విరుద్ధార్థకములగు రెండు పదములకు సామానాధికరణ్యము (ఏకవిశేష్యబోధకత్వము) అనుపపన్నముగాన గోపదము ఆరోపితార్థకమగుటచే గౌణమనియు, 'గౌఃచరతి' ఇత్యాదులలో అనారోపితార్థకమగుటచే ఇది ముఖ్యమనియు చెప్పుటకు వీలగును, కాని 'గౌర్వాహీకః' అనెడు అఖండవాక్యము, తత్తత్పదార్థానుసంధానమేదియు లేకుండగనే 'జాడ్యాదిధర్మావచ్ఛిన్నుడగు వాహీకుడు' అనెడు అఖండ వాక్యార్థమును బోధించునపుడు గౌణముఖ్యవిభాగమనునది అసంభావ్యముకదా యని ఆశంకించుకొని వాక్య వాక్యార్థము లఖండములు అనెడు పక్షమునందుగూడ గౌణముఖ్యభావమును సమర్థించుచున్నాడు.

వాక్య స్యార్థాత్ పదార్థానా మపోద్ధారే ప్రకల్పితే
శబ్దాన్తరేణ సమ్బన్ధః తస్యైక స్యోపపద్యతే . 269

వాక్యస్య = వాక్యముయొక్క, అర్థాత్ = అర్థమునుండి, పదార్థానామ్ = పదపదార్థములయొక్క, అపోద్ధారే = అపోద్ధారము, ప్రకల్పితే = కల్పింపబడిన దగుచుండగా, తస్యఏకస్య = ఆ విధముగ అపోద్ధృతమగు ఆ ఒక్క పదమునకు, శబ్దాన్తరేణ = మరియొక శబ్దముతో, సమ్బన్ధః = సంబంధము, ఉపపద్యతే = ఉపపన్నమగును.

తా. వాక్యార్థమునుండి పదార్థముల విభాగమును బుద్ధిచే కల్పింపగా దానికే శబ్దాంతరముతో సంబంధము ఉపపన్న మగును.

వి. అఖండములగు వాక్యవాక్యార్థములనుండి బుద్ధి పరికల్పితమగు అపోద్ధార ముచే పదపదార్థములను విడదీసి, ప్రసిద్ధ్యప్రసిద్ధిమూలకమగు గౌణముఖ్య విభాగము నంగీకరించవచ్చును.

'అయం కః'అను ప్రశ్నకు ప్రత్యుత్తరముగా 'గౌః'అను ఒక్క పదమే ప్రయోగింప బడుచున్నది. అట్టి స్థలములలో వాస్తవమగు పదపదార్థ విభాగమున్నది గాన గౌణముఖ్య విభాగము గూడ వాస్తవమే యని యాశంకించుకొని సమాధానము చెప్పుచున్నాడు.

యచ్చాప్యేకం పదం దృష్టం చరితాస్తిక్రియం క్వచిత్
తద్వాక్యాన్తరమేవాహు ర్నతదన్యేవ యుజ్యతే. 270

క్వచిత్ = కొన్ని స్థలములయందు, యత్ = ఏ, ఏకమ్ = ఒక, పదం = 'గో' ఇత్యాదిపదము, దృష్టం = చూడబడినదో, చరితాస్తిక్రియం = కబలీకృతమగు 'అస్తి' అనెడు క్రియగల, తత్ = దానిని, వాక్యాన్తరమేవ = మరియొక స్వతంత్ర వాక్యమేయని, ఆహుః = చెప్పుదురు. తత్ = అది, అన్యేన = మరియొక పదముతో, న యుజ్యతే = సంబంధించదు.

తా. నిగీర్ణమగు 'అస్తి' క్రియగల ఏ ఒక పదము గలదో అది భిన్నవాక్యమే కాని మరి దేనితోడను సంబంబంధింపదు అని చెప్పుచున్నారు.

వి. ప్రత్యుత్తరరూపమున ప్రయుక్తమగు 'గౌః' ఇత్యాదిశబ్దము ఒకపదమువలె కనబడుచున్నను, 'అస్తి' అను క్రియ గూడ అందు నిగూఢమైయున్నది. కావున ఇది 'గౌః అస్తి' అను అఖండవాక్యమే కావున అది పదాంతరముతో సంబంధించుట అనునది లేదు.

ఈ విషయమునే స్పష్టీకరించుచున్నాడు.

యచ్చ కోఽయ మితి ప్రశ్నే గౌ రశ్వ ఇతి చోచ్యతే
ప్రశ్న ఏవ క్రియా తత్ర ప్రక్రాన్తా దర్శనాదికా. 271

అయం = ఇది, కః = ఏమిటి, ఇతి = అను, ప్రశ్నే = ప్రశ్నయందు, గౌః = ఎద్దు అనియు, అశ్వ ఇతిచ = అశ్వమనియు, యచ్చ ఉచ్యతే = చెప్పుట ఏది కలదో, తత్ర = ఆ స్థలమునందు, ప్రశ్నేఏవ = ప్రశ్నమునందే, దర్శనాదికా = దర్శనము మొదలగు, క్రియా = క్రియ, ప్రక్రాన్తా = ఉపక్రమింపబడినది.

తా. 'ఇది ఏమి?' అని ప్రశ్నించినపుడు 'గోవు' 'అశ్వము' అని సమాధానము చెప్పబడుచున్నది. అచట ప్రశ్నమునందే దర్శనాదిక్రియ ఉపక్రాంతమై యున్నది.

వి. 'కోఽయమ్' అని ప్రశ్నించినపుడు 'గౌః' అని గాని, 'అశ్వః' అని గాని ప్రత్యుత్తరము చెప్పబడుచున్నది. ఇచట ప్రశ్నమునందే 'దృశ్యతే' 'భవతి' ఇత్యాదిక్రియ ('కోఽయం దృశ్యతే' లేక 'భవతి' ఇత్యాది విధమున) ప్రారంభముననే అంతర్గర్భితమై యున్నది. ఆ క్రియయే 'గౌః' 'అశ్వః' అను ప్రత్యుత్తరమునందు గూడ నిగూఢమైయున్నది గాన ఇది నిగూఢక్రియమగు వాక్యమని భావము.

ధర్మముల న్యూనాధికభావమే గౌణముఖ్య విభాగమునకు కారణమని కొందరి యభిప్రాయము. ఉదాహరణమునకు—అధికమగు జాడ్యము కలది ముఖ్యమగు గోపదార్థము. తద్వాచకమగు గోశబ్దము ముఖ్యము. వాహీకాదులలో జాడ్యము అల్పముగనుండును. అట్టి యర్థము గౌణార్థము. ఆ యర్థమును బోధించు గోశబ్దము గౌణము. ఈ మతమును నిరాక రించుచున్నాడు.

నై_వాధికత్వం ధర్మాణాం న్యూనతా వా ప్రయోజికా
అధిక్యమపి మన్య_న్తే ప్రసిద్ధే ర్న్యూనతాం క్వచిత్ . 272

ధర్మాణాం=ధర్మములయొక్క, అధికత్వమ్ = అధిక్యముగాని, న్యూనతావా = న్యూనత్వముగాని, ప్రయోజికా = గౌణముఖ్యత్వనిమిత్తము, నైవ = కాజాలదు. క్వచిత్ = కొన్నియెడల, ప్రసిద్ధేః = లోకప్రసిద్ధివశమున, అధిక్యమపి = అధిక్యమునుగూడ, న్యూనతామ్ = న్యూనత్వమునుగా, మన్యన్తే= తలచుచున్నారు.

తా. ధర్మముల న్యూనత్వాధికత్వములు ప్రయోజకములు కావు, లోకప్రసిద్ధి వశమున కొన్ని యెడల అధిక్యము గూడ న్యూనత్వమే యని చెప్పుదురు.

వి. అధికత్వము, న్యూనత్వము అనువని ఆపేక్షికములుగాన వాటిని బట్టి గౌణత్వ ముఖ్యత్వముల నిర్ణయము పొసగదు. కొన్ని స్థలములలో వాహీకాదులగు గౌణార్థములలో అత్యధికముగ జాడ్యాదికమున్నను, లోకప్రసిద్ధి ననుసరించి, అల్పమని చెప్పుట గూడ సంభావ్యము కావున గౌణార్థమున ధర్మములు న్యూనముగా నుండు ననియు, ముఖ్యార్థమున అధికముగనుండు ననియు చెప్పుట యుక్తిసహము కాదు.

ఇపుడు మతాంతరము ననుసరించి, గౌణముఖ్య వ్యవహారమునకు సాదృశ్యము నిమిత్తమని చెప్పుచున్నాడు.

జాతిశబ్దోఽ_న్తరేణాపి జాతిం యత్ర ప్రయుజ్యతే
సమ్బన్ధిసదృశా ద్ధర్మాత్ తం గౌణ మపరే విదుః . 273

జాతిశబ్దః = గోత్వాదిజాతి ప్రవృత్తినిమిత్తముగా గల గవాది శబ్దము, జాతిమ్ అన్తరేణాపి=గోత్వాది జాతి లేకపోయినను, యత్ర = ఏ వాహీకాద్యర్థమునందు, సమ్బన్ధి సదృశాత్=గోత్వాదిజాతికి సంబంధించిన గవాది వ్యక్తియొక్క ధర్మమగు జాడ్యాదిక్యముతో సమానమగు వాహీకాదిగత జాడ్యాదికమువలన, ప్రయుజ్యతే = ప్రయోగింపబడుచున్నదో, తం = దానిని, గౌణమ్ = గౌణమునుగా, అపరే = ఇతరులు, విదుః = తెలిసికొనుచున్నారు. (చెప్పుచున్నారు).

తా. జాతిశబ్దము జాతి లేకపోయినను తత్సంబంధిధర్మసదృశమగు ధర్మము వలన ఎచట ప్రయోగింపబడునో దానిని గౌణమని కొందరు చెప్పుదురు,

వి. వాహీకునియందు గోత్వము లేదు. అయినను 'గో' శబ్దము అతని విషయమున ప్రయోగింపబడుచున్నది. గోత్వజాతికి ఆశ్రయభూతమగు గోవునం దున్న జాడ్యాదులతో సమానమగు జాడ్యాదులు వాహీకునియందుండుటయే ఇందులకు కారణము. ఈవిధముగ సాదృశ్యమే గౌణముఖ్యవ్యవహారమునకు నిమిత్తమని కొందరు చెప్పుచున్నారు.

విపర్యాసము—అనగా అది కాని దానిని అదియని భావించుట అనెడు అధ్యారోపము గౌణత్వ వ్యవహారమునందు హేతువని చెప్పుచున్నాడు.

విపర్యాసాది వార్థస్య య త్రార్థాన్తరతా మివ
మన్య_న్తే స గవాదిస్తు గౌణ ఇత్యుచ్యతే క్వచిత్ . 274

అర్థస్య = వాహీకాద్యర్థమునకు, అర్థాన్తరతామివ=ముఖ్యార్థగవాది రూపత్వమును వలె (గవాదిరూపత్వము యథార్థముకాదు గాన 'ఇవ' శబ్దప్రయోగము), విపర్యాసాదివ =

విపర్యాసమువలనవలె, యత్ర = ఎచ్చట, మన్యన్తే = తలతురో, సః = ఆం గవాదిస్తు = 'గో' మొదలగు శబ్దము, క్వచిత్ = కొందరిమతమున, గౌణ ఇతి = గౌణమని, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా. ఒక అర్థము మరియొక అర్థమువలె ఉన్నట్లు, విపర్యాసమువలన వలె, ఎచట తలతురో, అది కొందరి మతమున గౌణమని చెప్పబడుచున్నది.

వి. విపర్యాసమనగా ఒక యర్థమును (వాహీకాద్యర్థమును) బోధింపని పదమును ఆ అర్థమనకు (వాహీకాద్యర్థమునకు) వాచకముగా ప్రయోగించుట. ఇది అధ్యవసాయము—అనగా అభేదగ్రహణరూపమగు మిథ్యాజ్ఞానము, అధ్యారోపము అను రెండు నిమిత్తములచే కలుగవచ్చును. శుక్తికనుచూచి ఇది రజతము అనునపుడు ఇచట భేదగ్రహణము లేదు గాన ఇది మిథ్యాజ్ఞానరూపమగు విపర్యాసము. దానికి నిమిత్తము అధ్యవసాయము. 'గౌర్వాహీకః' అనునపుడు గోవాహీకులకుగల భేదము గ్రహింపబడుచున్నను వాహీకుని యందు గోగత జాడ్యాది గుణసదృశములగు గుణములను చూచి అతనియందు గోత్వమును ఆరోపించుచున్నాడు. ఇదియు విపర్యాసమే. ఇందు భేదగ్రహణపూర్వకాధ్యారోపము మూలము. ఈ విధముగ నిచట అధ్యవసాయరూపవిపర్యాసము (మిథ్యాజ్ఞానము) లేదు. అధ్యారోపరూప విపర్యాసమే ఉన్నది. కావుననే కారికలో 'విపర్యాసాదివ' (అనగా అధ్యవసాయరూప విపర్యాసమువలన వలె) అని 'ఇవ' శబ్దము ప్రయోగింపబడినది. ముఖమునందు చంద్రత్వమును ఆరోపించి 'ముఖమే చంద్రుడు' అనునట్లు వాహీకునియందు గోత్వము లేకున్నను దానిని ఆరోపించి 'గౌర్వాహీకః' ఇత్యాది గౌణప్రయోగములు చేయుచున్నారు అని కొందరి యభిప్రాయము.

గౌణముఖ్య వ్యవహారమునకు రూపమును, శక్తియు నిమిత్తమని కొందరి యభిప్రాయము. ఉదాహరణమునకు—గంగడోలు మొదలగు అవయవములు గల రూపముతో గూడిన వ్యక్తి విషయమున ప్రయుక్తమగు గోశబ్దము ముఖ్యము, ఇతర స్థలములందు గౌణము. దోహన-వాహనాదులకు సాధనమగుట యను శక్తిగల వ్యక్తి విషయమున ప్రయుక్తమగు గోశబ్దము ముఖ్యము; అట్టి శక్తి లేని వ్యక్తి విషయమున ప్రయుక్తమగు గోశబ్దము గౌణము. ఈ మతమును దృష్టాంత ప్రదర్శన పూర్వకముగ ప్రతిపాదించుచున్నాడు.

నియతాః సాధనత్వేన రూపశక్తి సమన్వితాః
యథా కర్మసు గమ్యన్తే సీరాసిముసలాదయః . 275

క్రియావ్యతిరేకేణ చైతేషాం భవన్తి నహి శక్తయః
రూపాదేవ తు తాదర్థ్యం నియమేవ ప్రతీయతే . 276

తథైవ రూపశక్తిభ్యా ముత్పత్త్యా సమవస్థితః
శబ్దో నియతతాదర్థ్యః శక్త్యావ్యత్ర ప్రయుజ్యతే . 277

యథా = ఏ విధముగా, రూపశక్తి సమన్వితాః = తమతమ ఆకారములతోడను, ఆయాక్రియలను చేయుటకు అనుకూలమగు శక్తులతోడను కూడిన, సీరాసిముసలాదయః = నాగలి, కత్తి, రోకలి మొదలగునవి, కర్మసు = దున్నుట, ఖండించుట, దంచుట మొదలగు

ఆయా కర్మలయందు, సాధనత్వేన=సాధనములుగా, నియతాః=నియతములై, గమ్యన్తే= తెలియబడునో,

ఏతేషాం = ఈ సీరాసిముసలాదులకు, క్రియాన్తరేణ చ = లతాచ్ఛేదాదకమగు ఇతరక్రియతో సంబంధించిన, శక్తయః = శక్తులు, నహి = ఉండవుకదా (అందుచే), రూపాదేవ = వాటి రూపమువలననే, నియమేన=నియమముచేత, తాదర్థ్యం = ఆయా కర్మలను చేయుటకై ఉద్దిష్టమగుట, ప్రతీయతే=తోచుచున్నది.

తథైవ = అట్లే (సీరాసిముసలాదులవలెనే), ఉత్పత్త్యా = స్వభావముచేతనే, రూపశక్తిభ్యామ్ = రూపశక్తులతో, సమవస్థితః = కూడియున్నదియు, నియతతాదర్థ్యః= సాస్నాదిమత్పిండమును నియతముగబోధించు, శబ్దః = గవాది శబ్దము, శక్త్యా=కేవల శక్తిచేత, అన్యత్ర = బాహీకాద్యర్థమునందు, ప్రయుజ్యతే = ప్రయోగింపబడును.

తా. ఆయా రూపశక్త్యాదులతో కూడిన హలముసలఖడ్గాదులు ఆయా కర్మలయందు నియత సాధనములుగ తెలియబడుచున్నవి. వాటి శక్తులు మరియొక క్రియతో సంబంధించి యుండవు. రూపమును బట్టియే ఇవి ఆయాకర్మల కొరకై ఉద్దిష్టములైనవని తెలియుచుండును. ఈ విధముగనే స్వభావము చేతనే రూపశక్తులతో కూడియున్నదియు, నియతార్థబోధకమును అగు శబ్దము శక్తిచేతనే వాహీకార్యర్థమున ప్రయోగింపబడును.

వి. నాగలి, కత్తి, రోకలి మొదలగువాటికి వేరువేరు ఆకారములును, ఆయా పనులను చేయు శక్తులును ఉన్నవి. కావున కర్షణచ్ఛేదనాది కర్మలనుచేయుటకు ఇవి సాధనములని తప్పక తెలియును. ఈ నాగలి మొదలగువాటికి లతలను ఛేదించుట మొదలగు కర్మలు చేయు శక్తి లేదు. వాటి రూపములను చూడగనే ఇవి ఈ పనిచేయుశక్తిగల సాధనములు అని తప్పక తెలియును. ఈ విధముగనే రూపశక్తులతో స్వభావసిద్ధముగనే కూడియున్న (గవాది) శబ్దము నియతముగ (సాస్నాది మత్పిండరూపమగు) ఒక అర్థమునే బోధించును. కేవలశక్తిని పురస్కరించుకొని గోభిన్నార్థవిషయమున గూడ ప్రయోగింపబడును.

నాగలికి ఒక ఆకారము (రూపము), ఒక పనిని చేయు శక్తియు కలవు. కావున ఆ రూపశక్తులను రెండింటిని పురస్కరించుకొని 'సీర' శబ్దమును ప్రయోగించినపుడు ఆ శబ్దము నాగలి అను నర్థమునే బోధించును. అదియే దాని ముఖ్యార్థము. నాగలి దున్నుట అను క్రియావిశేషమునుమాత్రమే చేయకలుగును అనునది దాని రూపమునుబట్టి మాత్రమే తెలియును. ఈ అసాధారణరూపమునకు ప్రాధాన్య మీయక కేవలక్రియాశక్తిని మాత్రమే పురస్కరించుకొని ప్రయోగించినపుడు 'సీర' శబ్దము నాగలికంటె భిన్నమగు (నాగలి భూమిని చీల్చినట్లు శత్రుసేనలను చీల్చిన యోధుడు మొదలగు) అర్థమును చెప్పవచ్చును. అది గౌణార్థము. ఇట్లే సాస్నాదిమద్రూపమును భారవహనాదిశక్తిని ఈ రెండింటిని పుర పురస్కరించుకొని ప్రయుక్తమగునపుడు గోశబ్దము గోరూపమగు ముఖ్యార్థమును బోధించును. గోవునకు కేవలము కర్షణశక్తియే కాక తద్భిన్నములగు భారవహనాదిశక్తులుకూడ ఎన్నియో ఉండవచ్చును. వాటిలో నేదైన ఒకదానిని పురస్కరించుకొని గోశబ్దమును ఇతరార్థములయందు ప్రయోగింపవచ్చును. ఆ విధముగ కేవల భారవహనాదిక్రియానుకూలశక్తిని పురస్కరించుకొని ప్రయుక్తమగునపుడు వాహీకాది గౌణార్థమును బోధించును. ఇట్లు రూపము,

శక్తి అనెడు నిమిత్తద్వయమును బట్టి ఒకపదమును ప్రయోగించునపుడు అది బోధించు అర్థము ముఖ్యార్థము. కేవలశక్తిరూపనిమిత్తమును బట్టి ప్రయోగించునపుడు అది బోధించు అర్థము గౌణార్థము.

గోశబ్దమునకు అనేకశక్తులుండవచ్చును గాన వాహీకార్థమునందు గూడ దానిని ప్రయోగించవచ్చునని అన్నచో గోశబ్దమున గౌణముఖ్య విభాగమెట్లు అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

> శ్రుతిమాత్రేణ యత్రాస్య యాదర్థ్య మవసీయతే
> ముఖ్యం తమర్థం మన్యన్తే గౌణం యత్రోపపాదితమ్ . 278

యత్ర = ఎచట, అస్య = ఈ శబ్దముయొక్క, శ్రుతిమాత్రేణ = శ్రవణమాత్రముచేతనే, యాదర్థ్యమ్ = ఏ అర్థమును బోధించుసామర్థ్యము, అవసీయతే = నిశ్చయింపబడుచున్నదో, తమ్=అ, అర్థమ్ = అర్థమును, ముఖ్యమ్ = ముఖ్యార్థమునుగాను, యత్ర = ఎచట, ఉపపాదితమ్ = అర్థప్రకరణాదులచే అర్థమును బోధించుశక్తి సమర్థింపబడినదో దానిని, గౌణమ్ = గౌణమునుగాను, మన్యన్తే = తలచుచున్నారు.

తా. పదమును వినినంతనే ఇది ఈ యర్థమున ప్రయుక్తమైనది అని ఏది నిశ్చయింపబడునో అది ముఖ్యార్థమనియు, ఏ యర్థమును ప్రకరణాదులచే సమర్థింపవలసి యుండునో అది గౌణమనియు చెప్పుదురు.

ఈవిధముగ అధ్యారోపరూపమగు శబ్దోపచారము గాని అర్థోపచారముగాని ఎచట నుండునో అది గౌణమనియు, అది లేనిచో ముఖ్యమనియు ప్రతిపాదించి కొన్ని లక్ష్యములలో దీనిని సమన్వయించుటకై చెప్పుచున్నాడు.

> గోయుష్మన్మహతాం చ్వ్యర్థే స్వార్థా దర్థాన్తరే స్థితౌ
> అర్థాన్తరస్య తద్భావ స్తత్ర ముఖ్యోఽపి దృశ్యతే . 279

గో-యుష్మ-న్మహతామ్=చ్విప్రత్యయాంతములగు గో-యుష్మద్-మహచ్ఛబ్దములకు, చ్వ్యర్థే=అభూతతద్భావరూపచ్విప్రత్యయార్థమున, స్వార్థాత్ = స్వార్థముకంటె, అర్థాన్తరే = మరియొకఅర్థమగు వాహీకాదియందు, స్థితౌ సత్యామ్ = ప్రవృత్తియుండగా, తత్ర= అచట, అర్థాంతరస్య=అర్థాంతరమునకు (వాహీకాదికమునకు), తద్భావః = గవాదిరూపతాప్రాప్తి, ముఖ్యోఽపి = ముఖ్యమైనదిగా కూడ, దృశ్యతే=కనబడుచున్నది.

తా. గోయుష్మన్మహచ్ఛబ్దములకు, చ్విప్రత్యయార్థమున, స్వార్థముకంటె భిన్నమగు మరియొకఅర్థమున ప్రవృత్తి కలిగినపుడు, అర్థాంతరము గవాదిరూపమును పొందుట ముఖ్యమైనదిగా కూడ కానవచ్చుచున్నది.

'ఆ విధముగ లేనిది ఆ విధముగ అగుట' అనునర్థమునందు 'కృ' 'భూ' 'అస్' ధాతువులతో సంబంధమున్నపుడు— 'కృభ్వస్తియోగే సమ్పద్యకర్తరి చ్విః' (5-4-50) 'అభూత తద్భావ ఇతి వక్తవ్యమ్' అను సూత్రవార్తికములచే చ్విప్రత్యయము వచ్చును. 'అకృష్ణం కృష్ణం సమ్పద్యమానం కరోతి'— (కృష్ణుడు కానివానిని వేషాదులచే కృష్ణునిగా తయారుచేయుచున్నాడు) అను నర్థమున చ్విప్రత్యయము వచ్చి ఏర్పడిన 'కృష్ణీకరోతి' ఇత్యాదులుదాహరణము. ఈ విధముగా చ్విప్రత్యయము చేర్చగా సిద్ధించిన— 'అగౌః

గౌః సమపద్యత ఇతి 'గోఽభవత్' (గోవుకానివాడు గోవుగా అయినాడు), 'అత్వం త్వం సమ్పద్యతే త్వద్భవతి' (నీవు కానివాడు నీవుగా అయినాడు) ఇత్యాదులందు వాహీకుని వాహీకత్వము పూర్వావస్థలో నున్నట్లును గోరూపత్వము ఉత్తరావస్థలో వచ్చినట్లును, అట్లే 'నీవు' కానివానియందు నీవు కానివాడుగా నుండుట పూర్వావస్థలో నున్నట్లును, ఉత్తరావస్థ యందు నీవగుట వచ్చినట్లును చెప్పబడుచున్నది. ఇట్లు ఉత్తరావస్థయందు గోరూపత్వము, యుష్మద్రూపత్వము, (లేనివి) ఆరోపించబడుచున్నవిగాన ఇచట గౌణార్థత్వము. 'అమహాన్ మహాన్ భూతః మహద్భూతః పూర్ణిమాయాం చంద్రః' 'అశుక్లః శుక్లః సంపద్యతే శుక్లీభవతి పటః' ఇత్యాదులలో పూర్వము పెద్దగా లేని చంద్రుడు ఇపుడు పెద్దగానగుట, పూర్వము తెల్లగాలేని వస్త్రము తెల్లబడుట అనునవి అరోపితములు కాక యథార్థములే గాన ఇచట మహచ్ఛుక్ల శబ్దముల యర్థము ముఖ్యమేకాని గౌణముకాదు. ఈ విధముగ చ్విప్రత్యయము చేర్చినపుడు కొన్ని యెడల గౌణార్థత్వము, కొన్ని యెడల ముఖ్యార్థత్వము కానవచ్చు చున్నదని యభిప్రాయము, 'గోఽ భవత్' 'త్వద్భవతి' అను ఉదాహరణములలో గోశబ్ద (త్వమ్) యుష్మచ్ఛబ్దములు గౌణములుగాన "గౌణముఖ్యయో ర్ముఖ్యే కార్యసంప్రత్యయః" (గౌణపదము, ముఖ్యపదము రెండును ఉన్నపుడు కార్యము ముఖ్యపదము విషయముననే ప్రవర్తించును) అను భాష్యకారోక్త నియమము ననుసరించి 'గోఽ భవత్' లోని 'గో' అనునది ఓకారాంతనిపాతమే యైనను 'ఓత్' అను సూత్రముచే ప్రగృహ్యసంజ్ఞయు, తత్ప్రయుక్త ప్రకృతిభావమును (సంధి లేకపోవుట) రాలేదు. 'త్వద్భవతి' అనునపుడు యుష్మచ్ఛబ్దమున్నను భూధాతువునకు మధ్యమ పురుషమురాలేదు. ('త్వద్భవసి' కాలేదు).

పైనచూపిన విధముగ 'గోఽభవత్' 'త్వద్భవతి' అనునపుడు గౌణార్థత్వమున్నది గాన ఇష్టరూపములు సిద్ధించినవి. కాని 'మహద్భూతశ్చన్ద్రమాః' అనునపుడు చంద్రుడు పూర్ణిమనాడు యథార్థముగనే పెద్దగా అయినాడు గాన గౌణత్వము లేదు, మహచ్ఛబ్దము ముఖ్యమే. అందుచే నిచట గౌణముఖ్యన్యాయము ప్రవర్తించదుగాన 'అన్మహతః సమానాధి కరణ జాతీయయోః' అను సూత్రముచే మహచ్ఛబ్దమునకు ఆత్వము రావలయును కదా యని ఆశంకించుకొని ఇచటగూడ గౌణార్థత్వమున్నదని నిరూపించుచున్నాడు.

మహత్త్వం శుక్లభావంచ ప్రకృతిః ప్రతిపద్యతే
భేదేనాపేక్షితా సాతు గౌణత్వస్య ప్రయోజికా. 280

ప్రకృతిః = ప్రకృతి, మహత్త్వమ్ = మహత్త్వమును, శుక్లభావంచ = శుక్లత్వ మును, ప్రతిపద్యతే = పొందుచున్నది, భేదేన = భేదముచేత, అపేక్షితా = అపేక్షింపబడిన, సా = ఆప్రకృతి, గౌణత్వస్య = గౌణత్వమునకు, ప్రయోజికా = కారణభూతమైనది.

తా. ప్రకృతి మహత్త్వమును శుక్లత్వమును పొందుచున్నది. భేదముచే అపే క్షింపబడిన ఆ ప్రకృతి గౌణత్వమునకు కారణభూతమైనది.

వి. చ్విప్రత్యయస్థలమునందు ఒక వస్తువు మరియొక వస్తువుగా మారుచున్నది గాన దాని పూర్వావస్థ ప్రకృతి, ఉత్తరావస్థ వికృతి లేక వికారము. 'కృష్ణీభవతి' అను నుదాహరణమున కృష్ణుడు కాని నటుని స్వరూపము ప్రకృతి; కృష్ణత్వము వికృతి. 'మహద్భవతి చన్ద్రమాః' 'శుక్లీభవతి పటః' ఇత్యాదులలో మహద్రూపము వికృతి, అమహ ద్రూపము ప్రకృతి; శుక్లత్వము వికృతి, అశుక్లత్వము ప్రకృతి; వాస్తవమున అమహద్రూపా

శుక్లరూపములలో నున్న ప్రకృతులకును, మహద్రూప శుక్లరూప వికృతులకును భేదము లేదు. ఆ చంద్రుడు, ఈ చంద్రుడును, ఆ వస్త్రమును, ఈ వస్త్రమును ఒక్కటియే కదా ? ఐనను అవి వివక్షా వశముచే భేదమును అపేక్షించుటచే విశేష్యమగు పూర్వరూపావస్థకు ప్రాధాన్యమును, విశేషణమగు (ఆ పూర్వావస్థగల దానికి వచ్చిన) ఉత్తరావస్థకు అప్రాధాన్యమును కల్పించి, పూర్వావస్థయందు మహత్త్వ శుక్లత్వాదుల నారోపించుటచే మహత్త్వము గౌణమైనది. కావున 'గౌణముఖ్య' న్యాయము ననుసరించి ఆత్వము రాలేదు.

'అగ్ని' 'సోమ' మొదలగు శబ్దములు (1) దేవతావాచకములు, (2) తేజస్విత్వాహ్లాదకత్వాది గౌణసాదృశ్యము నాధారముగ గొని శబ్దస్వరూపము నారోపించుటచే మాణవకుల విషయమున ప్రయోగింపబడునవి, (3) పిత్రాదులు సంకేతముచేసి శబ్దస్వరూపము నారోపించుటచే బాలాదులకు సంజ్ఞగా ప్రయుక్తమగునవి అని మూడు విధములుగ నుండవచ్చును. ఇందు సాదృశ్యనిమిత్తకములు గౌణములు. కాని మిగిలిన రెండు విధములకును చెందినవి ముఖ్యములు. కావున 'అగ్నిసోమౌ మాణవకౌ' (అగ్నిసోముడు అను బాలురు) అనుచోట సంజ్ఞావాచకములగు ఈ 'అగ్నిసోమ' శబ్దములు ముఖ్యములే గాన 'అగ్నేఃస్తుత్ స్తోమసోమాః' అను సూత్రముచే షత్వము రావలెనుకదా యని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

అగ్నిసోమాదయః శబ్దా యే స్వరూపనిబన్ధనాః
సంజ్ఞిభిః సంప్రయుజ్యన్తేఽప్రసిద్ధే స్తేషు గౌణతా. 281

స్వరూపనిబన్ధనాః=పిత్రాది సంకేతముచే ఆరోపితమగు శబ్దస్వరూపమే ప్రవృత్తి నిమిత్తముగా గల (అనగా అగ్ని శబ్దమును మాణవక రూపార్థమున ప్రయోగించుటకు అది 'అగ్ని' శబ్దమగుట ఒక్కటియే కారణము కాని కారణాంతరము లేదని యర్థము), అగ్నిసోమాదయః='అగ్ని' 'సోమ' మొదలగు, యే = ఏ, శబ్దాః = సంజ్ఞాశబ్దములు, సంజ్ఞిభిః= సంజ్ఞులగు మాణవకాదులతో, సంప్రయుజ్యన్తే = సంబంధించుచున్నవో, తేషు = ఆ శబ్దముల యందు, అప్రసిద్ధేః = ప్రసిద్ధి లేకపోవుటవలన, గౌణతా = గౌణత్వము.

తా. స్వరూపమే ప్రవృత్తి నిమిత్తముగా గల ఏ అగ్ని సోమాది శబ్దములు సంజ్ఞులతో సంబంధించుచున్నవో వాటియందు ప్రసిద్ధి లేకుండటచే గౌణత్వమే.

వి. అగ్నిసోమాది శబ్దములు పిత్రాది సంకేతముచే మాణవకాదుల సంజ్ఞగా నుపయుక్తములైనను, ఇవి దేవతారూపార్థమున ప్రసిద్ధములైనట్లు మాణవకాద్యర్థమున కావు. కావున సాదృశ్యమూలకశబ్దములవలె అప్రసిద్ధార్థకములు గూడ గౌణములుగ పరిగణింపబడుటచే గౌణముఖ్యన్యాయానుసారముగా షత్వము రాదు. అనగా గౌణముఖ్యన్యాయమునందలి గౌణత్వము అప్రసిద్ధి మూలకము కావచ్చును లేదా సాదృశ్యమూలకము కావచ్చునని యభిప్రాయము.

'అగ్ని' 'సోమాది' శబ్దములను ఆరోపాది నిమిత్తముచే మాణవకాదివిషయమున ప్రయోగించునపుడు అవి గౌణార్థములను విషయము స్పష్టమే యని చెప్పుచున్నాడు.

అగ్నిదత్తస్తు యోఽగ్నిః స్యాత్ తత్ర స్వార్థోపసర్జనః
శబ్దో దత్తార్థవృత్తిత్వాత్ గౌణత్వం ప్రతిపద్యతే. 282

తు = కాని, అగ్నిద త్తః = అగ్నిద త్తరూపమగు, యః = ఏ అర్థము, అగ్నిః = అగ్నిపదవాచ్యమై, స్యాత్ = అగునో, తత్ర = అచట, స్వార్థోపసర్జనః = దేవతారూపమగు స్వార్థము అప్రధానముగా (విశేషణముగా) గల, శబ్దః=అగ్ని శబ్దము, దత్తార్థవృత్తిత్వాత్= అగ్నిదత్తుడు అనునర్థము బోధించుట వలన, గౌణత్వం=గౌణత్వమును, ప్రతిపద్యతే= పొందును.

తా. 'అగ్నిదత్త' రూపమగు అర్థము అగ్ని శబ్ద వాచ్యమగునపుడు, అచట స్వార్థోపసర్జనమగు 'అగ్ని' శబ్దము దత్తార్థబోధకమగుటచే గౌణత్వమును పొందును.

వి. అగ్ని ప్రసాదలబ్ధుడగు బాలునియందు అగ్నిత్వమునారోపించి వానిని అగ్ని యని పిలచునపుడు అగ్నిశబ్దము, స్వముఖ్యార్థమగు దేవత అప్రధానము కాగా, ఇచట 'అగ్నిదత్తుడు' అనునర్థమును బోధించుచున్నది గాన ఇది గౌణమని భావము.

'హరిశ్చన్ద్రః మాణవకః' అనునపుడు సుడాగమమును సమర్థించుటకై ప్రస్తావించు చున్నాడు.

నిమిత్తభేదాత్ ప్రక్రాన్తే శబ్దవ్యుత్పత్తికర్మణి
హరిశ్చన్ద్రాదిషు సుటో భావాభావౌ వ్యవస్థితౌ. 283

ప్రకాన్తే = పాణినిచే ఉపక్రమింపబడిన, శబ్దవ్యుత్పత్తికర్మణి = శబ్దముల వ్యుత్పత్తి నిరూపణమునందు, హరిశ్చన్ద్రాదిషు = హరిశ్చంద్రాది పదములయందు, నిమిత్త భేదాత్ = నిమిత్తభేదమువలన, సుటః = సుట్టుయొక్క, భావాభావౌ = భావాభావములు, వ్యవస్థితౌ = నియతముగనున్నవి.

తా. పాణిన్యుపక్రాంతమగు శబ్దవ్యుత్పత్తి నిరూపణమునందు, హరిశ్చంద్రాది పదములందు, నిమిత్తభేదమువలన సుట్టుయొక్క భావాభావములు వ్యవస్థితములైనవి.

వి. పాణిని తన వ్యాకరణమున 'ప్రస్కణ్వ హరిశ్చన్ద్రా వృషీ' (6-1-153) అను సూత్రముచే ఋషివాచకమగునపుడు 'హరిశ్చన్ద్ర' శబ్దమునకు సుడాగమము వచ్చునని ('హరిచన్ద్ర' శబ్దమునకు సుడాగమము వచ్చి 'హరిశ్చన్ద్ర' అని యగునని) చెప్పియున్నాడు. ఈ విధముగ సుడాగమము వచ్చుట రాకపోవుట అనునవి 'హరిశ్చన్ద్ర' శబ్దము ఋషివాచక మగుట కాకపోవుట అను నిమిత్తభేదముపై ఆధారపడి యున్నవి - అనగా ఋషివాచకమగు నపుడు సుడాగమము వచ్చి 'హరిశ్చన్ద్రః'అను రూపమును, ఋషివాచకము కాక 'హరిద్వర్ణ మగు చంద్రుడు కలది' ఇత్యాద్యర్థములయందు 'హరిచన్ద్రః' అను రూపము అగునని భావము.

ఇట్లుండగా—ఒక పిల్లవానియందు ఋషియగు హరిశ్చంద్రుని యందలి గుణము లుండుటచే వానిని చూచి 'సాక్షాత్ హరిశ్చన్ద్రోఽయం మాణవకః' అని పల్కుట కలదు. కాని ఇచట 'హరిశ్చన్ద్ర' శబ్దము గౌణమగుటచే దీనికి సుడాగమము రావచ్చునా రాకూడదా అను సంశయమున రావచ్చుననుటకు ఉపపత్తి చెప్పుచున్నాడు.

ఋష్యాదౌ ప్రాప్తసంస్కారో యః శబ్దోఽన్యేన యుజ్యతే
తత్రాన్తరఙ్గః సంస్కారో బాహ్యేఽర్థే న నివర్తతే. 284

ఋష్యాదౌ = ఋష్యాద్యర్థమునందు, ప్రాప్తసంస్కారః = పొందబడిన సుడాదే శాది సంస్కారముగల, యః=ఏ, శబ్దః = శబ్దము, అన్యేన = మరియొక మాణవకాద్యర్థ

ముతో, యుజ్యతే = సంబంధించుచున్నదో, తత్ర=ఆ శబ్దమునందు, అన్తరఙ్గః = పదాన్తరని రపేక్షమగుటచే అంతరంగమగు, సంస్కారః = సుడాదిరూపవ్యాకరణ కార్యము, బాహ్యే= బాహ్యమగు, అర్థే = మాణవకరూపమగు అర్థము బోధ్యమగునపుడు, న నివర్తతే = నివర్తించదు.

తా. ఋష్యాద్యర్థమున సుడాగమరూప సంస్కారమును పొందిన ఏ శబ్దము మరియొక మాణవకాద్యర్థముతో సంబంధించుచున్నదో, ఆ శబ్దమునందు, అంతరంగమగు సంస్కారము బాహ్యమగు అర్థము బోధ్యమగునపుడు నివర్తించదు.

వి. వ్యాకరణశాస్త్రానుసారముగా 'హరిశ్చంద్ర' శబ్దమునకు ఋషియను అర్థమునందు మాత్రమే సుడాగమమువచ్చినది. ఈ విధముగ వ్యాకరణసంస్కృతమగు 'హరిశ్చన్ద్ర' శబ్దమును సాదృశ్యమూలారోపముచే మాణవకుని విషయమున ప్రయోగించి వాక్యార్థబోధసమయమున దాని యర్థమునకు అర్థాంతరముతో సంబంధము కల్పించినపుడు, అంతకుపూర్వము ప్రవర్తించిన, బాహ్యపదానపేక్షమగుటచే అంతరంగమగు, సుడ్రూప కార్యము నివర్తించదని యభిప్రాయము. ఒకమారు వచ్చిన వ్యాకరణకార్యము ఎప్పుడును నివర్తించదని వైయాకరణసిద్ధాంతము.

ఏశబ్దమును విన్నంతనే ఏ యర్థము బుద్ధిగోచరమగునో ఆ యర్థము ఆ శబ్దమునకు ముఖ్యార్థమే కాన శబ్దములలో గౌణముఖ్య విభాగమనునది లేదని ఆశంకించుచున్నాడు.

అత్యన్తవిపరీతోఽపి యదా యోఽర్థోఽవధార్యతే
యథాసంప్రత్యయం శబ్ద స్తత్ర ముఖ్యః ప్రవర్తతే . 285

యదా = ఎప్పుడు, అత్యన్తవిపరీతోఽపి = ముఖ్యార్థమని ప్రసిద్ధమగు అర్థము కంటె మిక్కిలి విపరీతమైనను, యః = ఏ, అర్థః = అర్థము, అవధార్యతే = ఏ శబ్దమును విన్నంతనే బుద్ధిగోచర మగుచున్నదో, తత్ర = ఆ అర్థము విషయమున, శబ్దః = శబ్దము యథాసంప్రత్యయం = అర్థజ్ఞానానుసారముగ, ముఖ్యః = ముఖ్యముగనే, ప్రవర్తతే= ప్రవర్తించును.

తా. అత్యంతవిపరీతమైనను ఏ యర్థము బుద్ధిగోచరమగుచున్నదో ఆ యర్థము విషయమున, ఆ శబ్దము అర్థజ్ఞానానుసారముగ ముఖ్యముగనే ప్రవర్తించును.

వి. శబ్దమును వినగనే బుద్ధిగోచరమగు అర్థమంతయు ముఖ్యార్థమే. ముఖ్యార్థ మని ప్రసిద్ధమగు అర్థముకంటె అది విపరీతముగ నున్నను శబ్దశ్రవణముచే బుద్ధిగోచరమగు చున్నదిగాన దానినికూడ ముఖ్యార్థముగనే పరిగణింపవలెను. ఈ విధముగ ఒక శబ్దము ఏ యే అర్థములను బోధించునో ఆయా అర్థము లన్నియు దాని ముఖ్యార్థములే గాన గౌణ ముఖ్యవిభాగము లేదు అని భావము.

బుద్ధిగోచరమైన దంతయు శబ్దార్థమే అను నీమతమునందు గూడ గౌణముఖ్య విభాగము సంభావ్యమే యని ప్రతిపాదించుటకై ముందుగ సత్యాసత్యవిభాగమును చేయు చున్నాడు.

యద్యపి ప్రత్యయాధీన మర్థతత్త్వావధారణమ్
న సర్వః ప్రత్యయ స్తస్మి న్నసిద్ధ ఇవ జాయతే . 286

అర్థతత్త్వావధారణమ్ = ఒకపదార్థము సత్యమని ఊహించుట (నిర్ణయించుట), ప్రత్యయాధీనం యద్యపి = ప్రత్యయ (జ్ఞాన) రూప లింగముపై ఆధారపడినదే యైనను, సర్వః = సమస్తమైన, ప్రత్యయః = జ్ఞానము (యథార్థమైనను, అయథార్థమైనను), అసిద్ధే ఇవ = అసిద్ధమైన (లేని), తస్మిన్ = సత్యమైనను అసత్యమైనను ఆ పదార్థము విషయమున, న జాయతే = పుట్టదు.

తా. అర్థతత్త్వనిర్ణయము జ్ఞానాధీనమే యైనను, అసిద్ధమగు ఆ పదార్థము విషయమున ఏ జ్ఞానమును పుట్టదు.

వి. ఒకపదార్థము సత్యమని ఊహించుటకు జ్ఞాన మనెడు లింగము ఆవశ్యకము. అనగా ఇచటనున్న పదార్థము ఘటమే యని నిర్ణయించుటకు ఘటజ్ఞాన ముండవలెను. ఘటజ్ఞానము లేకున్నచో నిఇచట నున్న ఘటము సత్యమని చెప్పజాలము. అయినను పదార్థమున్నపుడే సత్యజ్ఞానము కలుగు ననియు (అనగా సత్యజ్ఞానోత్పత్తినిపట్టి ఆ పదార్థము సత్యముగ నచటనున్నదని చెప్పవచ్చుననియు) పదార్థము లేనపుడు అసత్యజ్ఞానము పుట్టుననియు (అనగా అసత్యజ్ఞానోత్పత్తిని బట్టి ఆ పదార్థమచటలేదని చెప్పవచ్చుననియు) అంగీకరించుటకు వీలులేదు. జలము యథార్థముగనున్నను లేకున్నను జలప్రత్యయము కలుగుచునే యున్నది. కావున కేవలము జ్ఞానమునుబట్టి పదార్థముల సత్యత్వాసత్యత్వములను నిర్ణయింపజాలమని యర్థము.

సత్యమగు జలమును చూచినపుడును, ఎండమావులను చూచినపుడును గూడ జలప్రత్యయము కలుగుచున్నది. అయినను మృగతృష్ణిక జలము కాదు. అందుచే జ్ఞానమును బట్టి అర్థతత్త్వమును నిర్ణయింపజాలము గాన ప్రత్యయరూపహేతువు (జలజ్ఞానము కలిగినది గాన జలము సత్యము అను అనుమానమానములోని జ్ఞానరూపహేతువు) మృగతృష్ణాజన్య జలజ్ఞానమున వ్యభిచరితమని చెప్పుచున్నాడు.

దర్శనం సలిలే తుల్యం మృగతృష్ణాది దర్శనైః
తుల్యత్వే దర్శనాదీనాం న జలం మృగతృష్ణికా. 287

సలిలే = యథార్థమైన జలము విషయమున, దర్శనమ్ = జలజ్ఞానము, మృగతృష్ణాది దర్శనైః = మృగతృష్ణాదులవలన కలిగిన జలజ్ఞానములతో, తుల్యమ్ = తుల్యమైనదే. దర్శనాదీనామ్ = మృగతృష్ణికాది దర్శనములు, తుల్యత్వేఽపి = తుల్యములే యైనను, మృగతృష్ణికా = ఎండమావులు, జలం న = నీరు కాజాలదు.

తా. యథార్థజలజ్ఞానము మృగతృష్ణాజలజ్ఞానముతో తుల్యమైనదే. దర్శనాదులు తుల్యములే యైనను మృగతృష్ణ జలము కాజాలదు.

వి. కావున జ్ఞానమును పట్టి వస్తువు సత్యమని కాని, అసత్యమని కాని నిర్ణయింపజాలమని భావము.

ఆయా వస్తువులచే సాధ్యములగు అసాధారణ కార్యముల జ్ఞానముచే వస్తువుయొక్క సత్యత్వాసత్యత్వములను నిర్ణయింపవచ్చునని చెప్పుచున్నాడు.

య దసాధారణం కార్యం ప్రసిద్ధం రజ్జుసర్పయోః
తేన భేదః పరిచ్ఛేద్య స్తయో స్తుల్యేఽపి దర్శనే. 288

రజ్జుసర్పయోః = రజ్జుసర్పములయొక్క, ప్రసిద్ధమ్ = ప్రసిద్ధమైన, యత్ = ఏ, అసాధారణమ్ = అసాధారణమైన, కార్యమ్ = కార్యముగలదో, తేన = ఆ కార్యముచేత, దర్శనే = జ్ఞానము, తుల్యేఽపి = సమానమేయైనను, తయోః = ఆ రజ్జుసర్పములయొక్క భేదః = భేదము, పరిచ్ఛేద్యః = నిర్ణయింపదగినది.

తా. జ్ఞానము తుల్యమేయైనను, రజ్జుసర్పములకు గల అసాధారణకార్యములను బట్టి వాటి భేదమును నిర్ణయింపవలెను.

వి. రజ్జువును చూచినపుడు సర్పమనుజ్ఞానము కలుగుచున్నది. సర్పమును చూచినపుడు సర్పమనుజ్ఞానము కలుగుచున్నది. వీటిలో మొదటిది భ్రాంతి; రెండవది యథార్థజ్ఞానము, జ్ఞానమాత్రమును బట్టి ఇది భ్రమయా, ప్రమయా యను విషయమును తెలిసికొనజాలము. రజ్జుసర్పములు చేయగల్గు అసాధారణకార్యములు కొన్నిగలవు. రజ్జువు బంధనరూపకార్యము చేయును. సర్పము దశనరూపకార్యము చేయును, కావున ఈ అసాధారణకార్యజ్ఞానము కలిగినచో దానిని బట్టి సర్పము సత్యమా మిథ్యయా యని నిర్ణయింపవచ్చును. కావున స్వరూపప్రత్యయము వ్యభిచరితమైనను అసాధారణకార్య ప్రత్యయము వస్తుసత్యత్వాసత్యత్వనిర్ణయమున వ్యభిచరితము కాదని యభిప్రాయము.

అసాధారణ కార్యజ్ఞానము లేనిచో విషయము అసత్యమనియు, దీనినిబట్టి ఆ విషయ జ్ఞానము అసత్యమనియు, ప్రతిపాదించి, ఇపుడు ఇంద్రియవిషయములలో దేనియందైన దోష మున్నచో తజ్జన్యజ్ఞానము గూడ అసత్యమని చెప్పుచున్నాడు.

ప్రసిద్ధార్థవిపర్యాసనిమిత్తం యచ్చ దృశ్యతే
యస్తస్మా ల్లక్ష్యతే భేద స్తదసత్యం ప్రచక్షతే. 289

యచ్చ = ఏ, ప్రసిద్ధార్థవిపర్యాసనిమిత్తమ్ = ప్రసిద్ధమైన సత్యమగు అర్థము యొక్క వైపరీత్యమునకు (మిథ్యాజ్ఞానమునకు) కారణమైన ఇంద్రియాదిదోషము, దృశ్యతే = కనబడుచున్నదో, తస్మాత్ = ఆదోషమువలన, యః = ఏ, భేదః = ద్విచంద్రాదివిశేషము, లక్ష్యతే = కనబడునున్నదో, తత్ = ఆ విపర్యాసదర్శనమునకు విషయమైన వస్తువును, అసత్యం = అసత్యమైనదానినిగా, ప్రచక్షతే = చెప్పుచున్నారు.

తా. సత్యమగు అర్థము విపరీతముగ కనబడుటకు నిమిత్తములగు విషయేంద్రియాదిదోషములచే కనబడు ద్విచంద్రాదికము అసత్యమని చెప్పుచున్నారు.

వి. తెల్లగానున్నట్లు ప్రసిద్ధమగు శంఖాదికము నేత్రములయందలి కాచకామలాది దోషముచే పచ్చగా కనబడును. ముత్యపుచిప్ప చాకచక్యరూపమగు దోషముచేత వెండి వలె కనబడుచున్నది. ఈ విధముగ ప్రసిద్ధములగు వస్తువులు విపర్యస్తరూపమున కనబడుటకు కారణభూతమగు ఇంద్రియవిషయగతదోషములచే కలుగు జ్ఞానమున విషయమగునదియు, ఆ జ్ఞానమునుకూడ అసత్యములని చెప్పుదురు.

జ్ఞానవిషయము తన అసాధారణ కార్యమును చేయగలిగినచో ఆ జ్ఞానము సత్య మనియు, లేనిచో అసత్యమనియు మొదట చెప్పబడినది. పిమ్మట–జ్ఞానవిషయము సత్యమైనచో ఆ జ్ఞానము కూడ సత్యమనియు, కానిచో కాదనియు ప్రతిపాదింపఁబడినది. ఇపుడు—జ్ఞాన విషయమగు వస్తువునకు సంబంధించిన అసాధారణ ధర్మములను చూచినను, తత్ప్రియుక్తము

లగు కార్యములను గూడ చూచినచో ఆ జ్ఞానము సత్యమనియు, ఆ కార్యములను చూడ కున్నచో అసత్యజ్ఞానమనియు చెప్పుచున్నాడు.

యచ్చ నిమ్నోన్నతం చిత్రే సరూపం పర్వతాదిభిః
న తత్ర ప్రతిఘాతాదికార్యం తద్వత్ ప్రవర్తతే. 290

చిత్రే=చిత్తరువునందు, పర్వతాదిభిః=పర్వతాదులతో, సరూపమ్ = సమానమైన, యచ్చ=ఏ, నిమ్నోన్నతం=ఎత్తుపల్లములు (చూడబడుచున్నవో), తత్ర = ఆ చిత్తరువు నందలి నిమ్నోన్నతమునందు, తద్వత్ = యథార్థ పర్వతమునందలి నిమ్నోన్నతములందు వలె, ప్రతిఘాతాది = దెబ్బతగులుట మొదలగు, కార్యమ్=కార్యము, న ప్రవర్తతే= ప్రవర్తించుటలేదు

తా. చిత్తరువునందు పర్వతాదులతో సమానరూపముగల నిమ్నోన్నతము కనబడుచున్నది. కాని అచట ప్రతిఘాతాదికార్యము దానియందు వలె కనబడుట లేదు.

వి. యథార్థములగు పర్వతాదుల అసాధారణ ధర్మములగు నిమ్నోన్నతములతో సమానములగు నిమ్నోన్నతములు చిత్తరువులోని పర్వతములందు కూడ కనబడుచున్నవి. కాని పర్వతాసాధారణ ధర్మములగు నిమ్నోన్నతముల కార్యమగు (వాటివలన కలుగు) దెబ్బ తగులుట మొదలగునది చిత్తరువునందలి నిమ్నోన్నతములలో లేదు. కావున చిత్రమునందలి నిమ్నోన్నతములును, వాటి జ్ఞానమును గూడ అయథార్థములు. ప్రతిఘాతాది కార్యముండుటచే యథార్థ పర్వతములయందలి నిమ్నోన్నతములును, వాటి జ్ఞానమును సత్యములు.

ఈ విషయమునే మరికొన్ని దృష్టాంతములతో విశదీకరించుచున్నాడు.

స్పర్శప్రబన్ధో హస్తేన యథా చక్రస్య సన్తతః
న తథాలాతచక్రస్య విచ్ఛిన్నం స్పృశ్యతే హి తత్. 291

వప్రప్రాకారతల్పేషు స్పర్శనావరణే యథా
నగరేషు న తే తద్వద్గన్ధర్వనగరేష్వపి. 292

చక్రస్య = యథార్థమైన రథాది చక్రముయొక్క, స్పర్శప్రబన్ధః = స్పర్శ ప్రబంధము, హస్తేన = హస్తముతో, యథా=ఎట్లు, సన్తతః = అవిచ్ఛిన్నముగా నుండునో, అలాతచక్రస్య = అలాతచక్రముయొక్క స్పర్శము, తథా = ఆ విధముగా, న = ఉండదు. తత్ = అలాతచక్రము, విచ్ఛిన్నం = ఆగి ఆగి, స్పృశ్యతే హి=స్పృశింపబడునుగదా ?

తా. సత్యమగు చక్రమునకు హస్తముతో స్పర్శము ఎట్లు అవిచ్ఛిన్నముగ నుండునో అట్లు అలాతచక్రమునకు ఉండదు. అది ఆగి ఆగి స్పృశింపబడును గదా ?

వి. అలాతమనగా కొరవి. కొరవిని పైకెత్తి వేగముగా త్రిప్పినచో అది చక్రము వలె కన్పడును. అది చక్రమువలె కన్పడినను రథచక్రమును అవిచ్ఛిన్నముగ దాని చుట్టును స్పృశింప గలిగినట్లు ఈ అలాతచక్రమును హస్తముతో స్పృశింపజాలము. అది తిరుగు చున్నపుడు ఏ ప్రక్కకు వచ్చునో ఆ ప్రక్క హస్తమును పెట్టినపుడు మాత్రమే అది స్పృశింపబడును. కావున అసాధారణమగు చక్రత్వము కనబడుచున్నను, తత్కార్యమగు అవిచ్ఛిన్నస్పర్శ లేదు గాన అలాతచక్ర, తద్జ్ఞానములు అసత్యములు.

నగరేషు = యథార్థనగరములయందు, వప్రప్రాకారతల్పైః = వప్రములచేతను, ప్రాకారములచేతను, తల్పములచేతను, స్పర్శనావరణే = స్పర్శనావరణములు, యథా = ఏ విధముగా చేయబడుచున్నవో, తద్వత్ = ఆ విధముగా, గన్ధర్వనగరేష్వపి = గంధర్వ నగరములయందు కూడ, తే = స్పర్శనావరణములు, న = లేవు.

తా. యథార్థనగరములందు వప్రప్రాకారతల్పములచే స్పర్శనావరణములు కలుగునట్లు గంధర్వనగరములందు కలుగవు.

వి. వప్రమనగా నగరమునకు వెలుపలనున్న రాళ్ళు రప్పలు మొదలగు వాటితోకూడిన ఉన్నతభూప్రదేశము. ఇది కృత్రిమము కావచ్చును, సహజముకావచ్చును. దానివెనుక నిర్మితమగు ఎత్తైన గోడ ప్రాకారము. తల్పమనగా నగరప్రాకారమునకు దగ్గరగ కట్టెడు రక్షక భటాద్యావాసమగు గృహవిశేషము. పూర్వము మొదట కృత్రిమము గాని సహజముగాని యగు ఒక వృక్షలతాగుల్మాది సంకులమగు ఎత్తైన ప్రదేశము, దాని వెనుక ఎత్తైన ప్రాకారము, దానివెనుక చుట్టును అట్టములను పేరుగల సైన్యావాసస్థానము లగు గృహవిశేషములు, వాటి వెనుక నగరము ఈ విధముగ నగరనిర్మాణ ముండెడిదని సూచితమగుచున్నది. గారడీవాడు మాయచే ఆకాశమున సృష్టించిన నగరమునకు గంధర్వ నగరమని పేరు. ఈ గంధర్వనగరమునందు గూడ సత్యనగరమందువలె వప్రప్రాకారాట్టము లున్నను, అవి స్పృశించుటకుగాని, దాగికొనుటకుగాని ఉపయోగింపవు. ఇట్లు నగరాసాధారణ ధర్మములగు వప్రాదులు కనబడుచున్నను వాటి కార్యములు కానవచ్చుటలేదు గాన ఆ నగరము, నగరజ్ఞానముగూడ మిథ్యాభూతములు.

ఇంతవరకును చేసిన సత్యాసత్యజ్ఞాననిర్ణయముచే, సత్యాసత్యవిభాగమునే గౌణ ముఖ్యవిభాగముగ భావింపరాదని తెలినది. భేదగ్రహణము లేని అనాహార్యారోపమునకు విషయమైనది సత్యము. భేదగ్రహణపూర్వకమగు ఆహార్యారోపమునకు విషయమగునది గౌణము. బుద్ధివిషయమైనదంతయు శబ్దార్థమే అను మతమునందు గూడ (కా.285) ఈ గౌణముఖ్యవిభాగమును అంగీకరింపవలసియుండును. జ్ఞానవిషయమైనవాని నెల్ల సత్య మని చెప్పుటకు ఎట్లు శక్యము కాదో అట్లే శబ్దప్రతిపాద్యమైన అన్ని అర్థములును ముఖ్యము లని చెప్పుటకు వీలులేదు కదా? కావున ప్రసిద్ధ్యప్రసిద్ధ్యాది నిమిత్తములను బట్టి గౌణముఖ్య విభాగమును అంగీకరింపవలసియే యుండును. ఈ విషయమును సూచించుటకే ఈ సత్యా సత్యవిభాగ మిచట చూపబడినది.

ఆహార్యమనగా బుద్ధిపూర్వకముగా తెచ్చిపెట్టుకొనినది. అనాహార్యమనగా బుద్ధి పూర్వకముగ కాక కారణాంతరములచే వచ్చినది. రజ్జువును చూచి సర్పమనుకొనునపుడు రజ్జువుపై సర్పత్వా రోపమున్నది. ఆరోపించుసమయమున ఇది వాస్తవమున రజ్జు వనియు, తాను సర్పత్వము నారోపించుచున్నాడనియు ఆ భ్రాంతునకు తెలియదు. ఈ యారోపము నకు అస్పష్టప్రకాశకించిచ్చలనాదులు కారణము. దీనికి అనాహార్యారోపమని పేరు. భ్రాంతికి ఇది కారణము. మాణవకునిజూచి 'అగ్నిరయం మాణవకః' అనునపుడు అగ్నిమాణవకులు వేరువేరని తెలిసినను కావలెనని మాణవకునియందు అగ్నిత్వము ఆరోపించబడుచున్నది. ఇది ఆహార్యారోపము. ఇది గౌణప్రయోగములకు మూలము.

'ఇవే ప్రతికృతౌ' (5.3.96) అను సూత్రముచే గౌణార్థ విశేషమున 'కన్' ప్రత్యయము విధింపబడినది. అట్టి 'కన్' ప్రత్యయము చేర్చుట కుపయుక్తమగు గౌణముఖ్య విభాగమును చెప్పుచున్నాడు.

మృగపశ్వాది భిర్యావాన్ ముఖ్యై రర్థః ప్రసాధ్యతే
తావాన్న మృన్మయేఽప్యస్తి తస్మాత్తే విషయః కనః . 293

ముఖ్యైః = ముఖ్యములైన, మృగపశ్వాదిభిః = మృగములు, పశువులు మొదలగు వాటిచే, యావాన్ = ఎంతటి, అర్థః = ప్రయోజనము, ప్రసాధ్యతే = సాధింపబడునో, మృన్మయే = మట్టితోనిర్మించిన మృగపశ్వాదికమునందు, తావాన్ = అంతప్రయోజనము, నాస్తి = లేదు, తస్మాత్ = ఆ కారణమువలన, తే = ఆ మృన్మయ మృగాదివాచకశబ్దములు, కనః = కన్ ప్రత్యయమునకు, విషయః = విషయము.

తా. ముఖ్యములగు మృగపశ్వాదులచే ఎట్టి ప్రయోజనము సాధింపబడునో అట్టిది మృన్మయమైనదానియందు లేదు. కావున అవి కన్ ప్రత్యయమునకు విషయము.

వి. సత్యమైన మృగాదులు చేయగలిగిన కార్యములను వాటి మట్టి బొమ్మలు చేయజాలవు. కావున బహుప్రయోజన సాధకములగు మృగములు ముఖ్యములు అల్ప ప్రయోజనసాధకములు గౌణములు. ఈ గౌణముఖ్యవిభాగమునే మనస్సులో నుంచుకొని గౌణార్థములగు మృగశబ్దాదులకంటె 'ఇవే ప్రతికృతౌ' (5.3.96) అను సూత్రముచే (ఇవార్థము—అనగా ఉపమానత్వము—గల ప్రాతిపదికముకంటె ప్రకృతి ఉపమేయమగునపుడు) 'కన్' ప్రత్యయమును విధించెను. 'హరిణకాన్ విక్రీణీతే' 'హస్తికాన్ విక్రీణీతే' (లేడిబొమ్మలను అమ్ముచున్నాడు; ఏనుగ బొమ్మలను అమ్ముచున్నాడు) ఇత్యాదులుదాహరణము.

గౌణములగు చరపదార్థములను ఉదాహరించి. ఇపుడు అచరపదార్థములను ఉదాహరించుచున్నాడు:— లేదా గౌణముఖ్యములకు ఆకారముచే గల సాదృశ్యమును చెప్పి ఇపుడు బింబ ప్రతిబింబభావముచే సాదృశ్యమును చెప్పుచున్నాడు.

మహాన్నాప్రియతే దేశః ప్రసిద్ధైః పర్వతాదిభిః
అల్పదేశాన్తరావస్థం ప్రతిబిమ్బంతు దృశ్యతే . 294

ప్రసిద్ధైః = ప్రసిద్ధములగు, పర్వతాదిభిః = బింబములగు పర్వతాదులచే, మహాన్ = విశాలమైన, దేశః = ప్రదేశము, ఆవ్రియతే = ఆవరింపబడును, ప్రతిబిమ్బంతు = వాటి ప్రతిబింబమైతే, అల్పదేశాన్తరావస్థం = స్వల్పమైన ప్రదేశమునందున్నదిగా, దృశ్యతే = చూడబడుచున్నది.

తా. ప్రసిద్ధములగు పర్వతాదులు విశాలదేశము నాక్రమించును. కాని వాటి ప్రతిబింబము అల్పప్రదేశమునందు కానవచ్చుచున్నది.

వి. ఈ విధముగ మహాదేశావరకత్వాల్పదేశావరకత్వరూప కార్యభేదముచే ప్రసిద్ధపర్వతము ముఖ్యము, ప్రతిబింబపర్వతము గౌణము. కావున 'పర్వతకాః సురస్రోతస్వినీ జలే' (గంగాజలమునందు పర్వతప్రతిబింబములు) అని ప్రయోగము. ఇచట పర్వతక శబ్దము ప్రతిబింబవాచకము.

చరాచరవస్తువులలో కన్ ప్రత్యయమున కుపయోగించు గౌణముఖ్య విభాగమును తెలిపి ఇపుడు స్వప్నాదులయందు అట్టి విభాగమును చూపుచున్నాడు.

మరణాదినిమిత్తంచ యథా ముఖ్యా విషాదయః
న తే స్వప్నాదిషు స్వస్య తద్వ దర్థస్య సాధకాః . 295

ముఖ్యాః = ముఖ్యమైన, విషాదయః = విషము మొదలగునవి, యథా = ఏ విధముగా, మరణాదినిమిత్తం = మరణాదులకు నిమిత్తమో, తద్వత్ = ఆ విధముగా, తే = ఆ విషాదులు, స్వప్నాదిషు = స్వప్నేంద్రజాలాదులందు, స్వస్య = తమయొక్క, అర్థస్య = మరణాది ప్రయోజనమునకు, సాధకాః = సాధకములు, న = కావు.

తా. ముఖ్యమైన విషాదులు ఎట్లు మరణాదులకు నిమిత్తమో ఆ విధముగ స్వప్నగతవిషాదులు స్వస్వకార్యములను సాధింపజాలవు. కావున అట్టి విషాదులు 'కన్' ప్రత్యయమునకు విషయము లని భావము.

ప్రకృతమగు గౌణముఖ్యవిభాగమును ఉపసంహరించుచున్నాడు.

దేశకాలేన్ద్రియగతై ర్భేదై ర్యద్దృశ్యతేఽన్యథా
యథాప్రసిద్ధి ర్లోకస్య తథా తదవసీయతే . 296

యత్ = ఏ వస్తువు, దేశకాలేన్ద్రియగతైః = దేశమునందు, కాలమునందు, ఇంద్రియమునందు ఉన్న, భేదైః = దోషములచేత, అన్యథా = మరియొకవిధముగా, దృశ్యతే = కనబడుచున్నదో, తత్ = ఆ వస్తువు, లోకస్య = లోకమునకు, యథా = ఎట్లు, ప్రసిద్ధిః = ప్రసిద్ధియో, తథా = ఆ విధముగా, అవసీయతే = నిర్ణయింపబడును.

తా. దేశకాలేంద్రియాది గత దోషములచే మరియొకవిధముగ కనబడుచున్నను వస్తువు, లోకప్రసిద్ధి ననుసరించి, ఆ విధముగనే నిర్ణయింపబడును.

వి. దగ్గరగా నుండుట అనెడు దేశదోషముచేత, జపాపుష్పమునకు దగ్గరగానున్న స్ఫటికము ఎఱ్ఱగా కనబడుచున్నది. దూరముగ నుండుట అనెడు దేశదోషముచేత, ఎత్తైన పర్వతముపై నున్న వృక్షములు దూర్వాగ్రములవలె కనబడుచున్నవి. గ్రీష్మమున కాల దోషముచేత ఆవిరితో కలిసి చలించుచున్న సూర్యరశ్మిలు దూరముననున్నవారికి జలజ్ఞానమును కలిగించుచున్నవి. నేత్రదోషముచేత ఒక చంద్రుడు చంద్రద్వయముగా కనబడుచున్నాడు. ఈ విధముగ దేశకాలేంద్రియగత దోషములచే ఒక వస్తువు మరియొక విధముగా కనబడుచున్నను లోక ప్రసిద్ధివశముచేత దాని యథార్థస్వరూపము నిర్ణయింపబడుచున్నది. అనగా దోషవశముచే కల్గిన జలాది ప్రత్యయమునకు బాధకమగు 'ఇది జలము కాదు' అను జ్ఞానము కలిగినను, లేదా అది జలకార్యమగు సేచనాదికమును చేయజాలకపోయినను, ఇది ఇంతే యని దృఢ ప్రత్యయము కలుగకపోయినను, ఇవి యెండమావులే యను యథార్థ స్వరూపము తెలియును.

బుద్ధిగోచరమైనదే శబ్దార్థమని గాని, బాహ్యపదార్థమే శబ్దార్థమని గాని, ఉభయమును శబ్దార్థమని గాని ఈమూడు మతములలో ఏమతము నంగీకరించినను, జ్ఞానాంతరముచే బాధితము కానిదియు, సకలవ్యవహార నిర్వహణ దక్షమును అగు జ్ఞానమునకు విషయమగునదియే సత్యమని గ్రహించవలెను, ఇతరము కాదు అని చెప్పుచున్నాడు.

యచ్చోపఘాతజం జ్ఞానం యచ్చ జ్ఞానమలౌకికమ్
న తాభ్యాం వ్యవహారోఽస్తి శబ్దాలోకనిబన్ధనాః . 297

యచ్చ = ఏ జ్ఞానము, ఉపఘాతజమ్ = ఇంద్రియదోషాదులవలన కలిగినదో, యచ్చ = ఏ, అలౌకికమ్ = అలౌకికమైన, జ్ఞానమ్ = ఆర్షజ్ఞానము కలదో, తాభ్యామ్ = ఆ జ్ఞానములచే, వ్యవహారః = లోకవ్యవహారము, నాస్తి=లేదు. శబ్దాః = శబ్దములు, లోక నిబన్ధనాః=లోక వ్యవహారకారణములు.

తా. దోషజన్యజ్ఞానము గాని, అలౌకికమగు యోగిజ్ఞానముగాని లోక వ్యవహార మునకు ఉపయోగించవు. శబ్దములు లోక వ్యవహారముపై ఆధారపడియుండును.

వి. ఇంద్రియ దోషాదులవలన కలిగిన భ్రాంతిజ్ఞానముచే గాని, తపఃసిద్ధులగు మహర్షుల లోకాతీతమగు జ్ఞానముచే గాని లౌకిక కార్య నిర్వాహము చేయ శక్యము కాదు. లోకములో శబ్దములను అర్థబోధకై ప్రయోగింతురు. కావున ఇవి లోకవ్యవహారమున కుప యుక్తములై యుండవలెను. ఇవి భ్రాంతిరూపజ్ఞానమును గాని, అలౌకికమగు (దృశ్యలోక విరుద్ధమగు) జ్ఞానమును గాని కల్పించినచో అట్టి శబ్దములతో లౌకిక వ్యవహారము కుదరదు. ఈ విధముగ లోకవ్యవహారమాత్రప్రయోజనములగు శబ్దములు బాధజ్ఞానము లేకుండుట చేతను, ప్రసిద్ధివశమునను ముఖ్యార్థమును బోధించుటలో ఏ మాత్రము అడ్డులేక (అస్ఖలద్గతిక ములై) ప్రవర్తించును. గౌణార్థమును బోధింపవలసివచ్చునపుడు అప్రసిద్ధి బాధాదులచే మందముగ (స్ఖలద్గతికములై) ప్రవర్తించును. శబ్దార్థము బౌద్ధము (బుద్ధి గోచరమైన దెల్ల శబ్దార్థమే) అని అంగీకరించు మార్గమునందు గూడ ఈ గౌణముఖ్య విభాగము అంగీకార్యమే యని భావము.

ఇంతవరకును గౌణముఖ్యన్యాయమునకు ఉపయుక్తమగు గౌణముఖ్య విభాగము, తత్ప్రసంగముచే సత్యాసత్య విభాగాదులును ప్రతిపాదింపబడినవి. ఇపుడు అర్థములలో ముఖ్యము—ద్యోత్యము, వివక్షితము—అవివక్షితము, గుణము—ప్రధానము, మొదలగు విభాగములను, పదార్థమునందలి ఒక భాగమునకే వివక్ష, సకల పదార్థమునకు వివక్ష, అన్వార్థోపలక్షణము మొదలగు విషయములను తెలుపుటకై ముందుగ శబ్దముల ముఖ్యార్థ నాన్తరీయకార్థ విచార మును దృష్టాంత నిరూపణ పూర్వకముగ చేయుచున్నాడు. జ్ఞాపకము, కారకము అను రెండు విధములగు దృష్టాంతములలో మొదట జ్ఞాపకదృష్టాంతమును చూపుచున్నాడు.

ఘటాదిషు యథా దీపో యేనార్థేన ప్రయుజ్యతే
తతోఽన్యదపి సాచివ్యాత్ స కరోతి ప్రకాశనమ్ . 298

దీపః = దీపము, ఘటాదిషు = ఘటము మొదలగు జ్ఞేయపదార్థములవిషయమున యేన = ఏ, అర్థేన = ప్రయోజనముచే, ప్రయుజ్యతే = ఉపయోగింపబడునో, తతః = ఆ ప్రయోజనముకంటె, అన్యత్ = భిన్నమైన, ప్రకాశనమపి = ప్రకాశనమునుకూడా, సాచి వ్యాత్ = నాన్తరీయకత్వమువలన, యథా = ఏవిధముగా, కరోతి = చేయునో—

తా. ఘటాదివిషయమున ఉపయుక్తమగు దీపము ఉద్దిష్టమగు ప్రయోజనము కంటె భిన్నమగు ప్రకాశమును గూడ, నాన్తరీయకత్వముచే, ఎట్లు చేయునో—1

వి. ఘటప్రత్యక్షజ్ఞానము కలుగుటకై దీపము సహాయముగ తీసికొనబడును. ఆ దీపము ఘటప్రత్యక్షమును కలిగించుటయే కాక, ఆ ప్రత్యక్షమునకు నాంతరీయకముగ, ఘటమునందు ప్రకాశమును కూడ కలుగచేయును.

'యేన వినా యదనుపపన్నం తత్తస్య నాన్తరీయకమ్' అని నాన్తరీయకత్వలక్షణము. ఒకపని జరుగవలెనన్న మరియొకపనికూడ జరిగితీరవలెను. అపుడు రెండవపని మొదటిదానికి నాన్తరీయకము; ఫలమును భక్షింపవలెనన్నచో దానిని ఛేదించుట తప్పక జరుగవలెను. ఛేదించకుండగా పలభక్షణము అసంభావ్యము గాన ఫలభక్షణమునకు ఫలచ్ఛేదనము నాంతరీయకము, అట్లే దీపసహాయముచే ఘట ప్రత్యక్షము కావలెనన్నచో అ దీపపు వెలుతురు ఘటముపై ప్రసరించుట (ఘటప్రకాశనము) నాంతరీయకము.

దృష్టాంతసిద్ధమగు అర్థమును దార్ష్టాంతికమునందు కూడ సమన్వయించుచున్నాడు.

సంసర్గిషు తథార్థేషు శబ్దో యేన ప్రయుజ్యతే
తస్మాత్ప్రయోజకా దన్యా నపి ప్రత్యాయయ త్యసౌ . 299

తథా = అవిధముగనే, శబ్దః = 'భావః' 'పాకః' 'లవః' ఇత్యాదిశబ్దము, సంసర్గిషు = తనతోసంబంధించిన సిద్ధత్వము, లింగము, సంఖ్య మొదలగు, అర్థేషు = అనేకార్థములలో, యేన = ఏ అర్థముచే (ఏ అర్థమును బోధించుటకై) ప్రయుజ్యతే = ప్రయోగింపబడునో, తస్మాత్ = ఆ, ప్రయోజకాత్ = ప్రయోగనిమిత్తమగు అర్థముకంటె, అన్యానపి = ఇతరములైన అర్థములనుకూడ, అసౌ = ఈ పదము, ప్రత్యాయయతి = బోధించుచున్నది.

తా. ఆ విధముగనే తనకుసంబంధించిన అర్థములలో ఏ అర్థమును బోధించుటకై ఒకశబ్దము ప్రయోగింపబడునో దానికంటె భిన్నములగు అర్థములనుగూడ బోధించును.

వి. 'భావః' 'లవః' 'పాకః' ఇత్యాది శబ్దములకు సిద్ధత్వము, సంఖ్య, లింగము, మొదలగు ఎన్నియో అర్థములతో సంబంధమున్నది. ఈ యర్థములలో ఏదే నొకదానిని బోధించుటకై ప్రయుక్తమైనను ఆ శబ్దము, ఘటజ్ఞానముకొరకు ఉద్దిష్టమగు దీపము ఘట ప్రకాశమునుకూడ కలిగించునట్లు, ఇతరార్థములనుగూడ (సిద్ధత్వముతో సంబంధించని లింగ సంఖ్యాదులు కాని, లింగసంఖ్యాదులతో సంబంధించని సిద్ధత్వము గాని లేకపోవుటచే) బోధించుచుండును కావున ఆ యర్థములు నాంతరీయకములు.

[1] ఇచట 'తతోఽన్యదపి' అను పాఠమునకు బదులు 'తతోఽన్యస్యాపి' అను పాఠమును గ్రహించి 'ఘటమును ప్రకాశింపచేయుటకు వెలిగించిన దీపము దాని ప్రక్కనే యున్న పటమును కూడ ఎట్లు ప్రకాశింపచేయునో అవిధముగా' అని ఒక వ్యాఖ్యాత వ్యాఖ్యానించి యున్నారు. ఈ కారికకపై పుణ్యరాజ వ్యాఖ్యానము ననుసరించి మొదట చూపిన యర్థము యుక్తమైనను, 302 వ కారికకు పుణ్యరాజు వ్రాసిన అవతారికను బట్టి రెండవ వ్యాఖ్యానము కూడ యుక్తమే యని తోచుచున్నది. కాని నాంతరీయకత్వమనునది ప్రథమ వ్యాఖ్యానముననే సంగతముగనుండును.

జ్ఞాపక హేతువు, కారక హేతువు అని హేతువు రెండు విధములు. దీపము ఘట మున్నట్లు జ్ఞానము కలిగించును గాన అది జ్ఞాపక హేతువు. అగ్నివలన ధూమము పుట్టునుగాన అగ్ని ధూమమునకు కారక హేతువు. పూర్వము జ్ఞాపక హేతువును దృష్టాంతముగ జూపి ఇపుడు కారక హేతువును దృష్టాంతముగ చూపుచున్నాడు.

నిర్మన్థనం యథారణ్యో రగ్న్యర్థ ముపపాదితమ్
ధూమము ప్యనభి ప్రేతం జనయ త్యేకసాధనమ్ . 300

యథా = ఏ విధముగా, అగ్న్యర్థం = అగ్నికొరకై, ఉపపాదితమ్ = చేయబడిన, అరణ్యోః = అరణులయొక్క, నిర్మన్థనమ్ = మథనము, అనభిప్రేతమ్ = ఉద్దేశింపబడనిదియు, ఏకసాధనమ్ = అగ్నికి ఏ అరణులు సాధనమో అవియే సాధనములుగా గల, ధూమం = ధూమమును, జనయతి = పుట్టించునో—

తా. అగ్నిని పుట్టించుటకై అరణులను మథించునపుడు అగ్నిని పుట్టించుటకు ఏ అరణులు సాధనమో ఆ అరణులే ధూమమునకు కూడ సాధనము గాన, కావలెనని కోరక పోయినను, ధూమముకూడ ఏ విధముగ ఉత్పన్న మగునో—

వి. యాగాదులకై అగ్నిని సంపాదింపవలసి వచ్చినపుడు జమ్మికఱ్ఱతో చేసిన ఒక దిమ్మను నేలపై ఉంచి, దానికి రంధ్రములుచేసి, ఒక రంధ్రములో మరియొక కఱ్ఱ యొక్క అగ్రమును చేర్చి, ఒకరు నిలబడి పైనుండి అదిమిపట్టుకొనియుండగా మరియొకరు త్రాళ్ళతో కవ్వము త్రిప్పినట్లు త్రిప్పుదురు. ఈ రెండు కఱ్ఱలకును అరణులని పేరు.

దీనిని దార్ష్టాంతికమునందు సమన్వయించుచున్నాడు.

తథా శబ్దోఽపి కస్మింశ్చిత్ ప్రత్యాయ్యార్థే వివక్షితే
అవివక్షితమ ప్యర్థం ప్రకాశయతి సన్నిధేః . 301

తథా = ఆ విధముగ, శబ్దోఽ పి = పాకాదిశబ్దము కూడా, కస్మింశ్చిత్ = ఒకా నొక, ప్రత్యాయ్యార్థే = బోధింపవలసిన సిద్ధత్వాద్యర్థము, వివక్షితే = వివక్షితమైనదగు చుండగా, సన్నిధేః = సన్నిధానమువలన, అవివక్షితమ్ = వివక్షితము కాని, అర్థమ్ = లింగసంఖ్యాద్యర్థమును కూడా, ప్రకాశయతి = బోధించుచున్నది.

తా. అట్లే శబ్దము కూడ, ఒక అర్థము వివక్షితమై యుండగా, సన్నిధివశమున అవివక్షితార్థమును గూడ బోధించును.

వి. అగ్నికొరకై మథింపబడిన అరణులు ధూమమును కూడ పుట్టించునట్లు సిద్ధత్వార్థమును బోధించుటకు ప్రయుక్తమగు 'పాక' శబ్దము, అవినాభావ సంబంధముచే సిద్ధత్వరూపార్థముతో కలిసియున్న పుంలింగ-ఏకత్వ సంఖ్యాదులను కూడ బోధించును.

కావున ఒక శబ్దము ఏ అర్థమును బోధింపవలెనని ప్రయోగింతుమో ఆ యర్థము ముఖ్యార్థము. తత్సన్నిధానముచే బోధ్యమగునది నాన్తరీయకము అని భావము.

ఒక క్రియకు అనేకములగు అంగములు ఉండును. ఉదా. పచనక్రియకు నిప్పు రగుల్చుట, బియ్యము కడుగుట, గిన్నె పొయ్యిపై కెక్కించుట మొదలగు ఎన్నియో అంగము లుండును. "పచతి" మొదలగు తిఙంతములు క్రియజరుగుచున్నట్లు బోధించును.

కావున తదోప్తధ్యమగు క్రియ సాధ్యము. ఘణాద్యంతములగు 'పాకః' ఇత్యాది పదములు క్రియపూర్తియై పోయినట్లు బోధించును. కావున ఏతదోప్తధ్యమగు క్రియ సిద్ధము.

దీపము, ఘటముతో పాటు దానిదగ్గర నున్న పటాదికమును గూడ ప్రకాశింప చేసిన చేయవచ్చును. శబ్దము కూడ అవిధముగనే వివక్షితార్థమునే కాక తత్సమానాధికరణ మగు అర్థాంతరమును గూడ బోధింపవలెనని నియమ మేమి యున్నది అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

యథై వాత్యన్తసంసృష్ట _స్త్యక్తు మర్థో న శక్యతే
తథా శబ్దోఽపి సమ్బన్ధీ ప్రవివేక్తుం న శక్యతే. 302

అత్యన్తసంసృష్టః = ఎక్కువగా కలిసిపోయి ఉన్న, అర్థః = వస్తువు, యథా= ఏ విధముగా, త్యక్తుం=విడచుటకు, న శక్యతే=శక్యముకాదో, తథా=ఆ విధముగా, సమ్బన్ధీ= ఆయా అర్థములతో సంబంధించివ, శబ్దోఽపి = శబ్దముకూడ, ప్రవివేక్తుమ్ = ఆ యర్థముల నుండి విడదీయుటకు, న శక్యతే=శక్యము కాదు.

తా. ఎక్కువగా కలిసిపోయిన పదార్థమును విడచుట ఎట్లు శక్యము కాదో, ఆ విధముగనే ఆయా యర్థములతో కలిసిన శబ్దమునుగూడ ఆయా అర్థములనుండి విడదీయుట శక్యము కాదు.

వి. మత్స్యాదిమాంసమును కోరువాడు ఆ మాంసముతో కలిసిపోయిన చర్మము, ముళ్ళు మొదలగు వాటిని ఏ విధముగ పూర్తిగ విడువజాలడో ఆ విధముగనే ముఖ్యార్థమును బోధింపవలెననెడు నభిప్రాయములతో ఒక శబ్దమును ప్రయోగించువాడు ఆ శబ్దముతో ఘనిష్ఠ సంబంధము గల లింగ సంఖ్యాది రూపములగు నాంతరీయ కార్థములను దానినుండి విడదీయజాలడు. కావున ముఖ్యార్థముతోపాటు నాన్తరీయ కార్థము కూడ బుద్ధిగోచర మగుచుండును. ఆ శబ్దమును లింగసంఖ్యాదులనుండియే కాదు, లింగసంఖ్యావాచకములు కాని, ద్యోతకములు కాని అగు ప్రత్యయములనుండి గూడ విడదీయుట శక్యము కాదు—కావుననే— "న కేవలా ప్రకృతిః ప్రయోక్తవ్యా, నాపి ప్రత్యయః" (కేవల ప్రకృతిని గాని, కేవల ప్రత్యయమును గాని ప్రయోగింపరాచు) అని నియమము.

అనేకములగు అర్థములు సన్నిహితములైనచో శబ్దము ఏ అర్థమును బోధించును అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

వ్యర్థానాం సన్నిధానేఽపి సతి చైషాం ప్రకాశనే
ప్రయోజకోఽర్థః శబ్దస్య రూపాభేదేఽపి శస్యతే. 303

వ్యర్థానామ్ = అనుపయుక్తములగు నాంతరీయకార్థముల యొక్క, సన్నిధానేఽపి= ముఖ్యార్థమునకువలె, ఒక శబ్దమున సన్నిధానమున్నను, ఏషాం = ఈ నాంతరీయకార్థములయొక్క, ప్రకాశనే=బోధనము, సత్యపి=ఉన్నను, శబ్దస్య=శబ్దమునకు, రూపాభేదేఽపి= ముఖ్యార్థమునందు వలె నాంతరీయకార్థ విషయమునందుగూడ స్వరూపభేదము లేకున్నను, ప్రయోజకః = ప్రయోజకమగు (ఏ అర్థము నుద్దేశించి ఆ శబ్దము ప్రయోగింపబడినదో అట్టి), అర్థః=అర్థము, శస్యతే= ప్రశంసింపబడును.

తా. అనుపయుక్తములగు అర్థములు సన్నిహితములైనను, అవి ప్రకాశితము లైనను, రూపభేదము లేకున్నను, ప్రయోజకమగు అర్థమే ప్రశంసింపబడును.

వి. ఒక శబ్దముతో ముఖ్యార్థమెట్లు సంబంధించియున్నదో నాంతరీయకార్థములు గూడ ఆ విధముగనే సన్నిహితములై యున్నవి. ముఖ్యార్థములను, నాంతరీయకార్థములను కూడ, తన స్వరూపమునందు ఎట్టి మార్పును లేకుండగనే శబ్దము బోధించుచున్నది. అయినను ఏ అర్థమును బోధింపవలెనను నుద్దేశముతో శబ్దము ప్రయోగింపబడినదో అట్టి ప్రయోజకమగు అర్థమే ప్రశస్యము— అనగా ముఖ్యము. ఇతరార్థములు నాన్తరీయకములు మాత్రమే.

ఈ విషయమునే, ప్రకారభేదములను గూడ చూపుచు విస్తారముగ ప్రతిపాదించుచున్నాడు.

క్వచి ద్గుణప్రధానత్వ మర్థానా మవివక్షితమ్
క్వచి త్సాన్నిధ్య మప్యేషాం ప్రతిపత్తా వకారణమ్ . 304

క్వచిత్=కొన్ని స్థలములయందు,అర్థానామ్=అర్థములయొక్క,గుణప్రధానత్వమ్=గుణప్రధాన భావము, అవివక్షితమ్=వివక్షితము కాదు. అనగా గుణప్రధానభావమునందు విపర్యయము కనబడుచున్నది.క్వచిత్=కొన్ని స్థలములయందు, ఏషామ్=ఈనాంతరీయకార్థముల యొక్క, సాన్నిధ్యమపి=సాన్నిధ్యముకూడ, ప్రతిపత్తౌ=జ్ఞానమునందు, (జ్ఞానము ద్వారా నాంతరీయకార్థ సంబద్ధ వ్యవహారమునందు), అకారణమ్=కారణము కాదు.

తా. కొన్నిటి అర్థముల గుణప్రధానభావము అవివక్షితము. కొన్నియెడల ఈ నాంతరీయకార్థముల సాన్నిధ్యము జ్ఞానమునందు అకారణము. అనగా పదార్థైకదేశము (పదార్థములోని ఒక భాగము) వివక్షితము కాదు - అని యర్థము.

యచ్చానుపాత్తం శబ్దేన తత్కస్మింశ్చిత్ ప్రతీయతే
క్వచి త్ప్రధాన మే వార్థో భవ త్యన్యస్య లక్షణమ్ . 305

కస్మింశ్చిత్ = ఒకానొకస్థలమునందు, యచ్చ=ఏది, శబ్దేన=శబ్దముచేత, అనుపాత్తమ్=వాచ్యార్థరూపమున బోధింపబడలేదో, తత్=అ యర్థమే, (నాన్తరీయకమైనను), ప్రతీయతే=గ్రహింపబడును. అనగా వాచ్యార్థమునకు వివక్ష ఉండదని భావము. క్వచిత్=కొన్నిస్థలములయందు, ప్రధానమ్=ప్రధానమైన, అర్థఏవ=అర్థమే, అన్యస్య=మరియొక అర్థమునకు, లక్షణమ్=ఉపలక్షణము, భవతి=అగును.

తా. కొన్ని స్థలములందు శబ్దవాచ్యముకాని అర్థము గ్రహింపబడును. కొన్నియెడల ప్రధానమైన అర్థమే మరియొక అర్థమునకు ఉపలక్షకముగ నుండును.

పై రెండు కారికలలో (1) గుణప్రధాన భావ విపర్యయము (2) పదార్థైక దేశావివక్ష, (3) సకల పదార్థావివక్ష (4) ఉపాత్త పదార్థమును విడువకుండగనే అర్థాంతరమును ఉపలక్షించుట అను ప్రకారచతుష్టయము చెప్పబడినది. వీటిలో మొదటిదానిని ఉదాహరణపూర్వకముగ వివరించుచున్నాడు.

అఖ్యాతం తద్ధితార్థస్య యత్కిఞ్చి దుపదర్శకమ్
గుణప్రధానభావస్య తత్ర దృష్టో విపర్యయః . 306

ఆఖ్యాతమ్ = 'తేనదీవ్యతి -' (4.4.2) ఇత్యాదిసూత్రమునందలి ఆఖ్యాతము, తద్ధితార్థస్య=తద్ధితార్థముయొక్క, యత్కిఞ్చిదుపదర్శకమ్=క్రియారూపము, కారకరూపము అగు ఏదియో అంశమునకు ప్రదర్శకము, తత్ర = ఆ ఆఖ్యాతమునందు, గుణప్రధాన భావస్య=గుణప్రధాన భావమునకు, విపర్యయః=వైపరీత్యము, దృష్టః=చూడబడినది.

తా. ఆఖ్యాతము తద్ధితముయొక్క ఏదియో ఒక అంశమును ప్రదర్శించును. ఆ ఆఖ్యాతమునందు గుణప్రధానభావమునకు విపర్యయము కానవచ్చుచున్నది.

వి. 'అక్ష' శబ్దమునకు 'అక్షముతో ఆడువాడు' అను నర్థమున 'తేన దీవ్యతి ఖనతి జయతి జితమ్' (4.4.2) అను సూత్రముచే 'ఠక్' ప్రత్యయము, దానికి ఇకాదేశము వచ్చి 'ఆక్షికః' అను రూపము సిద్ధించినది. 'పాచికలతో ఆడెడువాడు' అని యర్థము. 'తేన దీవ్యతి—' ఇత్యాదిసూత్రమున 'దీవ్యతి' అను ఆఖ్యాతము ప్రయుక్తమైనది. 'క్రియాప్రధాన మాఖ్యాతమ్' (ఆఖ్యాతము ప్రధానముగ క్రియను బోధించును) అను నియమము ననుసరించి 'తత్కరణకదేవనక్రియ' అను నర్థమున ఠక్ ప్రత్యయము వచ్చునని సూత్రమున కర్థము వచ్చును. కావున ఈ లక్షణము (శాస్త్రము) ననుసరించి నిష్పన్నమగు 'ఆక్షికః' అను లక్ష్యమునకు 'అక్షకరణక (దేవదత్త కర్తృక) దేవనక్రియ' అను నర్థము చెప్పవలసియున్నది. కాని తద్ధితాంతము స్వభావముచే సాధనప్రధానమగు అర్థమును బోధించునుగాన 'అక్షకరణక దేవనక్రియ చేయువాడు' (అక్షకరణకదేవనక్రియా కర్త్రభిన్నః దేవదత్తః) అను ప్రథమాంత ప్రధానమగు బోధమునే చెప్పవలెను. ఈ విధముగ లక్షణోక్త గుణప్రధానభావమునకును (అచట కర్త అప్రధానము, క్రియప్రధానము), లక్ష్యబోధ్యగుణప్రధానభావమునకును (ఇచట కర్త ప్రధానము, క్రియ తద్విశేషణ మగుటచే అప్రధానము) విపర్యాసమువచ్చినది గాన ఇది గుణప్రధాన విపర్యాసమున కుదాహరణము. ఇట్టి పరిస్థితులలో 'తేన దీవ్యతి' ఇత్యాదులందు ఆఖ్యాతము తద్ధితాంతమునకు సంబంధించిన క్రియాకర్తృరూపమగు కొంత అర్థమును బోధించుచున్నదేగాని ఇందు గుణప్రధానభావము వివక్షితము కాదు. అక్షకరణక దేవనక్రియాకర్తృరూపమగు అర్థముమాత్రమే ప్రయోజకము గాన అదియే ముఖ్యార్థమని భావము.

'క్వచి త్సాన్నిధ్యమ ప్యేషాం ప్రతిపత్తా వకారణమ్' అను ద్వితీయ ప్రకారమును (పదార్థైకదేశావివక్షను). 'యచ్చానుపాత్తం శబ్దేన తత్ కస్మింశ్చిత్ ప్రతీయతే' అను తృతీయ ప్రకారమును (సకల పదార్థావివక్షను) విశదీకరించుచున్నాడు.

నిర్దేశే లిఙ్గ సంఖ్యానాం సన్నిధాన మకారణమ్
ప్రమాణ మేవ హ్రస్వాదా వనుపాత్తం ప్రతీయతే . 307

నిర్దేశే='భావే' (3.3.18) ఇత్యాది సౌత్రనిర్దేశమునందు, లిఙ్గసంఖ్యానామ్ = లింగసంఖ్యలయొక్క, సన్నిధానం = సన్నిధి, అకారణమ్ = స్వవిషయక వ్యవహారమునకు కారణము కాదు.

తా. సౌత్రనిర్దేశమున లింగ సంఖ్యా సన్నిధి స్వవ్యవహారకారణము కాదు.

వి. 'పచ్' మొదలగు ధాతువులకు 'భావే' (3.3.18) అను సూత్రముచే భావార్థమున 'ఘఞ్' (అ) ప్రత్యయము విధింపబడినది. సిద్ధావస్థనుపొందిన ధాత్వర్థమునకు

భావమని పేరు. 'పాకః' ఇత్యాదిరూపములు సిద్ధించినవి. ఇచట 'భావే' అనునపుడు పుంలింగైకత్వములుకూడ భావపదార్థముతో సంసృష్టములై యున్నవి గాన నాంతరీయకము లగు ఆ అర్థములను గూడ స్వీకరించినచో 'భావార్థమున, పుంలింగమున, ఏకత్వసంఖ్య వాచ్యమగునపుడు ఘఞ్ వచ్చును' అను నర్థము చెప్పవలసియుండును. అట్లు చెప్పినచో 'పాకః' ఇత్యాది పుంలింగైకవచనరూపములు మాత్రమే యుండునుగాని 'పాకౌ' 'పాకాః' ఇత్యాదిరూపము లుండరాదు. అట్లే భావార్థమున 'క్తి' (తి) ప్రత్యయము వచ్చి, గతిః, 'గతీ' ఇత్యాదిస్త్రీలింగరూపములుండుటకు గూడ అవకాశముండదు. కావున నాన్తరీయకము లగు సంఖ్యాలింగరూపార్థముల జ్ఞాన మిచట కలిగినను అవి వ్యవహారయోగ్యములు కావు. ఇది పదార్థైకదేశావివక్షకు ఉదాహరణము.

ఉత్తరార్థము సకల పదార్థావివక్షను వివరించుచున్నది.

హ్రస్వాదౌ = 'తస్యాదిత ఉదాత్త మర్ధహ్రస్వమ్' (1.2.32) ఇత్యాదిసూత్రము లందలి హ్రస్వాదిపదములందు, అనుపాత్తం = గ్రహింపబడని (చెప్పబడని), ప్రమాణ మేవ = అర్థమాత్రప్రమాణమే, ప్రతీయతే = రూఢిచే తెలియబడుచున్నది.

తా. హ్రస్వాదిపదములందు చెప్పబడని ప్రమాణరూపార్థము గ్రహింపబడు చున్నది.

వి. పాణిని—'ఊకాలోఽజ్ఘ్రస్వదీర్ఘ ప్లుతః' (1.2.27) అను సూత్రముచే అచ్చు లన్నియు హ్రస్వము, దీర్ఘము, ప్లుతము అని మూడేసి విధములుగ నుండుననిచెప్పి, మరల హ్రస్వదీర్ఘప్లుతములు ఉదాత్తానుదాత్తస్వరితభేదములచే మూడేసి విధములగునని ప్రతిపా దించి, 'ఉచ్చై రుదాత్తః' (1.2.29) నీచై రనుదాత్తః' (1.2.30) అను సూత్రములచే ఉదాత్త మన నేమియో, అనుదాత్తమన నేమియో చెప్పి, పిదప 'సమాహారః స్వరితః' (1.2.31)అను సూత్రమున ఉదాత్తానుదాత్తముల సమాహారము (కలయిక) స్వరితమని ప్రతిపాదించినాడు. ఈ విధముగ అచ్చులన్నియు (ఏజాదులుతప్ప) హ్రస్వోదాత్త—హ్రస్వానుదాత్త—హ్రస్వ స్వరితములనియు, దీర్ఘోదాత్త—దీర్ఘానుదాత్త- దీర్ఘ స్వరితములనియు, ప్లుతోదాత్త—ప్లుతాను దాత్త—ప్లుతస్వరితము లనియు తొమ్మి దేసివిధము లుండును. స్వరితములగు హ్రస్వదీర్ఘప్లుత ములు క్రమముగ ఏకమాత్ర-ద్విమాత్ర-త్రిమాత్రములై యుండును. కావునహ్రస్వస్వరితాదు లలోఉదాత్తానుదాత్తములు రెండునుకలిసియున్నవి గాన, ఎంతభాగముఉదాత్తము, ఎంతభాగము అనుదాత్తము, అందును మొదటిభాగముదాత్తమా, మధ్యభాగమా లేక చివరిభాగమా అను శంకకు సమాధానముగా 'తస్యాదిత ఉదాత్త మర్ధహ్రస్వమ్' (1.2.32) అని చెప్పబడినది. దానికి—'ఆ స్వరితముయొక్క మొదటి సగమైన హ్రస్వము ఉదాత్తము' అని అర్థము చెప్పవలసియున్నది. కాని ఇట్లు అర్థము చెప్పినచో హ్రస్వస్వరితమువిషయమున వెనుకటి శంక తొలగినను దీర్ఘస్వరిత ప్లుతస్వరితములవిషయమున వాటిలో ఎంతభాగము, ఏభాగము ఉదాత్తమో సమాధానముచెప్పినట్లుకాదు. కావున ఈ సూత్రమునందలి 'హ్రస్వ' శబ్దము నిరర్థకము 'అర్ధహ్రస్వమ్' అనుదానికి అర్ధమాత్ర యనియే అర్థము. అట్లు చెప్పినచో దీర్ఘప్లుత స్వరితములలోగూడ మొదటి అర్ధమాత్రయే ఉదాత్తమని చెప్పినట్లగును. ఈ విధముగ నిచట హ్రస్వపదార్థమును పూర్తిగ విడిచి నిరూఢలక్షణచే 'అర్ధహ్రస్వమ్' అను

దానికి 'ర్ధఅమాత్ర' యని మరియొకయర్థము చెప్పబడినది. కాన ఇది సకలపదార్థా వివక్షకు ఉదాహరణము.

వర్ణములను ఉచ్చరించుటకు పట్టు కాలమునకు మాత్ర యని పేరు. హ్రస్వమునకు ఒక మాత్ర, దీర్ఘమునకు రెండు మాత్రలు, ప్లుతమునకు మూడు మాత్రలు, వ్యంజనమునకు అర్ధమాత్ర.

'ఏకమాత్రో భవే ద్ధ్రస్వో ద్విమాత్రో దీర్ఘ ఉచ్యతే
త్రిమాత్రస్తు ప్లుతో జ్ఞేయః వ్యఞ్జనం త్వర్ధమాత్రకమ్'.

పూర్వకారికో క్తవిషయమునే స్పష్టీకరించుచున్నాడు.

హ్రస్వస్యార్ధం చ యద్దృష్టం తత్ర స్యాసన్నిధా వపి
హ్రస్వస్య లక్షణార్థత్వాత్ తద్వదే వాభిధీయతే. 308

హ్రస్వస్య = హ్రస్వముయొక్క, యత్ = ఏ, అర్ధమ్ = అర్ధమాత్రాప్రమాణమగు అర్ధభాగము, దృష్టమ్ = చూడబడినదో, తత్ = ఆ అర్ధమాత్రాప్రమాణము, తస్య = ఆ హ్రస్వముయొక్క, అసన్నిధావపి = దీర్ఘ స్వరితాదులయందు సన్నిధి లేకపోయినను, హ్రస్వస్య = హ్రస్వశబ్దము, లక్షణార్థత్వాత్ = మాత్రయను నర్థమున లాక్షణిక మగుట వలన, తద్వదేవ = ఆ హ్రస్వముయొక్క అర్ధమాత్రవలె (దీర్ఘప్లుతముల విషయమునందు కూడ) అభిధీయతే = చెప్పబడుచున్నది.

తా. హ్రస్వస్వరితమునందు, అర్ధహ్రస్వ మనగా హ్రస్వముయొక్క సగ భాగము అని అర్థము చెప్పుటకు అవకాశమున్నను దీర్ఘప్లుతములలో హ్రస్వము లేదు గాన 'హ్రస్వ' శబ్దమునకు 'మాత్ర' యనియే అర్థము లక్షణచే చెప్పవలెను. ఆ యర్థము దీర్ఘప్లుతముల విషయమునగూడ సంగత మగును.

వి. "క్వ వోఽశ్వాః" ఇత్యాదులలో 'క్వ' లోని హ్రస్వ అకారము స్వరితము. పైన చూపిన సూత్రమునుబట్టి ఈ హ్రస్వస్వరితమునందలి మొదటి సగము హ్రస్వము— అనగా హ్రస్వమునకు ఒకమాత్రగాన సగముమాత్ర—ఉదాత్తము. కాని "రథానాం నయేరాః" అనునపుడు "యే" యందలి దీర్ఘస్వరిత ఏ కారమున హ్రస్వము లేకున్నను, సూత్రము నందలి 'హ్రస్వ' శబ్దమునకు మాత్ర యను లాక్షణికార్థము చెప్పి 'అర్ధహ్రస్వమ్' అను దానికి 'అర్ధమాత్ర' యను నర్థము చెప్పుటచే హ్రస్వస్వరితవిషయమునం దెట్లో ఆ విధముగనే దీర్ఘ స్వరిత ప్లుతస్వరితముల విషయమున గూడ 'మొదటి అర్ధమాత్ర' అను నర్థము చెప్పబడు చున్నది.

లేదా, ఇచట మూడు ప్రకారములను చెప్పవచ్చును అను నభిప్రాయముతో చెప్పు చున్నాడు.

దీర్ఘప్లుతాభ్యాం తస్య స్యా న్మాత్రయా వా విశేషణమ్
జాతే ర్వా లక్షణా యస్మాత్ సర్వథా స ప్తపర్ణవత్. 309

తస్య = ఆ అర్ధశబ్దమునకు, దీర్ఘప్లుతాభ్యాం = దీర్ఘప్లుతములచేగూడ, విశేషణమ్ = అవచ్ఛేదనము, స్యాత్ = అగును.

తా. 'అర్ధ' శబ్దము 'దీర్ఘ' 'ప్లుత' ములచే అవచ్ఛేద్యము కావచ్చును.

వి. "ఊకాలోఽజ్ఘ్రస్వదీర్ఘప్లుతః" (1.2.27) అను సూత్రమున హ్రస్వదీర్ఘములు కూడ నిర్దిష్టములై యున్నవిగాన ఛత్రి న్యాయముచే దీర్ఘప్లుతములు కూడ ఉపలక్షితములగును. (ఒకరిద్దరు గొడుగులు చేతబట్టుకొనియు, ఇతరులు గొడుగులు లేకుండగను, పది మంది కలిసిపోవునపుడు వారందరిని కలిపి "ఛత్రిణో గచ్ఛన్తి"-గొడుగులవారు వెళ్ళుచున్నారు – అనిఅందుము. దీనికి ఛత్రిన్యాయమని పేరు). ఇట్లు దీర్ఘప్లుతములు గూడ అర్ధశబ్దముతో విశేషణముగ అన్వయించుటచే హ్రస్వముయొక్క అర్ధము, దీర్ఘముయొక్క అర్ధము, ప్లుతముయొక్క అర్ధము అను నర్థములు వచ్చును. 'హ్రస్వ' శబ్దముతో సంబంధించిన 'అర్ధ' శబ్దమునకు సగభాగమని యర్థము. 'దీర్ఘ' 'ప్లుత' శబ్దములతో సంబంధించినపుడు ఒక అంశము అని యర్థము. అర్ధశబ్దమునకు సమమైన భాగమనియే కాక విషమమైన భాగమనికూడ అర్థమున్నది. ఈ విధముగ హ్రస్వ-దీర్ఘ-ప్లుత స్వరితముల మొదటి అర్ధమాత్ర ఉదాత్తమని యర్థము సిద్ధించును. ఇది మొదటి ప్రకారము

విశేషణమనగా ఇతరవస్తువులలో లేనిదియు, ఒకవస్తువునం దుండునదియు అగు విశేషమును తెలిపి తద్ద్వారా ఈ వస్తువు ఇతరవస్తువులకంటె భిన్నమైనది అను విషయమును (ఇతరవ్యావృత్తత్వమును లేదా అవచ్ఛిన్నత్వమును) సూచించునది. అందుచే 'నీలోత్పలమ్' ఇత్యాదులలో 'నీల' శబ్దము 'ఉత్పల' శబ్దమునకు విశేషణమై, ఏ విధముగ—'ఈ ఉత్పలము శ్వేతోత్పలాదులకంటె భిన్నమైనది' అని బోధించుచున్నదో అట్లే 'రాజపురుషః' అనునపుడు 'రాజ' శబ్దము కూడ—'ఇతడు మరియొక పురుషుడుకాడు, రాజుయొక్క పురుషుడు' అను నర్థమును తెలుపుచు ఇతరవ్యావృత్తిని బోధించుచున్నది. కావున 'రాజన్' శబ్దము 'పురుష' శబ్దమునకు విశేషణమని చెప్పుట శాస్త్రపద్ధతి. ఈ పద్ధతి ననుసరించి 'అర్ధహ్రస్వమ్' 'అర్ధదీర్ఘమ్' ఇత్యాదులలోని హ్రస్వాదిశబ్దములు 'అర్ధ' శబ్దమున విశేషణములైనవని చెప్పబడినది.

వా = లేక, మాత్రయా = మాత్రాశబ్దముచే, తస్య = ఆ 'హ్రస్వ' శబ్దమునకు, విశేషణమ్ = అవచ్ఛేదము (చేయబడును).

తా. లేదా 'మాత్రా' శబ్దము 'హ్రస్వ' శబ్దావచ్ఛేకముగ నుండునని చెప్పవచ్చును.

వి. 'హ్రస్వ' పదమునకు లక్షణచే 'మాత్ర' యని యర్థము. ఈ మాత్రరూపార్థము అర్ధశబ్దముతో విశేషణముగ అన్వయించుటచే 'మాత్రయొక్క అర్ధము' (అర్ధమాత్ర) అను నర్థము సిద్ధించును. ఈ విధముగ 'హ్రస్వ దీర్ఘ ప్లుత స్వరితముల మొదటి అర్ధమాత్ర' అను నర్థము సిద్ధించును. ఇది ద్వితీయప్రకారము.

వా = లేక, (అఖండమగు అర్ధహ్రస్వపదముచే), సప్తపర్ణవత్ = సప్తపర్ణశబ్దముచేతవలె, సర్వథా = సర్వవిధములచే, అనగా అవయవవిభాగము ఏదియులేకుండ, యస్మాత్ = ఏ కారణమువలన, జాతేః = అర్ధమాత్రాత్వరూపమగు జాతియొక్క, లక్షణా = సూచనము (ఉపలక్షణము) అంగీకరింపబడునో ఆ కారణమువలన దీర్ఘప్లుతాదులందు గూడ మొదటి అర్ధముమాత్రమే ఉదాత్తమగునని యర్థము.

తా. సప్తపర్ణశబ్దమువలె, అవయవవిభాగము లేక అర్ధమాత్రాత్వరూప జాత్యుప లక్షణము అంగీకరింపవచ్చును.

వి. అవయవవిభాగము లేని అఖండమగు 'అర్ధహ్రస్వ' శబ్దమే, సప్తపర్ణాదిశబ్దములు సప్తపర్ణవృక్షత్వమునకు ఉపలక్షకములైనట్లు, అర్ధమాత్రాత్వజాతికి ఉపలక్షకమని భావము. ఇది తృతీయప్రకారము.

ఇపుడు 'క్వచి త్ప్రధానమే వార్థో భవ త్యన్యస్య లక్షణమ్' అని చెప్పిన 'ఉపాత్త పదార్థమును త్యజించకుండగనే అన్యార్థమును ఉపలక్షించుట అను చతుర్థ ప్రకారమును విచారించుచున్నాడు.

గన్తవ్యం దృశ్యతాం సూర్య ఇతి కాలస్య లక్షణే
జ్ఞాయతాం కాల ఇత్యేత త్సోపాయ మభిధీయతే. 310

గన్తవ్యమ్ = ఇంకను చాలదూరము వెళ్ళవలసియున్నది, సూర్యః = సూర్యుడు, దృశ్యతామ్ = చూడబడుగాక, ఇతి = ఈ విధముగా (సూర్యదర్శనము ప్రధానార్థముగా గల 'సూర్యః దృశ్యతామ్' అను వాక్యముచేత) కాలస్య = కాలవిశేషముయొక్క, లక్షణే = లక్షణచే బోధించుటలో, కాలః = కాలము, జ్ఞాయతామ్ = తెలిసికొనబడుగాక, ఇత్యేతత్ = అనువిషయము, సోపాయమ్ = సూర్యదర్శన రూపకాల జ్ఞానోపాయ సహితముగా, అభిధీయతే = చెప్పబడుచున్నది.

తా. 'ఇంకను వెళ్ళవలెను, సూర్యుని చూడుము' అని కాలమును లక్షణచే బోధించునపుడు—'కాలమును తెలుసుకొనుము' అనెడు విషయము ఉపాయముతో చెప్పబడుచున్నది.

వి. పథికులు ఒకరితోనొకరు—'ఇంకను చాలదూరము వెళ్ళవలసియున్నది; సూర్యునివైపు చూడుడు' అని చెప్పుకొనునపుడు—'కొంచెము పగటికాలమే మిగిలియున్నది- అను విషయమును తెలిసికొనండి' అను లాక్షణికార్థము సూర్యదర్శన రూప ముఖ్యార్థబోధనమును ఉపాయముగ గొని తెలుపబడుచున్నది. ఈ విధముగ నిచట ముఖ్యార్థమును వీడకుండగనే మరియొకయర్థము లక్షణచే బోధింపబడుచున్నది గాన ఇది—'ఉపాత్తపదార్థాపరిత్యాగేనైవాన్యార్థోపలక్షణమ్' అనుదానికి ఉదాహరణము.

'ప్రధానమగు అర్థమే అన్యార్థోపలక్షక మగును' అను విషయమునే శాస్త్రీయలౌకికోదాహరణములతో రెండు శ్లోకములలో వివరించుచున్నాడు.

విధ్యత్యధను షేత్యత్ర విశేషేణ నిదర్శ్యతే
సామాన్య మాశ్రయః శక్తే ర్యః కశ్చిత్ప్రతిపాదకః. 311

విధ్యత్యధనుషా + ఇత్యత్ర = 'విధ్యత్యధనుషా' అను సూత్రమున, విశేషేణ = కరణవిశేషవాచకమగు ధనుస్సుచేత, శక్తేః = కరణశక్తికి, సామాన్యమ్ ఆశ్రయః = ఆశ్రయ సామాన్యమైన, యః = ఏ, కశ్చిత్ = ఒకానొకపదార్థము కలదో, ప్రతిపాదకః = దానిని బోధించుశబ్దము, నిర్దిశ్యతే = నిర్దేశింపబడుచున్నది.

తా. 'విధ్యత్యధనుషా' అను సూత్రమున విశేషముచే కరణశక్తికి ఆశ్రయ సామాన్యమగు ఒకానొక పదార్థమును బోధించుశబ్దము నిర్దేశింపబడుచున్నది.

వి. 'విధ్యత్యధనుషా' (4.4.83) అను సూత్రము 'విధ్యతి' (కొట్టుచున్నాడు) అను నర్థమున, ఆ కొట్టుటయందు కరణము (సాధనము) ధనుస్సు కానిచో, ద్వితీయాంతము కంటె 'యత్' ప్రత్యయమును విధించుచున్నది. 'పాదౌ విధ్యన్తి పద్యాః శర్కరాః' (పాదములను వేధించు గులకరాళ్ళు) అనునది ఉదాహరణము. ఇచట 'అధనుషా' అని చెప్పుటచే ఒక్క ధనుస్సునుమాత్రమే గ్రహించినచో 'చోరం విధ్యతి ఖడ్గేన' అనునపుడు కరణ వాచకము ధనుస్సు కాదు కావున ఇచట 'చోర' శబ్దముకంటె 'యత్' ప్రత్యయము వచ్చుటకు అవకాశమున్నది. అది అనిష్టము. ఇచట ధనుఃశబ్దము లక్షణచే కరణసామాన్యవాచకము. ఇపుడు కరణవాచక మేదియు ప్రయుక్తము కానపుడుమాత్రమే 'యత్' ప్రత్యయము వచ్చునని అర్థమగుటచే పై ఉదాహరణమున చోరశబ్దముకంటె 'యత్' ప్రత్యయము రాదు. ఇచట ధనుఃశబ్దముచే లక్షితమగు కరణసామాన్యమునందు ధనుస్సుకూడ అంతర్గతమే కాన (ధనుస్సును మరి యే ఇతర కరణములను చెప్పరాదు అని అర్థమగుటచే) ప్రధానార్థమును పూర్తిగ పరిత్యజించక అన్యార్థము ఉపలక్షితమైనది. కావున ఇది అజహల్లక్షణకు శాస్త్రీయోదాహరణము.

సామాన్యమును గ్రహించుటకై విశేషమును చెప్పుట యనుదానికి (అజహల్లక్షణకు) లౌకికోదాహరణమను చూపుచున్నాడు.

> కాకేభ్యో రక్ష్యతాం సర్పి రితి బాలోఽపి చోదితః
> ఉపఘాతపరే వాక్యే న శ్వాదిభ్యో న రక్షతి. 312

కాకేభ్యః = కాకులనుండి, సర్పిః = నెయ్యి, రక్ష్యతామ్ = రక్షింపబడుగాక, ఇతి = అను, ఉపఘాతపరే = సర్పిరుపఘాతపరమగు, వాక్యే = వాక్యము ప్రయుక్తమైనదగుచుండగా, చోదితః = ఈ వాక్యముచే సర్పిరక్షణమునకై ప్రేరితుడగు, బాలోఽపి = బాలుడైనను, శ్వాదిభ్యః = కుక్కలు మొదలగువాటినుండి, న రక్షతీతి న = రక్షింపడను మాట లేదు.

తా. 'కాకులనుండి నెయ్యిని రక్షింపుము' అని సర్పిరుపఘాతపరమగు వాక్యము ప్రయుక్తమగు నపుడు, ఆదిష్టుడగువాడు బాలుడైనను శునకాదులనుండి దానిని రక్షింపకుండడు.

వి. ఇచట 'కాకులనుండి రక్షింపుము' అని సర్పిరుపఘాతక విశేషములగు కాకములనుమాత్రమే చెప్పినను సర్పిరుపఘాతకములగు అన్నింటినుండియు రక్షింపుమని తాత్పర్యముగాన కాకశబ్దము లక్షణచే సర్పిరుపఘాతక సామాన్యమును తెలుపును. కావున విశేషాభిధాయకమగు ఈ వాక్యమును ప్రయోగించుటకు సామాన్యమే నిమిత్తమని భావము. ఇది అజహల్లక్షణకు లౌకికోదాహరణము.

'యచ్చానుపాత్తం శబ్దేన తత్ కస్మింశ్చిత్ ప్రతీయతే' (కా. 305) అని చెప్పిన విధమున కొన్నిచోట్ల ఉక్తమగు ముఖ్యార్థమునకు నాంతరీయకమగుటచే అనుక్తమగు మరియొక వాక్యార్థము కూడ ప్రతీతమగునని చెప్పుచున్నాడు.

ప్రక్షాళనం శరావాణాం స్థాలీనాం మార్జనం తథా
అనుక్తమపి రూపేణ భుజ్యఙ్గత్వాత్ ప్రతీయతే . 313

రూపేణ = స్వరూపముచేత, అనుక్తమపి = ఈ అతిథులకుభోజనము పెట్టుడు అను వాక్యముచే బోధింపబడకున్నను, శరావాణాం = భోజనపాత్రములయొక్క, ప్రక్షాలనమ్= జలప్రక్షాళనము, తథా = మరియు, స్థాలీనామ్ = వంటపాత్రలయొక్క, మార్జనమ్=మృత్తికాదులచే తోముటయు, భుజ్యఙ్గత్వాత్ = భోజనాంగమగుటవలన, ప్రతీయతే = తెలియబడుచున్నది.

తా. ప్రత్యక్షముగ చెప్పకున్నను, శరావప్రక్షాళనము, స్థాలీమార్జనము మొదలగునది భోజనాంగము గాన ప్రతీతమగును.

వి. 'అతిథులకు భోజనము పెట్టవలెను' అని చెప్పినపుడు భోజనపాత్రలను, పాకపాత్రలను కడిగిననే కాని అన్నము వండి భోజనముపెట్టుట కుదరదు. కనుక 'ఆ పాత్రలను కడుగవలెను' అను అర్థముకూడ పై వాక్యముచే అప్రత్యక్షరూపమున బోధింపబడుచున్నది. కావున—కొన్ని యెడల ముఖ్యార్థము సాక్షాదనుక్తమగు అర్థాంతరమును గూడ బోధించును—అనుదానికి ఇది ఉదాహరణము.

శబ్దార్థములలో, 'ఇది ముఖ్యము, ఇది గౌణము (అప్రధానము)' మొదలగు నిర్ణయమును చేయుటకుపయోగించు కొన్ని ఉపాయములను చూపుచున్నాడు.

వాక్యాత్ప్రకరణా దర్థా దౌచిత్యా ద్దేశకాలతః
శబ్దార్థాః ప్రవిభజ్యంతే న రూపాదేవ కేవలాత్ . 314

వాక్యాత్ = వాక్యముయొక్క సమన్వయమువలన, (వాక్యము మొత్తముపై వచ్చు భావము వలన) ప్రకరణాత్=సందర్భమువలన, అర్థాత్=చెప్పదలచిన ప్రయోజనమువలన, ఔచిత్యాత్ = ఔచిత్యము (తగి ఉండుట) వలన, దేశకాలతః = ప్రదేశమువలన, సమయము వలనను, శబ్దార్థాః=శబ్దముల అర్థములు, ప్రవిభజ్యంతే=నిశ్చయింపబడును, కేవలాత్ = కేవలము (ఎట్టి సహాయము లేకుండ), రూపాత్ + ఏవ=శబ్దముయొక్క ఆకారమునుబట్టియే, న = కాదు (నిశ్చయింపబడవు).

తా. "శబ్దమునకు ఇది అర్థమా ? అది అర్థమా ?" అని సంశయము కలుగునపుడు సంశయమును పోగొట్టి, అర్థమును నిర్ణయించుటకు కొన్ని ఉపాయములు కలవు. అవియే వాక్యము, ప్రకరణము, అర్థము, ఔచిత్యము మొదలగునవి. వీని సాయముతో అర్థమును నిశ్చయించుకొన వీలు కలుగును. కేవలము శబ్దము యొక్క స్వరూపము మాత్రమే, అన్నిచోట్లను అభిమతమైన అర్థమును స్పష్టపరుపజాలదు.

వి. ఇంతకు ముందున్న కారికలలో శబ్దముల విషయమునను అర్థముల విషయమునను గౌణముఖ్యాది విభాగము (ఏది ప్రధానము ? ఏది అప్రధానము ? మొదలగు చర్చ) చర్చింపబడినది. ఆ ప్రసంగమును బట్టి శబ్దము యొక్క అర్థమును గురించి కలుగు సందేహమును పోగొట్టు ఉపాయములు ఇచట చూపబడినవి. అనేకార్థత్వము (ఒకే శబ్దము రెండు మూడర్థములను బోధించుట), సారూప్యము (వేరు వేరు అర్థములను బోధించినను శబ్దరూపమొకే విధముగ ఉండుట) మొదలగు హేతువులవలన, కొన్నిచోట్ల "ఈ శబ్దము

నకు ప్రకృతము ఏది అర్థము" అనుసంశయమునకు అవకాశము ఉండును. అట్టితరి అర్థ నిర్ణయమునకు ఈ వాక్యాది సాధనములు మిక్కిలి ఉపకరించును. వీనిలో ఏదో ఒక ఉపాయము మూలమున "ఈ శబ్దమునకు ఇచట ఇదియే అర్థము" అని నిశ్చయించుకొన వచ్చును.

కొన్ని ఉదాహరణములతో పై అంశములను విశదీకరింపవగును.

1. వాక్యమువలన అర్థనిర్ణయము : 'కటం కరోతి భీష్మ ముదారం దర్శనీయమ్' అనునది వాక్యము. (భీష్మమ్=దృఢమైన, ఉదారమ్ = విశాలమైన, దర్శనీయమ్= అందమైన, కటమ్=చాపను, కరోతి=చేయుచున్నాడు—అల్లుచున్నాడు) ఇచట 'కట' శబ్దము 'చాప' అను ద్రవ్యమును బోధించుటచే అది విశేష్యముగాన దానికి 'కరోతి' అను క్రియతోముందుగా సంబంధము తప్పదని తెలియును. పిదప ద్రవ్యగుణములు (ఒకవస్తువు-దానికి సంబంధించిన గుణములును) పరస్పరాపేక్ష కలవగుటచే (ఒకదానిని విడిచి మరొకటి ఉండుట కుదురదు. నలుపు, తెలుపు మొదలగు గుణములు ఎల్లప్పుడును ఒక ద్రవ్యము నాశ్రయించుకొనియే ఉండును) విశేషణ విశేష్యభావము, శబ్దములను వాడినతీరు, వానికుండు పరస్పర సంబంధము, అన్వయ సారస్యమును వెంటనే స్ఫురించి, "భీష్మ" శబ్దమునకు ఈ వాక్యమున 'దృఢమైన' అనియే అర్థముగాని భారత కథయందలి 'భీష్ముడని' అర్థము కాదని స్పష్టమగును. అనగా వాక్యమందలి పదముల విన్యాసరీతి, పరస్పర సంబంధము ముందుకు వచ్చి, వాక్యముయొక్క మొత్తము భావమును సూచించి ఏ ఒక శబ్దముయొక్క అర్థమునైనను నిస్సంశయముగ బోధింపజాలునని అభిసంధి.

2. ప్రకరణమువలన : ప్రకరణ మనగా సందర్భము. దీనినే ప్రసంగము, ప్రస్తావము అనియు అందురు."సైంధవ మానయ"అను వచనము. (సైంధవమును తెమ్ము). ఇచట సైంధవ శబ్దమునకు అశ్వము, ఉప్పు అను రెండర్థములున్నవి. (సింధౌభవమ్= సింధుదేశమున పుట్టునది—లేక—సముద్రమున పుట్టునది) కాన సంశయమునకు అవకాశ మున్నది. అయినను ఈ వచనమును ప్రయాణము సందర్భములో వాడినచో సైంధవశబ్ద మునకు గుఱ్ఱమనియు, భోజన ప్రసంగములో వాడినచో ఉప్పు అనియు అర్థనిర్ణయము కలుగును. అది సహజము, సముచితమును.

3. అర్థము వలన : అర్థమనగా ప్రయోజనము. ఇదియు అర్థమును నిర్ణయించును. 'స్థాణుం భజ భవచ్ఛిదే' (భవచ్ఛిదే=సంసారము నశించుటకు, స్థాణుమ్= స్థాణువును, భజ = సేవింపుము) అన్న వాక్యములో స్థాణుశబ్దమునకు పరమశివుడనియే అర్థమును చెప్పవలెను. అతడే సంసారమును నశింపజేసి, మోక్షమును ఈయగలవాడు. అంతే గాని స్థాణు వనగా 'కఱ్ఱమొద్దు'అని అర్థము కానేరదు. నిఘంటువులో మాత్రము స్థాణుశబ్దము నకు రెండర్థములును కనిపించును. కాగా ప్రకృతప్రయోజనమును బట్టి శబ్దార్థమును నిర్ణయించుకొనవలెను.

4. ఔచిత్యమువలన : 'ఉచితస్యభావః = ఔచిత్యమ్ =తగిఉండుట లేక పొసగుట. 'పాతు వో దయితాముఖమ్' (దయితాముఖమ్ = ప్రియురాలి అభిముఖ్యము, వః = మిమ్ము, పాతు=రక్షించుగాక!) ఇచట ముఖశబ్దమునకు కేవలము 'మోము' అని

అర్థము కాదు. 'ప్రియురాలి అభిముఖ్యము లేక అనుకూల్యము' అని అర్థము. 'కాముకులను రక్షింపగలది ప్రియురాలి ఆనుకూల్యమే' అను ఔచిత్యము ననుసరించి ఈ నిర్ణయము పర్యవసించును.

5. దేశమువలన : 'వైకుంఠే హరిః వసతి' (వైకుంఠే=వైకుంఠమందు, హరిః = హరి, వసతి = నివసించును) హరిశబ్దమునకు విష్ణువు, ఇంద్రుడు, గుర్రము, కప్ప, మొదలగు ఎన్నో అర్థములను కోశములు చూపును. అయినను ఈ వాక్యమున వైకుంఠమను పురాణప్రసిద్ధమైన ప్రదేశము హరిశబ్దమునకు విష్ణువని అర్థమును చెప్పుటలో ఉపకరించును.

6. కాలమువలన : 'దివా చిత్రభానుః విభాతి' (దివా = పగటియందు, చిత్రభానుః=సూర్యుడు, విభాతి = ప్రకాశించును) ఈ వచనమున 'దివా' అని సమయమును చెప్పుట, చిత్రభానుశబ్దమునకు 'సూర్యు' డను అర్థమును నిర్ణయించుటలో సాయపడును. ఈ వాక్యమునే 'రాత్రౌ' అను పదముతో విన్యసించినచో, చిత్రభాను శబ్దమునకు 'అగ్ని' అని అర్థమును చెప్పవలెను. (చిత్రాః భానవః యస్యసః=చిత్రమైనకాంతులుకలవాడు—లేక—కిరణములు గలవాడు) ఈ శబ్దమునకు సూర్యుడు, అగ్ని అను రెండర్థములును ఉన్నవి.

ఇట్లు సౌకర్యముకొరకై లోకవ్యవహారమందలి ఉదాహరణములు మాత్రమే చూపబడినవి. వ్యాకరణము, తర్కము, మీమాంస, మొదలగు శాస్త్రములతో గూడ వీనికుదాహరణములను చూపవచ్చును. కాని అవి మిక్కిలి గహనములుగా (సులభముగా తెలియశక్యము కానివిగా) ఉండును. అందుచే వానిని విడచుట జరిగినది.

'అట్టి శబ్దార్థ నిర్ణయోపాయములను కొందరు పండితులు ఇదివరకేచెప్పియున్నారు' అను అంశమును విశదీకరించుచున్నాడు.

సంసర్గో విప్రయోగశ్చ సాహచర్యం విరోధితా
అర్థః ప్రకరణం లింగం శబ్దస్యాऽన్యస్య సన్నిధిః . 315

సామర్థ్య మౌచితీ దేశః కాలో వ్యక్తిః స్వరాదయః
శబ్దార్థ స్యానవచ్ఛేదే విశేషస్మృతిహేతవః . 316

సంసర్గః=కలయిక, కూడిక, లేక-ఏదో ఒక సంబంధము, విప్రయోగః = విడివడుట, వేరుగా ఉండుట, సాహచర్యమ్=ప్రసిద్ధమైన మైత్రి, విరోధితా=ప్రసిద్ధమయిన శత్రుత్వము, అర్థః=ప్రయోజనము (అనుకొన్న ఫలము), ప్రకరణమ్ = సందర్భము, లింగమ్ = చిహ్నము (ఒక వస్తువునకుండు ప్రత్యేకమైన ధర్మము—లేక—ముఖ్యమైన గుణము), అన్యస్య=మరియొక, శబ్దస్య = శబ్దముయొక్క (పదము యొక్క), సన్నిధిః = సామీప్యము (దగ్గరగా ఉండుట)—

సామర్థ్యమ్ = శక్తి, అనుకొన్న అర్థమును ఈయగల శక్తి (సమర్థస్యభావః = సామర్థ్యమ్ = తగినబలము), ఔచితీ = తగిఉండుట (ఔచిత్యము), దేశః=ప్రదేశము (చోటు), కాలః = సమయము, వ్యక్తిః = స్త్రీ లింగము, పుంలింగము, నపుంసకము అను లింగము, స్వరాదయః = ఉదాత్తము మొదలగు స్వరము (లేక-ప్రశ్నను, వెక్కిరింతను,

హాస్యము మొదలగు భావములను స్ఫురింపజేయుచు, శబ్దమును పలుకుటలో వినబడు "కాకువు" మొదలగు స్వరము)—ఈ మొదలగునవి, శబ్దార్థస్య = శబ్దమునకు సంబంధించిన అర్థము యొక్క, అనవచ్ఛేదే = సంశయమందు (అవచ్ఛేదః = నిశ్చయము, న + అవచ్ఛేదః = సంశయము), విశేషస్మృతిహేతవః = నిశ్చితమైన అర్థమును తెలియజేయుటలో కారణములు (అగును).

తా. లోకవ్యవహారమందు, పురాణాదులందును మిక్కిలి ప్రసిద్ధములైన సంబంధము, మైత్రి, విరోధము, మొదలగు అంశముల సాయముతో గూడ శబ్దము యొక్క అర్థమును నిశ్చయించుటకు వీలగును. కొండొకచో ప్రక్కనుండు శబ్దము, శబ్దముయొక్క శక్తి, శబ్దము యొక్క లింగము మొదలయినవి కూడ అర్థనిర్ణయమున ఉపకరించును.

వి. ఉదాహరణముల మూలముగా సంయోగాదులను సుఖముగ తెలిసికొనవచ్చును.

1. సంయోగము : "సశంఖచక్రో హరిః" (శంఖచక్రములుగల హరి)హరి శబ్దమునకు ఇంద్రుడు, కోతి, గుర్రము, మొదలగు చాలా అర్థములున్నవి. అయినను శంఖచక్రములతో సంబంధముగల వ్యక్తి విష్ణువొక్కడే. కాన ఆసంబంధమువలన (సంయోగమను సంబంధము) ఇచట హరిశబ్దమునకు విష్ణువనియే అర్థము ఫలించును. (మిగిలిన అర్థములు పొసగవు).

2. విప్రయోగము : "సః రాజా అశంఖచక్రో హరిః" (ఆరాజు శంఖచక్రములు లేని హరి) అనుచుటచే శంఖచక్రముల వియోగము కూడ హరి శబ్దమునకు "విష్ణువు" అను అర్థమును నిశ్చయించును. శంఖచక్రములతో కలిసి ఉండుటగాని, వానిని విడిచి ఉండుటగాని విష్ణువునకే చెల్లుననుట పురాణములలో ప్రసిద్ధమైన విషయము.

3. సాహచర్యము : "తౌ రామలక్ష్మణౌ ఇవ దృశ్యేతే"(వారిరువురు రామలక్ష్మణులవలె అగపడుచున్నారు) రామ శబ్దమునకు శ్రీరాముడు, బలరాముడు, పరశురాముడు అను అర్థములు ప్రసిద్ధములు. అయినను లక్ష్మణునితో సాహచర్యము (కలసి మెలసి ఉండుట) శ్రీరామునకే మిక్కిలి రూఢమై ఉన్నది. అందువలన ఇచట రామశబ్దమునకు శ్రీరామః డనియే అర్థము.

4. విరోధిత : "రామార్జునగతిః తయోః"(వారిద్దరి నడవడి రామార్జునులను పోలిఉన్నది) ఇచట రామశబ్దమునకు పరశురాముడనియు, అర్జున శబ్దమునకు కార్తవీర్యార్జునుడనియు అర్థములు. వారికుండు ప్రసిద్ధ వైరమునుబట్టి ఈ నిర్ణయము సిద్ధించును.

5. అర్థము, 6. ప్రకరణము : ఈ రెండింటి స్వరూప స్వభావములును మీది కారికలో (814) వివరింపబడినవి.

7. లింగము : ఒక వ్యక్తికి గాని, ఒక వస్తువునకు గాని ఉండు ప్రత్యేకమైన ధర్మమును లేక గుణమును లింగమందురు. అనగా శబ్దముయొక్క నానార్థములలో ఏదో ఒక అర్థమందే కుదురునట్టి విశేషధర్మము. ఇది ఇతరములగు అర్థములకు పొసగకుండ ఉండవలెను. ఇదియు అర్థమును నిర్ణయించును. "కుపితః మకరధ్వజః" (మన్మథుడు కోపగించెను) ఇచట "కోపము" అను ధర్మము మన్మథునికే కుదురును కాన 'మకరధ్వజ' శబ్ద

మునకు మన్మథుడని అర్థమును నిర్ణయింపవలెను. ఆ శబ్దమునకు "సముద్రము" అను వేరొక అర్థమున్నది. అయినను 'కోపము' అను లక్షణము సముద్రునకు సంభవింపదు.

8. శబ్దాంతర సాన్నిధ్యము : 'కరేణ రాజతే నాగః' (ఏనుగుతొండముచే భాసిల్లుచున్నది) ఇచట కర శబ్దము నానార్థకము. (కరః=చేయి, తొండము, పన్ను అని అర్థములు) నాగశబ్దము కూడ అట్టిదే. (నాగః=ఏనుగు, పాము, నాగజాతికిచెందిన వ్యక్తి, అని అర్థములు) అయినను ఈ శబ్దములు ఒకదానిప్రక్కను వేరొకటిగ ప్రయోగింపబడి నందున, కరశబ్దమునుబట్టి నాగశబ్దముయొక్క అర్థము 'ఏనుగు' అని,నాగశబ్దము ననుసరించి కరశబ్దముయొక్క అర్థము 'తొండము' అనియు ఫలించును. అనగా పదముల సామీప్యమే ఇట్టి చోట్ల అర్థమును నిర్ణయించునని భావము.

9. సామర్థ్యము : అనుకొన్న అర్థమును చెప్పగలుగు శక్తిని సామర్థ్య మందురు. 'మధునా మత్తః కోకిలః' (మధుమాసముచే కోకిల కైపెక్కినది) ఇచట మధు శబ్దమునకు చైత్రమాసము తేనె, మద్యము, అను అర్థము లున్నవి. అయినను కోకిలకు సహజముగ కైపెక్కించగలది చైత్రమాసమొక్కటే కాన మధుశబ్దమునకు చైత్రమాస మనియే అర్థమును చెప్పవలెను. (మిగిలిన అర్థములకు అట్టి శక్తి లేదు).

10. ఔచిత్యము, 11. దేశము, 12. కాలము : వీని లక్షణములు, ఉదాహరణములును మీదికారికలో ఉన్నవి.

13. వ్యక్తి : శబ్దముయొక్క లింగమే (స్త్రీ లింగము, పుంలింగము, నపుం సక లింగము) వ్యక్తి అనబడును. 'మిత్రం భాతి' (స్నేహితుడు ప్రకాశించుచున్నాడు) ఇచట మిత్రశబ్దమునకు 'స్నేహితుడు' అని అర్థము. సూర్యుడని కాదు. 'మిత్రః భాతి' (సూర్యుడు ప్రకాశించుచున్నాడు) ఇచట మిత్రశబ్దము సూర్యునిమాత్రమే బోధించును. మిత్రశబ్దము యొక్క లింగము నపుంసకమైనచో 'స్నేహితుడు' అనియు, పుంలింగమైనచో 'సూర్యుడు' అనియు అర్థములను నిర్ణయింపవచ్చును. ఇట్లే 'నభస్' అను సకారాంతశబ్దము నపుంసక మైనచో 'ఆకాశము' అని అర్థము. పుంలింగమైనచో 'శ్రావణమాసము' అని అర్థము.

14. స్వరము : ఉదాత్తము, అనుదాత్తము, స్వరితము అను స్వరములతో అర్థనిర్ణయమును వేదమందు చేయుదురు. 'ఇంద్రశత్రుః వర్ధస్వ'—ఇచట 'ఇంద్రశత్రుః' అను సమాసములో చివరను ఉదాత్తస్వరమును పలికినచో 'ఇంద్రుని చంపునది' (షష్ఠీతత్పురుష సమాసము) అను అర్థమువచ్చును. అట్లుకాక మొదటివర్ణమును ఉదాత్తముగ పలికినచో 'ఇంద్రుడే (తనను) చంపునట్టి' '(బహువ్రీహిసమాసము-ఇంద్రః, శత్రుః = శాతయితా యస్యసః = ఇంద్రశత్రుః—ఇంద్రునిచే చంపబడువాడు)' అను అర్థమువచ్చును. ఇచట శత్రు శబ్దము, 'ద్వేషి' అను సామాన్యార్థమునుగాక, 'చంపువాడు' అను విశేషార్థమును బోధించు నదిగ ప్రయోగింపబడినది. ('శత్' అను ధాతువునకు 'చంపుట' అనునది సహజమైనఅర్థము). పై వాక్యమును వృత్రాసురుడు, ఒక అస్త్రమును ఇంద్రునిపై విడుచుచు పలికెననియు, అది ఎదురుతిరిగి తననాశమునకే దారితీసెననియును గాథ కలదు.

వివిధములగు స్వరములతో (నొక్కిపలుకుట, తేల్చిపలుకుట, సాగదీసి పలుకుట, ప్రశ్నార్థకముగా కాని, అపహాసార్థకముగా కాని పలుకుట మొదలగు ధ్వనిభేదములు) శబ్ద

ముల అర్థములు మారుచుండుట అనుభవసిద్ధమే. ప్రశ్నార్థకమైన స్వరమును సంస్కృతమున సామాన్యముగా 'కాకుస్వరము' అందురు. 'ఆగచ్ఛతి' అనుపదమును ఏ స్వరములేకుండ పలికినచో 'వచ్చుచున్నాడు' అని అర్థము. కాకుస్వరముతో పలికినచో 'వచ్చుచున్నాడా?' అను అర్థమువచ్చును.

15. స్వరాదయః : అనుచోట 'ఆది' (మొదలగునవి) అను పదమువలన అభినయము, చేష్ట, మొదలగు ఇతరసాధనములను గ్రహింపవలెను. అవియు కొన్నిచోట్ల శబ్దార్థమును నిర్ణయించును.

శబ్దముయొక్క అర్థమును నిర్ణయించుటకు చాలా ఉపాయములున్నవని చెప్పుటలో పూర్వుల సమ్మతికూడ ఉన్నదని విశదీకరించుటకై ఈ రెండు కారికలును బయలు దేరినవి. కొన్నిచోట్ల ఈ పరికరములలో ఒకదానినిగాని, రెండుమూడింటిని గాని సహాయముగా తీసుకొని అర్థమును నిశ్చయించుకొనవచ్చును. ఆవశ్యకతనుబట్టి ఆయా సందర్భములలో ఆయా ఉపాయములను అవలంబించవలెను.

శబ్దముయొక్క ముఖ్యమగు అర్థమును ("అభిధ" అను వ్యాపారమువలన సాంకేతికముగా వచ్చునది) నిర్ణయించుటకే పై ఉపాయములు తోడ్పడును. లక్ష్యార్థము ("లక్షణ" అను వ్యాపారమువలన సిద్ధించు అర్థము), వ్యంగ్యార్థము (వ్యంజన అను వ్యాపారమువలన లభించునది) అను వానివిషయములో వీని ఉపయోగము లేదు.

అర్థము, లింగము, సామర్థ్యము, అను వానివిషయములో వేరొకవిధమైన వ్యాఖ్యానము కూడ ఉన్నది. సందర్భమున ననుసరించి దానిని స్వీకరింపవచ్చును.

1. అర్థము : అనగా ఒక శబ్దముయొక్క నిశ్చితమైన అర్థము. దానిని బట్టి దానితో అన్వయముగల మరియొక శబ్దముయొక్క అర్థమును నిశ్చయించుట కూడ ఒక పద్ధతియే. ఉదా :- "అంజలినా జుహోతి"- ఇచట "జుహోతి" అను పదమునకు "హోమము చేయవలెను'' అని అర్థము. దీనినిబట్టి "అంజలినా" అనుపదమునకు "దోసిలితో" అను అర్థమును నిశ్చయింతురు. 'అంజలినా సూర్య ముపతిష్ఠతే' అను వాక్యములో 'ఉపతిష్ఠతే' అను శబ్దమునకు 'ప్రార్థింపవలెను' అని అర్థము. దీనిని అనుసరించి 'అంజలినా' అను పదమునకు 'నమస్కారముతో=రెండుచేతులను జోడించుటతో' అను అర్థమును నిశ్చయింపవలెను.

2. లింగము : ఒక వాక్యములోని పదముయొక్క అర్థమును నిర్ణయించుటకు, వేరొకవాక్యములోని ఒక పదము (దాని అర్థము) సూచకముగ ఉపయోగించుట లింగమగును. ఉదా :- 'పశు మాలభేత' (యాగములో పశువును చంపవలెను) ఇది శ్రౌతకర్మకు సంబంధించిన వచనము. ఇచట 'పశు' శబ్దమువలన 'ప్రాణి ఏదయినాసరే' అను సామాన్యార్థము స్ఫురించును. కాని అది సరికాదు. 'ఛాగస్య హవిషః వపాయాః మేదసః' అను వేరొక వాక్యములోని 'ఛాగస్య' అను పదము సూచకముగ ఉపయోగించి, పశువనగా 'ఛాగమే' (మేక) అని నిశ్చయింపనగును. 'మేకయొక్క వపను (గుండెలోని సన్నని చర్మపు పొరను) హవిస్సుగా చేయవలెను' అని పైవాక్యముయొక్క భావము. సూచకము జ్ఞాపకము, లింగము, అను పదములు సమానార్థకములు.

౬. సామర్థ్యము : 'ఒక శబ్దమునకు ఒక విధమైన అర్థమును చెప్పక తప్పదు' అను స్థితి ఏర్పడుటయే సామర్థ్యము. ఉదా :- 'అనుదరా కన్యా' (నాస్తి-ఉదరం-యస్యాః-సా = అనుదరా) ఇచట 'అనుదరా' అనుపదమునకు 'సన్నని నడుముగలది' అను అర్థమును చెప్పక తప్పదు. 'నడుములేనిది' అనుట బొత్తిగా కుదరదు గదా!

మీదచూపిన ఉపాయములలో 'లింగము' 'సామర్థ్యము' అను రెండే ముఖ్యములని, మిగిలినవన్నియు వానిలో అంతర్భూతములగుననియు కొందరందురు. 'సామర్థ్యము ఒక్కటే చాలును-మిగిలినవి దాని వివరణములు మాత్రమే' అని మరికొందరు. ఈ వాదోపవాదములను ఉద్గ్రంథములలో చూడనగును.

'అనేకార్థస్థలములలో-అర్థభేదమునుబట్టి శబ్దభేదమును అంగీకరింపవలెను'- అను భేదపక్షమందు కూడ, మీదచూపిన ప్రకరణాద్యుపాయములు ఆవశ్యకములే అని చెప్పుచున్నాడు.

భేదపక్షేఽపి సారూప్యా ద్భిన్నార్థాః ప్రతిపత్తిషు
నియతా యాంత్యభివ్యక్తిం శబ్దాః ప్రకరణాదిభిః. 317

భేదపక్షే + అపి = నానార్థక శబ్దములు పరస్పరము భిన్నములను మతమందు కూడ, సారూప్యాత్ = ఆకారము సమానముగా ఉండుటవలన, (శబ్దముల ఆకారము ఒకటే అగుటవలన 'వేరువేరు శబ్దములు కావు' అను భావన కలుగునుగాన) ప్రతిపత్తిషు=అర్థమును గ్రహించునపుడు, భిన్నార్థాః = వేరువేరు అర్థములను కలిగిన, శబ్దాః = శబ్దములు, ప్రకరణాదిభిః = ప్రకరణ, దేశ, కాలాదులచే, నియతాః = నియమింపబడినవై, అభివ్యక్తిమ్=అర్థనిర్ణయమును, యాంతి = పొందును.

తా. అనేకార్థక శబ్దములు పరస్పరము భిన్నములను పక్షమందుకూడ, అర్థమును నిశ్చయించుటకు ప్రకరణాదుల సాయము తప్పనిసరి అగును. ఏలయనగా- 'వేరువేరు' అని చెప్పినను శబ్దముల స్వరూపము ఒకటే అయినందున భ్రాంతికలిగి అర్థవిషయమున సందేహమేర్పడుచుండును. దానినివారించుటకు ప్రకరణాదులే శరణ్యములు.

వి. అనేకార్థక శబ్దముల విషయములో సంప్రదాయసిద్ధముగా రెండు మతములున్నవి. "అర్థము వేరయినపుడు దానిని బోధించు శబ్దముకూడ వేరే" అనునది మొదటి మతము. "ఎన్ని అర్థములున్నను శబ్దరూపమొకటి" అనునది రెండవమతము. మొదటి మతమును 'భేదపక్షము' అనియు, రెండవదానిని 'అభేదపక్షము' అనియు చెప్పుదురు. ఈ రెండిటిలో అభేదపక్షమందే అర్థ సంశయమునకు అవకాశము ఉండునని భావించి (శబ్దస్వరూపము ఒకటే కావున) 'ప్రకరణాదుల ఆవశ్యకత అచటనే' అని కొందరన వచ్చును. అది సరికాదు. భేదపక్షమున కూడ శబ్దముల ఆకారము (ఆనుపూర్వి = వర్ణక్రమము) ఒకటే అయినందున, అభేదభావన కలిగి తన్మూలముగా అర్థసంశయము కలుగక తప్పదు. దానిని పోగొట్టుటకు ప్రకరణాదులను ఆశ్రయింపక తీరదు.

'హరి' అను శబ్దమునకు మొత్తము పదిహేను అర్థములు నిఘంటువులో ఉన్నవని అనుకొందము. అపుడు భేదపక్షమున పదిహేను హరిశబ్దములున్నవని చెప్పవలెను; అభేదపక్షమున హరిశబ్దమొక్కటే అని, దాని అర్థములుమాత్రమే వేర్వేరుగ పదిహేను అనియు చెప్పవలెను. కాగా పదిహేను శబ్దములును విడివిడిగా ఉన్నందున భేదపక్షములో అర్థసంశ

యము కలుగదని, అభేదపక్షములోనే అట్టి సంశయము కలుగుననియు కొందరు భావింప వచ్చును. వారికిది సమాధానము: భేదపక్షములోగూడ 'హరి' శబ్దముయొక్క రూపమొక్క రీతిలోనే ఉండుటచే (పలుకుట, వినుట, వ్రాయుటయు ఒకే తీరులో జరుగును) 'శబ్దమొకటే' అను భ్రాంతి కలుగవచ్చును. దానివలన అర్థసంశయము ఏర్పడవచ్చును. తన్నివృత్తికై ప్రకరణాదులనే ఉపయోగింపవలెను. 'భేదాభేద పక్షములు రెండింటియందును అర్థమును నిర్ణయించు సాధనములు ప్రకరణాదులే' అని సారాంశము.

పై అభిప్రాయము సమంజసమని సహేతుకముగ నిరూపించుచున్నాడు.

నామాఖ్యాతసరూపా యే కార్యాంతరనిబంధనాః
శబ్దా వాచ్యాశ్చ తే ష్వర్థో న రూపా దధిగమ్యతే . 318

కార్యాంతర నిబంధనాః = వేరువేరు ప్రత్యయములతో వేరువేరు పద్ధతులలో ఏర్పడిన, నామాఖ్యాతసరూపాః = సుబంతములను పోలిన తిఙంతములు, తిఙంతములను పోలిన సుబంతములును అయిన, యే = ఏ, శబ్దాః = శబ్దములు, వాచ్యాః + చ = వాని అర్థములును కలవో, తేషు = అట్టి శబ్దముల విషయమున, రూపాత్ = కేవలము శబ్దస్వరూపమును బట్టి, అర్థః = అభిమతమైన అర్థము, న + అధిగమ్యతే = పొందబడదు.

తా. సంస్కృతభాషయందు కడు విచిత్రములైన శబ్దములు కొన్ని ఉన్నవి: అశ్వః, తేన, తస్య మొదలగునవి. ఇవి సుబంతములుగను (నామవాచకములు), తిఙంతములుగను కూడ (క్రియాపదములు) సాధుశబ్దములే. (అవి సిద్ధించిన తీరుమాత్రము వేరు) వానిని ప్రయోగించునపుడు 'అర్థమేదిః'. అను సందేహము కలిగితీరును. అది పోవుటకు ప్రకరణాదులసాయమును తీసుకొనక తప్పదు.

వి. అశ్వః = ఇది 'శ్వి' అను ధాతువుయొక్క (శ్వి = గతిసమృద్ధ్యోః-భ్వాది గణము - పరస్మైపది) భూతకాలమునకు సంబంధించిన (లుఙ్ అను లకారము) మధ్యమ పురుషైకవచనరూపము. 'వెళ్ళితివి' అని అర్థము, 'అశ్వ' శబ్దముయొక్క ప్రథమావిభక్తితో ఏకవచనరూపము కూడ ఇట్లే ఉండును. 'అశ్వః = ఒక గుర్రము' అని అర్థము. తేన = ఇది 'తను' ధాతువుయొక్క (తను = విస్తారే, తనాదిగణము - పరస్మైపది) లిట్టుకు సంబంధించిన (భూతకాలము) మధ్యపురుష బహువచనరూపము. 'మీరు వ్యాపించిరి' అని అర్థము. 'తద్' అను సర్వనామముయొక్క (పుంనపుంసకములు) తృతీయైకవచనముకూడ 'తేన' అనియే అగును. దీనికి 'వానిచే' - 'దానిచే' అని అర్థము. ఇట్లే 'తస్య' అనునది 'తసు' ధాతువుయొక్క (తసు = యత్నే, దివాదిగణము — పరస్మైపది) లోట్టుకు చెందిన (విధ్యర్థకము) మధ్యమ పురుషైకవచనము. 'తస్య = ప్రయత్నింపుము' అని అర్థము. 'తద్' అను సర్వనామముయొక్క (పుంనపుంసకములు) షష్ఠ్యేకవచనము కూడ 'తస్య' అనియే అగును. 'తస్య = వానియొక్క — దానియొక్క' అనియర్థము. ఇవి నానార్థకశబ్దములు కావు. వేరువేరుఅర్థములు కలిగిన సరూపములగు శబ్దములుమాత్రమే. కాగా 'త్వమ్ అశ్వః' (నీవు గుర్రము — లేక — నీవు వెళ్ళితివి) 'యూయం తేన' (మీరువ్యాపించిరి—లేక - మీరు వానితో) 'త్వం తస్య' (నీవు ప్రయత్నింపుము - లేక - నీవు వానియొక్క) మొదలగు ప్రయోగములలో అర్థసంశయ మందరకును కలుగును. అపుడు అర్థమును నిశ్చయించుటకు

ప్రకరణాదులే గతిఅగును. కావున అన్నిపక్షములందును ప్రకరణాదులను అంగీకరించుట యుక్తము.

ఒకటినిమించి రెండుగాని మూడుగాని అర్థములను బోధించుశబ్దములు సామాన్యముగ ప్రతిభాషలోను కనబడును. ఇట్టిచోట్ల శబ్దవ్యుత్పత్తిమాత్రము (శబ్దము ఏర్పడినతీరు) ఒకటేఅయిఉండును. వీని విషయములోనే 'భేదపక్షము, అభేదపక్షము' అను వాదములు కుదురును. అట్లుగాక వేర్వేరు అర్థములను బోధించుచు, ఒకే ఆకారములో ఉండు శబ్దములు కూడ భాషలలో ఉండుట సహజమే. ఇట్టిచోట్ల శబ్దము సిద్ధించినతీరు వేరుగాఉండును (ఒకటి సుబంతము, వేరొకటి క్రియాపదము మొదలగుతీరు). ఇవి సమానమైన ఆకారముగలవి మాత్రమే. వీని విషయములో భేదాభేదవాదములు కుదరవు. ఇట్టిశబ్దములవిషయములో అర్థనిర్ణయమునకు ప్రకరణాదు లావశ్యకము కాక తప్పవు. కాగా అన్నిపక్షము లందును సంప్రదాయసిద్ధముగా వచ్చుచున్న ప్రకరణాది సామగ్రిని స్వీకరించుటయే సముచితము.

ప్రసంగవశమున ప్రారంభమైన ప్రకరణాదుల చర్చ ఈ కారికతో ముగిసినది.

శబ్దార్థములను నిర్ణయించు సందర్భమును పురస్కరించుకొని, ''వాస్తవమున పద పదార్థములు సత్యములు కావనియు, అఖండవాక్య వాక్యార్థములే సత్యము లనియును అంగీకరింపక తప్ప''దని వివరించు ప్రఘట్టకమును ప్రారంభించుచున్నాడు.

యా ప్రవృత్తినివృత్త్యర్థా స్తుతినిందాప్రకల్పనా
కుశలః ప్రతిపత్తా తా మయథార్థాం ప్రతీయతే. 319

ప్రవృత్తినివృత్త్యర్థా = ప్రవృత్తినివృత్తులే ప్రయోజనముగాగల, స్తుతి నిందా ప్రకల్పనా = స్తోత్రమును నిందను చేయు వాక్యముల కల్పనము, యా = ఏదిగలదో, తామ్ = దానిని, కుశలః = నేర్పరియగు, ప్రతిపత్తా = జ్ఞాత-లేక - తెలిసికొనువ్యక్తి, అయథార్థామ్ = అసత్యముగ, ప్రతీయతే = గ్రహించును.

తా. ఏదైన ఒకపనిని చేపట్టుటను ('ఈపని చేయుము' అనుట) ప్రోత్సహించుటకై ఆ పనిని వివిధ వచనములతో పొగడుట, వేరొకపనినుండి మరల్చుటకు ('ఈపని చేయవద్దు' అనుట) ఆపనిని మరొకరీతిలో దూషించుటయు జరుగును. ఇట్టిరీతి శాస్త్రములందును, లోకవ్యవహారములందును అనూచానముగ(సంప్రదాయసిద్ధముగా) కనబడుచున్నది. అయినను తెలివిగలవా డాయంశమును గ్రహించి, అట్టి స్థలములలో ప్రవృత్తి నివృత్తులే ముఖ్యముగ ఉద్దేశింపబడినవని, స్తుతి నిందలు వాస్తవములు కావనియు సమన్వయించుకొనును.

వి. ప్రవృత్తి=ఒక పనిని చేయ తలపెట్టుట. నివృత్తి=ఒకపనిని మానదలచుట. స్తుతి=పొగడ్త (పొగడు వాక్యము). నింద = తెగడుట (తెగడు వాక్యము). ఒక పనిచేయుట యందు ఉత్సాహమును కలిగించుటకై ఆ పనిని విశేషవచనములతో పొగడుదురు. అట్లే ఒక చెడ్డ పనినుండి మరల్చుటకు ఆ పనిని పెక్కు మాటలతో దూషింతురు. ఈతీరు సహజము. అందు 'చేయుట' లేక 'మానుట' అను అంశములే ముఖ్యములనియు, భూషణ దూషణములు ముఖ్యము కావనియు పరిశీలకులు శీఘ్రముగ తెలిసికొందురు.

ప్రశంసకు ఉదాహరణము: 'గంగలో స్నానముచేసినచో సకలపాపములు నశించును. మోక్షము కలుగును.' ఇచట 'గంగలో స్నానముచేయుము' అను ఆశయమే ఉద్దిష్టముగాని మోక్షాది ప్రత్యేకసిద్ధి కాదు.

నిందకు ఉదాహరణము : 'సూర్యోదయమైన తరువాత మేల్కొన్నవానికి ఆయుర్దాయము క్షీణించును. నరకము వచ్చును.' ఇచట 'సూర్యోదయము అయిన పిదప నిద్రించుట కూడదు' అని చెప్పుటయే ఉద్దేశ్యము.

ఇట్లు ఒక వాక్యమువలనగాని, వాక్యసముదాయమువలనగాని తెలియు ప్రధానమైన భావమునే 'వాక్యార్థము' లేక 'తాత్పర్యార్థము' అని అందురు. అన్ని ప్రయోగములలోను ఇదియే వాస్తవమని ఎరుగవలయును.

ఇంతవరకు పదపదార్థములను నిర్ణయించు తీరులు వివరింపబడినవి. ఈ సందర్భములో 'అఖండమగు వాక్యము దాని అర్థము మాత్రమే సత్య' మని (వర్ణములు, పదములు మొదలగు ఎట్టి విభాగములు లేని వాక్యము) 'పదములయొక్కయు, పదార్థములయొక్కయు విభాగము సత్యమును తెలియుటకు ఉపయోగించు కల్పన మాత్రమే' అనియు ప్రసిద్ధమై ఉన్న వైయాకరణుల తత్త్వమును మరొకసారి నొక్కి చెప్పుటకు ఈ ప్రకరణ మారంభమైనది. స్తుతినిందా వాక్యములలో ప్రవృత్తినివృత్తులే సత్యమైనట్లు అఖండవాక్యమే సత్యమని చెప్పుట ఈ కారికయొక్క సారాంశము. రాబోవు కారికల మూలమున ఈ యంశ మింకను విశదము కాగలదు.

పై కారికయొక్క విషయమునే వివరించుచున్నాడు.

విధీయమానం యత్కర్మ దృష్టాదృష్ట ప్రయోజనమ్
స్తూయతే సా స్తుతి స్తస్య కర్తు రేవ ప్రయోజికా . 320

దృష్టాదృష్టప్రయోజనమ్ = కనబడునట్టియు కనబడనట్టియు ఫలముగలిగి, విధీయమానమ్ = విధింపబడుచున్న, యత్=ఏ, కర్మ=పని, స్తూయతే = పొగడబడునో, సా = ఆ, తస్య = ఆకర్మయొక్క, స్తుతిః=పొగడ్త, కర్తుః + ఏవ = చేయువానికే, ప్రయోజికా = ప్రోత్సాహమును కలిగించునది (అగును).

తా. లోకములోని పనులకు ఫలము కనబడును. వేదము విధించిన కర్మలయొక్క ఫలితము కన్నులకు గోచరము కాదు. 'ఈపని చేసినచో ఈ లాభము కలుగును' అని ప్రయోజనము నుద్దేశించి ప్రశంసను చేయుట అలవాటు అయినను అచట ఆ ప్రశంస ప్రధానము కాదు. కర్త ఆపనియందు సంతోషముతో చొరబడుటకే అది ఉపయోగించును.

వి. 'యో రాజానం భజతే స సారం భుంక్తే' (రాజును సేవించినవాడు ఐశ్వర్యమును పొందును) ఇది లౌకికమైన ప్రశంసావాక్యము. ఇచట 'రాజును సేవింపవలెను' అని సూటిగా చెప్పక, 'రాజసేవ సంపద నిచ్చును' అని రాజసేవను పొగడుట జరిగినది. రాజసేవవలన కలుగుఫలము కనబడునుగాన అది దృష్టప్రయోజనమైన కర్మ. 'యః అగ్నిష్టోమేన యజతే సః స్వర్గం గచ్ఛతి' (అగ్నిష్టోమమను యాగమునుచేయువాడు స్వర్గమును పొందును) ఇది వైదికవాక్యము. ఇచటకూడ 'అగ్నిష్టోమయాగమును చేయవలెను' అని చెప్పక, దాని ఫలమును చెప్పి ఆ యాగమును ప్రశంసించుట జరిగినది. స్వర్గమన్న ఫలము కనశక్యముకానిది. అందుచే అగ్నిష్టోమమను కర్మ అదృష్టప్రయోజనము. ఈ రెండుస్థలములందును ప్రశంసకు వేరుగా ప్రయోజన మేదియు లేదు. ఆయా కర్మలను చేయుటకు తగిన ప్రబలమైన కోరికను కర్తలో రేకెత్తించుటయే అద్దాని ముఖ్యోద్దేశము.

ప్రశంసావాక్యము అసత్యము. దానివలన పర్యవసించు ప్రవృత్తివాక్యమే సత్యము. అట్లే నిందాస్థలములలో నిందావచనము వాస్తవముకాదు. తుదకు ఫలించు నివృత్తివచనమే వాస్తవము. ఆయా వాక్యమువలన 'ఈ పనిచేయవలెను' లేక 'ఈ పని మానవలెను' అను రీతిలో ఏ విభాగము లేని ఒకవాక్యార్థము అవగతమగును (అవిభక్తమైన మొత్తము సారాంశము స్ఫురించును). అట్లే వ్యాకరణశాస్త్రము చూపు వర్ణములు, పదములు మొదలగు విభాగము లన్నియు కృతకములు, అఖండవాక్యమే యథార్థమైనది.

అట్టిచోటులందు, "స్పష్టముగ ప్రవృత్తి నివృత్తులనే విధించుట మానివేసి, ప్రయోజనరహితములగు స్తుతినిందాదులను ప్రదర్శించుట ఎందులకు ?" అను శంకకు సమాధానము చూపుచున్నాడు.

వ్యాఘ్రాదివ్యపదేశేన యథా బాలో నివర్త్యతే
అసత్యోఽపి తథా కశ్చిత్ ప్రత్యవాయో విధీయతే . 821

వ్యాఘ్రాదివ్యపదేశేన = పెద్దపులి మొదలగు జంతువుల పేర్లను చెప్పుటచే, బాలః= బాలుడు, యథా=ఏవిధముగా, నివర్త్యతే = మరలింపబడునో, తథా = ఆ విధముగనే, అసత్యః + అపి = వాస్తవముకానిదైనను ('అపి,' అనుటవలన కొన్నిచోట్ల సత్యమైనదైనను) కశ్చిత్ = ఒకానొక, ప్రత్యవాయః = అనిష్టము (దుఃఖము), విధీయతే = విధింపబడును.

తా. ఏడ్చుచున్నబాలుని భయపెట్టి ఏడుపును మానిపించుటకు, 'నీవు ఏడ్చినచో పులి వచ్చి నిన్ను తినివేయును' అని బెదరించుట లోకములో కానవచ్చును. ఆ సమయమున అచటికి పులివచ్చుట, తినుటయు అసత్యమే. కేవలము 'ఏడువవద్దు' అని చెప్పుటయే సత్యము (అభిమతము). అట్లే వేదములందు, ధర్మశాస్త్రములందును కొన్ని పనులను చేసినచో పాప మని, నరకము కలుగుననియు భయపెట్టుట జరుగును. కాని అచటకూడ 'ఆ పనులను చేయ వద్దు' అని నిషేధించుటయే ముఖ్యతాత్పర్యమని తెలియవలెను.

వి. 'విధిని (చేయుమనుట), నిషేధమును (చేయవద్దనుట) సూటిగా చెప్పక స్తుతి నిందలను కల్పించి ఆ భావమును వంకరగా ఎందుకు చెప్పవలసివచ్చును?' అను ప్రశ్న పుట్టు నని ఊహించి దానికి సమాధానముగా ఈ శ్లోకము బయలుదేరినది 'లోకవ్యవహారమువలె వేదవ్యవహారమందున్న ఒక పనియందు ప్రవర్తింపచేయుటనుగాని నివర్తింపచేయుటనుగాని చక్కగా నిర్వహించుటకు స్తుతినిందలను కల్పించుట అలవాటయిన ఒకతీరు. అట్టిచోట్ల వాస్తవమైన అంశమునే నేర్పుతో గ్రహింపవలెను. (అట్లే పదములయొక్క, పదార్థముల యొక్కయు కల్పనము, అఖండవాక్యము - అఖండవాక్యార్థము అను సత్యమును గ్రహించు టకే ఉపయోగపడును)' అని సారము.

ప్రత్యవాయః = అనర్థము—దుఃఖము. వేదమునందు, ధర్మశాస్త్రములందును చేయకూడని పనులను చేసినచో 'రౌరవం నరకం వ్రజేత్' (రౌరవమను నరకము పొందును) 'సాన్వయో వినశ్యతి' (వంశముతోకూడి నశించును) మొదలగు వచనములతో వివిధములైన ప్రత్యవాయములు చూపబడును.

ప్రత్యేకించి నిషేధముయొక్క సంగతినే ఈ కారిక వివరించినది. విధినిగురించి కూడ ఇట్లే ఊహించుకొనవలయును (స్తుతి వాక్యము సత్యముకాదు - విధియే సత్యము-అని).

శాస్త్రము చూపిన ప్రత్యవాయమునకు ఏదో విధముగ ప్రతిక్రియ నాచరించి, కేవలము అహంకారముతో శ్రేయస్కాముడు నిషిద్ధమైన కర్మలను చేయరాదని నిరూపించుచున్నాడు.

న సంవిధానం కృత్వాఽపి ప్రత్యవాయే తథావిధే
శాస్త్రేణ ప్రతిషిద్ధేఽర్థే విద్వాన్ కశ్చిత్ ప్రవర్తతే. ౩౨౨

తథావిధే=ఆ తీరుగ చూపబడిన, ప్రత్యవాయే=అనర్థము (పాపము) విషయమున, సంవిధానమ్=ప్రతిక్రియను (విరుగుడు), కృత్వా+అపి = చేసినను, శాస్త్రేణ=శాస్త్రముచే (వేదము - ధర్మశాస్త్రము మొదలగునవి) ప్రతిషిద్ధే=నిషేధింపబడిన, అర్థే = పనియందు, విద్వాన్ = పండితుడైనవాడు, కశ్చిత్ = ఎవడైనను, న + ప్రవర్తతే = ప్రవర్తింపడు.

తా. ప్రత్యవాయము స్పష్టముగచెప్పబడినను, 'ఆః దానికేమిః ఏదో ప్రతిక్రియనుచేసి ఆ నష్టము పోగొట్టుకొనవచ్చును లెమ్ము' అని అహంకారముతో నిషేధింపబడిన పనిని చేయుట విజ్ఞుల లక్షణము కాదు. వద్దన్న పనినిచేయుట, అందువలన కలుగు నష్టమునకు విరుగుడును ఆలోచించుటయు మంచినడవడి కానేరదు.

వి. సత్యాంశమును గ్రహించుటకు ప్రత్యవాయము కల్పింపబడునని మీదికారిక సూచించినది. 'ప్రత్యవాయము సత్యము కానిండు - లేక - అసత్యము కానిండు. అంత మాత్రమున దానిని పూర్తిగా తిరస్కరించుటగాని, ప్రతిక్రియపై దృష్టిపెట్టి నిషిద్ధమైన కర్మను మొండిగా ఆచరించుటగాని పండితునకు సముచితముకాదు' అని ఈ శ్లోకము వివరించినది.

కేవలము దృష్టాంతమును చూపుటకుమాత్రమే 'ప్రత్యవాయము కల్పితము' అని చెప్పబడినది. దీనినే ప్రమాణముగా తీసుకొని అహంకారముతోను, పట్టుదలతోను ఇష్టము వచ్చిన తీరులో శాస్త్రములను వ్యాఖ్యానింపకూడదు. స్తుతినిందల మూలముగా శాస్త్రమందలి సత్యమును గుర్తించి, తదనుసారము విహితకర్మను ఆచరించుట, నిషిద్ధకర్మను మానుటయు పండితుల ముఖ్యకర్తవ్యము. ఇదియే సంప్రదాయ రహస్యము.

మీది కారిక యొక్క భావమునే ఉదాహరణ పూర్వకముగ విశదీకరించుచున్నాడు.

సర్పేషు సంవిధాయాఽపి సిద్ధైర్మంత్రౌషధాదిభిః
నాఽన్యథా ప్రతిపత్తవ్యం "న దతో గమయే దితి". ౩౨౩

సిద్ధైః = ప్రసిద్ధములైన (స్వాధీనములోఉన్న), మంత్రౌషధాదిభిః = మంత్రములు, ఔషధములు మొదలగువానితో, సర్పేషు = పాముల విషయమున, సంవిధాయ + అపి = ప్రతిక్రియనుచేసినను, 'న - దతః - గమయేత్' ఇతి = 'న దతో గమయేత్' యద్దతో గమయేత్ సర్పాః ఏనం ఘాతుకాః భవంతి' (పురోడాశమును దంతములతో నమలకూడదు. అట్లు నమలినచో అతడు పాముకాటుకు గురి అగును - అనిభావము) అను శాస్త్రమునకు, అన్యథా = విపరీతముగ (చెప్పినదానికి భిన్నముగ), న + ప్రతిపత్తవ్యమ్ = (వ్యాఖ్యానము చేయకూడదు) ఆచరింపకూడదు.

తా. యజ్ఞములో దేవతలకై తయారుచేయు వరిపిండి ముద్దను పురోడాశమందురు. దానిని దేవతలకు నివేదించి యజమానుడు, ఋత్విజులును తిందురు. ఆ తిను

టనుగురించి ఒకనియమమును శాస్త్ర మీవిధముగా చెప్పినది :—'పురోడాశమును దంతములతో నమలకూడదు. నమిలినచో—నమిలినవానిని పాములు కరచును.' – అని ఇట్లు ప్రత్యవాయము స్పష్టముగఉన్నను – దానిని తిరస్కరించి, మంత్రములతోను, ఔషధములతోను పాములను దరిజేరకుండ చేసుకొని, పురోడాశమును దంతములతోనే నమలుట సముచితమైన పని కాదు.

వి. శాస్త్రమునకు ఈయదగిన గౌరవమును ఎల్లప్పుడును ఈయక తప్పదు. విధినిషేధములను శాస్త్రోక్తముగా ఆచరింపవలసినదే. వ్యక్తియొక్క స్వేచ్ఛకు, స్వాతంత్ర్యమునకును అచట చోటు లేదు. అట్లుకాకున్న శాస్త్రము నిరుపయోగమై విశృంఖలత్వమునకు రాజమార్గములు ఏర్పడును.

పురః = ముందుగా, దాశ్యతే = ఈయబడును (దేవతలకు) = పురోడాశః అని వ్యుత్పత్తి. ప్రత్యవాయము కల్పితమనుటవలన తుదకు శాస్త్రాతిక్రమణమే సంభవించునేమో అని సంభావించి, అది సరికాదని, శాస్త్రమును ఉల్లంఘింపకూడదనియు స్పష్టముగాచెప్పుటకై మీదికారిక, ఈ కారికయు వినియోగపడినవి. 'సత్యమును (తత్త్వమును) గ్రహించినవారు కూడ లోకసంగ్రహార్థము (సామాన్యజనులకు మార్గమును చూపుటకై) శాస్త్రమును అనుసరించుచునే ఉండవలయును' అన్నది ఇచట ముఖ్యాంశము.

"స్తుతినిందలే వాస్తవముగ కనబడు స్థలములందు కూడ, తుదకు ప్రవృత్తినివృత్తులే తాత్పర్య విషయములని ఫలించును" అని సమర్థించుచున్నాడు.

క్వచిత్తత్త్వసమాఖ్యానం క్రియతే స్తుతినిందయోః
తత్రాఽపిచ ప్రవృత్తిశ్చ నివృత్తిశ్చోపదిశ్యతే. 824

స్తుతినిందయోః = ప్రశంసయొక్క, దూషణముయొక్కయు, తత్త్వసమాఖ్యానమ్ = సత్యత్వమునుచెప్పుట (అవియే సత్యములనుట), క్వచిత్ = కొన్నిచోట్ల, క్రియతే = చేయబడును. తత్ర + అపి + చ = అచటకూడ, ప్రవృత్తిః + చ = ప్రవర్తించుటయు, నివృత్తిః + చ = నివర్తించుటయు, ఉపదిశ్యతే = చెప్పబడును

తా. కొన్నిచోట్ల విధినిగాని, నిషేధమునుగాని, కొంచెమైనను సూచింపక, ఒక విషయమును పొగడుటయో తెగడుటయో కనిపించును. అట్టి స్థలములలో స్తుతినిందలే ప్రముఖములని, సత్యములనియు తోపవచ్చును. కాని అచటకూడ పర్యవసానమున (చివరను) విధియో నిషేధమో ఏదో ఒకటి గమ్యముకాక తప్పదు. ఆ అంశమునే సత్యముగా గ్రహింపవలెను. విధినిషేధములను సూచింపకున్నట్టి స్తుతినిందలు నిష్ప్రయోజనములగునుగాదా :

వి. పురాణాదులందు భగవంతుని స్తోత్రములు కొల్లలుగా ఉండును. దురాచారులను దూషించుటయు అధికముగనే అగపడును. అట్టిచోట్ల స్తుతియు, నిందయు మాత్రమే ప్రధానములని, వానివలన తెలియదగు విధినిషేధములు లేవనియు పై పైని అనిపించును. (స్తుతి స్తుతికొరకే, నింద నిందకొరకే అనుకొనుట) కాని సూక్ష్మముగ పరిశీలించినచో 'దేవుని సేవింపవలెను' 'చెడ్డపనులను చేయరాదు' అనురీతిని విధినిషేధములే అచటకూడ ఫలించును. ఏలయనగా విధిని చెప్పనిస్తుతియు, నిషేధమును బోధింపని నిందయు వ్యర్థప్రసంగములగును.

లోకములోగాని శాస్త్రములోగాని స్తుతినిందావాక్యములు అప్రధానములు. వానివలన తెలియు విధినిషేధవాక్యములే ప్రధానములు. అట్లే వ్యాకరణమున వివరింపబడు పద

ములయొక్కయు, పదార్థములయొక్కయు ఉనికి అసత్యము-కాల్పనికము. అఖండవాక్యము, అఖండవాక్యార్థము మాత్రమే యథార్థములు. ఈ అంశములను గట్టిగాచెప్పుటకే 'యా ప్రవృత్తినివృత్త్యర్థా స్తుతినిందాప్రకల్పనా' (319) అను కారిక మొదలుకొని ఈకారికవరకును చర్చసాగినది. 'అఖండవాక్యమే సత్య' మను వైయాకరణతత్త్వమును సమయమువచ్చినపు డెల్ల, గ్రంథకర్త తరచుగా ఏదోఒక పద్ధతిలో నిరూపించుచునే ఉండును. సందర్భాను సారముగా సిద్ధాంతమును నొక్కిచెప్పుటలో పునరుక్తిదోషము సంభవింపదు.

ఇట్లు పదపదార్థములు అసత్యములనియు, అఖండవాక్య వాక్యార్థములే సత్యముల నియు నిశ్చయించి, పదార్థముల ఉనికికి వాక్యార్థమే మూలమని ప్రతిపాదించుచున్నాడు.

రూపం సర్వపదార్థానాం వాక్యార్థోపనిబంధనమ్
సాపేక్షా యే తు వాక్యార్థాః పదార్థై రేవ తే సమాః.　　　325

సర్వపదార్థానామ్ = అన్నివిధములయిన పదములయొక్కయు వాని అర్థముల యొక్కయు, రూపమ్ = స్వరూపము - లేక - ఉనికి, వాక్యార్థోపనిబంధనమ్ = క్రియప్రధా నముగాగల వాక్యార్థమే నిమిత్తముగాగలది (వాక్యార్థమున అన్వయముగలవై దానియొక్క అంతర్భాగములు అనిపించుకొనునుగాని వేరుగ వానికి ఉనికి ఉండదు) (భవతి = అగును.) సాపేక్షాః = ఒకదానినొకటి కోరుకొను, (పరస్పరము సంబంధముగల), యే = ఏ, వాక్యార్థాః + తు = చిన్నచిన్నవాక్యముల అర్థములుగలవో, తే = అవి, పదార్థైః + ఏవ = పదార్థములతోనే, సమాః = సమానములయినవి, (భవంతి = అగును).

తా. సంపూర్ణమైన ఒకవిషయమును వాక్యార్థముమాత్రమే అందజేయును. పర స్పరము అన్వయముకలిగి, విశేషణ విశేష్యభావమును పొంది, ప్రధానమైన క్రియతో అన్వ యించునట్టి అఖండసముదాయరూపమైన భావార్థమును వాక్యార్థమందురు. (దానిని బోధించు నది అఖండవాక్యము) వాక్యార్థముతో అన్వయము కలిగిఉండునవి పదార్థములు. (పదార్థమును అందించునది పదము) వాక్యార్థమును బట్టియే పదార్థముల ఉనికి సిద్ధించును. అదిలేకుండా స్వతంత్రముగ పదార్థములు ఉండజాలవు. రాముడు, గుర్రము, తినెను, మొదలగు విడివిడి పదార్థములవలన ఎట్టి జ్ఞానమును కలుగదుగదా! ఒకవాక్యార్థమున అన్వయము కలిగినపుడు అవి సార్థకములగును. లేకున్న వ్యర్థములగును. కాగా వాక్యార్థము లేకున్నచో, పదార్థము లేనేలేదు. (సౌకర్యముకొరకు పదార్థములను కల్పించుట జరుగును). అట్లే చిన్నచిన్న వాక్య ముల అర్థములుకూడ పదార్థములవంటివే. అనగా చిన్నచిన్న అవాంతరవాక్యములు ఒక దానితో వేరొకటి సంబంధము కలిగి, పెద్దవాక్యముగాఏర్పడిన స్థలములలోకూడ - ఆ పెద్ద వాక్యముయొక్క అఖండార్థమునుబట్టియే అవాంతరవాక్యార్థముల ఉనికి సిద్ధించును. మహా వాక్యార్థములోని అవాంతర వాక్యార్థములు, వాక్యార్థములోని పదార్థములును సమానప్రతిపత్తి కలవే అగును.

వి. "రామః సీతాం పర్యణయత్" (రాముడు సీతను పెండ్లియాడెను) ఇదొక చిన్నవాక్యము. ఇందలి పదములకు పరస్పరము సంబంధము లేకున్నచో భావార్థము తెలి యదు. అట్టి సంబంధమునే ఆకాంక్ష లేక అపేక్ష అందురు. ఆసంబంధమువలన 'వివాహము చేసికొనుట క్రియ, అందులో రాముడు కర్త, సీత కర్మ' అని తెలిసి తాత్పర్యార్థము బోధ

పడును. అట్టి అర్థమే వాక్యార్థము. అది అఖండము. (అవయవముల విభాగము తెలియని ఏకాకారజ్ఞానము). అది పానకమువంటిది. (నీరు, చక్కెర, సుగంధ ద్రవ్యములును కలిసిన పానకములో పదార్థములకు విడివిడిగా ఉనికి ఉండదు.) ఆ వాక్యార్థమును ఆధారముగా పెట్టుకొనియే పదార్థములను ఊహించుటకు అవకాశము కలుగుచున్నది. ఇట్లే 'రామః విశ్వామిత్రేణ సహ వనం జగామ. సః తత్ర తాటకాం జఘాన. క్రమేణ మిథిలాం గత్వా తత్ర సీతాం పర్యణయత్' (విశ్వామిత్రునివెంట రాముడు అడవికి వెళ్లెను. అతడచట తాటకను చంపెను. క్రమముగా మిథిలానగరమునకు చేరి అచట సీతను పరిణయమాడెను) మొదలగు కథా సంవిధానమును వర్ణించు చిన్న చిన్న వాక్యములు వాని అర్థములును పరస్పరము సంబంధమును (అన్వయము) పొంది మహావాక్యముగా (మహావాక్యార్థముగా) ఏర్పడును. అచటకూడ మహావాక్యార్థములో అన్వయించు అవాంతర వాక్యార్థములు, చిన్న వాక్యార్థములోని పదార్థములవంటివే. వానికి స్వాతంత్ర్యము కుదరదు. మహావాక్యార్థమే వానికి ఉనికిని ప్రసాదించును. ఇదే తీరులో ఒక పెద్ద గ్రంథమునుగురించియు చెప్పవచ్చును. గ్రంథము మొత్తముపై ఏర్పడు తాత్పర్యము మహావాక్యార్థము. గ్రంథములోని ఇతర వాక్యముల అర్థములన్నియు పదార్థములే అగును.

భాషలో వాక్యమే సహజము. అదియే సమగ్రమైన భావమును అందించును. సౌకర్యముకొరకై పదములను కల్పింతుము. ఒక వాక్యములోని పదములు, వాని అర్థములును పరస్పరము సంబంధము గలవై, తుదకు ప్రధానమైన క్రియతో అన్వయించును. అట్టి వాక్యము వలన కలుగు బోధ (జ్ఞానము) లో క్రియయే ముఖ్యమైనది. మిగిలిన పదార్థములన్నియు ఆ క్రియకు విశేషణములుగా అన్వయించును. 'రామః సీతాం పర్యణయత్' అను వాక్యమువలన, 'రాముడు కర్తగను సీత కర్మగను ఉన్న జరిగిపోయిన పెండ్లి అను వ్యాపారము' అను సంపిండితార్థము లభించును. ఏ వాక్యమునైనను గ్రంథమునైనను ఈవిధముగనే విశ్లేషించుకొనవలెను. ఈ పద్ధతిచే 'శాబ్దబోధ' (శబ్దమువలన కలుగు సామూహికమైన అర్థమును తెలిసికొనుట) అందురు. క్రియయే విశేష్యముగా ఉండు శాబ్దబోధ వైయాకరణులకు అభిమతము. అవాంతరవాక్యార్థములు కూడ మహా వాక్యార్థమునకు సంబంధించిన పదార్థములే. కాగా 'వాక్యార్థమందు పదార్థములు, మహావాక్యార్థమందు అవాంతర వాక్యార్థములును స్వతంత్రములు కావు. అఖండవాక్యము, అఖండవాక్యార్థము మాత్రమే పరమార్థమున సత్యములు' అని సారాంశము.

పరిపూర్ణార్థమును సమర్పించు ఒకే ఒక పదమైనను కొండొకచో వాక్యము కావచ్చునని స్పష్టపరచుచున్నాడు.

> వాక్యం తదపి మన్యంతే యత్పదం చరితక్రియమ్
> ఆఖ్యాతశబ్దే నియతం సాధనం యత్ర గమ్యతే
> తదప్యేకం సమాసా(ప్తా)ర్థం వాక్యమిత్యభిధీయతే. 326

చరితక్రియమ్=ఇమిడియున్న క్రియాపదముగల. యత్ = ఏ, పదమ్ = పదము గలదో, తత్ + అపి = ఆ పదమునుగూడ, వాక్యమ్ = వాక్యమని, మన్యంతే = తలచుదురు. యత్ర=ఏ, ఆఖ్యాతశబ్దే = క్రియా పదము విషయములో, సాధనమ్ =

కారకముగా అన్వయించు పదము, నియతమ్ = నిశ్చయముగా, గమ్యతే = తెలియబడునో, తత్ + అపి = ఆక్రియాపదము కూడ, సమాసార్థమ్ = సంగ్రహింపబడిన అర్థముగల (సమాప్తార్థమ్ = సంపూర్ణమైన అర్థముగల), ఏకమ్ = ఒక, వాక్యమ్ + ఇతి = వాక్యమని, అభిధీయతే = చెప్పబడును.

తా. మిక్కిలి ప్రసిద్ధమైన వాడుకనుబట్టి కొన్నిసంధర్భములలో ఒక్క నామవాచకమువలననే సంపూర్ణమగు అర్థముతెలియుచుండును. అట్లే కొన్నిచోట్ల ఒకే క్రియాపదమువలననే సంపూర్ణవాక్యార్థము అవగతమగును. అట్టి స్థలములలో ఆ ఒక్కపదమే ఇతర పదములను అపేక్షింపకుండ సంపూర్ణవాక్యార్థమును ఇచ్చుటచే, ఆ పదమే వాక్యమని చెప్పవలయును. ఆ పదము, దాని అర్థమును అచట వాస్తవములే. ఎందుచేతననగా - ఎట్టి ఆకాంక్షయులేకుండ (కర్త, కర్మ, క్రియ మొదలగువానియొక్క అపేక్షలేకుండ) ఒక సంపూర్ణమగు అర్థమును బోధించుటయే వాక్యముయొక్క ముఖ్యలక్షణము. ఇది అట్టి స్థలములలో ఒకే పదమునకు అన్వయించును. ఆ పదము నామవాచకమైనచో క్రియయు, క్రియాపదమైనచో ఆవశ్యకమైన కారకమున్ను వెంటనే స్ఫురించును.

వి. 'ఖడ్గేన' (కత్తితో) అనుపదము 'ఛినత్తి' (నరకుచున్నాడు) అను క్రియాపదమును పలుకనక్కరలేకుండగనే, ప్రసిద్ధినిబట్టి ఆక్రియను బోధించును. (ఖడ్గేన అను పదమే క్రియనుకూడ చెప్పగలుగును). అట్లే 'వర్షతి' (వర్షించును) అను క్రియాపదమే 'దేవః' (దేవుడు) 'జలమ్' (నీటిని) అనుకారకములను తప్పక బోధించును. ప్రకరణాదుల సాయముతో ఆవశ్యకమైన ఆయా పదార్థములు నియతముగా తెలిసిపోవును. కాన అవన్నియు ఉచ్చరించిన ఒక పదమువలననే (నామముకాని, ఆఖ్యాతముకాని) లభించునట్లు అనుభవము కలుగును. ఆ విధముగా పదమే వాక్యమగుచున్నది. కాన అదియు దాని అర్థమును సత్యములే అగును.

'పదములు, పదార్థములును అసత్యములు అన్నారుగదా! అయినపుడు సంపూర్ణ వాక్యార్థమును అందించు, మీదచూపిన 'ఖడ్గేన' 'వర్షతి' మొదలగుపదముల గతిఏమి?' అను శంకకు, ఈ కారిక సమాధానముచూపినది. 'అవి వాక్యమందలి అవయవములైన పదములు కావు. సంపూర్ణమైనవాక్యములే. ఆవశ్యకమైన పదపదార్థములన్నియు అచట ఒకపదములోనే ఇమిడిఉన్నవి' అని తీర్మానము.

చరితక్రియమ్ = చరితా, క్రియా, యేన తత్ = తనలో ఇముడ్చుకున్న క్రియగలది. ఆఖ్యాతశబ్దము = తిఙంతము—క్రియాపదము. సాధనమ్ = కర్త, కర్మ, మొదలగు కారకము.

ఈ సందర్భమున మీమాంసవకుల ఆశయమును చూపుచున్నాడు.

శబ్దవ్యవహితా బుద్ధి రప్రయుక్తపదాశ్రయా
అనుమానా త్తదర్థస్య ప్రత్యయే హేతు రుచ్యతే. 327

(ప్రయుక్తేన = ఉచ్చరింపబడిన, పదేన = పదముచే) అప్రయుక్తపదాశ్రయా = ఉచ్చరింపబడని పదమునకు సంబంధించిన, బుద్ధిః = బుద్ధి (ఊహ), శబ్దవ్యవహితా = ఆవశ్యకమైన

శబ్దముతో వ్యవధానముగలదై, అనుమానాత్ = అనుమానమువలన (ఊహవలన), తదర్థస్య= ఉచ్చరించబడని శబ్దమునకు సంబంధించిన అర్థముయొక్క, ప్రత్యయే = జ్ఞానమందు, హేతుః = కారణముగా, ఉచ్యతే = చెప్పబడును.

తా. ఒకే సుబంతముగాని ఒకే తిఙంతముగాని తనంతటతానుగా సంపూర్ణ వాక్యార్థమును చెప్పజాలదు. అట్టిచోటులందు సంపూర్ణార్థము ఈ విధముగా లభించుచుండును. పొగనుచూచి నిప్పును అనుమానించునట్లు, ప్రయోగించిన పదమువలననే, దాని అర్థముతో సంబంధముగల పదముల నన్నింటిని అనుమానించుదురు, అట్లు లభించిన అన్నిపదములను కూర్చుకొనియే పూర్తిఅర్థములను తెలిసికొందురు. (అర్థములను అనుమానించి, పిదప వానిని చెప్పుపదములను ఊహించుట ఒకపద్ధతి. మొదట పదములనే ఊహించి, తరువాత వాని అర్థములను చెప్పుకొనుట రెండవ పద్ధతి. ఏదయినను అనుమానప్రమాణముతోనే కావలసిన శబ్దార్థములు వచ్చును) ఈ రీతినే 'ఆక్షేపము' (కావలసినదానిని లాగికొనివచ్చుట) అనియు అందురు. కావున 'ఒకేపదము వాక్యము' అనుట యుక్తముకారు. (అక్కడ అన్నిపదములును ఉన్నట్లే లెక్క)

ఇది మీమాంసకుల వాదము. దీనిసారమిట్లుండును. ఒకదానినివిడిచి వేరొకటి ఉండుటకు వీలుకుదరని శబ్దములుకాని, అర్థములుకాని ఉన్నపుడు, వానిలో ఏ ఒకదానిని ప్రయోగించినను, అది రెండవదానిని తప్పక లాగుకొని వచ్చును. 'రెండవదాని ప్రయోగము స్పష్టముగ ఉండితీరవలెను' అను నిర్బంధము లేదు. దీనిని ఆక్షేప మందురు. 'యేన వినా యదనుపపన్నం తత్తేనాఽఽక్షిప్యతే' అని ఆక్షేపన్యాయము. (యేన వినా=ఏదిలేకుండ. యత్ + అనుపపన్నమ్=ఏది కుదరదో, తత్ = అది, తేన=ఆ కుదరనిదానిచే, ఆక్షిప్యతే=తీసుకొని రాబడును) 'పీనో దేవదత్తః దివా న భుంక్తే' (దేవదత్తుడు బలిసిఉన్నాడు-కాని పగలు భోజనముచేయడు) అనునది శాస్త్రప్రసిద్ధమైన ఉదాహరణము. ఇచట, 'దేవదత్తుడు రాత్రి భోజనముచేయును' అను అర్థము ఆక్షేపమువలన లభించును. రాత్రికూడ భోజనము చేయకున్నచో బలిసిఉండుట కుదురదుగదా! ఈ పద్ధతినే "శ్రుతార్థాపత్తి - లేక - అర్థాపత్తి" అను పదములతో సాంకేతికముగ వ్యవహరింతురు. (కావలసిన అర్థమును ఆక్షేపించి - పిదప దానిని చెప్పు శబ్దమును తీసుకొనివచ్చినను, తొలుతశబ్దమునే ఆక్షేపించి, తరువాత దాని అర్థమును చెప్పుకొన్నను ఇబ్బందిలేదు.) ప్రకృతము ఈ మార్గముమ అవలంబించి, ఒకే పదముగల ప్రయోగములలో, అవశ్యకమైన క్రియాపదమునో కారకపదమునో ఆక్షేపించుకొని పూర్తి అర్థమును పొందుదురని చెప్పుటయే సమంజసము. ("ఖడ్గేన"అనగానే "ఛినత్తి" అనుక్రియాపదము, "వర్షతి" అనగానే "దేవః, జలమ్" అనుకారక పదములును ఆక్షేపించబడును). అన్ని పదములను యథావిధిగ ఉచ్చరింపనక్కరలేదు. ఉచ్చరింపబడినపదమే మిగిలిన అన్ని పదములను తీసుకొని వచ్చును. కాగా "వాక్యైకదేశములు (వాక్యముయొక్క ఖండములు) సమగ్ర వాక్యములే" అనుట పొసగదు.

శాస్త్రీయములగు చర్చలలో పలుతావులందు వైయాకరణులకు, మీమాంసకులకును పూర్తిగా వేర్వేరు అభిప్రాయములు, సిద్ధాంతములును ఉన్నవి. అట్లే తార్కికులకు వైయాకరణులకును అన్ని విషయములందును అభిప్రాయభేదములు ఉన్నవి. సమయము సందర్భమును బట్టి పై వారి వాదములను గ్రంథకర్త ఉట్టంకించుచుఖండించుచుండును. అయితే

ప్రవాహరూపమున నడచు మూలకారికలలో, "ఏది పూర్వపక్షము ? ఏది సిద్ధాంతము ?" అని తెలిసికొనుట మిక్కిలి శ్రమసాధ్యము. వ్యాఖ్యానములమూలమున అట్టి సంశయములు తీరు చుండును. ఈ కారిక మీమాంసకుల పూర్వపక్షమును ప్రతిపాదించినది.

(1) అర్థాపత్తిః = అర్థస్య + ఆపత్తిః = కావలసిన విషయమును బలవంతముగా లాగికొని వచ్చుట. మీమాంసకులు దీనిని వేరే ప్రమాణముగా (జ్ఞానమును కలిగించు ఉపాయము) అంగీకరించినారు.

(2) అనుమానమ్ = పరస్పరము నియతమైన సంబంధముగల రెండింటిలో ఒకదానిని బట్టి రెండవదానిని ఊహించుట. కార్యమును బట్టి కారణమును, కారణమును బట్టి కార్యమును నిశ్చయముగా తెలిసికొనుట అని భావము. (పొగనుచూచి నిప్పును ఊహించుట మొదలగునవి). తార్కికులకు ఇది ప్రబలమైన ప్రమాణము. ప్రకృతమైన కారికలో అనుమానమనగా—"శబ్దమువలన తత్సంబంధియగు శబ్దమునుగాని, అర్థమునుబట్టి తత్సంబంధియగు అర్థమునుగాని తెలిసికొనుట" అగును. అర్థమును అనుమానించినపుడు దానిని చెప్పు శబ్దము కూడ అనుమానమువలననే లభించునని అనుకొనవలయును. తార్కికులు "అర్థాపత్తి" అను ప్రమాణమును ఒప్పుకొనరు. కాన వారి మార్గమననుసరించి యిచట అనుమాన పదము ఉపయోగింపబడినది. మీమాంసకుల దృష్టిలో ఇచటి అనుమాన పదమునకు "అర్థాపత్తి" అనియే తాత్పర్యము.

"ఒకే పదము వాక్యము కానేరదు. అట్టిచోటులందుకూడ ఆవశ్యకమైన ఇతర పదములను తీసికొని రాక తప్పదు" అను మీమాంసకుల మతమును ఖండించుచున్నాడు.

యస్మిం స్తూచ్చరితే శబ్దే యదా యోఽర్థః ప్రతీయతే
తమాహు రర్థం తస్యైవ నాన్య దర్థస్య లక్షణమ్ . 328

యదా=ఎప్పుడు, యస్మిన్ = ఏ, శబ్దే=శబ్దము, ఉచ్చరితే + తు=ఉచ్చరింపబడగా, యః = ఏ, అర్థః = అర్థము, ప్రతీయతే = తెలియబడునో, తమ్ = ఆ, అర్థమ్ = అర్థమును, తస్య + ఏవ = ఆ శబ్దమునకు సంబంధించినదిగానే, ఆహుః= చెప్పుదురు, అర్థస్య = అర్థముయొక్క, లక్షణమ్= లక్షణము, అన్యత్ = వేరుగా ఏదియు, న=లేదు.

తా. శబ్దమును ప్రయోగించినపుడు, దానివలన సూటిగా బోధపడు అర్థమంతయు ఆ శబ్దమునకు సంబంధించినదే అని చెప్పవలెను. (ఒక శబ్దమువలన కలుగు భావార్థమంతయు ఆ శబ్దముయొక్క శక్తిని బట్టియే వచ్చును) శబ్దముయొక్క శక్తినిబట్టి సూటిగా తెలియుదానినే అర్థమందురు.

వి. ఈ శ్లోకము మీమాంసకుల వాదమును త్రోసిపుచ్చును:- ఏకపద వాక్యములలో (ఖడ్గేన, వర్షతి మొదలగునవి) ఆవశ్యకమైన పదములను ఆక్షేపించ నక్కరలేదు. ప్రయోగించిన పదమొక్కటే తన అర్థముతోపాటు, సంబంధించినట్టి, (ప్రయోగింపబడని) శబ్దముల అర్థమునంతను బోధించును. అది వ్యవహారస్వభావము (లోకులు భాష నుపయోగించు సహజమైన తీరు). కాగా కొన్నిచోట్ల ఒక్కపదమే సంపూర్ణవాక్యమగుననుటలో బాధకము లేదు.

మీది కారిక చెప్పిన తీరును అవలంబించినపుడు, "క్రియార్థోపపదస్య కర్మణి స్థానినః" అను సూత్రము విధించు చతుర్థీవిభక్తి వ్యర్థమే అని చెప్పుచున్నాడు.

క్రియార్థోపపదే ష్వేవం స్థానినాం గమ్యతే క్రియా
వృత్తౌ నిరాదిభి శ్చైవ క్రాంతాద్యర్థోఽవగమ్యతే. 329

ఏవమ్=ఈ విధముగనే (ఒకేపదమువలన కావలసిన అర్థమంతయు లభించు తీరుకో), క్రియార్థోపపదేషు=ఒక క్రియకు ప్రయోజనమైన వేరొకక్రియను బోధించు, స్థానినామ్=ఉచ్చరింపబడని ధాతువులయొక్క, క్రియా=వ్యాపారము, గమ్యతే=తెలియబడును, వృత్తౌ=సమాసము మొదలగు వృత్తియందు, నిరాదిభిః+చ+ఏవ=నిర్ మొదంగు ఉపసర్గలచేతనే, క్రాంతాద్యర్థః = "అతిక్రమించినాడు" మొదలగు అర్థము, అవగమ్యతే = బోధింపబడును.

తా. ఒకపనిని సాధించుటకు వేరొకపనిని ప్రారంభింతుము. దానిని క్రియార్థమైన క్రియ అందురు. ఇట్టిచోట్ల ప్రయోజనముగా ఉండు క్రియను ఉచ్చరింపక పోయినను ఇబ్బంది లేదు. సాధింపదలచిన క్రియ తప్పక అవగతమగుచుండును. అట్లే సమాసము, (తద్ధితము, కృత్తు), మొదలగు వృత్తులలో 'నిర్' మొదలగు ఉపసర్గలు, 'క్రాంతః' మొదలగు పదములను వాడకపోయినను, ఆ పదముల అర్థమును స్పష్టముగా తెలియజేయును.

వి. 'సః ఫలేభ్యో యాతి' (అతడు పండ్లకై వెళ్ళుచున్నాడు) అనునది ఒక వాక్యము. ఇచట వ్యాకరణశాస్త్రమనుసరించి, వివరణ మిట్లుండును :- "పండ్లకై వెళ్ళుచున్నాడు" అనగా 'పండ్లను తెచ్చుటకు వెళ్ళుచున్నాడు' అని అర్థము. 'వెళ్ళుట' ఒక పని. 'తీసుకొనివచ్చుట' వేరొకపని. వెళ్ళుటకు ప్రయోజనము, తీసుకొనివచ్చుట. ఇటువంటి క్రియనే క్రియార్థమైన క్రియ అందురు. ప్రయోజనముగా ఉండు క్రియను, 'ఆహర్తుమ్, సంపాదయితుమ్, ద్రష్టుమ్' మొదలగు పదములతో (ఈ పదములు ఆయా ధాతువులకు 'తుమున్'=తుమ్-అను ప్రత్యయమును చేర్చగా ఏర్పడు అవ్యయములు) సంస్కృతభాషలో బోధింతురు. ప్రయోజనముగా ఉండు క్రియను బోధించు తుమున్ ప్రత్యయాంతపదమును ఉచ్చరింపని సందర్భములలో, ఆ ప్రయోజనక్రియలో కర్మగా అన్వయించు శబ్దమునకు, చతుర్థీవిభక్తి అగునని, 'క్రియార్థోపపదస్యచ కర్మణిస్థానినః' (2-3-14) అను పాణినీయ సూత్రము చెప్పినది. 'ఫలాని ఆహర్తుం యాతి', 'ధనం సంపాదయితుం గచ్ఛతి', మొదలగు వాక్యములలో, కర్మవాచకములగు 'ఫలాని', 'ధనమ్' మొదలగు శబ్దములకు చతుర్థివచ్చి, 'ఫలేభ్యః యాతి', 'ధనాయ గచ్ఛతి' మొదలగు ప్రయోగములు సిద్ధించును. 'ఆహర్తుమ్' 'సంపాదయితుమ్' మొదలగు తుమున్నంతముల వలన లభించు అర్థము చతుర్థీ విభక్తిచేతనే సూచింపబడునుగాన, మరల ఆ పదములను వాడకూడదు. వాడినపుడు ఈ సూత్రము ప్రవర్తింపదు. కర్మవాచకమునకు సహజమైన ద్వితీయా విభక్తియే వచ్చును.

కాగా ప్రకృతము "ఫలేభ్యః" అను దానివలననే "పండ్లను తెచ్చుటకు" అని, 'ధనాయ' అనుదానివల్లనే "ధనమును సంపాదించుటకు' అనియు పూర్తి అర్థమును చెప్ప వచ్చును. 'ఒక పదమువలన బోధింపబడు అర్థమంతయు ఆపదమునకు సంబంధించినదే' అని అంగీకరించినపుడు, 'క్రియార్థోపపదస్యచ కర్మణి స్థానినః' అను సూత్రము వ్యర్థమేఅగును. 'ఫలేభ్యః' 'ధనాయ' మొదలగు ప్రయోగములలో, 'తాదర్థ్యే చతుర్థీ వాచ్యా' (పరిక్రయణే

సంప్రదాన మన్యతరస్యామ్-1-4-44 అను సూత్రమున-వార్తికము) అనువార్తికముచే చతుర్థీ విభక్తిని సాధించుకొనవచ్చును.' ఒక క్రియయొక్క ప్రయోజనమును చెప్పు శబ్దమునకు ('ఈ ఫలమునకై ఈ పని' అను భావమును చెప్పదలచుకొన్నప్పుడు) చతుర్థి వచ్చునని' 'తాదర్థ్యే చతుర్థీ వాచ్యా' అనువచనము యొక్క తాత్పర్యము. 'ముక్తయే హరింభజతి' (ముక్తికై హరిని సేవించుచున్నాడు) అని దీని ఉదాహరణము. 'హరిసేవ' అనుక్రియకు ముక్తి ప్రయోజనము. కాన ముక్తి శబ్దమునకు చతుర్థివచ్చినది. ఇదే విధముగ'ఫల, ధన', మొదలగు శబ్దములకు ఈ వార్తికముచేతనే చతుర్థిని సాధించి, అభిమతార్థమును పొంద వచ్చునుగాన, అందుకై వేరే సూత్రము ఆవశ్యకము కానేకాదు.

ఇట్లే 'నిరాదయః క్రాంతాద్యర్థే పంచమ్యా' (కుగతిప్రాదయః-2-2-18 అను సూత్రమున వార్తికము) అనిసమాసప్రకరణములో ఒక వచనము కలదు. 'నిర్' మొదలగు ఉపసర్గలు 'క్రాంతః' (దాటినవాడు) మొదలగు అర్థములలో పంచమ్యంతశబ్దముతో సమసించును అని దీని అర్థము. 'క్రాంతః కౌశాంబ్యాః' అను విగ్రహవాక్యము, 'నిర్' అను ఉపసర్గతో కలిసి, 'నిష్కౌశాంబిః' అను సమాసముగ సిద్ధించును. ఇటువంటి సమాస ములు ఈ వచనమునకు ఉదాహరణములు. ఇట్టి స్థలములలో కూడ ఉపసర్గయే అభిమతమైన అర్థమునంతను బోధించునుగాన, 'క్రాంతః' మొదలగు పదములను వేరుగా పలుకనక్కర లేదు.

క్రియార్థోపపదస్యచ కర్మణి స్థానినః (2-3-1) ఈ సూత్రము సిద్ధాంతకౌ ముదిలో కారకప్రకరణమందున్నది. 'క్రియార్థాక్రియా ఉపదం యస్య తస్య స్థానినః అప్రయు జ్యమానస్య తుమునః కర్మణి చతుర్థీ స్యాత్' అని దీని వృత్తి. ఉదా: ఫలేభ్యో యాతి. ఉపపదమనగా సమీపమందుచ్చరింపబడు పదము. ప్రకృతమున క్రియార్థమైన క్రియను చెప్పు 'యాతి' మొదలగు క్రియావాచకమే ఉపపదమగును. స్థానినః = ఉచ్చరింప బడనిది, 'తుమునః' అనుపదము అధ్యాహారము, ఇదియే విశేష్యము, 'క్రియార్థోపపదస్య స్థానినః' అనునవి రెండును విశేషణములు. ఇట్లు అభిమతార్థము సిద్ధించును. క్రియార్థమైన క్రియను సమీపమందు ప్రయోగించునపుడు ధాతువునకు 'తుమన్' (తుమ్) ప్రత్యయము వచ్చును (కర్తుంయాతి, ద్రష్టుం గచ్ఛతి, మొదలగునవి). అట్టి తుమున్ ప్రత్యయాంత శబ్దములకు సంభవము ఉండి, వానిని ప్రయోగింపని వాక్యములలోనే ఈ సూత్రము సహజ ముగ ప్రవర్తించును.

'తాదర్థ్యే చతుర్థీ వాచ్యా' - తదర్థస్య భావః = తాదర్థ్యమ్ = 'అందుకొరకు' అనుట- అనగా అనుకొన్న ప్రయోజనము.

'కుగతిప్రాదయః '(2-2-18) కు అనునది. గతిసంజ్ఞగలది, ప్ర, పరా, మొదలగునవియు సమర్థమైన శబ్దముతో సమసించును.' అని దీని అర్థము. కుకవిః, తిరస్కృత్య, ప్రాచార్యః, మొదలగునవి ఉదాహరణములు. ఈ సూత్రమును వివరించు సందర్భములో 'నిరాదయః క్రాంతాద్యర్థే పంచమ్యా' అను వార్తికము బయలుదేరినది.

1. ఉపసర్గః = క్రియతో అన్వయించు ప్ర, పరా, అను, మొదలగునది. ఉదా:- ప్రభవతి, పరాజయతే, అనుకరోతి మొదలగునవి.

2. స్థానీ=ఉచ్చరింపబడనిది. "స్థానమ్ అస్య అస్తి= స్థానీ = స్థానముగలది. స్థానమనగా ప్రసంగము." అది అచట ఉండదగినది-కాని ప్రకృతము ఉండదు"అని అర్థము. దీనివలన "లేనిది-ఉచ్చరింపబడనిది" అను భావము ఫలించును.

౩. కర్మ=కర్తయైన వ్యక్తి తన పనిచే పొందుటకుద్దేశింపబడిన విషయము.

4 వృత్తిః = విగ్రహవాక్యములలో కనబడు విడివిడి పదముల అర్థమును విడిచి, సమూహమువలన ఒకానొక ప్రత్యేకార్థమును బోధించు వ్యాకరణ ప్రక్రియ ఉదా :- రాజ్ఞః పురుషః. ఇది విగ్రహము. "రాజపురుషః" ఇది సమాసము. దీనివలన 'రాజసేవకుడు' అను విశేషణ విశేష్యభావముకల ఒకా నొక ప్రత్యేకార్థము వచ్చునని వైయాకరణులందురు. సమాసము, కృత్తు, తద్ధితము, ఏకశేషము, నామధాతువు, అని వృత్తులు అయిదు విధములు.

అట్లయినపుడు కేవలము సుబంతమునో తిఙంతమునో వాక్యముగ వాడుకొని, ఆవశ్యకములగు పదాంతరములను విడువవచ్చునా ? అను శంకకు ఉత్తరమును చూపుచున్నాడు.

తాని శబ్దాంతరాణ్యేవ పర్యాయా ఇవ లౌకికాః

అర్థప్రకరణాభ్యాం తు తేషాం స్వార్థో నియమ్యతే. ౩౩౦

తాని=వాక్యముయొక్క అర్థమును పూర్తిగా బోధించు ఒక్కొక్కపదములు, లౌకికాః=లోకములో ప్రసిద్ధములగు, పర్యాయాః + ఇవ=పర్యాయపదములవలె, శబ్దాంతరాణి + ఏవ=వేరువేరు శబ్దములే. తేషామ్=ఆ పదములయొక్క, స్వార్థః=పూర్తిఅర్థము, అర్థప్రకరణాభ్యామ్ + తు=ప్రయోజనమును బట్టి, సందర్భమునుబట్టియు, నియమ్యతే = 'ఇది' అని స్పష్టము చేయబడును.

తా. 'ఖడ్గేన' 'వర్షతి' మొదలగు ఒక్కొక్క పదమువలననే వాక్యార్థము పూర్తిగా వచ్చునపుడు అవియే వాక్యములగును. అట్లని 'ఖడ్గేన ఛినత్తి' 'దేవః జలం వర్షతి' అను సమగ్రవాక్యములు వ్యర్థములని ఎంచరాదు. అవియు వేర్వేరుగ వాక్యములై ప్రయోగార్హములే అగును. ఈ రెండువిధములయిన వాక్యములును పర్యాయపదములవంటివని భావింపవలెను. చెట్టును బోధించుటకు 'వృక్షః' 'తరుః', 'ద్రుమః', మొదలగు అనేక పదములున్నవి. అవన్నియు పర్యాయపదములు. అందు ఒకదానినే స్వీకరించి తక్కినవానిని వ్యర్థము లనలేముగదా: అట్లే పై రెండువిధములైన వాక్యములును ప్రయోగింపబడుచుండును. అయితే సుబంతమునే వాక్యముగా ఉచ్చరించునపుడు ఆవశ్యకమైన తిఙంతార్థము, తిఙంతమునే వాడినపుడు ఆవశ్యకమైన సుబంతార్థమున్ను వెనుక చెప్పబడిన అర్థప్రకరణాదుల సాయముతో లభించును.

వి. ఒకపదమే వాక్యముకాగలిగినపుడు దానినే వాడుచు, సమగ్రవాక్యములను (ఆవశ్యకమైన పదములన్నియు గల వాక్యములు) విడిచిపెట్టవచ్చునాః అను శంకకు ఇది సమాధానము. అట్లు విడువనక్కరలేదని, రెండురకములైన వాక్యములను ప్రయోగించుకొనవచ్చునని, పదమే వాక్యమగు స్థలములలో అర్థప్రకరణాదులు సాయముచేసి సమగ్రార్థమును బోధించుననియు సారాంశము.

ఒకే అర్థమును బోధించుచు వేర్వేరు ఆకారములు గల శబ్దములను పర్యాయములందురు.

ఉదా : ఇంద్రః, హరిః, పాకశాసనః మొదలగునవి. పర్యాయపదముల విషయములో లాఘవ గౌరవచర్చను ('ఈ పదము చిన్నది- దీనినే వాడవలెను' 'ఆ పదము పెద్దది- దానిని వాడకూడదు' అను విచారణము) అంగీకరించనక్కరలేదు. అట్లయిన పెద్దపదములన్నియు నిష్ఫలములగును. ఆ విధముగనే వాక్యములుకూడ పర్యాయవాక్యములు కావచ్చును. లాఘవగౌరవవిచారణము అక్కడకూడ చేయకూడదు. ఇష్టానుసారము చిన్నవాక్యమునో (ఏకపదవాక్యము), పెద్దవాక్యమునో (అన్నిపదములునుగల వాక్యము) ప్రయోగింపవచ్చును. వాక్యార్థమును ప్రకరణాదులే నిర్ణయించును.

అఖండవాక్యము, అఖండవాక్యార్థముమాత్రమే సత్యమని, కొన్నిచోట్ల ఒకేపదము అఖండవాక్యమగుటలో ప్రతిబంధకములేదని, పదపదార్థములు అసత్యములనియు ఇంతవరకు దృఢపరచడమైనది.

"అఖండ వాక్య వాక్యార్థములే సత్యమయినపుడు, పదపదార్థాది విభాగమును కల్పింపనేల ?" అనుశంకకు సమాధానమును చూపుచున్నాడు.

ప్రతిబోధాభ్యుపాయాస్తు యే తం తం పురుషం ప్రతి
నాఽవశ్యం తేఽభిసంబద్ధాః శబ్దా జ్ఞేయేన వస్తునా. 331

తమ్ + తమ్ = ఆయా, పురుషమ్ = వ్యక్తిని, ప్రతి = గురించి, యే = ఏ, ప్రతిబోధాభ్యుపాయాః = అర్థమును తెలియజేయుటకుపయోగించు, పదములు, (పదభాగములు) మొదలయినఉపాయములు గలవో, తే = ఆ, శబ్దాః = శబ్దములు, జ్ఞేయేన = తెలియదగు, వస్తునా = విషయముతో, అవశ్యమ్ = తప్పక, అభిసంబద్ధాః = సంబంధము కలవి, న = కావు.

తా. వాక్యములో పదములు, సమాసాదివృత్తులలో పదైకదేశములు, (పదములలో వర్ణములు) మొదలగునవి అఖండవాక్యార్థమును తెలియుటలో సాధనములు మాత్రమే. ఆ అర్థమునకు, ఉపాయములైన అట్టి విభాగములకును సంబంధమేదియు లేదు.

వి. ఒక పరిపూర్ణమైన అర్థమును తెలియజేయుటకై వాక్యమును ఉపయోగించుదురు. అది ఏకపదరూపముగనో, పదసముదాయరూపముగనో కనిపించవచ్చును. కాని అది అఖండము. (ఎట్టిభాగములును లేనిది). దానివలన తెలియు అర్థముకూడ అఖండమే. అయినను సామాన్యులకు స్పష్టత కలుగవలయునని. పదములను పదభాగములను కల్పించి చూపుదురు. సత్యమును తెలిసికొన్నవారికి ఆ విభాగముతో పనిలేదు.

"అఖండవాక్యము - అంఖండార్థము మాత్రమే సత్యమైనపుడు పదములు - వాని అవయవములు (ప్రకృతి, ప్రత్యయము మొదలగునవి) మొదలగు కల్పనలన్నియు ఎందుకు ?" అను శంక కిది సమాధానము. మందమధ్యమాధికారులకు (తెలివితక్కువ వారు మందులు, సామాన్యమైన తెలివిగలవారు మధ్యములు) సత్యమును బోధించుటకై అసత్యాంశముల కల్పన ఆవశ్యకమగుచుండునని సారము. ఇటువంటి భావములను గ్రంథకర్త తరచుగ ప్రకటించుచునే ఉండును.

"యస్మింస్తూచ్చరితే శబ్దే" (328 శ్లోకము) అన్న రీతిలో శబ్దార్థమును పరిష్కరించినచో, ఉచ్చరించిన శబ్దమును సమముగా వినకపోవుట, భ్రమపడుట మొదలగు కారణముల

వలన కొన్నిచోట్ల సరియైన అర్థము తెలియక పోవచ్చును. అట్లయిన శబ్దార్థముల సంబంధము అనిత్యము కావలసివచ్చును. అది సముచితముకాదు'' అని శ్రుతార్థాపత్తి గినంకరించు మీమాంసకుడు మరల తన ఆశయమును ప్రతిపాదించుచున్నాడు.

అసత్యాం ప్రతిపత్తౌ చ మిథ్యా వా ప్రతిపాదనే
స్వైరర్థైః నిత్యసంబద్ధా స్తే తే శబ్దా వ్యవస్థితాః. 332

ప్రతిపత్తౌ = అర్థజ్ఞానము, అసత్యామ్ = కలుగనపుడు, (లేనపుడు) వా = లేక మిథ్యా = అసత్యముగ (వేరొకరీతిని), ప్రతిపాదనే + చ = కలిగినపుడు కూడ, తే + తే = ఆయా, శబ్దాః = శబ్దములు, స్వైః = తమతమ, అర్థైః = ముఖ్యమైన అర్థములతో, నిత్య సంబద్ధాః = ఎల్లపుడునుఎడతెగని సంబంధము కలవిగా, వ్యవస్థితాః = నిశ్చయింపబడి ఉన్నవి.

తా. "ఈ శబ్దమునకు ఇది అర్థము'' అని శబ్దార్థసంకేతము తెలియకపోవచ్చును; పరాకుగా ఉండి సమముగ వినకపోవుటవలన, లేక—భ్రాంతివలనను ఒక శబ్దమునకు 'వేరొక అర్థము' అని అనిపించవచ్చును; అయినను శబ్దమునకు. అర్థమునకును ఉండు సంబంధము నిత్యముగాన, (తనకు సంబంధించిన ముఖ్యార్థమునే శబ్దము ఎల్లపుడును తెలియ జేయును) ఉచ్చరింపబడిన శబ్దము తన అర్థమును మాత్రమే చెప్పును. మిగిలిన అర్థములను చెప్పజాలదు. అట్లు కాకున్న 'శబ్దార్థ సంబంధము నిత్యము' అను సంప్రదాయము పాడగును.

వి. ఇది మొదలు వరుసగా నాలుగు కారికలు మీమాంసకుల పూర్వపక్షమును ఉపపత్తులతోను, ఉదాహరణములతోను వివరించును.—'శబ్దార్థయోః నిత్యః అభిసంబంధః' (శబ్దమునకు దాని అర్థమునకు ఉండు సంబంధము నిత్యము) అని వారి మతము. తదను సారము ఒక్కొక అర్థమునకు ఒక్కొక శబ్దము నియతముగా ఉండును. ఈ భావమునే 'ప్రత్యర్థం శబ్ద నివేశః' (ప్రతియొక అర్థమును గురించియు వేరువేరుగ ఒక్కొక్క శబ్దమును ఉచ్చరింప వలయును) అను వచనముతో ప్రకటించుదురు. 'ఈ శబ్దమునకు ఇది అర్థము లేక—ఈ అర్థమును బోధించు శబ్దము ఇది' అని గ్రహించుట శబ్దార్థ సంకేతమనబడును. దీనినిబట్టియే శబ్దార్థముల వ్యవహారము జరుగును. ఒకప్పుడు ఇట్టి సంకేతము తెలియక పోవచ్చును. పరాకుగా శబ్దమును వినవచ్చుసు. లేక భ్రాంతికలుగవచ్చును. అట్లయినను శబ్దమునకుండు నియతమైన అర్థము మారినదని కాని, లేదని కాని' అనకూడదు తెలిసినను, తెలియకపోయినను శబ్దమునకుండునది తన ముఖ్యార్థమే. వాని సంబంధము శాశ్వతము.

కాగా—'యస్మింస్తూచ్చరితే శబ్దే యదా యోఽర్థః ప్రతీయతే'(328)అను కారిక చెప్పినట్లు, వైయాకరణుల మతము ప్రకారము ఒకే పదము వాక్యమగుట కుదురదు. ఆ ఒక్కపదము తనయొక్క అర్థమును మాత్రమే చెప్పి ఊరకుండును. మిగిలిన అర్థములను చెప్పజాలదు. అందుకొరకై ఆయాశబ్దములను వాడక తప్పదు. అట్లుకాకున్నచో (ఒకే పదమువలన అన్ని అర్థములను లభించినచో) 'శబ్దార్థ సంబంధము నిత్య' మను శాస్త్రము భగ్నమగును. అందుచే ఏక పదవాక్యములలో, అర్థాపత్తి నాశ్రయించి ఆవశ్యకమైన పదముల నన్నింటిని కూర్చుకొన్న తరవాతనే సంపూర్ణవాక్యమగునని చెప్పక తీరదు.

'ఖడ్గేన' అను సుబంతము 'కత్తితో' అను అర్థము నొకదానినే చెప్పును. అట్లే 'వర్షతి' అనునది 'వర్షించుచున్నాడు' అను అర్థమునే చెప్పును. మిగిలిన అరములు కావలసి నచో వానిని బోధించు శబ్దములను వాడవలెను. శబ్దమును వాడకుండ నర్థమువచ్చునని

చెప్పినను, అర్థము లేకుండ శబ్దమును వాడినను 'శబ్దార్థ సంబంధము నిత్యము' అనుట ఎట్లు పొసగును? ఇది శంకయొక్క సారాంశము.

"ద్వారమ్" మొదలగు ఏకపదస్థలములలో, "పిధేహి" మొదలగు ఆవశ్యకమైన పదములను తీసికొనివచ్చియే అర్థమును బోధింపవలయును. లేకున్న మీద చూపిన రీతిని శబ్దార్థముల సంబంధమునకు హాని కలిగెడిని" అని బోదాహరణముగ నిరూపించుచున్నాడు.

యథాప్రకరణం ద్వార మిత్యస్యాం కర్మణః శ్రుతౌ
బధాన దేహి వేత్యేత దుపాయా దధిగమ్యతే. ౪౩౩

ద్వారమ్ + ఇతి = 'ద్వారమ్' అను (ద్వారమును), కర్మణః = కర్మవాచకమగు పదము యొక్క, అస్యామ్ = ఈ, శ్రుతౌ = వినుటలో, బధాన + ఇతి = "బధాన" అను అర్థముగాని (మూసివేయుము), దేహి + ఇతి + వా = "దేహి" అను అర్థముగాని(ఇమ్ము, తెరువుము), యథాప్రకరణమ్ = సందర్భమును బట్టి, ఉపాయాత్ = "ఆయాశబ్దములను పలుకుట" అనే ఉపాయమువలన, అధిగమ్యతే = తెలియబడును.

తా. 'ద్వార' అను శబ్దమునకు 'తలుపు', 'దారి' అనునవి అర్థములు. 'ద్వారమ్' (ద్వారమును) అను ద్వితీయాంతమును (కర్మకారకమును) ఉచ్చరించినవెంటనే సందర్భమునుబట్టిగాని, సన్నివేశమునుబట్టిగాని, ఆవశ్యకమైన 'బధాన' (మూయుము) అను పదమో, లేక 'దేహి' (ఇమ్ము)అను పదమో అచటకు వచ్చును. దానిమూలముగానే అర్థబోధ కలుగును.

వి. కర్త, కర్మ, మొదలగుకారకములను ఉచ్చరించినపుడు, ఆవశ్యకమైన క్రియాపదమును, క్రియాపదమునుమాత్రమే వాడినపుడు యోగ్యమైన కారకపదమును, అర్థాపత్తి వలన తప్పకవచ్చును. తరువాతనే పూర్తి అర్థజ్ఞానము సంభవించును. ఇట్లు చెప్పకున్నచో 'శబ్దార్థముల సంబంధము నిత్యము' అను సిద్ధాంతమునకు భంగము వాటిల్లును.

ఇట్లు 'యస్మి న్నుచ్చరితే శబ్దే' (౪౨౩వ శ్లోకము) ఇత్యాదికారిక చూపిన శబ్దార్థ లక్షణము నంగీకరించినయెడల, శబ్దార్థముల సంబంధము అనిత్యము కావలసివచ్చునని ప్రతిపాదించి, ఈ సందర్భముననే వేరొకదోషమునుకూడ చూపుచున్నాడు.

యత్ర సాధనవృత్తి ర్యః శబ్దః సత్త్వనిబంధనః
న స ప్రధానభూతస్య సాధ్య స్యార్థస్య వాచకః. ౪౩౪

యత్ర = ఏస్థలమందు, సాధనవృత్తిః = కారకమును ప్రతిపాదించుచు, సత్త్వనిబంధనః = ద్రవ్యమును బోధించుటకు ఉద్దేశింపబడిన, శబ్దః = శబ్దము, యః = ఏది కలదో, సః = ఆ శబ్దము, ప్రధానభూతస్య = ముఖ్యమైన, సాధ్యస్య = క్రియారూపమగు, అర్థస్య = అర్థమును, వాచకః = బోధించునది, న = కాదు.

వి. 'సాధనము' అనగా క్రియను పుట్టించునది. (సాధ్యతే—అనేన = దీని మూలముగా క్రియపుట్టును) కర్త, కర్మ, కరణము, మొదలగుకారకములు సాధనము లన బడును. సత్త్వమనగా ద్రవ్యము. స్త్రీలింగము, పుంలింగము మొదలగులింగము, ఒకటి, రెండు మొదలగుసంఖ్యయు కలది ద్రవ్యమగును. సాధ్యమనగా క్రియ—లేక - వ్యాపారము. ఏ వాక్యములోఅయినను, కారకము అప్రధానముగాను, క్రియ ప్రధానముగాను ఉండును. అందుచేత శబ్దమును ప్రయోగించకుండ, సాధనముమాత్రమే సాధ్యమునుకూడ బోధించ

ననుట సమంజసముకానేరదు. 'ఒకేపదము (కారకము) సాధనము, సాధ్యము అను పరస్పరవిరుద్ధములగు అర్థములను ఏకకాలములో ఎట్లు బోధింపగలుగును?' (కాగా 'ద్వారమ్' అనుపదమే 'పిధేహి' అను క్రియాపదముయొక్క అర్థమునుకూడ బోధించుట కుదరదు) అని భావము.

"కాగా ఏకపదస్థలములలో అవశ్యకమైన శబ్దమును కలుపుకొనియే వాక్యార్థమును సంపాదింపవలయును" అని మీమాంసకుడు తన మతమును పూర్తి చేయుచున్నాడు.

స్వార్థమాత్రం ప్రకాశ్యాసౌ సాకాంక్షో వినివర్తతే
అర్థస్తు తస్య సంబంధీ ప్రకాశయతి సన్నిధిమ్ . ౩౩౫

అసౌ = ఈ శబ్దము (కేవలము నామవాచకము కాని, కేవలము క్రియాపదము కాని), స్వార్థమాత్రమ్ = తన అర్థమునే, ప్రకాశ్య = బోధించి, సాకాంక్షః = తనతో అన్వయించుటకు తగినఅర్థమును అపేక్షింపుచు, వినివర్తతే = వెడలిపోవును (వేరొకఅర్థమును బోధింపక ఊరకుండును). తస్య = ఆ శబ్దమునకు, సంబంధీ = సంబంధించిన, అర్థః + తు = అర్థమైతే, సన్నిధిమ్ = అన్వయమునకు తగిన, ఆవశ్యకమైన, అర్థముయొక్క చేరికను, ప్రకాశయతి = స్పష్టపరచును. (యోగ్యమైన శబ్దముమూలముగనే తెలియజేయును).

తా. నామవాచకమునైనా, క్రియావాచకమునైనా, ఒక్కదానినే వాడినపుడు, అది తన అర్థమునుమాత్రమే బోధించి ఊరకుండును. మిగిలిపోయిన ఆవశ్యకార్థములన్నియు, ప్రకరణాదుల సాయముతో తమతమ శబ్దములను తీసికొనివచ్చి, వానిమూలముననే అన్వయించును.

వి. కాగా 'ఒక్కపదమే వాక్యముకావచ్చును' అనుట కుదురదు. 'శ్రుతార్థాపత్తి' అను ప్రమాణము మూలముగా ఆవశ్యకమైన శబ్దములను తీసికొనిరాక తప్పదు.

ఈ కారికతో మీమాంసకుల పూర్వపక్షము ముగిసినది. దీని సారాంశమిది :

1. "శబ్దార్థసంబంధము నిత్యము" అను శాస్త్రము విరోధించును.

2. సాధనము, సాధ్యముకూడ ఒకే పదమువలన బోధింపబడుట మంచిదికాదు (కుదరదు).

3. ఒక శబ్దము తన అర్థమునే బోధించునుగాని, అన్వయమునకు ఆవశ్యకమైన అర్థములను అన్నింటిని బోధింపదు.

4. "శ్రుతార్థాపత్తి"ని (ఆవశ్యకమైన శబ్దములను ఆక్షేపించి వాని అర్థములను కలుపుకొనుట) ఆశ్రయించుట తప్పనిసరి.

శ్రుతార్థాపత్తి నంగీకరించు మీమాంసకుని అఖండవాది తిరస్కరించుచున్నాడు.

పారార్థ్యస్యావిశిష్టత్వాన్న శబ్దాచ్ఛబ్దసన్నిధిః
నాఽర్థాచ్ఛబ్దస్య సాన్నిధ్యం న శబ్దాదర్థసన్నిధిః . ౩౩౬

పారార్థ్యస్య=వేరొక ప్రయోజనము ఉండుట (ఉద్దేశించిన ఫలము ప్రత్యేకముగా ఉండుట అనగా శబ్దము తన అర్థమును చెప్పుట, ఆవశ్యకమైన మరియొక్క శబ్దమును ఆక్షేపించుట అను అంశములు), అవిశిష్టత్వాత్=సమానమైనందున (అన్నిశబ్దములకు సమానమేగాన), శబ్దాత్ = ఒక శబ్దమువలన, శబ్దసన్నిధిః = మరొక శబ్దము యొక్కరాక,

(ఆక్షేపము) న=కలుగదు, అర్థాత్=అర్థమువలన, శబ్దస్య=శబ్దముయొక్క, సాన్నిధ్యమ్=లాభము (ఆక్షేపము), న = కలుగదు, శబ్దాత్ = శబ్దమువలన, అర్థసన్నిధిః = అర్థము యొక్క లాభము, న = సంభవింపదు.

తా. "ద్వారమ్" అను పదమువలన "పిధేహి" అనుపదము (అపదము లేనిదే అర్థము పూర్తి కాదు కాన ఆపదము ఆక్షేపించబడును) తప్పని సరిగా అర్థాపత్తిచే ఆక్షేపించ బడునన్న మీమాంసకుల వాదము నిలువదు. అది యుక్తియుక్తము కాదు. ప్రతి యొక శబ్దమునకును తన అర్థమును బోధించుట, ఆవశ్యకమైన మరియొక శబ్దమును (దాని అర్థమును) అపేక్షించుట అను అంశములు సమానముగనే ఉండును. అయినను అట్టిస్థలములలో ("ద్వారమ్" మొదలగు ఏకపదవాక్యములలో) "శబ్దమును ఆక్షేపించునని" గాని, "అర్థము శబ్దమును ఆక్షేపించును" అనిగాని "శబ్దము అర్థమును ఆక్షేపించును" అనిగాని చెప్పుట కుదరదు. "ప్రత్యర్థం శబ్దనివేశః" (ప్రతి యొక అర్థమునకు ఒక శబ్దము ఉండక తప్పదు) అను మీమాంసకుల న్యాయము వారికే ఎదురు తిరుగును. ఎందువల్లననగా—శబ్దమునకు తనముఖ్యార్థమును చెప్పుటయే ప్రధాన ప్రయోజనము. అంతతో దానిపని నెరవేరును. ఇంకొక శబ్దమునుగాని, అర్థమును గాని అది ఆక్షేపించుటకు సమర్థముకాదు. ఇట్లే అర్థము కూడ తనను చెప్పు శబ్దమును తీసికొనినచ్చి, బలహీనమైపోవును. కాగా శబ్దార్థముల సహజ ధర్మము లంతటను ఒకే విధముగా ఉండునుగాన అవి తమకు దూరముగా ఉండు (పూర్తిగా వేరైన) శబ్దార్థములను ఆక్షేపించ జాలవు.

వి. ఖండవాక్యమును, ఖండవాక్యార్థమును అంగీకరించి మీమాంసకుల మీదివాదమునకు ఇది ఖండనము : 'ద్వారమ్' మొదలగు ఏకపదప్రయోగములలో అర్థాపత్తివలన, 'పిధేహి' మొదలగుపదములకు ఆక్షేపముకలిగి, సంపూర్ణవాక్యములగునని వారందురు. కాని వారు చూపు ఆక్షేపమను రీతి కుదరనే కుదరదు. చూడుడు:

1. శబ్దమే వేరొకశబ్దమును ఆక్షేపించుట సంభవింపదు. ఉచ్చరించిన పదము తన అర్థమును చెప్పుటతో దానిపని నెరవేరును.

2. అట్లే ప్రకృతమైన అర్థము తనను బోధించు శబ్దమునుమాత్రమే ఆక్షేపించ గలదుగాని, సంకేతసిద్ధముకాని వేరొకశబ్దమును ఆక్షేపించజాలదు. కాన అర్థము శబ్దమును ఆక్షేపించు ననుట అసంభవము.

3. అట్లే శబ్దము తన అర్థమునే చెప్పి ఊరకుండును గాన, దానివలన వేరొక అర్థము ఆక్షేపించబడు ననుటయు అసంగతము.

అందువలన 'శ్రుతార్థాపత్తి' అని మీమాంసకులు ప్రతిపాదించుస్థలములలో శబ్దము శబ్దమునుగాని, అర్థము శబ్దమునుగాని, శబ్దము అర్థమునుగాని ఆక్షేపించుట పొసగదు.

కాగా "అఖండవాక్యము, అఖండవాక్యార్థము అనునవే సత్యములు. ద్వారమ్, మొదలగు ఏకపదప్రయోగములు వాక్యఖండములని అనకూడదు. అవియు అఖండవాక్యములే. అట్టిచోటులందు ఉచ్చరించిన ఒక్కపదమే సంపూర్ణార్థమును బోధించును. (అభిమతమైన 'పిధేహి' మొదలగు శబ్దముల అర్థములను ఒక్కపదమే సూటిగా తెలియజేయును) ప్రకరణాదులసాయముతో సంపూర్ణార్థమును చెప్పు శక్తి ఆ ఒక్కపదమునకే ఉండుననవలయును" అని అభిసంధి.

మీమాంసకుల అర్థాపత్తిని దూషించుటకై మూడు రకములను (అభిప్రాయములను) ఊహించి—వాని నన్నింటిని ఈ కారిక తిరస్కరించినది.

1. శబ్దమువలన శబ్దమునకు ఆక్షేపము,
2. అర్థమువలన శబ్దమునకు ఆక్షేపము,
3. శబ్దమువలన అర్థమునకు ఆక్షేపము,

అనునవి మూడు వికల్పములు. శబ్దార్థములకు ఉండు వాచ్యవాచకభావ మను సంబంధము (వాచకము=శబ్దము, వాచ్యము=అర్థము), దానిస్వభావమును బట్టి, శబ్దము గాని అర్థము గాని తనకు సంబంధించని వేరొకదానిని ఆక్షేపించుట అసంగతమని ప్రకృతఖండనము యొక్క సారము.

ఇక 'అర్థము అర్థమును ఆక్షేపించును' (పిదప ఆ అర్థములను భావించుకొన వచ్చును)అనురీతిని నాలుగవ వికల్పమును కూడ చూపవచ్చును కాని అది ఈ సందర్భములో బొత్తిగా అతకదు. ఆతీరు నైయాయికుల అనుమాన ప్రమాణమే అయిపోవును. వాచ్య వాచక భావముగల శబ్దార్థముల విషయములో ఆవిధమైన అనుమానము నప్పదు. ('ఒకే పదము-సమగ్రార్థమును బోధించును' అను ప్రకృతసిద్ధాంతములో శబ్దమొకటి తప్పక ఉచ్చరింప బడవలెను గదా!)

మరల మీమాంసకుడు ఆక్షేపించుచున్నాడు.

నష్టరూపమి వాఖ్యాత మాక్షిప్తం కర్మవాదినా
యది ప్రాప్తం ప్రధానత్వం యుగపద్భావసత్త్వయోః . 387

ఆఖ్యాతమ్=క్రియాపదము (తిఙంతము), నష్టరూపమ్+ఇవ=స్వరూపము పోయినదా-అన్నట్లు (వాడనక్కరలేకుండానే), కర్మవాదినా=కర్మను చెప్పు పదముచేతనే, ఆక్షిప్తమ్=కల్పించబడినది (తెలియబడునది), యది=అయినచో, భావసత్త్వయోః= క్రియకు, ద్రవ్యమునకును, ప్రధానత్వమ్=ప్రాముఖ్యము, యుగపత్=ఒక్కసారిగా, ప్రాప్తమ్=ప్రాప్తించును.

తా. 'ద్వారమ్' మొదలగు కర్మపదమును మాత్రమే ఉచ్చరించిన స్థలములలో 'పిధేహి' మొదలగు క్రియాపదమును తెచ్చుకొనక్కర లేకుండగనే సంపూర్ణమగు వాక్యార్థము లభించునని చెప్పినయెడల, సుబంతమే తిఙంతముయొక్క అర్థమును కూడ చెప్పినట్లు అగును గాన, ద్రవ్యమునకు క్రియకును భేదమే లేకుండపోయెడిని.

వి. ఈ కారిక మరల మీమాంసకుల ఆక్షేపమును చూపును.

లింగము, సంఖ్యయు గలది ద్రవ్యమని, వ్యాపారము క్రియ అనియు నిర్వచింతురు. ద్రవ్యమునకు సత్త్వమని, క్రియకు భావమనియు నామాంతరములు. వాక్యమందు క్రియయే ప్రధానమని, ద్రవ్యము అప్రధానమనియు వైయాకరణుల సిద్ధాంతము. అయినపుడు క్రియాపదమును వాడకుండగనే, వాక్యము సంపూర్ణమగునని అంగీకరించినచో, ఉచ్చరించిన ద్రవ్యవాచక పదమే క్రియను కూడ బోధించునని పర్యవసించును. కాగా ఆ రెండింటి యొక్క ప్రత్యేకతయు నశింపవలసివచ్చును. (రెండును ఒకటే అనవలసివచ్చును:)

'క్రియాప్రధాన మాఖ్యాతమ్' (ఆఖ్యాతమ్ = తిఙంతము, క్రియాప్రధానమ్ = వ్యాపారమునే ముఖ్యముగా బోధించును), 'సత్త్వప్రధానాని నామాని' (నామాని = సుబంతములు, సత్త్వ ప్రధానాని = ద్రవ్యమునే ముఖ్యముగా చెప్పును), 'ప్రధానం వ్యాపారః' (వాక్యములో క్రియయే ముఖ్యము) అను వచనములు వైయాకరణుల మతమును ప్రతిపాదించును. అట్టే ద్రవ్యమును 'సిద్ధము' (సిద్ధముగా ఉండునది) అని, క్రియను 'సాధ్యము' (చేయదలచిన పని) అనియు వైయాకరణులు వ్యవహరింతురు.

కాగా 'విధేహి' అను క్రియాపదముయొక్క అర్థమును కూడ "ద్వారమ్" అను సుబంతము (కలుపుకొని) చెప్పుననన్నచో, సుబంతములకు, తిఙంతములకును భేదమే లేదని తేలునుగాన, వాని వాడుక 'కలగూరగంప'గా తయారగును. వైయాకరణుల సిద్ధాంతములు, ప్రత్యేకలక్షణములు, నియమములు అన్నియు పాడైపోవునుగదా ! 'యత్ర సాధనవృత్తి ర్యః' (884) మొదలగు శ్లోకముయొక్క భావమునే మరొకరీతిలో ఈ శ్లోకము ప్రతిపాదించినది.

అఖండవాది సమాధానమును ఈ కారిక చూపుచున్నది.

తైస్తు నామసరూపత్వ మాఖ్యాత స్యోపవర్ణ్యతే
అన్వయవ్యతిరేకాభ్యాం వ్యవహారో విభజ్యతే . 888

ఆఖ్యాతస్య = తిఙంతమునకు (క్రియాపదమునకు), నామసరూపత్వమ్ = సుబంతముతో సాదృశ్యము (నామవాచకముయొక్క ఆకారమును కలిగియుండుట), తైః + తు = వారిచే (వైయాకరణులచే), ఉపవర్ణ్యతే = చెప్పబడును. అన్వయవ్యతిరేకాభ్యామ్ = అన్వయ వ్యతిరేకమువలన, (ఉండుట—లేకపోవుట అను వివేచనమునుబట్టి)—అనగా సుబంతముల యొక్క, తిఙంతములయొక్కయు ప్రసిద్ధమైన ప్రయోగరీతిననుసరించి, వ్యవహారః = ఆ యా పదములవాడుక, విభజ్యతే = వేరుచేయబడును. (విడివిడిగా నిశ్చయింపబడును).

తా. 'ద్వారమ్' అను కర్మపదమునుమాత్రమే వాడిన వాక్యములో— ఆ పదమే 'విధేహి' (మూయుము) అను క్రియాపదమని అనుకొనవలెను. వాక్యములో క్రియయే ముఖ్యము కాన, 'ద్వారమ్' అను పదమే 'విధేహి' అను పదముయొక్క అర్థమును బోధించుటకై వాడబడిదని భావనచేసికొనవలెను. (క్రియాపదమునకు బదులుగా నామవాచకమును వాడి, దానివలన క్రియారూపమగు అర్థమునుపొందుట. తిఙంతమునకు నామవాచక సాదృశ్యమనగా ఇదియే). కాగా 'ద్వారమ్' అనగా 'విధేహి' అనియే అర్థము. ఇట్లు నామవాచకమును క్రియావాచకముగా మార్చుకొనవలెను. (పిదప 'ద్వారమ్' అనుదానిని మరొకసారి భావనచేసికొన్నచో, అదియే కర్మనుకూడ చెప్పగలుగును. అట్లు వాక్యార్థము పూర్తిఅగును). అట్లయినచో నామపదములకు, క్రియాపదములకును సాంకర్యమేర్పడి, వ్యామోహము కలుగునేమో—అని శంకింపనక్కరలేదు. 'త్వం ద్వారం విధేహి' మొదలగు పూర్తివాక్యముల అనుభవమునుబట్టి, 'ఇది నామవాచకము ఇది క్రియాపదము'—అను విభాగము, నిశ్చయమును కలుగుచునే ఉండును.

వి. మీమాంసకుల పైఆక్షేపమునకు వైయాకరణు లిచ్చు సమాధాన మిది : "నామాఖ్యాతసరూపా యే కార్యాంతరనిబంధనాః" (818)అనుకారికలో వివరించినరీతి ననుసరించి, (అశ్వః అను పదమును సుబంతముగను, తిఙంతముగనుకూడ వాడునట్లు—అశ్వః = గుర్రము, అశ్వః = నీవు వెళ్ళితివి) 'ద్వారమ్' అను ఒకపదమునే రెండువిధములుగను

వాడుకొనవచ్చును. అందుకుగాను మీమాంసకుల 'శ్రుతార్థాపత్తి' అను మార్గమును అవలంబింప నక్కరలేదు. సుబంతతిజంతముల వివేచనమును అన్వయవ్యతిరేకముల మూలముగా, సులభముగానే పొందవచ్చును.

అన్వయః = ఉండుట—అనగా ఒకటి ఉన్నపుడు దానికి సంబంధించిన వేరొకటి తప్పనిసరిగా ఉండుట, వ్యతిరేకః = లేకుండుట = ఒకటిలేనపుడు దానికిసంబంధించిన వేరొకటి తప్పక లేకుండుట. అన్వయమును సూటిగాచెప్పి, వ్యతిరేకమును త్రిప్పి చెప్పుదురు. ఉదాహరణము : 'పొగఉన్నచోట నిప్పు తప్పక ఉండును' - అది అన్వయము. 'నిప్పులేని చోట పొగ ఎప్పుడును ఉండదు' - ఇది వ్యతిరేకము. ఈ తీరు నుపయోగించుకొని, వాక్యములలోని సుబంతతిజంతములను విశకలితముగా తెలిసికొనవచ్చును.

కాగా—ప్రకృతమున 'ద్వారమ్' అనుపదము ప్రక్కను 'పిధేహి' అను పదమున్నచో, ద్వారశబ్దమునకు ద్వారమను ద్రవ్యార్థమును, 'పిధేహి' అను పదములేనపుడు, 'మూయుము' అను క్రియార్థమును చెప్పుకొనవచ్చును. అట్టే ప్రకృతి ప్రత్యయవిభాగమును కూడ పొందవచ్చును. కావుననే 'సిద్ధము—సాధ్యము ఒకటైపోవును' 'సుబంతము తిజంత మెట్లగును' మొదలగు శంకలకు అవకాశములేదు.

'పిధేహి' అను ఒకక్రియాపదమును మాత్రమే వాడినపుడుకూడ ఇట్టి పద్ధతిని ఊహించుకొని అన్వయించుకొనవలెను. 'త్వం ద్వారం పిధేహి' అను సమగ్రవాక్యము వలెనే 'ద్వారమ్', 'పిధేహి' అను విడివిడిపదములు కూడ సమగ్రవాక్యములే అగును.

"ద్వారమ్" మొదలగు చోట్ల సంశయము కలిగినను, ప్రకరణాదులవలన అర్థమును నిశ్చయింప వీలగునని అనుచున్నాడు.

> నచాఽపి రూపాత్సందేహే వాచకత్వం నివర్తతే
> అర్ధం పశో రివ యథా సామర్థ్యాత్తద్వికల్ప్యతే. ౩౩౭

రూపాత్ = శబ్దముయొక్క ఆకారమునుబట్టి, సందేహే + అపి = అర్థమువిషయమున సంశయము కలిగినను, వాచకత్వమ్ = అర్థమును సూటిగాబోధించుట, న + చ + నివర్తతే = పోడుకాదు. 'అర్ధమ్-పశోః-ఇవ' యథా = 'అర్ధంపశోరివ' (అర్ధమ్ = సగము, పశోః = పశువుయొక్క, ఇవ = వలె) అను వాక్యమందువలె, సామర్థ్యాత్ = సామర్థ్యము వలన (కావలసినఅర్థమును బోధించుశక్తి, ప్రకరణము మొదలగు ఉపాయమువలన), తత్ = ఆ వాచకత్వము, వికల్ప్యతే = నిశ్చయింపబడును.

తా. "మీదికారికలో చెప్పినట్లు 'ద్వారమ్' అను పదము కొన్నిచోట్ల (ఆ ఒక్క పదమునే వాడిన వాక్యములో) క్రియాపదముయొక్క అర్థమును చెప్పును" అని ఒప్పుకొన్నచో, ఆ పదముయొక్క నిశ్చితార్థమునుగురించి సంశయముకలుగవచ్చును. (మరి కొన్నిచోట్ల 'ద్వారమ్' అనునది ద్వితీయైకవచనముగా వాడబడునుగదా !) కాని సామర్థ్యము, ప్రకరణము, మొదలగు పూర్వముచెప్పిన ఉపాయములతో ప్రకృతార్థమును నిశ్చయించుకొనవచ్చును కాన, అట్టి సంశయము తీరిపోవును.

"దేవదత్తస్య అర్ధం పశోః ఇవ" అను వాక్యమందు కలుగుసంశయమును (దేవదత్తునియొక్క సంగోరుభాగమా? లేక పశువుయొక్క సంగోరుభాగమా? అని సందేహము)

సామర్థ్యాదుల సాయముతోనే తీర్చుకొందురు (ప్రకరణాదులవలన, దేవదత్తునియొక్క సంగోరుభాగము పశువువలె ఉన్నదని కాని, పశువుయొక్క సగముభాగము దేవదత్తునివలె ఉన్నదని కాని నిశ్చయించుకొందురు).

వి. "శబ్దముయొక్క ఆకారము (వర్ణక్రమము) ఒకేవిధముగా ఉన్నచో, అర్థమునుగురించి సంశయము ఏర్పడి, తుదకు ఎట్టి యర్థమును చెప్పలేక, ఆ శబ్దము 'అవాచకము' కావలసివచ్చును" అని మీమాంసకు లందురు. వారి కిది సమాధానము : రూపసాదృశ్యమునుబట్టి అర్థమువిషయమున సంశయము కలిగినంతమాత్రముచేత ఒకశబ్దముకాని, ఒక వాక్యముకాని, అవాచకము (ఏ అర్థమును చెప్పనిది) కానక్కరలేదు. ప్రకరణాదుల సాయముతో అట్టిచోట్ల అర్థమును నిశ్చయించుకొని, వాచకత్వమును నిలబెట్టుదురు (ప్రకరణాదులు అర్థమును నిర్ణయించునని 314, 315,316, కారికలు వివరించినవి). ప్రకరణాదులసాయము ఇంచుమించు అన్నిస్థలములందును ఆవశ్యకమే అగుచుండును. అది లేనిచో ప్రతియొక ప్రయోగములోను, పదమువిషయమునగాని వాక్యమువిషయమునగాని ఏదో యొకసంశయము కలుగుచునేఉండును గాన, అవన్నియు అవాచకములు కావలసివచ్చును. ఇట్టి సందర్భమునకు ఉదాహరణముగా "అర్ధంపశోరివ" అను వచనము చూపబడినది. ఇందు "దేవదత్తస్య" అను షష్ఠ్యంతమును కలుపుకొనవలెను. (లేక ఏదో ఒక వృత్తిని చెప్పు షష్ఠ్యంతము చేర్చవలెను. అపుడే సంశయమునకు అవకాశము).

ప్రకృతమున "ద్వారమ్" అను ఒక పదమునే వాడినచోట, "పిధేహి"(మూయుము) అనునది అర్థమని, "త్వం ద్వారం పిధేహి" అనుస్థలములో "ద్వారమును" అని అర్థమనిన్ని సామర్థ్యమునుబట్టి నిశ్చయించుకొనవలయును.

శ్రుతార్థాపత్తిని అంగీకరించు మీమాంసకుడు మరల ఆక్షేపించుచున్నాడు.

సర్వం సత్త్వపదం శుద్ధం యది భావనిబంధనమ్
సంసర్గే చ విభక్తోఽస్య తస్యాఽర్థో న పృథగ్యది .　　　　840

క్రియాప్రధాన మాఖ్యాతం నామ్నాం సత్త్వప్రధానతా
చత్వారి పదజాతాని సర్వ మేత ద్విరుధ్యతే .　　　　841

శుద్ధమ్ = కేవలమైన, (ఆఖ్యాతపదముతో విరహితమైన) సర్వమ్ = ప్రతియొక, సత్త్వపదమ్ = ద్రవ్యవాచకపదము ("ద్వారమ్" మొదలగునది), భావనిబంధనమ్ = క్రియాపరమైనది (క్రియనుచెప్పునది), యది=అయినచో, సంసర్గే + చ=క్రియాపదముతో సంబంధమున్నపుడు, అస్య = ఈ నామవాచకమునకు, తస్య = ఆ క్రియావాచకమునకు, విభక్తః= వేరుచేయబడిన, అర్థః=అర్థము, పృథక్ = వేరుగా, న + యది = లేకపోయినచో,

ఆఖ్యాతమ్ = తిఙంతము (క్రియాపదము), క్రియాప్రధానమ్ = క్రియను ముఖ్యముగా బోధించునది అను అంశము, నామ్నామ్ = సుబంతములకు, సత్త్వప్రధానతా = ద్రవ్యము ముఖ్యముగా ఉండుట అను అంశము, పదజాతాని=పదసమూహములు, చత్వారి= నాలుగువిధములు అను అంశమున్ను (నామము, ఆఖ్యాతము, ఉపసర్గము, నిపాతము అని నాలుగువిధములు), ఏతత్ = ఈ, సర్వమ్ = అంతయు, విరుధ్యతే = విరోధించును (ఎదురు తిరుగును).

తా. మీమాంసకులు మరల ఇట్లు ఆక్షేపించుచున్నారు.

ఇంతవరకు జరిగిన చర్చవల్ల కేవలము సుబంతమైనను (ద్వారమ్), కేవలము తిఙంతమైనను (వర్షతి) వాక్యము కావచ్చునని, శేషించినపదముల అర్థమును, ఉచ్చరించిన పదమొక్కటే చెప్పగలుగుననియు వైయాకరణులమతమని తెలినది. అట్లయినపుడు ఒకచో సుబంతము తిఙంతముగను, వేరొకచో తిఙంతము సుబంతముగను పనిచేయును. సుబంతములకు, తిఙంతములకును వేరువేరు అర్థ మనుభావము పోదయి – ప్రత్యేకత నశించి సాంకర్య మేర్పడును. "క్రియాప్రధాన మాఖ్యాతమ్" "సత్త్వప్రధానాని నామాని" "చత్వారి పదజాతాని—నామాఖ్యాతే చ—ఉపసర్గనిపాతా శ్చ" అను చిరప్రసిద్ధములైన వైయాకరణ సంప్రదాయములకే భంగము వాటిల్లును.

వి. క్రియాపదము చెప్పవలసిన అర్థమును నామపదము, నామవాచకము చెప్ప దగిన అర్థమును క్రియాపదమున్ను చెప్పుట ప్రారంభించినచో వానికి వేరువేరుగా లక్షణములను చూపించుట, వాని ప్రయోగవిషయములో ఒకవిధమైన వ్యవస్థను ఆదరించుటయు వ్యర్థముకావలసివచ్చును. ముఖ్యముగా—నామము, ఆఖ్యాతముకూడ ఒకతీరుగనే పనిచేసినపుడు, "పదములు నాలుగువిధములు" అనులెక్క ఎట్లుకుదురును?—అని సారము.

"క్రియాప్రధాన మాఖ్యాతమ్" మొదలగులక్షణవాక్యములు యాస్కాచార్యుని 'నిరుక్త'మను గ్రంథములో ఉన్నవి. (చూడు: నిరుక్తము – 1, వ అధ్యాయము).

1. క్రియాప్రధాన మాఖ్యాతమ్: ఆఖ్యాతమ్ = తిఙంతము, క్రియాప్రధానమ్ = వ్యాపారమును ముఖ్యముగా చెప్పును.

2. సత్త్వప్రధానాని నామాని: నామాని = నామవాచకములు, (సుబంతములు) సత్త్వప్రధానాని = ద్రవ్యమును ముఖ్యముగా చెప్పును.

3. చత్వారి పదజాతాని - నామాఖ్యాతేచ ఉపసర్గ నిపాతాశ్చ : పదజాతాని = భాషయందలి పదములన్నియు, చత్వారి = నాలుగువిధములు. నామాఖ్యాతేచ-ఉపసర్గ నిపాతాశ్చ: నామవాచకము, క్రియాపదము, ఉపసర్గము, నిపాతము—అని.

ఉపసర్గము = క్రియాపదముతో సంబంధమునుకలిగి, ఒకానొక విశేషార్థమును సూచించునది. ప్ర, పరా, అను - మొదలగునది. ఉదా: ప్రభవతి, పరాజయతే, అనుకరోతి, మొదలగునవి.

నిపాతము: సముచ్చయము (కూడిక), నిర్ధారణము (నిశ్చయము), వికల్పము (సంశయము), మొదలగు అర్థములనుచెప్పు, చ – ఏవ – వా – మొదలగునవి. ఉదా: రామశ్చ లక్ష్మణశ్చ, సః ఏవ, శివో వా హరిర్వా మొదలగునవి.

పై ఆక్షేపణమును తిరస్కరించుచున్నాడు.

వాక్యస్య బుద్ధౌ నిత్యత్వ మర్థయోగం చ లౌకికమ్
దృష్ట్వా చతుష్ట్వం నాస్తీతి వార్తాక్షౌదుంబరాయణౌ. 342

బుద్ధౌ = బుద్ధియందు, వాక్యస్య = ఎట్టి అవయవములును లేని అఖండవాక్యము, నిత్యత్వమ్ = నిత్యమగుటను, దృష్ట్వా, = పరిశీలించి, లౌకికమ్ = లోకసిద్ధమైన (అనిత్యమైన) అర్థయోగమ్ = అఖండార్థముతోడి సంబంధమును, దృష్ట్వా + చ = పరిశీలించియు, చతు

ష్ట్వమ్ = నాలుగగుట (పదములు నాలుగువిధములను విభాగము) న + అస్తి + ఇతి = లేదు అని, వార్తాక్షౌదుంబరాయణౌ = వార్తాక్షుడు, ఔదుంబరాయణుడు అను ఇద్దరు ఆచార్యులు (చెప్పియున్నారు).

తా. ఏ విధమైనభాగములున్ను (సుబంతము, తిఙంతము, ఉపసర్గము, మొదలగు అవయవములు) లేని అఖండవాక్యము నిత్యము. అది బోధించు అర్థముకూడ అఖండమే. (సిద్ధాంతములో మట్టుకు అర్థము అసత్యమే; శబ్దమే అర్థముగా భాసించును) కావున పదములయు, పదార్థములయు ఉనికి కేవలము కల్పితము. కాగా 'పదములు నాల్గు విధములు' మొదలగు నియమములున్ను కల్పితములే.అవి వాస్తవములు కానందున ప్రతిబంధకములు కావు—ఈవిధముగా వార్తాక్షుడు, ఔదుంబరాయణుడు అను ప్రాచీనవైయాకరణులు తత్త్వమును బోధించి ఉన్నారు. అదియే మాకుకూడ (గ్రంథకర్తకు) సమ్మతము.

వి. మీమాంసకులకు ఇది సమాధానము : వర్ణము, ప్రకృతి, ప్రత్యయము, మొదలగు విభాగములన్నియు కృతకములు. అఖండమైనట్టి, వాక్యరూపముగా ఉండునట్టియు స్ఫోటశబ్దము మాత్రమే నిత్యము. దీనిని గుర్తించుటకే కల్పితమైన విభాగములన్నియు ఉపయోగించును. అట్లే అఖండవాక్యముయొక్క అర్థము కూడ, వ్యక్తియొక్క (చెప్పేవాడు—వినువాడును) బుద్ధియందు అఖండముగనే ప్రకాశించును. ఈ ప్రకాశమును 'ప్రతిభ' అని అందురు. ఇదియు ఒకవిధముగా అసత్యవస్తువే. (శబ్దమే అర్థముగా భాసించును గాన వేరుగా అర్థమనునది ఉండదు-చూడు : ద్వితీయకాండము—145 వ శ్లోకము) ఇది వైయాకరణుల సిద్ధాంతసారము. ఇదంతయు మొదటి కాండమందు, రెండవ కాండమందును ఆయా సందర్భములలో వివరింపబడినది. తదనుసారము పదముల విభాగములు, లక్షణములు మొదలగునవి అన్నియు వైయాకరణులకు లేనట్టివే, లేనివానితో—వారికి పని ఏమి ?

"పదము" మొదలగు విభాగములు అన్నియు సత్యములని మీమాంసకు లందురు. వారి సిద్ధాంతములు వేరు. వానినిబట్టి వైయాకరణులను ఆక్షేపించుట అసంగతము.

'ఇట్లయిన శాస్త్ర మెందుకు ?' అనుశంకకు సమాధాన మిచ్చుచున్నాడు.

వ్యాప్తిమాంశ్చ లఘుశ్చైవ వ్యవహారః పదాశ్రయః
లోకే శాస్త్రే చ కార్యార్థం విభాగేనైవ కల్పితః . 348

వ్యాప్తిమాన్ + చ = అన్నిచోటులందును ప్రసరించునట్టియు, లఘుః + చ + ఏవ = సులభమైనట్టియు, పదాశ్రయః = పదములనుబట్టి జరుగు, (పదములను విభజించి చూపునట్టి), వ్యవహారః = వాక్యములయొక్క వాడుక, లోకే = లోకమందు (భాషయందు), శాస్త్రే + చ = వ్యాకరణశాస్త్రమందును, కార్యార్థమ్ = ప్రయోజనమును ఉద్దేశించి (సాధుశబ్దములను తెలిసికొనుట మొదలగు ప్రయోజనము), విభాగేన + ఏవ = ప్రకృతి, ప్రత్యయము, వాని అర్థము మొదలగు విభాగములతో, కల్పితః = కల్పింపబడినది.

తా. విభాగములన్నియు అసత్యమైనపుడు—వాక్యమును పదముగాను, పదమును ప్రకృతి + ప్రత్యయము అనురీతిని విభజించుటయు, వాక్యార్థ మిది, ఇది పదార్థము, ప్రకృతియొక్క అర్థమిది, ఇది ప్రత్యయముయొక్క అర్థము—అని విభజించి చూపుటయు

వైయాకరణులు ఎందుకు చేయుచున్నారు? అందుకై బయలుదేరిన వ్యాకరణశాస్త్ర మెందుకు? అను శంకలు పుట్టవచ్చును. వాని కిది సమాధానము: సాధుశబ్దములను, వాని అర్థములను సర్వతోముఖముగ, సులభముగ, అనాయాసముగను తెలిసికొనుటకు, ఆ ఉపాయములద్వార మున తుదకు సత్యమైన అఖండవాక్యమును తెలిసికొనుటకును — లోకమందుకాని, వ్యాకరణ శాస్త్రమందుకాని ఆయా విభాగములు ఉపయోగపడును. అంతమాత్రమున శాస్త్రము వ్యర్థమై పోదు. అది సత్యాన్వేషణకొరకు బయలుదేరిన ఒక సాధనము. అట్లే విభాగములు యథార్థ ములును కానేరవు. అవి అసత్యములే.

వి. వ్యాప్తిః అస్య అస్తి = వ్యాప్తిమాన్ = అన్నిచోటులందు ప్రసరింప గలది. వ్యాకరణశాస్త్రములోని ప్రక్రియ అంతయు వ్యాప్తిగలదియే. అనగా ఒక లక్షణము వలన లక్ష్యము లన్నియు తెలియును. ఉదా॥ ఒకసంధిలక్షణమువలన దానికిచెందిన లక్ష్యము లన్నియు తెలిసిపోవును. ఒకపదముయొక్క వ్యుత్పత్తి తెలిసినచో సజాతీయములగు పదము లన్నింటియొక్క వ్యుత్పత్తియు తెలిసిపోవును.

'పదపదార్థముల మూలముగనే జనులకు ప్రవృత్తినివృత్తులు కలుగుచుండునుగదా ! కాగా పదపదార్థములు అసత్యము లనుట సమంజసమా?' అను శంకను తొలగించుచున్నాడు.

న లోకే ప్రతిపత్తౄణా మర్థయోగాత్ ప్రసిద్ధయః
తస్మాద లౌకికో వాక్యా దన్యః కశ్చి న్న విద్యతే. 344

లోకే = లోకమందు (భాషయొక్కవాడుకలో), అర్థయోగాత్ = సత్యమైన అర్థ ముతో సంబంధము ఉన్నందువలననే, ప్రతిపత్తౄణామ్ = తెలిసికొనువారియొక్క, ప్రసి ద్ధయః = ఆయా ప్రవృత్తులు (ఒకపనిచేయుట, మానుటయు), న = జరుగలేదు. (లేకపోయి నను జరుగుచున్నవి.) తస్మాత్ = అందువలన, వాక్యాత్ = సత్యమైన అఖండవాక్యము కన్న, అన్యః = వేరైన, అలౌకికః = సత్యమైనది, కశ్చిత్ = ఏదియు, న + విద్యతే = లేదు.

తా. "పదములు, వాని అర్థములును అన్నివిధముల అసత్యమైనపుడు, లోక మందలి వ్యవహారములలో వానిని పూర్తిగా విడిచిపెట్టుట జరుగదేమి? పదపదార్థమూలముననే అభిమతభావమును పొందుచున్నట్లు ఎందుకు అనిపించును?" అను శంకకు సమాధానము చూపుటకై ఈ కారిక బయలుదేరినది.

అసత్యమైన ఉపాయముతో కూడ, సత్యమైన విషయమును తెలిసికొనుట లోక ములో కనిపించును. ఉదా: పెద్దపులియొక్క బొమ్మను వేసి 'ఇది పులి' అందుము. బొమ్మ అను అసత్యమైన సాధనముతో సత్యమైన పులియొక్క జ్ఞానము కలుగును. వీలు కుదిరినపుడు వాస్తవమైనపులిని చూచినందువలననే "ఇది పులి" అను జ్ఞానము కలుగవచ్చును. కాని సత్యము సిద్ధించుటకు ఎల్లపుడును సత్యమైనసాధనమే ఉండవలయునను నియమము మాత్ర మక్కరలేదు. అందుచే అఖండవాక్యమే సత్యమైనది. దానిని తెలుపుటకు, పద పదార్థములు పరికరములుగా ఉపయోగించును. అవి సత్యములు కావు.

వి. వైయాకరణుల మతమున, సత్యమైన శబ్దబ్రహ్మమును తెలియుటకై ఉప యోగించు వర్ణ, పదాదిరూపములైన ఉపాయము లన్నియు అసత్యములే. కనుకనే 'ఉపేయ ప్రతిపత్త్యర్థాః ఉపాయా అవ్యవస్థితాః' (లక్ష్యమును పొందుటకుపయోగించు సాధనములు అని

యతములు) మొదలగు వచనములతో గ్రంథకర్త ఈ అభిప్రాయమును తరచు సూచింపు చుండును.

ఒకానొక జ్ఞాపకమువలన తెలియదగు అర్థముకూడ, వాక్యమువలననే పొందబడునని సూచించుచున్నాడు.

అన్యత్ర శ్రూయమాణైశ్చ లింగైర్వాక్యేషు సూచితాః
స్వార్థా ఏవ ప్రతీయంతే రూపాభేదా దలక్షితాః. 345

రూపాభేదాత్ = స్వరూపము ఒకటే అయినందువలన, అలక్షితాః = స్పష్టముగ తెలియబడని, స్వార్థాః + ఏవ = ప్రస్తుతమైన వాక్యముయొక్క పూర్తిఅర్థములే, అన్యత్ర = వేరొక, వాక్యేషు = వాక్యములలో (విశేషార్థమును సూచించు పదములచే), సూచితాః = సూచింపబడినవై, ప్రతీయంతే = తెలియబడును.

తా. కొన్నివాక్యములలో వాక్యార్థము పూర్తిగా తెలియుటకు, వేరొకవాక్యము లోని పదము (దానిఅర్థము) సూచకముగ ఉపయోగపడును. దానివలన సూచింపబడిన అర్థమునుకూడ కలుపుకొనిన తరువాతనే పూర్తిఅర్థము తెలియుచుండును. అయినను అట్టి చోట్లకూడ, ఉచ్చరించిన వాక్యముచేతనే సంపూర్ణార్థము లభించునని, సూచకమైన పదము, కేవలము అర్థమును నిర్ణయించుటకై అవలంబించు ప్రకరణాదులవంటి పరికరము మాత్రమే అనియు గ్రహింపవలెను.

వి. "వేరొక వాక్యమందలి సూచకమైన (జ్ఞాపకమైన) పదమును అపేక్షించు వాక్యములుకూడ సంపూర్ణవాక్యములే" అని విశదీకరించుట ఈ కారికయొక్క పని. యాగము నకు సంబంధించిన ఒకవాక్యమును ఉదాహరణముగా తీసుకొనవచ్చును. 'అక్తాః శర్కరాః ఉపదధాతి' (అక్తాః = జిడ్డుచేయబడిన, శర్కరాః = పటికబెల్లపుముక్కలను, ఉపదధాతి = ఉంచుకొనవలెను) ఇచట 'అక్తాః' అనగా 'జిడ్డుచేయబడినవి' అని అర్థము. జిడ్డుచేయుట 'నూనెతోనా? లేక నెయ్యితోనా?' అని సంశయము కలుగును. అది తీరుటకు 'తేజోవై ఘృతమ్' (ఘృతమ్=నేయి, తేజః + వై = కాంతియేగదా!) అను వేరొకవాక్యములోని 'ఘృతమ్' అను పదము సూచకముగ (లింగముగ) ఉపయోగించును. నేతిని పొగడుటచే 'నేతితో జిడ్డు చేయబడిన' అను అర్థము అభిమతమని స్ఫురించి, మొత్తము వాక్యార్థము నిస్సంశయముగ పూర్తిఅగును. ఇటువంటిసందర్భములలో కూడ, 'అక్తాః శర్కరా ఉపదధాతి' అనువాక్యమే 'ఘృతేన అక్తాః శర్కరా ఉపదధాతి' అను సమగ్రమైన అర్థమును బోధించునని, వాక్యాంత రమున ఉండు 'ఘృతమ్' అను పదము సూచకముమాత్రమే అనియు అనవలెను. 'అక్తాః' అను శబ్దరూపమునుబట్టి (ఘృతేన-అక్తాః, తైలేన-అక్తాః—అను రెండు ప్రయోగములలోను 'అక్తాః' అను పదమొకటే గాన) విశేషార్థము తెలియుట కష్టము కావున, అట్టి విశేషార్థము కొరకై సూచకమును స్వీకరించుట ఒక ఉపాయము.

లింగ్యతే = సూచ్యతే అనేన = లింగమ్. ఒక విశేషార్థమును సూచించు పదము. సూచకము, జ్ఞాపకము, గమకము, లింగము—అనునవి పర్యాయపదములు.

సామాన్యముగా వాడుకొను లౌకిక వాక్యముల విషయములో కూడ "అల్లక్కడ అపదమున్నది కనుక దానిని బట్టి, ఇక్కడ ఈ వాక్యమునకు ఈయర్థమునే చెప్పవలెను" అని సమన్వయింతుము. అర్థమును జ్ఞాపనము చేయురీతి అనగా ఇదియే.

వ్యాకరణసూత్రములలో జ్ఞాపకపదములుగలవి అధికముగనే ఉన్నవి. అయినను శాస్త్రీయ సంకేతము క్లేశకరమని, ఈ విషయమున సూత్రముల ఉదాహరణములను చూప లేదు. (ఆయాస్థలములందు శాస్త్రీయోదాహరణములను విడిచిపెట్టుట పాఠకులకు క్లేశమును పరిహరించుటకే).

కాగా—విశేషార్థమును సూచించుపదము ఆవశ్యకమైన వాక్యములు కూడ సంపూర్ణ వాక్యములే అని, వాక్యైకదేశములు (వాక్యఖండములు) కావనియు సారము.

శాస్త్రీయములగు వాక్యములలో బాధ్యబాధక భావముయొక్క తీరును నిరూపించు చున్నాడు.

ఉత్సర్గ వాక్యే యత్త్యక్త మశబ్దమివ శబ్దవత్
తద్బాధకేషు వాక్యేషు శ్రుత మన్యత్ర గమ్యతే. 846

ఉత్సర్గవాక్యే = సామాన్యవాక్యమందు, అశబ్దమ్ + ఇవ = బోధించుశబ్దములు లేవా—అన్నట్లుగను, శబ్దవత్ = బోధించుశబ్దములతో చెప్పినట్లుగను, యత్ = ఏ విషయము, త్యక్తమ్ = విడువబడునో, తత్ = ఆ విషయము, బాధకేషు = బాధించునట్టి, వాక్యేషు = విశేషవాక్యములందు, శ్రుతమ్ = వినబడినదై, అన్యత్ర = వేరొకచోట (సామాన్య వాక్య మందే), గమ్యతే = తెలియబడును.

తా. చెప్పదలచుకొన్న విషయము అన్నింటికిని వర్తించునట్లు ప్రతిపాదించు వాక్యము సామాన్యవాక్యము. ఉదా:- "ఆవులను పొలమునుండి యింటికి తీసుకొని రమ్ము." ఇచట "తీసికొని వచ్చుట" ఆవులన్నింటికిని ఉద్దేశింపబడినది. ఒక ప్రత్యేక విషయమును వెంటనే చెప్పి, ముందు చెప్పిన సామాన్య వాక్యమును అడ్డు పెట్టునట్టి వాక్యము బాధక వాక్యము లేక విశేషవాక్యము. ఉదా - "తెల్ల ఆవులను రెండింటిని పొలములోనే కట్టి వేయుము" ఇచట తెల్ల ఆవులను ఇంటికి తెచ్చుట, వారింపబడినందున మీది వాక్యమునకు ఇది బాధకమైనది. ఇట్టి రీతిని కూర్పబడిన వాక్యములను, సామాన్య విశేషవాక్యములు, బాధ్యబాధకవాక్యములు, ఉత్సర్గాపవాదవాక్యములు అను పేర్లతో వ్యవహరింతురు. లోకము లోపలనే ప్రతి యొక శాస్త్రమందును, ఏదో ఒక సందర్భమున సామాన్యవిశేషవాక్యములు ఉండకతప్పవు. అట్టి వాక్యములవలన కలుగు అర్థప్రతిపత్తిని ఈ కారిక విశదీకరించును.

విశేషవాక్యము యొక్క అర్థము కూడ, సామాన్య వాక్యము వలననే తొలుత పూర్తిగా అవగతమైపోవును. తరువాత విశేషవాక్యము వలన అది స్పష్టపడును. అనగా విశేష మెప్పుడును సామాన్యములోని భాగముగనే ఉండును. విశేషవిషయమును మొదట స్పష్టముగ చెప్పకపోయినను, తాత్పర్యమునుబట్టి చెప్పినట్లే అనిపించి, "విశేషము ఉండును" అని సామాన్య వాక్యమును విను వ్యక్తికి (ఉచ్చరించు వ్యక్తికిని) బోధపడును. ఉత్తర క్షణ ములో విశేషముచ్చరింపబడును. దాని భావము అపుడు విస్పష్టమగును. అయినను ఆ విశే షార్థము కూడ సామాన్య వాక్యము నుచ్చరించు క్షణములోనే సూచింపబడి, సంపూర్ణ వాక్యా ర్థము (సామాన్య విశేష వాక్యముల యొక్క మొత్తము భావము) తెలిసిపోవును. ఇందులో తాత్పర్యము (వాక్యమును ప్రయోగించువాని యొక్క మనసులోని ముఖ్యమైన భావము) మిక్కిలి సాయము చేయును.

"ద్వారమ్", "వర్షతి" మొదలగు వాక్యభాగములవంటివి అఖండవాక్యములు అగునట్లుగానే, సామాన్య విశేషవాక్యములు రెండును కలిపి, ఒకటే అఖండ వాక్యమని, అవి విడివిడి వాక్యములు కావని, వానివలన లభించునది అఖండవాక్యార్థమే అనియు సారాంశము.

వి. వ్యాకరణమునకు మూలమనదగిన అష్టాధ్యాయిని, ప్రధానముగ సామాన్య విశేషభావముగల సూత్రములతోనే పాణిని రచించెను. వానికి సంబంధించిన అర్థసమన్వయమును దృష్టిలో ఉంచుకొనియే భర్తృహరి ఈ కారికను దీనికి అనుబంధములుగా కొన్ని దిగువ కారికలను కూర్చినాడు. ఈ విషయమున అతి ప్రసిద్ధమైన సూత్రముల ఉదాహరణమును చూడుడు:—'ఆద్గుణః' (6-1-87) అను సూత్రము. 'అవర్ణా దచి పరే పూర్వపరయోః గుణః ఏకాదేశః స్యాత్' (దీక్షితుని వృత్తి) (అ, ఆ, అనువానికి అచ్చుపరమైనచో, పూర్వపర వర్ణములకు గుణము ఏకాదేశమగును. ఓ, ఏ, అ, అనునవి గుణసంజ్ఞకములు. సావర్ణ్యమునుబట్టి ఆదేశమువచ్చును. రమా + ఈశః = రమేశః, ఉప + ఇంద్రః = ఉపేంద్రః, మొదలగునవి ఉదాహరణములు). ఇది సామాన్యవాక్యము. 'వృద్ధిరేచి' (6-1-88) అను సూత్రము. 'ఆ దేచి పరే వృద్ధి రేకాదేశః స్యాత్, గుణాపవాదః' (వృత్తి) అ, ఆ, లకు ఏ, ఓ, ఔ, లలో ఏదోయొకటి పరమైనపుడు వృద్ధి ఏకాదేశమగును. అ, ఐ, ఔ, అనునవి వృద్ధి సంజ్ఞకములు. వర్ణసామ్యమునుబట్టి ఆదేశమువచ్చును. కృష్ణ + ఐశ్వర్యమ్ = కృష్ణైశ్వర్యమ్ మొదలగునవి లక్ష్యములు) ఇది విశేషవాక్యము. (ఇటువంటి సామాన్యవిశేషభావముగల సూత్రములు కొల్లలుగా ఉన్నవి). ఇట్టి స్థలములలోగూడ, సామాన్యవాక్యముయొక్క అర్థమువలననే, విశేషవాక్యార్థము అవగతమగును. "వృద్ధికి అవకాశమును విడిచిపెట్టి— మిగిలినస్థలములందే గుణమువచ్చును" అని ముందుగనే తెలియును, పిదప వెంటనే 'వృద్ధిరేచి' అనుసూత్రము వినబడి, ఆ విశేషము సుస్పష్టమగును.

ఉచ్చరించుటలో — సామాన్యవాక్యము ముందుగను, విశేషవాక్యము వెనుకగను ఉండుట సహజము. అట్లే విశేషార్థమును కూడగట్టుకొనియే (విశేషము తప్పకఉండును. దానికి చోటును వేరుగాఉంచి, ఈ సామాన్యము ప్రవర్తించును — అని ఊహించి) సామాన్యార్థము తెలియుట, వెనువెంటనే విశేషార్థము స్పష్టమగుటయు సహజమే. ఈ భావమునే 'ప్రకల్ప్య చ అపవాదవిషయం తత ఉత్సర్గః ప్రవర్తతే' (విశేషముయొక్క చోటును విడిచిపెట్టి మిగిలినచోటులందే సామాన్యము ప్రవర్తించును) అను న్యాయముతో వైయాకరణులు వివరించుదురు.

బాధ్యబాధకభావమునే లోకదృష్టాంతముతో వివరించుచున్నాడు.

బ్రాహ్మణానాం శ్రుతి ర్దధ్ని ప్రక్రాంతా మాఠరం వినా
మాఠర స్తక్రసంబంధా త్తత్రాఽచష్టే యథార్థతామ్. 347

మాఠరమ్ = మాఠరుడను పేరుగల బ్రాహ్మణుని, వినా = విడిచి (తప్పించి,) దధ్ని = పెరుగువిషయమున, బ్రాహ్మణానామ్ = బ్రాహ్మణులకు సంబంధించిన, శ్రుతిః = వచనము, ప్రక్రాంతా = ఆరంభింపబడినది, తక్రసంబంధాత్ = మజ్జిగతో సంబంధమునుబట్టి, మాఠరః = మాఠరశబ్దము, తత్ర = ఆ వాక్యమందలి, యథార్థతామ్ = వాస్తవమును, ఆచష్టే = చెప్పును.

తా. సామాన్యవిశేషవాక్యముల విషయములో, లోకసిద్ధమగు ఒక ఉదాహరణము ఇచట చూపబడినది:—'బ్రాహ్మణేభ్యో దధి దీయతామ్' (బ్రాహ్మణులందరకు పెరుగు వేయండి) ఇది సామాన్యవాక్యము. 'తక్రం మాఠరాయ' (మాఠరుడనే బ్రాహ్మణునికి మజ్జిగ వేయండి). ఇది విశేషవాక్యము. ఇచట మాఠరుని విడిచిపెట్టి, మిగిలినబ్రాహ్మణులందరకును పెరుగున్ను, మాఠరునికి మజ్జిగయు లభించును. సామాన్యవాక్యమును వినగానే ఏదో ఒక మినహాయింపు (విశేషము) ఉండునని ఊహించుట, వెంటనే విశేషవాక్యము చెవిని బడి, మినహాయింపు స్పష్టమై మొత్తము వాక్యార్థము అఖండముగ తెలియుటయు జరుగును.

వి. మొదట విశేషముచెప్పినట్లు భాసించినను, వెంటనే చెప్పుటచే సామాన్యవిశేషవాక్యములు రెండును కలిపి, ఒకటే వాక్యమనీ విశేషవాక్యము సామాన్యవాక్యమునకు లింగమువలె (వాక్యార్థమును పూర్తిచేయుటలో సూచకము) ఉపయోగించును గాన, అది వేరే వాక్యము కాదనియు పర్యవసానము. అట్టే సామాన్యము విశేషము జోలికి పోకుండుటయే, 'బాధ' అనిపించుకొనును. వాస్తవముగా విశేషవాక్యమువలన కలుగు బాధ ఏదియు లేదు. (ఉత్సర్గము = సామాన్యము, అపవాదము = విశేషము, బాధ్యము = సామాన్యము, బాధకము = విశేషము—ఈ ప్రయోగములను సందర్భమునుబట్టి వివరించుకొనవలెను.)

సామాన్య వాక్యమునకు, విశేషవాక్యమునకును ఏకవాక్యతను ఆశ్రయించియే, బాధ్యబాధకభావమును నిర్ణయించవలయునని చెప్పుచున్నాడు.

అనేకాఖ్యాతయోగేఽపి వాక్యం న్యాయ్యాపవాదయోః
ఏకమేవేష్యతే కైశ్చి ద్భిన్నరూప మివ స్థితమ్. 848

న్యాయ్యాపవాదయోః = ఉత్సర్గాపవాదములకు చెందిన (వానిని బోధించు), వాక్యమ్ = వాక్యము, అనేకాఖ్యాతయోగే + అపి = ఒకటికిమించిన తిఙంతములతో సంబంధమున్నను, భిన్నరూపమ్ + ఇవ = వేరువేరు స్వరూపముకలిగినట్లుగా, స్థితమ్ = ఉన్న, ఏకమ్ + ఏవ = ఒకే వాక్యముగా, కైశ్చిత్ = కొందరిచే, ఇష్యతే = ఒప్పుకోబడుచున్నది (చెప్పబడుచున్నది).

తా. 'బ్రాహ్మణేభ్యో దధి దీయతామ్ తక్రం మాఠరాయ దీయతామ్' మొదలగు సామాన్యవిశేషవాక్యములలో క్రియాపదములను వేరువేరుగా వాడినను, అవి విడివిడి వాక్యములు కానేరవు; అవి రెండును కలిసి ఒకటే వాక్యమగును. ఎందుచేతననగా సామాన్యవిశేషములు పరస్పరసాపేక్షములు (ఒకదానినొకటి కోరుకొనునవి). కాన ఆకాంక్ష, యోగ్యత, (తగిఉండుట) మొదలగు సాధనములనుబట్టి ఆ రెండింటిని ఒక వాక్యముగానే సిద్ధము చేసికొనవలయును. 'మాఠరునికి మజ్జిగను మిగిలినవారికి పెరుగును వేయుము' అన్న తీరులో ఒక క్రియాపదమునే వాడి, సమన్వయము చేసి ఏకవాక్యతను సంపాదించుటయే సమంజసము.

వి. ఇది కొందరిమతము. మీది రెండుకారికలున్ను 'సామాన్యవాక్యము ఒకటే అఖండము. విశేషవాక్యము సామాన్యమును పూర్తిచేయు లింగముమాత్రమే (జ్ఞాపకము వంటిది)' అను భావమును తెలిపినవి. 'సామాన్యవిశేష వాక్యములను వేరువేరుగా అంగీకరించినను, అవయవాఽవయవిభావముతో ఆ రెండును ఒకే వాక్యముగా మారును' అని ఈ కారిక వివరించినది.

వి. "ఎవరు ఎట్లు సమన్వయము చేసినను 'అఖండవాక్యము, అఖండవాక్యార్థము' అను సత్యమునకు రాక తప్పదు" అను భావము విశదమైనది.

'కాగా విధి నిషేధాదివాక్యములతో గూడ ఈ రీతినే అవలంబింపవలెను' అని ప్రతిపాదించుచున్నాడు.

నియమః ప్రతిషేధశ్చ విధిశేష స్తథా సతి
ద్వితీయే యో లుగాఖ్యాత స్తచ్ఛేష మలుకం విదుః . 849

తథా = ఆ విధముగా, సతి = అయినపుడు (ఉత్సర్గవాక్యమునకు, అపవాద వాక్యమునకును అంగాంగిభావమును అంగీకరించి, ఏకవాక్యతను చూపిన తీరులోనే), నియమః = నియమము, ప్రతిషేధః + చ = నిషేధముకూడ, విధిశేషః = విధివాక్యమునకు అవయవము, (అగును). ద్వితీయే = రెండవ అధ్యాయములో (పాణిని అష్టాధ్యాయిలో రెండవది), యః = ఏ, లుక్ = లోపము, అఖ్యాతః = విధింపబడినదో, తచ్ఛేషమ్ = దానికి అవయవమైనదానినిగా, అలుకమ్ = అలుక్కును ('కొన్నిచోట్ల లోపము ప్రవర్తింపదు' అను వచనమును), విదుః = తెలిసికొందురు.

తా. మీదికారిక వివరించిన విధములో సామాన్యవిశేషవాక్యములకు అవయవా వయవిభావమును, ఏకవాక్యతను అంగీకరించినపుడు,—అదేతీరులో విధి నియమవాక్యములకు, విధినిషేధవాక్యములకును, అంగాంగిభావమును, ఏకవాక్యతను చెప్పుట సమంజసమగును.

'దీనిని చేయవలెను', 'ఇది ఇట్లు జరుగవలెను' అని ఒక అంశమును క్రొత్తగా చెప్పుట 'విధి' అనబడును. సహజముగ సిద్ధించు ఒక విషయమును కొంతవరకే పరిమితముచేయుట 'నియమము' అగును. 'దీనిని చేయకూడదు' అని ఒక విషయమును అడ్డుపెట్టుట 'నిషేధము' అనిపించుకొనును. లౌకికములగు కొన్ని ఉదాహరణములు వీనిని విశదీకరించును. 'దేవ మభిషిం చేత్' (దేవుని స్నానము చేయింపవలెను) ఇది విధివాక్యము. 'దేవం పర్వణి పయసా అభిషించేత్' (పర్వదినములలో దేవునికి పాలతోనే స్నానము చేయింపవలెను) ఇది నియమవాక్యము. 'కదాఽపి దేవం తైలేన నాఽభిషించేత్' (దేవునికి ఎప్పుడును నూనెతో అభిషేకము చేయరాదు) ఇది నిషేధవాక్యము. ఇటువంటి వాక్యములలో కూడ, విధివాక్యము ప్రధానమని (అవయవి), నియమవాక్యముకాని, నిషేధవాక్యముగాని దానికి అనుబంధములు (అవయవములు) అగుననియు తెలియవలెను. ఈ తీరునే 'శేషశేషిభావము' అనియు అందురు. (శేషము = అవయవము, శేషి = అవయవి) అనగా నియమవాక్యమున్నపుడు దానితోను, నిషేధవచనమున్నపుడు దానితోను, విధివాక్యమునకు ఏకవాక్యతను సంపాదింపవలెను.

అందుచే అష్టాధ్యాయిలోని రెండవ అధ్యాయములో ఉన్న "సుప్ ప్రత్యయము లోపము" ను విధించు సూత్రమునకు, ఆరవ అధ్యాయములో ఉన్న నిషేధ సూత్రము అవయవమై ఏకవాక్యతను బోధించును.

వి. విధినిషేధముల విషయములో కర్మకాండకు సంబంధించిన ఒక ఉదాహరణము : "పశు మాలభేత" (యాగమందు పశువును చంపవలెను) ఇది విధివాక్యము. "మా హింస్యాత్ సర్వాణి భూతాని" (జీవులను హింసింపకూడదు) ఇది నిషేధవాక్యము. ఈ రెండును వేదచోదితములే. కావున ఈ రెండిటిని ఒకే వాక్యముగ చేసి, "యాగమందు తప్ప, మరెప్పుడును జీవహింసచేయరాదు" అను అర్థమును చెప్పవలెను. లేకున్న విధి

నిషేధములకు సంబంధము కుదరక, రెండును వ్యర్థములై పోవును. నియమవిషయములో కూడ, ఇట్లే ఏక వాక్యతను ఊహించునది. విధి వాక్యమునకు అవయవమగుటనే "విధిశేష భావ" మనియు వ్యవహరింతురు. కాగా నియమము, నిషేధమున్ను విధిశేషములు.

అష్టాధ్యాయిలో రెండవ అధ్యాయమున "సుపో ధాతు ప్రాదిపదికయోః"(2-4-71)-(ఏతయో రవయవస్య సుపో లుక్ స్యాత్=ధాతువునకు, ప్రాతిపదికమునకును, అవయవముగా ఉన్న సుప్ ప్రత్యయము లోపించును) అనునది లోపమును విధించు సూత్రము. దీనికి "అలు గుత్తరపదే" (6-3-1) (ఉత్తరపదము పరమైనపుడు సుప్పునకు లుక్కు రాదు) అను నిషేధసూత్రమును శేషముగా చెప్పవలెను.

వి. విధి నియమములకు, విధినిషేధములకును ఇట్టి ఏకవాక్యతను స్వీకరించని యెడల, విధివాక్యము తన స్వభావము ననుసరించి తొలుత తనకు వీలున్న అన్ని చోటులందును ప్రవర్తించునుగాన, తరువాత బయలుదేరిన నియమముగాని, నిషేధముగాని ప్రయోజనము లేనిదగును. భోజనము ముగించినవానితో "భుజింపకుము" అనినచో లాభము లేదుగదా? (యో హి భుక్తవంతం ప్రతి బ్రూయాత్, "మా భుంక్థాః" ఇతి కిం తేన కృతం స్యాత్?" అనునది లోకన్యాయము = పూర్తిగా తినినవాని నుద్దేశించి "తినవద్దు" అన్నచో ఏమి ప్రయోజనము?)

నియమవిషయమును, నిషేధవిషయమును విడిచి, (వాని స్థలములను పరిహరించి) విధివాక్యము ప్రవర్తించుటయే ఏకవాక్యతవలన కలుగు ప్రయోజనము.

పదైకవాక్యత (పదములు పరస్పరము కలిసి ఒకే వాక్యమగుట), వాక్యైకవాక్యత (రెండు వాక్యములును తమ ప్రత్యేకతను చూపుచు ఒక వాక్యముగా ఏర్పడుట), అని ఏక వాక్యత విషయములో రెండు పక్షములున్నవి. వాని స్వరూప స్వభావములు గ్రంథ విస్తర భీతిచే విడువబడినవి. అట్లే పాణినీయ సూత్రములను ఉదాహరణములుగా తీసికొని, సమన్వయించుటయు విడువబడినది. (అవన్నియు పెద్ద వ్యాఖ్యానముల వలన తెలియదగినవి).

ఈ సందర్భమున వాక్యభేదము నంగీకరించు వ్యక్తి ఇట్లనుచున్నాడు.

నిరాకాంక్షాణి నిర్వృత్తౌ ప్రధానాని పరస్పరమ్
తేషా మనుపకారిత్వాత్ కథం స్యా దేకవాక్యతా? 350

(విధినిషేధవాక్యములు - లేక - విధినియమవాక్యములు) నిర్వృత్తౌ = తమ తమ అర్థమును పూర్తిగా చెప్పుటలో, పరస్పరమ్ = అన్యోన్యము, నిరాకాంక్షాణి=అపేక్ష లేనివి, (ఒకదానినొకటి ఆశించనవి) (కావున), ప్రధానాని=ముఖ్యములు (అగును). అనుప కారిత్వాత్ = ఒకదానిసాయ మింకొకదానికి ఆవశ్యకము కానందువలన, తేషామ్ = ఆవాక్యములకు, ఏకవాక్యతా = ఒకే వాక్యమగుట, కథమ్=ఎట్లు, స్యాత్ = అగును?

తా. ఈ కారికపూర్వపక్షమును చూపును. విధినిషేధ వాక్యములలో-లేక-విధినియమవాక్యములలో, ఒకదాని అపేక్ష వేరొకదానికి లేదు. అవి దేనికది స్వతంత్రముగనే అర్థమును బోధించును. కావున వానికి అవయవావయవిభావము కుదరదు. అయినపుడు ఆ రెండు వాక్యములకు ఏకవాక్యత ఎట్లు సిద్ధించును? (అవి విడివిడిగా రెండు వాక్యములని ఎందు కనగూడదు?)

వి. ఒక వాక్యమందలి పదములకు, ఆకాంక్ష (ఒకదానిని వేరొకటి ఆశించుట), యోగ్యత (తగియుండుట), సన్నిధి (సామీప్యము) మొదలగు ధర్మములు పనిచేసి, పరస్పర సమన్వయము సంభవించును. కాన అచట పదములకు, వాక్యమునకును అవయవావయవిభావ మును చెప్పుట సముచితమే. అట్లే ఏదో విధముగ ఉపకార్యోపకారక భావము ఉన్న వాక్య ములలో కూడ శేషశేషిభావమును అంగీకరింపవచ్చును. కాని విధి నియమ వాక్యముల విషయ మున, విధి నిషేధ వాక్యముల విషయమునను అన్యోన్యము అట్టి పరస్పరాపేక్ష ఉన్నట్లు కనపడదు. కావున అవి స్వతంత్రములగు వాక్యములే అనుట మంచిది.

ఏకవాక్యతను అంగీకరించు సిద్ధాంతి యొక్క ప్రతివచన మిది.

విశేషవిధినా ర్థిత్వా ద్వాక్యశేషోఽనుమీయతే
విశేషవ న్నివ ర్త్యేఽర్థే తస్మా త్తుల్యం వ్యపేక్షణమ్ . ৪৫1

అర్థిత్వాత్ = ఆకాంక్ష ఉన్నందువలన (వేరొక అంశమును కోరుచున్నందువలన) విశేషవిధినా=ఒక ప్రత్యేక విషయమును చెప్పు వాక్యముచే, వాక్యశేషః=వాక్యముయొక్క భాగమని (''ఈ విశేష వాక్యము సామాన్య వాక్యముయొక్క భాగము'' అని) అనుమీయతే= ఊహింపబడును, తస్మాత్=అందువలన, విశేషవత్=ఒక ప్రత్యేకాంశమందువలె, నివర్త్యే= నిషేధింపదగు, అర్థే=విషయమున కూడ, వ్యపేక్షణమ్=ఆకాంక్ష (ఆశించుట), తుల్యమ్= సమానము.

తా. మీది పూర్వపక్షమునకు ఇది సమాధానము. సామాన్యము, విశేషమును ఎల్లప్పుడును పరస్పరాపేక్షములే (అవి ఒక దాని నొకటి తప్పక ఆశించుచుండును). సామాన్యముతో విశేషమును, విశేషముతో సామాన్యమును అనుమానించుట (ఊహించుట) సహజము. ఉదా: ''పువ్వులను తెమ్ము'' అను సామాన్యవాక్యము గులాబీలు, లేక సంపంగులు మొదలగు-ఉద్దేశింపబడిన పూవులను బోధించు వాక్యమును అపేక్షించును. ''గులాబీ పువ్వులను తెమ్ము'' అను విశేష వాక్యము, ''మిగిలిన అన్ని రకముల పూవులను విడువుము'' అను సామాన్య వాక్యమును ఊహించును.

ఈ తీరునుబట్టి విధినియమములు, విధి నిషేధములును సామాన్య విశేషముల వంటివే అగును. విడిచిపెట్టవలసిన అంశము స్పష్టముగ తెలియుటకై నియమముగాని, నిషేధముగాని విధివాక్యముతో కలియుటయే సముచితము (వాని వాని పరిధులు నిర్దిష్టముగ తెలియుటకై, వానికిని పరస్పరాకాంక్ష ఉండును). కావున అట్టి వాక్యములు అన్యోన్యము కలిసి ఒకే వాక్యముగ ఏర్పడునని చెప్పవచ్చును.

వి. ఉత్సర్గ వాక్యమునకు అపవాద వాక్యము శేషమగునట్లుగా, విధివాక్యమునకు నియమవాక్యము, నిషేధ వాక్యమును శేషములగును. పరస్పరాకాంక్ష ఉండుటయే అందుకు ముఖ్యమైన కారణము.

''వాక్యభాగములుగా (వాక్యైక దేశములు-లేక-వాక్యఖండములు) కనిపించునవి సంపూర్ణ వాక్యములే'' అను విషయమును గురించిన చర్చ ఈ కారికతో ముగిసినది. అట్టి వాక్యములు నాలుగు విధములుగా ఉండవచ్చునని సారాంశము సిద్ధించినది.

1. కేవలము నామవాచకము : ''వృక్షః'' (తిష్ఠతి) అర్థప్రకరణాదులసాయ ముతో సిద్ధించునది.

2. కేవలము ఆఖ్యాతము : "వర్షతి" (జలమ్) ప్రసిద్ధిని బట్టి ఏర్పడునది.

3. జ్ఞాపకమును అపేక్షించునది : "అక్తాః శర్కరా ఉపదధాతి" (ఘృతేన-అనునది లింగము)

4. సామాన్యవిశేషభావము గలది : "బ్రాహ్మణేభ్యో దధి దీయతామ్" "మాఠరాయ తక్రమ్"(బాధకవచనము, నియమవచనము, నిషేధవచనము మొదలగువానితో సంబంధము గలది).

'అపోద్ధారము' (సమగ్రవాక్యమునుండి వేరుచేసిచూపుట) అను పద్ధతిలో మీద చూపినవన్నియు వాక్యములే అని, అవి అఖండములనియు తత్త్వము.

అపోద్ధారమును ఆశ్రయించినపుడు వాక్యములందు వాక్యైకదేశముల వలె, పదములందును పదైకదేశములు సంభవించునని విశదీకరింప ప్రారంభించుచున్నాడు.

సంజ్ఞాశబ్దైకదేశో యస్తస్య లోపో న విద్యతే

విశిష్టరూపా సా సంజ్ఞా కృతా చ న నివర్తతే. 352

సంజ్ఞా శబ్దైకదేశః = పేరులోని ఒకభాగము, యః = ఏది కలదో, తస్య = దానికి, లోపః = లోపము (కనబడకపోవుట), న + విద్యతే = లేదు. సా = ఆ, సంజ్ఞా = పేరు, విశిష్టరూపా = పూర్తియగు ప్రత్యేకస్వరూపముగలదై, కృతా + అపి = చేయబడినందున, న + నివర్తతే = తొలగిపోదు.

తా. 'దేవదత్తః' 'సత్యభామా' మొదలగు శబ్దములున్నవి. అవి ఆయా వ్యక్తులకు పేర్లు(సంజ్ఞలు).ఇటువంటి శబ్దములను సంజ్ఞాశబ్దములందురు. వీనిలో ఒకభాగమునే ఉచ్చరించి, (దేవః—లేక—దత్తః) సంజ్ఞనంతను బోధించుట వాడుకలో ఉన్నది. అదెట్లు కుదురును ? అట్టిప్రయోగములలో, విడువబడిన భాగము లోపించినదని చెప్పుట శాస్త్రీయము కాదు. (వ్యాకరణము దానికి లోపమును చెప్పలేదు). వాస్తవముగ—సంజ్ఞా శబ్దములకు ఒక నిర్దిష్టమైన స్వరూపము (వర్ణక్రమము) ఉండును గాన, వానిలో ఏ భాగము లోపించినను సంజ్ఞ పూర్తికాదు కావునను, లోపమనుటకు కూడ వీలులేదు.

వి. 'అపోద్ధారము' (వేరుచేయుట—లేక—విడగొట్టుట) అను కాల్పనికమైన పద్ధతిలో వాక్యములందు వాక్యైకదేశము లుండవచ్చునని ఇంతవరకు చర్చ కొనసాగినది. ఈ సందర్భములో—అదే మార్గమును ఆశ్రయించినచో, కొన్ని పదములలోకూడ, పదైకదేశములు (పదఖండములు) ఉండవచ్చునను చర్చను, ఈ కారిక ప్రారంభించినది. ఇది శంకారూపమైన కారిక.

'ఈ వర్ణక్రమముగలది ఈ సంజ్ఞ' (దీనిరూపమిది) అని అన్నపుడు, ఆ శబ్దమును పూర్తిగా ఉచ్చరించినందువలననే అర్థము బోధపడును గాని, అందులోని ఒక భాగమును మాత్రమే ఉచ్చరించినందువలన బోధపడదు. అందుచే ఒక భాగమును వాడి, మిగిలిన భాగమునకు లోపమనుట కుదరదు.

వి. 'వృక్షః ప్రచలన్ సహ అవయవైః ప్రచలతి' (చెట్టు కదిలినపుడు దాని అవయవములును కదలును) అను న్యాయము ననుసరించి, సంజ్ఞా శబ్దమును పూర్తిగా పలికినపుడే, అవయవములైన వర్ణములకును సార్థక్యము ఏర్పడును. లేనపుడు కేవలము అవయవములకు అర్థము ఉండదు.

"దేవదత్త" మొదలగు సంజ్ఞాశబ్దములలో ఏకదేశమువలన (దేవ – లేక – దత్త) సంపూర్ణమగు అర్థమెట్లు తెలియనగునని ఆక్షేపించుచున్నాడు.

సంజ్ఞాంతరాచ్చ దత్తాదేః నాన్యా సంజ్ఞా ప్రతీయతే
సంజ్ఞినం దేవదత్తాఖ్యం దత్తశబ్దః కథం వదేత్ ? 353

దత్తాదేః = దత్తః మొదలగు, సంజ్ఞాంతరాత్ + చ = వేరొక సంజ్ఞా శబ్దము వలన, అన్యా = మరియొక, సంజ్ఞా = పేరు, న + ప్రతీయతే = తెలియబడదు. దేవదత్తాఖ్యమ్ = దేవదత్తః అను పూర్తిపేరుగల, సంజ్ఞినమ్ = ఒక వ్యక్తిని (ఆ పేరుతో తెలియదగిన వ్యక్తిని), దత్తశబ్దః = 'దత్తః' అను శబ్దము, కథమ్ = ఎట్లు, వదేత్ = చెప్పును ?

తా. 'దేవః' 'దత్తః' అనునవి తమంతట తాము వేరువేరు సంజ్ఞలు కూడ కావచ్చును. కాన వానిలో ఏ ఒకటియు 'దేవదత్తః' అను పూర్తిసంజ్ఞను తెలియజేయజాలదు. అట్లే పూర్తిసంజ్ఞయే తనకు అర్థముగా నిర్ణయింపబడిన వ్యక్తిని ('ఈ పేరుతో తెలియదగిన వ్యక్తి ఇది'—అను సంకేతముగల వ్యక్తిని) బోధించును గాని, అందులోని భాగము బోధింపదు (వర్ణక్రమము తగ్గిపోవుటచే అనుకున్న అర్థము తెలియదు).

వి. సంజ్ఞ = పేరుగా ఉచ్చరింపబడు శబ్దస్వరూపము. సంజ్ఞి = ఆ పేరుతో పిలువబడువ్యక్తి (సంజ్ఞా శబ్దముయొక్క వాచ్యార్థము) "సంజ్ఞా శబ్దమందలి ఒక భాగముతో ఆ సంజ్ఞను అంతనుగాని, దాని అర్థమునుగాని చెప్పుటకు వీలులేదు. సంజ్ఞాస్వరూపమును—దేనినైనను—పూర్తిగానే ఉచ్చరింపవలయును." అని సారము.

మీది కారికకు, ఈ కారిక అనుబంధము. ఇదియు శంకారూపమే.

ఈ సందర్భమున వేరొక మతమును చూపుచున్నాడు.

సర్వైరవయవైస్తుల్యం సంబంధం సముదాయవత్
కేచిచ్ఛబ్దస్వరూపాణాం మన్యంతే సర్వసంజ్ఞిభిః. 354

శబ్దస్వరూపాణామ్ = సంజ్ఞాశబ్దములలో, సముదాయవత్ = మొత్తమునకువలెనే, (శబ్దముయొక్క పూర్తిరూపము), సర్వైః = అన్ని, అవయవైః = అవయవములకు (భాగములకు), సర్వసంజ్ఞిభిః = అన్ని అర్థములతోను (తెలియదగిన వ్యక్తులు), తుల్యమ్ = సమానమైన (ఏకకాలమందే), సంబంధమ్ = సంబంధమును, కేచిత్ = కొందరు, మన్యంతే = భావించుదురు.

తా. మీదిశంకకు సమాధానమును కొంద రిట్లు చెప్పుదురు. సంజ్ఞాశబ్దముల విషయములో, ఒకే సమయమున సముదాయమునకు, అవయవములకు కూడ అర్థముతో కల సంబంధము గ్రహింపబడును. కావున సముదాయమువలన అర్థము తెలియునట్లు, అవయవములవలనను పూర్తి అర్థము తెలియును.

వి. శబ్దమునకు అర్థమునకును ఉండు ముఖ్యమైన సంబంధము వాచ్య వాచక భావము గదా: సముదాయమందువలెనే అవయవములందు కూడ శబ్దమును పలుకు సమయమందే ఈ సంబంధమును అంగీకరించినచో, అవయములును పూర్తి అర్థమును బోధింపగలవని ఈ వాదముయొక్కసారము.

ఈ సందర్భముననే రెండు దోషములను చూపుచున్నాడు.

వర్ణానా మర్థవత్త్వం తు సంజ్ఞానాం సంజ్ఞిభి ర్భవేత్
సంబద్ధోఽవయవః సంజ్ఞాప్రవివేకే న కల్ప్యతే . ३५५

సంజ్ఞానామ్ = సంజ్ఞా శబ్దములయొక్క, వర్ణానామ్ = అక్షరములకు, సంజ్ఞిభిః = ఆయా అర్థములతో, అర్థవత్త్వమ్ + తు = అర్థము కలిగియుండుట, భవేత్ = సంభవించెడిని.

సంజ్ఞా ప్రవివేకే = మొత్తము సంజ్ఞా పదమునుండి విడదీసినపుడు, సంబద్ధః = సంబంధించిన (పూర్తి అర్థమును చెప్పు సముదాయమునకు చెందిన) అవయవః = ఒక భాగము, న + కల్ప్యతే = పూర్తి అర్థమును చెప్పజాలదు.

తా. సంజ్ఞా శబ్దములలో సముదాయమునకు అవయవములకును, ఏకకాలమందే అర్థబోధకత్వమును ఒప్పుకొన్నచో, ఒక్కొక్క వర్ణముకూడ అర్థబోధకము కావలసివచ్చును వర్ణములును అవయవములేగదా! అదియుగాక సముదాయమునకే అర్థమును బోధించుశక్తి ఉండునుగాని, విడదీయబడిన భాగమునకు అట్టి శక్తి ఉండదు.

వి. పై కారిక చూపిన మతములో రెండు రకములైన దోషములు ఉన్నవని ఈ శ్లోకము విశదీకరించినది.

మీది కారిక చెప్పిన భావమునే ఈ కారిక విశదీకరించుచున్నది.

సర్వస్వరూపై ర్యుగప త్సంబంధే సతి సంజ్ఞినః
నైకదేశసరూపేభ్య స్తత్ప్రత్యాయన సంభవః. ३५६

సర్వస్వరూపైః = సంజ్ఞాశబ్దముయొక్క అన్ని అవయవములతో, సంజ్ఞినః = ఆ సంజ్ఞయొక్క అర్థమునకు, యుగపత్ = ఒకేసారి, సంబంధే = సంబంధము, సతి = ఉన్నపుడు, ఏకదేశస్వరూపేభ్యః = అవయవములతో సమానముగ కనిపించు శబ్దరూపములతో, తత్ప్రత్యాయనసంభవః = ఆ సంజ్ఞయొక్క అర్థమును బోధింపగలుగుట, న = లేదు (కుదురదు).

తా. అవయవములన్నియు కలిసి, సముదాయముగా ఏర్పడిన సంజ్ఞాశబ్దముల వల్లనే వానియర్థములు తెలియును. (సముదాయమునకు మాత్రమే అర్థమును బోధించుశక్తి ఉండును). 'దత్తః' మొదలగు ప్రత్యేక సంజ్ఞాపదములతో సమానముగ కనిపించునట్టి— 'దేవదత్తః' మొదలగు సముదాయములలో భాగములుగా ఉండునట్టియు 'దత్తః' మొదలగు శబ్దములు 'దేవదత్తుడు' మొదలగు పూర్తిఅర్థములను చెప్పలేవు.

వి. పై కారికయొక్క భావమే ఇచట వేరొకతీరులో ప్రతిపాదింపబడినది. కాగా సంజ్ఞాపదములలోని భాగములు, ఆయా సంజ్ఞల పూర్తిఅర్థమును చెప్పజాలవని తేలినది.

వేరొక మతమును చూపుచున్నాడు.

ఏకదేశాత్తు సంఘాతే కేషాంచి జ్జాయతే స్మృతిః
స్మృతేస్తు విషయా చ్ఛబ్దాత్ సంఘాతార్థః ప్రతీయతే . ३५7

ఏకదేశాత్ + తు = ఒకభాగమువలననే, సంఘాతే = సముదాయమును గురించిన, స్మృతిః = స్మరణము, కేషాంచిత్ = కొందరకు, జాయతే = కలుగును. స్మృతేః = స్మర

ణమునకు, విషయాత్ = లోనైన, శబ్దాత్ + తు = శబ్దమువలన, సంఘాతార్థః = సముదాయ ముయొక్క అర్థము, ప్రతీయతే = తెలియబడును.

తా. ఈ సందర్భములో మరికొందరు ఇట్లందురు—సంజ్ఞాశబ్దములలో, ఒక భాగమును ఉచ్చరించుటతోడనే పూర్తియైన శబ్దరూపము గుర్తునకు వచ్చును. అట్లు జ్ఞాపకమునకు వచ్చిన సముదాయమే అర్థమును బోధించును.

వి. 'దేవదత్తః' అనునది సముదాయము. 'దేవ, దత్త' అనునవి దాని భాగములు. వీనిలో ఏ ఒకదానిని పలికినను, 'దేవదత్తః' అను పూర్తిరూపము స్మృతికి వచ్చును. అందువల్ల అర్థము తెలియును. భాగమునుమాత్రమే ఉచ్చరించిన ప్రతియొకచోటను ఈ తీరును ఉపయోగించుకొనవచ్చును.

పై మతమును నిరాకరించుచున్నాడు.

ఏకదేశాత్ స్మృతి ర్భిన్నే సంఘాతే జాయతే కథమ్

కథం ప్రతీయమానః స్యా చ్ఛబ్దోఽర్థ స్యాభిధాయకః ? ౩౫౮

భిన్నే = వేరైన, సంఘాతే = సముదాయము విషయములో, ఏకదేశాత్ = ఒక భాగమువలన, స్మృతిః = స్మరణము, కథమ్ = ఎట్లు, జాయతే = కలుగును ? ప్రతీయమానః = స్మరింపబడు, శబ్దః = శబ్దము, అర్థస్య = అర్థమును, అభిధాయకః = చెప్పునది, కథమ్ = ఎట్లు, స్యాత్ = అగును ?

తా. ఒకదాని నొకటి పోలిన రెండు వస్తువులు అనుభవములో ఉన్నపుడు, వానిలో ఒకదానివలన, రెండవది గుర్తువచ్చుట లోకములో ప్రసిద్ధము. ప్రకృతము సంజ్ఞాశబ్దములలో సముదాయరూపము వేరుగను; అవయవములరూపము వేరుగను ఉండును. (రెండింటికిని పోలికలేదు). కాన అవయవరూపముతో సముదాయము స్మృతికి వచ్చుననుట పొసగదు. మరియు—అట్లంగీకరించినను, ప్రయోజనము సిద్ధించదు. స్పష్టముగ ఉచ్చరింపబడిన శబ్దమే తన అర్థమునకు వాచకమగును గాని, స్మృతికివచ్చి, ఉచ్చరింపబడని శబ్దము అర్థమును చెప్పజాలదు. (ఉచ్చరించిన ఒకభాగమువలన సముదాయముయొక్క అర్థము లభింపదు).

వి. మీది శ్లోకము చూపిన స్మృతిపక్షమును ఈ శ్లోకము ఖండించినది. 'ఉచ్చారిత ఏవ హి శబ్దః ప్రత్యాయకః నానుచ్చారితః (ఉచ్చరింపబడిన శబ్దమే అర్థమును బోధించును. మరొకవిధముగ ఉన్న శబ్దము బోధింప సమర్థముకాదు) అన్నది వైయాకరణుల సిద్ధాంతము.

సముచితమైన సిద్ధాంతమును చూపుచున్నాడు.

ఏకదేశసరూపాస్తు తైస్తై ర్లింగైః సమన్వితాః

అనునిష్పాదినః శబ్దాః సంజ్ఞాసు సమవస్థితాః . ౩౫౯

ఏకదేశసరూపాః + తు = అవయవములగు శబ్దముల రూపములతో సమానమైనటువంటి స్వరూపముగలవై, తైః + తైః = ఆయా, లింగైః = లింగములతో, (పుంలింగము మొదలగు శబ్దలింగములు) సమన్వితాః = కూడినవై, అను నిష్పాదినః = తరువాత పుట్టినటు

వంటి, శబ్దాః = వేరువేరుశబ్దములు, సంజ్ఞాసు = సంజ్ఞావాచక శబ్దములలో, సమవస్థితాః = స్పష్టముగా ఉన్నవి.

తా. 'దేవదత్తః' అనునది సంజ్ఞాపదము. ఇది సముదాయరూపము. 'దేవదత్తుడు' అనువ్యక్తి సంజ్ఞి —లేక— ఆ సముదాయమువల్ల లభించు అర్థము. ఇటువంటి స్థలములలో, సముదాయమును ఉచ్చరించిన వెనువెంటనే, దానిలో సుస్పష్టముగ వినబడు 'దేవ', 'దత్త' మొదలగు అవయవములనుపోలిన వేరే శబ్దములు (దేవ, దత్త మొదలగునవి)పుట్టును. (అనగా ఉచ్చరింపబడును). వానిని 'అనునిష్పాదులు' (సముదాయమును పలికినతరువాత పుట్టునవి) అందురు. ఇవి సంపూర్ణమైన అర్థమును బోధించును. అట్టిశక్తిని వానికి అంగీకరింపవలెను. అనగా 'దేవః' మొదలగునవి వేరేశబ్దములే. అవి సముదాయముయొక్క అవయవములుమాత్రము కావు. సముదాయమునకువలెనే వీనికిని సమగ్రార్థమును బోధింపగల సామర్థ్య ముండును. అయితే—ఆవశ్యకతనుబట్టి వీని లింగమును మార్చుకొనుచుండవలెను (పుంలింగమైతే —దేవః, దత్తః అని, స్త్రీలింగమైతే సత్యా, భామా అనియు). అవయవసదృశములైన శబ్దములు సంజ్ఞిని బోధించు స్థలములన్నింటియందును ఈ తీరును అవలంబింపవలెను.

వి. ఇదే వైయాకరణుల సిద్ధాంతము.–'సంజ్ఞా వాచకములలో ఏకదేశములు అర్థమును బోధింపగలవా?' అను చర్చను ఆరంభించి, ఇతరుల మతములను అందలి దోషములను చూపి, తుదకు గ్రంథకర్త తన అభిమతమును స్పష్టముచేసినాడు.

"దేవదత్తః" అను సముదాయమును పలికిన సమయములోనే, "దేవ, దత్త"అను విడివిడిశబ్దములను కూడ పలికి, (అట్లు భావించుకొని), వానికి ఆవశ్యకములైన లింగములను చేర్చుకొని, ఆయా సంజ్ఞలుగా వాడుకొనవచ్చును. "సముదాయములు వేరు. అనునిష్పాదులైన ఇట్టి శబ్దములు వేరు. రెండింటికిని అర్థబోధకత్వము సమానమే" అనునది ఈ వాదముయొక్క సారము.

అను=(పశ్చాత్) = తరువాత, నిష్పాదినః = పుట్టునవి—అనునిష్పాదినః.

వాక్యమువలెనే పదముకూడ అఖండమని, నిత్యమనియు వైయాకరణులందురు (పరమసిద్ధాంతములో పదము లేనేలేదు. అది వేరువిషయము). అయినపుడు వాక్యములో వాక్యైకదేశములు లేనట్లుగానే, పదములోకూడ పదైకదేశములు లేవని చెప్పకతప్పదు. అట్లే వాక్యైకదేశములుగా కనబడువానిని, వేరే స్వతంత్రవాక్యములని సమర్థించిన రీతిలో, పదైకదేశములుగా కనబడువానిని, వేరే స్వతంత్రపదములని సమర్థింపవలసి వచ్చినది. ఇట్టి పదముల ఉచ్చారణమును హేతుబద్ధము చేయుటకై "అనునిష్పత్తివాదము"ను చేపట్టవలసి వచ్చినది.

సంజ్ఞాశబ్దములలోని భాగములు (దేవ — దత్త మొదలగునవి) నియమితముగ సంజ్ఞిని (ఆ సంజ్ఞచే తెలియదగిన వ్యక్తిని) ఎట్లు బోధించునో నిరూపించుచున్నాడు.

సాధారణత్వాత్సందిగ్ధాః సామర్థ్యాన్నియతాశ్రయాః
తేషాం యే సాధవస్తేషు శాస్త్రే లోపాది శిష్యతే. ౩౬౦

సాధారణత్వాత్ = శబ్దరూపము సమానముగా ఉన్నందువలన, సందిగ్ధాః = అర్థము విషయములో సంశయమును కలిగించు శబ్దములు, సామర్థ్యాత్ = వానికుండు శక్తిని

బట్టి, నియతాశ్రయాః = నిర్ణయింపబడిన అర్థములుగలవి (అగును). తేషామ్ = అట్టి శబ్దములలో, యే = ఏవి, సాధవః = శిష్టవ్యవహారమున ప్రసిద్ధములై ఉండునో, తేషు = వాని విషయమున, శాస్త్రే = వ్యాకరణశాస్త్రములో, లోపాది = లోపము మొదలగు కార్యము, శిష్యతే = విధింపబడును.

తా. అర్థము వేరుగానుండి, శబ్దరూపము ఒకేవిధముగా ఉండు స్థలములలో, అర్థమును గురించి సంశయము కలుగుట సహజము. అయినను, ఆయా శబ్దములకుండు శక్తిని బట్టి, (ప్రకరణాదుల సాయముతో) వాని అర్థములు నిశ్చయింపబడును. "అనునిష్పాదులు" అగు శబ్దములలో (దేవ, దత్త, మొదలగునవి) అర్థమును ఇట్లే నిశ్చయించుకొనవలెను. అవి స్వతంత్రశబ్దములై, పూర్తిఅర్థమును బోధించుచుండును. లోకములోని పెద్దల వాడుకను అనుసరించి "అవి సాధువులు" (ప్రయోగార్హములు) అని తెలియును. వాని సాధుత్వమును స్పష్టపరచుటకు మాత్రమే ఆ యా స్థలములలో పూర్వపదము లోపించునని, (దత్తః, అన్నచో, దేవ అను ముందుపదము జారిపోయినదని) ఉత్తరపదము లోపించుననియు, దేవః, అనినచో, దత్త అను చివరిపదము జారిపోయినదని) వ్యాకరణశాస్త్రము చెప్పుచుండును. వాస్తవముగ లోప మచట లేకపోయినను, సామాన్యులకు అదొక ఉపాయమని గ్రహింపవలెను.

వి. "దేవదత్తః" మొదలగు సంజ్ఞాపదములలో దేవ, దత్త మొదలగు విడివిడి శబ్దములను "అనునిష్పాదిశబ్దము" లనుగా ఒప్పుకొని, వానివలనకూడ పూర్తి అర్థము తెలియునని చెప్పవలెనని మీదిశ్లోకము వివరించినది.

ఈ సందర్భములో కలుగు ఒకటి రెండు సందేహములను పోగొట్టుట ఈ శ్లోకము యొక్క ప్రయోజనము.

మొదటి సంశయము : సంజ్ఞావాచకములలోని భాగములవంటి శబ్దములను వేరుగా ఒప్పుకొన్నచో, దేవ శబ్దము రెండు విధములగును. దేవుని బోధించునది ఒకటి. (దేవః = దేవుడు). దేవదత్తుడు, అనువ్యక్తిని చెప్పునది రెండవది. (దేవః = దేవదత్తుడు = దేవదత్త శబ్దములోని పూర్వభాగమువంటి శబ్దము). అట్లే దత్త శబ్దముకూడ రెండు విధములగును. "ఈయబడినది" అను అర్థమును తెలుపునది ఒకటి. (దా = ఇచ్చుట అనుధాతువునకు భూతకాలికమైన కృదంతరూపము). దేవదత్తుని బోధించునది రెండవది. (దేవదత్త శబ్దములోని రెండవభాగమువంటిది) ఆ శబ్దముల ఆకారములు సమానములు అయినపుడు వాడుకలో "దేని కేది అర్థము?" అను సందేహము కలిగితీరును అని.

దీని కిది సమాధానము : అర్థము విషయమున సంశయము కలిగినంత మాత్రముచే శబ్దము వాచకము కాకపోదు. సామర్థ్యము, ప్రకరణము మొదలగు ఉపాయముల నాశ్రయించి, ఆయా శబ్దముల అర్థములను నిశ్చయించుకొనగలము. (ఈ యంశమును పలుమారులు గ్రంథకర్త చెప్పుచునే యున్నాడు). పెద్దల వాడుకనుబట్టి శబ్దార్థముల సంబంధము సాధుత్వమును అవగతమగుచుండును. కాగా సంజ్ఞావాచకములలోని భాగములవంటి "దేవ" మొదలగు శబ్దములును సాధువులై, స్వతంత్రముగ ఆయా సంజ్ఞకలవ్యక్తిని తెలుపును. వాని వలె ఉండు ప్రత్యేకశబ్దములుకూడ వాని ప్రత్యేకార్థములను తెలుపుచుండును. ఇటువంటి ఏర్పాటుకు బాధక మేదియు లేదు.

రెండవసంశయము : అట్లంగీకరించినయెడల, "వినాఽపి ప్రత్యయం పూర్వోత్తర పదయోః వా లోపో వాచ్యః" (5-3-83 సూత్రములోని వార్తికము) (ప్రత్యయమేదియు పరముగ లేకున్నను సంజ్ఞాశబ్దములలో ముందుపదమునకుగాని, చివరిపదమునకుగాని లోపము వికల్పముగ అగును) అను వచనముచే లోపవిధాన మెందుకుః అని.

దీని కిది సమాధానము : భాష లోకసిద్ధము, సహజము. శాస్త్రము కల్పితము, అవాస్తవము. లోకసిద్ధములగు శబ్దార్థముల ప్రయోగరీతులను శాస్త్రము ధ్రువపరచి ప్రామాణ్యమును, సంప్రదాయమును సంపాదించును. సామాన్యులకు అదొక సాధనము. శబ్దతత్త్వము నెరిగిన వారికి వ్యాకరణశాస్త్రముతో పనిలేదు. కాగా ప్రకృతము పూర్వోత్తర పదములకు లోపము జరుగుట కేవలము కల్పన. (పదములు నిత్యములుగాన - లోపాదులు కుదరవు) ప్రయోగసిద్ధములైన దేవ మొదలగు శబ్దములును సంజ్ఞావాచకములుగ సాధువులనుటయే తాత్పర్యము.

మీది అంశమును విశదీకరించి, విశేషమును చూపుచున్నాడు.

తుల్యాయా మనునిష్పత్తౌ జ్యే-ద్రా-ఘా-ఇత్యసాధవః
న హ్యన్వాఖ్యాయకే శాస్త్రే తేషు దత్తాదివత్ స్మృతిః . 361

అనునిష్పత్తౌ = తరువాతపుట్టుట, తుల్యాయామ్ = సమానమైనను, జ్యే-ద్రా-ఘా ఇతి = జ్యే - ద్రా - ఘా - మొదలగు వేరువేరు వర్ణములు, అసాధవః = సాధువులుకావు (ప్రయోగించుటకు తగినవి కావు). తేషు = అట్టి వర్ణముల విషయములో, అన్వాఖ్యాయకే = సాధుత్వమును చెప్పు, శాస్త్రే = వ్యాకరణ శాస్త్రమున, దత్తాదివత్ = దత్త, మొదలగు శబ్దముల విషయములో వలె, స్మృతిః = సాధుత్వమును చెప్పు వచనము, న + హి = లేదుగదాః

తా. సంజ్ఞావాచకములగు శబ్దములలో విడివిడి భాగములకువలె, విడివిడి వర్ణములకు కూడ అనునిష్పత్తిని (సముదాయమును పలికిన క్షణములోనే, విడిగాకూడ పలికినందువలన వేరుగ వినిపించుట) చెప్పవచ్చును. కాని అట్టి వర్ణములకు ప్రయోగార్హతలేదు. అందుచే జ్యేష్ఠ, ద్రాఘిష్ఠ, శ్లాఘా, మొదలగు పదములలోని జ్యే, ద్రా, ఘా మొదలగు ప్రత్యేక వర్ణములను ఆయా పదముల అర్థమును చెప్పువానినిగా వాడకూడదు. శిష్టులు అట్టి వర్ణములకు సాధుత్వమును అంగీకరింపలేదు. అందుచేతనే వ్యాకరణశాస్త్రముకూడ అట్టి స్థలములలో ప్రత్యేకవర్ణములకు సాధుత్వమును చెప్పలేదు.

వి. "దేవదత్తః" మొదలగు సముదాయశబ్దములను, దేవః, దత్తః, మొదలగు భాగములను మాత్రమే, ఆయా సంజ్ఞలుగ వాడుట ప్రసిద్ధముగా ఉన్నదిగాని, దే-వ-త్త- మొదలగు విడివిడి అక్షరములను ఆ విధముగా వాడుట లోకమందు లేదని, కావుననే శాస్త్రము కూడ వానిని ఒప్పుకొనదనియు సారాంశము.

"కొన్ని స్థలములలో (ముఖ్యముగా సంజ్ఞావాచకములు) సముదాయములు, వాని అవయవములును కూడ ప్రయోగార్హములగును"-అను చర్చ ఈ కారికతో ముగిసినది.

ఇచట వర్ణములనగా, సంయుక్తవర్ణములు-లేక-అచ్చులతోకూడిన హల్లులు లేక-కేవలము అచ్చులు, హల్లులును అని తెలియదగును. "రాః" (ఐశ్వర్యము) "గ్లౌః" (చంద్రుడు) "నౌః" (ఓడ) మొదలగునవి, ప్రత్యేకపదములేగాని వర్ణమాత్రములు కావు.

"పదములందు పదైకదేశములందు" నను ఈ ప్రసంగమున, సంజ్ఞాశబ్దముల విషయములో గూడ శబ్దార్థ సంబంధముల నిత్యత్వమును సమర్థించుచున్నాడు.

కృతణత్వాశ్చ యే శబ్దా నిత్యం ఖరణసాదయః
ఏకద్రవ్యోపదేశిత్వా త్తాన్ సాధూన్ సంప్రచక్షతే . 362

నిత్యమ్=ఎల్లప్పుడును, కృతణత్వాః = ణత్వముచేయబడిన, ఖరణసాదయః = "ఖరణసః" మొదలగు, యే+చ=ఏ, శబ్దాః = శబ్దములు గలవో, తాన్=వానిని, ఏకద్రవ్యోపదేశిత్వాత్=ఒకేవ్యక్తిని బోధపరచుటవలన, సాధూన్=ప్రయోగమునకు తగినవని, సంప్రచక్షతే=చెప్పుదురు.

తా. సంజ్ఞాశబ్దములలో శబ్దవ్యుత్పత్తిని చూపుట, దాని అర్థమును వివరించుటయు చేయనక్కరలేదు. ఆ శబ్దములను "ఉన్నవానిని ఉన్నట్టుగనే" ఉచ్చరింపవలెను. ప్రతియొక సంజ్ఞావాచకముకూడ, ఆ సంజ్ఞకల వ్యక్తిని ఎల్లపుడును సూటిగా బోధించును. ఇతరశబ్దముల విషయములోవలెనే, సంజ్ఞాశబ్దమునకు, దానివలన తెలియు అర్థమునకు గల సంబంధము నిత్యము. కాగా సంజ్ఞాశబ్దములును నిత్యములే. ణత్వము (ఖరణస అనుచోట నకారము ణకారమగుట), దీర్ఘము (విశ్వామిత్ర అనుచోట తొలిపదము చివరనున్న అకారము ఆకారముగ మారుట) మొదలగు సంజ్ఞావాచకములకు సంబంధించిన శాస్త్రీయ కార్యములన్నియు సాధుత్వమును స్పష్టపరచుటకు ఉద్దేశింపబడినవే. అవి వాస్తవములు కావు.

వి. శబ్దము (స్ఫోటశబ్దము), అర్థము (బుద్ధియందు భాసించుఅర్థము), శబ్దార్థముల సంబంధమును నిత్యములని భర్తృహరి సిద్ధాంతముగదా: ప్రకృతము సంజ్ఞావాచకముల ప్రసంగమును పురస్కరించుకొని - ఆ సిద్ధాంతమును మరొకసారి విశదీకరించుటకై ఈ ఘట్టము ప్రారంభమైనది.

"ఖరణసః"అనునది ఒక వ్యక్తిపేరు. ఇచట "ఖరస్యేవ నాసికా యస్య" (గాడిద ముక్కువంటి ముక్కు కలవాడు) అను విగ్రహమును చూపుట, నాసికాశబ్దమును "నస"అను శబ్దముగా మార్చి, నకారమునకు ణత్వము చేయుటయు వ్యాకరణము చూపు ప్రక్రియ. అట్లే "విశ్వామిత్రః" అనునది ఒక మునిపేరు. ఇచటకూడ "విశ్వస్యమిత్రమ్" (ప్రపంచమునకు మిత్రుడు) అను విగ్రహమును, తొలిపదముచివర దీర్ఘమును వ్యాకరణము చూపును. అయినను ఇట్టిస్థలములలో శాస్త్రప్రక్రియకు ముందు ఒక రూపమనియు, (ఖరనస, విశ్వమిత్ర) ప్రక్రియ చేసినతరువాత వేరొకరూపమనియు భావింపరాదు. అట్లయిన శబ్దములు మారినట్లగును గాన నిత్యములు కాకపోవును. (మార్పుచెందని పదార్థమే నిత్యము). కాగా ఆ శబ్దములు "ఉన్నవి ఉన్నట్లే" సాధువులు. అవి ఎల్లప్పుడును ఒకే అర్థమును బోధించును. అదియు నిత్యమే. (అర్థమునకు మార్పులేదు). సంజ్ఞకు సంజ్ఞికి ఉండు సంబంధము (వాచ్యవాచకభావము) కూడ నిత్యమే. శాస్త్రముచూపు ప్రక్రియ, కేవలము సాధుత్వమును ధ్రువపరచు ముద్రవంటిది. సంజ్ఞాపదము లన్నింటియందును ఈ తీరునే గమనింపవలెను.

"ఖరణసః" అనుచోట ఈ రెండు సూత్రములు ప్రవర్తించును.

1. "అఞ్ నాసికాయాః సంజ్ఞాయాం నసంచాఽస్థూలాత్"(5-4-118) నాసికాంతాత్ బహువ్రీహే రచ్ స్యాత్ నాసికాశబ్దశ్చ నసం ప్రాప్నోతి నతు స్థూలపూర్వాత్ (వృత్తి). దీనిభావ మిది : సముదాయము సంజ్ఞ అయినపుడు, చివరను నాసికాశబ్దముగల బహువ్రీహి

సమాసమునకు అచ్ (అ) అను ప్రత్యయమును, నాసికాశబ్దమునకు 'నస్' అను ఆదేశమున్ను అగును. తొలిపదము స్థూలశబ్దమైనచో ఈ కార్యము రాదు.

2. "పూర్వపదా త్సంజ్ఞాయామగః" (8-4-3) పూర్వపదస్థాన్నిమిత్తా త్పరస్య నస్య ణః స్యాత్ నతు గకార వ్యవధానే (వృత్తి). దీనిభావ మిది : తొలిపదమందున్న నిమిత్తమునకు (రేఫగాని, షకారముగాని) పరమగు నకారము ణకారముగ మారును. సముదాయము సంజ్ఞకావలయును. గకారముతో వ్యవధానమున్నపుడు మాత్రము ఈ కార్యము జరుగదు. ఉదా : ఖరణసః.

"విశ్వామిత్రః" అనుచోట ఈ సూత్రము ప్రవర్తించును :- "మిత్రేచర్షౌ" (6-3-130). దీనిభావ మిది : మిత్రశబ్దము పరమైనపుడు తొలిపదము చివరి అచ్చునకు దీర్ఘమగును. సముదాయమొక మునికి పేరు కావలెను.

ఇట్టి స్థలములలో, సముదాయరూపములే సహజములనియు, వైశద్యముకొరకు, ఆయా కార్యములు జరుగునట్లు శాస్త్రము చూపుననియు అనుకొనవలెను. లేకున్న ఆ కార్యములు ప్రవర్తింపనిస్థితిలో అవిసంజ్ఞలే కానందున, "కార్యము లెట్లు ప్రవర్తించును?" అని శంక కలుగును. కార్యములు ప్రవర్తించిన తరువాతనే సంజ్ఞలగునన్నచో, "ముందొక రూపము, వెనుక వేరొకరూపము" అగునుగాన, శబ్దనిత్యత్వమునకు భంగమేర్పడును.

పై శ్లోకము యొక్క భావమునే స్పష్టపరచుచున్నాడు.

> గోత్రాణ్యేవ తు తా న్యాహుః సంజ్ఞాశక్తి సమన్వయాత్
> నిమిత్తాపేక్షణం తేషు స్వార్థే నావశ్య మిష్యతే. 368

సంజ్ఞాశక్తి సమన్వయాత్ = ఆయా అర్థములను (సంజ్ఞలవలన తెలియువ్యక్తులు) బోధించు సామర్థ్యమును కలిగిఉన్నందువలన, తాని + తు = ఆయా సంజ్ఞాపదములను (ఖరణసః, మొదలగునవి), గోత్రాణి + ఏవ = ప్రత్యేకమైన శబ్దకులముగా (ఒకవిధమైన శబ్ద విభాగము), ఆహుః = చెప్పుదురు, తేషు = ఆ శబ్దముల విషయములో, నిమిత్తాపేక్షణమ్ = తన స్వరూపముకంటె వేరైన వ్యుత్పత్త్యర్థము, అవశ్యమ్ = తప్పనిసరిగా, న + ఇష్యతే = కోరబడదు.

తా ఖరణసః మొదలగు సంజ్ఞలు, వాచ్యవాచక భావసంబంధముచే తమ తమ అర్థములను సూటిగా బోధించును. అవి నిత్యమైన ఒక ప్రత్యేక శబ్దరాశికి చెందును. వాని విషయములో ప్రవృత్తి నిమిత్తము (శబ్దము అర్థమును బోధించుటకు హేతువైన ఒక ధర్మము) వాని స్వరూపమే (అనుపూర్వి = వర్ణక్రమము). వేరే ప్రవృత్తి నిమిత్తము ఉండవలెనను నిర్బంధము లేదు. (కొన్నిచోట్ల అట్టి నిమిత్తము కుదిరినను బాధలేదు).

వి. ఇతరశబ్దముల వలెనే సంజ్ఞాశబ్దములును అనాదిగా లోకమందు సిద్ధములై ఉన్నవి. వానికి ఆయా అర్థములను బోధించుశక్తియు నిత్యముగానే ఉన్నది. అయినపుడు "ఆ శబ్దము లా అర్థమును బోధించుటలో హేతువేమి?" అని పరిశీలింప నక్కరలేదు. ఒకానొకచో వేరే ప్రవృత్తినిమిత్తము (శబ్దవ్యుత్పత్తినిబట్టి తెలియు అర్థము) కుదిరినయెడల, దానిని స్వీకరింపవచ్చును. లేనియెడల ఆ సంజ్ఞయొక్క స్వరూపమునే ప్రవృత్తినిమిత్తముగా అంగీకరింపవలెను.

అనగా 'ఖరణసః' అను సంజ్ఞను వాడినపుడు, దాని అర్థముగా తెలియబడువ్యక్తి, "గాడిదముక్కు కలవాడై తప్పక ఉండవలయు" నను నిర్బంధము లేదు. అట్టు లేనివాని కైనను ఆ పేరును పెట్టుకోవచ్చును. ఆ విధముగా పెట్టినపుడు, "ఈ వర్ణక్రమముతోకూడిన ఈ శబ్దమునకు ఈ వ్యక్తి అర్థము" అని సమన్వయము చేసికొనవలెను.

ప్రవృత్తి నిమిత్తమునుబట్టి, భాషయందలి శబ్దములను ముఖ్యముగా మూడు విధములుగా విభజింతురు.

1. జాతివాచకములు : గౌః, అశ్వః, మానవః మొదలగునవి. (ఈ శబ్దములు ఆయా జాతిని ఆధారముగా చేసికొని వాడబడును).

2. గుణవాచకములు : శుక్లః, నీలః, రక్తః, మొదలగునవి. (ఇచట ఆయా గుణములు ప్రవృత్తి నిమిత్తములు).

3. క్రియావాచకములు : పాచకః, గాయకః, లేఖకః మొదలగునవి. (ఇచట ఆయా క్రియ ప్రవృత్తినిమిత్తము).

ప్రకృతము సంజ్ఞాశబ్దములను వేరే ఒక విభాగముగాచూపి, "సంజ్ఞాప్రవృత్తినిమిత్తములు" అని నాలుగవ శబ్దరాశిని అంగీకరించుట మంచిదనియు, అచట వేరుగా వ్యుత్పత్త్యర్థమును చూపినను చూపకపోయినను బాధలేదనియును ఈ కారికయొక్క సారాంశము.

ప్రవృత్తేః = శబ్దప్రవృత్తేః, నిమిత్తమ్ = హేతుః- అని విగ్రహము. ఒక శబ్దము తన అర్థమును బోధించుటలో కారణమైన అంశమును ప్రవృత్తి నిమిత్తమందురు. అది జాతి, గుణము, క్రియ అను మూడు విధములని సంప్రదాయము. సంజ్ఞాపదములలో ఇవి కుదరవు గాన, అచట శబ్దస్వరూపమే ప్రవృత్తి నిమిత్తమగునని వైయాకరణు లందురు. ఈ ప్రవృత్తి నిమిత్తమును గురించిన విశాలమైన చర్చలను మహాభాష్యము మొదలగు ఉద్గ్రంథములలో చూడనగును.

"సంజ్ఞా శబ్దములన్నియు కృతకములు—అనగా—కేవలము కల్పితములు" అన్న పక్షమందును, వాని విషయములో శబ్దార్థ సంబంధము నిత్యమే అని సమర్థించుచున్నాడు.

వ్యవహారాయ నియమః సంజ్ఞాయాః సంజ్ఞిని క్వచిత్
నిత్య ఏవ తు సంబంధో డిత్థాదిషు గవాదివత్ . 364

క్వచిత్ = ఒకానొక, సంజ్ఞిని = సంజ్ఞగల వ్యక్తి విషయములో (సంజ్ఞచే తెలియదగు అర్థము విషయములో), వ్యవహారాయ = లోకములోని వాడుక సిద్ధించుట కొరకు, సంజ్ఞాయాః = సంజ్ఞావాచకమునకు సంబంధించిన, నియమః = వ్యవస్థ ("ఈ సంజ్ఞతో తెలియవలసిన వ్యక్తి ఇదే"—అను కట్టుబాటు), (క్రియతే = చేయబడును). గవాదివత్ = "గౌః" మొదలగు శబ్దములలో వలె, డిత్థాదిషు = "డిత్థ" మొదలగు శబ్దములలో కూడ, సంబంధః = అర్థముతోగల సంబంధము, నిత్యః + ఏవ + తు = నిత్యమైనదే (కల్పితము కాదు).

తా. "డిత్థః" "డవిత్థః" మొదలగు సంజ్ఞాపదములుకూడ, భాషలోని ఇతర శబ్దములవలె అనాదులును, నిత్యములును అని తెలియవలెను. ఆయా వ్యక్తులను బోధించు శక్తి, ఆయా అర్థములతో వానికుండు సంబంధమును నిత్యమే. అయితే లోకులు మాత్రము ఆయా సమయములలో, ఆయా సంజ్ఞా శబ్దములను కొందరు వ్యక్తులకు వాడుచుందురు. అది

సౌకర్యము కొరకు చేసికొన్న ఏర్పాటు. దానివలన, 'ఈ సంజ్ఞ ప్రస్తుతమీ అర్థమును తెలుపును' అను స్పష్టత సిద్ధించును.

గో, అశ్వ, మొదలగు భాషలోని శబ్దము లన్నింటికి, వాని వాని అర్థములకును ఉండు సంబంధము (వాచ్య వాచకభావము) అనాది అనియు, నిత్యమనియు అందురు. ఆ సంబంధమును "యోగ్యత" (తగియుండుట) అని కూడ అందురు. ఇటువంటి తీరును సంజ్ఞా శబ్దముల విషయములో కూడ అంగీకరింపవలెను. కాగా సంజ్ఞా శబ్దములు కేవలము "ఆధునికులు కల్పించుకొన్న శబ్దములు" అనకూడదు.

వి. "సంజ్ఞా శబ్దములు మనము కల్పించుకొన్నవి. అవి నిత్యము లెట్లు కాగలవు?" అను శంకకు ఈ శ్లోకము సమాధానము. "అన్ని రకముల శబ్దములును ప్రవాహరూపమున నిత్యములే. వానికి అర్థములతోడి సంబంధమును నిత్యమే. అది "అనాది యోగ్యత" అని వ్యవహరింపబడును ("ఈ అర్థము ఈ శబ్దమువలన తెలియదగిన ది అనుభావము). సంజ్ఞా శబ్దముల విషయములో మాత్రము ఒక విధమైన నియమమును ("ఏ అర్థమును బోధించు ఉద్దేశముతో ఆ సంజ్ఞనువాడుదుమో అప్పటికదియే దాని అర్థము' అనుకొనుట) అవలంబింపక తప్పదు" అన్నది సారాంశము.

శబ్దార్థ సంబంధము నిత్యమైనపుడు, ఆ సంబంధము కల శబ్దార్థములు కూడ నిత్యములే యని ఫలించును. (సంబంధులు లేని సంబంధము ఉండదు గదా!) ఈ యంశమును ముందు ముందు గ్రంథకర్త బహురీతులతో విశదీకరించును.

శాస్త్రీయములగు "వృద్ధి" మొదలగు సంజ్ఞలలోగూడ, ఇట్టి వ్యవహార నియమమును అవలంబింపవలెనని అనుచున్నాడు.

వృద్ధ్యాదీనాం చ శాస్త్రేఽస్మిన్ శక్త్యవచ్ఛేదలక్షణః
అకృత్రిమోఽభిసంబంధో విశేషణవిశేష్యవత్ . 365

అస్మిన్ = ఈ, శాస్త్రే = వ్యాకరణ శాస్త్రమందు, వృద్ధ్యాదీనామ్ + చ = వృద్ధి, గుణము, మొదలగు సంజ్ఞలకు కూడ, శక్త్యవచ్ఛేద లక్షణః = శక్తి నియమ రూపమైన, ("ఇచట ఈ శబ్దమునకు ఇదే అర్థము" అని ప్రత్యేకించుట), అకృత్రిమః = సహజసిద్ధమైన అభిసంబంధః = అర్థముతోడి సంబంధము, విశేషణ విశేష్యవత్ = విశేషణ విశేష్యముల యొక్క సంబంధమువలెనే, (అస్తి = ఉన్నది).

తా. వ్యాకరణ శాస్త్రములో వృద్ధి, గుణము మొదలగు సంజ్ఞలు కొల్లలుగా ఉన్నవి. అవి వాని సంకేతితార్థములను బోధించుచుండును. అవియు "డిత్థ" "డవిత్థ" మొదలగు లౌకిక సంజ్ఞల వంటివే. కృతకములు కావు. అచటను శబ్దార్థ సంబంధములు నిత్యములే అయినను, శాస్త్రీయ వ్యవహారము కొరకై, "ఈ సంజ్ఞ వలన ఈ యర్థము తెలియదగినది" అను చిన్న నియమమును చేసికొందుము.

విశేషణ విశేష్యములకుండు సహజమైన ఒకానొక సంబంధమువలెనే, సంజ్ఞా సంజ్ఞులకుండు సంబంధమున్ను అనాదియు స్వతస్సిద్ధమునై ఉండును.

వి. శబ్దము, అర్థము వాని సంబంధము,—అన్నియు నిత్యములను సిద్ధాంతము యొక్క శిఖరముపై, "సర్వే సర్వార్థ వాచకాః" (అన్ని శబ్దములును అన్ని అర్థములను

కూడ చెప్పగలుగును) అనువచనము ఉన్నది. అయినపుడు శబ్దార్థముల విషయములో ఏ విధమైన నియమమును చేయనక్కరలేదు. నిత్యములైన వానికి నియమము లెందుకు ?

కాని "సర్వే సర్వార్థ వాచకాః" అను అనుభవము శబ్ద బ్రహ్మవేత్తలగు యోగీశ్వరులకే చెల్లును. సామాన్యులకు అన్ని విధములైన ఏర్పాటులును ఆవశ్యకములే. అట్టి ఏర్పాటులలో ముఖ్యమైనది శబ్ద శక్తిని నియమించుట. లౌకిక సంజ్ఞలకువలెనే, శాస్త్రీయ సంజ్ఞలకును శక్తిని నియమింతురు. (ఈ శాస్త్రమున, ఈ సంజ్ఞకు ఇది అర్థము అని చెప్పుదురు). ఉన్న విషయమును ప్రత్యేకించుట తప్ప, క్రొత్త కల్పన ఏదియు ఈ సందర్భములో ఉండదు.

వాక్యములోని విశేషణ విశేష్యములకు ఉండు సంబంధము కూడ (అభేద సంబంధము మొదలయినది) అనాది సిద్ధమైనదే, ఏ ఒక వ్యక్తియు అట్టి సంబంధమును సృష్టింపలేదు. స్వతస్సిద్ధమైన విషయమును, కొన్ని ఉపాయముల మూలముగా సామాన్యులు గుర్తించుట జరుగుచుండును. అట్టి ఉపాయములనే శాస్త్రము అందురు.

కాగా వ్యాకరణ శాస్త్రములోని సంజ్ఞ లన్నియు నియమరూపములే.

వి. "వృద్ధి రాదైచ్" (1-1-1) ఆదైచ్చ వృద్ధి సంజ్ఞః స్యాత్. (వృత్తి) "ఆ, ఐ, ఔ అనునవి 'వృద్ధి' అనబడును" అని అర్థము. ఇదొక నియమము. "అదేఙ్ గుణః" (1-1-2) అదేఙ్చ గుణసంజ్ఞః స్యాత్. (వృత్తి)" "అ, ఏ, ఓ అనునవి 'గుణము' అనబడును" అని భావము. ఇది వేరొక నియమము. ఇట్లే ఇతర సంజ్ఞల విషయమును ఊహించునది.

"సంజ్ఞాశబ్దములన్నియు శబ్దాంతరములవలె అనాదులే. వ్యవహారము కొరకు మాత్రమే నియమము చూపబడును" అనునది ముఖ్యతత్త్వము.

సంజ్ఞాశబ్దముల ప్రవృత్తి నిమిత్తమును నిరూపించుటకు ఉపక్రమించుచున్నాడు.

సంజ్ఞాస్వరూప మాశ్రిత్య నిమిత్తే సతి లౌకికీ
కాచిత్ ప్రవర్తతే కాచి న్నిమిత్తాసన్నిధా వపి .   ౩౬౬

కాచిత్ = ఒకానొక, లౌకికీ = లోకమందు ప్రసిద్ధమైన, సంజ్ఞా = సంజ్ఞాశబ్దము, (శత్రుఘ్న-మొదలగునది), నిమిత్తే = ప్రవృత్తి నిమిత్తము (వ్యుత్పత్తి ననుసరించి లభించు అర్థము), సతి = ఉన్నయెడల, స్వరూపమ్ = శబ్దస్వరూపమును (వేరుగా ఉన్న వ్యుత్పత్త్యర్థమును కూడ), ఆశ్రిత్య = ఆశ్రయించి (నిమిత్తముగా ఉంచుకొని), ప్రవర్తతే = ప్రవర్తించును (అర్థమును బోధించును), కాచిత్ + సంజ్ఞా = వేరొక సంజ్ఞాశబ్దము, నిమిత్తాసన్నిధౌ + అపి = వ్యుత్పత్తిసిద్ధమైన అర్థము వేరుగా లేకున్నను (స్వరూపమ్ = కేవలము శబ్దరూపమును, ఆశ్రిత్య = ఆశ్రయించి), ప్రవర్తతే = ప్రవర్తించును.

తా. లోకములో వాడబడు సంజ్ఞలు రూఢములు, యౌగికములు అని రెండు విధములు. ఎట్టి వ్యుత్పత్తియు లేనివి రూఢములు. ఉదా : డిత్థః, డవిత్థః మొదలగునవి. వ్యుత్పత్త్యర్థముకలవి యౌగికములు. ఉదా : శత్రుఘ్నః మొదలగునవి (శత్రూన్-హంతి= శత్రువులను చంపువాడు). ఈ రెండు విధములైన సంజ్ఞలకును శబ్దస్వరూపమే ప్రవృత్తి నిమిత్తము. దానినే ఆధారముగ చేసుకొని, శబ్దము ఆయా సంజ్ఞిని బోధించును. వ్యుత్పత్త్యే

ర్థము కుదిరినచోట్ల దానినికూడ ప్రవృత్తి నిమిత్తముగా కలుపుకొనవచ్చును. లేనిచోట్ల శబ్ద స్వరూపమే ప్రవృత్తి నిమిత్తముగా మిగులును.

వి. సంజ్ఞాశబ్దముల ప్రవృత్తినిమిత్తమును పరిశీలించుటకు ఈ ప్రసంగ మారంభ మైనది. శ్లోకములోని "లౌకికీ" అను పదమును సూచనగా తీసుకొని, "శాస్త్రీయ సంజ్ఞలకు కూడ ఈ తీరునే అవలంబింపవలయును" అని తెలియవలెను.

వ్యాకరణశాస్త్రమునకూడ రెండు విధములైన సంజ్ఞలును ఉన్నవి. టి, ఘు, భ మొదలయినవి రూఢములు. 'సర్వనామ' 'సమాస' మొదలగునవి యౌగికములు. రెండింటి విషయమునను శబ్దస్వరూపమునే ముఖ్యమైన ప్రవృత్తి నిమిత్తముగా గ్రహింపవలెను (వ్యుత్పత్త్యర్థమున్నచో కలుపుకొందుము. లేనిచో ఇబ్బంది లేదు).

వి. జాతి, గుణము, క్రియ–వీనితోపాటు శబ్దస్వరూపమునుకూడ, ప్రవృత్తి నిమిత్తముగా వైయాకరణు లంగీకరించినారు. ఇది సంజ్ఞాశబ్దములకే చెందును.

సర్వేషామ్ = అన్నింటికిని, నామ = పేరు – సర్వనామ. (తద్, యద్, మొదలగు శబ్దములు ఉద్దేశించిన ప్రతియొక వస్తువును బోధింపగలవి.) సమాసః = సంగ్రహః = రెండు మూడు పదముల అర్థము ఇచట కుదింపబడును. ఇట్టిచోట్ల యౌగికార్థముకూడ ప్రవృత్తి నిమిత్తముగా కుదురును. వీనిని సార్థకసంజ్ఞలు–లేక–అన్వర్థసంజ్ఞలు అని అందురు.

ఏకాక్షర సంజ్ఞల విషయమునవే గాక–మహా సంజ్ఞల విషయములో కూడ శబ్ద స్వరూపమే ప్రవృత్తి నిమిత్తమని తెలియవలెనని ప్రకటించుచున్నాడు.

> శాస్త్రే తు మహతీ సంజ్ఞా స్వరూపోపనిబంధనా
> అనుమానం నిమిత్తస్య సన్నిధానే ప్రతీయతే. 367

శాస్త్రే + తు = వ్యాకరణశాస్త్రమందైతే, మహతీ = పెద్దదైన, సంజ్ఞా = సంజ్ఞా శబ్దము, స్వరూపోపనిబంధనా = తన ఆనుపూర్వియే ప్రవృత్తినిమిత్తముగా గలది (అగును). నిమిత్తస్య = వేరుగా కనబడు అవయవార్థమనెడి ప్రవృత్తి నిమిత్తముయొక్క, సన్నిధానే = ఉనికియందు (అవయవార్థముకూడ ఉన్నపుడు), అనుమానమ్ = ఊహవలన లభించు ఆ అవయవార్థముకూడ, ప్రతీయతే = తెలియబడుచుండును.

తా. "సర్వనామ" మొదలగు మహాసంజ్ఞలకున్న (టి–ఘు–భ–మొదలగువాని సంగతి వేరుగా చెప్పనక్కరయే లేదు) తమతమ ఆనుపూర్వియే ప్రవృత్తి నిమిత్తము. అయితే అట్టిచోట్ల అవయవార్థముకూడ ఉండును కావున అదియు ప్రవృత్తి నిమిత్తమే అని ఊహింపవచ్చును.

అనగా శబ్ద స్వరూపమే ముఖ్య ప్రవృత్తి నిమిత్తము. పిదప, అనుమాన ప్రమాణమును బట్టి (ఊహించి) అవయవార్థమును కూడ ప్రవృత్తి నిమిత్తముగా గ్రహించుట జరుగును.

వి. మీది శ్లోకమునకు ఇది విపులీకరణము. అనుమానమనెడు ఒక క్రొత్తతీరు ఇచట సూచింపబడినది.

పై కారికయందలి అనుమాన ప్రకారమును విశదీకరించుచున్నాడు.

అవృత్తే రనుమానం వా సారూప్యా త్తత్ర గమ్యతే
శబ్దభేదానుమానం వా శక్తిభేదస్య వా గతిః. ౩౬౮

తత్ర=ఆ మహాసంజ్ఞ విషయములో, సారూప్యాత్ = శబ్ద రూపము సమానమైనందువలన, ఆవృత్తేః = శబ్దమును ఆ వృత్తి చేయుటయొక్క (రెండవసారి పలుకుట) అనుమానమ్=అనుమానము (ప్రామాణికమైన ఊహ) గమ్యతే = తెలియబడును. వా = లేక, సారూప్యాత్ = సాదృశ్యమువలన, శబ్దభేదానుమానమ్=వేరే శబ్దమను అనుమానము, గమ్యతే=తెలియబడును, వా=లేక, సారూప్యాత్=సాదృశ్యమువలన, శక్తిభేదస్య = రెండు శక్తులయొక్క, గతిః = అనుమానము, (భవతి = అగును).

తా. "సర్వనామ" మొదలగు మహా సంజ్ఞల విషయములో శబ్దస్వరూపమే (వర్ణక్రమము) మొదటి ప్రవృత్తి నిమిత్తము. అవయవార్థము కూడ (సర్వేషామ్-నామ = అన్నింటిని చెప్పునది) రెండవ ప్రవృత్తి నిమిత్తమగును. అయితే అవయవార్థమును పురస్కరించుకొని వేరొక శబ్దమును పలుకుటను (సర్వనామ-అను దానిని) అనుమానింపవలెను. లేక— ఒక శబ్దము వలననే ఒకసారి "స్వరూప" మని, రెండవసారి "అవయవార్థ" మని, అర్థము లభించునని ఊహింపవలెను. లేదా - ఒక శబ్దమునకే రెండు శక్తులను (రెండు విధములయిన అర్థములను చెప్పగల వేరుగా ఉండు రెండు శబ్దశక్తులు) అనుమానింపవలెను. ఎట్లు అనుమానించినను-ఆ అనుమానమునకు హేతువు శబ్ద సాదృశ్యమే అని తెలియవలెను.

వి. మహాసంజ్ఞల విషయములో, అనుమాన ప్రమాణమును స్వీకరించినట్లయితే, అవయవార్థము కూడ రెండవ ప్రవృత్తి నిమిత్తము కావచ్చునని మీది కారిక సూచించినది. అనుమానించుపద్ధతిని ఈ కారిక వివరించినది. సర్వనామ సంజ్ఞను ఉదాహరణముగా తీసుకొని ఈ అంశమును స్పష్టపరచుకొనవచ్చు.

1. సర్వనామ: ఈ శబ్దముయొక్క ఆనుపూర్వియే (వరుసగా ఉన్న వర్ణములు) మొదటి అర్థము. అదే ప్రవృత్తి నిమిత్తము.

2. సర్వనామ: "సర్వేషామ్-నామ"- ఇది అవయవార్థము. రెండవ ప్రవృత్తి నిమిత్తము. "ఇదెట్లు లభించు"నని ప్రకృతశంక. ఈ శంకను పోగొట్టుటకు మూడు మార్గములను గ్రంథకర్త చూపినాడు:— 1. ఆవృత్తి :— "సర్వనామ"- అనుపదమును రెండుసార్లు ఉచ్చరించి కావలసిన రెండర్థములను సంపాదించుట 2. శబ్దభేదము:—శబ్దమును ఒక మారేపల్కి, రెండర్థములును ఆ శబ్దమునకే అతికినట్లున్నవని చెప్పుట. దీనినే సాంకేతికముగా "తంత్రము" అని అందురు. (ఇచట శబ్దశక్తి ఒకటే). 3. శక్తిభేదము :- శబ్దమునకు రెండు శక్తులు (అర్థమును బోధించు శక్తి) విడివిడిగా ఉన్నవని, అవి రెండు అర్థములనున్ను బోధించుననియు చెప్పుట. దీనిని "శక్తిభేదము" అందురు. ఇచట కూడ శబ్దమును పలుకుట ఒక్కసారియే.

పై మూడింటిలో ఒక దానినైనను అనుమానమువలన సాధించుకొనవచ్చును. అన్నింటి విషయములోను "శబ్దసారూప్యమే" హేతువు. (శబ్దరూప మొక విధముగానే ఉన్నందువలన రెండవ అర్థము కూడ ఉన్నందువలనను ఆవృత్తి మొదలగు వానిని ఊహింపవచ్చునని భావము).

కాగా మహా సంజ్ఞ లన్నింటికిని, "ఆనుపూర్వి", "అవయవార్థము" అను రెండు ప్రవృత్తి నిమిత్తములుండునని ఫలించినది.

సంజ్ఞా శబ్దములు నాలుగు విధములని ప్రతిపాదించుచున్నాడు.

క్వచి ద్విషయభేదేన కృత్రిమా వ్యవతిష్ఠతే
సంఖ్యాయా మేకవిషయం వ్యవస్థానం ద్వయో రపి . 369

కృత్రిమా=శాస్త్రమందు చేయబడిన సంజ్ఞ, క్వచిత్=ఒక చోట, విషయ భేదేన= విషయము వేరగుటను బట్టి, వ్యవతిష్ఠతే=ప్రత్యేకముగా సమన్వయించును. సంఖ్యాయామ్= సంఖ్యాసంజ్ఞ విషయములో, ఏక విషయమ్=ఒక కార్యమును గురించిన, వ్యవస్థానమ్= నియమము (సమన్వయ నియమము), ద్వయోః+అపి=కృత్రిమమము, అకృత్రిమము అగు రెండు రకముల సంజ్ఞలకును, (భవతి=అగును).

తా. సంజ్ఞలు ముఖ్యముగా రెండు విధములు: కృత్రిమములు, అకృత్రిమములు అని. ఒక ప్రయోజనమును ఉద్దేశించి ప్రత్యేకముగా శాస్త్రమందు చేయబడినవి కృత్రిమములు. లోకవ్యవహారములో సహజముగా వాడబడునవి అకృత్రిమములు. ఈ సంజ్ఞల అర్థమును ఆయా విషయమును బట్టి నిశ్చయించుకొనవలెను. ఒక చోట కృత్రిమమైన అర్థమును వేరొకచోట అకృత్రిమమైన అర్థమును, మరొకచోట రెండు విధములైన అర్థములను ఆయా సందర్భమును బట్టి స్వీకరింపవలెను. అన్నిచోటులందును ఒకే విధమున సమన్వయించుట కుదురదు.

వి. వ్యాకరణ శాస్త్రమందలి కొన్ని ఉదాహరణముల మూలముగా ప్రకృతాంశము విశదమగును:— 1. కరణమ్:- ఇదొక కృత్రిమ సంజ్ఞ "ఒకక్రియ సిద్ధించుటలో మిక్కిలి ఉపయోగపడు పనిముట్టు" అని అర్థము. "కర్తృకరణయోస్తృతీయా" (2-3-18) అను సూత్రము కర్తృవాచకమునకు, కరణవాచకమునకును తృతీయా విభక్తిని విధించినది. కావున ఇచట "కరణం" మనగా సాధనమను కృత్రిమార్థమునే చెప్పవలెను.

2. "చేయుట" అను లోకసిద్ధమైన సామాన్యార్థమును చెప్పినచో, "కరణ" సంజ్ఞ అకృత్రిమము కూడ అగును. "శబ్దవైరకలహాభ్రకణ్వమేఘేభ్యః కరణే" (3-1-17) అను సూత్రమున కరణ శబ్దమునకు అకృత్రిమార్థమునే చెప్పవలెను. ("చేయుట" అను అర్థములో శబ్ద, వైర, మొదలగు శబ్దములకు పరముగ, క్యఙ్ అను ప్రత్యయమును ఈ సూత్రము విధించును).

3. సంఖ్యా: బహు, గణ, అనుశబ్దములును, వతుప్రత్యయాంత శబ్దములును. (యావత్, తావత్, మొదలగునవి) కతి అనుశబ్దమున్ను (డతిప్రత్యయాంతము) "సంఖ్య" అనిపించుకొనును. (బహుగణవతుడతి సంఖ్యా-1-1-23 అని సూత్రము) ఇది ఈ శబ్దము నకు కృత్రిమమైవ అర్థము. "ఏక, ద్వి, త్రి, మొదలగు సంఖ్యావాచకములు" అను అర్థమును చెప్పినచో అకృత్రిమమగును. "సంఖ్యాయా అతిశదంతాయాః కన్" (5-1-22) అను కన్ ప్రత్యయమును విధించు సూత్రములో, సంఖ్యాసంజ్ఞకు ఈ రెండు విధములైన అర్థములను కూడ స్వీకరింపవలెను.

కర్మ, కరణమ్, సంఖ్యా, మొదలగు సంజ్ఞలు వ్యాకరణ శాస్త్రమందు ప్రత్యేక సంకేతములుగా ఉన్నవి. లోకవ్యవహారములో అవే శబ్దములకు ప్రసిద్ధములైన వేర్వేరు అర్థములున్నవి. శాస్త్రమందు ఆయా శబ్దములకు, కొన్నిచోట్ల సంకేతసిద్ధమైన అర్థమును, మరికొన్నిచోట్ల లోకప్రసిద్ధమైన అర్థమును, ఇంకను కొన్నిచోట్ల రెండువిధములైన అర్థములనుకూడ చెప్పుచుండవలెను. ప్రకరణము, ఔచిత్యము, లక్ష్యసిద్ధి మొదలగువాని ననుసరించి ఆయా అర్థమును నిశ్చయించుకొనవలెను. ఈ విషయములను బోధించుటయే ఈ శ్లోకము యొక్క ముఖ్యప్రయోజనము.

1. కర్తృకరణయోస్తృతీయా (2-3-18) "అనభిహితే కర్తరి కరణేచ తృతీయా స్యాత్" (వృత్తి)- "కర్తయు కరణమున్ను వేరొకరీతిని చెప్పబడని సందర్భములో, తద్వాచక శబ్దమునకు తృతీయావిభక్తి అగును"—అని అర్థము. ఉదా: రామేణ బాణేన హతః వాలీ. (బాణము కరణము) కరణమును చెప్పు శబ్దమునకు తృతీయ వచ్చునుగాన, ఇచట కరణశబ్దము శాస్త్రీయమైన కృత్రిమార్థమునే బోధించును. ("చేయుట" అను అకృత్రిమార్థము పొసగదు).

2. శబ్దవైరకలహాభ్రకణ్వమేఘేభ్యః కరణే (3-1-17) ఏభ్యః కర్మభ్యః కరోత్యర్థే క్యఙ్ స్యాత్ (వృత్తి). "శబ్ద, వైర, కలహ, అభ్ర, కణ్వ, మేఘ- అను శబ్దములకు పరముగ—"దానిని చేయువాడు"—అను అర్థములో "క్యఙ్" (య) అను ప్రత్యయము వచ్చును"—అని అర్థము. ఉదా: "శబ్దం కరోతి = శబ్దాయతే, వైరం కరోతి = వైరాయతే," మొదలగునవి. ఈ సూత్రమున కరణశబ్దము "చేయుట" అను అకృత్రిమార్థమును మాత్రమే బోధించును. 'ఈ అర్థమందు ఈ ప్రత్యయమగును' అను సందర్భముగాన, ఇచట కృత్రిమమైన అర్థము నప్పదు.

(సాధకతమం కరణమ్—1-4-42 క్రియాసిద్ధౌ ప్రకృష్టోపకారకం కరణసంజ్ఞం స్యాత్ (వృత్తి). వ్యాపారము సిద్ధించుటలో ప్రముఖమైన సాధనము కరణమనబడును. — ఇది కరణశబ్దమునకు కృత్రిమమైన అర్థము).

3. 'సంఖ్యాయా అతిశదంతాయాః కన్' (5-1-22) సంఖ్యాయాః కన్ స్యాత్ ఆర్హీయేఽర్థే నతు త్యంతశదంతాయాః(వృత్తి). "దానిచే కొనబడినది" మొదలగు అర్థములలో సంఖ్యావాచకమునకు కన్ ప్రత్యయ మగును, తి-శత్ అనునవి చివరనుగల సంఖ్యకు మాత్రము (వింశతి, త్రింశత్ మొదలగునవి) ఈ ప్రత్యయము రాదు. ఉదా: పంచభిః క్రీతః=పంచకః మొదలగునవి. ఈ సూత్రమున సంఖ్యాశబ్దము కృత్రిమార్థమును (బహు, గణ, మొదలగునవి) అకృత్రిమార్థమునుకూడ (ఏక, ద్వి, మొదలగునవి) బోధించును. 'అతిశదంతాయాః' అను నిషేధమువలన 'అకృత్రిమార్థమునుకూడ గ్రహింపవలెను' అను విషయము సూచితమైనది. కేవలము కృత్రిమమునే గ్రహించినయెడల ఆ నిషేధము వ్యర్థమగును గదా! (వింశతి, త్రింశత్, మొదలగునవి కృత్రిమసంఖ్యలు కానే కావు కాన నిషేధమక్కరలేదు).

సారాంశము : 1. వ్యాకరణశాస్త్రములోని సంజ్ఞలకు కొన్నిచోట్ల కృత్రిమార్థమునే చెప్పవలెను.
2. కొన్నిచోట్ల అకృత్రిమార్థమునే చెప్పవలెను.
3. మరికొన్నిచోట్ల రెండు విధములైన అర్థములను ఒకేసారి చెప్పవలెను.

కొన్నిచోట్ల అకృత్రిమమగు సంజ్ఞాశబ్దము కృత్రిమసంజ్ఞను గూడ బోధించునని చెప్పుచున్నాడు.

విషయం కృత్రిమస్యాఽపి లౌకికః క్వచి దుచ్చరన్
వ్యాప్నోతి దూరాత్సంబుద్ధౌ తథా హి గ్రహణం తయోః. 370

దూరాత్, సంబుద్ధౌ = 'ఏకశ్రుతి దూరాత్ సంబుద్ధౌ' (1-2-33) మొదలగు, క్వచిత్ = కొన్నిచోట్ల, లౌకికః = లోకప్రసిద్ధమైన సంజ్ఞ, ఉచ్చరన్ = పలుకబడుచు, కృత్రిమస్య = శాస్త్రీయమైన సంజ్ఞయొక్క, విషయమ్ + అపి = విషయమునుకూడ, వ్యాప్నోతి = వ్యాపించును. హి = ఎందువల్లననగా, తయోః = ఆ రెండు విధములైన అర్థములకును, తథా = ఆవిధముగ (వ్యాప్యవ్యాపక భావముచే), గ్రహణమ్ = స్వీకారము, (భవతి = అగును).

భా. 'సంబుద్ధి' అనునది ఒక సంజ్ఞ. 'పిలుచుట లేక హెచ్చరించుట' అని దీని యొక్క లౌకికార్థము (అకృత్రిమము). 'సంబోధన ప్రథమయొక్క ఏకవచన ప్రత్యయము' (సు) అనునది శాస్త్రీయార్థము (కృత్రిమము). 'ఏకశ్రుతి దూరాత్ సంబుద్ధౌ' అను సూత్రములో సంబుద్ధిపదమునకు తొలుత అకృత్రిమమైన అర్థమునే చెప్పవచ్చును. అయినను ఆ అర్థములోనే ఇమిడియున్నందున, కృత్రిమార్థమునుకూడ గ్రహింప వీలుకలుగును.

వి. 'సంబోధనం సంబుద్ధిః' ('ఒకవ్యక్తిని తనవైపు త్రిప్పుకొనుటకు చేయు పిలుపు') ఇది లౌకికార్థము. 'ఏకవచనం సంబుద్ధిః' (2-3-49) సంబోధనే ప్రథమాయా ఏకవచనం సంబుద్ధిసంజ్ఞంస్యాత్ (వృత్తి). సంబోధనమందు ప్రథమావిభక్తియొక్క ఏకవచన ప్రత్యయమునకు (సు) సంబుద్ధి యని పేరు. ఇది శాస్త్రీయార్థము. లౌకికార్థము వ్యాపకము. (దాని విషయము విశాలమైనది). శాస్త్రీయార్థము వ్యాప్యము. (దాని విషయము పరిమితమైనది). వ్యాపకమందు వ్యాప్యము అంతర్భూతమగును.

'ఏకశ్రుతి దూరాత్ సంబుద్ధౌ' (1-2-33) దూరాత్ సంబోధనే వాక్య మేకశ్రుతి స్యాత్. (వృత్తి) 'సంబోధనమందు ప్రయోగించు వాక్యమునకు "ఏకశ్రుతి" అగును' అని అర్థము. అనగా ఉదాత్తాది స్వరవిశేషములు లేకుండ, ఆ వాక్యము ఒకే సామాన్యధ్వనితో ఉచ్చరింపబడునని భావము. ఉదా: 'ఆగచ్ఛ భో మాణవక!' ఈ సూత్రమున సంబుద్ధిపదమునకు లౌకికార్థమునే చెప్పినను, దానితోపాటు శాస్త్రీయార్థముకూడ స్ఫురించి, అంగీకరింపబడును. కావున దాని విషయములోకూడ ఏకశ్రుతి సిద్ధించును.

సంబోధన ప్రథమావిభక్తి అంతయు సంబుద్ధి అయినపుడు (లౌకికముగా) దాని ఏకవచనాంతము సంబుద్ధి అని వేరుగా చెప్పనక్కరలేదుగదా! అని సారాంశము. సంజ్ఞా శబ్దముల చర్చ ఇంతతో ముగిసినది.

వాక్యవిచారణ ప్రసంగమున, కొన్నిచోట్ల ప్రత్యేకవాక్యసమాప్తి అని, మరికొన్ని చోట్ల సముదాయ వాక్య సమాప్తి అనియు సూచించుచున్నాడు.

సంభేదైక శేషద్వంద్వేషు కేచి త్సామర్థ్యలక్షణమ్
ప్రత్యాశ్రయ మవస్థానం క్రియాణాం ప్రతిజానతే. 371

సంఖ్యైకశేషద్వంద్వేషు = సముదాయమును బోధించుపదము, ఏకశేషము, ద్వంద్వ సమాసమును, (నిర్దిష్టేషు = ప్రయోగింపబడినపుడు), క్రియాణామ్ = భోజనము మొదలగు కొన్ని వ్యాపారములకు, సామర్థ్యలక్షణమ్ = శబ్దస్వభావము నిమిత్తముగాగల, అవస్థానమ్ = సమాప్తిని, ప్రత్యాశ్రయమ్ = ప్రతియొక కర్తకును చెందునట్లుగా, కేచిత్ = కొందరు, ప్రతిజానతే = చెప్పుదురు.

భా. 'బ్రాహ్మణః భునక్తు' (బ్రాహ్మణుడు భుజించుగాక) 'బ్రాహ్మణాః భుంజంతు' (బ్రాహ్మణులు భోజనముచేయుదురుగాక). 'రామ, కృష్ణ, గోపాలాః భుంజంతు' (రామ-కృష్ణ-గోపాలురు భుజించుదురుగాక). వీనిలో మొదటివాక్యములోని 'బ్రాహ్మణః' అనునది బ్రాహ్మణసముదాయమును చెప్పు పదము. రెండవ వాక్యములోని 'బ్రాహ్మణాః' అనునది ఏకశేషము. మూడవవాక్యమందలి 'రామకృష్ణగోపాలాః' అనునది ద్వంద్వసమాసము. 'భుజించుట' అను క్రియ అన్నింటను సమానమే.

'ఇటువంటి వాక్యములలో, శబ్దసామర్థ్యము ననుసరించి భోజనమను వ్యాపారము, ఎందరు కర్త లుందురో అందరకును ప్రత్యేకముగా చెందును. అపుడే వాక్యార్థము సఫలమగును'. అని కొందరందురు. అనగా అందరును ఎవరికి వారు తిన్నపుడే ప్రతియొకరికిని తృప్తి కలుగునుగాని, ఎవరో ఒక రిద్దరు తిన్నందువలన మిగిలిన అందరకును తృప్తి కలుగదని భావము.

వి. వాక్యవిచారణమును, వాక్యార్థవిచారణమును ప్రకృతములు. తదనుసారము వాక్యవాక్యార్థ సమాప్తి, 'సముదాయమందాః లేక ప్రత్యేకమందాః' అను పరిశీలనకొరకు ఇటు పై ఘట్టమంతయు ఉపయోగించును. ఆ ఘట్టమును ఈ కారిక ప్రారంభించినది. వాక్యమందలి క్రియ కర్తృసముదాయమందు విశ్రమించినచో (అన్వయించి ఆగినచో), 'సముదాయ వాక్య పరిసమాప్తి' అనియు, ప్రతియొక కర్తకును విడివిడిగా సంబంధించినచో, 'ప్రత్యేక వాక్యసమాప్తి' అనియు సాంకేతికముగా చెప్పుదురు.

'బ్రాహ్మణః' అను ఏకవచనాంతముతో బ్రాహ్మణసముదాయమునంతను బోధింపవచ్చును. దీనిని జాత్యేకవచన మందురు. 'బ్రాహ్మణాః' అను బహువచనాంతముకూడ బ్రాహ్మణుల నందరిని చెప్పును. దీనిని ఏకశేషవృత్తి అందురు. సరూపమైన శబ్దములలో ఒకటే మిగిలి, అన్నింటి అర్థమును చెప్పగలుగుట (బ్రాహ్మణశ్చ, బ్రాహ్మణశ్చ, బ్రాహ్మణశ్చ = బ్రాహ్మణాః). ఇతరేతరయోగమును (ఒకరినొకరు కలియుట) సూచింపుచు విడివిడి శబ్దములను సమాసముగా కూర్చుట ద్వంద్వమగును. ఈ మూడువిధములైన వాక్యప్రయోగము లందును క్రియకు ప్రత్యేక సమాప్తియే అని కొందరి మతము.

సంఖ్యైకశేష ద్వంద్వసమాసములుగల వాక్యములలో, క్రియాపదమునకు ప్రతియొక పదముతోను సంబంధము కొన్నిచోటులందు (భోజనము, పానము, మొదలగు క్రియలను చెప్పు తిఙంతమును ప్రయోగించిన స్థలములలో) సహజము. కొన్నిచోటులందు ('చూచుట' మొదలగు వ్యాపారములను చెప్పు తిఙంతమును వాడినచోట్ల) సముదాయమును బోధించు పదముతో మాత్రమే సంబంధము సహజము. అట్లే వాక్యార్థవిషయమునకూడ, కొన్నిచోటులందు సముదాయ సమాప్తియు శబ్దార్థస్వభావమునుబట్టి సహజము, సముచితమును అగును.

'భుజించుట' 'త్రాగుట' 'నడచుట' మొదలగు క్రియలకు ప్రత్యేక పరిసమాప్తి (ప్రతియొక కర్తతోను సంబంధము) తప్పదు. 'చూచుట' మొదలగు వ్యాపారములకు సముదాయపరిసమాప్తియే (కర్మసముదాయముతో సంబంధము) సమంజసము. (ఎందుచేత ననగా భోజనాదులను ఎవరికివారే చేయవలెను. లేకున్న ప్రతియొకరికిని తృప్తికలుగదు. కాని వస్తుసముదాయము నంతను ఒకేసారి చూడగలుగుదుము. విడివిడిగా ఒక్కొక్క వస్తువును చూడనక్కరలేదు). ఆయా వ్యాపారముల స్వభావమే ఇట్టి వ్యవస్థకు నిదానము.

'భాష వాక్యరూపము. వాక్యమందు క్రియ ప్రధానము, మిగిలినవన్నియు (కారకములు) క్రియకు విశేషణములు. ఆ క్రియ తన సంబంధమునకు తగిన వస్తువుల సముదాయమునకు అన్వయించినచో సముదాయ పరిసమాప్తి అగును. విడివిడిగా ప్రతియొక వస్తువునకు అన్వయించినచో ప్రత్యేక పరిసమాప్తి అగును' అని సారాంశము.

ఈ కారిక ప్రత్యేక సమాప్తి పక్షమును చూపును.

నాట్యక్రియవలె భోజన క్రియకు కారక సముదాయసమాప్తి కుదురదని చెప్పుచున్నాడు.

భోజనం ఫలరూపాఖ్యా మేకైకస్మిన్ సమాప్యతే
అన్యథా హి వ్యవస్థానే న తదర్థః ప్రకల్ప్యతే. 372

ఫలరూపాఖ్యామ్ = 'తృప్తి' (కడుపునిండుట)అను ఫలముతోను, 'అన్నముతినుట' అను స్వరూపముతోను, భోజనమ్ = భోజనము, ఏకైకస్మిన్ = ప్రతియొక కర్తయందును, సమాప్యతే = పూర్తిఅగును (సంబంధించును). అన్యథా = మరియొకవిధముగా (సముదాయ సమాప్తి అని) వ్యవస్థానే = భుజించుటను నియమించినచో, తదర్థః = భోజనముయొక్క ప్రయోజనము, న + ప్రకల్ప్యతే + హి = సిద్ధింపదుగదా!

తా. 'భుజించుట' అను క్రియకు ముఖ్యమైన స్వరూపము అన్నమును తినుట, ఫలము తృప్తి. ఈ రెండును ప్రతియొక కర్తకును చెందునపుడే భోజనము జరిగినట్లు లెక్కవచ్చును. ఒకడుభుజించగానే మిగిలిన అందరకును తృప్తి కలుగదుగదా! కావున భోజన క్రియకు ప్రత్యేకసమాప్తి అని చెప్పక తప్పదు.

వి. కొన్నిరకములైన క్రియలకు సముదాయ పరిసమాప్తి సహజముగా కుదురును. ఉదా: అభినయక్రియ (నాట్యక్రియ). ఒక నాటకమందలి నాట్యమును పెక్కుమంది కలిసి అభినయింతురు. నటులలో ఎవరి అభినయము వారికి వేరువేరుగా ఉన్నను, మొత్తముపై నటసముదాయమునకే ఆ అభినయము చెందును. 'నటాః శాకుంతలం అభినయంతి' మొదలగు వాక్యములలో, నాట్యక్రియ సముదాయమునకే సంబంధించును. అట్లే 'చూచుట' అనుక్రియ. 'సః వృక్షాన్ పశ్యతి' అను వాక్యములో, 'చూచుట' అనునది వృక్షసముదాయమునకే చెందును (అన్నింటిని ఒక్కసారిగనే చూడగలుగును. విడివిడిగా ఒక్కొక్కచెట్టును చూడనక్కరలేదు). ఇటువంటి వ్యాపారములలో ప్రత్యేకసమాప్తి ఆవశ్యకము కాదు. కాని భుజి క్రియ ఇటువంటిది కాదు. దాని విషయములో ప్రత్యేకసమాప్తియే ఫలప్రదము.

నాట్యక్రియ, దృశిక్రియ మొదలగువానివలె, భుజిక్రియకును సముదాయపరిసమాప్తిని ఎందుకు చెప్పకూడదు?- అను శంకకు ఈ శ్లోకము ఉత్తరమిచ్చినది.

సూక్ష్మముగా పరిశీలించినచో ప్రతిఒక క్రియకును, అవయవములైన కొన్ని క్రియలు కొద్దిగనో గొప్పగనో ఉండకతప్పదు. ఇందుకు 'పచిక్రియ' (వండుట) ప్రసిద్ధమైన ఉదాహరణము. బియ్యమును కడుగుట మొదలుకొని, పొయ్యిమీదనుండి గిన్నెను దింపుపర కును మధ్యను ఎన్నో చిన్నచిన్న వ్యాపారములుండును. అవన్నియు 'వండుట' అను క్రియకు అవయవములే. కాగా పచిక్రియ క్రియాసముదాయ రూపమైనదని తెలియును. విమర్శించి చూచినచో ప్రతిఒక క్రియయు క్రియాసముదాయ రూపమే అగును. అయినను ప్రతి ఒక క్రియకును ఒక ముఖ్యమైన రూపము, ఫలమును ఉండును. పచిక్రియకు 'బియ్యము ఉడుకుట' రూపమని, 'తినుటకుపయోగించుట' ఫలమనియు అనవచ్చును. ఇట్టి రూపమును ఫలమును బట్టియే ప్రత్యేక సమాప్తినిగాని, సముదాయ సమాప్తినిగాని నిర్ణయింపవలెను. అన్ని క్రియలకును ఒకేపద్ధతి పనికిరాదు. ఈ రీతినే సామర్థ్యము లేక వస్తుస్వభావము అని వ్యవహరింతురు. ఈ సామర్థ్యము ముందు వివరింపబడును.

ప్రకృతము - భుజిక్రియకూడ క్రియాసముదాయ రూపమే. (కాళ్ళు కడుగుకొనుట, పీటపై కూర్చుండుట, అన్నము వడ్డించుట, మొదలగునవి అవయవక్రియలు) అయినను దీని రూపఫలములు మాత్రము (తినుట, తృప్తి) వేరుగా ఉన్నవి. వాని ననుసరించి భుజిక్రియకు ప్రత్యేకసమాప్తినే చెప్పవలయునన్నది సారాంశము.

పై కారిక యొక్క విషయమునే స్పష్టపరచుచున్నాడు.

అన్నాదానాదిరూపాం చ సర్వే తృప్తిఫలాం భుజిమ్
ప్రత్యేకం ప్రతిపద్యంతే న తు నాట్యక్రియా మివ . 373

అన్నాదానాదిరూపామ్ = అన్నమును తీసికొనుట మొదలగు స్వరూపము కలిగి నట్టియు, తృప్తిఫలామ్ + చ = తృప్తి అను ఫలము కలిగినట్టియు, భుజిమ్ = భోజనమను క్రియను, సర్వే = అందరును, ప్రత్యేకమ్ = ఒక్కొక్కరుగా, ప్రతిపద్యంతే = పొందు దురు, నాట్యక్రియామ్ + ఇవ = అభినయక్రియనువలె, న + తు = కాదు (సముదాయముగా పొందరు).

తా. ఒక్కొక్కక్రియకు ఒక్కొకరీతిని సంబంధము సహజము. భోజనమునకు ప్రత్యేకకారక సమాప్తియు, నాట్యమునకు కారక సముదాయ సమాప్తియు స్వభావసిద్ధములు.

వి. మీదికారిక చెప్పిన అంశమునే ఇది స్పష్టపరచినది. క్రియను 'సాధ్యము' (చేయదగుపని) అని అందురు. ఈ ధర్మము అన్ని క్రియలకును సమానమే. అయినను కారకములతో కలుగు సంబంధము మాత్రము ఆయా క్రియలకు నియతముగా ఉండును. అది వ్యవహారస్వభావము. శబ్దార్థసంబంధములవలెనే క్రియాకారకముల నియతసంబంధము కూడ అనాదిసిద్ధము. అందుచే భోజనము మొదలగు కొన్ని క్రియలు ప్రత్యేకముగా ఒక్కొక్క కారకమునకు సాధ్యములని, నాట్యము మొదలగు మరికొన్నిక్రియలు కారక సముదాయమునకు సాధ్యములనియు గ్రహింపవలెను.

పై భావమునే వేరొక దృష్టాంతముతో సమర్థించుచున్నాడు.

పాద్యవత్ సా విభాగేన సామర్థ్యా దవతిష్ఠతే
భుజిః కరోతి భుజ్యర్థం న తంత్రేణ ప్రదీపవత్ . 374

సా = అభోజనక్రియ, పాద్యవత్ = పాదోదకమువలె, సామర్థ్యాత్ = వస్తు స్వభావమువలన, విభాగేన = ప్రత్యేకముగా, అవతిష్ఠతే = సంబంధించి ఉండును, భుజిః = భోజనక్రియ, భుజ్యర్థమ్ = తృప్తిరూపమైన భోజనఫలమును, ప్రదీపవత్ = దీపమువలె, తంత్రేణ = సమానముగా (అన్నివస్తువులకు ఒకేసారి చెందునట్లుగా) న + కరోతి = చేయదు (సంపాదింపజాలదు).

తా. అతిథులకు పాదోదకమును ఇచ్చుట ఆచారము. ఆ ఉదకమును విడివిడిగా ప్రతియొక అతిథికిని ఇచ్చినపుడే సాఫల్యము. (ఒకరి కిచ్చినందువలన అందరకును పాద్య మిచ్చినట్లు కాదుగదా!) అట్లే భోజనక్రియకూడ ప్రత్యేకముగనే సంబంధించును. అది ఆ క్రియయొక్క స్వభావము.

దీపము ఒకచోటనే ఉండి, అన్నివస్తువులను ఒకేసారి ప్రకాశింపచేయగలదు. కాని భోజనక్రియ అట్లు చేయజాలదు (ఒకరు తిన్నందున అందరకును తృప్తి కలుగదు).

వి. మీది భావమే, వ్యతిరేకదృష్టాంతము మూలముగా విశదీకరింపబడినది. దీపప్రకాశముచేయు విధముగా భోజనక్రియ చేయలేదనుటయే దృష్టాంత తత్త్వము.

''చూచుట'' మొదలగు క్రియలవిషయములో సముదాయపరిసమాప్తియే అని నిరూపించుచున్నాడు.

దృశ్యాదిస్తు క్రియైకాఽపి తథాభూతేషు కర్మసు
అవృత్తి మంతరేణాఽపి సముదాయాశ్రయా భవేత్ . 375

దృశ్యాదిః = 'చూచుట' మొదలగు, క్రియా + తు = వ్యాపారమైతే, ఏకా + అపి = ఒక్కటే, తథా భూతేషు = ఆయాయోగ్యములైన, కర్మసు = కర్మలు ఉన్నపుడు, ఆవృత్తిమ్ = ఆవృత్తి (మరల మరల చూచుట), అంతరేణ + అపి = లేకపోయినను, సముదాయాశ్రయా = సముదాయమందు సమాప్తికలదై, భవేత్ = అగును.

తా. 'చూచుట' (పశ్యతి, పశ్య, పశ్యేత్ మొదలగు ప్రయోగములు. —'దృశ్' ధాతువు) మొదలగు క్రియ, ఆవృత్తి అక్కరలేకుండగనే, యోగ్యమైన కర్మ సముదాయ మందు పరిసమాప్తమగును. ఉదా: 'త్వం వృక్షాన్ పశ్య'—ఇచట చెట్లు కర్మలు. వాని నన్నింటిని ఒక్కసారిగనే చూడవచ్చును. చూపును ఆవృత్తి చేసి, ప్రతియొక చెట్టును వేర్వేరుగా చూడనక్కరలేదు.

వి. ద్వంద్వము (రామ, కృష్ణ, గోపాలాః భుంజంతు), ఏకశేషము (బ్రాహ్మణాః భుంజంతు), ఉన్నపుడు, ఆవృత్తి అనెడి మరొకక్రియను (తినుట అనునది మరల మరల జరుగుట) ఆశ్రయించి భోజనవ్యాపారము ప్రత్యేకముగ సంబంధించుననియు, భోజన సామాన్యరూపమున అదియే సముదాయమునకు కూడ సంబంధించు ననియు శాస్త్రీయముగ చెప్పుదురు. (సముదాయాన్వయమును చెప్పకున్న ద్వంద్వైకశేషములు శాస్త్రప్రకారము కుదురవు).

దృశిక్రియకు అట్టి ఆవృత్తి కూడ అక్కరలేకుండగనే సముదాయసమాప్తి కుదురును. ఈ అంశమును చెప్పుటకే ఈ శ్లోకము బయలుదేరినది.

'వండుట' మొదలగు కొన్ని క్రియల విషయములో గూడ, సముదాయ సమాప్తియే సముచితమని భావించుచున్నాడు.

భిన్నవ్యాపారరూపాణాం వ్యవహారాదిదర్శనే
కర్తృణాం దర్శనం భిన్నం సంభూ యార్థస్య సాధకమ్ . 376

భిన్నవ్యాపార రూపాణామ్ = వేరువేరు వ్యాపారముల స్వరూపములుగల, కర్తృణామ్ = కర్త, కర్మ, కరణము మొదలగు కారకములయొక్క, దర్శనమ్ = కనబడుట (తెలియుట), భిన్నమ్ = వేరుగా ఉన్నదై, వ్యవహారాది దర్శనే = అయా అర్థములలో ఆయా ధాతువు యొక్క ప్రయోగము కనిపించునపుడు, సంభూయ = కలిసి, (మొత్తముపై) అర్థస్య = ఆయా కారక సముదాయమునకు సంబంధించిన అర్థమును, సాధకమ్ = సాధించునది, (భవతి = అగును).

తా. ఒకక్రియలో అవయవములుగా పెక్కుక్రియలు ఉండునని, వెనుక చూప బడినది. క్రియను పుట్టించునది కారకమగును. (కరోతి = క్రియాం జనయతి = కారకమ్), కాగా ఒక ప్రధానక్రియను తీసికొన్నపుడు, దానికి చెందిన కారకమును, అవయవక్రియలకు చెందిన కారకములును విడివిడిగా అనుభూతము లగుచుండును. అయినను ప్రయోగము లలో, 'ప్రధానమగు క్రియ కారక సముదాయమునకే సంబంధించును' అనియే తెలియు చుండును.

వి. ఈ కారికయొక్క భావమును, ప్రసిద్ధమైన ఒక ఉదాహరణము మూలముగా తెలియనగును. "పచ్" (పాకే) అను ధాతువునకు "వండుట" అని అర్థము. "దేవదత్తః కాష్ఠైః స్థాల్యాం తండులం పచతి" (దేవదత్తుడు కర్రలతో గిన్నెయందు బియ్యమును వండు చున్నాడు) అని ప్రయోగము. ఇచట 'వండుట' ముఖ్యవ్యాపారము. బియ్యమును కడుగుట, గిన్నెలో పోయుట, పొయ్యిమీద పెట్టుట మొదలగు అవయవ వ్యాపారము లెన్నో ఉండును. అట్లే దేవదత్తుడు కర్తయు, కాష్ఠములు కరణములును, స్థాలి (గిన్నె) అధికరణమును, తండులములు కర్మయును అయి ఉన్నవి. ఈ కారకములకు కూడ వాని వాని వ్యాపారములు ఉండును. ఇట్టి సన్నివేశములో 'వంట' అను క్రియ వేరువేరుగా ఒక్కొక్క కారణమునకు సంబంధించినదని చెప్పుటకు వీలులేదు (ఏ ఒకదాని వలనను వంట పూర్తిఅయినట్లు లెక్క రాదు). కావున ఆ క్రియ కారకసముదాయమునకే చెందుననియు, అది కారక సమూహ సాధ్యమనియును చెప్పవలెను. ఇదియు వాక్యస్వభావమే.

పచ్యాదిక్రియలు కొన్ని, తమ తమ స్వభావము ననుసరించి, కారక సముదాయ పరిసమాప్తములగు చుండును. వానివిషయములో ప్రత్యేక కారకసమాప్తి పొసగదు.

మీది ఉదాహరణవాక్యములో, దేవదత్తుని వ్యాపారము, మొత్తముగా వంటను చేయుటయు, కర్రలపని మంటను కలిగించుటయు, గిన్నెపని బియ్యమును భరించి పొయ్యి మీద ఉండుటయు, బియ్యము వ్యాపారము మెత్తబడుటయు నని విశ్లేషించుకొనవలెను. 'పచతి' అనగా ఈ పనులన్నియు కలిసి, ఒక ముద్దగా తయారైన పని జరుగుచున్నదని తెలియును. కారకసముదాయ సమాప్తి అనగా ఇదియే. 'పచ్' ధాతువువంటి ఇతర ధాతువుల విషయములో కూడ ఈ తీరును ఊహించుకొనవలెను.

కారికయందలి దర్శనశబ్దమునకు 'జ్ఞానము' అని అర్థమును చెప్పవలెను. 'కన బడుట' అన్నది ఫలితార్థము.

శాస్త్రీయవాక్యములో ప్రత్యేక సమాప్తిని చూపుచున్నాడు.

లక్ష్యస్య లోకసిద్ధత్వా చ్ఛాస్త్రే లింగస్య దర్శనాత్
అర్థిత్వా దైజు భేదేన వృద్ధిసంజ్ఞా సమాప్యతే. 377

లక్ష్యస్య=ప్రయోగములు, లోకసిద్ధత్వాత్ = భాషలో సహజముగా ఉన్నందు వలనను, శాస్త్రే = వ్యాకరణశాస్త్రమున, లింగస్య=జ్ఞాపకము, దర్శనాత్ = కనబడుట వలనను, అర్థిత్వాత్ = అపేక్ష ఉన్నందువలనను, ఐజు=ఆ, ఐ, ఔ, (దీర్ఘములు) అను వర్ణములందు, భేదేన = వేర్వేరుగా, వృద్ధిసంజ్ఞా='వృద్ధి' అను శాస్త్రీయసంజ్ఞ, సమాప్యతే= సంబంధించును.

తా. 'వృద్ధిరాదైచ్' (1-1-1) అను సూత్రము, ఆ, ఐ, ఔ, (దీర్ఘములు) అను వర్ణములకు వృద్ధిసంజ్ఞను చెప్పినది. ఈ సంజ్ఞ మూడు వర్ణములకును ప్రత్యేకముగా చెందును. (సముదాయమునకు చెందదు). భాషలోని ప్రయోగములు, వ్యాకరణమందలి జ్ఞాపకము, ఆ వర్ణముల అపేక్ష అను మూడున్ను ఇందుకు హేతువులు.

వి. శాస్త్రమందు కొన్నిచోట్ల ప్రత్యేక వాక్యపరిసమాప్తి ఆవశ్యకమని చెప్పుటకు, వృద్ధిసంజ్ఞ ఉదాహరణముగా తీసికొనబడినది. ఇచట ప్రత్యేకసమాప్తిని సమర్థించుటకై మూడు కారణములు చూపబడినవి: 1. లోకసిద్ధమైన లక్ష్యము: 'అసురస్య ఇదమ్ = ఆసురమ్' (అసురసంబంధి), 'ఇంద్రః దేవతా అస్య = ఐంద్రమ్' (ఇంద్రుడు దేవతగాగలది), 'ఉపగోః అపత్యం పుమాన్ = ఔపగవః' (ఉపగుని పురుషసంతతి) ఈ మూడు స్థలముల లోను మొదటి అచ్చునకు వృద్ధివచ్చినది. అది ఒక్కొక్కచోట ఒక్కొక వర్ణముగనే (సదృశమైన వర్ణము) ప్రవర్తించినదిగాని, సముదాయరూపముగా ప్రవర్తింపలేదు. ఇట్టి ప్రయోగములు అనాదిసిద్ధములు.

2. శాస్త్రమందలి జ్ఞాపకము:'వృద్ధిర్య స్యాచా మాది స్తద్వృద్ధమ్' (1-1-73) అను సూత్రము 'వృద్ధ' అను సంజ్ఞను చెప్పినది. 'యస్య సముదాయస్య అచాంమధ్యే ఆదిర్వృద్ధిః తద్వృద్ధసంజ్ఞం స్యాత్'— అని ఈ సూత్రముయొక్క వృత్తి. 'ఒక శబ్దమందలి అచ్చులలో మొదటి అచ్చు వృద్ధిసంజ్ఞ గలదైనచో (ఆ, ఐ, ఔ, అనువానిలో ఒకటి), ఆ శబ్దము 'వృద్ధము' అనిపించుకొనును అని దీని అర్థము. ఉదా: మాలా, ఐశ్వర్య, ఔపగవ అనునవి వరుసగ వృద్ధములగును. (వృద్ధసంజ్ఞకములకు ప్రవర్తించు తద్ధిత కార్యములు పెక్కులున్నవి). వృద్ధిసంజ్ఞ ప్రత్యేకముగ పరిసమాప్తమైనపుడే, ఈ సూత్రము సార్థకమగును. (సముదాయ సమాప్తి అన్నయెడల, ఆ, ఐ, ఔ ల సముదాయము ఏశబ్దమందును మొదట సంభవింపదుగాన వృద్ధసంజ్ఞాసూత్రము వ్యర్థమగును గాదా!) కాగా ఈ సూత్రము ప్రత్యేకసమాప్తికి జ్ఞాపకము.

3. అర్థిత్వము—లేక—అపేక్ష—ఆ, ఐ, ఔ, అనునవి విడివిడిగానే వృద్ధిసంజ్ఞను కోరుకొనును. లేకున్న (సముదాయమే వృద్ధి సంజ్ఞక మైనచో) ప్రయోగములలో ఎక్కడను ఈ సంజ్ఞకు ఉపయోగము ఉండదు.

పై మూడు హేతువుల వలనను, వృద్ధిసంజ్ఞ వేరుగా ఒక్కొక వర్ణమునకే చెందునని ఫలించును.

కొన్నిచోట్ల సముదాయవాక్య సమాప్తి సమంజసమనుచున్నాడు.

శతాదానే ప్రధానత్వా ద్దండనే శతకర్మకే
అర్థినాం గుణభేదేఽపి సంఖ్యేయోఽర్థో న భిద్యతే. 378

శత కర్మకే = నూరు రూపాయిలు కర్మగా గల, దండనే = 'జరిమానా' యందు (శిక్షకు పరిహారముగా చెల్లించవలసిన ధనము), అర్థినామ్ = కోరే వారికి (ఆ సొమ్మును కోరు రాజులకు - లేక—అధికారులకు), శతాదానే = నూరు రూపాయలను తీసికొనుటయే, ప్రధానత్వాత్ = ముఖ్యమగుటవలన, గుణభేదే + అపి = అప్రధానులైన—ఇచ్చేవారియొక్క భేదమున్నను (ఇచ్చేవారు ఎందరున్నను), సంఖ్యేయః = లెక్కింపదగిన, అర్థః = అర్థము (సొమ్ము), న + భిద్యతే = మారదు.

తా.- 'గర్గాః శతం దండ్యంతామ్'— 'అర్థినశ్చ రాజానో హిరణ్యేన భవంతి' అని ప్రయోగము. "గర్గులనువారినుండి నూరు రూపాయలను జరిమానాగా వసూలు చేయవలెను. - రాజులకు కావలసినది ఆ సొమ్ముమాత్రమే" అని దీని భావము. ఇచట నూరు రూపాయిలే ముఖ్యము. గర్గుల సంఖ్య ముఖ్యము కాదు. కనుక గర్గులు ఎందరున్నను అందరి మొత్తముపై నూరు రూపాయిలను వసూలు చేయుదురు. (ఒక్కొక గర్గుని నుండి నూటిని వసూలు చేయరు). అనగా ఈ వాక్యమునకు గర్గసముదాయమందే పరిసమాప్తి అని తెలును.

వి. 'లౌకిక వాక్యములందు కూడ కొన్నిచోట్ల సముదాయసమాప్తియే' అని ఉదాహరణపూర్వకముగా ఈ శ్లోకము చూపినది. 'వాక్యసామర్థ్యము, అన్వయ స్వారస్యము, యోగ్యత మొదలగు హేతువులనుబట్టి ఆయా వాక్యములలో ప్రత్యేక పరిసమాప్తి అనిగాని, సముదాయ పరిసమాప్తి అనిగాని నిశ్చయించుకొనవలెననియు, ఈ విషయమున ప్రత్యేక నియమము లేవియు లేవనియు, సహజసిద్ధమైన వాక్యార్థస్వభావమును విశదీకరించి చూపుటయే పండితుల పని అనియును' దీనివలన ఫలించును.

మీదచూపిన వాక్యమున 'శతము' ప్రధానకర్మ అనియు, 'గర్గులు' అప్రధాన కర్మఅనియు శాస్త్రీయముగా చెప్పుదురు. కాన ప్రధానమైన శతమే తాత్పర్యవిషయమగుటయు, గర్గులసంఖ్య అట్లు కాకపోవుటయును సిద్ధించును. గర్గు లెందరున్నను అందరి మొత్తమునుండి నూరు రూపాయిలను తప్పక తీసుకొనవలెనని పర్యవసించును.

శాస్త్రీయ వాక్యములలో సముదాయ సమాప్తిని చూపుచున్నాడు.

సంఘస్యైవ విధేయత్వాత్ కార్యవత్ప్రతిపాదనే
తత్ర తంత్రేణ సంబంధః సమాసాఖ్యాస్తసంజ్ఞయోః. 379

కార్యవత్ప్రతిపాదనే = శబ్దార్థసంబంధములు అనిత్యములను వ్యాఖ్యానమందు, సంఘస్య + ఏవ = సముదాయమునకే, విధేయత్వాత్ = విధింపబడుటవలన, సమాసాఖ్యాస్త

సంజ్ఞయోః = సమాసము, అభ్యస్తము అను సంజ్ఞలకు, తయోః = ఆ సముదాయములందే, తంత్రేణ = ఒక్కసారిగ, సంబంధః = సంబంధము (సమాప్తి), (భవతి = అగును).

తా. సమాసము (రాజపురుష మొదలగునవి), అభ్యస్తము (దదత్ మొదలగునవి), అను సంజ్ఞలు వ్యాకరణశాస్త్రమందున్నవి. ఇవి సముదాయములకే విధింపబడినవి. కాన ఈ సంజ్ఞలకు ఆయా సముదాయములతోనే సంబంధమును చెప్పవలెను. (ప్రత్యేక పరిసమాప్తి వీని విషయములో కుదురదు).

'సహసుపా' (2—1—4) అని సూత్రము. 'సుప్ సుపా సహ సమస్యతే — సః సమాసః' అని వృత్తి. 'సుబంతము సమర్థమైన వేరొక సుబంతముతో కలిసి సమాసమని పించుకొనును' అని భావము. పూర్వోత్తరపదముల సముదాయమునకే సమాససంజ్ఞను ఈ సూత్రము విధించుచున్నది. కాన ప్రత్యేకపదములకు సమాససంజ్ఞ వర్తించదు. అట్లే 'ఉభే అభ్యస్తమ్' (6—1—5) అని సూత్రము. 'షాష్ఠద్విత్వప్రకరణే యే ద్వే విహితే తే ఉభే సముదితే అభ్యస్త సంజ్ఞే స్తః'—అని వృత్తి. "ఆరవ అధ్యాయములోని సూత్రములచే ద్విత్వమును పొందినపుడు, ఆ రెండు భాగములును కలిసి మొత్తముగా 'అభ్యస్తము' అన బడును" అని భావము. ద్విత్వమును పొందిన (రెండు) భాగముల సముదాయమునకే ఈ సూత్రము అభ్యస్త సంజ్ఞను విధించినది. కాన ప్రత్యేకభాగమునకు అభ్యస్త సంజ్ఞ ఉండదు.

వి. వ్యాకరణ శాస్త్రములో సముదాయ పరిసమాప్తిని చూపుటకై ఈ కారిక బయలుదేరినది. "రాజపురుషః" మొదలగు సమాసములలో, సముదాయమునకే సమాస సంజ్ఞ. అట్లే దదత్, బిభ్యత్, మొదలగు ద్విరుక్తరూపములలో కూడ, సముదాయమునకే అభ్యస్తసంజ్ఞ. శాస్త్ర మావిధముగ చెప్పుటయే అందుకు హేతువు.

'దా' (దానే) ధాతువునకు 'శతృ' (అత్) ప్రత్యయమును చేర్చినపుడు, ద్విరుక్తి కలిగి 'దదత్' అను రూపమగును. (దా + దా + అత్ = దదత్ = ఇచ్చువాడు). ఇట్లే 'భీ' (భయే) ధాతువునకు 'బిభ్యత్' (భీ + భీ + అత్ = బిభ్యత్ = భయపడువాడు) అను రూపమగును.

" 'శబ్దము నిత్యము' అన్నపక్షములో సమాసాదులు కూడ నిత్యములే కాన, వాని విషయములో శాస్త్రవిధాన మెట్లు కుదురును?" అను శంక రాకుండుటకై, 'కార్యవత్ప్రతి పాదనే' అనునది కారికలో పొందుపరచబడినది. 'శబ్దము అనిత్య' మను కొందరి మతము నాశ్రయించి యిట్లనవచ్చు నని భావము.

తంత్రేణ = ఒక్కసారిగా, తంత్రశబ్దమునకు ఇచట ఈ లాక్షణికార్థమును చెప్ప వలెను.

కొన్ని వాక్యములలో ప్రత్యేక సమాప్తియు సముదాయ సమాప్తియును, సంభ వించునని ప్రతిపాదించుచున్నాడు.

లక్షణార్థా శ్రుతి ర్యేషాం కాంచిదేవ క్రియాం ప్రతి
తై ర్వ్యస్తై శ్చ సమస్తై శ్చ స ధర్మ ఉపలక్ష్యతే. 380

కాంచిత్ + ఏవ = ఒకానొక, క్రియామ్ + ప్రతి = వ్యాపారమును గురించి, యేషామ్ = ఎవరికి సంబంధించిన, లక్షణార్థా = ఉపలక్షణము కొరకైన, శ్రుతిః = పదము

గాని, వాక్యముగాని (వినబడువచనము), (స్యాత్ = ఉండునో), వ్యస్తైః + చ = విడిగా ఉన్నను, సమస్తైః + చ= సముదాయముగా ఉన్నను, తైః = వారిచే, సః = ఆ, ధర్మః = ధర్మము, ఉపలక్ష్యతే = సూచింపబడును.

తా ప్రత్యేకమగు ఒక ధర్మముగల వ్యక్తులను ఉద్దేశించి, ఒక పనిని బోధించు వాక్యమును ప్రయోగించినపుడు, విడిగా ఉన్నను, కలిసిఉన్నను ఆ ధర్మముగలవారికి ఆ పని సంబంధించును. నిర్దేశింపబడిన ధర్మ మచట ఉపలక్షణముగా ఉపయోగించును.

వి. కొన్ని వాక్యములలో స్వభావమునుబట్టి, ప్రత్యేకసమాప్తియు సముదాయ సమాప్తియుకూడ సమంజసమగునని చెప్పుట ఈ కారికయొక్క ఉద్దేశము. ఉదాహరణమును దిగువకారిక స్పష్టపరచును.

ఉపలక్షణమనగా 'సూచనము' అని సామాన్యార్థము. 'తన అర్థముతోపాటు మరియొక అర్థమునుకూడ సూచించు పదమును ఉపలక్షకమనియు, ఉపలక్షణమనియు సాంకేతికముగా చెప్పుదురు, ఉదా : "కాకేభ్యః దధి రక్ష్యతామ్" (కాకులనుండి పెరుగును కాపాడవలెను) ఇచట కాకశబ్దము ఉపలక్షణమై, పెరుగును తిను అన్ని పక్షులను, జంతువులను కూడ సూచించును. అంతేగాని, కాకులను మాత్రమే పారద్రోలి, ఇతర జంతువులు పెరుగును తినుచున్నను ఊరకుండుమని తాత్పర్యముకాదు. చెప్పేవాని భావమునుబట్టి ఉపలక్షణాంశము తెలియుచుండును.

జాతిరూపమైన ధర్మమునుకూడ ఉపలక్షణమని వ్యవహరించుదురు. ప్రకృత శ్లోకమున ఇట్టి ధర్మమునే ఉపలక్షణముగా గ్రహింపవలెను. దిగువ శ్లోకమందలి ఉదాహరణము ఈ అంశమును విశదీకరించును.

మీది కారికకు ఉదాహరణమును ఇచ్చుచున్నాడు.

వృషలై ర్న ప్రవేష్టవ్య మిత్యేతస్మిన్ గృహే యథా
ప్రత్యేకం సంహతానాంచ ప్రవేశః ప్రతిషిధ్యతే. 381

యథా = ఎట్లనగా, ఏతస్మిన్ = ఈ, గృహే = ఇంటియందు, వృషలైః = శూద్రులు, న + ప్రవేష్టవ్యమ్ = ప్రవేశింపగూడదు, ఇతి = అనగానే, ప్రత్యేకమ్ = విడిగా ఒక్కొక్కనికిని, సంహతానామ్ + చ = సమూహముగా ఉన్నవారికినికూడ, ప్రవేశః = ప్రవేశము, ప్రతిషిధ్యతే = నిషేధింపబడును.

తా. "ఈ యింటిలో శూద్రులు ప్రవేశింపరాదు." ఈ వాక్యమున క్రియకు ప్రత్యేకసమాప్తియు, సముదాయ సమాప్తియును కూడ ఉన్నది. 'ఒక్కడైనాసరే మరెందరైనా సరే శూద్రజాతి వ్యక్తికి ఈ యింట ప్రవేశము నిషిద్ధ' మను భావము ఈ వాక్యమువలన ఫలించును.

వి. పై కారికకు ఈ కారిక పూర్తిగా ఉదాహరణరూపము. ప్రత్యేక సముదాయ పరిసమాప్తులు రెండును ఒకేవాక్యములో ఉండవచ్చుననుటకు, "ఏతస్మిన్ గృహే వృషలైః న ప్రవేష్టవ్యమ్" మొదలగు వాక్యములు ఉదాహరణములగును. ఇచట ప్రవేశ నిషేధము వ్యాపారము. వృషలత్వమను జాతి ఉపలక్షణము. ఆధర్మముగల వ్యక్తికిగాని, వ్యక్తి సము

దాయమునకు గాని గృహమందు ప్రవేశించుట నిషిద్ధము. ఈ విధముగ రెండు కారికలను కలిపి సమన్వయము చేసికొనవలెను.

మీది భావమునే వేరొక తీరులో చూపుచున్నాడు.

సంభూయ త్వర్థలిప్సాదిప్రతిషేధోపపాదనే
పృథగప్రతిషిద్ధత్వాత్ ప్రవృత్తి ర్న విరుధ్యతే. 332

సంభూయ+తు=సముదాయము మొత్తముపైననే, అర్థలిప్సాది ప్రతిషేధోపపాదనే=ధనమందు కోరిక, రాగము, ద్వేషము మొదలగువానిని నిషేధించునపుడు, పృథక్=ప్రత్యేకముగా, అప్రతిషిద్ధత్వాత్=నిషేధింపబడక పోయినను, ప్రవృత్తిః=వేరు వేరుగా నిషేధము ప్రవర్తించుట, న+విరుధ్యతే=విరోధించదు.

తా. ఒక వాక్యములో ఒక విషయమును, సముదాయమునకే చెందునట్లు నిషేధింపవచ్చును. ప్రత్యేకముగా ఒక్కొకవ్యక్తికి నిషేధము సంబంధించు సూచన అందే మియు ఉండదు. ఆయినను ఆ నిషేధము సముదాయమునకు వలె, ప్రత్యేకవ్యక్తులకును సంబంధించును. అది వాక్యస్వభావము.

వి. సముదాయమునకే ఉద్దేశింపబడినట్లు కనబడు కొన్ని వాక్యములకు కూడ ప్రత్యేకసమాప్తి ఉండుననియు, ఉభయసమాప్తియే (సముదాయ+ప్రత్యేకసమాప్తులు) అట్టిచోట్ల అభిమతమనియు, అది వ్యవహారస్వభావమనియును, ఈ కారిక ప్రతిపాదించును. ఉదా: "భవద్భిః ఇతఃపరం రాజసేవా న కార్యా, సముద్గమనం న విధేయం, కృషికర్మ నాఽనుష్ఠేయం, ధనలిప్సా న కార్యా, యోషా న స్ప్రష్టవ్యా". (ఇటుపైని మీరందరును రాజును సేవింప కూడదు, ఎవరికిని నమస్కరించకూడదు, వ్యవసాయమును చేయకూడదు, ధనమందు కోరిక నుంచుకొనరాదు, స్త్రీని ముట్టుకొన కూడదు). సంన్యాసదీక్షను పుచ్చుకొన్నవారిని ఉద్దేశించి, గురువుగారు చెప్పు వాక్యమిది. ఇచటి నిషేధము సామూహికమైనను, ప్రత్యేకముగా కూడ సంబంధించును. (ఆ యా పనులను సముదాయము మాత్రమే చేయకూడదనియు, వేరుగా వ్యక్తులు చేయవచ్చుననియును వాక్యతాత్పర్యము కాదుగదా!) ఇట్టి వాక్యములను "ఉభయ సమాప్తిగల వాక్యములు" అందురు.

శాస్త్రీయమగు వాక్యమందు ఉభయవిధవాక్యసమాప్తికి ఉదాహరణమును ఇచ్చు చున్నాడు.

వ్యవాయలక్షణార్థత్వా దట్కుప్వాఙాదిభి స్తథా
ప్రత్యేకం వా సమస్తై ర్వా ణత్వం న ప్రతిషిధ్యతే. 333

తథా=ఆ విధముగానే. వ్యవాయలక్షణార్థత్వాత్=వ్యవధానము (అడ్డు) ఉపలక్షణమగుటవలన, ప్రత్యేకమ్+వా=విడివిడిగా ఉన్నను, సమస్తైః+వా=కలిసిఉన్నను, అట్కుప్వాఙాదిభిః=అట్, కు, పు, ఆఙ్ మొదలగువానిచే, ణత్వమ్=ణత్వమను కార్యము, న+ప్రతిషిధ్యతే=నిషేధింపబడదు.

తా. "అట్కుప్వాఙ్నుమ్ వ్యవాయేఽపి" (8–4–2) అను సూత్రము, 'అట్, కు, పు- మొదలగు వానితో వ్యవధానమున్నను, నకారమునకు ణత్వమగును"

అని చెప్పుచున్నది. ఇచట వ్యవధానమన్నది ఉపలక్షణము, కాన, ఒక్కొకదానితో వ్యవధాన మున్నను, సముదాయముతో వ్యవధానమున్నను, ణత్వము ప్రవర్తించును. అనగా ణత్వమును విధించు ఈ వాక్యమునకు ఉభయ సమాప్తి ఉన్నదని అభిప్రాయము.

వి. వ్యాకరణ శాస్త్రములో ఉభయసమాప్తికి ఒక ఉదాహరణమును ఈ శ్లోకము చూపినది. "అట్కుప్వాఙ్నుమ్ వ్యవాయేఽపి" '8-4-2) అని సూత్రము. "అట్, కవర్గ, పవర్గ, ఆఙ్, నుమ్— ఏతైః వ్యస్తైః యథాసంభవం మిలితైశ్చ వ్యవధానేఽపి, రషాభ్యాం పరస్య నస్య ణః స్యాత్ సమానపదే" అని వృత్తి. "ఏకపదమందు రేఫకుగాని, షకారమునకు గాని పరముగా ఉన్న నకారమునకు ణత్వముగును. రేఫషకారములకును, నకారమునకును మధ్యను— అడాదులతో— విడివిడిగా కాని, వీలున్న సముదాయముగా గాని వ్యవధాన మున్నను, ణత్వము ప్రవర్తించును" అని భావము. ఉదా :— రామేణ (రామే + న = రామేణ ఇచట రేఫకును నకారమునకు మధ్యను అ-మ్-ఏ-అనునవి అడ్డుగా ఉన్నను, ణత్వము వచ్చినది).

విశేష్యమందు తప్పక ఉండునట్టియు, తాను తప్ప మిగిలిన వానిని త్రోసి వేయునట్టియు ధర్మమును విశేషణమందురు. ఉదా: "కపిలా గౌః" (పచ్చని ఆవు). ఇచట కపిలత్వము విశేషణము. విశేష్యమందుండు ధర్మముతో పాటు ఇతర ధర్మమును కూడ సూచించి కూడగట్టుకొనునది ఉపలక్షణము. ఉదా: "ఇదం సస్యం గోభ్యః రక్షేత్" (ఈ సస్యమును ఆవులు తినకుండ కాపాడవలెను). ఇచట గోశబ్దము ఉపలక్షణమై, ఆవులనే కాక, సస్యమును తిను ప్రతియొక జంతువును కూడ బోధించును.

ప్రకృతమున వ్యవధానమన్నది ఉపలక్షణము కావుననే "విడిగా కాని, సమూహ ముగా కాని వ్యవధానము" అను అర్థము సిద్ధించినది. విశేషణమన్నచో, "సముదాయము తోనే వ్యవధానము ఉండవలెను" అను అర్థము వచ్చెడిని.

అట్ = అట్ ప్రత్యాహారములోని వర్ణము. కు = కవర్గ వర్ణములు. పు = పవర్గా క్షరములు. ఆఙ్ = ఆ-అనునిపాతము. నుమ్ = న్- అను ఆగమము.

భోజన క్రియా విషయమున ఏకత్వానేకత్వములను పరిశీలించుచున్నాడు.
(ఇది మొదలు మూడు శ్లోకములతో)

> అనుగ్రహార్థం భోక్తౄణాం భుజి రారభ్యతే యదా
> దేశకాలాద్యభేదేన నాఽనుగృహ్ణాతి తా నసౌ .　　　　౩౮౪

భోక్తౄణామ్ = భుజించు వారియొక్క, అనుగ్రహార్థమ్ = అనుగ్రహముకొరకు (వారి ఆశీస్సుల ఫలమును పొందుట—లేక— వారు భుజించినందువలన కలుగు పుణ్యమును పొందుట), దేశకాలాద్యభేదేన = దేశ కాలాదిభేదము లేకుండ, భుజిః = భుజిక్రియ, యదా = ఎప్పుడు, ఆరభ్యతే = ప్రారంభింపబడునో, (తదా = అప్పుడు) అసౌ = ఈ భుజిక్రియ, తాన్ = ఆ భోక్తలను, న + అనుగృహ్ణాతి = అనుగ్రహించదు. (అనుగ్రహము వారికి చెందదు, భోజనము పెట్టినవారికే చెందును).

తా. భోక్తల అనుగ్రహముకొరకు భోజనమును పెట్టినపుడు, భోక్తల అనుగ్రహము అన్నదాతకు చెందునుగాని భోక్తలకు చెందదు. అన్నదానమునకు దేశకాలాది భేదములు లేవు. ఏ దేశమందు పెట్టినను, ఏ కాలమందు పెట్టినను, ఎవరికి పెట్టినను-అన్నమును పెట్టినందువలన, భోక్తల అనుగ్రహము తప్పక కలుగును. దేశకాలభేదము న్నను (ఒక్కొకచోట, ఒక్కొకసమయమున, ఒక్కొకవ్యక్తికి అన్నదానము చేసినను వారి అనుగ్రహము కలుగును).

వి. "ఒక విధముగా చెప్పినచో, భుజిక్రియ (భుజించుట) ఒకటే అగును. అవుడు దానికి "సముదాయ సమాప్తి" అన్నను బాధ ఉండదు. "మరొక విధముగా చెప్పినచో ఆక్రియ అనేకమగును. అపుడు దానికి ప్రత్యేక సమాప్తి తప్పదు" అను అంశమును సూచించుటకై ఇది మొదలు వరుసగా మూడు శ్లోకములు ప్రయత్నించును. "దేశ కాలాది భేదమున్నను లేకున్నను, భోక్తల అనుగ్రహము సమానముగనే లభించును" అను సామాన్యాంశమును ఈ కారిక చెప్పినది.

భోజనమును పెట్టుట రెండు విధములు. భోక్తల అనుగ్రహమును కోరునది ఒకవిధము. శ్రాద్ధాదులందు నిమంత్రించిన భోక్తల విషయములో ఇది సరిపోవును. భోక్తల అనుగ్రహమును కోరనిది రెండవ విధము. ఒకరు తమంత తాము కోరగా పెట్టు భోజనము విషయములో ఇది సరిపోవును.

అనుగ్రహార్థమైన భోజన మిచట గ్రహింపబడినది(రెండవదానిని కూడ ఊహించు కోవచ్చును. అచట కూడ ఏదోఒక రూపమున భోక్తల అనుగ్రహము ఉండును).

"దేశకాలాద్యభేదేన" అన్నందువలన, 'ఒకప్రదేశమందే, ఒకసమయమందే, కొందరు వ్యక్తులకే భోజనము పెట్టినపుడు' అను అర్థము వచ్చును, కాని అట్టి నిర్బంధ మక్కరలేదు. ఈ పదము "దేశకాలాదిభేదము ఉన్నను" అను అంశమును కూడ సూచించును.

భోజనము విషయములో దేశకాలపాత్రలను గురించిన నియమములు, ధర్మశాస్త్ర ములందు పెక్కులున్నవి. వానిని ఇచట భావించుకొనవలెను.

పాత్రాదిభేదా న్నానాత్వం యస్యైక స్యోపదిశ్యతే
విపర్యయే వా భిన్నస్య తస్యైకత్వం ప్రకల్ప్యతే. ౩౩౯

యస్య = ఎవని మతమున, ఏకస్య = ఒకటియైన భుజిక్రియా స్వరూపమునకు, పాత్రాదిభేదాత్ = దేశ, కాల, పాత్రల భేదమువలన, నానాత్వమ్ = భేదము, ఉపదిశ్యతే = చెప్పబడునో, తస్య = వాని మతమున, ఏకత్వమ్ = ఐక్యము (భుజిక్రియకు), ప్రకల్ప్యతే = స్పష్టముగ చెప్పబడును. విపర్యయే వా = విపరీతముగా చెప్పినచో, (భుజక్రియ భిన్నము అన్నపుడు), భిన్నస్య = భిన్నమైన భుజిక్రియకు, (పాత్రాద్యభేదాత్ = దేశకాల పాత్రలభేద మును భావింపనందువలన), ఏకత్వమ్ = ఐక్యము, ప్రకల్ప్యతే = చెప్పబడును.

తా. భుజిక్రియకు తృప్తి అన్నది ఫలము. అది భోక్తలందరకును సమా నమే కావున, ఆ సామాన్యధర్మము ననుసరించి, భోక్తలు వేరువేరుగా ఉన్నను, 'భుజిక్రియ

ఒకటే' అని కొందరందురు. ఈ పక్షమున దేశ, కాల, పాత్రల భేదమును పురస్కరించు కొని, 'భుజిక్రియ భిన్నము కావచ్చుననియు, స్వయముగ అది ఒకటే' అనియును సమర్థించుకొనవచ్చును.

"భోక్తలు వేరువేరుగా ఉన్నందున భుజిక్రియయు వేరువేరు" అని భుజిక్రియకు భేదమును మరికొందరు చెప్పుదురు. ఈ పక్షమున దేశ, కాల, పాత్రములయొక్క అభేదమును భావించుకొని, "స్వయముగ భిన్నమైనను, భుజిక్రియ ఒకటే" అని వ్యాఖ్యానింపవచ్చును.

వి. 'భుజిక్రియ సహజముగ ఒకటే' అన్నది ఒకమతము .ఇందు భేదము కల్పితమగును. 'భుజిక్రియ సహజముగ భిన్నము' అన్నది మరొకమతము. ఇందు అభేదము కల్పితమగును. కల్పితమైనదానిని 'ఔపాధికము' అని సాంకేతికముగా అందురు. అనగా 'ఆయా ధర్మములను భావించి, పరిగణించుట' అని భావము.

కాగా భుజిక్రియ ఏకమన్నచో సముదాయ పరిసమాప్తి అనియు, భిన్నమన్నచో ప్రత్యేక పరిసమాప్తి అనియును చెప్పవచ్చునని సారాంశము. ఈ విషయము దిగువకారికలో విశదమగును.

సంహత్యాఽపి చ కుర్వాణా భేదేన ప్రతిపాదితాః
స్వం స్వం భోజ్యం విభాగేన ప్రాప్తం సంభూయ భుంజతే . ౪౩౬

భేదేన=భేదముతో(విడివిడిగా), ప్రతిపాదితాః=చూపబడిన భోక్తలు, సంహత్య= కలిపి (ఒక్కుమ్మడిగా), కుర్వాణాః+అపి+చ=భుజించువారైనను, విభాగేన =విడి విడిగా వడ్డనచే, ప్రాప్తమ్=లభించిన, స్వమ్ స్వమ్=తమతమ, భోజ్యమ్=తినదగు పదార్థమును, సంభూయ=కలిసి, భుంజతే=తిందురు.

తా. పదిమంది కలిసి భుజించుటను గమనింపుడు. అచట అందరును ఒకే సమయములో ఒకేపనిని చేయుదురు. (పదార్థములను తీసుకొనుట, కలుపుకొనుట, నమలుట మొదలగు క్రియాకలాపరూపమైనది భోజనము). చివరకు అందరకును తృప్తి కలుగును. ఈ తీరును "మొత్తముపై ఒకటే" అని భావించినచో "దశబ్రాహ్మణాః భుంజతే" అను వాక్యములో వాక్యార్థవిశ్రాంతి సముదాయమునకే అనవచ్చును.

అట్లుకాక "వడ్డన ప్రతి ఒకరికి విడిగా జరుగుచున్నది. ఎవరికివారు విడిగా తినుచున్నారు. ఎవరితృప్తి వారిది" అని భేదభావన చేసినయెడల, పై వాక్యమున "ప్రత్యేక సమాప్తియే" అనక తప్పదు.

వి. భుజిక్రియకు ప్రత్యేకసమాప్తియే అని వెనుక ప్రతిపాదింప బడినది. ఒక విధమైన భావన మూలకముగా ఆ క్రియకు సముదాయ సమాప్తికూడ కుదురునని ఇచట చూపబడినది.

కల్పనానుసారము భుజ్యాదిక్రియలకు ఐక్యమును భేదమును కూడ అంగీకరింతురన్నది ఇచట క్రొత్తవిషయము. "సమూహభావన ఉన్నపుడు భుజిక్రియ ఒకటే, వ్యక్తిభావన కలిగినపుడు మాత్రము అది భిన్నము" అన్నది సంపిండితార్థము.

"శతాదానే ప్రధానత్వాత్" (378 వ శ్లోకము) ఇత్యాదికారిక చెప్పిన అంశమునకు ఉపపత్తిని చూపుచున్నాడు.

వీప్సాయా విషయాభావాత్ విరోధా దన్యసంఖ్యయా
ద్విధా సమాప్త్యయోగాచ్చ శతం సంఘేఽవతిష్ఠతే. 387

వీప్సాయాః = వీప్సకు సంబంధించిన (ప్రతియొక గర్గుని ఉద్దేశించుటకు), విషయాభావాత్ = ఆవృత్తి లేనందువలనను, అన్యసంఖ్యయా = శతమును మించిన సంఖ్యతో, విరోధాత్ = విరోధము కలుగును కావునను, ద్విధా = రెండువిధములుగా (ప్రత్యేకముగను, సముదాయమందును), సమాప్త్యయోగాత్ + చ = సమాప్తి సముచితము కానందువలనను, శతమ్ = నూరు (రూపాయిలు), సంఘే = సముదాయమందే, అవతిష్ఠతే= సమాప్తిని పొందును.

తా. (వెనుకటి సందర్భములో (378వ శ్లోకము) ఈ విషయము చర్చింప బడినది. దానినే భంగ్యంతరముగ ధ్రువపరచుటకు మరల ఈ కారిక బయలుదేరినది).

"గర్గాః శతం దండ్యంతామ్" అను వాక్యములో సముదాయ సమాప్తియే కాని ప్రత్యేక సమాప్తి కుదురదు. అందుకు మూడు హేతువులు కలవు: (1) వీప్సాభావము : ఈ వాక్యములో వీప్సలేదు. "చేయుపని ప్రతియొక వస్తువునకు చెందవలెను" అని సూచించుటకై, శబ్దమును ఆవృత్తి చేయుట వీప్స అగును. ఉదా : "వృక్షం వృక్షం పశ్య" (ప్రతియొక చెట్టును చూడుము). ప్రకృతము. "గర్గః గర్గః శతం దండ్యతామ్" అను వాక్యవిన్యాసము లేదు. అనగా వక్తకు, "ప్రతియొక గర్గుని నుండి నూరు చొప్పున వసూలు చేయవలెను" అను కోరిక లేదనుట స్పష్టము.

(2) సంఖ్యావిరోధము : ప్రతియొక గర్గుని నుండియు నూరు రూపాయలను తీసుకొన్నచో, "శతమ్" అను సంఖ్యను నొక్కి పలుకుట పొసగదు. అట్లయిన కొన్నివందలో, వేలో (గర్గుల సంఖ్యను బట్టి) కావలసి వచ్చును.

(3) అసంభవము : ఈ వాక్యమును ప్రయోగించిన తీరు, వాక్యసామర్థ్యము, వక్తృతాత్పర్యము, వ్యవహార స్వభావము, ఔచిత్యము మొదలగు పరికరములవలన, ఇచట సముదాయ సమాప్తియే కుదురును గాని ప్రత్యేక సమాప్తి గాని, ఉభయసమాప్తి గాని కుదురదు.

వి. (1) వీప్స = వ్యాప్తుమ్ + ఇచ్ఛా = అనుకొన్నది ప్రతియొక వ్యక్తికిని చెందవలెనను కోరిక. ఇది ఉన్నపుడు ఆయా వ్యక్తిని గాని, వస్తువును గాని చెప్పు శబ్దమును ఆవృత్తి చేయుదురు. ప్రకృతవాక్యమున "గర్గాః" అను ఏకశేషము (గర్గశ్చ, గర్గశ్చ, గర్గశ్చ = గర్గాః) ఉపయోగింపబడినది. ఏకశేషమెల్లపుడును సముదాయమునే బోధించును.

(2) "శతమ్" అనునది ముఖ్యముగా నొక్కి చెప్పిన సంఖ్య. ప్రత్యేక సమాప్తి అన్నచో శతసంఖ్యకు ప్రాధాన్యము లేకపోయెడిని (అనుకొన్న సొమ్ముకన్న అధికమైపోవును).

(3) తంత్రము, ఆవృత్తి మొదలగు కొన్ని పద్ధతుల నాశ్రయించి, "ఇచట ఉభయసమాప్తి" అనుట తాత్పర్య విరుద్ధమును, ఔచిత్యభంజకమును, వితండప్రాయమును అగును.

భోజనక్రియ విషయములో కూడా, కొన్ని సందర్భములందు ఉభయవిధవాక్య సమాప్తి పొసగునని ప్రదర్శించుచున్నాడు.

భుజి ర్ద్వంద్వైకశేషాభ్యాం యత్రాఽన్యైః సహ శిష్యతే
తత్రాపి లక్షణార్థత్వాత్ ద్విధా వాక్యం సమాప్యతే. ౪౪౬

ద్వంద్వైకశేషాభ్యామ్ = ద్వంద్వసమాసము, ఏకశేషము — ఈ రెండింటితోను, అన్యైః = ఇతరులతో, సహ = కలిసి, భుజిః = 'భుజ్' ధాతువు, యత్ర = ఏ వాక్యమున, శిష్యతే = చెప్పబడునో, తత్ర + అపి = అచటకూడ, లక్షణార్థత్వాత్ = భుజ్ ధాతువు భోజన సామాన్యమును బోధించుటవలన, వాక్యమ్ = వాక్యము, ద్విధా = రెండువిధములుగా (ప్రత్యేకముగను, సముదాయమందును), సమాప్యతే = సమాప్తిని పొందును. (క్రియ సంబంధించును).

తా. 'త్వయా రామ, గోపాల, కృష్ణైః సహ భోక్తవ్యమ్' (నీవు రామ గోపాల కృష్ణులతో కలిసి భుజింపుము) ఇది ద్వంద్వమున్న వాక్యము. 'త్వయా బ్రాహ్మణైః సహ భోక్తవ్యమ్' (నీవు బ్రాహ్మణులతో కలిసి భుజింపుము) ఇది ఏకశేషము కల వాక్యము. 'కలిసి చేయవలెను' అన్న అర్థమును ఇట్టి వాక్యములతో బోధింతురు. ఇటువంటి స్థలము లలో క్రియ ప్రత్యేకమునకును, సముదాయమునకును కూడ సంబంధించును. 'ఎవరికి వారు ఆ పని చేయుటయు, అందరును కలిసి ఒక్కుమ్మడిగనే ఆ పని చేయుటయు' వాక్యతాత్పర్య మగుట ఇందు నిదానము.

వి. కొన్ని సందర్భములలో భుజిక్రియకు కూడ ఉభయసమాప్తి సంభవించు నని చెప్పుట ఈ కారికయొక్క ప్రయోజనము.

మీది ఉదాహరణ వాక్యములలో 'భోక్తవ్యమ్' అను క్రియాపదమును ఆవృత్తి చేసి, తొలిసారి 'నీవు భుజింపవలెను' 'వారును ప్రత్యేకముగా భుజింపవలెను' అని అర్థమును చెప్పవలయును. అపుడు ప్రత్యేకసమాప్తి అగును. రెండవసారి 'మీరందరును కలిసి, ఒక సమయముననే భుజింపవలెను' అను అర్థమును చెప్పవలెను. ఇపుడు సముదాయసమాప్తి అగును. అనగా భుజ్ ధాతువునకు భోజన సామాన్యార్థమును స్వీకరించి, దానికి కర్తృ సముదాయముతో సంబంధమును చెప్పవలయునని సారము.

'లక్షణార్థత్వాత్, అనగా, భుజిక్రియ లక్షణావ్యాపారముచే భోజనసామాన్యమును బోధించుటవలన' అని భావము.

వాక్యార్థమునుబట్టి (వాక్యార్థముయొక్క సామర్థ్యము, తాత్పర్యము, యోగ్యత మొదలగు ధర్మములను అనుసరించి) ప్రత్యేకసమాప్తియు, సముదాయసమాప్తియు, ఉభయ సమాప్తియు జరుగు విధానము ఇంతవరకు వివరింపబడినది.

ఇట్లు వాక్యార్థమును బట్టిప్రత్యేకసమాప్తిని సముదాయసమాప్తిని పరిశీలించి, ప్రకృతము వాక్యస్వరూపమును బట్టి ఆ యంశమునే ప్రతిపాదించుచున్నాడు.

వాక్యాంతరాణాం ప్రత్యేకం సమాప్తిః కైశ్చి దిష్యతే
రూపాంతరేణ యుక్తానాం వాక్యానాం తేన సంగ్రహః. ౪౪౭

వాక్యాంతరాణామ్ = మహావాక్యములకు, ప్రత్యేకమ్ = (అవాంతరవాక్యములతో) వేరువేరుగా, సమాప్తిః = సంబంధము (విశ్రాంతి=పూర్తి), కైశ్చిత్ = కొందరిచే, ఇష్యతే= కోరబడుచున్నది, రూపాంతరేణ = వేరేరూపముతో, యుక్తానామ్ = కూడిన, వాక్యానామ్= అవాంతర వాక్యములకు, తేన = ఆ మహావాక్యముచే, సంగ్రహః = స్వీకారము, (భవతి = అగును).

తా. ఒక తత్త్వమును లేక ఒక ముఖ్యాంశమును ప్రతిపాదించు వాక్యము మహావాక్యము (గౌరవమునుబట్టియే దాని మహత్త్వము, రూపమునుబట్టి కాదు) ఉదా: 'తత్ త్వమ్ అసి' (ఆ బ్రహ్మమే నీవు) ఇది వేదాంత మహావాక్యము. ఈ తత్త్వమును సూచించు మిగిలిన ఉపనిషద్వాక్యములన్నియు అవాంతరవాక్యములు. 'శ్రీరామవత్ వర్తితవ్యం నతు రావణవత్' (మానవుడు రామునివలె నడచుకొనవలయును, రావణునివలె నడచుకొనరాదు). ఇది రామాయణ మహావాక్యము. రామాయణమందలి ఇతరవాక్యములన్నియు అవాంతర వాక్యములు. అట్లే లోకవ్యవహారమున కూడ ప్రధానమైన దానిని మహావాక్యమనియు, దానికి బలము చేకూర్చు వాక్యములను అవాంతర వాక్యములనియును చెప్పవచ్చును.

ఇట్టి సందర్భములలో మహావాక్యమునకు ప్రతియొక అవాంతరవాక్యముతోను సంబంధము ఉండునని కొందరందురు. అనగా అంగాంగి భావముతో (మహావాక్యము అంగి, అవాంతరవాక్యములు అంగములు) అవి ప్రకాశించునని వారి ఆశయము. 'కైశ్చిత్' అనుట వలన, సముదాయసమాప్తియు (అవాంతరవాక్యముల సముదాయముతోకూడ సంబంధము) మరికొందరికి అభీష్టమని సూచితమైనది.

మహావాక్యముచేతనే అవాంతరవాక్యములన్నియు సంగ్రహింపబడును.

వి. "వాక్యార్థమునుబట్టి సముదాయసమాప్తి–లేక–ప్రత్యేకసమాప్తి" అను విషయము ఇంతవరకు కొనసాగినది. వాక్యస్వరూపము నాశ్రయించి, ''మహావాక్యములకు'' అవాంతరవాక్యములకును ఉండు సమన్వయము" ఇటుపైని విపులముగా చూపబడును.

ఒక పద్యమును ఉదాహరణముగా తీసుకొని ప్రకృతాంశమును తెలియనగును:

అభ్యుద్ధృతా వసుమతీ దలితం రిపూరః
ప్రత్యాహృతా బలవతా బలిరాజలక్ష్మీః ।
ఏకత్ర జన్మని కృతం తదనేన యూనా
జన్మత్రయే యదకరోత్ పురుషః పురాణః ॥

అర్థము: వసుమతీ = భూమి, అభ్యుద్ధృతా = ఉద్ధరింపబడెను. రిపూరః = శత్రువుయొక్క వక్షఃస్థలము, దలితమ్ = బ్రద్దలు చేయబడినది. బలవతా = బలముగల ఇతనిచే, బలిరాజలక్ష్మీః = బలవంతులైన రాజుల రాజ్యము (బలిచక్రవర్తియొక్క రాజ్యము) ప్రత్యాహృతా = మరల తీసుకొనబడెను.

పురాణః + పురుషః = శ్రీకృష్ణుడు, జన్మత్రయే = మూడు జన్మలందు (వరాహ, నరసింహ వామన జన్మలు) యత్ = దేనిని, అకరోత్ = చేసెనో, తత్ = ఆపని, అనేన + యూనా = ఈ యువకుడైన రాజుచే, ఏకత్ర + జన్మని = ఒక జన్మయందే, కృతమ్ + చేయబడినది.

ఒక రాజుయొక్క వర్ణనమిది. "శ్రీకృష్ణుడు మూడుజన్మలలో చేసినపనిని ఇత డొక జన్మలోనే చేయగలిగెను" అన్నది చమత్కారము.

ఇందు పూర్వార్ధములో మూడు వాక్యములున్నవి. అవి దేనికది సంపూర్ణమే(ప్రత్యేక సమాప్తము). అయినను ఆ మూడున్ను, ఉత్తరార్ధమందలి "యత్ పురాణః పురుషః అకరోత్ ....తత్ అనేన కృతమ్" అను మహా వాక్యమునకు అవయవము లగును. లేకున్న, వానికి "స్వతంత్రమైన ఉనికి" కుదరదు. కాగా మహావాక్యము అవయవియు, అవాంతర వాక్యములు అవయవములును అయి పరస్పర సంబంధమును పొందును.

"ఆకాంక్ష, యోగ్యత మొదలగు హేతువులవలన, అంగవాక్యములతో అంగి వాక్యమునకును, అంగివాక్యముతో అంగవాక్యములకును పొత్తు ఏర్పడును. అయినను అంగి వాక్యము ముఖ్యము గాన, దానివలన అంగవాక్యములు గతార్థములైనట్లే. సంగ్రహము అనగా ఇదియే" అన్నది తత్త్వము.

మహా వాక్యమునకు అవాంతరవాక్యములతో విడివిడిగా సంబంధమన్నను, సము దాయముతో సంబంధమన్నను ఫలిత మొకటే. ఆ యంశమును ఈ కారిక సూచించినది.

మహావాక్యమొకటే అవయవ వాక్యముల భావమును వ్యక్తపరచగలుగును గాన, "మహావాక్యము అవాంతరవాక్యములను సంగ్రహించును--అనగా వాని భావమును చెప్పును." అవి అందురు. ఉదా : "నీవు ఊరికి వెళ్ళి సొమ్ము పట్టుకు రమ్ము." ఇది ముఖ్యవాక్యము. "బస్సులో జాగ్రత్తగా ఉండుము. ఆకలయితే ఫలహారము చేయుము. అవశ్యకమైతే ఒక రోజు ఆ ఊరిలో ఉండుము." మొదలగు అవయవవాక్యముల అర్థమంతయు ఈ ముఖ్య వాక్యమువలన అవగతమైపోవును. అందుచేతనే "మహావాక్యము వాచకమనియు, అవాంతర వాక్యములు వాచ్యములనియును" సాంకేతికముగా అందురు.

ఈ తీరునుబట్టి మహావాక్యము, అవాంతరవాక్యములను అన్నింటిని ఒక్కమారు గనే సంగ్రహించునన్నచో, "సముదాయసమాప్తి" అనియు, విడివిడిగా వానితో సంబం ధించు నన్నచో "ప్రత్యేకసమాప్తి" అనియును వ్యాఖ్యానించుకొనవలయును.

మహావాక్యము అవాంతర వాక్యములకు వాచకము కాదని నిరూపించుచున్నాడు:

న వాక్యస్యాభిధేయాని భేదవాక్యాని కానిచిత్
తస్మింస్తూచ్చరితే భేదాం స్తథాన్యాన్ ప్రతిపద్యతే. ౩90

భేదవాక్యాని = అంగవాక్యములు, కానిచిత్ = ఏవయినను, వాక్యస్య = మహా వాక్యమునకు, అభిధేయాని = వాచ్యములు, న = కావు. తస్మిన్ = ఆ మహావాక్యము, ఉచ్చ రితే + తు = ఉచ్చరింపబడగానే, తథా = ఆవిధముగా, అన్యాన్ = ఇతరములైన, భేదాన్ = అవయవవాక్యములను, ప్రతిపద్యతే = సూచించును.

తా. మహావాక్యము, అవయవవాక్యములకు వాచకము మాత్రము కాజాలదు. కాని దానిని పలుకగానే అవయవవాక్యముల అర్థము స్ఫురించుచుండును (యోగ్యత, ఆకాంక్ష మొదలగు హేతువులవలన).

వి. మహావాక్యమునకు అవాంతర వాక్యములకును సాక్షాత్తుగా వాచ్యవాచక సంబంధము లేదు. అయినను మహావాక్యార్థము తెలియగానే, అవాంతరవాక్యముల అర్థము

కూడ అవగతమైనందున దానిని బోధించు వాక్యములును ఉచ్చరితములే అనిపించును. "మహావాక్యము అవాంతరవాక్యములకు ఉపలక్షణము" అని సారము.

అఖండ వాక్యవాది పదవాదియొక్క మతమును ఖండించుచున్నాడు.

యేషాం సమస్తో వాక్యార్థః ప్రతిభేదం సమాప్యతే
తేషాం తదానీం భిన్నస్య కిం పదార్థస్య సత్తయా ? 391

సమస్తః = అఖండమైన, వాక్యార్థః = వాక్యార్థము, ప్రతిభేదమ్ = ప్రత్యేకముగా, యేషామ్ = ఎవరిమతమందు, సమాప్యతే = సంబంధించునో, తేషామ్ = వారిమతమున, తదానీమ్ = అట్లయినపుడు, భిన్నస్య = వేరయిన, పదార్థస్య = పదార్థముయొక్క, సత్తయా = ఉనికిచే, కిమ్ = ఏమిప్రయోజనము ?

తా. అఖండవాక్యమును, అఖండవాక్యార్థమును అంగీకరించిన వారి మతమున, పదపదార్థములను వేరుగా చూపుట వ్యర్థము. వాని ఉనికి శూన్యప్రాయమే గదా !

వి. అఖండవాక్యవాదియొక్క మతమిది. "పదపదార్థముల ఉనికి కాల్పనికమును, ఉపాయభూతమును" అని అతని సిద్ధాంతము గదా !

పదవాదమును నిరాకరించుటకై, వాక్యవాది రెండు పక్షములను ప్రతిపాదించుచున్నాడు.

అథ తైరేవ జనితః సోఽర్థో భిన్నేషు వర్తతే
పూర్వస్యార్థస్య తేన స్యాత్ విరోధః సహ వా స్థితిః. 392

తైః + ఏవ = (పరస్పరము కలసిన) పదార్థములచేతనే, జనితః = కలిగింపబడిన, సః + అర్థః = ఆ వాక్యార్థము, భిన్నేషు = వేరుగా ఉన్న పదములందు వేరువేరుగా, వర్తతే = ఉన్నది, అథ = అయినచో, పూర్వస్య = ముందున్న, అర్థస్య = వాక్యార్థమును పుట్టించు పదార్థమునకు, తేన = ఆ వాక్యార్థముతో, విరోధః = విరోధము కాని, (కలిసి ఉండుట కుదరకపోవుట), వా = లేక, సహస్థితిః = కలిసి ఉండుట కాని, స్యాత్ = అగును (అని చెప్పవలసి యుండును).

తా. మహావాక్యములోని అవాంతరవాక్యములు, వాక్యములోని పదములవంటివే కాన, ప్రత్యేక సమాప్తి, సముదాయ సమాప్తి- అను వానిని రెండు విషయములందును యథాసంభవముగ ఊహించుకొనవలెను.

ప్రత్యేక సమాప్తి అన్న పక్షమునకు సంబంధించినది ప్రకృత పరిశీలనము : "పరస్పరము కలిసిన పదార్థములే వాక్యార్థము. అందుచే పదార్థములు వాక్యార్థజనకములు. ఆ విధముగ పుట్టిన వాక్యార్థము విడివిడిగా ప్రతియొక పదమందును ఉండును" అని పదవాదులు అనుట కవకాశమున్నది.

అయినను ఇట్లు చెప్పినచో రెండు చిక్కులున్నవి : పదార్థముయొక్క రూపము వేరు (ఇతర సంబంధము లేనిది). వాక్యార్థము యొక్క స్వరూపము వేరు (పరస్పర సంబంధము కలది). ఇవి విరుద్ధములు కాన ఒక చోట ఉండుట కుదురదు. ఇదొక చిక్కు. "విరోధమున్నను, రెండును ఒక చోట ఉండును" అన్నది మొండివాద మగును. ఇది రెండవ చిక్కు.

వి. పదవాదమును ఖండించుటకై, అందు సంభవించు రెండు విధములైన బాధలను ఈ కారిక చూపినది. పదార్థ వాక్యార్థముల స్వరూపములు భిన్నములు కాన, పరస్పరము పొత్తు కుదురదు (ఒకే పదమందు రెండును ఉండుట అసంభవము).

మీది రెండు పక్షములందును దోషము కలదని వ్యాఖ్యానించుచున్నాడు.

సహాస్థితౌ విరోధిత్వం స్యా ద్విశిష్టావిశిష్టయోః
వ్యభిచారీ తు సంబంధ స్త్యాగేఽర్థస్య ప్రసజ్యతే. 393

సహస్థితౌ = పదార్థము, వాక్యార్థమున్ను కలిసి ఉన్నయెడల, విశిష్టావిశిష్టయోః ఎట్టి సంబంధము కలిగియుండని పదార్థమునకును, విశేషణ విశేష్యభావముతో మొత్తముగా ఏర్పడిన వాక్యార్థమునకును, విరోధిత్వమ్=విరోధము, స్యాత్=కలిగెడిని. అర్థస్య=పదార్థము యొక్క, త్యాగే + తు = త్యాగమందైతే (విడుచుట = ఉపేక్షించుట), సంబంధః = శబ్దార్థ ముల సంబంధంము, వ్యభిచారీ = అనిత్యము, ప్రసజ్యతే = కావలసివచ్చును.

తా. దేనికది విడిగా భాసించునది పదార్థము; అన్ని పదార్థములను కలుపుకొని, విశేషణ విశేష్యభావముతో ఏకాకారముగ భాసించునది వాక్యార్థము. ఇట్లు పరస్పర విరుద్ధము లగు ఈ రెండింటికిని సహస్థితి (ఒక పదార్థమందే కలసి ఉండుట) అనుచితము (విరోధము లేని వానికే సహావస్థానము సముచితము).

అట్లుకాక, పదార్థము తొలుత వాక్యార్థమును కలిగించి, పిదప తన ఉనికిని కోల్పోయి, తనయందు వాక్యార్థమునకు స్థానమిచ్చునని చెప్పినయెడల, శబ్దార్థము నశించి నట్లగును గాన, "శబ్దార్థ సంబంధము నిత్యము" అను సిద్ధాంతము పాడగును.

కావున "ప్రత్యేక సమాప్తి అన్న పక్షములో పరమార్థమున పదపదార్థములు ఉండవు" అని సారాంశము.

వి. విశిష్టము = సంబంధము కలది = వాక్యార్థము. అవిశిష్టము = సంబంధము కలిగి ఉండనిది = పదార్థము. "విశిష్టావిశిష్టయోః" అను ద్వంద్వములో, లాఘవమునుబట్టి, విశిష్టశబ్దము ముందుకు వచ్చినది. అట్లే జన్య మనగా వాక్యార్థమును, జనక మనగా పదార్థ మును అని తెలియునది. -

వ్యభిచారి = చంచలము = నిత్యముకానిది. పదార్థవాక్యార్థములకు విరోధమును పూర్వకారిక వివరించినది. అందువలననే వానికి సహస్థితియు కుదరదని ఈ కారిక చెప్పినది.

"సముదాయ వాక్యపరిసమాప్తి" అను పక్షమున అర్థవత్త్వము సముదాయ మునకా? లేక—అవయవములకా? (వాక్యమే అర్థము కలదై పదములు అర్థశూన్యములగునా?) అను అంశమును పరిశీలించుచున్నాడు.

ఏకః సాధారణో వాచ్యః ప్రతిశబ్ద మవస్థితః
సంఘే సంఘిషు చార్థాత్మా సంనిధాననిదర్శకః. 394

అర్థాత్మా = వాక్యార్థము, వాచ్యః = అన్నిపదములచేతను చెప్పబడినదై (సత్య మైనదై), ఏకః = అఖండమైనదై, సంనిధాన నిదర్శకః=ఇతర శబ్దములయొక్క ఉనికివలన ప్రతిపాదింపబడినదై, సంఘే = సముదాయరూపమగు వాక్యమందును, సంఘిషు + చ =

సముదాయమునకు అవయవములుగా ఉన్న పదములందును, సాధారణః = సమానమైనదై, ప్రతిశబ్దమ్ = ప్రతియొక పదమందును, అవస్థితః = ఉండునదియే.

తా. వాక్యమందలి పదములన్నియు వాక్యార్థమును పుట్టించును. అది అఖండము, నిత్యము. అయినను ఏ ఒక్క పదమువలనను సంపూర్ణ వాక్యార్థము కలుగుదు. ఆవశ్యకమైన పదములన్నియు ఉన్నపుడే అది జనించును. అందుచే పదసముదాయమునకును, ప్రత్యేక పదములకును కూడ సంబంధించియే వాక్యార్థము ఉండునని చెప్పవలెను.

వి. "సముదాయమందు వాక్యపరిసమాప్తి" అని అంగీకరించినను, ప్రత్యేక పదములకును, పదసముదాయరూపమైన వాక్యమునకును కూడ, వాక్యార్థము వాచ్యమగుననియు, పదపదార్థములు పూర్తిగా వ్యర్థములు కావనియును ఈ శ్లోకము విశదపరచినది. (117 వ శ్లోకముచే ఇదివరకే ఈ భావము ప్రకటితము— "ప్రత్యేకంతు సమాప్తోఽర్థః సహభూతేషు వర్తతే" అని వచనము).

పదసముదాయముచే వాక్యార్థము బోధపడును. అవయవములగు పదములు కూడ ప్రత్యేకముగా వాక్యార్థమునకు సహకారులగును. ఏ ఒక పదము లేకున్నను అది సమగ్రము కాదు గదా! ఈ విధముగా వాక్యార్థము సముదాయావయవసాధారణ మగును.

పై కారికయొక్క భావమునకు ఒక దృష్టాంతమును చూపుచున్నారు.

యథా సాధారణే స్వత్వం త్యాగస్య చ ఫలం ధనే
ప్రీతి శ్చావికలా తద్వ త్సంబంధోఽర్థేన తద్వతామ్. ౪౧౬

స్వత్వమ్=తమకు సంబంధించుటయు (హక్కు), త్యాగస్య = దానముయొక్క, ఫలమ్ + చ = పుణ్యము మొదలగు ఫలమును, అవికలా = సంపూర్ణమైన, ప్రీతిః + చ = సంతృప్తియును, సాధారణే = ఉమ్మడిగాఉన్న, ధనే = ధనమందు, యథా = ఎట్లు తెలియ బడునో, తద్వత్ = ఆ విధముగనే, తద్వతామ్ = వాక్యార్థముగల వాక్యమునకు, తదవ యవములైన పదములకును, అర్థేన = వాక్యార్థముతో, సంబంధః = వాచ్యవాచక భావసంబం ధము, (సాధారణః = సామాన్యముగా = ఉమ్మడిగా, భవతి = అగును-తెలియబడును).

తా. కొందరు వ్యక్తులకు ఉమ్మడిగా కొంతధనము ఉన్నదనుకొనుడు. ఆ ధన మందు హక్కును, దానిని దానము చేసినందువలన లభించు ఐహికాముష్మిక ఫలములును, దానివలన కలుగు తృప్తియును విడివిడిగాను, సామూహికముగాను కూడ ఆ వ్యక్తులకు సమానముగా ఉండునన్నది లోకములోని అనుభవము. అట్లే వాక్యమందును, తదవయవము లైన పదములందును వాక్యార్థము వాచ్యవాచక భావసంబంధముతో ఉండును.

వి. పై కారిక చూపిన విషయము ఒక ఉదాహరణముతో ఇచట సమర్థించ బడినది.

కాగా "పదములును, తత్సముదాయరూపమైన వాక్యమునుకూడ వాచకములు. వాక్యార్థము వాచ్యము. అది పదార్థసముదాయరూపము" అని ఫలించును.

ఈ ప్రసంగమున "వర్ణ సముదాయరూపమగు ప్రాతిపదికమునకే సుప్ ప్రత్యయ మగును, అవయవములగు వర్ణములకు అది సంభవింపదు" అను పతంజలి వచనమును వ్యాఖ్యానించుచున్నారు.

వర్ణానా మర్థవత్తాయాం తేనై వార్థేన తద్వతి
సముదాయేన చైకత్వం భేదే న వ్యవతిష్ఠతే . 396

వర్ణానామ్ = వర్ణములకు, అర్థవత్తాయామ్ = అర్థమున్నపుడు, తేన = ఆ, అర్థేన + ఏవ = అర్థముతోనే, తద్వతి = అర్థముగల ప్రాతిపదికము విషయములో, సముదాయేన + చ = వర్ణసముదాయ రూపమైన ఆ ప్రాతిపదికము చేతనే, ఏకత్వమ్ = ఏకత్వ సంఖ్య = ఏకవచనము, (బోధ్యతే=బోధింపబడును). భేదే=విడిగా వర్ణమందు, ఏకత్వమ్= ఏకత్వసంఖ్య, న + వ్యవతిష్ఠతే = ఉండదు.

తా. ధన వన మొదలగునవి ప్రాతిపదికములు. వీనిలో ప్రత్యేకవర్ణములును, సముదాయమును కూడ అర్థము కలవియే- అని ఒక మతమున్నది. తదనుసారము ప్రత్యేక వర్ణముల కేది అర్థమో సముదాయమైన ప్రాతిపదికమునకును అదియే అర్థమగును. అందుచే ప్రాతిపదికమునకే సుప్ ప్రత్యయములు చేరును. ఆ విధముగ సుబర్థము (సంఖ్య, మొదలగునది) అవగతమగును గాన, ప్రత్యేకవర్ణములకు వేరుగా సుప్రత్యయములు చేరవు.

వి. ఈ విషయము ప్రాసంగికము. 'సంఘాతస్యైకార్థ్యాత్ సుబభావో వర్ణాత్' (మహాభాష్యము- రెండవ ఆహ్నికము - హయవరట్-అను సూత్రములోని వచనము) అని ఒక వచనమున్నది. 'సంఘాతస్య = సముదాయము, ఐకార్థ్యాత్ = ఒక అర్థము గలదగుట వలన, వర్ణాత్ = వర్ణమునకు పరముగ, సుబభావః = సుప్ ప్రత్యయము రాదు' అని అర్థము. ఒక ప్రాతిపదికములోని వర్ణములకును సముదాయమునకును అర్థవత్త్వము సాధారణము. అందువలన సముదాయమునకు ప్రత్యయము వచ్చి, ఆవశ్యకమైన అర్థమును బోధించును. విడివిడి వర్ణములకు ప్రత్యయము వ్యర్థమగును. సముదాయమునకు ప్రత్యయము చేరుటయందు లాఘవమున్నది గదా?

పై భావమునే దృష్టాంతపూర్వకముగ చూపుచున్నాడు.

ఏకేనైవ ప్రదీపేన సర్వే సాధారణం ధనమ్
పశ్యంతి తద్వ దేకేన సుపా సంఖ్యాభిధీయతే . 397

ఏకేన = ఒక, ప్రదీపేన + ఏవ = దీపముతోనే, సర్వే = అందరును, సాధారణమ్ = సామాన్యమైన (అందరకును చెందిన), ధనమ్ = ధనమును, పశ్యంతి = చూడ గలుగుదురు. తద్వత్ = అట్లే, ఏకేన = ఒక, సుపా = సుప్రత్యయముచే, సంఖ్యా = ఆవశ్యకమైన సంఖ్య, అభిధీయతే = చెప్పబడును.

తా. ఉమ్మడిగా ఒకచోట దాచుకొన్న ధనమును ఒక దీపముతోనే రాత్రిపూట అందరును చూడవచ్చును. ఆ విధముగానే ఒకే సుప్ ప్రత్యయము సముదాయముయొక్కయు అవయవములయొక్కయు సంఖ్యను తెలియజేయ గలుగును.

వి. మీది శ్లోకము చెప్పిన అంశమును ఉదాహరణపూర్వకముగా ఈ శ్లోకము సమర్థించినది. ''వర్ణసముదాయ రూపమగు ప్రాతిపదికమునకే సుప్రత్యయమగునుగాని, ప్రత్యేకవర్ణములకు కాదు'' అని ఫలితము.

"వర్ణ పద వాక్యములకు అర్థవత్త్వము సాధారణము" అనుట ఎట్లు పొసగును? అను శంకకు ఉత్తరము నిచ్చుచున్నాడు.

నార్థవత్తా పదే వర్ణే వాక్యే చైవం విశిష్యతే
అభ్యాసా త్ప్రక్రమోఽన్యస్తు విరుద్ధ ఇవ దృశ్యతే. 898

ఏవమ్ = ఈ విధముగా, వర్ణే = వర్ణమందును, పదే = పదమందును, వాక్యే + చ = వాక్యమందును కూడ, అర్థవత్తా = అర్థముండుట, న + విశిష్యతే = మార్పుచెందదు (సమానమే). అన్యః = ఇతరమైన, ప్రక్రమః + తు = ఆయా శాస్త్రముల రీతి, అభ్యాసాత్ = అభ్యాసమువలన, విరుద్ధః + ఇవ = పరస్పరము పొసగనిదివలె, దృశ్యతే = కనబడును.

తా. "వర్ణములును, పదములును, వాక్యమును కూడ అర్థము గలవియే" అనునది వాస్తవము కాదు. ఇతరశాస్త్రముల ననుసరించియే ఈ మాట తరచుగ వినబడుచుండును. "అఖండవాక్యము, అఖండవాక్యార్థము మాత్రమే పరమార్థ సత్యము" అని వైయాకరణుల సిద్ధాంతము.

వి. "అఖండవాక్య వాక్యార్థములే సత్యములని పెక్కురీతులతో ఇదివరకు నిర్ణయింపబడినది. వర్ణ, పద, వాక్యములును, వాని అర్థములును కూడ సత్యము లన్నట్లుగా ప్రకృతము వివరింపబడినది. కాగా పరస్పర విరుద్ధవచనములతో గ్రంథమంతయు నిండియున్నట్లు తోచును" అను శంకకు ఈ కారిక సమాధానము.

"ప్రాచీన వ్యాకరణములు కొన్ని ఉన్నవి. న్యాయము, పూర్వమీమాంస, మొదలగు శాస్త్రాంతరములును పెక్కు లున్నవి. అవి వర్ణములకును, పదములకును కూడ అర్థవత్త్వమును ప్రతిపాదించును. తదనుసారము ఆయా మతములను చూపుటకు గాని, అనువదించుటకుగాని, ఏదో ఒకరీతిని సమర్థించుటకు గాని, అనేకవిధములయిన వచనములు ఈ గ్రంథమున కనబడవచ్చును. అంతమాత్రమున పరస్పర విరోధమని భావింపరాదు. సందర్భానుసారము సమన్వయము చేసుకొనుచుండవలెను. పాణినీయ తత్త్వమున మాత్రము అఖండవాక్య వాక్యార్థములే పరమసత్యములు" అన్నది సమాధానము యొక్క సారము. ప్రత్యేకసమాప్తి, సముదాయసమాప్తి అను చర్చ ఇంతతో ముగిసినది.

అర్థమును బోధించుటలో గల శబ్దముయొక్క వ్యాపారమును ఇపుడు పరిశీలించుచున్నాడు.

వినియోగా దృతే శబ్దో న స్వార్థస్య ప్రకాశకః
అర్థాభిధాన సంబంధ ముక్తిద్వారం ప్రచక్షతే. 899

వినియోగాత్ = ప్రయోగము (ఉచ్చారణము), ఋతే = లేకుండ, శబ్దః = శబ్దము, స్వార్థస్య = తన అర్థమును, ప్రకాశకః = బోధించునది, న = కాదు. అర్థాఽభిధానసంబంధమ్ = అర్థమునకు, శబ్దమునకును ఉండు సంబంధమును, ఉక్తిద్వారమ్ = ప్రయోగము ద్వారముగా గలదని, ప్రచక్షతే = చెప్పుదురు.

తా. ప్రయోగములేకుండ శబ్దము తన అర్థమును చెప్పజాలదు. శబ్దార్థముల సంబంధము ప్రయోగమూలకము.

వి. 'ఈ శబ్దము ఈ అర్థమును బోధింపవలయును' అను తాత్పర్యముతో, వక్త ఒక శబ్దమును స్పష్టముగ పలికినపుడే ఆయా శబ్దమువలన ఆయా అర్థము తెలియుట జరుగుచున్నది. అట్లు కానపుడు అర్థబోధ కలుగదు. కావున శబ్దమునకు నియతమైన అర్థమున్నను, ప్రయోగములేనిదే అది తెలియదని స్పష్టమగును. కావుననే శబ్దార్థసంబంధము విశదమగుటకు ప్రయోగమును సాధనముగా స్వీకరింపక తప్పదు.

శబ్దము తన అర్థమును బోధించి తీరునని ఈ కారిక వివరించును. ఒక శబ్దము నియతమైన ఒక అర్థమును బోధించును. అనేకార్థక శబ్దమైనను ప్రకరణాదులచే నియతార్థమునే చెప్పును. శ్లేషాదిస్థలములలో కూడ ఆవశ్యకమైన అర్థములే బోధింపబడును. శబ్దార్థములకు యోగ్యతారూపమైన ఇట్టి సంబంధము అనాదిసిద్ధము. దీనినే అభిధా వ్యాపారమని అందురు. అభిధా వ్యాపారమును 'ప్రతిభ' అనియు సామాన్యముగా వైయాకరణులు వ్యవహరింతురు.

ప్రతిభకు మూడు స్వరూపములున్నవి: 1. ఉక్తి - లేక - వినియోగము = ఉచ్చారణము. ఇది వాగ్రూపము. 2. అనుసంధానము - లేక - అభిసంధానము = ఎడతెగని భావన. ఇది మనోరూపము. 3. ప్రణిధానము = శ్రద్ధతో చూచుట. ఇది నేత్రరూపము. ఈ మూడును కలిసియే ప్రతిభ అగును.

అభిధయు ప్రతిభయు ఒకటే అన్న పక్షములో ఇబ్బందిలేదు. 'శబ్దము తన అర్థమును అభిధావ్యాపారముచే తెలియజేయును' అని చెప్పవచ్చును. 'ఆ రెండును వేరే' అన్న పక్షములో మాత్రము అభిధకు ప్రతిభ—లేక—వినియోగము-సాధనముగా పనిచేయునని వ్యాఖ్యానించుకొనవలెను. 'ప్రతిభాసహితమైన అభిధయే అర్థప్రకాశకమగును' అని సారాంశము.

కారికలోని 'వినియోగ' పదము ప్రతిభకు సూచకము.

శబ్దమునకు అర్థమునకును గల సంబంధము సహజము, నిత్యమునని ప్రతిపాదించుచున్నాడు.

> యథా ప్రణిహితం చక్షు ర్దర్శనా యోపకల్పతే
> తథాభిసంహితః శబ్దో భవ త్యర్థస్య వాచకః . 400

ప్రణిహితమ్=సావధానమైన, (ఏకాగ్రమైన=గురియందు లగ్నమైన), చక్షుః= నేత్రము, దర్శనాయ=చూచుటకు, యథా=ఏవిధముగ, ఉపకల్పతే=సమర్థమగునో, తథా = ఆవిధముగనే, అభిసంహితః = సావధానమైన, (అనుసంధింపబడిన=ఈ శబ్దమీఅర్థమును చెప్పవలెనని భావింపబడిన), శబ్దః = శబ్దము, అర్థస్య=అర్థమును, వాచకః=చెప్పునది, భవతి = అగును.

తా. కన్ను లక్ష్యమందు లగ్నమైనపుడే దానిని చూడగలుగును. అట్లే అర్థమందు లగ్నమైనపుడే శబ్దమా అర్థమును చెప్పగలుగును. ఈ తీరును ప్రణిధానమనియు, అభిసంధానము - లేక - అనుసంధానమనియు అందురు.

వి. వస్తువును చూచుట కంటి యొక్క సహజధర్మము (కంటికి రూపమగపడుట సృష్టిసిద్ధము). అయినను అచట ప్రణిధాన మను ఒక వ్యాపారముకూడ ఉండ

వలెను. అనగా కంటిని మనసుతో జోడించి చూడగోరిన వస్తువునందు నిలుపవలెను. లేకున్న—ఎదురుగా ఉన్న వస్తువులు కూడ కనబడవు.

అట్లే అర్థమును చెప్పుట శబ్దముయొక్క స్వభావము. అయినను ఇచట కూడ అభిసంధానమను వ్యాపారము ఉండితీరవలెను. లేకున్న శబ్ద మెట్టి అర్థమును చెప్పజాలదు. అనగా సహజమైన వానిని గ్రహించుటకు కూడ ఒక వ్యాపారము - లేక - ప్రక్రియ ఆవశ్యక మగును. 'ఈ శబ్దము ఈ అర్థమును బోధించుగాక' అను కోరికయే శబ్దమునకు సంబంధించిన వ్యాపారము. దీనిని 'అభిసంధానము' (మనసును ఏకాగ్రముచేయుట=నిలుపుట) అని అందురు.

'శబ్దమునకు అర్థముతోడి సంబంధము సహజము - నిత్యము. అట్లు కాక కల్పిత మన్నచో, శబ్దార్థసంబంధములు నిత్య ములన్న వైయాకరణ సిద్ధాంతము పాడగును.' ఈ యంశమును సమర్థించుటకు ఈ ప్రసంగ మారంభమైనది.

ఆయా ఇంద్రియము మనస్సుతో కలిసినపుడే, ఆయా యోగ్యమైన తన విషయ మును గ్రహించుచున్నదనుట అనుభవసిద్ధమైన అంశము. దీనిని 'ఇంద్రియ మనస్సం యోగము' అని నైయాయికు లందరు. దీనినే 'ప్రణిధానము' - లేక - 'ప్రచారము' అని వైయాకరణు లందురు. ఇది ఇంద్రియములకును వాని విషయములైన రూపాదులకును వర్తించు ప్రక్రియ.

ఇదేతీరులో శబ్దమునకును, అర్థమునకును వర్తించు ప్రక్రియను 'అభిసంధానము' అని వైయాకరణులు వ్యవహరించుదురు. వక్త తనమనస్సును శబ్దార్థములందు లగ్నము చేయుటయే అభిసంధాన మగును. ఇది లేనపుడు శబ్ద మర్థమును బోధింపజాలదు. అనగా 'ఈ శబ్దమువలన ఈ అర్థము తెలియదగును' అను ఏకాగ్రభావనతో వక్త ఉచ్చరించినపుడే, ఏ శబ్దమైనను తన అర్థమును చెప్పగలుగునని భావము. అనుసంధానము, వినియోగము, ఉక్తి, అనునవి అభిసంధానమునకు మారు పేరులు.

ఇట్టి అభిసంధిద్వారమున శబ్దము అభిధావ్యాపారముతో తన అర్థమును బోధించును. కాగా మీదికారికలో సూచించిన ప్రతిభయు ఈ అభిసంధియు ఒకటే అని పర్యవసించును.

అభిసంధియు అభిధావ్యాపారమును వేరన్న పక్షములో అభిసంధి అభిధావ్యాపారమునకు సహాయమగును.

ఆ రెండున్ను ఒకటే అన్న పక్షముకూడ ఉన్నది. ఈ పక్షములో అభిధ, ప్రతిభ, అభిసంధానము అన్న పదములు సమానార్థకములే అగును. అపుడు శబ్దమువలన అర్థము బోధపడి తీరును. ఇట్లు వివరించుకొనవలెను- "ఈ శబ్దము ఈ అర్థమును బోధింపవలెను" అను కోరిక వక్తయొక్క మనస్సులో పుట్టును. అభిధ అన్నను, ప్రతిభ అన్నను ఇదియే. ఇది సూక్ష్మమైన శబ్దమయమైన స్థితి. తరువాత ఆ యా స్థానములందు వాయుప్రసారముచే వైఖరీరూపమున (స్పష్టధ్వని) ఇదే అభివ్యక్తమగును. (పరమసిద్ధాంతములో అర్థమనునది వేరుగా లేనేలేదు. శబ్దమే అర్థముగా భాసించును).

'వక్తయొక్క తాత్పర్యము ననుసరించి, శబ్దము, తన అర్థమును సమర్పించుటయే అభిధావ్యాపారము. దీనినే అనేక నామములతో వ్యవహరించి, అనేక రీతులలో వివరించు

చుందురు. ఇట్టి శబ్దార్థసంబంధము సహజమైనను, 'అభిసంధానము నిమిత్తమాత్రముగా- వ్యావహారికస్థితిలో ఉండకతప్పదు' అన్నది సారసంగ్రహము.

వినియోగము, ఉక్తి, అభిసంధానము అనునవి అభిధావ్యాపారముయొక్క మారు పేర్లు అని నిరూపించుచున్నాడు.

క్రియావ్యవేతః సంబంధో దృష్టః కరణకర్మణోః
అభిధానియమ స్తస్మా దభిధానాభిధేయయోః . 401

కరణకర్మణోః = కరణకారకమునకును, కర్మకారకమునకును, క్రియావ్యవేతః = క్రియాద్వారకమైన (వ్యాపారము మూలముగాగల), సంబంధః = సంబంధము, (యతః = ఏకారణమువలన), దృష్టః = కనబడునో, తస్మాత్ = ఆ కారణము వలననే, అభిధానాభిధేయయోః = శబ్దమునకును అర్థమునకును, అభిధా = అభిధఅనెడు వ్యాపారము, నియమః = నియామకమై (నియమించునది), (భవతి = అగును).

భా. కరణము (క్రియను కలిగించుటలో ప్రముఖసాధనము), కర్మ (కర్త తన వ్యాపారముతో పొందగోరు విషయము) అను కారకములు దేనికది స్వతంత్రము. (ఒక దానితో వేరొకదానికి సంబంధము వాస్తవముగ ఉండదు). అయినను ఒకానొక క్రియనుబట్టి ఆ రెండింటికిని సంబంధము ఏర్పడుచుండును. ఉదా: 'రామః బాణేన రాక్షసం జఘాన' (రాముడు బాణముతో రాక్షసుని చంపెను). ఇచట బాణము కరణము. రాక్షసుడు కర్మ. ఈ రెండును 'చంపుట' అను వ్యాపారముతో ముడివడి ఉన్నవి (సంబంధమును కలిగి ఉన్నవి). అనగా క్రియ ఒక్కటే; దానితో బాణము సాధనముగను, రాక్షసుడు కర్మగను కూడగట్టబడుట జరిగినది.

అట్లే శబ్దము సాధనమును, అర్థము కర్మయును అగును (ఉదా: శబ్దేన అర్థం బోధయతి = శబ్దముతో అర్థమును బోధించును) అభిధ అను వ్యాపారము ఈ రెండింటిని నియమించును.

వి. అభిధానమనగా శబ్దము. అభిధేయమనగా అర్థము ఆ రెండును అభిధ అను వ్యాపారముతో కట్టబడి ఉండును. అనగా శబ్దము అర్థమును బోధించుట అభిధావ్యాపారము మూలముగా జరుగును.

కాగా 'శబ్దము వాచకము. అర్థము వాచ్యము. వాచ్యవాచకభావము శబ్దార్థముల సంబంధము. అది అభిధావ్యాపారముచే నియమింపబడును' అని ఫలించును.

శబ్దార్థములకుండు వాచ్యవాచక భావసంబంధమును, దానిని నియమించు అభిధావ్యాపారమును స్వతస్సిద్ధములు. అవి కల్పితములుకావు. కేవలము తెలియువారి సౌకర్యముకొరకు అనేకరీతులలో వానిని వివరించుచుందురు. అందుచే వినియోగము, అభిసంధానము, ఉక్తి అనునవి అభిధకు మారుపేరులేగాని, వేరువేరు శబ్దములు కావు. వానికి వేర్వేరు అర్థములును లేవు.

'సిద్ధే శబ్దార్థసంబంధే' (భాష్యము మొదటి ఆహ్నికము మొదటివార్తికము).— (శబ్దము, అర్థము, వాని సంబంధము ఈ మూడును నిత్యములు) అను వార్తికమును, దానికి సంబంధించిన భాష్యమును పై అంశములను దృఢపరచును.

మీది విషయమునే స్పష్టపరుచుచున్నాడు.

బహు ష్వేకాభిధానేషు సర్వే ష్వేకార్థకారిషు
యత్ ప్రయోక్తాభిసంధత్తే శబ్ద స్తత్రావతిష్ఠతే ॥ 402

బహుషు = పెక్కు అర్థములు, ఏకాభిధానేషు = ఒకేశబ్దముచే బోధింపబడినపుడు, సర్వేషు = అన్ని అర్థములును, ఏకార్థకారిషు = ఒక క్రియలో అన్వయించుటకు వీలుకలుగునపుడు, ప్రయోక్తా = శబ్దమును ఉచ్చరించు వ్యక్తి, యత్ = ఏ అర్థస్వరూపమును, అభిసంధత్తే = నిశ్చయించునో (సంకల్పించునో), తత్ర = ఆ అర్థమందు, శబ్దః = శబ్దము, అవతిష్ఠతే = నిలబడును.

తా. ఒక శబ్దమునకు పెక్కు అర్థములు ఉండవచ్చును. అవన్నియు ప్రకృతమైన క్రియతో అన్వయించుటకు వీలుకూడ కనబడవచ్చును. అయినను అట్టిచోట్ల కూడ ప్రయోక్త ఉద్దేశించిన అర్థమునే అతడు ఉచ్చరించిన శబ్దము చెప్పును. అన్ని అర్థములను చెప్పదు. అది అభిధయొక్క - లేక - అభిసంధానముయొక్క ప్రభావము.

వి. మీదికారికయొక్క భావమును ఈ కారిక విశదీకరించును, గో శబ్దమునకు గోవు, భూమి, కిరణము మొదలగు అనేకార్థములున్నవి. 'గావః దృశ్యంతామ్' (గోవులు చూడబడుగాక) మొదలగు ప్రయోగములలో, 'చూచుట' మొదలగు క్రియలతో ఆ అర్థము లన్నియు అన్వయింపగలవు. ('గామ్ ఆనయ' మొదలగుచోట్ల అట్లు కుదురదు- అది వేరువిషయము) అయినను ఉచ్చరించినపుడు వక్త ఏ అర్థమును మనసునందు అనుసంధానముచేయునో, ఆ అర్థమునే గో శబ్దము చెప్పును. ఇది లోకానుభవము. ఆ అనుసంధానమే అభిధావ్యాపారము.

పై విషయమునే వేరొకరీతిలో విశదీకరించుచున్నాడు.

ఆమ్నాయశబ్దా నభ్యాసే కేచి దాహు రనర్థకాన్
స్వరూపమాత్రవృత్తీంశ్చ పరేషాం ప్రతిపాదనే. 403

అభిధానక్రియాభేదా దర్థస్య ప్రతిపాదకాన్
నియోగభేదా న్మన్యంతే తానే వైకత్వదర్శినః ॥ 404

అభ్యాసే = తరచుగా వల్లె వేయుటయందును, పరేషామ్ = ఇతరులకు (శిష్యులకు), ప్రతిపాదనే + చ = ఉపదేశించుటయందును, ఆమ్నాయశబ్దాన్ = వేదమందలి శబ్దములు, అనర్థకాన్ = అర్థము లేనివనియు, స్వరూపమాత్రవృత్తీన్ + చ = తమరూపమును మాత్రమే తెలియజేయునవి అనియును, ఏకత్వదర్శినః = శబ్దమొకటే అని భావించువారు, కేచిత్ = కొందరు, ఆహుః = చెప్పుదురు.

(అట్లే)-అభిధానక్రియాభేదాత్ = అనుసంధానభేదమువలనను (అభిధాభేదమువలన), నియోగభేదాత్ = వినియోగభేదమువలనను, తాన్ + ఏవ = ఆ శబ్దములనే, అర్థస్య = ఆయా అర్థమును, ప్రతిపాదకాన్ = బోధించువానినిగా, ఏకత్వదర్శినః = శబ్దైకత్వవాదులు, మన్యంతే = తలచుదురు.

తా. 'ఎన్నిమారులు పలికినను, ఎన్నిఅర్థములను బోధించినను శబ్దమొకటే' అనువారు శబ్దైకత్వవాదులు. వీరు ఇట్లందురు: వల్లెవేసినసమయములోను, శిష్యులకు చెప్పు సమయములోను వేదశబ్దములకు అర్థము లేదు. వాని స్వరూపమును బోధించుటయు, తెలిసి కొనుటయు మాత్రమే అచట ముఖ్యప్రయోజనము. అయినను యజ్ఞయాగాదికర్మలందును, తత్త్వప్రతిపాదనమందును ఆవేదశబ్దములే, ఆయా అర్థములను బోధించుచుండును. అను సంధానభేదమువలన సిద్ధించు అభిధావ్యాపారభేదమువలననే వేర్వేరు అర్థములను శబ్దములు బోధించుచుండును.

వి. అభిధావ్యాపారమును దృఢపరచుటకై వేరొకరీతిని ఈ కారిక ప్రతిపాదించు చున్నది. లౌకిక శబ్దములవలెనే, వైదికశబ్దములు కూడ, యజ్ఞయాగాది కర్మలలో తమ తమ అర్థములను బోధించును. అట్లు బోధించుట అభిధావ్యాపారమువలననే జరుగును. అర్థము మారినపుడు అభిధయు మారినది అని అనుకొనవలెను. అభిధ మారుటకు అను సంధానము మారుట కారణమగును. (వేదశబ్దముల ప్రయోక్త వేదపురుషుడే అని ఆర్ష సంప్రదాయము).

కాగా శబ్దమును, అర్థమును కూడగట్టు అభిధ అను ఒక వ్యాపార మున్నదని స్పష్టపడును.

శబ్దమును అర్థమును కాక, ఆ రెండింటిని ముడివేయు, అభిధ అను ఒకప్రక్రియ వేరుగా ఉన్నదని చెప్పుటయే ఈ ప్రసంగముయొక్క అభిసంధి.

"అర్థభేదమున్నను (చాలా అర్థములున్నను) శబ్దమొక్కటే" అన్నది ఏకత్వ వాదుల ఆశయము. ఈ మతములో అభిధాభేదమువలన (ఒక్కొక అర్థమునకు ఒక్కొక అభిధ) ఆయా నియతమైన అర్థము తెలియబడును. అట్టి యర్థమును స్మరించుటకు మాత్రమే ప్రకరణాదు లుపయోగించును. కావుననే వానిని "విశేషస్మృతి హేతువులు" అని పేర్కొనుట జరిగినది (316 శ్లోకము).

"అర్థభేదమున్నను శబ్దమొకటే" అను పక్షమున అభిధావ్యాపారమే అర్థమును నియమించునని మీది కారికలో సూచించి, ప్రకృతము "అర్థభేదముచే శబ్దభేదము" అను పక్షమున ప్రకరణాదులు అర్థమును నియమించునని వివరించుచున్నాడు.

తేషా మత్యంతనానాత్వం నానాత్వవ్యవహారిణః
అక్షాదీనా మివ ప్రాహు రేకజాతిసమన్వయాత్. 405

అక్షాదీనామ్ + ఇవ = "అక్ష" మొదలగు శబ్దములకువలె, ఏకజాతి సమన్వయాత్ = ఒకే అనుపూర్వి (వర్ణక్రమము) అను ధర్మమున్నందువలన, తేషామ్ = అనానార్థక శబ్దములకు, అత్యంతనానాత్వమ్ = పూర్తిగా భేదమును, నానాత్వవ్యవహారిణః = భేదమును చెప్పువారు, ప్రాహుః = చెప్పుదురు.

తా. నానార్థకములైన శబ్దముల విషయములో, అర్థభేదమును బట్టి శబ్దభేదమును అంగీకరింపవలెను. అనగా ఎన్ని అర్థములుండునో అన్ని శబ్దములను ఒప్పుకొనవలెను. అయితే-ఆ శబ్దముల స్వరూపమొకటే కావున సాదృశ్యమును బట్టి "ఒకే శబ్దము" అనిపించు చుండును. కాని అది వాస్తవము కాదు. ఉదా: అక్షః. ఈ శబ్దమునకు, పాచిక, ఇరుసు,

పాము, బండి అను నాలుగర్థములున్నవని చెప్పినపుడు, నాలుగు అక్ష శబ్దములును విడిగా ఉన్నవనియే అనవలెను. వీని రూప మొకటైనంత మాత్రమున శబ్ద మొకటే అనకూడదు.— ఇది శబ్ద భేదవాదుల మతము.

వి. అర్థభేదమును బట్టి శబ్దభేదమును స్వీకరించు భేదవాదములో, ప్రకరణాదుల వలననే అర్థ నిర్ణయమగునని విశదీకరించుటకు, ముందుగా ఈ శ్లోకము బయలుదేరినది.

కాగా ఫలించిన అంశమును విశదీకరించు చున్నాడు.

ప్రయోగా దభిసంధానం తత్ప్వేషు న విద్యతే
విషయే యతశక్తిత్వాత్ స తు తత్ర వ్యవస్థితః . 406

ప్రయోగాత్ = ఉచ్చారణము కన్న వేరైన, అభిసంధానమ్=అభిధ, తత్ప్వేషు = ఆ నానార్థకశబ్దములందు, న+విద్యతే=లేదు. సః+తు = ఆ నానార్థకశబ్దమైతే, విషయే= ఆయా అర్థమందు, యతశక్తిత్వాత్ = నియతమైన వేర్వేరు శక్తులు ఉన్నందువలన, తత్ర= ఆ నియతమైన ఒక అర్థమందు, వ్యవస్థితః=తప్పక ఉండునదియై, (భవతి=అగును).

తా. నానార్థకస్థలములలో అర్థభేదమును బట్టి శబ్దభేదము తప్పదన్న యెడల, ఆ శబ్దములకు ఉచ్చారణమే తప్ప, వేరుగా అనుసంధానరూపమైన అభిధ ఉండుట కష్టము. అయినను వెనుక చూపిన (314-316 శ్లోకములు) ప్రకరణాదులవలన శబ్దశక్తి నియతమై, కావలసిన అర్థమునే ఇచ్చుచుండును.

వి. శబ్దభేదవాదములో ప్రకరణాదులే ఆవశ్యకార్థమును సమర్పించునని తత్త్వము. కాగా "ఏకత్వవాదమందు అభిధా వ్యాపార భేదమువలన, నియతార్థ ప్రతీతియనియు, భేదవాద మందు ప్రకరణాదులవలన నియతార్థ ప్రతీతియనియును" ఫలించును.

ఏకత్వవాదములో శబ్దము ఒకటే. అర్థములు పెక్కులు కావున అనుసంధాన నిమిత్తకమగు అభిధ మారుచు, అర్థమును మార్చుచుండును. భేదవాదమున ఎన్ని అర్థము లున్నవో, అన్ని శబ్దములను ఉచ్చరింపవలసి వచ్చును. అప్పుడు అనుసంధానమునకు అవకాశము ఉండదు. ప్రకరణాదులు వచ్చి శబ్ద శక్తిని నియమింపక తప్పదు.

ఆనుపూర్వి సమానముగ ఉన్నను, శబ్దములు భిన్నములే. ప్రకరణాదులు అర్థమును నిశ్చయించుటయే అందు గమకము" అని చూపుచున్నాడు.

నానాత్వస్యైవ సంజ్ఞాన మర్థప్రకరణాదిభిః
న జాత్వర్థాంతరే వృత్తి రన్యార్థానాం కథం చ న . 407

అర్థప్రకరణాదిభిః = అర్థము, ప్రకరణము మొదలగు వానిచే, నానాత్వస్య+ శబ్దభేదము యొక్క, సంజ్ఞానమ్+ఏవ = బాగుగా తెలియుటయే, (భవతి = అగును). అన్యార్థానామ్=ఒక నియతమైన అర్థమును బోధించు శబ్దములకు, అర్థాంతరే = వేరొక అర్థ మందు, జాతు=ఎప్పుడైనను, కథంచన=ఎట్లయినను, వృత్తిః = ప్రవృత్తి, న=కాదు.

తా. అర్థప్రకరణాదులు నానార్థకశబ్దముల శక్తిని నియమించును. అట్లు నియత మైన శక్తివలన, ఎల్లప్పుడును ఏదోఒక అర్థమే తెలియబడుచుండునుగాని, అన్ని అర్థములును ఏకకాలమున తెలియబడవు. కావున అర్థభేదమునుబట్టి శబ్దభేదమును అంగీకరించుటయే న్యాయ్యము.

వి. శబ్దము నానార్థకమైనను, ప్రకరణాదికమువలన ఎప్పుడును ఒకే అర్థము వచ్చుచుండునుగాన, వేరొకఅర్థము కావలసినపుడు వేరొకశబ్దమునే ఆశ్రయించినట్లగును. అందుచే నానార్థకస్థలములలో, అర్థభేదము ననుసరించి, శబ్దభేదమును ఒప్పుకొనుటయే సమంజసమగునను భావము సూచితమైనది. 'అర్థము వేరైనపుడు శబ్దముకూడ వేరుకాక తప్పదు' అనునది ఇచట ముఖ్యమైన యుక్తి. (ధర్మభేదమువలన ధర్మిభేదము సిద్ధించును). అభిధావ్యాపారచర్చ యింతతో ముగిసినది.

ప్రసంగవశమున మరల వాక్య వాక్యార్థ నిర్ణయమును సంగ్రహముగ ప్రదర్శించు చున్నాడు.

పదరూపం తు యద్వాక్య మస్తిత్వోపనిబంధనమ్
కామం విమర్శ స్తత్రాయం న వాక్యావయవే పదే. 408

అస్తిత్వోపనిబంధనమ్ = 'అస్తి' (ఉన్నది) అనుక్రియను బట్టి వాచకముగా సిద్ధించు, పదరూపమ్ = ఒకేపదముగా ఉండు, యత్ = ఏ, వాక్యమ్ = వాక్యముగలదో, తత్ర = ఆ వాక్యము విషయములోనే, అయమ్ = ఈ, విమర్శః = పరిశీలనము, కామమ్ = పూర్తిగా సరిపడును, వాక్యావయవే = అఖండవాక్యముయొక్క అవయవమైన, పదే + తు = పదమందు అయితే, న = సరిపడదు.

తా. 'అర్థభేదమును బట్టి శబ్దభేదమును అంగీకరింపవలయునా? - లేక అక్కర లేదా?' అను మీది విమర్శఅంతయు, గౌః, హరిః, మొదలగు ఏకవాక్యములకే సరిపోవును. 'అస్తి' అనియో, 'నివర్తతే' (పోవుచున్నది) అనియో, ఒకక్రియను చేర్చినందువలన, అవి అఖండవాక్యములు కాగలుగుటయే అందుకు కారణము. సహజమైన అఖండవాక్యముల యొక్క పదములకు మాత్రము, ఈ విమర్శ సంబంధింపదు. అచట వాస్తవముగ పదములు ఉండవు. అపోద్ధారముచే (వేరుచేసి చూపుట) వానిని కల్పింతుము.

వి. క్రియ లేకుండ వాక్యము ఏర్పడదు. స్పష్టముగ క్రియను ఉచ్చరింపక పోయినను అది ఉచ్చరింపబడినట్లే భావింపబడును. ఈ యంశము వెనుక (323వ శ్లోకము) వివరింపబడినది. విశేషక్రియ ఏదియు లేక పోయినను, 'అస్తి' అను సామాన్యక్రియ ఉండు నని వైయాకరణుల సంప్రదాయము. కాగా 'గౌః' అని అనగానే 'అస్తి' అను క్రియ సంబంధించును. దీనినిబట్టి అది అఖండవాక్యమగును. గోశబ్దము నానార్థకము కాన, మీద చూపిన విమర్శమును ఇచట సమన్వయింపవచ్చును. హరిః, ఘటః, వృక్షః, మొదలగు ఇట్టి ప్రయోగములను ఏకపదవాక్యము లందురు.

కర్తృ కర్మ క్రియాదుల నన్నింటిని కలిపి ప్రయోగించిన వాక్యము సహజమైన అఖండవాక్యము. అందు పదములన్నవి కేవలము కల్పితములు కాన, వాని విషయముతో పై విమర్శకు సంబంధ మక్కరలేదు.

'అస్తి' అనునది ఉపలక్షణము (సూచకము), కాన 'నివర్తతే' (మరలును, పోవును) అను క్రియనుకూడ స్వీకరింపవచ్చును. కాగా 'ఘటః' అనగానే, 'అస్తి' అనికాని, 'నివర్తతే' అనికాని ఒక సామాన్యక్రియను భావింపక తప్పదు. ఈ క్రియనుబట్టియే ఘటాది

పదములు అర్థమును బోధించుట సిద్ధించును. ఈ యంశము ముందు (428 శ్లోకము) వివరింపబడును.

'అర్థభేదమునుబట్టి శబ్దభేదము అనగానే, పదములను వేరుగా ఒప్పుకొన్నట్లగును. అట్లయిన అఖండ వాక్యవాదము దెబ్బతినదా?' అను శంకకు ఈ కారిక సమాధానము. 'అఖండ వాక్యవాదమే సిద్ధాంతము. ఏకపదరూపమున కనబడు అఖండ వాక్యములకు మాత్రమే, ప్రకృతచర్చ సంబంధించును' అని సమాధానసారము.

స్ఫోటరూపమైన అఖండవాక్యమే అర్థమును బోధించునని, దృష్టాంతముతో నిరూపించుచున్నాడు.

యథైవానర్థకైర్వర్ణైర్విశిష్టార్థోఽభిధీయతే

పదైరనర్థకైరేవం విశిష్టార్థోఽభిధీయతే . 409

అనర్థకైః=అర్థములేని, వర్ణైః=వర్ణములచే, విశిష్టార్థః=అవ్యక్తమైన అర్థము యొక్క మొత్తము, యథా=ఎట్లు, అభిధీయతే + ఏవ=చెప్పబడునో, ఏవమ్=ఈ విధముగానే, అనర్థకైః=అర్థములేని, పదైః=పదములచే, విశిష్టార్థః=ఆవశ్యకమైన అఖండమైన వాక్యార్థము, అభిధీయతే=చెప్పబడును.

తా. పదములోని వర్ణములకు విడిగా అర్థములేదు. అయినను అవి గుంపుగా ఏర్పడి ఒక ప్రత్యేకమైన అర్థమును ఇచ్చును. అనగా విడివిడి వర్ణములకు ఎట్టి అర్థమును లేకున్నను, క్రమబద్ధములైన వర్ణములే పదముగా సిద్ధించి, ఒక విశేషార్థమును తెలియజేయును. వర్ణముల వలన అభివ్యక్తమైన మొత్తము అర్థమునకు సముదాయము వాచకమగును. ఈ సముదాయమునే "పదస్ఫోట" అందురు.

ఇట్లే వాక్యమందలి పదములకు విడిగా అర్థములేదు. అవి కలియగా ఏర్పడిన (పదములచే అభివ్యక్తమైన) మొత్తము అర్థమునే వాక్యము తెలియజేయును. కావున అఖండార్థమును చెప్పు అఖండ వాక్యమే వాస్తవమగును. దీనినే "అఖండ వాక్యస్ఫోట" అందురు.

వి. "పదస్ఫోటమును అంగీకరించిన మతములో వర్ణములు లేనట్లే, వాక్యస్ఫోటమును తత్త్వముగా స్వీకరించినపుడు, పదములును లేవు." అని దృష్టాంతపూర్వకముగా, అఖండ వాక్యస్ఫోటము సమర్థింపబడినది.

స్ఫోటమనగా నిత్యశబ్దము. 1. వర్ణస్ఫోట. 2. పదస్ఫోట, 3. వాక్యస్ఫోట, 4. వర్ణజాతిస్ఫోట, 5. పదజాతిస్ఫోట, 6. వాక్యజాతిస్ఫోట. 7. అఖండపదస్ఫోట. 8. అఖండ వాక్యస్ఫోట- అని స్ఫోట ఎనిమిది విధములు. వీనిలో అఖండ వాక్యస్ఫోటయే వైయాకరణుల పరమ సిద్ధాంతము. మిగిలినవానిని కూడ ఉపాయభూతములుగాను, ప్రాసంగికముగాను వివరించుచుందురు. స్ఫోటకు సంబధించిన ముఖ్య చర్చ అంతయు మొదటి కాండములో ఉన్నది.

అనర్థకములయినను పదముల ఉనికి వాక్యమందు ఎట్లు సంభవించునో వివరించుచున్నాడు.

యదంతరాలే జ్ఞానం తు పదార్థేషూపజాయతే

ప్రతిపత్తే రుపాయోఽసౌ ప్రక్రమానవధారణాత్ . 410

అంతరాళే=వాక్యజ్ఞానము యొక్కయు, వాక్యార్థజ్ఞానము యొక్కయు మధ్యను, పదార్థేషు=పదముల విషయమందు, పదార్థముల విషయమందును, యత్ = ఏ, జ్ఞానమ్= జ్ఞానము (ఉన్నట్లు అనిపించుట - లేక - తెలిసికొనుట), ఉపజాయతే=కలుగుచున్నదో, అసౌ + తు = ఈ జ్ఞానమైతే, ప్రక్రమానవధారణాత్=తొలుతనే అఖండ వాక్యవాక్యార్థ ముల స్వరూపము నిశ్చయించుట వీలుకాకపోవుట వలన, ప్రతిపత్తేః=అఖండ జ్ఞానమునకు, ఉపాయః=ఉపాయము, (భవతి=అగును).

తా. "పదార్థములు తెలిసినపుడే వాక్యార్థము తెలియును" అని అందరును అందురు. అనుభవము కూడ అట్లే కనబడుచున్నది. అయినను పదమును, పదార్థమును ఉపాయములే కాని వాస్తవములు కావు. "అఖండ వాక్యార్థము" అను తత్త్వమును ప్రారంభ ములోనే గ్రహించి మనసుకు పట్టించుకొనుట, ఎవరికైనను కష్టమే అగును. అందువలన ఆగమ్యమును చేరుటకు పెక్కు ఉపాయములను చూపుచుందురు. పదపదార్థములన్నవి అట్టి ఉపాయములలో ప్రముఖములు. అంత మాత్రమున అవి సత్యములు కానేరవు.

వి. "వాక్యార్థజ్ఞానం పదార్థ జ్ఞానాధీనమ్" (వాక్యార్థమును తెలియుట పదార్థము లను తెలియుటపై అధారపడి ఉండును) అని సామాన్యముగా కొందరు శాస్త్రవేత్త లందురు. వైయాకరణుల మతమున ఈ వచనము కాల్పనికమును, మార్గదర్శకమును అగును.

వాచ్యమగు అర్థమును బట్టియు అఖండత్వమును సాధించుటకు ప్రయత్నించు చున్నాడు.

పూర్వైర్ అర్థైరనుగతో యథార్థాత్మా పరః పరః
సంసర్గ ఏవ ప్రక్రాంత స్తథాఽన్యే ష్వర్థవస్తుషు . 411

పూర్వైః=ముందున్న, అర్థైః = పదముల అర్థములతో, అనుగతః = సంబంధిం చిన, పరః + పరః=వెనుకను ఉండు పదార్థము, యథా=ఏ విధముగా, అర్థాత్మా=వాక్యార్థము, (స్యాత్=అగునో), తథా=ఆ విధముగనే, అన్యేషు = వెనుకను ఉన్న, అర్థవస్తుషు= పదార్థములు, (ప్రతీతేషు=తెలియబడగా), ప్రక్రాంతః=మొదటనే ఉండునట్టి, సంసర్గః + ఏవ=సంబంధమే, అర్థాత్మా=వాక్యార్థముగా, (స్యాత్ = అగును).

తా. 'ఒక వాక్యమున ఉండు పదముల అర్థములు, ఎట్టి సంబంధమును లేకుండ, విడివిడిగా ముందు తెలియబడును. పిదప ఆ పదార్థములు, ఒకదానితో వేరొకటి యోగ్య తానుసారముగా కలిసి, వాక్యార్థముగా మారును. కాగా ముందుపదార్థమును, వెనుక వాక్యా ర్థమును లభించును' అని కొందరందురు.

ఆ విధముగనే "అన్యోన్యము కలిసిపోయిన పదార్థముల రూపముగా భావింపబడు వాక్యార్థమే ముందు లభించును. వెనుక ఆ వాక్యార్థమందే పదార్థములు భాసించుచుండును." అని వైయాకరణులందురు.

వి. "ముందు పదార్థములు, పిదప వాక్యార్థము" అని మీరుచెప్పిన విధముగానే, "ముందు వాక్యార్థము, పిదప పదార్థములు" అని మేము చెప్పుదుము—అను సమన్వయ మిచట అభిమతము. కావున "ముందుగా వాక్యార్థము లభించును" అనునదియే వైయా కరణుల సిద్ధాంతమగును.

వాచకముఖమున (శబ్దమునుబట్టి), అఖండవాక్యార్థములు మూడు విధములుగా ఉండవచ్చునని ఇంతవరకు ప్రపాదింపబడినది.

1. అస్తిక్రియనుబట్టి సిద్ధించు ఏకపదవాక్యము (406 శ్లోకము).

2. అఖండస్ఫోటరూపమైన వాక్యము (409 శ్లోకము).

3. పదములు ఉపాయములుగా ఉండు వాక్యము (410 శ్లోకము).

ఆ విధముగనే వాచ్యముఖమునకూడ (అర్థమునుబట్టి) అఖండవాక్య వాక్యార్థములు మూడు విధములుగా సిద్ధించునని విశదీకరించుటకు, ఈ శ్లోకము బయలుదేరినది.

1. వాక్యార్థమే ముందు చెప్పబడును, (పిదప పదార్థములు కల్పితములగును).

2. క్రియయే వాక్యార్థము.

3. ఎట్టి విభాగములును లేని అఖండార్థరూపమైన ప్రతిభయే వాక్యార్థము.

ఈ మూడువిధములును ఇటుపైని వివరింపబడును: అందు మొదటి విధమును ఈ కారిక ప్రారంభించినది.

"ముందు పదార్థములు, పిదప వాక్యార్థము" అను మతమును "అభిహితాన్వయ వాదము" అని అందురు. దీనిని నైయాయికు లంగీకరించిరి. దీని సార మిది: "అభిహితా నామ్ = చెప్పబడిన పదార్థములకు, అన్వయః = పరస్పరసంబంధము — అభిహితాన్వయః. ఒక వాక్యమున పదములు తమ విడివిడి అర్థములనే ముందుగా చెప్పును. పిదప ఆ కాంక్ష, యోగ్యత మొదలగు పరికరముతో వానికి పరస్పరసంబంధము ఏర్పడును. (కర్త, కర్మ, క్రియ - ఇది ప్రధానము - ఇది అప్రధానము -, ఇది విశేషణము-ఇది విశేష్యము-, మొద లగు సంపూర్ణసంబంధము) ఇట్టి సంబంధమైన అర్థమునే వాక్యార్థమందుము. ఉదా : "కులాలః ఘటం కరోతి". ఈ వాక్యమువలన,"కుండను తయారుచేయుటకు అనుకూలమైన వ్యాపారము గలవాడు కుమ్మరి'' అను బోధ కలుగును. ఇదియే వాక్యార్థము. ఏ ఒక పదమువలనను ఈ యర్థము లభింపదు.''—అని.

పదార్థమును ఒప్పుకొనని వైయాకరణులకు ఈ మతము అభిమతము కాదు. కాన వారు ''అన్వితాభిధానము" అను మతమును స్వీకరించుదురు. ఈ మతమున ''అఖండమగు వాక్యార్థమే'' వాక్యమువలన ముందుగా బోధింపబడును. పిదప సౌకర్యమునకై పదార్థము లను విడదీయుట జరుగును.

దీనిసారమిది: ''అన్వితానామ్ = పరస్పరముసంబంధముగల పదార్థసముదాయము లకే (సమగ్రవాక్యార్థములకే), అభిధానమ్ = చెప్పుట — అన్వితాభిధానమ్" భాష వాక్య రూపము. వ్యవహారమువలన అది వాక్యరూపముగనే సంక్రమించుచుండును. కాన వాక్య మును వినగానే తాత్పర్యవశమున, వాక్యార్థమే ముందుగా తెలియును. తరువాత సౌకర్యము కొరకు, పదార్థములను విడదీసి తెలిసికొందురు. ఉదా: ''రామః గ్రామం గచ్ఛతి'' - ''రాముడు కర్తగను, గ్రామము కర్మగను ఉన్న గమనరూపమైన వ్యాపారము'' అని వాక్యార్థము — అని.

కాగా అన్వితాభిధానమును ఆశ్రయించినందువలన ''అఖండవాక్యార్థమే'' సిద్ధించు నని పర్యవసించును.

అంగీకృతే తు కేషాంచిత్ సాధ్యే నార్థేన సాధనే
ఆధారనియమార్థైవ సాధనానాం పునః శ్రుతిః. 412

కేషాంచిత్ = కొందరి మతమున, సాధ్యేన=సాధింపదగు, అర్థేన = క్రియతోడి సంబంధముచే, సాధనే = క్రియకు ఉపకారకమైన కారకము, అంగీకృతే + తు=సామాన్యరూపమున తప్పకఉండునని అంగీకరింపబడినపుడు, పునః=మరల, సాధనానామ్=కారకముల యొక్క, శ్రుతిః = వినబడుట, ఆధారనియమార్థా + ఏవ=కారకశక్తుల ఆధారమును నియమించుటకే, (భవతి = అగును).

తా. అన్వితాభిధానవాదులు కొందరు ఇట్లందురు: "వాక్యమునందలి మొదటి పదము వలననే, క్రియతో సంబంధించిన పరస్పర సంబద్ధమైన వాక్యార్థమంతయు బోధింపబడును" అని. అట్లు మొదటి పదమువలననే కారకాన్వితమైన క్రియ పూర్తిగా చెప్పబడినచో, వేరుగా కారకములను వాక్యమందుచ్చరించుట వ్యర్థమే అగును. అయినను ఆయా కారకములను వేరుగా చూపుట, వానివాని శక్తుల ఆశ్రయములను నియమించుటకు ఉపయోగించును.

వి. అన్వితాభిధానవాదములోకూడ ఒకవిధమైన రీతిని కొందరు చెప్పినారు. తదనుసారము వాక్యమందలి తొలిపదమే వాక్యార్థమంతను చెప్పును. వాక్యార్థమున క్రియయే ప్రధానము. కారకము లన్నియు పరస్పరసంబద్ధములై క్రియతో అన్వయించును. అట్లు సమన్వితమైవ క్రియ పూర్తిగా, తొలిపదమువలననే తెలిసినపుడు, "వేరుగా కారకపదముల నన్నింటిని చూపుట ఎందుకు?" అను శంక కలుగుట సహజము. ఆ శంకను ఇట్లు పరిహరించుకొనవలెను: క్రియ ఉన్నపుడు కారకము తప్పక ఉండును. కాని ఆ కారకమేదియో తెలియదుగదా: కారకమును స్పష్టపరచుటకే - వేరుగా కారకము ఉచ్చరింపబడును. అనగా సామాన్యరూపముగా అవగతమైపోయిన కారకమును, విశేషరూపముగా ఆయా పదములతో నొక్కిచెప్పుట జరుగును. కాన వానికి వైయర్థ్యము లేదు.

సాధ్యము = సాధింపదగినది—లేక—సాధింపదలచినది. ఇది ఎల్లప్పుడును క్రియయే అగును. సాధనము = సాధించునది = కలిగించునది. అనగా కారకము—క్రియను పుట్టించునది కారకము. ఈ "పుట్టించుట" అన్నది ఒక విధమైన "శక్తి" అని వైయాకరణులందురు. అట్టి శక్తి కలది కారకమగుచుండును. కర్త, కర్మ, కరణము, సంప్రదానము, అపాదానము, అధికరణము, అని కారకము ఆరు విధములు. (కర్తృత్వము, కర్మత్వము మున్నగునవి శక్తులు). తృతీయాది విభక్తులు ఈ కారకములను బోధించును. కారకములేని క్రియ ఉండదు.

సామాన్య వివక్షయందు శక్తి ఒకటే. విశేష వివక్షయందు దాని వైవిధ్యము స్ఫుటమగుచుండును.

ప్రకృత మొక ఉదాహరణము: "రామః దండేన గామ్ ఆనయతి" (రామ కర్తృకమును, దండ కరణకమును, గో కర్మకమును వర్తమానమును అగు ఆనయన రూపమైన క్రియ). ఇచట రామపదమువలననే, వాక్యార్థమంతయు వచ్చుననుట ఒక పద్ధతి. అయినను, కరణ శక్తికి ఆధారము కర్ర, కర్మ శక్తికి ఆధారము గోవు, అని నియమించుటకై కారకములు ఉచ్చరింపబడుచుండు నన్నది తత్త్వము.

ఆధారవిశేష రహితమైన సాధనమును క్రియ ఆక్షేపించదని చెప్పుచున్నాడు.

ఆధారనియమా భావాత్ తదాక్షేపో న విద్యతే
సామర్థ్యాత్సంభవ స్తస్య శ్రుతి స్త్వన్యనివృత్తయే . 413

అధార నియమా భావాత్ = ఆధారవిశేషములయొక్క నియమము కుదరనందు వలన, తదాక్షేపః = ఆధార విశేషములను ఆక్షేపించుట, న + విద్యతే = లేదు (జరుగదు). తస్య = ఆ ఆధారవిశేషమునకు, సామర్థ్యాత్ = సామర్థ్యమువలన, సంభవః = ఉండుట, (భవేత్ = కావచ్చును). శ్రుతిః + తు = మరల కారకములు వినబడుట, అన్యనివృత్తయే = ఇతర కారకములను అడ్డుటకు, (ఉపయుజ్యతే = ఉపయోగించును).

తా. సాధనములులేని క్రియ (సాధ్యము) ఉండదు. కావున క్రియ సాధనమును ఆక్షేపించును (లాగుకొనివచ్చును). అయినను సాధన సామాన్యమునే ('ఏదో ఒకసాధనము' అను భావమును) క్రియ ఆక్షేపించును. విశేషము లేని సామాన్యము కూడ ఉండదు గాన, సాధన విశేషము కూడ ఆక్షిప్తము కావచ్చును. అట్టి విశేషమును విశదీకరించి, విశేషాంతర ములను నివర్తింప చేయుటకొరకే కారక పదములను ఉచ్చరింపవలెను.

వి. కారకశక్తికిని కారకమునకును ఆధారాధేయభావమును చెప్పుదురు. (కారక శక్తి అధేయము. కారకము ఆధారము. ఉదా: "దండేన" అనుచోట కరణత్వ మనునది శక్తి. ఇది ఆధేయము. దండమందా శక్తి ఉన్నది కాన దండము ఆధారము. ఇట్లే ఇతర కారకముల విషయమును కూడ ఊహించునది). క్రియ కారకమును ఆక్షేపించునపుడు సామాన్యాకారముగ (కారకసామాన్యము) ఆక్షేపించును. సామాన్యములో విశేషము ఇమిడి యుండును గాన సామాన్యము విశేషమును కూడ తీసికొనిరాగలుగును. అయినను ఆ విశేషమును స్పష్టపరచుటకై కారకములను చూపక తప్పదు.

మీది కారికకు ఇది అనుబంధము.

''క్రియచేతనే కారక సామాన్యమును, కారక విశేషమును కూడ ఆక్షేపించుటకు వీలున్నది కాన, వాక్యములో కారకములను ఉచ్చరించుట ఎందుకు?'' అను శంకకు ఈ శ్లోకము సమాధానము. "కారకాంతరములను నివర్తింపజేయుటయే ప్రయోజనము" అన్నది సమాధాన స్వరూపము.

"నిర్విశేషం న సామాన్యమ్" అని శాస్త్రీయమగు సంప్రదాయము. "విశేషమును ఇముడ్చుకొనని సామాన్యము ఉండదు" అని దీని అర్థము. ఉదా: గోత్వము (నిఖిల గోవులందును ఉండు ధర్మము) సామాన్యము. కృష్ణ గోత్వము (నల్ల ఆవులందుండు ధర్మము), ధవళ గోత్వము మొదలగునవి విశేషములు. ఇవన్నియు గోత్వమందు అంత ర్భూతములే కదా! ఈవిధముగ సామాన్యధర్మము విశేషధర్మమును కూడ ఆక్షేపించును. కాని దాని ప్రత్యేకతను చెప్పుటకు ఆవశ్యకమైన పదములను తప్పక ఉచ్చరింపవలెను. ఉదా :- "కృష్ణా గౌః, ధవళా గౌః" మొదలగునవి.

అట్లే ''ఈ కారకములే ఈ వాక్యమున ఉండదగినవి. మిగిలినవి ఉండకూడదు'' అనుటకై కారకములను పలుకవలెను.

అన్వితాభిధాన మతము ననుసరించి, అఖండ వాక్యార్థమే మొదట సిద్ధించు నను రీతి ఇంతతో ముగిసినది.

క్రియయే వాక్యార్థ మను భావము నాశ్రయించి మాటాడుచున్నాడు.

క్రియా క్రియాంతరా ద్భిన్నా నియతాధారసాధనా
ప్రక్రాంతా ప్రతిపత్తౄణాం భేదాః సంబోధహేతవః . 414

నియతాధార సాధనా = నియమింపబడిన కర్తృకర్మాది కారకములు గలిగినట్టియు, క్రియాంతరాత్ = వేరొక క్రియనుండి, భిన్నా = వేరైనటువంటిన్ని, క్రియా = ఒకానొక నిర్దేశింపబడిన క్రియయే, ప్రక్రాంతా = మొదట బోధపడును. భేదాః = వాక్యమందలి విశేషములన్నియు, ప్రతిపత్తౄణామ్ = తెలియువారియొక్క, సంబోధ హేతవః = జ్ఞానమునకు ఉపయోగించునవి.

తా. ఏ వాక్యమందైనను క్రియయే వాక్యార్థము. వాక్యమున ఏ క్రియను చూపుదుమో ఆ క్రియ, ఆవశ్యకములైన కారకములను కలుపుకొని, ప్రధానముగా బుద్ధి గోచరమగును. ఇతరవిశేషములన్నియు కేవలము సుఖబోధ కొరకే ఉపయోగించును.

"రామః, దండేన, గామ్, ఆనయతి". ఇచట అనయన క్రియయే వాక్యార్థము. కారకములన్నియు అందులో ఇమిడిపోవును.

ప్రతియొక వాక్యమందును ఒక క్రియ నిర్దేశింపబడును గాన, అది ఇతరక్రియలను నివర్తింపజేయును. అవాంతరక్రియలు ఏవయిన ఉన్నను అవి ప్రధానక్రియయందే లీనమగును.

క్రియ అనునది వ్యాపారరూపము, ఫలరూపమునుకూడ కావచ్చును.
"క్రియయే అఖండవాక్యార్థము" అను రీతిని ఈ కారిక చూపినది.

స్వమతమును అవలంబించి వాక్యార్థమును చూపుచున్నాడు.

అవిభాగం తు శబ్దేభ్యః క్రమవద్భ్యఽపదక్రమమ్
ప్రకాశతే తదన్యేషాం వాక్యం వాక్యార్థ ఏవ చ . 415

తదన్యేషామ్ = మీది రెండు మతములను అంగీకరింపనివారికి, క్రమవద్భ్యః = క్రమముగల, శబ్దేభ్యః = వర్ణస్వరూపములనుండియు, పదస్వరూపములనుండియు, అపదక్రమమ్ = వర్ణములయు పదములయు వరుసలేనటువంటిన్ని, అవిభాగమ్ + తు = ఎట్టిభాగములును లేనటువంటి (అఖండమైన), వాక్యమ్ = వాక్యమున్ను, వాక్యార్థః + ఏవ + చ = వాక్యార్థమున్ను మాత్రమే, ప్రకాశతే = ప్రకాశించును.

తా. వర్ణములకును, పదములకును ఒక వరుసఉన్నట్లు కనబడినను, మొత్తముపై ఎట్టివరుసయు, అవయవములును భాసింపనట్టి అఖండవాక్యమును, అది బోధించు అఖండ వాక్యార్థమును మాత్రమే ఎల్లపుడును గ్రహింపబడుచుండును. ఇది వైయాకరణులమతము.

వి. 1. అన్వితాభిధాన వాదముచే తొలుత లభించునది వాక్యార్థము, 2. క్రియయే వాక్యార్థము, అను ఈ రెండు మతములను వైయాకరణు లంగీకరింపరు. ఈ కారిక వైయాకరణమతమును ప్రతిపాదించినది. దీని సార మిది: "లోకములో మధురపానీయములు ఎన్నో ఉన్నవి. విడివిడి వస్తువుల రసములను ఎన్నింటినో కలిపి ఒక పానీయమును తయారు చేయుదురు. అయినను త్రాగునపుడు ఆ విభాగమేదియు తెలియదు. అఖండరసమే అనుభూతమగును. దీనిని పానకరసన్యాయ మందురు."

అట్లే వాక్యములో వర్ణములును, పదములును, వాని వరుసయు ఉన్నట్లు కనబడి నను, అఖండాకారమైనదే వాక్యమగును. అది బోధించు అఖండార్థమే వాక్యార్థము—అని.

అర్థమునుబట్టి కూడ అఖండవాక్యార్థము సిద్ధించునను చర్చ ఇంతతో ముగిసినది.

అసత్యమైన పదార్థమువలన, సత్యమైన వాక్యార్థము గ్రహింపబడునని పరామర్శించుచున్నాడు.

స్వరూపం విద్యతే యస్య తస్యాత్మా న నిరూప్యతే
నాస్తి యస్య స్వరూపం తు తస్యైవాత్మా నిరూప్యతే. 416

యస్య = దేనికి, స్వరూపమ్ = రూపము, విద్యతే = ఉండునో, తస్య = దాని యొక్క, ఆత్మా = స్వరూపము (సత్యత్వము), న + నిరూప్యతే = బోధింపబడదు. యస్య + తు = దేనికైతే, స్వరూపమ్ = రూపము, న + అస్తి = ఉండదో, తస్య = దానియొక్క, ఆత్మా + ఏవ = స్వరూపమే, నిరూప్యతే = బోధింపబడును.

తా. పదార్థమునకు స్వరూపముండును. అనగా విడివిడి పదముల అర్థములు లోకములో ప్రత్యక్షమగుచుండును (ఉదా: రామః, గౌః, దండః మొదలగువాని అర్థములు). వాక్యార్థమునకు స్వరూపము ఉండదు. అనగా పరస్పర సంబద్ధమైన (ఒక సంబంధముతో ముడివడిన) పదార్థసముదాయ రూపమైన వాక్యార్థము అంతకుముందు (శాబ్దబోధకు ముందు) లేనిదే అగును. కావున వాక్యముచే వాక్యార్థమే బోధింపబడును గాని పదార్థము బోధింపబడదు.

వి. క్రియతో సంబంధించని పదార్థము వ్యవహారయోగ్యము కాదు (ఉదా: రామః అను ఒకే పదమువలన ఏదియు బోధపడదు). క్రియా కారకభావసంబంధము వాక్యము. ఇదియే వ్యవహారయోగ్యము. ఇది వాక్యావస్థకు ముందు ఉండదు. అయినను వాక్యముచే ఇదియే బోధింపబడును.

"పదార్థము అసత్యము, వాక్యార్థము సత్యము. సత్యమైన వాక్యార్థము తెలియుటకు, అసత్యమైన పదార్థమును ఉపాయముగా మాత్రమే వాడుకొందుము" అను తమ సిద్ధాంతమును అనేకరీతులతో గ్రంథకర్త ఇటుపైని వివరించును. ఆ సందర్భమునకు ఇది ప్రారంభము.

గోవుయొక్క బొమ్మను వ్రాసి, దాని మూలమున వాస్తవమైన గోవుయొక్క జ్ఞానమును కలిగింతురు. ఈ రీతిని "రేఖాగవయన్యాయము" అని అందురు. ఈ తీరుననే అసత్యమైన పదార్థమును సాధనముగా పెట్టుకొని, సత్యమైన వాక్యార్థమును బోధింతుము.

స్వరూపముకలది అనగా క్రియాసంబంధములేని కేవలపదార్థము. దీనిని వాక్యము బోధింపదు. స్వరూపము లేనిది అనగా క్రియాసంబంధము కలిగిన వాక్యార్థము (సంబంధమన్నది వాక్యముగా ఏర్పడుటకు ముందు ఉండదు). దీనినే వాక్యము బోధించును.

కేవలపదార్థముల కన్న వాక్యార్థము క్రొత్తదే అగును. అది పదార్థముల సంబంధమును నూతనముగా తీసుకొనివచ్చును. (ఇది కర్త, ఇది కర్మ, ఇది విశేషణము, ఇది అవయవము మొదలగు సంబంధములు). అట్టి సంబంధమే ప్రధానము. అందుకొరకే వాక్యము వినియోగింపబడును.

పదార్థములు వేరుగా ఉన్నట్లు భావించి, అవి అసత్యములని ఈ శ్లోకము సూచించినది.

ఉన్నట్లుగా భాసించు పదార్థముల యొక్క సంసర్గమే వాక్యార్థమని ప్రతిపాదించుచున్నాడు.

అశబ్ద మపరేఽర్థస్య రూపనిర్ధారణం విదుః
అర్థావభాసరూపా హి శబ్దేభ్యో జాయతే స్మృతిః . 417

అర్థస్య = సంసర్గరూపమైన వాక్యార్థముయొక్క, రూపనిర్ధారణమ్ = స్వరూప నిశ్చయము, అశబ్దమ్ = శబ్దమువలన లభింపనిదే - అని, అపరే = మరికొందరు, విదుః = తెలిసికొందురు (చెప్పుదురు). అర్థావభాసరూపా = వాస్తవమైన అర్థముయొక్క అనుభవముతో సమానమైన, స్మృతిః = అర్థముయొక్క స్మరణము, శబ్దేభ్యః = శబ్దముల వలన, జాయతే + హి = కలుగునుగదా!

తా. సంబంధరూపమగు అఖండవాక్యార్థము శబ్దములవలన కలుగనే కలుగదనియు, అది మనస్సుచేతనే తెలియబడుననియు కొందరు తాత్త్వికు లందురు.

మరియు, ఆకాశగుణముగా ఉండు శబ్దములు ఆకాశమందుగాని, ఆకాశ ప్రతీకమైన చెవియందుగాని ఉండును. అర్థములన్నవి ఆయా చోటులం దుండును. ఈ విధముగా శబ్దములకును అర్థములకును మధ్యను కడుదూర మున్నది. కావున శబ్దము అర్థముయొక్క అసలు అనుభవమును కలుగజేయజాలదు. కేవలము అర్థముయొక్క స్మృతిని కలిగించి ఒక విధమైన అర్థముద్రను మనస్సులో వేయుటకుమాత్రమే శబ్దము ఉపయోగించును.

వి. వాక్యార్థమనునది, అఖండమైన స్ఫోటరూపవాక్యముచే సిద్ధించు మానస ప్రత్యక్షమే. పదములయొక్కయు, పదార్థములయొక్కయు ఆవశ్యకత అట్టి మానసిక జ్ఞానమునకు ఉండనేఉండదు.

శబ్దములు అర్థస్మృతికి మాత్రమే ఉపయోగించు సాధనములు.

వాక్యమును వినగనే, మనస్సును ఏకాగ్రము చేసి (లగ్నముచేసి) దాని అర్థమును అఖండ రూపమున గ్రహింతుము. ఈ తీరును "మానసిక నిర్వికల్ప ప్రత్యక్ష జ్ఞానము" (మనసున భావించు విభాగరహితమైన సంసర్గరూప వాక్యార్థము) అని అందురు. ఈ అనుభవమును బట్టి పద పదార్థములు కల్పితములే అనక తప్పదు.

మరొక చిత్రము :- శబ్దము ఉండుచోటు వేరు (ఆకాశము-లేక-చెవి). అర్థము ఉండుచోటు వేరు (ఆయా ప్రదేశము). ఇట్లు శబ్దార్థములకు సామీప్యమే లేదు. కాన శబ్దము అసలు అర్థమును సమర్పింపజాలదు. అర్థాభాసను మాత్రము స్మృతిమూలముగా కలిగించును.

అనగా :- "గౌః" అను శబ్దము చెవిని పడును. అసలు ఆవు ఎక్కడో ఒక ప్రదేశములో ఉండును. గోశబ్దమువలన ఆ ఆవు దగ్గరకు వచ్చి కనబడదు. సంకేతాదుల వలన వెనుక కలిగిన అనుభవమును బట్టి, స్మరణము కలిగి, ఆవుయొక్క చిత్రముమాత్రము మనసులో పడును. ఇది మానస ప్రత్యక్షము. ఇట్టి ప్రక్రియచే శబ్దములు సాయము చేయును. లౌకికముగ జరుగు శబ్దార్థ వ్యవహారమంతయు వాస్తవమున మనోవ్యాపారమే. అట్టి ఆంతరమగు జగత్తుకు సంబంధించినది నిత్య శబ్దము. అదియే అర్థముగ భాసించుచుండును.

వైయాకరణుల శబ్దతత్త్వమును ఈ కారిక మరొకసారి పరామర్శించినది.

అన్యథైవ వాగ్నిసంబంధా ద్దాహం దగ్ధోఽభిమన్యతే
అన్యథా దాహశబ్దేన దాహాద్యర్థః ప్రతీయతే. 418

అగ్నిసంబంధాత్ = నిప్పుయొక్క సంబంధమువలన, దాహమ్ = కాలుటను, దగ్ధః = కాలినవాడు, అన్యథా = వేరొకవిధముగా, అభిమన్యతే = అనుభవించును. దాహశబ్దేన = 'దాహ' అను శబ్దముచే (కాలుట, చురుకుట, మొదలగు శబ్దములు), దాహాద్యర్థః = కాలుట మొదలగు అర్థము, అన్యథా + ఏవ = వేరొకవిధముగానే, ప్రతీయతే = తెలియబడును..

తా. నిప్పును సాక్షాత్తుగ ముట్టుకొన్నచో చేయి కాలును. ఆ అనుభవము వేరు. "దాహ" అను శబ్దమువలన "కాలుట" అను చిత్రము మాత్రము మనసులో పడును. కాని సాక్షాత్తుగ కాలుట ఉండదు, ఈ అనుభవము వేరు. కావున శబ్దార్థములకు వాస్తవమైన సంబంధము లేదు.

వి. బాహ్య జగత్తులోని వస్తురూపమైన అర్థము వేరు. శబ్దమువలన బోధపడు అర్థము వేరు. రెండును ఒకటి కాదు. అట్లయినచో "అగ్ని" అనగానే నాలుక కాలవలసి వచ్చును. అందుచే శబ్దమువలన లభించు అర్థమంతయు బుద్ధి పరికల్పితమే. దానికి వాస్తవమైన ఉనికి లేదు. అట్లే బౌద్ధార్థమునకు, శబ్దమునకును సంబంధము కల్పితమే. కాగా శబ్దార్థముల సంబంధము అసత్యము.

అర్థము బుద్ధి పరికల్పితమన్నపుడు, దానిని బోధించు వైఖరీ రూపమైన శబ్దము గూడ (ధ్వనిరూపము) బుద్ధి పరికల్పితమే అగును. కావుననే ఒక్కొక అర్థమునకు, పెక్కు వైఖరీ శబ్దము లాయా భాషలలో వినబడుచుండును. అందువలన స్ఫోట శబ్దము ఒక్కటే సత్యము. (బాహ్య శబ్దము అసత్యము).

పదార్థాలింగిత మైన వాక్యార్థమే సత్యమని సమర్థించుచున్నాడు.

పృథఙ్నివిష్టతత్త్వానాం పృథగర్థానుపాతినామ్
ఇంద్రియాణాం యథాకార్య మృతే దేహాన్న కల్ప్యతే. 419

పృథక్ = వేరువేరుగా, నివిష్టతత్త్వానామ్ = ఉన్నటువంటి స్వరూపములు గలిగినటువంటివిన్ని, పృథక్ = వేరువేరుగా, అర్థానుపాతినామ్ = విషయములను గ్రహించునటువంటివిన్ని, ఇంద్రియాణామ్ = నేత్రము మొదలగు ఇంద్రియములకు, దేహాత్ + ఋతే = శరీరము లేకుండా, కార్యమ్ = ప్రయోజనము, (తమ తమ విషయములను గ్రహించుట), యథా = ఏవిధముగా, న + కల్ప్యతే = సిద్ధింపదో.

తా. నేత్రము మొదలగు ఇంద్రియముల స్వరూపము వేరు వేరుగా ఉండును. అవి గ్రహించు రూపాది విషయములును వేరు వేరుగానే ఉన్నవి. అయినను శరీరమను ఒక ఆధారమున్నపుడే ఆయా ఇంద్రియములు తమ తమ విషయములను గ్రహించుటకు సమర్థములగును. శరీరము లేనియెడల ఇంద్రియములు నిష్ప్రయోజనములు.

వి. కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మము అనునవి జ్ఞానేంద్రియములు. వీని స్థానములును, స్వరూపములును భిన్నభిన్నములు. రూపము, వాసన, శబ్దము, రుచి, స్పర్శ అనునవి వరుసగా ఆయా ఇంద్రియములు గ్రహించు విషయములు. శరీరమను అధిష్ఠానము ఉన్నపుడే ఇంద్రియములు తమ పనిని చేయగలుగును.

ఈ కారికను దిగువ కారికతో కలిపి సమన్వయము చేయవలెను.

కంటి యొక్క రూపము తైజసము (తేజోవికారము); స్థానము కనుపాప. ముక్కు రూపము పార్థివము (భూమికి చెందినది); స్థానము ముక్కుకొన. చెవి రూపము ఆకాశము; స్థానము చెవిలోని పొర. నాలుక రూపము నీటికి చెందినది; స్థానము నాలుక చివర. చర్మము రూపము వాయువునకు చెందినది; స్థానము శరీరమంతయు.

తథా పదానాం సర్వేషాం పృథగర్థనివేశినామ్
వాక్యేభ్యః ప్రవిభక్తానా మర్థవత్తా న విద్యతే. 420

తథా = ఆ విధముగానే, పృథక్ = వేరువేరుగా, అర్థనివేశినామ్ = అర్థమును బోధించునవి అయినను, వాక్యేభ్యః = వాక్యములనుండి, ప్రవిభక్తానామ్ = వేరుచేయబడిన, సర్వేషామ్ = అన్ని రకములైన, పదానామ్ = పదములకును, అర్థవత్తా = అర్థము కలిగి ఉండుట, న + విద్యతే = ఉండదు.

తా. ఇంద్రియములకు శరీరమువలెనే, పదములకు వాక్యము అధిష్ఠానము. శరీరము లేనపుడు ఇంద్రియములు పనిచేయనట్లుగానే, వాక్యములేనపుడు పదములును పనిచేయవు. వాక్యమువలననే పదములు అర్థవంతములగును. విడగొట్టినచో పదముల కర్థములు ఉండవు.

వి. వాక్యమందలి పదములను వేరుచేయుటయు, వానికి వేర్వేరు అర్థములను చూపుటయు ఉపాయభూతమైన కల్పన మాత్రమే.

పైది సందర్భము సమర్పించిన సారమిది :— "పదపదార్థము లన్నవి భ్రమరూపములు. వాక్యవాక్యార్థములనే, పదపదార్థములన్నట్లు గ్రహించి, భ్రాంతి పడుచుందురు. దీనిని 'అన్యథాఖ్యాతి' అందురు. ఒక వస్తువును చూచి వేరొక వస్తు వనుకొనుట అన్యథాఖ్యాతి అగును. ఉదా:— త్రాటిని చూచి పాము అనుకొనుట. కాగా పదార్థము లున్నట్లు భ్రాంతిని కలిగించుచు, వాక్యార్థమే సత్యమైనదిగా ఉండును."— అని.

వాక్యార్థ స్వరూపమును ప్రతిపాదించుచున్నాడు.

సంసర్గరూపం సంసృష్టే ష్వర్థవస్తుషు గృహ్యతే
నాఽత్రోపాఖ్యాయతే తత్త్వ మపదార్థస్య దర్శనాత్. 421

అర్థవస్తుషు = పదార్థములు, సంసృష్టేషు = పరస్పరము కలిసిపోయినపుడే, సంసర్గరూపమ్ = సంబంధముయొక్క స్వరూపము, గృహ్యతే = తెలియబడును, అత్ర = ఇచట = పదార్థములు వేర్వేరుగా భాసించు సమయములో, అపదార్థస్య = పదార్థములకన్న వేరైన వాక్యార్థముయొక్క, దర్శనాత్ = అనుభవమువలన, తత్త్వమ్ = వాక్యార్థముయొక్క స్వరూపము, న + ఉపాఖ్యాయతే = చెప్పబడదు.

తా. చక్కెర, నీరు, మొదలగు విడివిడి వస్తువులవంటివి పదార్థములు. పానకమువంటిది వాక్యార్థము. అది, పదార్థములు తమ రూపమును పోగొట్టుకొని, ఏకరూపముగా సిద్ధించిన సంబంధరూపము. అది పదార్థములకన్న విలక్షణమైనది. కావున, పదార్థములను భావించు సమయములో, వాక్యార్థమును వివరించుట కుదురదు. అనుభవములో వాక్యార్థమే ఉన్నందున దానిని లేదనుటయు పొసగదు.

వి. "లేనిపదార్థములను ఉన్నట్లు భావించి ఊతగా తీసుకొని వర్ణింపబడునదియు, సంబంధరూపమైనదియు వాక్యార్థము. అనుభవములో ఎల్లప్పుడును అదియే ఉండును. సాథా

త్తుగ మొదటనే వాక్యార్థమును నిరూపించుట శక్యముకాదు గాన, దాని స్వరూపమును వివరించుటకై పదార్థమను భావనను సాయముగా తీసుకొందుము'' అను వైయాకరణుల మతము ఇచట సంగ్రహింపబడినది.

''వాక్యార్థమనగా ఏమి?'' అను శంకకు, ''పదార్థసంబంధమే వాక్యార్థము'' అనియే సమాధానముకాని, వేరొక సమాధానము కుదరదు. ఆ విధముగా పదార్థభావన అవశ్యకమగును. అంతమాత్రమున అది సత్యమని అనుకొనకూడదు.

''అసత్యమైన పదార్థము మూలమున సత్యమైన వాక్యార్థమెట్లు సాధింపబడును?'' అనుశంకకు, సయుక్తికముగ సమాధానమిచ్చుచున్నాడు.

దర్శనస్యాఽపి యత్సత్యం న తథా దర్శనం స్థితమ్
వస్తుసంసర్గరూపేణ తదరూపం నిరూప్యతే. 422

దర్శనస్య + అపి = జ్ఞానముయొక్కయు, సత్యమ్ = సత్యమైన = స్వచ్ఛమైన (పదార్థముల సంపర్కములేని), యత్ = ఏరూపముగలదో, తథా = ఆరూపముగా, దర్శనమ్ = జ్ఞానము, న + స్థితమ్ = లేదు (ఉండదు). అరూపమ్ = రూపములేని, తత్ = ఆ జ్ఞానము, వస్తుసంసర్గరూపేణ = ''వస్తువులసంబంధము'' అను స్వరూపముతో, నిరూప్యతే = వర్ణింపబడును.

తా. ''జ్ఞానము'' అను ఒక పరతత్త్వమున్నది. ఎరుక, తెలివి, అను మాటలతో దానిని చెప్పుదురు. జ్ఞానమునకు వాస్తవమైనరూపము లేదు. సంభవింపదు కూడ. అది రూపరహితము. అయినను వస్తువులను జ్ఞానమునకు విషయముగాచేసి, జ్ఞానస్వరూపమును తెలియజేయుదురు. అనగా, ''గోవిషయక జ్ఞానము'' ''అశ్వవిషయక జ్ఞానము'' అని చెప్పి, గోవు, అశ్వము మొదలగువాని సంబంధమును కలిగించి, ''జ్ఞానమనగా ఏదియో'' తెలియ ప్రయత్నములను చేయుదురు. వాస్తవమున వస్తువులు అసత్యములు, జ్ఞానమేసత్యము. అట్లే రూపములేని కార్యమును నిరూపించుటకు, పదార్థముల సంపర్కమును స్వీకరించుట జరుగును.

వి. పరతత్త్వమునకు సంబంధించిన దృష్టాంతముతో ''వాక్యార్థము సత్యమని'' నిరూపించుట ఈ కారిక యొక్క ప్రయోజనము.

రూపములేని జ్ఞానమునకు లక్షణము చెప్పవలసివచ్చినపుడు, వస్తువును విషయముగా తీసికొనక తప్పదు. అనగా ''వస్తువులు దేనికి గోచరమగునో అది జ్ఞానము''అనవలెను. పరమార్థమున వస్తువులు అసత్యములు, జ్ఞానమే సత్యము.

అట్లే వాక్యార్థమునకు స్వతంత్రమైన రూపములేదు. దానిని నిరూపించుటకై పదార్థములను కల్పించుకొనవలెను. ''పదార్థసంబంధమే వాక్యార్థము'' అని చెప్పవలెను. వాక్యార్థమే నిత్య సత్యమగును.

శబ్దతత్త్వవిదులగు వైయాకరణులకును, అద్వైత వేదాంతులకును, తత్త్వవిచారణ విషయములో పెక్కు పోలికలు ఉన్నవి. మొదటి కాండమున అవన్నియు విశదీకరింపబడినవి. ప్రకృతము, అద్వైత దృష్టాంతముతో శబ్దతత్త్వము మరొకసారి సంగ్రహింపబడినది.

''ఉన్నపదార్థముల లేవనుటయు, వాని సముదాయము తప్ప, వేరుగా ఉండని వాక్యార్థమును ఉన్నది—అదియే సత్యము అనుటయు'' ఎట్లు సమంజసము? ఈ విధానము,

"కుందేటి కొమ్ము అను ప్రయోగమున, ఉన్న కుందేలును లేనిదనియు, లేని కొమ్మును ఉన్న దనియు ప్రతిపాదించినట్లున్నది"—అను శంకకు ఈ కారిక సమాధానము.

దీనిసారమిది: "తత్త్వమును సామాన్యులు తెలియుటకు ఈ మార్గము తప్పదు. వేదాంతవిషయమును చూడుడు: పరబ్రహ్మముతప్ప వేరొక పదార్థము లేదు. ఆ బ్రహ్మము జ్ఞానము. దీనికి సాక్షాత్తుగ "ఇది–ఇట్టిది" అను లక్షణమును ఎవరును చెప్పలేరు. అయినను భ్రాంతిమూలకమైన లౌకికవస్తువులను ఆశ్రయించి, "ఇటువంటిది జ్ఞానము" అని బోధపర తురు. చివరకు మనస్సు ద్వారముననే జ్ఞానము ప్రకాశించి, మనస్సుకూడ లయమైపోవును. జ్ఞానమే మిగులును. భ్రాంతి ఉన్నంతవరకును ఇట్టి నిరూపణములును, ప్రతిపాదనములును అవశ్యకములగుచుండును. సత్యవేత్తలకు ఇవి వ్యర్థములే. ఈ యంశము లన్నియు ఉపని షత్తులలో బహుముఖముగా వర్ణింపబడినవి.

శబ్దతత్త్వము కూడ ఇట్టిదే. అఖండవాక్యము సత్యము. అది అఖండవాక్యార్థముగ భాసించును. దీనికిని రూపము లేదు. కావున పదార్థములను కల్పించుకొని, "పదార్థసంబంధము వాక్యార్థము" అని చెప్పవలసి వచ్చును. తత్త్వము తెలియగానే ఇట్టి ప్రతిపాదన లన్నియు నిష్ప్రయోజనము లగును.

తత్త్వము సూటిగా తెలియ శక్యము కానపుడు, కొన్ని ఉపాయములను ఆశ్ర యింపక తప్పదు గదా!

మరియు జ్ఞానమే లేకున్నచో విషయములైన వస్తువు లసలే ఉండవు. (వానిని నిరూపించుట కుదరదు). అట్లే వాక్యార్థమే లేనప్పుడు పదార్థము ఉనికియే కుదరదు. కాగా "వాక్యార్థము సత్యము గాన, దానినిబట్టియే, పదార్థముల భావన యైనను కుదురును" అని.

వాక్య వాక్యార్థములే వ్యవహార యోగ్యములు అని స్పష్టపరచుచున్నాడు.

అస్తిత్వేనానుషక్తో వా నివృత్త్యాత్మని వా స్థితః
అర్థోఽభిధీయతే యస్మా దతో వాక్యం ప్రయుజ్యతే. 428

అస్తిత్వేన = "అస్తి" అను క్రియతో, అనుషక్తః + వా=కూడినదైగాని, వా=లేక, నివృత్త్యాత్మని= "నాఽస్తి" అను క్రియయందు, స్థితః = అన్వయించినదై కాని, అర్థః = అర్థము, యస్మాత్=ఎందువలన, అభిధీయతే=చెప్పబడునో, అతః = అందువలన, వాక్యమ్=వాక్యమే, ప్రయుజ్యతే=ప్రయోగింపబడును.

తా. కేవలము పదము కాని పదార్థముగాని ప్రయోగార్హముకాదు. అట్టిచోట్ల కూడ "అస్తి" అను క్రియతో గాని, "నాఽస్తి" అను క్రియతో గాని సంబంధము తప్పదు. అయినపుడు అది వాక్యమే అగును.

వి. "వృక్షః" "అశ్వః" మొదలగు ఏకపదమును వాడినచోట్ల కూడ చివరకు "అస్తి" అనియో "నాస్తి" అనియో క్రియను చేర్చనిదే సమగ్రార్థము లభింపదు. ఇట్టిస్థలము లందు పదముల కధ్యాహారమన్నను, అర్థములకు అధ్యాహారమన్నను అధ్యాహారము మాత్రము తప్పదు. ఆ విధముగ అవి వాక్యములే అగుగు.

"అస్తి" "నాఽస్తి" అను క్రియలు ఉపలక్షణములు. "ఏదో ఒక క్రియ" అను భావమును అవి సూచించును. క్రియ లేనపుడు వాక్యము సంపూర్ణము కాదు గదా!

క్రియానుషంగేణ వినా న పదార్థః ప్రతీయతే
సత్యో వా విపరీతో వా వ్యవహారే న సోఽ_స్త్యతః. 424

వ్యవహారే=లోకములోని వాడుకలో, సత్యమైనదికాని, విపరీతః+వా=అసత్యమైనది కాని, పదార్థః=కేవలము పదార్థము. క్రియానుషంగేణ+వినా=క్రియతోడి సంబంధము లేకుండ, న+ప్రతీయతే=తెలియబడదు, అతః=అందువలన, సః=అట్టి పదార్థము, న+అ_స్తి=లేదు.

తా. సత్యము కానిండు-లేక-అసత్యము కానిండు; క్రియాసంబంధములేని పదార్థమన్నది లేదు. క్రియతో సంబంధముగల అర్థమే లోకములో అనుభవసిద్ధముగా ఉన్నది. అది వాక్యార్థమే కావున పదార్థమన్నది లేదు.

వి. పై కారికయు, ఈ కారికయు ఒకే భావమును విశదీకరించును.

లోక వ్యవహారములో వాక్య వాక్యార్థములవలననే ప్రవృత్తి నివృత్తులు బోధపడుచున్నవి. కాన అవియే సత్యములు, పదపదార్థములు కల్పితములు.

పెద్దలనుండి పిన్నలకు భాష సంక్రమించురీతిని లోకవ్యవహార మందురు. అట్లే ఒకరితోనొకరు మాటాడుకొను రీతికూడ వ్యవహారమే అగును. అందు వాక్యవాక్యార్థములకు మాత్రమే, యోగ్యత ఉండునది అనుభవసిద్ధమైన విషయము.

ఒకే పద మెపుడును అర్థవంతము కానేరదని చెప్పుచున్నాడు.

సదిత్యేవ తు య ద్వాక్యం త దభూ ద_స్తి నేతి వా
క్రియాభిధాన సంబంధ మంతరేణ న మన్యతే. 425

సత్+ఇతి+ఏవ="సత్" అను కేవలపదరూపముగానే, యత్=ఏ, వాక్యమ్+తు=వాక్యమైతే కలదో, తత్=దానినికూడ, అభూత్+అ_స్తి + ఇతి = "అభూత్" (ఉండెను) "అ_స్తి" (ఉన్నది) అని కాని, వా=లేక, న—ఇతి=న+అభూత్, న+అస్తి" అని కాని, క్రియాభిధానసంబంధమ్=క్రియావాచకసంబంధము, అంతరేణ=లేకుండ, న+మన్యతే = తెలియజాలడు ("తెలియువాడు" అనునది అధ్యాహారము).

తా. "సత్" (ఉన్నది) అను ఏక పదవాక్యమున్నది. బ్రహ్మమును, సత్యవస్తువును చెప్పుటకు దీనిని వాడుదురు. ఇచట క్రియయొక్క ఆవశ్యకతలేదని సామాన్యముగా అనిపించును. ఈ పదము కేవలము సత్తును (ఉనికిని) బోధించుటయే అందుకు కారణము. అయినను "సత్" అనగానే "అభూత్"—"అ_స్తి" "నాభూత్ — "నా_స్తి" అని ఏదో ఒక క్రియాపదసంబంధము ఉండక తప్పదు. లేకున్న సంపూర్ణభావము తెలియదు.

వి. కేవలము సత్తను బోధించు "సత్" మొదలగు ప్రయోగములలో కూడ, క్రియా సంబంధము లేనిదే అర్థము పూర్తికాదు. కావుననే 'సదేవ — ఆసీత్' 'సదజాయత' (సత్తు ఉండెను—సత్తు పుట్టెను) మొదలగు ఉపనిషత్ప్రయోగములలో క్రియాపదము తప్పక ఉపయోగించబడినది. అందుచే కేవలము పదమునకు (పదార్థమునకు) ప్రయోగార్హత లేదు.

క్రియ ఎల్లపుడును కారకమును ఆక్షేపించుచుండునని చూపుచున్నాడు.

ఆఖ్యాతపదవాచ్యేఽర్థే సాధనోపనిబంధనే
వినా సత్త్వాభిధానేన నాఽకాంక్షా వినివర్తతే. 426

సాధనోపనిబంధనే = సాధనము (కారకము) నిమిత్తముగా గల, ఆఖ్యాత పద వాచ్యే = క్రియాపదముచే చెప్పబడు, అర్థే = అర్థము ప్రతిపాదింపబడినపుడు, సత్త్వాభిధానేన = సాధనమైన ద్రవ్యమును చెప్పుట, వినా = లేకుండ, ఆకాంక్షా = అపేక్ష, న + వినివర్తతే = నివర్తింపదు (శాంతింపదు).

తా. క్రియ సాధ్యము. ద్రవ్యము సాధనము (కారకము). సాధ్యము సాధనమును, సాధనము సాధ్యమును తప్పక అపేక్షించును. ఆ రెండును అవినాభూతములు అనగా ఒకదానిని విడిచి, వేరొకటి ఉండజాలదు. కావున క్రియను చెప్పినపుడు కారకమును చూపవలెను. కారకమును చూపినపుడు క్రియను చూపవలెను. ప్రతియొక వాక్యమందును ఈ విధముగ నియతముగ క్రియాకారకములు ఉండును. లేకున్న ఆకాంక్ష శాంతింపదు (వాక్యార్థము పూర్తికాదు).

వి. క్రియాపదమున్నపుడు కారకపదము ఉండక తప్పదని ఈ కారిక చెప్పినది. దీనినిబట్టి 'కారక పదమున్నపుడు క్రియాపదము ఉండక తప్పదు' అను అంశమును కూడ ఊహించుకొనవలెను. కాగా ఏదయినను, ఒకేపదము వాక్యము కానేరదని సారాంశము. ఈ యంశములు వెనుక చర్చింపబడినవే (326 శ్లోకము). ప్రసంగవశమున మరల ఇచట విశదీకరించబడినవి.

సాధనము అప్రధానము, క్రియయే ప్రధానము అనుటలో ఉపపత్తిని చూపుచున్నాడు.

ప్రాధాన్యాత్తు క్రియా పూర్వ మర్థస్య ప్రవిభజ్యతే
సాధ్య ప్రయుక్తా న్యంగాని ఫలం తస్యాః ప్రయోజకమ్. 427

క్రియా + తు = క్రియయే, ప్రాధాన్యాత్ = ముఖ్యము అగుటవలన, అర్థస్య = వాక్యార్థమునుండి, పూర్వమ్ = ముందుగా, ప్రవిభజ్యతే = వేరుచేయబడును. అంగాని = అప్రధానములైన (అవయవములైన) కారకములు, సాధ్యప్రయుక్తాని = క్రియ సిద్ధించుటకు ఉపయోగించునవి. తస్యాః = ఆ క్రియకు, ఫలమ్ = ఫలము (ప్రయోజనము), ప్రయోజకం = ప్రేరేపించునది (ముఖ్యమైనది), (భవతి = అగును).

తా. వాక్యార్థములో వ్యాపారమే ముఖ్యమైనది; కావుననే దానిని ముందుగా వేరు చేసి చూపుదురు. వ్యాపారము సిద్ధించుటకు అనేకరీతులలో సాయముచేయునవి కారకములు. అవి అప్రధానములు. అన్నిటికన్నను ముఖ్యమైనది ఫలము. అది వ్యాపారమువలన సిద్ధించును.

వి. "దేవదత్తః కాష్ఠైః స్థాల్యాం తండులాన్ పచతి" అను వాక్యము. "దేవదత్తుడు కర్తగాను, కర్రలు సాధనముగాను, గిన్నె ఆధారముగాను, బియ్యము కర్మగాను, ఉన్న జరుగుచున్న వంట అను పని" అని వైయాకరణులమతములో (మీమాంసకమతము కూడ ఇదియే) శాబ్దబోధము కలుగును. దీనిని క్రియావిశేష్యకమైన శాబ్దబోధ అందురు. ఇందు విశేష్యము కాన, క్రియ ప్రధానమగును. కారకములన్నియు క్రియాసిద్ధికై పాటుపడు

నవే గాన విశేషణములై అప్రధానములగును. (క్రియాకారకములకు అవయవావయవిభావ సంబంబంధమని తాత్పర్యము. క్రియ—అవయవి. కారకములు—అవయవములు). వ్యాపారమునకు కూడ, ఉద్దేశించినఫలమే ప్రయోజకమగును. ఎట్టి ఫలమునులేని వ్యాపారము వ్యర్థమగును గదా: పైదివాక్యములో పాకమే (బియ్యము ఉడుకుట) ఫలము. ఇట్లే ప్రతియొక క్రియకును ఒక ఫల ముండును. అదియే వ్యాపారమునకు లక్ష్యము కాన, అన్నింటికన్నను ముఖ్యమగును.

"సాధ్యసాధనములకు పరస్పరాపేక్ష సమానమే గాన, వానిలో ఒకటి ముఖ్యమనియు వేరొకటి అముఖ్యమనియు ఎట్లు చెప్పగలుగుదుము:" అను శంకకు ఈ శ్లోకము సమాధానము.

"గమ్" (వెళ్ళుట) "పచ్" (వండుట) మొదలగు ధాతువులన్నియు వ్యాపారమును బోధించును, దానివలన సిద్ధించుఫలముకూడ, ఆ వ్యాపారమందే ఇమిడియుండును. అందుచేతనే "ఫలవ్యాపారయోః ధాతుః" (ధాతుః = ధాతువు, ఫలవ్యాపారయోః = ఫలమును వ్యాపారమును కూడ బోధించును) అని ధాతులక్షణమును చూపుదురు. కాగా ఫలము పరమ ముఖ్యమని తేలును. (లోకములోని వ్యాపారము లన్నియు, ఏదో ఒక ఫలమును ఆశించియే జరుగుచుండును).

సాధ్య సాధన వ్యవహారము కూడ కల్పితమే అనుచు, మరల "పదార్థము అసత్యమే" అని స్థాపించుచున్నాడు.

ప్రయోక్త్రై వాఽభిసంధత్తే సాధ్యసాధనరూపతామ్
అర్థస్య వాఽభిసంబంధకల్పనాం ప్రసమీహతే. 428

సాధ్యసాధన రూపతామ్ = సాధ్యముయొక్కయు, సాధనము యొక్కయు స్వరూపమును, ప్రయోక్తా + ఏవ = వాక్యమును ప్రయోగించు వ్యక్తియే, అభిసంధత్తే = కల్పించును, అర్థస్య = సాధ్యమును, సాధనమును అయిన పదార్థము యొక్క, అభిసంబంధ కల్పనామ్ + వా = సంబంధకల్పనమును కూడ, ప్రసమీహతే = కోరుకొనును.

తా. వాక్యమున "ఇది సాధ్యము, ఇది సాధనము" అను విభాగము కూడ కల్పనయే. వాస్తవము కాదు. వాక్యమును ఉచ్చరించు వ్యక్తి అట్టి కల్పనను మనసునందు చేసికొనియే, వాక్యమును ఉచ్చరించును. అట్లే పదార్థముల సంబంధమును కూడ అతడే కల్పించును. వాక్యమును వినువ్యక్తియు—విన్నతరవాత, ఆయా పదార్థములను, వాని సంబంధమును కల్పించుకొనియే, వాక్యార్థమును గ్రహించును.

వి. "ఇది సాధ్యము, ఇది సాధనము, ఇది ఈ రెండింటికిని ఉండు సంబంధము" మొదలగు వివేచన అంతయు, వక్తయు బోద్ధయు కల్పించుకొను అసత్యములు. అఖండ వాక్యార్థమే సత్యము. పదపదార్థము లన్నవి అనిర్వచనీయములు).

విశేష విషయములు : ఉన్నదని కాని లేదని కాని, నొక్కి చెప్పుటకు వీలులేని ఒక వస్తువును అనిర్వచనీయమని వేదాంతులు చెప్పుదురు. (అనిర్వచనీయము = వర్ణింప శక్యము కానిది). ఉదా : త్రాటిని చూచి 'పాము' అనుకొన్న సమయములో పాము అనిర్వచనీయము.

'పదపదార్థములు ఇట్టివే' అని శాబ్దికుల ఆశయము.

సాధ్యము, సాధనము, వాని సంబంధమును నియతములు కావని ప్రతిపాదించుచున్నాడు.

పచిక్రియా కరోమీతి కర్మత్వే నాఽభిధీయతే
పక్తేః కరణరూపం తు సాధ్యత్వేన ప్రతీయతే. 429

కరోమి + ఇతి = 'అహం పాకం కరోమి' అను ప్రయోగములో, పచిక్రియా = వంట, కర్మత్వేన = కర్మగా, అభిధీయతే = చెప్పబడుచున్నది. సాధ్యత్వేన = సాధింపదగినది అగుటచే, పక్తేః = పచి క్రియకు, కరణరూపమ్ + తు=సాధనస్వరూముకూడ, ప్రతీయతే= తెలియబడుచున్నది.

తా. ''అహంపాకం కరోమి'' (నేను వంటను చేయుచున్నాను) అనుప్రయోగములో ''వంట'' అను క్రియ "చేయుట" అను క్రియకు కర్మగా ఉన్నది. అనగా ఒకప్పుడు ("పచామి'' అను ప్రయోగమున) ప్రధానముగా ఉండునది, ప్రకృతము అప్రధానముగా మారినది. అట్లే "ఓదనం పచతి'' (అన్నమును వండుచున్నాడు) అను ప్రయోగములో, ''బియ్యము ఉడికి అన్నముగా సిద్ధమగుట'' ఫలము. దీనికి పాక క్రియ ఒక విధముగా "కరణము'' (సాధనము) కూడ అగుచున్నది. ఇట్లు ఒకే పచిక్రియ ఒకప్పుడు, ముఖ్యముగాను, వేరొకప్పుడు కర్మగాను, ఇంకొకప్పుడు సాధనముగాను మారుచున్నది. కావున సాధ్యసాధనాది వ్యవహారము కూడ అనియతము.

వి. ఒకే వస్తువు, ఆయా సందర్భమునుబట్టి అనేకకారకములుగా (సాధనముగా) మారుచుండును. ఉదా: ''పుష్పం విద్యతే" ఇచట పుష్పము కర్త, ''పుష్పం పశ్యతి''ఇచట పుష్పము కర్మ. 'పుష్పేణ పూజ్యతే' ఇచట అది కరణము. "పుష్పే మకరందః అస్తి" ఇచట అది అధికరణము. కావున "ఇది ఈ సాధనము" అని సృష్టిలో ఏ వస్తువును నియతముగా లేదు.

అట్లే "ఇది వ్యాపారము, ఇచే ప్రధానము" అను నియమముకూడ, ఏ వ్యాపారము విషయముననను నిర్దిష్టముగా సంభవింపదు. ప్రసిద్ధమైన పచిక్రియ ఒకచోట కర్మగాను, మరొకచోట కరణముగాను తెలియబడుచుండును గదా !

అట్లే సాధ్యసాధనముల సంబంధము కూడ అనియతమే. ఉదా : ''రామేణ బాణేన హతః వాలీ'' (రాముని బాణముచే వాలి చంపబడెను). ఇచట కర్తయగు రామునకును, హనన క్రియకును ఉండు సంబంధము వేరు. (బాణమును విడుచుట రాముని పని). కరణమగు బాణమునకును, హననక్రియకును ఉండు సంబంధము వేరు. (చచ్చుట అను ఫలమును బాణము సాధించును). అనగా కర్తకు వ్యాపారముతోను, కరణమునకు ఫలముతోను సంబంధమని తాత్పర్యము.

కాగా, సాధనము, సాధ్యము, సంబంధము అనునవి నియతముగా ఉండునవి కావు. కావుననే అవి కల్పితములును, అసత్యములును అగుచున్నవి.

మీది కారిక సూచించిన అంశమును, ఈ కారిక పూర్తిగా వివరించినది.

సాధనత్వాదికము వివక్షాధీనమని వివరించుచున్నాడు.

యోఽసౌ యేనోపకారేణ ప్రయోక్తౄణాం వివక్షితః
అర్థస్య సర్వశక్తిత్వాత్ స తథైవ వ్యవస్థితః 480

యః+అసౌ (అర్థః)=ఏ అర్థము (వస్తువు), యేన=ఏవిధమైన, ఉపకారేణ=సాయముతో, ప్రయోక్తౄణామ్=ప్రయోగించువారిచే, వివక్షితః=బోధించుటకు సంకల్పింపబడినదో, సః=ఆ అర్థము, అర్థస్య=అర్థమునకు, సర్వశక్తిత్వాత్=అన్నివిధములైన శక్తులను ఉండుటవలన, తథా+ఏవ = ఆవిధముగనే (వివక్షించినరీతిగనే), వ్యవస్థితః=నియతమై, (స్యాత్=ఉండును).

తా. కర్తృత్వము, కర్మత్వము, కరణత్వము మొదలగునవి శక్తులనబడును. ప్రతియొక వస్తువునకును ఈ శక్తులన్నియు ఉండవచ్చును, అయినను ప్రయోగించు వ్యక్తి, ఏ శక్తిని బోధింపవలయునని సంకల్పించునో, ఆ శక్తియే అప్పటికి నియతమగును. అనగా ఉద్దేశించిన వ్యాపారములో, ఏది-ఎట్లు-సాయపడునో అను అంశము, ప్రయోక్తచే సంకల్పించబడునుగాన, అది—ఆకారకముగ—అచట నియతరూపమున తెలిసికొనబడును.

వి. మీది కారిక చెప్పిన విషయమునే, మరొక రీతిలో ఈకారిక చెప్పుచున్నది.

"అర్థము" అనగా వస్తువు, విషయము-లేక-అంశము. ఒక వ్యాపారమును, అందు ఒక్కొక్క అర్థము చేయు సాయమును, సంకల్పించియే, వక్త వాక్యమును ప్రయోగించును. దానిని బట్టి ఆ వాక్యములో "ఏది ఏ కారకము" అన్న విషయము నిశ్చయముగా తెలియుచుండును. ప్రతియొక అర్థమును సర్వశక్తిసంపన్నమే అయినను, ఆయా ప్రయోగములలో వక్తృవివక్షను బట్టి ఒక విధమైన వ్యవస్థ కుదురుచుండును. అయినను, "ఈ వస్తువు ఎల్లప్పుడును ఈ కారకమే" అను స్వరూపనియమము లేనందున కారకములు అవ్యవస్థితములే అగును. "కారకములు వివక్షాధీనములే కాని, నియతములు కావు" అని సారాంశము. ఇట్లే సాధ్యరూపమైన అర్థము కూడ వివక్షాధీనమని అభిసంధి.

వస్తువులు సర్వశక్తి సంపన్నములు కావున, వివక్షావశమున వివిధ సంబంధములను సహించుచుండునని నిరూపించుచున్నాడు.

ఆరాద్వృత్తిషు సంబంధః కదాచి దభిధీయతే
ఆశ్లిష్టో యోఽనుపశ్లిష్టః స కదాచిత్ ప్రతీయతే. 481

ఆరాత్=దూరముగా, వృత్తిషు=ఉన్నట్టి వస్తువుల విషయములో కూడ, సంబంధః=పరస్పరసంబంధము, కదాచిత్=ఒకప్పుడు, అభిధీయతే=చెప్పబడును, అశ్లిష్టః=సంబంధముకలదైనను, అనుపశ్లిష్టః=సంబంధము లేనట్టిదిగా, యః=ఏ పదార్థము ఉండునో, సః=ఆ పదార్థము, కదాచిత్=ఒకప్పుడు, ప్రతీయతే=తెలియబడును.

తా. పదార్థముల సంబంధము కూడ అతి విచిత్రమైనది. దూరదూరముగా ఉండి ఎట్టి సంబంబంధమును లేని వస్తువులు, వివక్షావశమున ఒకప్పుడు పరస్పరసంబంధమును పొందును. ఉదా:- "అయోధ్యోజ్జయినీవారాణస్యః భారతదేశే ద్రష్టవ్యాః" (అయోధ్య ఉజ్జయిని, వారాణసి అనునగరములు భారతదేశమున చూడదగినవి) అను ప్రయోగము.

ఇచట వాస్తవమున ఆయా నగరములు ఒకదానికొకటి సుదూరముగా ఉన్నవి అయినను అవి వక్తయొక్క ఇచ్ఛానుసారము, పరస్పర సంబంధమును పొంది ద్వంద్వరూపమున ఒకచోట కూడినవి. అట్లే ఎల్లపుడును కలిసియుండు వస్తువులు, సంబంధము లేనట్లుగా ఒకప్పుడు చెప్పబడుచుండును. ఉదా: "తోయమత్స్యయోః నైకత్వమ్-కింతు మహదంతరమ్" (నీరును చేప ఒకటి కాదు. చాలా భేదమున్నది.) ఇచట నీటిని ఎల్లపుడును ఆశ్రయించి ఉండు చేపకు నీటితో సంబంధము లేనట్లు చూపబడినది. "అస్య రూప మన్యత్, అస్య పాండిత్య మన్యత్" (ఇతని రూపమువేరు. ఇతని పాండిత్యము వేరు) మొదలగు ప్రయోగములలో కూడ ఇట్లే ఊహించునది (వేరు కాకున్నను వేరని వర్ణించుట).

వి. "వస్తువులు సర్వశక్తిసంపన్నములే కాక, సర్వసంబంధశోభితములుకూడ" అని ఈ కారిక చెప్పినది. అనగా లేని సంబంధము ఉన్నట్లుగను, ఉన్న సంబంధము లేనట్లుగను, వివక్షావశమున పదార్థములకు కల్పింపబడుచుండును. ఆలంకారిక ప్రయోగములలో ఇట్టి కల్పనము తరచుగా అనుభూతమగుచుండును. కాగా పదార్థముల సంబంధములును అవ్యవస్థితములే.

సంస్పృష్టానాం వివేకిత్వం సంసర్గశ్చ వివేకినామ్
నానాత్మకానా మేకత్వం నానాత్వం చ విపర్యయే. 482

సంస్పృష్టానామ్=కలిసిఉండు పదార్థములకు, వివేకిత్వమ్=భేదమును (విడివడుట), వివేకినామ్ = విడిగాఉన్న వానికి, సంసర్గః + చ = సంబంధమును, నానాత్మకానామ్ = వేరు వేరు స్వరూపముకలవానికి, ఏకత్వమ్=ఐక్యమును్ను, విపర్యయే=అట్లు కానపుడు, (ఒకటిగా ఉన్నపుడు), నానాత్వమ్ + చ = వేర్వేరురూపమును్ను, (పరికల్ప్యతే = కల్పింపబడును).

తా. పదార్థముల విషయములో మరొక చిత్రమైన తీరుకూడ ఉన్నది.

1. కలిసిఉన్నవానిని విడదీయుట: ఉదా: "మాథురాః పాటలిపుత్రకేభ్యః ఆఢ్యతరాః" (మథురానగరపు జనులు, పాటలిపుత్రనగరపు జనులకన్న ధనవంతులు) ఇచట జనులందరిని మొదట మనసులో కూడగట్టుకొని భావించి, పిదప విడదీయుట జరుగును.

2. విడిగాఉన్నవానికి సంబంధమును కూర్చుట: ఉదా: "దేవదత్తః కాష్ఠైః పచతి" ఇచట విడిగాఉండు దేవదత్తునికిని, కర్రలకును వంట అను ఒక వ్యాపారముతో సంబంధమును కూర్చుట జరుగును.

3. వేరువేరు స్వరూపములు కలవానికి ఐక్యమును సంపాదించుట: ఉదా: "వనమ్". (అడవి). ఇచట మర్రి, రావి, జువ్వి, మొదలగు ఎన్నోరకములచెట్లకు ఒకేపదము ఐక్యమును కలుగజేయును.

4. ఒకే రూపము గలదానికి వేరువేరు రూపములను వర్ణించుట: ఉదా: "రాహోః శిరః" (రాహువుయొక్క శిరస్సు). ఇచట పురాణసంప్రదాయము ననుసరించి రాహువును, శిరస్సును ఒకటే. అయినను భేదము చూపబడినది.

ఇట్టి తీరులన్నియు కేవలము బుద్ధియొక్క కల్పనలు. కాగా పదార్థము లన్నవి కల్పనావిలాసములు (వానిని బోధించుపదములును అట్టివే).

పైన చూపిన తీరు ఎట్లు సంభవమగునో విశదీకరించుచున్నాడు.

సర్వాత్మకత్వా దర్థస్య నైరాత్మ్యా ద్వా వ్యవస్థితమ్
అత్యంతయతశక్తిత్వా చ్ఛబ్ద ఏవ నిబంధనమ్. 483

అర్థస్య = పదార్థము, సర్వాత్మకత్వాత్ = అన్నిశక్తులును, అన్నిరూపములుకలది అగుటవలన గాని, వా = లేక, నైరాత్మ్యాత్ = రూపములేనిదియు, అసత్యమైనదియు అగుట వలనగాని, వ్యవస్థితమ్ = ఆయా విధమున తెలియబడునదిగా ఉండును. అత్యంతయతశక్తిత్వాత్ = నియతమైనశక్తి మిక్కుటముగా గలదగుటవలన, శబ్దః + ఏవ = శబ్దమే, నిబంధనమ్ = ఆయా విధమున అర్థముతెలియుటలో నిమిత్తము, (భవతి = అగును).

తా. వివక్షావశమున ఆయా తీరులో తెలియబడుచు, పదార్థములు అవ్యవస్థితములుగా ఉండుటకు రెండు హేతువులను చెప్పవచ్చును. అవి సర్వశక్తి సంపన్నములగుట మొదటి హేతువు. అవి సర్వథా అసత్యములగుట రెండవ హేతువు.

ఏది ఎట్లయినను, పదార్థముల కట్టి స్థితికలుగుటలో ముఖ్యమైన నిమిత్తము శబ్దమే అనగా వక్తయొక్క ఇచ్ఛానుసారము (ఆయా అర్థములను తెలియుటకు) ప్రయోగించు శబ్దములు మాత్రమే, తమ వ్యాపారముచేతను, ప్రకరణాది పరికరముచేతను, కావలసిన తీరులో అర్థప్రతీతిని కలుగజేయును. కావున వ్యవహారమునకు శబ్దమే ముఖ్య నిమిత్తము.

వి. "పదార్థములున్నవి – అవి సర్వశక్తులును గలవి" అని అన్నను, "పదార్థములు లేవు – అవి కాల్పనికములు" అని అన్నను వాని ప్రతీతి శబ్దమువలన మాత్రమే సాధింపబడును—అని సారాంశము.

"శబ్దార్థములకు సత్యమైన సాక్షాత్సంబంధము లేదు. అర్థమునకు శబ్దము ఉపలక్షణము మాత్రమే" అని చెప్పుచున్నాడు.

వస్తూపలక్షణం శబ్దో నోపకారస్య వాచకః
న స్వశక్తిః పదార్థానాం సంస్ప్రష్టుం తేన శక్యతే. 484

శబ్దః = శబ్దము, వస్తూపలక్షణమ్ = అర్థమునకు ఉపలక్షణముమాత్రమే (సూచించునది). ఉపకారస్య = అసలువస్తువు చేయుపనికి, వాచకః = చెప్పునది, న = కాదు. పదార్థానామ్ = పదార్థములయొక్క, స్వశక్తిః = తమతమ ఉపయోగరూపమైన శక్తి, తేన = ఆ శబ్దముచే, సంస్ప్రష్టుమ్ = స్పృశింపబడుటకు (సంబంధమును కలిగియుండుటకు), న + శక్యతే = వీలుకాదు.

తా. శబ్దము అర్థమును కేవలము సూచించి ఊరకుండును. అట్లే అర్థముగా ఉండు వస్తువు చేయగలిగినపనిని శబ్దము చేయజాలదు. శబ్దమును ఉచ్చరింపగానే అర్థము తెలియుటయు, ఆ అర్థముయొక్క ఉపయోగము తెలియుటయుకూడ అనుమాన ప్రమాణము (ప్రామాణికమైన ఊహ) వలననే సిద్ధించును. కావున శబ్దమునకు అర్థముతోగల సంబంధము కూడ వాస్తవము కాదు.

వి. "శబ్దార్థముల సంబంధముకూడ వాస్తవము కాదు" అని నిరూపించుటకు ఈ సందర్భము బయలుదేరినది. ఒక ఉదాహరణముతో ప్రకృతాంశమును వివరించుకొనవచ్చును. "ఘటః" (కుండ) అనునది శబ్దము. ఘటమను వస్తువు అర్థము. రెండును ఒకచోట

ఉండవు. (శబ్దము వాగ్రూపమున ప్రయోక్తయం దుండును. వస్తువు దూరముగా ఒకచోట ఉండును). అనగా వస్తువును అంటిపెట్టుకొని శబ్దమెప్పుడును ఉండదు. కావున ఆ రెండింటికిని ఎట్టి సంబంధమును లేదు. అయినను ఒక సంకేతరూపమున శబ్దము అర్థమును సూచించును ("కాకేభ్యః దధి రక్ష్యతామ్" అనుచోట కాకశబ్దము పెరుగును తిను జంతువు లన్నింటిని సూచించునట్లుగా). ఈ తీరునే ఉపలక్షణమందురు.

అట్లే ఘటము నీటిని తెచ్చుటకు ఉపయోగించును. "ఘట" అను శబ్దమట్లు ఎన్నడును ఉపయోగింపదు. అనగా అసలు పదార్థము ఏదో ఒక పనిని సాధించును. ఆ అర్థమును చెప్పు శబ్దము మాత్రము అట్టి పనిని చేయజాలదు.

కాగా శబ్దమునకు, అసలు అర్థముతో గాని, అది సాధించుపనితో గాని ఏ విధమైన సంబంధమును కుదరదు. అందుచే శబ్దార్థ సంబంధము వాస్తవము కాదు.

అయితే ఒక వస్తువుయొక్క ఉపయోగమును, అనుమానరూపమైన ఊహచే ఎట్లు తెలిసికొందుమో, అట్లే కల్పితమైన సంకేతమను సూచనను అనుసరించి శబ్దముయొక్క అర్థమును తెలిసికొందుము.

శబ్దార్థముల సంబంధము కల్పితము కావుననే, వైశేషికులు శబ్దమును వేరే ప్రమాణముగా ఒప్పుకొనలేదు. అది అనుమాన ప్రమాణముతో గతార్థమగునని వ్యాఖ్యానించిరి. అనగా "ఈ శబ్దము ఈ అర్థమును బోధించును" అను అంశమును, పొగనుబట్టి నిప్పును ఊహించునట్లుగా, ఊహింపవచ్చునని వారి ఆశయము.

శబ్దార్థములకు వాచ్యవాచకభావము కూడ కుదురదని చెప్పుచున్నాడు.

సంబంధిధర్మా సంయోగః స్వశబ్దే నాభిధీయతే
సంబంధః సమవాయశ్చ సంబంధిత్వేన గమ్యతే. 485

సంయోగః=సంయోగసంబంధము, సంబంధిధర్మా=సంబంధముకల వస్తువుల యొక్క స్వభావము గలదై, స్వశబ్దేన=తన శబ్దముచే, ("సంయోగ" అను శబ్దముచే) అభిధీయతే=చెప్పబడును. సమవాయః=సమవాయమనెడు, సంబంధః+చ=సంబంధము కూడ, సంబంధిత్వేన=సంబంధముగల వస్తువుల స్వభావముచేతనే, గమ్యతే=తెలియబడును.

తా. సంయోగము, సమవాయము అను రెండు సంబంధములకును, ప్రత్యేకమైన స్వరూప మేదియు లేదు. ఆ సంబంధము గల వస్తువుల స్వరూపమే ఆ సంబంధముయొక్క స్వరూపమనియు, అంతకు మించిన రూపము సంభవింపదనియును శాస్త్రజ్ఞులు చెప్పుదురు.

ప్రకృతము, శబ్దమునకును అది బోధించు అర్థమునకును "వాచ్యవాచకభావసంబంధము" ఉన్నదని సామాన్యముగా చెప్పుదుము. కాని అట్టి సంబంధము కూడ శాస్త్రీయముగ కుదురదు.

ఎందుచేతననగా, వాచ్యవాచకభావసంబంధముకూడ సంయోగ సమవాయముల వంటిదే. కాన దానికిని వేరుగా స్వరూపముఉండదు. ఆ సంబంధముగల శబ్దార్థములే దాని స్వరూపమని చెప్పవలసిఉండును. అట్టయిన శబ్దమును, దాని అర్థమును (అర్థమైనవస్తువు)

ఒకేసారి కలిసి కనబడవలెను. అట్లు కనబడుట అనుభవవిరుద్ధము. (శబ్దమును అర్థరూపమును ఒకచోట కలిసిఉండును), ఈ రీతిగా వాచ్యవాచక భావమనునది సంభవింపదు.

వి. "శబ్దార్థములకు వాచ్యవాచకభావసంబంధము కలదు" అని సామాన్యముగా చెప్పు అంశము కూడ సూక్ష్మపరిశీలనకు నిలబడజాలదనియు, అట్టి సంబంధము శబ్దార్థములకు కుదరదనియు—కాన అదియు కల్పనయే అనియును ప్రతిపాదించుటకు ఈ కారిక రచింపబడినది.

ఇచటి తత్త్వ మిది : సంబంధమన్నది రెండు వస్తువులకు చెందిన విషయము. సంయోగము, సమవాయము అని ప్రసిద్ధమైన సంబంధములు రెండున్నవి. విడదీయుటకు వీలైనది సంయోగము. ఉదా: "చేతిలోని పుస్తకము". చేతికిని పుస్తకమునకును ఉన్న సంబంధము సంయోగము (చేతినుండి పుస్తకమును విడదీయగలము). విడదీసి చూపుటకు శక్యముకానిది సమవాయము. ఉదా : 'శరీరముయొక్క చేయి.' (శరీరమునుండి విడదీసి చేతిని చూపలేము. అవయవములకును, అవయవికిని ఉండు సంబంధము సమవాయము). ఈ రెండుస్థలములందును సంబంధమునకు ప్రత్యేకమైనస్వరూపము ఉండదు. సంబంధముగలవానియొక్క రూపమే, సంబంధముయొక్కయు రూపమగునని నిర్వచింతురు. అనగా సంయోగముగల వస్తువుల రూపమే సంయోగస్వరూపము. (చేయి + పుస్తకము=ఇదియే సంయోగరూపము) సమవాయ రూపముకూడ ఇట్టిదే. ఈ అంశమునే "సంబంధము సంబంధిస్వరూపమే" అని శాస్త్రీయముగ చెప్పుదురు. కావున సంబంధమనగానే-ఆ సంబంధముగల రెండువస్తువులును స్పష్టముగా ఒకచోట ఉండక తప్పదు. లేనపుడు సంబంధము లేనట్లే అగును.

ప్రకృతము—శబ్దార్థములకు వాచ్యవాచక భావమను ఒకసంబంధము ఉన్నదని చెప్పినచో, పై విధానముననుసరించి దాని స్వరూపము శబ్దరూపమును, అర్థస్వరూపమును అని చెప్పవలెను గదా ! కాని అది సంభవింపదు. "ఘట" అనునది శబ్దరూపము. "మట్టి కుండ" అనునది అసలు అర్థస్వరూపము. ఈ రెండును ఒకచోట కలిసిఉండవు. సంబంధము వాస్తవముగ ఉన్నచో, ఘటశబ్దమును, దాని అర్థమగు కుండయు ఒకే సమయములో కలిసి ఉండవలెను. అనగా శబ్దమును పలికినవెంటనే దాని అర్థమగు వస్తురూపము కూడ, ప్రక్కనే ఉండును. ఇట్టి తీరు శబ్దార్థముల విషయములో సంభవింపదు అందుచే వానికి వాచ్యవాచక భావము కుదురదు. కాగా అట్టి సంబంధము కూడ కల్పితమే.

"హస్తే పుస్తకమ్" మొదలగు ప్రయోగములలో, "హస్తము. ఆధారముగను, పుస్తకము ఆధేయముగను ఉన్న సంయోగము" అను ప్రతీతి కలుగునుగాన, సంయోగము సంబంధరూపమను జ్ఞానముకూడ కలుగును. "హస్తపుస్తకయోః సంయోగః" మొదలగు ప్రయోగములలో సంయోగము సంబంధిరూపమే అగును. సమవాయవిషయమున కూడ ఇట్లే ఊహించునది.

పదార్థములకు సహజసిద్ధమైన స్వరూపము లేదు. వివక్షను బట్టి అయారూపము గోచరమగుచుండునని వ్యాఖ్యానించుచున్నాడు.

లక్షణా ద్వ్యవతిష్ఠంతే పదార్థా న తు వస్తుతః ।
ఉపకారాత్ స ఏవార్థః కథంచి దనుగమ్యతే. 486

పదార్థాః=శబ్దముయొక్క అర్థములు, లక్షణాత్ = ఒకానొక ధర్మమువలన, వ్యవతిష్ఠంతే=ఆయా రూపముతో నియతములగును. వస్తుతః+తు = సహజరూపమువలన, న=కాదు (న+వ్యవతిష్ఠంతే = నియతములు కావు). ఉపకారాత్ = ఆయా పనికి ఉపయోగించుటవలన, సః=ఆ, అర్థః+ఏవ = నియతమైన అర్థమే, కథంచిత్ = ఎట్లో, అనుగమ్యతే = తెలియబడును.

తా. పదార్థములకు వాస్తవమైన స్వరూపము లేనేలేదు. ఒకానొక విశేషధర్మమును సంకల్పించి—ఒక్కొక్క వ్యుత్పత్తిని చూపుచు, వివిధములైన శబ్దములను ఒకే వస్తువును బోధించుటకు వాడుచుందురు. కావున వివక్షించిన ధర్మమునుబట్టియే పదార్థముయొక్క స్వరూపము భావింపబడుచుండును. అట్లు వివక్షాధీనమైన స్వరూపమే, శక్తిసంపన్నమైనట్లు భావించుకొని, ఆయా కారకముగ స్వీకరింపబడుచుండును.

వి. "పదార్థములకు సహజసిద్ధమైన రూపము లేదు. మనము ఇచ్ఛానుసారము కల్పించినరూపమే ఆయా పదార్థముగ భాసించుచుండును" అని విశదీకరించుటకు ఈ కారిక బయలుదేరినది.

దీని సార మిది: పదార్థమునకు నియతమైన రూపమున్నయెడల, దానిని పురస్కరించుకొని, ఆ రూపమును సూచించుచు, నియతమైన ఒకే శబ్దము ప్రయోగింపబడవలెను. కాని వ్యవహార మట్లు లేదు. ఇష్టమువచ్చిన రూపమును కల్పించుకొని, దానికి తగిన వ్యుత్పత్తిని చూపించి, వివిధశబ్దములను ఒకే వస్తువును బోధించుటకై వాడుచుందురు. అనగా కల్పనానుసారముగ ఒకే వస్తువునకు ఎన్నో రూపములను చూపుచుందురు. పర్యాయశబ్దములను తీసికొని ఈ అంశమును విశ్లేషించుకొనవచ్చును: "ఇంద్రః"=ఇంద్రుడు (ఇందం-రాతి=ఐశ్వర్యమును ఇచ్చువాడు). ఐశ్వర్యము నిచ్చుట ఇచటిరూపము. వజ్రీ (వజ్రమ్, అస్య, అస్తి = వజ్రాయుధము గలవాడు) వజ్రాయుధమును ధరించుట రూపము. గోత్రభిత్ (గోత్రాణి, భినత్తి = పర్వతములను భేదించువాడు) పర్వతములను భేదించుట రూపము. శచీపతిః (శచ్యాః పతిః=శచీదేవి భర్త) శచియొక్క భర్త అగుట రూపము. ఇట్లు ఎన్నో రూపములను కల్పించి, వ్యుత్పత్తులనుచూపి — ఒక అర్థమునుగురించియే వివిధశబ్దములను ఉపయోగించుచుందురు. పదార్థమునకు శాశ్వతమైన రూపమున్నచో, ఇట్టి విధానము కుదరదు.

అట్లే ఏ రూపమును వివక్షించుదురో ఆ రూపమునకే కారకశక్తులను అంటగట్టి ఆయా ఉపయోగములను చూపుదురు. ఉదా: ఇంద్రమ్, ఇంద్రేణ, ఇంద్రాయ, మొదలగునవి. (వజ్రిణమ్, వజ్రిణా, వజ్రిణే మొ॥).

అందుచే పదార్థముల రూపములును, వానిశక్తులును సంకల్పాధీనములు. నియతములు కావు. నియతములు కానందువలననే అవి సత్యములును కానేరవు. (సత్యమైనది ఎప్పుడును మారదు.)

"బహుముఖములైన యుక్తుల మూలమున పదార్థములు అసత్యములు" అను ప్రతిపాదనము ఈ కారికతో ముగిసినది. ఇటుపైని వాక్యార్థవిచారణము చూపబడును.

వాక్యార్థమే సత్యమని నొక్కి చెప్పుచున్నాడు.

వాక్యార్థే యోఽభిసంబంధో న తస్యాత్మా క్వచిత్ స్థితః
వ్యవహారే పదార్థానాం త మాత్మానం ప్రచక్షతే. 487

వాక్యార్థే = వాక్యార్థమందు, యః = ఏ, అభిసంబంధః = పరస్పరసంబంధము గలదో, తస్య = దానియొక్క, ఆత్మా = స్వరూపము, క్వచిత్ = ఎక్కడను, న + స్థితః = లేదు. తమ్ = ఆ వాక్యార్థమును, పదార్థానామ్ = పదార్థములయొక్క, ఆత్మానమ్ = ఆత్మనుగా; వ్యవహారే = సామాన్యవ్యవహారమున, ప్రచక్షతే = చెప్పుదురు.

తా. సంబంధరూపమని భావింపబడు వాక్యార్థముయొక్క స్వరూపస్వభావములను "ఇది" అని మాటలతో నొక్కి చెప్పలేము. 'పదార్థములయొక్క ఆత్మ వాక్యార్థము" అని మాత్రము మామూలుమాటలతో సూచింపగలము.

వి. వాక్యార్థమే సత్యమని ఈ కారిక చెప్పుచున్నది. అఖండమును, నిత్యమును, సత్యమును అయిన వాక్యార్థమును "ఇది ఇట్టు" అని ఎవరును చెప్పలేరు. "సంబంధరూపమనియు, పానకరసమువంటిదనియును" ఏవో ఏవో మాటలతో దానిని సూచించుటయే జరుగును.

అయినను పదపదార్థమూలముగా, వాక్య వాక్యార్థజ్ఞానమును, దానిని బట్టియే ప్రవృత్తినివృత్తులును జరుగుచున్నట్లు లోకములో అనుభమున్నది గాన, తదనుసారము "పదార్థముల ఆత్మయే వాక్యార్థము" అని ఒక నిర్వచనమును చెప్పవచ్చును. ఇది వేదాంతుల ఆత్మ నిర్వచనమును పోలి ఉండును.

లౌకికమగు సామాన్యవ్యవహారమున, ప్రతి శరీరమందును ఆత్మ ఉన్నదనియు, అది ఇంద్రియాదులతో కూడినదనియు, ఒక శరీరమునుండి వేరొక శరీరమునకు పోవుచుండు ననియును— మొదలగు లక్షణములను చెప్పుచుందురు. వానివలన ఒక విధమైన అనుభూతి కలుగుచుండును. కాని అద్వైతవేదాంతము ననుసరించి ఆ లక్షణములన్నియు వ్యావహారిక సత్యములు, పరమార్థసత్యము ఆత్మ ఒక్కటే. దానికి సూటిగా లక్షణములేదు. మనస్సును వాక్కును అచట పనిచేయవు. అది అనుభవైకవేద్యము. "ఇది కాదు. ఇది కాదు" అనుకొనుచు, "అన్నిటికంటెను వేరైనది" అను రీతిలోనే ఆత్మను అనుభవింపవలెను. అనగా "ఏదియు కానిదియు సత్యమైనదియును ఆత్మ" అని ఫలించును. ఉపనిషత్తులన్నియు ఈ విషయములను పెక్కు రీతులలో వివరించినవి.

ఈ అద్వైత వేదాంతుల మార్గమునే వైయాకరణులు ఆశ్రయించినారు. పదపదార్థములు వ్యవహారసత్యములు. వానివలననే లోకవ్యవహారము సిద్ధించుచుండును. వీనిని మాటలతో వర్ణింపవచ్చును. అఖండ వాక్యవాక్యార్థములు పరమార్థ సత్యములు. వానిని మాటలు చెప్పజాలవు. అవి అనుభవైకవేద్యములు. ఏదో ఒక విధమున (జ్ఞానము కలుగుటకు) స్వరూపము చెప్పక తప్పదుగాన, "పదార్థ సంబంధరూపమైనదియు, పదార్థములకు ఆత్మవంటిదియును వాక్యార్థము (దానిని చెప్పునది అఖండ వాక్యము)" అని చెప్పుదురు.

కాగా, లౌకికజ్ఞానము కొరకు, "పదపదార్థములు, వాని సంబంధము, అది వాక్యార్థము" మొదలగు ఎన్ని ఉపాయములను చూపినను, అవన్నియును అసత్యములనియు,

బ్రహ్మపదార్థమువంటి అఖండవాక్యార్థమే (అఖండ వాక్యబోధితము) పరమసత్యమనియు, దానికి లక్షణము మాత్రము లేదనియును శబ్దతత్త్వవిదులు భావింపవలెను.

కల్పితములయిన పదార్థములను బట్టి, వాక్యార్థము సఖండమువలె అగపడుచుం డునని చూపుచున్నాడు.

పదార్థే సముదాయే వా సమాప్తో నైవ వా క్వచిత్
పదార్థరూపభేదేన తస్యాత్మా ప్రవిభజ్యతే . 488

పదార్థే = ఒక పదార్థమందుగాని, వా = లేక, సముదాయే = పదార్థ సముదాయ మందుగాని, వా = లేక, క్వచిత్ = మరెక్కడైన గాని, సమాప్తః = సమాప్తిని పొందినదై (విశ్రమించినదై), న + ఏవ = ఉండనే ఉండదు. పదార్థ రూపభేదేన = పదార్థములయొక్క స్వరూప భేదముచే, తస్య = ఆ వాక్యార్థముయొక్క, ఆత్మా = స్వరూపము, ప్రవిభజ్యతే = విడగొట్టబడును.

తా. సత్యమైన వాక్యార్థము అసత్యమైన పదార్థమందుగాని, పదార్థ సముదాయ మందుగాని విశ్రమింపదు. కేవలము కల్పితమైన పదార్థములనుబట్టి, వాక్యార్థము (అఖండ మైనను) విడగొట్టబడినట్లు భావింపబడును.

వి. వాక్యములోని ఒక పదార్థమందు వాక్యార్థము సమాప్తమగునని ఒక పక్షము. పదార్థ సముదాయమందు అది విశ్రమించునని వేరొక పక్షము. ఈ రెండు పక్షములు కూడ కల్పనలే అనియు, వాక్యార్థము స్వయంపూర్ణమనియు, ఎట్టి భేదభావన అయినను కల్పనా మూలకమే అనియును పరమతత్త్వమును ఈ కారిక వాఖ్యానించినది.

"వాక్యార్థము సమాప్తమగుట" అనగా వాక్యార్థము సంపూర్ణముగా తెలియుట అని భావము. వాక్యమందలి తొలిపదమువలననే, అట్లు జరుగునని కొందరును, పదార్థ సము దాయమువలననే అట్లు జరుగునని మరికొందరును అందురు. ఈ ప్రక్రియ కూడ సౌకర్యము కొరకే ఏర్పడినది. వాస్తవము కాదు.

ఎందుచేతననగా : వాక్యార్థమనునది సిద్ధాంతములో సర్వోపాధిరహితము (ఎట్టి విశేషములును లేనిది). అది సత్యము 'ఇది—అది' అని చెప్ప శక్యముకానిది. పదార్థమనునది విశేషధర్మము. అసత్యము కల్పనచే 'ఇది ఇట్టిది' అని చెప్పశక్యమైనది. కావున సత్యాసత్య ములకు ఎట్టి సంబంధమును సంభవింపదు. (వేరుగా ఉండు వానికే సంబంధము కుదురును).

అయినను వాక్యార్థముయొక్క అనుభవము కలుగుటకు, 'పదార్థసంబంధరూపము వాక్యార్థము' అను కల్పనను మాత్రము చేయకతప్పదు. ఈ కల్పనవలననే అఖండమైనను, సఖండమువలె (భాగములున్నట్లు) వాక్యార్థము భాసించుచుండును.

పై కారిక యొక్క భావమునే స్పష్టపరచుచున్నాడు.

అన్వాఖ్యానాయ యో భేదః ప్రతిపత్తినిబంధనమ్
సాకాంక్షావయవం భేదే తేనాప్య ఉపవర్ణ్యతే . 489

యః = ఏ, భేదః = భేదముగలదో (పదార్థముల భేదము), సః = అది, అన్వాఖ్యానాయ = వాక్యార్థమును చెప్పుటకొరకును, ప్రతిపత్తినిబంధనమ్ = వాక్యార్థము తెలియుటకు నిమిత్తముగను, (భవతి = అగును), తేన = ఆ కల్పితమైన భేదముచే, భేదే =

భేదము కలుగగా, సాకాంక్షావయవమ్=పరస్పరము ఆకాంక్షతో కూడిన పదార్థములు అవయవములుగాగల, అన్యత్=వేరైన వాక్యార్థము, ఉపవర్ణ్యతే=చెప్పబడును.

తా. పదార్థములను విడదీసిచూపుట కల్పనామాత్రము. అది వాని పరస్పర సంబంధమును తెలియజేయుటకును, తన్మూలమున చివరకు అఖండవాక్యార్థమును తెలియ జేయుటకును ఉపయోగించును.

వి. మీది కారికయొక్క భావమును ఈ కారిక మరింత స్పష్టపరచినది.

'అన్యత్' అనగా, కల్పితమైన పదార్థముల మూలముగానే తెలియదగినదియు, పదార్థములకంటె పూర్తిగా వేరైనదియును అని భావము.

సత్యము, అఖండమునగు వాక్యార్థము కల్పిత పదార్థముల మూలమున భిన్న భిన్న ముగ తోచుచుండునని నిరూపించుచున్నాడు.

అనేకశక్తే రేకస్య ప్రవిభాగోఽనుగమ్యతే
ఏకార్థత్వం హి వాక్యస్య మాత్రయాఽపి ప్రతీయతే. 440

ఏకస్య = ఒకటే అయినటువంటిన్ని, అనేకశక్తేః = అనేకార్థములను చెప్పగల శక్తి కలిగినటువంటి, వాక్యస్య = వాక్యమునకు, ప్రవిభాగం = విభాగము, (భేదము) అనుగమ్యతే=కల్పనచే తెలియబడుచున్నది, వాక్యస్య = అఖండమైన వాక్యముయొక్క, ఏకార్థత్వమ్=అఖండార్థమును కలిగియుండుట, మాత్రయా + అపి=ఒక లేశముతో అయినను (చిన్న పదముతో అయినను), ప్రతీయతే + హి = తెలియబడునుగదా!

తా. అఖండవాక్యమే వాచకము. అది స్ఫోటరూపమైన నిర్విభాగమైన నిత్య శబ్దము. దానికి అనేకశక్తు లుండును. అందుచేతనే అట్టి అఖండవాక్యమువలన వివర్తరూపము లైన (సత్యవస్తువు, భ్రాంతిమూలముగా వివిధరూపములతో కనబడుట) అఖండవాక్యార్థ ములు తోచుచుండును. (ప్రకరణాదులనుబట్టి ఏదోఒక అర్థము స్వీకరింపబడుచుండును.) ఇదంతయు కల్పితమైన పదార్థములవలన ఏర్పడు విభాగము.

'వాక్యము అఖండార్థమును బోధించును' అన్న విషయము కొన్నిచోట్ల ఒక పదమువల్లనే తెలియుచుండును.

వి. "వాచకమగు వాక్యమును, వాచ్యమగు అర్థమును అఖండములే. శబ్ద భేదమును, అర్థభేదమును కల్పనామూలకములు" అను అంశమునే మరొక రీతిలో ఈ కారిక వివరించినది. అక్కడక్కడ లౌకికములైన వాక్యములవలన, అనేకార్థములు భాసించుటయు పదార్థ భేదమువలననే (కృతకమైన భేదము) జరుగుచుండుననియు, ప్రకరణాదులమూలముగా తుదకు ఒక అర్థమే నిలబడుననియును సూచింపబడినది. "అనేకార్థములు తోచుటకు మూల కారణము, వాక్యము సర్వశక్తి సంపన్నమగుటయే" అని తెలియవలెను. వ్యవహారములోని అనేకార్థక వాక్యములను, శ్లేషతో కూడిన వాక్యములను కూడ ఈ సందర్భములో ఉదాహరణ ముగా తీసుకొనవచ్చును.

అట్టి వాక్యము ఏకార్థమను అంశమును కొన్నిచోట్ల ఒక పదమే సూచించును.

మీది అంశములకు ఉదాహరణములు :

(1) అనేకార్థకవాక్యము: "సైంధవ మానయ" (భోజన ప్రకరణమైతే "ఉప్పును తెమ్ము" అని అర్థము, ప్రయాణసమయమైతే "గుర్రమును తెమ్ము" అని అర్థము).

(2) శ్లేషవాక్యము : "అజరామరతా అయోధ్యేవ సర్వస్య ప్రియా" (అజ + రామ + రతా = అజ మహారాజునందు శ్రీరామునందును ఆసక్తమైన, అయోధ్యా + ఇవ = అయోధ్యవలె, అజర + అమరతా = జరామరణములు లేకుండుట, సర్వస్య = ప్రతియొకనికిని ప్రియా = ఇష్టమైనది).

(2) ఒక పదము అఖండార్థమును బోధించుట : "సంప్రసారణమ్" అను ఒకే పదము, "య్, వ్, ర్, ల్, అను వర్ణముల స్థానములో వచ్చు ఇ, ఉ, ఋ, ఌ, అను వర్ణములు" అను ఏకార్థమును (వ్యాకరణములో) బోధించును.

"ఇగ్యణః సంప్రసారణమ్" (1-1-45) "యణః స్థానే ప్రయుజ్యమానో యః ఇక్ స సంప్రసారణ సంజ్ఞః స్యాత్" అని వృత్తి. "యణ్ల ప్రసంగములో ప్రయోగింపబడు ఇక్కులు సంప్రసారణ మనబడును" అని అర్థము. ఇచట "ఇక్", "యణః" అను రెండు పదములు బోధించు అర్థమును, "సంప్రసారణమ్" అను ఒకే పదము బోధించుచున్నది: అనగా పదభేదము లేకున్నను, ఏకార్థమును తెలియజేయుచున్నదని భావము.

సత్యమైన వాక్యార్థము బౌద్ధమని ప్రతిపాదించుచున్నాడు.

> సంప్రత్యయార్థా ద్బాహ్యోఽర్థః సన్నసన్వా విభజ్యతే
> బాహ్యీకృత్య విభాగస్తు శక్త్యపోద్ధారలక్షణః . 441

సంప్రత్యయార్థాత్ = బౌద్ధమగు వాక్యమువలన, బాహ్యః = బయటనున్న (లోకములో ఉన్న), అర్థః = పదార్థము, సన్ = ఉన్నదైనను, అసన్ + వా = లేనిదైనను, విభజ్యతే = వేరుగా చేయబడును. బాహ్యీకృత్య = వెలుపల ఉన్నదానినిగా చేసి, విభాగః + తు = వేరుచేయుట అనగా, శక్త్యపోద్ధారలక్షణః = పదార్థముయొక్క శక్తిని, వేరుచేయుటయే (అనిగ్రహింపవలెను).

తా. వాక్యార్థమంతయు బౌద్ధమే, అనగా బుద్ధియొక్క ఆకారమే (బుద్ధిలో ఏర్పడు ఒకవిధమైన ముద్ర) బాహ్యమైన వాక్యార్థమునుండియే వేరుచేసి చూపబడును. అట్లు వేరుచేయుట బాహ్యమైన ఆయా పదార్థములయొక్క శక్తినిబట్టియే (ఉపయోగించు సామర్థ్యము = పనికివచ్చుట) జరుగును.

వి. అఖండవాక్యార్థ మన్నది బుద్ధి రూపమే అనగా, ఏ వాక్యమును విన్నను-దాని వలన ఏకాకారమగు జ్ఞానము కలుగును, ఆ జ్ఞానమే వాక్యార్థము. ఉదా : 'దేవదత్తః దండేన గామ్ ఆనయతి". ఈ వాక్యమువలన "దేవదత్తుడు కర్తగాను, దండము కరణముగాను, గోవు కర్మగాను ఉన్న ఆనయనమను వ్యాపారము జరుగుచున్నది అను బుద్ధిఏర్పడును. అనగా బుద్ధి అట్టి చిత్రముగా (సంస్కారముగా = ముద్రగా) మారును. అచట బాహ్య పదార్థముల సంపర్కము (అసలు వస్తువుల ఉనికి) సంభవింపదు. అట్టి బుద్ధిరూపమైన వాక్యార్థము నుండి, బాహ్య పదార్థములు వేరుచేయబడును. అనగా బౌద్ధ పదార్థమున్ను, బాహ్య పదార్థమున్ను ఒకటే అని భావించి విడదీయబడును. ఉదా: 'దండః, గౌః' = కర్ర, ఆవు,

అనువాని ముద్రలు బుద్ధియందుండును. ఇవి బౌద్ధములు. వాక్యార్థమందిమిడియున్న వీనికి భేదభావన ఉండదు. కర్ర, ఆవు అను భౌతిక వస్తువులు బాహ్యములు. ఈ రెండును ఒకటే అను భావన కలుగును. ఇట్లు విడదీయుటకు ముఖ్య కారణము శక్తిభేదము అనగా ఆయా బాహ్యవస్తువులకుండు, క్రియాజనకమైన శక్తి వేర్వేరుగా ఉండుట. ఉదా : దేవదత్తుడను శరీరధారియే పనిచేయగలడు. భౌతికమైన కర్రయే తోలుటకు పనికివచ్చును. బౌద్ధ పదార్థములకు ఇట్టి శక్తు లుండవు. (అయినను రెండును ఒకటే అనుకొని, వీనికిని శక్తులను అంట గట్టుదురు).

కాగా లౌకికములైన పదార్థములయొక్క శక్తి భేదమును అనుసరించియే, బౌద్ధమైన పదార్థములకును భేదమును కల్పించుదురు. అంతియే కాని బౌద్ధముల కట్టి భేదములేదు' అని సారాంశము.

సన్=ఉండునది. నైయాయికుల మతములో ద్రవ్య, గుణాది పదార్థములకు 'ఉనికి' ఉన్నది. అసన్=లేనిది. విజ్ఞానవాదులగు బౌద్ధులయొక్కయు, అద్వైతవేదాంతులయొక్కయు మతములో పదార్థములకు పరమార్థమున 'ఉనికి' లేదు. వైయాకరణులు వీరికి చుట్టములే.

సంప్రత్యయము, బుద్ధి, విజ్ఞానము—ఇవన్నియు సమానార్థకములే.

ఇచటి తత్త్వ మిది : స్ఫోటరూపశబ్దబ్రహ్మమొక్కటే సత్యము. అదియే వాక్యార్థముగ బుద్ధికి గోచరించును. అందు పదార్థములు లేవు. అయినను, లోకవ్యవహారము సిద్ధించుటకై బాహ్య పదార్థములను విడదీసినట్లు వీనినిగూడ విడదీయుదుము. ఇదంతయు అజ్ఞాన మూలకమే. శబ్దబ్రహ్మానుభవము కలుగగానే, అజ్ఞాన విలసితములైన విషయము లన్నియు నశించిపోవును.

వాక్య విచారణ ప్రసంగమున, పరస్పరము సాకాంక్షములైన వాక్యములకు ఏక వాక్యత గాని, అనేక వాక్యతగాని సంభవింపనగునని మతభేదములను చూపుచు, మొదట సూత్రకారుని ఆశయమును ఉగ్గడించుచున్నాడు.

బహుష్వపి తిఙంతేషు సాకాంక్షే ష్వేకవాక్యతా
తిఙంతేభ్యో నిఘాతస్య పర్యుదాస స్తథార్థవాన్ . 442

తిఙంతేషు = తిఙ్ ప్రత్యయాంతములగు పదములు, బహుషు + అపి = చాలా ఉన్నను, సాకాంక్షేషు = పరస్పరము ఆకాంక్షగలవి అయిన యెడల, ఏకవాక్యతా = ఒకే వాక్యమగుట, (ఇష్టా=అభిమతమైనది), తిఙంతేభ్యః = తిఙంతములకు పరమైన, తిఙంతస్య= తిఙంతమునకు సంబంధించిన, నిఘాతస్య = అనుదాత్త స్వరముయొక్క, పర్యుదాసః = నిషేధము, తథా = ఆవిధముగానే, అర్థవాన్ = అర్థముగలది, (భవతి = అగును).

తా. తిఙంతములనగా క్రియాపదములు (తిప్, తస్ మొదలగు ప్రత్యయములు కలిసిన ధాతురూపములు). ఒక తిఙంతముతో ఒక వాక్యము సామాన్యముగా ఏర్పడును. కొన్నిచోట్ల ఒక వాక్యములోనే, ఒకటిని మించిన క్రియాపదములుండవచ్చును. అంత మాత్రమున ఎన్ని క్రియాపదములున్న- అన్ని వాక్యములని అనుకొన నక్కరలేదు. ఉన్న క్రియా పదములకు పరస్పరాకాంక్ష ఉండి, మొత్తమువాక్యము ఒక క్రియతో సంపూర్ణమైనపుడు, అదంతయు ఒకేవాక్యమని భావింపవలెను. ఉదా : 1. 'గృహే పచతి భవతి' (ఇంటియందు

వంట జరుగుచున్నది). ఇచట 'పచతి' అను క్రియాపదమునకు 'వంట' అనియే అర్థము. 'భవతి' అను ముఖ్యక్రియతో అది సంబంధించుచునుగాన, ఈ వాక్యము ఏకవాక్యమే. 2. 'మృగో ధావతి-పశ్య' (లేడి పరుగెత్తుచున్నది-చూడుము) అనగా 'పరుగెత్తుచున్న లేడిని చూడుము' అని భావము. ఇచటకూడ 'చూచుట' అను ముఖ్యక్రియతో వాక్యము సమాప్తమగును గాన, ఇదియు ఏకవాక్యమే. ఇట్టి భాషీయ ప్రయోగములు సంస్కృతములో అక్కడక్కడ కనబడును. కాగా తిఙంతములు అనేకము లున్నను, అవి సాకాంక్షములైనచో ఏక వాక్యతయే సిద్ధించును.

ఈ విషయమును సూత్రకారుడైన పాణిని సూచించెను. 'తిఙ్ఙతిఙః' (8-1-28) అని సూత్రము. 'అతిఙంతా త్పదా త్పరం తిఙంతం నిహన్యతే' అని వృత్తి. 'వాక్యములో, తిఙంతముకాని పదమునకు ప్రక్కనున్న తిఙంతమునకు, అనుదాత్తస్వరమగును'. అని అర్థము. ఉదా: 'అగ్నిమీశే' (అగ్నిమ్ + ఈశే = అగ్నిని స్తోత్రము చేయుదును) ఇచట 'ఈశే' అను తిఙంతము అనుదాత్తమగును. 'ముందు తిఙంతమున్నపుడు, దాని ప్రక్కనున్న తిఙంతమునకు, అనుదాత్తము రాకుండుటకై 'అతిఙః' అను నిషేధము చెప్పబడినది ('పచతి భవతి' మొదలగుచోట్ల నిషేధము అనభిమతము). ఒక వాక్యమందు రెండవ తిఙంతమునకు ఎన్నడును ప్రయోగమే లేనిచో, ఈ నిషేధము నిష్ప్రయోజనమగును. కావున దీనినిబట్టి, ఒక వాక్యమందు అనేక తిఙంతముల ప్రయోగమునకు అవకాశమున్నదని జ్ఞాపనము చేయబడినది.

అట్లు అనేక తిఙంతములున్నను, ఒక క్రియయే ముఖ్యముగా ఉన్నపుడు, ఏక వాక్యమే అగుననియు, ఒకేతిఙంతమున్నపుడు చిక్కే లేదనియును పాణినియొక్క భావము. కాగా 'కారకములుగాని, తిఙంతములుగాని విశేషణములై, ఒకేక్రియ విశేష్యముగా ఉండు వాక్యము' ఏకవాక్యమే అని సారము.

వి. తిఙంతములను బట్టి వాక్యములకు నానాత్వమా (భేదము)? - లేక - ఏకత్వమా? అను పరిశీలనకై ఈ సందర్భము బయలుదేరినది. పాణిని మతమును ఈ కారిక ప్రతిపాదించినది.

పర్యుదాసము = నిషేధమని భావము. 'తద్భిన్నత్వం తత్సాదృశ్యంచ పర్యుదాసః' అని వచనము. 'అదికానిది-దానితో సమానమైనది' అను అర్థమును పర్యుదాసశబ్దము తెలియజేయును. ప్రకృతసూత్రమున 'అతిఙ్' అనగా, 'తిఙంతము కానిదియు, దానితో సమానమైనదియును అయిన పదము' సుబంతమగును. ఇట్లు తిఙంతము నివారింపబడును.

ఈ సందర్భమున వార్తికకారుని మతమును ఉటంకించుచున్నాడు.

ఏకతిఙ్ యస్య వాక్యం తు శాస్త్రే నియతలక్షణమ్
తస్యాతిఙ్గ్రహణే నార్థో వాక్యభేదా న్న విద్యతే. 448

యస్య + తు = ఎవనిమతములో, శాస్త్రే = వ్యాకరణ శాస్త్రమందు, నియత లక్షణమ్ = నియతమగు స్వరూపముగలదై, ఏకతిఙ్ = ఒకే తిఙంతముగలదై, వాక్యమ్ = వాక్యముండునో, తస్య = అతనికి (అతని మతములో), వాక్యభేదాత్ = అనేక తిఙంతములున్నపుడు వాక్యభేదమే సిద్ధించునుగాన, అతిఙ్గ్రహణేన = 'అతిఙః' అను పదముతో, అర్థః = ప్రయోజనము, న + విద్యతే = ఉండదు.

తా. 'ఏకతిఙ్ వాక్యమ్' (ఒకే ఒక తిఙంతముగలది వాక్యము) అను వాక్య లక్షణమును దృఢముగా అంగీకరించిన వార్తికకారుని మతములో, ఒకటినిమించిన తిఙంతములు గలవి వేరు వేరు వాక్యములే అగునుగాన, 'తిఙ్ఙతిఙః' అను మీదికారికలో చూపిన సూత్రమందు 'అతిఙః' అను పదము అనావశ్యకమే అగును. ప్రతియొక వాక్యమందును ఒక తిఙంతమే ఉండునుగాన, 'తిఙః' అనియే సూత్రమున్నను బాధలేదు.

వి. ఈకారిక వార్తికకారుని మతమును చెప్పును. 'ఏకతిఙ్ వాక్యమ్' అనియు, 'ఆఖ్యాతం సావ్యయకారకవిశేషణం వాక్యమ్' అనియు, రెండు వాక్యలక్షణములను కాత్యాయనుడు చూపెను, (సమర్థః పదవిధిః 2-1-1 సూత్రములోని వార్తికములు). వీనిలో మొదటి వచనముయొక్క అర్థమును పరిశీలించితిమి. రెండవ వచనముయొక్క అర్థమిది : 'యథావకాశముగ, అవ్యయములును, కారకములును, విశేషణములును గల, (వాని అన్వయముగల) ఒకతిఙంతము వాక్యమగును' అని. కాగా ఇది మొదటి లక్షణముయొక్క వివరణమే అగును. వాక్యమందు కారకము తప్పక ఉండవలెను. (క్రియ ఉన్నపుడు కారకము ఉండక తీరదు). అవ్యయమును, విశేషణములును, ఆవశ్యకతను బట్టి ఉండవచ్చును. 'దేవదత్తః ఓదనం పచతి' 'దేవదత్తః మృదు ఓదనం పచతి' 'సః మృదు మధురం ఓదనం పచతి మొదలగునవి ఉదాహరణములు.

ఈ పక్షమందు ఒక వాక్యములో రెండు తిఙంతములు ఉండనే ఉండవుగాన 'అతిఙః' అను పదము వ్యర్థమే (తిఙంతమునకు పరమైన తిఙంతము సంభవింపదు గాన అనుదాత్తస్వరమునకు అతిప్రసక్తి కలుగదు).

కాగా, "మృగోధావతి–పశ్య" మొదలగు చోట్ల, ఏకవాక్యతయే అనునది పాణిని మతమనియు, "మృగః ధావతి"–"త్వం తం పశ్య" అనురీతిలో అవి రెండు వాక్యములనునది కాత్యాయనుని మతమనియును ఫలించును.

కాత్యాయనుడు చూపిన రెండవ వాక్యలక్షణమందు 'ఆఖ్యాతమ్' (క్రియాపదము) అనుచోట ఏకవచనము వివక్షితము కాదనియు ('ఒకటి' అను సంఖ్యను పట్టించుకొననక్కర లేదు), అది సూచనామాత్రమనియును కొందరు వ్యాఖ్యానింతురు. అట్లయినపుడు, అనేక తిఙంతములున్నను ఒక వాక్యమే అగును గాన, పాణిని కాత్యాయనులకు మతభేదము ఏర్పడదు. పతంజలి మాత్రము పాణిని మతమునే సమర్థించెను. (సమర్థః పదవిధిః 2-1-1 సూత్రముయొక్క భాష్యము).

కొందరిమతమున అనేక తిఙంతములుగల వాక్యములలో భేదాభేదములు రెండును కుదురునని సమర్థించుచున్నాడు.

తిఙంతాంతరయుక్తేషు యుక్తయుక్తేషు వా పునః
మృగః పశ్యత యాతీతి భేదాభేదౌన తిష్ఠతః . 444

'మృగః పశ్యత, యాతి + ఇతి = 'మృగః, యాతి, పశ్యత, (లేడి వెళ్ళుచున్నది-చూడుడు) మొదలగు, తిఙంతాంతరయుక్తేషు = ముఖ్యమగు క్రియాపదముతో సంబంధించు మరొక క్రియాపదము గల స్థలములలో, (భేదః + ఇతి = వాక్యభేదమని, కేచిత్ = కొందరు, ఆహుః = చెప్పుదురు).

వా=లేక, యుక్తయుక్తేషు = ఒకతిఙంతముతో సంబంధించు మరొకతిఙంతము గల స్థలములలో, (మృగః, యాతి, పశ్యత, మొదలగునవియే) పునః=కూడ, (అభేదః + ఇతి = భేదములేదని=ఏకవాక్యతయే అని, కేచిత్=కొందరు, ఆహుః=చెప్పుదురు)

భేదాభేదౌ=భేదాభేదములు, న+తిష్ఠతః=వాస్తవముగలేవు. (సూత్రవార్తికకారుల మతములో అట్టిచోట్ల అభేదమే కాని భేదములేదు).

తా. 'మృగః యాతి పశ్యత' మొదలగు ప్రయోగములలో వాక్యభేదమని కొందరి మతము. 'అయం మృగః యాతి' అను మొదటి వాక్యమును, 'యూయం తం పశ్యత' అను రెండవ వాక్యమును అచట ఏర్పడునని వారి ఆశయము. అట్టి ప్రయోగములలో పరస్పరాకాంక్ష ఉన్నందువలన, ఏకవాక్యతే అని మరికొందరి మతము. అనగా 'మృగః యాతి' అనునది, 'పశ్యత' అను క్రియకు కర్మగా మారి, 'యూయం యాంతం మృగం పశ్యత' (మీరు వెళ్లుచున్న లేడిని చూడుడు) అన్నట్లు వాక్యార్థము సంభవించి, అది ఒక వాక్యమే అగునని వీరి అభిప్రాయము.

అయినను పాణిని కాత్యాయనుల మతములో ఇట్టిచోట్ల ఏకవాక్యతయే అని గ్రహింపవలెను.

వి. 'అనేకతిఙంతములు గలవాక్యములలో, పాణిని కాత్యాయనులు ఇరువురికిని, ఏకవాక్యతయే అభిమతము' అను విషయమును సూచించుట ఈ కారికయొక్క ముఖ్య ప్రయోజనము. తదనుసారము కొన్ని పదములను అధ్యాహారము చేసి దీనిని వ్యాఖ్యానించుట జరిగినది.

'తిఙంతాంతర యుక్తేషు' 'యుక్తయుక్తేషు' అను రెండు పదములకును భావమొకటే. ("మృగః," అనుదానితో యుక్తమైనది "యాతి" అనునది. "మృగః యాతి" అనుదానితో యుక్తమైనది "పశ్యత" అనునది).

కాత్యాయనుని రెండవ వాక్యలక్షణమునకు, ఏకవాక్యతయందే తాత్పర్యమని మీది కారికలోనే సూచితమైనది. "ఏకతిఙ్ వాక్యమ్" అను మొదటిలక్షణమునకు కూడ, అట్టి తాత్పర్యమును సాధింపవచ్చును. "ఏకం తిఙ్—తిఙంతం=ప్రధాన తిఙంతం, యస్య—తత్=ఏక తిఙ్=ముఖ్యమైన ఒక తిఙంతముగలది వాక్యము" అని అర్థమును చెప్పినచో, అప్రధానమైన మరొక తిఙంతమున్నను, అది ఏకవాక్యమే అగునని పర్యవసించును. ఇట్లు కాత్యాయనుని ఆశయమును, పాణిని ఆశయమును ఒక్కటే అగును. (వాక్యభేదమును చెప్పువారు వైయాకరణులు కాక, వేరొకరు అగుదురు).

కష్టపడి అయినను, వ్యాకరణ ప్రవర్తకులగు ఆచార్యులకు, ఐకమత్యమును చూపుట శాస్త్రమర్యాద అని తెలియునది.

"వాక్యములకు భేదమా? అభేదమా? అను చర్చ ఇంతతో ముగిసినది.

ఏకవాక్యతగాని, అనేకవాక్యతగాని, వాక్యపరిసమాప్తి జ్ఞానమువలన సంభవించును. అట్టి వాక్యసమాప్తియు శబ్దస్వరూపమువలననే తెలియదగినదని వివరించుచున్నాడు.

ఇతికర్తవ్యతార్థస్య సామర్థ్యాద్ వ్యస్య కాంక్ష్యతే
అశబ్దలక్షణాకాంక్షం సమాప్తార్థం తదుచ్యతే. 445

యస్య = ఏ వాక్యముయొక్క, అర్థస్య = అర్థముయొక్క, సామర్థ్యాత్ = అర్థ స్వభావమువలన, ఇతికర్తవ్యతా = 'ఇది ఇట్లు చేయవలెను' అను పద్ధతి, కాంక్ష్యతే = కోర బడు చుండునో, అశబ్దలక్షణాకాంక్షమ్ = శబ్దముల అపేక్షలేని, తత్ = ఆ వాక్యము, సమాప్తార్థమ్ = సంపూర్ణమైన అర్థముగలదని, ఉచ్యతే = చెప్పబడును.

తా. అవశ్యకములైన శబ్దములన్నియు ఉండి, (ఉచ్చరింపబడినవి-లేక-అధ్యా హృతములైనవి) నిరాకాంక్షమైన అర్థమును బోధించునది వాక్యము. దానివలన తెలియు అర్థమును, 'ఎట్లు చేయవలెను ?'- లేక 'ఎట్లు సమకూర్చవలెను?' అను రీతియు, అందు కొరకు కావలసిన సామగ్రియు చెప్పనక్కర లేకుండగనే తెలిసిపోవుచుండును. అట్లు అవ గతమగుట వాక్యార్థముయొక్క స్వభావము. ఉదా: 'త్వం విపణిం గత్వా తండులాన్ ఆనయ' (నీవు అంగడికిపోయి బియ్యమును తీసుకొనిరమ్ము) ఇది నిరాకాంక్షమైన వాక్యము. దీనివలన సమగ్రార్థము తెలియును. ఇచట బస్సు ఎక్కుటయు, బజారులో దిగుటయు, బియ్యమును గోనెలో వేయుటయు, మొదలగు పనులెన్నో ఉండును. అయినను అవన్నియు చెప్పనక్కర లేకుండగనే ఈ వాక్యార్థమువలన తెలిసిపోవును. ఇది స్వభావము. కావున ఇట్టి ఆకాంక్షలు ఉన్నను సాకాంక్షమును స్పష్టముగా చెప్పినందువలన, ఇది వాక్యమే అగును.

వి. 'శబ్దమునుబట్టియే వాక్యసమాప్తి అగును. అర్థమునుబట్టి కాదు. అందుచే శబ్దాకాంక్ష లేనపుడు- అది సమగ్రవాక్యమే అగును. అర్థమునకు సంబంధించిన విశేషాంశ ములు ఎన్నిఉన్నను ఇబ్బందిలేదు. అవి అవగతమగుచునే ఉండును. అనగా ఉద్దేశించిన ముఖ్యమగు అర్థమును, నిస్సంశయముగా బోధించు శబ్దములు (కారకము, క్రియాపదము మొదలగునవి) ఉండుటయే వాక్యమునకు ముఖ్యలక్షణము. ఆ అర్థమునకు చెందిన వివరము లన్నియును శబ్దముల సాయమక్కర లేకుండగనే స్ఫురించును' అనునది సారము.

ఇతికర్తవ్యతా = 'ఇది ఇట్లు చేయవలెను' అను ప్రక్రియ.

వాక్యప్రసంగవశమున, వాక్యపరిసమాప్తిని, మరల మరొకతీరులో ఈ కారిక పదామర్శించినది. 'వాక్యసమాప్తి అన్నది శబ్దాశ్రితమేకాని, అర్థాశ్రితము కాదు'. అన్నది ఇచట తత్త్వము. ప్రతియొక వాక్యమునకును ఈ తీరు వర్తించును. అన్నిచోటులందును అర్థమునకు సంబంధించిన వివరములను అన్నింటిని శబ్దములతో చెప్పుటయు, సంశయనివృత్తి కలుగుటయు శబ్దార్థస్వభావములకును, అనుభవమునకును విరుద్ధములుగదా!

పై విషయమునే స్పష్టపరచుచున్నాడు.

> తత్త్వాన్వాఖ్యానమాత్రే తు యావా నర్థోఽనుషజ్యతే
> వినాపి తత్ప్రయోగేణ శ్రుతే ర్వాక్యం సమాప్యతే. 446

తత్త్వాన్వాఖ్యానమాత్రే + తు = సారభూతమైన అర్థమును చెప్పగానే, యావాన్ = ఎంత (ఎన్ని రకములైన), అర్థః = అర్థము, అనుషజ్యతే = అనుబంధముగా స్ఫురించునో, తత్ప్రయోగేణ = ఆ అర్థమును బోధించు శబ్దములయొక్క ఉచ్చారణము, వినా + అపి = లేకున్నను, శ్రుతేః = శబ్ద వ్యాపారముయొక్క సామర్థ్యము వలన, వాక్యమ్ = వాక్యము, సమాప్యతే = పూర్తి అగును.

తా. వాక్యముయొక్క సారాంశము తెలియగానే అర్థమునకు సంబంధించిన వివరములన్నియు తెలిసిపోవును. వానికొరకు వేరుగా శబ్దములను వాడనక్కరలేదు. అట్లు తెలియుట వాక్యముయొక్క సామర్థ్యమువలన (అభిధా వ్యాపారమువలన) జరుగును. ఉదా: 'వ్రీహయః అవహన్యంతామ్' (ధాన్యమును దంచవలయును). ఇచట ధాన్యమును దంచుట' సారాంశము. రోలు తెచ్చుట, రోకళ్ళు తెచ్చుట, రోటిలో ధాన్యమును పోయుట, రోకళ్ళను ఆడించుట మొదలగునవన్నియు విశేషాంశములు. ఇవన్నియు ఈవాక్యమువలననే తెలిసి పోవును. కావున వాక్య సమాప్తి శబ్దాశ్రితమే అగును.

వి. మీదికారిక చెప్పిన విషయమును ఇది స్పష్టపరచినది.

శబ్దస్వభావమును బట్టి అర్థమువిషయమున గుణప్రధానభావము ఏర్పడునని తెలుపుచు, శబ్దస్వభావమును ప్రతిపాదించుచున్నాడు.

చంక్రమ్యమాణోఽధీ ష్వాత్ర జపం శ్చంక్రమణం కురు
తాదర్థ్య స్యాఽవిశేషేఽపి శబ్దా ద్భేదః ప్రతీయతే. 447

'చంక్రమ్యమాణః=పచారుచేయుచు, అధీష్వ = జపము చేయుము', 'జపన్ = జపముచేయుచు, చంక్రమణమ్ = పచారుచేయుటను, కురు = చేయుము'— అత్ర = ఈ రెండు వాక్యములందును, తాదర్థ్యస్య = ఒకే అర్థమును బోధించుట, అవిశేషే+అపి = సమానమైనను, శబ్దాత్=శబ్ద స్వభావమును బట్టి, భేదః=ఒకటి ముఖ్యము, ఒకటి అముఖ్యము అను భేదము, ప్రతీయతే=తెలియబడును.

తా. అర్థము ఒకటే అయినను శబ్ద స్వభావమును బట్టి (శబ్దములను ప్రయోగించు తీరునుబట్టి), అర్థమునకు సంబంధించిన గుణ ప్రధాన భావము (అముఖ్యము-ముఖ్యము అను విషయము) విశదమగుచుండును. ఉదా: (1) "పచారు చేయుచు, జపింపుము" (2) 'జపించుచు, పచారుచేయుము' ఈ రెండు వాక్యములయొక్కయు సారార్థమొకటే (పచారు, జపము అను రెండు పనులను చేయుట) అయినను మొదటి వాక్యములో 'పచారు చేయుట అముఖ్యము, జపించుట ముఖ్యము అనియు, రెండవ వాక్యములో 'జపించుట అముఖ్యము, పచారుచేయుట ముఖ్యము' అనియు బోధపడును. ఇట్టి వైచిత్ర్యము శబ్ద స్వభావమును బట్టియే సిద్ధించుచుండును.

వి. కల్పితములైన పదార్థములను బోధించు శబ్దములయొక్క, అర్థబోధనా వైచిత్రిని చూపుటకు ఈ కారిక బయలుదేరినది.

'అర్థమొకటే అయినను, అందలి గుణప్రధాన భావమును శబ్దవిన్యాసము (శబ్ద వ్యాపారము) స్పష్టపరచును' అని ఫలించినది.

కొన్నిచోటులందు శబ్దభేదమున్నను సామర్థ్యమువలన అర్థప్రతిపాదనము విచిత్రముగ నుండునని చెప్పుచున్నాడు.

ఫలవంతః క్రియాభేదాః క్రియాంతరనిబంధనాః
అసంఖ్యాతాః క్రమోద్దేశై రేకాఖ్యాతనిదర్శనాః. 448

ఏకాఖ్యాత నిదర్శనాః = ఒకే క్రియాపదమువలన బోధింపబడునటువంటివిన్ని, క్రమోద్దేశైః=అనుసరింపదగినరీతుల చేతను, పొందగోరు ఫలములచేతను, అసంఖ్యాతాః =

లెక్కించుటకు శక్యము కానటువంటిన్ని, ఫలవంతః = ఫలభేదమును పురస్కరించుకొన్న, క్రియాంతర నిబంధనాః = ఉపకారకములగు చిన్న చిన్న అవాంతర క్రియలు కలిగినటు వంటిన్ని, క్రియాభేదాః = వ్యాపారభేదములు, (ప్రతీయంతే = తెలియబడుచుండును).

తా. కొన్ని వాక్యములందు క్రియాపదము ఒక్కటే ఉన్నను, దానివలన తెలియు అర్థముయొక్క సామర్థ్యమును బట్టియు, స్వభావమును బట్టియు, అవాంతర క్రియలును, వానియొక్క ప్రయోజనములును లెక్కలేనన్ని స్ఫురించి అవగతములగుచుండును. ఒకే క్రియను బోధించు వేర్వేరు ధాతువులను ప్రయోగించినను ఇట్టి తీరు సంభవించును.

వి. శబ్దముయొక్క సామర్థ్యమువలన (శబ్దవ్యాపారమువలన) కలుగు అర్థవైచిత్రిని మీదికారిక చూపినది. శబ్దభేదమున్నను, లేకున్నను దాని అర్థముయొక్క స్వభావము వలన, లెక్కకుమించిన మరికొన్ని అర్థములు శబ్దములను వాడనక్కర లేకుండగనే-తెలియు చుండునని ఈ కారిక చెప్పుచున్నది. వాక్యమందలి క్రియాపదమును ఆధారముగా తీసుకొని ప్రకృతాంశము విశదీకరింపబడినది. ఉదా: 'సోమేన యజతే' (సోమయాగమును చేయు చున్నాడు) 'చిత్రయా యజతే' (చిత్రయాగమును చేయుచున్నాడు) 'దర్శపూర్ణమాసాభ్యాం యజతే' (దర్శము, పూర్ణమాసము, అను కర్మలను అచరించుచున్నాడు) ఇవి కర్మకాండకు సంబంధించిన వాక్యములు. వీనిలో 'యజతే, యజతి' అను క్రియాపదములు సమానార్థక ములు. 'యాగం కరోతి' అని మరొకరీతిలో చెప్పినను అర్థమొకటే. అయినను ప్రతియొక కర్మ విషయములోను, చేయురీతులు, వానిని సూచించువ్యాపారములు, అవాంతరఫలములు, ప్రధానఫలము మొదలగునవి ఎన్నో ఉండుట సహజము. అవన్నియు 'యజతే' అను ఒక క్రియాపదముయొక్క అర్థమువలననే తెలిసిపోవును. అది అర్థస్వభావము.

లౌకికోదాహరణమును చూడుడు. 'ఉపాధ్యాయుడు ధనమును సంపాదించు చున్నాడు'. 'వైద్యుడు ధనమును సంపాదించుచున్నాడు'. 'వర్తకుడు ధనమును సంపాదించు చున్నాడు.' ఈ వాక్యములందు "ధనసంపాదనము" ఒక్కటే వ్యాపారము. అయినను ఆ యా వ్యక్తులు అనుసరించు మార్గములును వారు అనుకొన్న ప్రయోజనములును ఎన్నో ఉండును. అవన్నియు 'సంపాదించుచున్నాడు' అను క్రియవలననే అవగతమగును. వాని కొరకు వేరుగా శబ్దములను వాడనక్కరలేదు.

'శబ్దము యొక్కయు, అర్థముయొక్కయు స్వభావము అతివిచిత్రమైన' దని సారాంశము.

పై అంశమునే విశదీకరించుచున్నాడు.

నివృత్తభేదా సర్వైవ క్రియాఖ్యాతేఽభిధీయతే
శ్రుతే రశక్యా భేదానాం ప్రవిభాగప్రకల్పనా . 449

సర్వా = ప్రతియొక, క్రియా = వ్యాపారము, నివృత్త భేదా + ఏవ = భేదములు లేనిది అగుచునే, ఆఖ్యాతే = క్రియాపదముచే, అభిధీయతే = చెప్పబడును. భేదానామ్ = భేదములయొక్క, ప్రవిభాగప్రకల్పనా = విభాగమును చూపుట, శ్రుతేః = క్రియాపదమును విన్నంత మాత్రమువలన, అశక్యా = శక్యము కానిది (అలవి కాని పని).

తా. ఒక వ్యాపారములో అవాంతర వ్యాపారములు ఎన్నో ఇమిడియుండును. వానినన్నింటిని క్రియ ముక్తకంఠముగా చెప్పదు. క్రియాపద మేది అయినను వ్యాపార సామాన్యమునే చెప్పును. దానివలన విశేషాంశము లన్నియు పూర్తిగా తెలియుచుండును. అది అర్థ స్వభావము. ఉదా: 'పచతి'. ఇచట బియ్యమును బాగుచేసి గిన్నెలోవోయుట మొదలు కొని, పొయ్యినుండి గిన్నెను దింపువరకును, మధ్యను ఎన్నో వ్యాపారము లుండును. అవి అన్నియు 'వంట' అను వ్యాపారమువలననే తెలిసిపోవును.

వి. పైకారికను ఈ కారిక స్పష్టపరచినది.

మీది భావమును ఉదాహరణపూర్వకముగ సమర్థించుచున్నాడు.

అశ్వమేధేన యక్ష్యంతే రాజానః సత్ర మాసతే
బ్రాహ్మణా ఇతి నాఖ్యాతరూపా ద్భేదః ప్రతీయతే . 450

'రాజానః = రాజులు, అశ్వమేధేన=అశ్వమేధమును, యక్ష్యంతే = చేయు చున్నారు'—' బ్రాహ్మణాః = బ్రాహ్మణులు, సత్రమ్ = సత్రయాగమును, ఆసతే = చేయుచున్నారు.' — ఇతి = ఈచోటులందు, ఆఖ్యాత రూపాత్ = క్రియాపదముయొక్క స్వరూపమువలన, భేదః=అవాంతరక్రియా భేదము, న+ప్రతీయతే = తెలియబడదు.

తా. అర్థము ఒకటే అయినపుడు, క్రియాపద రూపములో భేదమున్నను, అవాంతరక్రియాభేదములు తెలియవు. అవి అర్థసామర్థ్యమును బట్టియే తెలియుచుండును. ఉదా: 'రాజానః అశ్వమేధేన యక్ష్యంతే' 'బ్రాహ్మణాః సత్రమాసతే'. ఈ వాక్యములలో 'యక్ష్యంతే' 'సత్రమాసతే' అని క్రియాస్వరూపము వేరుగానే ఉన్నది. అయినను అర్థము ఒకటే. అదియే ఇతికర్తవ్యతాభేదములను, (చేయు తీరులు) ఫలభేదములను తెలియజేయును. అనగా అర్థము తెలియగానే అవన్నియు స్ఫురించును. శబ్దము ముఖ్యార్థమును చెప్పుటయేకాని, దాని భేదముల జోలికి పోలేదు.

వి. మీది రెండు కారికల విషయమునకును, ఉదాహరణమును ఈ కారిక చూపినది.

"శబ్దభేదమున్నను అర్థమువలననే భేదములు తెలియునపుడు, శబ్దభేదము లేన పుడు అట్లు జరుగునని వేరుగ చెప్పనక్కరలేదు" అని సారము.

'కొన్నిచోట్ల శబ్దసామర్థ్యము వలనను, మరికొన్నిచోట్ల అర్థసామర్థ్యమువలనను, అర్థమునకు సంబంధించిన సొగసులు తెలియుచుండును. ఈ విషయములో ప్రత్యేకమైన కొలత బద్దలు ఏవియు ఉండవు. అవి వాని వాని స్వభావము. యథాసంభవముగ, ఆయా వాక్యములలో ఇట్టి విచిత్రములను అనుభవింపనగును.'—అన్నది ప్రకృత సందర్భము యొక్క తత్త్వము.

పై విషయమునకే వైదికోదాహరణమును చూపుచున్నాడు.

సకృచ్ఛ్రుతా సప్తదశ స్వనావృత్తాఽపి యా క్రియా
ప్రాజాపత్యేషు సామర్థ్యాత్ సా భేదం ప్రతిపద్యతే . 451

సప్తదశసు = పదియేడు అయిన, ప్రాజాపత్యేషు=ప్రజాపతి దేవతగాగల మేకల విషయములో, యా = ఏ, క్రియా = ఆలంభనమను వ్యాపారము(చంపుట), సకృత్ = ఒక్క-

సారియే, శ్రుతా = వినబడునో, సా = ఆ వ్యాపారము, అనావృత్తా + అపి = ఆవృత్తి లేని దైనను (మరలమరల చెప్పబడకపోయినను), సామర్థ్యాత్ = అర్థముయొక్క స్వభావము వలన, భేదమ్ = భేదమును, ప్రతిపద్యతే = పొందును.

తా. "శబ్దభేదము లేకున్నను, అర్థసామర్థ్యమునుబట్టి క్రియయొక్క భేదము తెలియుచుండును" అను అంశమునకు, వైదిక కర్మకాండలోని ఒక ఉదాహరణమును ఈ కారిక చూపినది: "సప్తదశ ప్రాజాపత్యాన్ ఏకవర్ణాన్ అజాన్ ఆలభేత" అనునది ఒక. యాగప్రక్రియకుచెందిన వాక్యము. "ప్రజాపతి దేవతగాగలిగినటువంటివిన్ని, ఒకే రంగు గలిగినట్టివిన్ని, పదిహేడు మేకలను ఈ యాగములో చంపవలెను" అని అర్థము. ఇచట "ఆలభేత" అను క్రియాపదము ఒక్కసారే వాడబడినది. అయినను దానివలనతెలియు ఆలంభనమను వ్యాపారము, మేకల విషయములో వేరువేరుగా (ప్రత్యేకముగా) సంబంధించుననని తెలియును. అది అర్థస్వభావము.

ధాతువు భేదరహితమైన క్రియను ప్రతిపాదించును. కావుననే భుజిక్రియ దేవదత్తాదుల విషయమున ప్రత్యేకముగ అన్వయించుననని చెప్పుచున్నాడు.

దేవదత్తాదిషు భుజిః ప్రత్యేక మవతిష్ఠతే
ప్రతిస్వతంత్రం వాక్యం వా భేదో న ప్రవిభజ్యతే. 452

దేవదత్తాదిషు = దేవదత్తుడు మొదలగువారి విషయములో, భుజిః = భోజనమను వ్యాపారము, ప్రత్యేకమ్ = ప్రతియొక వ్యక్తికిని, అవతిష్ఠతే = సంబంధించియుండును. వా = లేక, ప్రతిస్వతంత్రమ్ = ప్రతియొకకర్తకును సంబంధించిన, వాక్యమ్ = వాక్యమైనను, అవతిష్ఠతే = ఏర్పడును. భేదః = క్రియాభేదము, న + ప్రతీయతే = తెలియబడదు.

తా. "నివృత్తభేదా సర్వైవ" (449 శ్లోకము) మొదలగుశ్లోకము, "క్రియాపదము (అందలిధాతువు) అవాంతరభేదములేని వ్యాపారసామాన్యమును తెలియజేయు"నని చెప్పినది. ఈ అంశము భుజిక్రియలో స్పష్టముగ కనబడును. భోజనమను వ్యాపారములో కూడ, అవాంతరవ్యాపారములు (కాళ్ళు కడుగుకొనుట, అన్నము కలుపుకొనుట, నమలుట మొదలగునవి) పెక్కులుండును. అయినను "భుజ్" అను ధాతువు, "భుజించుట" అను వ్యాపారసామాన్యమునే తెలుపును గాని, దాని భేదములను తెలుపదు.

అందువలన "దేవదత్త, యజ్ఞదత్త, విష్ణుమిత్రాః భుంజంతి" మొదలగు వాక్యములలో వాక్యార్థము ప్రతియొకవ్యక్తికిని సంబంధించును. (అనగా ప్రతియొకడును భోజనము చేయుచున్నాడని చెప్పినందువలననే వాక్యార్థము పూర్తిఅగును కాని, ఒక్కొక్కరికి ఒక్కొక్క అవాంతరవ్యాపారమును అంటగట్టినందువలన వాక్యార్థము పూర్తి కానేరదు). ఇది వాక్యార్థ సమాప్తి పక్షము (అర్థముయొక్క సంబంధమును చూపుట).

వాక్యసమాప్తిపక్షమును (శబ్దరూపమైన సంబంధమును చూపుట) ఆశ్రయించినచో ఇట్టి స్థలములందు, "దేవదత్తః భునక్తి, యజ్ఞదత్తః భునక్తి, విష్ణుమిత్రః భునక్తి" అనురీతిని వేరువేరు వాక్యము లేర్పడును.

ఏ పక్షమందైనను, ఇట్టిచోట్ల ధాతువు క్రియాసామాన్యమునే చెప్పును గాని, దాని భేదములను చెప్పదు.

వి. వాక్యసమాప్తిని పరిశీలించు సందర్భములో ఈ విషయములు, లోగడ (371-380) విపులముగా చర్చింపబడినవి ప్రసంగవశమున మరల ఇచట చూపబడినవి.

"దేవదత్త యజ్ఞదత్త విష్ణుమిత్రాః భుంజంతు" మొదలగు వాక్యములలో ప్రత్యేక సమాప్తి సిద్ధించు రీతిని చూపుచున్నాడు.

ఉచ్చారణే తు వాక్యానా మన్య ద్రూపం నిగృహ్యతే
ప్రతిపత్తౌ తు భిన్నానా మన్య ద్రూపం ప్రతీయతే. 453

ఉచ్చారణే + తు = ఉచ్చరించు సమయమున, వాక్యానామ్ = వాక్యమందలి క్రియా పదములకు, అన్యత్=వేరొక, రూపమ్=స్వరూపము (భేదములేని రూపము), నిగృహ్యతే= స్వీకరింపబడును. ప్రతిపత్తౌ + తు = అర్థమును గ్రహించు సమయమున, భిన్నానామ్ = వేరైనక్రియా పదములయొక్క, అన్యత్ = వేరొక, రూపమ్ = స్వరూపము, ప్రతీయతే= తెలియబడును.

తా. 'దేవదత్త, యజ్ఞదత్త, విష్ణుమిత్రాః భుంజంతి' మొదలగు వాక్యములను ఉచ్చరించునపుడు, క్రియాపదము ఒకసారే వినిపించినను, అర్థమును గ్రహించు సమయములో, అది ప్రతియొక కర్తకును సంబంధించునని (విడివిడిగా చేరుట)తెలియుచుండును. వాక్యార్థమును సమగ్రముగ భావించుటవలన అట్లు జరుగును, కావున 'ఒకసారిమాత్రమే ఉచ్చరింపబడిన క్రియాపదము,రెండు మూడు కర్తృపదములతో విడివిడిగా ఎట్లు సంబంధించు' నని సంశయింప నక్కరలేదు.

వి. వాక్యముయొక్క రచనాపద్ధతియు, వాక్యార్థముయొక్క ఔచిత్య పరిశీలనయు, వాక్య వాక్యార్థముల సమాప్తిని నిర్ణయించుటలో ముఖ్య హేతువులగుచుండును. దీనిని బట్టియే కొన్నిచోట్ల క్రియాపదమునకు ఆవృత్తిచేయవలయుననియు, కొన్నిచోట్ల చేయనక్కర లేదనియు వ్యాఖ్యానించుచుందురు.

శాస్త్రీయ వాక్యములలో గూడ ప్రత్యేకసమాప్తిని ప్రదర్శించుచున్నాడు.

ఏకం గ్రహణకం వాక్యం సామాన్యేనాభిధీయతే
కర్తరీతి యథా తచ్చ పశ్వాదిషు విభజ్యతే. 454

గ్రహణకమ్=విశేషములను అన్నింటిని గ్రహించునట్టి, వాక్యమ్ = వాక్యము, ఏకమ్ = ఒక్కటే, సామాన్యేన=సామాన్యరూపముతో, కర్తరి + ఇతి + యథా= "కర్తరి కృత్" అన్నరీతిని, అభిధీయతే = చెప్పబడును. తత్ + చ = ఆ వాక్యమైతే, పశ్వాదిషు = "పశౌ" మొదలగు విశేషస్థలములలో, విభజ్యతే = వేరుచేయబడుచుండును.

తా. విశేషవాక్యములన్నింటిలోను,విడివిడిగా సంబంధించునట్లుగా, ఒకే సామాన్య వాక్యమును ముందుగా ఉచ్చరింతురు. అది ప్రతియొక విశేషముతోను, వేరువేరుగానే కలియుచుండును. దీనికి వ్యాకరణములో ఒక ఉదాహరణము: 'కర్తరి కృత్' (3-4-67) ఇది సామాన్యసూత్రము. ఇది 'హరతే ర్దృతినాథయోః పశౌ' (3-2-25) మొదలగు, కృత్ప్ర కరణమందలి ప్రతియొక విశేషసూత్రముతోను సంబంధించుచుండును.

వి. "కర్తరి కృత్" అనుదానికి, "ప్రతియొక కృత్ప్రత్యయమును కర్తను బోధించును" అని అర్థము. (ఉదా: కృ + అకః = కారకః = చేయువాడు, కృ +

తృ=కర్తృ=చేయునది మొదలగునవి). కృత్ ప్రత్యయములను విధించు ప్రతియొక విశేష సూత్రముతోను "కర్తరి" అను పదము సంబంధించును. ఉదా : "హరతేః దృతినాథయోః పశౌ" అను సూత్రము. ఇచట "కర్తరి" అనుపదము సంబంధింపగా, "దృతి నాథ," అను శబ్దములు ముందున్నప్పుడు హృ అను ధాతువునకు 'ఇ' అను ప్రత్యయమువచ్చును. ఇది పశువు కర్తగా అయినపుడే ప్రవర్తించును. "పశౌ కర్తరి" అను అర్థము ఫలించును. "దృతి హరిః (దృతిమ్+హరతి)-దృతిని హరించు పశువు. నాథహరిః (నాథమ్+హరతి) ముక్కు త్రాటిని హరించు పశువు" అనునవి ప్రకృతసూత్రమునకు ఉదాహరణము లగును. ఇట్లే కృత్ప్రకరణములోని విశేషములతో, "కర్తరి కృత్" అను సామాన్యసూత్రమునకు సంబంధము నూహించునది.

"శాస్త్రమందుకూడ కొన్నిచోట్ల ప్రత్యేక వాక్యసమాప్తియే" అని చూపుట ఈ కారికయొక్క ఆశయము. ప్రత్యేకసమాప్తి అనగా, విశేషవచనములతో సామాన్యవచనము విడివిడిగా సంబంధించుటయే.

మీది కారిక చెప్పినతీరును స్వీకరించకపోయినచో, అభిమతము సిద్ధింపదని వివరించు చున్నాడు.

> యద్యాకాంక్షా నివర్తేత తద్ధ్యాతస్య సకృచ్ఛ్రుతౌ
> నైవాన్యేనాభిసంబంధం తదుపేయాత్ కథంచన. 455

తద్ధ్యాతస్య = సామాన్యవాక్యమును, సకృత్ = ఒకసారి, శ్రుతౌ = వినుట జరుగ గానే, ఆకాంక్షా=ఆకాంక్ష (మరియొకదానితో సంబంధము), నివర్తేత+యది=పోయినట్ల యితే, తత్=ఆ సామాన్యవాక్యము, అన్యేన=వేరొకవిశేషవాక్యముతో, అభిసంబంధమ్= సంబంధమును, కథంచన = ఏవిధముగా అయినను, న+ఏవ + ఉపేయాత్ = పొందలేక పోయెడిని.

తా. మీది కారికలో చూపిన సామాన్య వాక్యమునకు, 'కేవలము సామాన్యార్థ మును బోధించుటయందే తాత్పర్య' మని చెప్పినచో, దానికి విశేషవాక్యములతో ఏవిధము గాను సంబంధము కుదరదు కావున, అభిమతములగు లక్ష్యములు సిద్ధింపక పోయెడివి.

వి. 'కర్తరి కృత్' అను వాక్యము, 'కృత్ప్రత్యయము కర్తను బోధించును' అను అర్థమును మాత్రమే చెప్పి ఊరకుండును' అన్నయెడల, విశేషస్థలములలో 'పశౌకర్తరి' (పశువు కర్త కావలెను) మొదలగు సమన్వయములు సిద్ధింపవు. కాగా పశువు కర్త కాకుండ, వేరొకటి కర్త అయినవుడు కూడ దృతిహరిః, నాథహరిః మొదలగు ప్రయోగములు సాధు వులు కావలసివచ్చును. అది అభిమతము కాదు.

"పశౌ కర్తరి" అని అన్వయము చేసినపుడే, "పశువే కర్త కావలెను" అను నియమము లభించును.

కాగా ఏకరూపమైన వాక్యమే అవాంతర వాక్యములకు మూలకారణ మగుచుండు నని ఉపపాదించుచున్నాడు.

> ఏకరూప మనేకార్థం తస్మా దుపనిబంధనమ్
> యోని ర్విభాగవాక్యానాం తేభ్యోఽనన్యదివ స్థితమ్. 456

తస్మాత్ = అందువలన, అనేకార్థమ్ = వేర్వేరు అర్థములతో సంబంధముగల, ఏకరూపమ్ = ఒకేస్వరూపముగల సామాన్యవాక్యము, ఉపనిబంధనమ్ = ముఖ్యమైన స్థానమై, విభాగవాక్యానామ్=విశేషములగు అవాంతరవాక్యములకు, యోనిః=మూలకారణమై, తేభ్యః= ఆ విశేషవాక్యముల కన్న, అనన్యత్ + ఇవ = భేదములేనిదివలె, స్థితమ్ = ఉండును.

తా. "కర్తరి కృత్" అనునది, స్వతంత్రమైన విధివాక్యము కాని, ఏదోఒక విశేష వాక్యముతోమాత్రమే సంబంధించి ఊరకొనునది కాని కాదు. కృత్ప్రత్యయమును విధించు ప్రతియొక విశేషవాక్యముతోను, ప్రత్యేకముగ సంబంధించు సామాన్యవాక్యమది. కాగా ఆయా సూత్రములలో నిర్దేశింపబడిన "పశౌ" మొదలగు విశేషార్థములన్నియు, "కర్తరి" అను సామాన్యార్థముయొక్క భిన్నభిన్న రూపములే. అగును (ఏది కర్తకావలెనో స్పష్టముగ చెప్పును). అందువలన మన్ను వివిధములైన పాత్రలకు మూలకారణమైనట్లు, ఈ సామాన్యవాక్యము వివిధములైన విశేషవాక్యములకు నిదాన మనియు, అది ఒకేరూపముతో వేరుగా ఒకచోట ఉండు ననియు చెప్పవచ్చును.

వి. 'ఏకం గ్రహణకం వాక్యమ్' మొదలగు కారికకు, మీది కారికయు ఈ కారికయు సయుక్తికమైన వ్యాఖ్యానములు. వీనివలన, శాస్త్రమందు కూడ ప్రత్యేకసమాప్తి ఆవశ్యకమగునని సమర్థింపబడినది. సామాన్యవాక్యము వేరుగా ఉండి, విశేషములతో విడి విడిగా సంబంధించినను, ఒకేవాక్యములో సామాన్యవిశేషభావమును కల్పించుకొని, విడివిడిగా సంబంధమును చూపినను—అది ప్రత్యేకసమాప్తియే అని గ్రహింపవలెను. ఔచిత్యమునుబట్టి ఆయా వాక్యములలో, ఆయా తీరును ఉపయోగించుకొనవలెను.

క్రియా విషయమున "జాతి — వ్యక్తి" వ్యవహారము సంభవించు రీతిని వివరించు చున్నాడు.

క్వచిత్ క్రియావ్యక్తిభాగై రుపకారే ప్రవర్తతే
సామాన్యభాగ ఏవాఽస్యాః క్వచి దర్థస్య సాధకః . 457

క్రియా = క్రియ (వ్యాపారము), క్వచిత్ = కొన్నిచోట్ల, వ్యక్తిభాగైః = ఒక్కొ క్కటిగా చూపబడిన భాగములచే, ఉపకారే = అభీష్టమైన అర్థమునుసాధించుటయందు, ప్రవర్తతే = ప్రవర్తించును, క్వచిత్ = కొన్నిచోట్ల, అస్యాః = ఈ క్రియయొక్క, సామాన్య భాగః + ఏవ = సామాన్యరూపమే, అర్థస్య = వాక్యార్థమునకు, సాధకః = సాధించునది, భవతి = అగును.

తా. వేరువేరుగా ఒక్కొక్కటిగా కనుపించునవి వ్యక్తులు. వ్యక్తులన్నిటి యందును సమానముగాను, ఏకాకారముగాను, ఒక్కటిగాను ఉన్నట్లు భావింపబడు ధర్మము సామాన్యము—లేక—జాతి. ఉదా: మానవులు విడివిడిగా వ్యక్తులగుదురు. "మానవత్వము" అను ధర్మము జాతి అగును. లోకవ్యవహారములోని క్రియావిషయమున కూడ, ఇట్లే కొన్ని చోట్ల వ్యక్తి విభాగమునుబట్టియు, మరి కొన్నిచోట్ల జాతినిబట్టియును అభీష్టార్థము సిద్ధించు చుండును. ఉదా: "అయం తత్ర ఇదానీం స్తోక మోదనం పచతి" (వీడు అక్కడ ఇప్పుడు కొంచెము అన్నమును వండుచున్నాడు). "సః అత్ర మధురం శాకం పచతి" (వాడు ఇక్కడ తియ్యని కూరను వండుచున్నాడు). ఇట్టి ప్రయోగములలో ప్రదేశము, కాలము, ద్రవ్యము,

క్రియావిశేషణము, మొదలగువానిని స్పష్టముగా చెప్పుదురుగాన, "ఆ క్రియ వేరు" "ఈ క్రియ వేరు" అన్నట్లుగా క్రియకు విభాగమును కల్పించుకొని, సమన్వయమును పొందుదురు. అట్లు కాక, ఎట్టి విశేషములను చెప్పకుండ, "పచతి" "యజతి" మొదలగు ప్రయోగములను చేసి నపుడు, ఆయా క్రియయొక్క జాతిని భావించుకొని సమన్వయమును పొందుదురు.

వి. వ్యక్తి, జాతి, అను విభాగము క్రియావిషయమునకూడ సంభవించునని, ఈ కారిక చెప్పుచున్నది.

క్రియకు సామాన్యలక్షణ మిది: లింగముతోకాని (స్త్రీ, పుమాన్. నపుంసకమ్), సంఖ్యతోకాని (ఒకటి, రెండు మొ॥) దానికి అన్వయము ఉండదు. ఆరంభించిన క్షణము మొదలుకొని, పూర్తియగు క్షణమువరకును మధ్యను అవాంతరక్రియలు-(చిన్నవి-పెద్దవియు) ఎన్నో అందు ఉండును. పూర్తి అగువరకును జరుగుచుండుటయు, క్షణక్షణము పెరిగి పూర్తి అగుటయు దానియొక్క అవస్థలు.

ఇట్టి క్రియకు దేశకాలాదివిశేషములు చూపినపుడు, వ్యక్తి భావనయే ఉపయోగించును. 1. 'న పచ' (వండకుము)అను నిషేధమందును, 2. "పచ వా గచ్ఛవా" (వండు-లేక-వెళ్ళు) అను వికల్పమందును, 3. 'పచతి స్తౌతి చ' (వండుచున్నాడు మరియు స్తుతించుచున్నాడు) అను సముచ్చయమందును, క్రియను వ్యక్తిగా భావించుటయే సమంజసమగును (దేనికది వేరే క్రియాస్వరూపమనుకొనుట). ఈ నిషేధవికల్పాదులు వ్యక్తుల విషయములోనే సంభవించును.

ఎట్టి విశేషమును లేనిచో క్రియను జాతిగా స్వీకరింపవచ్చును. జాతి నిత్యమును ఏకమును అగుటవలన, దానివిషయములో నిషేధవికల్పాదులను అన్వయించుట కుదురదు. కాగా ప్రయోగమునుబట్టియు, చెప్పదలచుకొన్న అర్థమును బట్టియు, క్రియలలో జాతి వ్యక్తి విభాగము ఏర్పడుచుండునని సారాంశము.

ఆఖ్యాత శబ్దములు క్రియాగతమైన జాతి భాగమునే సామాన్యముగ బోధించుచుండునని చెప్పుచున్నాడు.

కాలభిన్నాశ్చ భేదా యే యే చాప్యుష్ట్రాసికాదిషు
ప్రక్రమే జాతిభాగస్య శబ్దాత్మా తై ర్న భిద్యతే. 458

యే = ఏ, కాలభిన్నాః = కాలముచే వేరుచేయబడిన, భేదాః + చ = క్రియయొక్క భేదములుగలవో, యే = ఏ, ఉష్ట్రాసికాదిషు= "ఉష్ట్రాసికాః ఆస్యంతే" మొదలగుశబ్దములను ప్రయోగించినపుడు, (సాధనభిన్నాః = కారకములచే వేరుచేయబడిన), భేదాః + చ = క్రియయొక్క భేదములు గలవో, తైః=ఆ భేదములచే, జాతిభాగస్య= "క్రియయొక్క జాతి" అను అంశము, ప్రక్రమే = ప్రారంభమున తెలియగా, శబ్దాత్మా = క్రియాపదముయొక్క స్వరూపము, న + భిద్యతే = వేరుచేయబడదు (మారదు).

తా. "పచతి" (వండుచున్నాడు-వర్తమానకాలము), "అపాక్షీత్" (వండెను-భూతకాలము), "పక్ష్యతి" (వండగలడు-భవిష్యత్కాలము) ఇట్టి ప్రయోగములలో కాల భేదము ఉండును. అయినను "వంట" అను సామాన్యాంశమునే గ్రహించుటవలన, "పాక జాతి" అను సామాన్యమే ప్రారంభమున అవగతమగుచుండును. 'ఆ వంటవేరు' 'ఈ వంట

వేరు' అన్నట్లుగా, వ్యక్తి భావన కలుగదు (దేశకాలాది విశేషములను భావించిన క్షణములో వ్యక్తిభావన కలిగిన కలుగుగాక, అది వేరు విషయము).

అట్లే 'ఉష్ట్రాసికాః ఆస్యంతే' (ఒంటెలు కూర్చున్నట్లు కూర్చుండుట) 'హతశాయికాః శయ్యంతే' (చచ్చినవారివలె నిద్రించుట) మొదలగు వాక్యములలో కూడ, కర్తృభేద మున్నను 'ఆసనము' 'శయనము' మొదలగు క్రియాసామాన్యమే మొదట తెలియబడు చుండును.

అనగా దేశకాలాదిభేదమును, కారకభేదమును (ముఖ్యముగా కర్తృభేదము) విడదీసి చెప్పనంతవరకు, ఏ క్రియ అయినను మొదట జాతినే సూచించునని సారము.

వి. 'నడచుట, వ్రాయుట, తినుట' మొదలగు అన్ని విషయములలోను, సామాన్య రూపమైన జాతియే మొదట తెలియును. పిదప దేశకాలాది భేదమును, కర్తృభేదమును స్ఫురించి, ఆవశ్యకమైనచోట, 'ఆ క్రియ వేరు' 'ఈ క్రియ వేరు' అని వ్యక్తి విభాగము జరుగు చుండును.

'ఉష్ట్రికాః ఆస్యంతే' మొదలగునవి భావ ప్రయోగములు. క్రియ మాత్రమే వీనివలన బోధపడును. ఈ ప్రయోగములలో కర్తృపదము తృతీయాంతముగ ఉండును. 'దేవదత్తాదిభిః ఉష్ట్రికాః అస్యంతే' అనునది పూర్తి ప్రయోగము. 'దేవదత్తుడు మొదలగు వారు ఒంటెలవలె (వికృతముగా) కూర్చుండుట' అని మాత్రమే వాక్యార్థము. ఇట్టిచోట్ల కూడ కూర్చుండు వ్యక్తులు (కర్తలు) వేరువేరుగా ఉన్నను, 'ఆసన'మను జాతిభాగమే, మొదట వాక్యార్థముతో సంబంధించును.

మీది కారికయు, ఈ కారికయు క్రియలలోని జాతి వ్యక్తి వివేచనమును జరిపినవి.

సాధనములు ఒకే శబ్దముచేతను, క్రియ విభిన్నములగు శబ్దములచేతను ప్రతిపాదింప బడిన వాక్యములలో క్రియాసాధనముల సంబంధమును నిర్దేశించుచున్నాడు.

ఏకసంఖ్యేషు భేదేషు భిన్నాః జాత్యాదిభిః క్రియాః
భేదేన వినియుజ్యంతే తచ్ఛబ్దస్య సకృచ్ఛ్రుతౌ. 459

ఏకసంఖ్యేషు = ఒకేసంఖ్యగల (వేరువేరుగా బహుత్వసంఖ్యను కలిగి ఉన్న), భేదేషు = ఒకేశబ్దముతో చెప్పబడిన సాధనభేదములందు, జాత్యాదిభిః = జాతి, దేశ, కాలాదులచే, భిన్నాః = వేరైనటువంటివిన్ని, వేర్వేరు శబ్దములతో బోధింపబడునటువంటి, క్రియాః = వ్యాపారములు, తచ్ఛబ్దస్య = సాధనవిశేషములను చెప్పు ఆ శబ్దమును, సకృత్ = ఒకసారి, శ్రుతౌ = వినగానే, భేదేన = భేదముతోనే (వేర్వేరుగానే), వినియుజ్యంతే = ఆయా సాధనములతో సంబంధమును పొందును.

తా. ఈ దిగువ ఉదాహరణమును తీసుకొని, ఈ కారికయొక్క ఆశయమును విశదీకరించుకొనవలెను: "అక్షాః భజ్యంతామ్, భుజ్యంతామ్, దీవ్యంతామ్" ఇచట అక్ష శబ్దమునకు మూడు అర్థములు ఉన్నవి. 1. బండి ఇరుసు. 2. ఒక పండు (విభీతకఫలము తానికాయ) 3. పాచిక, వీనిలో ఏ ఒక అర్థమును తీసికొన్నను, క్రియాపదమందలి బహువచనమును అనుసరించి అక్షశబ్దమును బహువచనాంతముగానే అంగీకరింపవలెను. పిదప ప్రకృతక్రియను, దాని వరుసను బట్టి, 1. "అక్షాః భజ్యంతామ్" (ఇరుసులు విరుగగొట్టబడు

గాక) 2. "అక్షాః భుజ్యంతామ్" (అక్షఫలములు తినబడుగాక) 3. "అక్షాః దీవ్యంతామ్" (పాచికలు ఆడబడుగాక) అను మూడు వాక్యములు వరసగా ఏర్పడి, వినువానికి అర్థబోధ కలుగును.

అయినను తంత్రమును (శబ్దమును ఒకసారే పలికి, దానివలన చాలా అర్థములను బోధించురీతి) ఆశ్రయించి, వక్త అక్ష శబ్దమును ఒక్కసారే పలుకును. ఇట్టి ప్రయోగ ములలో క్రియలు, దేశకాలాదులవలన భిన్నభిన్నములే అగును (వాని జాతియు, వ్యక్తులును, వానిని ఆచరించు సమయమును, తీరులును వేర్వేరు). కావుననే క్రియాభేదమును, క్రియా శబ్దమును, వినువానికి కలుగు జ్ఞానభేదమును పురస్కరించుకొని, 'అక్షాః' మొదలగు శబ్ద ములవలన, సాధన భేదముకూడ (కారక భేదము) సిద్ధించును. ఒక్కొక్క సాధనముతో దానికి తగిన క్రియ వేరువేరుగానే సంబంధించును. సాధన శబ్దమును పలుమారులు పలుక నక్కరలేకుండగనే అభీష్టార్థము తెలియుచుండును.

వి. "దేవదత్త, యజ్ఞదత్త, విష్ణుమిత్రాః భోజ్యంతామ్" మొదలగు ప్రయోగ ములలో, క్రియ ఒక్కసారే ఉచ్చరింపబడి, సాధనములతో వేర్వేరుగా సంబంధించుచుండును. ఈ అంశమును (ప్రత్యేక సమాప్తి) అనేక యుక్తులతో శాఖా చంక్రమణము చేసి గ్రంథకర్త ఇంత వరకు వ్యాఖ్యానించెను.

ఆవిధముగానే వేర్వేరు క్రియలను వేర్వేరు శబ్దములతో చెప్పి, కారకములను మాత్రము ఒకే శబ్దముతో ఒకేసారి బోధించు ప్రయోగములలో (అక్షాః భక్ష్యంతామ్, భుజ్యం తామ్, దీవ్యంతామ్ మొదలగునవి) కూడ, క్రియకు ప్రత్యేకసంబంధమే సంభవించునని విశదీకరించుటకు, ఈ కారిక రచింపబడినది. ఇట్టి ప్రయోగములలో 'వక్త తంత్రముతో పలుకుననియు, బోద్ధ ఆవృత్తి చేసికొని అర్థమును తెలిసికొనుననియు' సారము. ఈ విషయము దిగువ కారికలవలన స్పష్టపడును.

మీది కారికకు ఒక ఉదాహరణము నిచ్చుచున్నాడు.

అక్షాదిషు యథా భిన్నా భంజి భక్షి దివి క్రియాః
ప్రయోగకాలాభేదేఽపి ప్రతిభేదం పృథక్ స్థితాః . 460

యథా=ఎట్లనగా, అక్షాదిషు='అక్షాః' మొదలగు సాధనములు ఒకే శబ్దముతో చెప్ప బడినపుడు (అక్షాః భక్ష్యంతామ్, భుజ్యంతామ్, దీవ్యంతామ్ మొదలగు ప్రయోగములలో) భిన్నాః = వేరైనటువంటివి, వేర్వేరు శబ్దములతో చెప్పబడినటువంటి, భంజి భక్షి దివి క్రియాః=భంజనము, భక్షణము, దేవనము అనువ్యాపారములు, ప్రయోగకాలాభేదే + అపి=ఉచ్చరించుటలో గాని, ఉచ్చరించు సమయములో గాని భేదము లేకున్నను, ప్రతిభేదమ్= ప్రతియొక సాధనముతోను, పృథక్ = వేరువేరుగా, స్థితాః=సంబంధించి ఉండును.

తా. పై శ్లోకమునకు ఉదాహరణమును ఈ శ్లోకముచూపినది. "అక్షాః భజ్యం తామ్" మొదలగు ప్రయోగములలో, సాధనములను ఒక శబ్దముతోనే చెప్పినను, అర్థబోధ సమయమున వేర్వేరు క్రియలు వేర్వేరుగా తమతమ యోగ్యమైన సాధనములతో సంబంధిం చును. కాగా ఇట్టిచోట్ల కూడ వాక్యమునకు ప్రత్యేకసమాప్తియే అని ఫలించును.

మీద చూపినట్టి వాక్యముల విషయమున తంత్రన్యాయమును ఆశ్రయింపవలయు నని చూపుచున్నాడు.

అక్షాణాం తంత్రిణాం తంత్ర ముపాయ స్తుల్యరూపతా
ఏషాం క్రమో విభక్తానాం తంత్రిబద్ధా సకృచ్ఛ్రుతిః . 461

తంత్రిణామ్ = తంత్రమునకు విషయములైన (తంత్రముగల), అక్షాణామ్ = అక్షములకు (రథముయొక్క అక్షము, విభీతకాక్షము, ఆడుకొనే అక్షము-మూడుచోట్లకూడ, శబ్దము "అక్ష" అనునదియే), తుల్యరూపతా="స్వరూపము సమానముగా ఉండుట" అను, తంత్రమ్ = తంత్రము (ఒకే ఉచ్చారణముమాత్రము), ఉపాయః = ఉపాయము (మూడు అర్థములను ఒకేమారు బోధపరచుటలో సాధనము), (భవతి=అగును). విభక్తానామ్=అక్షాః భజ్యంతామ్, అక్షాః భుజ్యంతామ్, అక్షాః దీవ్యంతామ్ అని వేరుచేయబడిన, ఏషామ్ = ఈ అక్షములకు, క్రమః = వేర్వేరుగా తెలియజేయుటకు అవలంబింపబడిన అక్షశబ్దములయొక్క ఉచ్చారణక్రమము, ఉపాయః = వేర్వేరుగా తెలియుటకు సాధనము, (భవతి = అగును). సకృత్ = ఒకసారే, శ్రుతిః = అక్షశబ్దము వినబడుట, తంత్రిబద్ధా = తంత్రవిషయములైన అక్షములకు సంబంధించినది (భవతి = అగును).

తా. వక్త ఇచ్ఛానుసారము ప్రయోగములు జరుగుచుండును. "అక్షాః భజ్యంతామ్, అక్షాః భుజ్యంతామ్, అక్షాః దీవ్యంతామ్" అని విడివిడిగా కూడ ప్రయోగింపవచ్చును. ఇట్లు ప్రయోగించునపుడు, అక్షశబ్దముయొక్క ఉచ్చారణక్రమము, అర్థభేదమందలి క్రమమును (వరుసను) స్పష్టపరచును. (క్రియాభేదమువలన అర్థభేదము తప్పనిసరి అగుటయు— ఆ భేదమును, వరుసయు స్పష్టమగుటయు మొదట సిద్ధించి, పిదప క్రియలకు వేరువేరుగా, తమతమ కారకములతో సంబంధము ఏర్పడును).

మరియు, "అక్షాః భజ్యంతామ్, భుజ్యంతామ్, దీవ్యంతామ్" అని కూడ ప్రయోగింపవచ్చును. ఇపుడు కావలసిన అర్థమంతయు (పైనిచూపిన తీరు) "తంత్రము" వలన (శబ్దమును ఒకమారే పలికి, చాలా అర్థములను బోధించుట) సిద్ధించును. అయితే ఒకవిశేషము. ఇట్టి స్థలములలో, తంత్రవిషయమైన శబ్దమును బోద్ధ (తెలియువాడు) ఆ వృత్తి చేసికొని అర్థభేదమును గ్రహించును.

వి. "క్రమమనగా—వరుస—లేక-విభాగము. అభిమతార్థములు తెలియుటకై నానార్థక శబ్దములను ఒకవరుసలో విడివిడిగా ఉచ్చరించుట" అని భావము. దీనికి పూర్తిగా విరుద్ధమైనది తంత్రము. దీనినే 'యౌగపద్యము' అని అందురు. "నానార్థములను బోధించుటకు శబ్దమును ఒక్కమారే పలుకుట" అని భావము. శబ్దరూపము సమానముగా ఉండుటయే, తంత్రమునకు ముఖ్యకారణ మగును.

కాగా నానార్థక శబ్దములను క్రమముతోగాని, యౌగపద్యముతోగాని, వాక్యములలో వాడవచ్చును. క్రియలుమాత్రము వానిలోని కారకములతో విడివిడిగానే సంబంధించును.

క్రమయౌగపద్యముల స్వరూపమును ఉద్దేశించుచున్నాడు.

ద్వావభ్యుపాయౌ శబ్దానాం ప్రయోగే సమవస్థితౌ
క్రమో వా యౌగపద్యం వా యౌ లోకో నాతివర్తతే . 462

క్రమే విభిద్యతే రూపం యౌగపద్యే న భిద్యతే
క్రియా తు యౌగపద్యేఽపి క్రమరూపానుపాతినీ . 463

శబ్దానామ్ = శబ్దములయొక్క (తెలిసికొను సమయమున వేర్వేరు అర్థములుగల సరూపశబ్దములయొక్క) ప్రయోగే=ఉచ్చరించుట విషయములో, క్రమః + వా=విభాగము కాని (విడివిడిగా పలుకుట), యౌగపద్యమ్ + వా = ఒక్కసారే ఉచ్చరించుటగాని, ద్వౌ= రెండు, అభ్యుపాయే=ఉపాయములు, సమవస్థితౌ = స్పష్టముగా ఉన్నవి. యౌ=ఏ రెండు ఉపాయములను, లోకః=జనము (ప్రయోగించువారు), న + అతివర్తతే=విడనాడజాలదో (తౌ=అవి, స్తః=ఉన్నవి).

క్రమే=శబ్దములను వేరుగా పలికినపుడు, రూపమ్ = ఆ శబ్దముల స్వరూపము, విభిద్యతే = వేరుగా ఉండును (వేరని భావింపబడును). యౌగపద్యే=ఒక్కసారే పలికినపుడు, రూపమ్=శబ్దస్వరూపము, న + భిద్యతే = వేరుకాదు. (వేరుకాదని భావింపబడును) యౌగపద్యే + అపి=ఒక్కసారే పలికినపుడు కూడ, క్రియా=వ్యాపారము (క్రియాపదము), క్రమరూపానుపాతినీ = క్రమములో ఉండు శబ్దరూపమును అనుసరించునది (క్రమమునను సరించి ప్రత్యేకాన్వయము కలది), భవతి=అగును.

తా. క్రమము, యౌగపద్యము అనువాని స్వరూపస్వభావములను వివరించుటకు ఈ ప్రసంగము ప్రారంభింపబడినది.

అనేకార్థకములగు శబ్దములను వాక్యములలో ప్రయోగించుటకు రెండు మార్గము లున్నవి. మొదటిది క్రమము—ఎన్ని అర్థములను చెప్పదలచుకొన్న అన్ని శబ్దములను విడిగా పలుకుట. ఈ మార్గమున శబ్దస్వరూపము వాస్తవముగ ఒకటే అయినను, 'వేర్వేరు' అన్నట్లు ఊహించుకొనవలసి ఉండును (కావుననే శబ్దములను మరల మరల పలికినట్లు భావన). రెండవది యౌగపద్యము—శబ్దమును ఒక్కసారే పలుకుట. ఇందు శబ్దరూపమొకటే అని భావింపవలయును. ఈ రెండుపద్ధతులను మించిన వేరొక పద్ధతిలేదు.

యౌగపద్యముతో ప్రయోగించినపుడు కూడ, విడివిడిగా ఉండు క్రియలు తమతమ కారకములతో ప్రత్యేకముగనే సంబంధించును. అట్లు అన్వయించుట క్రియయొక్క స్వభావము. మీదికారికలలో చూపిన 'అక్షాః భజ్యంతామ్' ఇత్యాది వాక్యమే ఇందుకు ఉదాహరణము. భంజనమను క్రియ రథాక్షమునకే (ఇరుసు) చెందుననియు, భుజిక్రియ విభీతకాక్షమునకే (పండు) చెందుననియు, దేవనక్రియ (ఆట) దేవనాక్షమునకే (పాచిక) చెందుననియును ఇచట బోధకలుగును.

క్రమ యౌగపద్యము లనునవి వాస్తవమున శబ్దముయొక్క శక్తులే అని చెప్పుచున్నాడు.

భేదసంసర్గశక్తీ ద్వే శబ్దా ద్భిన్నే ఇవ స్థితే
యౌగపద్యేఽప్యనేకేవ ప్రయోగే భిద్యతే శ్రుతిః . 464

ద్వే=రెండైన, భేదసంసర్గశక్తీ=భేదము, సంసర్గము అనుశక్తులు, శబ్దాత్= శబ్దముకన్న, భిన్నే + ఇవ=వేరయినవి అన్నట్లు, స్థితే=ఉన్నవి. యౌగపద్యే + ప్రయోగే + అపి=ఒక్కసారే శబ్దమును ప్రయోగించినను, అనేకేన=అనేకసాధనములతో క్రియకు

సంబంధము కలుగుచున్నందుచే, శ్రుతిః=సాధనముయొక్క వినబడుట, భిద్యతే=వేరగును (సాధనశబ్దములు విడివిడిగా స్ఫురించును).

"అక్ష" మొదలగు నానార్థక శబ్దములలో వాస్తవముగ శబ్దమునకే భేదము, సంసర్గము, అను రెండు శక్తులున్న వని చెప్పవలయును. "ఎన్నిఅర్థములు ఉంటే, అన్ని శబ్దములును ఉండుట" భేదమనబడును. "శబ్దములన్నియు కలిసి, అంటుకున్నట్లు ఒకశబ్దముగనే భాసించుట" సంసర్గమనబడును. భేదమునకే "క్రమ" మనియు, సంసర్గమునకే "యౌగపద్య"మ నియును మారుపేర్లు. శక్తికిని, శక్తిమత్తునకును (శక్తికలది) అభేదము సహజము. కావున శబ్దమునకును, దానిశక్తులగు భేదసంసర్గములకును అభేదమే (రెండును ఒకటే) అనక తప్పదు. అయినను ఆ రెండుశక్తులను శబ్దముకన్న వేరయినవన్నట్లుగా ఊహింపబడు చుండును. మరొకవిషయము : శబ్దమును ("అక్షాః" మొదలగుదానిని) యౌగపద్యముతో ప్రయోగించినను, దానిని ఆవృత్తి చేసికొనియే, విభిన్నములగు క్రియలతో (భజ్యంతామ్, భుజ్యంతామ్, మొదలగునవి) సంబంధమును చూపవలయును. అనగా "అక్ష" మొదలగు సాధనశబ్దమును విడివిడిగా ప్రయోగించునపుడు, శబ్దభేదము ఉండునుగాన, విభిన్న క్రియలతో సంబంధము స్పష్టముగ కుదిరినట్లే, ఒక్కసారి ప్రయోగించినను శబ్దావృత్తిని చేయుదుము. గాన విభిన్న క్రియలతోడి సంబంధము సంభవించును. ఒక్కసారే పలికినంతమాత్రమున, "శబ్దముకూడ ఒక్కటే అని అనుకొనకూడదు" అని సారాంశము.

వి. అర్థముయొక్క క్రమము (భేదము) గాని, యౌగపద్యముగాని శబ్దమును బట్టియే తెలియుచుండును గాన భేదసంసర్గశక్తులు రెండును శబ్దశక్తులే అగును గాని అర్థ శక్తులు కానేరవు.

"అక్షాః" ఇత్యాది వాక్యములలో తంత్రమును ఆశ్రయింపక పోయినను ప్రత్యేక పరిసమాప్తి సంభవించు రీతిని ప్రతిపాదించుచున్నాడు.

అభిన్నో భేదరూపేణ య ఏకోఽర్థో వివక్షితః
తత్రాఽవయవధర్మేణ సముదాయోఽనుగృహ్యతే . 465

అభిన్నః=స్వయముగా భేదమును కలిగిఉండనటువంటిన్ని, ఏకః = ఒక సముదాయరూపమైన, యః=ఏ, అర్థః = అర్థము, భేదరూపేణ = భిన్నభిన్నముగా, వివక్షితః = చెప్పదలపబడినదో, తత్ర = అచ్చట (ఆ అర్థము విషయములో), అవయవధర్మేణ=అవయవముల భేదముచే, సముదాయః=సముదాయము, అనుగృహ్యతే = అనుగ్రహింపబడును (భేదముగలదిగా చేయబడును).

తా. కొన్నివస్తువుల ప్రోగు సముదాయమును, సముదాయమందలి విడివిడి వస్తువులు ఆ సముదాయమునకు అవయవములును అగును.సముదాయ మొక్కటియే. అందు విభాగము ఉండదు. అవయవములందు విభాగము ఉండును. ఈ అవయవభేదమును, సముదాయమును చెప్పు శబ్దముతోనే కొన్నిచోట్లబోధింతురు. అనగా సముదాయవాచకశబ్దమును ఒక్కసారే పలికి, అవయవములను విడివిడిగా బోధింపప్రయత్నింతురు. ఇందుకు లోకమందలి ఉదాహరణము : "సభకు జనము గొప్పగావచ్చినది (వచ్చినారు)". ఇచట "జనము" అను పదమునకు "జనులు" (విడివిడిగా) అను అర్థము. ఇట్టి తీరును "ఉద్భూతావయవభేదము" (సముదాయ

మందు అవయవములభేదమును ఆరోపించుట) అందురు. దీనిని స్వీకరించినచో, మీదచూపిన "అక్షాః" మొదలగు స్థలములలో, ఆ ఒక్క శబ్దమువలననే అవయవభేదము స్ఫురించి, (అక్షాః, అక్షాః, అక్షాః అని) క్రియలు ప్రత్యేకముగ సంబంధించును. ఈ పక్షమందు," వక్త తంత్రముతో పలుకు ననియు, బోద్ధ అవృత్తితో అర్థమును తెలిసికొను ననియును" వేరుగా ఉపపాదింప నక్కరలేదు.

శబ్దతంత్రమును అవలంబించినను, అట్టి వాక్యములలో పరిసమాప్తిని సాధించుకొన వచ్చునని నిరూపించుచున్నాడు.

భేదనిర్వచనే త్వస్య ప్రత్యేకం వా సమాప్యతే
శ్రుతి ర్వచనభిన్నా వా వాక్యభేదేఽవతిష్ఠతే . 466

వా=లేక, అస్య = ఈ "అక్షాః" అను బహువచనాంతముచే బోధింపబడు సముదాయమునకు, భేదనిర్వచనే + తు = అవయవభేదమునుసరించి భేదమును చెప్పినపుడు, ప్రత్యేకమ్=విడివిడిగా, సమాప్యతే = వాక్యార్థము సమాప్తిని పొందును (కియలు విడివిడిగా సాధనములతో సంబంధించి, వాక్యములు పూర్తి అగును).

వా=లేక, శ్రుతిః = "అక్షాః" అను బహువచనాంతము, వచనభిన్నా = వచనముతో వేరైనదై = ఏకవచనాంతముగ మారినదై, వాక్యభేదే = వేరువేరు వాక్యములుగ, అవతిష్ఠతే= పర్యవసించును.

తా. "అక్షాః" అను శబ్దముబోధించు సముదాయమునకు, ఉద్భూతావయవ భేదమును అంగీకరించినపుడు, విజాతీయములగు క్రియాపదములకు విడిగా కారకములతో సంబంధమేర్పడి, "అక్షాః భజ్యంతామ్, అక్షాః భుజ్యంతామ్, అక్షాః దీవ్యంతామ్," అను సంపూర్ణ వాక్యములు సిద్ధించును.

లేక—"అక్షాః" అను పదమును విడివిడిగా ఏకవచనాంతముగ మార్చుకొని, తదనుగుణముగ క్రియాపదములనుకూడ ఏకవచనాంతములుగా మార్చి, "అక్షః భజ్యతామ్, అక్షః భుజ్యతామ్, అక్షః దీవ్యతామ్", అని మూడు ప్రత్యేకవాక్యములనైనను సంపాదించి అర్థమును తెలియనగును.

వి. "అక్ష" మొదలగు నానార్థక శబ్దములలో, శబ్దము ఒకటే అయి, అర్థములు పరస్పరము దానిని అంటిపెట్టుకొని ఉండునని చెప్పినచో, "అర్థతంత్రము" అని అందురు. శబ్దములే (సమానరూపముగలవి—ఆవశ్యకమైన అర్థములను చెప్పునవి) అతుకుకొని, ఒక శబ్దముగా కనుపించునన్నచో "శబ్దతంత్రము" అని అందురు. ఈ రెండు పక్షములనుకూడ, వాక్యపరిసమాప్తి పరిశీలనములో చూపుచుందురు.

ప్రకృతము "అక్షాః" అను బహువచనమును ఏకవచనముగా మార్చుట అను అంశము శబ్దతంత్రపక్షమునకు చెందును.

శబ్దపరిసమాప్తి యొక్క ఒకానొక రీతిని చూపుచున్నాడు.

తత్రైకవచనాంతో వా సోఽక్షశబ్దః ప్రయుజ్యతే
ప్రత్యేకం వా బహుత్వేన ప్రవిభాగో యథాశ్రుతి . 467

తత్ర = "అక్షాః భజ్యంతామ్, భుజ్యంతామ్, దీవ్యంతామ్" అను వాక్యములో, సః = ఆ, అక్షశబ్దః = అక్షశబ్దము, ఏకవచనాంతః + వా = ఏకవచనాంతముగా అయినను, ప్రయుజ్యతే = ప్రయోగింపబడును. వా = లేక, యథాశ్రుతి = వాక్యము వినిపించినట్లుగానే, బహుత్వేన = బహువచనాంతముగానే, ప్రత్యేకమ్ = విడివిడిగా, ప్రవిభాగః = విభాగము, (క్రియతే = చేయబడును).

తా. "అక్షాః భజ్యంతామ్" ఇత్యాదివాక్యములలో, శబ్దములను బట్టి ప్రత్యేక వాక్యసమాప్తిని చెప్పదలచుకొన్నపుడు, అక్షశబ్దమును, క్రియలను కూడ ఏకవచనాంతము లుగా మార్చుకొని, వాక్యసమాప్తిని చెప్పవచ్చును. లేక—ఉన్నదున్నట్లుగా బహువచనాంత ములుగానే, క్రియలకును, సాధనములకును (అక్షాః అనుదానిని ఆవృత్తిచేసి) సంబంధమును చూపి, ప్రత్యేకసమాప్తిని పొందవచ్చును.

వి. "అర్థమునుబట్టి వాక్యసమాప్తి" అన్నపక్షములో ఆవృత్తిమొదలగు ప్రక్రియ అంతయు అర్థమునకే ముఖ్యముగా సంబంధించును. "శబ్దమునుబట్టి వాక్యసమాప్తి" అనుపక్ష మందు ఎట్టి కల్పనముచేసినను, అది ముఖ్యముగా శబ్దమునకే సంబంధించును. ఈ రెండు పక్షములనుకూడ శాస్త్రకారులు ఎడనెడ చూపుచుందురు. వీనిని యథాసంభవముగ ఆయా వాక్యములలో సమన్వయించుకొనవలెను.

ఈ కారిక, మీది కారికకు అనుబంధమే.

"అర్థభేదమున్నను శబ్దభేదము లేదు" అను మతమున, అనేకార్థక వాక్యములలో శక్తిభేదముచే అర్థవిభాగము సిద్ధించునని ప్రతిపాదించుచున్నాడు.

ద్విష్ఠాని యాని వాక్యాని తేష్వ ప్యేకత్వదర్శినామ్
అనేకశక్తే రేకస్య స్వశక్తిః ప్రవిభజ్యతే . 468

యాని=ఏ, వాక్యాని=వాక్యములు, ద్విష్ఠాని=రెండు అర్థములుగలవై ఉండునో, తేషు + అపి=వానియందుకూడ, ఏకత్వదర్శినామ్= "శబ్దము ఒకటే" అనువారి మతములో, అనేకశక్తేః = ఒకటికి మించిన అర్థములను బోధించుశక్తులుగల, ఏకస్య = ఆ ఒకవాక్యము యొక్క, స్వశక్తిః = తనయొక్క శక్తి, ప్రవిభజ్యతే = వేరువేరుగా తెలియబడును.

తా. రెండువిధములైన అర్థములను సమర్పించువాక్యములను "ద్విష్ఠములు" అని అందురు. ఇటువంటివి శాస్త్రములోను, లోకములోను కూడ కొన్ని ఉండును. "రెండు విధములైన అర్థములను ఇచ్చుశక్తులు, వేరువేరుగా ఈ వాక్యములకు ఉండుననియు, శబ్దము ఒకటే అనియును" ఈ వాక్యముల విషయములో అభేదవాదు లందురు.

వి. "అనేకార్థక స్థలములలో, ఎన్ని అర్థములుంటే, అన్నిశబ్దములు వేర్వేరుగా ఉండునని" కొందరందురు. వీరు శబ్ద భేదవాదులు. "శబ్దమొకటే అనియు, ఆ శబ్దమునకే వేర్వేరుఅర్థములనుచెప్పు శక్తులు వేర్వేరుగా ఉండుననియును" మరికొందరందురు. వీరు శబ్దా భేదవాదులు. భేదవాదులమతములో "శబ్దతంత్రము" వలన అర్థభేదము సిద్ధించును. "స్వరూ పము సమానముగా ఉండి, వేర్వేరు అర్థములుగల శబ్దములు ఒకశబ్దముగా అతుకుకొనుట (వర్ణక్రమము ఒకటే కావున) "శబ్దతంత్రము" అగును. ఈ పక్షములో వక్త శబ్దమును ఒకసారే పలుకుటయు, బోద్ధ శబ్దమును ఆవృత్తిచేసికొని, (విడదీసికొని) అర్థమును తెలియ

టయు జరుగును. అభేదవాదులమతములో శబ్దముఒకటే కావున, శబ్దతంత్రము సంభవింపదు. అందుచే వీరు "శక్తితంత్రము" ను ఆశ్రయింతురు. "ఒకశబ్దమునకే అనేకార్థములనుచెప్పు శక్తులు భిన్నభిన్నములుగా ఉండుట శక్తితంత్రము" అనిపించుకొనును. దీనివలన, శబ్దమును ఒకేసారిపలికినను, దానికుండు వేర్వేరుశక్తులు వేర్వేరుఅర్థములను తెలియజేయుచుండును. ఇచట అర్థములను మార్చుకొనుటయే ఆవశ్యకమగును కాని, శబ్దావృత్తి ఆవశ్యకముకాదు. ఈ తీరును "అర్థతంత్రము" అని కూడ చెప్పవచ్చును.

ఈ విషయములు 317 వ కారికలో కొంతవరకు సూచింపబడినవి. ప్రసంగము వచ్చినపుడెల్ల గ్రంథకర్త వీనిని ఎడనెడ స్పృశించుచునే ఉండును. భేదపక్షమును, అభేద పక్షమును కూడ, వైయాకరణులకు అభిమతమే. కావుననే తదనుసారముగను, యథా సంభవ ముగను రెండిటికిని సంబంధించు యుక్తులను, వాని వివరణములును సంకీర్ణముగ ఇందు కనిపించుచుండును. (కేవలము పదములకును [అనేకార్థములు] పదార్థములకును సంబంధించిన చర్చ ఇంతవరకు సాగినది.)

ప్రకృతము ఈ కారిక రెండర్థములుగల వాక్యములకు సంబంధించిన చర్చను ప్రారంభించినది. ఇది 475 వ కారికతో (అనగా – ఈ కాండము చివరకు) పూర్తిఅగును. భేదాభేదపక్షములను రెండిటిని చూపుచు చర్చ కొనసాగును.

శాస్త్రమందలి ద్విష్ఠవాక్యమున కొక ఉదాహరణము : 'ఇగ్యణః సంప్రసారణమ్' (1-1-45) అను సూత్రము. ఇది సంప్రసారణమను సంజ్ఞను బోధించును. ఇచట 'యణః ఇక్' (యణ్ణుల ప్రసంగములో ప్రయోగింపబడు ఇక్కులు) అనువాక్యమునకు 'సంప్రసారణ సంజ్ఞ' అని ఒక అర్థము. య్, వ్, ర్, ల్, అనువాని స్థానమున వరుసగ ప్రయోగింపబడు ఇ, ఉ, ఋ, ఌ అను వర్ణములకు విడివిడిగానే సంప్రసారణ సంజ్ఞ' అని రెండవ అర్థము.

లోకమందలి ద్విష్ఠ వాక్యమున కొక ఉదాహరణము : 'శ్వేతోధావతి'. 'తెల్లని వాడు పరుగెత్తుచున్నాడు' (శ్వేతః + ధావతి) అని ఒక అర్థము. "కుక్క ఇటునుండి పరుగెత్తు చున్నది" (శ్వా + ఇతః + ధావతి) అని రెండవ అర్థము.

ఇటువంటి ద్వ్యర్థక వాక్యములలో, వాక్యమునకు ఉండు రెండు శక్తులను వేరు చేసికొని, తన్మూలమున వేర్వేరు అర్థములను గ్రహింపవలెనని అభేదవాదులందురు. శాస్త్రీయ ములును, లౌకికములును అగు ద్వ్యర్థవాక్యము లన్నింటియందును ఈ మార్గమునే వారు అవలంబింతురు. 'ద్విష్ఠ' అను పదము ఒక్కద్వ్యర్థకములనే కాక బహ్వర్థకములను కూడ గ్రహించును.

"ప్రత్యర్థం శబ్దనివేశః" అనునది వైయాకరణుల సిద్ధాంతము. ఈ వచనము 'సరూపాణా మేకశేష ఏకవిభక్తౌ' (1-2-64) అను సూత్రముయొక్క భాష్యములో ఉన్నది. ఇచట 'అర్థమర్థం ప్రతి=ప్రత్యర్థమ్' అను విగ్రహమును చెప్పినచో, 'ఒక్కొక అర్థము చెప్పుటకు, ఒక్కొక శబ్దమును వేరుగా వాడవలెను' అను భావము వచ్చును. ఇదియే శబ్దభేద వాదము. 'అర్థౌ అర్థౌ ప్రతి' 'అర్థాన్ అర్థాన్ ప్రతి = 'ప్రత్యర్థమ్' అని ద్వివచన బహు వచనాంతములతో కూడ విగ్రహమును చూపినచో, 'రెండు కాని అంతకు మించి కాని అర్థము లను చెప్పుటకు కూడ, ఒక శబ్దమునే వాడవచ్చును.' అనుభావము ఫలించును. ఇదియే శబ్దా భేదవాదము.

'ప్రత్యర్థమ్' అనుచోట మూడువిధములైన విగ్రహములను కూడ, భాష్యకారుడు అంగీకరించెను. కావున భేదాభేదవాదములు రెండిటికిని ఈ వచన మొక్కటియే మూలమై కూర్చున్నది. కావుననే రెండు మతములును వైయాకరణులకు స్వీకార్యములైనవి.

కాగా—"ఎన్ని యుక్తులను ఎన్ని విధముల చూపినను, అనేకార్థక స్థలములలో భేదవాదులకు శబ్దతంత్రము అనియు, అభేదవాదులకు శక్తితంత్రము — లేక - అర్థతంత్రము అనియు, ఎవరి కిష్టమైన మార్గమును వారు అనుసరింపవచ్చు ననియును" ఇచటి తత్త్వము. దీనినే ఈ దిగువ శ్లోకములు వివరించును.

శబ్దభేదమును అంగీకరించువారి మతమున శబ్దతంత్రముచే అభీష్టము సిద్ధించునని వాఖ్యానించుచున్నాడు.

అత్యంతభిన్నయో ర్వా స్యాత్ ప్రయోగ స్తంత్రలక్షణః
ఉపాయ స్తత్ర సంసర్గః ప్రతిపత్తృషు భిద్యతే . 469

వా = లేక, అత్యంత భిన్నయోః = పూర్తిగా వేరయిన శబ్దములకు, తంత్ర లక్షణః=శబ్దతంత్రరూపమైన, ప్రయోగః = వక్తయొక్క ఉచ్చారణము, స్యాత్ = అగును. తత్ర = ఆ స్థలములో, ప్రతిపత్తృషు = తెలిసికొనువారి విషయములో, సంసర్గః = సంబంధము (వాక్యసంబంధము, లేక-పదార్థ సంబంధము), ఉపాయః=ఉపాయమై, భిద్యతే= వేరగును.

తా. 'అక్షాః' మొదలగు శబ్దములను కావలసిన అర్థముల ననుసరించి వేర్వేరుగానే వక్త ప్రయోగించును. అతడు శబ్దతంత్రమును ఆశ్రయించునుగాన, శబ్దములన్నియు అతుకుకొనినట్లు అయి ఒక శబ్దముగానే వినిపించును. ఆ శబ్దమును ఆవృత్తి చేసికొని, కావలసిన అర్థములను బోద్ధ తెలిసికొనును. కాగా వక్తకు శబ్దతంత్రమున్ను, బోద్ధకు శబ్దావృత్తియును ఉపాయములగును'— అని శబ్దభేదవాదులందురు.

వి. 'ఒక్కొక్క అర్థమునకు, ఒక్కొక్క శబ్దము ఉండవలయు' నని శబ్దభేద వాదులందురు. వారి మతమున, 'అక్షాః' మొదలగు అనేకార్థక శబ్దముల విషయములోను, 'ఇగ్యణః సంప్రసారణమ్' 'శ్వేతోధావతి' మొదలగు ద్వ్యర్థవాక్యముల విషయములోనుకూడ, 'అభిమతములగు అర్థములు తెలియుగాక' అను భావముతో వక్త ఒకసారే శబ్దమును ఉచ్చరించును. (శబ్దములు సరూపములగుటచే, అన్నింటిని కుదించి వానికి ఒకరూపమునే ఇచ్చును). అయినను ఆ శబ్దమును విడదీసికొని బోద్ధ అర్థములను తెలిసికొనును. అనగా ఏదో ఒక అర్థము కావలసినను, లేక-అన్ని అర్థములును కావలసినను, వానిని గ్రహించుటకు వీలుగా లాఘవమును బట్టి, ఆయా సందర్భములలో వక్తయగు వ్యక్తి శబ్దమును ఒక్కసారే పలికినను, బోద్ధ అగు వ్యక్తి తనకు కావలసిన తీరులో శబ్దమును విడదీసికొని అర్థమును తెలిసికొనుచుండును. ఇట్లు విభిన్నార్థములు కలిసి ఉండుటయే సంసర్గ మనిపించుకొనును.

భేదేనావగతౌ పూర్వం శబ్దౌ తుల్యశ్రుతీ పునః
తంత్రేణ ప్రతిపత్తారః ప్రయోక్త్రా ప్రతిపాదితాః . 470

పూర్వమ్ = ప్రయోగించుటకు ముందు, భేదేన = వేర్వేరుగా, అవగతౌ = తెలియబడిన, శబ్దౌ = శబ్దములు, పునః = మరల (ప్రయోగించు సమయమున), తుల్యశ్రుతీ =

సమానమైన వర్ణక్రమముగలవై, తంత్రేణ=తంత్రముతో, ప్రయోక్త్రా=వక్తచే, ప్రతిప్రత్తారః=బోద్ధలనుగురించి, ప్రతిపాదితాః=ప్రతిపాదింపబడును (వినిపింపబడును).

తా. మీది కారికకు ఇది వివరణము. ప్రయోగించుటకు ముందు 'శబ్దములు వేరు' అని తెలిసినను, వాని వర్ణక్రమము సమానమగుటచే, వక్త అగువాడు లాఘవమును అపేక్షించి ఒక్కసారే శబ్దమును ప్రయోగించును. అయినను బోద్ధ ఆవృత్తిని ఆశ్రయింపక తీరదు. దానివలననే అతనికి విభిన్నార్థములు తెలియును.

వి. 'అక్షాః (ఇరుసులు) అక్షాః (విభీతక ఫలములు), అక్షాః (పాచికలు)'. శబ్దభేదవాదములో ఈ మూడును వేర్వేరు శబ్దములు అయినను వీని స్వరూపమొకటే. అట్లే, 'శ్వా+ఇతః=శ్వేతః (కుక్క, ఇక్కడనుండి) 'శ్వేతః' (తెల్లనివాడు), అనుచోట కూడ శబ్దములు వేరు, రూపమొక్కటే. ఈ రూపసామ్యమును బట్టి సౌకర్యము కొరకై, వక్త ఒక్కసారే శబ్దమును ప్రయోగించును. అర్థములను తెలియునపుడు మాత్రము శబ్దములను వేరుచేసియే తెలియవలయును. శబ్దభేదవాదములో ఇంతకు మించిన ఉపాయము లేదు.

శబ్దభేదమతముననే వేరొకరీతిని తంత్రమును నిరూపించుచున్నాడు.

ఏకస్యాపి వివక్షాయా మనునిష్పద్యతే పరః
వినాభిసంధినా శబ్దః శక్తిరూపః ప్రకాశతే. 471

ఏకస్య=ఒక అర్థమునే బోధించు శబ్దముయొక్క, వివక్షాయామ్+అపి=వివక్షయందు కూడ, పరః=రెండవ అర్థమును చెప్పు వేరొక శబ్దము, అనునిష్పద్యతే=తరువాత పుట్టును.

అభిసంధినా+వినా=వక్తయొక్క తాత్పర్యము లేకపోయినను, శబ్దః=అనేకార్థక శబ్దము, శక్తిరూపః=అనేకార్థములను ఇచ్చు అనేక శక్తులు కలదిగ, ప్రకాశతే=ప్రకాశించును (తెలియబడును).

తా. అనేకార్థకశబ్దమును వాడినపుడు, వక్తకు ఏదో ఒక అర్థమందే దృష్టి ఉండవచ్చును. వేరొక అర్థమందు దృష్టి లేకపోవచ్చును. అయినను శబ్ద స్వరూపము ఒకటే అయినందున, ఉచ్చరింపబడిన శబ్దమునకు వెనువెంటనే, అట్టి శబ్దమే వేరొకటికూడ స్ఫురించి, రెండవ అర్థము బోద్ధకు తెలియుచుండును. ఇట్లే ఎన్ని అర్థములను బోద్ధ అపేక్షించునో, అన్ని శబ్దములును, ఒక దాని వెనుక మరొకటి అతనికి వినిపించుచుండును. శబ్దభేదవాదుల యొక్క శబ్దతంత్రమును ఈ విధముగా కూడ వ్యాఖ్యానించుకొనవచ్చును.

అట్లే—"వక్తకు అనేకార్థములందు ఇచ్ఛ లేకున్నను, అతడు ప్రయోగించిన శబ్దమునకు అనేక శక్తులు ఉండుటవలన, వాని మూలముగా బోద్ధకు అనేకార్థములు తెలియుచుండునని" కూడ సమన్వయింపవచ్చును. ఇట్టి సమన్వయము శబ్దాభేదవాదులయొక్క శక్తితంత్రము-లేక- అర్థతంత్ర మగును (ఏదయినను ఫలితమొకటే).

వి. ఈ కారికయందలి మొదటి సగము, శబ్దభేదవాదుల శబ్ద తంత్రమునకు సంబంధించిన ప్రకారాంతరమును (వేరొకరీతి) చెప్పినది. రెండవ సగము, శబ్దాభేదవాదుల శక్తి తంత్రముయొక్క ప్రకారాంతరమును చూపినది. ఒక ధ్వనికి అనుబంధముగా పుట్టు ధ్వనిని అనురణన మందురు. అట్లే ఒక శబ్దమును పలుకగానే, అట్టివే మరికొన్ని శబ్దములు

పుట్టుటను అనునిష్పాదన మందురు. ఈ రీతిని స్వీకరించినపుడు శబ్దావృత్తి అక్కరలేదు. (ఎట్టియుక్తిని చూపినను, "ఒక శబ్దమువలన అనేకార్థములను సాధించుటయే" పరమార్థము).

ఈ సందర్భముననే శక్తితంత్రమును చూపుచున్నాడు.

అనేకశక్తి రేకస్య యుగప చ్ఛ్రియతే క్వచిత్
అగ్నిః ప్రకాశదాహాభ్యా మేకత్రాపి నియుజ్యతే . 472

ఏకస్య = ఒకే శబ్దముయొక్క, అనేకశక్తిః = వేరుగా అర్థములను బోధించు శక్తులు, క్వచిత్ = కొన్నిచోట్ల, యుగపత్ = ఒక్కసారిగా (కలిసికట్టుగా), శ్రీయతే = ఆశ్రయింపబడును.

ప్రకాశదాహాభ్యామ్ = వెలుగుట, కాల్చుట అను రెండు శక్తులతోను, అగ్నిః = అగ్ని, ఏకత్ర + అపి = ఒకేచోటకూడ, నియుజ్యతే = వినియోగింపబడును.

తా. శబ్దాభేదవాదుల శక్తితంత్రములోని వేరొకరీతిని, ఈ కారిక వివరించినది. శక్తి తంత్రమున ఒకే శబ్దమునకు, వేర్వేరు అర్థములను బోధించు వేర్వేరు శక్తులు ఉండును. కొన్నిచోట్ల ఆ శక్తులన్నియును ఒకేసారి పనిచేయును. కాన, కావలసిన అర్థము లన్నియును ఒకేసారి తెలియును.

ఇందుకు లౌకికమైన ఒక దృష్టాంతము : అగ్నికి వెలుగు నిచ్చుట, కాల్చుట అను రెండు శక్తులున్నవి. వానిని ఆవశ్యకతనుబట్టి ఆయా సమయములలో, ఆయా స్థలము లలో, ప్రత్యేకముగ కాని, కలిసికట్టుగా ఒకేసారి గాని వాడుకొనవచ్చును (కొన్నిచోట్ల వెలుగుమాత్రమే. కొన్నిచోట్ల దాహము మాత్రమే. మరికొన్నిచోట్ల రెండున్ను కలిసి). శబ్ద శక్తుల విషయమును కూడ ఇట్లే ఊహించునది.

వి. వక్త యేదో ఒక అర్థమునే చెప్పదలచినపుడు, వేరొక అర్థము వచ్చు రీతి మీది కారికలో వివరింపబడినది. 'అన్ని అర్థములను వివక్షించినను అవన్నియు, ఒకేసారి రావచ్చు' నను పద్ధతిని ఈ కారిక చెప్పినది. అనగా వక్తయొక్క ఇచ్ఛానుసారము శబ్దశక్తులు పనిచేసి, ముందువెనుకలుగా కాని, ఒకేసారి కాని అర్థము లన్నియును వచ్చుచుండు నని సారాం శము. 'అక్ష' మొదలగు శబ్దములును, "శ్వేతో ధావతి" మొదలగు వాక్యములును ఉదాహర ణములను విషయమును మరువకూడదు.

నానార్థక స్థలములలో—ఒకే ఆకారముగల శబ్దములు వేరువేరుగా ఉండి, వేర్వేరు అర్థములను చెప్పుట ఒక పద్ధతి. ఒకే శబ్దము ఉండి, వేర్వేరు అర్థములను చెప్పుట రెండవ పద్ధతి. ఇది సూత్రప్రాయము. ఇది మనస్సుకు గట్టిగా పట్టుటకై, గ్రంథకర్త అనేకరీతులలో చర్విత చర్వణముగా (చెప్పినదానినే చెప్పుట) చర్చలను కొనసాగించెను. 'ద్విర్బద్ధం సుబద్ధం భవతి' (రెండుకట్లు కట్టినచో బాగుగా బిగియును) అను న్యాయముతో వీనిని సమర్థించు కొనవలెను.

శాస్త్రీయ వాక్యములో శక్తితంత్రమును సమన్వయించుచున్నాడు.

అవృత్తిశక్తిభిన్నార్థే వాక్యే సకృదపి శ్రుతే
లింగా ద్వా తంత్రధర్మా ద్వా విభాగేనావతిష్ఠతే. 473

అవృ త్తి శ క్తి భిన్నార్థే=శబ్దముయొక్క అవృ త్తివలనగాని, శబ్దశక్తుల భేదము వలనగాని వేర్వేరు అర్థములను బోధించు, వాక్యే = వాక్యము, ("ఇగ్యణః సంప్రసారణమ్" మొదలగు శాస్త్రీయమైన వాక్యము), సకృత్=ఒకసారి, శ్రుతే + అపి=వినబడినను, (తత్ = ఆ వాక్యము) లింగాత్ + వా = జ్ఞాపకమువలన గాని (విశేషార్థమును సూచించునది), తంత్ర ధర్మాత్ + వా = శ క్తితంత్రమువలన గాని, విభాగేన = వేరుగా (వేర్వేరు అర్థములను బోధించునదిగా), అవతిష్ఠతే = ఉండును.

తా. 'ఇగ్యణః సంప్రసారణమ్' (1-1-45) మొదలగు శాస్త్రీయ వాక్యములలో కూడ, రెండర్థములు వచ్చుచుండు'నని ఇదివరకు సూచింపబడినది (468 వ శ్లోకకము). ఆ యంశమునే మరల ఈ కారిక వివరించుచున్నది. "ఇక్, యణః" (యణ్ణుల స్థానమందలి ఇక్కులకు) అను వాక్యమునకు సంప్రసారణ సంజ్ఞ అనునది ఇచటి మొదటి అర్థము. "య్, వ్, ర్, ల్ అను వర్ణముల స్థానములో వరుసగా ప్రయోగింపబడు ఇ, ఉ, ఋ, ఌ, అను వర్ణములకు ప్రత్యేకముగా సంప్రసారణ మని పేరు" అనునది రెండవ అర్థము. ఈ రెండర్థ ములును శబ్దభేదవాదుల మతములో 'శబ్దావృత్తి' వలన సిద్ధించును. శబ్దాభేదవాదుల మతములో 'శ క్తితంత్రము' (రెండర్థములను చెప్పు రెండు శక్తులుండుట) వలన లభించును.

శబ్దభేదవాదులకు ఇతర సూత్రములలో కనబడు జ్ఞాపకములు కూడ సాయము చేయును. ఎట్లన : 'సంప్రసారణాచ్చ' (6-1-10०) మొదలగు సూత్రములు 'వర్ణములకే సంప్రసారణ సంజ్ఞ' అని జ్ఞాపనము చేయును. 'వసోః సంప్రసారణమ్' (6-4-131) మొద లగు సూత్రములు 'వాక్యమునకు సంప్రసారణ సంజ్ఞ' అని సూచించును.

శబ్దాభేదవాదులు, "రెండర్థములనిచ్చు రెండు విధములైన శక్తులును వాక్యమునకే ఉండును' అని అందురుగాన, వారికి జ్ఞాపకములతో పనిలేదు.

వి. 'శ్వేతోధావతి' మొదలగు లౌకిక వాక్యములకువలెనే, 'ఇగ్యణః సంప్రసా రణమ్' మొదలగు పాణిని వాక్యములకు కూడ రెండర్థములు సంభవించుననియు, మతభేదము ననుసరించి అవృత్తివలననో. లేక అర్థతంత్రమువలననో ఆ అర్థములను సాధించుకొన వలయు ననియును ఈ కారికయొక్క తత్త్వము.

"సంప్రసారణాచ్చ"(6-1-108) అని సూత్రము 'సంప్రసారణా దచి పరే పూర్వ రూప మేకాదేశః స్యాత్' అని వృత్తి, 'సంప్రసారణమను సంజ్ఞ గల వర్ణమునకు అచ్చు పరమగునపుడు పూర్వరూప మేకాదేశమగును' అని అర్థము. ఇచట విధింపబడు 'పూర్వరూప' మను కార్యము వర్ణమునకు మాత్రమే సంభవించును గాన ఈ సూత్రము 'వర్ణములకు సంజ్ఞ' అను అర్థమును తెలియజేయును.

'వసోః సంప్రసారణమ్' (6-4-131) అని సూత్రము. 'వస్వంతస్య భస్య సంప్ర సారణం స్యాత్' అని వృత్తి. "భసంజ్ఞ కలిగిన వస్వంతమునకు (విద్వస్, మొదలగు శబ్దములు) సంప్రసారణమగును" అని అర్థము. ఇచట సంప్రసారణ శబ్దమువలన "యణ్ణుల స్థానమందలి ఇక్కులకు మొత్తముపై సంప్రసారణమని పేరు గదా! అది ఇచట ప్రవర్తించును'' అన్నట్లుగా, సామాన్యార్థము మొదట స్ఫురించునుగాన ఈ సూత్రము 'వాక్యమునకు సంప్ర సారణ సంజ్ఞ' అను అర్థమును తెలియజేయును. ప్రకృతకారికయందలి 'లింగము' అనగా ఇట్టి సూచనయే.

సంప్రసారణ సంజ్ఞాయాం లింగాభ్యాం వర్ణవాక్యయోః
ప్రవిభాగ స్తత్ర సూత్రే ఏకస్మిన్నేవ కల్ప్యతే . 474

సంప్రసారణ సంజ్ఞాయామ్=సంప్రసారణమను సంజ్ఞా శబ్ద విషయములో, వర్ణ వాక్యయోః=ప్రత్యేక వర్ణములకును, వాక్యమునకును చెందిన, లింగాభ్యామ్=జ్ఞాపకములవలన, తత్ర=ఆ, ఏకస్మిన్=ఒక, సూత్రే+ఏవ=సూత్రమందే, ప్రవిభాగః=వర్ణములకును సంజ్ఞ, వాక్యమునకును సంజ్ఞ అను విభాగము, కల్ప్యతే=లభించును.

తా. 'ఇగ్యణః సంప్రసారణమ్' అనునది సంజ్ఞా సూత్రము. "సంప్రసారణాచ్చ" "వసోఃసంప్రసారణమ్" మొదలగునవి విధి సూత్రములు. వీనియందలి సూచనలను బట్టి, 'వర్ణములకును, వాక్యమునకును కూడ సంప్రసారణమను సంజ్ఞ ఉండవచ్చును' అను అర్థము తెలియుచుండును.

వి. మీది కారిక చెప్పిన విషయమునకు వ్యాకరణ శాస్త్రమందలి ఒక ఉదాహరణమును ఈ కారిక చూపినది. ఆ యా విధి సూత్రములలో వినబడు 'సంప్రసారణస్య' 'సంప్రసారణాత్' మొదలగు ఇతర విభక్తులు వర్ణ సంజ్ఞా పక్షమును, 'సంప్రసారణమ్' అను ప్రథమా విభక్తి, వాక్యసంజ్ఞా పక్షమును సూచించునని సారాంశము.

శక్తితంత్రమనెడు అర్థతంత్రము పతంజలికిని అభిమతమే అని సమర్థించుచున్నాడు.

తథా ద్విర్వచనేఽచీతి తంత్రోపాయాదిలక్షణః
ఏకశేషేణ నిర్దేశో భాష్య ఏవోపవర్ణితః . 475

తథా=ఆవిధముగా, ద్విర్వచనేఽచి+ఇతి="ద్విర్వచనేఽచి" అను సూత్రముయొక్క, భాష్యే+ఏవ=మహాభాష్యమందే, తంత్రోపాయాదిలక్షణః=శక్తితంత్రము, లేక-శబ్దావృత్తి అను ఉపాయములను సూచించు, ఏకశేషేణ=ఏకశేషముతో, నిర్దేశః=ప్రయోగము (ఉచ్చారణము), ఉపవర్ణితః=చెప్పబడినది.

తా. ఒక శబ్దమువలన అనేకార్థములను సాధించుటకు, శక్తితంత్రమునుగాని, శబ్దావృత్తిని గాని ఉపాయముగా తీసికొనవచ్చునను అంశమును, 'ద్విర్వచనేఽచి' (1-1-59) అను సూత్రముయొక్క వ్యాఖ్యానమున మహాభాష్యకారుడే స్వయముగ సూచించెను.

వి. "తంత్రము" లేక "ఆవృత్తి" అను ఉపాయముల మూలముగా, అనేకార్థములను పొందవచ్చునని ఇంతవరకును గ్రంథకర్త 'పదే పదే' విశదీకరించెను. అట్టి ఆశయము తన కల్పన కాదనియు, మహా ప్రామాణికుడగు పతంజలియొక్క సిద్ధాంతమే అనియును సమర్థించుటకై ఈ కారికను రచించెను.

"ద్విర్వచనేఽచి' (1-1-59) అని సూత్రము. 'ద్విత్వనిమిత్తే అచి పరే, అచః ఆదేశో న స్యాత్, ద్విత్వే కర్తవ్యే' ద్విత్వము చేయతలపెట్టినపుడు, ద్విత్వమునకు నిమిత్తమైన అచ్చు పరమందుండగా, ముందున్న అచ్చునకు ఎట్టి ఆదేశమును ప్రవర్తింపదు' అని అర్థము.

ఇచట మనకు కావలసిన ముఖ్యాంశ మిది : సూత్రమందు 'ద్విర్వచనే' అను పదమొకసారే ఉచ్చరింపబడినది. కాని దానివలన, 'ద్విత్వనిమిత్తము' 'ద్విత్వము' అను రెండర్థములను గ్రహింపవలసి ఉన్నది. "ఒక శబ్దమువలన రెండర్థములు ఎట్లు వచ్చును?" అని

శంక కలిగినది. దానికి సమాధానముగా 'ద్విర్వచనే' అనునది, 'ఏకశేష'మని పతంజలి చెప్పెను. అది వాస్తవముగ ఏకశేషమైనచో, "ద్విర్వచనయోః" అని ప్రయోగము ఉండక తీరదు (రామయోః—అన్నట్లు సప్తమీ ద్వివచనాంతము). కాని అట్లు ప్రయోగము లేదు. అందువలన ఏక శేషపదముతో, 'శక్తితంత్రమును-లేక-శబ్దావృత్తిని' పతంజలి సూచించెనని అనక తప్పదు. ఈ విధముగ 'తంత్రావృత్తులు' పతంజలికి అభిమతములే అని ఫలించును.

'యత్ పునః ద్వితీయం ద్విర్వచన గ్రహణం కర్తవ్యమ్ః న కర్తవ్య మిత్యాహ- ఏకశేష నిర్దేశాత్ సిద్ధమ్' (సూత్రములో రెండవసారి 'ద్విర్వచనే' అని పలుకవలయునా ః— అక్కరలేదు-ఏకశేషమనుటవలన అభీష్టార్థము సిద్ధించును) అనునవి ఈ సందర్భములోని పతంజలి వచనములు. కాగా "తంత్రము, ఆవృత్తి" అని స్పష్టముగ చెప్పకపోయినను, ఏక శేష శబ్దముతో ఆ రెండింటిని సూచించినట్లు అనుకొనక తీరదు. అట్లు కాకున్న 'ద్విర్వచ నయోః' అని ప్రయోగమును చేయవలసి ఉండును. ఉన్నదున్నట్లు సమర్థించుటయే గాని, ప్రయోగమును మార్చుట పతంజలికి ఎంత మాత్రమును ఇష్టము కాదు.

ఈ కారికతో రెండవకాండము యొక్క విషయమంతయు పూర్తి అయినది. ఇటుపైని పది శ్లోకములతో భర్తృహరి, 'తన గ్రంథము సంప్రదాయబద్ధమనియు, ప్రామా ణికమనియును' ప్రతిపాదించును. ఆ సందర్భముననే, మహాభాష్యము యొక్క మహత్త్వ మును, గురుపరంపరను, తన పరిశ్రమను కూడ చరిత్రరూపమున విశదీకరించును.

మహాభాష్యముయొక్క అవతారమును—తన గ్రంథముయొక్క గురుసంప్రదాయ మును వర్ణించుచున్నాడు.

ప్రాయేణ సంక్షేపరుచీ నల్పవిద్యాపరిగ్రహాన్
సంప్రాప్య వైయాకరణాన్ సంగ్రహేఽస్త ముపాగతే. 476

సంక్షేపరుచీన్ = లాఘవమందును, సౌకర్యమందును ఆసక్తి గలిగినట్టియు, అల్ప విద్యా పరిగ్రహాన్ = విద్యలను తక్కువగా అభ్యసించినట్టి, వైయాకరణాన్ = వైయాకర ణులను, ప్రాయేణ = అధికముగా, సంప్రాప్య = పొంది, సంగ్రహే = 'సంగ్రహము' అను గ్రంథము, అస్తమ్ = కనబడకపోవుటను, ఉపాగతే = పొందగా (దిగువ శ్లోకముతో అన్వ యించుకొనవలెను).

తా. కేవలము సుఖాపేక్షచే పెద్ద గ్రంథములను చదవలేక, చిన్నచిన్న గ్రంథ ములందే ఆసక్తిని చూపునట్టియు, విద్యలందు తక్కువ పరిశ్రమను చేసినట్టియు వైయాకరణులు చాలామంది 'సంగ్రహము' అను మహాగ్రంథమును ఆదరింపకపోవుటవలన, ఆ గ్రంథము కాలగర్భములో కరగిపోయినది. అప్పుడు—

వి. ఈ శ్లోకము మొదలు వరుసగా పది శ్లోకములు మహాభాష్యము యొక్క ఆవిర్భావమును, గౌరవమును, వాక్యపదీయము భాష్యసారమగుటను, కథారూపమున వివరించి చూపును.

పాణినీయ వ్యాకరణమునకు మూలము, పాణిని రచించిన సూత్ర రూపమైన ఎనిమిది అధ్యాయముల గ్రంథము. దీనినే 'అష్టాధ్యాయి' అని అందురు. పిదప 'వ్యాడి' అను ఆచార్యుడు అష్టాధ్యాయిపై "సంగ్రహము" అనుపేరుతో, ఒక గొప్ప గ్రంథమును రచించెను.

అది లక్ష అనుష్టుప్ శ్లోకములు కలిగియుండె నందురు. అది అలసులును, మందబుద్ధులు నగు వ్యక్తుల చేతులలో పడి, కాలక్రమమున నశించిపోయెను. (భాష్యకారుడగు పతంజలి 'సంగ్రహము'ను పెక్కుసారులు పేర్కొనెను. అతనిసమయములో ఆ గ్రంథము ఉండి ఉండవచ్చును.)

పతంజలి మహాభాష్యమును రచించెనని, అది మహావైభవ సంపన్నమనియు వివరింపుచున్నాడు.

కృతేఽథ పతంజలినా గురుణా తీర్థదర్శినా
సర్వేషాం న్యాయబీజానాం మహాభాష్యే నిబంధనే .　　　477

అలబ్ధగాధే గాంభీర్యా దుత్తాన ఇవ సౌష్ఠవాత్
తస్మి న్నకృతబుద్ధీనాం నైవావాస్థిత నిశ్చయః .　　　478

అథ = తరువాత, గురుణా = పూజ్యుడైనటువంటిన్ని, తీర్థదర్శినా = పెక్కుశాస్త్రముల రహస్యములను తెలిసినటువంటిన్ని, పతంజలినా = పతంజలి అను మహానుభావునిచే, గాంభీర్యాత్ = గాంభీర్యమువలన (విషయ గౌరవము), అలబ్ధగాధే = లోతు తెలియనటువంటిన్ని (అంతు చిక్కనటువంటిది), సౌష్ఠవాత్ = సరళముగా ఉండుటవలన, ఉత్తానే + ఇవ = లోతులేనట్లు కనబడునటువంటిన్ని (విశదముగా ఉండునటువంటిది), సర్వేషామ్ = సకలమైన, న్యాయబీజానామ్ = లౌకికములును, శాస్త్రీయములునగు న్యాయములకును పరిభాషలకును, నిబంధనే = మూలకారణమైన, మహాభాష్యే = మహాభాష్యమను వ్యాఖ్యానము, కృతే = రచింపబడగా, అకృతబుద్ధీనామ్ = బుద్ధివైభవము లేనివారలకు తస్మిన్ = ఆభాష్యమందు, నిశ్చయః=నిర్ణయము (తత్త్వజ్ఞానము), న + ఏవ + అవాస్థిత=, కలుగనేలేదు.

తా. వ్యాడివిరచితమైన సంగ్రహమను గ్రంథము నశించిన పిదప, భగవత్పతంజలి పాణినీయ వ్యాకరణమునకు 'మహాభాష్య' మహావ్యాఖ్యను సంతరించెను అది సకల న్యాయములకును పుట్టినిల్లు. అతిగంభీరము అయినను మృదుమధురమైన శైలితో ప్రకాశించునుగాన, పైపైని తేలికగా తోచును. అందువలననే సామాన్యమానవులు ఆ గ్రంథము యొక్క తత్త్వమును గ్రహింపజాలరు.

వి. పాణినీయాష్టాధ్యాయిపై విమర్శరూపమైన వార్తికములను వరరుచి అనబడు కాత్యాయనుడు రచించెను. వార్తికములు చాలవరకు పాణిని సూత్రములను అధిక్షేపించుచుండును. సూత్రములను వార్తికములను కూడ కలిసికట్టుగా తీసికొని, సర్వతోముఖమైన విమర్శమును చేయుచు, తుదకు కాత్యాయనుని ఖండించి పాణినినే పతంజలి సమర్థించును. అతడు సాక్షాత్తుగ ఆదిశేషుని అవతారమందురు (అనగా సాటిలేని మహామేధావి అని భావము). వేరొక వ్యక్తి ఎంతటి పండితుడైనను అంతటి మహావ్యాఖ్యను రచింపజాలడు.

మహాభాష్యము సరళము, గంభీరమును అగు సంస్కృతములో, సంభాషణ రూపమున సాగినది. పైపైని చదువువారలకు అది తేలికగానే తోచును. కాని అందలి ఉక్తి ప్రత్యుక్తుల తాత్పర్యమును, వాదధోరణిని, న్యాయపరిశీలనమును సమన్వయించుకొని విషయ

నిర్ణయమును పొందగలుగుట సామాన్యబుద్ధులకు సాధ్యము కాని పని. కావుననే మహాభాష్యమును మహాసాగరముతో పోల్చుచుందురు.

కాలక్రమమున మహాభాష్యము నష్టప్రాయమయ్యెనని చెప్పుచున్నాడు.

బైజి సౌభవ హార్యక్షైః శుష్కతర్కానుసారిభిః
ఆర్షే విప్లావితే గ్రంథే సంగ్రహాప్రతికంచుకే. 479

శుష్కతర్కానుసారిభిః = కేవలము తర్కమును మాత్రమే అనుసరించు, బైజిసౌభవ హార్యక్షైః = బైజి—సౌభవుడు-హార్యక్షుడు అనువారలచే, ఆర్షే = పతంజలి మహర్షిచే రచింపబడినటువంటిన్ని, సంగ్రహాప్రతికంచుకే = సంగ్రహమునకు సంరక్షకమైనటువంటిన్నీ, గ్రంథే = మహాభాష్యగ్రంథము, విప్లావితే = పాడుచేయబడగా (నశింపచేయబడగా) — (తరువాత శ్లోకముతో అన్వయింపవలెను).

తా. బైజి, సౌభవుడు, హార్యక్షుడు అనువారలు ఆనాటి తార్కికులు. వారు తమ తర్కమును మాత్రమే అవలంబించి మాహాభాష్యముయొక్క తత్త్వమును తెలియజాలక క్రమముగ దాని వినాశమునకు కారకులైరి.

వి. మానవుని బుద్ధిబలమువలన సిద్ధించు ఊహారూపమైనది తర్కము. దానిని మాత్రమే ప్రమాణముగ తీసుకొనువారు శుష్కతార్కికులు. వారికి ఇతర శాస్త్రములందు ప్రవేశముగాని అభిరుచిగాని ఉండదు. తత్త్వ విషయములు తర్కమునకు లొంగవు. అవి అతీంద్రియములు. ద్రష్టలగు ఋషులకే అవి 'తమకు తాముగా' సమర్పించుకొనును. పతంజలిముని ద్రష్టలలో అగ్రేసరుడు. శబ్దతత్త్వముతో పాటు ఎన్నింటినో అతీంద్రియ తత్త్వములను, తనభాష్యమున అతడు పొందుపరచెను. శుష్క తార్కికులు వానిని గ్రహింపజాలక, తిరస్కరించుటవలన క్రమముగ మహా భాష్యము ప్రచారమునుండి తొలగిపోయెను.

కొందరు దాక్షిణాత్యులయొద్ద మాత్రము భాష్యగ్రంథము మిగిలెనని సూచించుచున్నాడు.

యః పతంజలిశిష్యేభ్యో భ్రష్టో వ్యాకరణాగమః
కాలే స దాక్షిణాత్యేషు గ్రంథమాత్రే వ్యవస్థితః. 480

కాలే = ఒకానొక సమయమున, పతంజలి శిష్యేభ్యః = మందబుద్ధులగు పతంజలి యొక్క శిష్యులనుపొంది, భ్రష్టః = జారిపోయినటువంటి (పఠనపాఠనాదులనుండి దూరమైపోయిన), యః = ఏ, వ్యాకరణాగమః = వ్యాకరణ సంప్రదాయముగలదో, సః = అది, దాక్షిణాత్యేషు = దక్షిణదేశమందుండు పండితులలో, గ్రంథమాత్రే = కేవలము గ్రంథరూపమున, వ్యవస్థితః = నిలిచిపోయివది.

తా. ఆ విధముగ శుష్క తార్కికుల చేతిలోను, బుద్ధివైభవములేని శిష్యుల చేతిలోను పడి—'కోతి చేతిలోని మహారత్నము' వలె నిరర్థకమై, పఠనపాఠనాది సంప్రదాయ రహితమై వ్యాకరణశాస్త్రము (మహాభాష్యము) కొంతకాలమునకు లుప్తప్రాయమయ్యెను. ఎక్కడో దాక్షిణాత్యుల ఇండ్లలో మాత్రము, అది గ్రంథరూపమున మూలబడి మూల్గుచుండెను.

వి. "వ్యాకరణాగమము" అనగా - వ్యాకరణ సంప్రదాయము = మునిత్రయో పజ్ఞమైన వ్యాకరణశాస్త్రమును, దాని అధ్యయనాధ్యాపనములును అగును.

గురుసంప్రదాయమును చూపి దానివలన తనకు వ్యాకరణాగమము సంక్రమించెనని స్పష్టపరచుచున్నాడు.

పర్వతా దాగమం లబ్ధ్వా భాష్యబీజానుసారిభిః
స నీతో బహుశాఖత్వం చంద్రాచార్యాదిభిః పునః .　　　　481

భాష్యబీజానుసారిభిః = భాష్యమందలి న్యాయములను, రీతులను అనుసరించు, చంద్రాచార్యాదిభిః = చంద్రుడు, వసురాతుడు మొదలగు ఆచార్యులచే, పర్వతాత్ = ఒక కొండనుండి, ఆగమమ్ = వ్యాకరణ సంప్రదాయమును, లబ్ధ్వా = పొంది, సః = ఆ వ్యాకరణ శాస్త్ర సంప్రదాయము, పునః = మరల, బహుశాఖత్వమ్ = శాఖోపశాఖలగుటను, నీతః = పొందింపబడెను.

తా. నష్టప్రాయమైన ఆ వ్యాకరణ సంప్రదాయమును, చంద్రుడు, వసురాతుడు మొదలగు మహా విద్వాంసులు కొందరు, భాష్యన్యాయానుసారముగనే వ్యాఖ్యానించి బహువిధములుగ లోకమున వ్యాప్తిగావించిరి. ఒకానొక కొండయొక్క రాతిపలకలపై వారికి వ్యాకరణాగమము లభించెను.

వి. "లంకలోని ఒకకొండయొక్క పలకలపై రావణుడు వ్యాకరణాగమమును వ్రాయించెననియు, దానిని ఒక బ్రహ్మరాక్షసుడు సంగ్రహించి కాలక్రమమున చంద్రాచార్యుల కిచ్చెననియును" ఒక గాధ కలదు. ఇటువంటి కథలకు చారిత్రకాధారములు లభింపవు. "పోయినదనుకొన్న వ్యాకరణసంప్రదాయము ఏదోవిధమున మరల కొందరు మేధావులకు దొరికెననియు, వారు దానిని విస్తరింపజేసిరనియు, అదియే మహాభాష్యమునకును, తద్వ్యాఖ్యలకును పునరుజ్జీవనమయ్యెననియును" భావించుకొనవలెను.

న్యాయప్రస్థానమార్గాం స్తా నభ్యస్య స్వం చ దర్శనమ్
ప్రణీతో గురుణాఽస్మాక మయ మాగమసంగ్రహః .　　　　482

తాన్ = ఆయా, న్యాయప్రస్థానమార్గాన్ = భాష్యన్యాయములయొక్క రాజ మార్గములను, స్వమ్ = తనసంబంధమైన, దర్శనమ్ + చ = వ్యాకరణ సిద్ధాంతములను, అభ్యస్య = బాగుగా పరిశీలించి, గురుణా = గురువైన వసురాతునిచే, అయమ్ = ఈ వాక్యపదీయరూపమైన, ఆగమసంగ్రహః = వ్యాకరణ సంప్రదాయసారము, అస్మాకమ్ = మాకు, ప్రణీతః = ఈయబడినది.

తా. వసురాతుడు మాకు (భర్తృహరికిని-అతని సహాధ్యాయులకును) గురువు. అతడు మహావైయాకరణుడు. వ్యాకరణముయొక్క మూలసిద్ధాంతములును, మహాభాష్యముయొక్క న్యాయములను అతనికి కరతలామలకములు. అతడే మమ్మనుగ్రహించి, ఈ వాక్యపదీయమును మాకిచ్చెను.

వి. భర్తృహరియొక్క గురువుపేరు వసురాతుడని వైయాకరణులు అందురు. "అతడే వాక్యపదీయము యొక్క ప్రణాళికను, సిద్ధాంతములను ఉపదేశించెననియు,

అవన్నియు మహాభాష్యమును అనుసరించినవే అనియు, స్వకపోలకల్పనలు ఇందు లేవనియు, గురూపదేశములకు గ్రంథరూపము నిచ్చుటయే తానుచేసిన పని అనియును' గ్రంథకారుని తాత్పర్యము. దీనివలన గ్రంథముయొక్క గౌరవమును, గ్రంథకర్తకు గురువులయెడ ఉన్న గౌరవమును వెల్లడియగును. 'వాక్యపదీయము సర్వథా భాష్యసిద్ధాంత సర్వస్వము' అనునది ఈ ఘట్టమందలి సారాంశము.

మూడవకాండమున వ్యాకరణాగమవిషయములు సమగ్రముగ చర్చింపబడినవని చెప్పుచున్నాడు.

వర్త్మనా మత్ర కేషాంచిత్ వస్తుమాత్ర ముదాహృతమ్
కాండే తృతీయే న్యక్షేణ భవిష్యతి విచారణా . 483

కేషాంచిత్ = కొన్ని, వర్త్మనామ్ = భాష్య సిద్ధాంత మార్గములయొక్క, వస్తుమాత్రమ్ = మూలస్వరూపము మాత్రమే, అత్ర = ఈ రెండు కాండములందును, ఉదాహృతమ్ = చెప్పబడినది; తృతీయే = మూడవ, కాండే = కాండమందు, న్యక్షేణ = ఆదరముతో (పూర్తిగా), విచారణా = పరిశీలనము, భవిష్యతి = జరుగగలదు.

తా. ఈ గ్రంథమున మొదటి కాండము బ్రహ్మకాండము. రెండవది వాక్యకాండము. ఈ రెండు కాండములందును, భాష్య సిద్ధాంతముల మూలరూపము ప్రదర్శింపబడినది. మూడవ కాండము పదకాండము. అందు సకల విషయములును సాదరముగ చర్చింపబడును.

వేర్వేరు శాస్త్రములనుగూడ క్షుణ్ణముగ అభ్యసించినందువలననే విద్యాసిద్ధి సంభవించునని నిరూపించుచున్నాడు.

ప్రజ్ఞావివేకం లభతే భిన్నైరాగమదర్శనైః
కియద్వా శక్య మున్నేతుం స్వతర్క మనుధావతా . 484

భిన్నైః = అనేకవిధములైన, ఆగమదర్శనైః = శాస్త్రములయొక్క సిద్ధాంతములచే, ప్రజ్ఞా = నిశితమైనబుద్ధి, వివేకమ్ = వైశాల్యమును—వైశద్యమును, లభతే = పొందును. స్వతర్కమ్ = తనయొక్క ఊహనుమాత్రమే, అనుధావతా = అనుసరించువానిచే, కియత్ + వా = ఏపాటిజ్ఞానము, ఉన్నేతుమ్ = సంపాదించుటకు, శక్యమ్ = వీలుకలిగెడిని ?

తా. వివిధములైన శాస్త్రములను బాగుగా అభ్యసించుటవలననే, బుద్ధిపాటవము పెరుగును. కేవలము తన బుద్ధిమాత్రమే అవలంబించి, విషయములను ఊహించు వ్యక్తి, పరిపూర్ణజ్ఞానమును ఎన్నటికిని సంపాదింపజాలడు.

వి. ఆయా శాస్త్రవిషయములను అన్నింటిని కూలంకషముగ దివ్యశక్తితో పరికించి, ప్రవర్తింపజేయగల మహానుభావులు కొందరే ఉందురు. వారు ఋషులును, ద్రష్టలును అగుదురు. వారివిషయము వేరు. సామాన్యమానవుడుమాత్రము, సిద్ధముగఉన్న అనేకశాస్త్రములను అభ్యసించియే చక్కని పండితుడు కాగలుగును. అపుడే తన సిద్ధాంతమును సమర్థించుటకుగాని, ఇతరుల ఆశయమును ఖండించుటకుగాని అతనికి అడ్డులేని నేర్పు అలవడును. శాస్త్రసంస్కారములేని బుద్ధి ఎంతటి నిశితమైనదైనను, ఎందుకును కొరగాదు.

"ఏదో ఒక శాస్త్రమునుమాత్రమే అభ్యసించి తృప్తి పడకూడదు. వీలయినంత వర కును ఇతరశాస్త్రములనుకూడ పరిశీలింపవలెను. అపుడే సమగ్రమైన జ్ఞానమున్ను, పరిశీలనా శక్తియు సమకూరును" అని సారము.

తత్తదుత్ప్రేక్షమాణానాం పురాణై రాగమై ర్వినా
అనుపాసితవృద్ధానాం విద్యా నాతిప్రసీదతి . 485

ఇతి వాక్యపదీయే వాక్యకాణ్డం సమాప్తమ్.

పురాణైః=ప్రాచీనములగు, ఆగమైః=శాస్త్రములను, వినా=విడిచిపెట్టి, తత్ + తత్ = ఆయా విషయమును, ఉత్ప్రేక్షమాణానామ్=ఊహించువారియొక్కయు, అనుపాసిత వృద్ధానామ్=పెద్దలగు గురువులను సేవింపనివారియొక్కయు, విద్యా=విద్య (ప్రజ్ఞ, ప్రతిభ), అతి = ఎక్కువగా, న + ప్రసీదతి = అనుగ్రహింపదు (ప్రకాశింపదు).

తా. గురువులను సేవింపకయు. శాస్త్రములను చదువకయు, కేవలము తనబుద్ధి బలముతో "అది అట్లు, ఇది ఇట్లు" అని ప్రతియొకవిషయమును నిశ్చయింప సమకట్టిన వ్యక్తియొక్క విజ్ఞానము రాణింపదు. గురు శుశ్రూషయు, శాస్త్రాభ్యాసమును మాత్రమే ప్రజ్ఞాప్రాభవమును సంపాదించిపెట్టును. ప్రతిభాప్రకాశమునకు ఇంతకుమించిన రాజమార్గము లేదు.

వి. మీదికారికచెప్పిన అంశమునే ఈ కారిక వివరించినది. భారతీయుల భారతీ సంప్రదాయమును, భర్తృహరియొక్క సంప్రదాయప్రవణతను ఈ రెండుకారికలును చక్కగా చిత్రించినవి.

వాక్యపదీయమున వాక్యకాండము
సమాప్తము.

పారిభాషికపదకోశము

అకృత్రిమము II. 366.

స్వభావసిద్ధమైనది. ప్రయత్నముచే నిర్మిత మైనది కానిది. ఉదా: ద్రవ్యగుణములలో గుణము ఎల్లప్పుడును విశేషణముగనే ఉండును. ద్రవ్యము విశేష్యముగనే ఉండును. వీటి విశేషణత్వ విశేష్యత్వములు సహాజములే కాని ఇపుడు క్రొత్తగ కల్పించినవి కావు.

అఙ్గిరస్ I. 21.

అథర్వవేదద్రష్టలగు ఋషుల వంశమునకు పేరు. ఇచట అథర్వవేదము అనునర్థమున ప్రయోగింపబడినది.

అతిదేశము II. 78.

ఒక దాని ధర్మములు మరియొకదానితో గూడ సంబంధించు నని చెప్పుట.

'గురు పుత్రుని గురువునువలె చూడవలెను' అనగా గురు ధర్మములు, వచనానుసరణ నమస్కారాదులు, గురు పుత్రుని యందు అతిదేశింపబడుచున్నవి. "స్థానివదాదేశోఽనల్విధౌ" అను సూత్రము స్థానికి గల ధర్మములను ఆదేశమునందు గూడ అతిదేశించు చున్నది. సామాన్యాతిదేశము, విశేషాతిదేశము అని అతిదేశము రెండు విధములు. "బ్రాహ్మణవత్ క్షత్రియేఽస్మిన్ వర్తితవ్యమ్" అనుచోట సామాన్యాతిదేశము. "బ్రాహ్మణవదస్మిన్ బ్రాహ్మణే వర్తితవ్యమ్" అనుచోట విశేషాతిదేశము.

అథర్వన్ I. 21.

అథర్వవేదద్రష్టలగు ఋషుల వంశమునకు పేరు. ఇచట ఈ పదము అథర్వవేదమను నర్థమున ప్రయుక్తమైనది.

అధికరణము II. 116.

చర్చనీయాంశము. విచారస్థానము.

అధికారము II. 79.

శాస్త్రము మొదలగునవి ప్రవర్తించుటకు అనువగు స్థానము. ఉదా. "ప్రతిపాద్యేషు శబ్దేషు వ్యాకరణ శాస్త్ర స్యాధికారః" "వ్యాకరణ శాస్త్రమునకు ప్రతిపాద్యము లగు శబ్దముల విషయమున అధికారమున్నది" అ.

అధిక్రతు II. 254

యజ్ఞమునందు; యజ్ఞము చేయు సందర్భమున ఈ యర్థమున 'అధియజ్ఞ' శబ్దము ప్రసిద్ధతరముగా వాడబడుచున్నది. అధ్యాత్మ అధిదైవ శబ్దములు రెండును పయి శబ్దము వంటివే.

అధ్యాహిత I. 3 ('అవ్యాహత' తో సమానార్థకము)

ఆరోపితమగు. లేకున్నను ఉన్నట్లుగా భావింపబడిన.

అనవస్థిత I. 106.

ఆగకుండగా పునఃపునరావృత్తమగు.

అనాగమ II. 132.

మన బుద్ధికి గోచరించునట్టి కారణము లేనిది.

అనిబంధన I. 133.

ఆధారము లేనిది; శుష్కతర్కము; నిర్విషయము.

అనుకార (1) I. 5

ప్రతిబింబము ప్రతికృతి.

(2) II. 68. అనుకరించుట. అసత్యమగు ఆకారచేష్టాదులనుగ్రహించుట.

అనుతంత్ర I. 23.

ఒక శాస్త్రగ్రంథమును అనుసరించి బయలువెడలిన మరియొక శాస్త్రగ్రంథము. ఉదా: పాణిని కృతమగు అష్టాధ్యాయికి వార్తికము అనుతంత్రము.

అనునిష్పత్తి II. 362.

ఒకటి నిష్పన్నమైన పిమ్మట నిష్పన్నమగుట. 'యజ్ఞదత్తుడు' అను సముదాయము ఒకనికి నామధేయముగ నిష్పన్నమైన పిమ్మట దాని అవయవమగు 'య' అను దానికి గూడ తన్నామధేయత్వము అనునిష్పన్నము.

అనునిష్పాదిన్ II. 121; 124; 352

1. కాలాంతరమున ప్రయోగములోనికి వచ్చినది. ఉదా: 'దేవదత్త' 'సత్యభామా' శబ్దములకు బదులుగ అదే యర్థమున 'దత్త' 'భామా' శబ్దములు ప్రయుక్తములగుచున్నవి గాన అవి అనునిష్పాది శబ్దములు.

2. మూలమగు శబ్దము ననుసరించి పుట్టు శబ్దములు. (దేవదత్తాది సంజ్ఞా శబ్దముల ననుసరించి వెనువెంటనే జనించు 'దేవ'–'దత్త' మొదలగు స్వతంత్ర శబ్దములు.)

అనుమానమ్ II. 367.

1) అనుమీయతే–ఇదమ్ = ఊహింపబడునది. (సర్వనామ మొదలగు మహాసంజ్ఞలకు సంబంధించిన అవయవార్థము 'సర్వేషాం నామ' మొదలగునది)

II 368.

2) కార్యమునుబట్టి కారణమునుగాని కారణమునుబట్టి కార్యమునుగాని ఊహించుట (జ్ఞానమునకు ఇదొక ప్రబల సాధనము)

అనువాద II. 115.

స్పష్టీకరణమునకై గాని, నియమార్థము కాని చెప్పిన విషయమును మరల చెప్పుట.

అనుషంగిణీ II. 122.

తప్పక సంబంధించునది.

అనుసంహృతి II. 1.

బుద్ధియందు ఆకళించుకొనుట.

అన్వయ :II. 388.

ఎల్లపుడును కలిసియుండు రెండింటిలోను ఒకటి ఉన్నపుడు రెండవది కూడ తప్పక ఉండుట.

అన్వాఖ్యాన II. 170; 281; 439; 443.

ఉన్నదానిని మరలచెప్పుట. తెలిసినదానిని స్పష్టీకరించుట. వాడుకలోనున్న పదములకు ప్రకృతి ప్రత్యయాది విభాగము చేసి వ్యుత్పత్తి చూపుట.

అన్వాఖ్యానస్మృతి II. 281.

శబ్దవ్యుత్పత్తిని చూపెడు గ్రంథము. శబ్దానుశాసనము. పాణినీయాది వ్యాకరణ గ్రంథములను గూడ స్మృతులని యనుట సంప్రదాయసిద్ధము.

అన్వాఖ్యేయ I. 24.

ప్రకృతి ప్రత్యయాది విభాగముచే వ్యుత్పత్తి చూపుటకు తగినశబ్దము. 'అన్వాఖ్యేయః శబ్దః' ఇత్యాదులలో 'అన్వాఖ్యేయః' అనుదానికి ప్రయోగార్హమై సాధువైనది అని యర్థము.

అన్వితాభిధాన పక్ష II. 17.

ఒక వాక్యమునందలి పదములు పరస్పర సంబద్ధములగు అర్థములను బోధించును అను పక్షము. ఇది ప్రాభాకర మీమాంసకుల మతము. ఒక వాక్యమునందలి పదములు వాటి వాటి అర్థములను బోధించిన పిమ్మట ఆ అర్థములు పరస్పరము సంబంధించును అనునది అభిహితాన్వయ పక్షము. ఇది భాట్టమీమాంసకుల మతము.

అపభ్రంశ I. 148, 153, 154.

ఒక సాధుశబ్దము వ్యాకరణ విరుద్ధమగు మార్పుచెందుటచే నేర్పడిన శబ్దము. అది వ్యాకరణ విరుద్ధమే యైనను దానిని వినునపుడు దాని ప్రకృతియగు సాధుశబ్దము స్మృతి పథమున గోచరించుటచే అర్థబోధ కలుగుచుండును.

అపవర్గ I. 14.
మోక్షము, బంధవిముక్తి.

అపవాద II 348.
ఒక స్థలమున సామాన్యశాస్త్రము—దీనికే 'న్యాయము' 'ప్రాప్యము' అనికూడ పేరు— ప్రవర్తింపవలసి యుండ అది యట్లు ప్రవర్తింపకుండ చేయునది అపవాద శాస్త్రము. ఈ సామాన్యాపవాద శాస్త్రములకు ఏక వాక్యత్వమును సంపాదించి, అపవాదశాస్త్ర స్థానభిన్నములగు స్థానములందు సామాన్య శాస్త్రము ప్రవర్తించును అని అర్థము చెప్పుకొనవలెను. 'అద్గుణః' అను సామాన్య శాస్త్రమునకు 'వృద్ధి రేచి' ఇత్యాదులు అపవాదములు. కావున 'వృద్ధి రేచి' ఇత్యాదులకు ప్రవృత్తిలేని స్థలములందు మాత్రమే 'అద్గుణః' ప్రవర్తించును.

అపోద్ధార I. 24, II 10, 269, 441.
వేరుచేయుట. విడదీయుట. ఈ పదమును—'ప్రకృతినుండి ప్రత్యయమును విడదీయుట' అను నర్థమున ప్రయోగింతురు. ప్రకృతినుండి వేరుచేసిన ప్రత్యయము లేక ప్రత్యయమునుంచి వేరుచేసిన ప్రకృతి అను నర్థమున గూడ ఈ పదమునుపయోగింతురు. అప + ఉద్ + ధార = విభాగము చేయుట.

అపోద్ధృత II. 83, III 14, 170
సముదాయమునుండి వేరుచేసిన అవయవము, సముదాయార్థము నుండి విడదీసిన అవయవార్థము.

అభిఖ్యా I 146.
జ్ఞానము.

అభిఘాత (ద్రవ్యాభిఘాత) I 105.
'దెబ్బ'యని అక్షరార్థము. వర్ణోచ్చారణ స్థానములగు తాల్వాదులందు ఉచ్చారణ సాధనములగు జిహ్వాదుల చేతను, వాయువు చేతను కలిగిన ఒత్తిడి.

అభిజల్ప II 128.
తాను బోధించు అర్థముతో తాదాత్మ్యము నొందిన శబ్దము.

అభిధా II 401
శబ్దము అర్థమును బోధించును ఈ అర్థబోధన వ్యాపారమునకు అభిధ యని పేరు. శబ్దమునకును తద్వాచ్యమగు అర్థమునకును గల సంబంధము.

అభిధాన II. 160, 165, 168,
401, 402, 404, మొ.
శబ్దము అర్థమును బోధించుట. ఈ అభిధానము శబ్దమునకు స్వాభావికము. 'అభిధానం పునః స్వాభావికమ్' మ. భా.

అభిధానక్రియా II. 106.
పరస్పర సంబద్ధములగు పదములను ప్రయోగించి సాధించిన అర్థబోధ చేయుట అనెడు వ్యాపారము. 'అభిధాన క్రియా సంహిత యోచ్చారణ మేవ'. (పుణ్యరాజ)

అభిధేయ II. 118, 401.
శబ్దము బోధించు అర్థము.

అభిసంధాన II. 400.
ఏకాగ్ర చిత్తత్వము. మానస వ్యాపారము.

అభిసంహిత II. 400
వివక్షితమగు అర్థమును బోధించుటకై బాగుగ పర్యాలోచించి ప్రయోగించిన శబ్దము.

అభిహితాన్వయపక్ష [II. 1, 41, 42]
స్వతంత్రముగ తమతమ అర్థములను బోధించు పదములు ఒక వాక్యమున పరస్పరము అన్వయించి, స్వస్వార్థ భిన్నమగు తాత్పర్యార్థమును బోధించును అని అంగీకరించు భాట్ట మీమాంసకుల పక్షము. ఇది ప్రాభాకర మీమాంసకుల అన్వితాభిధాన పక్షమునకు విరుద్ధము.

అభ్యాస II. 117, 235.
(1) అభ్యసించుట. (2) పదమును గాని, తత్ప్రకృతిని గాని ఆవృత్తి చేయుట. ఉదా : లిట్టులో 'పత్' అనుదానిని రెండు పర్యాయములు ఆవృత్తి చేయుటచే 'పపాత' ఇత్యాది రూపములు సిద్ధించును.

అర్థ (1) II 79.
ఒక శబ్దము బోధించు నర్థము
(2) II. 264, 268, 315, 331.
ఒక పదమునకు గల అర్థమును నిర్ణయించుటకు ఉపయుక్తమగు ప్రయోజనము. 'సంసార నిర్మూలనము కొరకు స్థాణు భజనము చేయుము' అనునపుడు సంసార నిర్మూలన మనెడు ప్రయోజనమును బట్టి స్థాణు శబ్దమునకు శివుడని యర్థము. ఇది అలంకారికులు చెప్పు ఉదాహరణము. 'అంజలినా జుహోతి' 'అంజలినా సూర్య ముపతిష్ఠతే' 'అంజలినా పూర్ణపాత్ర మాహరతి' ఇత్యాదులలో 'జుహోతి' మొదలగు పదముల అర్థమును బట్టి 'అంజలి' శబ్దము విభిన్నాకారముగల హస్త సన్నివేశమును బోధించును అని పుణ్యరాజాదులు ఉదాహరించినారు.

అర్థప్రవృత్తితత్త్వ I. 13.
వివక్ష. ఒక పదమును ప్రయోగించుటలోని అభిప్రాయము.

అర్థవాద I. 8.
ఒక ప్రయోజనము నుద్దేశించి చేసిన వాదము. వేదములో కొన్ని వాక్యములు విధి రూపములుగ గాని నిషేధరూపములుగ గాని యుండవు. విధి వాక్య విహితములగు వాటిని స్తుతించుటయో, నిషేధ వాక్య నిషిద్ధములగువాటిని నిందించుటయో వీటి ప్రయోజనము. అట్టి వాక్యములకు అర్థవాదములని పేరు ఉదా. 'వాయవ్యం శ్వేతమాలభేత' 'వాయు దేవతకై శ్వేత పశువును ఆలంభించవలెను' అనునది విధి వాక్యము. తరువాత వచ్చు 'వాయువు శీఘ్రగామి దేవత, యజమానునకు ఫలమును శీఘ్రముగ కూర్చును' అనిచెప్పు వాక్యము వాయుదేవతాక యాగస్తుతిపరము గాన అర్థవాదము.

అర్థవిభాగహేతు } II. 314, 316
అర్థావచ్ఛేదహేతు }
నానవమున అనేకములగు అర్థములు స్ఫురించునపుడు వివక్షితార్థ నిర్ణయమునకుపయుక్తమైన సాధనము. ఉదా : 'సశంఖచక్రః హరిః' అనునపుడు శంఖచక్ర సాహచర్యము హరిశబ్దమునకు విష్ణురూపార్థ విభాగమునకు హేతువైనది.

అర్థిత్వ II. 79.
కావలెనని కోరిక కలిగియుండుట. ఏదైన ఒక కార్యము చేయవలెనన్నచో ఈ అర్థిత్వ ముండవలెను.

అర్ధహ్రస్వ II. 308
హ్రస్వము యొక్క అర్ధభాగము అని అక్షరార్థము. రెండు మాత్రల ప్రమాణము గల దీర్ఘము యొక్క గాని మూడు మాత్రల ప్రమాణము గల ప్లుతము యొక్క గాని, అర్ధమాత్రాప్రమాణక మగు మొదటి భాగము.

అలాతచక్ర II. 291.
మండుచున్న కొరవిని వేగముగ త్రిప్పునపుడు అది అగ్ని చక్రమువలె కనబడును. అది అలాత చక్రము.

అవగ్రహ I. 91.
జ్ఞానము. జ్ఞానాకారము.

అవధారణ II. 268.
నిర్ణయము.

అవయవాశ్రయా క్రియా
II. 372-75-376.
వేరు వేరు అవయవములలో నుండెడు వ్యాపారము. 'ప్రత్యేకం వాక్యపరిసమాప్తిః' అను న్యాయము ఈయర్థమునే బోధించును. 'సముదాయే వాక్యపరిసమాప్తిః' అను న్యాయము ఏతద్విరుద్ధము. దానిని 'సముదాశ్రయక్రియ' అనవచ్చును.

అవిద్యా II. 233
అజ్ఞానము. భ్రాంతి.

అవిభాగ I. 128.
విభాగము లేకుండుట.

అవివక్షా I. 187.

ఈ విషయమును తప్పక చెప్పవలెను అనెడు ఇచ్ఛ లేకుండుట. ఔదాసీన్యము.

అశ్వకర్ణ II. 86.

ఒక లతకు పేరు. దాని యాకులు గుఱ్ఱము చెవులను పోలియుండును.

అసంవిద్ II. 61.

అవిద్య. భ్రాంతి.

అసంసృష్ట II. 248; 249.

సంసృష్టము కానిది. కలియనిది. ఉదాహరణమునకు—పదవాద పక్షమున ఒక పదము బోధించు అర్థము మరియొక పదము బోధించుఅర్థముతో కలియదు అని చెప్పుదురు.

అసిద్ధి II. 263.

పూర్వమే తెలిసినది కాకుండుట. అప్రసిద్ధత్వము.

ఆఖ్యాత II. 1, 57, 306, 338, 341, 342 మొ॥

క్రియ. క్రియారూపము. ఇదియే వాక్యమని కొందరి యభిప్రాయము.

ఆఖ్యాతశబ్ద I. 1.

క్రియాశబ్దము.

ఆగమ (1) I. 27, 30, 133.

అవిచ్ఛిన్నమగు సంప్రదాయము.

(2) I. 41.

అవిచ్ఛిన్న సంప్రదాయ సిద్ధమగు ఆచారము.

(3) అవిచ్ఛిన్న సంప్రదాయ ప్రవర్తకమగు శాస్త్ర గ్రంథము.

ఆంజస I. 12.

సులభముగ గ్రహింప శక్యమైనది. ఋజుమార్గోపదిష్టము.

ఆండభావ I. 51.

అండ మధ్యగత రసమువలె ప్రధానరూపమున నుండుట.

ఆత్మన్ I. 17.

ఆత్మ. అతిసూక్ష్మమగు తత్త్వము.

ఆద్యపద II. 2.

వాక్యములోని మొదటి పదము. ఇదియే (ఇతర సంసృష్టమై)వాక్యమగునని కొందరు చెప్పుదురు.

ఆధారనియమ II. 463.

కారకముల వ్యాపారము కొన్ని వస్తువులకు మాత్రమే నియమితమై యుండుట. ఉదా. కరణ శక్తికి ఇంధనము ఆధారము, అధికరణ శక్తికి స్థాలి ఆధారము.

ఆపేక్షికీ II. 168.

మరియొకదానిపై ఆధారపడియున్నది.

ఆమ్నాత I. 2.

శాస్త్రములలో ప్రమాణ రూపమున చెప్పబడినది.

ఆమ్నాయ II. 259.

వేదము.

ఆవాపోద్ధారిక II. 79.

పదముల విభిన్నావయవములలో అర్థమును చేర్చుచుండుట తీసివేయుచుండుట అను దానిపై ఆధారపడినది.

ఆవృత్తి II. 115.

నియమము కొరకుగాని, స్పష్టీకరణార్థము గాని ఒక యర్థమును రెండు పర్యాయములు చెప్పుట.

ఆసన్న I. 11.

చాల సమీపమున నున్నది.

ఇతికర్తవ్యతా I. 122.

లౌకిక వ్యవహారము. ఈ విధముగ చేయవలెను అనెడు బుద్ధి.

ఉత్సర్గవాక్య II. 347.

సామాన్య వాక్యము. ఉదా. "మా హింస్యాత్ సర్వాణి భూతాని" 'ఏ భూతము

లను హింసింపరాదు' అనునది ఉత్సర్గ వాక్యము. "అగ్నిషోమీయం పశు మాలభేత" 'అగ్నిషోమయాగ పశువును ఆలంభింప వలెను' అనునది విశేషవాక్యము, లేదా అప వాదవాక్యము.

ఉదహారి II 246.

నీళ్లు మోయుట జీవికగా గల స్త్రీ.

ఉపఘాత II. 312.

పాడు చేయుట.

ఉపఘాతజ II. 297

దోషము వలన కలిగినది. ఇంద్రియ దోష జన్యము.

ఉపవ్యంజన II. 13.

ఏదైన గుర్తు మొదలగు దానిచే ఒక వస్తువును సూచించుట. అట్లు సూచించు గుర్తు మొదలగునది.

ఉపాదానశబ్ద I. 44. II. 4.

ప్రత్యక్షముగ అర్థమును బోధించు శబ్దము.

ఉపాదాన మనగా మూలకారణము. అర్థములను తన యందు ఆరోపించుకొని యున్నందున, ఇచట శబ్దపద సాహిత్యము న వాచక పర్యాయము ఉపాదాన శబ్దము. వాచకములగు శబ్దముల విషయమున అని వాచ్యార్థము.

ఉపాయ II. 88, 108, 287.

ఏదైన ఒక లక్ష్యమును సాధించుటకై గ్రహింపబడి ఆ లక్ష్యమును సాధించిన వెంటనే విడువబడెడు సాధనము.

ఉపాదాయ హేయః—ఉపాయః. ఉపాదాయ హేయః ఇందు 'దాయహే' అను భాగము పృషోదరాదిగణపాఠముచే లోపింపగా ఉపాయ శబ్దము నిష్పన్నమగును.

ఊహ II. 78, 258.

అవశ్యకతానుసారముగ లింగవచన ప్రకృత్యాదులను మార్చుట. ఉదా. "వికృతి యాగమును ప్రకృతియాగమువలె చేయవలెను" అను నియమ మున్నది. ప్రకృతి యాగమున 'అగ్నయే త్వా జుష్టం నిర్వపామి' అని యున్నది. కాని వికృతి యాగమున 'అగ్నయే" అనుదానికి బదులుగా 'సూర్యాయ' అని మార్చి "సూర్యాయ త్వాజుష్టం నిర్వపామి" అని చెప్పవలెను. "తతః ప్రవిశతి దశరథః రామలక్ష్మణౌచ" ఇత్యాదులలో 'ప్రవిశతి' అనుదానిని 'రామలక్ష్మణౌ' అనుదానితో అన్వయించునపుడు 'ప్రవిశతః' అని మార్చవలెను. ఇది ఊహము.

ఏకశ్రుతి (వ్యా).

ఒకే స్వరముతో ఉచ్చరించుట. ప్రాచీన వైయాకరణులు 'లింగ సర్వనామ' శబ్ద సాదృశ్యముచే. ఏక శ్రుతి అనునర్థమున 'స్వరసర్వనామ' శబ్దమును ప్రయోగించి యున్నారు. 'లింగసర్వనామ' మనగా నపుంసకలింగము.

ఔచిత్య II. 314; 316.

ఉచితముగా నుండుట. అనేకార్థ శబ్దములను ప్రయోగించునపుడు ఆశబ్దమునకు ఒక అర్థమును నిర్ణయించుటలో ఇది యొక నిమిత్తము.

'నాగలి', 'కత్తి', 'రోకలి' మొదలగు పదములతో క్రియాపదమును ప్రయోగింప కున్నను ఔచిత్యమును బట్టి దున్ను, యుద్ధముచేయు, దంచు మొదలగు క్రియాపదములను ఆక్షేపించుటచే శబ్దార్థ నిర్ణయము జరుగును అని పుణ్యరాజాదులు ఉదాహరించిరి. ఆలంకారికులు 'పాతు వో దయితాముఖమ్', ఇత్యాదులందు ఔచిత్యమును బట్టి 'పాతు' అనగా "అభిముఖముగా నుండుగాక" యని యర్థమని ఉదాహరించిరి.

ఔత్పత్తిక [I. 28. స్వోపజ్ఞవృత్తి].

జన్మసిద్ధము. సహజము. అనగా క్రొత్తగా కల్పితము కానిది.

ఔదుంబరాయణ II. 348.

శబ్దనిత్యత్వవాదియగు ఒక ప్రాచీన వైయాకరణుడు. ఈతనిని యాస్కుడు పేర్కొనెను.

కంప I. 107.

వర్ణములను ఉచ్చరించు సమయమున పవనాభిఘాతముచే కలిగిన కంఠనాళ చలనము.

కరణ II. 430.

ఒక పని చేయు సాధనము. ఒక వస్తువు ఒక క్రియయందు సాధనముగ నుండుటచే ఆవస్తువునకు ఆక్రియతో గల సంబంధము.

కరణవిన్యాస I. 123.

ఉచ్చారణ సాధనములను శబ్దోచ్చారణ మున నియోగించుట.

కర్మ II. 430.

కర్త క్రియద్వారా దేనిని పొందగోరునో అది.

కర్మప్రవచనీయ II. 199, 201, 202, 204.

ఒకానొకప్పుడు క్రియా వాచకములై యుండి, ఇపుడు మాత్రము అట్లుకాక క్రియోపజనిత సంబంధవిశేష ద్యోతకము లగు ఉపసర్గాదులు.

కృత్రిమ (సంజ్ఞాశబ్దము) II. 371.

కల్పితమును సహజార్థరహితమును అగు 'టి' 'ఘు' ఇత్యాది సంజ్ఞాశబ్దము.

క్రతు I. 51.

చేయునది యని అక్షరార్థము. బుద్ధి శబ్దాది వ్యక్తి కారణభూతమగు అంతరశక్తి.

క్రమ II. 1, 49–52.

(1) ఒక వాక్యములో నున్న అనేక పదముల అర్థము తెలియుటకు సహకరించునదియగు పదముల క్రమము. ఈ పదక్రమమే వాక్య మని కొందరి యభిప్రాయము. "క్రమేణ పదార్థగత కర్తృ కర్మవిశేషాః ప్రతిపాద్యన్తే అతః క్రమ ఏవ వాక్యమ్" (2) ముక్రమమే కాలమని చెప్పుదురు. "క్రమాఖ్యాహి కాల శక్తిర్వృత్తిహ్నాణః జన్మవత్సు పదార్థేషు జన్మాదిక్రియా ద్వారకమేవ పౌర్వాపర్యేణావభాసోపయోగ విధాయినీ; నాపరో ద్రవ్యభూతః కాలః" (పుణ్యరాజ).

క్రియానుషఙ్గ II. 425.

ధాతు ప్రతిపాద్య వ్యాపారముతో కారక మునకు గల సంబంధము. ఇది లేనిచో వాక్యము పరిపూర్ణము కాజాలదు.

క్రియాపద I. 114.

ధాతువునుండి నిష్పన్నమై ప్రయోగార్హ మగు 'భవతి' ఇత్యాది క్రియా వాచకపదము. ధాతువు వేరు క్రియాపదము వేరు. ధాతువు నుండి క్రియాపదము నిష్పన్నమగును. ధాతు వును స్వతంత్రముగ ప్రయోగించుటకు వీలు లేదు.

క్రియాప్రధాన II. 442.

వ్యాపారము ప్రధాన వాచ్యముగ గలది క్రియాపదము. 'క్రియాప్రధానము' అను నది ఆఖ్యాతమునకు లక్షణము. ఆఖ్యాత శబ్ద మును 'ధాతువు' 'క్రియా పదము' అనునర్థ మున ప్రయోగింతురు.

ఖరణస II. 363.

గాడిద ముక్కు. ఇచట 'నస' లోని నకారము ణకారమైనది.

గీతి II. 107.

గానము. సంగీత యుక్తముగ ఉచ్చరించుట. సంగీతయుక్తముగ నుచ్చరించినచో ఋఙ్మంత్రము సామ మగును. 'గీతిషు సామాఖ్యా' (పుణ్యరాజు).

గుణ I. 62, 64.

అప్రధానముగా వివక్షితమగు అర్థము గుణము. తర్కశాస్త్రమున రూప రస గంధాదులు 24 పారిభాషిక గుణ ములుగా జూపబడినవి. అవి మాత్రము ఇచట గ్రాహ్యములు గావు.

గురువు II. 34.

సుదీర్ఘమగు ప్రతిపాదనము. దానికి వ్యతిరేక పదము లఘువు.

"శాస్త్రీయథా- 'పృషోదరాదీని యథోపదిష్టమ్' ఇతి శిష్టప్రసిద్ధసాధుశబ్దౌఘ ప్రతిపాదనే లఘు రుపాయః, నపవతు ప్రాతిపదికాదన భిహిత కర్మాది గతైక త్వాదౌ స్వాదయ ఇత్యాదినా గురు రుపాయః."

గౌః II. 174.

ఆవు లేక ఎద్దు. ఈ శబ్దము గ్మా, గర్జ, గమ్, గు, గద్ ధాతువుల నుండి నిష్పన్న మైనదని చెప్పుదురు.

గౌణ II. 34, 273, 274.

అప్రధానము. వాక్య నిర్మాణమున ప్రధాన స్థానములో లేనిది. అర్థమునకు సంబంధించినంతవరకు మరియొక దానికి లొంగియుండునది. "గుణాదాగతం గౌణమ్" అని దీని వ్యుత్పత్తి. 'సింహో మాణవకః' ఇత్యాద్యుదాహరణములందు సింహ శబ్దము, సింహసదృశశౌర్యాదులుండుటచే, మాణవకుని విషయమున ప్రయోగింపబడు చున్నది. ఇది గౌణ ప్రయోగము.

గౌరఖర II. 216.

అడవిగాడిద. 'కృష్ణసర్ప' 'లోహితశాలి' మొదలగు శబ్దములవలె ఈ శబ్దము అవయ వార్థ విహీనమై ఒక జాతిని బోధించు చున్నది.

గ్రహణక II. 456.

సర్వసామాన్యార్థము. వ్యాకరణమున ఏదియో ఒక విషయమును పేర్కొనుచు సూత్రము రచింపబడును. ఆ సూత్రము సామాన్య రూపమున ఇతర స్థలములందు గూడ ప్రవర్తించును. ఈ విధముగ ఇతరో దాహరణము చేయునది గాన అది గ్రహణ కము. ఉదా. 'కర్తరి కృత్' అను సూత్రము 'కర్త్రర్థమున కృత్ ప్రత్యయము వచ్చును' అని బోధించుచున్నది. ఇది కర్త్రర్థమున వచ్చు ప్రతి ఒక్క ప్రత్యయము తోడను వేరువేరుగా సమన్వయించును. ఈ విధముగ ఈ సూత్రము సర్వోదాహరణ సంబద్ధముగాన గ్రహణకము.

'అణ్' మొదలగునవి స్వసజాతీయము లను గూడ గ్రహించును అని ప్రతిపాదించు 'అణుదిత్సవర్ణస్యచాప్రత్యయః' ఇత్యాది సూత్రములను గ్రహణక శాస్త్రములని, శాఖాంతరమున కాశికాకారాదులు చెప్పి యున్నారు.

గ్రాహ్య I. 65, II. 99.

శబ్దము నుచ్చరించినంతనే బుద్ధిచే గ్రహింపదగినది. బుద్ధిచే గ్రహింపదగిన ఒక వస్తువును గూర్చి శబ్దమును ప్రయో గింతురు. ఆ వస్తువు గ్రాహ్యము, గ్రహణ సాధన మగు బుద్ధ్యాదికము గ్రాహకము.

ఘా II. 362.

జ్యోతిష గ్రంథములలో 'మఘా' అను పదమునకు సంక్షిప్త రూపముగ 'ఘా' అని యుపయోగింతురు. వైయాకరణులు ఇట్టి ప్రయోగము సాధువని అంగీకరింపరు.

చతుష్ట్వ II. 343.

నాలుగుగా ఉండుట, నాల్గింటి సము దాయము. ప్రాచీన వైయాకరణులు చెప్పిన నామ–ఆఖ్యాత–ఉపసర్గ–నిపాతము లనెడు నాల్గు శబ్ద విభాగములు.

చంద్రాచార్య II. 453.

ఆచార్య చంద్రగోమి. ఈతడు మహా వైయాకరణుడు. పాణినీయ పాతంజలముల పై ఇతర వైయాకరణుల ఆక్షేపములను ఖండించి వీటి పఠన పాఠన సంప్రదాయ మునుపునరుద్ధరించినవాడు. ఈతడు రచిం చిన చాంద్రవ్యాకరణము పాణినీయానుసారి యైనది కాని ఇందు వైదిక ప్రక్రియ లేదు. పారిభాషిక పదములను ఉపయోగింప కుండుట ఈ వ్యాకరణమునందలి విశే షము. ఈతడు క్రీ. శ. 6వ శతాబ్దమునకు చెందిన వాడు.

చరితము II. 270. 326.

నమిలివేయబడినది లేదా మ్రింగివేయబడినది అని దీని అక్షరార్థము. దీనిని భర్తృహరి "అంతర్గతము చేయబడినది" అను నర్థమున ప్రయోగించి యున్నాడు.

ఛందస్య I. 17.

వేద మంత్రముల సముదాయమని అక్షరార్థము. వేదమంత్ర సముదాయ ప్రతిపాద్యమగు ఆత్మ గూడ ఛందస్యము.

జహత్స్వార్థా వికల్ప II. 223.

జహత్స్వార్థ వృత్తియనెడు వికల్పము. జహత్స్వార్థ యనియు అజహత్స్వార్థ యనియు వృత్తులు రెండు విధములు. అవయవార్థమును అపేక్షింపకయే సముదాయార్థమును బోధించువృత్తి జహత్స్వార్థావృత్తి. ఈ వృత్తియందు ఘటకములగు అవయవములు తమ తమ అర్థములను విడచినవిగాన దీని కాపేరు. 'రథన్తరమ్' (ఒక సామము) కృష్ణ సర్పః (త్రాచు పాము), శుశ్రూషా (సేవ) మొదలగునవి ఉదాహరణములు.

'గంగాయాం ఘోషః' 'పీతాంబరః' ఇత్యాదులలో 'గంగాగాయాం' 'పీతాంబరః' మొదలగునవి స్వవాచ్యార్థ భిన్నములగు 'గంగాతీరమునందు' 'పీతాంబరమును ధరించినవాడు' అను నర్థముల బోధించుచున్నవి గాన ఇవి కూడ జహత్స్వార్థకు ఉదాహరణములు.

జాతిశబ్దము II. 122.

ముఖ్యముగ జాతిని, లక్షణచే వ్యక్తిని బోధించు శబ్దము. అనేక వ్యక్తులకు సంబంధించిన ఒకానొక విలక్షణ ధర్మమునకు జాతి యని పేరు. ఉదా. గోత్వము అనేక గో వ్యక్తులతో సంబంధించి యున్నది గాన అది జాతి.

జిత్వరీ II. 179.

పతంజలి కాలమున వారాణసిని వర్తకులు 'జిత్వరి' అను పేరుతో వ్యవహరించుచుండెడి వారు.

జ్ఞాన I. 86.
తెలివి. ఎఱుక.

జ్యే II. 362.

'జ్యేష్ఠా' నక్షత్రమునకు సంక్షిప్త రూపము.

తంత్ర II. 77, 96, 103, 108, 109. 470.

ఒక ప్రయత్నముచే రెండు లేక అంతకంటె అధికమగు విషయములను సాధించుట (శబ్దమును ఒకసారే పలికి అనేకార్థములను బోధించు తీరు).

తర్క I. 30, 43, 136, 138.

అనుమానోపమానాదుల సహాయముచే ఒక విషయమును నిర్ణయించుట. ఈ నిర్ణయము శాస్త్ర ప్రత్యక్షాది విరుద్ధముగ నుండరాదు.

నైయాయికుల పరిభాష ననుసరించి 'వ్యాప్యారోపముచే వ్యాపకారోపము తర్కము' ఉదాహరణమునకు— 'వహ్ని లేకున్నచో ధూమము కూడ లేకుండెడిది' అని వ్యాప్యమగు వహ్ని యొక్క ఆరోపముచే (వహ్ని విషయక భ్రమముచే) వ్యాపకమగు ధూమము యొక్క ఆరోపము (ధూమ విషయక భ్రమము) తర్కము.

త్రయీ I. 133.

ఋగ్యజుస్సామ వేదముల త్రయము. ఇవి అపౌరుషేయములు లేదా ఈశ్వరజన్యములని ఆస్తికుల విశ్వాసము. స్మృత్యాగమాదులు కూడ ప్రవాహానాదిత్వముచే నిత్యములు. ఎప్పుడైన వీటి సంప్రదాయము విచ్ఛిన్నమైనను ఇవి నిత్యములగు బీజముల సహాయముచే పునరుద్ధరింపబడుచుండును.

దేశ II. 314, 316.

ఒకానొక ప్రదేశము. రెండు లేదా అంతకంటె అధికమగు అర్థములు గల శబ్దమును

ప్రయోగించినపుడు దాని యర్థనిర్ణయము నకు ఈ దేశము ఉపకరించును. 'మథురకు ఉత్తరముగ నున్న నగరమునుండి వచ్చుచున్నాను' అని చెప్పినపుడు 'పాటలిపుత్రము నుండి వచ్చుచున్నాను' అని చెప్పినట్లు అర్థమగును.

ద్యోతక II. 192, 193.

తన సమీపమునను న్న పదము యొక్క శక్తిని వ్యంజింప చేయునది.

ద్రా I. 362.

'ఆర్ద్రా' నక్షత్రము యొక్క సంక్షిప్త రూపము. దీనిని ఆర్ద్రా నక్షత్రము అను నర్థమున జ్యోతిష గ్రంథములలో కొందరు ప్రయోగించినను, దీనిని విన్నంతనే 'ఆర్ద్రా' స్ఫురితి కలుగదు గాన అట్లు ప్రయోగించుట యుక్తము కాదని వైయాకరణు లందురు.

ద్వంద్వ పదార్థ II. 223.

ద్వంద్వ సమాసావయవమగు ఒక పదము యొక్క అర్థము.

ధర్మ I. 31, 140.

(1) శాస్త్ర విహితమగు ధర్మము. పవిత్ర కర్తవ్యము. (2) ఒక పదార్థము నందలి ధర్మము.

నఞ్ II. 243, 244.

ఇది ఒక అవ్యయము. 'న' మాత్రము మిగులును. సమాసమునందు ఇది 'అ' గాను 'అన్' గాను మార్పు చెందును.

నాద I. 102.

ధ్వని. దీని మార్పుచే ఉచ్చులలో దీర్ఘత్వ హ్రస్వత్వములును, ఉచ్చారణమున తారత్వ మందత్వములును కలుగుచుండును.

నాన్తరీయక II. 81.

ఒక వస్తువుతో తప్పక కలిసియుండునది. 'అంతర' శబ్దమునకు లేకుండగా అని యర్థము. 'అంతరేభవం అంతరీయమ్' ఒక దానితో కలిసి కాక వేరుగా ఉండునది. 'న అంతరీయం నాన్తరీయం' అట్లు విడిగా ఉండనిది.

నామాఖ్యాతసరూప II. 318.

క్రియా పదముగను నామవాచకముగను కూడ నుండు పదములు. ఉదా. 'అశ్వః' 'అజాపయః', 'తేన', 'యస్య' 'అస్య' మొ. 'అశ్వః' అనునది 'టుఓశ్వి గతి వృద్ధ్యోః' అను ధాతువు లుఙ్ మధ్యమపురుషైక వచన రూపము. గుఱ్ఱము అను నర్థమున నామవాచకము, ఇట్లే 'అజాపయః' ఇత్యాది శబ్దములు కూడ క్రియాపదములుగను, నామవాచకములుగను ఉన్నవి.

నాలికా II.113.

ఊదుటచే వివిధములగు శబ్దములు పుట్టు వెదురుగొట్టము మొదలగునది.

నిఘాత II. 3.

అనుదాత్తము.

నిపాత II. 192.

వైయాకరణులు పదములను—నామములు ఆఖ్యాతములు, ఉపసర్గములు, నిపాతములు అని నాలుగు విధములుగ విభజించి యున్నారు. 'చ' 'వా' మొదలగునవి నిపాతములు. వివిధార్థములను బోధించుటకై వచ్చుచుండును గాన ఇవి నిపాతములు. 'ఉచ్చావచేష్వర్థేషు నిపతన్తీతి నిపాతాః' (నిరుక్తము) నిపాతములకు లింగ, విభక్తి, వచనాదులు ఉండవు.

నిబంధన I. 13, II. 127, 132, 297, 434

'మూలకారణము,' 'ఆధారము' అను నర్థమున 'నిబంధనమ్' 'నిబంధనా' అను పదములను భర్తృహరి అత్యధికముగ ప్రయోగించి యున్నాడు.

నియమ II. 85, 350

ఏదైన ఒక సూత్రముచే విహితమగు కార్యము ప్రవర్తించు స్థానములను సంకు

చితముచేయునది నియమము. విధి సూత్రమునకు ఈ నియమ సూత్రమును చేర్చి అర్థము చెప్పవలసి యుండును.ఉదా. 'సార్వధాతు కార్ధధాతుకయోః' అను సూత్రము 'సార్వధాతు కార్ధధాతుకములు పరమగునపుడు పూర్వవర్ణమునకు గుణము వచ్చును' అని చెప్పుచున్నది. ఆగుణము 'ఇక్' కు మాత్రమే వచ్చునని 'ఇకో గుణవృద్ధీ' అను సూత్రము చెప్పుచున్నది. కావున ఈ సూత్రము నియమ సూత్రము.

నిర్వచన II. 174.

ఒక పదము ఏధాతువునుండి జనించినదో కనుగొని అర్థము చెప్పుట.

న్యాయము II. 348, 479, 482.

సామాన్య రూపమున చెప్పిన ఒక వాక్యము. సామాన్య శాస్త్రము. సామాన్య నియమము. ఈ పదమును 'ప్రావ్యము' అను నర్థమున 'న్యాయ్యము' అని గూడ వ్రాయుట కలదు.

న్యాయవాదిన్ II. 2.

ఒక శాస్త్రీయ సిద్ధాంతమును ప్రతిపాదించిన వాడు.

న్యాయ్య II 348.

న్యాయము. సామాన్య శాస్త్రము.

పతంజలి II. 479, 482.

వ్యాకరణ మహాభాష్య రచయితయగు మహావైయాకరణుడు. ఈయన క్రీ. పూ. రెండవ శతాబ్దికి చెందినవాడు. మహాభాష్యము వ్యాకరణమున అత్యుత్తమ ప్రమాణమని వైయాకరణు లెల్లరును అంగీకరించిన గ్రంథము.

పద I. 71, 72, 73.

ఒక వాక్యమునకు అవయవముగ నున్న సుబంతము లేక తిఙంతము. అక్షరసముదాయము.

పదదర్శినః II. 57.

వైదిక సహింతలకు పదపాఠము నేర్పరచిన శాకల్యుడు, ఆత్రేయుడు, కాత్యాయనుడు మొదలగువారు. సంహితా పాఠమే సత్యమని అంగీకరించెడు వైయాకరణుల మతమునకు విరుద్ధముగ వీరు పదపాఠమే సత్య మనియు వాక్యపాఠము కాల్పనిక మనియు చెప్పుదురు.

పదస్థాన I. 16.

అడుగు.

పదామ్నాయ II. 59.

సంప్రదాయసిద్ధమగు వైదికపదపాఠము.

పదార్థ II. 61.

(1) ఒక పదము బోధించెడు అర్థము.

(2) పదముచే చూపబడిన ఒక వస్తువు. బుద్ధియందు ఒక క్రమమున భాసించు అక్షరముల అర్థము.

పరమాత్రా I. 129.

మరి యొక రూపముతో భాసించుట.

పరిప్లవమానతా II. 45.

అస్పష్టత్వము. అస్ఫుటత్వము.

పర్యాయ II. 251.

వంతు. క్రమము. అవిచ్ఛిన్నమగు క్రమము.

పర్యుదాస II. 84, 442.

క్రియతోకాక నామముతో సంబంధించిన నఞ్. ఉదా. అబ్రాహ్మణః. అనశ్వః మొ.

"ప్రసజ్య ప్రతిషేధః సః క్రియయా సహ యత్ర నఞ్। పర్యుదాసః సవిజ్ఞేయః యత్రోత్తరపదేన నఞ్॥"

పశ్యన్తీ I. 143.

వాక్కునకు గల నాల్గు భేదములలో నొకటి. ఇది ఒకానొక విధమగు బౌద్ధిక

పదార్థావకలనము. ఇచ్ఛానుసారముగ ఇది వాగ్రూపమున అభివ్యక్తమగును.

పారార్థ్య I. 137.

మరియొకదాని నిమిత్తమై ఉద్దిష్టమై యుండుట.

పురాణగాః I. 45.

పురాణవ్యాఖ్యాతలు. రామాయణ మహాభారతాది గ్రంథములందు ప్రతిపాదితములగు శాస్త్రీయ సిద్ధాంతములను పాటించువారు.

పృథక్సర్వపద II. 2.

పరస్పర సంబంధముతో వాక్యార్థమును బోధించునవియు స్వతంత్రములును అగు పదముల సముదాయము. ఇదియే వాక్యమని కొందరి యభిప్రాయము.

ప్రకరణ I. 314, 315, 317, 330.

ఏదైన ఒక విషయమును ప్రతిపాదించు సందర్భము. ఒక పదము యొక్క అర్థమును నిర్ణయించుటలో ఇది ఉపకరించును.

ప్రకర్ష I. 64.

గుణముల అతిశయము. ఇది 'తరప్' 'తమప్' ప్రత్యయములను చేర్చుటయందు ఉపకరించును.

ప్రకృత్యర్థ II. 229.

ప్రకృతి పూర్తిగ లోపించి ప్రత్యయము మాత్రము మిగిలిన 'ఇయాన్' ఇత్యాది స్థలములలో ప్రత్యయము చేతనే బోధింపబడిన ప్రకృత్యర్థము.

ప్రక్రమ II. 399.

మౌలికములగు సిద్ధాంతములను బోధించు విధానము.

ప్రక్రియా I. 1

(1) 1. ఏర్పడుట,స్వరూప నిర్మాణము. (2) స్వరూప నిరూపణము.

ప్రణవ I. 9.

ఓంకారము. ఇది సకల వేదసారము.

ప్రతినిధి II. 65, 70, 71.

ఒక వస్తువు లభ్యము కానప్పుడు దాని స్థానమున ఉపయుక్తమగు, దానితో సమానమగు మరి యొక వస్తువు.

ప్రతిపత్తి I. 79.

జ్ఞానము.

ప్రతిపాదక I. 24.

విభక్తి ప్రత్యయాదులు చేర్చని, అర్థబోధకమగు ధాతువు, ప్రాతిపదికము మొదలగు శబ్దము.

ప్రతిబింబ II. 294.

ప్రతికృతి. ఒక మార్గము, దేశము, ప్రాంతము, ఏనుగు, సింహము మొదలగు వాటి స్వరూపమును చూపుటకై గీసిన చిన్న పటము.

ప్రతిభా II. 117, 148, 152.

(1) సర్వప్రాణి సంవేద్యమును, సర్వవ్యవహారమూలభూతమును అగు బుద్ధిస్ఫురణము. ఇది స్వభావము, అభ్యాసము, శిక్ష, సంబంధము, అదృష్టము, ప్రత్యేక పరిస్థితులు అనెడు ఆరు కారణములచే వెంటనే స్వయముగ ఆవిర్భవించును.

(2) II. 148

వాక్యము వినినంతనే బుద్ధి యందు గోచరమగు అర్థము. ఇదియే వాక్యార్థమని కొందరు పండితుల అభిప్రాయము.

ప్రతిషేధ II 319.

జరుగనున్న పనిని నిషేధించుట. ఏదైన ఒక విషయమును నిషేధించు వాక్యము. ఈ ప్రతిషేధ వాక్యమును విధి వాక్యముతో సమన్వయించి దీనికి అర్థము చెప్పవలెను.

ప్రత్యయ II. 185, 236.

(1) జ్ఞానము

(2) II. 229.

ఒక పదము మొదలగు దానికి చేర్చు ప్రత్యయము.

ప్రత్యవాయ II. 321.
నిషేధము అనిష్టము.

ప్రత్యాయ్య II. 119.
ఒక పదముచే బోధింపబడునది.

ప్రమాణ [II. 77].
(1) యథార్థ జ్ఞానము కలుగుటకు సాధనము.
(2) II. 307
కొలత.

ప్రయోగ II. 124,125
ఒక వాక్యమున కారకములను ప్రయోగించుట.

ప్రయోజక II. 299, 303, 429.
వాక్యప్రయోగమునకు కారణభూతమగు అర్థము.

ప్రయోజన II. 113.
ఒక వాక్యము యొక్క ప్రయోజనము. ఇదియే వాక్యమునకు లక్షణమని కొందరు పండితుల అభిప్రాయము.

ప్రవిభాగ I. 123.
శబ్దబ్రహ్మము ప్రపంచమునందలి విభిన్న పదార్థాకారమున ఆవిర్భవించుట. ఇదియే శబ్ద బ్రహ్మము యొక్క జాగ్రదవస్థ యని చెప్పుదురు.

ప్రసజ్య ప్రతిషేధ II. 34.
నఞ్ క్రియాపదముతో సంబంధించి తద్బోధ్య క్రియను నిషేధించుట. ఉదా. 'నేక్షేతోద్యన్త మాదిత్యమ్.'

ప్రాజాపత్య II. 453.
ప్రజాపతికై ఉద్దిష్టమగు పశువు లేక సోమ పాత్ర మొదలగునది.

ప్రాప్యకారిన్ I. 30
ఒక వస్తువును చేరిన పిమ్మట పని చేయునది. ఉదా. నేత్రము విషయమును చేరిన పిమ్మట జ్ఞానమును కలిగించునుగాన ఇది ప్రాప్యకారి.

ప్రాసంగిక II. 77.
ప్రధానమగు ఒక విషయమును గూర్చి చెప్పెడు సందర్భమున ప్రతిపాదితమగు అప్రధాన విషయము.

ఫల II. 228.
ఒక వ్యాపారమువలన కలుగు ఫలము. ఇది కారణములకంటె భిన్నమైనది. వ్యాపారము, ఫలము కూడ ధాత్వర్థములని నవీన వైయాకరణుల యభిప్రాయము. ప్రాచీన వైయాకరణుల యభిప్రాయము ప్రకారము వ్యాపారము మాత్రమే ధాత్వర్థము.

బాధకవాక్య II. 347.
మొదట చెప్పిన సామాన్య శాస్త్రమును బాధించు విశేష శాస్త్రము.

బాధా II. 77.
ఏదైన ఒక విషయమును నిరాకరించు వాక్యము. ప్రమాణాదులచే ప్రాప్తించు దానిని నిషేధించుట.

బీజ I 34.
నిగూఢ మగు శక్తి. విత్తనము.

బుద్ధి I 34.
విషయములను గ్రహించెడు శక్తి. ప్రపంచమునందలి వివిధ పదార్థములను వేరువేరుగ గ్రహించెడు శక్తి.

బుద్ధి విషయ II. 132.
బుద్ధికి గోచరమైనది.

బుద్ధ్యనుసంహృతి II. 1.
పరస్పర సంబద్ధములగు అనేక పదములు బోధించిన విభిన్నార్థములను ఒక సంఘాతముగ బుద్ధియందు గ్రహించుట. ఈ విధముగ విభిన్న పదములను ఏకసంఘాత రూపమున గ్రహించుటయే అంతరస్ఫోటమనియు ఇదియే వాక్యలక్షణమనియు కొందరు వైయాకరణుల అభిప్రాయము.

బైజి II. 481.
ఒక ప్రాచీన వైయాకరణుని పేరు. మహాభాష్యమునందు పతంజలియు, సంగ్ర

హమున వ్యాడియు ప్రతిపాదించిన సంప్రదాయ సిద్ధములగు వ్యాకరణ సిద్ధాంతము లను ఈతడు తర్కాభాసములచే నిరాకరింప ప్రయత్నించెనట.

బ్రహ్మన్ I. 11, 22, II 237.

వేద ప్రతిపాదిత మగు అత్యుత్తమ తత్త్వము. ఇదియే వేదసారమగు శబ్ద బ్రహ్మము.

బ్రాహ్మణ కంబల II. 14.

'బ్రాహ్మణుని కంబళి' అనునపుడు కంబళి ఒక్కటియే ప్రధానముగ కానవచ్చుచున్నది గాని, ఇచట 'బ్రాహ్మణ' పదము ప్రయుక్తమైనను బ్రాహ్మణ లక్షణ మొక్కటియైనను కానవచ్చుట లేదు. కావున ఒక పదము ఉన్నను లేకున్నట్లే అను విషయమును బోధించుటకు ఈ బ్రాహ్మణ కంబల న్యాయము నుపయోగింతురు.

భావనా II. 116.

ఆయా శాస్త్రముల నభ్యసించిన పిదప వాటి యర్థమును మానసమున మననము చేసికొనుట. ఒక సిద్ధాంతము.

భాష్య II. 477.

పాతంజల మహాభాష్యము.

భేత్తవ్య II. 133.

విశేషణము దేనియందలి వైశిష్ట్యమును బోధించునో అట్టి విశేష్యము.

భేద II. 77, 85, 440.

భేదము, భేదమునకు నిమిత్తము. భేద కారణ భూతమగు వైశిష్ట్యము. ఒక వ్యక్తిని ఇతర వ్యక్తులనుండి వేరుగ చూపగలిగిన ఒక విశిష్టలక్షణము.

భేదశక్తి II. 466.

ఒక క్రమమునకు కారణభూతమగు పదమునందలి ఒకానొక శక్తి.

భేదానుకార I. 36.

తెలియబడిన విషయములందలి పరస్పర భేదమును గుర్తించుటచే వాటి జ్ఞానమునందు గూడ ఏర్పడినట్లు భావింపబడిన భేదము.

మధ్యమా I. 143.

'మధ్యమా' వాక్కు. ఇది మనోవృత్తి స్వరూపమైనది. ఇందు దీనినావిష్కరింప సమర్థములగు పదము లేవియు ఉండవు.

మంత్ర II 253.

వైదిక మంత్రము.

మహతీ సంజ్ఞా II. 363.

దీర్ఘమగు పారిభాషిక పదము. ఇది సార్థకముగ నుండును. ఉదా. 'సర్వనామము' (అన్నిటికిని బోధకముగ ప్రయోగింప దగినది). 'అవ్యయము' (మార్పుచెందనిది) మొ.

మహాభాష్య II. 479.

పతంజలి విరచిమును అష్టాధ్యాయీ వ్యాఖ్యాన రూపమును అగు ఉద్గ్రంథము.

మాఠర II. 348.

ఒక బ్రాహ్మణుని పేరు.

'బ్రాహ్మణా భోజ్యన్తామ్; మాఠర కౌండిన్యౌ పరివేవిష్టామితి, నేదానీం తౌ భుంజాతే" మ. భా.

మాత్రా II. 24.

(1) స్థితి. అవస్థ.

(2) II 309. అచ్చులు హల్లులు మొదలగు వాటిని ఉచ్చరించుటకు అవసర మగు కాలము.

మిథ్యాభ్యాస II. 235.

దోషభూయిష్ఠములగు పద్ధతుల ద్వారా శాస్త్రములను అభ్యసించుట.

ముఖ్య II. 84.

ప్రధానము. గౌణము కానిది.

మూర్తి వ్యాపారదర్శన I. 19.

జగమునందలి దృశ్యపదార్థముల వ్యాపారమును చూచుచుండుట.

యథా సంఖ్య II. 93

క్రమమును అనుసరించి. ఉదా. మొదట నాలుగు విషయములను చెప్పి మరల మరి నాలుగు విషయములను చెప్పునపుడు మొదటిది మొదటి దానితోడను, రెండవది రెండవ దానితోడను ఈ క్రమమున సంఖ్యానుసారముగ సంబంధించును. ఇది యథాసంఖ్యము.

యౌగపద్యమ్ = 462.

ఒక్క మారుగానే జరుగుట

(ఒక్క మారుగానే ఉచ్చరించుట)

రూఢి II 771.

స్థిరీభూతమగు అలవాటు లేక ఆచారము.

లక్షణ II. 168.

గౌణార్థము. సూచితమగు అర్థము. లాక్షణికార్థము.

'లక్షణ ముపలక్ష్యమాణార్థః' (పుణ్య.)

లఘు II 84, 176.

సంక్షిప్తము. గురువు కానిది. తేలికగా నుండునది.

లిఙ్గ II. 73, 315

గుర్తు. సాకూత మగు వచనము. సమీపమున నున్న పదము యొక్క అర్థము తెలియటకు ఉపకరించు విశిష్టార్థబోధక శబ్దము.

లైఙ్గికీ I. 137.

భావగర్భిత మగు మాటవలన తెలియునది. ఏదైన ఒక వస్తువునందలి విశిష్ట లక్షణమును తెలిసికొనగా, తద్ద్వారా కల్గిన మరియొక జ్ఞానము.

వర్ణసఙ్ఘాత II 342.

అర్థవంతమగు వర్ణ సముదాయము. దీనికే పదమని పేరు.

వాక్య II. 1, 2, 326-327.

వాక్యము. పదసముదాయము. ఒక భావమును అవిష్కరించుటకు ప్రయుక్తమై, విడదీయరాని పదసముదాయము.

(2) II 314.

పదార్థనిర్ణయమునకై ఉపయుక్తము లగు హేతువులలో నొకటి.

వాక్యవాదినః II. 57.

అఖండార్థ బోధకమగు వాక్యము అఖండ మనియు, పదాది విభాగము కాల్పనిక మనియు అంగీకరించువారు.

వాచ్ I. 124, 127.

శ్రవణ గోచరమగు వాక్కు (మాట). శ్రవణగోచరమను వైఖరీనామధేయమును అగు వాక్కునకే కాక తత్పూర్వస్థితరూపము లగు 'మధ్యమా' 'పశ్యన్తీ' లకు గూడ 'వాచ్' అని పేరు. కొందరు పండితులు 'పరా' అనుదానిని కూడ వీటి అన్నింటి యొక్క పూర్వస్థితి రూపమగు వాక్కునుగా అంగీకరించినారు.

వాచక II. 192, 194.

ఒక అర్థమును ప్రత్యక్షముగ బోధించునది.

వార్తాక్ష II. 343.

ఒక ప్రాచీన వైయాకరణుడు. వాక్యార్థమే వాస్తవమైనదనియు, కావున వాక్యము అఖండమైనదనియు ఈతని యభిప్రాయము. వాక్యమును పదములుగ విభజించి ఆపదములు నాలుగు విధములని యంగీకరించుట కాల్పనికము. ఇట్టి సిద్ధాంతమునుచెప్పినవాడు ఔదుంబరాయణుడని నిరుక్తకారుడు చెప్పియున్నాడు. భర్తృహరి అతనితోపాటు వార్తాక్షుని గూడ ఏతత్సిద్ధాంతాంగీకర్తనుగా చెప్పినాడు.

వాలవాయ II. 179.

వైడూర్య మణులు జనించు ఒక పర్వతమునకు పేరు.

వాహీక II. 252, 255.

వాహీకదేశవాసి. ఈ దేశము నేటి పంజాబు కాశ్మీర రాష్ట్రములతో సంబంధించి యున్నది. వాహీక శబ్దము మొద్దువాడు అను నర్థమున ప్రయోగింపబడినది.

వికల్ప II. 116.
విభాగము.

వికల్పన II. 180
ఇదికాని, అది కాని అని చెప్పుట.

వికార I. 3. II. 50,
ఆకారము, పరిణామము, మార్పుచెందుట.

విచ్ఛిన్న II. 291,
తెగిపోయిన, వేరుగా చేయబడిన, ఆగిపోయిన.

విచ్ఛేద II. 242.
పదావయవములను విడదీసి చూపుట.

విద్యా I. 10, 15, II. 233, 288
శాస్త్ర ప్రక్రియ.

విధాతా I. 10
సృష్టికర్త. వ్యవస్థాపకుడు.

విధిశేష II. 349.

విధాయక శాస్త్రమునకు అంగభూతము. ఉదా. 'ఇకోగుణవృద్ధీ' అను సూత్రము గుణ విధాయకములగు 'సార్వధాతుకార్ధధాతుకయోః' ఇత్యాదులకు అంగము.

వినియోగ II. 32.
ఉపయోగించుట.

విప్రయోగ II. 315.

విడిపడుట. ఒక పదమునకు ఏ అర్థము చెప్పవలెను అనుసందేహము కలిగినపుడు తదర్థ నిర్ణయ హేతువులలో విప్రయోగము ఒకటి. 'అశంఖచక్రో హరిః' ఇత్యాదు లుదాహరణము.

విరహిత II. 328,

వ్యవహితము. ఒక అసదృశ వస్తువు మధ్య ప్రవేశించుటచే ఏర్పడిన వ్యవధానము కలది.

విరోధితా II 315.

విరుద్ధ స్వభావము. శత్రుత్వము, ఇది అర్థ నిర్ణయ హేతువులలో నొకటిగ అంగీకరింపబడినది. 'రామార్జునగతిస్తయోః' ఇత్యాదులు ఉదాహరణము.

వివిక్తత్వ (వివేకత్వ) II 433.
భేదము, నానాత్వము.

వివేక II. 116.
విభాగము.

విశేషాతిదేశ [II. 77].

ఒక వస్తువునందు సదృశమగు వస్త్వంతరము యొక్క ధర్మములను ఆరోపించుట.

వృత్తి I. 51, 75, II. 35, 218, 226.

(1) కొన్ని ధర్మములు ఆవిర్భూతములై మరికొన్ని ధర్మములు తిరోభూతములగుచుండెడు పరిస్థితి.

(2) II. 35.

ఒక పదము మరి యొక అర్థమును గూడ బోధించెడు స్థితి. 'కృత్తద్ధిత సమాసైక శేష సనాద్యన్త ధాతురూపాః పఞ్చవృత్తయః. పదార్థాభిధానం వృత్తిః' (సి. కౌ.).

(3) II. 246.

పదముల ప్రయోగము లేక ప్రవృత్తి. 'కా పునర్వృత్తిః? శాస్త్ర ప్రవృత్తిః' (మ. భా)

(4) II. 75. 101, 105

వృత్తిఅనగా ప్రవృత్తి. ఇచట వైకృత ధ్వనులవలనకలిగెడు ద్రుత, మధ్యమ, విలంబిత అను మూడు విధములగు ధ్వని ధర్మములు గ్రాహ్యములగును. గ్రంథమును వల్లెవేయునపుడు ద్రుతవృత్తి. ఇతరులతో ప్రసంగించునపుడు మధ్యమవృత్తి. పాఠము

చెప్పునపుడు విలంబితవృత్తి ఉపయోగపడును. వీనివలన స్ఫోటశబ్దము భిన్నము కాదు. తొందరగా, సామాన్యముగా, మందముగా ప్రజలు చదువునపుడు పై వృత్తులు స్పష్టమగును.

వృద్ధి I. 59.
వ్యాకరణ శాస్త్రమున 'ఆ' 'ఐ' 'ఔ' లకు వృద్ధి యని పేరు.

వేద I. 5
వేదము. ఇది శబ్ద బ్రహ్మస్వరూపము.

వైకృత I. 19, 77.
వికారము చెందినదానితో సంబంధించినది.
ద్రుతాది వృత్తి భేదము వైకృత ధ్వనులచే కలుగును. స్ఫోటశబ్దమభివ్యక్తమైన తరువాత ఆశబ్దమును కొంతకాలము నిలచునట్లు చేయునవి వైకృతధ్వనులు. అవి మాత్రము స్ఫోట శబ్దమునకు నానాత్వమును జూపునవి కావు.

వైఖరీ I 143.
శ్రోత్రగ్రాహ్య మగు శబ్దము. ఇది చతుర్విధ వాక్కులలో నొకటి.

వ్యక్తి I. 68. 69.
ఒక పదార్థము. ఒక వ్యక్తి.

వ్యఞ్జన I. 116.
వ్యక్తము చేయుట, అభివ్యక్తి. వింజామర గాలి ఉనికిని సూచించినట్లు ఒక వస్తువు అవిర్భవించుటకు కారణమగుట.

వ్యతిరేక I. 338
ఎల్లపుడు కలిసియుండు రెండింటిలో ఒకటి లేనపుడు రెండవది కూడ ఉండదనుట.

వ్యపేక్షణా II. 223.
పేర్కొనుట, పరామర్శించుట.

వ్యర్థ II. 303.
విభిన్నార్థము.

వ్యవచ్ఛిన్న II. 6.
ఇది ఇట్లని చెప్పబడినది, నిశ్చిత రూపమున ప్రతిపాదింప బడినది.

వ్యవహార II. 343
వాక్యములను ప్రయోగించుట.

వవ్యస్థానిత్యతా I. 28.
బాహ్యాకృతియందు మార్పులు కనబడుచున్నను అంతరతత్త్వము స్థిరముగ నుండుట.

వ్యవహిత II. 323.
అసదృశవస్తువుచే వ్యవధానముకలదిగ చేయబడినది. చూ. విరహిత.

వ్యవాయ II. 364.
వ్యవధానము.

వ్యాకరణ I, 11, 13, 22, 142.
శబ్దసాధుత్వాసాధుత్వాది నిర్ణాయక శాస్త్రము.

వ్యాపిన్ II. 84.
ఇతర వస్తువులను తనలో సంగ్రహించునది.

వ్యుదాస II. 79.
దూరముచేయుట, ఒక నియమము పట్టకుండ వేరు చేయుట.

వ్రీహిశ్రుతి II. 65.
వ్రీహులతో యాగముచేయ వలెను అని బోధించెడు వేదవాక్యము.

శబ్ద I. 1, 107, 103, 111, 1112
II. 30 మొ.

ధ్వనియని అక్షరార్థము, ఉచ్చారణ సమయమున ధ్వనికి సంబంధించిన అన్ని దశలకును శబ్దమను పేరు ప్రయుక్త మగుచున్నది స్పష్టము కాని ధ్వని, స్పష్టమగు ధ్వని, అర్థబోధకమగు స్పష్టధ్వని (పదము), శ్రవణ గోచరము కాని ధ్వని, ధ్వని కారణ భూతమగు మానసిక శక్తి, సర్వవ్యాపారకారణ

భూత మగుచిచ్ఛక్తి - ఇవియన్నియు శబ్దావస్థా భేదములే.

శబ్దతత్త్వ I. 1, II. 30, 32.

శబ్ద తత్త్వము అత్యుత్తమమగు శబ్ద శక్తి. దీనికే శబ్దబ్రహ్మ మనియు, నాద బ్రహ్మమనియు, స్ఫోటయనియు నామాంతరములు.

దీనికి 'శబ్దస్య తత్త్వమ్' అనియు 'శబ్దః తత్త్వం అస్య' అనియు విగ్రహములు చెప్పుదురు.

శబ్దధర్మ I. 58.

అర్థమును గ్రహించుట, అర్థమును బోధించుట అనెడు రెండు శబ్ద ధర్మములు.

శబ్దశక్తి II. 168.

అర్థమును బోధించు విషయమున శబ్దమునకు గల శక్తి.

శబ్దార్థసంబంధ I. 23.

శబ్దమునకు అర్థముతో సంబంధము. ఈ సంబంధము నిత్యమని వైయాకరణుల మతము.

శాస్త్రార్థము. II. 210.

ఒక పదమునకు గాని ఒక వర్ణమునకు గాని వ్యాకరణశాస్త్రకారులు తమ గ్రంథము లో చూపిన యర్థము. ఈయర్థము లౌకిక భాషలో కాన రాదు.

శిష్ట I. 27, 29.

మంచి సంస్కృతిగల పండితులు. వ్యాకరణాది శాస్త్రములను బాగుగ అభ్యసించి ప్రమాణ సమ్మతముగ వాటి విషయములను విశదీకరింప కలిగినవారు.

'శిష్టా వైయాకరణాః. శాస్త్ర పూర్వికా హి శిష్టిః. వైయాకరణాశ్చ శాస్త్రజ్ఞాః' (మ. భా. VI. 3, 109)

శేష II. 82.

మరియొకదానికి అంగమైనది. శేషించినది.

శేషలక్షణా (షష్ఠీ)

సంబంధ సామాన్యార్థమున 'షష్ఠీ శేషే' అను సూత్రముచే విహితమగు షష్ఠి.

శ్రుతి II. 73, 75. మొ.

ప్రత్యక్షముగ బోధించు వాక్యము, అనుమానముద్వారా బోధించు లింగమువలె కాక ఇది ఒక విషయమును ప్రత్యక్షముగ బోధించును.

సంగ్రహ II. 478, 481.

(1) అతి విస్తృతమగు ఒక వ్యాకరణగ్రంథము. అది ఇపుడు లభ్యముకాదు. దీనిని ఎందరో ప్రాచీన వైయాకరణులును అర్వాచీనులును ప్రమాణముగ చూపియున్నారు. దీనిని వ్యాడియను ఒక వేదవేత్త రచించెను. ఈతని నామధేయమును వార్తికకారుడును ఋక్ప్రాతిశాఖ్యకారుడును పేర్కొనియున్నారు. పాతంజల భాష్యమునకు ఈ సంగ్రహము ఆధారమని చెప్పుదురు.

(2) కూర్పు

సంఘాత II. 169, 205, 208. మొ.

(1) సహోచ్చరితములై అర్థబోధకములగు వర్ణముల సముదాయము.

(2) II. 1. పరస్పర సంబంద్ధములగు పదముల సముదాయము. ఇదియే వాక్యమని అభిహితాన్వయవాదులు చెప్పుదురు.

సంజ్ఞా I, 59, 66; II. 353, 360. మొ.

పేరు. పారిభాషికమగు పదము. ఇది కాల్పనికమై కొన్నిటికి నామధేయముగ ప్రయుక్తమగును. సమ్యగ్ జానన్తి అనయా (దీనిచే లెస్సగా తెలుసుకొందురు). అనువ్యుత్పత్తిచే తెలుసుకొనుటకు సాధనము సంజ్ఞ అనబడును. ఇది లోకశాస్త్రసాధారణము. 126 శ్లోకమున మాత్రము సజ్ఞా శబ్దము ప్రాణము లోపలనున్న చైతన్యమును బోధించును

సంజ్ఞిన్ I. 59, 66, II. 100, 353, 365.

పారిభాషికమగు ఒక సంజ్ఞాశబ్దముచే బోధింపడు వస్తువు.

సంనిపాత I. 109.

వ్యాపార విశేషము.

సంవిత్ II. 133.

జ్ఞానము

సంవిధానమ్ II. 322.

ప్రతిక్రియ. ఒకపనికి విరుగుడుగా చేయు వేరొకపని (ప్రాయశ్చిత్తము మొ॥)

సంసర్గ II. 96, 97, 126 మొ.

(1) క్రియా కారకముల పరస్పర సంబంధము

(2) II. 44.

క్రియా సాధనములకు క్రియతో ఘనిష్ఠ మగు సంబంధము. ఈ క్రియయే అనగా వ్యాపారమే వాక్యార్థమని కొందరి అభిప్రాయము.

(3) II. 315.

ఇతర వస్తువులతో సంబంధము. సంశయము కలిగినపుడు అర్థ నిర్ణాయక హేతువులలో నిది యొకటి.

సంస్కార I, 79.

(1) ఎక్కువ అర్హత. కార్య కరణ సమర్థముగ చేయుట.

(2) II. 284.

వ్యాకరణ నియమ ప్రవృత్తి.

సంస్థాన II. 155.

అవయవసంనివేశము. ఆకృతి.

సంహితా II. 58, 104.

పదములు పరస్పరము కలిసియుండుట. పదవిభాగరహితమగు వేదపాఠము.

సత్య II. 127.

వాస్తవమైనది. పదము యొక్క లేదా వాక్యము యొక్క వాస్తవమగు అర్థము.

సప్తపర్ణ II. 309.

కణుపుకు ఏడు ఆకులుచొప్పున బయల్వెడలు ఒక వృక్ష విశేషము.

'సప్తపర్ణ' అనుదానికి 'ఏడాకులు' అని మాత్రమే' అర్థమైనను ఇది లక్షణచే వృక్షమును బోధించుచున్నది గాన ఈ పదమును లక్షణకు ఉదాహరణముగ చూపుదురు

సమయ II. 118.

(1) ఒక కట్టుబాటు. అలవాటుగా వచ్చుచుండెడు ఒక నియమము.

(2) సహజమగు ఒకానొక విధమైన జ్ఞానము.

సమవాయ II. 436.

విడదీయరాని సంబంధము.

సమాఖ్యాన II. 9, 173.

చెప్పుట. ప్రతిపాదనము.

సమామ్నాత I. 5.

ప్రామాణికముగ చెప్పబడినది.

సముచ్చయ II. 77.

ద్వంద్వాది సమాసములలో చెప్పిన విధముగ రెండు లేక అంతకంటె అధికమగు వస్తువులను కలిపి చెప్పుట.

సముచ్చితాభిధాన II. 195, 196.

దగ్గరగా చేర్చబడిన వస్తువులను చెప్పుట.

సముదాయ II. 126.

ఏకపిండీకృతమగు అర్థము. ఏకవచన ప్రయోగాదులచే అనేక విషయములను ఒక సమాహారముగ నేర్పరచుటచే వచ్చిన సముదాయము.

సాధన II. 418, 426 మొ.

ఒక క్రియను సాధించుటకు ఉపయుక్తమగు సాధనము.

సామిధేనీ II. 258.

అగ్నియందు సమిధలను ఉంచునపుడు పఠించు ఋక్కు.

సాయుజ్య I. 181.

కలయిక.

సార్వార్థ్య II. 250.

వివిధార్థముల నన్నింటిని బోధించుట

సాహచర్య II. 815.

కలిసి ఉండుట.

సిద్ధి I. 86.

(1) ఈప్సితార్థము నెరవేరుట.

(2) II. 263

తెలియబడి యుండుట.

సోఢత్వ I. 82.

బుద్ధిస్థము చేయబడుట. పునఃపఠనముచే బుద్ధిస్థము చేయబడుట.

సౌభవ II. 181.

ఒక ప్రాచీన వైయాకరణుడు. ఈతడు తర్కాభాసములచే భాష్యకారుని సిద్ధాంతములను ఖండింప ప్రయత్నించెను.

స్ఫోట I. 49, 75, 77, 81,
93, 102, 108, 106

విషయమును స్ఫుటము చేయునది. నిత్యమగు శబ్దము.

"స్ఫుటతి అస్మాత్ అర్థః ఇతి స్ఫోటః." దీనివలన అర్థము స్ఫుటమగును, ఈవ్యుత్పత్తిచే అర్థబోధకమగు శబ్దము. మధ్యమా వాగ్రూపము స్ఫోట అనిశాబ్దికులు విశ్వసింతురు.

స్మృతి I. 7, 145

సంప్రదాయ సిద్ధముగ స్మరింపబడుచుండెడు ప్రామాణికమగు వాక్యము.

స్వమాత్ర I. 129

ఆత్మ స్థితి. ఆత్మ స్వరూపము.

స్వర II. 816.

స్వరము. ఇది అర్థ నిర్ణయ హేతువులలో నొకటి.

స్వార్థిక II, 191.

తనయొక్క అర్థము మాత్రమే కలది. ఒక పదమునకు చేర్చిన ప్రత్యయమునకు ఆ పదమున కేది యర్థమో యదియే కాని మరియొక అర్థము లేకున్నచో అది స్వార్థికము.

హర్యక్ష II. 481.

ఒక ప్రాచీన వైయాకరణుడు. ఈతడు తర్కాభాసములచే భాష్యకార ప్రతిపాదితములగు సిద్ధాంతములను ఖండింప ప్రయత్నించెను.

హేతువాద I. 41.

హేతు ప్రదర్శన పూర్వకమగు వాదము.